*Saheeh Bukhari (Vol-5)*
*(Telugu)*

# సహీహ్ బుఖారీ

## (5వ సంపుటం)

మూలం
**హజ్రత్ అల్లామా వహీదుజ్జమాఁ (రహ్మ)**

తెలుగు అనువాదం
**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

ప్రకాశకులు :
**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్–500 002.
ఫోన్: 040–24564583

# Saheeh Bukhari *(Vol-5)*

## Saheeh Bukhari (Vol-5) (Telugu)

**TIP Series No.** : **345**

Written by : **Hazrat Allama Waheeduzzaman** (R.H.)

Translated by : **Muhammad Azeezur Rahman**

*All Rights Reserved with Publishers*

First Edition : January 2023

Copies : 1000

**Price** : **Rs. 450/-**

ISBN : 978 - 93 - 81111 - 96 - 3

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 040 - 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

“విశ్వసించిన ప్రజలారా!
అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ
విధేయత చూపండి. ఆజ్ఞ విన్న
తరువాత దాని నుండి
మరలకండి.”

*(అల్ అన్‌ఫాల్ : 20)*

# విషయసూచిక

## 1. దైవప్రవక్తల (కు సంబంధించిన హదీసుల) ప్రకరణం


| | | |
|---|---|---|
| అధ్యాయం : 1 | మహనీయ ఆదమ్ (అలైహిస్సలామ్) పుట్టుక గురించి ... | 01 |
| అధ్యాయం : 2 | ఆత్మలు (తొలినుంచే) సమీకరించబడిన సేనలు | 07 |
| అధ్యాయం : 3 | (మహనీయ నూహ్- అలైహిస్సలామ్ గురించి) దైవోపదేశం | 07 |
| అధ్యాయం : 4 | దైవప్రవక్త ఇల్యాస్ (అలైహిస్సలామ్) గురించి | 11 |
| అధ్యాయం : 5 | దైవప్రవక్త మహనీయ ఇద్రీస్(అలైహిస్సలామ్) గురించి | 12 |
| అధ్యాయం : 6 | అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 15 |
| అధ్యాయం : 7 | సమూద్ జాతి, దైవప్రవక్త మహనీయ సాలెహ్(అ) గురించి | 17 |
| అధ్యాయం : 8 | అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ప్రవక్తా! ఈ ప్రజలు నిన్ను జుల్‌ఖర్‌నైన్‌ను గురించి అడుగుతున్నారు | 19 |
| అధ్యాయం : 9 | (అన్ నిసా సూరాలో) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 22 |
| | భూమండలంపై నిర్మించబడిన ప్రప్రథమ మస్జిద్ ఏది? | 40 |
| అధ్యాయం : 10 | అల్ హిజ్ర్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 43 |
| అధ్యాయం : 11 | (ఇస్మాయీల్-అ గురించి) అల్లాహ్ ఇలా సెలవీయటం | 44 |
| అధ్యాయం : 12 | ఇబ్రాహీమ్ కుమారుడగు ఇస్‌హాఖ్ (అ) గురించి | 44 |
| అధ్యాయం : 13 | మహనీయ యాఖూబ్ (అ) గురించి.... | 45 |
| అధ్యాయం : 14 | మహనీయ లూత్ (అలైహిస్సలామ్) గురించి... | |
| అధ్యాయం : 15 | అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 46 |
| అధ్యాయం : 16 | దైవప్రవక్త మహనీయ యాఖూబ్(అ) గురించి... | 47 |
| అధ్యాయం : 17 | యూసుఫ్ (అలైహిస్సలామ్) గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 47 |
| అధ్యాయం : 18 | దైవప్రవక్త మహనీయ అయ్యూబ్(అలైహిస్సలామ్) గురించి.... | 51 |
| అధ్యాయం : 19 | దైవప్రవక్త మహనీయ మూసా(అలైహిస్సలామ్) గురించి | 52 |
| అధ్యాయం : 20 | తాహా సూరాలో దైవోపదేశం | 53 |
| అధ్యాయం : 21 | ఈ సందర్భంగా.... | 53 |
| అధ్యాయం : 22 | దైవోపదేశం | 54 |
| అధ్యాయం : 23 | అల్ ఆరాఫ్ సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు | 55 |
| అధ్యాయం : 24 | అల్ ఆరాఫ్ సూరాలో ప్రస్తావనకు వచ్చిన 'తుఫాను' | 56 |
| అధ్యాయం : 25 | మహనీయ ఖిజర్(అ), మహనీయ మూసా(అ)ల వృత్తాంతం | 57 |
| అధ్యాయం : 26 | ముఖ ద్వారం గుండా సాష్టాంగపడుతూ ... | 62 |
| అధ్యాయం : 27 | ఆరాఫ్ సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు | 64 |

అధ్యాయం : 28 దైవోపదేశం 65
అధ్యాయం : 29 మహనీయ మూసా(అ) మరణం: ఆయన తదనంతర పరిస్థితులు 65
అధ్యాయం : 30 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: విశ్వాసుల విషయంలో ... 67
అధ్యాయం : 31 గర్వాతిశయం– దాని పరిణామం 68
అధ్యాయం: 32 మద్‌యన్ వారి గురించి 69
అధ్యాయం : 33 దైవప్రవక్త మహనీయ యూనుస్(అలైహిస్సలామ్) గురించి 69
అధ్యాయం : 34 శనివారం (సబ్బత్) వారి గురించి 72
అధ్యాయం : 35 దైవప్రవక్త మహనీయ దావూద్(అలైహిస్సలామ్) గురించి 72
అధ్యాయం : 36 దైవ సన్నిధిలో అత్యంత ఇష్టకరమైన నమాజ్ దావూద్(అ) నమాజ్ అన్నిటికన్నా ప్రియమైన ఉపవాసం దావూద్ (అ) ఉపవాసం 75
అధ్యాయం : 37 సాద్ సూరాలో మహనీయ దావూద్(అలైహిస్సలామ్) ప్రస్తావన 75
అధ్యాయం : 38 లుఖ్మాన్ (అలైహిస్సలామ్) గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 80
అధ్యాయం : 39 యాసీన్ సూరాలో దైవప్రవక్తల ప్రస్తావన 82
అధ్యాయం : 40 దైవప్రవక్త జకరియ్యా (అలైహిస్సలామ్) గురించి 83
అధ్యాయం : 41 హ(జత్ ఈసా(అలైహిస్సలామ్), హ(జత్ మర్యమ్(అలైహిస్సలామ్)ల గురించి... 84
అధ్యాయం : 42 మర్యమ్ (అలైహస్సలామ్) గొప్పతనం 85
అధ్యాయం : 43 మహనీయ ఈసా(ఏసుక్రీస్తు– అలైహిస్సలామ్) విశిష్టత 86
అధ్యాయం : 44 దీన్ (ధర్మం)లో అతిశయిల్లటం 87
అధ్యాయం : 45 మర్యమ్ సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం 89
అధ్యాయం :45(అ) మర్యమ్ కుమారుడగు ఈసా(అలైహిస్సలామ్) దివి నుండి భువికి రావటం 95
అధ్యాయం : 46 బనీ ఇ(స్రాయీల్ సంఘటనలు 96
అధ్యాయం : 47 ఇస్రాయీల్ సంతతిలోని ఒక కుష్టురోగి, ఒక గుడ్డివాడు, ఒక బట్టతలవాడు 101
హదీసు వెలుగులో గుహవారు 104
అధ్యాయం : 48 ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించగా ... 106

## 2. మహిమోన్నతుల ప్రకరణం

అధ్యాయం : 1 అల్ హుజురాత్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 117
అధ్యాయం : 2 ఖురైషుల విశిష్టత గురించి 122
అధ్యాయం : 3 ఖురైషుల భాషలో ఖుర్‌ఆన్ అవతరించటం 125
అధ్యాయం : 4 యమన్ వాసులు మహనీయ ఇస్మాయీల్ (అలైహిస్సలామ్) సంతతి వారై ఉండటం 126
అధ్యాయం : 5 ఎవరయినా సరే ఉద్దేశపూర్వకంగా తన తండ్రిని కాదని వేరెవరినయినా

| | | | |
|---|---|---|---|
| | | తండ్రిగా చేసుకుంటే, అతను అవిశ్వాసానికి (కుఫ్ర్‌కు) ఒడిగట్టినట్లే | 127 |
| అధ్యాయం : | 6 | అస్లం, ముజైనా, జుహైనా, గిఫార్, అష్జా తెగల గురించి | 129 |
| అధ్యాయం : | 7 | ఒక ఖహ్‌తానీ వ్యక్తి ప్రస్తావన | 131 |
| అధ్యాయం : | 8 | అజ్ఞానపు గబ్బు వారించదగినది | 131 |
| అధ్యాయం : | 9 | ఖుజాఅ తెగ వారి గురించి | 132 |
| అధ్యాయం : | 10 | అబూజర్ గిఫ్ఫారీ (రజి) ఇస్లాం స్వీకరించిన సంఘటన | 133 |
| అధ్యాయం : | 11 | అరబ్బు జాతి అజ్ఞానం గురించి | 138 |
| అధ్యాయం : | 12 | ఇస్లామ్‌లోగానీ, అజ్ఞానంలోగానీ తన వంశపారంపర్యాన్ని తన తాతముత్తాతల వైపునకు ఆపాదించటం | 139 |
| అధ్యాయం : | 13 | ఏదేని ఒక జాతికి చెందిన మేనల్లుడు, స్వేచ్ఛ నొసగబడిన బానిస కూడా ఆ జాతివాడే | 140 |
| అధ్యాయం : | 14 | అబిసీనియన్ల గురించి... దైవప్రవక్త(స) వారినుద్దేశించి, ‘ఓ బనీ అర్ఫిదా’[1] అని సంబోధించటం | 140 |
| అధ్యాయం : | 15 | ఏ వ్యక్తి అయినా తన తండ్రీ తాతలను తూలనాడరాదని కోరుకోవటం | 141 |
| అధ్యాయం : | 16 | దైవప్రవక్త ముహమ్మద్(స) పేర్ల గురించి | 142 |
| అధ్యాయం : | 17 | ముహమ్మద్(సఅసమ్) చిట్టచివరి ప్రవక్త కావటం | 143 |
| అధ్యాయం : | 18 | మహనీయ ముహమ్మద్(స) మరణం గురించి | 143 |
| అధ్యాయం : | 19 | దైవప్రవక్త(సఅసం) ‘కునీయత్’ గురించి | 144 |
| అధ్యాయం : | 20 | జుఅయ్‌ద్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఇలా అన్నారు | 144 |
| అధ్యాయం : | 21 | దైవప్రవక్త ‘ముద్ర’ గురించి | 145 |
| అధ్యాయం : | 22 | దైవప్రవక్త(సఅసం) ఆహార్యం, నీతీ నడవడికల గురించి | 145 |
| అధ్యాయం : | 23 | దైవప్రవక్త(స) కళ్ళు బాహ్యంలో నిద్రించేవి కాని హృదయం మాత్రం ఏమరుపాటుకు గురయ్యేది కాదు | 153 |
| అధ్యాయం : | 24 | మహాప్రవక్త(స) అద్భుతాల గురించి | 155 |
| అధ్యాయం: | 25 | అల్ బఖరా సూరాలో దైవోపదేశం | 191 |
| అధ్యాయం : | 26 | ఏదైనా ‘అద్భుతం’ (చిహ్నం, సూచన) చూపమని బహుదైవారాధకులు దైవప్రవక్త(సఅసం)ను కోరటం | 192 |
| అధ్యాయం : | 27 | హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు | 193 |


## 3. ప్రవక్త ప్రియసహచరుల (రజిఅల్లాహు అన్‌హుమ్) గొప్పదనం


| | | | |
|---|---|---|---|
| అధ్యాయం: | 1 | ప్రవక్త ప్రియ సహచరుల(ర.అన్‌హుమ్) విశిష్ఠత గురించి | 197 |
| అధ్యాయం : | 2 | ముహాజిర్ల అంతస్తు | 199 |
| అధ్యాయం : | 3 | మహాప్రవక్త(సఅసం) ఈ విధంగా సెలవిచ్చారు | 202 |

| | | | |
|---|---|---|---|
| అధ్యాయం : | 4 | దైవప్రవక్త(సఅసం) తరువాత అబూబక్ర్(రజి)కు– ఇతర సహాబీలపై– గల ప్రాధాన్యత | 202 |
| అధ్యాయం : | 5 | "ఒకవేళ నేను గనక ఎవరినయినా ప్రాణ స్నేహితునిగా చేసుకునేటట్లయితే అబూబక్ర్(రజి)ను చేసుకునేవాణ్ణి" | 203 |
| అధ్యాయం : | 6 | ముహమ్మద్ బిన్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ గారికి ఆయన తండ్రి తెలిపిన దాని ప్రకారం ... | 204 |
| అధ్యాయం : | 7 | మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) విశిష్టత | 218 |
| అధ్యాయం : | 8 | మహనీయ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) మహిమోన్నతులు | 226 |
| అధ్యాయం : | 9 | హ్రజత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) సమక్షంలో విధేయతా ప్రమాణం చేసిన సంఘటన ... | 231 |
| అధ్యాయం : | 10 | హ్రజత్ అలీ బిన్ అబీ తాలిబ్(రజి) విశిష్టత | 239 |
| అధ్యాయం : | 11 | మహనీయ జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి) విశిష్టత | 245 |
| అధ్యాయం : | 12 | మహనీయ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి) గురించి | 246 |
| అధ్యాయం : | 13 | దైవప్రవక్త(స) రక్త సంబంధీకుల ప్రాముఖ్యత | 247 |
| అధ్యాయం : | 14 | జుబైర్ బిన్ అవ్వామ్(రజి) గొప్పతనం | 249 |
| అధ్యాయం : | 15 | మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) గురించి | 252 |
| అధ్యాయం : | 16 | మహనీయ సాద్ బిన్ అబీ వక్కాస్ జుహ్రీ(రజి) విశిష్టత | 252 |
| అధ్యాయం : | 17 | దైవప్రవక్త (సఅసమ్) అల్లుళ్ల గురించి... అబుల్ ఆస్ బిన్ రబీ కూడా ఈ కోవలో ఉన్నాడు | 254 |
| అధ్యాయం : | 18 | దైవప్రవక్త(స) బానిస మహనీయ జైద్ బిన్ హారిసా (రజి) గురించి... | 255 |
| అధ్యాయం : | 19 | మహనీయ ఉసామా బిన్ జైద్(రజి) గురించి | 257 |
| అధ్యాయం : | 20 | అబ్దుల్లాహ్ బిన్ దీనార్ అందజేసిన సమాచారం | 258 |
| అధ్యాయం : | 21 | మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గొప్పతనం | 259 |
| అధ్యాయం : | 22 | అమ్మార్, హుజైఫా (ర.అన్‌హుమా)ల గురించి | 260 |
| అధ్యాయం : | 23 | మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి) విశిష్ఠత | 262 |
| అధ్యాయం : | 24 | మహనీయ హసన్, హుసైన్(రజిఅల్లాహు అన్‌హుమా)ల విశిష్టత | 262 |
| అధ్యాయం : | 25 | హ్రజత్ బిలాల్ బిన్ రబాహ్(రజి) విశిష్టత | 265 |
| అధ్యాయం : | 26 | మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) గురించి | 266 |
| అధ్యాయం : | 27 | మహనీయ ఖాలిద్ బిన్ వలీద్(రజి) విశిష్టత | 266 |
| అధ్యాయం : | 28 | మహనీయ అబూ హుజైఫా బానిస సాలిమ్(రజి)గురించి | 267 |
| అధ్యాయం : | 29 | మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) గొప్పతనం | 267 |
| అధ్యాయం : | 30 | హ్రజత్ ముఆవియా బిన్ అబూ సుఫ్యాన్(రజి) గురించి | 269 |

అధ్యాయం : 31 హజ్రత్ ఫాతిమా(ర.అ) విశిష్టత 270
అధ్యాయం : 32 హజ్రత్ ఆయిషా(ర.అ) విశిష్టత 270
అధ్యాయం : 33 అన్సార్ల గొప్పతనం గురించి... 274
అధ్యాయం : 34 ప్రవక్త మహనీయులు (స) ఈ విధంగా సెలవీయటం... 276
అధ్యాయం : 35 అన్సార్లు– ముహాజిర్ల మధ్యన దైవప్రవక్త(స) సోదర బంధాన్ని ఏర్పరచటం 277
అధ్యాయం : 36 అన్సార్ల పట్ల ప్రేమాదరణలు కలిగి ఉండటం గురించి 279
అధ్యాయం: 37 "మీరు నాకు జనులందరిలోకీ ప్రియతములు" అని దైవప్రవక్త(స) సెలవీయటం 279
అధ్యాయం : 38 అన్సార్ తాబేదారుల విశిష్టత 280
అధ్యాయం : 39 అన్సార్ కుటుంబీకుల విశిష్టత 280
అధ్యాయం : 40 ప్రవక్త మహనీయులు(స) అన్సార్లతో ఇలా పలకటం.... 282
అధ్యాయం : 41 "(దేవా!) అన్సార్లపై ముహాజిర్లపై దయజూపు' అని ప్రవక్త (స) వేడుకోవటం 283
అధ్యాయం : 42 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 284
అధ్యాయం : 43 ప్రవక్త మహనీయులు(స) ఈ విధంగా సెలవీయటం 285
అధ్యాయం : 44 మహనీయ సాద్ బిన్ ముఆజ్ (రజి) విశిష్టత 286
అధ్యాయం : 45 ఉసైద్ బిన్ హుజైర్ (రజి), అబ్బాద్ బిన్ బిష్ర్ (రజి)ల విశిష్టత 288
అధ్యాయం : 46 ముఆజ్ బిన్ జబల్ (రజి) గొప్పతనం 289
అధ్యాయం : 47 సాద్ బిన్ ఉబాదా (రజి) గురించి.... 289
అధ్యాయం : 48 ఉబై బిన్ కాబ్ (రజి) గురించి 290
అధ్యాయం : 49 హజ్రత్ జైద్ బిన్ సాబిత్(రజి) విశిష్టత 290
అధ్యాయం : 50 హజ్రత్ అబూ తల్హా (రజి) గొప్పతనం 291
అధ్యాయం : 51 అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) విశిష్టత 292
అధ్యాయం : 52 హజ్రత్ ఖదీజా(ర.అ)తో దైవప్రవక్త(స) వివాహం. ఆమె విశిష్టత 294
అధ్యాయం : 53 జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ(రజి) గురించి 296
అధ్యాయం : 54 హుజైఫా బిన్ యమాన్(రజి) గురించి.... 297
అధ్యాయం : 55 హింద్ బిన్తె ఉతబా బిన్ రబీయ (రజి) గురించి 297
అధ్యాయం : 56 హజ్రత్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్ వృత్తాంతం 298
అధ్యాయం : 57 ఖురైషులు కాబా గృహానికి మరమ్మతు చేయటం గురించి 301
అధ్యాయం : 58 అజ్ఞాన కాలం గురించి 302
అధ్యాయం : 59 అజ్ఞాన కాలపు ప్రమాణ స్థలి గురించి 308
అధ్యాయం : 60 దైవప్రవక్త– సల్లల్లాహు అలైహి వ సల్లమ్– ప్రభవనం గురించి 313
అధ్యాయం : 61 దైవప్రవక్త(స), ఆయన ప్రియ సహచరులు మక్కా నగరంలో... 313

అధ్యాయం : 62 మహనీయ అబూబక్ర్(రజి) ఇస్లాం స్వీకరించిన సంఘటన 317
అధ్యాయం : 63 మహనీయ సాద్ బిన్ అబీ వక్కాస్(రజి)[1] ఇస్లామ్ స్వీకరణా వృత్తాంతం 318
అధ్యాయం : 64 జిన్నుల గురించి 319
అధ్యాయం : 65 మహనీయ అబూజర్ గిఫ్ఫారీ(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటన 320
అధ్యాయం : 66 సయీద్ బిన్ జైద్(రజి)[1] ఇస్లామ్ స్వీకరణ 322
అధ్యాయం : 67 మహనీయ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటన 323
అధ్యాయం : 68 చంద్రుడు చీలిపోవటం 326
అధ్యాయం : 69 ముస్లింలు అబిసీనియా వైపునకు వలస పోవటం 327
అధ్యాయం : 70 అబిసీనియా రాజు నజాషీ మరణం గురించి 332
అధ్యాయం : 71 దైవప్రవక్త(సఅసమ్)కు వ్యతిరేకంగా బహు దైవారాధకుల ప్రతిజ్ఞ 333
అధ్యాయం : 72 అబూ తాలిబ్ సంఘటన 334
అధ్యాయం : 73 మేరాజ్ (గగనయాత్ర) గురించి... 336
అధ్యాయం : 74 మక్కాలో దైవప్రవక్త(స) వద్దకు అన్సార్ల బృందాలు రావటం- 343
అధ్యాయం : 75 హజ్రత్ ఆయిషా(ర.అ)తో దైవప్రవక్త(స) వివాహం,
ఆమె కాపురానికి వెళ్ళటం గురించి... 345
అధ్యాయం : 76 ప్రవక్త(స), ఆయన ప్రియ సహచరులు మదీనా వైపునకు హిజ్రత్ చేయటం 347
అధ్యాయం : 77 ప్రవక్త (స), ఆయన ప్రియ సహచరులు మదీనాకు రావటం 371
అధ్యాయం : 78 హజ్జ్ నెరవేర్చిన పిదప 'ముహాజిర్లు' మక్కాలో ఆగి ఉండటం 377
అధ్యాయం : 79 ఇస్లామ్ చరిత్రకు మొదలేది? 377
అధ్యాయం : 80 "దేవా! నా సహచరుల హిజ్రత్‌ను స్థిరపరచు" 378
అధ్యాయం : 81 దైవప్రవక్త(స) ఏ విధంగా తన సహచరుల మధ్యన
సోదర బంధాన్ని ఏర్పరచారు? 380
అధ్యాయం : 82 మహనీయ అనస్(రజి) కథనం 381
అధ్యాయం : 83 ప్రవక్త మహనీయులు(స) మదీనా వచ్చినప్పుడు,
యూదులు ఆయన(స) వద్దకు రావటం గురించి... 383
అధ్యాయం : 84 సల్మాన్ ఫార్సీ(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటన 385

## 4. యుద్ధాల ప్రకరణం (కితాబుల్ మగాజీ)

అధ్యాయం : 1 ఉషైరా లేదా ఉసైరా యుద్ధం గురించి 387
అధ్యాయం : 2 బద్ర్ సంగ్రామంలోని హతుల గురించి ప్రవక్త (స) భవిష్యవాణి 388
అధ్యాయం : 3 బద్ర్ యుద్ధం 390

| | | | |
|---|---|---|---|
| అధ్యాయం : | 4 | అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 391 |
| అధ్యాయం : | 5 | ఇబ్నె అబ్బాస్(రజి) ఈ విధంగా.... | 393 |
| అధ్యాయం : | 6 | బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నవారి సంఖ్య | 393 |
| అధ్యాయం : | 7 | ఖురైషు అవిశ్వాసులు, షైబా, ఉతబా, వలీద్, అబూ జహల్‌లను అధిక్షేపిస్తూ ప్రవక్త మహనీయులు(స) ప్రార్థించటం– | 394 |
| అధ్యాయం : | 8 | అబూ జహ్ల్ వధ | 395 |
| అధ్యాయం : | 9 | బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి విశిష్టత | 403 |
| అధ్యాయం : | 10 | అబూ ఉసైద్(మాలిక్ బిన్ రబీయా–రజి) తెలిపారు | 405 |
| అధ్యాయం : | 11 | బద్ర్ యుద్ధంలో దైవదూతలు పాల్గొనటం గురించి | 412 |
| అధ్యాయం : | 12 | అనస్ బిన్ మాలిక్(రజి) ఖతాదాతో ఇలా అన్నారు | 413 |
| అధ్యాయం : | 13 | బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహచరమాన్యుల పేర్లు | 427 |
| అధ్యాయం : | 14 | బనూ నజీర్ యూదుల గురించి | 429 |
| అధ్యాయం : | 15 | కాబ్ బిన్ అష్రఫ్ వధ | 436 |
| అధ్యాయం : | 16 | అబూ రాఫె అబ్దుల్లాహ్ బిన్ అబిల్ హుఖీఖ్ వధ | 439 |
| అధ్యాయం : | 17 | ఉహుద్ యుద్ధం | 443 |
| అధ్యాయం : | 18 | మీలోని రెండు వర్గాలు[1] పిరికితనం చూపటానికి సిద్ధపడిన విషయం | 451 |
| అధ్యాయం : | 19 | అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 457 |
| అధ్యాయం : | 20 | అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు | 459 |
| అధ్యాయం : | 21 | అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 459 |
| అధ్యాయం : | 22 | అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు | 460 |
| అధ్యాయం : | 23 | ఉమ్మె సలీత్(ర.అ) ప్రస్తావన | 461 |
| అధ్యాయం : | 24 | ఉహుద్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(స)కు అయిన గాయాలు | 465 |
| అధ్యాయం : | 25 | ఉహుద్ యుద్ధంలో అమరగతినొందినవారు | 467 |
| అధ్యాయం : | 26 | “ఉహుద్ పర్వతం మమ్ము అభిమానిస్తోంది” | 470 |
| అధ్యాయం : | 27 | రజీ యుద్ధం గురించి | 471 |

# భూమిక

'హదీసు'కు సంబంధించిన ముఖ్యమయిన, అవసరమయిన చర్చలన్నీ ఈ క్లుప్తమయిన 'భూమిక'లో చేర్చడం సాధ్యపడదు. వీటిగ్గాను ప్రత్యేకంగా వేరే రచన అవసరం. ప్రస్తుతానికి హదీసు సంకలనం, సంచయనాలకు సంబంధించిన సంక్షిప్త మయిన ఒక స్వరూపాన్ని పఠితల ముందుంచడం జరిగింది. ప్రవక్త ప్రవచనాల అమూల్యమయిన సంపద గత 13 వందల ఏళ్ళుగా ఎన్నెన్ని దశలు దాటుకుంటూ మన వరకు చేరిందో విజ్ఞతకు, వివేచనకు, మార్గదర్శకత్వానికి మూలమయిన ఈ వెలలేని ఖజానా తమ తరువాతి తరాలకు భద్రంగా చేరవెయ్యడానికి ఏయే పవిత్రాత్మలు తమ జీవితాలను అంకితం చేశాయో, అవసరమైతే తమ ప్రాణాలకు సైతం ఎలా తెగించి ఈ కార్యాన్ని నిర్వహించాయో కాస్తయినా బోధపరచడానికి ఇందులో కృషి జరిగింది.

ప్రవక్త ప్రవచనాలు మనకు మూడు విధాలుగా చేరాయి.

1. ముస్లిమ్ సముదాయం నిరంతర ఆచరణ
2. లిఖితపూర్వకంగా భద్రపరిచిన సంకలనాలు, పుస్తకాలు.
3. జ్ఞాపకశక్తి ఆధారంగా ఉల్లేఖన ప్రక్రియ- అంటే పాఠ్య పఠనాల ద్వారా.

ఈ విధంగా సంచయనం, సంకలనం, రచనలు జరిగిన మొత్తం కాలాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు.

1. ప్రవక్త కాలం నుంచి మొదటి శతాబ్ది హిజ్రీ వరకు
2. మొదటి శతాబ్ది మొదలుకుని రెండవ అర్ధ శతాబ్ది వరకు
3. రెండవ అర్ధ శతాబ్ది మొదలుగా నాల్గవ శతాబ్ది చివరి వరకు.
4. అయిదవ శతాబ్ది మొదలుకుని ఇంకా కొనసాగుతోంది.

## మొదటి దశ

ఈ కాలంలో హదీసు సంచయన కర్తలు, ఆనాటి లిఖిత ప్రతులు, సంచయనాల వివరాలు ఇలా ఉన్నాయి.

## ప్రఖ్యాత హదీసు స్మర్తలు

| సంఖ్య | పేరు | మరణం | వయసు | ఉల్లేఖనాలు |
|---|---|---|---|---|
| 1. | హజ్రత్ అబూహుర్రైరా (రజి) (అబ్దుర్రహ్మాన్) శిష్యులు 800 | హి.59 | 78 | 5374 |
| 2. | హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) | హి.68 | 71 | 2660 |
| 3. | హజ్రత్ ఆయిషా సిద్దికా (ర.అ) | హి.58 | 67 | 2210 |
| 4. | హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) | హి.73 | 84 | 1630 |
| 5. | హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) | హి.78 | 94 | 1560 |
| 6. | హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) | హి. 93 | 103 | 1286 |
| 7. | హజ్రత్ అబూ సయీద్ ఖుద్రి (రజి) | హి. 74 | 84 | 1170 |

వెయ్యికన్నా ఎక్కువ హదీసులు జ్ఞాపకమున్న ఘనులయిన ప్రవక్త సహచరులు వీరు. వీరుకాక హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (హి.63), హజ్రత్ అలీ (హి. 40), హజ్రత్ ఉమర్ ఫారూక్ (హి. 23) వీరంతా 500 నుంచి వెయ్యి వరకు హదీసులు ఉల్లేఖించినవారు.

అలాగే హజ్రత్ అబూబక్ర్ (హి. 13), హజ్రత్ ఉస్మాన్ (హి.36), హజ్రత్ ఉమ్మె సలమా (హి.59), హజ్రత్ అబూ మూసా అష్అరీ (హి.52), హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (హి.32), హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారి(హి. 51), హజ్రత్ ఉబై బిన్ కఅబ్(హి.19), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (హి.18)- వీరంతా వందకు పైగా 500కు తక్కువగా హదీసులు ఉల్లేఖించారు.

వీరేకాక ఆ కాలంలోని గొప్ప అనుచర గణాన్నీ మరువలేము. వారి అనన్య మయిన పరిశ్రమ వల్లనే ప్రవక్త సంప్రదాయ సంపద అంతా ప్రవక్త అనుచర సముదాయానికి అందగలిగింది. ప్రళయం వరకూ తరగని ఈ సంపద ద్వారా ముస్లిమ్ సముదాయం ప్రయోజనం పొందుతూనే ఉంటుంది.

కొందరు మహనీయుల పరిచయం క్రిందనిస్తున్నాము.

1. **సయీద్ బిన్ ముసయ్యిబ్ :** ఫారూకీ హయాంలో రెండవ సంవత్సరం మదీనాలో పుట్టారు. హి. 105లో మరణించారు.

   హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ ఆయిషా, హజ్రత్ అబూ హుర్రైరా, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర) ద్వారా హదీసు విద్యనభ్యసించారు.

2. **ఉర్వా బిన్ జుబైర్ :** ఈయన మదీనాకు చెందిన ప్రముఖ పండితుల్లో

పరిగణించబడతారు. హజ్రత్ ఆయిషా అక్క కుమారులు. అధికాంశం తన పిన్ని చెప్పిన హదీసులను ఉల్లేఖించారు. ఇంకా హజ్రత్ అబూ హురైరా, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ వద్ద కూడా శిష్యరికం చేసిన ఘనత ఉంది. ఈయన శిష్యుల్లో సాలిహ్ బిన్ కైసాన్, ఇమామ్ జుహ్రి లాంటి పండితులున్నారు. ఈయన హి.94లో పరమపదించారు.

3. **సాలిమ్ బిన్ అబ్దుల్లా బిన్ ఉమర్:** మదీనాకు చెందిన 7 గురు షరీఅత్ వేత్తల్లో ఈయన్ని గణిస్తారు. ఈయన తన తండ్రి గారు, ఇతర ప్రవక్త సహచరుల ద్వారా హదీసు పాండిత్యాన్ని గడించారు. నాఫె జుహ్రి తదితర ప్రముఖ అనుచరులు ఈయన శిష్యులు. హి. 106లో మరణించారు.

4. **నాఫె మౌలా అబ్దుల్లా బిన్ ఉమర్:** వీరు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ శిష్యుల్లో ప్రముఖులు, ఇమామ్ మాలిక్‌కు గురువు. హదీసువేత్తల దృష్టిలో ఈ ప్రమాణ పరంపర (మాలిక్ నాఫె నుండి, ఆయన అబ్దుల్లా బిన్ ఉమర్ నుండి, ఆయన దైవ సందేశహరుల నుండి) సిల్సిలతుజ్జహబ్ (స్వర్ణ పరంపర)గా పరిగణించ బడుతుంది. ఈయన హి.117లో దివంగతులయ్యారు.

## తొలి దశలోని లిఖిత సంపద

1. **సహీఫా సాదికా:** ఇది హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (హి.13-వయసు 77) సంకలనం చేసింది.

   హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్‌కు రచన, సంకలనాల అభిరుచి మెండుగా ఉండేది. దైవ సందేశహరులు పలికే ప్రతి మాటను రాసుకునేవారు. ఈ విషయంలో స్వయాన ప్రవక్త మహనీయులు ఆయనకు అనుమతినిచ్చారు. ఈ సంకలనంలో ఒక వెయ్యి హదీసులుండేవి. చాలాకాలం వరకు వారి వంశంలో భద్రంగా ఉండేవి. ఇప్పుడు అది ముస్నద్ ఇమామ్ అహ్మద్‌లో ఒక భాగమయిపోయింది.

2. **సహీఫా సహీహా:** సంకలన కర్త, హుమామ్ బిన్ మునబ్బిహ్ (హి.101). వీరు హజ్రత్ అబూ హురైరా గారి ప్రముఖ శిష్యుల్లో ఒకరు. ఈయన తన గురువు ఉల్లేఖనాలన్నింటినీ ఒకేచోట గ్రంథస్థం చేసుకున్నారు. దాని రాత ప్రతులు బెర్లిన్, డెమాస్కస్ గ్రంథాలయాల్లో ఉన్నాయి. ఇంకా ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ తన విఖ్యాత ముస్నద్‌లోనూ 'అబూ హురైరా' అన్న శీర్షికన ఈ మొత్తం పుస్తకాన్ని యధాతథంగా చేర్చారు. (ముస్నద్ అహ్మద్, సంపుటి 2, పుటలు

312- 318) ఈ సంకలనం కొన్నేళ్ళ క్రితం డాక్టర్ హమీదుల్లా (ప్యారిస్) ప్రయత్నాల ఫలితంగా హైదరాబాద్‌లో ప్రచురించడం జరిగింది. ఇందులో 138 ఉల్లేఖనాలున్నాయి.

ఈ సహీఫా, హజ్రత్ అబూ హురైరా ఉల్లేఖనాలన్నింటిలోని ఒక భాగం మాత్రమే. దీని ఉల్లేఖనాలు అనేకం బుఖారి, ముస్లిమ్ గ్రంథాలలోనూ దొరుకుతాయి. పదాలు ఒకేలాగుంటాయి. పెద్ద వ్యత్యాసం కనిపించదు.

3. **బషీర్ బిన్ సహీక్:** హజ్రత్ అబూహురైరా శిష్యుల్లో రెండవ వారు. ఈయన కూడా ఒక సంకలనం తయారు చేశారు. దీన్ని ఈయన హజ్రత్ అబూ హురైరాకు చివరి రోజుల్లో వినిపించి ధ్రువీకరించుకున్నారు.

4. **ముస్నద్ అబూహురైరా :** దీని ప్రతులు సహచరుల కాలంలోనే గ్రంథస్థమయ్యాయి. దీని ఒక ప్రతి హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ తండ్రి, అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్ (ఈజిప్ట్ గవర్నర్ హి.86) వద్ద కూడా ఉండేది. అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్ కసీరా బిన్ ముర్రాకు, 'నీ వద్ద సహచరులు ఉల్లేఖించిన హదీసులుంటే వాటిని వ్రాసి పంపు. హజ్రత్ అబూ హురైరా హదీసులు అక్కరలేదు. అవి నా వద్ద గ్రంథస్థమయి ఉన్నాయి' అని వ్రాశారు. 'ముస్నద్ అబూ హురైరా' గ్రంథ ప్రతి ఒకటి, ఇమామ్ ఇబ్ను తయిమియ్య వ్రాసినది జర్మనీ గ్రంథాలయంలో భద్రంగా ఉంది.

5. **సహీఫా హజ్రత్ అలీ:** ఇమామ్ బుఖారి విశదీకరించిన దాని ప్రకారం, ఇది చాలా ఘనమయిన సంపుటం. ఇందులో జకాత్, మదీనా పవిత్రత, హజ్జతుల్ విదా ప్రసంగం, ఇస్లామీయ రాజ్యాంగ అంశాలు లాంటి విషయాలు అనేకం ప్రస్తావించబడి వున్నాయి.

6. **ప్రవక్త మహనీయుని ప్రసంగ పాఠం :** మక్కా ప్రవేశం నాడు, అబూ షా యమని కోరిక మేరకు దైవ ప్రవక్త తన ప్రసంగాన్ని సవివరంగా రాయించారు. ఈ ప్రసంగంలో మానవ హక్కులకు సంబంధించిన ముఖ్యమయిన వివరాలున్నాయి.

7. **సహీఫా హజ్రత్ జాబిర్ :** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనాలను ఆయన శిష్య గణం, వహబ్ బిన్ మునబ్బ(హి.110), సులైమాన్ బిన్ ఖైస్ లష్కరి వ్రాత మూలకంగా సంకలనం చేసుకున్నారు. ఈ సంకలనంలో హజ్ విధి నిషేధాలు, వీడ్కోలు హజ్ ప్రసంగం ఉన్నాయి.

8. **హజ్రత్ ఆయిషా(ర) ఉల్లేఖనాలు** : హజ్రత్ ఆయిషా ఉల్లేఖనాలను ఆవిడ శిష్యుడు ఉర్వా బిన్ జుబైర్ వ్రాసి భద్రపరిచారు.
9. **ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనాలు** : హజ్రత్ అబ్దుల్లా ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనాల అనేక సంకలనాలున్నాయి. హజ్రత్ సయీద్ బిన్ జుబైర్ తాబయీ కూడా ఈయన ఉల్లేఖనాలను వ్రాసి సంకలనం చేసుకున్నారు.
10. **అనస్ బిన్ మాలిక్ సహీఫాలు:** సయీద్ బిన్ హిలాల్ ప్రకారం, "హజ్రత్ అనస్ తాను వ్రాసిపెట్టుకున్న ప్రతుల్ని మాకు చూపి, 'ఈ ఉల్లేఖనాలు నేను స్వయంగా దైవ సందేశహరుని నోట విన్నాను, అప్పుడే రాసుకున్నాను, తరువాత ఆయన (స)కు వినిపించి ధ్రువీకరించుకున్నాను కూడా' అని అనేవారు".
11. **అమ్ర్ బిన్ హజ్మ్** : ఈయన్ని యమన్ గవర్నరుగా నియమించి పంపేటప్పుడు ప్రవక్త మహనీయులు (స) రాతమూలకంగా ఒక సూచనా పత్రాన్ని ఇచ్చి పంపారు. ఈయన ఆ సూచనాపత్రాన్ని భద్రపరచటమేకాక దైవప్రవక్త ఇచ్చిన ఇంకా 21 ఆదేశ పత్రాలను జతచేసి ఒక పుస్తకాన్నే సంకలనం చేశారు.
12. **సమురి బిన్ జున్దబ్ పుస్తకం:** ఇది ఈయన తనయునికి వారసత్వంలో లభించింది. ఇందులోనూ ఉల్లేఖనాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.
13. **సహీఫా సఅద్ బిన్ ఉబాదా** : హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా ప్రవక్త సహచరులు, అజ్ఞానకాలం నుండే చదవనూ, వ్రాయనూ వచ్చినవారు.
14. **హజ్రత్ నాఫె లేఖలు:** సులైమాన్ బిన్ మూసా ఉల్లేఖనం ప్రకారం, అబ్దుల్లా బిన్ ఉమర్ చెబుతూ ఉంటే నాఫె (ర) వ్రాస్తూ ఉండేవారు.
15. మ'అన్ ఉల్లేఖనం ప్రకారం, 'అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లా బిన్ మస్ఊద్(ర) నా ఎదుట గ్రంథం తీసి ప్రమాణం చేస్తూ 'ఇది నా తండ్రి అబ్దుల్లా బిన్ మస్ఊద్ తన స్వహస్తాలతో వ్రాసిన గ్రంథం' అని అన్నారు."

పరిశోధనను అన్వేషణను ఇంకా కొనసాగిస్తే ఇవి కాక ఇంకా ఎన్నో ఉదాహరణలు, సంఘటనలు దొరకవచ్చు.

ఈ దశలో ప్రవక్త సహచర మాన్యులు, గొప్ప అనుచరులు ఇతోధికంగా తమ వ్యక్తిగత స్మృతిలోని హదీసుల్ని గ్రంథస్థం చెయ్యడం పట్ల శ్రద్ధ చూపారు. కాని రెండవ దశలో సంచయన, సంపాదన కార్యం ఇంకా విస్తృతి పొందింది. హదీసు సంకలనకర్తలు తమకు సొంతంగా తెలిసినవాటితోపాటు తమ నగరం, ప్రాంతంలోని పండితుల్ని కలుసుకుని వారి ఉల్లేఖనాలను సయితం క్రమబద్ధం చేశారు.

## రెండవ దశ

ఈ దశ దాదాపు రెండవ శతాబ్ది (హి(జ్రీ) తొలి యాభయ్యేళ్ళకు ముగుస్తుంది. ఈ దశలో అనుచరుల ఒక పెద్ద వర్గం సిద్ధమయింది. ఈ వర్గంలోనివారు తొలి దశలోని లిఖిత సంపదనంతా విస్తృత సంకలనాలతో క్రోడీకరించారు.

## హదీసు సంకలన కర్తలు

**1. ముహమ్మద్ బిన్ షిహాబ్ జుహ్రీ (మ : హి.124)** : ఈయనను సమకాలీన హదీసువేత్తలలో ముఖ్యులుగా పరిగణించేవారు. ఈయన హదీసు విద్యను దిగువ పేర్కొన్న మహనీయ వ్యక్తుల ద్వారా అభ్యసించారు.

**సహచరుల్లో** : 1. అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) 2. అనస్ బిన్ మాలిక్ (ర) 3. సహల్ బిన్ సఅద్(ర).

**అనుచరుల్లో** : సయీద్ బిన్ ముసయ్యిబ్, మహ్మూద్ బిన్ రబీ ప్రభృతులు.

ఈయన గారి శిష్యగణంలో, ఇమామ్ ఔజాయి, ఇమామ్ మాలిక్, సుఫియాన్ బిన్ ఉయియ్యన వంటి హదీసువేత్తలున్నారు. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ హి.శ. 101లో ఈయనకు హదీసులు సంకలనం చేసే కార్యాన్ని అప్పగించారు. ఈయనతోపాటు మదీనా గవర్నరు అబూబక్ర్ ముహమ్మద్ బిన్ ఉమర్ బిన్ హజ్మ్‌కు ఆదేశాలు పంపి, ఉర్వా బిన్తు అబ్దుర్రహ్మాన్, కాసిమ్ బిన్ ముహమ్మద్ వద్ద వున్న హదీసు భండారాన్నీ గ్రంథస్థం చెయ్యమని ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ పురమాయించారు.

పైన పేర్కొన్న ఉర్వా, హజ్రత్ ఆయిషాకు ముఖ్య శిష్యురాలు. కాసిమ్ బిన్ ముహమ్మద్ ఆవిడ సోదరుని కొడుకు. హజ్రత్ ఆయిషా తన సంరక్షణలో వీరికి శిక్షణ, బోధనలు గరిపారు.

ఇంతేకాక హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఇస్లామీయ రాజ్యంలో బాధ్యతా యుత స్థానంలో ఉన్న నాయకులందరినీ హదీసుల్ని కూడబెట్టాలని, వాటిని క్రమబద్ధం చేయాలన్న తాకీదుతో ఫర్మానాలు జారీ చేశారు. ఫలితంగా హదీసు పెను గ్రంథాలే రాజధాని నగరమయిన డెమాస్కస్ చేరాయి. ఖలీఫా వాటి నకళ్ళను రాజ్యంలో మూల మూలన చేరవేశారు.

ఇమామ్ జుహ్రీ హదీసు సంకలనాన్ని సిద్ధం చేసిన తరువాత ఆ కాలంలోని ఇతర విద్యావంతులు సయితం సంకలనం, సంపాదన కార్యక్రమాలు చేపట్టారు.

2. అబ్దుల్ మలిక్ బిన్ జరీహ్ (హి. 150) మక్కాలో ఈ మహత్కార్యాన్ని చేపట్టారు.
3. ఇమామ్ ఔజాయి (హి. 157) - సిరియాలో
4. ముఅమ్మర్ బిన్ రాషిద్ (హి.153) - యమన్‌లో
5. ఇమామ్ సుఫియాన్ సౌరి (హి. 161)- కూఫాలో
6. ఇమామ్ హమ్మాద్ బిన్ సల్లమ(హి. 167) - బస్రాలో
7. ఇమామ్ అబ్దుల్లా బిన్ ముబారక్ (హి. 181)- ఖురాసాన్‌లో

వీరంతా హదీసుల సంకలనం, వాటి క్రమబద్ధీకరణ కృషిలో మున్ముందు ఉండిన మహనీయులు.

8. ఇమామ్ మాలిక్ బిన్ అనస్(హి.93- 179): మదీనాలో ఇమామ్ జుహ్రీ తరువాత ప్రవక్త హదీసు సంకలనా శుభకార్యం చేపట్టే ఘనత తనకే దక్కింది. ఈయన నాఫె, జుహ్రీ ఇంకా ఇతర ప్రముఖ పండితుల వద్ద విద్యనభ్యసించారు. ఈయన గురువుల సంఖ్య 900 వరకు ఉందని అంటారు. ఈ విద్యామృత సరోవరం నుండి హిజాజ్, సిరియా, ఇరాక్, పాలస్తీనా, ఈజిప్ట్, ఆఫ్రికా, స్పెయిన్‌కు చెందిన వేలాది ప్రవక్త సంప్రదాయ పిపాసువులు తనివితీరా గ్రోలారు. ఈయన శిష్యుల్లో లైస్ బిన్ సఅద్ (హి.175), ఇబ్ను ముబారక్ (హి. 181), ఇమామ్ షాఫియీ (హి. 204), ఇమామ్ ముహమ్మద్ బిన్ హసనుష్షైబాని (హి.189) లాంటి మహామహులున్నారు.

ఈ దశలో హదీసు సంకలనాలు అనేకం జరిగాయి. వీటిలో ఇమామ్ మాలిక్ సంకలనం చేసిన ముఅత్తాకు ప్రత్యేక స్థానముంది. దీని సంకలనా కాలం హి.130 నుండి 141 మధ్యన ఉంటుంది. మొత్తం ఉల్లేఖనాల సంఖ్య 1700. వీటిలో నుంచి మర్ఫూ 600; ముర్సల్ 228, మౌకూఫ్ 613; అనుచరుల సూక్తులు 285 ఉన్నాయి. ఈ దశలోని కొన్ని ఇతర సంకలనాల పేర్లు : 1. జామె సుఫియాన్ సౌరి (హి.161) 2. జామె ఇబ్ను ముబారక్ (హి.181); 3. జామె ఇమామ్ ఔజాయి (హి.157), 4. జామె ఇబ్ను జురైజ్ (హి.150) 5. కితాబుల్ ఖరాజ్, కాజీ అబూ యూసుఫ్ (హి.183); 6. కితాబుల్ అసార్, ఇమామ్ ముహమ్మద్(హి.189)

ఈ దశలో ప్రవక్త మహనీయుని హదీసులు, సహచరుల అనుచరుల ఫత్వాలు (తీర్పులు)- అన్నింటినీ ఒకే గ్రంథంలో సంచయనం చేసేవారు. అయితే ఫలానా విషయం సహచరుల లేక అనుచరుల సూక్తి అని లేక ప్రవక్త(స) హదీసు అని విశదీకరించడం జరిగేది.

## మూడవ దశ

ఇది దాదాపు హిజ్రీ 150 మొదలు 400 వరకు ఉంటుంది. ఈ దశ ప్రత్యేకతలు ఇవి :

1. ప్రవక్త ప్రవచనాలను (హదీసులను) సహచరుల 'ఆసార్' (ప్రభావకాలు), అనుచరుల సూక్తుల నుండి వేరు చేసి సంకలనం చెయ్యడం జరిగింది.
2. విశ్వసనీయమయిన ఉల్లేఖనాల సంకలనాలు వేరుగా తయారయ్యాయి. ఈ విధంగా అన్వేషణ, పరిశోధన, అనుశీలనల తరువాత రెండవ దశలోని రచనలు మూడవ దశలో ఘనమయిన పుస్తకాలుగా రూపొందాయి.
3. ఈ దశలో ఉల్లేఖనాలను ప్రోగు చెయ్యడమేకాక హదీసు శాస్త్రాన్ని భద్రపరచడానికి హదీసువేత్తలు వందకు పైగా వివిధ విద్యల్ని ఆవిష్కరించారు. వాటి మీద ఇప్పటివరకు వేలాది పుస్తకాల రచన జరిగింది.

    'వారు చేసిన కృషికి దైవానికి కృతజ్ఞతలు, దైవం వారి ఆ కృషికి గాను ఉత్తమమయిన ప్రతిఫలాన్నివ్వుగాక'

    ఆ విద్యల్లో కొన్నింటి క్లుప్తమయిన పరిచయం

## 1. అస్మాఉర్రిజాల్ విద్య

ఈ విద్యలో ఉల్లేఖకుల జీవిత విశేషాలు, జనన కాలం, వారి గురువులు, శిష్యులు ఇత్యాధి విషయాల వివరాలు; విద్యాప్రాప్తికై చేసిన ప్రయాణాలు, వారి విశ్వసనీయత ప్రమాణాన్ని గురించి హదీసువేత్తల నిర్ణయాలున్నాయి. ఇది చాలా విస్తృతమయిన శాస్త్రం, ఆసక్తికరమయింది కూడా.

కొందరు పక్షపాత బుద్ధి గల ప్రాచ్య విద్యా నిపుణులయిన పాశ్చాత్యులు (Orientalists) కూడా దీని ప్రశస్తతను కొనియాడకుండా ఉండలేకపోయారు. ఈ శాస్త్రం వల్ల అయిదు లక్షల మంది ఉల్లేఖకుల జీవన వృత్తాంతాలు భద్రంగా ఉన్నాయి. ఈ ప్రత్యేకతలో ముస్లిమ్ పండితులకు సరితూగేవారు దొరకడం అసాధ్యం.

ఈ శాస్త్రంలో వందలాది పుస్తకాలు రచించారు. కొన్నింటి పేర్లు :

**అ)** **తహ్జీబుల్ కమాల్ - రచయిత** : ఇమామ్ యూసుఫ్ (హి.742). ఈ శాస్త్రంలో ఇది అత్యంత ప్రామాణికమయిన గ్రంథం.

**ఆ)** **తహ్జీబుత్తహ్జీబ్ :** రచయిత - హాఫిజ్ ఇబ్ను హజర్, బుఖారీ టీకా కర్త, ఈ గ్రంథం 12 సంపుటాల్లో ఉంది; (హైదరాబాద్ దాయరతుల్ మఆరిఫ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రచురించింది).

ఇ) తజ్‌కిరతుల్ హుఫ్ఫాజ్ - రచయిత : అల్లామా జహబి (హి. 748)

## 2. ముస్తలహుల్ హదీస్ విద్య

ఇది హదీసు విద్యకు ప్రాతిపదిక సూత్రావళి. ఈ శాస్త్రం వెలుగులోనే హదీసుల స్థాయి, బలహీనతల నియమాలు తెలుస్తాయి.

ఈ శాస్త్రానికి సంబంధించిన ప్రఖ్యాత పుస్తకం 'ఉలూముల్ హదీసు' దీన్ని 'ముకద్దమ ఇబ్నుస్సలాహ్' అని కూడా అంటారు. రచయిత : అబూ ఉమర్, ఉస్మానిబ్నుస్సలాహ్ (హి. 577)

గత 100 ఏళ్ళల్లో హదీసు సూత్రావళి మీద రెండు గ్రంథాలు వెలువడ్డాయి.

**(అ) తౌజీహున్నజర్ - రచయిత:** అల్లామా తాహిర్ బిన్ సాలిహ్ అల్ జజాయిరీ (హి.1338)

**(ఆ) కవాయిదుత్తహదీసు - రచయిత** : అల్లామా సయ్యద్ జమాలుద్దీన్ కాసిమీ (హి.1332)

మొదటి పుస్తకం విషయ విస్తృతికి, రెండవది సక్రమ సంకలనానికి ఖ్యాతి గడించాయి.

## 3. గరీబుల్ హదీసు విద్య

ఈ శాస్త్రంలో హదీసుల్లోని కఠినపదాల శాబ్దిక అర్థాల పరిశోధన విరివిగా జరిగింది. ఈ శాస్త్రంలో ఇదికాక అల్లామా జమఖ్షరీ (హి.538) రచించిన అల్ ఫాయిక్, ఇబ్నుల్ అసీర్ (హి.606) రచించిన నిహాయ ప్రముఖమయినవి.

## 4. తఖ్‌రీజుల్ అహాదీస్ విద్య

ప్రముఖ ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన గ్రంథాలు, ఫికహ్ గ్రంథాలు, సూఫీయిజానికి సంబంధించిన గ్రంథాలు, విశ్వాసాలకు సంబంధించిన గ్రంథాలు- వీటన్నింటిలో ప్రస్తావించిన ఉల్లేఖనాలకు మూల గ్రంథాలేవీ అన్న విషయం తెలుసుకోదలిస్తే ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, 'హిదాయ' (బుర్హానుద్దీన్ అలీ బిన్ అబీబక్ర్ అల్ మర్గీనాని (హి. 592). 'ఇహ్యాఉల్ ఉలూమ్' (ఇమామ్ గజాలి -హి. 505)లలో అనేక ఉల్లేఖనాలు, ఎలాంటి ప్రామాణికత తెలుపకుండా, మూలాన్ని తెలుపకుండా ప్రస్తావనలోకి వచ్చాయి. ఎవరైనా ఆ ఉల్లేఖనాల ప్రామాణికత ఏ పాటిదని, ఏఏ ప్రముఖ హదీసు పుస్తకాల్లో అవి వచ్చాయని తెలుసుకోగోరితే ఈ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాల్లో అవి లభ్యమవుతాయి. మొదట పేర్కొన్న పుస్తకం కోసం హాఫిజ్ జైలయి (హి. 792) రచించిన 'నసబుర్రాయ' అన్న పుస్తకాన్ని, హాఫిజ్ ఇబ్ను హజర్ అస్కలాని (హి.852) వ్రాసిన 'అద్దరాయ' అన్నదాన్నీ చూడవలసి వుంటుంది. రెండవ పుస్తకంలోని హదీసుల

కొరకు హాఫిజ్ జైనుద్దీన్ ఇరాకీ (హి. 808)రచించిన 'అల్ ముగ్నీ అన్ హమలిల్ అస్ఫార్' అనేది ఉచితమయింది.

## 5. అల్ అహాదీసుల్ మౌజూఅ విద్య

ఈ శాస్త్రంలో పండితులు ప్రత్యేక పుస్తకాలు రచించారు. 'మౌజూ' (కల్పించిన-అబద్ధపు) ఉల్లేఖనాలను వేరు చేశారు. ఈ విషయంలో కాజీ షౌకాని (హి.1255) రచించిన 'అల్ ఫవాయిదుల్ మజ్మూఅ'తోపాటు హాఫిజ్ జలాలుద్దీన్ సుయూతి (హి.911) వ్రాసిన 'అల్ లఆలి అల్ మస్నూఅ' ప్రముఖమయినవి.

## 6. అన్నాసిఖ్ వల్ మన్సూఖ్ విద్య

ఈ శాస్త్రంలో ఇమామ్ ముహమ్మద్ బిన్ మూసా హాజమి హి.784- వయసు 35) రచించిన 'కితాబుల్ ఈ'తిబార్' చాలా ప్రామాణికమయింది. ఖ్యాతి గడించింది కూడా.

## 7. అత్ తౌఫీక్ బైనుల్ అహాదీస్- విద్య

ఈ శాస్త్రంలో, స్థూలంగా చూస్తే పరస్పర విరుద్ధంగా కనిపించే ఉల్లేఖనాల మధ్య సమాన అర్థాన్వయం చెయ్యడం జరిగింది. ప్రథమంగా ఇమామ్ షాఫియి (హి. 204) ఈ విషయాన్ని చర్చించారు. ఈయన వ్రాసిన పుస్తకం 'ముఖ్తలిఫుల్ హదీసు' అనే పేరుతో ఖ్యాతి గడించింది. ఇమామ్ తహావి (హి. 321) రచించిన 'ముష్కిలుల్ అసార్' అనే పుస్తకం కూడా ఈ శాస్త్రంలో ఉపయోగకరమయిన పుస్తకమే.

## 8. అల్ ముఖ్తలిఫ్ వల్ ముఅత్తలిఫ్ విద్య

ఈ శాస్త్రంలో ముఖ్యంగా ఉల్లేఖన కర్తల పేర్లు, వాళ్ళ సంతానం, తండ్రిపేర్లు, బిరుదులు, తాత ముత్తాతల పేర్లు, లేక గురువుల పేర్లు ఒకేలా కనిపించిన వారి ప్రస్తావన వుంది. ఇలాంటి అనుమానాస్పద స్థితి వల్ల ఎరుగని వ్యక్తి అపార్థానికి గురయ్యే ఆస్కారముంది. ఈ శాస్త్రంలో హాఫిజ్ ఇబ్ను హజర్ విరచితమయిన 'తాబీర్ అల్ మున్తబహ్' అనే పుస్తకం చాలా సమగ్రమయింది.

## 9. అత్రాఫుల్ హదీస్ విద్య

ఈ శాస్త్రం ద్వారా ఏ ఉల్లేఖనం ఏ పుస్తకంలో ఉందో, దాని ఉల్లేఖనకర్తలెవరో తెలుస్తుంది. ఉదాహరణకు మీకు 'ఇన్నమల్ ఆమాలు బిన్నియ్యాత్' అనే హదీసు

వాక్యం ఒకటి గుర్తుంది. అది ఎక్కడి నుండి లభించిందో, ఉల్లేఖనం పూర్తి పాఠమేమిటో, ఉల్లేఖన కర్తలెవరో మీరు తెలుసుకోదలిస్తే ఈ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను చూడవలసి వుంటుంది. ఈ శాస్త్రాన్ని హాఫిజ్ మజి (హి. 742) రచించిన 'తుహఫతుల్ అష్రాఫ్' అన్న పుస్తకంలో సవివరంగా చర్చించడం జరిగింది. ఇందులో 'సిహాసిత్తా' (ఆరు అతి సవ్యమయిన హదీసు పుస్తకాలు)లోని ఉల్లేఖనాల పట్టిక మొత్తం వచ్చేసింది. ఈ పుస్తకంలో హాఫిజ్ అబూ యూసుఫ్ మజీ 26 సంవత్సరాలు వెచ్చించారు. ఎంతో కఠిన శ్రమతో దీన్ని పూర్తి చేశారాయన. నేటి ప్రాచ్య శాస్త్రాల పాశ్చాత్య నిపుణులు (Orientalists) ఇలాంటి పుస్తకాలను అనుసరించే కాస్త కొత్తరూపంలో హదీసుల పట్టిక ఒకటి తయారు చేశారు. ఉదాహరణకు 'కునూజుస్సున్నహ్' అనే పుస్తకం ఇంగ్లీషులో ప్రచురించారు. దాని అరబీ అనువాదం క్రీ.శ. 1934లో ఈజిప్ట్ నుండి వెలువడింది. ఇప్పుడొక విస్తృత పట్టిక 'అల్ము'జముల్ ముఫహ్రిస్' అనే పేరుతో సంకలనం చేస్తున్నారు. దీని 20 సంపుటాలు వెలువడ్డాయి.

## 10. ఫిక్హుల్ హదీస్

ఈ శాస్త్రంలో ధార్మిక ఆదేశాలకు సంబంధించిన హదీసుల మర్మ హేతువును, అందులో నిగూఢమయి ఉన్న వివేచనను ఆవిష్కరించడం జరిగింది. ఈ విషయం మీద హాఫిజ్ ఇబ్ను కయ్యిమ్ (హి. 751) రచించిన 'ఆలాముల్ మౌకియీన్' అన్న పుస్తకంతోపాటు షా వలీయుల్లా 'హుజ్జతుల్లాహుల్ బాలిగ' అనే పుస్తకం ప్రయోజన కరమయినవి. ఇవేకాక జీవితంలోని విభిన్న సమస్యల్ని స్పృశిస్తూ పండితులు వేర్వేరు పుస్తకాలు రచించారు. ఉదాహరణకు ఆర్థిక విషయాలకు సంబంధించిన పుస్తకం 'కితాబుల్ అమ్వాల్'ని అబూ ఉబైదా కాసిమ్ బిన్ సల్లామ్ (హి.224) వ్రాశారు. అలాగే భూమి, సేద్యపు భూమి, ఉష్ర్ (పంటలో జకాత్) ఖరాజ్ ఇత్యాధి విషయాల మీద కాజీ అబూ యూసుఫ్ వ్రాసిన 'కితాబుల్ ఖరాజ్' అత్యుత్తమ రచన. ఇంకా సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) షరీఅత్కు మూలం అనడానికి, హదీసు తిరస్కారులు వ్యాపింపజేసిన అపార్థాలను తొలగించడానికి దిగువ పేర్కొన్న పుస్తకాలు చూడవచ్చు.

1) కితాబుల్ ఉమ్మ్ 7వ సంపుటం; 2) అల్ రిసాల (ఇమామ్ షాఫియి); 3) అల్ ముఆఫికాత్, నాల్గవ సంపుటం (అబూ ఇస్హాక్ షాతిబి (హి.790); 4) సవాఇకు ముర్సల, సం.2 (ఇబ్నుకయ్యిమ్), 5) అల్ అహ్కామ్ (ఇబ్ను హజ్మ్ ఉన్దులుసి హి.456); 6) తర్జుమానుస్సున్న (ఉర్దు, మౌలానా బద్రెఆలమ్, మీరఠీ); 7) ఇస్బాతుల్ ఖబర్ (మా

తండ్రి గారు, మౌలానా హాఫిజ్ అబ్దుస్సత్తార్ హసన్, ఉమర్‌పూరి, హి. 1324, హదీసు, ఖుర్‌ఆన్ (మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది) 9) ఇన్కారె హదీస్ కా మన్జర్ ఔర్ పస్‌మన్జర్ (ఇఫ్తిఖార్ అహ్మద్ బల్ఖి), 10) కొంతకాలం ముందు అల్లామా ముస్తఫా సబాయి, అల్ ముస్లిమూన్ అనే పత్రికలో, హదీసులు తార్కిక నిదర్శనాలన్న విషయం మీద వ్యాసాల పరంపర ప్రారంభించారు. వాటి ఉర్దూ అనువాదం మౌలానా మలిక్ గులామ్ అలీ గారు చేశారు. ఈ పుస్తకం 'నాతె రసూల్' పేరుతో వెలువడింది.

హదీసు విద్యల చరిత్ర, తదితర సంబంధిత చర్చలకుగాను దిగువ ప్రస్తావించిన రచనలు సమగ్రమైనవి, ప్రయోజనకరమయినవి.

1) ముకద్దమ ఫత్‌హుల్ బారి (హాఫిజ్ ఇబ్ను హజర్); 2) జామె బయానుల్ ఇల్మ్ వ అహ్లిహీ, (హాఫిజ్ ఇబ్ను అబ్దుల్ బర్ ఉందులుసి(హి.463) 3) ముఅరిఫతు ఉలూముల్ హదీస్ (ఇమామ్ హాకిమ్- హి.405); 4) ముకద్దమ తుహఫతుల్ అహ్వజీ (మౌలానా అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి- హి.1353) ఈ పుస్తకం కొత్తగా వచ్చిన పుస్తకాలన్నింటిలో సమగ్రమయింది, ప్రయోజనకరమయిందీను; అలాగే 5) ముకద్దమ ఫత్‌హుల్ ముల్హిమ్ (మౌలానా షబ్బీర్ అహ్మద్ ఉస్మాని); 6) తద్వీనె హదీస్ (ఉర్దూ- మౌలానా మనాజిర్ అహ్సన్ గీలాని)

## మూడవ దశలో హదీసు సంకలన కర్తలు

ఈ దశలోని ప్రముఖ ఖ్యాతిగాంచిన హదీసువేత్తల ప్రామాణిక గ్రంథాలను క్రింద పరిచయం చేస్తున్నాము.

1) **ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (హి.164- 241):** ఈయనగారి ప్రముఖ సంకలనం 'ముస్నద్ అహ్మద్' పేరుతో ఖ్యాతి గడించింది. ఇందులో 30 వేల ఉల్లేఖనాలున్నాయి. దీని సంపుటాలు 24. చెప్పుకోదగ్గ హదీసులన్నీ ఇందులో ఉన్నాయి. ఇందులో సంకలనా విధానం విషయశీర్షికనుబట్టికాక ఉల్లేఖన కర్త అయిన ప్రవక్త సహచరుని శీర్షికన జరిగింది. దీన్ని అధ్యాయాల రీత్యా అంటే విషయానుక్రమంగా తిరిగి కూర్చే పని హసనుల్ బన్నా షహీద్ తండ్రిగారు అయిన అహ్మద్ అబ్దుర్రహ్మాన్ సాఅతి ప్రారంభించారు. ఇప్పటివరకు 14 సంపుటాలు వెలువడ్డాయి. ఈజిప్టుకే చెందిన ప్రముఖ పండితులు అహ్మద్ షాకిర్ కూడా ఈ సందర్భంలో పని చేస్తున్నారు. ఇప్పటివరకు 15 భాగాలు సంకలనమయ్యాయి.

2. **ఇమామ్ ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ అల్ బుఖారి (హి.194- 256):** ఈయన గారి పుట్టుక సంవత్సరం అరబీ సంఖ్యా శాస్త్రం రీత్యా 'సిద్క్' (194) మరణ సంవత్సరం 'నూర్' (256) వస్తాయి. ఇమామ్ బుఖారి రచనల్లో అన్నింటికన్నా ప్రముఖమయిందీ, ప్రామాణికమయింది 'సహీహ్ బుఖారి'. దాని పూర్తి పేరు 'అల్ జామి ఉస్సహీహుల్ ముస్నదుల్ ముఖ్తసర్ మిన్ ఉమూరు రసూలుల్లాహి సల్లల్లాహు అలైహి వ ఆలిహి వసల్లం వ అయ్యామహ్.'

ఈ గ్రంథ సంకలనంలో 16 ఏళ్ళు పట్టాయి. ఆయన ద్వారా నేరుగా సహీహ్ బుఖారి చదివిన శిష్య గణం సంఖ్య 90వేల వరకు ఉంటుంది. కొన్ని పర్యాయాలు ఒకే సమావేశంలో హాజరైన వారి సంఖ్య 30వేల వరకు చేరేది. ఇలాంటి సమావేశాల్లో ఆయన చెబుతూ ఉండగా తిరిగి చెప్పి వ్రాయించే వారి సంఖ్య 300కు మించి ఉండేది. మొత్తం హదీసుల సంఖ్య 9684. అయితే పునరుక్తమయిన ఉల్లేఖనాలు (ముకర్రర్ రివాయాత్), అప్రామాణికమయిన ఉల్లేఖనాలు (తాలీకాత్), సహచరుల సాక్ష్యాధారమయిన ఉల్లేఖనాలు (షవాహిద్ (అసార్), ముర్సల్ హదీసులను తీసివేస్తే మర్ఫూ ఉల్లేఖనాలు 623 మిగులుతాయి. ఇతర హదీసువేత్తలను పోల్చి చూస్తే ఉల్లేఖనకర్తలను ఏరివేసే ప్రమాణం ఈయన కాస్త ఉన్నతంగా పెట్టారు.

3. **ఇమామ్ ముస్లిమ్ బిన్ హజ్జాజ్ కషీరి (హి.202- 261):** ఇమామ్ బుఖారి, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ ఈయన గురువుల్లోనూ, ఇమామ్ తిర్మిజీ, అబూ హాతిమ్ రాజి, అబూబక్ర్ బిన్ ఖుజైమా ప్రభృతులు ఈయన శిష్యగణంలోని వారు. ఈయన సంకలనం 'సహీహ్ ముస్లిమ్' సంకలనాక్రమం రీత్యా ప్రముఖమయిందిగా పరిగణించబడుతుంది.

4. **అబూ దావూద్ అష్అస్ బిన్ సులైమాన్ సజిస్తానీ (హి. 202- 275):** ఈయన ప్రముఖ సంకలనం 'సునన్ అబూ దావూద్' పేరుతో ప్రఖ్యాతమయింది. ఇందులో అధికాంశం ధర్మశాస్త్ర ఆదేశాలకు సంబంధించిన ఉల్లేఖనాలను సమగ్ర రూపంలో ఒకచోట చేర్చడం జరిగింది. ఫికహ్‌కు సంబంధించిన, శాసనాంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఇది అత్యుత్తమ మూల గ్రంథమని చెప్పవచ్చు.

5. **ఇమామ్ అబూ ఈసా తిర్మిజి(హి. 209- 279):** ఇందులో ఫికహ్‌కు సంబంధించిన విషయాలను, విభిన్న పంథాల వివరాలను విశదపరచడం జరిగింది.

6. **ఇమామ్ అహ్మద్ బిన్ షుఅయిబ్ నసాయి (హి. 303):** ఈయన సంకలనం పేరు 'అస్సుననుల్ ముజ్‌తబా'

7. **ఇమామ్ ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ మాజా కుజ్‌వయిని (హి. 273):** ఈయన పుస్తకం సునన్ ఇబ్ను మాజా పేరుతో ప్రఖ్యాతమయింది.

ముస్నద్ అహ్మద్ తప్ప మిగతా 6 గ్రంథాలను హదీసువేత్తల పరిభాషలో 'సిహాహ్ సిత్తా' అంటారు. కొందరు పండితులు ఇబ్ను మాజాకు బదులు ముఅత్తా 'ఇమామ్ మాలిక్'ని సిహాహ్ సిత్తాలో ఒకటిగా పరిగణిస్తారు.

ఇవికాక ఆ దశలో ఇంకా అనేక ప్రయోజనకరమయిన, సమగ్రమయిన రచనలు, సంకలనాలు జరిగాయి. వాటిని వివరించడం ఇక్కడ సాధ్యపడదు. బుఖారి, ముస్లిమ్, తిర్మిజీ ఈ మూటిని 'జామె' అని అంటారు. అంటే వీటిలో విశ్వాసాలు, ఆరాధనలు, నైతక నియమాలు, వ్యవహారాలు తదితర సకల విషయాలకు సంబంధించిన హదీసులున్నాయన్నమాట. అబూ దావూద్, నసాయి, ఇబ్నుమాజ- వీటిని సునన్ అని అంటారు. అంటే వీటిలో క్రియాత్మక జీవితానికి సంబంధించిన ఉల్లేఖనాలు మటుకే ఉన్నాయని అర్థం.

## హదీసు గ్రంథాల వర్గీకరణ

హదీసువేత్తలు ఉల్లేఖనాల బలం, సవ్యతల ఆధారంగా హదీసు గ్రంథాలన్నింటినీ నాలుగు వర్గాలుగా విభజించారు.

1. **ముఅత్తా** ఇమామ్ మాలిక్, సహీహ్‌బుఖారి, సహీహ్ ముస్లిమ్. ఈ మూడు గ్రంథాలు, సవ్యత రీత్యాను, ఉల్లేఖనకర్తల విశ్వసనీయత దృష్ట్యాను అత్యున్నత స్థాయికి చెందినవి.

2. **అబూ దావూద్, తిర్మిజి, నసాయి-** ఈ గ్రంథాల ఉల్లేఖనకర్తలు కొందరు విశ్వసనీయత రీత్యా మొదటి వర్గానికి కాస్త దిగువన ఉన్నవారు. అయినా ఇవీ విశ్వసనీయ గ్రంథాలే. ముస్నద్ అహ్మద్ కూడా వీటితో సమంగా పరిగణించబడుతుంది.

3. **దారిమి (హి.225),** ఇబ్ను మాజ, బైహకీ, దారుల్‌ఖుతని (హి.385), తబ్రానీ (హి.360) పుస్తకాలు, తహావి (హి.311) రచనలు, ముస్నద్‌షాఫియీ, ముస్తద్‌రక్ హాకిమ్ (హి. 405) - ఈ గ్రంథాలలో సహీహ్ (సవ్యమయినవి), జయీఫ్ (బలహీనమయినవి) అన్ని రకాల ఉల్లేఖనాలున్నాయి. కాని విశ్వసనీయమయిన ఉల్లేఖనాలే అధికంగా ఉన్నాయి.

4. ఇబ్ను జరీర్ తబ్రీ (హి.310) రచనలు, ఖతీబ్ బగ్దాదీ(హి.463) పుస్తకాలు, అబూ నుఅయిమ్ (హి.403), ఇబ్ను అసాకిర్ (హి.571), దైలమి, ఫిర్‌దౌస్ కృతికర్త (509), కామిల్ ఇబ్ను అదీ (హి.365), ఇబ్ను మర్దూయ (హి.410) సంకలనాలు, వాకిది(హి.207) ఇంకా ఇలాంటి ఇతర రచయితల పుస్తకాలు ఈ కోవకు చెందినవి. ఈ పుస్తకాలు కలగూర గంప లాంటివి. మౌజూ (కల్పిత) ఉల్లేఖనాలు కూడా వీటిలో అధికంగా చోటుచేసుకున్నాయి. సాధారణ మత బోధకులు, సూఫీ పండితులకు ఆధారాలు ఈ గ్రంథాలే. అయితే కష్టపడి ప్రక్షాళన జరిపితే ఈ సంకలనాల నుండి కూడా మణిమాణిక్యాలు వెదికి తీయవచ్చు.

## నాల్గవ దశ

ఈ దశ దాదాపు అయిదవ శతాబ్ది హిజ్రీ నుండి మొదలయింది. ఇంకా కొనసాగు తోంది. దీనికి పూర్వం మూడవ దశలో జరిగిన సంకలనా విధానం ముగిసింది. ఈ సుదీర్ఘ కాలంలో జరిగిన రచన, పరిశోధనా కార్యకలాపాల వివరాలు ఇవి:

1. ప్రముఖ హదీసు గ్రంథాల టీకా తాత్పర్యాలు, వివరణలు, ఇతర భాషల్లోకి అనువాదాలు జరిగాయి.
2. పైన పేర్కొన్న హదీసు శాస్త్రాల మీద అనేక రచనలు జరిగాయి. వాటి వ్యాఖ్యా నాలు, వివరణలు, సంక్షిప్తాలు వ్రాయడం జరిగింది.
3. పండితులు తమ అభిరుచులకనుగుణంగా లేక అవసరాల రీత్యా మూడవ దశలో జరిగిన సంకలనాల నుండి హదీసులను ఎన్నుకుని ప్రయోజనకర మయిన కూర్పులు చేశారు. వాటిలో కొన్ని దిగువన ఇస్తున్నాము.

అ) **మిష్కాతుల్ మసాబీహ్** (వలీయుద్దీన్ ఖతీబ్): ఇందులో విశ్వాసాలు, ఆరాధ నలు, నైతిక నియమాలు, వ్యవహారాలు, సామాజిక నియమాలు, ప్రళయ దిన వివరాలు ఇత్యాది విషయాలకు సంబంధించిన ఉల్లేఖనాలన్నీ సమకూర్చడం జరిగింది.

ఆ) **రియాజుస్సాలిహీన్** (ఇమామ్ అబూ జక్రియ్యా యహ్యా బిన్ షరఫ్ నవవి- ఈయన 'ముస్లిమ్' గ్రంథానికి టీకా కూడా వ్రాశారు. హి.676) ఈ గ్రంథం అధికంగా నైతికత, మర్యాదలకు సంబంధించిన హదీసులున్న పుస్తకం. ప్రతి అధ్యాయం ప్రారంభంలో శీర్షికను బట్టి ఖుర్‌ఆన్ వచనాలను కూడా ఉటంకించడం జరిగింది. ఇది ఈ గ్రంథం ప్రత్యేకత. సహీహ్ బుఖారి సంకలనా విధానం కూడా ఇదే. *(తెలుగులో ఇది 'హదీసు కిరణాలు' పేరుతో ప్రచురించబడింది)*

4) **మున్తకల్ అఖ్బార్** (ముజద్దిదుద్దీన్, అబుల్ బర్కాత్, అబ్దుస్సలామ్ బిన్ తైమియ్యా -హి.652) : ఈయన ప్రఖ్యాత ఇస్లామీయ తత్వవేత్త షేఖుల్ ఇస్లామ్ తకీఉద్దీన్ అహ్మద్ బిన్ తైమియ్యా (హి.728) గారి పితామహులు. కాజి షౌకాని, ఈ గ్రంథానికి నైలుల్ ఔతార్ పేరిట ఒక టీకా వ్రాశారు.

5. **బులూగుల్ మరామ్** (హాఫిజ్ ఇబ్ను హజర్, బుఖారి టీకా కర్త (హి.852)ఇందులో అధికంగా ఆరాధనలు, వ్యవహారాలకు సంబంధించిన హదీసులే ఉన్నాయి. ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ సనాని (హి.1182) 'సుబులుస్సలామ్' పేరిట దీనికి టీకా వ్రాశారు. 'మిస్కుల్ ఖిత్తామ్' పేరిట మరో టీకా ఫార్సీ భాషలో నవాబ్ సిద్దీకుల్ హసన్ ఖాన్ (హి.1307) వ్రాశారు. ఈ గ్రంథాల్లో చాలా వాటికి చాలా కాలం క్రితమే ఉర్దూలోనికి అనువాదం జరిగింది. వాటి ప్రచురణ కూడా జరిగింది. *(తెలుగులో ఇది 'హదీసు మకరందం' పేరుతో ప్రచురించ బడింది)*

## భారతదేశంలో

మన దేశంలో మొట్టమొదట షేఖ్ అబ్దుల్ హక్ ముహద్దిస్ దహ్లావీ బిన్ సైఫుద్దీన్ తుర్క్ (హి.1052) హదీసు విద్యాజ్యోతిని ప్రకాశింపజేశారు. ఆయన తరువాత హజ్రత్ షా వలీయుల్లా (హి.1176), ఆయన సంతానం, సేవాపరాయణులు, బోధనాగ్రహకు లయిన శిష్యుల అవిరళ పరిశ్రమ వల్ల ఈ భూభాగంలో ప్రవక్త సంప్రదాయ కాంతి నలుమూలలా వ్యాపించింది. 'భూమి దాని ప్రభు జ్యోతితో ప్రకాశమానమయి పోయింది.' *(దివ్యఖుర్ఆన్ -అజ్ జుమర్ : 69)*

షా వలీయుల్లా తరువాత ఈ దేశంలో అనువాదాలు, టీకాలు, చిన్నచిన్న సంకలనాలు, ప్రచురించే సత్కార్య క్రమం ఇంకా కొనసాగుతూనే ఉంది.

'నేను సత్పురుషుల ప్రేమికుణ్ణే కాని వారిలోని వాణ్ణి కాను.'

దీని ద్వారానయినా బహుశా దైవం నాలో సదాచారాన్ని అనుగ్రహిస్తాడేమో! ప్రవక్త కాలం నుండి నేటివరకు హదీసులు వ్రాసే, వాటిని ఉల్లేఖించే కార్యక్రమం సదా ఎడతెగకుండా సాగుతూనే ఉందని పై వివరాల వల్ల తెలుస్తోంది. ఈ విజ్ఞాన పరిశోధనా పరంపరలో పగలూ దేదీప్యమానమయినదే, రేయీ ఉజ్వలమానమయినదే!

**- అబ్దుల్ గఫ్ఫార్ హసన్ ఉమర్పూరి**

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

كِتَابُ [أَحَادِيثِ] الأَنْبِيَاءِ

# 1. దైవప్రవక్తల (కు సంబంధించిన హదీసుల) ప్రకరణం

## అధ్యాయం : 1

## మహనీయ ఆదమ్ (అలైహిస్సలామ్) పుట్టుక గురించి, ఆయన సంతానం పుట్టుక గురించి [1]

(అర్రహ్మాన్ సూరాలో) **'సల్‌సాలిన్'** అనే పదం వచ్చింది. **'సల్‌సాలిన్'** అంటే కుళ్ళిన మట్టి యొక్క ఎండిన గార అని అర్థం. అది కాల్చబడిన పెంకులాగా టంగు టంగుమని మ్రోగుతుంది. మరికొంతమంది దీనికి 'దుర్వాసన వచ్చేది' అని అర్థం చెప్పారు. అసలు ఈ పదం 'సిల్' నుండి వచ్చింది....

అల్ బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : (ప్రవక్తా!) ఆ సంఘటనను జ్ఞాపకం తెచ్చుకో: "నేను భువిలో 'ఒక ప్రతినిధి'ని సృష్టించబోతున్నాను" అని నీ ప్రభువు తన దూతలతో అన్నప్పుడు... **(2 : 30)**

**మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: అత్ తారిఖ్ సూరాలో 'లమ్మా అలైహా హాఫిజ్'** అనే పదాలొచ్చాయి. అంటే తనకు ఒక పర్యవేక్షకుడు లేని ప్రాణి అంటూ ఏదీ లేదు అని అర్థం. అల్ బలద్ సూరాలో **'ఫీ కబద్'** అని వచ్చింది. కబద్ అంటే కఠోర పరిశ్రమ, చాలా కష్టంతో కూడుకున్న అని అర్థం... అత్ తారిఖ్

---

1-1. ఒక హదీసు ప్రకారం ఈ ప్రపంచంలో ఒక లక్షా ఇరవై నాలుగు వేల మంది దైవ ప్రవక్తలు ప్రభవించారు. వారిలో షరీఅత్, గ్రంథం వొసగబడినవారు 313 మంది. ఈ సందేశహరులందరిలో కట్టకడపటి వారు ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లమ్). ఈయన చిట్టచివరి దైవప్రవక్త అన్న విషయం స్వయంగా ఖుర్ఆన్ ద్వారా రూఢీ అవుతోంది.

సూరాలో **'ఇన్నహూ అలా రజ్ఇహీ లఖాదిర్'** అని అనబడింది. ముజాహిద్ ఈ వాక్యానికి అర్థం చెబుతూ తొలిసారి మనిషిని పుట్టించిన సృష్టికర్త ప్రళయదినాన అతన్ని మళ్ళీ పుట్టించగల సమర్థుడు అన్నారు...

**1)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ప్రవచించారని మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "పరమ పవిత్రుడగు అల్లాహ్ ఆదమ్ (అలైహిస్సలామ్)ను సృష్టించినప్పుడు, ఆయన్ని అరవై చేతుల పొడుగరిగా చేశాడు. తరువాత ఆయనతో, "వెళ్ళు. ఆ దైవదూతల సమూహానికి సలామ్ చెయ్యి. వారు ఏ రీతిలో నీ సలామ్‌కు సమాధానం ఇస్తారో చూడు. తెలుసుకో! అదే నీకూ, నీ సంతతికి నిర్ధారిత సలామ్ పద్ధతి అవుతుంది" అని సెలవిచ్చాడు. ఆదమ్(అ) వెళ్ళి, **'అస్సలాము అలైకుమ్'** అని చెప్పారు. దానికి దైవదూతలు, **'అస్సలాము అలైక వ రహ్మతుల్లాహ్'** అని బదులిచ్చారు. అంటే 'రహ్మతుల్లాహ్' అనే వాక్యాన్ని అదనంగా పలికారు. ఇకపోతే ఎవరు స్వర్గంలో ప్రవేశించినా ఆదమ్(అలైహిస్సలామ్) ఆకారంలో, ఎత్తులో ప్రవేశిస్తారు. ఆదమ్(అ) తరువాత మనుజ జాతిలో రానురాను ఎత్తు తగ్గిపోతూ వచ్చింది." [1]

**2)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం- మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ప్రవచనం: "స్వర్గంలో అందరికన్నా ముందు ప్రవేశించే వర్గీయుల ముఖారవిందాలు పున్నమి చంద్రునిలా వెలిగిపోతుంటాయి. ఆ తరువాత ప్రవేశించే వారి ముఖాలు ఆకాశంలో మెరిసే తారల్లోకెల్లా ఉజ్వలమైన తార మాదిరిగా ఉంటాయి. వారికి మలమూత్రాలు విసర్జించవలసిన అవసరం ఏర్పడదు. వారు ఉమ్మి వేయటం గానీ, ముక్కులోని చీముడు చీదటం గానీ ఉండదు. వారి దువ్వెనలు బంగారు దువ్వెనలై ఉంటాయి. వారి చెమట కస్తూరిలా సువానను గుబాళిస్తూ ఉంటుంది. వారి ఉంగరాలలో సువాసన వచ్చే సాంబ్రాణి మండుతూ ఉంటుంది. వారి భార్యలు పెద్ద పెద్ద కన్నులు కల సుందరాంగులై ఉంటారు. అందరి రూపు

1-1. అంటే ఎత్తు తగ్గుతూ తగ్గుతూ ప్రస్తుత మానవ సముదాయం సగటు ఎత్తుకు చేరుకుంది. ఆదమ్ (అలైహిస్సలామ్) వంకీలు తిరిగిన జుత్తుతో అత్యంత సుందర స్వరూపులుగా ఉండేవారని ఇబ్నె ఖుతైబా చెప్పారు. ఖుస్తులానీ ప్రకారం, స్వర్గంలో ప్రవేశించేవారంతా ఎంతో అందంగా, చూడముచ్చటగా ఉంటారు. ఈ ప్రపంచంలో కొందరి మాదిరిగా అందవికారంగా ఉండరు. నలుపు- తెలుపు తేడాలు కూడా ఉండవు.

రేఖలు ఒకేవిధంగా ఉంటాయి. అంటే వారంతా తమ తండ్రి ఆదమ్ (అలైహిస్సలామ్)లా అరవయ్యేసి చేతుల పొడుగరులై ఉంటారు.

3) విశ్వాసుల మాత హజ్రత్ ఉమ్మె సలమా (ర.అ) కథనం: ఒకసారి ఉమ్మె సులైమ్(ర.అ) వచ్చి, 'దైవప్రవక్తా! అల్లాహ్ సత్యం చెప్పడానికి సిగ్గుపడడు కదా! మరైతే, ఒకవేళ స్త్రీకి 'ఇహ్తెలామ్' అయినట్లయితే (వీర్య స్ఖలనం జరిగినట్లయితే) ఆమె తప్పనిసరిగా గుస్ల్ (స్నానం) చేయవలసి ఉంటుందా?' అని అడిగారు. దానికి ఆయన(స) "అవును. అయితే ఆమెకు తడి కనిపిస్తేనే (స్నానం తప్పనిసరి అవుతుంది)" అని చెప్పారు. ఈ మాట విన్న విశ్వాసుల మాత ఉమ్మె సలమా (ర.అ)కు నవ్వు వచ్చింది. 'ఏమిటి, స్త్రీకి కూడా వీర్య స్ఖలనం జరుగుతుందా?' అని ఆమె సందేహపడగా, "(పిచ్చిదానా, అలా కాని పక్షంలో) మరి పిల్లవానికి తల్లి పోలికలు ఎలా వస్తాయనుకున్నావ్?" అని దైవప్రవక్త(స) సమాధానమిచ్చారు.

4) మహనీయ అనస్(రజి)కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనా నగరానికి ఏతెంచుతున్నారన్న వార్త విన్నప్పుడు, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి 'నేను మీకు మూడు విషయాల గురించి అడుగు తాను. వాటి సంగతి దైవప్రవక్తకు తప్ప వేరెవరికీ తెలిసి ఉండదు. 1) ప్రళయదినపు మొట్టమొదటి సూచన ఏది? 2) స్వర్గవాసులకు ఆతిథ్యంగా ఇవ్వబడే మొట్టమొదటి భోజనం ఏది? 3) ఏ వస్తువు కారణంగా శిశువుకు అతని తండ్రి పోలికలు వస్తాయి? మరి దేని కారణంగా శిశువుకు (తల్లి లేదా) అమ్మమ్మ తరపు వారి పోలికలు వస్తాయి?' అని అడిగారు- ఈ ప్రశ్నలకు దైవప్రవక్త(స) బదులిస్తూ "నాకు ఇప్పుడే జిబ్రయీల్(అ) దీనికి సంబంధించిన సమాచారం అందజేశార"ని అన్నారు. ఇది విన్న అబ్దుల్లాహ్ బిన్ సలామ్, 'ఓహో అతనా! దైవదూతలలో యూదుల శత్రువు అతనే కదా!' అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) ఆ మూడు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు : 1) ప్రళయదినపు మొట్టమొదటి సూచన అగ్ని రూపంలో ప్రస్ఫుటమవుతుంది. అది తూరుపు నుండి పశ్చిమం వైపునకు నెట్టుకుంటూ పోతుంది. 2) ఇక స్వర్గవాసులకు విందుగా ఇవ్వబడే మొట్టమొదటి ఆహారం చేప కాలేయంపై వ్రేలాడుతూ ఉండే మాంసపు ముక్క (అదెంతో రుచిగా ఉంటుంది). 3) ఇకపోతే శిశువు పోలికలకు సంబంధించిన విషయం; పురుషుడు స్త్రీని ఆక్రమించుకున్నప్పుడు పురుషుని వీర్యం దూకుడుగా వెలువడి ముందుకు

ఉరికినట్లయితే శిశువుకు అతని పోలికలొస్తాయి. ఒకవేళ రతిక్రీడ సందర్భంగా స్త్రీ రేతస్సు ఆధిపత్యం వహించినట్లయితే పుట్టే శిశువుకు స్త్రీ (తరఫువారి) పోలికలు వస్తాయి." (ఈ సమాధానాలు విన్న) అబ్దుల్లాహ్ బిన్ సలామ్ 'తమరు దైవ సందేశ హరులని నేను సాక్ష్యమిస్తున్నాను' అని పలికారు. తరువాత ఇలా విన్నవించు కున్నారు: 'యా రసూలల్లాహ్! యూదులు పచ్చి అబద్ధాల కోరులు. తమరు దర్యాప్తు చేయకముందే నేను ఇస్లామ్ స్వీకరించానన్న సంగతి వారికి తెలిస్తే, నాపై రకరకాల అభాండాలు మోపడానికి వెనుకాడరు'. అంతలోనే కొంతమంది యూదులు అక్కడికి వచ్చారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) వారికి కనబడకుండా ఇంటి లోపల దాక్కు న్నారు. "అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) ఎలాంటి వారు?" అని దైవప్రవక్త(స) వాళ్ళను అడిగినప్పుడు, "ఆయన మాలో అందరికన్నా గొప్ప విద్వాంసులు. అందరి కన్నా గొప్ప విద్వాంసుని కుమారుడు. మాలో అందరికన్నా ఉత్తములు. మాలో అందరికన్నా ఉత్తముని కుమారుడు" అని అక్కడి యూదులంతా ముక్తకంఠంతో జవాబిచ్చారు. "ఒకవేళ అబ్దుల్లాహ్ బిన్ సలామ్ ఇస్లాం స్వీకరిస్తే అప్పుడు మీరే మంటారు?" అని దైవప్రవక్త(స) అడగ్గా, 'దేవుడు ఆ చర్య నుండి ఆయన్ని కాపాడు గాక!' అని వారంతా చెప్పారు. అంతలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) బయటికి వచ్చి, **'అష్‌హదు అఁల్లా ఇలాహ ఇల్లల్లాహు, వ అష్‌హదు అన్న ముహమ్మ దర్రసూలుల్లాహ్'** (అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ అల్లాహ్ సందేశహరుడని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను) అంటూ సాక్ష్యవచనం పలికారు. అప్పుడు వారంతా ఆయన గురించి, 'ఇతను మాలో అందరి కన్నా నీచుడు. అందరికన్నా నీచుని కుమారుడు' అంటూ తూలనాడసాగారు.[1]

**5)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు (అబ్దుర్రజ్జాఖ్ రివాయతు తరహాలో) ప్రవక్త మహ నీయులు(సఅసం) ఇలా ప్రవచించారు : "బనీఇస్రాయీల్ జనులే గనక లేకుండా

4–1. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) యూదుల్లో గొప్ప విద్వాంసులుగా ప్రసిద్ధి చెందారు. ఆయన మహాప్రవక్త(స)ను కలుసుకుని, కొన్ని ప్రశ్నలు వేశారు. వాటికి సమాధానాలు వినగానే ముహమ్మద్(స) సత్యవంతులని గ్రహించారు. ఏమాత్రం తాత్సారం చేయకుండా ముస్లింగా ధర్మపరివర్తన చెందారు. అల్లాహ్ ఆయన ఎడల ప్రసన్నుడగుగాక! ఇకపోతే, అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) దైవప్రవక్త(స)కు వెయ్యి ప్రశ్నలు వేశారని కొంతమంది నకలు చేశారు. ఇది నిరాధారం.

**ఉంటే మాంసం కుళ్ళిపోయేది కాదు. హవ్వాయే గనక లేకుండా ఉంటే, భార్య తన భర్త యెడల స్వామిద్రోహానికి ఒడిగట్టేది కాదు.”** [1]

**6)** **మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని మహనీయ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు : “నా ఉపదేశాన్ని (వసీయతును) అనుసరించి, స్త్రీల యెడల సద్వ్యవహారం చేస్తూ ఉండండి (వారిని వేధించకండి). ఎందుకంటే స్త్రీ ప్రక్కటెముకచే పుట్టించబడింది.** [1] **ప్రక్కటెముకలో పైభాగం మరింత వంకరగా ఉంటుంది (అలాగే స్త్రీలో నోటి దురుసుతనం ఎక్కువగా ఉంటుంది). ఒకవేళ మీరు దానిని బలప్రయోగంతో తిన్నగా చేసేందుకు యత్నిస్తే అది విరిగి పోతుంది, కాని తిన్నగా మటుకు అవదు. దానిని అలాగే వదిలేసినట్లయితే వంకర గానే ఉంటుంది. కాబట్టి నా ఉపదేశాన్ని అనుసరిస్తూ, స్త్రీల యెడల సద్భావంతో మెలగండి.”**

**6(అ) సత్యసంధులకు సత్యసంధుడైన మహనీయ ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ఉద్బోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు: “మీలోని ప్రతి మనిషి పుట్టుక ప్రక్రియ ఇలా ఉంటుంది– మొదటి నలభై రోజులు అతని ఉత్పత్తికి సంబంధించిన రేతస్సు మాతృ గర్భాశయంలో పేరుకుపోయి ఉంటుంది. తరువాత సరిగ్గా అన్నే రోజుల (40 రోజులు) వరకు గడ్డకట్టిన రక్తం రూపంలో ఉంటుంది. ఆ తరువాత అన్నే రోజుల వరకు మాంసపు ముద్ద ఆకారంలో నిలిచి ఉంటుంది. ఆపైన అల్లాహ్ తన దూతకు నాలుగు ఆదేశాలిచ్చి**

---

5–1. ఇస్రాయీల్ సంతతికి దేవుని వరప్రసాదంగా ‘మన్ వ సల్వా’ ఆహారం లభించేది. దానిని నిల్వ చేసి ఉంచటాన్ని నిషేధించడం జరిగింది. కాని వారు ఆ ఆహారాన్ని నిల్వచేయటం మొదలెట్టారు. అందువల్ల వారికి శిక్షగా ‘సల్వా’ మాంసం కుళ్ళిపోయేలా చేయటం జరిగింది. హదీసులో ఎత్తిచూపబడిన అంశం ఇదే.

అలాగే షైతాన్ కుట్రకు పావుగా మారి ఆది మానవుడైన ఆదమ్(అలైహిస్సలామ్)ను నిషిద్ధ వృక్షం నుండి తినమని పురికొల్పినది హవ్వాయే. ఆ అలవాటే వారి సంతానంలో కూడా పొడసూపింది. ‘స్వామి ద్రోహం’ అంటే ఇదే. స్త్రీలలో సర్వ సామాన్యమైన ‘కృతఘ్నత’, ‘భర్తల పట్ల మోసపూరిత వ్యవహారం’ దాని ఫలితమే. ఆమె వంకరగా ఉన్న ప్రక్కటెముకతో పుట్టించబడింది. రాబోయే హదీసులలో ఈ విషయమే చెప్పబడింది.

6–1. అంటే ఆమె హజ్రత్ ఆదమ్(అలైహిస్సలామ్) ప్రక్కటెముకతో సృష్టించబడింది. అన్ నిసా సూరాలోని మొదటి వాక్యంలో **‘ఖలఖ మిన్‌హా జౌజహా’** (అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు) అని చెప్పబడటం గమనార్హం.

పంపిస్తాడు. అప్పుడు ఆ దైవదూత అతని ఆచరణ, అతని జీవన వ్యవధి, అతని జీవనోపాధి ఇంకా అతను సద్వర్తనుడా లేక దుర్వర్తనుడా అన్నది రాసుకుంటాడు. ఆ తరువాత అతనిలో ప్రాణం ఊదబడుతుంది. ఇక మానవుడు (జీవితాంతం) ఒక్కోసారి నరకవాసుల పనులు చేస్తుంటాడు. అతనికీ– నరకానికీ మధ్య కేవలం ఒక బారెడు అంతరం ఉండగా అతని విధివ్రాత ముందుకు వచ్చేస్తుంది. అంతే, అతను స్వర్గవాసుల పనులు చేయటం మొదలెట్టి స్వర్గానికి వెళతాడు. అలాగే ఒక వ్యక్తి స్వర్గవాసుల ఆచరణ చేస్తుంటాడు. తీరా అతనికీ– స్వర్గానికీ మధ్యన కేవలం ఒక బారెడు అంతరం ఉండగా అతని విధివ్రాత ముందుకువస్తుంది. అంతే, అతను నరకవాసుల పనులు చేయటం మొదలెట్టి, నరకానికి ఆహుతి అవుతాడు.

**7)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారని హ్రజత్ అనస్(రజి) ఉల్లేఖించారు : “అల్లాహ్ మాతృ గర్భంపై ఒక దైవదూతను నియమిస్తాడు. ఆ దైవదూత, ‘ప్రభూ! ఇది రేతస్సుగా ఉంది’ అని విన్నవించు కుంటాడు. ‘ప్రభూ! ఇది ఘనీభవించిన రక్తంగా ఉంది. ప్రభూ! ఇది మాంసపు ముద్దగా మారింది’ అనంటాడు. చివరకు అల్లాహ్ అతన్ని పుట్టించాలని సంకల్పిం చుకున్నప్పుడు, ‘ప్రభూ! ఇది ఆడ లేక మగా? ప్రభూ! ఇది మంచిదా? చెడ్డదా? దీనికి ప్రాప్తించే ఉపాధి ఎటువంటిది? దీని జీవన వ్యవధి ఎంత?’ అని దైవదూత అడుగుతాడు. ఈ విధంగా మాతృగర్భంలోనే– ఆ ప్రాణికి సంబంధించినది – అంతా దైవదూత వ్రాసేస్తాడు.”

**8)** హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : “అల్లాహ్ (ప్రళయదినాన) నరకంలోని అత్యంత తేలికపాటి శిక్ష పడిన వ్యక్తినుద్దేశించి, ‘ఒకవేళ ఇహలోకంలో నీకు చెందిన ఏదైనా వస్తు సంపద ఉంటే, ఈ శిక్షనుండి విముక్తి పొందదానికి దానిని పరిహారంగా ఇవ్వడానికి సిద్ధపడేవాడివా?’ అని అడుగుతాడు. దానికి ఆ వ్యక్తి ‘అవున’ంటాడు. అప్పుడు అల్లాహ్ ఇలా అంటాడు: ‘నీవు ఆదమ్ వీపులో ఉన్నప్పుడు, దీనికన్నా అతి సామాన్యమైనది నీనుండి కోరాను– నాకు సహవర్తులుగా ఎవరినీ కల్పించారదని అన్నాను. కాని నీవు (ప్రపంచంలో అడుగుపెట్టగానే) అదే ‘షిర్క్’కు ఒడిగట్టావు.”

**9)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించారని హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు :“ఎప్పుడు ఒక మనిషి అన్యాయంగా చంపబడినా, ఆ

**పాపానికి సంబంధించిన ఒక భాగం ఆదమ్ (అలైహిస్సలామ్) ప్రథమ పుత్రుడు (ఖాబీల్) ఆచరణా పత్రంలో లిఖించబడుతుంది. ఎందుకంటే అన్యాయంతో కూడిన హత్యానేరానికి పునాది వేసినది అతడే."[1]**

## అధ్యాయం : 2

## ఆత్మలు (తొలి నుంచే) సమీకరించబడిన సేనలు

**దైవప్రవక్త(సఅసమ్) చెప్పగా తాను విన్నానని హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ఆయన (స) ఇలా చెప్పారు- ఆత్మలు సమీకరించబడిన సైన్యంలా ఉండేవి. అక్కడ ఏ ఆత్మల మధ్య పరస్పర పరిచయం ఉండేదో వాటి మధ్యన ఇక్కడ కూడా స్నేహబంధం ఉంటుంది. అక్కడ ఏ ఏ ఆత్మలు అపరిచితంగా ఉండేవో ఇక్కడ కూడా వారు వ్యతిరేకంగా, అపరిచితంగానే ఉంటాయి"[1]- యహ్యా బిన్ అయ్యూబ్ కూడా ఈ హదీసును ఉల్లేఖించారు. యహ్యా బిన్ సయీద్ తనకు దీనిని వినిపించి నట్లు చెప్పారు...**

## అధ్యాయం : 3

## (మహనీయ నూహ్- అలైహిస్సలామ్ గురించి) దైవోపదేశం

**"మేము నూహ్‌ను - ప్రవక్తగా చేసి - అతని జాతి వైపునకు పంపాము."**

**(హూద్: 25)**

---

9-1. అతడు తన సోదరుడైన హబీల్‌ను అసూయతో చంపేశాడు. ఈ వృత్తాంతం దివ్య ఖుర్ఆన్‌లోని అల్ బఖరా సూరాలో వచ్చింది.

అకారణంగా తోటి మానవుణ్ణి చంపటం దైవప్రవక్తల శాసనాంగంలో మహాపరాధంగా ఖరారు చేయబడింది. మానవుడు ఏ జాతికి చెందినవాడైనా, ఏ మతావలంబీకుడైనా, ఏ ప్రాంతానికి చెందినవాడైనా అతనిని అన్యాయంగా హతమార్చటం మహాపాతకం. ఇస్లామీయ షరీఅత్ దానిని 'మహాపరాధం'గా పరిగణిస్తుంది. హతుని తరఫు వారసులకు ప్రతీకార న్యాయం ఇప్పిస్తుంది.

2-1. ఆధ్యాత్మికంగా భావసారూప్యంలేని వారి మధ్య నిజమైన ప్రేమానురాగాలు చిగురించవు. ఒక మహనీయుని మాటల్లోనే చెప్పాలంటే వంద మంది కపటులు కూర్చుని ఉన్నచోట ఒక నికార్సయిన విశ్వాసి (మోమిన్) వెళితే, అతడు విశ్వాసి కూర్చుని ఉన్నచోటికే వెళ్ళి కూర్చుంటాడు. అలాగే అతడు కపటి అయివుంటే, కపటుల పక్కన కూర్చున్నప్పుడే అతనికి సంతృప్తి కలుగుతుంది. తౌబా సూరాలోని 67వ ఆయత్‌ను, 71వ ఆయత్‌ను చదివితే ఈ విషయం బాగా అవగతం అవుతుంది.

మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) గారు ఇదే సూరాలోని **'బాదియర్రాయి'** గురించి చెబుతూ అది మా ముందే ప్రస్ఫుటం అయిందని అన్నారు. ముజాహిద్ గారు **'అల్‌జూదీ'** గురించి వ్యాఖ్యానిస్తూ, అది ఒక ద్వీపంలోని పర్వత శిఖరం అన్నారు.

నూహ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: మేము ప్రవక్త నూహ్‌ను అతని జాతి వద్దకు పంపాము– అతని జాతి ప్రజలపైకి బాధాకరమయిన శిక్ష రాక మునుపే వారిని హెచ్చరించమని (ఉపదేశిస్తూ) (71:1)... సూరా చివరి వరకూ. సూరయె యూనుస్‌లో ఈ విధంగా సెలవీయబడింది :

వారికి నూహ్ గాధను వినిపించు. అతను తన జాతి వారితో ఇలా అన్నప్పటి గాధను : "నా జాతి సోదరులారా! నేను మీ మధ్య ఉండటం, అల్లాహ్ ఆయతులను మాటిమాటికి వినిపించి మిమ్మల్ని ఏమరుపాటు నుండి మేల్కొలపటం మీకు సహింపశక్యం కాకపోతే సరే, నేను మాత్రం అల్లాహ్‌నే నమ్ముకున్నాను. మీరు నిలబెట్టిన భాగస్వాములను తోడుగా తీసుకుని మీరు ఒక ఏకగ్రీవ నిర్ణయానికి రండి. మీ దృష్టిలో ఉన్న పథకం గురించి సావధానంగా ఆలోచించి అర్థం చేసుకోండి. దానికి సంబంధించిన ఏ కోణమూ మీ దృష్టికి గోప్యంగా ఉండకుండా ఉండేందుకు. తరువాత దానిని నాకు వ్యతిరేకంగా ప్రయోగించండి. నాకు ఏమాత్రం వ్యవధి నివ్వకండి. మీరు నా హితోపదేశానికి వైముఖ్యం వ్యక్తంచేసి (నాకేమి నష్టం కలిగించరు). నేను మీ నుండి ఏ ప్రతిఫలాన్నీ కోరి ఉండలేదే! నాకు ప్రతిఫలాన్నివ్వటం అనేది అల్లాహ్ బాధ్యత. (ఎవరు విశ్వసించినా, విశ్వసించకపోయినా) స్వయంగా నేను మాత్రం ముస్లిము అయివుండాలని నాకు ఆజ్ఞ ఇవ్వబడింది." (యూనుస్– 71, 72)

**10)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ప్రజలనుద్దేశించి ప్రసంగించడానికి నిలబడ్డారు. మొదట ఆయన(స) అల్లాహ్ ఘనత్వానికి తగ్గ రీతిలో స్తోత్రం చేశారు. ఆ తర్వాత దజ్జాల్‌ను ప్రస్తావిస్తూ ఇలా అన్నారు : "నేను మిమ్మల్ని దజ్జాల్ ఉపద్రవం గురించి భయపెడుతున్నాను. వాడి గురించి తన జాతి ప్రజలకు భయబోధ చేయని ప్రవక్త ఎవరూ గతించలేదు. అయితే నేను మీకు వాడి గురించి, ఏ ప్రవక్తా తన జాతి జనులకు చెప్పని విషయం ఒకటి చెబుతున్నాను, తెలుసుకోండి! దజ్జాల్ ఒంటికన్ను వాడై ఉంటాడు. కాగా, అల్లాహ్ ఈ లోపానికి అతీతుడు, పరిశుద్ధుడు."

**11)** హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్

**(సఅసమ్) ఇలా ప్రవచించారు : "దజ్జాల్ గురించి ఏ ప్రవక్తా తన జాతి ప్రజలకు ఇప్పటివరకూ తెలుపని ఒక ముఖ్య విషయాన్ని నేను మీకు తెలుపనా? ఆ ధూర్తుడు ఒంటికన్ను కలవాడై ఉంటాడు. స్వర్గం, నరకం లాంటి వస్తువుని ప్రత్యక్షపరుస్తాడు. వాడు దేన్నయితే స్వర్గం అని అంటాడో అది నిజానికి నరకం అయివుంటుంది. నూహ్(అ) ప్రవక్త తన జాతి ప్రజలకు భయబోధ చేసినట్లే నేను మిమ్మల్ని వాడి (దజ్జాల్) ఉపద్రవం గురించి హెచ్చరిస్తున్నాను."[1]**

**12) హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "(ప్రళయదినాన) దైవప్రవక్త నూహ్ (అలైహిస్సలామ్) దేవుని దర్బారులో హాజరవుతారు. అల్లాహ్ ఆయనపై విచారణ జరుపుతూ, "నా సందేశాన్ని వారికి చేరవేశావా?" అని అడుగుతాడు. సమాధానంగా హజ్రత్ నూహ్(అ), 'ప్రభూ! నేను నీ సందేశాన్ని చేరవేశాను' అని విన్నవించుకుంటారు. అప్పుడు అల్లాహ్ ఆ ప్రవక్త అనుచరులనుద్దేశించి, "చెప్పండి, (నూహ్ ప్రవక్త) నా సందేశాన్ని మీ వరకు చేరవేశాడా?" అని అడుగుతాడు. దానికి వారు, 'లేదు. మా వద్దకు నీ ప్రవక్త ఎవరూ రాలేద'ని అంటారు. అప్పుడు అల్లాహ్ నూహ్‌తో, "దీనికి సంబంధించి నీ దగ్గర సాక్ష్యమేదైనా ఉందా?" అని దర్యాప్తు చేస్తాడు. దానికాయన, 'ఉంది. ముహమ్మద్(స) మరియు ఆయన అనుచర సముదాయం ప్రజలు' అని సవినయంగా విన్నవించుకుంటారు. అప్పుడు ఈ ఉమ్మత్ ప్రజలు (అంటే మనం), నూహ్ తన కర్తవ్యాన్ని నెరవేర్చారని సాక్ష్యమిస్తారు. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది ఆయత్ ద్వారా బోధపడేది కూడా ఇదే– "ఈ విధంగా మేము మిమ్మల్ని ఒక 'మధ్యస్థ సమాజం'గా చేశాము. ఇకపై మీరు సమస్త మానవ జాతికి సాక్షులుగా ఉంటారు. ప్రవక్త మీకు సాక్షిగా ఉంటాడు."[1] *(అల్ బఖరా: 143)***

**'వసత్' అంటే మధ్యస్థం అని అర్థం.**

**13) మహనీయ అబూ హురైరా(రజి) కథనం : మేము ప్రవక్త మహనీయుల**

---

11–1. పరమ పవిత్రుడైన అల్లాహ్ తన దాసుల్ని పరీక్షించడానికి దజ్జాల్‌కి కొన్ని శక్తుల్ని ప్రసాదిస్తాడు. ఆఖరిలో అతని అశక్తత, నిస్సహాయ స్థితి బహిర్గతం అవుతుంది. అప్పుడు అతను నిజ దైవం కాడన్న సంగతి ప్రజలకు సుబోధకం అవుతుంది. పై హదీసులలో ప్రవక్త నూహ్(అ) ప్రస్తావన వచ్చింది. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం.

12–1. మరి నిజానికి ఉమ్మతె ముహమ్మదీకి చెందిన ప్రజలు దైవప్రవక్త నూహ్(అ)ను గానీ, ఆయన జాతి జనుల్ని గానీ చూడలేదు. మరలాంటప్పుడు సాక్ష్యం ఎలా ఇస్తారు? అన్న

**(సఅసమ్)తో కలసి ఒక విందు భోజనానికి వెళ్ళాము. ఆయన(స) ముందు (మేక) ముంగాలి మాంసం సమర్పించబడింది. ఆ మాంసం ఆయన(స)కు ఎంతో ఇష్టకర మైనది. ఆయన(స) ముంగాలి ఎముకకు అతుక్కుని ఉన్న మాంసాన్ని తన దంతా లతో చీల్చి తిన్నారు. తరువాత ఇలా అన్నారు– "నేను ప్రళయదినాన ప్రజల నాయ కుడనై ఉంటాను. ప్రళయదినాన అల్లాహ్ మానవులందరినీ ఏవిధంగా ఒక చదునైన మైదానంలో సమీకరిస్తాడో తెలుసా? ఆ దృశ్యం ఏవిధంగా ఉంటుందంటే చూసే వాడు అక్కడున్నవారందరినీ ఒకే సమయంలో చూడగలడు. పిలిచేవాని పిలుపు ప్రతిచోటా వినిపిస్తుంది. సూర్యుడు చాలా దగ్గరగా ఉంటాడు. ఒక వ్యక్తి తనకు చాలా దగ్గరగా ఉన్న మరో వ్యక్తితో, 'ప్రజలంతా ఎటువంటి విపత్తుకు గురై ఉన్నారో, ఆపద ఎంతవరకు వచ్చిందో నీవు చూడటం లేదా? మనందరి సిఫారసుకై అల్లాహ్ సన్నిధికి వెళ్ళగలిగే వ్యక్తిని మనం ఎందుకు వెతకరాదు?' అంటాడు. ఈ పనికోసం ముత్తాత ఆదమ్ (అలైహిస్సలామ్) అయితే బావుంటుందని కొంతమంది సలహా ఇస్తారు. అందువల్ల ప్రజలు ఆయన సమక్షంలో హాజరై, 'ఓ ఆదమ్ పితామహా! మీరు మానవులందరికీ పితామహులు. అల్లాహ్ మిమ్మల్ని తన స్వహస్తాలతో చేశాడు.[1] మీలో తన ఆత్మను ఊదాడు. ఆయన ఆదేశాన్ని పురస్కరించుకుని దైవదూతలు మీకు సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేశారు. మిమ్మల్ని సృష్టించిన మీదట మీకు స్వర్గంలో ఆగి ఉండే సౌకర్యం కల్పించాడు. కనుక మీరు దైవసన్నిధిలో మా కొరకు సిఫారసు చేయండి. ప్రస్తుతం మేము ఎలాంటి కష్టంలో ఉన్నామో మీరు చూస్తూనే ఉన్నారు' అని విన్నవించుకుంటారు. దానికాయన "పాపాత్ములపై అల్లాహ్ నేడు ఆగ్రహించినంతగా మరెన్నడూ ఆగ్రహించలేదు. ఇక మీదట కూడా అంతగా ఎన్నడూ ఆగ్రహించడు. మొదట్లోనే ఆయన నన్ను (స్వర్గంలోని) ఆ వృక్షం నుండి తినకూడదని తాకీదు చేశాడు. కాని ఆయన ఆజ్ఞను శిరసావహించటంలో నా వల్ల తప్పు జరిగింది. ఈ రోజు నన్ను నేను ఎలా**

---

సందేహం కలగవచ్చు. దీనికి సమాధానం ఏమిటంటే, ఖుర్ఆన్ హదీసులే వారికి ప్రమాణ నికషం. అల్లాహ్, ఆయన ప్రవక్త ముహమ్మద్(స) వారికి చెప్పిన విషయమే వారి సాక్ష్యానికి ఆధారం.

13–1. ఇక్కడ 'హస్తం' అంటే కొందరు ఊహిస్తున్నట్లుగా 'శక్తి' కాదు. ఆ మాటకు వస్తే శక్తితోనే ప్రతిదీ సాధ్యమయింది. ఇతర హదీసులలో కూడా చెప్పబడినట్లు అల్లాహ్ మూడు వస్తువులను ప్రత్యేకంగా తన చేత్తో చేశాడు. 1) ఆదం బొమ్మను 2) 'జన్నతుల్ అదన్' వృక్షాన్ని ప్రత్యేకంగా తన చేత్తో నాటాడు 3) తౌరాతు గ్రంథాన్ని ప్రత్యేకంగా తన చేత్తో వ్రాశాడు.

**కాపాడుకోవాలా? అన్న చింతనలో ఉన్నాను. కాబట్టి మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. మీరు నూహ్(అ) ప్రవక్త వద్దకు వెళ్ళండి" అని అంటారు. అప్పుడు వారంతా నూహ్(అ) సన్నిధిలో హాజరై ఇలా విన్నవించుకుంటారు: 'ఓ నూహ్! మీరు (ఆదమ్- అలైహిస్సలాం తర్వాత) భూమండలంలో అందరికన్నా తొలి ప్రవక్త. అల్లాహ్ మిమ్మల్ని 'కృతజ్ఞుడైన దాసుడు' (అబ్దె షకూర్)గా పేర్కొన్నాడు. ఈ రోజు మేము ఎలాంటి ఆపదలో ఉన్నామో మీరు చూడగలరు. మీరు మీ ప్రభువు సమక్షంలో మా కొరకు సిఫారసు చేయండి'. దానికి ఆయన ఇచ్చే సమాధానం కూడా అదే- "ఈ రోజు నా ప్రభువు క్రోధావేశంలో ఉన్నాడు. ఇంతకు ముందెన్నడూ ఆయన ఇంతగా క్రోధావేశం చెందలేదు. ఇక మీదట కూడా ఇంతగా క్రోధావేశం చెందదు. ఈ రోజు నా గురించే నాకు భయమేస్తోంది. కాబట్టి మీరు మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) దగ్గరకు వెళ్ళండి". అప్పుడు వారంతా నా దగ్గరకు వస్తారు. నేను (వారి సిఫారసు కొరకు) దైవ సింహాసనం- అర్ష్- క్రింద సజ్దాలో పడిపోతాను. అప్పుడు, "ఓ ముహమ్మద్! లే. సిఫారసు చెయ్యి. నీ సిఫారసు ఆమోదించ బడుతుంది. అడుగు. నీవు అడిగింది ఇవ్వబడుతుంది" అన్న పిలుపు ప్రతిధ్వని స్తుంది. పూర్తి హదీసును నేను జ్ఞాపకం ఉంచుకోలేకపోయానని ముహమ్మద్ బిన్ ఉబైదుల్లాహ్ తెలిపారు.**

**14) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) (సూరయె ఖమర్‌లోని) 'ఫహల్ మిన్ ముద్దకిర్' అనే ఆయత్‌ను ప్రఖ్యాత పద్ధతిననుసరించి వత్తి పలికారు.**

## అధ్యాయం : 4

## దైవప్రవక్త ఇల్యాస్ (అలైహిస్సలామ్)[1] గురించి

**నిశ్చయంగా ఇల్యాస్ కూడా మా సందేశహరులలో ఒకడు. జ్ఞాపకం తెచ్చుకో, అప్పుడు అతను తన జాతి వారితో "మీరు భయపడరా? సృష్టికర్తలలోకెల్లా ఉత్తము**

14-1. ఈయన ఇల్యాస్ బిన్ యాసీన్ బిన్ హారూన్. అంటే హారూన్ (అలైహిస్సలామ్) మనవడు. దైవప్రవక్త మూసా(అ) తరువాత ప్రవక్తగా పంపబడ్డారు. ఇల్యాస్ అన్నా ఇద్రీస్ అన్నా ఒక్కరేనని మరికొందరు అభిప్రాయపడ్డారు. కాని ఇమామ్ బుఖారీ (రహ్మా) దీంతో ఏకీభవించలేదు. ఆయన ఇద్రీస్(అ) పేరుతో ప్రత్యేకంగా ఒక అధ్యాయం ఏర్పరచారు.

డైన సృష్టికర్తయున్నూ మీకూ, మీకు పూర్వం ఉండిన మీ తాత ముత్తాతలకూ ప్రభువున్నూ అయిన అల్లాహ్‌ను వదలివేసి మీరు 'బఅల్'ను వేడుకుంటున్నారా?" అని అన్నాడు. కాని వారు అతనిని అసత్యవాది అని తిరస్కరించారు. కనుక వారు తప్పనిసరిగా శిక్ష కొరకు హాజరుపరచబడతారు, ప్రత్యేకించుకోబడిన దైవదాసులు తప్ప. ఇల్యాస్‌ను గురించిన మంచి ప్రస్తావనను మేము తరువాతి తరాలలో నిలిచి ఉండేలా చేశాము. ఇల్యాస్‌కు శాంతి కలుగుగాక! మేము సత్కార్యాలు చేసేవారికి ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిస్సందేహంగా అతను విశ్వాసులైన మా దాసులలో ఒకడు. *(అస్ సాఫ్ఫాత్: 123– 132)*

## అధ్యాయం : 5

## దైవప్రవక్త మహనీయ ఇద్రీస్(అలైహిస్సలామ్) గురించి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మేము అతనిని ఉన్నత స్థాయికి లేపాము."

*(మర్యమ్ : 57)*

ప్రవక్త మహనీయులు(సఅసమ్) తమకు వివరించి చెప్పినట్లుగా అబూజర్ (రజి) తెలిపారు: నా ఇంటి కప్పు తెరువబడింది. ఆ రోజుల్లో నేను మక్కాలోనే ఉన్నాను. జిబ్రయీల్(అ) దిగివచ్చి, నా రొమ్మును చీల్చి, దానిని జమ్‌జమ్ జలంతో కడిగారు. ఆ తరువాత వివేకం (హిక్మత్), విశ్వాసం (ఈమాన్)తో నిండిన ఒక పాత్రను తెచ్చి నా హృదయంలో కుమ్మరించారు. ఆ తరువాత నా చేయి పట్టుకుని ఆకాశం వైపునకు ఏగారు. సమీప ఆకాశంపైకి వెళ్ళగానే జిబ్రయీల్(అ) అక్కడి ద్వారపాలకునితో 'తలుపు తెరువు' అన్నారు. 'ఎవరు?' అని ప్రశ్నించబడింది. 'జిబ్రయీల్‌ని' అని ఆయన బదులిచ్చారు. 'మీవెంట మరెవరయినా ఉన్నారా?' అని అడిగితే, 'నా వెంట ముహమ్మద్(స) ఉన్నార'ని చెప్పారు. అప్పుడు తలుపు తెరుచు కుంది. మేము అందులోకి ప్రవేశించినప్పుడు ఒక పెద్దాయన కలిశారు. కొన్ని మానవాత్మలు ఆయనకు కుడివైపున, మరికొన్ని ఎడమ వైపున ఉన్నాయి. ఆయన కుడివైపు చూసినప్పుడు (సంతోషంతో) నవ్వేవారు. ఎడమ వైపు చూసినప్పుడు (దుఃఖంతో) ఏడ్చేవారు. 'స్వాగతం సజ్జనుడైన ప్రవక్తా! సద్వర్తనుడైన కుమారుడా!' అంటూ ఆయన స్వాగతించారు. 'జిబ్రయీల్! ఈ పెద్దాయన ఎవరు?' అని నేనడిగాను. 'ఈయన ఆదమ్(అలైహిస్సలామ్). ఈయనకు కుడిఎడమల్లో ఉన్నవి మానవాత్మలు. వీరు ఆదమ్ సంతతి ఆత్మలు. ఈయనకు కుడివైపున ఉన్నవారు

స్వర్గవాసులు. ఎడమ వైపున ఉన్నవారు నరకవాసులు. అందుకే ఆయన కుడివైపున దృష్టి సారించినప్పుడల్లా మందహాసం చేస్తారు. ఎడమ వైపున దృష్టి సారించినప్పుడు ఏడుస్తారు' అని జిబ్రయీల్(అ) చెప్పారు. తరువాత జిబ్రీల్ నన్ను పై ఆకాశానికి (రెండవ ఆకాశానికి) తీసుకునిపోయారు. అక్కడి ద్వార పాలకుణ్ణి కూడా, 'తలుపు తెరువు' అని ఆయన కోరారు. మొదటి ఆకాశంలో ఎదురైన ప్రశ్నలే అక్కడా ఎదురైనాయి. ఆ తర్వాత తలుపు తెరిచారు– హజ్రత్ అబూజర్(రజి) వివరంగా చెప్పారని హజ్రత్ అనస్(రజి) తెలిపారు– ప్రవక్త మహనీయులు(సఅసమ్) వివిధ ఆకాశాల పైన మహనీయ ఇద్రీస్, మూసా, ఈసా, ఇబ్రాహీమ్ (అలైహిముస్సలామ్)లను కలిశారు. కాని ఆయన ఆ ప్రవక్తల స్థలాలను గురించి ప్రత్యేకంగా నిర్ధారించి చెప్పలేదు. మహాప్రవక్త(స) ఆదమ్(అ)ను సమీప ఆకాశంలో, ఇబ్రాహీమ్(అ)ను ఆరవ ఆకాశంలో కలుసుకున్నారని మాత్రం చెప్పారు.

మహనీయ అనస్(రజి) ఇంకా ఇలా వివరించారు : తర్వాత జిబ్రయీల్(అ) ఇద్రీస్ (అలైహిస్సలామ్) వద్ద నుండి సాగిపోతున్నప్పుడు, "స్వాగతం! సజ్జనుడైన ప్రవక్తా! మంచి సోదరా!" అంటూ ఆయన స్వాగతించారు. "ఈయన ఎవరు?" అని నేనడిగితే, "ఈయన ఇద్రీస్(అ)" అని జిబ్రయీల్ చెప్పారు. ఆ తర్వాత నేను ఈసా(అలైహిస్సలామ్) వద్ద నుండి సాగిపోయాను. ఆయన కూడా "సౌజన్య శీలుడైన ప్రవక్తా! మా మంచి సహోదరుడా! మీకు స్వాగతం" అంటూ స్వాగత వచనాలు పలికారు. "ఈయన గారెవరు?" అని నేనడిగితే, "ఈసా (అ)" అని నాకు సమాధానం ఇవ్వబడింది. నేను ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) వద్ద నుండి సాగి పోతున్నప్పుడు, "సౌజన్యశీలుడైన ప్రవక్తా, సత్పురుషుడవైన సోదరా! నీకు స్వాగతం!" అని ఆయన పలికారు. "ఎవరీయన?" అని నేనడిగితే, "ఈయన ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్)" అని జిబ్రీల్ (అ) సమాధానమిచ్చారు. .... అబూ దహియా అన్సారీ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: "పిదప నన్ను పైకి తీసుకుపోయారు. ఎంత ఎత్తైన చోటికి తీసుకెళ్ళారంటే, అక్కడ నాకు కలముతో లిఖించబడే శబ్దం చాలా స్పష్టంగా వినిపించింది."

మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా చెప్పారు: "తరువాత అల్లాహ్ యాభై పూటల నమాజులను నాపైన విధిగా నిర్ణయించాడు. ఈ విధ్యుక్త ధర్మాన్ని తీసుకుని నేను తిరిగి వస్తూ మూసా(అ) వద్ద నుండి సాగిపోతుండగా, "మీ అనుచర సముదాయంపై

విధితమైన విషయం ఏది?” అని ఆయన ప్రశ్నించారు. యాభై పూటల నమాజులు వారిపై విధించబడ్డాయి” అని నేను బదులిచ్చాను. “మీరు మీ ప్రభువు వద్దకు తిరిగివెళ్ళండి. ఎందుకంటే మీ ఉమ్మత్‌లో ఇన్ని నమాజులు చెయ్యగలిగే శక్తి లేద”ని ఆయన సలహా ఇచ్చారు. అందుచేత నేను వెళ్ళి నా ప్రభువు దర్బారులో మొరపెట్టుకున్నాను– ఈ విషయాన్ని పునఃపరిశీలించమని! తత్ఫలితంగా అందులోని ఒక భాగం తగ్గించబడింది. ఆ తర్వాత నేను మూసా(అ)దగ్గరకు వచ్చినప్పుడు, ఈసారి కూడా ఆయన అదే సలహా ఇచ్చారు. మరోసారి నా అభ్యర్థనపై లోకేశ్వరుడు అందులోని మరో భాగాన్ని తగ్గించాడు. మూడవసారి నేను మూసా(అ) దగ్గరకు వచ్చి, జరిగినదంతా చెప్పాను. “మీరు మీ ప్రభువుకు మరోసారి విజ్ఞప్తి చేయండి. ఎందుకంటే మీ అనుచరులలో ఈపాటి శక్తి కూడా లేదు” అని ఆయన సూచించారు. నేను వెళ్ళి ఇంకొకసారి నా ప్రభువుకు విన్నవించుకున్నాను. అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : “ఐదుపూటల నమాజులు విధిగా నిర్ణయించబడ్డాయి. అయితే వాటి పుణ్యఫలం మాత్రం యాభై నమాజులదే అయి ఉంటుంది. మా వాక్కుకు ఇక తిరుగులేదు, అది మారబోదు”. ఆ తర్వాత నేను మూసా (అ) దగ్గరకు వస్తే, ఆయన ఈసారి కూడా మరింత తగ్గింపు కొరకు మీ ప్రభువు సన్నిధికి వెళ్ళండి అని పట్టుబడ్డారు. దానికి నేను, “మరోసారి నా ప్రభువు సన్నిధికి వెళ్ళి విన్నపం చేసుకోవడానికి నాకు సిగ్గేస్తుంది” అని చెప్పాను. ఆ తర్వాత జిబ్రయీల్(అ) నన్ను వెంటబెట్టుకుని ముందుకు సాగారు– ‘సిద్రతుల్ మున్తహా’ వరకూ తీసుకువచ్చారు. అక్కడ నాకు వివిధ రంగులు కనిపించాయి. అవి (ఆ రంగులు) ఆ వృక్షాన్ని కప్పి ఉంచాయి. అదేమిటో నాకు అర్థమవలేదు. ఆ తర్వాత నాకు స్వర్గంలో ప్రవేశం కల్పించటం జరిగింది. అందులో ముత్యాల గుంపటాలు చేయబడి ఉండటం నేను గమనించాను. దాని మట్టి కస్తూరిలా సువాసనను గుబాళిస్తోంది.”[1]

---

5–1. ఈ అధ్యాయంలో (హదీసులో) దైవప్రవక్త మహనీయ ఇద్రీస్(అలైహిస్సలామ్) ప్రస్తావన వచ్చింది. ఈ కారణంగానే మహాప్రవక్త(స) గగనయాత్రను ఇక్కడ పొందుపరచవలసి వచ్చింది.

మేరాజ్ (గగన యాత్ర) శారీరకంగా జరిగిందన్నది సత్యం. దానిని యధాతథంగా– నిజమని– నమ్మాలి. ఇది విశ్వాసం (అఖీదా)తో ముడివడిన అంశం. ఇక్కడ ఇతరత్రా ఊహాగానాలకు, భాష్యాలకు, కాకిలెక్కలకు తావులేదు.

## అధ్యాయం : 6

## అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు

**ఆద్ జాతి వైపునకు మేము వారి సహోదరుడైన హూద్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు: "నా జాతి సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి."**
***(హూద్ : 50)***

**వారికి కొంచెం ఆద్ సోదరుని (హూద్) గాథను వినిపించు. అప్పుడు అతను ఇసుక గుట్టల మధ్య నివసించే తన జాతి వారిని ఇలా హెచ్చరించాడు– అలా హెచ్చరించేవారు అతనికి పూర్వం కూడా వచ్చారు, అతని తరువాత కూడా వచ్చారు– "అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకండి. మీ విషయంలో ఒక భయంకర దినాన విధించబడే శిక్షను గురించి నేను భయపడుతున్నాను." దానికి వారు ఇలా అన్నారు, "మాయమాటలు చెప్పి మా దేవతల నుండి మమ్మల్ని దూరం చేయటానికా వచ్చింది నీవు? సరే, మంచిది, నీవు సత్యవంతుడవే అయితే, నీవు మమ్మల్ని భయపెడుతూ ఉన్నటువంటి ఆ శిక్షను తీసుకు రా." అతను ఇలా అన్నాడు, "దానిని గురించి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఏ సందేశాన్ని ఇచ్చి నన్ను పంపడం జరిగిందో ఆ సందేశాన్నే నేను మీకు అందజేస్తున్నాను. కాని నేను గమనిస్తున్నాను, మీరు అజ్ఞానులుగా ప్రవర్తిస్తున్నారు." తరువాత వారు ఆ శిక్షను తమ లోయల వైపునకు వస్తూ ఉండగా చూసి, "ఇవి పుష్కలంగా మాకు వర్షాన్ని కురిపించే మేఘాలు" అని అనసాగారు– కాదు, కాని ఇది మీరు తొందరపెడుతూ ఉన్న విషయం. ఇది తుఫాను గాలి, వ్యధాపూరితమైన శిక్షను తెస్తోంది, తమ ప్రభువు ఆజ్ఞానుసారం ప్రతి వస్తువునూ సర్వనాశనం చేస్తుంది. చివరకు వారి నివాస స్థలాలు తప్ప అక్కడ ఏమీ కనిపించకుండా పోయింది. ఈ విధంగా మేము నేరస్తులకు ప్రతిఫలం ఇస్తూ ఉంటాము."[1]** ***(46 అల్ అహ్‌ఖాఫ్ : 21–25)***

---

6–1. అతా రివాయతును సంకలనకర్త అహ్‌ఖాఫ్ సూరా వ్యాఖ్యానంలో సులైమాన్ రివాయతును నేరుగా వసల్ చేశారు. **'అహ్‌ఖాఫ్'** అనేది **'హిఖ్ఫ్'**కు బహువచనం. అహ్‌ఖాఫ్ పేరుతో ఖుర్‌ఆన్‌లో ఒక అధ్యాయమే ఉంది. అందులో ఆద్ జాతికి విధితమైన శిక్ష ప్రస్తావించబడింది. ఆద్‌జాతి వారు ఎత్తయిన ఇసుక గుట్టలపై నివసించే వారు. అహ్‌ఖాఫ్ అంటే ఇసుక గుట్టలని అర్థం. యమన్ ప్రదేశంలోని ఒక లోయ పేరు అహ్‌ఖాఫ్. అదే ఆద్‌జాతి నివసించే ప్రదేశం. అది సముద్ర తీర ప్రాంతమని ఖతాదా అభిప్రాయపడ్డారు.

ఆద్ జాతి వారు ఒక పెద్ద గాలివాన ద్వారా నాశనం చేయబడ్డారు. అల్లాహ్ వరుసగా ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్ళు వారిని దానికి గురిచేశాడు. (నీవు అక్కడ ఉండి ఉంటే) వారు అక్కడ బోసిపోయిన ఖర్జూరపు చెట్ల బోదెలు మాదిరిగా చెల్లా చెదురుగా పడి ఉండటాన్ని నీవు చూస్తావు. ఇప్పుడు వారిలో మిగిలి ఉన్న వాడెవ డయినా నీకు కనిపిస్తున్నాడా? *(అల్ హాఖ్ఖహ్ : 6–8)*

ఈ అధ్యాయంలో అతా బిన్ అబీ రబాహ్, సులైమాన్ బిన్ యసార్ ప్రభృతులు హజ్రత్ ఆయిషా(ర.అ) నుండి ప్రవక్త(స) ప్రవచనాన్ని ఉటంకించారు.

**15)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : "(కందక యుద్ధ సందర్భంగా) తూరుపు (ముందటి) గాలి ద్వారా నాకు సహాయం చేయబడింది. ఆద్ జాతి వెనుకటి గాలి ద్వారా అంతమొందించబడింది."

మహనీయ అబూ సయీద్ ఖుద్రీ(రజి) కథనం: హజ్రత్ అలీ(రజి) (యమన్ ప్రదేశం) నుండి దైవప్రవక్త(స) దగ్గరకు కొంత బంగారం పంపించారు. దానిని ఆయన(స) నలుగురు మనుషుల్లో పంపిణీ చేశారు. (ఆ నలుగురు వీరు) 1) అఖ్రా బిన్ హాబిస్ హంజలా అల్ మజాషియి 2) ఉయైనా బిన్ బద్ర్ ఫజారీ 3) బనూ నబ్హాన్‌కు చెందిన జైద్ తాయి 4) అల్ఖమా బిన్ ఉలాసా ఆమిరీ (బనూ కిలాబ్‌కి చెందినవారు). ఈ పంపకంపై కొంతమంది ఖురైషులకు, అన్సార్లకు కోపం వచ్చింది. 'ప్రవక్త మహనీయులు(స) నజ్ద్ ప్రముఖులకైతే ఇచ్చారు గాని మనల్ని పట్టించుకోలేదు' అని పరస్పరం చెప్పుకున్నారు. దానికి దైవప్రవక్త(స), "నేను వారి హృదయాలను పరస్పరం కలపడానికి ఇస్తుంటాను (ఎందుకంటే వారు ఇప్పుడిప్పుడే ఇస్లాం స్వీకరించారు)" అని సముదాయించారు. అంతలో ఒక వ్యక్తి ముందుకు వచ్చాడు. అతని కళ్ళు లోపలికి పోయి ఉన్నాయి. దవడలు ఉబ్బి ఉన్నాయి. నుదురు కూడా ఉబికి ఉంది. అతని గడ్డం గుబురుగా ఉంది. తల గొరిగించుకుని ఉన్నాడు. అతను, 'ఓ ముహమ్మద్! అల్లాహ్‌కు భయపడు' అని అన్నాడు. దానికి సమా ధానంగా ఆయన(స) ఇలా అన్నారు : "నేనే అల్లాహ్‌కు విధేయత చూపకపోతే మరెవరు విధేయత కనబరుస్తారు? అల్లాహ్ నన్ను ఈ భూమండలానికి అమీన్ (నిజాయితీపరుని)గా చేసి పంపాడు. ఏమిటి, నీవు నన్ను 'అమీన్' (నిజాయితీ పరుని)గా భావించటం లేదా?'– ఆ వ్యక్తి దుర్వర్తనపై ఒక సహాబీ ఆగ్రహించి,

**అతన్ని చంపడానికి ఆనతినివ్వమని అభ్యర్థించారు. బహుశా ఆ సహాబీ ఖాలిద్ బిన్ వలీద్ అని నేననుకుంటున్నాను- అయితే దైవప్రవక్త(స) ఆ చర్య నుండి ఆయన్ని ఆపారు. తరువాత ఆ వ్యక్తి అక్కడి నుండి నిష్క్రమిస్తూ ఉండగా ప్రవక్త మహనీయులు (స) ఇలా అన్నారు : "ఇతని తదనంతరం ఇతని తెగ నుండి ఇతనిలాంటి అబద్ధీకులైన ముస్లింలే పుట్టుకువస్తారు. వారు ఖుర్ఆన్‌ను పారాయణం చేస్తారు. కాని ఖుర్ఆన్ వారి గొంతులోనుండి క్రిందికి (గుండెలోనికి) దిగదు. ధనుస్సు నుండి బాణం దూసుకుపోయినట్లే ధర్మం (దీన్) వారి నుండి వెడలి పోతుంది. వారు ముస్లింలను వధిస్తారు. విగ్రహారాధకుల్ని విడిచిపెట్టేస్తారు.[1] నేను గనక అప్పటి వరకూ బ్రతికి ఉంటే ఆద్ జాతి వారు (దేవుని శిక్షగా) సంహరించబడినట్లే, నేను వారిని ఒక్కరూ మిగులకుండా సంహరిస్తారు."[2]**

**16) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) చెప్పగా తాను విన్నానని అస్వద్ చెప్పారు- అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా చెప్పేవారు : ప్రవక్త మహనీయులు (సఅసం) ఫహల్ మిన్ ముద్దకిర్ ఆయత్ పారాయణం చేస్తుండగా నేను విన్నాను.[1]**

## అధ్యాయం : 7

## సమూద్ జాతి, దైవప్రవక్త మహనీయ సాలెహ్(అ) గురించి

**అల్లాహ్ హూద్ సూరాలో ఇలా సెలవిచ్చాడు : "సమూద్ జాతి వద్దకు మేము వారి సహోదరుడైన సాలిహ్‌ను పంపాము" *(11: 61)***

---

15-1. ప్రవక్త(స) వారి ఈ భవిష్యవాణి నిజమయింది. మహనీయ అలీ(రజి) పరిపాలనా కాలంలో ఇలాంటి వారు పుట్టుకువచ్చారు. హజ్రత్ అలీ(రజి) వారి పీచమణిచారు. ఇలాంటి సోకాల్డ్ ముస్లింలకు ఈ కాలంలో కూడా కొరత లేదు. పైకి ఎంతో ధర్మపరాయణులుగా కానవస్తారు. కాని వారి ఆంతర్యాలలో విశ్వాస జ్యోతి ఉండదు.

15-2. ఈ హదీసు చివర్లో ఆద్ జాతి తుదముట్టించబడిన ప్రస్తావన వచ్చింది. ఈ కారణంగానే ఈ హదీసు ఇక్కడ పొందుపరచబడింది. దైవప్రవక్త(స) ఎదుట దురుసుగా మాట్లాడిన ఆ దౌర్భాగ్యుని వారసులు హజ్రత్ అలీ (రజి) హయాంలో 'ఖారిజీలు'గా తలెత్తారు. అలీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. కడకు అలీ (రజి) చేత సంహరించబడ్డారు.

16-1. ఈ ఆయత్ అల్ ఖమర్ సూరాలో ఆద్ జాతి వృత్తాంతం సందర్భంగా కూడా వచ్చింది. ఈ కారణంగానే ఇక్కడ ఈ హదీసు తీసుకోబడింది.

"హిజ్ర్ ప్రజలు కూడా దైవప్రవక్తలను అబద్ధీకరించారు" *(అల్ హిజ్ర్ : 80)*

అల్ అన్ఆమ్ సూరాలో కూడా 'హిజ్ర్' అనే పదం వచ్చింది. ఇక్కడ హిజ్ర్ అంటే నిషిద్ధం, అధర్మం అన్న అర్థాలొస్తాయి. కట్టడాన్ని కూడా 'హిజ్ర్' అనంటారు. అంటే ఒక భూమిని చుట్టుముట్టిన గోడ లేక కంచె. ఈ అర్థంలోనే కాబా గృహం వద్ద ఉన్న 'హతీమ్'ను 'హిజ్ర్' అంటారు.

**17)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ జమా తెలిపారు: ఆయన(స), మహనీయ సాలిహ్(అ) ఒంటెను చంపిన కిరాతకుణ్ణి గురించి ప్రస్తావిస్తూ, "ఒక బలశాలి, గౌరవనీయుడైన వ్యక్తి ఆ ఒంటెను చంపే బాధ్యత తీసుకున్నాడు" అని చెప్పారు.

**18)** ఇబ్నె ఉమర్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) తబూక్ యుద్ధ (ప్రయాణ) సందర్భంగా 'హిజ్ర్' ప్రదేశంలో విడిది చేసినప్పుడు, "ఇక్కడి బావుల్లోని నీరు త్రాగకండి. నీటితిత్తుల్లో నీరు నింపుకోకండి" అని ప్రజలను ఆదేశించారు. దానికి సహచరమాన్యులు, 'అయ్యో. మేము ఇక్కడి నీటిలో పిండి నానబెట్టాము, నీళ్ళతిత్తులు నింపుకున్నాము కదా!' అని సందేహపడగా, "ఆ పిండి పారవేయండి. తిత్తుల్లోని నీళ్ళను నేలపై కుమ్మరించండి" అని దైవప్రవక్త(స) సూచించారు. సబులా బిన్ మాబద్, అబూ షమూస్‌ల ఉల్లేఖనంలో "(ఈ నీటితో తయారైన) భోజనాన్ని పారవేయండి" అని ఆజ్ఞాపించారు. మహాప్రవక్త(స) నుండి అబూజర్(రజి) ఉల్లేఖించిన దానిలో, "ఈ నీటితో నానబెట్టబడిన పిండిని పారవేయండి" అని ఉంది.

**19)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ప్రజలు (తబూక్ ప్రయాణ సందర్భంగా) హిజ్ర్ ప్రాంతంలో ఆగినప్పుడు అక్కడి బావి నుండి తమ నీటితిత్తులు నింపుకున్నారు. ఆ నీటితో పిండి నానబెట్టారు. అప్పుడు దైవప్రవక్త(స), "నీళ్ళ తిత్తుల్లోని నీటిని పారవేయండి. నానబెట్టిన పిండిని ఒంటెలకు తినిపించండి" అని ఆదేశిస్తూ, "ఈ బావిలోని నీరు మహనీయ సాలిహ్ ఒంటె త్రాగిన నీరు" అని చెప్పారు– ఉబైదుల్లాహ్‌తోపాటు ఈ హదీసును ఉసామా కూడా నాఫే నుండి ఉటంకించారు.

**20)** (తన తండ్రి) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారని సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ చెప్పారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) సమూద్ జాతి నివసిం

చిన 'హిజ్ర్' ప్రదేశం గుండా సాగిపోతున్నప్పుడు ఇలా పలికారు– "పాపాత్ముల బస్తీ నుండి సాగిపోవటం అనివార్యమైనప్పుడు, దుఃఖంతో విలపిస్తూ (అల్లాహ్‌కు భయ పడుతూ, పశ్చాత్తాపపడుతూ) సాగిపోండి. ఎందుకంటే వారిపై విరుచుకుపడినది మీపైన కూడా పడకూడదు సుమా!" ఇలా పలికిన తరువాత ఒంటెపైనుంచే, తన ముఖంపైన గుడ్డ కప్పుకున్నారు.

**21)** హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రబోధించారు : "నేరస్తుల (పాపాతురుల) పట్టణంలోకి వెళ్ళకండి. ఒకవేళ తప్పనిసరి పరిస్థితిలో వెళ్ళవలసి వస్తే దుఃఖంతో విలపిస్తూ అక్కడి నుండి సాగిపోండి. వారిపై విధితమయిన శిక్ష మీపైన కూడా వచ్చి పడకూడదు."

## అధ్యాయం : 8

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : ప్రవక్తా! ఈ ప్రజలు నిన్ను జుల్‌ఖర్‌నైన్‌ను గురించి అడుగుతున్నారు. వారితో, "నేను అతనిని గురించి మీకు కొంచెం వినిపిస్తాను" అని అను.

మేము అతనికి ధరణిలో అధికారాన్ని ప్రసాదించాము. అతనికి అన్ని రకాల సాధనాలనూ, వనరులనూ ఇచ్చాము. అతను (మొదట పశ్చిమ దిశకు దండయాత్ర చేయటానికి) సన్నాహాలు చేశాడు. చివరకు అతను సూర్యుడు అస్తమించే హద్దుకు చేరినప్పుడు, నల్లని నీటిలో సూర్యుడు మునుగుతూ ఉండగా అతను చూశాడు. అక్కడ అతనికి ఒక జాతి ప్రజలు కనిపించారు. అప్పుడు మేము ఇలా అన్నాము, "జుల్‌ఖర్‌నైన్! ఆ జాతి ప్రజలను శిక్షించటానికి గానీ, వారి పట్ల ఉదార వైఖరిని అవలంబించటానికి గానీ నీకు అధికారం ఉన్నది". అతను ఇలా అన్నాడు, "వారిలో దౌర్జన్యం చేసేవాడిని మేము శిక్షిస్తాము. ఆపై అతడు తన ప్రభువు వైపునకు మరలింపబడతాడు. అప్పుడు ఆయన అతనికి మరింత తీవ్రమైన శిక్ష విధిస్తాడు. వారిలో విశ్వసించినవాడికీ, సత్కార్యాలు చేసేవాడికీ మంచి ప్రతిఫలం లభిస్తుంది. అంతేకాదు మేము అతడికి తేలికపాటి ఆజ్ఞలను ఇస్తాము."

తరువాత అతను (మరొక దండయాత్ర కోసం) సన్నాహాలు చేశాడు. చివరకు అతను సూర్యుడు ఉదయించే హద్దు వరకు పోయాడు. అక్కడ అతను ఒక జాతిపై సూర్యుడు ఉదయించటం చూశాడు, దాని కోసం మేము ఎండ నుంచి రక్షణ పొందే

**ఏర్పాటు ఏదీ చేయలేదు. ఇదీ వారి స్థితి. జుల్‌ఖర్‌నైన్ వద్ద ఉన్నది ఏమిటో మాకు తెలుసు.**

**తరువాత అతను (మరొక దండయాత్రకు) సన్నాహాలు చేశాడు; చివరకు అతను రెండు పర్వతాల మధ్యకు చేరినప్పుడు, అక్కడ అతనికి ఒక జాతి కనిపించింది. ఆ జాతి ఏ విషయాన్నైనా అతి కష్టం మీదగాని అర్థం చేసుకోలేదు. వారు ఇలా అన్నారు : "జుల్‌ఖర్‌నైన్! యాజూజ్, మాజూజ్‌లు ఈ భూభాగంలో కల్లోలాన్ని వ్యాపింపజేస్తున్నారు. కనుక నీవు మాకూ వారికీ మధ్య అడ్డంగా ఒక గోడను నిర్మించు. అందుకు మేము నీకు ఏదైనా సుంకం చెల్లించాలా?" అప్పుడు అతను ఇలా అన్నాడు, "నా ప్రభువు నాకు ఇచ్చినదే నాకు చాలు. మీరు మటుకు శ్రమ ద్వారా నాకు సహాయపడండి, నేను మీకూ, వారికీ మధ్య అడ్డంగా గోడ కడతాను. నాకు ఇనుప రేకులను తెచ్చి ఇవ్వండి." చివరకు ఆ రెండు పర్వతాల మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని అతను పూడ్చివేసి, ప్రజలతో "ఇక మంటలు రగిలించండి" అని అన్నాడు. తరువాత (ఆ ఇనుప గోడను) పూర్తిగా నిప్పు మాదిరిగా ఎర్రగా చేసి అతను, "ఇక కరిగిన రాగిని తీసుకురండి. దీనిపై కుమ్మరిస్తాను" అని అన్నాడు. (ఈ గోడ ఎటువంటిదంటే) యాజూజ్, మాజూజ్‌లు దానిపైకి ఎక్కిరానూ లేరు; దానికి కన్నం వేయటం వారికి ఇంకా కష్టతరం. జుల్‌ఖర్‌నైన్ ఇలా అన్నాడు, "ఇది నా ప్రభువు కరుణ, కాని నా ప్రభువు యొక్క వాగ్దాన సమయం ఆసన్నమయినప్పుడు, ఆయన దానిని నేలమట్టం చేస్తాడు. నా ప్రభువు వాగ్దానం నిజమైనది." ఆ రోజున మేము ప్రజలను వదిలిపెడతాము. వారు (సముద్రపు అలలు మాదిరిగా) ఒకరితో ఒకరు అల్లకల్లోలంగా కలిసిపోతారు.[1] *(అల్ కహఫ్ : 83–99)***

**22) విశ్వాసుల మాత హజ్రత్ జైనబ్ బిన్తె జహ్షా (ర.అ) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఆమె దగ్గరకు వచ్చినప్పుడు, ఆయన (స) కలవరానికి లోనై ఉన్నారు. అప్పుడు ఆయన(స) ఇలా అన్నారు : అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేనేలేదు. ఒకరోజు సమీపంలోనే రానున్నది. దాని చెడుగు కారణంగా అరేబియా దేశంలో విధ్వంసం జరుగుతుంది. యాజూజ్ మాజూజ్‌లు**

---

8–1. భౌగోళికంగా అక్కడ రెండు వైపులా రెండు ఎత్తయిన పర్వతాలుండేవి. ఆ రెండింటి మధ్యన సందు ఉండేది. యాజూజ్ మాజూజ్ జనులు ఆ సందు గుండా వచ్చి పేద ప్రజలను బాధించేవారు. వారిని దోచుకునేవారు. ఆ పీడిత ప్రజల అభ్యర్థనపై జుల్ ఖర్‌నైన్ ఆ రెండు కొండల మధ్యన ఇనుప రేకులతో పటిష్టమయిన గోడను నిర్మించాడు.

**గోడలో ఇంత కన్నం వేశారు. తరువాత దైవప్రవక్త(స) తన బొటనవ్రేలును, దాని సమీప వేలును వృత్తంగా చేసి చూపించారు. విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ జైనబ్ బిన్తె జహ్ష్(ర.అ) ఇలా అన్నారు : 'దైవప్రవక్తా! మాలో సజ్జనులు ఉన్నప్పటికీ మేము అంతమొందించబడతామా?' అని నేను ప్రశ్నించగా, "అవును. పాపాలు దురాగతాలు పెచ్చరిల్లిపోయినప్పుడు (వినాశం తప్పదు)" అని ఆయన(స) బదులిచ్చారు.**

**23) మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "ఈ రోజు యాజూజ్ మాజూజ్‌ల గోడ ఇంత తెరచుకుంది"[1] ఇలా చెబుతూ ఆయన(స) తన వ్రేళ్ళలో 90 సంఖ్యను చూపించారు.**

**24) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) తెలిపారు : అల్లాహ్ (ప్రళయదినాన), "ఓ ఆదమ్!" అని పిలుస్తాడు. దానికి ఆదమ్ (అలైహిస్సలామ్) 'చిత్తం. నేను హాజరయ్యాను. ఆజ్ఞాపాలనకై సిద్ధంగా ఉన్నాను. సమస్త శుభాలు నీ హస్తగతమై ఉన్నాయి' అని అంటారు. అప్పుడు అల్లాహ్ "నరకానికి ఆహుతి అయ్యేవారిని వేరుపరచుకో" అని సెలవిస్తాడు. 'ఓ అల్లాహ్! ఇంతకీ నరకవాసులు ఎంతమంది?' అని ఆదమ్ అడిగితే, 'ఒక వెయ్యిలో తొమ్మిది వందల తొంబై తొమ్మిది" అని అల్లాహ్ అంటాడు. అప్పుడు (పిడుగులాంటి ఆ వార్తను విని) పసిపిల్లలు సయితం పండు ముసలివాళ్ళై పోతారు. గర్భవతి తన గర్భాన్ని పడవేస్తుంది. ఆ సమయంలో ప్రజలు మీకు మత్తులో ఉన్నట్లు కనిపిస్తారు. నిజానికి వారు మత్తులో ఉండరు. కాని అల్లాహ్ శిక్షయే అంత తీవ్రంగా ఉంటుంది. ఇది విన్న సహచరమాన్యులు, 'దైవప్రవక్తా! ఆ ఒక్క వ్యక్తి మాలో ఎవడై ఉంటాడు?' అని అడిగితే, "మీకు శుభవార్త. ఆ ఒక్కడు మీలోని వాడై ఉంటాడు. వెయ్యిమంది నరకవాసులు యాజూజ్ మాజూజ్ జాతికి చెందినవారై ఉంటారు" అని మహాప్రవక్త(స) చెప్పారు. తరువాత ఆయన(స) ఈ**

---

23-1. ఒక ఉల్లేఖనం ప్రకారం యాజూజ్ మాజూజ్ ప్రతిరోజూ గోడ వద్ద త్రవ్వకాలు చేపడుతుంటారు. ఇంకాస్త త్రవ్వితే వారి పనైపోతుంది. అప్పుడు వారు రేపు వచ్చి గోడబద్దలు కొడదాం అంటారు. కాని మరునాడు వారు వచ్చి చూస్తే గోడ చెక్కుచెదరకుండా ఉంటుంది. చివరకు అది బద్దలయ్యే రోజు వచ్చినప్పుడు, ఇన్‌షా అల్లాహ్ రేపు మనం ఈ గోడను బద్దలు గొడదాం అంటారు. ఆ రోజు రాత్రి ఆ గోడ అలా ఉండిపోతుంది. తెల్లవారాక యాజూజ్ మాజూజ్‌లు వచ్చి గోడ బద్దలు గొట్టి లోనికి చొచ్చుకుపోతారు.

**విధంగా పలికారు : "ఎవరి గుప్పెట్లో నా ప్రాణముందో ఆయన సాక్షిగా! (ముస్లిం సముదాయానికి చెందిన) మీరు మొత్తం స్వర్గవాసులలో మూడింట ఒక వంతు ఉంటారని నేను ఆశిస్తున్నాను". ఇది విని మేము అల్లాహు అక్బర్ అన్నాము. అప్పుడాయన(స), "మీరు యావత్తు స్వర్గవాసులలో సగం మంది ఉంటారని నేనాశిస్తున్నాన"న్నాను. మళ్ళీ మేము అల్లాహు అక్బర్ అని నినదించగా, "(మహ్షర్ మైదానంలో) మీరు సమస్త మానవాళికి ఎదురుగా, ఒక తెల్లని ఎద్దు ఒంటిపై ఒక నల్లని వెంట్రుకలా కనిపిస్తారు లేదా ఒక నల్లని ఎద్దు శరీరంపై ఒక తెల్లని వెంట్రుక మాదిరిగా కానవస్తారు"[1] అని ఆయన(స) వివరించారు.**

## అధ్యాయం : 9

## (అన్ నిసా సూరాలో) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**"అల్లాహ్ ఇబ్రాహీమును తన మిత్రునిగా చేసుకున్నాడు." *(4: 125)***

**"నిజానికి ఇబ్రాహీమ్ తనకు తానే ఒక సంఘం. అల్లాహ్కు పరమ విధేయుడు. ఆయన యందే మనస్సు నిలిపినవాడు." *(అన్ నహ్ల్ : 120)***

**"వాస్తవానికి ఇబ్రాహీమ్ మెత్తని మనస్సు కలవాడు, సంయమనం కలవాడూను." *(అత్ తౌబా -114)***

**హబషా భాషలో 'అవ్వాహ్' అనే పదం దయామయుడు అన్న అర్థంలో వస్తుందని అబూ మైసరా చెప్పారు.**

**25) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "మీరు ప్రళయదినాన నగ్న పాదాలతో,**

---

24-1. అంటే యాజూజ్ మాజూజ్ జాతి వారితో పోలిస్తే మీ సంఖ్య బహుస్వల్పం. యాజూజ్ మాజూజ్ అనేవి రెండు తెగల పేర్లు. వారు యాఫస్ బిన్ నూహ్ సంతతికి చెందినవారు. ప్రళయానికి ముందు వీరు భువిలో చెలరేగిపోతారు. ప్రపంచం నలువైపుల నుండీ బయల్పడతారు. వారు ఈ విధంగా బయల్పడటం కూడా ప్రళయ సూచనలలో ఒక సూచనయే. యాజూజ్ మాజూజ్ల ఉనికి పట్ల సందేహం కలిగి ఉండేవాడు స్వయంగా అవివేకి.

ముహమ్మద్ అనుచర సమాజానికి చెందినవారు స్వర్గంలో అత్యధికంగా ఉంటారన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. అయితే వారు షిర్క్ (బహుదైవా రాధన)కు దూరంగా ఉండాలి. తమ విశ్వాసం (ఈమాన్) వాంఛించే వాటికి కట్టుబడి ఉండాలి.

నగ్న శరీరాలతో, సున్తీ (వడుగు) చేయని స్థితిలో సమీకరించబడతారు"– ఆ తరువాత ఆయన(స) ఈ ఆయత్‌ని పఠించారు : "మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించినట్లుగానే, మేము మిమ్మల్ని మరల్చుతాము. ఇది మా తరఫున ఒక వాగ్దానం. దానిని మేము చేసి తీరుతాము"– "దైవప్రవక్తలలో అందరికన్నా ముందు ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్)కి వస్త్రం తొడిగించబడుతుంది. నా అనుయాయులలో కొందరిని ఎడమ వైపునకు తీసుకుపోవటం జరుగుతుంది. అప్పుడు నేను, 'అయ్యో! వీరు నా అనుయాయులు' అని కేక వేస్తాను. కాని నాకు తెలియపరచబడుతుంది– 'మీ తదనంతరం వీళ్ళు తిరస్కార వైఖరి (కుఫ్ర్)కి ఒడిగట్టారు' అని. అప్పుడు నేను సజ్జనుడైన దాసుడు (హజ్రత్ ఈసా– అలైహిస్సలామ్) చెప్పిన మాటే చెబుతాను– 'నేను వీరి మధ్యన ఉన్నంత కాలమే వీరిని కనిపెట్టి ఉన్నాను'[1] అంటాను.. నీవు శక్తిమంతుడవు, వివేకవంతుడవు (5: 118)" వరకు.

**26)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ప్రవచనం : మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) ప్రళయదినాన తన తండ్రి ఆజర్‌ను కలుసుకున్నప్పుడు అతని ముఖం దుమ్ము కొట్టుకుని ఉంటుంది. '(నాన్నా!) నా సందేశాన్ని వ్యతిరేకించకండి అని నేను మీతో అనలేదా?' అని ఇబ్రాహీమ్ (అ) తన తండ్రితో అంటారు. దానికి అతను 'ఈ రోజు నేను నిన్ను వ్యతిరేకించను' అంటాడు. అప్పుడు మహనీయ ఇబ్రాహీమ్(అ), 'ప్రభూ! ప్రళయ దినాన నన్ను అవమానపర్చను అని నీవు నాకు వాగ్దానం చేశావు. ఈ రోజు నా తండ్రి నీ కారుణ్యానికి అందరికన్నా ఎక్కువ దూరాన ఉన్నాడు. ఇంతకన్నా పెద్ద అవమానం ఇంకేమి కాగలదు?' అని దీనాతిదీనంగా విన్నవించుకుంటారు. సమాధానంగా అల్లాహ్ ఇలా అంటాడు : "నేను సత్యతిరస్కారుల కొరకు స్వర్గాన్ని నిషిద్ధం

---

25–1. వారు ధర్మభ్రష్టులు. మహాప్రవక్త(సఅసం) పరమపదించిన తరువాత వారు మొదటి ఖలీఫా హజ్రత్ అబూబక్ర్(రజి) కాలంలో 'ముర్తద్' అయిపోయారు. అంటే ఇస్లాం ధర్మం నుండి మరలిపోయారు. మహనీయ అబూబక్ర్(రజి) అలాంటి వారికి వ్యతిరేకంగా ధర్మయుద్ధం చేశారు. వారిలో చాలామంది పల్లెటూరి బైతులు. వారు నామమాత్రంగానే ఇస్లామ్‌లో ప్రవేశించారు. వారి హృదయాలలో విశ్వాసం (ఈమాన్) గట్టిగా నాటుకో లేదు. దైవప్రవక్త(స) తదనంతరం వారు ఇస్లామ్‌ను ఎదిరించారు. తమ ఆంతర్యాలలోని కాపట్యాన్ని బహిర్గతం చేశారు. అలాంటి ధర్మభ్రష్టులకు వ్యతిరేకంగా ప్రథమ ఖలీఫా జిహాద్ చేసి, వారి పీచమణిచారు.

**(హరామ్)గా ఖరారు చేశాను". తరువాత ఇబ్రాహీమ్ (అ)తో ఇలా అనబడుతుంది: "ఓ ఇబ్రాహీమ్! నీ పాదాల క్రింద ఏముంది?" ఇబ్రాహీమ్(అ) చూస్తే, కోయబడిన ఒక జంతువు (తేలు?) నెత్తుటి మడుగులో పడిఉన్నట్లు కనిపిస్తుంది. పిదప దాని కాళ్ళు పట్టుకుని నరకంలోకి విసిరివేయటం జరుగుతుంది.[1]**

**27) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాబా గృహంలో (మక్కా విజయం సందర్భంగా) ప్రవేశించినప్పుడు, అందులో మహనీయ ఇబ్రాహీమ్(అ), హజ్రత్ మర్యమ్(అలైహస్సలామ్)ల విగ్రహాలను గమనించి, "ఖురైషులకు ఏమైపోయింది? విగ్రహాలున్న గృహంలోనికి దైవదూతలు రారన్న సంగతి వారికి తెలుసు కదా! అయినా వారిలా ఎందుకు చేశారు. ఇది మహనీయ ఇబ్రాహీమ్(అ) విగ్రహం– అది కూడా పాచిక విసురు తున్నట్లుగా!"[1] అని తన ఆవేదనను వెళ్ళగ్రక్కారు.**

**28) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాబా గృహంలోని విగ్రహాలను చూసినప్పుడు, వాటిని అక్కడినుండి తొలగించనంత వరకూ లోనికి ప్రవేశించలేదు. ఆయన(స) ఇబ్రాహీమ్ (అ), ఇస్మాయిల్(అ)ల విగ్రహాలను చూశారు. వాటి చేతుల్లో (పాచికల) బాణాలు ఉన్నాయి. అప్పుడు ఆయన(స) నోట వెలువడిన వాక్యమిది– "అల్లాహ్ వీళ్ళను నాశనం చెయ్యి. దైవసాక్షిగా! ఆ మహనీయులు ఎన్నడూ ఇలాంటి (పాచికల) బాణాలు విసరలేదు."**

**29) మహనీయ అబూహురైరా (రజి) తెలిపారు : 'దైవప్రవక్తా! ప్రజలందరి లోకీ ఆదరణీయుడు ఎవరు?' అని ప్రవక్త మహనీయులు(సఅసమ్)ను అడగ్గా,**

---

26–1. మా ముర్షిదులు, బాబాలు ఎలాగైనా తీర్పుదినాన మమ్మల్ని కాపాడుకుంటారని గాలి మేడలలో తేలియాడుతున్న సోకాల్డ్ ముస్లిములు ఈ హదీసు ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి.

27–1. అరబ్బు ముష్రిక్కులు ఇబ్రాహీమ్(అ) విగ్రహాన్ని తయారు చేసి, దాని చేతిలో పాచిక బాణాన్ని పెట్టారు. పాచిక తయారు చేయటంగానీ, జూదమాడటంగానీ, శకునాలు చూడటం గానీ ఏ ప్రవక్తకు కూడా శోభించదని ముహమ్మద్(స) ప్రవక్త చెప్పారు.

ఖుస్తులానీ ఇలా అన్నారు : మక్కాలోని అవిశ్వాసులు ప్రయాణం చేయదలచినప్పుడు పాచికల ద్వారా శకునాలు చూసేవారు. ఏదేని విగ్రహాన్ని ఆరాధ్య దైవంగా పూజించటం 'షిర్క్' అని కూడా ఈ హదీసు ద్వారా రూఢీ అయింది.

"అందరికన్నా ఎక్కువగా దైవానికి భయపడేవాడు" అని ఆయన(స) చెప్పారు. 'మేమడిగేది దాని గురించి కాదు' అని సహచరమాన్యులు విన్నవించుకోగా, "అలాగైతే వంశపారంపర్యపు మర్యాదల దృష్ట్యా దైవప్రవక్త యూసుఫ్(అ) అందరి కంటే శ్రేష్టులు. ఆయన స్వయంగా ప్రవక్త, ఆయన తండ్రి ప్రవక్త, తాత ప్రవక్త, ముత్తాత దేవుని ప్రియ నేస్తం (ఖలీల్). (ఒకరి తర్వాత ఒకరుగా నాలుగు తరాలలో ప్రవక్తా పదవి లభించటం కన్నా శ్రేష్ఠత మరేముంటుంది?)" అని ఆయన (స) బదులిచ్చారు. అప్పుడు సహచరమాన్యులు, 'మేమడిగేది దాని గురించి కూడా కాదండి' అని విన్నంచుకోగా, "ఓహెూ! మీరు అరబ్బు వంశీయుల గురించి అడగ దలిచారా? అయితే వినండి! అజ్ఞాన కాలంలో మర్యాదస్తులుగా ఉన్నవారు ఇస్లామ్‌లో కూడా మర్యాదస్తులే. కాకపోతే వారిలో ధర్మావగాహన ఉండాలి" అని ఆయన వివరించారు.

**30)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా చెప్పినట్లుగా హజ్రత్ సమురా (రజి) తెలియజేశారు : "ఈ రోజు రాత్రి నా దగ్గరకు (కలలో) ఇద్దరు దైవదూతలు (జిబ్రయీల్, మేకాయీల్- అలైహిముస్సలామ్) వచ్చారు. తరువాత ఆ ఇద్దరు దైవదూతలు నన్ను తీసుకుని బాగా పొడుగరి అయిన మహనీయుని వద్దకు వెళ్ళారు. ఆయన ఎంత పొడుగ్గా ఉన్నారంటే, ఆయన తలను నేను చూడలేని 'పరిస్థితి'. ఇంతకీ ఆయన మహనీయ ఇబ్రాహీమ్(అ) (అని తెలిసింది)".

**31)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) చెప్పగా ముజాహిద్ విన్నారు. ఆయన సమక్షంలో ప్రజలు దజ్జాల్ గురించి ప్రస్తావిస్తూ అతని నుదుటిపై 'కాఫిర్' అని లిఖించబడి ఉంటుంది. (లేదా) 'క-ఫ-ర' అని వ్రాసి ఉంటుంది అని చెప్పారు. అప్పుడు హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: నేను దైవప్రవక్త(స) నుండి ఈ హదీసును వినలేదు. అయితే ఆయన(స) ఒకసారి ఈ హదీసును వినిపించారు- ఇలా అన్నారు : "హజ్రత్ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) రూపురేఖల్ని మీరు తెలుసుకోదలిస్తే మీ సహచరుణ్ణి (అంటే ముహమ్మద్-సఅసం-ను) చూడవచ్చు. ఇకపోతే మహనీయ మూసా (అ) శరీరం చిక్కి ఉండేది, గోధుమ వర్ణం. ఒంటెపై స్వారీ అయి ఉన్నారు. ఆ ఒంటె పగ్గం ఖర్జూరపు ఆకులతో పేనబడింది. ఆ దృశ్యాన్ని నేను ఇప్పుడే చూస్తున్నట్లుగా ఉంది. ఆయన దైవస్తోత్రం చేస్తూ ఒక లోయలో దిగుతున్నారు."

**32)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారని మహనీయ అబూ హురైరా (రజి) తెలిపారు :"దైవప్రవక్త మహనీయ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ఎనభై ఏళ్ళ వయసులో బాడిస (బడిత)తో 'సున్నతీ' చేసు కున్నారు."[1]

**33)** అబ్దుర్రహ్మాన్ బిన్ ఇస్‌హాఖ్ కూడా అబుజ్జినాద్ ద్వారా ఈ హదీసును ఉటంకించారు. అజ్లాన్ కూడా అబూ హురైరా (రజి) నుండి దీనిని ఉటంకించారు. కాకపోతే పదాల ఒత్తులలో స్వల్పమైన వ్యత్యాసం ఉంది.

**34)** హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు: "మహనీయ ఇబ్రాహీమ్ (అలైహి స్సలామ్) మూడుసార్లు తప్ప ఎన్నడూ (తన పూర్తి జీవితకాలంలో) 'తౌరియా'[1] ప్రయోగించలేదు.

**35)** మహనీయ అబూహురైరా(రజి) తమతో చెప్పినట్లుగా ముహమ్మద్ బిన్ సీరీన్ తెలిపారు– అబూహురైరా (రజి) ఇలా చెప్పారు : దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) తన జీవితకాలంలో కేవలం మూడుసార్లు మాత్రమే అబద్ధం చెప్పారు. వాటిలో రెండు దైవప్రసన్నతను చూరగొనే దృష్టితో చెప్పినవి. ఒకటి: సంకేతప్రాయంగా (తౌరియాగా) చెప్పినది. అంటే ఒకటి 'నా ఒంట్లో బాగాలేదు' అని ఆయన చెప్పటం జరిగింది. రెండవది : 'ఈ పని వాటి పెద్దాయనే (పెద్ద విగ్రహమే) చేసి ఉంటాడు" అని అనటం. ఇంకొకటి ఏమిటంటే హజ్రత్ ఇబ్రాహీమ్(అ) ఒకసారి తన సతీమణి హజ్రత్ సారా(అలైహస్సలామ్)తో కలసి ఒక దౌర్జన్యపరుడైన చక్రవర్తి రాజ్యం మీదుగా ప్రయాణం చేస్తున్నారు. తన

---

32–1. ఎందుకంటే ఆ వయసులోనే ఆయనకు సున్నతీ (సున్తీ) చేసుకోమని దైవాజ్ఞ అయింది. ఆ సమయంలో ఆయన దగ్గర బహుశా సున్నతీ చేసే పరికరం (కత్తి) ఉండి ఉండదు. అందువల్ల దైవాజ్ఞా పాలనలో తాత్సారం జరగరాదన్న ఉద్దేశ్యంతో, తనకు అందు బాటులో ఉన్న బడితతోనే తన పురుషాంగం (శిష్నం)పైనున్న చర్మాన్ని స్వయంగా కత్తిరించుకున్నారు. అబూ యాలా ఉల్లేఖనంలో ఈ విషయం వివరంగా వచ్చింది.

34–1. 'తౌరియా' అంటే ఏదేని ఒక సంఘటనలో నిజాన్ని స్పష్టంగా ప్రకటించకుండా–కొన్ని పరమార్థాల దృష్ట్యా– ద్వంద్వార్థాలకు తావు ఉన్నట్లుగా చెప్పటం. విషయాన్ని విన్నవాడు దాని లోతులను తెలుసుకోవటంలో బోల్తా కొడతాడు. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో 'తౌరియా'ను ప్రయోగించటానికి షరీఅత్ అనుమతి ఇస్తుంది.

రాజ్యపరిధిలోకి ఒక వ్యక్తి వచ్చాడని, అతని వెంట ఒక ప్రపంచ సుందరి అయిన స్త్రీ ఉందని చక్రవర్తికి సమాచారం అందింది. చక్రవర్తి తన మనిషిని పంపి ఇబ్రాహీమ్(అ)ని పిలిపించాడు. "ఆమె ఎవరు? ఆమె నీకేమవుతుంది?" అని సారా(అ) గురించి వాకబు చేశాడు. 'ఆమె నా (ధార్మిక) సోదరి'[1] అని ఇబ్రాహీమ్ (అ) చెప్పారు. తరువాత ఆయన(అ) సారా (అ) దగ్గరకు వచ్చి,'చూడు సారా! ఇక్కడ నువ్వూ, నేను తప్ప విశ్వాసులెవరూ లేరు. ఇక్కడి చక్రవర్తి నీ గురించి దర్యాప్తు చేసినప్పుడు, నువ్వు (ధార్మికంగా) నా సోదరి అని చెప్పాను. కాబట్టి ఇప్పుడు నీవు నన్ను అబద్ధీకరించి ఇరకాటంలో పెట్టే మాట ఏదీ పలకవద్దు' అని సూచించారు. పిదప దుర్మార్గుడైన ఆ చక్రవర్తి సారా(అ)ను పిలిపించాడు. ఆమెగారు అతని దగ్గరకు వెళ్ళినప్పుడు, చక్రవర్తి దురుద్దేశ్యంతో ఆమె వైపు చేయి చాపాడు. అంతే. అతను పట్టుకోబడ్డాడు. "(అమ్మా! ఈ విపత్తు నుండి నాకు విముక్తిని వొసగమని) దైవాన్ని ప్రార్థించు. ఇకమీదట నేను నీకు ఎలాంటి కీడు కలిగించను" అని ప్రాధేయ పడ్డాడు. అందువల్ల ఆమె గారు అతని కొరకు ప్రార్థించారు. దాంతో అతనికి విముక్తి లభించింది. కాని అతడు రెండవసారి కూడా ఆమెను సమీపించబోయాడు. ఈసారి కూడా అలాగే పట్టుకోబడ్డాడు. మొదటిసారి కన్నా మరింత గట్టిగా పట్టుకోబడ్డాడు. అప్పుడు మరోసారి విన్నవించుకున్నాడు– "అమ్మా. నా కోసం దైవాన్ని ప్రార్థించు. ఇక ఎన్నడూ నేను నీ జోలికి రాను" అన్నాడు. సారా (అలైహస్సలామ్) దైవాన్ని ప్రార్థించారు. అతను వదలివేయబడ్డాడు. ఆ తర్వాత అతను తన సేవకుణ్ణి పిలిచి, "మీరు నా దగ్గరకు మానవ మాత్రుణ్ణి కాదు, తలబిరుసుతనం కల మానవాతీత శక్తి (జిన్ను)ని తెచ్చారు" అని గద్దించాడు. అక్కడి నుండి అతను నిష్క్రమిస్తూ, సారా (అ) సేవ కొరకు హాజిరా (అలైహస్సలామ్)ను– కానుకగా– ఇచ్చాడు. సారా(అ) తిరిగి వచ్చినప్పుడు మహనీయ ఇబ్రాహీమ్(అ) నమాజులో నిలబడి ఉన్నారు. చేత్తోనే– సంజ్ఞ ద్వారా– అడిగారు ఆమె క్షేమ సమాచారాన్ని. దానికి సమాధానంగా ఆమె ఇలా అన్నారు :"అల్లాహ్ ఆ అవిశ్వాసి (లేక) అవిధేయుని మోసాన్ని అతని

---

35–1. దుర్మార్గుడైన ఆ రాజు అందగత్తెలైన సామాన్యుల భార్యలను బలవంతంగా లాక్కుని వారి పట్ల దుర్వ్యవహారం చేసేవాడు. తల్లిని, తోబుట్టువుని మాత్రం వదిలేసేవాడు. అందుకే హజ్రత్ ఇబ్రాహీమ్(అ) సారా(అ)ను తన సోదరిగా చెప్పుకున్నారు. అంటే ధార్మికంగా ముస్లిం స్త్రీ పురుషులంతా సోదర సోదరీమణులే అన్న అర్థంలో అలా చెప్పారు.

ముఖం మీదే తిప్పికొట్టాడు. ఇదిగో, హాజిరాను సేవకురాలిగా నాకు ప్రదానం చేశాడు". అబూహురైరా (రజి) ఇలా అన్నారు: "ఓ ఆకాశనీటి సంతానమా![2] (అరబ్బు ప్రజలారా!) ఆ మహా తల్లి ఎవరో కాదు, మీ తల్లి (హాజిరా)యే."

**36)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) తొండను (ఊసరవెల్లిని కూడా) చంప మని ఆదేశించారని హజ్రత్ ఉమ్మె షరీక్(ర.అ) తెలిపారు. "అది ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్‌ను కాల్చడానికి ఉద్దేశించిన) అగ్నిని తన నోటితో ఊది రాజేసింది" అని ఆయన(స) చెప్పారు.

**37)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు : "వాస్తవానికి విశ్వసించిన వారికీ, తమ విశ్వాసాన్ని ఆత్మ ద్రోహం (జుల్మ్)తో కలుషితం చేయని వారికే శాంతి. వారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నారు" **(6: 82)** అనే ఆయత్ అవతరించినప్పుడు, 'దైవప్రవక్తా! మాలో తన ఆత్మకు అన్యాయం చేయని వాడె వడుంటాడు?' అని మేము సందేహపడ్డాము. దానికి సమాధానంగా ఆయన(స) ఇలా అన్నారు: "మీరు ఊహించుకుంటున్న విషయం కాదది. 'ఎవరయితే తమ విశ్వాసాన్ని జులుంతో కలుషితం చేసుకున్నారో...' అనే ఆయత్‌లోని జులుం అంటే షిర్క్ (బహు దైవోపాసన) అని అర్థం. ఏమిటి, మీరు మహనీయ లుక్మాన్ తన కుమా రునికి చేసిన ఉపదేశాన్ని వినలేదా? 'ఒరేయ్ అబ్బాయి! అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పించకు (షిర్క్ చేయకు). షిర్క్ చాలా పెద్ద అన్యాయం' అని ఆయన ఉపదేశిం చారు".

**38)** హజ్రత్ అబూహురైరా(రజి) కథనం : ఒకసారి ప్రవక్త మహనీయుల (సఅసమ్) వారి సేవలో మాంసం సమర్పించబడినప్పుడు, ఆయన (స) ఇలా అన్నారు: "అల్లాహ్ ప్రళయదినాన తొలి వారినీ, తుదివారినీ ఒక చదునైన, సువిశాల మైన మైదానంలో సమావేశపరుస్తాడు. ఆ సమీకరణ వైనం ఎలా ఉంటుందంటే, ప్రకటన చేసేవాడు తన మాటను అందరికీ వినిపించగలుగుతాడు. చూసేవాడు ఒకే సమయంలో అందరినీ చూడగలుగుతాడు. సూర్యుడు జనులకు చాలా సమీపంలో ఉంటాడు". తరువాత ఆయన(స) 'సిఫారసు' గురించి ప్రస్తావించారు–

35–2. 'ఆకాశ నీటి సంతానమా!' అని అరబ్బులనుద్దేశించి చెప్పటం గమనార్హం. ఆ రోజుల్లో అరబ్బులు తమ మనుగడకై పూర్తిగా ఆకాశం నుండి కురిసే వర్షపు నీటిపైనే ఆధార పడేవారు. బావులు, చెరువులు, ఇతర జలాశయాలు చాలా అరుదుగానే ఉండేవి. కాని ఇప్పుడు పరిస్థితులు మారాయి. అరబ్బు దేశాలలో మంచినీటి ఎద్దడి అన్న మాటే లేదు.

**“ప్రజలు మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) దగ్గరకు వచ్చి, ‘తమరు భూమండలంలో దైవ సందేశహరునిగా, దేవుని ప్రియ స్నేహితునిగా ఉన్నారు కదా. అందుకే తమరు మా గురించి ప్రభువు సన్నిధిలో సిఫారసు చేయండి’ అని విన్నవించుకుంటారు. అప్పుడు ఆయన గారికి తన అబద్ధాలు (తౌరియా) జ్ఞప్తికి వస్తాయి. అందువల్ల ‘ఈ రోజు నాకు నా గురించే చింత పట్టుకుంది. ఒక పని చేయండి. మీరు హజ్రత్ మూసా(అలైహిస్సలామ్) దగ్గరకెళ్ళండి’ అంటారు[1]– అబూ హురైరా (రజి)తోపాటు హజ్రత్ అనస్(రజి) కూడా ఈ హదీసును మహాప్రవక్త (సఅసమ్) నుండి ఉల్లేఖించారు.**

**39) హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఈ విధంగా ప్రవచించారు: “అల్లాహ్ ఇస్మాయీల్ తల్లి (హజ్రత్ హాజిరా)పై దయజూపుగాక! ఆమె గనక తొందరపడకుండా ఉంటే (అంటే జమ్‌జమ్ జలం పెల్లుబికిన స్థలం చుట్టూ గట్టు వేయకుండా ఉంటే) నేడు అదొక ప్రవహించే సెలయేరు అయి ఉండేది.”**

**వేరొక సనదు ప్రకారం–**

**కసీర్ బిన్ కసీర్ ఇలా అన్నారు: నేను మరియు ఉస్మాన్ బిన్ అబూ సులైమాన్– ఇద్దరం సయీద్ బిన్ జుబైర్ దగ్గర కూర్చుని ఉన్నాము. అంతలో ఇబ్నె జురైజ్ ఏమన్నారంటే, ‘ఇబ్నె అబ్బాస్(రజి) నాకు ఈ హదీసును ఈ విధంగా గాకుండా ఇలా వివరించి చెప్పారు– “ఇబ్రాహీమ్(అ) తన కుమారుడు ఇస్మాయీల్ (అ)ను, ఆయన తల్లి హజ్రత్ హాజిరా(అ)ను తీసుకుని మక్కా భూభాగం వైపునకు వచ్చారు. హజ్రత్ హాజిరా (అలైహస్సలాం) ఇస్మాయీల్(అ)కు పాలు త్రాగిస్తూ ఉన్నారు. ఆమె వద్ద ఒక పాత నీళ్ళ సంచి ఉంది”[1]**

---

38–1. తమ నాయకులు, పీర్లు, మత గురువులు ప్రళయదినం నాడు తమను కాపాడుకుంటారని ఊహాలోకాల్లో విహరిస్తున్న అమాయక ముస్లిములకు ఈ హదీసు మేల్కొలుపు కావాలి.

39–1. హజ్రత్ ఇబ్రాహీమ్(అ) ఒక సంచి నిండా త్రాగునీరును హాజిరా (అ)కు ఇచ్చి ఆమెను, పాలు త్రాగే తన పుత్రరత్నాన్ని నీరూ పచ్చికా లేని పర్వత ప్రాంతంలో– దేవుని భరోసాపై– వదలిపోయారు. ఆ నీరు కాస్తా అయిపోయింది. పసిపిల్లవాడు దాహంతో అల్లాడిపోతున్నాడు. తల్లడిల్లిన మనసుతో ఆ మహా తల్లి నీళ్ళ అన్వేషణలో బయలుదేరింది. సఫా– మర్వా కొండల మధ్య ఏడుసార్లు పరుగులు తీసింది. కాని

**40) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : మహిళలలో నడుముకు పట్టా (నడికట్టు) కట్టుకునే సంప్రదాయం హజ్రత్ ఇస్మాయీల్(అలైహిస్సలామ్) తల్లి (హాజిరా– అలైహస్సలామ్) నుండి కొనసాగుతూ వస్తోంది. అందరికన్నా ముందు ఆమె నడుముకు పట్టా కట్టుకోవటంలోని ముఖ్యఉద్దేశం సారా (అలైహస్సలామ్)కు తన ఆచూకీ తెలియకూడదన్నదే.[1] తరువాత ఆమెనూ, ఆమె కుమారుడు ఇస్మాయీల్ (అ)ను తన వెంటబెట్టుకుని మక్కాకు చేరుకున్నారు ఇబ్రాహీమ్(అ). ఆ సమయంలో ఆమె ఇస్మాయీల్(అ)కు పాలుపడుతుండగానే, ఇబ్రాహీమ్ ఆ తల్లీకొడుకులిద్దరినీ కాబాకు సమీపంలో ఒక పెద్ద వృక్షం వద్ద కూర్చోబెట్టారు. ఆ స్థలంలో ఇప్పుడు జమ్‌జమ్ జలం ఉంది. అది కాబా గృహానికి ఎగువ వైపున ఉంది. ఆ రోజుల్లో మక్కాలో మనుషులెవరూ లేరు. అది నిర్జన ప్రదేశం– అందువల్ల అక్కడ నీరు కూడా లేదు. ఇబ్రాహీమ్(అ) వారిద్దరినీ అక్కడే వదలి పెట్టారు. వారి కోసం తోలు సంచిలో కొన్ని ఖర్జూరాలు, నీళ్ళ తిత్తిలో త్రాగునీరు మాత్రం సమ కూర్చి, తన నివాస గృహానికి బయలుదేరారు ఇబ్రాహీమ్(అ). అప్పుడు ఇస్మాయీల్ (అ) తల్లి ఆయన వెంటపడ్డారు. 'ఓ ఇబ్రాహీమ్! నీరూ పచ్చికా లేని నిర్జన ప్రదేశంలో మమ్మల్ని వదలి వెళ్ళిపోతున్నారా?' అని అడిగారు. ఈ ప్రశ్న మాటిమాటికీ వేశారు. కాని ఇబ్రాహీమ్ (అ) ఆమె వైపు చూడనయినా లేదు. చివరకు ఆమె, 'ఏమిటి, ఈ మేరకు మీకు దైవాజ్ఞ అయిందా?' అని అడిగారు. దానికి ఇబ్రాహీమ్ (అ) "అవున"న్నారు. 'అలాగైతే అల్లాహ్‌యే మా రక్షకుడుగా ఉంటాడు. ఆయన మమ్మల్ని అంతమొందించడు' అని పలికి తిరిగి వచ్చేసిందా మహా తల్లి.**

**ఇబ్రాహీమ్ (అ) తిరుగు ప్రయాణం చేస్తున్నారు. సనియ్యా కొండల వరకూ చేరుకున్నారు. అంటే (భార్యకు) కనిపించనంత దూరం వెళ్ళిపోయారు. అప్పుడు**

---

ఎక్కడా నీటి జాడ లేదు. ఎట్టకేలకు హజ్రత్ జిబ్రయీల్(అ) దివినుండి భువికి దిగి వచ్చి, తన రెక్కతో నేలపై కొట్టగానే జమ్‌జమ్ నీటి ఊట చిమ్ముకొచ్చింది. హజ్రత్ హాజిరా(ర) ఆ ఊట చుట్టూ గట్టు కట్టారు. అప్పుడది ఒక చిన్న కోనేరులా తయారయింది. ఆనాటి నుంచీ నేటివరకూ ఆ నీటిబుగ్గ నుండి నీరు పెల్లుబుకుతూనే ఉంది. దానినే జమ్‌జమ్ జలంగా వ్యవహరిస్తున్నారు. అది ప్రపంచంలోని కోట్లాది మందికి సరఫరా అవుతోంది. అది శుభవంతమైన జలం. ఎవరు ఏ ఉద్దేశ్యంతో ఈ జలాన్ని సేవిస్తారో దానిని అల్లాహ్ నెరవేరుస్తాడని హదీసు ద్వారా తెలుస్తోంది.

**గాని ఆయన వెనక్కి తిరిగి చూడలేదు. ప్రస్తుతం పవిత్ర కాబా గృహం ఉన్న స్థలం వైపునకు దృష్టిని సారించారు. తరువాత రెండు చేతులెత్తి ఆర్ద్రంగా వేడుకున్నారు: "నా ప్రభూ! నేను నా ఆలుబిడ్డలను నీరూ పచ్చికా లేని లోయలో, నీ పవిత్ర గృహం వద్ద వదలి వచ్చాను. ప్రభూ! వారు ఇక్కడ నమాజును స్థాపించాలని నేనిలా చేశాను. కనుక నీవు ప్రజల హృదయాలను ఆసక్తితో వారి వైపునకు మరలేలా చెయ్యి. తినటానికి వారికి పండ్లు ప్రసాదించు. బహుశా వారు కృతజ్ఞులవుతారేమో!"**

**ఇటు ఇస్మాయీల్(అ) తల్లి ఆ పిల్లవానికి పాలు తాపుతూ, తాను స్వయంగా నీరు త్రాగసాగారు. నీళ్ళ తిత్తిలోని నీరంతా అయిపోయాక ఆమె దాహంతోనే గడప సాగారు. ఆమె ముద్దు బిడ్డడు కూడా దాహంతో ఉన్నాడు. దాహంతో ఆ పసివాడు అల్లాడిపోవటాన్ని, నేలపై అటూ ఇటూ దొర్లటాన్ని చూసి ఆ తల్లి తట్టుకోలేక పోయింది. అక్కడి నుండి నిష్క్రమించింది - నిస్సహాయ స్థితిలో కన్నకొడుకును చూడలేక. 'సఫా' కొండ ఆ స్థలానికి దగ్గరలోనే ఉంది. (నీళ్ళ అన్వేషణలో) ఆ కొండపైకి ఎక్కింది. అక్కడి నుండి లోయ వైపు తిరిగి ఎక్కడయినా మనుషులు కనిపిస్తారేమోనని చూసింది. కాని కనుచూపు మేరలో ఎక్కడా మానవ మాత్రుడు కనిపించలేదు. ఆమె సఫా కొండపైనుంచి దిగి లోయలోనికి తిరిగి వచ్చింది. తన**

---

40-1. సుదీర్ఘమయిన ఈ హదీసుల్లో పలు ధార్మిక పరమార్థాలు అంతర్లీనమై ఉన్నాయి. హదీసు మొదట్లో హజ్రత్ హాజిరా (అలైహస్సలామ్) నడుము పట్టా (వస్త్రం) కట్టుకున్న ప్రస్తావన వచ్చింది. అలా కట్టుకోవడానికి కారణం తాను వేగంగా నడవాలన్నదే. మరికొందరు ఏమని వ్యాఖ్యానించారంటే, ఆ నడుము బట్ట ద్వారా హాజిరా (అ) తన అడుగుజాడలను చెరిపేసుకుంటూ వెళ్ళారు. తన ఆచూకీ సారా(అ)కు తెలియకూడదని ఆమె అనుకున్నారు.

ఇంతకీ జరిగిందేమిటంటే, హజ్రత్ సారా(అ) సౌశీల్యాన్ని, పాతివ్రత్యాన్ని చూసి ఈజిప్టు రాజు ముగ్ధుడయ్యాడు. ఆ కుటుంబ సేవ కోసం రాజవంశానికి చెందిన హాజిరా (అ)ను సేవకురాలిగా- కానుకగా-ప్రదానం చేశాడు. హజ్రత్ ఇబ్రాహీమ్(అ) ఆమెను తన దాంపత్య జీవితంలోకి తీసుకున్నారు. వివాహమైన కొంతకాలం తర్వాత ఆమె గర్భవతి అయింది. దాంతో హజ్రత్ సారా(అ)హాజిరా(అ)పై ఈర్ష్య పెంచుకున్నారు. ఎందుకంటే అప్పటివరకు సారా(అ)కు సంతాన భాగ్యం కలగలేదు. హాజిరా(అ) ప్రసవించిన తరువాత భార్యలిద్దరి మధ్యన అంతరాల అగాథాలు మరింతగా పెరిగిపోయాయి. హాజిరా మనసు కీడు శంకించింది. అందుకే ఆమె ప్రయాణానికి సిద్ధమయ్యారు.

అంగ వస్త్రాన్ని కొంచెం పైకి లేపుకుంది (పరుగెత్తేటప్పుడు అది కాళ్ళలో చిక్కుబడ కూడదని), దిక్కుతోచని స్థితిలో పరుగులు తీస్తూ 'మర్వా' కొండపైకి వచ్చింది. ఆ కొండపై నుంచి చూసినా ఏ ఒక్క మనిషీ కానరాలేదు.

మహాప్రవక్త(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు: "(సఫా – మర్వా కొండల మధ్య) జనులు పరుగెత్తడం ఈ కారణంగానే సమ్మతించి ఆమోదించటం జరిగింది."

ఆ విధంగా ఆమె ఆ రెండు కొండల మధ్య ఏడుసార్లు పరుగెత్తింది. (ఏడవ సారి) ఆమె మర్వా కొండపైకెక్కినప్పుడు, ఆమెకు ఒక పిలుపు వినిపించింది. 'నిశ్శబ్దం' అని తనలోతానే చెప్పుకోసాగింది. కాని రెండవసారి కూడా పిలుపు వినవస్తే అప్పుడు అటువైపు చెవియొగ్గి వినసాగింది. ఇప్పుడూ అదే పిలుపు! 'సరేలే. నీ పిలుపు విన్నాను. నీవు నాకేదన్నా సహాయం చెయ్యగలిగితే చెయ్యి' అని చెప్పింది. కాని అద్భుతం! ఇప్పుడు జమ్‌జమ్ బావి ఉన్నచోట ఒక దైవదూత ప్రత్యక్షమవటం ఆమె గమనించింది. ఆ దూత తన కాలి మడమను నేలలో పాతాడు లేదా తన రెక్కను నేలపై కొట్టాడు (అని చెప్పారు). అంతే, ఆ స్థలంలో నీరు పెల్లుబికింది. హజ్రత్ హాజిరా (అ) దానిని సరస్సులా రూపొందించారు. అంటే నీరు అటూఇటూ పోకుండా తన చేత్తో గట్టు కట్టారు. తన దోసిలితో నీళ్ళ తిత్తిలో నీరు నింపుకున్నారు. నీళ్ళ తిత్తి నిండగానే ఆ నీరు మరోసారి పెల్లుబికింది.

ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు : "అల్లాహ్ ఇస్మాయీల్(అ) మాతృశ్రీపై కరుణించుగాక! ఆమె గనక జమ్‌జమ్ నీటికి గట్టు కట్టకుండా వదలి ఉంటే, దోసిలితో నీళ్ళ తిత్తిని నింప కుండా ఉంటే జమ్‌జమ్ జలం ఓ ప్రవహించే సెలయేరు రూపాన్ని సంతరించు కునేది."

హాజిరా (అలైహస్సలామ్) స్వయంగా ఆ నీటిని త్రాగటమేకాక తన పుత్ర రత్నానికి కూడా త్రాపారు. తరువాత దైవదూత ఆమెను ఓదారుస్తూ, "నిశ్చింతగా ఉండండి. ఎట్టి పరిస్థితిలోనూ మీకు భంగపాటు జరగదు. ఎందుకంటే ఇక్కడే దేవుని ఆరాధనా గృహం ఉంటుంది. దానిని ఈ పిల్లవాడు, ఇతని తండ్రి కలసి నిర్మిస్తారు. అల్లాహ్ (సజ్జనుడైన) తన దాసులను వృథా గావించడు" అని పలికాడు.

**ప్రస్తుతం బైతుల్లాహ్ ఉన్న స్థలం పూర్వం ఒక గుట్ట మాదిరిగా నేల ఎత్తుగా ఉండేది. వరదలు వచ్చినప్పుడు దానికి కుడివైపున, ఎడమ వైపున భూమి కోతకు గురయ్యేది. ఈ విధంగా రేయింబవళ్ళు గడవసాగాయి. చివరకు జుర్హుమ్ తెగకు చెందిన ఒక బిడారు అటువైపు నుండి సాగిపోయింది. లేదా జుర్హుమ్ తెగకు చెందిన కొంతమంది మక్కా మెరక ప్రాంతం నుండి సాగిపోతూ, మక్కా పల్లపు ప్రదేశంలో విడిది చేశారు. తాము విడిది చేసిన స్థలానికి దగ్గరలోనే కొన్ని పక్షులు ఎగరటం వారు గమనించి, 'ఇవి జలాశయంపైన ఎగిరే పక్షులు కదా!' అని చెప్పు కున్నారు. నిజానికి తాము అనేకసార్లు ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించారు. కాని నీటి జాడ అన్నదే ఎక్కడా లేదు. చివరకు వారు తమ మనుషులు ఒకరిద్దరిని పంపి విషయాన్ని కనుక్కొని రమ్మన్నారు. ఆ మనుషులు తిరిగి వచ్చి అక్కడ నీరు ఉన్న సంగతి నిజమేనని చెప్పారు. ఈ సంగతి తెలుసుకుని, వారంతా ఆ లోయ వద్దకు చేరుకున్నారు. ఉల్లేఖకుని ప్రకారం ఆ సమయంలో ఇస్మాయీల్(అ) తల్లి ఆ నీటి కొలను వద్దనే కూర్చుని ఉన్నారు. వారంతా ఆమెతో, 'ఈ కొలను సమీపంలో నివసించడానికి మీరు మాకు అనుమతి ఇస్తారా?' అని అడిగితే, "అనుమతి ఉంటుంది. అయితే ఈ జలాశయంపై మీకు యాజమాన్యపు హక్కు మాత్రం ఉండదు" అని ఆమె చాలా స్పష్టంగా చెప్పారు. ఆ షరతుకు వారంతా ఒప్పుకున్నారు[2].**

**ఇబ్నె అబ్బాస్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు: "ఇస్మాయీల్ (అ) తల్లికి పొరుగువారు లభించారు. మనుషుల ఉనికి వల్ల ఆమెగారి మనసు కుదుటపడింది. ఆ ప్రయాణీకులు అక్కడ మకాం వేయటమేగాకుండా తమ తెగ వారందరినీ అక్కడకు పిలుచుకున్నారు. అందరూ కలసి ఆ ప్రదేశంలో నివసించసాగారు. ఆ విధంగా జుర్హుమ్ తెగకు చెందిన ఎన్నో కుటుంబాలు అక్కడ స్థిరపడ్డాయి. ఆ పసివాడు (జుర్హుమ్ తెగవారి పిల్లల**

---

40-2. 'జుర్హుమ్' తెగ యమన్ దేశానికి చెందినది. కటిక కొండ ప్రాంతంలో పెల్లుబికిన నీటి ఊటను (జమ్‌జమ్ జలాన్ని) చూసి జుర్హుమ్ తెగవారు అమితంగా ప్రభావితులై అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. జమ్‌జమ్ జలంపై యాజమాన్యపు హక్కు తనకే ఉంటుందని హాజిరా(అ) పెట్టిన షరతును కూడా వారు మనస్ఫూర్తిగా అంగీకరించారు. యుక్త వయసుకు చేరిన ఇస్మాయీల్(అ)ను జుర్హుమ్ తెగవారు అల్లుడుగా చేసు కున్నారు.

మధ్యన) పెరిగి పెద్దవాడయ్యాడు. వారి ద్వారా అరబీ భాష నేర్చుకున్నాడు. యుక్త వయసులో ఇస్మాయీల్(అ) ఎంత అందంగా ఉండేవారంటే, అందరూ ఆయన్ని అలా చూస్తుండిపోయేవారు. అందుకే జుర్‌హుమ్ తెగవారు ఇస్మాయీల్ (అ)కు తమ తెగకు చెందిన ఒక యువతినిచ్చి వివాహం జరిపించారు. తరువాత కొన్నాళ్ళకు ఇస్మాయీల్(అ) తల్లి (హాజిరా– అలైహస్సలామ్) చనిపోయారు. వివాహం జరిగిన తరువాత ఒకసారి ఇబ్రాహీమ్ (అ) తన కుటుంబీకుల్ని చూడటానికి మక్కా వచ్చారు. ఆ సమయంలో ఇస్మాయీల్(అ) ఇంట్లో లేరు. అందువల్ల ఇబ్రాహీమ్(అ) తన కుమారుని స్థితిగతుల గురించి ఆయన భార్యను విచారించారు. జీవనోపాధి అన్వేషణలో ఆయన బయటికి వెళ్ళి ఉన్నారని ఆమె చెప్పింది. మీ ఆర్థిక పరిస్థితులెలా ఉన్నాయమ్మా! అని ఇబ్రాహీమ్(అ) అడిగిన దానికి ఆమె, 'ఏం చెప్పమంటారు? చాలా కష్టాల్లో ఉన్నాము. రోజులు చాలా గడ్డుగా గడుస్తున్నాయి' అని సమాధానమిచ్చింది. ఆ విధంగా ఆమె భర్తను నిందిస్తూ మాట్లాడింది. 'అమ్మా! నీ భర్త ఇంటికి వచ్చినప్పుడు నా సలామ్ చెప్పు. తన తలుపు చట్రాన్ని (చౌకట్టు) మార్చమని కూడా ఆయనతో చెప్పు' అని సూచించి ఇబ్రాహీమ్(అ) వెళ్ళిపోయారు. ఇస్మాయీల్(అ) ఇంటికి రాగానే, అనిర్వచనీయమైన ఆత్మీయత ఆయనకు సోకింది. "ఎవరయినా మన ఇంటికి వచ్చారా?" అని ఆయన అడిగితే, 'అవును. ఒక వయోవృద్ధుడు వచ్చారు. ఆయన రూపురేఖలు ఈఈ విధంగా ఉంటాయి. ఆయన మీ గురించి వాకబు చేశారు. మీరు బయటికి వెళ్ళి ఉన్నారని చెప్పాను. మీ రోజులు ఎలా గడుస్తున్నాయని ప్రశ్నించారు. చాలా గడ్డుగా గడుస్తున్నాయని నేను చెప్పాను' అని ఆయన భార్య వివరించింది. "ఆయన గారు మనకేదైనా ఉపదేశించారా?" అని ఇస్మాయీల్ అడిగితే, 'చేశారు. మీకు సలామ్ చెప్పమన్నారు. మీరు మీ తలుపు చౌకట్టు (చట్రాన్ని) మార్చమని చెప్పమన్నారు' అని చెప్పిందామె. దానికి ఇస్మాయీల్ (అ), "ఆ వచ్చిన పెద్దాయన ఎవరో కాదు, ఆయన నా కన్నతండ్రి ఇబ్రాహీమ్(అ). నీకు విడాకులివ్వవలసిందిగా ఆయన– సంకేతప్రాయంగా– ఆదేశించి వెళ్లారు. ఇక నీవు నీ పుట్టింటికి పోవచ్చు" అని చెప్పారు. తరువాత ఇస్మాయీల్(అ) ఆమెకు విడాకులిచ్చి, జుర్‌హుమ్ తెగకే చెందిన మరో మహిళను మనువాడారు.

దేవునికి సమ్మతం కానంతవరకూ హజ్రత్ ఇబ్రాహీమ్(అ) అక్కడికి రాలేదు.

కొన్నాళ్ళ తరువాత మరోసారి ఆయన మక్కాకు వచ్చారు. ఆ సమయంలో కూడా ఇస్మాయీల్(అ) ఇంట్లో లేరు. ఆయన ఇస్మాయీల్ భార్యను పలకరించారు. ఇస్మాయీల్ ఎక్కడికెళ్ళారు? అన్న ప్రశ్నకు 'జీవనోపాధిని అన్వేషించడానికి బయటికెళ్ళి ఉన్నార'ని ఆమె జవాబిచ్చింది. "మీరిద్దరూ ఎలా ఉన్నారమ్మా?" అన్న కుశల ప్రశ్నలతోపాటు మీ జరుగుబాటు ఎలా ఉంది? ఆర్థిక పరిస్థితులెలా ఉన్నాయి? లాంటి ప్రశ్నలు కూడా వేశారు ఇబ్రాహీమ్(అ). దానికామె, 'మేమిక్కడ సంతోషంగా ఉన్నాము. మాకు పుష్కలంగా ఉపాధి లభ్యమవుతోంది' అంటూ దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంది. "ఇంతకీ మీరు తినే ఆహార పదార్థమేది?" అని ఇబ్రాహీమ్ (అ) అడిగితే, 'మాంసం తింటున్నామ'ని ఆమె చెప్పింది. "ఏం త్రాగు తున్నారు?" అన్న ప్రశకు 'నీరు' అని జవాబిచ్చింది. అప్పుడు ఇబ్రాహీమ్(అ) "దేవా! వీరి మాంసంలో, త్రాగునీరులో శుభం వొసగు" అని దుఆ చేశారు.

మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా చెప్పారు : 'ఆ రోజుల్లో వారికి ఆహారంగా ధాన్యం లభించేది కాదు. ఒకవేళ ఆహార ధాన్యాలు కూడా వారి భోజన సామగ్రిగా ఉండి ఉంటే ఆయన(ర) అందులో కూడా శుభం కొరకు ప్రార్థించి ఉండేవారు.

కేవలం మాంసాన్ని, నీరును తమ శాశ్వత ఆహారంగా సరిపుచ్చుకోవటం మక్కా తప్ప వేరితర భూభాగాలలోని వారికి అచ్చి రాలేదు. ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) వెళుతూ వెళుతూ "అమ్మా! నీ భర్త గనక ఇంటికి వస్తే, అతనికి నా సలామ్ చెప్పు. అతను తన తలుపు చౌకట్టును యథాస్థానంలో ఉండనివ్వమని చెప్పు" [3] అని అన్నారు.

ఇస్మాయీల్(అలైహిస్సలామ్) ఇంటికి రాగానే, "ఇక్కడికి ఎవరయినా వచ్చారా?" అని అడిగారు తన భార్యను. దానికామె, 'అవునండి! వయోవృద్ధుడు, సంస్కారం ఉట్టిపడేలా ఉన్న ఒక పెద్ద మనిషి వచ్చివెళ్ళారు' అంటూ ఇంటికి వచ్చిన ఆ పెద్ద మనిషిని పొగిడింది. ఆయన గారు మీ గురించి కూడా ఆరా తీశారు. మీరు

---

40-3. ఇస్మాయీల్(అ)ను చూసిపోవడానికి రెండుసార్లు వచ్చిన ఇబ్రాహీమ్(అ) తన కొడుకు ఇంటికి వచ్చేవరకూ ఎందుకు నిరీక్షించలేదు? అన్న సందేహం కలగవచ్చు. బహుశా తన భార్య సారా(అ) పెట్టిన గడువు ముగిసేలోగా ఆయన తిరిగి వెళ్ళవలసి ఉంది. అందుకే మరింత ఎక్కువ సమయం అక్కడ వేచి ఉండలేకపోయారేమో!

బయటికి వెళ్ళి ఉన్నారని నేను చెప్పాను. మీ జరుగుబాటు ఎలా ఉంది? అని ఆయన అడిగితే, చాలా బాగుంది. మేము చాలా సంతోషంగా ఉన్నామని చెప్పాను. "ఆయన నీకేమైనా సూచించారా?" అన్న ఇస్మాయీల్ (అ) ప్రశ్నకు, 'అవును. ఆయన మీకు సలామ్ చెప్పమన్నారు. తన తలుపు చౌకట్టును యధాతథంగా ఉండనివ్వమని ఆజ్ఞాపించారు' అని జవాబిచ్చిందామె. దానికి ఇస్మాయీల్(అ), "ఆయన ఎవరో కాదు, నా తండ్రి. 'చౌకట్టు' అంటే నువ్వే. నిన్ను నా ఇల్లాలిగా ఉండనివ్వమని ఆయన ఆదేశించారు" అని వివరించారు.

పిదప అల్లాహ్‌కు సమ్మతమైనంత కాలం గడిచాక మహనీయ ఇబ్రాహీమ్(అ) వారి దగ్గరకు వచ్చారు. ఆ సమయంలో ఇస్మాయీల్(అ) జమ్‌జమ్ జలనిధి సమీపంలోని ఒక పెద్ద వృక్షం నీడలో (ఇబ్రాహీమ్ తన ఆలుబిడ్డల్ని అక్కడే వదలి వెళ్ళారు) తన బాణాలు తయారు చేసుకుంటున్నారు. తండ్రి ఇబ్రాహీమ్(అ)ను చూడగానే ఇస్మాయీల్(అ) లేచి నిలబడ్డారు. ఒక తండ్రి తన కొడుకు పట్ల ఎలా వాత్సల్యాన్ని చూపుతాడో, ఒక కొడుకు తన తండ్రి యెడల ఎలా గౌరవ మర్యాదలు కనబరుస్తాడో అలాగే వారిద్దరూ – పరస్పరం– వ్యవహరించారు. కుశల ప్రశ్నల అనంతరం ఇబ్రాహీమ్(అ) తన కుమారునితో, "ఇస్మాయీల్! అల్లాహ్ నాకు ఒక విషయమై ఆజ్ఞాపించాడు" అని అన్నారు. దానికి ఇస్మాయీల్ 'మీ ప్రభువు మీకిచ్చిన ఆజ్ఞను తప్పక శిరసావహించండి' అని పలికారు. "మరి ఈ విషయంలో నీవు కూడా నాకు తోడ్పడగలవా?" అని తండ్రి ప్రశ్నించగా, 'అవశ్యంగా తోడ్పడతాన'ని తనయుడు సమాధానమిచ్చాడు. అప్పుడు ఇబ్రాహీమ్(అ) ఇలా అన్నారు : "ఇక్కడే దేవుని ఓ (ఆరాధనా) గృహాన్ని నిర్మించాలన్నది దైవాజ్ఞ". ఆయన ఒక ఎత్తయిన స్థలం వైపు సంజ్ఞ చేస్తూ "దీనికి నలువైపులా!" అన్నారు. అప్పుడు వారిద్దరూ బైతుల్లాహ్ పునాదిపై కట్టడ నిర్మాణం ప్రారంభించారు. ఇస్మాయీల్(అ) రాళ్ళు తెచ్చి అందిస్తూ ఉంటే, ఇబ్రాహీమ్(అ) గోడల్ని లేపేవారు. గోడలు ఎత్తుగా నిర్మిత మయ్యాక ఇస్మాయీల్ ఒక రాయిని తెచ్చి, తండ్రికి ఇచ్చారు. అప్పుడు ఇబ్రాహీమ్(అ) ఆ రాయిపై నిలబడి నిర్మాణ పనిని కొనసాగించారు. ఇస్మాయీల్(అ) రాయిని అందిస్తూ ఉంటే... వారిద్దరూ కలిసి ఇలా ప్రార్థించేవారు : "రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అంతస్సమీవుల్ అలీమ్" (ఓ మా ప్రభూ! మా ఈ సేవను నీవు దయతో స్వీకరించు. నీవు అందరి మొరలు ఆలకించేవాడవు. అన్నీ తెలిసిన

వాడవు). వారిద్దరూ కాబా గృహం నలువైపులా తిరిగి గోడల్ని నిర్మిస్తూ ఈ దుఆ చేశారు. "ఓ మా ప్రభూ! మా ఈ సేవను దయతో ఆమోదించు. నిశ్చయంగా నీవు అందరి మొరలు ఆలకించేవాడవు, సర్వజ్ఞానివి."

**41)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం : దైవప్రవక్త హ్రజత్ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్)కి- ఆయన సతీమణి (హ్రజత్ సారా- అలైహస్సలామ్)కి మధ్యన జరగవలసిన గొడవ జరిగినప్పుడు, ఆయన ఇస్మాయీల్‌ని, ఇస్మాయీల్ తల్లి (హాజిరా- అ)ని తీసుకుని బయలుదేరారు. వారి వెంట ఒక నీళ్ళ తిత్తి ఉంది. ఇస్మాయీల్ తల్లి ఆ తిత్తిలోని నీటిని త్రాగుతూ, తన పసికందుకు పాలు త్రాపించేవారు. మహనీయ ఇబ్రాహీమ్(అ) మక్కా చేరుకున్నప్పుడు, ఒక పెద్ద వృక్షం వద్ద వారిద్దరినీ విడిచి, తన ఇంటి వైపు తిరుగు ముఖం పట్టారు. ఇస్మాయీల్ తల్లి ఆయన వెనకే నడిచి వచ్చింది. 'మఖామె కదా'కు చేరుకోగానే తన భర్తను ఎలుగెత్తి పిలుస్తూ, 'ఓ ఇబ్రాహీమ్! మీరు మమ్మల్ని ఎవరికి అప్పగించి వెళుతున్నారు?' అని ప్రశ్నించారు. "అల్లాహ్‌కు" అని ఆయన క్లుప్తంగా జవాబిచ్చారు. దానికి ఆమె, 'అలాగైతే ఫరవాలేదు. అల్లాహ్ సంరక్షణ పట్ల నేను సంతోషంగా ఉన్నాను" అని పలికారు.

తరువాత హ్రజత్ హాజిరా (అ) తన విడిది స్థలానికి తిరిగి వచ్చారు. తన దగ్గర ఉన్న తిత్తిలోని నీరు త్రాగుతూ, తన పిల్లవానికి పాలు త్రాపేవారు. నీరు అయిపోయిన తరువాత పరిసరాలలో అన్వేషణ సాగించాలన్న ఆలోచన వచ్చింది. బహుశా ఎవరయినా మానవమాత్రుడు కనిపిస్తాడేమోనని ఊహించారామె. ఉల్లేఖకులు ఇలా అంటున్నారు : ఈ ఆలోచన రాగానే ఆమె 'సఫా' పర్వతంపైకెక్కి నలువైపులా దృష్టిని సారించారు. కాని ఎక్కడా మనిషన్నవాడు కనిపించలేదు. అక్కడి నుండి దిగి లోయలోనికి వచ్చారు. తల్లడిల్లిన మనస్సుతో 'మర్వా' గుట్ట వరకూ పరుగెత్తుకుని వచ్చారు. ఈ విధంగా ఆ రెండు పర్వతాల మధ్యన అనేక చక్కర్లు కొట్టారు. ఆ తరువాత పిల్లవాడి పరిస్థితి ఎలా ఉందో చూసుకుందామని తిరిగి వచ్చారు. ఆ పిల్లవాడు మృత్యువుతో పోరాటం సాగిస్తున్నట్లు ఉన్నాడు. ఆ పరిస్థితిని చూసి ఆమె ఓర్చుకోలేక, మరోసారి 'సఫా' పర్వతం పైకెక్కారు. నలువైపులా చూశారు, ఎవరయినా ఒక మనిషి కానవస్తాడేమోనన్న ఆలోచనతో. కాని ఎవరూ కానరాలేదు. ఈ విధంగా హ్రజత్ హాజిరా(అ) ఏడు ప్రదక్షిణలు చేశారు. అంతలోనే మరోసారి ఆలోచన, కన్నకొడుకు ఎలా ఉన్నాడోనని. సరిగ్గా అప్పుడామెకు ఒక

శబ్దం వినిపించింది. ఆమె అటువైపు తిరిగి, 'నీ దగ్గర మేలు చేసే గుణమే ఉంటే నాకు సహాయపడు' అని పలికారు కలత చెందిన మనసుతో. అక్కడ జిబ్రయీల్(అ) ఉన్నారు. ఆయన తన కాలి మడమతో నేల త్రవ్వినట్లుగా సంజ్ఞ చేశారు.

ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు : ఈ చర్య ఫలితంగా నేలలోనుంచి నీరు చిమ్ముకుని వచ్చింది. (ఆ నీరు ఎక్కడ ఇంకిపోతుందోనని) ఇస్మాయీల్ తల్లి భయపడ్డారు. తరువాత ఆమె నేలను త్రవ్వసాగారు. ఉల్లేఖకుని ప్రకారం అబుల్ ఖాసిమ్(సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ఇలా అన్నారు : "ఆమె గనక ఆ నీటిని దాని మానాన వదలివేసి ఉంటే, ఆ నీరు నేలపై ప్రవహిస్తూనే ఉండేది". మొత్తానికి హజ్రత్ హాజిరా (అ) జమ్‌జమ్ జలాన్ని సేవిస్తూ, తన పిల్లవానికి పాలిస్తూ గడిపారు.

ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : ఆ తరువాత జుర్‌హుమ్ తెగకు చెందిన కొంతమంది ఆ పర్వతలోయ పల్లపు ప్రదేశం మీదుగా సాగిపోయారు. అక్కడ వారికి కొన్ని పిట్టల గుంపు ఆకాశంలో ఎగురుతున్నట్లు కనిపించింది. అది వారికి ఆనవాయితీకి విరుద్ధంగా అనిపించింది. 'పక్షులు సాధారణంగా జలాశయాల వద్దనే ఇలా ఎగురుతుంటాయి' అని వారు పరస్పరం చెప్పుకుని, నిజనిర్ధారణ కోసం ఒక మనిషిని అక్కడికి పంపారు. అతను వెళ్ళి చూస్తే నిజంగానే అక్కడ ఒక జలనిధి కనిపించింది. అతను తిరిగి వచ్చి ఆ తెగవారికి సమాచారం అందజేశాక, వారంతా కలసి అక్కడికి వెళ్ళారు. 'ఓ ఉమ్మె ఇస్మాయీల్! మీరు మమ్మల్ని కూడా మీతోపాటే ఉండనిస్తారా? (లేదా ఇలా అన్నారు) మేమిక్కడ నివాసం ఏర్పరచుకోవడానికి అనుమతినిస్తారా?'

తరువాత ఆమె కుమారుడు ఇస్మాయీల్(అ) యుక్త వయసుకు చేరాక జుర్‌హుమ్ తెగ వారి అమ్మాయితో ఆయన వివాహం జరిగింది. ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : కొన్నాళ్ళ తర్వాత ఇబ్రాహీమ్(అ)కి తన ఆలుబిడ్డల్ని చూసి రావా లన్న ఆలోచన కలిగింది. నేను మక్కాలో విడిచి వచ్చిన వారి యోగక్షేమాలను విచారించడానికి వెళుతున్నానని తన భార్య (సారా– అలైహస్సలామ్)తో చెప్పారు. ఇబ్రాహీమ్(అ) మక్కా చేరుకుని, సలామ్ చేసి, 'ఇస్మాయీల్ ఎక్కడున్నాడు?' అని అడిగారు. 'వేటకెళ్ళార'ని ఇస్మాయీల్ భార్య చెప్పింది. అతను ఇంటికి వచ్చినప్పుడు తలుపు చౌకట్టును మార్చమని అతనితో చెప్పు అని ఆయన సూచించారు. ఇస్మా

యీల్ ఇంటికి రాగానే జరిగినదంతా వివరించి చెప్పిందామె. "ఆ చౌకట్టు నువ్వే (నీకు విడాకులివ్వమని ఇబ్రాహీమ్-అ సంకేతప్రాయంగా తెలిపారు). కాబట్టి నీవు నీ పుట్టింటికి వెళ్ళిపో" అని చెప్పారు ఇస్మాయీల్(అ).

కొంతకాలం గడిచిన తరువాత ఇబ్రాహీమ్(అ) ధ్యాస మళ్ళీ మక్కావైపు మళ్ళింది. నేనెవరిని వదలి వచ్చానో వారిని చూసి రావటానికి వెళుతున్నానని భార్యతో చెప్పారు. ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు: ఇబ్రాహీమ్(అ) వచ్చి, "ఇస్మాయీల్ ఎక్కడున్నాడు?" అనడిగారు. వేటకెళ్ళారని చెప్పింది ఆయన భార్య. ఆమె ఇబ్రాహీమ్(అ)ను మర్యాదపూర్వకంగా పలకరించింది. భోజనానికి పిలిచింది. "ఇంతకీ మీరు ఏం తింటున్నారు? ఏం త్రాగుతున్నార"ని అడిగారాయన. మాంసం తింటున్నాము. నీళ్ళు త్రాగుతున్నామని ఆమె చెప్పింది. "దేవా! వీళ్ళ అన్నపానీయా లలో శుభం వొసగు" అని ఆయన ప్రార్థించారు. "ఇబ్రాహీమ్(అ) ప్రార్థనలోని శుభం ఇప్పటివరకూ కొనసాగుతూ ఉంద"ని అబుల్‌ఖాసిమ్(సల్లల్లాహు అలైహి వ సల్లమ్) చెప్పారు.

కొన్నాళ్ళు గడిచాక మూడవసారి ఇబ్రాహీమ్(అ)కు తన కుటుంబీకులు జ్ఞప్తికి వచ్చారు. "నేను విడిచి వచ్చిన వారి బాగోగులను తెలుసుకోవడానికి వెళ్ళి వస్తాన"ంటూ భార్యతో చెప్పారు. ఈసారి వచ్చినప్పుడు కొడుకు ఇస్మాయీల్(అ) కనిపించారు. ఆ సమయంలో ఆయన జమ్‌జమ్ బావి వెనుక తన బాణాలను సరిచేసుకుంటున్నారు. "ఓ ఇస్మాయీల్! నేనిక్కడ ఒక ఆరాధనా గృహాన్ని నిర్మిం చాలన్నది నీ ప్రభువాజ్ఞ" అన్నారు ఇబ్రాహీమ్(అ). 'అలాగైతే మీరు మీ ప్రభువాజ్ఞను తప్పక శిరసావహించండి' అన్నారు కొడుకు ఇస్మాయీల్(అ). "ఈ మహత్కార్యంలో నీ సహాయం తీసుకోమని" కూడా ప్రభువు ఆజ్ఞాపించాడు అన్నారు ఇబ్రాహీమ్(అ). 'చిత్తం. నేనందుకు సిద్ధమే' అన్నారు ఆ పుత్రరత్నం. అంతే... ఆ తండ్రీకొడుకు లిద్దరూ కట్టడ నిర్మాణానికి ఉపక్రమించారు. ఇబ్రాహీమ్(అ) కాబా గోడలు నిర్మిస్తుంటే, ఇస్మాయీల్ రాళ్ళు తెచ్చి అందించసాగారు. ఆ సమయంలో వారి నోట జాలువారిన వేడుకోలు వచనాలివి : "ఓ మా ప్రభూ! మా ఈ సేవను దయతో స్వీకరించు. నిశ్చయంగా నీవు మొరలు ఆలకించేవాడవు. అన్నీ తెలిసినవాడవు."

ఉల్లేఖకుడు ఇలా అన్నారు : గోడ ఎత్తు పెరిగిన తరువాత కట్టడ నిర్మాణంలో ఇబ్రాహీమ్(అ)కు కొంత ఇబ్బంది ఎదురయింది. అప్పుడాయన 'మఖామె

ఇబ్రాహీమ్' రాయిపై నిలబడ్డారు. అప్పుడు ఇస్మాయీల్(అ) రాళ్ళు తెచ్చి అందిస్తూ ఉంటే, ఇబ్రాహీమ్(అ) రాళ్ళను గోడలో పేర్చసాగారు. ఆ సమయంలో ఆ తండ్రీ కొడుకుల అధరాల మీదుగా జాలువారిన ప్రార్థనా పలుకులు ఇవి : "ఓ మా ప్రభూ! మా ఈ సేవను దయతో స్వీకరించు. నిశ్చయంగా నీవు ప్రార్థనను ఆలకించి ఆమోదించేవాడవు. అన్నీ తెలిసినవాడవు."

## భూమండలంపై నిర్మించబడిన ప్రప్రథమ మస్జిద్ ఏది?

**42)** హజ్రత్ అబూజర్(రజి) కథనం: నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్)తో 'దైవప్రవక్తా! భూమండలంపై నిర్మించబడిన మొట్టమొదటి మస్జిద్ ఏది?' అని అడిగితే, "మస్జిదె హరామ్" అని ఆయన(స) చెప్పారు. 'ఆ తరువాత ఏది?' అని నేను అడిగిన దానికి "మస్జిదె అక్సా(బైతుల్ మఖ్దిస్)" అని ఆయన బదులిచ్చారు. ఆ రెండు మస్జిద్‌ల నిర్మాణం మధ్య ఎంత అంతరం ఉంది?' అని నేను విన్నవించుకోగా, "నలభై ఏళ్ళు" అని ఆయన(స) సమాధానమిచ్చారు. ఆ తరువాత ఆయన(స) ఇలా బోధించారు: "ఇక నీకు ఎక్కడ నమాజ్ వేళ అవుతే అక్కడే నమాజ్ చేసుకో. (వేళకు) నమాజ్ చేయటం మహత్పూర్వకమైన విషయం."[1]

**43)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : "ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి ఉహుద్ పర్వతాన్ని చూసి, "ఈ పర్వతం మమ్మల్ని ప్రేమిస్తోంది. మేము దీనిని ప్రేమిస్తున్నాము. ఓ అల్లాహ్! మహనీయ ఇబ్రాహీమ్(అ) మక్కా నగరాన్ని పవిత్ర నగరంగా (నిషిద్ధ ప్రదేశం)గా ఖరారు చేశారు. నేను మదీనాలోని రెండు రాతి ప్రదేశాల మధ్యన గల ప్రాంతాన్ని పవిత్రమైనదిగా (నిషిద్ధ స్థలంగా) ఖరారు చేస్తున్నాను"[1]. ఈ హదీసును అబ్దుల్లాహ్ బిన్ జైద్(రజి) కూడా దైవ ప్రవక్త(స) నుండి ఉల్లేఖించారు.

---

42–1. ఇక్కడ పాఠకులకు ఒక సందేహం కలగవచ్చు– కాబా గృహాన్ని దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అ) నిర్మించగా, మస్జిదె అక్సాను దైవప్రవక్త హజ్రత్ సులైమాన్(అ) నిర్మించారు. వీరిద్దరి మధ్య 40 సంవత్సరాలకన్నా ఎక్కువ అంతరం ఉంది కదా! దీనికి సమాధానం ఏమిటంటే కాబా గృహాన్ని ప్రప్రథమంగా నిర్మించినది ఇబ్రాహీమ్(అ) కాదు, దానిని మొట్టమొదటగా నిర్మించినవారు హజ్రత్ ఆదమ్(అలైహిస్సలామ్). బహుశా కాబా నిర్మాణం జరిగిన నలభై ఏళ్ళ తరువాత ఆదమ్ లేదా ఆయన సంతానం లోని మరొకరు మస్జిదె అక్సాను నిర్మించి ఉండవచ్చు. దాని పునాదులపై హజ్రత్ సులైమాన్(అ) పునర్నిర్మాణం చేసి ఉండవచ్చు.

**44) దైవప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : "(ఆయిషా!) నీకు తెలుసా? నీ జాతి వారు కాబా గృహం (నవ) నిర్మాణం చేపట్టినప్పుడు కాబా యొక్క ఇబ్రాహీమీ పునాదిని వదిలిపెట్టేశారు" అని దైవప్రవక్త(సఅసం) చెప్పి నప్పుడు, 'యా రసూలల్లాహ్! మరైతే మీరు ఇబ్రాహీమ్ పునాదుల ప్రకారం దాని నవ నిర్మాణాన్ని ఎందుకు చేపట్టకూడదు?' అని నేను విన్నవించుకున్నాను. దానికి సమాధానంగా ఆయన(స), "నీ జాతి ప్రజలు గనక అవిశ్వాస (కుఫ్ర్) కాలానికి దగ్గరగా ఉండకుండా ఉంటే (నేను అవశ్యంగా అలా చేసి ఉండేవాణ్ణి)"- అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అన్నారు: హజ్రత్ ఆయిషా(ర.అ) దైవప్రవక్త(స) నుండి ఈ హదీసును విన్నారంటే, నా అభిప్రాయంలో ఈ కారణంగానే దైవప్రవక్త(స), హజ్రె అస్వద్‌కు సమీపంలో ఉన్న రెండు మూలలను ముద్దాడేవారు కారు (అంటే రుక్నె షామీ, రుక్నె ఇరాకీలను). ఎందుకంటే కాబా గృహం హజ్రత్ ఇబ్రాహీమ్(అ) వేసిన పునాదులపై లేదు. ఆ రెండు మూలలు కాస్త ముందుకు జరిగి ఉన్నాయి.**

**45)** మహనీయ అబూహుమైద్ సాయిదీ (రజి) తెలిపారు : 'దైవప్రవక్తా! మేము మీపైన ఏవిధంగా దురూద్ పంపాలి?' అని సహచర మాన్యులు ప్రశ్నించగా, "మీరు ఈ విధంగా పలకండి- **అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ అజ్‌వాజిహీ వ జుర్రియ్యతిహీ కమా సల్లయ్‌త అలా ఆలి ఇబ్రాహీమ, వ బారిక్ అలా ముహమ్మదిన్ వ అజ్‌వాజిహీ వజుర్రియ్యతిహీ, కమా బారక్త అలా ఆలి ఇబ్రాహీమ, ఇన్నక హమీదుమ్మజీద్ (అనువాదం: ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీమ్ సంతతిపై నీ కారుణ్యాన్ని కురిపించినట్లే ముహమ్మద్‌పై ఆయన సతీమణులపై, ఆయన సంతానంపై నీ కారుణ్యాన్ని కురిపించు. ఇబ్రాహీమ్ సంతానంపై నీ శుభాన్ని వర్షింపజేసినట్లే ముహమ్మద్‌పైన,**

---

43-1. "ఉహుద్ పర్వతం మమ్మల్ని ప్రేమిస్తోంది" అన్న పలుకు గమనార్హం. ఇది సత్యం. ఎందుకంటే, అల్లాహ్ తన సృష్టితాలకు, వాటి వైభవానికి తగినట్లుగా గ్రాహ్యశక్తిని, స్పందన గుణాన్ని ప్రసాదించాడు. ఉదాహరణకు- "ఆయన స్తోత్రంతో సహా ఆయన పవిత్రతను కొనియాడని వస్తువంటూ ఏదీలేదు" (17: 44) అన్న దైవ వచనం ఇక్కడ గమనించదగినది.

ఈ హదీసు ద్వారా 'మదీనా మునవ్వరా' పవిత్రత రూఢీ అవుతున్నది. ఈ హదీసు ఇంతకుముందు హజ్జ్ ప్రకరణంలో కూడా వచ్చింది. ఇక్కడ దైవప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ప్రస్తావన రావటం వల్ల దానిని పునరావృతం చేయవలసి వచ్చింది.

ఆయన సతీమణులపైన, ఆయన సంతానంపైనా నీ శుభాన్ని వర్షింపజెయ్యి. నిశ్చయంగా నీవు స్తవనీయుడవు, మహిమాన్వితుడవు)

**46)** అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ యాలా కథనం : ఒకసారి నేను కాబ్ బిన్ ఉజ్రహ్ (రజి)ను కలుసుకోవటం జరిగింది. 'నేను మీకు దైవప్రవక్త(స) ద్వారా విన్న (హదీసు) కానుక ఒకటి ఎందుకు అందజేయకూడదు?' అన్నారాయన. దానికి నేను, 'నాకు ఆ కానుకను తప్పకుండా ప్రదానం చేయండి' అన్నాను. 'మేము ఒకసారి, దైవప్రవక్తా! మీపైన, మీ ఇంటివారలపైన దురూద్ ఎలా పంపేది? మీపైన సలామ్ పంపే పద్ధతినైతే అల్లాహ్ స్వయంగా మాకు తెలియపరిచాడు (ఖుర్ఆన్‌లో)' అని విన్నవించుకోగా, దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు : "మీరు ఈ విధంగా వేడుకోండి– **అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్, వ్వఅలా ఆలి ముహమ్మదిన్, కమా సల్లయ్‌త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ, ఇన్నక హమీదుమ్మజీద్- అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్, వ్వ అలా ఆలి ముహమ్మదిన్, కమా బారక్త అలా ఇబ్రాహీమ, వ అలా ఆలి ఇబ్రాహీమ, ఇన్నక హమీదుమ్మజీద్.** (అనువాదం : ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీమ్‌పైన, ఇబ్రాహీమ్ ఇంటివారలపైన దయజూపినట్లే ముహమ్మద్‌పైన, ముహమ్మద్ ఇంటివారలపైన దయజూపు. నిశ్చయంగా నీవు స్తవనీయుడవు. ఘనాఘనుడవు. ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీమ్‌పైన, ఇబ్రాహీమ్ ఇంటివారలపైన శుభాన్ని అవతరింపజేసినట్లే ముహమ్మద్‌పైన, ముహమ్మద్ ఇంటివారలపైన శుభాన్ని అవతరింపజెయ్యి. నిశ్చయంగా నీవు స్తుతిపాత్రుడవు. గొప్ప మహిమాన్వితుడవు.)" [1]

**47)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) హసన్ హుసైన్ (రజిఅల్లాహు అన్‌హుమా)ల కొరకు శరణు వేడుకునే వారు. ఇలా పలికేవారు– "మీ ముత్తాత (ఇబ్రాహీమ్–అ) కూడా ఇస్మాయీల్, ఇస్‌హాఖ్‌ల కొరకు అల్లాహ్ శరణు వేడేవారు. నేను ఇలా శరణు వేడుతున్నాను– **'అవూజు బికలిమాతిల్లాహిత్తామ్మాతి మిన్ కుల్లి షయ్‌తానిన్ వ హామ్మతి, వ మిన్ కుల్లి అయ్‌నిన్ లామ్మతి.** (అనువాదం : నేను అల్లాహ్ సంపూర్ణ వచనాల ద్వారా ప్రతి

46–1. 'ఆల్' (ఇంటివారలు) అంటే జకాత్ సొమ్ము నిషేధించబడినవారు. 'ఆల్' అంటే 'అహ్లెబైత్' అనీ, హజ్రత్ అలీ(రజి), హజ్రత్ ఫాతిమా, హజ్రత్ హసన్ హుసైన్‌లు ఈ పరిధిలోకి వస్తారని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇంకొందరు కాదన్నారు.

**షైతాన్ కీడు నుండి, ప్రతి విష పురుగు నుండి, హాని కలిగించే ప్రతి చెడు దిష్టి నుండి శరణు వేడుతున్నాను).**

## అధ్యాయం : 10

## అల్ హిజ్ర్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు

**వారికి ఇబ్రాహీమ్ అతిథుల గాథను కొంచెం వినిపించు. వారు అతని వద్దకు వచ్చి, "మీకు శాంతి కలుగుగాక" అని అన్నప్పుడు, అతనిలా అన్నాడు: "మేము మిమ్మల్ని చూచి భయపడుతున్నాము." వారు ఇలా సమాధానం పలికారు : "భయపడకండి..." (అల్ హిజ్ర్ 51-53)**

**"ఓ నా ప్రభూ! నీవు మృతులను ఏ విధంగా బ్రతికిస్తావో నాకు చూపించు" అని ఇబ్రాహీము తన ప్రభువును అడిగిన సందర్భాన్ని స్మరించుకోండి".**

**(అల్ బఖరా : 260)**

**48) ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "మనం మహనీయ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) కన్నా ఎక్కువగా సందేహం వ్యక్తం చేయడానికి హక్కుదారులం. ఎందుకంటే మృతులను బ్రతికించే విషయంలో ఆయనకు కలిగిన సందేహాన్ని స్మరించుకొనండి- 'ఓ నా ప్రభూ! నీవు మృతులను ఏ విధంగా బ్రతికిస్తావో నాకు చూపించు' అని ఇబ్రాహీమ్ అడిగినప్పుడు, 'నీకు విశ్వాసం లేదా?' అని అల్లాహ్ అడిగాడు. ఇబ్రాహీమ్ వినయంగా ఇలా అన్నాడు: 'నాకు విశ్వాసం అయితే ఉంది. కాని మనస్సును తృప్తిపరచటం కోసం అడుగుతున్నాను.' ఇంకా లూత్ (అలైహిస్సలామ్)పై అల్లాహ్ దయజూపుగాక! ఆయన గట్టి మూలాధారాన్ని (అంటే నిజప్రభువును) ఆశ్రయించారు. ఇకపోతే యూసుఫ్ (అలైహిస్సలామ్); ఆయన కారాగారంలో ఉన్నంత కాలం నేను గనక ఉండి ఉంటే, నేను విడుదల కోసం పిలిచినవాని మాటను తప్పకుండా అంగీకరించి ఉండేవాణ్ణి."[1]**

48-1. అంటే జైలు నుండి విడుదల అవటం మహాభాగ్యం అని భావించి ఉండేవాణ్ణి. మహనీయ యూసుఫ్(అ) సహన గుణానికి జోహార్లు. ఆయన సుదీర్ఘ కాలంగా జైలులో మ్రగ్గుతూ ఉన్నప్పటికీ, రాజుగారి నుండి అందిన విడుదల కబురుపై ఏమాత్రం తొందరపడలేదు. అసలు తాను చేసిన నేరం ఏమిటో ముందు రుజువు కావాలన్నారు. అంతిమ దైవప్రవక్త(స) వినయం కొద్దీ మహనీయ యూసుఫ్(అ) గురించి అలా వ్యాఖ్యానించారు. అంటే యూసుఫ్(అ) గొప్పతనాన్ని నొక్కి వక్కాణించారు.

## అధ్యాయం : 11

## (ఇస్మాయిల్-అ గురించి) అల్లాహ్ ఇలా సెలవీయటం-

"గ్రంథంలో ఇస్మాయిల్(అ)ను గురించి ప్రస్తావించు. అతను వాగ్దాన పాలకుడు, సందేశహరుడైన ప్రవక్త" *(మర్యమ్ : 54)*

**49)** హజ్రత్ సలమా బిన్ అక్వా (రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి అస్లం తెగకు చెందిన ఒక సమూహం మీదుగా సాగిపోయారు. ఆ సమయంలో ఆ తెగవారు విలువిద్య పోటీలు నిర్వహిస్తూ ఉన్నారు. దైవప్రవక్త(స) ఆ తెగ వారిని ఉద్దేశించి, "ఓ ఇస్మాయిల్ సంతతి వారలారా! విలు విద్యలో విజృంభించండి. ఎందుకంటే మీ పితామహుడు (ఇస్మాయిల్-అ) మంచి విలుకాడు. ఇప్పుడు నేను ఫలానా తెగవారి పక్షాన ఉన్నాను" అని పలికారు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు : ఈ మాట వినగానే అవతల ఉన్నవారు బాణాలు ప్రయోగించటాన్ని ఆపేశారు. "ఏమయింది! ఆగిపోయారెందుకు?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, 'దైవప్రవక్తా! మీరు ప్రత్యర్థి పక్షాన నిలబడినప్పుడు మేము బాణాలు ఎలా ప్రయోగించగలం?' అని బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "ఫరవాలేదు. మీ పోటీని కొనసాగించండి. నేను మీ అందరి పక్షాన ఉన్నాను."[1]

## అధ్యాయం : 12

## ఇబ్రాహీమ్ కుమారుడగు ఇస్హాఖ్ (అ) గురించి

ఈ అధ్యాయంలో ఇబ్నె ఉమర్ మరియు అబూ హురైరా (రజి)లు ప్రవక్త మహనీయులు(స) నుండి ఉల్లేఖించారు.[1]

---

49-1. హదీసులో మహనీయ ఇస్మాయిల్ (అ) ప్రస్తావన వచ్చింది. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం. తాతముత్తాతల మంచి పనులను అనుసరించటంలో తప్పులేదని కూడా ఈ హదీసు ద్వారా విదితమవుతోంది.

12-1. ఈ రెండు హదీసులను ఇమామ్ బుఖారీ (రహ్మ) స్వయంగా వసల్ చేశారు. ఇబ్నె ఉమర్(రజి) హదీసు అంటే ఇది- కరీమ్ బిన్ కరీమ్ బిన్ కరీమ్ యూసుఫ్ బిన్ యాఖూబ్ బిన్ ఇస్హాఖ్ బిన్ ఇబ్రాహీమ్(అలైహిముస్సలామ్). ఎందుకంటే ఈ హదీసులో ఇస్హాఖ్ (అ) ప్రస్తావన ఉంది. ఆయన్ని ఉదార స్వభావిగా కూడా పేర్కొనటం జరిగింది.

## అధ్యాయం : 13

## మహనీయ యాఖూబ్ (అ) గురించి....

**యాఖూబ్ మృత్యు దశలో ఉన్నప్పుడు మీరు అక్కడ ఉన్నారా? అతను తన కుమారులను ఇలా అడిగాడు : "బిడ్డలారా! నా తరువాత మీరు ఎవరిని ఆరాధిస్తారు?" వారంతా ఇలా సమాధానం చెప్పారు : "మీరూ, మీ పెద్దలైన ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్హాఖ్ దేవుడుగా భావించిన ఆ ఏకైక దేవుణ్ణే మేమూ ఆరాధిస్తాము. మేము ఆయనకే ముస్లిములమై ఉంటాము." *(అల్ బఖరా : 133)***

**50) హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం : 'అందరికన్నా ఎక్కువ ఆదరణీయుడు ఎవరు?' అని ఒకసారి ప్రవక్త మహనీయులు(సఅసమ్)ను ప్రశ్నించటం జరిగింది. దానికి ఆయన(స), "అందరికన్నా అధికంగా దైవానికి భయపడే వాడే అందరికన్నా ఆదరణీయుడు" అని సమాధానమిచ్చారు. దానికి సహచర మాన్యులు, 'మా ప్రశ్నలోని ఉద్దేశం అది కాదండి' అని విన్నవించుకోగా, "అలాగైతే అందరికన్నా ఆదరణీయులు యూసుఫ్. ఆయన తండ్రి యాఖూబ్ దైవసందేశ హరుడు, ఆయన (యాఖూబ్) తండ్రి ఇస్హాఖ్ దైవప్రవక్త, ఆయన (ఇస్హాఖ్) తండ్రి ఇబ్రాహీమ్ దేవుని ప్రియతముడు" అని ఆయన(స) వివరించారు. దానికి సహాబా, 'మా ఉద్దేశం అది కూడా కాదండి' అని సందేహపడగా, "బహుశా మీరు అరబ్బు మర్యాదస్తుల గురించి అడగాలనుకుంటున్నారేమో!" అని అన్నారు దైవ ప్రవక్త(స). 'అవునండి' అని సహచరమాన్యులు చెప్పగా, ప్రవక్త మహనీయులు(స) ఇలా వివరించి చెప్పారు : "అలాగైతే వినండి. ఇస్లామ్‌కు పూర్వం– అజ్ఞాన కాలంలో– మర్యాదస్తులుగా, మంచి నడవడిక కలవారుగా ఉన్నవారు ఇస్లామ్ స్వీకరించిన తరువాత కూడా మర్యాదస్తులుగా, సౌజన్యశీలురుగా భావించబడతారు. అయితే వారు ధర్మావగాహనను పెంపొందించుకుని ఉండాలి.[1]**

## అధ్యాయం : 14

## మహనీయ లూత్ (అలైహిస్సలామ్) గురించి...

**"మేము లూత్‌ను పంపాము. అతను తన జాతి వారితో, ఇలా అనిన సంద**

50–1. ఈ హదీసులో మహనీయ యాఖూబ్(అలైహిస్సలామ్) ప్రస్తావన వచ్చింది. ఆ విధంగా ఇది అధ్యాయం (13)లోని మకుటంతో సమరసం చెందుతోంది.

ర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో, “మీరు చూస్తూ అశ్లీల కార్యం చేస్తారేమిటీ? ఇదేనా మీ నడవడిక, కామతృష్ణను తీర్చుకోవటానికి స్త్రీలను వదలి పెట్టి పురుషుల వద్దకు పోతారేమిటి? వాస్తవానికి మీరు చాలా అజ్ఞానపు పని చేస్తున్నారు.” కానీ, ఈ సమాధానం తప్ప మరొకటి అతని జాతివారు ఇవ్వలేదు. వారు ఇలా అన్నారు, “లూత్ కుటుంబాన్ని మీ పట్టణం నుండి వెళ్లగొట్టండి. వారు మహాపవిత్రులట!” చివరకు మేము అతనినీ అతని కుటుంబాన్నీ రక్షించాము, అతని భార్యను తప్ప. ఆమె,వెనుక ఉండిపోవాలని మేము నిర్ణయించాము. మేము వారిపై ఒక వర్షాన్ని కురిపించాము. అది హెచ్చరించబడిన వారి విషయంలో అత్యంత ఘోరమైన వర్షం.

***(27 అన్ నమ్ల్ : 54-58)***

**51)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : “అల్లాహ్ మహనీయ లూత్ (అలైహిస్సలామ్)ను మన్నించుగాక! ఆయన ఒక దృఢమైన ఆధారం (అంటే అల్లాహ్) శరణు పొందారు.”[1]

## అధ్యాయం : 15

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : తరువాత ఈ దైవదూతలు లూత్ వద్దకు వెళ్ళి నప్పుడు అతను, “మీరు అపరిచితులుగా కనిపిస్తున్నారు” అని అన్నాడు.

**(అల్ హిజ్ర్ : 61, 62)**

‘అన్‌కరహుమ్’ అని అన్నా, నకిరహుమ్ అన్నా, ‘అస్తన్‌కరహుమ్’ అన్నా అర్థం ఒక్కటే...

---

51-1. లూత్ (అ) జాతివారు ఆయన్ని ఎదిరించినప్పుడు, ఆయనకు ఆదరువుగా నిలిచే ఆయన వంశస్తులు ఎవరూ లేకపోయారు. దైవప్రవక్త ఇబ్రాహీమ్(అ) సిరియా వైపు వలసపోయినప్పుడు, లూత్(అ) కూడా ఆయన వెంట వలసపోయారు. తరువాత అల్లాహ్ లూత్(అ)ను ‘సదూమ్’ జనుల వైపు ప్రవక్తగా పంపాడు. ‘నా అన్నవారు ఎవరయినా నాకు తోడుగా ఉంటే ఈ దుష్టజనుల్ని నేను ప్రతిఘటించేవాణ్ణి’ అన్న లూత్ మాటల్లోని అంతరార్థం ఇదే.

లూత్ జాతి ప్రజల ప్రస్తావన ఖుర్ఆన్‌లో అనేకచోట్ల వచ్చింది. నీతిబాహ్యతలో వారు హద్దుమీరిపోయారు. అల్లాహ్ ఆ దుష్టుల్ని సర్వనాశనం చేసేశాడు. నేడు మృత సముద్రంగా పిలువబడే ప్రాంతం అదే.

**52)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) 'ఫహల్ మిన్ ముద్దకిర్' పఠించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు.[1]

## అధ్యాయం :16

## దైవప్రవక్త మహనీయ యాఖూబ్(అ) గురించి...

"యాఖూబ్ మృత్యు దశలో ఉన్నప్పుడు మీరు అక్కడ ఉన్నారా?"

*(అల్ బఖరా- 133)*

**53)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : గౌరవనీయుడు, గౌరవనీయుని కుమారుడు, గౌరవనీయుని మనవడు, గౌరవనీయుని ముని మనవడు మహనీయ యూసుఫ్ బిన్ యాఖూబ్ బిన్ ఇస్హాఖ్ బిన్ ఇబ్రాహీమ్(అలైహిముస్సలామ్).

## అధ్యాయం : 17

## యూసుఫ్ (అలైహిస్సలామ్) గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"యథార్థానికి యూసుఫ్, అతని సోదరుల గాథలో అడిగేవారికి గొప్ప సూచనలు ఉన్నాయి." *(యూసుఫ్-7)*

**54)** మహనీయ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు : 'ప్రజలలో అందరికన్నా ఎక్కువ గౌరవనీయుడు ఎవరు?' అని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)ను ప్రశ్నించగా, "అందరికన్నా ఎక్కువగా దైవానికి భయపడేవాడు" అని ఆయన(స) బదులిచ్చారు. 'మా ప్రశ్నలోని ఉద్దేశం అది కాద'ని సహచరమాన్యులు విన్నవించుకోగా, "అలాగైతే (వంశపరంగా) యూసుఫ్ అందరికన్నా ఎక్కువ గౌరవనీయులు. ఆయన స్వయంగా దైవప్రవక్త, ఆయన తండ్రి దైవప్రవక్త, ఆయన తాత దైవప్రవక్త, ముత్తాత (మహనీయ ఇబ్రాహీమ్-అ) అల్లాహ్‌కు ప్రియ మిత్రుడు"అని ఆయన(స) వివరించి చెప్పారు. 'మాప్రశ్నలోని ఉద్దేశం అది కూడా కాదండి' అని సహాబా విన్నవించుకోగా, "ఓహెూ! మీరు అరబ్బు వంశీయుల గురించి అడుగదలిచారా!? చూడండి! జనుల ఉపమానం గనుల వంటిది (ఒక్కో గని నుండి మంచి ఖనిజం బయల్పడితే, ఒక్కో గని నుండి నాసిరకం ఖనిజం బయల్పడుతుంది). మీలో

---

52-1. ఈ ఆయత్ అల్ ఖమర్ సూరాలో హజ్రత్ లూత్(అ) వృత్తాంతంలో కూడా వచ్చింది. ఈ కారణంగానే ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకురావడం జరిగింది.

ఎవరయితే అజ్ఞాన కాలంలో ఆదరణీయులుగా, సత్ప్రవర్తన కలవారుగా ఉండేవారో, వారు ఇస్లాం స్వీకరించిన తరువాత కూడా మంచీ మర్యాదలు కలవారుగా రాణిస్తారు. కాకపోతే వారు ధర్మావగాహనను పెంపొందించుకోవాలి" అని ఆయన(స) విశదీకరించారు. ... వేరొక సనదు ప్రకారం కూడా అబూహురైరా(రజి) మహా ప్రవక్త(స) నుండి ఇదే హదీసును ఇలాగే ఉల్లేఖించారు.

**55)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్)– మరణవ్యాధికి గురై ఉన్న సమయంలో– "ప్రజలకు నమాజ్ చేయించమని అబూబక్ర్‌తో చెప్పు" అని ఆమెతో అన్నారు. దానికి ఆయిషా(ర.అ), 'ఆయన ఎంతో మృదు మనస్కులు. నమాజ్ చేయించటానికి మీ స్థానంలో నిలబడగానే భావోద్వేగానికి లోనవుతారు (తత్కారణంగా సరిగ్గా ఖుర్ఆన్ పఠించలేరు)' అని విన్నవించుకున్నారు. కాని దైవప్రవక్త(స) ఆమెకు మరోసారి కూడా ఇలాగే ఆదేశించారు. అయితే ఆమెగారు ఈసారి కూడా ఇదేవిధంగా సంజాయిషీ ఇచ్చుకున్నారు. (ఉల్లేఖకులైన) షూబా ఇలా అంటున్నారు– దైవప్రవక్త(స) మూడవసారి లేక నాల్గవ సారి, "మీరు (మీ ఆడువారు) యూసుఫ్(అ)కు తారసపడిన స్త్రీలవంటివారు (పైన ఒకటి, లోన ఒకటి). నమాజ్ చేయించమని అబూబక్ర్‌తో చెప్పు" అని రెట్టించారు.

**56)** తన తండ్రి తనతో చెప్పారని అబూ బుర్దా బిన్ అబీ మూసా తెలిపారు. దాని ప్రకారం, ప్రవక్త మహనీయులు(సఅసమ్) అస్వస్థతకు గురైనప్పుడు, "ప్రజల (సామూహిక) నమాజ్‌కు సారథ్యం వహించమని అబూబక్ర్‌తో చెప్పు" అని ఆజ్ఞాపించారు. దానికి ఆయిషా(ర.అ) 'అబూబక్ర్ ఎంతో మెత్తని మనస్సు కల మనిషి' అని విన్నవించుకోగా, దైవప్రవక్త(స) రెండవసారి కూడా ఇలాగే ఆజ్ఞాపించారు. కాని ఆమెగారు ఈసారి కూడా అలాగే సంజాయిషీ ఇవ్వటంతో దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "నమాజ్ చేయించమని ఆయనకు చెప్పు. మీరు (మీ ఆడువారు) యూసుఫ్‌కు ఎదురైన స్త్రీల వంటివారు (పైన ఒకవిధంగా, లోన ఒక విధంగా ఉంటారు)". అందువల్ల అబూబక్ర్(రజి) దైవప్రవక్త(స) జీవిత కాలంలోనే ఇమామత్ చేశారు– హుసైన్ బిన్ అలీ జాఫీ అదనంగా, 'అబూబక్ర్ మృదు మనస్కులైన మనిషి' అనే పదం నకలు చేశారు.

**57)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రార్థించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "ఓ దేవా! అయాష్ బిన్ అబీ రబీయాకు ముక్తిని ప్రసాదించు. అల్లాహ్! సలమా బిన్ హిషామ్‌కు మోక్షం వొసగు. ఓ అల్లాహ్!

**వలీద్ బిన్ వలీద్‌కు విముక్తినొసగు. ఓ దేవా! బలహీనులైన ముస్లిములందరికీ మోక్షం ప్రసాదించు. ఓ దేవా! ముజర్ తెగ వారిని కఠిన శిక్ష క్రింద పట్టుకో. ఓ అల్లాహ్! యూసుఫ్ (అలైహిస్సలాం) కాలం నాటి దుర్భిక్షాన్ని ఈ దుర్మార్గులపై విధించు."**

**58) హ(జ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "అల్లాహ్ లూత్ (అలైహిస్సలామ్)పై దయజూపుగాక! ఆయన దృఢమైన ఆధారం (అంటే అల్లాహ్) శరణు జొచ్చేవారు. ఇక యూసుఫ్ (అలైహిస్సలామ్) కారాగారంలో ఉన్నంత కాలం నేను గనక ఉండి ఉంటే, ఆ తరువాత (రాజు గారి) మనిషి వచ్చి పిలిస్తే, నేను ఏమాత్రం ఆలస్యం చేయకుండా అతని వెంట వెళ్ళిపోయేవాణ్ణి."[1]**

**59) మస్రూఖ్ కథనం: నేను హ(జ్రత్ ఆయిషా(ర.అ) తల్లి ఉమ్మె రూమాన్‌ను, ఆయిషా(ర.అ) పై అల్లబడిన అపనింద (కట్టుకథ) గురించి అడగ్గా, ఆమె ఇలా వివరించారు : నేను అయిషా(ర.అ)తో కలసి కూర్చుని ఉండగా, ఒక అన్సార్ మహిళ మా దగ్గరకు వచ్చి, "అల్లాహ్ వాణ్ణి (మిస్తహ్ బిన్ ఉసాసాను) నాశనం చెయ్య, ఎలాగూ నాశనం చేసినట్లే" అని పలికింది. 'అయ్యో! అలా ఎందుకంటు న్నావ్?' అని నేను ప్రశ్నించగా, "ఎందుకంటారేమిటి, ఈ అబద్ధాన్ని వ్యాపింప జేసింది వాడే కదమ్మా" అని ఆమె బదులిచ్చింది. ఆ తర్వాత ఆ అన్సార్ మహిళ (హ(జ్రత్ ఆయిషా–ర.అ పై మోపబడిన అభాండం గురించి) వివరంగా చెప్పింది. దానికి ఆయిషా(ర.అ), "ఇంతకీ దేని గురించి మీరు చెప్పుకునేది?" అని అడగ్గా, ఆమె తల్లి జరిగినదంతా వివరంగా వివరించింది. "ఏమిటి, ఈ సంగతి దైవ ప్రవక్తకు, అబూబక్ర్‌కు కూడా తెలుసా?" అని ఆమె అడగ్గా, 'అవున'ని ఆమె చెప్పింది. ఇది వినగానే హ(జ్రత్ ఆయిషా(ర.అ) స్పృహ తప్పి పడిపోయారు. ఆమె**

---

58–1. మహనీయ యూసుఫ్ (అలైహిస్సలామ్) సహనాన్ని, సమయస్ఫూర్తిని, స్థయిర్యాన్ని శ్లాఘిస్తూ అంతిమ దైవప్రవక్త(స) వ్యక్తపరచిన అభిప్రాయమిది. తన విడుదలకు సంబంధించిన ఫర్మానా స్పష్టంగా వెలువడనంతవరకూ, ఏ నిందారోపణపై తనను కారాగారంలో వేశారో దానికి సంబంధించిన నిజానిజాలు తేలనంతవరకూ ఆయన జైలు బయటకు అడుగుపెట్టనన్నారు. "నాకు ఆ కారాగారవాసమే మిన్న, ఈ కులీన కాంతల మనోరథాన్ని ఈడేర్చటంకన్నా" (12: 33) అన్న యూసుఫ్ పలుకులు ఆయన ఔన్నత్యాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

స్పృహలోకి వచ్చేసరికి చలిజ్వరంతో వణికిపోతున్నారు. అంతలో దైవప్రవక్త(స) ఏతెంచి, "ఈమెకేమయింది?" అని అడిగారు. దానికి నేను, 'ఒకానొక విషయం ఈమెకు చెప్పబడింది. ఆ షాక్‌తో ఈమెకు జ్వరం వచ్చేసింది' అన్నాను. తరువాత హ్రజత్ ఆయిషా(ర.అ) లేచి కూర్చున్నారు. "దైవసాక్షిగా చెబుతున్నాను. నేను దేవునిపై ప్రమాణంచేసి నిజం చెప్పినా, మీరు నా మాటను నమ్మలేరు. ఒకవేళ నేను సంజాయిషీ ఇచ్చినా దానిని మీరు అంగీకరించరు. నా ఉపమానం, మీ ఉపమానం హ్రజత్ యాఖూబ్(అలైహిస్సలామ్), ఆయన కొడుకుల వంటిది (ఆయన తన కొడుకులు చెప్పిన కట్టుకథను విని ఇలా అన్నారు) "మీ కల్పనపై నేను అల్లాహ్ సహాయం అర్థించటం వినా మార్గాంతరం లేదు". ఆ తర్వాత దైవప్రవక్త(స) తిరిగి వెళ్ళిపోయారు. అనంతరం అల్లాహ్ తనకు సమ్మతమైన దానిని అవతరింపజేశాడు. దైవప్రవక్త(స) ఈ విషయాన్ని ఆయిషా(ర.అ)కు తెలియజేసినప్పుడు, "దీనికిగాను నేను కేవలం అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. వేరితరులకు కాదు"[1] అని ఆయిషా(ర.అ) చెప్పారు.

**60)** ఉర్వా తెలిపారు : నేను దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్‌కు అర్థం గురించి దైవప్రవక్త సతీమణి హ్రజత్ ఆయిషా(ర.అ)ను అడిగాను– *"చివరకు ప్రవక్తలు ఆశ వదులుకున్నప్పుడు, తాము అబద్ధీకరించబడ్డామని వారు భావించినప్పుడు అకస్మాత్తుగా వారికి మా సహాయం అందింది." (యూసుఫ్– 110).*

ఆయత్ (అరబీ) మూలంలోని **'కుజిబూ'** అనే పదం ఒత్తుతో (కుజ్జిబూ అని) ఉందా? లేక ఒత్తు లేకుండా ఉందా? అసలు వారితో అబద్ధపు వాగ్దానం చేయబడిందా? లేక వారు అబద్ధీకరించబడ్డారా? విషయం అర్థం కావటం లేదు కదా! అని నేను సందేహపడగా, "వారు అబద్ధీకరించబడ్డారు (కుజిబూ)" అని హ్రజత్ అయిషా(ర.అ) సమాధానమిచ్చారు. కాని నా సందేహం తీరలేదు. ఖుర్ఆన్‌లో **'జన్న్'** అనే పదం వచ్చింది కదా! ఇది 'అనుమానం' 'ఊహా' అన్న అర్థంలో ఎందుకు ప్రయోగించబడినట్లు? తాము అబద్ధీకరించబడతామనీ, తమ దైవదౌత్యాన్ని జాతి జనులు అబద్ధమంటూ త్రోసిపుచ్చుతారని ప్రవక్తలకు తెలిసిందే కదా! అని నేను

---

59–1. హదీసులో మహనీయ యూసుఫ్, ఆయన సోదరుల ప్రస్తావన రావటం వల్ల ఇమామ్ బుఖారీ(రహ్మ) దీనిని ఈ అధ్యాయం క్రింద పొందుపరిచారు.

తిరిగి ప్రశ్నించగా, "ఓ చంటి ఉర్వా! ఆ విషయం ఖచ్చితంగా ప్రవక్తలకు తెలిసిందే" అని హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పారు. ఆ లెక్కన "వారితో అబద్ధపు వాగ్దానం చేయబడింది" అన్నదే సరైనది కావచ్చుకదా! అని నేను సందేహపడగా, "అల్లాహ్ శరణు! దైవప్రవక్తలు ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్ గురించి ఇలాంటి దురనుమానా లకు లోనవ్వరు- తమకు సహాయం చేస్తానని అల్లాహ్ అబద్ధపు వాగ్దానం చేశాడన్న ఆలోచన వారికి సుతరామూ కలగదు" అని హజ్రత్ ఆయిషా(ర.అ) సమాధాన మిచ్చారు. 'మరైతే ఈ ఆయత్‌కు అర్థమేమిటి?' అని ఉర్వా (రహ్మ) ప్రశ్నించగా, హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా వివరించి చెప్పారు-

"ఇది దైవప్రవక్తల అనుచరులకు సంబంధించినది. వారు తమ ప్రభువును విశ్వసించారు. దైవప్రవక్తలు చెప్పేది సత్యమని ధ్రువీకరించారు. తత్కారణంగా వారి జాతి ప్రజలు వారిని వేధింపులకు గురిచేశారు. అప్పుడు దైవ సహాయం అందటంలో ఆలస్యమైందని వారికి అనిపించింది. చివరకు దైవప్రవక్తలు తమ జాతి ప్రజలలోని అవిశ్వాసులు, విశ్వసించే విషయమై ఆశ వదులుకున్నారు. దైవ సహాయం అంద టంలో ఆలస్యం అవటం వల్ల బహుశా ఈ కొద్దిమంది విశ్వాసులు (మోమినీన్) కూడా తమను అబద్ధీకులుగా భావిస్తారేమోనన్న అనుమానం వారికి కలిగింది. అప్పుడు అకస్మాత్తుగా దైవ సహాయం అందింది." "అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి" (యూసుఫ్ : **87**) అన్న దైవ వచనం ఈ సందర్భంగా గమనార్హం.

ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పారు : "గౌరవనీయుడు, గౌరవనీయుని కుమారుడు, గౌరవనీయుని మనవడు, గౌరవనీయుని ముని మనవడు యూసుఫ్ (అలైహిస్సలామ్). ఈయన యాఖూబ్ కుమారుడు, ఆయనేమో ఇస్‌హాఖ్ కుమారుడు, మరాయనేమో ఇబ్రాహీమ్ కుమారుడు (అలైహిముస్సలామ్).

## అధ్యాయం : 18

## దైవప్రవక్త మహనీయ అయ్యూబ్(అలైహిస్సలామ్) గురించి....

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : అయ్యూబ్ తన ప్రభువును ఇలా వేడుకున్నప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో; "నాకు వ్యాధి సోకింది. నీవు కరుణామయులలోకెల్లా గొప్ప కరుణామయుడవు." *(అల్ అంబియా : 83)*

**మహనీయ అయ్యూబ్(అ) నేపథ్యంలోనే ఉన్న మరో ఆయత్..**

**"నీ కాలుతో నేలపై కొట్టు. ఇదో చల్లని నీరు. స్నానానికీ, త్రాగటానికీను."**

***(సాద్ : 42)***

**61) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఒకసారి అయ్యూబ్ (అలైహిస్సలామ్) నగ్నంగా స్నానం చేస్తుండగా బంగారు మిడతల దండు ఆయనపై పడసాగింది. ఆయన వాటిని తన వస్త్రంలో కట్టుకోసాగారు. అప్పుడు ప్రభువు ఆయన్ని ఎలుగెత్తి పిలుస్తూ, 'అయ్యూబ్! ఇప్పుడు నీవు వేటిని మూటకట్టుకుంటున్నావో వాటినుండి మేము నిన్ను అక్కరలేనివాడుగా చెయ్యలేదా?' (అంటే నిన్ను ధనికునిగా చేయలేదా?) అన్నాడు. దానికి అయ్యూబ్(అ), 'నిశ్చయంగా ఇది నిజమే ప్రభూ! కాని నేను నీ శుభం పట్ల నిరపేక్షాపరుణ్ణి కాగలనా?' అన్నారు.**

## అధ్యాయం : 19

## దైవప్రవక్త మహనీయ మూసా(అలైహిస్సలామ్) గురించి

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మూసాను గురించి ఈ గ్రంథంలో ప్రస్తావించు. అతను ఎన్నుకోబడిన వ్యక్తి, ఒక సందేశహరుడైన ప్రవక్త. మేము అతనిని తూర్ పర్వతం కుడివైపు నుండి పిలిచాము. రహస్య సంభాషణల ద్వారా అతనికి సాన్నిధ్యాన్ని ప్రసాదించాము."[1] *(మర్యమ్: 51, 52)***

**'నజీ' అనే పదం ఏకవచనం, ద్వివచనం, బహువచనం కొరకు కూడా ఉపయోగించబడుతుంది. యూసుఫ్ సూరాలో "ఖలసూ నజియ్యన్" అనే పద ప్రయోగం జరిగింది (12: 80). వారు ఒక మూలకుపోయి పరస్పరం సంప్రతించు కున్నారు అన్న అర్థంలో ఇది ఉంది...**

**62) హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పారని ఉర్వా బిన్ జుబైర్ తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) హిరా గుహ నుండి ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఖదీజా**

---

19–1. ఇస్రాయీల్ వంశీయుల నుండి వచ్చిన ప్రవక్తలలో మహనీయ మూసా(అల) స్థానం ఉన్నతమైనది. ఆయనకు షరీఅత్ (దైవ శాసనాంగం) వొసగబడింది. ఆయన్ని ప్రస్తావిస్తూ ఖుర్ఆన్ గ్రంథంలో ఎన్నో ఆయత్‌లు వచ్చాయి. ఆయన జననం, పెంపకం, ఆయన పూర్తి జీవితం దేవుని శక్తి సూచనలలోనిది. తన కాలపు ఒక నిరంకుశ చక్రవర్తిని ఎదుర్కొని అతని అధికార పీఠాన్ని పెకలించటం సాధారణ విషయం కాదు.

(ర.అ) వద్దకు వచ్చినప్పుడు, ఆయన(స) గుండె దడ పెరిగినట్లుగా ఉంది. హజ్రత్ ఖదీజా (ర.అ) ఆయన్ని (స) వరఖా బిన్ నౌఫల్ దగ్గరకు తీసుకెళ్ళారు. అతడు క్రైస్తవుడుగా ధర్మపరివర్తన చెందాడు. ఇంజీలు గ్రంథాన్ని అరబీలో చదివేవాడు. 'ఇంతకీ మీరేం చూశారు?' అని వరఖా ఆయన(స)ను అడిగాడు. ఆయన(స) జరిగినదంతా వివరించారు. అంతా విన్న మీదట, 'అల్లాహ్ మూసా ప్రవక్త (అలైహిస్సలామ్) వద్దకు పంపిన దైవదూతే ఇతను. నేను గనక మీ కాలం వరకూ జీవించి ఉంటే, మీకు పూర్తిగా సహాయపడతాను' అని వరఖా చెప్పాడు. హదీసు మూలంలో దైవదూత కొరకు **'నామూస్'** అనే పదం ప్రయోగించబడింది. నామూస్ అంటే పరమ రహస్యం తెలిసినవాడు అని అర్థం.

## అధ్యాయం : 20

## తాహా సూరాలో దైవోపదేశం

"(ప్రవక్తా!) మూసా వృత్తాంతం కూడా నీకేమైనా అందిందా? అప్పుడు అతను ఒక మంటను చూసి తన ఆలుబిడ్డలతో ఇలా అన్నాడు, "కొంచెం ఆగండి, నేను ఒక మంటను చూశాను. బహుశా మీ కోసం కాస్త నిప్పును తీసుకురాగలనేమో లేదా ఆ మంట వద్ద నాకేదైనా (దారికి సంబంధించిన) మార్గదర్శకత్వం లభిస్తుందేమో."... అక్కడకు చేరగానే, ఒక వాణి ఇలా పిలిచింది, "మూసా! నేనే నీ ప్రభువును, చెప్పులు విడువు. నీవు పవిత్రమైన తువా లోయలో ఉన్నావు. *(తాహా : 9-12)*

**63)** హజ్రత్ మాలిక్ బిన్ సాసా (రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) తనను గగనయాత్ర (మేరాజ్)కు తీసుకువెళ్ళబడిన రాత్రి గురించి ఆయనకు చెప్పారు- ఆయన(స) ఐదవ ఆకాశం పైకి తీసుకుపోబడ్డారు. అక్కడ ఆయన(స) హారూన్ (అలైహిస్సలామ్)ను కలుసుకున్నారు. 'ఈయన హారూన్(అ). ఈయనకు సలామ్ చేయండి' అని జిబ్రయీల్(అ) చెప్పారు. నేనాయనకు సలామ్ చేశాను. దానికాయన, 'స్వాగతం! మా మంచి సోదరా! సజ్జనుడైన సందేశహరుడా!' అన్నారు.

## అధ్యాయం : 21

ఈ సందర్భంగా, తన విశ్వాసాన్ని గుప్తంగా ఉంచిన ఫిరౌన్ జాతికి చెందిన ఒక విశ్వాసి ఇలా అన్నాడు: "మీరు ఒక వ్యక్తిని, కేవలం అతడు, 'నా ప్రభువు

అల్లాహ్' అని అన్నంత మాత్రాన్నే చంపేస్తారా? వాస్తవానికి అతను మీ ప్రభువు వద్ద నుండి మీ వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకువచ్చాడు. ఒకవేళ అతను అబద్ధాలు చెప్పేవాడే అయితే, అతని అబద్ధం స్వయంగా అతని మీదనే తిరిగి పడుతుంది. కాని ఒకవేళ అతను సత్యమే చెబుతున్నట్లయితే, అతను మిమ్మల్ని భయపెడుతున్న భయంకరమైన పరిణామాలలో కొన్ని అయినా మీ మీదకు తప్పకుండా వచ్చి పడతాయి. హద్దులను అతిక్రమించే, అసత్యాలు పలికే ఏ వ్యక్తికీ అల్లాహ్ సన్మార్గం చూపడు. *(40– అల్ మూ'మిన్ : 28)*

## అధ్యాయం : 22

## దైవోపదేశం

"(ప్రవక్తా!) మూసా వృత్తాంతం కూడా నీకేమైనా అందిందా?" *(తాహా : 9)*

"అల్లాహ్ మూసాతో ప్రత్యక్షంగా సంభాషించాడు." *(అన్ నిసా– 164)*

**64)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తనను మేరాజ్‌కు తీసుకుపోబడిన రాత్రి వైనాన్ని వివరించి చెప్పారు– "నేను మూసా (అలైహిస్సలామ్)ను చూశాను. ఆయన సన్నగా ఉన్నారు. ఆయన తల వెంట్రుకలు తిన్నగా ఉన్నాయి. షనూఅ తెగకు చెందిన వ్యక్తిలా అనిపించారు. నేను ఈసా(అలైహిస్సలామ్)ను చూశాను. మరీ అంత పొట్టీ కారు, పొడుగరీ కారు, ఎర్రగా ఉన్నారు.ఎంత పరిశుభ్రంగా, పరిశుద్ధంగా– తాజాగా– ఉన్నారంటే ఇప్పుడే స్నానశాల నుండి స్నానం చేసి వచ్చారా అనిపించింది. ఇక నేను, ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం)ను ఆయన పిల్లలందరికన్నా ఎక్కువగా పోలి ఉన్నాను. నా ముందు రెండు పాత్రలు ఉంచబడ్డాయి. ఒక దానిలో పాలు, మరొక దానిలో మధువు ఉంది. 'ఈ రెండింటిలో మీకు ఇష్టమైన దానిని తీసుకుని సేవించండి' అని జిబ్రయీల్(అ) చెప్పారు. నేను పాల పాత్రను నా చేత్తో పట్టుకుని త్రాగాను. 'మీరు సహజమైన దానిని అనుసరించారు (ఎందుకంటే పాలు మనిషికి పుట్టుకతోనే ఆహారంగా ఉంటుంది). ఒకవేళ మీరు గనక దీనికి బదులు మధువు సేవించి ఉంటే మీ అనుచర సముదాయం పెడదారి పట్టేది' అని నాతో అనబడింది.

**65)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా చెప్పారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్

**(రజి) తెలిపారు : "నేను యూనుస్ బిన్ మత్తయి(ప్రవక్త) కన్నా ఉత్తముణ్ణి అని ఎవరూ అనరాదు"-'ముత్తయి' ప్రవక్త యూనుస్ తండ్రి పేరని ఉల్లేఖకుడు తెలిపారు.**

**ప్రవక్త మహనీయులు(సఅసం) మేరాజ్ రాత్రి గురించి ప్రస్తావిస్తూ, "మూసా (అలైహిస్సలాం) గోధుమ వర్ణం కలవారు. బాగా పొడుగరి. షనూఅ తెగకు చెందిన వ్యక్తిలా ఉన్నారు". ఇంకా ఇలా అన్నారు: "ఈసా(అలైహిస్సలామ్) వంకీలు తిరిగిన జుత్తు కలవారు. మరీ అంత పొడుగరీ కారు, పొట్టీ కారు. మధ్యస్థ ఎత్తు ఆయనది". దైవప్రవక్త(స) నరకపాలకుడైన మాలిక్‌ను గురించి, దజ్జాల్‌ను గురించి కూడా ప్రస్తావించారు.**

**66) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మదీనాకు ఏతెంచినప్పుడు అక్కడి ప్రజలు ఒక రోజు -ఆషూరా దినాన (ముహర్రమ్ నెల 10వ తేదీన)- ఉపవాసం పాటిస్తున్నట్లు గమనించారు. ఆ రోజు ఎంతో మహత్పూర్వకమైనదనీ, ఆనాడే అల్లాహ్ మూసా (అలైహిస్సలామ్)కు విముక్తిని ప్రసాదించి, ఫిరౌన్ జనులను ముంచివేశాడని, అందుకే మూసా(అ) ఆ రోజు కృతజ్ఞతా పూర్వకంగా ఉపవాసం ఉన్నారని వారు (యూదులు) చెప్పారు. ఇది విని మహాప్రవక్త(స) ఇలా అన్నారు: "నేను వీళ్ళ కన్నా మూసా (అలైహిస్స లామ్)కు ఎక్కువ సన్నిహితుణ్ణి". అందువల్ల ఆ రోజున ఆయన(స) స్వయంగా ఉపవాసం ఉండసాగారు. సహాబాకు కూడా ఆ మేరకు ఆదేశించారు.[1]**

## అధ్యాయం : 23

## అల్ ఆరాఫ్ సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

**మేము మూసాను (సినాయ్ కొండపైకి) ముప్ఫయి రేయింబవళ్ళ కోసం పిలిపించాము. తరువాత ఇంకా పది రోజులు పొడిగించాము. ఈ విధంగా అతని ప్రభువు నిర్ణయించిన గడువు మొత్తం నలభై రోజులు అయింది. మూసా పోతూ పోతూ తన సోదరుడు హారూన్‌తో ఇలా అన్నాడు : "నా తరువాత నీవు నా జాతి ప్రజలలో నాకు ప్రాతినిధ్యం వహించు. సక్రమంగా వ్యవహరిస్తూ ఉండు. విచ్ఛిన్న**

66-1. పై ఉల్లేఖనాలన్నింటిలో మహనీయ మూసా (అ) ప్రస్తావన రావటం వల్ల అవి ఈ అధ్యాయంతో సమన్వయం చెందుతున్నాయి. మిగతా విషయాలు పాక్షికంగా, సాపేక్షికంగా ప్రస్తావనకు వచ్చాయి.

కారుల మార్గంలో నడవకు". మేము నిర్ణయించిన సమయానికి సరిగ్గా అతను చేరినప్పుడు, అతని ప్రభువు అతనితో సంభాషించాడు. అప్పుడు అతను ఇలా మనవి చేశాడు : "ప్రభూ! నా చూపునకు బలాన్ని ప్రసాదించు. నిన్ను చూస్తాను". ఇలా సెలవిచ్చాడు : "నీవు నన్ను చూడలేవు.కొంచెం, ముందున్న ఆ కొండవైపు చూడు. అది తన స్థానంలో స్థిరంగా ఉంటే అప్పుడు నీవు నన్ను చూడగలవు." ఆ ప్రకారం అతని ప్రభువు ఆ కొండపై తన తేజస్సును ప్రసరింపజేసి దానిని భస్మం చేసేశాడు. మూసా స్పృహ తప్పి పడిపోయాడు. తెలివి వచ్చిన తరువాత ఇలా అన్నాడు : "నీవు పరిశుద్ధుడవు. నేను నీ సన్నిధిలో పశ్చాత్తాప పడుతున్నాను. అందరికంటే మొదట నేనే విశ్వసిస్తున్నాను." ***(అల్ ఆరాఫ్ – 142, 143)***

అరబ్బు ప్రజలు **'దక్కతా'** అని అంటుంటారు. అంటే కుదిపివేశాడు అని అర్థం. అల్ హాఖ్ఖా సూరాలోని **'ఫదుక్కతా దక్కతన్ వాహిదహ్'** అనే వాక్యం దీని నుండే వచ్చింది (ఒకే దెబ్బకు తుత్తునియలు చేయటం జరిగింది– **69: 14)...**

**67)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : " ప్రళయదినాన జనులంతా స్పృహ కోల్పోతారు. తరువాత అందరికన్నా మొదట నేను స్పృహలోకి వస్తాను. అప్పటికే మూసా (అలైహిస్సలామ్) దైవ సింహాసనం (అర్ష్) కాళ్ళలో ఒక కాలును పట్టుకుని ఉండటం నేను గమనిస్తాను. మరి ఆయన గారు నాకంటే ముందే స్పృహలోకి వచ్చారో లేదా (అసలు స్పృహ కోల్పోలేదో) తూరు పర్వతంపై స్పృహ కోల్పోయిన దానికి బదులుగా మినహాయింపు ఇవ్వబడిందో నాకు తెలియదు."

**68)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : బనీ ఇస్రాయీల్ (ఇస్రాయీల్ సంతతివారు) గనక లేకపోతే (వారు 'సల్వా' మాంసాన్ని నిల్వ చేసి ఉంచకపోతే) మాంసం ఎప్పటికీ కుళ్ళిపోయేది కాదు. ఒకవేళ హవ్వా లేకపోతే (ఆమె ఆదమ్– అలైహిస్సలామ్‌ను ఏమార్చి ఉండకపోతే) ఏ స్త్రీ కూడా తన భర్తకు ద్రోహం చేసేది కాదు.

## అధ్యాయం : 24

అల్ ఆరాఫ్ సూరాలో ప్రస్తావనకు వచ్చిన 'తుఫాను' **(7: 133)** వరద ఉధృతి అన్న అర్థంలో ఉంది.

**అత్యధిక మరణాలను కూడా తుఫాను, ఉప్పెన అని అంటారు. 'అల్ ఖుమ్మల్' ఒక పురుగు. అది అతి చినదైన పేలులా ఉంటుంది... 'హాఖీఖ్' అనే పదం 'సుఖీత' అన్న అర్థంలో ఉంది. అంటే అతను తన చేతిలో పడిపోయాడు [1] అని అర్థం.**

## అధ్యాయం : 25

## మహనీయ ఖిజర్(అ), మహనీయ మూసా(అ)ల వృత్తాంతం

**69) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి)కి– హుర్ బిన్ ఫజారీ (రజి)కి మధ్యన, దైవప్రవక్త హజ్రత్ మూసా(అ)కు తారసపడిన వ్యక్తి విషయంలో అభిప్రాయభేదం ఏర్పడింది. అంతలో మహనీయ ఉబై బిన్ కాబ్(రజి) అటువైపుగా సాగిపోతుండగా, ఇబ్నె అబ్బాస్(రజి) ఆయన్ని పిలిచి, 'దైవప్రవక్త మూసా(అ) గారికి తారసపడిన వ్యక్తి (పడవలో రంధ్రం చేసిన, ఒక అబ్బాయిని చంపివేసిన, పడిపోవడానికి సిద్ధంగా గోడకు మరమ్మతు చేసిన వ్యక్తి) విషయంలో నాకూ– ఈయన గారికి మధ్య భేదాభిప్రాయం వచ్చింది. దీని గురించి మీరు దైవప్రవక్త(సఅసం) ద్వారా ఏమైనా విన్నారా?' అని అడిగారు. దానికి ఆయన (రజి), అవును, నేను దైవప్రవక్త(స) ఈ విధంగా చెబుతూ ఉండగా విన్నాను – "మూసా(అలైహిస్సలామ్) బనీ ఇస్రాయీల్‌కు చెందిన ఒక సమూహంతో కలసి కూర్చుని ఉండగా, ఒక వ్యక్తి వచ్చి 'సమస్త భూమండలంలో మీకన్నా ఎక్కువ జ్ఞానం కలిగి ఉన్నవారెవరో మీకు తెలుసా? అని అడిగితే, 'లేదు' అని మూసా(అ) చెప్పారు. అప్పుడు అల్లాహ్ మూసా(అ)పై దైవవాణిని అవతరింపజేసి, 'ఎందుకు లేదు? ఉన్నాడు. మా దాసుడు**

24–1. తన తప్పిదంపై సిగ్గుతో కుంచించుకుపోయే మనిషి తన చేతివ్రేళ్లను తన పల్లతో కొరుక్కుంటాడు. ఒక్కోసారి దుఃఖావేదనతో కూడా అలా చేస్తాడు. ఇకపోతే 'ఖుమ్మల్' అనే పదం అర్ ఆరాఫ్ సూరా 133వ వచనంలో వచ్చింది. పూర్తి ఆయత్ ఇలా ఉంది : "మేము వారిపైకి తుఫానును పంపాము. మిడతల దండును వదిలాము. పేలు వ్యాపింపజేశాము. కప్పలను పుట్టించాము. రక్తం కురిపించాము. కాని వారు తలబిరుసుతనం ప్రదర్శిస్తూనే పోయారు. వారు మహాపరాధం చేసిన ప్రజలు. (అల్ ఆరాఫ్ : 133) అంటే మేము ఫిరౌనీయులపై వారం రోజులపాటు కుండపోత వర్షం కురిపించాము. ఎక్కడ చూసినా కప్పలు, పేలు కనిపించేవి. మిడతల దండు వారి జీవితాన్ని దుర్భరం చేసింది. నైలు నదిలోని నీరు రక్తంలా అయిపోయిందని బైబిల్ నిర్గమ కాండంలో కూడా ఉంది. కాని వారు ఈ శిక్షా సూచనలను చూసి కూడా దారికి రాలేదు.

ఖిజర్ ఉన్నాడు' అని తెలియపరిచాడు. 'ఆయన వరకు చేరుకునే మార్గం ఏది?' అని మూసా(అ) విన్నవించుకోగా, చేపను ఒక సూచనగా తెలియపరచటం జరిగింది. అంటే చేప తప్పించుకుపోయిన చోటికి తిరిగి రావాలి. అక్కడే ఆయన కలుస్తాడు అని సూచించటం జరిగింది. అందువల్ల మూసా(అలైహిస్సలాం) ప్రయాణంలో చేపను జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉన్నారు. తరువాత ప్రయాణ సహవాసి ఆయనతో ఇలా అన్నాడు : 'మేము ఆ చట్టుబండ దగ్గర ఆగినప్పుడు, నేను చేప సంగతి మీకు చెప్పటం మరచిపోయాను. నన్ను షైతాన్ పరధ్యానానికి గురి చేశాడు'. దానికి మూసా (అ), 'అయ్యో. మనం వెళ్ళవలసినది అక్కడికే కదా!' అని పలికి, అదే మార్గం గుండా తిరుగు ప్రయాణం సాగించారు. ఎట్టకేలకు హజ్రత్ ఖిజర్ (అలైహిస్సలామ్)ను కలుసుకున్నారు. వీరిద్దరికి ఎదురైన సంఘటనల్ని అల్లాహ్ తన గ్రంథంలో విశదీకరించాడు.[1]

**70)** సయీద్ బిన్ జుబైర్ ఇలా అన్నారు : ఖిజర్‌ను కలుసుకున్న మూసా బనీ ఇస్రాయీల్ మూసా కారని నౌఫ్ బకాలీ అంటున్నాడు కదా! అని నేను హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి)ను అడిగితే, ఆయన ఇలా అన్నారు: "దైవ విరోధి తప్పుడు మాట అన్నాడు". హజ్రత్ ఉబై బిన్ కాబ్(రజి)గారు ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా విని మాకు ఇలా తెలియజేశారు– "మహనీయ మూసా ఇస్రాయీల్ జనుల మధ్యన నిలబడి ప్రసంగిస్తూ ఉండగా, 'అందరికన్నా గొప్ప జ్ఞాని ఎవరు?' అన్న ప్రశ్న ఆయనకు వేయబడింది. దానికి ఆయన 'నేనే' అని బదులిచ్చారు. దానిపై అల్లాహ్ ఆయన్ని మందలించాడు. ఎందుకంటే అందరికన్నా గొప్ప జ్ఞాని (సర్వ జ్ఞాని) అల్లాహ్‌యే అని ఆయన అనలేదు. అందువల్ల అల్లాహ్ ఆయనకు

---

69–1. దివ్య ఖుర్‌ఆన్‌లోని అల్ కహ్ఫ్ సూరాలో దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) హజ్రత్ ఖిజర్(అ)ను కలుసుకున్నప్పుడు ఎదురైన వింత సంఘటనలను తరచి చూసినప్పుడు బోధపడేదేమంటే; పైకి ఆక్షేపణీయంగా కనిపించే ఎన్నో విషయాలలో 'మేలు' దాగి ఉంటుంది. నిజం బయటపడితేగాని అందలి మర్మం తెలిసిరాదు. అందుకే ధార్మిక తీర్పులు (ఫత్వాలు) ఇచ్చే విద్వాంసులు, ధర్మవేత్తలు, ముఫ్తీలు విషయంలోని కోణాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలనగా చూడాలి. ధర్మవేత్తలకు, న్యాయాధిపతులకు దైవం అడుగడుగునా తోడ్పడుగాక! హజ్రత్ మూసా(అ)– హజ్రత్ ఖిజర్(అ)ల వృత్తాంతం అందరికీ కనువిప్పు కలిగించాలి.

తెలియపరిచాడు– 'ఉన్నాడు. రెండు సాగరాల సంగమం జరిగే చోట నా దాసు డొకడు ఉన్నాడు. అతను నీ కన్నా ఎక్కువ జ్ఞానం కలవాడు' అని.

'ఓ సకల లోకాల ప్రభువా! నేనాయన్ని ఎలా కలుసుకోగలను?' అని మూసా(అ) విన్నవించుకోగా, 'ఒక చేపను పట్టి నీ సంచిలో వేసుకో. ఆ చేప ఎక్కడ తప్పించుకుని పోతుందో అక్కడే నా దాసుడు నీకు కనిపిస్తాడు' అని అల్లాహ్ సెలవిచ్చాడు. అందువల్ల మూసా (అ) చేపను పట్టి, దానిని ఒక సంచిలో వేసు కున్నారు. తరువాత ఆయన తన ప్రయాణ సహవాసి యోషే బిన్ నూన్‌తో కలసి ప్రయాణం సాగించారు. వారు ఒక చట్టుబండపైకి చేరినప్పుడు, దానికి ఆనుకుని విశ్రమించారు. మూసా(అలైహిస్సలామ్)కి నిద్రపట్టేసింది. అంతలో చేప గిలగిలా కొట్టుకుంటూ జలాశయంలోనికి విచిత్రంగా దారి చేసుకుని వెళ్ళిపోయింది. అల్లాహ్ ఆ సమయంలో నీటి ప్రవాహాన్ని ఆపేశాడు. అదొక సొరంగం మాదిరిగా అయిపోయింది. తరువాత వారిద్దరూ ఆ రోజు పగలు రాత్రిలోని మిగిలిన భాగంలో నడుస్తూనే ఉన్నారు. మరునాడు మూసా(అ) తన ప్రయాణ సహచరునితో, 'మా భోజనం తీసుకురా. మేము ఈ ప్రయాణంలో బాగా అలసిపోయాము' అన్నారు. అల్లాహ్ మూసా(అ)కు ఆదేశించిన స్థలాన్ని దాటి ముందుకు పోయే వరకూ ఆయనకు అలసట అనిపించలేదు. తోటి ప్రయాణీకుడు ఆయనతో, 'చూశారా! మనం చట్టుబండపై ఆగినప్పుడు, చేప గురించి మీకు చెప్పటం మరచేపోయాను. ఆ విషయం మీకు చెప్పకుండా షైతాన్ నాకు మరపునకు గురిచేశాడు. చేప అక్కడ విచిత్రమైన పద్ధతిలో జలాశయంలోనికి దారి చేసుకుని వెళ్ళిపోయింది' అని చెప్పాడు. జరిగిన దానిపై వారు ఆశ్చర్యచకితులయ్యారు. 'అయ్యో! మనం వెళ్ళా ల్సింది అక్కడే కదయ్యా బాబు!' అని మూసా(అ) చెప్పారు. ఇద్దరూ కలసి వచ్చిన దారిలోనే వెనక్కి నడిచారు. వారు ఆ చట్టుబండను చేరుకునేసరికి, అక్కడ ఓ వయోవృద్ధుడు ఒకే వస్త్రంలో తన శరీరమంతటినీ కప్పుకుని విశ్రమిస్తున్నారు. హజ్రత్ మూసా(అ) ఆయనకు సలామ్ చేశారు. ఆ మహనీయుడు సలామ్‌కు బదులు పలికిన తరువాత, 'మీ ప్రాంతంలో సలామ్ ఆచారం ఎలా ప్రాచుర్యంలోనికి వచ్చింది?' అని ప్రశ్నించారు. 'నేను మూసాను' అని ఆయన బదులిచ్చారు. 'ఏ మూసా? బనీ ఇస్రాయీల్ వారి మూసానా?' అని ఆ మహనీయుడు ప్రశ్నించగా, 'అవును' అని మూసా(అ) జవాబిచ్చారు. 'మీకు నేర్పబడిన ప్రయోజనకరమయిన విద్యను మీ వద్ద ఉండి ఆర్జించటానికి నేను మీ సేవలో హాజరయ్యాను' అని

మూసా(అ) విన్నవించుకోగా, 'ఓ మూసా! నా వద్ద దైవ ప్రసాదితమయిన ఒక విద్య ఉంది. అల్లాహ్ దానిని నాకు నేర్పాడు. 'దానిని మీరెరుగరు' అని ఖిజర్ (అ) చెప్పారు. 'నేను మీతో పాటు ఉండగలనా?' అని మూసా(అ) విన్నవించుకోగా, 'మీరు నా వెంట ఉండి ఓర్పు వహించలేరు. అయినా మీరెరుగని విషయాలపై మీరు ఓర్పు ఎలా వహించగలరు?' అని ఆయన అన్నారు. దైవచిత్తమయితే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు అని మూసా(అ) పలికారు. ఏ వ్యవహారంలోనూ నేను మీకు అవిధేయత చూపను అని కూడా హామీ ఇచ్చారు. దానికి ఆ మహనీయుడు, 'సరే. ఒకవేళ మీరు నాతో రాదలిస్తే, స్వయంగా నేను మీతో ప్రస్తావించేవరకూ నన్ను ఏ విషయమూ అడగకండి' అన్నారు. వారు సాగర తీరంలో నడక సాగించారు. వారి సమీపంలోనుంచి ఒక పడవ సాగిపోతుండగా, తమను కూడా పడవ పైకి ఎక్కించుకోమని వారు కోరారు. పడవ నడిపే వారికి ఖిజర్ (అలైహిస్సలామ్) చిరపరిచితులు. అందువల్ల చార్జీలు తీసుకోకుండానే పడవపైకి ఎక్కించుకున్నారు. వీరు పడవపై కూర్చున్న తర్వాత, ఒక పిచ్చుక వచ్చి పడవ అంచున కూర్చుని తన నోటిని ఒకట్రెండు సార్లు నీటిలో ముంచి నీరు త్రాగింది. అది గమనించిన ఖిజర్, 'మూసా! ఈ పిచ్చుక తన నోటితో జలాశయంలోని నీరును తీసుకున్నంత మాత్రాన ఏ విధంగా నీరు తరగదో అదేవిధంగా నాకూ, మీకూ ప్రసాదించబడిన జ్ఞానం వల్ల అల్లాహ్ జ్ఞానసంపద తరిగిపోదు' అని చెప్పారు.

మరి అంతలోనే ఖిజర్(అ) తన గొడ్డలితో ఒక్క వ్రేటు వేసి పడవలోని ఒక కొయ్యపలకను తీసేశారు (అంటే పడవలో లోపం ఏర్పరిచారు). ఇది చూసిన మూసా(అ), 'అయ్యో! ఇదేం చేశారు మీరు? మా నుండి చార్జీలు కూడా తీసుకోకుండా– ఉచితంగానే పడవ ఎక్కించుకున్నవారి పడవ మీదే మీ చెడుచూపు పడిందే! పడవ పైనున్న వారు మునిగిపోవాలనా మీ ఉద్దేశం? ఏది ఏమైనా మీరు చేసిన ఈ పని ఎంతమాత్రం సహించరానిది' అన్నారు. దానికి ఖిజర్(అ), "ఏమిటి, నేను మీతో ముందే అనలేదా, మీరు నాతోఉండి ఓర్పు వహించలేరని?' అని చెప్పగా, (ఈ వాగ్దానాన్ని నేను మరచిపోవటం జరిగింది. అందువల్ల) నా మరుపుపై నన్ను నిలదీయకండి. నా వ్యవహారంలో కఠినంగా వ్యవహరించకండి' అని మూసా (అలైహిస్సలామ్) సంజాయిషీ ఇచ్చుకున్నారు. ఇది మొదటిసారి మరపు కారణంగా మూసా(అ) వల్ల జరిగిన ఉల్లంఘన.

పడవ ప్రయాణం ముగిసిన తరువాత వారు ఒక పిల్లవాని ముందునుంచి సాగిపోతున్నారు. ఆ పిల్లవాడు తోటి పిల్లలతో కలసి ఆడుకుంటున్నాడు. హజ్రత్ ఖిజర్(అ) ఆ పిల్లవాడి తల పట్టుకుని– తన చేత్తో– శరీరం నుండి మొండాన్ని వేరు చేసేశారు– సుఫ్యాన్ తన చేత్తో, వేరుపరచిన వైనాన్ని సంజ్ఞ ద్వారా విరిచి చూపించారు– దానిని చూసి హజ్రత్ మూసా(అ) ఓర్చుకోలేకపోయారు. 'మీరు ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నారు. పోనీ ప్రతీకార హత్యగా అలా చేశారా, అంటే అదీకాదు. ఏదిఏమైనా మీరు చేసిన పని దారుణమైనది' అని ఘాటుగా స్పందించారు. దానికి ఖిజర్(అ),'మీరు నా వెంట ఉండి సంయమనం పాటించలేరని ముందే చెప్పాను కదా!' అన్నారు. 'సరే. ఇకమీదట నేను మిమ్మల్ని ప్రశ్నిస్తే నన్ను మీవెంట ఉండనివ్వకండి. నిశ్చయంగా మీరు నా విషయంలో– సంజాయిషీని మన్నించే విషయంలో– ఆఖరి హద్దుకు చేరుకున్నారు' అని మూసా(అ) విన్నవించుకున్నారు.

తరువాత వారు ముందుకుసాగారు. వారొక గ్రామానికి చేరుకున్నప్పుడు, తమకు ఆతిథ్యం ఇవ్వమని గ్రామ ప్రజలను అభ్యర్థించారు. కాని గ్రామస్థులు వారికి ఆతిథ్యం ఇవ్వడానికి నిరాకరించారు. ఆ గ్రామంలో వారికి ఒక గోడ కనిపించింది. అది కూడా కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. హజ్రత్ ఖిజర్(అ) తన చేత్తో సంజ్ఞ చేయగానే ఆ గోడ తిన్నగా– స్థిరంగా– నిలబడింది. 'ఈ గ్రామ ప్రజలు దాక్షిణ్యం లేనివారు. వీరు మనకు ఆతిథ్యం ఇవ్వడానికి నిరాకరించారు. అలాంటప్పుడు గోడ మరమ్మత్తు చేసిన పనికిగాను మీరు తలచుకుంటే వేతనం తీసుకోగలరు కదా' అని మూసా (అ) సలహా ఇవ్వగా 'చాలు చాలు. ఇక మీకూ– నాకూ మధ్య వేర్పాటు జరిగిపోయింది. ఏ ఏ విషయాలపై మీరు ఓర్పు వహించలేక పోయారో వాటిలోని పరమార్థాలను నేను మీకు వివరిస్తాను' అని హజ్రత్ ఖిజర్(అలైహిస్సలామ్) చెప్పారు–

దీనిపై మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా అన్నారు : "మూసా (అలైహిస్సలామ్) గనక సంయమనం పాటించి ఉంటే, అల్లాహ్ ప్రకృతి సిద్ధమయిన మరెన్నో సంఘటనల్లోని పరమ రహస్యాలను మన కొరకు బహిర్గతం చేసేవాడు". సుఫ్యాన్ (ఉల్లేఖకుని) ప్రకారం మహాప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "అల్లాహ్ మూసాపై దయజూపుగాక! ఆయన గనక ఓపిక పట్టి ఉంటే, ఆయనకు (ఖిజర్‌కు)

సంబంధించిన ఎన్నెన్నో సంఘటనలు మనకు తెలిసి ఉండేవి. ఇక ఖిజర్ (అ) విడమరిచి చెప్పిన (ఆ మూడు) విషయాలు : ఆ పడవ వృత్తాంతం ఏమిటంటే అది నదిలో కష్టపడి పనిచేసుకునే కొందరు నిరుపేదలది. నేను దానికి లోపం కల్పించాలని ఎందుకు అనుకున్నానంటే ప్రతి పడవను బలవంతంగా వశపరచుకునే ఒక రాజుకు చెందిన ప్రాంతం ముందు రాబోతోంది. ఇక ఆ బాలుని విషయం– అతడు అవిశ్వాసి. కాగా; అతని తల్లిదండ్రులు విశ్వాసులు– సుఫ్యాన్ ఇలా అన్నారు: “నేను ఈ హదీసును అమ్ర్ బిన్ దీనార్ ద్వారా రెండుసార్లు విన్నాను. ఆయన ద్వారానే విని కంఠస్థం (కూడా) చేసుకున్నాను.

**71)** హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : “ఖిజర్ (అలైహిస్సలామ్)కు ఆ పేరు రావడానికి కారణమేమిటంటే, ఆయన పచ్చికలేని ఒక కటిక నేలపై కూర్చున్నారు. కాని ఆయన అక్కడి నుంచి లేచేసరికి ఆ నేలంతా సస్యశ్యామలంగా నవనవలాడసాగింది.”[1]

## అధ్యాయం : 26

### ముఖ ద్వారం గుండా సాష్టాంగపడుతూ, ‘దేవా! మమ్మల్ని మన్నించు’ అని పలుకుతూ నగరంలో ప్రవేశించండి అని బనీ ఇస్రాయీల్‌తో అనబడిన వేళ...

**72)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : “బైతుల్ మఖ్దిస్‌లో వినమ్రతతో సజ్దా చేస్తూ, ‘దేవా! మమ్మల్ని మన్నించు’ అని వేడుకుంటూ ప్రవేశించండి అని బనీ ఇస్రా యీల్‌కు ఆదేశమయింది. కాని వారు దానిని మార్చివేసి, పిరుదులపై దేకుంటూ ‘వెన్నులో గింజ’ అని పలుకుతూ నగరంలో ప్రవేశించారు.”[1]

---

71–1. ‘ఖిజర్’ అంటే పచ్చదనం కలవాడని అర్థం. హజ్రత్ ఖిజర్(అ) దైవప్రవక్తల వంశీయులని, ఈయన హజ్రత్ ఇబ్రాహీమ్(అ) కంటే ముందే జన్మించారని తెలుస్తోంది. ఖుస్తులానీ, మరితర సూఫీ పండితులు కొందరు ఖిజర్ ఇప్పటికీ జీవించి ఉన్నారని అంటారు. కాని ఇమామ్ బుఖారీ (రహ్మ), పరిశోధకులైన అహ్లె హదీసు వర్గానికి చెందినవారు ఖిజర్ జీవించి లేరని అంటారు. నిజము దేవుడెరుగు. ఆయన కూర్చున్నచోట, నేల పచ్చగా మారటం ఆయన మహిమల్లోనిది. దేవుని ప్రియతములైన దాసుల చేత మహిమలు జరిగాయన్నది సత్యం. కాకపోతే తత్సంబంధిత రుజువులు ఉండాలి. అవి కట్టుకథలై ఉండకూడదు.

**73)** హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "మూసా (అలైహిస్సలామ్) ఎంతో వ్రీడ కలవారు, సిగ్గరి, తన శరీరాన్ని పూర్తిగా కప్పుకునేవారు. ఆయనలోని బిడియపడే స్వభావం కారణంగా ఆయన శరీరంలోని ఏ భాగమూ - నగ్నంగా- కనిపించేది కాదు. ఆయన్ని వేధించటమే తమ లక్ష్యంగా పెట్టుకున్న ఇస్రాయీల్ సంతతి వారు, ఆయన్ని అంత సులభంగా వదలిపెడతారా? వారిలా అనసాగారు: 'ఆయన తన శరీరాన్ని పూర్తిగా కప్పుకోవడానికి కారణం ఆయన శరీరంలో ఏదో లోపం ఉండటమే. లేదా ఆయనకు కుష్ఠ రోగం అన్నా సోకి ఉండాలి లేదా ఆయనకు వరిబీజం అయినా ఉండి ఉండాలి లేదా మరేదన్నా జబ్బు ఉంటుంది'. వారు మోపిన నీలాప నిందల నుండి అల్లాహ్ మూసా(అ)ను పరిశుద్ధపరచదలిచాడు. ఒక రోజు మూసా (అలైహిస్సలామ్) స్నానం చేయడానికి (తటాకం) వద్దకు వచ్చారు. ఒక రాతిబండపై తన వస్త్రాలు పెట్టి జలకాలాడసాగారు. స్నానం ఆచరించిన తరువాత తన బట్టలు తీసుకోవడానికి ఆయన ముందుకు వచ్చారు. కాని ఆ రాతిబండ ఆ బట్టలతో సహా గాల్లో ఎగురసాగింది. వెంటనే హజ్రత్ మూసా(అ) తన లాఠీని పట్టుకుని ఆ రాతి బండను వెంబడిస్తూ ఇస్రాయీల్ జనులు కూర్చున్నచోటికి చేరుకున్నారు. అప్పుడు వారంతా నగ్నంగా ఉన్న మూసా(అ)ను చూశారు. దేవుడు చేసిన మనుషుల్లో ఆయన అందరికన్నా మంచి స్థితిలో- ఏ శారీరక లోపమూ లేకుండా- ఉండటం వారు గమనించారు. ఆ విధంగా అల్లాహ్ బనీ ఇస్రాయీల్ ప్రజలు మోపిన నింద నుండి మూసా(అ)ను గౌరవప్రదంగా విముక్తం చేశాడు. అప్పుడు ఆ రాతిబండ కూడా ఆగిపోయింది. ఆయన బట్టలు తొడుక్కుని, తన లాఠీతో ఆ రాతిబండను కొట్టసాగారు. దైవసాక్షి! ఆ రాయిపై మూసా(అ) కొట్టడం వల్ల మూడు లేక నాలుగు లేదా అయిదు చోట్ల గుర్తులు పడ్డాయి- "విశ్వాసులారా! మూసాకు మనస్తాపం కలిగించిన ప్రజల మాదిరిగా అయిపోకండి. తరువాత అల్లాహ్, వారు కల్పించిన మాటల బారి నుండి అతనికి విముక్తి కలిగించాడు. అతను అల్లాహ్ దృష్టిలో ఎంతో గౌరవనీయుడు" *(అల్ అహ్జాబ్ : 69)* అన్న దైవోపదేశం ఈ సంఘటన నేపథ్యం లోనే ఉంది.

---

72-1. ఇస్రాయీల్ సంతతి వారి అవిధేయతకు, తలబిరుసుతనానికి ఇదొక తార్కాణం. వారు అడుగడుగునా తమ ప్రవక్త మూసా(అలైహిస్సలామ్)ను బాధించారు. అందువల్లనే వారు దైవశాపగ్రస్తులయ్యారు.

**74)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ వాయల్ తెలిపారు : అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒకసారి ధనాన్ని పంపిణీ చేశారు. దానిపై ఒక వ్యక్తి, 'దైవప్రసన్నతను దృష్టిలో ఉంచుకుని చేసిన పంపిణీ కాదిది'[1] అని వ్యాఖ్యానించాడు. నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై ఆయనకు ఈ విషయాన్ని చేరవేశాను. ఆయన(స) ఆగ్రహోదగ్రులయ్యారు. నేను ఆయన(స)ముఖారవిందంపై ఆగ్రహ సూచనల్ని పసిగట్టాను. తరువాత ఆయన(స) ఇలా అన్నారు :"అల్లాహ్ మహనీయ మూసా(అలైహిస్సలామ్)పై దయజూపు గాక! ఆయన్ని ఇంతకన్నా ఎక్కువగానే బాధించటం జరిగింది. కాని ఆయన ఓర్పు వహించారు."

## అధ్యాయం : 27

### ఆరాఫ్ సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

"వారు తమ విగ్రహాలను పూజిస్తూ ఉన్నారు." *(7: 138)*

ఇదే సూరాలో **'ముతబర్రున్'** అనే పదం వచ్చింది. ఇక్కడ దీనికి నాశనం అయ్యేది అన్న అర్థం వస్తుంది. బనీ ఇస్రాయీల్ సూరాలో వచ్చిన **'లియుతబ్బిరూ'** అనే పదానికి అర్థం 'ధ్వంసం చేయటానికి' అని. **'మా అలవ్'** అంటే ప్రాబల్యం వహించినప్పుడు, అధికారం పొందినప్పుడు అన్న అర్థాలొస్తాయి.

**75)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు : (ఒకసారి ప్రయాణంలో) మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి 'పీలూ' పండ్లను కోయ సాగాము. అప్పుడాయన(స), "నల్లని పండ్లను కోయండి. అవి బాగా మాగి, రుచి కరంగా ఉంటాయి" అని చెప్పారు. దానికి సహచరమాన్యులు, 'ఏమిటి, తమరు ఎప్పుడయినా గొర్రెల కాపరిగా ఉన్నారా?' అని అడగ్గా, "గొర్రెల కాపరిగా ఉండని ప్రవక్త ఎవరూ గడవలేదు"[1] అని ఆయన(స) చెప్పారు.

---

74-1. ఆ వ్యర్థ ప్రేలాపన చేసిన వ్యక్తి ఒక కపట విశ్వాసి (మునాఫిక్). దైవప్రవక్త(స) ఆ కపటి కూసిన కూతపై సంయమనం పాటించారు. ఈ సందర్భంగా మహనీయ మూసా(అ)ను స్మరించుకున్నారు. ఇదే ఈ అధ్యాయంలోని కీలక విషయం.

75-1. ఈ హదీసులో దైవప్రవక్తలందరి ప్రస్తావన రావటం వల్ల హజ్రత్ మూసా(అ) కూడా వచ్చేశారు. పైగా 'నసాయి'లోని ఉల్లేఖనంలో మహనీయ మూసా (అ) ప్రస్తావన చాలా వివరంగా వచ్చింది. దైవప్రవక్తలందరూ గొర్రెల్ని మేపిన తరువాత మనుజ జాతి

## అధ్యాయం : 28

## దైవోపదేశం

ఆ సంఘటనను కూడా గుర్తుకు తెచ్చుకోండి : మూసా తన జాతి వారితో, "అల్లాహ్ మిమ్మల్ని ఒక గోవును బలిగా ఇవ్వండి అని ఆజ్ఞాపిస్తున్నాడు" అని అన్నప్పుడు, వారు, "మాతో నీవు పరిహాసమాడుతున్నావా?" అని బదులు పలికారు. "అవివేకుల మాదిరిగా నేనూ మాట్లాడకుండా నన్ను రక్షించు అని నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను" అని మూసా అన్నాడు.

అబుల్ ఆలియా ఇలా అన్నారు: ఖుర్ఆన్‌లో 'అవాను' అని వచ్చింది. అంటే ఆ ఆవు మరీ ముసలిదీ కాకుండా, లేగ దూడ కూడా కాకుండా మధ్య వయస్సులో ఉండాలి. ఫాఖివు లౌనుహా తసురున్నాజిరీన్– అంటే చూసేవారికి మనోహరంగా కనిపించాలి. లా జలూలున్ అంటే అది పనిచేసి చేసి నీరసించిపోయినదై ఉండ కూడదు. తుసీరుల్ అర్జ- అంటే భూమి దున్నలేనంత, మోట లాగలేనంత బలహీన మైనదై ఉండకూడదు. ముసల్లమతున్ అంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి. లా షియత అంటే దానికి వాతలు వేసి ఉండకూడదు...

## అధ్యాయం : 29

## మహనీయ మూసా(అ) మరణం : ఆయన తదనంతర పరిస్థితులు

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : అల్లాహ్ హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) దగ్గరకు మరణదూత (మలకుల్‌మౌత్)ను పంపాడు. మరణదూత మూసా (అ) దగ్గరకు వచ్చినప్పుడు ఆయన అతనికి చాచి ఓ చెంపదెబ్బ కొట్టారు. (ఎందుకంటే ఆ మరణ దూత మానవాకారంలో వచ్చాడు). మరణ దూత ప్రభువు సన్నిధికి తిరిగి వెళ్ళి, 'ప్రభూ! నీవు నన్ను మరణానికి సిద్ధంగా లేని దాసుని వద్దకు పంపావు' అని నివేదించుకున్నాడు. దానికి అల్లాహ్, "మళ్ళీ అతని దగ్గరకు వెళ్ళి, 'నీ చేతిని ఒక ఎద్దు వీపుపై పెట్టు. ఎన్ని వెంట్రుకలు చేతికి తగులుతాయో చూసి, ఒక్కో వెంట్రుకకు ఒక్కో సంవత్సరం చొప్పున ఆయుషు పెంచబడుతుంది' అని అతనితో

---

సంస్కరణా బాధ్యత వారిపై మోపటం జరిగింది. మరి కొందరేమంటారంటే; దేవుడు ప్రవక్తా పదవిని బలహీనులకు, మృదు మనస్కులకు ఇస్తాడు– అంటే గొర్రెల కాపరులకు ఇస్తాడు. గర్వాతిశయంతో విర్రవీగే వారికి ఆ పదవిని ఇవ్వడు.

**అను" అని సెలవిచ్చాడు. మరణదూత మరోసారి మూసా(అ) దగ్గరకువచ్చి, దైవ నిర్ణయాన్ని వినిపించాడు. దానికి మూసా(అ), 'ఓ ప్రభూ! మరి ఆ తర్వాత ఏం జరుగుతుంది?' అని అడగ్గా, "మృత్యువు కబళిస్తుంది" అని అల్లాహ్ బదులిచ్చాడు. దానికి మూసా(అ), 'మరి అలాగైతే ఆ మరణం ఇప్పుడే ఎందుకు రాకూడదు?' అని అడిగారు– మహనీయ అబూ హురైరా(రజి) వివరించారు : మహనీయ మూసా (అ) అల్లాహ్‌ను ప్రార్థించారు: 'నన్ను బైతుల్ మఖ్దిస్‌కు సమీపంలో ఉండేట్లుగా చూడు (అంటే నా సమాధి బైతుల్ మఖ్దిస్‌కి దగ్గరలో ఉండాలి). ఒకవేళ రాయి విసిరేవాడు అక్కడి నుండి రాయి విసిరితే అది బైతుల్ మఖ్దిస్ వరకూ చేరుకోవాలి'. మహాప్రవక్త(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూహురైరా (రజి) చెప్పారు: "నేను గనక అక్కడ ఉండే మాటైతే, మీకు ఆయన సమాధి చూపించేవాణ్ణి. అది దారి ప్రక్కన ఎర్రని ఇసుక గుట్ట క్రింద ఉంది."[1]**

**76) మహనీయ అబూహురైరా(రజి) ఉల్లేఖనం : ముస్లిం సముదాయానికి చెందిన ఒక వ్యక్తికి– ఒక యూదునికీ మధ్యన గొడవ జరిగింది. 'ముహమ్మద్ (సఅసమ్)ను సమస్త లోక వాసుల కొరకు ఎన్నుకున్న శక్తిమంతుని సాక్షిగా!' అని ముస్లిం ఒట్టేసి ఒక విషయం చెప్పాడు. 'మూసాను సమస్త లోకవాసులలో ప్రత్యేకంగా ఎన్నుకున్న శక్తిమంతుని సాక్షిగా!' అని యూదుడు ఒట్టేసి మరీ ఒక విషయం చెప్పాడు. అంతే, ముసల్మానుకు కోపం వచ్చింది. అతను యూదుని చెంప ఛెళ్ళుమనిపించాడు. అప్పుడు ఆ యూదుడు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, ముస్లింపై ఫిర్యాదు చేశాడు. అప్పుడు దైవప్రవక్త(స) జరిగినదంతా విని, "నాకు మహనీయ మూసా (అలైహిస్సలామ్)పై ప్రాధాన్యత కల్పించకండి.[1] ప్రళయదినాన ప్రజలు**

29–1. **'మలకుల్ మౌత్'** మహనీయ మూసా(అ) వద్దకు మానవాకారంలో రావటం వల్ల, ఆయన్ని సామాన్య మనిషి అనుకుని మూసా(అ) చెంపదెబ్బ కొట్టారు. కాని 'వాస్తవం' తెలిశాక ఆయన అల్లాహ్ వద్దకు చేరుకోవటాన్ని ఇష్టపడ్డారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)కు ఇహపరాల ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడినప్పుడు, పరమోన్నత మిత్రుడే కావాలని ఆయన కోరుకున్నారు.

ఇక మహనీయ మూసా(అ) బైతుల్ మఖ్దిస్‌లో సమాధి అవటాన్ని కోరుకోలేదు. పైగా నగరానికి అల్లంత దూరాన తన సమాధి ఉండేలా చేయమని దైవాన్ని ప్రార్థించారు. ఎందుకు? ఎందుకంటే, తన అనుయాయులు తన సమాధిని పూజాస్థలంగా చేసుకుంటారేమోనని ఆయన భయపడ్డారు.

స్పృహ కోల్పోయేలా చేయబడుతుంది. అందరికన్నా ముందు నేను స్పృహలోకి వస్తాను. అప్పటికే మహనీయ మూసా(అ) దైవసింహాసనం (అర్ష్) కాలు ఒక దానిని పట్టుకుని నిలబడి ఉండటం నేను చూస్తాను. మరి ఆయన కూడా స్పృహ కోల్పోయి నాకంటే ముందే స్పృహలోకి వచ్చారో? లేదా అల్లాహ్ ఆయన్ని స్పృహ కోల్పోయిన వారి నుండి మినహాయించాడో? నాకు తెలియదు."

**77)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : హజ్రత్ ఆదమ్(అలైహిస్సలామ్)కి- హజ్రత్ మూసా (అలైహిస్సలామ్)కి మధ్యన సంవాదన జరిగింది. మూసా(అ) ఆదమ్(అ)తో "పాపం చేసిన కారణంగా స్వర్గం నుండి బహిష్కరించబడిన ఆదమ్(అ) మీరే కదూ!" అన్నారు. దానికి ఆదమ్(స) బదులిస్తూ, "అల్లాహ్ మిమ్మల్ని ప్రవక్తా పదవితో సత్కరించాడు. మీతో సంభాషణ జరిపి, జనులపై మీకు ప్రాధాన్య తను వొసగాడు. అయినా (జ్ఞానం కలిగిన) మీరు, పుట్టుకకు ముందే నా విధి వ్రాతలో లిఖించబడి ఉన్న ఒకానొక విషయంపై నన్ను నిందిస్తున్నారా?" అన్నారు. మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా అన్నారు: "ఆ విధంగా ఆదమ్(అ) వాదోపవాదా లలో మూసా(అ)పై ఆధిక్యత వహించారు".

**78)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం: ఒక రోజు ప్రవక్త మహనీయులు(సఅసమ్) మా వద్దకు విచ్చేసి, ఇలా అన్నారు : "నా దగ్గరకు మానవ సముదాయాలన్నీ తేబడ్డాయి. ఒక పెద్ద సముదాయం ఆకాశపు అంచుల్లో కిక్కిరిసి ఉండటం నేను గమనించాను. 'వీరు మహనీయ మూసా(అలైహిస్సలామ్) జనుల'ని నాకు తెలియజేయటం జరిగింది."

## అధ్యాయం : 30

## అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

విశ్వాసుల విషయంలో అల్లాహ్ ఫిరౌన్ భార్యను ఉదాహరణగా పేర్కొంటున్నాడు. అప్పుడు ఆమె ఇలా ప్రార్థించారు, "ప్రభూ! నా కొరకు నీ వద్ద స్వర్గంలో ఒక గృహాన్ని నిర్మించు. నన్ను ఫిరౌన్ నుండీ, అతని చేష్టల నుండీ

76-1. అంటే దైవప్రవక్త హజ్రత్ మూసా(అలైహిస్సలాం)ను దిగజార్చినట్లు మాట్లాడకండి లేదా ప్రవక్తలందరికన్నా ముహమ్మద్(స) శ్రేష్ఠులు అన్న విషయం అప్పటికింకా ఆయన(స)కు తెలుపబడి ఉండకపోవచ్చు. లేదా ప్రవక్తల గురించి వ్యాఖ్యానించేటప్పుడు, మీ స్వంత అభిప్రాయాలను వెలిబుచ్చకండి అనేది దీని ఉద్దేశ్యమై ఉండవచ్చు.

**కాపాడు, దుర్మార్గపు జాతి నుండి నాకు విముక్తి కలిగించు.” ఇంకా ఇమ్రాన్ కుమార్తె మర్యమ్‌ను కూడా ఉదాహరణగా పేర్కొంటున్నాడు : ఆమె తన మానాన్ని కాపాడుకున్నారు. ఆ తరువాత మేము ఆమెలోకి మా తరఫు నుండి ఆత్మను ఊదాము. ఆమె తన ప్రభువు సూక్తులను, ఆయన గ్రంథాలను ధ్రువపరచారు. ఆమె వినయవిధేయతలు గల వారిలో ఒకరు. *(అత్ తహ్రీమ్– 11,12)***

**79)** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ప్రవచించారని అబూ మూసా(రజి) తెలిపారు : **“పురుషులలోనయితే ఎందరో పరిపూర్ణత కలవారు ప్రభవించారు. కాని స్త్రీలలో ఫిరౌన్ భార్యయగు ఆసియా (అలైహస్సలామ్), ఇమ్రాన్ కుమార్తె అగు మర్యమ్ (అలైహస్సలామ్) తప్ప వేరెవరూ పరిపూర్ణత కలవారుగా పుట్టలేదు. కాకపోతే వంటకాలన్నింటిపై ‘సరీద్’కు ఎలాంటి ప్రాధాన్యత ఉందో, మహిళలం దరిపై ఆయిషా(ర.అ)కు అలాంటి ప్రాధాన్యతే ఉంది.”[1]**

## అధ్యాయం : 31

## గర్వాతిశయం- దాని పరిణామం

**ఇదొక యథార్థం; ఖారూన్ మూసా జాతికి చెందిన ఒక వ్యక్తి. అతడు తన జాతికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. మేము అతనికి ఎన్నో నిధులను ఇచ్చాము. వాటి తాళపు చెవులను బలాఢ్యులైన వ్యక్తుల ఒక సమూహం కూడా చాలా కష్టంగా ఎత్తగలదు. ఒకసారి అతని జాతి ప్రజలు అతనితో ఇలా అన్నారు, “విర్రవీగకు, విర్రవీగేవారిని అల్లాహ్ ప్రేమించచదు.”[1] *(అల్ ఖసస్– 76)***

---

79–1. ‘సరీద్’ అనేది అరేబియాలో ఓ ప్రత్యేక వంటకం. చారు లాంటి పలుచటి కూరలో రొట్టె ముక్కలు కలిపి దానిని వండుతారు.

ఇక్కడ ‘పరిపూర్ణత’ అంటే అర్థం ధార్మికంగా అత్యున్నత స్థానానికి చేరటం. కాని అది ప్రవక్తా పదవికన్నా తక్కువ స్థాయి. ధార్మికంగా అత్యున్నత శ్రేణికి చెందిన మహిళలు ఎందరో కడిచారు. కాని వారిలో ప్రవక్తా పదవి ఎవరికీ లభించలేదు. దీనిపై దాదాపు ఏకాభిప్రాయం ఉంది. అయితే అష్అరీ ఇలా అంటారు : “ఆరుగురు మహిళలు దైవ ప్రవక్తల స్థాయిని పొందారు. వారెవరంటే; హవ్వా, సారా, హాజిరా, మూసా తల్లి, ఆసియా, మర్యమ్”.

31–1. మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ప్రకారం; ఖారూన్ దైవప్రవక్త మూసా(అ)కు వరుసకు పినతండ్రి కొడుకు అవుతాడు. కాని ప్రాపంచిక ధనవ్యామోహం అతని కళ్లు కప్పేసింది. ధనపిపాసతో సత్య తిరస్కారిగా మారిపోయాడు. మరి చూడబోతే అతడు తౌరాతు పండితుడు. కాని ధనమదం అతన్ని మార్గభ్రష్టుణ్ణి చేసింది.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) **'ఊలిల్ ఖువ్వతి'** అనే పదానికి వ్యాఖ్యానం చెబుతూ, ఖారూన్ తాళం చెవులను బలాఢ్యులైన ఒక వ్యక్తుల సమూహం కూడా ఎత్తలేకపోయేది అన్నారు. **'ఫరిహీన్'** అంటే గర్వించకు, నీల్గకు, మిడిసిపడకు అన్న అర్థాలొస్తాయి. 'అల్లాహ్ తాను కోరినవారి జీవనోపాధిని వికసింపజేస్తాడు. తాను కోరిన వారి ఉపాధిని కుదిస్తాడు అన్న విషయం మీకు తెలియదా?'

## అధ్యాయం: 32

## మద్‌యన్ వారి గురించి

మద్‌యన్ ప్రజల వైపునకు మేము వారి సోదరుడైన షుఐబ్‌ను పంపాము. **(హూద్: 84)**

'మద్‌యన్' అనేది ఒక పట్టణం పేరు. అది ఖుల్‌జుమ్ (కెంపు) సముద్రపు గట్టున ఉంది. **"వస్‌అలిల్ ఖర్‌యత..."**– 'మేము బస చేసిన నగరంలోని వారిని మీరు అడిగి తెలుసుకోండి. మేము కలసి తిరుగు ప్రయాణం చేసిన బిడారును విచారించండి.' **(12: 82)**

"ఉదాత్త హృదయుడవు, రుజువర్తనుడవూ కేవలం నీవు ఒక్కడివే మిగిలిపోయావు" అని సత్య తిరస్కారులు దైవప్రవక్త షుఐబ్‌ను ఎద్దేవా చేశారు ***(11: 87)***

'అస్ హాబుల్ అయికహ్'పై ముజాహిద్ వ్యాఖ్యానిస్తూ **'అయికహ్'** అంటే అడవి అని అన్నారు... చివరకు ఛత్ర దినపు శిక్ష వారిపై వచ్చిపడింది. (అష్ షుఅరా– **189)**

## అధ్యాయం : 33

## దైవప్రవక్త మహనీయ యూనుస్(అలైహిస్సలామ్) గురించి

నిశ్చయంగా యూనుస్ కూడా దైవప్రవక్తలలోని వాడే. జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు అతను నిండు పడవ వైపునకు పరుగెత్తాడు. అక్కడ చీటిలో పాల్గొన్నాడు. కానీ ఓడిపోయాడు. చివరకు అతనిని చేప మ్రింగేసింది. అతను దూషితుడయ్యాడు. **(అస్ సాఫ్ఫాత్ : 139– 142)**

**'ములీమ్'** అంటే తప్పు చేసినవాడు అని ముజాహిద్ అభిప్రాయపడ్డారు. **'మష్‌హూన్'** అంటే పూర్తిగా నిండిన పడవ.... అప్పుడు అతను దైవనామస్మరణ

**చేసి ఉండకపోతే, ప్రళయదినం వరకూ ఆ చేప కడుపులోనే ఉండిపోయేవాడు. చివరకు మేము అతనిని తీవ్ర అస్వస్థతకు గురై ఉన్న స్థితిలో ఒక తీర మైదానం మీద పడవేశాము. అతని మీద ఒక తీగల చెట్టు మొలిపింపజేశాము... ఆ తరువాత మేము అతన్ని ఒక లక్ష లేక అంతకంటే ఎక్కువ మంది ప్రజల వద్దకు పంపాము. వారు విశ్వసించారు. మేము ఒక నిర్ణీత కాలం వరకు వారు జీవించి ఉండేలా చేశాము.**

**అల్లాహ్ తన అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)కు సహన బోధ చేస్తూ ఇలా సెలవిచ్చాడు: "నీ ప్రభువు ఆజ్ఞ వెలువడేవరకూ సహనం వహిస్తూ ఉండు. చేపవాని (యూనుస్- అలైహిస్సలామ్) మాదిరిగా వ్యవహరించకు. అతను (మమ్మల్ని) మొరపెట్టుకున్నప్పుడు దుఃఖంలో మునిగి ఉన్నాడు. ఒకవేళ అతని ప్రభువు అనుగ్రహమే అతనికి తోడ్పడక పోయి ఉంటే, అతను అవమానకరమైన స్థితిలో విసిరివేయబడి ఉండేవాడే." *(అల్ ఖలమ్ : 48, 49)***

**80) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "నా గురించి మీలో ఏ ఒక్కరూ, నేను మహనీయ యూనుస్(అలైహిస్సలామ్) కన్నా శ్రేష్ఠుణ్ణి అని అనకూడదు"- ముసద్దద్ గారు 'యూనుస్ బిన్ మత్తయి' అని అదనంగా ఉల్లేఖించారు.**

**81) ప్రవక్త మహనీయులు(సఅసం) ఇలా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖించారు : "నన్ను యూనుస్ బిన్ మత్తయి కన్నా గొప్పవానిగా ఖరారు చేయటం ఏ వ్యక్తికీ తగదు"[1]. ఆయన(స) దైవప్రవక్త యూనుస్ (అ)ను ఆయన తండ్రి పేరుతో సహా స్మరించటం విశేషం.**

**82) మహనీయ అబూ హురైరా(రజి) కథనం : ఒకసారి ఒక యూదుడు తన వస్తు సామగ్రిని జనులకు చూపిస్తూ ఉన్నాడు. కాని అతను ఆ వస్తువులకు పెట్టిన ధర జనులకు అందుబాటులో లేదు. మరోవైపు జనులు అడిగిన ధర అతనికి**

---

81-1. దైవప్రవక్త హజ్రత్ యూనుస్(అ)ను ఖుర్ఆన్ 'చేపవాడు'గా పిలిచింది. ఆయన చేప కడుపులో ఉండి, దేవుని పవిత్రతను కొనియాడారు- "నీవు తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేనేలేడు. నీవు పరిశుద్ధుడవు. నిజానికి తప్పు నా వల్లనే జరిగింది" (అల్ అంబియా- 87). సముద్రపు అట్టడుగులో ఉండి చేసిన ఈ కీర్తన ఊర్ధ్వ లోకాల్లో అలజడిని సృష్టించింది. అల్లాహ్ దయతో ఆయన వైపునకు మరలాడు.

**గిట్టుబాటుగా లేదు. అందువల్ల అతను, 'ఎన్నటికీ అలా వీలుపడదు. మూసా(అ)ను సమస్త లోకవాసుల్లో ప్రత్యేకంగా ఎన్నుకున్న శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను' అన్నాడు. ఈ మాట విన్న ఒక అన్సారీ సహాబీ లేచి, ఆ యూదుని ముఖంపై చెంపదెబ్బ కొట్టారు. 'ఏమిటి, మహాప్రవక్త ముహమ్మద్(స) ఇంకా మన మధ్యనే ఉండగా నువ్వు ఈ విధంగా ఒట్టేసి చెబుతావా? మూసా(అ)ను సమస్త మానవుల్లో నుంచి ప్రత్యేకంగా ఎన్నుకున్న వాని సాక్షిగా! అని అంటావా?' అని మండిపడ్డారు. దానిపై ఆ యూదుడు, సరాసరి దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'ఓ అబుల్ ఖాసిం! ముస్లింలకు– నాకు మధ్య శాంతి ఒడంబడిక జరిగి ఉంది. మరోవైపున ఫలానా వ్యక్తి నా చెంప ఛెళ్ళుమనిపించాడు. ఇప్పుడు మీరేమంటారు?' అని అడిగాడు. దైవప్రవక్త(స) ఆ సహాబీని పిలిపించి, "ఈయన గారిని ఎందుకు కొట్టావు?" అనడిగారు. ఆయన కారణం తెలిపారు. దానిపై దైవప్రవక్త(స) ఆగ్రహోదగ్రు లయ్యారు. ఆ ఆగ్రహ సూచనలు ఆయన(స) ముఖారవిందంపై ప్రస్ఫుటంగా కనిపించాయి. తరువాత ఆయన(స) ఇలా అన్నారు : "దైవప్రవక్తలలో– పరస్పరం ఒండొకరిపై ప్రాధాన్యతను కల్పించకండి. శంఖం ఊదబడినప్పుడు భూమ్యాకాశాల లోని ప్రాణులన్నీ స్పృహ కోల్పోతాయి. అల్లాహ్ కోరిన వారికి మాత్రమే ఈ స్పృహ కోల్పోవటం నుండి మినహాయింపు ఉంటుంది. మలిసారి శంఖం ఊదబడినప్పుడు అందరికంటే ముందు నన్ను లేపటం జరుగుతుంది. అయితే అప్పటికే మహనీయ మూసా(అ) దైవ సింహాసనాన్ని పట్టుకుని నిలబడి ఉండటం నేను చూస్తాను. తూర్ కొండపై కోల్పోయిన స్పృహకు గాను ఆయనకు మినహాయింపు ఇవ్వబడిందో లేక నాకంటే ముందే ఆయన స్పృహలోకి వచ్చారో నాకు తెలీదు."**

**83) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "నేను యూనుస్ బిన్ మత్తయి కన్నా శ్రేష్టుణ్ణి అని చెప్పటం ఏ వ్యక్తికీ ఎంతమాత్రం తగదు."** [1]

---

83–1. అంటే– ఎవరూ తమ స్వంత అభిప్రాయంతో, తమ బుద్ధికి తోచినట్లుగా వ్యాఖ్యానించ కూడదు. ఎందుకంటే శ్రేష్ఠత (ఫజీలత్) అనేది నిగూఢ విషయం. కాబట్టి దానిని అల్లాహ్‌కే వదిలిపెట్టాలి. అయితే కొన్ని హదీసులలో ముహమ్మద్(స) ప్రవక్త దైవప్రవక్తలందరికీ నాయకులు అని చెప్పటం జరిగింది. కనుక ఆయన్ని(స) శ్రేష్టులు అని చెప్పటం సమంజసమే. అయితే ఈ సందర్భంగా ఇతర దైవప్రవక్తలను కించపరచటం తగదు.

## అధ్యాయం : 34

## శనివారం (సబ్బత్) వారి గురించి

సముద్రపు గట్టున ఉన్న ఆ పట్టణాన్ని గురించి కూడా వారిని (యూదులను) కొంచెం అడుగు. ఈ సంఘటనను వారికి గుర్తు చేయి. అక్కడి ప్రజలు సబ్బత్ (శనివారం) రోజున దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించేవారు. ఇంకా చేపలు సబ్బత్ నాడే వారి ముందు ఎగిరెగిరి నీటిపైకి వస్తూ ఉండేవి. సబ్బత్ నాడు తప్ప మిగతా దినాలలో అవి వచ్చేవి కావు. ఇలా ఎందుకు జరిగేదంటే, మేము వారి అవిధేయతల కారణంగా వారిని పరీక్షకు గురిచేస్తూ ఉండేవారము. ఇంకా వారికి ఈ విషయం కూడా గుర్తు చేయి. వారిలోని ఒక వర్గం వారు మరొక వర్గం వారితో ఇలా అన్నారు: "మీరు హితబోధ ఎందుకు చేస్తున్నారు అల్లాహ్ నాశనం చెయ్యనున్నవారికి లేక కఠినంగా శిక్షించనున్న వారికి?" వారు ఇలా సమాధానం చెప్పారు: "మేము మీ ప్రభువు ముందు క్షమింపబడటానికి ఒక కారణంగా చెప్పుకునే నిమిత్తం ఇదంతా చేస్తున్నాము. బహుశా ఈ ప్రజలు ఆయన పట్ల అవిధేయతకు దూరంగా ఉంటారనే ఆశతో చేస్తున్నాము." చివరకు వారు తమకు జ్ఞాపకం చెయ్యబడిన హితబోధలను పూర్తిగా విస్మరించినప్పుడు, మేము చెడు నుండి ప్రజలను వారించేవారిని రక్షించాము. దుర్మార్గులైన ఇతరులందరినీ వారి అవిధేయతల కారణంగా కఠినశిక్షకు గురిచేశాము. తరువాత వారు, తాము నిరోధించబడిన పనినే పూర్తి తలబిరుసుతనంతో చేస్తూ పోయారు. అప్పుడు మేము ఇలా అన్నాము : "కోతులై పొండి, హీనులుగా నీచులుగా!" *(అల్ ఆరాఫ్ : 163-166)*

## అధ్యాయం : 35

## దైవప్రవక్త మహనీయ దావూద్(అలైహిస్సలామ్) గురించి

"మేము దావూద్‌కు 'జబూర్'ను ప్రసాదించాము." *(అన్ నిసా- 163)*

నిశ్చయంగా మేము దావూద్‌కు మా వద్ద నుండి 'మహత్తు'ను వొసగాము. 'ఓ పర్వతమా! ఆయనతో కలసి దేవుని పవిత్రతను కొనియాడు' (అని ఆదేశించాము). పక్షులకు కూడా మేము, ఆయనతో కలసి దేవుని పవిత్రతను కొనియాడమని ఆజ్ఞాపించాము. ఇనుమును ఆయన కొరకు మెత్తగా చేశాము- దాంతో ఆయన కవచాలు తయారు చేయడానికి...

**84) హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "దావూద్ (అలైహిస్సలామ్) కొరకు ఖుర్ఆన్ (అంటే జబూర్) పారాయణం చాలా సులభతరం చేయబడింది. అందు వల్ల ఆయన తన వాహనంపై జీను కట్టమని ఆదేశించేవారు. జీను కట్టకముందే జబూర్‌ను పూర్తిగా పఠించేవారు. అంతేకాదు, ఆయన తన స్వహస్తాలతో (కవచాలు చేసి) ఆర్జించిన సంపాదనను తినేవారు."[1]**

**85) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) తెలిపారు: 'దైవసాక్షి! నేను బ్రతి కున్నంత కాలం పగటిపూట ఉపవాసం పాటించి, రాత్రంతా ఆరాధనలో నిమగ్నుణ్ణి అయి ఉంటాన'ని చెప్పిన సంగతి ప్రవక్త మహనీయుల(సఅసమ్)కు తెలిసింది. తరువాత ఆయన(స), 'ఏమిటి, పగలంతా ఉపవాసం ఉండి, రాత్రంతా ఆరాధనలో నిమగ్నుణ్ణి అయి ఉంటానని నువ్వు ఒట్టేసుకున్నావట! నిజమేనా?" అని నన్ను అడిగారు. దానికి నేను 'అవును. నేనిలా అన్నమాట నిజమే' అని చెప్పాను. అప్పు డాయన(స) ఇలా ఉపదేశించారు: "చూడు! నీవు దీనికి కట్టుబడలేవు. కాబట్టి**

---

84-1. అంత స్వల్ప వ్యవధిలో జబూర్‌ను పూర్తిగా పఠించటం కూడా దావూద్(అ)కు వొసగ బడిన మహిమలతో ఒక మహిమే. కాని ఇప్పుడు ముస్లింలు మూడు రోజులకంటే తక్కువ సమయంలో పూర్తి ఖుర్ఆన్‌ను పఠించడం సున్నత్‌కు విరుద్ధం. మూడు రోజుల కంటే తక్కువ సమయంలో ఖుర్ఆన్‌ను పూర్తిగా చదివినవాడు ఖుర్ఆన్‌ను అసలు అవగాహన చేసుకోలేదని అనాలి.

హజ్రత్ దావూద్(అ) తన అన్నదమ్ములలో అందరికన్నా పొట్టిగా ఉండేవారు. అందువల్ల ప్రజలు ఆయన్ని చిన్నచూపు చూసేవారు. అయితే అల్లాహ్ మహనీయ దావూద్(అ)కు, ఆయన సోదరులపై ప్రాధాన్యతను వొసగాడు. ఆయనపై జబూర్‌ను అవతరింపజేశాడు. ఆ విధంగా ఏ రాయిని నిర్మాతలు మంచిది కాదని భావించి పారవేశారో అదే ఆ మేడ లోని ఒక మూలకు ప్రధాన రాయిగా అయిందన్న బైబిల్ వాక్యం నిజమయింది.

ఇనుముతో అద్భుతాలు చేసే విద్యను కూడా అల్లాహ్ దావూద్‌కు ప్రసాదించాడు. ఆయన చేతిలో ఇనుము మైనంగా మారిపోయేది. దాంతో ఆయన కవచాలతోపాటు వివిధ ఇతర వస్తువులను కూడా తయారు చేసేవారు. అదే ఆయన సంపాదనా మార్గంగా ఉండేది. హదీసులో ఆయన పాటించే ఉపవాసాల పద్ధతి కూడా ప్రశంసించబడింది. అంతేకాదు; ఆయన ఆరాధనా విధానాలను, అభ్యాసాలను, దేవుని వైపునకు ఆయన మరలే తీరును ఖుర్ఆన్ మెచ్చుకుంది.

**ఉపవాసాలు ఉండు. కాని ఉపవాసాలు లేకుండా కూడా గడుపు. రాత్రి పూట ఆరాధ నలు చేసుకో. కాని నిద్రించటం కూడా అవసరమే. ప్రతి నెలా మూడు రోజులు ఉపవాసాలు ఉండు. ప్రతి సదాచరణకు పదింతల పుణ్యఫలం ప్రాప్తమవు తుంది. ఈ విధంగా ఉపవాసాలు ఉండే ఈ పద్ధతి (పుణ్యఫలం రీత్యా) జీవితాంతపు ఉపవాసం మాదిరిగా అయిపోతుంది." దానికి నేను, 'దైవప్రవక్తా! నాకు అంతకన్నా ఎక్కువ శక్తి ఉంది' అని చెప్పాను. "అలాగైతే ఒకరోజు ఉపవాసం పాటించి, రెండు రోజులు ఉపవాసాన్ని విరమించు" అని ఆయన(స) సలహా ఇచ్చారు. దానికి నేను, 'నాకు ఇంతకన్నా ఎక్కువ శక్తి ఉంద'ని విన్నవించుకోగా, 'అలాగైతే ఒకరోజు ఉపవాసం ఉండి, ఒకరోజు ఉపవాసం లేకుండా గడుపు. మహనీయ దావూద్ (అలైహిస్సలామ్) ఉపవాసాల పద్ధతి కూడా ఇదే. ఇదే అత్యుత్తమమైన పద్ధతి" అని మహాప్రవక్త(స) సూచించారు. 'నాకు ఇంతకన్నా ఎక్కువ శక్తి ఉంది' అని నేను ప్రాధేయపడగా, "ఇంతకన్నా మంచి పద్ధతి మరొకటి లేద"ని ఆయన(స) చెప్పారు.**

**86) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(రజి) తెలిపారు: ప్రవక్త మహ నీయులు (సఅసమ్) నన్నుద్దేశించి, "ఏమిటి, నీవు రాత్రంతా దైవారాధనలో లీనమై ఉండి, పగలంతా ఉపవాసం పాటిస్తావని విన్నాను. నిజమేనా?" అని అడిగారు. దానికి నేను 'అవున'ని విన్నవించుకున్నాను. అప్పుడాయన(స) ఇలా ఉపదేశిం చారు: "కాని నీవు గనక సదా ఇలాగే చేస్తూ ఉంటే నీ కళ్ళు బలహీనమై పోతాయి. నీ మనసు విసుగు చెందుతుంది. కాబట్టి ప్రతి నెలా మూడు రోజులు ఉపవాసాలు పాటించు. (పుణ్యఫలం దృష్ట్యా) ఇదే జీవితకాలపు ఉపవాసం. లేదా జీవితాంతపు ఉపవాసం వంటిది" (అని ఆయన-స- అన్నారు)**

**'నాకు అంతకన్నా ఎక్కువ శక్తి ఉందని నేను భావిస్తున్నాను' అని నేను విన్న వించుకోగా, "అలాగైతే మహనీయ దావూద్(అలైహిస్సలామ్) ఉపవాసం మాదిరిగా ఉపవాసం ఉండు. ఆయన ఒకరోజు ఉపవాసం ఉంటే మరుసటి రోజు ఉపవాసం ఉండకుండా గడిపేవారు. శత్రువును మార్కొన్నప్పుడు మైదానం నుండి వెన్నుచూపి పారిపోయేవారు కారు"[1] అని ప్రవక్త మహనీయులు(సఅ) బోధించారు.**

---

86–1. పై హదీసులలో దైవప్రవక్త హజ్రత్ దావూద్(అలైహిస్సలామ్) ప్రస్తావన వచ్చింది. అందువల్ల అధ్యాయంలోని మకుటానికి ఇది అతికినట్లే సరిపోతుంది.

## అధ్యాయం : 36

## దైవ సన్నిధిలో అత్యంత ఇష్టకరమైన నమాజ్ దావూద్(అ) నమాజ్. అన్నిటికన్నా ప్రియమైన ఉపవాసం దావూద్ (అ) ఉపవాసం

**ఆయన రాత్రి (మొదటి) అర్ధ భాగంలో నిద్రించి, మూడో వంతు రాత్రి దైవారాధనలో నిమగ్నులయ్యేవారు. రాత్రి చివరి భాగం (ఆరవ భాగం) మిగిలి ఉండగా శయనించేవారు. అలాగే ఆయన ఒకరోజు ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉపవాస విరమణ చేసేవారు. అలీ బిన్ మదీనీ ఏమంటారంటే, ఇది హజ్రత్ ఆయిషా (ర.అ) చెప్పిన దాని ప్రకారం ఉంది. ఆమె ఇలా అనేవారు : 'సహర్ (రాత్రి చివరి భాగం) వేళ దైవప్రవక్త(స) నా వద్ద ఉన్నప్పుడు, ఆయన(స) నిద్రించి ఉండేవారు.'**

**87) ప్రవక్త మహనీయులు(సఅసమ్) తనతో ఇలా అన్నారని అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) తెలియజేశారు : "అల్లాహ్ దృష్టిలో ఉపవాసాల యొక్క అన్నిటికన్నా ప్రీతికరమైన పద్ధతి మహనీయ దావూద్ (అలైహిస్సలామ్) పద్ధతి. ఆయన ఒకరోజు ఉపవాసం ఉండేవారు. మరుసటి రోజు ఉపవాసం ఉండేవారు కారు. అలాగే అల్లాహ్ సన్నిధిలో నమాజ్ చేసే అత్యుత్తమ పద్ధతి మహనీయ దావూద్ (అ) నమాజ్ పద్ధతి. ఆయన అర్ధరాత్రి వరకు నిద్రించేవారు. రాత్రి మూడో వంతు ఆరాధనలలో లీనమయ్యేవారు. మరి మిగిలిన రాత్రి ఆరవ భాగంలో (చివరి భాగంలో) కాస్సేపు నిద్రించేవారు."[1]**

## అధ్యాయం : 37

## సాద్ సూరాలో మహనీయ దావూద్(అలైహిస్సలామ్) ప్రస్తావన

**వారికి మా దాసుడు దావూద్ వృత్తాంతాన్ని వినిపించు. అతను గొప్ప బలవంతుడు, ప్రతి వ్యవహారంలోనూ అల్లాహ్ వైపునకు మరలుతూ ఉండేవాడు. మేము**

---

87-1. హజ్రత్ దావూద్(అ) గారి ఉపవాసాల పద్ధతి నిత్యం (నఫిల్) ఉపవాసాలుండటం కంటే ఉత్తమమైనది. ఎందుకంటే నిత్యం ఉపవాసాలుండటం వల్ల మనసు దానికి అలవాటు పడిపోతుంది. ఈ అలవాటు వల్ల ఆరాధనలకు అవసరమైన 'కష్టం' మిగిలి ఉండదు. అలాగే హజ్రత్ దావూద్(అ) అర్ధరాత్రి కడచిన మీదట తహజ్జుద్ నమాజ్ చేసేవారు. తరువాత పడుకునేవారు. మళ్ళీ ఉదయపు నమాజ్ కొరకు లేచేవారు. మనస్సును నియంత్రణలో ఉంచటానికి ఈ పద్ధతి ఎంతో ఉపయుక్తమైనది.

**పర్వతాలను అతనికి లొంగిపోయేలా చేశాము. ఉదయం, సాయంత్రం అవి అతనితోపాటు కీర్తన చేసేవి. పక్షులు గుమిగూడేవి, అవన్నీ అతని కీర్తన వైపునకు శ్రద్ధతో మరలేవి. మేము అతని రాజ్యాన్ని శక్తిమంతమైనదిగా చేశాము. అతనికి వివేకాన్ని ప్రసాదించాము. తిరుగులేని తీర్పు చెప్పే సామర్థ్యాన్ని అనుగ్రహించాము.**
***(38 సాద్ : 17–20)***

**'ఫస్‌లల్ ఖితాబ్' అంటే న్యాయనిర్ణయం గైకొనటంలో గల విచక్షణా జ్ఞానం అని ముజాహిద్ వ్యాఖ్యానించారు. 'తుష్‌తిత్' అంటే అన్యాయం చేయకండి. మాకు సరైన మార్గం చూపండి అని అర్థం.**

**ఇతను నా సోదరుడు. ఇతని వద్ద తొంభై తొమ్మిది గొర్రెలున్నాయి. నా దగ్గరేమో కేవలం ఒకే ఒక గొర్రె ఉన్నది. ఇక్కడ 'గొర్రె' అనే పదం 'భార్య' నేపథ్యంలో ఉంది.. యదార్థం ఏమిటంటే కలసి ఒకచోట ఉండేవారు తరచూ ఒకరికొకరు అన్యాయం చేసుకుంటూ ఉంటారు.[1] అయితే విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రం దీనికి దూరంగా ఉంటారు. అటువంటివారు కొందరు మాత్రమే."**

**... దావూద్ విషయాన్ని అర్థం చేసుకున్నాడు. కనుక అతను తన ప్రభువును క్షమాపణ కోరుకున్నాడు. సజ్‌దాలో పడిపోయాడు. పశ్చాత్తాపంతో ప్రభువు వైపునకు మరలాడు. అప్పుడు మేము అతని తప్పును మన్నించాము. నిశ్చయంగా మా వద్ద అతని కొరకు సాన్నిహిత్యం, ఉత్తమ పర్యవసానం ఉన్నాయి.**

**88) ముజాహిద్ ఇలా అన్నారు: 'నేను సాద్ సూరాలో(ని ఆయత్‌కు) సజ్‌దహ్ చేయాలా?' అని హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి)ను అడిగితే, ఆయన ఈ వచనాలను పఠించారు: "ఇంకా అతని సంతతిలోని వారైన దావూద్, సులైమాన్... వారి మార్గాన్నే**

---

37–1. కొందరు వ్యాఖ్యాతల ప్రకారం మహనీయ దావూద్(అ)కు 99 మంది భార్యలున్నప్పటికీ ఆయన దృష్టిలో అందగత్తె అయిన వేరొకని ఇల్లాలు పడింది. ఆయన మదిలో ఆమెను మనువాడాలన్న ఆలోచన వచ్చింది. అంతే, అల్లాహ్ ఆయన్ని నిలదీయడానికి ఇద్దరు దైవదూతలను మానవాకారంలో పంపాడు. వారిద్దరూ ఒక కేసును ఆయన దగ్గరకు తీసుకువచ్చారు. వారి వాదోపవాదాలు వినగానే హజ్రత్ దావూద్(అ)కు తన తప్పు తెలిసివచ్చింది. పశ్చాత్తాప భావంతో అల్లాహ్ వైపునకు మరలారు. ఈ వృత్తాంతానికి కొందరు వ్యాఖ్యాతలు ఉప్పు కారం తగిలించి, ఒక ప్రవక్తకు ఎంతమాత్రం శోభాయమానం కాని రీతిలో కథలల్లారు.

**నీవు అనుసరించు" (అల్ అన్ఆమ్ : 84-90). తరువాత ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : మీ ప్రవక్త(సఅసమ్)కు కూడా దైవప్రవక్తల(అలైహిముస్సలామ్) మార్గాన్ని అనుసరించమని ఆజ్ఞాపించటం జరిగింది.[1]**

**89) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు: "సాద్ సూరాలోని 'సజ్దహ్'కు ప్రణమిల్లటం తప్పనిసరి కాదు. అయితే నేను ఈ సూరాలో దైవప్రవక్త (సఅసమ్) సాష్టాంగ ప్రణామం చేస్తూ ఉండగా చూశాను."**

**అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : "దావూద్‌కు మేము సులైమాన్(వంటి కొడుకును) ప్రసాదించాము; అతను మంచి దాసుడు. అత్యధికంగా తన ప్రభువు వైపునకు మరలుతూ ఉండేవాడు." *(సాద్: 30)***

**"నా ప్రభూ! నన్ను క్షమించు. నా తర్వాత మరెవ్వరికీ లభించని రాజ్యాధికారాన్ని నాకు ప్రసాదించు" *(సాద్: 35)* అని హజ్రత్ సులైమాన్ వేడుకోవటం ప్రత్యేకంగా గమనార్హం.**

**అల్ బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "సులైమాన్ రాజ్యం పేరు చెప్పి షైతానులు ప్రచారం చేసే విషయాలను వారు అనుసరించసాగారు."**

**(2: 102)**

**సూరయె సబాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"మేము సులైమాన్‌కు గాలిని వశపరిచాము. అది ఉదయం పూట ఒక నెల రోజులపాటి ప్రయాణాన్ని పూర్తి చేయగలిగేది. సాయంకాలం పూట కూడా ఒక నెల రోజులపాటి ప్రయాణాన్ని చేయగలిగేది. మేము ఆయనకు కరిగిన రాగి ఊటను ప్రవహింపజేశాము. తమ ప్రభువు ఆదేశానుసారం అతని సన్నిధిలో సేవలు చేసే జిన్నాతులను మేము అతనికి వశవర్తులుగా చేశాము. వారిలో మా ఆజ్ఞను ఉల్లంఘించిన వాడికి మేము జ్వలించే అగ్నిని రుచి చూపేవారము. వారు అతనికి అతను కోరినవన్నీ చేసేవారు, ఎత్తైన కట్టడాలు, చిత్రాలు, కోనేరుల వంటి పెద్ద**

---

88-1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును 'వ్యాఖ్యాన ప్రకరణం'లో కూడా వెలికి తీశారు. ఆయన(స) సాద్ సూరాలో 'సజ్దా' చేశారని అందులో ఉంది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)కు గత ప్రవక్తల మార్గాన్ని అనుసరించమన్న ఆజ్ఞలోని పరమార్థం ఏమిటంటే దైవప్రవక్తలందరి మౌలిక విశ్వాసాలు, నియమ నిబంధనలు ఒక్కటే. కాకపోతే పాక్షిక, సాపేక్షిక విషయాలలో కొంత వైవిధ్యం ఉంది.

పళ్లాలు, తమ స్థానం నుండి కదలని భారీ దేగిసాలు–దావూద్ ప్రజలారా! కృతజ్ఞతతో పని చేయండి, నా దాసులలో కృతజ్ఞతలు తెలిపేవారు తక్కువే. *(34 సబా : 12,13)*

ఆ తరువాత సులైమాన్‌పై మేము మరణ నిర్ణయాన్ని అమలు జరిపినప్పుడు, జిన్నాతులకు అతని మరణం గురించి తెలియజేసిన వస్తువు అతని చేతి కర్రను తింటూ ఉన్న చీడపురుగే తప్ప మరొకటేదీ కాదు. ఈ విధంగా సులైమాన్ పడిపోగా, తమకు అగోచర విషయాలు తెలిసి ఉంటే అవమానకరమైన ఈ బాధకు గురి అయి ఉండేవారము కాము అని జిన్నాతులకు స్పష్టంగా తెలిసిపోయింది. *(34 సబా : 14)*

**90)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "తలబిరుసు అయిన ఒక జిన్ను నిన్న రాత్రి నా ఎదుట నిలిచాడు– వాడు నా నమాజ్‌ను భగ్నపరచటానికి వచ్చాడు. అల్లాహ్ నాకు అతనిపై నియంత్రణను ప్రసాదించాడు. నేనతన్ని పట్టుకున్నాను. మస్జిద్‌లోని ఏదో ఒక స్తంభానికి వాణ్ణి కట్టి ఉంచాలనుకున్నాను. అలా చేస్తే మీరంతా చూడగలిగే వారు. కాని నా సహోదరుడు మహనీయ సులైమాన్ (అలైహిస్సలామ్) చేసిన వేడుకోలు నాకు గుర్తుకు వచ్చింది. 'నా ప్రభూ! నా తరువాత మరెవ్వరికీ లభించని రాజ్యాధికారాన్ని నాకు ప్రసాదించు' అని ఆయన వేడుకున్నారు కదా! అందుచేత నేను ఆ జిన్నును గద్దించటంతో సరిపెట్టుకున్నాను."[1]

**91)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "దావూద్ కుమారుడగు సులైమాన్ (అలైహిస్స లామ్), 'ఈ రోజు రాత్రి నేను నా డెబ్భయి మంది భార్యల వద్దకు పోతాను. ప్రతి భార్య ఒక అశ్వారూఢుని చొప్పున కంటుంది. వారు దైవమార్గంలో జిహాద్ చేస్తార'ని అన్నారు. ఆయన వెంటనున్న సహచరుడొకడు, 'ఇన్‌షాఅల్లాహ్' అని పలక మన్నాడు. కాని ఆయన ఇన్‌షా అల్లాహ్ అని పలకటం మరిచిపోయారు. అందువల్ల ఏ ఒక్క భార్యకూ సంతాన భాగ్యం ప్రాప్తించలేదు. కేవలం ఒక్కావిడే పిల్లవాణ్ణి కన్నది. ఆ శిశువుకు కూడా ఒకవైపు శరీరం లేదు." దైవప్రవక్త(స) ఇలా వక్కాణించారు: "సులైమాన్(అ) గనక 'ఇన్‌షాఅల్లాహ్' అని పలికి ఉంటే (భార్యలందరికీ సంతాన భాగ్యం ప్రాప్తమయ్యేది) ఆ పిల్లలంతా దైవమార్గంలో పోరాడి ఉండేవారు"–

---

90–1. ఉల్లేఖనంలో దైవప్రవక్త మహనీయ సులైమాన్ (అలైహిస్సలామ్) ప్రస్తావన ఉంది. అందువల్లనే దీనిని ఈ అధ్యాయం క్రింద తీసుకోవలసి వచ్చింది.

**షుఐబ్, ఇబ్నె అబీ జినాద్ (డెభ్భయికి బదులు) తొంభై మంది అని అన్నారు. ఇదే ప్రామాణికమైనది.**

**92) హ్మజ్రత్ అబూజర్(రజి) కథనం : 'దైవప్రవక్తా! అన్నిటికన్నా ముందుగా ఏ మస్జిద్ నిర్మించబడింది?' అని నేను ప్రవక్త మహనీయుల(సఅసమ్)ను అడగ్గా, "మస్జిదె హరామ్" అని ఆయన(స) చెప్పారు. 'ఆ తరువాత ఏది?' అని నేను ప్రశ్నించగా, "మస్జిదె అక్సా" అని ఆయన(స) బదులిచ్చారు. 'ఈ రెండు మస్జిద్‌ల నిర్మాణంలో ఉన్న అంతరం ఎంత?' అని నేను తిరిగి ప్రశ్నించగా, "నలభై సంవత్స రాలు" అని ఆయన(స) సమాధానమిచ్చారు. ఆ తరువాత ఆయన(స) ఇలా ఉపదేశించారు : "ఏ స్థలంలో నమాజ్ వేళ అవుతే అక్కడే నమాజ్ చేసుకో. నీ కొరకు భూమండలమంతా మస్జిదే (సజ్దా స్థలమే)."[1]**

**93) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా హ్మజ్రత్ అబూ హురైరా (రజి) విన్నారు. ప్రవక్త మహనీయులు(స) ఇలా ప్రవచించారు : "నేను మరియు మానవులందరి ఉదాహరణ మంట వెలిగించిన వ్యక్తి లాంటిది. అప్పుడు దీపపు పురుగులు, కీటకాలు వచ్చి ఆ అగ్నిలో పడసాగాయి (ఇలాగే నేను జనులను నరకాగ్నిలో పడకుండా వారి నడుము పట్టి ఆపుతున్నాను. కాని జనులు మాత్రం ఆ అగ్నికే ఆహుతి కాగోరుతున్నారు). (అబూహురైరా–రజి కథనం ప్రకారం) ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు: ఇద్దరు స్త్రీలు ఉండేవారు. వారిద్దరికీ ఒక్కో పిల్లవాడు చొప్పున ఉన్నారు. తోడేలు వచ్చి ఒక పిల్లవాణ్ణి లాక్కుపోయింది. తోడేలు కబళించినది నీ పిల్లవాణ్ణి (ఈ పిల్లవాడు నా పిల్లవాడు) అని తోటి స్త్రీ చెప్పింది. 'కాదు, తోడేలు నీ పిల్లవాణ్ణి భక్షించింది. ఈ పిల్లవాడు నా పిల్లవాడు' అని రెండవ స్త్రీ వాదించింది. వారిద్దరూ గొడవ పడ్డారు. చివరకు ఆ స్త్రీలిద్దరూ మహనీయ దావూద్(అ) దగ్గరకువచ్చి ఫిర్యాదు చేశారు. ఆయన ఆ పిల్లవాణ్ణి పెద్దావిడకు ఇప్పించారు (ఎందుకంటే ఆ పిల్లవాడు ఆమె ఒడిలోనే ఉన్నాడు. రెండవ ఆమెవద్ద ఎలాంటి సాక్ష్యాధారం కూడా లేదు). తరువాత వారిద్దరూ హ్మజ్రత్ సులైమాన్(అ)**

---

92–1. ఈ హదీసులో 'మస్జిదె అక్సా' ప్రస్తావన వచ్చింది. దానికి ఏనాడో పునాది పడినప్పటికీ, దానిని పునర్నిర్మాణం చేసింది మాత్రం దైవప్రవక్త హ్మజ్రత్ సులైమానే(అ). అలాగే కాబా పునాది ఎప్పుడో పడింది. అయితే దాని పునాదులపైన కాబా నవ నిర్మాణం చేపట్టినది హ్మజ్రత్ ఇబ్రాహీమ్(అ) గారే. ఈ రెండు కట్టడాల పునాదుల మధ్య 40 ఏళ్ల అంతరం ఉంది.

వద్దకు వెళ్ళి, జరిగినదంతా వివరించి చెప్పారు. అంతా విన్న తరువాత ఆయన(అ) ఇలా అన్నారు : "కత్తి తీసుకురండి. నేను ఈ పిల్లవాణ్ణి రెండు ముక్కలుగా నరికి ఇద్దరికీ చెరోభాగం చొప్పున పంచిపెడతాను". ఈ తీర్పు విని చిన్నావిడ విలవిల్లాడి పోతూ, 'దేవుడు మీపై దయజూపుగాక! ఆ పని మాత్రం చేయకండి. ఈ పిల్లవాడు ఆమె (పెద్దావిడ) కొడుకే' అని చెప్పింది. మరోవైపు పెద్దావిడ కిమ్మనకుండా ఉండిపోయింది. అప్పుడు హజ్రత్ సులైమాన్(అ) ఆ పిల్లవాణ్ణి చిన్నావిడకు ఇప్పించారు (ఎందుకంటే, పిల్లవాణ్ణి రెండు ముక్కలుగా నరుకుతానని అనేసరికి కన్నతల్లి గుండె తరుక్కుపోయింది. అబద్ధం చెప్పిన పెద్దావిడలో మాత్రం ఎలాంటి స్పందన కనిపించలేదు)– అబూ హురైరా(రజి) ఇలా అన్నారు: నేను **'సిక్కీన్'** (కత్తి) అనే పదాన్ని ఆ రోజే దైవప్రవక్త(స) నోట విన్నాను. అంతకుముందు మేము 'కత్తి'కి **'ముద్‌యత'** అనే పదాన్ని ఉపయోగించేవారం.

## అధ్యాయం : 38

## లుఖ్మాన్ (అలైహిస్సలామ్) గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

మేము లుఖ్మాన్‌కు వివేకాన్ని ప్రసాదించాము. అతను అల్లాహ్‌కు కృతజ్ఞుడు కావాలని, ఎవడైనా కృతజ్ఞతలు తెలిపితే, అతని కృతజ్ఞతలు అతనికే లాభకరం, ఎవడైనా కృతఘ్నుతకు పాల్పడితే నిజానికి అల్లాహ్ అతీతుడు తనకు తానే స్తుతి పాత్రుడు. లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేసిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు అతను ఇలా అన్నారు, "కుమారా! దేవునికి భాగస్వాములుగా ఎవరినీ చేర్చకు, నిజం ఏమిటంటే, ఇతరులను దేవునికి భాగస్వాములుగా చేర్చటం పరమ దుర్మార్గం"– మానవుడు తన తల్లిదండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా మేమే అతనికి నిర్దేశించాము. అతని తల్లి బలహీనతపై బలహీనతను సహించి అతనిని తన కడుపున మోసింది. అతను పాలు విడిచిపెట్టటానికి రెండు సంవత్సరాలు పట్టింది. (ఇందుకే మేము అతనికి ఇలా బోధించాము) "నాకు కృతజ్ఞుడవై ఉండు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు. నా వైపునకే నీవు మరలి రావలసి ఉన్నది. ఒకవేళ నీవు ఎరుగని వారినెవరినైనా నాకు భాగస్వామిగా చేర్చు అని వారు నిన్ను బలవంతం చేస్తే, వారి మాటను ఏమాత్రం వినకు, ప్రపంచంలో వారి పట్ల సద్భావంతో

**మెలుగుతూ ఉండు; కాని నా వైపునకు మరలిన వ్యక్తి మార్గాన్నే అనుసరించు. తరువాత మీరందరూ నా వైపునకే మరలవలసి ఉంది. అపుడు నేను మీకు తెలుపుతాను మీరు ఎలాంటి పనులు చేస్తూ ఉండేవారో.**

**(లుఖ్మాన్ ఇలా అన్నాడు) "కుమారా! ఒక వస్తువు, అది ఆవగింజంతటి దైనప్పటికీ అది కొండరాయిలోగాని, ఆకాశాలలోగాని, భూమిలో గాని,ఎక్కడ దాగి ఉన్నప్పటికీ, అల్లాహ్ దానిని బయటికి తీసుకువస్తాడు. ఆయన సూక్ష్మగ్రాహి మరియు సర్వజ్ఞుడు. కుమారా! నమాజును స్థాపించు, మంచిని ఆజ్ఞాపించు, చెడుపనుల నుండి నిరోధించు, ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు. ప్రజలతో ముఖం ప్రక్కకు తిప్పి మాట్లాడకు, భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి, బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్ ప్రేమించడు.[1] (లుఖ్మాన్: 12-18)**

**94) హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు : "వాస్తవానికి విశ్వసించినవారికీ, తమ విశ్వాసాన్ని 'అన్యాయం' (జులుం)తో కలుషితం చేయని వారికే శాంతి, వారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నారు" (6: 82) అనే దివ్య ఖుర్ఆన్ ఆయత్ అవతరించినప్పుడు, ముస్లింలు తల్లడిల్లిపోయారు. 'దైవప్రవక్తా! మాలో తమ విశ్వాసం (ఈమాన్)తోపాటు అన్యాయాన్ని (జులుంను) కలగాపులగం చేయనివాడెవడుంటాడు?' అని వారు సందేహపడినప్పుడు, దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు : "దీని అర్థం ఇది కాదు. ఇక్కడ 'జులుం' అంటే 'షిర్క్' (దైవత్వంలో భాగస్వామ్యం కల్పించటం, దైవానికి సహవర్తులుగా ఇతరుల్ని నిలబెట్టడం) అని గ్రహించాలి. ఏమిటి, హ్రజత్ లుఖ్మాన్(అ) తన కుమారునికి హితబోధ చేస్తూ, 'కుమారా! అల్లాహ్‌కు ఎవరినీ భాగస్వాములుగా చేయకు (షిర్క్ చేయకు). నిశ్చయంగా షిర్క్ చాలా పెద్ద అన్యాయం' అని చెప్పటాన్ని మీరు వినలేదా?"[1]**

---

38-1. హ్రజత్ లుఖ్మాన్(అ) తన కాలపు ఓ గొప్ప వివేకి. కొన్ని ఉల్లేఖనాలలో ఆయన మహనీయ దావూద్(అ) హయాన్ని కూడా పొందారని, ఆయన ద్వారా లబ్ది పొందారని ఉంది. అత్యధిక మంది విద్వాంసులు ఈయన్ని 'హకీమ్'గానే పరిగణిస్తారు. 'ప్రవక్త'గా తలపోయరు. కాని మరికొంతమంది ఈయన్ని ప్రవక్తగా పేర్కొన్నారు. నిజము దేవుడెరుగు.

## అధ్యాయం : 39

## యాసీన్ సూరాలో దైవప్రవక్తల ప్రస్తావన

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ఉదాహరణగా వారికి ఆ పట్టణ వాసుల గాథను వినిపించు. అక్కడకు దైవప్రవక్తలు వచ్చినప్పటి గాథను; మేము వారివద్దకు ఇద్దరు ప్రవక్తలను పంపాము. వారు ఆ ఇద్దరినీ అసత్యవాదులు అని తిరస్కరించారు. తరువాత మేము వారికి సహాయంగా మూడో అతన్ని పంపాము. వారందరూ, "మేము మీ వద్దకు దైవప్రవక్తలుగా పంపబడ్డాము" అని అన్నారు. పట్టణవాసులు ఇలా అన్నారు; "మీరు మా వంటి కొందరు మానవులు తప్ప మరేమీ కారు. కరుణామయుడైన దేవుడు ఏ విషయాన్నీ అవతరింపజేయలేదు, మీరు కేవలం అబద్ధం పలుకుతున్నారు."**

**దైవప్రవక్తలు ఇలా అన్నారు, "మేము నిశ్చయంగా మీ వద్దకు దైవప్రవక్తలుగా పంపబడిన విషయాన్ని మా ప్రభువు ఎరుగును. స్పష్టంగా సందేశాన్ని అంద జేయటం తప్ప మాపైన మరొక బాధ్యత ఏదీ లేదు". పట్టణవాసులు ఇలా అన్నారు, "మేము మిమ్మల్ని (మాకు) ఒక దుశ్శకునంగా పరిగణిస్తున్నాము. మీరు (ఈ పనిని) మానుకోకపోతే, మేము మిమ్మల్ని రాళ్ళతో కొట్టి చంపేస్తాము. మీరు మా తరఫు నుండి అత్యంత బాధాకరమైన శిక్షను పొందుతారు". దానికి దైవప్రవక్తలు ఇలా అన్నారు:"మీ దుశ్శకునం స్వయంగా మీ వెంటనే ఉంది. మీకు హితబోధ చేయటం వల్లనేగా మీరు ఇలా మాట్లాడుతున్నారు? అసలు విషయం, మీరు హద్దు లను అతిక్రమించారు."[1] *(36 యాసీన్ : 13-19)***

**'ఫ అజ్జజ్‌నా' అనే పదానికి అర్థం చెబుతూ ముజాహిద్, 'మేము వారికి బలం చేకూర్చాము' అన్నారు. 'తాయిరుకుమ్' అనే పదానికి అర్థం. 'ఇది మీ దరిద్రం' అని అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) చెప్పారు.**

---

94-1. అన్యాయం, దౌర్జన్యం పలు రకాలు. వాటిలో అత్యంత ఘోరమైనది షిర్క్. పుట్టించినవాడు, తినిపించేవాడు, గండాలనుంచి గట్టెక్కించేవాడు, సహాయపడేవాడుగా అల్లాహ్ ఉండగా, ఆయన్ని కాదని ఇతరుల్ని దైవంగా కొలవటం, మొక్కుకోవటం, ఇతరుల ముందు సాష్టాంగపడటం అన్యాయమే కదా! పైగా ఇది విశ్వాస ఘాతుకం. అల్లాహ్ గనక తలచుకుంటే, తన దాసుల వల్ల జరిగిన ఏ పాపాన్నయినా క్షమిస్తాడుగాని షిర్క్‌ను క్షమించడు.

39-1. యాసీన్ సూరాలోని ఈ ఆయత్‌లలో దైవప్రవక్తల ప్రస్తావన ఉంది. వీరు హజ్రత్ యహ్యా (అలైహిస్సలామ్) కంటే ముందే పంపబడ్డారు. వారి పేర్లు : యోహానా, బోలస్. మూడవ వాని పేరు షమ్‌వూన్. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ అధ్యాయం క్రింద ఏ ఒక్క హదీసును

## అధ్యాయం : 40

## దైవప్రవక్త జకరియ్యా (అలైహిస్సలామ్) గురించి

**ఇది నీ ప్రభువు తన దాసుడైన జకరియ్యాపై చూపిన కారుణ్య ప్రస్తావన- అపుడు అతను తన ప్రభువునకు ఏకాంతంగా మొరపెట్టుకున్నాడు. అతను ఇలా మనవి చేసుకున్నాడు. "ప్రభూ! నా ఎముకలు సైతం కృశించిపోయాయి. ముదిమి వల్ల తల (నెరసి) మెరిసిపోతోంది. ప్రభూ! నిన్ను వేడుకుని నేను ఎన్నడూ నిష్ఫలుణ్ణి కాలేదు. నా తరువాత నా బంధుమిత్రులు చేసే చెడు పనులను గురించి నేను భయ పడుతున్నాను; నా భార్యేమో గొడ్రాలు. కనుక నీవు నీ ప్రత్యేక అనుగ్రహం ద్వారా నాకు ఒక వారసుణ్ణి ప్రసాదించు. అతడు నాకు వారసుడూ కావాలి, యాకూబ్ సంతతి వారసత్వాన్నీ పొందాలి. ప్రభూ! అతనిని అందరికీ ఇష్టుడైన వ్యక్తిగా చేయి." (ఇలా జవాబు ఇవ్వబడింది) "జకరియ్యా! మేము నీకు యహ్యా అనే పేరు గల ఒక కుమారుని శుభవార్తను తెలియజేస్తున్నాము. ఈ పేరు గల మనిషిని మేము ఇంతకు పూర్వం ఎన్నడూ పుట్టించలేదు." [1] *(మర్యమ్ : 2-7)***

**హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: అరబీ మూలంలోని 'రజియ్యా' అనే పదం 'అందరికీ ఇష్టమైనవాడు' అన్న అర్థంలో ఉంది..**

**95) ప్రవక్త మహనీయులు(సఅసమ్) మేరాజ్ రాత్రి గురించి ఈ విధంగా వివరించారని మాలిక్ బిన్ సాసా (రజి) తెలిపారు: "... తరువాత ఆయన(స) పైకి ఎక్కారు. రెండవ ఆకాశంపైకి గొనిపోబడ్డారు. ద్వారం తెరువమని కోరినప్పుడు, 'ఎవరు?' అని ప్రశ్నించటం జరిగింది. 'నేను జిబ్రయీల్(అ)ని' అని సమాధానం ఇవ్వటం జరిగింది. 'మీవెంట ఉన్నవారెవరు?' అని ప్రశ్నించగా, 'ముహమ్మద్(స)' అని ఆయన చెప్పారు. 'ఈయన్ని తీసుకురావడానికే మీరు పంపబడ్డారా?' అని**

---

తీసుకురాలేకపోయారు. బహుశా ఆయన షరతులకు తగిన హదీసు ఆయనకు లభ్యం కాలేదేమో!

40-1. ఇస్రాయీల్ వంశీయుల నుండి ప్రభవించిన దైవప్రవక్తలలో హజ్రత్ జకరియ్యా (అలైహిస్సలామ్) స్థానం ప్రత్యేకమయినది. పసితనంలో హజ్రత్ మర్యమ్ (అలైహస్స లామ్) పెంపకం ఈయన పర్యవేక్షణలోనే జరిగింది. వృద్ధాప్యంలో అల్లాహ్ ఈయనకు యహ్యా అనే కుమారుణ్ణి ప్రసాదించాడు. మరిన్ని వివరాల కొరకు మర్యమ్ సూరాను అధ్యయనం చేయాలి.

ప్రశ్నించగా, 'అవును' అని జిబ్రయీల్(అ) చెప్పారు. మేము అక్కడికి చేరుకున్న ప్పుడు హ|జ్రత్ ఈసా(అ), హ|జ్రత్ యహ్యా(అ) కనిపించారు. ఈ ప్రవక్తలిద్దరి తల్లులు అక్కాచెల్లెళ్ళు. 'వీరు ఈసా, యహ్యాలు. వీరికి సలామ్ చేయండి' అని జిబ్రయీల్ చెప్పారు. నేను వారికి సలామ్ చేశాను. వారిద్దరూ నా సలామ్‌కు జవాబు ఇచ్చి, 'మీకు స్వాగతం సోదరా! సజ్జనుడైన ప్రవక్తా!' అని పలికారు." [1]

## అధ్యాయం : 41

## హజ్రత్ ఈసా(అలైహిస్సలామ్), హజ్రత్ మర్యమ్(అలైహస్సలామ్)ల గురించి...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "ప్రవక్తా! ఈ గ్రంథంలో, మర్యమ్ తన వారి నుండి వేరైపోయి, తూర్పు దిక్కున ఏకాంతంగా కూర్చుంది, వారికి చాటుగా తెర కట్టుకుని ఉండిపోయినప్పటి వృత్తాంతాన్ని ప్రస్తావించు." *(మర్యమ్– 16)*

దైవదూతలు ఇలా అన్నారు: "మర్యమ్! అల్లాహ్ తన ఒక 'ఆజ్ఞ'కు సంబంధించిన శుభవార్తను నీకు పంపుతున్నాడు." *(ఆలి ఇమ్రాన్ : 45)*

అల్లాహ్ ఆదమ్‌కూ, నూహ్‌కూ, ఇబ్రాహీమ్ సంతతికీ ఇమ్రాన్ సంతతికీ, సమస్త భూలోక వాసులపై ప్రాధాన్యత ఇచ్చి (తన సందేశం కొరకు) ఎన్నుకున్నాడు. ఒకరి వంశాన్నుండి ఒకరు జన్మించిన వీరందరూ ఒకే పరంపరకు చెందినవారు. అల్లాహ్ అంతా వింటాడు, ఆయనకు అంతా తెలుసు. ఇమ్రాను స్త్రీ అల్లాహ్‌ను ఇలా ప్రార్థించినపుడు (అల్లాహ్ విన్నాడు). "ప్రభూ! నా గర్భంలో ఉన్న శిశువును నేను నీకు సమర్పించుకుంటున్నాను. అది నీ సేవకు అంకితం. నా ఈ కానుకను స్వీకరించు. నీవు అన్నీ వినేవాడవు, అన్నీ తెలిసినవాడవు." తరువాత ఆమెకు ఆడ శిశువు జన్మించినప్పుడు, ఆమె ఇలా విన్నవించుకుంది : "ప్రభూ! నాకు ఆడ శిశువు కలిగింది– ఆమెకు ఏ శిశువు పుట్టిందో అల్లాహ్‌కు బాగా తెలుసు– బాలుడు బాలిక వంటివాడు కాడు. సరే, నేను దానికి మర్యమ్ అని పేరు పెట్టాను. శాపగ్రస్తుడైన షైతాను బారి నుండి రక్షణ కొరకు నేను దానినీ, దాని సంతానాన్నీ నీకు అప్పగిస్తున్నాను." చివరకు ఆమె ప్రభువు ఆ బాలికను సంతోషంతో స్వీకరించి

---

95–1. హదీసులో యహ్యా (అ) ప్రస్తావన వచ్చింది. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం. హ|జ్రత్ ఈసా(అ) తల్లి పేరు మర్యమ్. హ|జ్రత్ యహ్యా (అ) తల్లి పేరు ఏషా. వారిద్దరూ అక్కాచెల్లెళ్ళు. వారి తల్లి పేరు హినా.

**ఆమెను ఒక మంచి బాలికగా తీర్చిదిద్దాడు. ఇంకా, జకరియ్యాను ఆమెకు సంరక్ష కుడుగా నియమించాడు. ...జకరియ్యా ఆమె గదికి పోయినప్పుడల్లా, ఆమె వద్ద ఆయన ఏవో కొన్ని భోజన పదార్థాలను చూసేవాడు. ఆమెను ఇలా అడిగేవాడు; "మర్యమ్! ఇవి నీ వద్దకు ఎక్కడి నుంచి వచ్చాయి?" ఆమె ఇలా జవాబు చెప్పేది: "అల్లాహ్ నుండి వచ్చాయి. అల్లాహ్ తాను కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ప్రసాదిస్తాడు."** ***(3 ఆలి ఇమ్రాన్ : 33-37)***

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా అన్నారు : ఆలి ఇమ్రాన్ అంటే ఇమ్రాన్ సంతతిలోని విశ్వసనీయులైన జనులు అని అర్థం. ఆలి ఇబ్రాహీమ్ అన్నా, ఆలి యాసీన్ అన్నా, ఆలి ముహమ్మద్(స) అన్నా ఇదే అర్థం వర్తిస్తుంది. కాకపోతే వారు విశ్వాసులు అయి ఉండాలి.

ఇబ్నె అబ్బాస్(రజి) ఇంకా ఇలా అన్నారు : అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు "ఇబ్రాహీముతో సంబంధం కలిగి ఉండే హక్కు ఎవరికైనా ఉందీ అంటే, అది అతన్ని అనుసరించిన ప్రజలకు మాత్రమే" (ఆలి ఇమ్రాన్: 68). అంటే వారు విశ్వాసులు (మోమినూన్), ఏకేశ్వరోపాసకులు (మువహ్హిదీన్) అయి ఉంటారు.

**96)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు- మహాప్రవక్త(స) ఇలా ప్రవచించారు: ఆదమ్ పిల్లలలో ప్రతి ఒక్కరూ జన్మించినప్పుడు- జనన సమయంలో- షైతాన్ ఆ శిశువును తాకుతాడు. షైతాన్ తాకిన కారణంగా ఆ శిశువు బిగ్గరగా ఏడుస్తాడు. కాని హజ్రత్ మర్యమ్(అ), ఆమె కుమారుడు హజ్రత్ ఈసా(అ)ల విషయంలో మాత్రం అలా జరగలేదు"- తరువాత అబూహురైరా (రజి) ఇలా వివరించారు : "ఎందుకంటే, నేను దీనినీ (మర్యమ్‌ను), దీని సంతానాన్ని శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి రక్షణ కొరకు నీకు అప్పగిస్తున్నాను" (3: 36) (అని మర్యమ్ తల్లి అల్లాహ్‌ను వేడుకుంది).

## అధ్యాయం : 42

## మర్యమ్ (అలైహస్సలామ్) గొప్పతనం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: తరువాత ఒకప్పుడు దైవదూతలు వచ్చి మర్యమ్‌తో ఇలా అన్నారు: "మర్యమ్! అల్లాహ్ నిన్ను ఎన్నుకున్నాడు. నీకు పరిశు**

ధ్ధతను ప్రసాదించాడు. ప్రపంచ మహిళలందరిపై నీకు ప్రాధాన్యమునిచ్చి నిన్ను తన సేవకొరకు ఎన్నుకున్నాడు. మర్యమ్! నీవు నీ ప్రభువునకు విధేయురాలవుగా ఉండు. ఆయన సాన్నిధ్యంలో సజ్దా చెయ్యి(సాష్టాంగపడు). రుకూ చేసే దాసులతో నీవూ రుకూ చెయ్యి (నమ్రతతో వంగు)"

ప్రవక్తా! ఇవన్నీ అగోచర విషయాలకు సంబంధించిన వార్తలు. వాటిని మేము నీకు వహీ ద్వారా తెలుపుతున్నాము. లేకపోతే, మర్యమ్ సంరక్షకుడు ఎవరు అవ్వాలి అనే విషయ నిర్ణయం కొరకు, ఆలయ సేవకులు తమ తమ కలములను విసరినప్పుడు నీవు అక్కడ లేవు కదా! ఇంకా, వారి మధ్య వివాదం చెలరేగినప్పుడు కూడా నీవు అక్కడ లేవు. *(3 ఆలి ఇమ్రాన్ : 42–44)*

**97)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని మహనీయ అలీ (రజి) ఉల్లేఖించారు : ఆయన(స) ఇలా ప్రవచించారు– "ఇమ్రాన్ పుత్రికయగు మర్యమ్ (తన కాలపు) అత్యుత్తమ మహిళ. కాగా; ఈ సముదాయపు (ఉమ్మతె ముహమ్మదీ) అత్యుత్తమ మహిళ హజ్రత్ ఖదీజా (ర.అ)".

## అధ్యాయం : 43

## మహనీయ ఈసా(ఏసుక్రీస్తు- అలైహిస్సలామ్) విశిష్టత

దైవదూతలు ఇలా అన్నారు: "మర్యమ్! అల్లాహ్ తన ఒక 'ఆజ్ఞ'కు సంబంధించిన శుభవార్తను నీకు పంపుతున్నాడు. అతని పేరు ఈసా మసీహ్. అతను మర్యమ్ కుమారుడు. అతడు ఇహపర లోకాలలో గౌరవనీయుడవుతాడు. అల్లాహ్ సామీప్యం పొందిన దాసులలోని వాడుగా పరిగణింపబడతాడు. ఉయ్యాలలో ఉన్నప్పుడూ, పెరిగి పెద్దవాడైనప్పుడూ ప్రజలతో సంభాషిస్తాడు. ఇంకా అతను ఒక సత్పురుషుడవుతాడు." ఇది విన్న మర్యమ్ ఇలా అన్నారు : "ప్రభూ! నాకు శిశువు ఎలా జన్మిస్తుంది? నన్ను ఏ పురుషుడూ చేతితోనైనా తాకలేదే!" సమాధానం లభించింది: "అలానే జరుగుతుంది. అల్లాహ్ తాను కోరినదాన్ని సృష్టిస్తాడు. ఆయన ఒక పనిని చెయ్యాలని నిర్ణయించినప్పుడు, కేవలం దానిని "అయిపో" అంటాడు. అంతే, అది అయిపోతుంది."[1] *(3 ఆలి ఇమ్రాన్ : 45–47)*

---

43–1. పై ఆయత్‌లలో మహనీయ ఈసా(అలైహిస్సలామ్) పుట్టుక ప్రస్తావన వచ్చింది. తండ్రి లేకుండానే, కేవలం దైవాజ్ఞతో ఆయన జన్మించారు. ఈ యధార్థాన్ని కొంతమంది సోకాల్డ్ ముస్లిములు నిరాకరించారు. వారి ఈ నిరాకరణ ఒక మిథ్య. దివ్య ఖుర్ఆన్‌లో

**'వజీహా' అంటే ఆదరణీయుడు అని అర్థం. 'మసీహ్' అంటే సచ్ఛీలుడు అని ఇబ్రాహీమ్ నఖ్యీ అభిప్రాయపడ్డారు. 'అల్ కష్లె' అంటే వినాశం అని ముజాహిద్ అన్నారు.**

**98) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "భోజన పదార్థాలపై 'సరీద్'కు ఎటువంటి ప్రాధాన్యత ఉందో, మహిళావనిపై ఆయిషా (ర.అ)కు అటువంటి ప్రాధాన్యతే ఉంది. ఇక పురుషుల విషయానికి వస్తే, వారిలో ఎందరో పరిపూర్ణత కలవారు గడిచారు. కాని మహిళలలో మాత్రం ఇమ్రాన్ పుత్రిక అగు మర్యమ్, ఫిరౌన్ భార్యయగు ఆసియా తప్ప వేరెవరూ పరిపూర్ణులుగా పుట్టలేదు."**

**ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబూ హురైరా(రజి) వివరించారు : ప్రవక్త(స) ఇలా చెప్పారు- "ఒంటెపై స్వారీ అయ్యే మహిళలలో(అరబ్బు మహిళలలో) అందరికన్నా మేలైనవారు ఖురైషీ మహిళలు. వారు పసికందుపై అందరికన్నా ఎక్కువ ప్రేమను, వాత్సల్యాన్ని కురిపిస్తారు. తమ భర్త సొమ్మును, వస్తుసామగ్రిని అందరికన్నా బాగా కనిపెట్టుకుని ఉంటారు- హజ్రత్ అబూహురైరా (రజి) ఈ హదీసును వినిపించిన మీదట, 'మర్యమ్ బిన్తె ఇమ్రాన్ ఎన్నడూ ఒంటెపై స్వారీ అవలేద'ని అనేవారు.**

## అధ్యాయం : 44

## దీన్ (ధర్మం)లో అతిశయిల్లటం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: గ్రంథ ప్రజలారా! మీ ధర్మ విషయాలలో అతిగా ప్రవర్తించకండి. అల్లాహ్‌కు సత్యం తప్ప వేరే విషయాన్ని ఆపాదించకండి. మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా, అల్లాహ్ పంపిన ఒక ప్రవక్త, అల్లాహ్ మర్యమ్ వైపు నకు పంపిన ఒక ఆజ్ఞ, అల్లాహ్ తరపు నుండి వచ్చిన (మర్యమ్ గర్భంలో బిడ్డ రూపం దాల్చిన) ఒక ఆత్మ తప్ప మరేమీ కాదు. కనుక అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త లను విశ్వసించండి. 'ముగ్గురు' అని అనకండి. ఇలా అనటం మానివెయ్యండి. ఇది మీకే శ్రేయస్కరం. అల్లాహ్ ఒక్కడే దేవుడు. ఆయన పరిశుద్ధుడు, ఆయనకు**

---

*చాలా స్పష్టంగా ఇలా అనబడింది : "అల్లాహ్ దృష్టిలో ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమ్‌ను మట్టితో చేసి 'అయిపో' అని ఆజ్ఞాపించాడు. అతను అయ్యాడు."* (3: 59)

**ఒక కొడుకు ఉన్నాడనే విషయానికి ఆయన అతీతుడు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన ఆస్తియే. దాని పోషణకు, దాని రక్షణకు ఆయనే చాలు.**

***(అన్ నిసా– 171)***

**'కలిమతుహు' అంటే దైవాజ్ఞ అనీ, 'అయిపో' అని దైవాజ్ఞ కాగానే 'అతను అయ్యాడు' అని అబూ ఉబైద్ వ్యాఖ్యానించారు. 'వలా తఖూలు సలాసతున్' అంటే 'దేవుడు ముగ్గురు' అని అనకండి [1] అని అర్థం.**

**99) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించారని హజ్రత్ ఉబాదా బిన్ సామిత్(రజి) ఉల్లేఖించారు : "ఎవరయితే అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని, అల్లాహ్‌కు సహవర్తులు ఎవరూ లేరని, ముహమ్మద్(స) దైవదాసుడు, [1] దైవ సందేశహరుడని సాక్ష్యమిస్తాడో, ఇంకా ఈసా (ఏసుక్రీస్తు– అలైహిస్సలామ్) దైవదాసుడనీ, దైవప్రవక్త అనీ (సాక్ష్యమిస్తాడో), ఇంకా ఆయన మర్యమ్(అ) వైపునకు తరలించబడిన వాక్కు (ఆజ్ఞ) అనీ, అది ఆయన తరఫున ఆత్మ (రూహ్) అని సాక్ష్యమిస్తాడో, ఇంకా స్వర్గ నరకాలు సత్యం (అని సాక్ష్యమిస్తాడో) అతను ఎటువంటి ఆచరణ చేసి ఉన్నా (చివరకు) అల్లాహ్ అతన్ని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు"– '(అటువంటి వ్యక్తి) స్వర్గం యొక్క ఎనిమిది ద్వారాలలో తాను కోరిన ద్వారం గుండా ప్రవేశిస్తాడు' అని వేరొక ఉల్లేఖనంలో అదనంగా ఉంది.**

---

44–1. ఇక్కడ 'త్రిత్వం' (TRINITY) అనే విశ్వాసం ఖండించబడింది. త్రిత్వాన్ని నమ్మేవారు 1) పరిశుద్ధాత్మ 2) మర్యమ్ 3) ఈసా(అ) – ఈ ముగ్గురు కలిపి ఒకే దైవం అంటారు.

99–1. మహాప్రవక్త ముహమ్మద్(స) దైవప్రవక్తలందరికీ నాయకులే అయినప్పటికీ, ఆయన మనుజ జాతిలోకెల్లా శ్రేష్ఠులైనప్పటికీ, ఆయన కూడా దైవదాసుడే. తనను దైవదాసుడుగా చెప్పుకోవడానికి ఆయన(స) ఎన్నడూ చిన్నబుచ్చుకోలేదు. కాని కడు శోచనీయమైన విషయం ఏమిటంటే, అనుదినం అయిదు పూటల నమాజులలో ముహమ్మద్ ప్రవక్త(స)ను దైవదాసుడుగా, దైవ సందేశహరునిగా ధ్రువపరిచే ప్రబుద్ధులు సయితం ఆయన్ని(స) దాస్యపు స్థానం నుంచి తీసి దైవత్వపు స్థానానికి చేర్చుతూ ఉంటారు. అలా చేస్తున్నప్పుడు వారు ఏమాత్రం సిగ్గుపడరు. ఆ మేరకు కవితలు, నాత్‌లు కూడా విని పిస్తూ ఉంటారు. వాటిని విని మౌనం వహించిన మన విశ్వాసం (ఈమాన్) ప్రమాదంలో పడిపోతుంది.

ఆయన(స) జీవిత కాలంలో ఒక వ్యక్తి కేవలం 'తమరు కోరినట్లే, అల్లాహ్ కోరినట్లే' అని పలికాడు. ఆయన(స) వెంటనే అడ్డు తగులుతూ, "అల్లాహ్ కోరినట్లే" అని పలుకు. నీవు నన్ను దైవానికి సమానంగా చేసేస్తున్నావు అని మందలించారు.

## అధ్యాయం : 45

## మర్యమ్ సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం

ప్రవక్తా! ఈ గ్రంథంలో, మర్యమ్ తన వారి నుండి వేరైపోయి, తూర్పు దిక్కున ఏకాంతంగా కూర్చుండి, వారికి చాటుగా తెర కట్టుకుని ఉండిపోయినప్పటి వృత్తాంతాన్ని ప్రస్తావించు. *(మర్యమ్ : 16)*

మానవాకారంలో ప్రత్యక్షమైన దైవదూతను చూసి మర్యమ్ (అ) ఇలా పలికారు: "నీవు దైవభీతి కల మనిషివే అయితే, నేను నీ బారి నుండి రక్షించవలసినదిగా దయామయుడైన దేవుని శరణు కోరుకుంటున్నాను."

**100)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "ఒడిలో ఉండి మాట్లాడిన పసిపిల్లలు ముగ్గురు మాత్రమే. వారిలో ఒకరు ఈసా(అలైహిస్సలామ్). (రెండవ వారెవరంటే) బనీ ఇస్రాయీల్‌లో ఒక సాత్వికుడైన వృద్ధుడు ఉండేవాడు. ఆయన పేరు జురైజ్. ఆయన నమాజ్ చేసుకుంటూ ఉండగా ఆయన తల్లి ఆయన్ని పిలిచింది. 'నేను తల్లి పిలుపుకు బదులు ఇవ్వాలా? లేక నమాజ్ చేసుకోవాలా?' (అని ఆయన మనసులోనే మథన పడ్డారు). కొడుకు ధోరణిపై తల్లికి కోపం వచ్చింది. 'దేవా! వేశ్యల ముఖం చూడనంతవరకూ వీడికి చావు రాకుండా చూడు' అని ఆమె శపించింది. జురైజ్ తన ప్రార్థనా కుటీరంలో ఉండేవాడు. ఒకసారి ఓ వేశ్య ఆయన దగ్గరకు వచ్చి కవ్వించింది. అక్రమ సంబంధం కొరకు పిలిచింది. కాని ఆయన ఆ స్త్రీ కోరికను తీర్చలేదు. తరువాత ఆ వేశ్య ఒక పశువుల కాపరి దగ్గరకు వెళ్ళి, అతనికి తనను అర్పించుకుంది. అతని ద్వారా ఆమెకు ఒక పిల్లవాడు పుట్టాడు. తనకు పుట్టిన ఆ పిల్లవాని తండ్రి జురైజ్ అని అపనింద మోపి, అతనిపై కసి తీర్చుకుంది ఆ వేశ్య. జురైజ్ జాతి ప్రజలు వచ్చి (కోపంతో) అతని ప్రార్థనా మందిరాన్ని కూల్చివేశారు. అంతేకాదు, ఆ సన్యాసిని క్రిందికి ఈడ్చుకు వచ్చి, ఎడాపెడా తిట్టారు. అప్పుడు ఆ సాత్వికుడు వుజూ చేసి, నమాజ్ చేసుకున్నాడు. తరువాత ఆ పిల్లవాడి దగ్గరకు వచ్చి, 'బాబు! నీ తండ్రి ఎవరమ్మా?' అని అడిగాడు. ఆ పిల్లవాడు (దైవాజ్ఞ మేరకు) మాట్లాడసాగాడు. 'నా తండ్రి పశువుల కాపరి' అని చెప్పాడు. (ఇది విని గ్రామ ప్రజలు సిగ్గుతో కుమిలిపోయారు) 'మేము మీ ప్రార్థనాలయాన్ని స్వర్ణాలయంగా

**నిర్మించి ఇస్తాం' అని అతనితో చెప్పారు. దానికి ఆ సాత్వికుడు 'వద్దొద్దు. మట్టితో కడితే సరిపోతుంది' అన్నాడు.**

**(మూడవ సంఘటన) బనీ ఇస్రాయీల్‌కి చెందిన ఒక స్త్రీ తన పసిపిల్లవాడికి చనుబాలు ఇస్తూ ఉండగా, ఆమెకు సమీపం నుండే ఒక వాహనంపై ఒక వ్యక్తి స్వారీ అయి ముందుకు సాగిపోయాడు. చూడచక్కగా ఉన్నాడు, మర్యాదస్తునిలా కనిపించాడు. 'దేవా! నా పిల్లవాణ్ణి కూడా ఈ వ్యక్తి మాదిరిగా తీర్చిదిద్దు' అని ఆ తల్లి వేడుకుంది. కాని ఆ పసిపిల్లవాడు (దైవాజ్ఞతో) మాట్లాడుతూ, 'దేవా! నన్ను మాత్రం ఆ వ్యక్తిలాగా తీర్చిదిద్దకు' అని చెప్పి ఆమె రొమ్ములకు అతుక్కుపోయి చనుబాలు చప్పరించసాగాడు." అబూహురైరా (రజి) ఇలా అన్నారు: 'దైవప్రవక్త (స) ఆ పిల్లవాడు పాలు త్రాగిన వైనాన్ని వివరిస్తూ తన వ్రేలును నోట్లో పెట్టి చప్పరించిన దృశ్యాన్ని నేను ఇప్పటికీ చూస్తున్నట్లే ఉంది– అంతలో ఒక బానిస స్త్రీ అక్కడి నుండి సాగిపోయింది. ఆమెను కొంతమంది తరుముకుంటూ పోతున్నారు. ఆ దృశ్యాన్ని చూసి, 'దేవా! నా పిల్లవాణ్ణి మాత్రం ఈవిడ మాదిరిగా చేయకు' అని ఆ తల్లి ప్రార్థించింది. అప్పుడు ఆ పసిపిల్లవాడు తన తల్లి చనువును వదిలి,'దేవా! నన్ను ఈ స్త్రీ మాదిరిగానే చెయ్యి' అన్నాడు. 'ఒరేయ్ చంటీ! నువ్విలా ఎందుకు ప్రవర్తిస్తున్నావ్‌రా?' అని ఆమె అడిగితే, '(అమ్మా!) ఆ రౌతు ఒక దౌర్జన్యపరుడు. ఇక ఆ బానిస స్త్రీ విషయానికి వస్తే, దొంగతనం చేశావనీ, వ్యభిచారం చేశావని జనులు ఆమెపై నీలాపనిందలు మోపుతున్నారు. వాస్తవానికి ఆమె ఏ తప్పూ చేయలేదు'[1] అని చెప్పాడు.**

---

100–1. ఆ స్త్రీ ఏ పాపం ఎరుగని అమాయకురాలు. శీలవతి. ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన మూడు సంఘటనలు కూడా బనీ ఇస్రాయీల్‌కు సంబంధించినవే. వీరుగాక మరికొంతమంది పాలు త్రాగే పసిపిల్లలు కూడా మాట్లాడారు. ఉదాహరణకు– దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ) నిర్దోషిత్వాన్ని గురించి సాక్ష్యం ఇచ్చిన పిల్లవాడు. అలాగే నిజదైవాన్ని నమ్మి నడుచుకునే ఒక స్త్రీని ఫిరౌన్ అగ్నికి ఆహుతి చేయదలచినప్పుడు ఆ మహిళ ఊగిసలాడింది. అప్పుడు ఫిరౌన్ కూతురు ఆ తల్లికి ధైర్యం చెబుతూ, 'అమ్మా! భయపడకు. మనం నిజ ధర్మంపై ఉన్నాం' అని చెప్పింది. కందకాల వాళ్ళ గురించి అధ్యయనం చేసేటప్పుడు కూడా అలాంటి ఒక పసివాని ప్రస్తావన వస్తుంది. అలాగే హలీమా కథనం ప్రకారం అంతిమ దైవప్రవక్త(స) పాలు త్రాగుతూ ఇలా పలికారు– "అల్లాహు అక్బర్ కబీరా– వల్ హమ్దులిల్లాహి కసీరా– వ సుబ్‌హానల్లాహి బుక్రతఁవ్వ అసీలా". దీనిని బైహఖీ వెలికి తీశారు.

**101)** అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "నన్ను గగనయాత్రకు తీసుకుపోబడిన రాత్రి, నేను మూసా (అలైహిస్సలామ్)ను కలుసుకోవటం జరిగింది– ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు: తరువాత దైవప్రవక్త(స) ఆయన రూపురేఖలను వివరించారు– ఆయన సన్నగా, ఎత్తుగా ఉన్నారు. తిన్నని తలవెంట్రుకలు. చూస్తుంటే షనూఅ తెగకు చెందిన వారిలా కనిపించారు. ఆయన(స) ఇంకా ఇలా అన్నారు: "ఈసా (అలైహిస్సలామ్)ను కూడా నేను కలుసుకున్నాను." దైవప్రవక్త(స) ఆయన రూపురేఖలను గురించి కూడా వివరించారు– ఇలా అన్నారు: "ఆయన మరీ అంత పొడుగరీ కారు, మరీ అంత పొట్టివారు కూడా కారు. ఎర్రగా ఉన్నారు.అప్పుడే స్నానశాల నుండి బయటికి వచ్చినవారిలా– ప్రఫుల్ల వదనంతో– ఉన్నారు. నేను ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్)ను కూడా కలుసుకున్నాను. నేను ఆయన సంతానంలో అందరికన్నా ఎక్కువగా ఆయన్ని పోలి ఉన్నాను" దైవప్రవక్త(స) ఇంకా ఇలా అన్నారు: "నా ముందు రెండు పాత్రలు సమర్పించబడ్డాయి. వాటిలో ఒక దాంట్లో పాలు, రెండవ దాంట్లో మద్యం ఉన్నాయి. 'మీకు నచ్చిన దానిని తీసుకుని సేవించండి' అని నాతో అనబడింది. నేను పాలపాత్ర తీసుకుని సేవించాను. అప్పుడు నాతో, 'మీరు సహజత్వం వైపునకు దారి తీశారు. లేదా సహజత్వాన్ని పొందారు. ఒకవేళ మీరు గనక మద్యం పాత్రను తీసుకుని ఉంటే, మీ అనుచర సమాజం మార్గం తప్పేది' అని అనటం జరిగింది."

**102)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచనం: "నేను ఈసా, మూసా, ఇబ్రాహీమ్ (అలైహిముస్సలామ్)లను చూశాను. ఈసా(అ) చాలా ఎర్రగా ఉన్నారు. వంకీలు తిరిగిన జుత్తు, విశాలమైన ఛాతీ– ఆయనది. మూసా(అ)ది గోధుమ వర్ణం, పొడుగరి, తలవెంట్రుకలు తిన్నగా ఉన్నాయి. 'జుత్'[1] తెగకు చెందిన మనిషిలా ఉన్నారు.

**103)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక రోజు ప్రజల ముందు దజ్జాల్ గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు:

---

102–1. 'జుత్' అనేది సూడాన్ దేశంలోని ఒక తెగ లేదా అది యూదు తెగ. ఆ ప్రజలు సన్నగా, ఎత్తుగా ఉంటారు.'జుత్' నుండే 'జాట్' అనే పదం వచ్చింది. జాట్ తెగ ఉత్తర భారతదేశంలో సుప్రసిద్ధమైన తెగ.

“నిశ్చయంగా అల్లాహ్ ఒంటి కన్ను కలవాడు కాదు. కాని దజ్జాల్ మాత్రం ఒంటి కన్ను కలవాడు. వాడి కుడి కన్ను పుచ్చిపోయి, ద్రాక్షపండులా ఉబ్బి ఉంటుంది. ఇంకా నేను రాత్రి కలలో, కాబా గృహం వద్ద ఒక వ్యక్తిని చూశాను. అతను గోధుమ వర్ణం కల మనుషులలో రూపురేఖల దృష్ట్యా ఎంతో అందంగా ఉన్నాడు. అతని తల వెంట్రుకలు (జులఫాలు) భుజాల వరకు వ్రేలాడుతూ ఉన్నాయి. అతని తల నుండి నీటి బిందువులు కారుతున్నాయి. అతను తన రెండు చేతుల్నీ ఇద్దరు వ్యక్తుల భుజాలపై పెట్టి కాబా గృహ ప్రదక్షిణ చేస్తూ ఉన్నాడు. ‘ఇంతకీ ఎవరితను?’ అని నేనడిగితే, ‘ఇతను మర్యమ్ కుమారుడగు మసీహ్ (అలైహిస్సలామ్) అని ఒకరు చెప్పారు.మరి ఆయన వెనుకాలే నేను మరో వ్యక్తిని కూడా చూశాను– కరకుగా ఉన్న వంకీల జుత్తు, ఒంటికన్ను కలవాడు. అతని కుడికన్ను పాడైపోయి ఉంది. నేను చూసిన జనులలో అతను అందరికన్నా ఎక్కువగా అబ్దుల్ ఉజ్జా బిన్ ఖతన్‌ను పోలి ఉన్నాడు (అతను అజ్ఞాన కాలంలోనే చనిపోయాడు). అతను తన రెండు చేతుల్నీ ఒక వ్యక్తి భుజంపై పెట్టి కాబాగృహ ప్రదక్షిణ చేస్తున్నాడు. ‘ఇతనెవరు?’ అని నేనడిగితే, ‘ఇతను మసీహ్ దజ్జాల్’ అని ఎవరో చెప్పారు.

**104)** తన తండ్రి (అబ్దుల్లా బిన్ ఉమర్–రజి) చెప్పారని సాలిమ్ తెలిపారు: ఎంతమాత్రం కాదు, దైవసాక్షిగా! దైవప్రవక్త(స) హజ్రత్ ఈసా (అ) గురించి, ‘ఆయన ఎర్రగా ఉన్నారు’ అని చెప్పలేదు. పైగా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ఇలా చెప్పారు– ‘నేనొకసారి కలలో కాబా గృహం ప్రదక్షిణ చేస్తూ చూశాను, ఆ సమయంలో నాకు ఒకాయన కనిపించారు. ఆయన గోధుమ వర్ణంలో ఉన్నారు. జులఫాలు వ్రేలాడుతూ ఉన్నాయి. ఇద్దరు మనుషుల మధ్యన వారిని ఊతగా చేసుకుని, తల నుంచి కారే నీటి బిందువులను తుడుచుకుంటున్నారు. ‘ఈయన ఎవరు?’ అని నేనడిగితే, ‘ఈయన మర్యమ్ కుమారుడు’ అని దైవదూతలు చెప్పారు. అప్పుడు నేనాయన్ని తదేకంగా తిలకిస్తూ ఉండగా, నాకు మరొక వ్యక్తి కనిపించాడు. అతను ఎర్రగా, లావుగా ఉన్నాడు. తల వెంట్రుకలు వంకీలు తిరిగి ఉన్నాయి. కుడి కన్ను ద్రాక్ష పండులా ఉబ్బి ఉంది (అతను ఒంటి కన్ను వాడు). ‘ఇతనెవరు?’ అని నేనడిగితే, ‘ఇతను దజ్జాల్’ అని దైవదూతలు చెప్పారు. రూపురేఖల దృష్ట్యా అతను ఇబ్నె ఖతన్‌ను పోలి ఉన్నాడు. జుహ్రీ ఇలా అన్నారు : అతను (ఇబ్నె ఖతన్) ఖుజాఅ తెగకు చెందినవాడు. అజ్ఞాన కాలంలోనే మరణించాడు.

**105) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు. ఆయన(స) ఇలా ప్రవచించారు– "నేను మర్యమ్ కుమారునికి (ఈసా– అలైహిస్సలామ్) ఇతరుల కన్నా చాలా దగ్గరివాడను. దైవప్రవక్తలు 'అల్లాతీ సోదరులు' వంటివారు (అంటే వారి తండ్రి ఒక్కడే, కాని తల్లులు మాత్రం వేరు)–ఇకపోతే నాకూ– ఈసా(అ)కి మధ్యన ఏ ప్రవక్తా లేరు."[1]**

**106) హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: "నేను మర్యమ్ కుమారుడగు ఈసా (అలైహిస్సలామ్)కు ఇతర జనులకన్నా ఎక్కువ సన్నిహితుణ్ణి– ఇహలోకంలో, పరలోకంలో కూడా. దైవప్రవక్తలు 'అల్లాతీ' సోదరులు (వంటివారు) (అంటే వారి తండ్రి ఒక్కడే అయినా తల్లులు వేర్వేరు). వారి (పాక్షిక) పద్ధతులలో వైవిధ్యం ఉన్నప్పటికీ వారి మతధర్మం (దీన్) మాత్రం ఒక్కటే."**

**107) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: "మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ప్రవచనం–"ఒక వ్యక్తి దొంగతనం చేస్తూ ఉండగా మర్యమ్ కుమారుడగు ఈసా(అలైహిస్సలామ్) చూసి, 'నీవు దొంగతనం చేశావా?' అని ఆ వ్యక్తిని విచారించారు. దానికి ఆ వ్యక్తి 'లేదు. ఏ దైవం తప్ప మరో నిజ ఆరాధ్యుడు లేడో ఆయనపై ఒట్టు. నేను దొంగతనం చేయలేదు' అన్నాడు. అప్పుడు ఈసా(అ) 'నేను అల్లాహ్‌ను విశ్వసించాను. కాని నా కళ్లు మోసపోయాయి' అని అన్నారు."[1]**

---

105–1. అంటే ఆయనా ప్రవక్తే, ఈయనా ప్రవక్తే. వీరిద్దరికీ మధ్యన ఏ ప్రవక్తా ప్రభవించలేదు. హజ్రత్ ఈసా(అ) స్వయంగా ఇంజీలులో ముహమ్మద్(స) రాక గురించి శుభవార్త వినిపించారు. ఆయన మిమ్మల్ని ఓదారుస్తారనీ, నేను మీకు చెప్పని ఎన్నో విషయాలను విడమరచి చెబుతారనీ, నేను జ్ఞానం పొందిన సరోవరం నుండే ఆయన కూడా జ్ఞానం పొందుతారని చెప్పారు. కాని నస్రానీలు ఇలాంటి వాక్యాలను మరుగుపరిచారు.

107–1. అంటే ఒక విశ్వాసి (మోమిన్) అబద్ధపు ప్రమాణం చేయలేడు. అతను ఒట్టేసుకుని చెప్పాడంటే నిజమే చెప్పి ఉంటాడు. లేదా అతను చేసినది దొంగతనం కాకపోవచ్చు. తనకు రావలసిన హక్కునే అతను తీసుకుని ఉండవచ్చు. మరికొంత మంది ఏమంటారంటే; అలా చెప్పటం హజ్రత్ ఈసా(అ) ఉద్దేశ్యం, ఒక విశ్వాసికి మరో విశ్వాసి ప్రమాణంపై నమ్మకం ఉంచాలి... అలాగే మరికొంతమంది ఏమంటారంటే, ఒక న్యాయమూర్తి తాను చూసిన దాని ఆధారంగా తీర్పు ఇవ్వటం సమంజసం కాదు. నేరానికి సంబంధించిన రుజువులు సమకూరనంతవరకూ తీర్పు ఇవ్వకూడదు.

**108) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : ఈయన గారు హజ్రత్ ఉమర్ (రజి)వేదికపై నుండి ఇలా అంటూ ఉండగా విన్నారు– "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ఇలా చెబుతూ ఉండగా విన్నాను "మర్యమ్ కుమారుడగు ఈసా (అలైహిస్సలామ్)ను నస్రానీలు ఆయన స్థాయికి మించి ఆయన్ని పైకి ఎత్తినట్లుగా మీరు నన్ను నా స్థాయికి మించి పైకి ఎత్తకండి. నేను దైవదాసుడను మాత్రమే. అందువల్ల (నా గురించి), నేను అల్లాహ్ దాసుణ్ణి అనీ, అల్లాహ్ సందేశహరుణ్ణి అని మాత్రమే అనండి."[1]**

**109) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఒకవేళ ఎవరయినా తన దగ్గర ఉన్న బానిస స్త్రీకి బాగా సంస్కారం నేర్పి, చక్కగా ధార్మిక శిక్షణనిచ్చి, ఆమెకు బానిసత్వం నుండి విముక్తిని ప్రసాదించి, ఆమెను వివాహమాడినట్లయితే, అతనికి రెట్టింపు పుణ్యం లభిస్తుంది. అలాగే ఎవరయినా ఒక వ్యక్తి పూర్వం హజ్రత్ ఈసా (అలైహిస్సలామ్)ను విశ్వసించిన వాడై ఉండి, ఆ తరువాత నన్ను విశ్వసించి నట్లయితే అతనికి కూడా రెండింతల పుణ్యఫలం ప్రాప్తమవుతుంది. అదేవిధంగా ఎవరయినా ఒక వ్యక్తి తన ప్రభువుకు భయపడుతూ, తన యజమానికి విధేయుడుగా మసలుకున్నట్లయితే అతనికి కూడా రెండింతల పుణ్యం లభిస్తుంది."**

**110) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా చెప్పినట్లుగా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖించారు : "(ప్రళయ దినమున) మీరు నగ్న పాదాలతో, నగ్న శరీరాలతో, సుంతీ (సున్నతీ– వడుగు) చేయని స్థితిలో లేపబడ**

---

108–1. అల్లాహ్ దాసుడు, అల్లాహ్ ప్రియతముడు, అల్లాహ్ స్నేహితుడు, ప్రవక్తలలోకెల్లా శ్రేష్ఠులు– ఆయన్ని (స) పొగిడే విషయంలో హద్దు ఇంతవరకే. దివ్య ఖుర్ఆన్‌లో ఆయన్ని **'ఖామ అబ్దుల్లాహి'** (అల్లాహ్ దాసుడు అల్లాహ్‌ను ప్రార్థించటానికి నిలబడినప్పుడు) (72: 19) అనే ఆయత్ అవతరించినప్పుడు ఆయన(స) ఎంతగానో సంతోషించారు. అలాగే అల్లాహ్ ఆయన్ని(స) ఇస్రా– మేరాజ్‌కు గొనిపోయిన సందర్భంగా ఖుర్ఆన్‌లో అవతరించిన ఆయత్‌లో కూడా ఆయన్ని **'బి అబ్దిహీ'** (తన దాసుణ్ణి) (17: 1) అని చెప్పటం జరిగింది. అల్లాహ్ దాసుడు అనే అంతస్తు ఎంతో ఉన్నతమైనదీ, గౌరవప్రదమైనదీను. కాని అజ్ఞానులకేం తెలుసు? వారు తమ నాత్‌లలో, ఖవ్వాలీలలో ఆయన్ని దైవత్వపు స్థానానికి చేర్చేశారు. *"వారి నోట వెలువడే ఈ మాట అత్యంత దారుణమైనది. వారు కేవలం అబద్ధాన్ని మాత్రమే వాగుతున్నారు'* (18: 5)

తారు". తరువాత ఆయన(స) ఈ దైవ వచనాన్ని పఠించారు– "మేము మొదట్లో సృష్టిని చేసినట్లే మళ్ళీ దానిని చేస్తాము. ఇది మాపై బాధ్యతగా ఉన్న ఒక వాగ్దానం. మేము ఈ పనిని ఎలాగైనా చేయవలసే ఉంది' (21: 104). "ఆ తరువాత అందరి కన్నా ముందు హజ్రత్ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్)కు వస్త్రం తొడిగించబడుతుంది. ఆపైన నా సహచరులను కుడి వైపునకు (స్వర్గం వైపునకు) గొనిపోవటం జరుగు తుంది. కాని కొంతమందిని ఎడమ (నరకం) వైపునకు గొనిపోవటం జరుగుతుంది. అప్పుడు నేను, 'అయ్యో! వీళ్ళు నా సహచరులు' అని అంటాను. అప్పుడు నాకు తెలియజేయబడుతుంది– 'నీవు వీళ్లమధ్య నుండి నిష్క్రమించగానే, వీళ్ళు ధర్మభ్రష్టత (ఇర్తెదాద్)కు ఒడిగట్టారు' అని. అప్పుడు నేను సజ్జనుడైన దాసుడు, మర్యమ్ పుత్రుడగు ఈసా(అలైహిస్సలామ్) చెప్పిన మాటలే చెబుతాను– '(ప్రభూ!) నేను వారి మధ్యన ఉన్నంతకాలం వరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉంటున్నావు. నీవు సర్వ విషయాలను కనిపెట్టి ఉండేవాడవు. ఇప్పుడు ఒకవేళ నీవు వారిని శిక్షించినట్లయితే వారు నీ దాసులు, ఒకవేళ క్షమించినట్లయితే నీవు శక్తిమంతుడవు, వివేకవంతుడవు."

*(అల్ మాయిదా : 117, 118)*

ఖబీసా కథనం ప్రకారం ఈ ధర్మభ్రష్టులు (ముర్తిదీన్) తొలికాలం వారు. దైవప్రవక్త(స) పరమపదించిన తరువాత– హజ్రత్ అబూబక్ర్(రజి) ఖిలాఫత్ కాలంలో వీరు అవిశ్వాస వైఖరికి ఒడిగట్టారు. వారిపై అబూబక్ర్(రజి) ధర్మయుద్ధం చేశారు.

## అధ్యాయం : 45(అ)

## మర్యమ్ కుమారుడగు ఈసా(అలైహిస్సలామ్) దివి నుండి భువికి దిగి రావటం గురించి....

**111)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను. మర్యమ్ కుమారుడగు మహనీయ ఈసా(అ) ఒక న్యాయశీలుడైన పరిపాలకునిగా దిగి వచ్చే కాలం దగ్గరలోనే ఉంది. ఆయన శిలువను విరగ్గొడతారు. పందిని చంపుతారు. జిజ్‌యాను రద్దు పరుస్తారు. ఆ సమయంలో ధనం ఎంత పుష్కలంగా ఉంటుందంటే, ఎవరికయినా దానిని

ఇవ్వాలనుకున్నా పుచ్చుకునే వాడుండడు. ఆ సమయంలో ఒక్కగానొక్క సజ్దా (దైవానికి చేసే సాష్టాంగ ప్రమాణం) ప్రపంచంకన్నా, ప్రపంచంలోనున్న దానంతటి కన్నా మేలైనదై ఉంటుంది"– ఆ తరువాత హజ్రత్ అబూ హురైరా(రజి) ఇలా అన్నారు: కావాలనుకుంటే మీరు ఈ ఆయత్‌ను చదువుకోండి– "గ్రంథ ప్రజలలో ఎవ్వరూ అతనిని అతని మరణానికి పూర్వం విశ్వసించకుండా ఉండరు. ప్రళయం నాడు ఆయన వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాడు."[1] *(అన్ నిసా– **159**)*

**112)** హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచనం– "మర్యమ్ కుమారుడగు ఈసా (అలైహిస్సలామ్) మీపైన అవతరించినప్పుడు, మీ పరిస్థితి ఏమవును? (అప్పుడు మీరు నమాజ్ చేస్తూ ఉంటారు) మీ ఇమామ్ మీలోనివాడే అయి ఉంటాడు."

## అధ్యాయం : 46

## బనీ ఇస్రాయీల్ సంఘటనలు

**113)** ఉఖ్బా బిన్ అమ్ర్ గారు హజ్రత్ హుజైఫా(రజి)తో 'ఏమిటీ, మీరు దైవప్రవక్త(సఅసమ్) ద్వారా విన్న ఆ హదీసును మాకు వినిపించరా?' అని అడగ్గా, ఆయన(రజి) ఇలా చెప్పారు– నేను, దైవప్రవక్త(సఅసమ్) ఈ విధంగా చెప్పగా విన్నాను : "దజ్జాల్ బయల్పడినప్పుడు, అతని వెంట అగ్ని, నీరు– ఈ రెండూ ఉంటాయి. కాని జనులకు అగ్నిగా కనిపించేది నీరై ఉంటుంది. జనులకు చల్లని నీరుగా కానవచ్చేది, కాల్చి భస్మీపటలం చేసే అగ్ని అయి ఉంటుంది. కనుక మీలో ఎవరయినా ఆ కాలంలో ఉంటే అగ్నిగా కానవచ్చే దానిలో పడిపోవాలి. ఎందుకంటే అదే ఎంతో తియ్యని, చల్లని త్రాగు నీరై ఉంటుంది."

ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ హుజైఫా (రజి) తెలిపారు : "పూర్వకాలంలో ఒక వ్యక్తి వద్దకు మరణ దూత (మలకుల్ మౌత్), అతని ఆత్మను వశపరచుకోవడానికి వచ్చి, 'నీవు చేసుకున్న సదాచరణ ఏదైనా నీకు గుర్తుందా?' అని అడగటం జరిగింది. దానికి ఆ వ్యక్తి 'నాకైతే గుర్తు లేద'ని అంటాడు. 'బాగా జ్ఞప్తికి తెచ్చుకో' అని అతన్ని మరోసారి

111–1. అంటే ప్రళయానికి ముందు హజ్రత్ ఈసా(అ) భువిపై అవతరించినప్పుడు యూదులు, క్రైస్తవులు అందరూ హజ్రత్ ఈసా(అలైహిస్సలామ్)ను నమ్మి నడుచుకుంటారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలాగే ఉటంకించారు.

అడగ్గా, 'నేనేదన్నా సత్కార్యం చేసుకున్నట్టు నాకైతే జ్ఞాపకం లేదు. కాకపోతే ప్రపంచంలో సాటి మానవులతో క్రయవిక్రయాలు చేసేవాణ్ణి, లావాదేవీల వ్యవహారం జరిపేవాణ్ణి. ఆ సందర్భంగా (అంటే అప్పులు వసూలు చేసే సమయంలో) కలవారికి గడువు ఇచ్చేవాణ్ణి, లేమికి గురైన వారిని మన్నించి వదలిపెట్టేవాణ్ణి' అంటాడు. అల్లాహ్ అతనికి, అతని ఈ సడలింపుల వైఖరి కారణంగా స్వర్గ ప్రవేశం కల్పించాడు."

దైవప్రవక్త (సఅసం) ఇలా చెబుతూ ఉండగా తాను విన్నానని హజ్రత్ హుజైఫా (రజి) వివరించారు: "ఒక వ్యక్తికి మరణ ఘడియలు ఆసన్నమై, అతడు తన జీవితం పట్ల పూర్తిగా నిరాశ చెందినప్పుడు, తన ఇంటివారికి ఇలా వసీయతు చేశాడు : 'మృత్యువు నన్ను కబళించినప్పుడు, నా కోసం కట్టెల్ని ప్రోగు చేసి, వాటికి నిప్పు అంటించండి. అగ్ని నా దేహాన్ని దగ్ధం చేసి, నా చివరి ఎముకను కూడా కాల్చివేశాక, కాలిన నా ఎముకలను కూడా దంచి తుత్తునియలు చేయాలి. బాగా గాలి వీచే రోజు నా కోసం నిరీక్షించి, ఆ రోజు నా చితాభస్మాన్ని నదిలో నిమజ్జనం చేసివేయాలి'– అతని ఇంటి వారు అతను చెప్పినట్లే చేశారు. కాని అల్లాహ్ అతని బూడిదను సమీకరించి, 'నువ్వీ పని ఎందుకు చేశావ్?' అని అడిగాడు. 'దేవా! నీ భీతి మూలంగానే ఇలా చేశాను' అని అతను సంజాయిషీ ఇచ్చాడు. "అల్లాహ్ ఈ కారణంగానే అతన్ని క్షమించాడు"–[1] ఉఖ్బా బిన్ అమ్ర్ ఇలా అన్నారు: "ఆ వ్యక్తి మృతులకు తొడిగించిన వస్త్రాన్ని దొంగిలించేవాడని దైవప్రవక్త(స) చెప్పగా నేను విన్నాను."

**114)** హజ్రత్ ఆయిషా(రజిఅల్లాహు అన్హా), హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్)పై మరణ సూచనలు ప్రస్ఫుటమైనప్పుడు, ఆయన(స) మాటిమాటికీ తన ముఖంపై దుప్పటి కప్పుకోసాగారు. తాపం తీవ్రత పెరగగానే దానిని మళ్ళీ తొలగించేవారు. ఆ స్థితిలో దైవప్రవక్త(ష) ఇలా అన్నారు: "యూదులు, క్రైస్తవులపై దేవుని శాపం పడుగాక!

---

113–1. ఆ వ్యక్తి బనీ ఇస్రాయీల్‌కి చెందినవాడు. ఇవి బనీ ఇస్రాయీల్ సంఘటనల్లో ఒకటైనందున అధ్యాయంలోని శీర్షికకు సరిగ్గా అతుకుతుంది. ఇలాంటి భయం వల్లనే మృతులను దహనం చేసే ఆచారం మొదలయిందని అంటారు. కాని ఇది సహజత్వానికి విరుద్ధం. మనిషికీ– మట్టికీ విడదీయరాని సంబంధం ఉంది. కాబట్టి మరణానంతరం అతన్ని మట్టిలో ఖననం చేయడమే ప్రకృతి ధర్మం.

వారు దైవప్రవక్తల సమాధులను మసాజిద్ (సాష్టాంగ ప్రణామ స్థలాలు)గా చేసుకున్నారు"– దైవప్రవక్త(స) తన అనుచర సమాజాన్ని వారి చేష్టల గురించి హెచ్చరించదలిచారు.[1]

**115)** అబూ హాజిమ్ తెలిపారు– నేను ఐదేళ్ళపాటు మహనీయ అబూ హురైరా(రజి) సమావేశాలలో కూర్చున్నాను. ఆయన గారు ప్రవక్త మహనీయుల (సఅసమ్) ఈ హదీసు వివరిస్తూ ఉండగా విన్నాను– ప్రవక్త మహనీయులు(స) ఇలా ప్రవచించారు: "బనీ ఇస్రాయీల్‌పై వారి ప్రవక్తలు పరిపాలన కూడా చేసేవారు. వారిలోని ఒక ప్రవక్త మరణించినప్పుడు వారి స్థానంలో– వారికి ప్రత్యామ్నాయంగా– రెండవ వారు వచ్చేవారు. కాని నా తదనంతరం మరో ప్రవక్త ఉండరు. కాకపోతే ఖలీఫాలు ఉంటారు." 'మరి అలాంటి పరిస్థితిలో మాకు మీ ఆదేశం ఏమిటి?' అని సహచరమాన్యులు ప్రశ్నించగా, ఆయన(స) ఇలా ఉపదేశించారు: "ఖలీఫాగా వచ్చిన వ్యక్తి (సమక్షంలో మీరు విధేయతా ప్రమాణం – బైఅత్– చేసి ఉన్నట్లయితే)కి చేసిన విధేయతా ప్రమాణానికి మీరు కట్టుబడి ఉండండి. ఆ తరువాత వచ్చిన ఖలీఫాకు కూడా అలాగే విధేయులై ఉండండి. పాలితులుగా మీ బాధ్యతను సజావుగా నెరవేర్చండి. మీ పాలితుల హక్కును మీరు ఇచ్చారా? లేదా? అని (ప్రళయదినాన) వారిని నిలదీసి అడగటం జరుగుతుంది.

**116)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "మీరు మీ పూర్వీకుల పద్ధతులను అనుసరిస్తారు. వారి అడుగులకు మడుగులొత్తుతారు. ఒకవేళ వారు గనక ఏదయినా (ఇరుకైన) ఉడుము కన్నంలో దూరి ఉంటే, మీరు కూడా అందులోకి దూరు

---

114–1. ఈ ఉపదేశాన్ని ఖాతరు చేయకుండా సమాధులను పూజా స్థలాలుగా చేసుకున్న వారి (ముస్లింల) వైఖరి కడు శోచనీయం. వారు మస్జిద్‌లకు వచ్చి దైవ సన్నిధిలో సాష్టాంగ పడరు. కాని సోమవారం నాడు, శుక్రవారం నాడు సమాధులను, దర్గాహ్‌లను సందర్శించి సున్నత్‌కు విరుద్ధమైన పనులన్నీ చేస్తుంటారు. సమాధుల వద్ద పుష్పాంజలి ఘటిస్తారు. దుప్పట్లు కప్పుతుంటారు. దీపాలు వెలిగిస్తుంటారు. సమాధులను ముద్దాడుతుంటారు. సమాధుల ప్రదక్షిణ చేస్తుంటారు. కొందరైతే అక్కడ 'అర్జీలు' వ్రేలాడదీస్తారు. మరికొందరు సంగీత విభావరి పెడతారు. గాన కచేరీలు నిర్వహిస్తుంటారు. ఇలాంటి సోకాల్డ్ ముస్లింలను పై హదీసు ప్రకారం ఏమనాలి? లాహౌల వలా ఖువ్వత ఇల్లాబిల్లాహ్.

**తారు.” ‘దైవప్రవక్తా! మీ ఉద్దేశ్యంలో పూర్వీకులు అంటే ఎవరు? యూదులు, క్రైస్తవులా?’ అని మేము ప్రశ్నించగా, “మరెవరనుకున్నారు?”[1] అని ఆయన(స) అన్నారు.**

**117) హజ్రత్ అనస్(రజి) కథనం : (నమాజ్ కొరకు ప్రజలను పిలిచే పద్ధతిపై తర్జనభర్జన జరిగినప్పుడు) సహచర మాన్యులు మంట పెట్టడాన్ని, గంట మ్రోగించటాన్ని గురించి ప్రస్తావించారు. అయితే ఇది యూదులు, నసారాల పద్ధతి అని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. ఎట్టకేలకు బిలాల్(రజి)కు ఆజ్ఞాపించటం జరిగింది– అజాన్ పలుకులు రెండేసిసార్లు, ఇఖామత్ పలుకులు ఒకసారి చొప్పున పలకాలని.**

**118) మస్రూఖ్ ఉటంకించారు: విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) నమాజులో నడుముపై చేతులు ఉంచడాన్ని ఇష్టపడేవారు కారు. ఎందుకంటే యూదులు ఇలాగే చేసేవారు.**

**119) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వివరించారు: గత సముదాయాలతో పోల్చుకున్నప్పుడు (మీ ప్రాపంచిక జీవిత కాలం) అస్ర్ నమాజ్ వేళ నుంచి సూర్యాస్తమయం వరకే. యూదులు క్రైస్తవులతో పోల్చుకున్నప్పుడు మీ ఉపమానం ఎటువంటిదంటే, ఒక వ్యక్తి కొంత మంది కూలీలను తన పనిపై మాట్లాడుకుంటూ మధ్యాహ్న సమయంలో ఒక్కో మనిషికి ఒక్కో ఖీరాత్ చొప్పున కూలి ఇస్తానన్నాడు. ఇది విని యూదులు ఒక ఖీరాత్‌కు బదులుగా పనిచేశారు. ఆ తరువాత మధ్యాహ్నం నుండి అస్ర్ నమాజ్ వేళ అయ్యేవరకు ఒక ఖీరాత్ కూలిపై పనిచేసేవారెవరు? అని ఆ వ్యక్తి ప్రకటించగా, అది విని, క్రైస్తవులు ఒక ఖీరాత్ కూలిపై అస్ర్ నమాజ్ వేళ అయ్యేవరకు పనిచేశారు.**

---

116–1. అంటే, మీరు గుడ్డిగా యూదులు, క్రైస్తవుల పాదచిహ్నాలలో నడుచుకుంటారని ఆయన (స) చెప్పదలిచారు. నేటి ముస్లింల పరిస్థితి అలాగే ఉంది. యూదులు క్రైస్తవులు ఏ విధంగా తమ ధర్మాన్ని (దీన్‌ను) మార్చివేశారో, అదేవిధంగా– అంతకన్నా అధికంగా– నేడు ముస్లింలు ధర్మం(దీన్)లో కొత్త పుంతలు తొక్కుతున్నారు. అందుకే వారిలో పరిశోధనల, ఆవిష్కరణల సామర్థ్యం క్షీణించిపోయింది. సమాధుల పూజ, వ్యక్తి పూజ వంటి హానికరమయిన పోకడలు వారిలో తిష్టవేశాయి. ధర్మావలంబన విషయంలో లేనిపోని ఆచార దురాచారాలను ప్రవేశపెడుతున్నారు.

**ఇప్పుడు అస్ర్ నమాజ్ నుండి సూర్యాస్తమయ సమయం వరకూ రెండు ఖీరాత్‌ల కూలిపై పనిచేసేవారెవరు? అని ఆ వ్యక్తి ప్రకటన చెయ్యగా; ఆ ప్రకటనను విని ముస్లింలు (అంటే మీరు) సూర్యాస్తమయ సమయం వరకు రెండేసి ఖీరాత్‌లకు బదులుగా పనిచేశారు. బాగా వినండి! మీకు రెండింతల ప్రతిఫలం (కూలి) లభించింది. కాని మీరు పడిన శ్రమ తక్కువ. ఈ పరిస్థితిని గమనించిన యూదులు, క్రైస్తవులు కోపగించుకున్నారు. 'మేము పడిన శ్రమ ఎక్కువ. కాని మాకు లభించిన ప్రతిఫలం తక్కువ. ఎందుకిలా?' అని వారు ప్రశ్నించగా, 'నేను మీకు నిర్ధారించిన ప్రతిఫలాన్ని ఆపి ఉంచానా?' అని అల్లాహ్ అంటాడు. దానికి వారు 'లేద'ంటారు. అప్పుడు అల్లాహ్, 'ఇది నా అనుగ్రహం. నేను కోరిన వారికి కోరినంతగా ఇస్తాను. దీనిపై మీకు ఎలాంటి గుత్తాధిపత్యం లేదు'[1] అనంటాడు.**

**120) హజ్రత్ ఉమర్(రజి) చెప్పగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు. ఆయన (ఉమర్) ఇలా చెప్పారు– అల్లాహ్ అతనిని నాశనం చెయ్య![1] దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు : 'యూదులపై దేవుని దెబ్బపడుగాక! వారి కొరకు 'కొవ్వు' నిషేధించబడింది. అయితే వాళ్ళు దానిని కరిగించి అమ్ముకోసాగారు. తద్వారా వచ్చిన సొమ్మును తిన్నారు."**

**121) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు: "నా సందేశాన్ని జనులకు చేర వేయండి– అది ఒక్క వచనమైనా సరే. బనీ ఇస్రాయీల్ సంఘటనలను మీరు వివరించవచ్చు. అందులో తప్పేమీ లేదు. కాని ఎవరయితే నా మీద ఉద్దేశ్యపూర్వ కంగా అబద్ధం కల్పించాడో, అతను నరకంలో తన నివాసం కొరకు సిద్ధంగా ఉండాలి."**

**122) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారని హజ్రత్ అబూ**

---

119–1. ఈ హదీసు 'కితాబుస్సలాత్' (నమాజ్ ప్రకరణం)లో కూడా వచ్చింది.

120–1. ఆ వ్యక్తి ఎవరో కాదు, సమురా బిన్ జుందబ్. ఆయన గారు అవిశ్వాసుల నుంచి 'జిజ్‌యా'గా మద్యాన్ని వసూలు చేసి, దానిని అమ్మి, ఆ పైకాన్ని బైతుల్‌మాల్‌కి పంపించారు. సమురా తన స్వంత ఆలోచనతో– శాసనాన్వయం (ఇజ్తెహాద్)– చేసి ఆ పని చేశారు. ఎందుకంటే ఈ హదీసును అంతకుముందు ఆయన వినలేదు. అందువల్ల హజ్రత్ ఉమర్(రజి) ఆయన్ని శిక్షించలేదు.

**హురైరా (రజి) ఉల్లేఖించారు : "యూదులు, క్రైస్తవులు (గడ్డానికి, తలకు) 'ఖజాబ్' ఉపయోగించరు. మీరు మాత్రం తద్భిన్నమైన పద్ధతిని అవలంబించండి[1] (అంటే ఖజాబ్‌ను పూయండి)**

**123) హజ్రత్ జున్దుబ్ బిన్ అబ్దుల్లాహ్ ఇదే మస్జిద్‌లో (అంటే బస్రాలోని మస్జిద్‌లో) తమకు వివరించి చెప్పారని హసన్ తెలిపారు. ఆయన విశదీకరించిన దానిని తాము మరిచిపోలేదనీ, ఈ హదీసును ఆయన దైవప్రవక్త(స)కు వక్రీకరించి ఆపాదించారని కూడా తాము అనుకోవటం లేదని హసన్ చెప్పారు. దీని ప్రకారం దైవప్రవక్త(సఅసమ్) ఇలా ప్రవచించారు: పూర్వకాలంలో ఒక వ్యక్తి చేతికి గాయమైంది. ఆ గాయం వల్ల అతనికెంతో బాధ కలిగింది. చివరకు అతను కత్తితో తన చేతిని నరికివేశాడు. తత్ఫలితంగా రక్తం తీవ్రంగా స్రవించి, ఆ వ్యక్తి తనువు చాలించాడు. అతని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "నా దాసుడు తనంతట తానుగా నా దగ్గరకు రావడానికి శీఘ్రత కనబరిచాడు. అందువల్ల నేను కూడా స్వర్గాన్ని అతని కొరకు నిషేధించాను."[1]**

## అధ్యాయం : 47

## ఇస్రాయీల్ సంతతిలోని ఒక కుష్ఠురోగి, ఒక గుడ్డివాడు, ఒక బట్టతలవాడు.

**124) ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా విని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : ఇస్రాయీల్ సంతతిలో ముగ్గురు వ్యక్తులుండేవారు. వారిలో ఒకడు కుష్ఠ రోగి, రెండవవాడు అంధుడు, మూడవవాడు బట్టతల కలవాడు. అల్లాహ్ ఆ ముగ్గురినీ పరీక్షించగోరాడు. అందువల్ల అల్లాహ్ వారి వద్దకు ఒక దైవదూతను పంపాడు.**

**దైవదూత మొదట కుష్ఠురోగి వద్దకు వెళ్ళి 'నీకు అన్నిటికన్నా ఇష్టమైన వస్తువు**

122-1. 'ఖజాబ్' అంటే గడ్డానికి గోరింటాకు లేదా కుంకుమ పువ్వు రంగును పూయటం. ఇది సున్నత్. నల్లని రంగు కల ఖజాబ్ పూసే విషయంలో భేదాభిప్రాయం ఉంది. ఆచార వ్యవహారాలలో యూదులకు, క్రైస్తవులకు భిన్నమైన పద్ధతి అవలంబించాలన్న విషయం కూడా హదీసు ద్వారా తెలుస్తోంది.

123-1. 'ఆత్మహత్య' హరామ్(నిషిద్ధం) అని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. పైన పొందుపరచబడిన అనేక హదీసులలో గ్రంథవహుల, ఇస్రాయీల్ పిల్లల ప్రస్తావన చూచాయగా వచ్చింది.

ఏది?' అని అడిగాడు. దానికి అతను 'నాకు మంచి రంగు, మంచి శరీర ఛాయ కావాలి. ఎందుకంటే నా ఈ పరిస్థితిని చూసి జనులు నన్ను అసహ్యించుకుంటు న్నార'ని అన్నాడు. దైవదూత అతనిపై తన చేతిని నిమరగానే అతని జబ్బు నయం అయింది. అతని శరీరం రంగు కూడా ఆరోగ్యవంతంగా రూపొందింది. అతని చర్మం కూడా నిగనిగలాడింది. "నీవు ఎలాంటి సంపదను ఇష్టపడతావు" అని దైవ దూత అడగ్గా, 'ఒంటెలు' అని అతనన్నాడు. లేదా 'ఆవులు' అన్నాడు– ఉల్లేఖకుల్లో ఒకరైన ఇస్హాఖ్ బిన్ అబ్దుల్లాహ్ ఇక్కడ సందిగ్ధంలో పడ్డారు– దైవదూత అతనికి సూడి ఒంటెను ఇచ్చి, 'అల్లాహ్ ఇందులో నీకు సమృద్ధిని ఒసగుతాడు' అని చెప్పాడు.

తరువాత దైవదూత బట్టతల ఉన్న వ్యక్తి దగ్గరకు వెళ్ళి 'నీకు ఇష్టమైనదేది?' అని అడిగాడు. దానికి అతను, 'నా తల మీద మంచి వెంట్రుకలు మొలవాలి. ప్రస్తుతం నాలో ఉన్న ఈ లోపం దూరమవ్వాలి. ఎందుకంటే జనులు ఈ లోపం కారణంగా నన్ను చిన్నచూపు చూస్తున్నారు' అని చెప్పుకున్నాడు. అప్పుడు దైవదూత అతని తలపై చేయి నిమరగానే, క్రమంగా అతని లోపం దూరమవసాగింది– అంటే అతని తలపై మంచి వెంట్రుకలు మొలిచాయి. 'నీకు ఎలాంటి సంపద ఇష్టం?' అని దైవదూత అడగ్గా, 'ఆవులు' అని అతనన్నాడు. దైవదూత అతనికి ఒక సూడి ఆవును ఇచ్చి, 'అల్లాహ్ ఈ సంపదలో నీకు వృద్ధిని ప్రసాదిస్తాడ'ని చెప్పాడు.

ఆ తరువాత దైవదూత గుడ్డివాని దగ్గరకు వచ్చి 'నీకు ఏ వస్తువు ప్రియ మైనది?' అని అడిగాడు. దానికతను, 'అల్లాహ్ నాకు కంటిచూపును ప్రసాదిస్తే నేను జనులను చూడగలను' అన్నాడు. దైవదూత చేత్తో స్పృశించగానే, అల్లాహ్ ఆ వ్యక్తి కంటిచూపును అతనికి తిరిగి ఇచ్చేశాడు. అప్పుడు, 'నీకు ఎటువంటి సంపద అన్నిటికన్నా ప్రియమైనది?' అని దైవదూత ప్రశ్నించగా, 'మేకలు' అని ఆ వ్యక్తి సమాధానమిచ్చాడు. దైవదూత అతనికి ఒక సూడిమేకను ఇచ్చాడు.

ఆ మూడు పశువుల్లో ఎంతో సమృద్ధి జరిగింది. కడకు (ఒకప్పటి) కుష్టు రోగి లోయ అంతా ఒంటెలతో నిండిపోయింది. బట్టతల వ్యక్తి దొడ్డి అంతా ఆవులు,ఎద్దులతో నిండిపోయింది. గుడ్డివాని మేకలతో అతని లోయ అంతా కూడా కిక్కిరిసిపోయింది.

అప్పుడు ఆ దైవదూత అదే ఆకారంలో కుష్టు రోగి దగ్గరకు వచ్చి, 'చూడు, నేనొక నిరుపేద వ్యక్తిని. నా ప్రయాణ సామగ్రి అంతా అయిపోయింది. అల్లాహ్ తప్ప వేరొకరి ద్వారా నా అవసరం తీరే ఆశే లేదు. అయితే నేను, నీకు ఎంతో అందాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదించి నీకు ఒంటె సంపదను ఒసగిన దేవుని ఆధారంగా ఒక ఒంటెను దానంగా ఇవ్వవలసినదిగా అర్థిస్తున్నాను. తద్వారా నేను నా ప్రయాణం పూర్తి చేయగలను' అన్నాడు, దానికతను, 'నా మీద ఎన్నో బరువు బాధ్య తలు ఉన్నాయి' అన్నాడు. 'బహుశా నేను నిన్ను గుర్తు పట్టగలను. నీకు ఒకప్పుడు కుష్టు వ్యాధి ఉండేది కదూ! దాని కారణంగా ప్రజలు నిన్ను ఏవగించుకునేవారు కదూ!? పైగా నీవు కటిక దారిద్ర్యంలో మ్రగ్గుతూ ఉండేవాడివి. అల్లాహ్ నీపై దయజూపి ఈ సంపదను నీకు ప్రసాదించాడు. అవునా?' అని దైవదూత అడిగాడు. దానికి ఆ వ్యక్తి 'లేదు. ఈ సంపద అంతా నాకు నా తాతముత్తాతల నుండి సంక్ర మించింది' అన్నాడు. దానికి దైవదూత, 'ఒకవేళ నీవు నీ వాదనలో అబద్ధీకుడవైతే అల్లాహ్ నిన్ను నీ పూర్వపు స్థితికే మరల్చుగాక!' అని చెప్పి అక్కడి నుండి నిష్క్ర మించాడు.

తరువాత దైవదూత తన పూర్వపు ఆకారంలోనే బట్టతల వ్యక్తి దగ్గరకు వచ్చాడు. కాని అతడు కూడా కుష్టురోగి మాదిరిగానే సాకులు చెప్పాడు. అప్పుడు దైవదూత, 'ఒకవేళ నీవు గనక నీ మాటల్లో అబద్ధీకుడవైతే అల్లాహ్ నిన్ను నీ పూర్వ స్థితికే మరల్చుగాక!' అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత దైవదూత తన పూర్వ ఆకారంలోనే గుడ్డివాని వద్దకు వచ్చాడు. 'చూడు! నేనొక నిరుపేదను. నా ప్రయాణ సామగ్రి అంతా అయిపోయింది. అల్లాహ్ తప్ప నాకు ఇప్పుడు ఏ దిక్కూలేదు. నీకు కంటిచూపు ప్రసాదించిన అల్లాహ్ వాస్తాను ఇచ్చి, ఒక మేకను ఇవ్వమని అర్థిస్తున్నాను. తద్వారా నేను నా ప్రయాణ అవసరా లను సమకూర్చుకుంటాను' అన్నాడు. దానికి ఆ అంధుడు, 'నిజంగానే నేను ఒకప్పుడు గుడ్డివాడను. అల్లాహ్ తన కృపతో నాకు కంటిచూపును ప్రసాదించాడు. నిజంగానే నేను నిరుపేదగా ఉండేవాణ్ణి. అల్లాహ్ నన్ను ధనికునిగా చేశాడు. ఇప్పుడు నీకు అవసరమైనన్ని మేకల్ని తీసుకోగలవు. దైవసాక్షి! నీవు అల్లాహ్ 'వాస్తా' ఇచ్చావు. కాబట్టి నీవు కోరినన్ని మేకల్ని తోలుకుపో. నేను నిన్ను ఆపను' అన్నాడు. అప్పుడు దైవదూత ఇలా అన్నాడు: 'అక్కరలేదు. నీ సంపదను నీ వద్దనే ఉంచుకో. ఇది

**కేవలం పరీక్ష మాత్రమే. అల్లాహ్ నీ యెడల ప్రసన్నుడయ్యాడు. కాని నీ సహవాసు లిద్దరి పట్ల అప్రసన్నుడయ్యాడు.'[1]**

## హదీసు వెలుగులో గుహవారు

**125) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "పూర్వ కాలం (ఇస్రాయీల్ సంతతి)లో జరిగిన ఒక సంఘటన– ముగ్గురు వ్యక్తులు ఒక దారి గుండా నడిచిపోతుండగా, అకస్మాత్తుగా వర్షం కురిసింది. అందువల్ల వారు ముగ్గురూ ఒక పర్వత గుహలోకి ప్రవేశించారు. వారు గుహలోపలికి వెళ్ళగానే (కొండచరియ విరిగిపడి) గుహ ముఖ ద్వారం మూసుకుపోయింది. అప్పుడు వారు ముగ్గురూ పరస్పరం ఇలా చెప్పుకున్నారు: 'దైవసాక్షి! ఇప్పుడు మనం ఇక్కడినుండి బయట పడే మార్గం ఒక్కటే– మనం సత్యాన్ని ఆశ్రయించాలి. మనలోని ప్రతి వ్యక్తి తన సదాచరణలను గుర్తు చేసుకుని– వాటి ఆధారంగా– దుఆ చేయాలి. కేవలం దైవప్రసన్నతను చూరగొన డానికి చేసిన సత్కార్యం ఆధారంగా దైవ సహాయం అర్థించాలి.'**

**అందువల్ల వారిలోని ఒకడు ఇలా వేడుకున్నాడు: 'దేవా! నీకు తెలుసు. నేను ఒక కూలివాణ్ణి పెట్టుకున్నాను. నేను అతన్ని ఒక ఫర్ఖ్ (మూడు 'సా'ల) ధాన్యంపై మాట్లాడుకున్నాను. అతను పని చేశాడు. కాని అతను నాతో గొడవపడి, కోపంతో కూలి తీసుకోకుండానే వెళ్ళిపోయాడు. నేను ఆ ధాన్యంతో సేద్యం చేశాను. అందులో ఎంత సమృద్ధి జరిగిందంటే; దాంతోనే నేను ఆవులు, ఎద్దులు కొనుగోలు చేశాను. అయితే చాలాకాలం తర్వాత ఆ వ్యక్తి వచ్చి, తన కూలి అడిగాడు, దానికి నేను, 'ఇదిగో, ఇక్కడ ఉన్న ఆవులు, ఎద్దులు అన్నీ నీవే. వీటిని తోలుకుపో' అన్నాను. 'నాకు ముట్టవలసినది ఒక్కగానొక్క ఫర్ఖ్ ధాన్యమే కదా!' అని అతను**

---

124–1. "మీరు గనక కృతజ్ఞులైతే, నేను మిమ్మల్ని ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాను. ఒకవేళ చేసిన మేలు మరచినట్లయితే నా శిక్ష చాలా కఠినంగా ఉంటుంది" అన్న ఖుర్ఆన్ వచనానికి వ్యాఖ్యానంగా ఈ హదీసు సరిగ్గా సరిపోతుంది. హదీసు చివర్లో అంధుడైన వ్యక్తి 'నీవు ఎన్ని మేకల్ని తోలుకుపోయినా నేను నిన్ను ఆపను' అని చెప్పటం గమనార్హం. కృతజ్ఞతా భావం అంటే ఇదే.

మానవుడు తనకు చేసిన మేలును తొందరగా మరచిపోతాడు. ఇది అతని నైజంలోనే ఉంది. సాధారణంగా చెడి బ్రతికిన వారిలో ఇది మరీ ఎక్కువ. ఇలాంటి వారు దైవానికి భయపడుతూ ఉండాలి.

అన్నాడు. 'ఫరవాలేదు, ఈ పశువులన్నింటినీ తోలుకుపో. ఆ ఒక్క ఫర్ఖ్ ధాన్యంతోనే ఈ వృద్ధి జరిగింద'ని నేనన్నాను. ఆ వ్యక్తి సంతోషంతో ఆ పశువులను తోలుకుని వెళ్ళాడు. 'దేవా! కేవలం నీ ప్రసన్నత కొరకే, నీ భీతితోనే నేనిలా నిజాయితీగా వ్యవహరించానన్న విషయం నీకు తెలిస్తే గుహ ముఖం తెరువు' అని ఆ వ్యక్తి వేడుకున్నాడు. అప్పుడు ఆ గుహ ముఖ ద్వారంపై పడి ఉన్న రాయి కొద్దిగా జరిగింది.

తరువాత రెండవ వ్యక్తి ఇలా ప్రార్థించాడు :

'దేవా! నా తల్లిదండ్రులు వృద్ధాప్యానికి చేరుకున్నప్పటి నుండీ నేను ప్రతి రోజూ రాత్రి వారికి మేక పాలు త్రాపిస్తూ ఉండేవాణ్ణి అన్న సంగతి నీకు బాగా తెలుసు. కాని ఒక రోజు నేను ఇంటికి వచ్చేసరికి ఆలస్యమైంది. అప్పటికే వారిద్దరూ నిద్రలోకి జారుకున్నారు. మరోవైపు నా ఆలుబిడ్డలు ఆకలితో అలమటిస్తున్నారు. కాని నా తల్లిదండ్రులు పాలు సేవించేవరకూ భార్యాబిడ్డలకు పాలు సమకూర్చేవాణ్ణి కాను. గాఢ నిద్రలో ఉన్న తల్లిదండ్రులను మేల్కొల్పటం సముచితం కాదను కున్నాను. అలా అని అక్కడి నుండి వెళ్ళడానికి కూడా నాకు మనసొప్పలేదు (ఎందు కంటే పాలు మాత్రమే వారి రాత్రి భోజనం. అది కూడా త్రాగకపోతే వారు నీరసించి పోవచ్చు). అందువల్ల తెల్లవారే వరకూ అక్కడే నిలబడి పోయాను. నీ భయం వల్లనే నేను ఇలా చేశానన్న విషయం నీకు గనక తెలిసివుంటే, మమ్మల్ని ఈ గండం నుండి గట్టెక్కించు'. అప్పుడు ఆ గుహ ముఖంపై పడివున్న ఆ రాయి మరి కాస్తంత జరిగింది. దాంతో వారికి ఆకాశం కానవచ్చింది.

తరువాత మూడవ వ్యక్తి ఇలా వేడుకున్నాడు: 'దేవా! నా పినతండ్రి కుమార్తె ఒకామె ఉండేది. నేనామెను ఎంతగానో ఇష్టపడ్డాను. ఒకసారి ఆమెతో రమించాలని కోరుకున్నాను. కాని ఆమె నిరాకరించింది. అయితే ఆమెకు డబ్బు అవసరం ఏర్పడింది. వంద దీనార్లు ఇచ్చేటట్లయితే నా కోర్కె తీరుస్తానని అంది. నేను ఎంతో ప్రయాసతో ఆ డబ్బును సమకూర్చి ఆమెకు అందజేశాను. ఆమె తన్నుతాను నాకు అర్పించుకోవడానికి సిద్ధపడింది. తీరా నేను ఆమె రెండు తొడల మధ్య కూర్చుని సమాగమం జరుపబోగా, 'అల్లాహ్‌కు భయపడు. అధర్మంగా నా కన్యాత్వ పొరను చించకు' అని ప్రాధేయపడింది. అంతే, (ఆ మాట వినగానే) నేను నిలబడిపోయాను. ఆమెకు ఇచ్చిన వంద దీనార్లను కూడా తిరిగి తీసుకోలేదు. దేవా! నీ భీతి వల్లనే

**నేను ఇలా చేశానన్న విషయం నీ జ్ఞాన పరిధిలో ఉంటే మా కష్టాన్ని సులభతరం చెయ్యి'. అంతే, అల్లాహ్ వారి కష్టాన్ని తొలగించాడు. వారు ముగ్గురూ ఆ గుహ నుండి బయటపడ్డారు.**[1]

## అధ్యాయం : 48

**126)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా, హజ్రత్ అబూ హురైరా (రజి) విని తెలియజేశారు: **"ఒక స్త్రీ తన పసిపిల్లవానికి పాలు త్రాపుతూ ఉండగా, ఒక రౌతు అటు వైపు నుండి సాగిపోయాడు. అతన్ని చూసినప్పుడు ఆ స్త్రీ తన పిల్లవానికి పాలు త్రాపుతూ, 'దేవా! నా పిల్లవాణ్ణి ఈ రౌతులాగా చేయనంత వరకూ ఇతనికి చావునివ్వకు' అని వేడుకుంది. అప్పుడు ఆ పసిపిల్లవాడు (దైవాజ్ఞతో**

---

125–1. ఈ హదీసుకు వ్యాఖ్యానంగా హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) ఇలా అంటున్నారు :

"ఈ హదీసు ద్వారా 'చిత్తశుద్ధి'కి గల మహత్తు ఎటువంటిదో స్పష్టమవుతోంది. తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగటం, వారి సంతోషం కొరకు శాయశక్తులా కష్టాన్ని భరించటం సంతానం కర్తవ్యం. తన పిల్లలు ఏడుస్తూ ఉన్నప్పటికీ ఆ వ్యక్తి లెక్కచేయ కుండా తల్లిదండ్రుల వద్దనే నిలబడి ఉండటానికి కారణం తెలియజేయబడింది. ఖర్చు పెట్టే విషయంలో తల్లిదండ్రులకు ఇతరులపై ప్రాధాన్యత ఇవ్వాలన్న షరీఅత్ ఆజ్ఞకు అతను కట్టుబడ్డాడు.

ఈ హదీసులో సౌశీల్యానికి, పవిత్రతకు గల ప్రాధాన్యత కూడా తేటతెల్లమయింది. పశ్చాత్తాపడటం వల్ల పూర్వపు అపరాధాలు క్షమించబడతాయన్న విషయం కూడా దీనిద్వారా స్పష్టమయింది. ఆహార ధాన్యాలకు బదులుగా కూలివాణ్ణి పెట్టుకోవటం సమ్మతమేనన్నది మరో అంశం. అమానతులను వాటికి యోగ్యులైన వారికి అప్పగించా లన్న ముఖ్యాంశం కూడా ఇందులో ఇమిడి ఉంది. సజ్జనులైన దాసుల ప్రార్థనా ఫలంగా అల్లాహ్ కష్టాల నుండి గట్టెక్కిస్తాడని ఈ హదీసు ద్వారా రుజువయింది.

హదీసులోని ముగ్గురు వ్యక్తులలో మూడవ వ్యక్తి మరింత మహత్తు కలవాడని ఖుస్తులానీ (రహ్మ) అంటారు. ఇమామ్ గజాలీ (రహ్మ) ఏమంటారంటే; లైంగికవాంఛ మనిషిపై తీవ్రంగా ప్రాబల్యం వహిస్తుంది. ఒక వ్యక్తి వద్ద సాధన సంపత్తి, అవకాశాలన్నీ ఉండి కూడా కేవలం దైవభీతి మూలంగా చెడు పని నుండి ఆగిపోయాడంటే, కచ్చితంగా అది సౌశీల్యానికి దర్పణం. అలాంటి వ్యక్తి స్వర్గవాసి అని దివ్య ఖుర్ఆన్ ద్వారా తెలు స్తోంది– 'తన ప్రభువు ముందు నిలబడవలసి ఉంటుందని భయపడి, తన మనస్సును దుష్టవాంఛలకు దూరంగా ఉంచిన వ్యక్తి యొక్క నివాసం స్వర్గమవుతుంది' (అన్ నాజిఅత్– 40)

**మాట్లాడుతూ) 'దేవా! నన్ను మాత్రం అతనిలాగా చెయ్యకు' అని చెప్పి మళ్ళీ పాలు త్రాగటంలో నిమగ్నుడైపోయాడు, ఆ తరువాత (తెలియని) ఒక స్త్రీ అటువైపు నుంచి తీసుకుపోబడింది. జనులు ఆమెను ఈడ్చుకుంటూ, పరిహసిస్తూ పోతున్నారు. అది చూసి, 'దేవా! నా పిల్లవాణ్ణి ఈ దౌర్భాగ్యురాలిగా చేయకు' అని ప్రార్థించింది ఆ తల్లి. కాని ఆ పిల్లవాడు, 'దేవా! నన్ను ఆ స్త్రీ మాదిరిగానే చెయ్యి' అన్నాడు. నువ్విలా ఎందుకు ప్రవర్తిస్తున్నావు? అని తల్లి అడిగితే, '(అమ్మా) ఆ రౌతు ఒక అవిశ్వాసి, దౌర్జన్యపరుడు. ఇక ఈ స్త్రీ అంటావా, ఈమె వ్యభిచారం చేయిస్తోందని జనులంటు న్నారు. దానికి జవాబుగా ఆమె హస్బియల్లాహు (నాకు అల్లాహ్ చాలు, నా సౌశీల్యం గురించి ఆయనకు బాగా తెలుసు) అని అంటోంది. జనులు ఆమెను దొంగతనం చేస్తోందని నిందిస్తున్నారు. దానికి జవాబుగా ఆమె హస్బియల్లాహు (నాకు అల్లాహ్ చాలు, నా గుణశీలం గురించి ఆయనకు బాగా తెలుసు) అని అంటోంది'[1] అని అన్నాడు.**

**127) ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "ఒక కుక్క ఓ బావిచుట్టూ తిరుగాడుతూ ఉంది. తీవ్రమైన దాహంతో దాని ప్రాణం పోయేలా ఉంది. బనీ ఇస్రాయీల్‌కు చెందిన ఒక వ్యభిచారిణి ఆ కుక్క పరిస్థితిని చూసి, తన కాలి మేజోడును తీసి దాంతో కుక్కకు నీరు త్రాపింది. ఆమె చేసిన ఆ పని ఆమె క్షమాభిక్షకు కారణమయింది."[1]**

---

126-1. పాలు త్రాగే పసికందు మాట్లాడటం ఒక అద్భుతం. దేవుని శక్తిసూచనలలో ఇదొకటి. దౌర్జన్యపరుడైన ఆ రౌతుతో ఆ పసివాడు తెగత్రెంపులను ప్రకటించాడు. కాని విశ్వసించిన ఒక బాధిత స్త్రీపై తన సానుభూతిని వెలిబుచ్చాడు. ఇందులో ఎన్నో గుణపాఠాలు అంతర్లీనమై ఉన్నాయి. దైవభీతిపరులకు, ధార్మికులకు ఇందులో మార్గదర్శకత్వం ఉంది. వారు ఎన్నడూ పదార్థ పూజారుల భోగభాగ్యాలను చూసి ప్రభావితులు కారాదు. పైగా అది వారికి దేవుడిచ్చిన గడువు అని తలపోయాలి. ఒకరోజు మరణం రానున్నది. అప్పుడు ఆట ముగుస్తుంది. ఇస్లాం ధర్మమే అతి పెద్ద సౌభాగ్యం. అది ఎన్నటికీ అరిగిపోనిది, తరిగిపోనిది.

127-1. భూతదయకు పుణ్యం ప్రాప్తిస్తుందని, నోరులేని ఒక జంతువు దాహం తీర్చటం మనిషి మన్నింపునకు సాధనంగా పరిణమిస్తుందని ఈ హదీసు ద్వారా రూఢీ అయింది. ఆమె ఒక దుర్నడత గల స్త్రీ. అయినా ఆ సత్కార్యాన్ని ఆమె చిత్తశుద్ధితో చేసింది. అందులో ప్రదర్శనాబుద్ధి లేశమయినా లేదు. అల్లాహ్ ఆమె సత్కార్యాన్ని ఆమోదించాడు. జీవితాంతం ఆమె చేసిన చెడును ఆమె నుండి దూరం చేశాడు.

**128)** ముఆవియా బిన్ అబూ సుఫ్యాన్ (రజి) చెప్పగా తాను విన్నానని హుమైద్ బిన్ అబ్దుర్రహ్మాన్ తెలిపారు : ఆయన తన పరిపాలనా కాలంలో ఒకసారి హజ్జ్‌కు వెళ్ళిన సందర్భంగా, దైవప్రవక్త(స) మింబర్ (వేదిక)పై నిలబడి, తన సేవకుని చేతిలో ఉన్న సవరాల గుచ్చాన్ని తీసుకుని ఇలా అన్నారు : "మదీనా వాసులారా! మీ విద్వాంసులు ఎక్కడ? నేను దైవప్రవక్త(స) చెప్పగా విన్నాను (ఆయన ఈ విధంగా సవరాలను సమీకరించడాన్ని వారించారు). ఆయన(సఅసం) ఇలా అన్నారు : బనీ ఇస్రాయీల్ స్త్రీలు (షరీఅత్‌కు విరుద్ధంగా) తమ శిరోజాలను ఇలా– కుచ్చుగా– కూర్చటం మొదలెట్టినప్పుడు వారిని వినాశం చుట్టుముట్టింది."[1]

**129)** హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : "పూర్వపు సముదాయాలలో విషయ పరిజ్ఞానం (ముహద్దస్) కలవారు ఉండేవారు. ఒకవేళ నా ఉమ్మత్‌లో అలాంటి వారెవరైనా కాగలరంటే, ఆయన ఉమర్ బిన్ ఖత్తాబే." (అల్లాహ్ తరఫున ఆయనకు ప్రియతముడైన వాని హృదయంలో ఒక విషయం వేయబడుతుంది. హజ్రత్ ఉమర్–రజి–కి ఈ స్థాయి పూర్తిగా ప్రాప్తమయింది. ఎన్నో విషయాలలో ఆయన అభిప్రాయానికి అనుగుణంగా 'వహీ' అవతరించింది. అందుకే ఆయన్ని 'ముహద్దస్' అని అనటం జరిగింది).

**130)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం : మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచనం: "బనీ ఇస్రాయీల్‌లో ఒక వ్యక్తి ఉండేవాడు. అతడు తొంభై తొమ్మిది మందిని అకారణంగా హత్య చేశాడు. (తరువాత పశ్చాత్తాపపడి) దీని గురించి ముక్తి మార్గం ఏదయినా ఉందా? అని అడగటానికి బయల్దేరాడు. ఒక సన్యాసి వద్దకు వచ్చి, నేను చేసిన ఈ మహా పాపం క్షమార్హమవు తుందా? అని అడిగాడు. 'అసంభవం' అని ఆ సన్యాసి చెప్పాడు. ఇది విని అతను

---

128–1. 'మీ విద్వాంసులు ఎక్కడ?' అంటే; ఈ చెడుగును అడ్డుకునే విద్వాంసులు అంతరించి పోయారా? అని అర్థం. దీనినిబట్టి అవగతమయ్యేదేమంటే, సమాజంలో ప్రబలిన చెడులనుండి ఆపటం పండితుల విధ్యుక్త ధర్మం. ఇతరుల శిరోజాలను– సవరాలుగా మలచి– తమ జడలలో వేసుకోవటం అవాంఛనీయం. ఇలాంటి పని చేసేవారు వేరొక హదీసులో శపించబడ్డారు. బనీ ఇస్రాయీల్‌లో కూడా ఈ పని వారించబడింది. కాని వారి స్త్రీలు షరీఅత్‌కు విరుద్ధమైన ఈ చేష్టకు ఒడిగట్టడంతో వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది.

**ఆ సన్యాసిని కూడా హతమార్చాడు (ఆ విధంగా నూరు హత్యలు చేశాడు). ఆ తరువాత మరికొంతమందిని కూడా విచారించాడు. చివరకు అతనికి ఓ సాత్వికుడు కనిపించాడు. 'నీవు ఫలానా గ్రామానికి వెళ్ళు' అని ఆ సాత్వికుడు సూచించాడు. అతను ఆ గ్రామం వైపునకు నడచిపోసాగాడు (సగం దూరమైనా పోకముందే) దారిలోనే మృత్యువాతనపడ్డాడు. ప్రాణం విడుస్తున్నప్పుడు అతను ఆ గ్రామం వైపునకు తన ఛాతీని వంచాడు. చివరకు (అతన్ని ఎవరు తీసుకోవాలి? అనే విషయమై) కారుణ్య దూతలకు– శిక్షించే దూతలకు మధ్య వివాదం తలెత్తింది. అయితే అల్లాహ్ 'నస్రా' అనే గ్రామాన్ని ఆదేశించాడు, అతని శవానికి దగ్గరవ్వమని. (అతను బయలు దేరిన) మరో గ్రామాన్ని ఉద్దేశించి, అతని శవానికి దూరంగా జరగమని ఆదేశించాడు. తరువాత ఆ రెండు గ్రామాల మధ్యన ఉన్న దూరాన్ని కొలవమని దైవదూతలను ఆజ్ఞాపించాడు. (దూరాన్ని కొలవగా) అతను పశ్చాత్తాపడటానికి వెళుతున్న గ్రామం ఒక జానెడు దగ్గరగా ఉంది. అందువల్ల అతను క్షమాభిక్షకు నోచుకున్నాడు.[1]**

**131)** హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఫజ్ర్ నమాజ్ చేయించిన మీదట, ప్రజల వైపునకు తిరిగి ఇలా అన్నారు: **"(బనీ ఇస్రాయీల్‌కి చెందిన) ఒక వ్యక్తి తన ఆవును తోలుకుని వెళుతూ దానిపై కూర్చొని స్వారీ అయ్యాడు. పైగా దానిని కొట్టాడు. అప్పుడు ఆ ఆవు (దేవుడిచ్చిన శక్తితో) 'పశువులమైన మేము పుట్టించబడినది మనుషుల్ని మోసుకెళ్ళటానికి కాదు కదా! (సేద్యపు పనుల కొరకు పుట్టించబడ్డాము)' అని చెప్పింది. 'సుబ్‌హానల్లాహ్! ఆవు కూడా మాట్లాడగలదా!' అని జనులు సందేహపడగా, "నేను ఈ మాటను విశ్వసిస్తున్నాను. అబూబక్ర్, ఉమర్ కూడా విశ్వసిస్తున్నారు"** అని దైవప్రవక్త(స)

---

130–1. పశ్చాత్తాపభావంతో ఆ వ్యక్తి వెళుతున్న ఊరి పేరు 'నస్రా'. అక్కడ ఒక గొప్ప సాత్వికుడు ఉండేవాడు. కాని ఆ హంతకుడు ఆ ఊరికి వెళ్ళకముందే– దారిలోనే– మరణించాడు. ఆ వ్యక్తి పశ్చాత్తాపపడిన తరువాత, అల్లాహ్ వైపునకు మరలే ఉద్దేశ్యంతో బయలుదేరాడని కారుణ్యదూతలు వాదించారు. అయితే అతను ఏ ఒక్క పుణ్యకార్యం కూడా చేయలేదని శిక్షించే దూతలు వాదించారు. పెద్దపెద్ద అపరాధాలు చేసి క్షమాభిక్ష కోరటం ఎటువంటిదో అన్యాయంగా రక్తపాతం సృష్టించిన మీదట మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడటం కూడా అటువంటిదేనని పండితులు అభిప్రాయపడ్డారు. అయితే అతను విశ్వాసి (మోమిన్) అయి ఉండాలి.

చెప్పారు– మరి చూడబోతే వారిద్దరూ అక్కడ లేరు– “అలాగే ఒక వ్యక్తి గొర్రెల్ని మేపుతుండగా ఒక తోడేలు వచ్చి ఆ గొర్రెల మందలోనుంచి ఒక గొర్రెను లాక్కుని పోసాగింది. గొర్రెల కాపరి పరుగెత్తుకుని వెళ్ళి, గొర్రెను ఆ తోడేలు నుంచి విడిపించుకున్నాడు. అప్పుడు ఆ తోడేలు (దేవుడిచ్చిన శక్తితో) ఇలా పలికింది : ‘ఈ రోజు నీవు నా నుండి దీనిని రక్షించుకోగలిగావు. కాని క్రూరమృగాలు చెలరేగి పోయే దినాన (ప్రళయానికి సమీపంలో) దీనిని రక్షించగలవాడెవడు? ఆ రోజు నేను తప్ప దీని కాపరిగా మరొకరు ఉండరు’ – ఇది విన్న జనులు ‘సుబ్‌హానల్లాహ్! తోడేలు కూడా మాట్లాడగలదా?’ అని విన్నవించుకోగా, “నేనైతే దీనిని విశ్వసించాను. అబూబక్ర్, ఉమర్‌లు కూడా విశ్వసించారు” అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు. వాస్తవానికి వారిద్దరు ఆ సమయంలో అక్కడ లేరు.[1] .........అబూహురైరా (రజి) ద్వారా అబూ సలమా ఉటంకించిన హదీసులో కూడా దైవప్రవక్త(స) ఈ విధంగానే పలికినట్లు ఉంది.

**132)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించినట్లుగా హ్రజత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : “ఒక వ్యక్తి మరో వ్యక్తి నుండి ఒక ఇల్లును కొన్నాడు. ఇల్లు కొనుగోలు చేసిన వ్యక్తికి ఆ ఇంట్లో ఒక బిందె లభ్యమయింది. అందులో బంగారం ఉంది. ఇల్లు అమ్మిన వ్యక్తితో అతను, ‘సోదరా! ఈ బిందె తీసుకెళ్ళు. ఎందుకంటే నేను నీ నుండి ఇల్లు కొన్నానే గాని బంగారం కొనలేదు’ అన్నాడు. అయితే ఇల్లు అమ్మిన వ్యక్తి, ‘నేను ఆ ఇంటిని, అందలి కలపతో, సామగ్రితో సహా అమ్మాను’ అని చెప్పాడు. (సమస్య పరిష్కారం కాలేదు) ఆ ఇద్దరూ కలసి మూడో వ్యక్తి దగ్గరకు వెళ్ళారు. తీర్పు చెప్పే వ్యక్తి, ఆ ఇద్దరినీ ఉద్దేశించి, ‘మీకు పిల్లలున్నారా?’ అని అడిగాడు. దానికి సమాధానంగా, ‘నాకొక అబ్బాయి ఉన్నాడ’ని ఒకడంటే, ‘నాకొక అమ్మాయి ఉంద’ని రెండవవాడు చెప్పాడు. అప్పుడు తీర్పరి ఇలా అన్నాడు: ‘ఆ అబ్బాయి పెళ్ళి ఆ అమ్మాయితో జరిపించండి. ఆ బంగారాన్ని దంపతులిద్దరిపై ఖర్చుపెట్టండి. కొంత బంగారం దానం కూడా చేయండి’[1] అన్నాడు.”

---

131–1. దైవప్రవక్త(స)కు తన ప్రియ సహచరులైన అబూబక్ర్, ఉమర్(రజి)ల దృఢ విశ్వాసంపై గల గురి అటువంటిది మరి! అందుకే ఆయన(స) ఆ విధంగా చెప్పగలిగారు. హదీసులో ఆవు, తోడేలు మాట్లాడినట్లుగా ఉంది. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయించగల శక్తి కలిగి ఉన్నాడు. సర్వసాధారణంగా పశువుల చేత ఏ పనులు చేయిస్తారో ఆ పనులనే చేయించాలి. అలవాటు లేని పనులు చేయించకూడదు (ఫత్‌హుల్ బారీ)

**133)** ఆమిర్ బిన్ సాద్ బిన్ అబీ వక్ఖాస్ తెలిపారు– తన తండ్రి (సాద్ బిన్ అబీ వక్ఖాస్–రజి) ఉసామా బిన్ జైద్(రజి)ను అడుగుతుండగా నేను విన్నాను. ఆయన ఇలా అడిగారు : "ప్లేగు వ్యాధి గురించి మీరు దైవప్రవక్త(సఅసం) ద్వారా ఏం విన్నారు?" దానికి సమాధానంగా ఆయన(రజి), దైవప్రవక్త(స) ఈవిధంగా ఉపదేశించగా నేను విన్నానని అన్నారు– "ప్లేగు వ్యాధి ఒక మహమ్మారి (విపత్తు, శిక్ష). అది పూర్వం బనీ ఇస్రాయీల్‌లోని ఒక వర్గంపై పంపబడింది." లేదా ఆయన(స) ఇలా అన్నారు– "పూర్వం గతించిన ఒక సముదాయంపై అవతరించింది. కాబట్టి ఏ ప్రదేశంలోనయినా, అక్కడ ప్లేగు వ్యాధి ప్రబలి ఉందని మీరు వింటే, అక్కడికి వెళ్ళకండి. కాని మీరు మొదటి నుండే ఉంటున్న ప్రాంతంలో ఆ వ్యాధి ప్రబలినట్లయితే, అక్కడి నుండి బయలుదేరకండి". అబూ నజ్ర్ ఇలా అన్నారు: "పారిపోవటం తప్ప మరో ఉద్దేశం లేనట్లయితే, అక్కడి నుండి బయలు దేరకండి."[1]

**134)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : నేను ప్రవక్త మహనీయుల(సఅసమ్) వారిని ప్లేగు మహమ్మారి గురించి అడిగితే, ఆయన(స) ఇలా వివరించారు: "అదొక విపత్తు. దానిని అల్లాహ్ విశ్వాసుల పాలిట కారుణ్యంగా

---

132–1. ఖుస్తులానీ (రహ్మ) ఇలా అంటారు :"ఒకవేళ ఎవరయినా తన భూభాగాన్ని అమ్మితే ఆ భూభాగంలో ఏదయినా నిధి బయటపడితే ఆ నిధి భూమి అమ్మిన వానికే చెందుతుంది. ఇంటి ఆవరణలో ఏదైనా వస్తు సామగ్రి ఉంటే అది అమ్మిన వానికే చెందుతుంది. షాఫియీల పంథా ఇదే. అయితే ఒకవేళ కొనుగోలు దారుడు ముందుగానే– ఆ సంపద తనదని– షరతు విధిస్తే అది వేరే విషయం.

133–1. దీనినిబట్టి అవగతమయ్యేదేమిటంటే వర్తకం, జిహాద్, మరితర అతి ముఖ్యమయిన పనుల నిమిత్తం ప్లేగు వ్యాధి ప్రబలిన చోటినుండి బయలుదేరి వెళ్ళటం ధర్మసమ్మతమే. హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) గారు, ప్లేగు వ్యాధి ప్రబలిన సమయంలో తన కుమారులను గ్రామీణ ప్రాంతాలకు పంపించేవారు. హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్(రజి) ఇలా అన్నారు : "ప్లేగు వ్యాధి వచ్చినప్పుడు పర్వత శిఖరాలపై విస్తరిల్లండి"– బహుశా ఈ సహాబాకు ఆ హదీసు చేరలేదేమో!

హజ్రత్ ఉమర్(రజి) ఒకసారి సిరియాకు వెళుతుండగా, అక్కడ ప్లేగు మహమ్మారి వ్యాపించిందని ఆయనకు సమాచారం అందింది. దాంతో ఆయన తిరిగి వచ్చేశారు. 'మీరు దేవుడు రాసిపెట్టిన దాని నుండి పలాయనం చిత్తగిస్తున్నారా?' అని ప్రజలు అడగ్గా, 'మేము దేవుడు రాసిపెట్టిన దాని నుండి దేవుని విధి వ్రాత వైపునకే మరలుతున్నాము' అని ఉమర్(రజి) చెప్పారు. ప్లేగు వ్యాధి వల్ల మరణం సంభవిస్తే అది 'అమరగతి' (షహాదత్) అవుతుంది.

చేశాడు. ఒకవేళ ఏ వ్యక్తి అయినా నివసించే పట్టణంలో ప్లేగు వ్యాధి ప్రబలితే, అతను ఓర్పుతో, దైవ కారుణ్యాన్ని ఆశిస్తూ అక్కడే ఉండిపోతే, అల్లాహ్ నాకు రాసి పెట్టినదే అవుతుందన్న నమ్మకంతో ఉంటే, అతనికి అమరగతినొందిన పుణ్యం లభిస్తుంది."

**135)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : (మక్కా విజయం సందర్భంగా) మఖ్జూమ్ తెగకు చెందిన ఒక మహిళ[1] (ఫాతిమా బిన్తె అస్వద్) దొంగతనం చేసింది. ఈ వ్యవహారం ఖురైషులను చింతాగ్రస్తుల్ని చేసింది. ఖురైషు ప్రముఖులు పరస్పరం సమాలోచన చేసుకున్నారు.[2] ఈ వ్యవహారంపై దైవప్రవక్త(సఅసం)తో చర్చించేదెవరు? అని ఆలోచించి, చివరకు ఉసామా బిన్ జైద్ (రజి) దీనికి తగిన వ్యక్తి అని కూడబలుక్కున్నారు. ఉసామా బిన్ జైద్(రజి) ఈ విషయమై సిఫారసు చేయగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "ఉసామా! ఏమిటి, నీవు దేవుడు విధించిన శిక్షలలో ఒకానొక శిక్ష గురించి నాకు సిఫారసు చేస్తున్నావా?" అని కోపగించు కున్నారు. ఆ తరువాత ఆయన(స) నిలబడి ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆయన(స) ఇలా అన్నారు : "పూర్వం గతించిన ఎన్నో సముదాయాలు నాశనమవ డానికి కారణం (ఏమిటో తెలుసా?) వారు తమలోని ఒక మర్యాదస్తుడు దొంగతనం చేస్తే అతన్ని వదలిపెట్టేసేవారు. ఎవరయినా ఒక బలహీనుడు ఆ పనిచేస్తే మాత్రం అతనిపై శిక్షను అమలుపరిచేవారు. దైవసాక్షిగా చెబుతున్నాను. ఒకవేళ ముహమ్మద్(స) కూతురు ఫాతిమా దొంగతనం చేసి ఉన్నాసరే, నేను ఆమె చెయ్యి నరకడానికి వెనుకాడేవాణ్ణి కాను."[3]

**136)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం : నేను ఒక సహాబీ (అమ్ర్ బిన్ ఆస్)ని దివ్య ఖుర్ఆన్‌లోని ఒక ఆయత్ చదువుతూ ఉండగా విన్నాను. అదే ఆయత్‌ను దైవప్రవక్త(స) తద్భిన్నమైన శైలిలో పారాయణం చేయటం విని

---

135–1. మఖ్జూమ్ తెగ ఖురైషులలో కులీన తెగగా భావించబడేది.

135–2. అంటే ఆమెకు ఎలాగయినా సరే శిక్ష పడకుండా చూడాలని వారు అనుకున్నారు.

135–3. దొంగతనం చేసినవాని చెయ్యి నరకాలన్న ఆదేశం మూసా(అ) షరీఅత్‌లో కూడా ఉండేది. ఈ శిక్షను క్రూర శిక్షగా భావించేవాడే క్రూరుడు. ఎవరయినా ఒక వ్యక్తి ముస్లిం అయివుండి ఈ శిక్షను అనాగరిక శిక్షగా పేర్కొంటే అతను ఇస్లామ్ పరిధిలో ఉండడు. హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) దైవప్రవక్త(స)కు ఎంతో ప్రియతముడు. ఎందుకంటే

ఉన్నాను. అందువల్ల నేను ఆయన్ని వెంటబెట్టుకుని దైవప్రవక్త(స) సమక్షంలో హాజరై జరిగినదంతా చెప్పాను. ఇది విని ఆయన(స) ముఖారవిందంలో అసహనం తొంగిచూసినట్టు గమనించాను. ఆయన(స) ఇలా అన్నారు : "మీరిద్దరూ సరిగ్గానే పఠిస్తున్నారు. పరస్పరం విభేదించుకోకండి. మీ పూర్వీకులు ఇలాంటి జగడాల మూలంగానే నాశనమయ్యారు."[1]

**137)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు : నేను ఇప్పుడు ప్రవక్త మహనీయుల (సఅసమ్)ను చూస్తున్నట్టే ఉంది. ఆయన(స) బనీ ఇస్రాయీల్‌కు సంబంధించిన ఒక ప్రవక్త సంఘటనను వివరిస్తూ ఉన్నారు- ఆయన జాతి ప్రజలు ఆయన్ని కొట్టి రక్తసిక్తం చేసేశారు. కాని ఆ ప్రవక్త రక్తం తుడుచుకుంటూ, 'దేవా! నా జాతి వారిని క్షమించు. వీరికి తెలియదు' అని ప్రార్థించసాగారు.

**138)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖించారు- మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించారు : "గత సమాజాలలోని ఒక వ్యక్తికి అల్లాహ్ పుష్కలంగా సిరిసంపదల్ని ప్రసాదించాడు. మరి అతనికి మరణసమయం ఆసన్నమైనప్పుడు, ఆ వ్యక్తి తన కొడుకులతో, 'నేను మీ యెడల ఎలాంటి తండ్రిగా ఉన్నాను?' అనడిగాడు. దానికి వారు, 'మీరు మా పాలిట అత్యుత్తమ తండ్రిగా వ్యవహరించారు' అని చెప్పారు. 'కాని నేనైతే నా జీవితంలో ఏ మంచి పనీ చేయలేదు. అందువల్ల నేను చనిపోయాక నన్ను కాల్చేయండి. ఆపైన నా ఎముకల్ని బాగా దంచివేయండి. వేగంగా గాలి వీచే రోజున నా చితాభస్మాన్ని ఎగురవేయండి' అని మరణ శాసనం చేశాడు. తండ్రి చెప్పినట్లే చేశారు ఆ కొడుకులు. అయితే అల్లాహ్ ఆ బూడిదను, ఎముకలను సమీకరించి, 'నువ్వెందుకిలా చేశావ్?' అని అడిగాడు. దానికి అతను, 'నీ భయం వల్లనే ఇలా చెయ్యాల్సి వచ్చింద'ని చెప్పాడు. అందువల్ల అల్లాహ్ అతనికి తన కారుణ్య ఛాయలో చోటిచ్చాడు."

**139)** అబూ మస్ఊద్ అన్సారీ మహనీయ హుజైఫా (రజి)తో, తమరు

---

ఈయన జైద్ బిన్ హారిసా (రజి) పుత్రుడు. జైద్ బిన్ హారిసా(రజి) ఒకప్పుడు మహాప్రవక్త(స) పెంపకంలో ఉండేవారు. చాలామంది జైద్‌ను ముహమ్మద్(స) కుమారునిగా తలపోసేవారు. అలా పిలిచేవారు కూడా. కాని అల్ అహ్‌జాబ్ సూరాలోని 5వ ఆయత్ అవతరించిన మీదట అలా పిలవటం మానుకున్నారు.

136-1. అంటే ఖుర్ఆన్ పారాయణంలో వైవిధ్యం ఉంది. ఎవరికి ఏ శైలి నచ్చితే దానిని అవలంబించవచ్చు. దీనిపై రాద్ధాంతం చేయకూడదు.

ప్రవక్త మహనీయుల(సఅసమ్) ద్వారా విన్న హదీసులను మాకెందుకు వివరించి చెప్పరు? అని అభ్యర్థించగా, హుజైఫా (రజి) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా చెప్పగా నేను విన్నాను– "ఒక వ్యక్తికి మరణఘడియలు సమీపించాయి. అతను తన జీవితం పట్ల ఆశ వదులుకున్నాడు. అప్పుడు అతను తన ఇంటివారలకు మరణ శాసనం చేస్తూ ఇలా అన్నాడు : 'నేను చనిపోయినప్పుడు మొదట నా కోసం ఎన్నో కట్టెలను ప్రోగు చేయండి. వాటికి నిప్పు పెట్టండి. ఆ అగ్ని నా దేహాన్ని దగ్ధం చేసి, కేవలం నా ఎముకలు మాత్రమే మిగిలి ఉన్నప్పుడు, వాటిని కూడా బాగా దంచి బాగా ఎండతాపం ఉన్న దినాన (లేదా ఇలా అన్నాడు) వేగంగా గాలి వీచే రోజున నన్ను గాల్లో ఎగురవేయాలి.' [1] కాని అల్లాహ్ అతనిని (చితాభస్మాన్ని) సమీకరించి, 'ఎందుకిలా చేశావ్?' అని అడిగాడు. 'నీ భయం వల్లనే ఇలా చేశాను' అని ఆ వ్యక్తి చెప్పాడు. చివరకు అల్లాహ్ అతన్ని క్షమించాడు"– ఈ హదీసును నేను కూడా దైవప్రవక్త(స) ద్వారా విన్నానని ఉఖ్బా చెప్పారు.

**140)** అబ్దుల్ మలిక్ ఇలా అంటారు : ఈ ఉల్లేఖనంలో "యౌమిన్ రాహిన్" అనే పదం వచ్చింది. దీనికి సందేహానికి ఆస్కారం లేదు అని అర్థం.

**141)** హజ్రత్ అబూ హురైరా(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఒక వ్యక్తి జనులకు అప్పు ఇస్తూ ఉండేవాడు. అతను తన గుమాస్తాలకు ఈ విధంగా సూచనలు జారీ చేశాడు: '(నా రుణగ్రస్తులలో) ఎవరయినా మీకు కష్టాల్లోఉన్నట్లు కనిపిస్తే అతని రుణాన్ని మాఫీ చేయండి. బహుశా ఈ సద్వ్యవహారం కారణంగా అల్లాహ్ మనల్ని క్షమించవచ్చు". ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు: "అతను అల్లాహ్‌ను కలుసుకున్నప్పుడు అల్లాహ్ అతన్ని క్షమించాడు."

**142)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "ఒక వ్యక్తి ఎన్నో పాపకార్యాలు చేశాడు. అతనికి మరణ కాలం దగ్గర పడినప్పుడు, తన కొడుకులతో, 'నేను మరణించాక

---

139–1. ఆ వ్యక్తి మృతదేహాలపైన ఉన్న వస్త్రాన్ని దొంగిలించే వాడని వేరొక ఉల్లేఖనంలోఉంది. అతను తన జీవిత కాలంలో ఏ ఒక్క సత్కార్యం కూడా చేసుకోలేదు. తీరా మరణ సమయం సమీపించినప్పుడు భయం పట్టుకుంది. దైవశిక్ష నుండి తనను కాపాడుకునే ఉద్దేశ్యంతో, తన చితాభస్మాన్ని గాల్లో ఎగురవేయమని ఇంటివారలకు తాకీదు చేశాడు. అతనిలోని ఆ 'దైవభీతి'యే చివరకు అతని పాలిట వరంగా పరిణమించింది.

**నన్ను కాల్చివేయండి. నా ఎముకలను కూడా దంచి గాల్లో ఎగురవేయండి. దైవసాక్షి! నా ప్రభువు గనక నన్ను పట్టుకున్నాడంటే, అంతకుముందు ఎవరికీ విధించనటు వంటి కఠినశిక్షను నాకు విధిస్తాడు" అని చెప్పాడు. మరి అతను చనిపోయినప్పుడు (అతని మరణ శాసనం ప్రకారం) అతని పట్ల అలాగే వ్యవహరించటం జరిగింది. అప్పుడు అల్లాహ్ భూమిని ఆజ్ఞాపిస్తూ, 'అతని శరీరంలోని ఒక్క అణువు అయినాసరే ఎక్కడయినా ఉంటే, దానిని కూడా సమీకరించి తీసుకురా' అని సెలవిచ్చాడు. భూమి దైవాజ్ఞను శిరసావహించింది. పిదప ఆ వ్యక్తి దైవ సమక్షంలో నిలబడినప్పుడు 'ఇలా ఎందుకు చేశావ్?' అని అల్లాహ్ ప్రశ్నించగా, 'ప్రభూ! నీ భయం వల్లనే అలా చేశాను' అని ఆ వ్యక్తి బదులిచ్చాడు. ఎట్టకేలకు అల్లాహ్ అతనికి క్షమాభిక్ష పెట్టాడు. అబూహురైరా(రజి) మినహా ఇతర సహాబా ఈ హదీసులోని 'ఖష్యతుక్' అనే పదానికి బదులు 'ముఖాఫతక' అనే పదాన్ని ఉపయోగించారు (రెండు పదాల అర్థం ఒక్కటే).**

**143) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "(ఇస్రాయీల్ సంతతికి చెందిన) ఒక స్త్రీని ఒక పిల్లి కారణంగా శిక్షించటం జరిగింది. ఆ పిల్లిని ఆమె బంధించి ఉంచింది. తత్కారణంగా అది చచ్చిపోయింది. దీనికి శిక్షగా ఆ స్త్రీ నరకానికి ఆహుతి అయింది. పిల్లిని బంధించి ఉంచినప్పుడు ఆమె దానికి తినడానికి గానీ, త్రాగటానికి గానీ ఏమీ పెట్టలేదు. పోనీ ఆ పిల్లి నేలలో సంచరించి పురుగూ పుట్రా తినేలా వదలిపెట్టిందా అంటే అదీ చేయలేదు."**

**144) అబూ మస్ఊద్ అన్సారీ (రజి) ఉఖబా బిన్ అమ్ర్ కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "ప్రజలు పూర్వీకులైన ప్రవక్తల నుండి పొందిన ప్రబోధనలలో ఇది కూడా ఉంది – 'నీలో సిగ్గూఎగ్గూ లేనప్పుడు ఇక నువ్వు ఏమైనా చేసుకోవచ్చు."[1]**

**145) అబూ మస్ఊద్ అన్సారీ(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "గత కాలపు ప్రవక్తల నుండి జనులు**

---

144–1. అంటే మనిషిలో లజ్జా, బిడియం, వ్రీడ అన్నది లేనప్పుడు అతడు ఏ చెడు పని అయినా నిర్భయంగా చేసేస్తాడు. 'కామా తురాణాం న భయం న లజ్జా' అన్న సంస్కృత లోకోక్తి ఈ సందర్భంగా స్మరించుకోదగినది. అంటే కామంతో కళ్ళు మూసుకుపోయిన వాడికి సిగ్గు గానీ, భయం కానీ ఉండదు.

**పొందిన ఉపదేశాలలో ఇది కూడా ఉంది– 'నీలో లజ్జ (వ్రీడ) అన్నదే లేనప్పుడు, నీవు కోరినది చేసుకో' (కాని దాని చెడు పర్యవసానం కొరకు సిద్ధంగా ఉండు)".**

**146) ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: "ఒక వ్యక్తి గర్వాతిశయంతో తన అంగ వస్త్రాన్ని (పంచిని) నేలకు రాసుకునేలా కట్టి నడవసాగాడు. తత్కారణంగా అతడు నేలలో దిగ్గొట్టబడ్డాడు. ప్రళయం వరకూ అతను నేలలో కూర్చివేయబడుతూనే ఉంటాడు."[1]**

**147) హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "మనం (ప్రపంచంలో) సముదాయాలన్నింటి కన్నా ఆఖరిలో వచ్చాము. అయితే (ప్రళయ దినాన) సముదాయాలన్నింటికన్నా ముందు ఉంటాము.[1] వ్యత్యాసమల్లా ఒక్కటే. వారికి మొదట గ్రంథం వొసగబడింది. మనకు వారి తరువాత దైవగ్రంథం లభించింది. ఈ దినం (అంటే శుక్రవారం) గురించి జనులు విభేదించుకున్నారు. యూదులు రేపటిదినాన్ని (అంటే శని వారాన్ని) తమ కొరకు ప్రత్యేకించుకున్నారు. క్రైస్తవులు ఎల్లుండి (ఆదివారం)ని తమ కొరకు నిర్ధారించుకున్నారు. ప్రతి ముస్లింకు వారంలో ఒక రోజు (అంటే శుక్రవారం) ప్రత్యేకమైనది. ఆ రోజున అతడు తన తలను, శరీరాన్ని కడగటం (తలంటు పోసుకోవటం) అనివార్యం."[2]**

**148) సయీద్ బిన్ ముసయ్యిబ్ తెలిపారు : ముఆవియా బిన్ అబీ సుఫ్యాన్ (రజి) చివరిసారిగా మదీనా వచ్చినప్పుడు మమ్మల్ని ఉద్దేశించి ప్రసంగించారు. (ప్రసంగం మధ్యలో) ఆయన సవరాల గుచ్ఛం ఒకదానిని తీసి, "యూదులు తప్ప వేరితరులు దీనిని ఇలా ఉపయోగించర"ని నేను భావిస్తున్నాను. ఈ విధంగా సవరాలు చేయడాన్ని దైవప్రవక్త(స) 'అజ్జూర్' (నకిలీ, మోసం) అని నామకరణం చేశారు. అంటే శిరోజాలలో సవరాలు పెట్టడాన్ని ఆయన(స) వారించారు.**

---

146–1. హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఆ వ్యక్తి ఎవరో కాదు, ధన పిపాసి ఖారూన్ అని వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. ఖారూన్ వృత్తాంతం ఖుర్‌ఆన్‌లో ఉంది.

147–1 అంటే అందరికన్నా ముందు స్వర్గంలో ప్రవేశిస్తాము. లేదా అంతస్తు రీత్యా అందరికన్నా ముందు వరుసలో ఉంటాము.

147–2. దీనికి కొంతమంది పెడర్థాలు తీశారు. మనిషి శారీరక అశుద్ధతను, లైంగిక అశుద్ధతను తొలగించడానికి ఎప్పుడయినా స్నానం చేయవచ్చు. కాని శుక్రవారం నాడు తలకు స్నానం చేయటం మాత్రం తప్పనిసరి, అది సున్నత్.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# كِتَابُ الْمَنَاقِبِ

# 2. మహిమోన్నతుల★ ప్రకరణం

## (కితాబుల్ మనాఖిబ్)

### అధ్యాయం : 1

**అల్ హుజురాత్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు.** ***(49 అల్ హుజురాత్ : 13)***

**అన్ నిసా సూరాలో ఇలా సెలవిచ్చాడు: "ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని కనిపెట్టుకుని ఉన్నాడనే విషయాన్ని తెలుసుకోండి."** ***(అన్ నిసా: 1)***

---

★ హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) ప్రకారం, అనేక కృతులలో 'కితాబుల్ మనాఖిబ్'కు బదులు 'బాబుల్ మనాఖిబ్' అనే ఉంది. ఇదే సరైనదని అనిపిస్తుంది. ఎందుకంటే ఇది వేరుగా ఓ ప్రకరణం (కితాబ్) కాదు. పైగా ఇది దైవప్రవక్తల ప్రకరణంలో అంతర్భాగమే. ఇందులో చివరి ప్రవక్తల ప్రస్తావన ఉంది. ఇమామ్ బుఖారీ (రహ్మ) దైవప్రవక్తల ప్రకరణాన్ని పూర్తి చేశాక, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) జీవిత విశేషాలను వెలికి తీయడానికి ఈ 'అధ్యాయాలను' ఏర్పరచారు. తొలుత మహాప్రవక్త(స) వంశపారంపర్యాన్ని ప్రస్తావించారు. ఆ తరువాత వివిధ వంశాలను ప్రస్తావించారు. ఆ తరువాత వర్గతెగల ప్రస్తావన

**అజ్ఞాన కాలంలో మాదిరిగా తాతల తండ్రుల గొప్పలు చెప్పుకుని మిడిసి పడకూడదు. 'షువూబ్' అనేది 'షాబ్'కు బహు వచనం...**

**149) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) (అల్ హుజురాత్ సూరాలోని) 'వజ అల్నాకుమ్ షువూబన్ వ ఖబాయిల' అనే వాక్యం గురించి చెబుతూ 'షువూబ్' అనేది పెద్ద తెగల అర్థంలో ఉందనీ, 'ఖబాయిల్' నుండి పెద్ద తెగల శాఖలు అనేకం వస్తాయని తెలిపారు.**

**150) హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : ఒకసారి దైవప్రవక్త(స)ను, 'దైవప్రవక్తా! అందరికన్నా మర్యాదస్తుడు, ఆదరణీయుడు ఎవడు?' అని అడగ్గా, "అందరికన్నా ఎక్కువగా దైవానికి భయపడేవాడు" అని ఆయన(స) సమాధాన మిచ్చారు. 'మేము అడిగింది దాని గురించి కాదు' అని సహచరమాన్యులు విన్న వించుకోగా, "మరి అలాగైతే (వంశపారంపర్యం రీత్యా) దైవప్రవక్త యూసుఫ్ (అలైహిస్సలామ్) అందరికన్నా సౌజన్యశీలురు" అని ఆయన(స) బదులిచ్చారు.**

**151) ప్రవక్త మహనీయుల (సఅసమ్) పెంపకంలో ఉన్న జైనబ్ బిన్తె అబీ సలమా (ర.అ) కథనం : కులైబ్ ఇలా అంటున్నారు– 'దైవప్రవక్త(స) ముజర్ తెగకు చెందినవారా?' అని నేను జైనబ్ను అడగ్గా, 'మరి ఏ తెగ వారని అనుకుంటున్నారు?' అని ఆమె బదులిచ్చింది. నిశ్చయంగా దైవప్రవక్త(స) 'ముజర్' తెగకు చెందిన బనీ నజర్ బిన్ కనానా సంతతిలోని వారే.[1]**

---

వస్తుంది. ఆపైన, వంశాలను ప్రస్తావించి బీరాలు పోయేవారిని గురించి చర్చించారు. పిదప చిట్టచివరి ప్రవక్త(స) విశిష్ఠతను ప్రస్తుతించారు. ఆ తరువాత హిజ్రత్కు పూర్వం మక్కా జీవితపు స్థితిగతులను పొందుపరిచారు.

151–1. **'నజర్ బిన్ కనానా'** అనేది ముజర్ తెగకు చెందిన ఒక శాఖ. ఎందుకంటే కనానా ఖుజైమా కుమారుడు. ఖుజైమా ముదర్కా కుమారుడు. మదర్కా ఇలియాస్ కొడుకు. ఇలియాస్ ముజర్ పుత్రుడు. ఈ విధంగా మహాప్రవక్త(స) ముజర్ తెగతో సంబంధం కలిగి ఉన్నారు. ఇకపోతే, హజ్రత్ జైనబ్(ర.అ) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఉమ్మె సలమా (ర.అ) కుమార్తె. ఉమ్మె సలమా మాజీ భర్త ద్వారా ఆమె అబిసీనియాలో జన్మించారు. ఉమ్మె సలమా (ర.అ) దైవప్రవక్త (స) దాంపత్య జీవితంలోకి వచ్చాక, ప్రవక్త(స) పర్యవేక్షణలో పెరిగే సౌభాగ్యం జైనబ్కు దక్కింది. మంచి ధర్మావగాహన కల మహిళలలో ఈమె ఒకరు.

**152) జైనబ్ బిన్తె అబీ సలమా (ర.అ) తెలిపారు : "ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) సొరకాయ తంబూరాను, ఆకుపచ్చని లక్క పాత్రలను, ముఖయ్యర్ పాత్రలను వాడటాన్ని వారించారు". కులైబ్ ఇలా అంటున్నారు : నేను ఆమె గారిని, 'అమ్మా! దైవప్రవక్త(స) ఏ తెగకు చెందినవారు? ముజర్ తెగతో ఆయనకు సంబంధం ఉందా?' అని అడిగితే, "మరే తెగతో సంబంధం ఉందను కుంటున్నారు? ఆయన(స) నజర్ బిన్ కనానా సంతతిలోని వారు" అని ఆమె బదు లిచ్చారు. (మరి నజర్ ముజర్ తెగవారే)**

**153) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించి నట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "మీరు మనుషులను గనుల మాదిరిగా కనుగొంటారు (మంచి విషయంలోనయినా, చెడు విషయంలో నయినా).[1] అజ్ఞాన కాలంలో మంచి వారుగా, సద్గుణ సంపన్నులుగా ఉన్నవారు ఇస్లామ్ స్వీకరించిన తరువాత కూడా మంచివారుగా, సద్గుణ సంపన్నులుగా రాణిస్తారు. కాకపోతే వారు ధర్మావగాహనను పెంపొందించుకోవాలి.[2] ప్రభుత్వాధి**

---

153-1. కొన్ని గనులలో నుంచి విలువైన ఖనిజాలు లభిస్తే, మరి కొన్ని గనులలో నుంచి నాసిరకం ఖనిజాలు, పనికిరాని వస్తువులు లభ్యమవుతాయి.

153-2. ధర్మావగాహన, విద్యార్జన గనక లేకుంటే వంశపరమైన మర్యాదలు, సంస్కారాలు నిరర్థకం. ప్రపంచంలో వచ్చిన విప్లవాల, జాతుల ఉత్థాన పతనాలపై దృష్టిని సారిస్తే విజ్ఞానం, ప్రతిభ, సమర్థత మూలంగానే అవి కీర్తి శిఖరాల అంబరాలను చుంబించాయన్న విషయం అర్థమవుతుంది. గత కాలపు చక్రవర్తుల, రాజవంశీయుల, శ్రీమంతుల పిల్లలు జ్ఞానార్జనకు దూరమైన కారణంగా పరాభవం పాలయ్యారు. అలాగే సామాజికంగా అధములుగా, తుచ్ఛులుగా పరిగణించబడేవారు చదువు సంధ్యల ద్వారా, శాస్త్రీయ పరిశోధనల ద్వారా ప్రపంచంలో ప్రసిద్ధి చెందారు. అంతేకాదు, వారు సమాజంలో మర్యాదస్తులుగా కూడా పరిగణించబడ్డారు. 'జ్ఞానార్జన'ను దైవప్రవక్త(స) 'ధర్మం (దీన్)లో అవగాహనను పెంపొందించుకోవటం'గా పేర్కొన్నారు. అంటే ఖుర్ఆన్ హదీసుల విద్య. ఇది ఒక కోణం. దీని రెండవ కోణం ప్రాపంచిక విద్యను ఆర్జించి, పరిపూర్ణమైన పోటీ విధానంలో యోగ్యులుగా, ప్రవీణులుగా రాణించటం. ప్రపంచం తమ అవసరాన్ని గుర్తించేలా తమ అస్థిత్వాన్ని మలచుకోవటం.

**కారం, నాయకత్వం పట్ల తీవ్రంగా అయిష్టతను వ్యక్తపరచిన వానినే మీరు పరిపాలనా దక్షత కలవానిగా, సమర్థుడైన నాయకునిగా పొందుతారు.[3] మీరు మనుషులలో రెండు ముఖాల ద్వంద్వ స్వభావి (కపటి)ని అతి చెడ్డవానిగా కనుగొం టారు. అతడు వీళ్ళల్లో ఒక ముఖం పెట్టుకుని వస్తే, వాళ్ళలో మరో ముఖంతో వస్తాడు.[4]**

**154) హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రబోధించారు: "ఈ (ఖిలాఫత్) వ్యవహారంలో జనులు ఖురైషులకు లోబడి ఉన్నారు. సాధారణ అవిశ్వాసులు ఖురైషీ అవిశ్వాసులకు లోబడి ఉన్నట్లే సాధారణ ముస్లింలు ఖురైషు ముస్లింలకు లోబడి ఉన్నారు. ఇక జనుల విషయానికి వస్తే, వారి ఉపమానం గనుల వంటిది. అజ్ఞాన కాలంలో మర్యాదస్తు లుగా ఉన్నవారు ఇస్లామ్ స్వీకరించిన తరువాత కూడా మర్యాదస్తులే. కాకపోతే వారు ధర్మంలో అవగాహనను పెంపొందించుకుని ఉండాలి. ఖిలాఫత్ పట్ల, నేతృత్వం పట్ల తీవ్రంగా విముఖతను చూపినవారినే మీరు సమర్థులుగా, పరిపాలనా దక్షత కలవారుగా కనుగొంటారు. కడకు వారు ఆ బాధ్యతల్లో లీనమైపోతారు.[1]**

**155) మహనీయ అబ్బాస్(రజి) తెలిపారు : "ఇల్లల్ మవద్దత ఫిల్ ఖుర్బా" (షూరా–23) అన్న దైవ వచనం గురించి – తావుస్– ఏమంటారంటే; దైవ**

---

153–3. ఎంత గొప్ప ఉపదేశమిది! ప్రాపంచిక పదవుల నుండి, ఈ పెత్తనం నుండి దూరంగా పారిపోయేవాడే నిస్వార్థ సేవా పరాయణుడై ఉంటాడు. అలాంటి వ్యక్తి చేతికి గనక అధికార పగ్గాలు ఇస్తే, అతను దైవానికి భయపడుతూ పరిపాలి స్తాడు. ప్రజా బాహుళ్యం మధ్యన న్యాయశీలునిగా రాణిస్తాడు. అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని అరికడతాడు.

153–4. అతనిది గోడ మీది పిల్లి వాటకం. తనకు ఎటువైపున ప్రయోజనం కనిపిస్తే అటువైపు దూకుతాడు. న్యాయం, ధర్మం, నీతి నిజాయితీ జాన్తానై. నేడు ఇలాంటి నయవంచకు లకు కొరతలేదు. పైగా వారు ఈ అవకాశవాదాన్ని 'స్ట్రాటజీ'గా సమర్థించుకుంటూ ఉంటారు. కడు శోచనీయం!

154–1. అంటే, వారికి ఇష్టం లేకపోయినప్పటికీ ప్రజలు తమ ప్రోద్బలంతో వారికి పదవీ బాధ్యతలు అప్పగిస్తారు. అప్పుడు వారు ఆ బాధ్యతల నుండి పారిపోరు సరికదా, అహోరాత్రులు చిత్తశుద్ధితో పనిచేస్తారు. నిస్వార్థ పరిపాలకులుగా రాణిస్తారు.

**ప్రవక్త(స)తో బంధుత్వం కలవని ఖురైషుల శాఖ ఏదీ లేదు. ఈ కారణంగానే ఈ ఆయత్ అవతరించింది. అందులో ఇలా అనబడింది : ప్రవక్తా! వారితో ఇలా అను, "నేను ఈ పనికిగాను మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ కోరను. అయితే బంధు ప్రేమను తప్పకుండా కోర్తాను."[1]**

**156) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించి నట్లుగా హజ్రత్ అబూ మస్ఊద్ అన్సారీ (రజి) తెలిపారు: "ప్రపంచంలో ఉపద్రవాలు అటువైపు నుండే పొడసూపుతాయి. అంటే తూరుపు నుండి. ఒంటెల, ఆవుల తోకల దగ్గరే (ఉండి) అరుస్తూ ఉండే జనులలో నిర్లక్ష్యం, హృదయ కాఠిన్యం ఉంటుంది. అంటే రబీయ, ముజర్ తెగలవారిలో."[1]**

**157) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా(రజి) తెలిపారు. ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "అరుస్తూ, కేకలు వేసే ఒంటెల వారిలో గర్వం, అహంకారం ఉంది.[1] గొర్రెలు మేపేవారిలో మృదుత్వం, మార్దవం ఉంటుంది.[2] ఇక విశ్వాసం (ఈమాన్) అంటారా, అది యమన్‌లో ఉంది. వివేకం (హదీసు) కూడా యమనీలదే". ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇలా అన్నారు :యమన్ పేరు 'యమన్' అని ఎందుకు పడిందంటే, అది కాబా గృహానికి కుడివైపున ఉంది. 'షామ్' (సిరియా)ను షామ్ అని ఎందుకంటా రంటే, అది పవిత్ర కాబాకు ఎడమ వైపున ఉంది. ఎడమ వైపును 'అల్ మష్అమ' అని అంటారు.[3] ఎడమ చేతిని 'షుమా' అనంటారు.**

---

155-1. ఈ హదీసులో బంధుత్వ హక్కుకు గల ప్రాముఖ్యత నొక్కి వక్కాణించబడింది. బంధుత్వాన్ని గుర్తించినవాడు వంశపారంపర్యాన్ని కూడా గుర్తించినట్లే. అందుకే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ అధ్యాయంలో ఈ హదీసును తీసుకువచ్చారు.

156-1. రబీయా, ముజర్ తెగలవారు ఆనాడు ధనికులు. వ్యవసాయం చేసేవారు. వారిలో దయ, జాలి, కనికరం తక్కువగా ఉండేవి. దైవప్రవక్త(స) ఈ రెండు తెగలలోని చెడును ఎండగట్టారంటే, దానికి ఎదురుగా ఇతర తెగలలోని మంచిని శ్లాఘించినట్లయింది. తరువాతి హదీసులో ఈ విషయం రానున్నది. అంటే యమన్ ప్రజల, గొర్రెల యజమానులలోని మంచితనం ప్రస్తుతించబడింది.

157-1. అరబ్బులు వారిని 'పల్లెటూరి బైతులు' అనంటారు.

157-2. వారు పెద్దగా ధనికులు కారు.

## అధ్యాయం : 2
## ఖురైషుల విశిష్ఠత గురించి ★

**158) హ॥జ్రత్ ముఆవియా ఖురైషుల ఒక బృందంలో ఉండగా ఆయనకు అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(రజి) గారి హదీసు చేరింది. అంటే అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) ఇలా అనేవారని తెలిసింది– "అతి త్వరలోనే (ప్రళయానికి ముందు) బనీ ఖహ్తాన్ తెగవారి నుండి ఒక వ్యక్తి పరిపాలకుడుగా వస్తాడు". ఇది విని హ॥జ్రత్ ముఆవియా ఆగ్రహోదగ్రులయ్యారు. తరువాత ఆయన ప్రసంగించడా**

---

157–3. అల్ బలద్ సూరాలో **'వల్లజీన కఫరూ బిఆయాతినా హుమ్ అస్హాబుల్ మష్ అమహ్'** (మా వాక్యాలను తిరస్కరించిన వారు ఎడమ పక్షానికి చెందినవారు. 90: 19) అని అనబడటం గమనార్హం. అలాంటి వారికి వారి ఆచరణల పత్రం తీర్పుదినాన వారి ఎడమచేతికి ఇవ్వబడుతుంది.

ఇక యమన్ వాసుల గురించి చెప్పాలంటే, ఆ రాజ్యంలో అల్లామా ఇమామ్ షౌకానీ (రహ్మ) వంటి గొప్ప విద్వాంసులు జన్మించారు. ఆయన ద్వారా అల్లాహ్ హదీసు విద్యను వ్యాపింపజేశాడు. ప్రళయ దినం వరకూ ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆయనగారు హదీసుకు వ్యాఖ్యానంగా రాసిన 'నైలుల్ అవ్తార్' గ్రంథం విశ్వవిఖ్యాతి గాంచింది.

★ నజర్ బిన్ కనానా సంతతిని ఖురైషులు అంటారు. కల్బీ కథనం ప్రకారం, మక్కా నగరంలో నివసించేవారు తమను తాము ఖురైషులుగా భావించేవారు. నజర్‌కు చెందిన ఇతర పిల్లలను ఖురైషులుగా పరిగణించేవారు కారు. దీని గురించి దైవప్రవక్త(స)ను అడిగినప్పుడు, "నజర్ బిన్ కనానా సంతానం కూడా ఖురైషులే' అని ఆయన(స) చెప్పారు. అత్యధిక మంది విద్వాంసులు చెప్పేది కూడా ఇదే. 'ఖురైష్' అనేది ఒక సముద్ర జంతువు పేరు. అది సముద్రంలోని ఇతర జంతువులను తినేసేది. వాటన్నింటికీ అది మహారాజుగా వర్ధిల్లేది. అలాగే ఖురైషులు కూడా అరేబియాలోని తెగలన్నింటికీ నాయకులుగా వర్ధిల్లేవారు. అందుకే వారికి 'ఖురైష్' అనే పేరు పడింది. మరి కొంతమంది ప్రకారం ఖుసై 'ఖుజాఅ' ప్రజలను హరమ్(పవిత్ర) క్షేత్రం నుండి వెళ్ళగొట్టినప్పుడు, మిగతా ప్రజలు ఆయన దగ్గర గుమిగూడారు. అందువల్లనే వారికి ఖురైషులు అనే పేరుపడింది. ఖురైష్ అంటే 'ప్రోగవ్వటం' అని మరో అర్థం.

**నికి నిలబడ్డారు. అల్లాహ్‌ను ఆయన స్థాయికి తగినట్లుగా స్తుతించిన తరువాత ఇలా అన్నారు : "ప్రజలారా! ఖుర్‌ఆన్‌లో లేని, దైవప్రవక్త(స) ద్వారా ప్రవచించబడని విషయాలను కొంతమంది ప్రజలు చెప్పుకుంటూ తిరుగుతున్నారని నాకు తెలిసింది. చూడండి! మీలో అందరికన్నా అజ్ఞానులు ఎవరంటే ఇలాంటివారే. ఇలాంటి వారి నుండి, వారి భావాలు భావనల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. వారి భావ నలే వారిని పెడదారి పట్టించాయి. నేను దైవప్రవక్త(స) ఇలా చెబుతుండగా విన్నాను. "ఈ ఖిలాఫత్ వ్యవస్థ ఖురైషులలో ఉంటుంది. ఎవడు వారి పట్ల శత్రుత్వం వహించినా అల్లాహ్ అతన్ని తలక్రిందులుగా చేసేస్తాడు- వారు (ఖురైషులు) ధర్మ సంస్థాపనకు కట్టుబడి ఉన్నంతవరకూ (ఈ సూత్రం వర్తిస్తుంది).[1]**

**159) ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: "ఖురైషుల్లోని ఇద్దరు వ్యక్తులయినా సరే మిగిలి ఉన్నంతవరకూ ఈ ఖిలాఫత్ వారి చేతుల్లోనే ఉంటుంది."[1]**

---

158-1. అంటే ఖురైషులు ధర్మాన్ని, షరీఅత్‌ను విడనాడినప్పుడు 'ఖిలాఫత్' కూడా వారి నుండి చేజారిపోతుంది. దైవప్రవక్త(స) చెప్పినట్లే జరిగింది కూడా. ఐదారు శతాబ్దుల వరకు ఈ పరిపాలనా వ్యవస్థ బనూ ఉమయ్యా, బనూ అబ్బాసియాల మధ్యన ఉండింది. వారంతా ఖురైషులే. వారు షరీఅత్ ప్రకారం నడుచుకోవటం మానెయ్యగానే ఖిలాఫత్ వ్యవస్థపై వారి పట్టు సడలిపోయింది. ఇతరులు రాజులుగా వచ్చారు. ఆనాటి నుంచి నేటివరకు కూడా ఖురైషులకు మళ్ళీ ఖిలాఫత్ లభించలేదు.

అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) వివరించిన హదీసు కూడా దీనికి విరుద్ధమేమీ కాదు. ఆయన వివరించిన దాని ప్రకారం, ప్రళయానికి ముందు ఒక ఖహ్తానీ అరబ్బు చక్రవర్తి అవుతాడు. అబూ హురైరా (రజి) ద్వారా కూడా ఇలాగే ఉల్లేఖించబడింది.

159-1. ఇమామ్ నవవీ (రహ్మ) ఇలా అంటారు: "ఖిలాఫత్ వ్యవస్థ ఖురైషులకు ప్రత్యేక మని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ప్రళయ దినం వరకూ ఖురైషులను కాదని ఖురైషేతరుల ఖిలాఫత్‌పై విధేయతా ప్రమాణం చేయటం సమంజసం కాదు". సహాబా కాలంలో ఈ మాటపై ఏకాభిప్రాయం ఏర్పడింది. ఒకవేళ ఏ కాలంలో నయినా ఖురైషు తప్ప మరో జాతికి చెందిన వ్యక్తి చక్రవర్తిగా వస్తే, అతను ఖురైషీ ఖలీఫా నుండి అనుమతి పొంది, అతనికి ప్రతినిధిగా వ్యవహరించాడు.

**160)** జుబైర్ బిన్ ముత్‌యిమ్ ఇలా అన్నారు : నేనూ, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) ఇద్దరం కలసి దైవప్రవక్త (సఅసమ్) వద్దకు వెళ్ళి ఇలా విన్నవించుకున్నాము: 'దైవప్రవక్తా! బనూ ముత్తలిబ్‌కు మీరు బాగానే ఇచ్చారు. కాని (బనూ ఉమయ్యాకు చెందిన) మమ్మల్ని ఉపేక్షించారు. చూడబోతే మీ కొరకు మేమూ, వారూ ఒకే స్థాయికి చెందినవారము.' దైవప్రవక్త(స) ఇది విని ఇలా సెలవిచ్చారు: "(అది నిజమేననుకోండి) కాని బనూహాషిమ్ మరియు బనూ ముత్తలిబ్ ఒక్కరే."

ఉర్వా బిన్ జుబైర్ తెలిపారు: "అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి), బనీ జుహ్రాకు చెందిన కొంతమందితో కలసి హజ్రత్ ఆయిషా (ర.అ) దగ్గరకు వెళ్ళారు. హజ్రత్ ఆయిషా(ర.అ) బనీ జుహ్రా తెగవారి పట్ల సద్భావన కలిగి ఉండేవారు. ఎందుకంటే వారికి దైవప్రవక్త(స)తో బంధుత్వం ఉంది."[1]

**161)** హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: "ఖురైష్, అన్సార్, జుహైనా, ముజైనా, అస్లమ్, అష్జా, గిఫార్– ఈ తెగలకు చెందినవారంతా నా శ్రేయోభిలాషులు. వారికి కూడా అల్లాహ్, ఆయన ప్రవక్త తప్ప మరో సంరక్షకుడు, సహాయకుడూ లేడు."

**162)** ఉర్వా బిన్ జుబైర్ కథనం: దైవప్రవక్త(స), అబూబక్ర్ (రజి)ల తర్వాత అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) పట్ల హజ్రత్ ఆయిషా(ర.అ) గారికి ఎక్కువ ప్రేమాదరణలు ఉండేవి. అమ్మ ఆయిషా(ర.అ) గారి అలవాటు ఏమిటంటే; అల్లాహ్ నుండి తనకు ఏ ఉపాధి అందినా, దానిని దానం చేసేవారు. ఒకసారి అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఎవరితోనో, 'ఉమ్ముల్ మోమినీన్‌ని ఈ దానధర్మాల నుండి ఆపాలి' అని చెప్పారు. (హజ్రత్ ఆయిషా–ర.అ–గారికి ఈ సంగతి తెలిసినప్పుడు ఆమె ఇలా అన్నారు) 'ఏమిటి, ఇప్పుడు నా చేతులను కట్టిపడేస్తారా? ఇక నుంచి నేను అబ్దుల్లాహ్‌తో మాట్లాడితే ఒట్టు. అతనితో మాట్లాడినట్లయితే నాపై పరిహారం (కఫ్ఫారా) తప్పనిసరి అయినట్లే.' అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) హజ్రత్ ఆయిషా (ర.అ) కోపాన్ని చల్లార్చడానికి ఖురైష్ తెగకు చెందిన కొంతమందిని, ముఖ్యంగా

---

160–1. బనూ ఉమయ్యా, బనూ ముత్తలిబ్– రెండూ ఒకే తెగకు చెందిన రెండు శాఖలు. ఇక దైవప్రవక్త(సఅసం) మాతృశ్రీ ఆమినా బనీ జుహ్రా తెగకు చెందినవారు. ఆ రకంగా దైవప్రవక్త(స)కు ఆ తెగవారితో బంధుత్వం ఉంది. ఆ బంధుత్వం వల్లనే హజ్రత్ ఆయిషా(ర.అ) ఆ తెగవారి పట్ల ఎంతో మర్యాదగా మసలుకునేవారు.

**దైవప్రవక్త(స) తల్లి తరఫు బంధువులను (బనూ జుహ్రాను) ఆమె వద్దకు పంపి క్షమాభిక్ష పెట్టమని సిఫారసు చేయించారు. కాని ఆయిషా(ర.అ) అంగీకరించలేదు. అప్పుడు బనూ జుహ్రాకు చెందిన వ్యక్తులు– వారు దైవప్రవక్త మేనమామలు– వారిలో అబ్దుల్లాహ్ బిన్ అస్వద్ బిన్ అబ్దె యగూస్, మిస్వర్ బిన్ మఖ్రమా కూడా ఉన్నారు– అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)కు సలహా ఇస్తూ వారిలా అన్నారు: 'చూడండి, మేము ఆమె గారి అనుమతితో అక్కడికి వెళ్ళి కూర్చున్నప్పుడు, నీవు ఒక్కసారిగా వచ్చి తెరలోపలికి దూరిపో'. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) అలాగే చేశారు. (ఇది గమనించిన హజ్రత్ ఆయిషా–ర.అ– లోలోపలే సంతోషించారు). పిదప అబ్దుల్లాహ్ ఆమె గారి సేవలో పదిమంది బానిసలను పంపగా, వారందరికీ విశ్వాసుల మాత (ప్రమాణ భంగానికి పరిహారంగా) స్వేచ్ఛను ప్రసాదించారు. ఆ తరువాత కూడా ఆమె అప్పుడప్పుడూ బానిసలకు విమోచనం ప్రసాదిస్తూ ఉండేవారు. ఈ విధంగా ఆమె విడుదల చేసిన బానిసల సంఖ్య నలభైకి చేరుకుంది. తరువాత ఆమె ఇలా అన్నారు: 'అయ్యో! నేను ఒట్టేసుకున్నప్పుడే (అంటే మొక్కుకున్నప్పుడే) ప్రమాణ భంగానికి పరిహారంగా ఈ పని చేస్తానని స్పష్టంగా చెప్పి ఉన్నట్లయితే, అది చేసేసి ఉండేదాన్ని (ఇంతటి సందిగ్ధానికి లోనయ్యేదానిని కాను)' అన్నారు.**[1]

## అధ్యాయం : 3

## ఖురైషుల భాషలో ఖుర్‌ఆన్ అవతరించటం ★

**163) హజ్రత్ అనస్ (రజి) కథనం: హజ్రత్ ఉస్మాన్(రజి) గారు జైద్ బిన్ సాబిత్, అబ్దుల్లాహ్ బిన్ జుబైర్, సయీద్ బిన్ ఆస్, అబ్దుర్రహ్మాన్ బిన్ హారిస్ బిన్**

162–1. అంటే– ఒక బానిసను విడుదల చేస్తాననో లేదా ఇంతమంది నిరుపేదలకు అన్నం పెడతాననో అని ఉంటే ఆంతర్యంలో సంశయం ఉండేది కాదు. హజ్రత్ ఆయిషా(ర.అ) అస్పష్టంగా మొక్కుకున్నారు. అందుకే ముందుజాగ్రత్తగా నలభై మంది బానిసలను విడుదల చేయాల్సి వచ్చింది.

ఇకపోతే అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఎవరో కాదు, ఆయిషా గారి అక్క అయిన అస్మా బిన్తె అబూబక్ర్(ర.అ) కుమారుడే. ఆయిషా(ర.అ) ఆయనకు పినతల్లి. బాల్యం నుండి పిన తల్లి పర్యవేక్షణలోనే ఆయనకు చదువు సంస్కారం అబ్బింది.

★ ఖురైషుల మాతృభాష అరబీ. వారు ఏ లోకోక్తులతో, ఏ దేశీయంలో, ఏ ఉచ్చారణతో అరబీ మాట్లాడేవారో ఆ తీరులోనే ఖుర్‌ఆన్ అవతరించింది. ఇలా ఎందుకు జరిగిందంటే అంతిమ దైవప్రవక్త(స) స్వయంగా ఖురైషు తెగకు

**హిషామ్(రజిఅల్లాహు అన్హుమ్)లను పిలిచి, దివ్య ఖుర్ఆన్ను లిఖించే మహ త్కార్యంపై నియమించారు. ఆ నలుగురు మహనీయులు దివ్య ఖుర్ఆన్ యొక్క అనేక ప్రతుల నకళ్ళను తయారు చేశారు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్(ఆ నలుగురు సహాబాలో) ముగ్గురు ఖురైష్ సహాబాతో ఇలా అన్నారు: "చూడండి! దివ్య ఖుర్ఆన్లో ఎక్కడయినా, ఏ జాతీయంలోనయినా మీకు జైద్ బిన్ సాబిత్(రజి)తో భేదాభిప్రాయం ఏర్పడితే, మీరు ఖురైషుల జాతీయం ప్రకారం దానిని లిఖించండి (ఎందుకంటే జైద్ బిన్ సాబిత్ మదీనా వాసులు). ఎందుకంటే దివ్య ఖుర్ఆన్ ఖురైషుల జాతీయంలో అవతరించింది."[1]– వారు అలాగే చేశారు.**

## అధ్యాయం : 4

## యమన్ వాసులు మహనీయ ఇస్మాయీల్ (అలైహిస్సలామ్) సంతతి వారై ఉండటం

**ఖుజాఅ తెగకు చెందిన ఒక శాఖ బనూ అస్లం బిన్ అఫ్సా బిన్ హారిసా బిన్ అమ్ర్ బిన్ ఆమిర్– వీరు యమన్ వాసులే.**

---

చెందిన అరబ్బు. అందువల్ల ఆయనకు తెలిసిన భాషలోనే దైవవాణి అవతరించటం అవసరం. అప్పుడే ఆయన(స) తన జాతి ప్రజలకు విషయం అర్థమయ్యేలా విడమరచి చెప్పగలరు. ప్రజల మాతృభాషలో మాట్లాడినప్పుడే వారు ఆ సందేశాన్ని సులువుగా గ్రహించగలరు.

163–1. అసలేం జరిగిందంటే, దివ్య ఖుర్ఆన్ హజ్రత్ అబూబక్ర్(రజి) ఖిలాఫత్ కాలంలోనే సేకరించబడింది. అదే ప్రతి హజ్రత్ ఉమర్(రజి) పరిపాలనా కాలంలో కూడా ఆయన వద్ద ఉండేది. హజ్రత్ ఉమర్(రజి) మరణానంతరం ఆ ప్రతి ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా (ర.అ) దగ్గర భద్రపరచబడింది. హజ్రత్ ఉస్మాన్(రజి) ఆ ప్రతిని తన హయాంలో హఫ్సా (ర.అ) దగ్గరి నుండి తెప్పించి, పై నలుగురు మహనీయుల చేత దాని నకళ్ళను తయారు చేయించారు. ఒక్కో నకలు ప్రతిని ఇరాక్, సిరియా, ఈజిప్టు, ఈరాన్ తదితర ప్రదేశాలకు పంపించారు. అందుకే హజ్రత్ ఉస్మాన్(రజి)ను 'జామెవుల్ ఖుర్ఆన్' అంటారు. ఆయన గారు ఖుర్ఆన్ నకళ్ళను స్పష్టంగా వ్రాయించి ఇరుగు పొరుగు రాజ్యాలకు పంపించారు. అంతేగాని ఖుర్ఆన్ ఆయన హయాంలోనే

**164)** హజ్రత్ సలమా బిన్ అక్వా (రజి) కథనం: ఒకసారి ప్రవక్త మహనీయులు (సఅసమ్) అస్లం తెగకు చెందిన సహచరుల వైపు నుండి సాగిపోయారు. ఆ సమయంలో వారు విలువిద్యను ప్రదర్శిస్తున్నారు. దైవప్రవక్త(స) వారిని ఉద్దేశించి, "ఓ ఇస్మాయీల్ సంతతి వారలారా! విలువిద్యలో విజృంభిం చండి. మీ పితామహుడు ఇస్మాయీల్ (అలైహిస్సలాం) కూడా మంచి విలుకాడే" అని చెప్పారు. తరువాత ఆయన(స) "నేను ఫలానా జట్టులో ఉన్నాను" అన్నారు. ఇది విని ప్రత్యర్థి జట్టు వారు తమ చేతులను ఆపుకున్నారు. "ఏమయింది? (ఆగిపోయారేమిటి?)" అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, 'తమరు అవతలి జట్టులో ఉండగా మేమెలా బాణాలు ప్రయోగించగలం?' అని వారు విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త(స), "ఫరవాలేదు. మీ విలువిద్యను కొనసాగించండి. నేను మీ అందరి వెంట ఉన్నా"నని అన్నారు.[1]

## అధ్యాయం : 5

## ఎవరయినా సరే ఉద్దేశపూర్వకంగా తన తండ్రిని కాదని వేరెవరినయినా తండ్రిగా చేసుకుంటే, అతను అవిశ్వాసానికి (కుఫ్రకు) ఒడిగట్టినట్లే.

**165)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబూజర్(రజి) తెలియజేశారు. ప్రవక్త(స) ఇలా చెప్పారు : "ఏ వ్యక్తి అయితే తెలిసి కూడా తన కన్న తండ్రికి బదులు వేరొకరిని తన తండ్రిగా చేసుకున్నాడో అతను అవిశ్వాసానికి (కుఫ్రకి) ఒడిగట్టాడు. మరెవడయితే తన వంశాన్ని, తనకు ఏమాత్రం సంబంధంలేని వంశంతో కలిపి పేర్కొన్నాడో అతను నరకంలో తన నివాసాన్ని ఏర్పరచుకోవచ్చు."

---

సేకరించబడిందనేది సరైనది కాదు. దైవప్రవక్త(స) కాలంలోనే ఖుర్ఆన్ కూర్చబడింది. విడిగా ఉన్న మరి కొంతభాగం అబూబక్ర్(రజి) పరిపాలనా కాలంలో సమీకరించబడింది.

164-1. ఈ విలువిద్యలో పాల్గొన్న అస్లం తెగవారు యమన్ ప్రదేశానికి చెందినవారు. దైవప్రవక్త(స) వారిని ప్రోత్సహిస్తూ, 'ఇస్మాయీల్ (అ) మీ పితామహుడు' అని చెప్పారు.

**166)** వాసిలా బిన్ అస్ఖా కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "మనిషి తన తండ్రికి బదులు వేరొకరిని తన తండ్రిగా చెప్పు కోవటం లేదా తాను కలలో చూడని దానిని చూసినట్లుగా చెప్పటం లేదా దైవ ప్రవక్త(స) చెప్పని విషయాన్ని (హదీసును) ఆయన చెప్పినట్లుగా వాదించటం అతి పెద్ద అభాండం, పచ్చి అబద్ధం."[1]

**167)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం : అబ్దె ఖైస్ తెగకు చెందిన ఒక ప్రతినిధి బృందం దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకుంది: 'దైవప్రవక్తా! రబీయా తెగతో మీకు సంబంధం ఉంది. మాకూ– మీకూ మధ్యన (దారిలో) ముజర్ తెగకు చెందిన సత్య తిరస్కారులు ఉన్నారు. అందువల్ల మేము మీ పవిత్ర సన్నిధికి హరామ్(నిషిద్ధ) మాసాలలో మాత్రమే రాగలము. కనుక తమరు మాకు, మేము స్థిరంగా, దృఢంగా పాటించగల విషయాలను గురించి ఆజ్ఞాపించండి. మాతోపాటు రాలేకపోయిన వారికి కూడా మేము వాటిని గురించి విశదీకరిస్తాము'. ఇది విని దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: "నేను మీకు నాలుగు విషయాలను పాటించమని ఆజ్ఞాపిస్తాను. మరో నాల్గు విషయాల నుండి వారిస్తాను. మొదటిది : అల్లాహ్‌ను విశ్వసించాలి. అంటే అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని సాక్ష్యమివ్వాలి. రెండు : నమాజును స్థాపించాలి. మూడు : జకాత్ ఇవ్వాలి. నాలుగు : మీకు లభించిన విజయప్రాప్తి (మాలె గనీమత్)లో నుండి ఐదవ భాగాన్ని అల్లాహ్‌కు (అంటే మీ నాయకుని బైతుల్ మాల్‌కు) చెల్లించాలి. ఇంకా నేను మిమ్మల్ని దుబ్బా నుండి, హంతమ్ నుండి, నఖీర్ నుండి, ముజఫ్ఫత్ నుండి వారిస్తున్నాను.[1]

**168)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు. దైవప్రవక్త(స) వేదికపై నిలబడి ఇలా

166–1. కలలో చూడని దానిని చూసినట్లుగా చెప్పటం జాగృదావస్థలో అబద్ధం చెప్పటం కన్నా పెద్ద పాపం. ఎందుకంటే 'కల' అనేది దైవదౌత్యపు భాగాలలో ఒక భాగం. కలలో చూడని దానిని చూశానని చెప్పేవాడు అల్లాహ్‌కు అబద్ధాన్ని ఆపాదించాడు. హదీసు విషయంలో అబద్ధం కల్పించేవాడు కూడా అంతే, అతడు దైవ ప్రవక్త(స)పై నిందమోపాడు.

167–1. ఈ హదీసు ఇంతకుముందు విశ్వాస ప్రకరణంలో వచ్చింది. ఈ ప్రకరణం ప్రారంభంలో కూడా ఈ హదీసులోని కొంత భాగం వచ్చింది.

**చెప్పారు : "వినండి! ఉపద్రవం అటువైపు నుండి పొడసూపుతుంది". ఆయన(స) తూరుపు వైపు సంజ్ఞ చేస్తూ ఈ మాట చెప్పారు– అటువైపు నుంచే షైతాన్ కొమ్ము ఉదయిస్తుంది.[1] అన్నారు.**

## అధ్యాయం : 6

## అస్లం, ముజైనా, జుహైనా, గిఫార్, అష్జా తెగల గురించి★

**169) హజ్రత్ అబూ హురైరా(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఖురైష్, అన్సార్, జుహైనా, ముజైనా, అస్లమ్, గిఫార్, అష్జా తెగలవారు నా శ్రేయోభిలాషులు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త తప్ప వేరెవరూ వారి రక్షకులు, సహాయకులు కారు"**

**170) ప్రవక్త మహనీయులు(స) మింబర్‌పై నుండి ఈ విధంగా వక్కాణించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: "గిఫ్ఫార్ తెగ వారిని అల్లాహ్ క్షమించాడు. అస్లమ్ తెగవారిని అల్లాహ్ క్షేమంగా ఉంచాడు. ఉసయ్యా తెగవారు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపారు."[1]**

**171) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించినట్లుగా హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "అస్లమ్ తెగవారిని అల్లాహ్ క్షేమంగా, సురక్షితంగా ఉంచాడు. గిఫ్ఫార్ తెగ వారికి అల్లాహ్ క్షమాభిక్ష పెట్టాడు."**

---

168–1. సూర్యోదయం అయ్యే సమయంలో షైతాన్ తన శిరస్సును దానిపై ఉంచుతాడు. ఆ విధంగా సూర్య నమస్కారం చేసే వారి ప్రణామం తనకు చెందాలని కోరుకుంటాడు. చంగీజ్‌ఖాన్ హయాంలో జరిగిన మారణకాండను ఈ హదీసు సూచిస్తోందని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

★ హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ) ప్రకారం ఈ అయిదు తెగలు అరేబియాలోకెల్లా బలోపేతమైన తెగలుగా భావించబడేవి. ఇతర తెగల వారికన్నా వీరే ముందుగా ఇస్లామ్ స్వీకరించారు. అందువల్ల దైవప్రవక్త(స) ఈ తెగలలోని మంచిని ప్రశంసించారు. బలోపేతమైన తెగలవారు ఇస్లాంలోకి రావటం వల్ల అరేబియాలో ఇస్లాం ధర్మవ్యాప్తికి మార్గం సుగమం అయింది. – **యద్‌ఖులూన ఫీ దీనిల్లాహి అఫ్‌వాజా.**

170–1. గిఫ్ఫార్ తెగ వారు అజ్ఞాన కాలంలో హజ్ యాత్రీకుల సామగ్రిని దోచుకునేవారు. దొంగతనం చేసేవారు. ఇస్లామ్ స్వీకరించిన మీదట అల్లాహ్ వారి పాపాలను క్షమించాడు.
ఉసయ్యా తెగవారు దైవప్రవక్త(స)తో చేసుకున్న ఒడంబడికను ఉల్లంఘించి విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారు. బైరె మవూనాలో ముస్లింలను వధించారు.

**172)** **అబూబక్రా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్), "చెప్పండి! జుహైనా, ముజైనా, అస్లమ్, గిఫ్ఫార్ తెగలు బనీ తమీమ్, బనీ అసద్, బనీ అబ్దుల్లాహ్ బిన్ గత్ఫాన్, బనీ ఆమిర్ బిన్ సాసాల కంటే ఉత్తమమైనవా?" అని ప్రశ్నించగా, ఒక వ్యక్తి (అతని పేరు అఖ్రా బిన్ హాబిస్), 'వారు నాశనమయ్యారు' అని బదులిచ్చాడు. అప్పుడు మహాప్రవక్త(స) ఇలా అన్నారు: "లేదు. జుహైనా, ముజైనా, అస్లమ్, గిఫ్ఫారీ అనబడే ఈ నాలుగు తెగలు బనీ తమీమ్, బనీ అసద్, బనీ అబ్దుల్లాహ్ బిన్ గత్ఫాన్, బనీ ఆమిర్ బిన్ సాసా అనబడే నాలుగు తెగలకన్నా శ్రేష్టమైనవి."[1]**

**173)** **అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బక్రా (రజి) కథనం : ఈయన గారు తన తండ్రి చెప్పగా విన్నారు– అఖ్రా బిన్ హాబిస్ దైవప్రవక్త(స)తో ఇలా విన్నవించు కున్నారు: హాజీల వస్తు సామగ్రిని దోచుకునేవారు మీ సమక్షంలో విధేయతా ప్రమాణం చేశారు. అంటే అస్లమ్, గిఫ్ఫార్, ముజైనా తెగలవారు– 'జుహైనా' తెగ పేరు కూడా చెప్పారని నేననుకుంటున్నానని ముహమ్మద్ బిన్ యాఖూబ్ అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స), "చెప్పు. అస్లమ్, గిఫ్ఫార్, ముజైనా, జుహైనా తెగలవారు బనీ తమీమ్, బనీ ఆమిర్, బనీ అసద్, గత్ఫాన్ తెగల వారికన్నా ఉత్తములు కారా? చివరి నలుగురు తెగలవారు చెడ్డవారు కారా? వారు నాశనమవలేదా?" అని అడగ్గా, 'అవున'ని అఖ్రా బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! వీరు వారికన్నా ఉత్తములు."**

**దైవప్రవక్త(స) ఇలా చెప్పారని అబూహురైరా(రజి) ఉల్లేఖించారు : "అస్లమ్, గిఫ్ఫార్, ముజైనా, జుహైనా తెగలకు చెందిన కొంతమంది– లేదా ముజైనా తెగకు చెందిన కొంతమంది అని చెప్పారు– లేదా జుహైనా తెగకు చెందిన కొంతమంది అన్నారు– 'వారు అల్లాహ్ దృష్టిలో' లేదా 'ప్రళయదినాన' అన్నారు– అసద్, తమీమ్, హవాజిన్, గత్ఫాన్ తెగలవారికన్నా శ్రేష్ఠులై ఉంటారు.**

---

172–1. అంటే పూర్వం ఒకప్పుడు జుహైనా, ముజైనా, అస్లమ్, గిఫ్ఫార్ తెగలలో చెడులు ప్రబలి ఉండేవి. కాని ధర్మపరివర్తనలో వారు ముందంజ వేశారు. ధర్మపరివర్తన తరువాత వారిలోని చెడుగులు దూరమయ్యాయి. అందువల్ల వారు బనూ తమీమ్ తదితర తెగలకన్నా ఆదరణీయులుగా పరిగణించబడ్డారు.

## అధ్యాయం : 7

## ఒక ఖహ్‌తానీ వ్యక్తి ప్రస్తావన

హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఖహ్‌తాన్ తెగలోనుండి ఒక వ్యక్తి పుట్టి, కర్ర బలంతో ప్రజలపై అధికారం చెలాయించనంత వరకూ ప్రళయం సంభవించదు."[1]

## అధ్యాయం : 8

## అజ్ఞానపు గబ్బు వారించదగినది

మహనీయ జాబిర్(రజి) కథనం : మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి జిహాద్‌లో పాల్గొన్నాము. ముహాజిర్లు పెద్ద సంఖ్యలో ఆయన(స) దగ్గర గుమిగూడారు. కారణం ముహాజిర్లలోని ఒక వ్యక్తి తోటి వారితో వేళాకోళమాడటమే. వేళాకోళానికే ఆయన ఒక అన్సార్ సహాబీ తలపై దెబ్బ కొట్టారు. అన్సార్ సహాబీకి కోపం వచ్చింది. ఆయన తన సోదర వర్గీయులను సహాయం కొరకు పిలిచారు. పరిస్థితి ఎంత వరకు వచ్చిందంటే, అన్సార్ వర్గానికి చెందినవారు 'ఓ అన్సార్ సోదరులారా! మమ్మల్ని ఆదుకోండి' అని నినదించారు. ముహాజిర్లు కూడా, 'ఓ ముహాజిర్ సోదరులారా! మా సహాయం కొరకు కదలిరండి' అని పిలుపు ఇచ్చారు. ఈ గలాటాను విని దైవప్రవక్త(స) (తన గుడారంలో నుంచి) బయటికి వచ్చారు. "ఏం జరిగింది? అజ్ఞాన కాలపు నినాదాలు ఇక్కడ ఎందుకు వినబడుతున్నాయి?" అని అడిగారు. అప్పుడు జరిగినదంతా ఆయన (స)కు వినిపించడం జరిగింది. అంతా విన్న తరువాత ఆయన(స) "అజ్ఞాన కాలపు ఈ పాడు మాటల్ని విడనాడండి" అన్నారు. (కపట విశ్వాసి అయిన) అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇలా అన్నాడు: "ఈ ముహాజిర్లు ఇప్పుడు మాకు వ్యతిరేకంగా తమ వర్గం వారిని రెచ్చగొట్టే వరకూ వచ్చారు. మదీనా చేరుకున్నాక వీళ్ళ సంగతి చూసుకుంటాం. గౌరవనీయుడైనవాడు అల్పుణ్ణి వెళ్ళగొడతాడు." దీనిపై హజ్రత్ ఉమర్(రజి), 'దైవప్రవక్తా! ఆ తుచ్ఛుడు

---

7-1. ఆ ఖహ్‌తానీ వ్యక్తి అసలు పేరు 'జహ్‌జా' అని సహీహ్ ముస్లింలోని ఉల్లేఖనంలో పేర్కొనబడింది. ఈ వ్యక్తి ఇమామ్ మెహ్దీ తరువాత బయల్పడతాడనీ, ఆయన వెనకే నడుస్తాడనీ అనబడుతోంది. 'ఫితన్'లో అబూ నుఐమ్ ఇలాగే ఉల్లేఖించారు.

**అబ్దుల్లాహ్ బిన్ ఉబైని మనం ఎందుకు కడతేర్చకూడదు?' అని తీవ్రంగా స్పందించారు. "వద్దు వద్దు. ఎట్టి పరిస్థితిలోనూ అలా చేయవద్దు. ఒకవేళ అలా చేసినట్లయితే, ముహమ్మద్(సఅసం) తన వాళ్ళనే సంహరిస్తున్నాడని జనులంటారు" అంటూ దైవప్రవక్త(స) ఆ చర్య నుండి ఉమర్(రజి)ను వారించారు.**[1]

**174) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారు : "(విపత్కర పరిస్థితిలో, సంతాప ప్రకటనగా) తన చెంపలపై కొట్టుకునేవాడు, అంగ వస్త్రాన్ని చింపుకునేవాడు, అజ్ఞాన కాలపు నినాదాలు చేసేవాడు మా వాడు కాదు."**

## అధ్యాయం : 9

## ఖుజాఅ తెగ వారి గురించి

**175) అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: "అమ్ర్ బిన్ లుహాయీ బిన్ ఖమ్అ బిన్ ఖిందిఫ్ ఖుజాఆ తెగకు మూల పురుషుడు."**

**176) సయీద్ బిన్ ముసయ్యిబ్ తెలిపారు: 'బహీరా' అనేది ఒక ఆడ ఒంటె పేరు. దాని పాలు త్రాగడం నిషేధించబడింది. ఎందుకంటే అది విగ్రహాల పేర**

---

8–1. దైవప్రవక్త(స)లోని విజ్ఞతకు, దూరదృష్టికి ఇది నిదర్శనం. అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఒక కపట విశ్వాసి. పైకి ముస్లిం సమూహంతోనే ఉండేవాడు. కాని లోపలి నుంచి అతను ముస్లిం కాడు. ఒకవేళ అతనిపై కఠినచర్య గైకొన్నట్లయితే మదీనాలో ఇప్పుడిప్పుడే రూపుదిద్దుకుంటున్న ఒక సత్సమాజ ప్రక్రియకు తీరని విఘాతం కలుగుతుంది. వర్గ తెగల విష కోరల్లో మళ్ళీ మానవత్వం విలవిల్లాడుతుంది. పైగా అబ్దుల్లాహ్ బిన్ ఉబై కుమారుడు నికార్సయిన ముస్లిం. ముహాజిర్ ముస్లింల గురించి ఆ కపటి పలికిన మాటలు అల్ మునాఫిఖూన్ సూరాలో కూడా ప్రస్తావనకు వచ్చాయి. ఒకవైపు దైవప్రవక్త(స) మొక్కవోని సహనం– మరోవైపు ఆ కపటి ఓర్వలేని తనం మధ్య అనిర్వచనీయమైన సంఘర్షణ! చివరకు సత్యమే గెలిచింది. ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకే అబ్దుల్లాహ్ బిన్ ఉబై మృత్యువాతన పడ్డాడు. అతని కుమారుని అభ్యర్థనపై దైవప్రవక్త(స) అతని అంత్యక్రియలలో పాల్గొనడమే కాకుండా, 'కఫన్ వస్త్రం'గా తన అంగీని కూడా ప్రదానం చేశారు.

**అంకితం చేయబడింది. అందువల్ల ఏ ఒక్కరూ పాలు పితికేవారు కారు. ఇక 'సాయిబా' అనేది (ముష్రిక్కులు) తమ విగ్రహాల కోసం ప్రత్యేకించుకున్న పశువు. దానిపై ఎవరూ బరువు మోపటంగానీ, దానిపై స్వారీ అవటం గానీ చేసేవారుకారు. (దీని పర్యవసానం గురించి) సయీద్ ఇలా తెలిపారు– అంటే మహాప్రవక్త(స) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూహురైరా(రజి) ఉల్లేఖించారు : "నేను అమ్ర్ బిన్ ఆమిర్ బిన్ లుహాయీని చూశాను, అతను నరకంలో తన ప్రేగులను ఈడ్చుకుంటూ తిరుగుతున్నాడు. ఈ అమ్ర్ ఎవరో కాదు, 'సాయిబా' దురాచారాన్ని మొదలెట్టిన ప్రథమ వ్యక్తి."[1]**

## అధ్యాయం : 10

## అబూజర్ గిఫ్ఫారీ (రజి) ఇస్లాం స్వీకరించిన సంఘటన

**177) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : ముహమ్మద్(స) దైవప్రవక్తగా నియుక్తులయ్యారన్న సంగతి అబూజర్(రజి)కు తెలిసినప్పుడు, ఆయన తన సోదరుడు అనీస్‌ను పిలిచి, 'మక్కా వెళ్ళడానికి వాహనాన్ని సిద్ధం చెయ్యి. తనను ప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి గురించి సమాచారం రాబట్టు. ఆ వ్యక్తి తనకు ఆకాశం నుండి దైవవాణి అందుతుందని అంటున్నాడట. నా కోసం ఆ విషయాలన్నీ కనుక్కుని రా. అతని మాటల్ని జాగ్రత్తగా విను. ఆ తరువాత వచ్చి నాకు విడమరిచి చెప్పు' అని ఆదేశించారు.**

---

176–1. ఇబ్నె ఇస్‌హాఖ్ ఉల్లేఖనం ప్రకారం అతడే (అరేబియాలో) విగ్రహాలను ప్రతిష్ఠించాడు. 'సాయిబా' అనే జంతువును అచ్చోసి వదిలాడు. బహీరా, వసీలా, హామ్‌లను వెలికి తీసినది కూడా అతడే. అల్ అన్ఆమ్ సూరాలో ఈ పశువుల ప్రస్తావన వచ్చింది.

అమ్ర్ బిన్ లుహాయీ సిరియా దేశానికి వెళ్ళినప్పుడు, అక్కడి ప్రజలు విగ్రహారాధన చేయటం గమనించాడు. వారి నుండి ఒక విగ్రహాన్ని అడిగి తెచ్చుకుని, దానిని కాబా గృహంలో ప్రతిష్ఠించాడు. దాని పేరే హుబల్... శోచనీయమైన విషయం ఏమిటంటే ధర్మజ్ఞానం లేని ముస్లింలలో నేటికీ ఇలాంటి దురాచారాలు ఉన్నాయి. వారు తమ సోకాల్డ్ పీర్ల, ముర్షిద్‌ల పేరు మీద పొట్టేలు వదలిపెడతారు. అలాంటి పశువుల మాంసాన్ని ఫలానా వారు తినవచ్చు, ఫలానా వారు తినకూడదన్న ఆంక్షలు కూడా పెట్టుకుంటారు. ఇవన్నీ అజ్ఞానంతో కూడిన మాటలు. అపమార్గాలు.

ఆయన సోదరుడు వెంటనే అక్కడి నుండి బయలుదేరి మక్కా చేరుకున్నాడు. దైవప్రవక్త(స) మాటల్ని ప్రత్యక్షంగా విని, తిరిగి వెళ్ళాడు. అబూజర్‌తో అతను ఇలా అన్నాడు : '(సోదరా!) నేను ప్రత్యక్షంగా ఆ ప్రవక్తను చూశాను. ఆయన మాటల్ని విన్నాను. ఉత్తమ నైతికత గురించి ఆయన ప్రజలకు ఆజ్ఞాపిస్తున్నారు. నేను ఆయన నోట విన్న పలుకులు కవిత్వం ఎంతమాత్రం కావు'. ఇదంతా విన్న తర్వాత, 'ఏ ఉద్దేశంతో నేను నిన్ను అక్కడికి పంపానో దానిపై నాకు పూర్తిగా సంతృప్తి కలగలేదు' అన్నారు అబూజర్. ఎట్టకేలకు ఆయన స్వయంగా భోజన సామగ్రిని (చద్ది మూటను) సమకూర్చుకుని, ఒక పాత నీళ్ళ తిత్తిని తీసుకుని మక్కాకు బయలు దేరారు. మస్జిదె హరామ్‌లోనికి వచ్చి, అక్కడ దైవప్రవక్త(స)ను అన్వేషించారు. దైవప్రవక్త(స)ను ఆయన గుర్తుపట్టలేదు (అంతకుముందెన్నడూ ఆయన్ని చూడ లేదు). ఆయన(స) గురించి జనులను అడగటం కూడా భావ్యం కాదనుకున్నారు. కొంత రాత్రి గడిచాక మస్జిదె హరామ్ ఆవరణలోనే మేను వాల్చారు. హజ్రత్ అలీ(రజి) ఆయన్ని ఆ స్థితిలో చూసి, బాటసారి అని తలపోసి, 'నాతోపాటే నా ఇంటికి వచ్చి అక్కడే విశ్రాంతి తీసుకోండి' అని ఆహ్వానించారు.

అబూజర్ గిఫారీ ఆయన వెనకాలే నడిచారు. కాని ఎవరూ ఒకరింకొకరితో మాట్లాడుకోలేదు. తెల్లవారగానే అబూజర్ తన చద్దిమూటను, నీళ్ళ సంచిని తీసు కుని మస్జిదె హరామ్ వైపునకు వెళ్ళిపోయారు. ఆ రోజు కూడా అలాగే గడిచి పోయింది. ఆయన దైవప్రవక్త(స)ను చూడలేకపోయారు. సాయంత్రమయింది. పడుకునే ఏర్పాట్లు చేసుకోసాగారు. సరిగ్గా అదే సమయంలో అలీ(రజి) అటువైపు నుండే సాగిపోతూ, బహుశా ఈ బాటసారికి తన గమ్యస్థలం చేరుకునే సమయం రాలేదేమో అనుకున్నారు. అబూజర్‌ను ఆయన మళ్ళీ తన వెంటబెట్టుకుని వెళ్ళారు. రెండవ రోజు కూడా వారిద్దరూ పరస్పరం సంభాషించుకోలేదు. మూడవ రోజు కూడా అదే సంగతి పునరావృతమయింది. తన ఇంటికి తీసుకువెళుతూ, మీ రాకకు కారణం ఏమిటో తెలుపగలరా? అని అడిగారు అలీ. 'మీరు నాకు గట్టి వాగ్దానం చేసి, నా వ్యవహారంలో మార్గనిర్దేశన చేసే మాటైతే, నేను మీకు అంతా విడమరచి చెబుతాన'న్నారు అబూజర్. అలీ (రజి) వాగ్దానం చేశారు. అప్పుడు ఆయన తన ప్రయాణ ఉద్దేశం గురించి చెప్పారు. ఇది విని, 'నిశ్చయంగా ఆయన(స) సత్యంపై ఉన్నారు. దేవుని సత్య సందేశహరుడు. సరే. రేపు ఉదయం మీరు నా వెనకాలే

నడవండి. దారిలో మీకు ఏదైనా ప్రమాదం పొంచి ఉందనిపిస్తే, నేను (ఏదైనా గోడ ప్రక్కన) నిలబడిపోతాను. మూత్ర విసర్జన కోసం ఆగినట్లుగా అభినయం చేస్తాను. ఆ క్షణంలో మీరు నా కోసం నిరీక్షించకూడదు. నేను నడక సాగించిన తరువాత నన్ను అనుసరించాలి. వీళ్ళిద్దరూ కలసి వెళుతున్నారన్న ఆలోచన ఎవరికీ రాకుండా జాగ్రత్తపడాలి. ఆ విధంగా నడిచిపోతూ, నేను ప్రవేశించిన ఇంట్లోకి మీరూ ప్రవేశిం చండి' అన్నారు. అబూజర్ అలాగే చేశారు. ఎట్టకేలకు ఆయన ప్రవక్త మహనీయుల (సఅసం) సేవలో హాజరయ్యారు. ఆయన(స) మాటలు విన్నారు. అప్పటికప్పుడే ఇస్లామ్ స్వీకరించారు.

తరువాత దైవప్రవక్త(స) ఆయనతో, "ఇప్పుడు మీరు మీ గిఫ్ఫార్ తెగవారి వద్దకు వెళ్ళి, ఇక్కడి నా పరిస్థితుల గురించి తెలియపరచండి. నేనిక్కడ ప్రాబల్యం వహించినట్లుగా సమాచారం అందిన మీదటే నా దగ్గరకు రావాలి" అని సూచిం చారు.

అబూజర్ గిఫ్ఫారీ (రజి) ఇలా విన్నవించుకున్నారు: 'ఎవరి చేతిలో నా ప్రాణ ముందో ఆ శక్తిమంతుని సాక్షి! నేను ఆ ఖురైష్ సమూహాన్ని పిలిచి- బాహాటంగా- దేవుని ఏకత్వపు వచనాన్ని పలుకుతాను.'

ఆయన దైవప్రవక్త(స) వద్ద నుండి సరాసరి మస్జిదె హరామ్ ప్రాంగణం లోనికి వచ్చి, 'అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్(స) దైవ సందేశహరులని నేను సాక్ష్యమిస్తున్నాను' అని బిగ్గరగా ప్రకటించారు. ఇది విని అక్కడున్న జనమంతా ఆయన మీద విరుచుకుపడ్డారు. ఎడాపెడా కొట్టారు. దాంతో ఆయన క్రింద పడిపోయారు. అంతలో అబ్బాస్(రజి) వచ్చి, ఆయన మీద- రక్షా కవచంగా- పడి ఖురైషులతో ఇలా అన్నారు: 'మీ వైఖరి కడు శోచనీయం. ఈ వ్యక్తి గిఫ్ఫార్ తెగకు చెందినవాడన్న సంగతి మీకు తెలీదా? సిరియాకు వెళ్ళే మీ వర్తక బృందాలన్నీ వీళ్ళు నివసించే ప్రాంతం మీదుగానే వెళ్ళాలి'. ఆ విధంగా ఆయన ఖురైషుల బారి నుండి అబూజర్‌ని రక్షించారు. కాని ఆయన మరునాడు కూడా మస్జిదె హరామ్ లోనికి వచ్చి, తాను ఇస్లామ్ స్వీకరించినట్లుగా ప్రకటించారు. జనం మరోసారి ఆయనపై విరుచుకుపడి కొట్టసాగారు. ఆ రోజు కూడా అబ్బాస్(రజి) గారే ఆయనపై బోర్లాపడి కాపాడారు.

**178)** అబూ జమ్రా ఇలా అంటున్నారు: 'నేను మీకు అబూజర్(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటనను గురించి వివరించనా?' అని అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) నాతో అన్నారు. దానికి నేను 'తప్పకుండా వినిపించండి' అన్నాను. అప్పుడాయన ఇలా చెప్పారు– అబూజర్ గిఫ్ఫారీ(రజి) నాతో ఇలా అన్నారు : నేను గిఫ్ఫార్ తెగకు చెందినవాణ్ణి. మక్కాలో ఒక వ్యక్తి ప్రభవించాడనీ, ఆయన తనను తాను దైవప్రవక్త అంటున్నాడని మాకు సమాచారం అందింది. నేను నా సోదరుణ్ణి పిలిచి, 'నువ్వు ఒకసారి మక్కా నగరం వెళ్ళి, ఆ వ్యక్తితో మాట్లాడు. తరువాత అతనికి సంబంధించిన స్థితిగతులన్నింటినీ తెలుసుకుని వచ్చి, నాకు చెప్పు' అని పురమాయించాను. నా సోదరుడు ముహమ్మద్(స) వద్దకు వెళ్ళి, ఆయనతో సమావేశమై తిరిగి వచ్చాడు. 'ఏమిటి సంగతి?' అని నేనడిగితే 'దైవసాక్షి! నేను చూసిన ఆ వ్యక్తి మంచి పనులు చేయమని చెబుతున్నాడు. చెడుల నుండి వారిస్తున్నాడు' అని చెప్పాడు. 'నీ మాటలు నాకు పూర్తిగా సంతృప్తి కలిగించలేదన'ని నేనన్నాను. తరువాత నేను స్వయంగా నా చద్దిమూటను, బెత్తాన్ని తీసుకుని మక్కావైపు సాగిపోయాను. అక్కడ ఎవరూ నాకు తెలిసినవారు లేరు. ఆయన(స) గురించి ఎవరినయినా అడగటానికి కూడా భయమేసింది. నేను జమ్‌జమ్ నీరు త్రాగుతూ మస్జిదె హరామ్‌లో బస చేశాను. ఒకసారి అలీ(రజి) నా ముందు నుంచి సాగిపోతూ, 'మీరు ఈ నగరంలో బాటసారి అనుకుంటాను' అన్నారు. దానికి నేను 'అవును' అన్నాను. 'మరి అలాగైతే మా ఇంటికి పదండి' అంటూ ఆయన నన్ను తనతో తీసుకెళ్ళారు. నేను ఆయన వెనకే నడిచాను. కాని ఆయన నన్నేమీ అడగలేదు. నేను కూడా ఏమీ చెప్పలేదు. తెల్లవారగానే నేను మళ్ళీ మస్జిదె హరామ్‌కు వచ్చేశాను– దైవప్రవక్త(స) గురించి ఎవరినయినా అడుగుదామని. కాని ఆయన(స) గురించి మాట్లాడేవారే ఎవరూ లేరు. మరునాడు కూడా అలీ(రజి) నా ముందు నుంచి సాగిపోతూ, 'బహుశా మీరు ఇంకా మీ గమ్యస్థానానికి చేరనట్టుంది' అన్నారు. 'చేరలేదు' అన్నాను. 'అలాగైతే నాతో రండి' అన్నారాయన. నేను ఆయన్ని అనుసరించాను. 'ఈ నగరానికి మీరు ఎందుకొచ్చారు?' అనడిగారు అలీ(రజి). 'మీరు ఎవరికీ చెప్పనంటే, నా రాకలోని ఉద్దేశమేమిటో మీకు వివరిస్తాన'న్నాను. 'అలాగే' అన్నారాయన. అప్పుడు నేను, 'ఇక్కడ ఎవరో ఒక వ్యక్తి ప్రభవించారట! ఆయన తనను దైవ సందేశహరునిగా ప్రకటించుకున్నారట! నేను మొదట నా సోదరుణ్ణి ఆయనతో

మాట్లాడి రమ్మని పంపాను. కాని అతను తిరిగి వచ్చాక చెప్పిన సంగతులు నాకు సంతృప్తినివ్వలేదు. అందువల్ల నేను స్వయంగా ఆయన్ని కలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో వచ్చాను' అని చెప్పాను. దానికి అలీ(రజి), 'మీరు మంచి మార్గం ఎన్ను కున్నారు (అది మిమ్మల్ని నా వరకూ చేర్చింది). నేను కూడా ఆయన దగ్గరకే వెళు తున్నాను. మీరు నా వెనకే నడవండి. నేను ఎక్కడ ఆగిపోతే, మీరూ అక్కడే ఆగిపోండి. ఏ వ్యక్తి వల్లనయినా మీకు ప్రమాదం ఉందని నేను పసిగడితే, నేను ఏదయినా గోడ దగ్గర నిలబడి నా చెప్పులు సరిచేసుకుంటున్నట్లుగా ప్రవర్తిస్తాను. అప్పుడు మీరు నా కోసం నిరీక్షించకుండా ముందుకు సాగిపోవాలి' అని చెప్పారు. పథకం ప్రకారం నడక సాగించాము. నేను ఆయన వెనుకే నడిచాను. చివరకు ఆయన ఒక ఇంట్లోకి వెళ్ళారు. నేను కూడా ఆయన్ని అనుసరిస్తూ దైవప్రవక్త (సఅసం) సన్నిధికి చేరుకున్నాను.

'ఇస్లామ్ మౌలిక సూత్రాలు, అర్కాన్‌ల గురించి నాకు వివరించండి' అని నేను దైవప్రవక్త(స)ను కోరాను. ఆయన(స) నాకు వాటి గురించి చాలా వివరంగా– విడమరిచి– చెప్పారు. అంతే, నేను ముస్లిమ్‌గా ధర్మపరివర్తన చెందాను. పిదప దైవప్రవక్త(స) నాతో, "అబూజర్! ఈ వ్యవహారాన్ని ప్రస్తుతానికి రహస్యంగానే ఉంచు. నీ ఊరికి వెళ్ళిపో. మేము ప్రాబల్యం వహించిన సంగతి నీకు తెలిశాకే మళ్ళీ ఇక్కడకు రా" అని సలహా ఇచ్చారు. దానికి నేను, 'మీకు సత్యం ఇచ్చి పంపినవాని సాక్షిగా! నేను వాళ్ళందరి ఎదుట– బాహాటంగా– ఇస్లామ్ సద్వచనాన్ని ప్రకటిస్తాను' అని చెప్పాను.

తరువాత ఆయన(రజి) మస్జిదె హరామ్‌లోనికి వచ్చారు. ఆ సమయంలో ఖురైషు జనులు కూడా అక్కడ ఉన్నారు.

'ఓ ఖురైషు జనులారా! (బాగా వినండి) అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ దైవదాసుడనీ, దైవ సందేశహరు డని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను' అని ప్రకటించాను.

'ఈ ధర్మభ్రష్టుడి సంగతి చూసుకోండి' అని ఖురైషులు పురమాయించారు. అంతే, వారు నా మీదికి వచ్చారు. నన్ను ఎంతగా కొట్టారంటే, నాకు చావు దాపురిం చిందనిపించింది. అంతలో హజ్రత్ అబ్బాస్ (రజి) వచ్చి, నా మీద పడి, నా శరీరంపై వారి దెబ్బలు పడకుండా చేశారు. ఆయన ఖురైషులనుద్దేశించి, 'మూర్ఖ

**ల్లారా! ఏం చేస్తున్నారు? గిఫ్ఫార్ తెగ మనిషినే చంపుతారా? గిఫ్ఫార్ తెగ వారితో మీ వాణిజ్య సంబంధాలున్నాయి. ఆ తెగ వారి (ప్రాంతం) మీదుగానే మీ వర్తక బిడారాలు పోతుంటాయి' అన్నారు. ఈ మాట అనగానే వారు నన్ను వదలిపెట్టే శారు. మరునాడు ఉదయం నేను మళ్ళీ మస్జిదె హరామ్‌లోనికి వచ్చి, నిన్న ఎలుగెత్తి ప్రకటించినదే ప్రకటించాను. ఖురైషులు కూడా నిన్న చెప్పిన మాటే చెప్పారు– 'ఈ ధర్మభ్రష్టుణ్ణి పట్టుకుని దండించండి'అని. వారు నిన్నటి రోజున నా పట్ల వ్యవహ రించినట్లే ఈ రోజు కూడా వ్యవహరించారు. యాదృచ్ఛికంగా ఈ రోజు కూడా అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వచ్చి నా మీద పడ్డారు. తన శరీరాన్ని నాకు డాలుగా పెట్టారు. నిన్న ఖురైషులను మందలించినట్లే ఈ రోజు కూడా మందలించారు.**

**హజ్రత్ అబూజర్ గిఫారీ(రజి) ఇస్లాం స్వీకారం ఈ విధంగా జరిగింది అని అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) చెప్పారు.**

## అధ్యాయం : 11

## అరబ్బు జాతి అజ్ఞానం గురించి ★

**179) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : మీరు గనక అరబ్బుల అజ్ఞానం గురించి తెలుసుకోదలిస్తే అల్ అన్ఆమ్ సూరాలో 130 ఆయత్‌ల తర్వాత వచ్చే వాక్యాలను చదువుకోండి. (ఉదాహరణకు–ఒక ఆయత్) "అజ్ఞానం వల్ల, మూర్ఖత్వం వల్ల తమ సంతానాన్ని హత్య చేసినవారూ, అల్లాహ్ ఇచ్చిన ఉపాధిని అల్లాహ్‌పై అబద్ధాలు మోపి నిషేధించుకున్న వారూ నిశ్చయంగా నష్టానికి గురయ్యారు. నిశ్చయంగా వారు మార్గం తప్పారు. ఎన్నటికీ రుజుమార్గం పొందేవారు కారు."[1]**

**(8: 140)**

---

★ ఇస్లామ్‌కు పూర్వం అరబ్బులలో అజ్ఞానం పెనుభూతంలా ఆవరించి ఉండేది. అందుకే అరబ్బుల ఆ యుగాన్ని 'అజ్ఞాన యుగం'గా పేర్కొనటం జరిగింది. ఈ అధ్యాయంలో వారిలోని కొన్ని అజ్ఞాన చేష్టలు ప్రస్తావించబడ్డాయి.

179–1 అల్ అన్ఆమ్ సూరాలో అరబ్బుల్లోని అజ్ఞాన కాలపు చెడుగులన్నీ పేర్కొన బడ్డాయి. వారిలోని అతిపెద్ద అపచారం ఏమిటంటే, వారు తమ కన్న కూతుళ్ళను తమ చేతులారా చంపేసేవారు. విగ్రహారాధన, దారిదోపిడీలు వారి దినచర్యగా ఉండేవి. స్త్రీ జాతి వారి చేతిలో ఒక విలాస వస్తువుగా ఉండేది. అల్లాహ్ తన అంతిమ ప్రవక్త(స)ను పంపి, వారిలోని ఈ చెడుగులను అంత మొందించాడు.

## అధ్యాయం : 12

## ఇస్లామ్‌లోగానీ, అజ్ఞానంలోగానీ తన వంశపారంపర్యాన్ని తన తాతముత్తాతల వైపునకు ఆపాదించటం

ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి), హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : ప్రవక్త(స) ఇలా ప్రవచించారు– గౌరవనీయుడు, గౌరవనీయుని కుమారుడు, గౌరవనీయుని మనవడు, గౌరవనీయుని ముని మనవడు– వారంతా దైవప్రవక్తలే. యూసుఫ్(అ) దైవప్రవక్తే. ఈయన యాఖూబ్ (అ)కుమారుడు. ఇస్‌హాఖ్ (అ) మనవడు, ఇబ్రాహీమ్ ఖలీలుల్లాహ్(అ) ముని మనవడు". బరా బిన్ ఆజిబ్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు(స) ఈ విధంగా చెప్పారు: "నేను అబ్దుల్ ముత్తలిబ్ పు(పౌ)త్రుడను"[1]

**180)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం : (అష్ షుఅరా సూరాలోని) ఈ ఆయత్– "నీ దగ్గరి బంధువులను భయపెట్టు" **(26: 214)** అవతరించినప్పుడు– ప్రవక్త మహనీయులు(స) ఖురైషులకు చెందిన వివిధ తెగల వారిని పిలిపించి, "ఓ బనీ ఫిహ్ర్! ఓ బనీ అదీ" అంటూ వారిని సంబోధించారు. వారంతా ఖురైషు కుటుంబీకులే."

ఇబ్నె అబ్బాస్(రజి) గారి వేరొక ఉల్లేఖనం ప్రకారం "నీ దగ్గరి బంధువులను భయపెట్టు"అన్న ఆయత్ అవతరించినప్పుడు, దైవప్రవక్త(స) ఒక్కొక్క తెగవారికి దైవ సందేశం అందజేశారు.

**181)** హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ఉద్బోధించారు: "ఓ అబ్దె మునాఫ్ పుత్రులారా! మీ ప్రాణాలను అల్లాహ్ నుండి కొనుగోలు చేసుకోండి (అంటే సత్కార్యాలు ఆచరించి వాటిని దైవశిక్ష నుండి కాపాడుకోండి). అబ్దె ముత్తలిబ్ కుమారులారా! మీ ప్రాణాలను అల్లాహ్ నుండి కొనుగోలు చేసుకోండి. ఓ జుబైర్ బిన్ అవ్వామ్ మాతా! దైవ సందేశహరుని అత్తా (సఫియ్యా)! ఓ ముహమ్మద్ పుత్రిక ఫాతిమా! మీరిద్దరూ మీ ప్రాణాలను అల్లాహ్ నుండి రక్షించుకోండి. మీ కొరకు నేను దైవ సమక్షంలో ఏ

12–1. దైవప్రవక్త(సఅసం) స్వయంగా తనను తాను అబ్దుల్ ముత్తలిబ్ వంశీయునిగా చెప్పుకున్నారు. అధ్యాయంలోని ముఖ్యాంశం ఇదే.

విధంగానూ ఉపయోగపడలేను. మీరిరువురూ నా సంపదలోనుంచి ఎంత కావాలో అడగండి (ఇస్తాను. కాని దైవసన్నిధిలో మాత్రం ఏమీ చేయలేను)”.

## అధ్యాయం : 13

## ఏదేని ఒక జాతికి చెందిన మేనల్లుడు, స్వేచ్ఛ నొసగబడిన బానిస కూడా ఆ జాతివాడే

**182)** హజ్రత్ అనస్(రజి) కథనం: ఒకసారి ప్రవక్త మహనీయులు (సఅసమ్) అన్సార్ వర్గీయులను ప్రత్యేకంగా పిలువనంపి, “ఏమిటి, మీలో ఎవరయినా మీ తెగతో సంబంధం లేని వ్యక్తి కూడా ఉంటున్నాడా?” అని అడిగారు. ‘కేవలం మా మేనల్లుడు మాత్రమే ఉన్నాడు’ అని వారు సమాధానం ఇచ్చారు. ఆ మాట విని, “మేనల్లుడు కూడా ఆ జాతిలోని వాడే”[1] అన్నారు దైవప్రవక్త(స).

## అధ్యాయం : 14

## అబిసీనియన్ల గురించి... దైవప్రవక్త(స) వారినుద్దేశించి, ‘ఓ బనీ అర్ఫిదా’[1] అని సంబోధించటం

**183)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : అబూబక్ర్ (రజి) ఆమె ఇంటికి వచ్చిన సమయంలో (అన్సార్ వర్గానికి చెందిన) ఇద్దరు అమ్మాయిలు డప్పు వాయిస్తూ పాటలు పాడుతున్నారు. అది హజ్ సీజన్. ‘మినా’ దినాలలో జరిగిన సంఘటన. దైవప్రవక్త(స) ఆ సమయంలో తన ముఖంపై గుడ్డ కప్పుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. హజ్రత్ అబూబక్ర్(రజి) ఆ ఇద్దరు అమ్మాయిలను మందలించగా, దైవప్రవక్త(స) ముఖంపైని గుడ్డను తొలగించి, “అబూబక్ర్! వాళ్ళను ఏమీ అనకండి. ఇది పండుగ దినం” అన్నారు. అవి ‘మినా’లో విడిది చేసే దినాలు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: హబషీలు (నీగ్రో యువకులు) మస్జిద్ ఆవరణలో ఈటెల విన్యాసం చేస్తుండగా నేను ఆ విన్యాసాన్ని చూశాను. ఆ సమయంలో దైవప్రవక్త(స) నన్ను తన చాటున (తన భుజం వెనుక) నిలబెట్టారు. హజ్రత్ ఉమర్(రజి) హబషీలను మందలించారు. అయితే దైవప్రవక్త(స) ఆయన్ని

---

182–1. అన్సార్లకు చెందిన ఆ కుర్రవాడి పేరు నోమాన్ బిన్ ముఖర్రన్. ఇమామ్ అహ్మద్ (రహ్మ) రివాయత్‌లో ఇది చాలా స్పష్టంగా వచ్చింది.

14–1. ‘అర్ఫిదా’ అనేది అబిసీనియన్ల (హబషీల) మూల పురుషుని పేరు.

**వారిస్తూ, "వాళ్ళ జోలికి వెళ్ళకు. బనీ అర్ఫిదా! మీరు నిశ్చింతగా ఆడుకోండి"[1] అన్నారు.**

## అధ్యాయం : 15

## ఏ వ్యక్తి అయినా తన తండ్రీ తాతలను తూలనాడరాదని కోరుకోవటం

**184) హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ఖురైషు ముష్రికులను తూలనాడటానికి తనకు అనుమతి ప్రదానం చేయమని హస్సాన్ బిన్ సాబిత్ దైవప్రవక్త (సఅసం)ను అభ్యర్థించారు. దానికి ఆయన (స),"మరి నేను కూడా వారి కుటుంబీకుణ్ణే కదా!" అన్నారు.**

**'ఫరవాలేదు. నేను (కవితలో) మిమ్మల్ని లాఘవంగా– మీపై ఏమాత్రం మాట రాకుండా– పిండిలోనుంచి వెంట్రుకను తీసినంత అలవోకగా– సాగిపోతాను' అని హస్సాన్(రజి) హామీ ఇచ్చారు.**

**హిష్షామ్ తన తండ్రి నుండి ఉటంకించారు. ఆయన ఇలా అన్నారు : హజ్రత్ ఆయిషా(ర.అ) గారి సమావేశంలో నేను హస్సాన్(రజి)ను ఘాటుగా విమర్శించ సాగాను. అప్పుడు ఆమె అడ్డు తగులుతూ, 'హస్సాన్‌ను విమర్శించకండి. ఆయన గారు దైవప్రవక్త(స) తరపున (అవిశ్వాసులను) ఎదుర్కొనేవారు' అని పలికారు.[1]**

---

183–1. ఈ హబషీలు హబష్ బిన్ కోశ్ బిన్ హామ్ బిన్ నూహ్ సంతతికి చెందినవారు. ఒక దశలో వీళ్ళు యావత్తు అరబ్బులపై ప్రాబల్యం వహించారు. వీరి రాజు కాబా గృహాన్ని కూల్చివేయాలని కూడా సంకల్పించుకున్నాడు.

మస్జిద్ ఆవరణలో ఈ హబషీల విన్యాసం యుద్ధ శిక్షణ (తర్ఫీదు)లో భాగంగా నడిచింది. దీని ఆధారంగా ఎవరయినా 'రక్స్' (నాట్యం, కోలాటం) ధర్మ సమ్మతమేనని భావించటం సరైనది కాదు.

184–1. ఒకానొక దశలో హజ్రత్ హస్సాన్(రజి) పెడదారి పట్టారు. అంటే హజ్రత్ ఆయిషా(ర.అ)పై అపనింద మోపిన వారితో కుమ్మక్కయ్యారు. తరువాత పశ్చాత్తాపపడ్డారు. కాని కొంతమంది సహచరమాన్యులు ఆయన ప్రవర్తనను జ్ఞాపకం ఉంచుకుని, ఆయనను విమర్శించగా, హజ్రత్ ఆయిషా(ర.అ) స్వయంగా కల్పించుకుని హస్సాన్ (రజి)లోని కవితా సామర్థ్యాన్ని శ్లాఘించారు. పూర్వం ఒకప్పుడు దైవప్రవక్త(స) తరఫున హస్సాన్(రజి) మక్కాలోని ముష్రిక్కులను తూలనాడటాన్ని గుర్తు చేశారు. ఇది హజ్రత్ ఆయిషా(ర.అ)లోని మంచితనానికి తార్కాణం.

## అధ్యాయం : 16

## దైవప్రవక్త ముహమ్మద్(స) పేర్ల గురించి

**అల్ ఫత్హ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త. ఆయన వెంట ఉన్నవారు అవిశ్వాసుల పట్ల కఠినులు గానూ, పరస్పరం కరుణామయులు గానూ ఉంటారు. *(48: 29)***

**"నా తరువాత ఒక ప్రవక్త రాబోతున్నాడు. అతని పేరు 'అహ్మద్'[1] అయి ఉంటుంది." *(61: 6)***

**185) జుబైర్ బిన్ ముత్యిమ్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "నాకు అయిదు పేర్లు ఉన్నాయి. నేను 'ముహమ్మద్'ను, 'అహ్మద్'ను, 'మాహీ'ని (అంటే చెరిపేవాణ్ణి). అల్లాహ్ నా ద్వారా కుఫ్ర్ (అవిశ్వాసాన్ని)ను చెరిపివేస్తాడు. నేను 'హాషిర్'ని. (ప్రళయదినాన) నా తర్వాత సమస్త మానవుల పునరుత్థానం జరుగుతుంది. నేను 'ఆఖిబ్'ను. అంటే దైవదౌత్యానికి పరిసమాప్తం. నా తర్వాత మరే ప్రవక్తా ఈ ప్రపంచంలో ప్రభవించడు."**

**186) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : "ఖురైషుల దూషణలను, శాపనార్థాలను అల్లాహ్ దూరం చేసే వైనంపై మీకు ఆశ్చర్యం కలగటం లేదా? వాళ్ళు నన్ను 'ముజమ్మమ్' అంటూ దూషిస్తారు. ఆపైన శాపనార్థం పెడతారు. వాస్తవానికి నేను 'ముహమ్మద్'ను."[1]**

---

16-1. ఇవి మర్యమ్ కుమారుడగు ఈసా(ఏసుక్రీస్తు – అలైహిస్సలాం) పలుకులు. తన తదనంతరం 'అహ్మద్' అనే ప్రవక్త రాబోతున్నారన్న శుభవార్తను ఆయన అందజేశారు.

పైన ప్రస్తావించబడిన రెండు వచనాలలో 'ముహమ్మద్'తోపాటు 'అహ్మద్' అనే పేరు వచ్చింది. ఇదే అధ్యాయంలోని ముఖ్యాంశం.

186-1. అరబ్బు అవిశ్వాసులు శత్రుత్వంలో ఎంతవరకు పోయారంటే ఆయన్ని 'ముహమ్మద్' (ప్రశంసించబడినవాడు) అని అనడానికి బదులు 'ముజమ్మమ్' (ఖండించబడినవాడు) అని అనేవారు. ఆయన(స) ఇలా అన్నారు : నా పేరు 'ముజమ్మమ్' కాదు. ఎవడయితే ఖండించబడ్డాడో వాడిపైనే ఈ దూషణ పడుతుంది.

## అధ్యాయం : 17

## ముహమ్మద్(సఅసమ్) చిట్టచివరి ప్రవక్త కావటం

**187)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : 'నేనూ మరియు ఇతర ప్రవక్తల ఉపమానం ఎలాంటిదంటే, ఒక వ్యక్తి ఇల్లు కట్టాడు. దానిని ఎంతో చక్కగా,అందంగా ముస్తాబు చేశాడు. కాని కేవలం ఒక్క ఇటుక పట్టేంత స్థలం మాత్రం (గోడలో) ఖాళీగా వదిలేశాడు. ఆ ఇంట్లోకి ప్రవేశించిన జనులు ఆ ఖాళీ స్థలాన్ని చూసి ఆశ్చర్యపోతారు. 'అయ్యో! ఈ ఒక్క ఇటుక పట్టేంత ఈ ఖాళీ స్థలం కూడా పూరించబడి ఉంటే ఈ ఇల్లు నిండుగా ఉండేది కదా!' అంటారు" [1] (ఆ ఇటుకను నేనే).

**188)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "నేనూ మరియు నాకు పూర్వం వచ్చిన దైవప్రవక్తలందరి ఉపమానం ఎటువంటిదంటే, ఒక వ్యక్తి ఒక ఇల్లు నిర్మించాడు. అందులో సర్వవిధాలుగా అందము చిందే ఏర్పాట్లు చేశాడు గాని ఆ ఇంట్లో ఒక మూలలో ఒక ఇటుక పట్టేంత స్థలం ఖాళీగా ఉండిపోయింది. ఇప్పుడు ఆ ఇంటికి వచ్చేవారు నలువైపులా తిరిగి చూసి, ఆశ్చర్యంలో మునిగిపోతారు. ఇంత చక్కని ఇల్లు కట్టారు గాని, ఇక్కడ ఒక ఇటుక ఎందుకు అమర్చలేదు? అని చెప్పి పోతారు. ఆ ఇటుకను నేనే. నేను దైవ దౌత్యానికి పరిసమాప్తంగా వచ్చాను."

## అధ్యాయం : 18

## మహనీయ ముహమ్మద్(స) మరణం గురించి

**189)** హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారని ఉర్వా బిన్ జుబైర్ తెలిపారు:

---

హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) ఇలా అన్నారు : దైవప్రవక్త(స)కు మరిన్ని పేర్లు ఉన్నాయి. ఉదాహరణకు : రవూఫ్, రహీమ్, షాహిద్, బషీర్, నజీర్, ముబీన్, దాయి ఇలల్లాహ్, సిరాజ్ మునీర్, రహ్మత్, నీమత్, హాదీ, షహీద్, అమీన్, ముజమ్మిల్, ముద్దస్సిర్, ముతవక్కిల్, ముఖ్తార్, ముస్తఫా, షఫీ, ముష్ఫయా, సాదిఖ్, మస్దూఖ్ మొదలగునవి. మరికొంతమంది ఏమంటారంటే దేవుని 99 నామాల మాదిరిగానే ప్రవక్త(స) పేర్లు కూడా 99 వరకు చేరుకుంటాయి.

187-1. నాకు అందిన దౌవదౌత్యం (ప్రవక్తా పదవి) ఆ లోటును భర్తీ చేసి దైవదౌత్యమనే సౌధానికి పరిపూర్ణతను వొసగింది. ఇక నా తర్వాత ఏ ప్రవక్తా రారు.

“దైవప్రవక్త (సఅసమ్) అరవై మూడు సంవత్సరాల వయసులో పరమపదించారు”– తనతో సయీద్ బిన్ ముసయ్యిబ్ కూడా ఇలాగే చెప్పారని ఇబ్నె షిహాబ్ అన్నారు.

## అధ్యాయం : 19

## దైవప్రవక్త(సఅసం) ‘కునీయత్’ గురించి

**190)** హజ్రత్ అనస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) బజారులో ఉండగా, ఒక వ్యక్తి ‘యా అబల్ ఖాసిమ్’ అని పిలిచాడు. ఆ పిలుపు వినగానే ఆయన(స) వెనక్కి తిరిగి చూశారు. కాని ఆ వ్యక్తి పిలిచింది (ఆయన్ని కాదు) వేరొకరిని అని తెలిసింది. అప్పుడు ఆయన (స) ఆ వ్యక్తి వైపు తిరిగి, “నా పేరు మీద పేరు పెట్టుకోండి. కాని నా ‘కునీయత్’ మీద పెట్టుకోకండి” అని ఉద్బోధించారు.

**191)** హజ్రత్ జాబిర్(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(సఅసమ్) ఇలా ప్రవచించారు : “నా పేరు మీద (ముహమ్మద్ అని) పేరు పెట్టుకోండి. కాని నా కునీయత్ (అబుల్ ఖాసిమ్) మీద పెట్టుకోకండి.”

**192)** అబుల్ ఖాసిమ్(సఅసమ్) ఈ విధంగా ప్రబోధించారని హజ్రత్ అబూహురైరా (రజి)తెలిపారు: “నా పేరు మీద పేరు పెట్టుకోండి. కాని నా కునీయత్ మీద పెట్టుకోకండి.”

## అధ్యాయం : 20

**193)** జుఅయ్‌ద్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఇలా అన్నారు: నేను సాయిబ్ బిన్ యజీద్(రజి)ను తొంభై నాలుగు ఏండ్ల వయసులో చూశాను. అప్పుడాయన ఆరోగ్య వంతులుగా, బలవంతులుగా ఉన్నారు. ఆయన తన ఆరోగ్య రహస్యం గురించి చెబుతూ ఇలా అన్నారు : నేను ఇప్పటికీ నా చెవుల ద్వారా, కళ్ళ ద్వారా లబ్ధి పొందు తున్నానంటే, అది కేవలం దైవప్రవక్త(స) వేడికోలు ఫలమే. నా పినతల్లి ఒకసారి నన్ను ఆయన(స) సన్నిధికి తీసుకువెళ్ళి, ‘దైవప్రవక్తా! ఇతను నా తోబుట్టువు కుమారుడు. ఇతనికి జబ్బు చేసింది. తమరు ఇతని కొరకు దుఆ చేయండి’ అని విన్నవించుకుంది. అప్పుడు ఆయన(స) నా కోసం దుఆ చేశారు.

## అధ్యాయం : 21

## దైవప్రవక్త 'ముద్ర' గురించి.

## (అది ఆయన-స- రెండు భుజాల మధ్యన ఉండేది)

**194)** సాయిబ్ బిన్ యజీద్(రజి) చెప్పగా తాను విన్నానని జుఅయ్‌ద్ బిన్ అబ్దుర్రహ్మాన్ తెలిపారు. సాయిబ్ ఇలా చెప్పారు : నా పినతల్లి నన్ను తీసుకుని దైవ ప్రవక్త(సఅసమ్) సన్నిధిలో హాజరై, 'దైవప్రవక్తా! నా తోబుట్టువు కుమారునికి జబ్బు చేసింది' అని చెప్పింది. అప్పుడాయన నా తలపై తన పవిత్ర హస్తాన్ని నిమిరి, నన్ను ఆశీర్వదించారు. ఆ తరువాత ఆయన వుజూ చేశారు. వుజూ కొరకు ఆయన(స) ఉపయోగించిన నీరును నేను త్రాగాను. తరువాత ఆయన(స) వీపు వైపునకు వెళ్ళి నిలబడ్డాను. ఆ సమయంలో నేను ఆయన రెండు భుజాల మధ్యన ఉన్న 'దైవప్రవక్త ముద్ర'ను చూశాను..

## అధ్యాయం : 22

## దైవప్రవక్త(సఅసం) ఆహార్యం, నీతీ నడవడికల గురించి

**195)** ఉఖ్‌బా బిన్ హారిస్ కథనం : హజ్రత్ అబూబక్ర్(రజి) అస్ర్ నమాజ్ చేసి మస్జిద్‌లోనుండి బయటకు వచ్చినప్పుడు, హజ్రత్ హసన్ తోటి పిల్లలతో ఆడు కుంటూ ఆయన కంటపడ్డారు. హజ్రత్ అబూబక్ర్(రజి) ఆయన్ని తన భుజాలపైకి ఎత్తుకుని, 'నా తండ్రి నీపై సమర్పితం! నీవు అచ్చం దైవప్రవక్త(స)లాగే ఉన్నావు, అలీ పోలికలు రాలేదు' అని పలికారు. ఇది విని హజ్రత్ అలీ(రజి) నవ్వారు.[1]

**196)** అబూ జుహైఫా(రజి) ఇలా అన్నారు : "నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్)ను చూసి ఉన్నాను. హజ్రత్ హసన్(రజి)లో ఆయన(స) పోలికలు పూర్తిగా ఉన్నాయి."

**197)** అబూ జుహైఫా (రజి) చెప్పగా తాను విన్నానని ఇస్మాయీల్ బిన్ అబూ ఖాలిద్ తెలిపారు : ఆయన ఇలా చెప్పేవారు– "నేను దైవప్రవక్త(సఅసమ్)ను

---

195–1. అంటే ఆ మాట విని అలీ (రజి)కి ఎంతో సంతోషం కలిగింది. హజ్రత్ హసన్ (రజి)కి తాతగారైన దైవప్రవక్త(స) పోలికలు ఎక్కువగా వచ్చాయి. ఇది దైవప్రవక్త(స) పరమపదించిన తరువాత జరిగిన సంఘటన. దైవప్రవక్త మనవళ్ళపై అబూబక్ర్(రజి)కు గల వాత్సల్యం ఎటువంటిదో దీనిద్వారా ద్యోతకం అవుతోంది.

చూశాను. అలీ కుమారుడగు హసన్‌కి– ఆయన(స)కు చాలా దగ్గరి పోలికలు ఉండేవి.” ఇస్మాయీల్ బిన్ అబూ ఖాలిద్ ఇంకా ఇలా అన్నారు, “మీరు దైవ ప్రవక్త(స) ఎలా ఉండేవారో వివరిస్తారా?” అని నేను అబూ జుహైఫా (రజి)ను అభ్యర్థించగా, ఆయన ఇలా వివరించారు : “దైవప్రవక్త(స) తెల్లగా ఉండేవారు. కొన్ని వెంట్రుకలు తెల్లబడ్డాయి. మాకు పదమూడు ఒంటెల్ని ఇవ్వమని ఆయన(స) ఆదేశించారు. కాని ఆ ఒంటెల్ని మేము మా స్వాధీనంలోనికి తీసుకోక ముందే ఆయన పరమపదించారు”.

**198)** అబూ జుహైఫా సువాయీ(రజి) వివరించారు : “నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం)ను చూశాను. ఆయన(స) క్రింది పెదవి క్రింద ఉన్న గడ్డం వెంట్రుకలు తెల్లగా ఉండేవి.”

**199)** హరీజ్ బిన్ ఉస్మాన్ గారు ప్రవక్త సహచరమాన్యులైన అబ్దుల్లాహ్ బిన్ బుస్ర్(రజి)ను, ‘ప్రవక్త మహనీయులు (సఅసమ్) ముసలి వారైపోయారా?’ అని అడిగితే, “ఆయన(స) గడ్డంలోని కొన్ని వెంట్రుకలు తెల్లబడ్డాయ”ని ఆయన చెప్పారు.

**200)** అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా, తాను విన్నానని రబీయ బిన్ అబీ అబ్దుర్రహ్మాన్ తెలిపారు : ఆయన గారు దైవప్రవక్త(సఅసం) బాహ్య లక్షణాలను వివరిస్తూ ఇలా అన్నారు– దైవప్రవక్త(స) మరీ అంత పొడుగరీ కారు, పొట్టివారు కూడా కారు. మధ్యస్థ ఎత్తు. తెలుపు ఎరుపు కలగలసిన రంగు ఆయనది. కేవలం తెలుపు రంగూ కాదు, కేవలం గోధుమ వర్ణం కూడా కాదు. ఆయన(స) వెంట్రుకలు వంకీలు తిరిగి కరకుగా ఉండేవి కావు. అలా అని మరీ సుతారంగా వ్రేలాడుతూ ఉండేవి కావు. దైవవాణి (మొదటిసారి) అవతరించినప్పుడు ఆయనకు నలభయ్యేళ్ళు. మక్కాలో ఆయన (స) పదేళ్ళ[1] వరకు ఉన్నారు. ఈ పూర్తి వ్యవధిలో ఆయన(స)పై వహీ (దైవవాణి) అవతరిస్తూ ఉండేది. మదీనాలో కూడా ఆయన(స) పదేళ్ళ వరకూ గడిపారు. ఆయన(స) తలలో, గడ్డంలో ఇరవై వెంట్రుకలు కూడా తెల్లబడలేదు. (హదీసు ఉల్లేఖకులు) రబీయ ఇలా అన్నారు : నేను ఆయన(స) గారి ఒక వెంట్రుకను చూశాను. అది ఎర్రగా ఉండేది. దాని గురించి నేను దర్యాప్తు చేయగా సువాసన (ఖజాబ్) పూస్తూ ఉండటం వల్ల అది ఎర్రగా అయిందని తెలియజేయటం జరిగింది.

**201) అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని రబీయ బిన్ అబీ అబ్దుర్రహ్మాన్ వివరించారు– ఆయన(అనస్) ఇలా అన్నారు : "దైవప్రవక్త(సఅసం) మరీ అంత పొడుగరీ కారు, మరీ అంత పొట్టివారు కూడా కారు. మరీ తెల్లవారూ కారు, మరీ గోధుమ వర్ణంలో కూడా ఉండేవారు కారు. ఆయన(స) వెంట్రుకలు వంకీలు తిరిగి కరకుగా ఉండేవి కావు. అలా అని మరీ నాజూకుగా వ్రేలాడుతూ ఉండేవి కూడా కావు. అల్లాహ్ ఆయనకు నలభై ఏళ్ళ వయసులో ప్రవక్తా పదవిని ప్రసాదించాడు. ఆయన (ప్రవక్తగా) మక్కాలో పదేళ్ళు గడిపారు, మదీనాలో కూడా పదేళ్ళ వరకూ గడిపారు. అల్లాహ్ ఆయన(స)కు మరణం వొసగినప్పుడు ఆయన తలలో, గడ్డంలో ఇరవై వెంట్రుకలు కూడా తెల్లబడలేదు."**

**202) బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్హాఖ్ తెలిపారు– ఆయన(బరా) ఇలా చెప్పారు : "ప్రవక్త మహనీయులు(సఅసమ్) అందచందాలలో అందరినీ మించినవారు. నీతీ నడవడికలలో కూడా అందరికన్నా శ్రేష్ఠులు. ఆయన(స) మరీ అంత పొడుగరీ కారు, మరీ అంత పొట్టివారు కూడా కారు."**

**203) ఖతాదా ఇలా అన్నారు : దైవప్రవక్త(సఅసమ్) ఎప్పుడయినా ఖజాబ్ (తలకు, గడ్డానికి రంగు) వాడారా? అని నేను అనస్(రజి) ను అడిగితే, "ఆయన (స) ఎన్నడూ 'ఖజాబ్'ను ఉపయోగించలేదు. కేవలం ఆయన(స) రెండు కణతలపైన (తలలో) కొన్ని వెంట్రుకలు మాత్రమే తెల్లగా ఉండేవి" అని ఆయన చెప్పారు.[1]**

---

200–1. దైవప్రవక్త(స)పై మొట్టమొదటిసారి 'వహీ' అవతరించిన తరువాత దాదాపు మూడేళ్ళ వరకూ ఆయన(స)పై వహీ అవతరణా పరంపర నిలిచిపోయింది. బహుశా ఉల్లేఖకులు ఈ మూడేళ్ళ కాలాన్ని తీసేసి లెక్కించి ఉంటారు. నిజానికి దైవదౌత్యం మొదలైన నాటి నుండీ ఆయన మక్కాలో 13 సంవత్సరాలు గడిపారు.

203–1. అయితే హాకిమ్, అస్హాబె సునన్ వెలికి తీసిన అబూ రిమ్సా ఉల్లేఖనంలో దైవప్రవక్త(స) వెంట్రుకలకు 'ఖజాబ్' ఉండేది అని ఉంది. ఆయన(స) కుంకుమ పువ్వు రంగులో ఉన్న 'ఖజాబ్'ను ఉపయోగించేవారని ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనంలో ఉంది. బహుశా ఆయన(స) సువాసన కొరకు గోరింటాకు తైలం,

**204)** బరా బిన్ ఆజిబ్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఎత్తు మధ్యస్థంగా ఉండేది. ఆయన ఛాతీ బహు విశాలమైనది. ఆయన తల వెంట్రుకలు చెవుల వరకూ వ్రేలాడుతూ ఉండేవి. నేనొకసారి దైవప్రవక్త(స)ను ఎరుపు రంగు దుస్తులు ధరించి ఉండగా చూశాను. నేను ఆయన్ని మించిన సుందర స్వరూపుణ్ణి చూడలేదు. యూసుఫ్ బిన్ అబీ ఇస్‌హాఖ్ తన తండ్రి నుండి ఈ హదీసును ఉల్లేఖించారు. అందులో 'ఆయన(స) తలవెంట్రుకలు భుజాల వరకూ వ్రేలాడుతూ ఉండేవి.'[1] అని ఉంది.

**205)** అబూ ఇస్‌హాఖ్ కథనం: "ఏమిటి, దైవప్రవక్త(సఅసం) ముఖారవిందం ఖడ్గం మాదిరిగా (కోల ముఖంలా) ఉండేదా?' అని ఎవరో బరా బిన్ ఆజిబ్(రజి)ని అడిగితే, "లేదు. ఆయన(స) ముఖారవిందం చంద్రునిలా (గుండ్రంగా, ఎంతో అందంగా) ఉండేది"[1] అని ఆయన చెప్పారు.

**206)** అబూ జుహైఫా (రజి) చెప్పగా తాను విన్నానని హకమ్ తెలిపారు: దైవప్రవక్త (సఅసమ్) మధ్యాహ్న సమయంలో ప్రయాణం చేసే ఉద్దేశ్యంతో బయలు దేరారు. 'బత్‌హా' అనే స్థలానికి చేరుకుని ఆయన(స) వుజూ చేశారు. జుహ్ర్ నమాజ్‌ను రెండు రకాతులు (ఖసర్‌గా) చేసుకున్నారు. అనంతరం రెండు రకతుల అస్ర్ నమాజ్ కూడా ఆచరించారు. నమాజ్ చేస్తున్నప్పుడు ఆయన ముందు ఒక

---

జాఫ్రాన్ పూసుకుని ఉండవచ్చు. దానినే వీళ్ళు 'ఖజాబ్' (తలకు రంగు)గా భావించి ఉండవచ్చు.

204–1. కొన్ని ఉల్లేఖనాలలో ఆయన(స) తల వెంట్రుకలు చెవుల వరకు ఉండేవి అనీ, మరికొన్ని ఉల్లేఖనాలలో భుజాల వరకు వ్రేలాడుతూ ఉండేవి అనీ ఉంది. ఇంకా కొన్ని ఉల్లేఖనాలలో ఆ రెంటికి మధ్యన ఉండేవి అని కూడా ఉంది. బహుశా ఆయన(స) తలకు నూనె రాసి, తల దువ్వుకున్నప్పుడు భుజాల వరకు వచ్చేవేమో!

205–1. గుండ్రం అంటే బంతిలాగా అని అర్థం కాదు. ముఖ స్వరూపం హుందాగా, చూడచక్కగా ఉండేదని అర్థం. అరేబియాలో ఇది 'సౌందర్యం'లో భాగం. దానికితోడు ఆయన చెంప కెంపులు ఉబ్బి ఉండేవి కావు. ఆయన గడ్డం గుబురుగా ఉండేది. గడ్డం నల్లగా ఉండేది. కళ్ళల్లో కొంచెం ఎర్రని జీర ఉండేది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన మూర్తీభవించిన సౌందర్యం.

**చిన్న ఈటె– సుత్రాగా– పాతిపెట్టడం జరిగింది. జౌన్ గారు తన తండ్రి నుండి ఉటంకించిన దానిలో అదనంగా ఇలా ఉంది : ఆ ఈటె అవతలి నుంచి జనులు రాకపోకలు సాగిస్తూ ఉన్నారు. తరువాత సహచరమాన్యులు ఆయన(స) వద్ద గుమి గూడారు. శుభవంతమయిన ఆయన(స) చేతులను తమ తమ ముఖాలపై ఉంచి తడుముకోసాగారు. అబూ జుహైఫా (రజి) ఇలా అన్నారు: నేను కూడా ఆయన(స) చేతిని నా ముఖానికి అద్దుకున్నాను. ఆ సమయంలో అది మంచుకన్నా చల్లగా, కస్తూరి (ముష్క్) కన్నా ఎక్కువగా సువాసన కలదిగా ఉంది."[1]**

**207) అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం : "ప్రవక్త మహనీయులు (సఅసమ్) అందరికన్నా ఎక్కువ ఔదార్యం కలవారు. రమజాన్ నెలలో జిబ్రయీల్(అలైహిస్సలామ్) ఆయన్ని కలుసుకున్నప్పుడు, ఆయన ఔదార్యం, దాతృత్వం మరింత అధికమైపోయేది. జిబ్రయీల్(అ) రమజాన్ నెలలోని ప్రతి రేయీ ఆయన్ని కలుసుకోవడానికి విచ్చేసేవారు. ఆయన(స)తో కలసి ఖుర్ఆన్ పారాయణం చేసేవారు. అప్పుడు దైవప్రవక్త(స) మేలు (చేసే) విషయంలో ఝుంఝూమారుతం కన్నా ఉధృతమైన ఉదార స్వభావి అయిపోయేవారు."**

**208) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ఒకసారి ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఆనందాతిశయంతో ఉవ్విళ్ళూరుతూ తన కుటీరంలో ప్రవేశించారు. సంతోషం వల్ల ఆయన(స)నుదుటిపైని చారలు మెరిసిపోతున్నాయి. తరువాత ఆయన(స) ఇలా అన్నారు : "ఆయిషా! ముద్లిజీ (అనే వ్యక్తి) జైద్–**

---

206–1. ఆయన(స) ఒక బక్కెట్టు నీళ్ళలో పుక్కిలించి ఆ నీటిని బావిలో వేయగా, ఆ బావి నీరులో కస్తూరి (ముష్క్) లాంటి సువాసన రాసాగిందని ఒక ఉల్లేఖనంలో ఉంది. ఉమ్మె సులైమ్(ర.అ) ఆయన (స) చెమటను సమీకరించి అత్తరులో కలిపితే, ఇతర సువాసనలకన్నా ఎక్కువగా అది పరిమళించింది. అబూ యాలా, బజ్జార్ ప్రభృతులు ప్రామాణికంగా వెలికితీసిన ఒక ఉల్లేఖనం ప్రకారం; ఆయన(స) మదీనా వీధిలో నడిచి వెళుతున్నప్పుడు ఆ పరిసరాలన్నీ సుగంధంతో గుబాళించేవి, ఒక పేద స్త్రీ దగ్గర సుగంధం లేదు. ఆయన(స) ఒక సీసాలో తన శరీరంపైని కాస్తంత చెమటను నింపి ఇచ్చారు. దాని నుండి మదీనా వాసులంతా కస్తూరి వంటి సువాసనను ఆస్వాదించారు. (అబూ యాలా, తిబ్రానీ)

**ఉసామాల (కేవలం) పాదాలు చూసి ఏమన్నాడో తెలుసా?? ఒకరి పాదం మరొకరి పాదంతో కలుస్తూ ఉన్నాయని అన్నాడు."[1]**

**209) కాబ్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ కాబ్ తెలిపారు : ఆయన (కాబ్ బిన్ మాలిక్) తబూక్ యుద్ధంలో, తాను వెనుక ఉండిపోయిన సంఘటనను వివరిస్తూ ఇలా అన్నారు : తరువాత నేను (నా పశ్చాత్తాపం స్వీకరించబడిన తరువాత) దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై సలామ్ చేశాను. ఆ క్షణంలో ఆయన(స) ముఖారవిందం సంతోషంతో ప్రకాశిస్తూ ఉంది. దైవప్రవక్త(స) ఎప్పుడు, ఏ విషయంపై సంతోషించినా ఆయన ముఖారవిందం మెరిసిపోతూ ఉండేది. అది (పున్నమి) చంద్రునిలా కనిపించేది. అది గమనించిన మేము, ఆయన(స) సంతోషంగా ఉన్నారని అర్థం చేసుకునేవారం.**

**210) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు: "నేను (హజ్రత్ ఆదమ్– అలైహిస్స లామ్ మొదలుకుని ఇప్పటివరకు) మనుషులలోని ఉత్తమ కాలాల (తరాల) నుండి వచ్చాను (అంటే ఉత్తమ వంశీయుల నుండి వచ్చాను). కడకు నేను పుట్టిన కాలం (తరం) వచ్చింది."[1]**

---

208–1. ఇంతకీ జరిగిందేమిటంటే ఉసామా బిన్ జైద్(రజి) నల్లగా ఉండేవారు. కాగా; ఆయన తండ్రి జైద్ బిన్ హారిసా(రజి) ఎర్రగా ఉండేవారు. బహుశా ఉసామా జైద్ కుమారుడు కారేమోనన్న శంక కొంతమంది కపటులకు కలిగింది. దాని గురించి వారు గుసగుసలాడేవారు. ఒకసారి తండ్రీ కొడుకులు– ఇరువురూ ఒకే దుప్పట్లో పడుకుని ఉన్నారు. వారి ముఖాలు కనిపించటంలేదు గాని ఇరువురి పాదాలు మాత్రం కనిపిస్తున్నాయి. ముద్లిజీ సాముద్రిక విద్యలో ప్రవీణుడు. అతను ఆ పాదాలను చూసి వారు రక్త సంబంధీకులని చెప్పాడు. ఆ మాట విన్నప్పుడు దైవప్రవక్త(స)కు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. సంతోషం కొద్దీ ఆయన(స) నుదుటి చారలు సయితం ప్రకాశమానం అయ్యాయి. ఇది దైవప్రవక్త(స) ఉత్తమ నైతికతకు ఒక మచ్చుతునక.

210–1. అంటే ఆదమ్(అలైహిస్సలామ్) తరువాత– ముహమ్మద్(స) ప్రవక్తకు చెందిన వంశాలన్నీ ఆదమ్ సంతతిలోని మంచి వంశాలే. ఆయన(స) పితామహుడు ఇబ్రాహీమ్(అ) దైవప్రవక్త. అరబ్బుల మూల పురుషుడుగా పేర్కొనబడే ఇస్మాయిల్ (అ) ఆయన వంశీయుడే. ఆ తరువాత అరేబియాలో గడిచిన

**211) అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం : దైవప్రవక్త(సఅసమ్) తల ముందటి వెంట్రుకలను నుదుటిపై పడి ఉండనిచ్చేవారు. కాగా, బహుదైవారాధకుల అలవాటు ఏమిటంటే, వారు తల ముందటి వెంట్రుకలను– పాపిడి తీసి– రెండు భాగాలుగా చేసేవారు. గ్రంథవహులు (యూదులు, క్రైస్తవులు) తల ముందటి వెంట్రుకలను నుదుటిపై పడి ఉండేలా వదిలేవారు. దైవాదేశం తనకు అందేవరకు దైవప్రవక్త(స) ఇలాంటి విషయాలలో గ్రంథవహుల పద్ధతులను ఇష్టపడేవారు. (దైవాదేశం అవతరించిన తరువాత) ఆయన (స) తలను దువ్వటం మొదలెట్టారు."[1]**

**212) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) దుర్భాషి కారు. దూషణలకు దిగేవారు కారు. "మీలో ఎవరి గుణగణాలు మంచివో అతడే అందరికన్నా ఉత్తముడు" అని ఆయన(స) చెప్పేవారు (అంటే హుందాగా వ్యవహరించేవారు, నగుమోముతో పలకరించేవారు అన్న మాట).**

**213) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్)కు రెండు విషయాలలో ఏదైనా ఒక దానిని ఎంపిక చేసుకునే అవకాశం ఇచ్చినప్పుడు, ఆయన (స) సులువైన దానినే ఎంపిక చేసుకునేవారు. కాకపోతే ఆ విధానం పాపభూయిష్ట విధానం కాకుండా ఉండేలా జాగ్రత్త పడేవారు. ఒకవేళ ఆ విధానంలో ఏ కాస్త పాపం ఉందనిపించినా ఆయన(స) దానికి అందరికన్నా దూరం జరిగేవారు. దైవప్రవక్త(స) వ్యక్తిగతంగా ఎవరిపైనా ప్రతీకారం తీర్చుకోలేదు. కాని దేవుడు విధించిన నిషేధాజ్ఞల్ని గనక ఎవరయినా ఉల్లంఘిస్తే మాత్రం అప్పుడు అతనిపై ప్రతీకారం చేసేవారు (శిక్ష విధించేవారు.)[1]**

---

వంశాలలో దైవప్రవక్త(స)కు సంబంధించిన వంశాలన్నీ మర్యాద కల వంశాలుగా భావించబడేవి. అరబీ మూలంలో **'ఖర్న్'** అనే పదం వచ్చింది. ఒక ఖర్న్ 40 ఏండ్ల నుండి 120 ఏళ్ల వరకు ఉంటుంది.

211–1. అంటే తల ముందుటి వెంట్రుకలను నుదుటిపై పడి ఉండనివ్వకుండా దువ్వటం మొదలెట్టారు. అంటే ఆయనకు బహుశా ఆ మేరకు దైవాజ్ఞ అయి ఉంటుంది.

213–1. అబ్దుల్లాహ్ బిన్ ఖతల్‌కు గానీ, ఉఖబా బిన్ ముఅయ్‌త్‌కుగానీ, అబూ రాఫె యహూదీకి గానీ, కాబ్ బిన్ అష్రఫ్‌కు గానీ ఆయన మరణ దండన విధించారంటే తన వ్యక్తిగత కక్షతో కాదు. వారు దైవధర్మంలో అవరోధాలు సృష్టించారు. ప్రజలను పెడత్రోవ పట్టించారు. సమాజంలో శాంతిభద్రతల స్థాపన కొరకు ఈ విధ్వంసకారులను హతమార్చవలసి వచ్చింది.

**214)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా అన్నారు : "దైవప్రవక్త (సఅసమ్) అరచేతికన్నా సుతిమెత్తని పట్టువస్త్రాన్ని నా చేతులు ఎన్నడూ ముట్టుకో లేదు. అలాగే నేను దైవప్రవక్త(స) సువాసన కన్నా మంచి సువాసనను, ఆయన చెమటకన్నా మేలైన, పరిశుభ్రమైన సువాసనను ఆఘ్రాణించలేదు."

**215)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) వివరించారు: "ప్రవక్త మహ నీయులు (సఅసమ్) పరదాలో ఉండే కన్నెపిల్లకన్నా ఎక్కువ సిగ్గరిగా ఉండేవారు."

**216)** యహ్యా బిన్ సయీద్ ఖత్తాన్, ఇబ్నె మెహ్దీలిద్దరూ వివరించారు: షూబా తమతో ఇలాగే చెప్పారని కూడా అన్నారు– "దైవప్రవక్త(సఅసమ్) ఏదయినా విషయాన్ని చెడుగా భావించినప్పుడు, ఆయన(స) ముఖారవిందంపై దాని ప్రభావం వ్యక్తమయ్యేది."

**217)** హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: మహాప్రవక్త(సఅసమ్) ఎన్నడూ ఏ భోజనంలో కూడా లోపాన్ని ఎత్తి చూపలేదు. ఒకవేళ అది తనకు ఇష్టమైనదై ఉంటే తినేవారు. లేకపోతే వదలిపెట్టేసేవారు."

**218)** అబ్దుల్లాహ్ బిన్ మాలిక్ బిన్ బుహైనా అసదీ (రజి) తెలిపారు: దైవ ప్రవక్త(సఅసమ్) సజ్దా చేసినప్పుడు, తన రెండు చేతుల్ని పొట్ట నుండి వేరుగా ఉంచేవారు. కడకు (ఆ స్థితిలో) ఆయన(స) చంకలను మేము చూడగలిగేవారము." (వేరొక ఉల్లేఖనం ప్రకారం) ఆయన(స) గారి చంకల తెలుపుదనం కనిపించేది.

**219)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం: "ప్రవక్త మహనీయులు (సఅసమ్) దుఆయె ఇస్తిస్ఖా (వర్షం కొరకు చేసే వేడుకోలు) తప్ప మరే దుఆలోనూ తన చేతుల్ని అంత పైకి లేపేవారు కారు. ఈ దుఆలో ఆయన(స) తన చేతుల్ని ఎంత పైకి లేపారంటే, ఆయన చంకలలోని తెల్లదనం కానరాసాగింది"– హజ్రత్ అబూ మూసా ఇలా అన్నారు: "ఒకసారి దైవప్రవక్త(స) దుఆ చేస్తూ తన చేతుల్ని ఎత్తారు. నేను ఆయన(స) రెండు చంకల తెల్లదనాన్ని చూశాను."

**220)** ఔన్ బిన్ అబీ జుహైఫాగారు తన తండ్రి (అబూ జుహైఫా– రజి) నుండి ఉటంకించేవారు : నేను (అబూ జుహైఫా) ప్రయాణం చేసే ఉద్దేశ్యంతో దైవ ప్రవక్త(సఅసం) సన్నిధిలో హాజరయ్యాను. అప్పుడు ఆయన(స) అబ్తహ్ (ముహ స్సబ్)లో తన గుడారం లోపల ఉన్నారు. మిట్ట మధ్యాహ్న సమయం. అంతలో బిలాల్(రజి) బయటకు వచ్చి నమాజ్ కొరకు అజాన్ ఇచ్చి, లోపలికి వెళ్ళిపోయారు. దైవప్రవక్త(స) వుజూ కొరకు ఉపయోగించగా మిగిలిన నీరును హజ్రత్ బిలాల్(రజి)

**బయటకు తీయగా, జనులు దానికోసం ఎగబడ్డారు. తరువాత బిలాల్(రజి) ఒక ఈటెను తీసుకున్నారు. దైవప్రవక్త(స) బయటకు ఏతెంచారు. ఆ సమయంలోని ఆయన(స) పిక్కల మెరుపు కూడా నా కళ్ళముందరే ఉంది. బిలాల్ (సుత్రాగా) ఈటెను పాతిపెట్టారు. ఆయన(స) జుహ్ర్, అస్ర్ నమాజులు రెండేసి రకతుల చొప్పున ఖసర్ చేశారు. ఆ సమయంలో గాడిదలు, స్త్రీలు ఆయన ముందు నుండి (సుత్రా అవతలి నుంచి) సాగిపోతూ ఉన్నాయి.[1]**

**221) హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : "దైవప్రవక్త(సఅసమ్) ఎంత నింపాదిగా, స్థిరంగా మాట్లాడేవారంటే, ఎవరయినా (ఆయన పలికే పదాలను) లెక్కపెట్టుకోదలిస్తే లెక్క పెట్టుకోగలిగేవాడు".... వేరొక ఉల్లేఖనంలో హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : "ఏమిటి, ఫలానా వ్యక్తి (అబూ హురైరా– రజి)పై మీకు ఆశ్చర్యం కలగటం లేదా? ఆయన వచ్చి, నా కుటీరం వెలుపల ఒక మూలన కూర్చొని, దైవప్రవక్త(సఅసం) హదీసులను నాకు వినిపించే ఉద్దేశ్యంతో ప్రసంగించ సాగారు. ఆ సమయంలో నేను నమాజ్‌లో నిమగ్నమై ఉన్నాను. మరాయనేమో, నేను నమాజ్ ముగించక ముందే లేచి వెళ్ళిపోయారు. ఆయన గనక ఉండి ఉంటే, ఆయన్ని విచారించి ఉండే దానిని– మీలాగా దైవప్రవక్త(స) ఇలా వేగంగా మాట్లాడే వారు కారని చెప్పి ఉండే దానిని."[1]**

## అధ్యాయం : 23

## దైవప్రవక్త(స) కళ్ళు బాహ్యంలో నిద్రించేవి. కాని హృదయం మాత్రం ఏమరుపాటుకు గురయ్యేది కాదు

**దీనిని సయీద్ బిన్ మీనా గారు జాబిర్(రజి) నుండి ఉటంకించారు. జాబిర్ (రజి) గారు దైవప్రవక్త(స) నుండి ఉల్లేఖించారు.**

---

220–1. దైవప్రవక్త(స) నమాజ్ చేస్తున్నప్పుడు, ఆయన ముందు ఈటెను 'సుత్రా'గా పాతటం జరిగింది. అధ్యాయంలోని ప్రధానాంశం ఇదే. ఆయన(స) కాళ్ళ పిక్కలు ఎంతో అందంగా, ప్రకాశవంతంగా ఉండేవి.

221–1. ఎదుటి వ్యక్తికి విషయాన్ని చెప్పదలచినప్పుడు వేగంగా మాట్లాడ కూడదన్నది అమ్మ ఆయిషా(ర.అ) ఉద్దేశం. ఆమె గారు ఈ సందర్భంగా దైవప్రవక్త(స) సంభాషణా తీరును ఉదహరించారు. ఆయన(స) ఎంత నిలకడగా– ఆగి ఆగి– మాట్లాడేవారంటే, ఆయన ఉపయోగించే పదాలను ఎవరయినా లెక్కించుకో దలిస్తే సులభంగా లెక్కించుకోగలిగేవారు.

**222)** అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ కథనం: ఈయన హజ్రత్ ఆయిషా (ర.అ)ను, '(అమ్మా!) రమజాన్ మాసంలో దైవప్రవక్త(సఅసం) ఆచరించే తరావీహ్ లేదా తహజ్జుద్ నమాజ్ వైనం ఎటువంటిది?' అని అడిగినప్పుడు, ఆమె ఇలా వివరించారు: "రమజాన్ నెలలో అయినా, మరే ఇతర నెలలోనయినా దైవప్రవక్త(స) పదకొండు రకతుల కన్నా ఎక్కువగా చేసేవారు కారు (వాటిని తహజ్జుద్ అంటారో, తరావీహ్ అంటారో మీ ఇష్టం). మొదట ఆయన(స) నాలుగు రకతుల నమాజ్ ఆచరించేవారు. ఆ రకతులు ఎంత సుదీర్ఘంగా, మరెంత చక్కగా ఉండేవంటే, వాటి చక్కదనాన్ని గురించి ఇక అడగకండి. ఆ తరువాత మరో నాలుగు రకతులు చేసేవారు. ఆ నాలుగు రకతులు కూడా ఎంత సుదీర్ఘంగా, సుందరంగా ఉండేవంటే, వాటి సౌందర్యం గురించి ఏమని చెప్పేది? ఆ తరువాత ఆయన(స) మూడు రకతుల విత్ర్ నమాజ్ ఆచరించేవారు. 'దైవప్రవక్తా! మీరు విత్ర్ నమాజ్ చేయక ముందు ఎందుకు నిద్రపోతారు?' అని నేనడిగితే, 'నా కళ్ళు నిద్రిస్తాయి. కాని నా హృదయం మేల్కొనే ఉంటుంది' అని ఆయన(స) అన్నారు".

**223)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా అబ్దుల్లాహ్ బిన్ అబీ నమిర్ విన్నారు: మస్జిదె హరామ్ నుండి అంతిమ దైవప్రవక్త(సఅసం)ను మేరాజ్‌కు గొనిపోబడిన సంఘటనను ఆయన వివరించారు. (మేరాజ్‌కు పూర్వం) ముగ్గురు దైవదూతలు వచ్చారు. దైవప్రవక్తశ్రీ((స)పై దైవవాణి అవతరించక పూర్వం జరిగిన సంఘటన ఇది– ఆ సమయంలో ఆయన మస్జిదె హరామ్‌లో ఇద్దరు వ్యక్తుల మధ్యన (హజ్రత్ హమ్జా, హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్‌ల మధ్యన) నిద్రిస్తూ ఉన్నారు. '(తీసుకుపోవాలని ఆజ్ఞాపించబడిన) ఆ వ్యక్తి ఎవరు?' అని ఒక దైవదూత అడగ్గా, 'మధ్యలో పడుకున్నవారు, ఆయనే అందరికంటే ఉత్తములు' అని రెండవ అతను చెప్పాడు. 'అలాగైతే అందరికన్నా ఉత్తములైన వారిని వెంటబెట్టుకుని పోదాం పదండి' అని మూడవ అతను చెప్పాడు. ఆ రోజు రాత్రి జరిగింది ఇంతే. ఆయన (స) వారిని చూడలేదు. కాని దైవదూతలు మరోసారి రాత్రి పూట వచ్చారు. ఆయన (స) మనో నేత్రంతో చూడగలిగేవారు. అయితే ఆయన(స) కళ్ళు మాత్రం నిద్రిస్తూ

**ఉండేవి. మనోనేత్రం నిద్రించేది కాదు– ఆ మాటకొస్తే దైవప్రవక్తలందరి పరిస్థితి ఇంతే. వారి కళ్ళు నిద్రిస్తుండగా, వారి హృదయాలు మాత్రం మేల్కొనే ఉంటాయి– చివరకు దైవదూత జిబ్రయీల్(అ) ఆయన్ని తన వెంటబెట్టుకుని గగనయాత్రకు వెళ్ళారు.**[1]

## అధ్యాయం : 25

## మహాప్రవక్త(స) అద్భుతాల గురించి

**224) హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) కథనం : ఈయన ఒక ప్రయాణంలో దైవప్రవక్త(సఅసమ్) వెంట ఉన్నారు. రాత్రంతా జనులు నడుస్తూనే ఉన్నారు. మరి కాస్సేపట్లో తెల్లవారుతుందనగా దైవప్రవక్త(స) ఒకచోట విడిది చేశారు. (మేము అప్పటికే బాగా అలసిపోయి ఉన్నాము. అందువల్ల) అందరూ గాఢనిద్రలోకి జారుకున్నారు. సూర్యోదయం అయ్యేవరకూ ఎవరికీ మెలకువ రాలేదు. ఎట్టకేలకు అందరికంటే ముందు హజ్రత్ అబూబక్ర్(రజి) మేల్కొన్నారు. అయితే దైవప్రవక్త(స) నిద్రిస్తుండగా ఆయన్ని అబూబక్ర్(రజి) లేపేవారు కారు. మరి అంతలోనే హజ్రత్ ఉమర్(రజి) కూడా మేల్కొన్నారు. చివరకు అబూబక్ర్(రజి) దైవప్రవక్త(స) తలవైపు దగ్గరగా కూర్చుని, బిగ్గరగా 'అల్లాహు అక్బర్' అని పలికారు. ఆ శబ్దానికి దైవ ప్రవక్త(స)కు కూడా మెలకువ వచ్చేసింది. "తక్షణం ఇక్కడి నుండి అందరూ బయలుదేరండి" అని ఆయన(స) ఆజ్ఞాపించారు. (కొంతదూరం వెళ్ళాక) ఆయన వాహనం మీది నుండి దిగి, మా అందరికీ నమాజ్ చేయించారు. కాని ఒక వ్యక్తి మాత్రం మాకు కొంత దూరాన– ఒక మూలన– కూర్చుని ఉన్నాడు. అతను మాతో కలసి నమాజ్ చేయలేదు. నమాజ్‌ను ముగించిన మీదట, దైవప్రవక్త(స) ఆ వ్యక్తినుద్దే శించి, "ఓయీ ఫలానా వ్యక్తీ! మాతో కలసి నమాజ్ చేయకుండా నీకు**

---

223–1. ఆ తరువాత మేరాజ్ యాత్ర సందర్భంగా జరిగినదంతా 'మేరాజ్ హదీసు'లో ప్రస్తావనకు వస్తుంది. ఈ ఉల్లేఖనం ఆధారంగా కొంతమంది, దైవప్రవక్త(స) నిద్రావస్థలో ఉండగా గగనయాత్ర జరిగిందని వాదిస్తారు. కాని ఈ ఉల్లేఖనం అరుదైనది. కేవలం షరీక్ మాత్రమే ఇలా ఉల్లేఖించారు. షరీక్ ఉల్లేఖనం విలక్షణమైనదని అబ్దుల్ హఖ్ అభిప్రాయపడ్డారు. మేరాజ్ (గగనయాత్ర) జాగృదావస్థలో జరిగిందన్న విషయంలో అత్యధిక మంది అహ్లె హదీసు వర్గీయులు ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు.

కలిగిన ఆటంకం ఏది?” అని అడిగితే, ‘నేను లైంగిక అశుద్ధతను దూరం చేయడానికి స్నానం చేయటం తప్పనిసరి అయింది’ అని ఆ వ్యక్తి సమాధానం ఇచ్చాడు. “పరిశుభ్రమైన మట్టితో తయమ్ముమ్ చేసుకో” అని ఆయన(స) అతనికి ఆజ్ఞాపించారు. తరువాత ఆ వ్యక్తి (తయమ్ముమ్ చేసుకుని) నమాజ్ చేశాడు.

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) అంటున్నారు : తరువాత దైవప్రవక్త(స) నన్ను కొంతమంది వాహనదారులతోపాటు ముందుకు పంపారు (మంచినీటి అన్వేషణ కోసం). ఆ సమయంలో మాకు తీవ్రంగా దాహమవుతున్నది. ఆ స్థితిలోనే మేము నీటి అన్వేషణలో ఉండగా మాకు ఒక స్త్రీ కనిపించింది. రెండు మంచినీటి తిత్తులతోపాటు వాహనంపై తన రెండు కాళ్ళు వ్రేలాడదీసుకుని సాగిపోతోందామె. ‘మంచినీరు ఎక్కడుందమ్మా?’ అని మేము ఆమెను అడిగాము. ‘ఇక్కడెక్కడా మంచి నీరు లేదు’ అని ఆమె చెప్పింది. ‘పోనీ, నీ నివాస గృహానికి నీరు ఎంత దూరంలో ఉంటుంది?’ అని ఆమెను అడిగితే, ‘ఒక పగలు, ఒక రాత్రి ప్రయాణ దూరానికి’ అని ఆమె చెప్పింది. ‘అలాగైతే నీవు దైవప్రవక్త(స) సమక్షంలో హాజరు కావలసి ఉంటుంది’ అని మేమామెతో అన్నాము. ‘దైవప్రవక్త(స) అంటే ఎవరు?’ అని ఆమె అడిగింది. ఇమ్రాన్(రజి) ఇలా అంటున్నారు : మేము ఆ స్త్రీని దైవప్రవక్త(స) ఎదుట హాజరు పరచగలిగాము. ఆమె మాకు వేసిన ప్రశ్నలే దైవప్రవక్త(స)కూ వేసింది. కాకపోతే, తాను తండ్రిలేని బిడ్డల (అనాథల) తల్లిననీ, దయచూపదగిన స్త్రీనని చెప్పింది. దైవప్రవక్త(స) ఆజ్ఞానుసారం ఆమె రెండు నీళ్ళ తిత్తులు క్రిందికి దించ బడ్డాయి. ఆయన(స) వాటి మూతులను తన చేతితో స్పృశించారు. మేము నలభై మందిమి ఆ నీళ్ళ తిత్తులనుండి కడుపు నిండా నీరు త్రాగి దాహం తీర్చుకున్నాము. మా బక్కెట్లలో, నీళ్ళ సంచులలో నీరు నింపుకున్నాము. ఒంటెలకు మాత్రమే నీరు త్రాపలేదు. అయినా ఆమె నీళ్ళ తిత్తుల్లోని నీరు ఏమాత్రం తరగలేదు సరికదా అది క్రిందికి వొలికేలా నిండిపోయి ఉంది. ఆ తరువాత ఆయన(స) మాతో, “మీ వద్ద తినడానికి ఉన్న ఆహార పదార్థాలను నా దగ్గరకు తీసుకురండి” అని ఆదేశించారు. వెంటనే ఆ స్త్రీ ముందు రొట్టెముక్కలు, ఖర్జూరాలు ఉంచటం జరిగింది. తరువాత ఆ స్త్రీ తన తెగవారి వద్దకు వచ్చినప్పుడు, వారిని ఉద్దేశించి, ‘ఈ రోజు నేను అతిపెద్ద మాంత్రికుణ్ణి చూసి వచ్చాన’ని చెప్పింది. లేదా ఆయన్ని నమ్మి నడుచుకునేవారు

ఆయన్ని దైవప్రవక్త(నబీ) అంటున్నారని అంది. ఎట్టకేలకు ఆ స్త్రీ ద్వారా అల్లాహ్ ఆమె తెగవారికి సన్మార్గ భాగ్యం ప్రసాదించాడు. ఆమె స్వయంగానూ ఇస్లామ్ స్వీకరించింది. ఆమె తెగవారు కూడా ఇస్లామ్‌ను స్వీకరించారు.

**225)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) సమక్షంలో ఒక నీళ్ళ పాత్ర ఉంచబడింది. ఆ సమయంలో ఆయన(స) మదీనా సమీపంలోని 'జవ్‌రా' అనే చోట ఉన్నారు. ఆయన(స) ఆ పాత్రలో చేయి ముంచగానే ఆయన చేతి వ్రేళ్ళ మధ్యలోనుంచి నీటి ఊట పెల్లుబికింది. ఆ నీటితోనే అక్కడున్న సహచరమాన్యులంతా 'వుజూ' చేసుకున్నారు- ఖతాదా ఇలా అంటు న్నారు : 'మీరంతా కలిపి అక్కడ ఎంతమంది ఉన్నారు?' అని నేను అనస్(రజి)ను అడిగితే, 'మూడు వందల మందిమి ఉంటాము లేదా మూడు వందలకు దరిదాపుల్లో ఉంటాము' అని ఆయన చెప్పారు.

**226)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: నేను దైవప్రవక్త (సఅసమ్)ను చూశాను, అస్ర్ నమాజ్ వేళ అయింది. జనులు వుజూ కొరకు నీళ్ళు అన్వేషిస్తున్నారు. కాని పరిసరాల్లో ఎక్కడా నీటి జాడలేదు. తరువాత దైవ ప్రవక్త(స) ముందు వుజూ కొరకు నీళ్ళ పాత్ర ఒకటి ఉంచబడింది. ఆయన(స) తన చేతిని ఆ పాత్రలో ముంచి, "ఈ నీటితో వుజూ చేసుకోండి" అని జనులకు చెప్పారు. ఆ సమయంలో ఆయన(స) చేతివ్రేళ్ళ కింది నుండి నీరు పెల్లుబకటం నేను గమనించాను. అప్పుడు ఆ నీటితో అందరూ- ప్రతి ఒక్కరూ-వుజూ చేసుకున్నారు.

**227)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) వివరించారు : దైవప్రవక్త(సఅసమ్) ఒక ప్రయాణంలో ఉన్నారు. ఆయన(స) వెంట కొంత మంది సహచర మాన్యులు కూడా ఉన్నారు. దారిలో వెళుతుండగా నమాజ్ వేళ అయింది. వుజూ చేయడానికి (దగ్గర్లో) నీరు లభ్యమవలేదు. చివరకు పయన బృందంలోని ఒక వ్యక్తి లేచి వెళ్ళి, ఒక పెద్దపాత్రలో కొంచెం నీరు తెచ్చి, ఆయన సమక్షంలో సమర్పించారు. దైవ ప్రవక్త(స) ఆ నీటితో వుజూ చేసి, తన చేతిని ఆ పాత్రపై ఉంచి, "రండి, వుజూ చేసుకోండి' అన్నారు. ఆయన వెంట ఉన్న ప్రయాణీకులంతా వుజూ చేసుకున్నారు. చక్కగా, సంప్రదాయబద్ధంగా వుజూ చేశారు. సంఖ్యాపరంగా మేము డెభ్భయి మందిమి లేదా దాదాపు డెభ్భయి మందిమి ఉన్నాము.

**228) హ్రజత్ అనస్(రజి) తమకు చెప్పినట్లుగా హుమైద్ తెలిపారు : నమాజ్ వేళ అయింది. మస్జిదె నబవీకి దగ్గరలో ఉన్నవారంతా వుజూ చేసుకున్నారు. కాని చాలామంది వుజూ చేసుకోనివారు ఉన్నారు. ఆ తరువాత దైవప్రవక్త(స) సన్నిధిలో ఒక రాతి కుండ తీసుకురావటం జరిగింది. అందులో నీరు ఉంది. ఆయన(స) తన అరచేతిని అందులో ముంచారు. కాని ఆ కుండ మూత చాలా చిన్నదవటం వల్ల ఆయన(స) స్వేచ్ఛగా అందులో తన చేతిని కదల్చలేకపోయారు. అందువల్ల ఆయన తన చేతివ్రేళ్ళను మాత్రం కలిపి ఆ కుండలో ముంచారు. ఆ నీటితో వుజూ చేయకుండా ఉండిపోయిన వారంతా వుజూ చేసుకున్నారు. (హుమైద్ ఇలా అంటున్నారు) 'ఆ సమయంలో ఎంత మంది (వుజూ చేయనివారు) ఉన్నారు?' అని నేనడిగితే, 'ఎనభై మంది' అని అనస్(రజి) చెప్పారు.[1]**

**229) హ్రజత్ జాబిర్(రజి) ఉల్లేఖించారు : హుదైబియా ఒడంబడిక జరిగిన రోజున జనులకు బాగా దాహం అయింది. అంతలో దైవప్రవక్త (సఅసమ్) సమక్షంలో ఒక నీళ్ళ చెంబు ఉంచబడింది. ఆయన(స) ఆ నీళ్ళతో వుజూ చేశారు. అదే సమయంలో సహచరమాన్యులు ఆయన(స) దగ్గరకు వచ్చారు. "ఏమిటి విశేషం?" అని ఆయన(స) దర్యాప్తు చేయగా, 'ఇప్పుడు తమరు వుజూ చేసిన నీరు తప్ప మా దగ్గర వుజూ చేయడానికి గానీ, త్రాగటానికి గానీ నీరులేదు' అని విన్నవించు కున్నారు. అప్పుడు ఆయన(స) తన చేతిని ఆ చెంబులో ముంచారు. నీరు ఆయన చేతివ్రేళ్ళ మధ్యలో నుంచి నీటి బుగ్గలా చిమ్ముకుని వచ్చింది. మేమంతా ఆ నీటిని త్రాగటమే గాకుండా, దాంతో వుజూ కూడా చేసుకున్నాము. సాలిమ్ ఇలా అంటు న్నారు : 'అక్కడ ఉన్న సహచరుల సంఖ్య ఎంత?' అని నేనడిగితే, 'మేము లక్ష మందిమి ఉన్నా ఆ నీరు సరిపోయేది.[1] ఆ సమయంలో మేము పదిహేను వందల మందిమి ఉన్నాము' అని జాబిర్(రజి) చెప్పారు.**

---

228-1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ పొందుపరచిన అనస్(రజి) గారి నాలుగు హదీసుల్లో నాలుగు వేర్వేరు సంఘటనల ప్రస్తావన ఉంది. అంతమాత్రాన వాటి సేకరణలో ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. వైవిధ్యాన్ని రూపుమాపేందుకు శ్రమ తీసుకోవలసిన అవసరం కూడా లేదు. ఎందుకంటే ఈ నాలుగు హదీసు ల్లోనూ ఆయన(స) అద్భుతాల గురించి ఉంది. అందుచేతనే ఈ అధ్యాయం క్రింద వాటిని పొందుపరచటం జరిగింది.

**230)** **హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) కథనం : హుదైబియా ఒప్పందం (జరిగిన) దినాన మేము 1400 మంది వరకూ ఉన్నాము. 'హుదైబియా' అనేది ఒక బావి పేరు. మేము ఆ బావి నుంచి ఎంత నీరు తోడుకున్నామంటే, అందులో ఒక్క చుక్క నీరు కూడా మిగల్లేదు (ఈ సంగతి తెలుసుకున్న దైవప్రవక్త-సఅసం- ఆ బావి వద్దకు వచ్చారు). ఆయన(స) బావి అంచున కూర్చుని నీటి కోసం ప్రార్థించారు. నీటితో పుక్కిలించి, ఆ పుక్కిలించిన నీటిని బావిలో పడవేశారు. అంతే, చూస్తుండగానే ఆ బావి నీటితో నిండిపోయింది. మేము కూడా ఆ నీటిని కడుపు నిండా త్రాగాము. మా ఒంటెలకు కూడా త్రాపాము లేదా నీరు త్రాగి తిరిగి వచ్చాము.**

**231)** **అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా ఇస్హాఖ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అబీ తల్హా విన్నారు. ఆయన ఇలా చెప్పారు: అబూ తల్హా (రజి) నా తల్లి ఉమ్మె సులైమ్ (ర.అ) తో, 'నేను దైవప్రవక్త(స) కంఠస్వరం విన్నాను. ఆ స్వరంలో బలహీనత ఉందనిపించింది. బహుశా ఆయన(స) బాగా ఆకలితో ఉన్నట్టున్నారు. నీ దగ్గర తినడానికి ఏమైనా ఉందా?' అని అడిగారు. దానికి ఆమె 'ఔను. ఉంది' అని బదులిచ్చారు. ఆమె తన దగ్గర ఉన్న బార్లీ రొట్టెలను తీసి,తన వోణీలో చుట్టి, దానిని నా చంకలో దాచేశారు. వోణీ రెండవ భాగాన్ని నా శరీరానికి చుట్టి కట్టేశారు. ఆ తరువాత ఆమె గారు నన్ను దైవప్రవక్త(స) దగ్గరకు పంపారు. తీరా నేను అక్కడికి చేరుకున్నప్పుడు, ఆయన(స) మస్జిద్‌లో ఉన్నారు. ఆయన(స)తోపాటు చాలామంది సహచరమాన్యులు కూర్చుని ఉన్నారు. నేను దైవప్రవక్త(స) దగ్గరకెళ్ళి నిలబడ్డాను. "ఏమిటి, నిన్ను అబూ తల్హా పంపారా?" అని ఆయన అడిగారు. 'అవున'న్నాను. "భోజనమిచ్చి పంపారా?" అని ఆయన(స) అడిగితే, నేను 'అవున'న్నాను. ఆ సమయంలో అక్కడ కూర్చున్నవాళ్ళందరినీ ఉద్దేశించి, 'పదండి' అన్నారాయన(స). దైవప్రవక్త(స) నడచి వస్తుండగా నేను ఆయన(స)కు ముందు పరుగులు తీయసాగాను. అబూతల్హా (రజి) ఇంటికి చేరుకుని సమాచారం అందజేశాను.**

**"ఉమ్మె సులైమ్! దైవప్రవక్త(స) చాలామందితో కలిసి వస్తున్నారట. వారం**

---

229-1. ఎందుకంటే ఆయన(స) చేతివ్రేళ్ళ నుండి అల్లాహ్ నీటి ఊటను వెలువరించాడు. అలాంటప్పుడు నీటి ఎద్దటి సమస్యే ఉండదు. ఇది కూడా దైవప్రవక్త(స) ద్వారా జరిగిన అద్భుతమే.

**దరికీ సరిపోయేంత భోజనం మన దగ్గర ఎక్కడుంది?" అన్నారు అబూతల్హా(రజి). దానికి ఆమె, 'ఆ విషయం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు' (అలాంటప్పుడు మనకు దిగులు ఎందుకు?) అని జవాబిచ్చింది. సరే, అబూ తల్హా (రజి) ముందుకేగి, దైవప్రవక్త(స)కు స్వాగతం పలికారు. ఇప్పుడు దైవప్రవక్త(స)తో ఆయన కూడా కలసి వస్తున్నారు. ఇంటికి చేరుకోగానే, "ఉమ్మె సులైమ్! నీ దగ్గర ఉన్న ఆహార పదార్థమేదో ఇటు తీసుకురా" అని దైవప్రవక్త(స) కోరారు. ఉమ్మె సులైమ్ రొట్టెలు తెచ్చి ఆయన(స) ముందుంచింది. దైవప్రవక్త(స) ఆదేశానుసారం ఆ రొట్టెలన్నీ చిన్న చిన్న ముక్కలుగా చేయటం జరిగింది. ఉమ్మె సులైమ్ చారులాంటిది చేసి, అందులో కొంచెం నెయ్యి వేసింది. అదే కూర అయింది. ఆ తరువాత ఆయన(స) అల్లాహ్ కోరినట్లుగా దుఆ చేసి[1] "పదిమందిని పిలవండి" అన్నారు. ఆయన చెప్పినట్లుగానే చేశారు. వారంతా కడుపునిండా రొట్టె తిని బయటికెళ్ళిపోయారు. "మరో పదిమందిని పిలుచుకోండి" అని ప్రవక్త(స) చెప్పారు. అందువల్ల పది మందిని పిలవటం జరిగింది.వారు కూడా సుష్టుగా తిన్నారు. వారు బయటికి వెళ్ళాక "మరో పదిమందిని పిలుచుకోండి" అని ఆయన(స) ఆదేశించారు. మరో పదిమందిని పిలిచారు. వారు కూడా కడుపునిండా భుజించారు. వారు బయటకు వెళ్ళిన తరువాత "ఇంకో పదిమందిని ఆహ్వానించండి" అని ఆజ్ఞాపించారు కారుణ్యమూర్తి(స). ఈ విధంగా అందరూ తృప్తిగా– కడుపునిండా– తిన్నారు. అలా భుజించిన వారి సంఖ్య డెభ్భయి లేదా ఎనభై వరకూ ఉంటుంది.**

**232) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) తెలిపారు : 'అద్భుతాల'ను మేము శుభప్రదంగా భావించేవాళ్ళం. మీరు వాటికి భయపడుతున్నారా? ఒకసారి మేము ఒక ప్రయాణంలో దైవప్రవక్త(స) వెంట ఉన్నాము. నీరు దాదాపు అయిపోవచ్చింది. అప్పుడు దైవప్రవక్త(స), "మిగిలి ఉన్న నీటిని వెతకండి" అని ఆజ్ఞాపించారు. అందువల్ల జనులు ఒక పాత్రలో కొద్ది నీరును తెచ్చారు. ఆయన(స) తన చేతిని ఆ నీటిలో ముంచి ఇలా అన్నారు : "శుభవంతమైన నీటిని గ్రహించండి.**

---

231–1. ఆయన(స) ఆ భోజనంలో 'శుభం' ప్రసాదించమని ప్రార్థించారు. అంతమంది భుజించిన తరువాత కూడా ఆహారం మిగిలింది. దైవప్రవక్త(స) అబూ తల్హా– ఉమ్మె సులైమ్ దంపతుల ఇంట్లో భోజనం చేశారు. అప్పటికీ మిగిలిన అన్నాన్ని ఇరుగు పొరుగు వారికి కానుకగా పంపించారు.

**శుభం అన్నది అల్లాహ్ తరఫునే ఉంటుంది" అన్నారు. ఆ సమయంలో దైవ ప్రవక్త(స) చేతివ్రేళ్ళ మధ్యనుండి నీరు ఫౌంటెన్‌లా చిమ్మటం నేను చూశాను. మేమైతే దైవప్రవక్త(స) కాలంలో భోజనం చేస్తున్నప్పుడు, భోజనం చేసే స్తుతిగానాన్ని వినేవారం.[1]**

**233) హజ్రత్ జాబిర్(రజి) తెలిపారు : ఆయన తండ్రి (అబ్దుల్లాహ్ ఉహుద్ యుద్ధంలో) అమరగతి నొందారు. అప్పటికి ఆయన రుణగ్రస్తులు- నేను దైవప్రవక్త(సఅసం) సమక్షంలో హాజరై, '(దైవప్రవక్తా!) నా తండ్రి రుణగ్రస్తునిగా మరణించారు. మరోవైపు నా వద్ద ఖర్జూరపు పండ్ల ఉత్పత్తి తప్ప మరో ఆధారం లేదు. ఆ వ్యవసాయోత్పత్తి ద్వారా, వచ్చే కొన్నేండ్లలో అప్పు తీర్చటం సాధ్యం కాదు. తమరు నా వెంట రండి. మిమ్మల్ని చూసి అయినా రుణదాతలు నా పట్ల ఉదారంగా వ్యవహరిస్తారు' అని విన్నవించుకున్నాను. ఈ విన్నపాన్ని పురస్కరించుకుని దైవ ప్రవక్త(స) వచ్చారు. కాని రుణదాతలు (కొంత రుణం మాఫీ చేయడానికి) సుతరామూ అంగీకరించలేదు. అప్పుడాయన (స) ఖర్జూరపు తోటకు వచ్చి, అక్కడ**

---

232-1. ప్రవక్త ప్రియ సహచరులు(రజిఅల్లాహు అన్‌హుమ్) తమ చెవులారా భోజనం దైవకీర్తన చేయటం విన్నారు. ఇది ప్రవక్త మహనీయుల(స) అద్భుతం. అన్యథా ప్రతి వస్తువు దేవుని పవిత్రతను కొనియాడుతుంది. ఉదాహరణకు- "ఆయన స్తోత్రంతోపాటు ఆయన పరిశుద్ధతను కొనియాడనటువంటిది ఏదీలేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు". (17: 44)

కంకరరాళ్ళు కూడా దైవాన్ని స్తుతించాయి. ఇమామ్ బైహాఖీ (రహ్మ) **'దలాయల్'**లో వెలికి తీసిన దాని ప్రకారం, దైవప్రవక్త(స) ఏడు కంకరరాళ్ళను చేతిలో తీసుకున్నారు, అవి ఆయన(స) చేతిలో దేవుని పవిత్రతను కొని యాడాయి. అది వినబడింది. తరువాత ఆయన(స) ఆ కంకరరాళ్ళను అబూబక్ర్ (రజి) చేతిలో పెట్టారు. తరువాత ఉమర్(రజి) చేతిలో, ఆ తర్వాత ఉస్మాన్(రజి) చేతిలో పెట్టారు. ఆ రాళ్ళు వారందరి చేతిలో దైవాన్ని స్తుతించాయి.

హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ) ఇలా అన్నారు : చంద్రుడు చీలటం ఖుర్‌ఆన్ ద్వారా, ప్రామాణిక హదీసుల ద్వారా రూఢీ అయింది. దైవప్రవక్త(స) మింబర్ వద్ద ఊతగా ఉపయోగించే కొయ్య (దుంగ) విలపించటం కూడా ప్రామాణిక హదీసు ద్వారా నిరూపితం అయింది. కాకపోతే కంకరరాళ్ళు దైవాన్ని స్తుతించాయన్న ఉల్లేఖనంలో బలహీనత ఉంది.

రాశులుగా పోయబడి ఉన్న ఖర్జూరాలలో ఒక రాశికి నలువైపులా కలియ తిరిగి దుఆ చేశారు. రెండవ రాశి పట్ల కూడా అలాగే చేసి దానిపై కూర్చున్నారు. "ఇప్పుడు ఖర్జూర పండ్లు కొలిచి ఇవ్వు" అని (జాబిర్‌ను) ఆదేశించారు. రుణం పూర్తిగా తీర్చబడింది. రుణభారం క్రింద ఎన్ని ఖర్జూరాలు ఇవ్వబడ్డాయో అన్ని ఖర్జూరాలు మిగిలాయి కూడా.

**234)** అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బక్ర్(రజి) కథనం : సుఫ్ఫా (అరుగు) వాళ్ళు పేద ప్రజలు, నిరాధార జీవులు. ఒకసారి దైవప్రవక్త(సఅసమ్) ఇలా ఆదేశించారు: "ఇద్దరు మనుషుల భోజనం తమ ఇంట్లో ఉన్నవారు మూడవ మనిషిగా ఒకతన్ని తమ వెంటబెట్టుకుని వెళ్ళాలి. తమ ఇంట్లో నలుగురు మనుషుల అన్నం ఉన్నవారు ఐదవవానిగా ఒకరిని తీసుకువెళ్ళాలి లేదా ఆరవవానిని." (ఇక్కడ ఉల్లేఖకులు సందిగ్ధంలో పడ్డారు) సరే, అబూబక్ర్ ముగ్గురు అస్హాబె సుఫ్ఫాను తన వెంట తీసుకువెళ్ళారు. దైవప్రవక్త(స) పది మందిని తమ వెంటబెట్టుకుని వెళ్ళారు. అప్పుడు ఇంట్లో నేను ఉన్నాను. నా తల్లిదండ్రులున్నారు– తన భార్య, తన దగ్గర, తన తండ్రి దగ్గర సేవకునిగా పనిచేసే వ్యక్తి కూడా ఉన్నాడని అబ్దుర్రహ్మాన్ చెప్పారో లేదో నాకు గుర్తులేదని అబూ ఉస్మాన్ అన్నారు – కాని అబూబక్ర్ మాత్రం దైవప్రవక్త(స)తో కలసి భుజించారు. ఇషా నమాజ్ వరకు ఆయన అక్కడే ఉన్నారు. (అతిథులను ముందుగానే పంపేశారు) ఈలోగా దైవప్రవక్త(స) భోజనం చేసేశారు. తరువాత అల్లాహ్ కోరినంత సమయం అబూబక్ర్(రజి) అక్కడ ఉండి, రాత్రి పొద్దుపోయాక ఇంటికి వచ్చారు. ఆయన భార్య (ఉమ్మె రూమాన్) ఆయన్ని ఉద్దేశించి, 'మీరు ఇంతసేపు ఎక్కడికెళ్ళారు. మీ అతిథులు ఇప్పటివరకూ మీ రాకకై నిరీక్షిస్తున్నార'ని అంది. 'ఇంతకీ నువ్వు వారికి భోజనం వడ్డించావా? లేదా?' అని అడిగారు అబూ బక్ర్. 'నేను వడ్డించాను. కాని వారు తినలేదు. అబూబక్ర్ వచ్చేవరకు తినబోమని నిర్దిష్టంగా చెప్పేశారు' అని సంజాయిషీ ఇచ్చుకుంది ఆయన భార్య. అబ్దుర్రహ్మాన్ ఇలా అన్నారు: 'ఆ పరిస్థితిని చూసి నేను (భయంతో) దాక్కున్నాను' అబూబక్ర్ నన్ను బిగ్గరగా కేకేసి పిలిచారు. ఒరేయ్ సన్నాసి ఎక్కడున్నావురా! అని గద్దించారు. చీవాట్లు పెట్టారు. తరువాత అతిథులతో, ఇక భోజనం చేయండి అన్నారు. తను మాత్రం తిననని ఒట్టేసుకున్నారు. అబ్దుర్రహ్మాన్ (రజి) ఇలా అన్నారు: దైవసాక్షి! ఆ భోజనం నుండి మేము ఒక ముద్దను తీసుకోగానే క్రింది నుండి మరింత అన్నం అధిక మయ్యేది (అందులో ఎంతగా శుభం జరిగిందంటే), అక్కడున్నవారంతా సుష్టుగా

భుజించారు. అయితే మరోవైపున భోజనం మునుపటి కన్నా ఎక్కువగా ఉంది. భోజనం యథాతథంగా ఉండటం, లేదా మునుపటి కన్నా అధికంగా ఉండటం గమనించిన అబూబక్ర్ తన భార్యతో, 'ఓ బనీ ఫరాస్ సోదరీ! ఏమిటి, విశేషం!?' అనడిగారు. దానికి ఆమె, 'ఏముంది? నా కన్నుల చలువ సాక్షిగా! భోజనం మొదటి దానికన్నా మూడింతలు ఎక్కువగా ఉందనిపిస్తోంది' అని చెప్పింది. తరువాత అందులో నుంచి అబూబక్ర్ కూడా కొద్దిగా తిన్నారు. ఇలా అన్నారు: '(ఈ అన్నం తినను అని) నేను చేసిన ప్రమాణం షైతాన్ ఎర.' ఒక ముద్ద అన్నం తిన్న తర్వాత ఆయన దానిని దైవప్రవక్త(స) దగ్గరకు తీసుకువెళ్ళారు. అక్కడ అది తెల్లవారేవరకూ ఉంచబడింది. కాకతాళీయంగా జరిగిందేమిటంటే ముస్లిములకు ఒక అవిశ్వాసుల వర్గంతో జరిగి ఉన్న ఒడంబడిక గడువు ముగిసింది. అందువల్ల ఆ వర్గంతో పోరాడటానికి ఒక సైన్యం సిద్ధం చేయబడింది. తరువాత మేము పన్నెండు జట్లుగా విడిపోయాము. ఒక్కో మనిషి (పర్యవేక్షకుని)తోపాటు ఎంతమంది ఉన్నారో అల్లాహ్‌కే తెలుసు. కాని ఆయన(స) ఆ పర్యవేక్షకులను సైన్యంతోపాటు పంపారన్న విషయం మాత్రం మాకు బాగా తెలుసు. చెప్పొచ్చిందేమంటే సైనిక దళం లోని వారు కూడా ఈ భోజనం చేశారు. లేదా అబ్దుర్రహ్మాన్ ఇలాంటి మాటే అన్నారు.[1]

**235)** హజ్రత్ అనస్(రజి) కథనం : దైవప్రవక్త(సఅసం) కాలంలో ఒకసారి దుర్భిక్షం ఏర్పడింది. ఆయన(స) శుక్రవారం నమాజు సందర్భంగా ప్రసంగిస్తూ ఉన్నారు. అంతలో ఒక వ్యక్తి నిలబడి 'ఓ దైవప్రవక్తా! గుర్రాలు అకలితో (గ్రాసం లేక) చచ్చిపోయాయి. మేకలు కూడా మృత్యువాతన పడ్డాయి. మాపై వర్షం కురిపించమని తమరు దైవాన్ని ప్రార్థించండి' అని అభ్యర్థించాడు. దైవప్రవక్త(స) అప్పటికప్పుడే చేతులెత్తి ప్రార్థించారు. హజ్రత్ అనస్(రజి) ఇలా అన్నారు : ఆ సమయంలో ఆకాశం అద్దంలా నిర్మలంగా ఉంది. అంతలోనే గాలి వీచింది. ఆ గాలి మేఘాన్ని లేపింది (మేఘోమథనం చేసింది). ఆ మేఘం అనేక మేఘ మాలికలుగా ఏర్పడింది. ఆకాశం తన ద్వారాలను తెరిచివేసిందా! అనిపించింది.

---

234-1. ఈ హదీసు అనువాదం సాఫీగా సాగలేదు. విషయంలో స్పష్టత లోపించినట్టు ఉంది. బహుశా ఉల్లేఖకుడు వివరించి చెబుతున్నప్పుడు – పద ప్రయోగంలో తడబడ్డారేమో!

మస్జిదుల నుండి ఇళ్ళకు బయలుదేరిన మేము ఇళ్ళకు చేరుకునేసరికి తడిసి ముద్దయ్యాము; మా కాళ్ళు నీట మునిగిపోయాయి. వచ్చే శుక్రవారం వరకు ఆ వర్షం నిరాఘాటంగా కురుస్తూనే ఉంది. మళ్ళీ ఆ వ్యక్తే రెండవ శుక్రవారం నిలబడి, 'దైవప్రవక్తా! ఇళ్ళు కూలిపోయాయి. వర్షం కురవకుండా చూడమని దైవాన్ని ప్రార్థించండి' అని విన్నవించుకున్నాడు. అతని మాటలకు దైవప్రవక్త(స) చిరు మందహాసం చేసి, "ఓ దేవా! ఇప్పుడు మా (మదీనా) సమీప ప్రాంతాలలో నలు వైపులా– వర్షాన్ని కురిపించు. మాపై కురిపించకు" అని వేడుకున్నారు. హజ్రత్ అనస్ (రజి) ఇలా అంటున్నారు : అప్పుడు నేను పైకి దృష్టిని సారిస్తే, మేఘ మాలి కలు చీలిపోయి చుట్టుప్రక్కల ప్రాంతాలకు– కిరీటాల మాదిరిగా– తరలిపోవటం కనిపించింది.

**236)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : "ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక 'కొయ్య'ను ఊతగా చేసుకుని ప్రసంగించేవారు. తరువాత వేదికగా 'మింబర్' నిర్మించబడినప్పుడు, ఆయన(స) మింబర్ ఎక్కారు. అప్పుడు ఆ కొయ్య సన్నని స్వరంతో రోదించటం మొదలెట్టింది. దైవప్రవక్త(స) ఆ కొయ్య దగ్గరకు వెళ్ళి, తన చేత్తో (ఆప్యాయంగా) దానిని నిమిరారు"– అబ్దుల్ హమీద్ ఇలా అన్నారు [1]: మాకు ఉస్మాన్ బిన్ ఉమర్ తెలిపారు...

**237)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : ప్రవక్త మహ నీయులు (సఅసమ్) శుక్రవారం నాడు ప్రసంగించడానికి ఒక వృక్షం (దుంగ) వద్ద నిలబడేవారు. లేదా ఖర్జూరపు వృక్షం (అన్నారు). ఒక అన్సారీ మహిళ ఆయన (స)తో, 'దైవప్రవక్తా! మీ కోసం మేము ఒక మింబర్ (వేదిక)ను ఎందుకు తయారు చేయకూడదు?' అంది. దానికి ఆయన(స), "అదే నీ అభిలాష అయితే, అలాగే కానివ్వు" అన్నారు. ఆమె దైవప్రవక్త(స) కొరకు ఒక మింబర్‌ను తయారు చేయిం చింది. శుక్రవారం రోజు వచ్చినప్పుడు ఆయన(స) ఆ మింబర్‌పైకి ఎక్కారు. అంతే, ఆ ఖర్జూర దుంగ నుండి పసిపిల్లవాడు ఏడ్చినట్లుగా ఏడుపు వినిపించింది. దైవ

236–1. హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) అన్నారు : అబ్దుల్ హమీద్ అనే ఈ ఉల్లేఖకుడు ఎవరో తెలియలేదని, ఈయన అబ్దె బిన్ హమీద్ హాఫిజ్‌గా సుప్రసిద్ధులని మజీ చెప్పారు. నేను ఆయన తఫ్సీర్‌లోనూ, మస్నద్‌లోనూ అన్వేషించాను, కాని ఈ హదీసు ఎక్కడా కనబడలేదు. కాకపోతే 'దారిమీ' దీనిని వెలికి తీశారు.

ప్రవక్త(స) మింబర్ నుండి దిగి వచ్చి, ఆ దుంగను తన హృదయానికి హత్తు కున్నారు– చిన్న పిల్లాడు ఏడ్చినప్పుడు ఎత్తుకుని లాలించినట్లుగా! దైవప్రవక్త(స) అది ఏడవకుండా చేశారు. ఆ తరువాత ఆయన(స) ఇలా అన్నారు : "ఈ దుంగ ఎందుకు ఏడుస్తుందో తెలుసా? అది ఇంతకుముందు తనకు సమీపంలో ఉన్న వారి ద్వారా దైవనామ స్మరణ వినేది".

**238)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : మస్జిదె నబవీ కప్పు ఖర్జూరపు దుంగల మీద నిర్మించబడింది. దైవప్రవక్త(స) ప్రసంగించడానికి ఏతెంచినప్పుడు, ఆయన(స) ఆ దుంగలలో ఏదో ఒకదాని దగ్గర నిలబడేవారు. కాని ఆయన(స) కొరకు 'మింబర్' నిర్మించబడిన తరువాత ఆయన(స) ప్రసం గించడానికి ఆ మింబర్ పైకి ఎక్కారు. అప్పుడు మాకు ఆ దుంగ నుండి ఏడుపు శబ్దం వినిపించింది. ఒంటె ఈనినప్పుడు వచ్చే శబ్దంలా ఉంది ఆ దుంగ నుండి వచ్చే శబ్దం. చివరకు దైవప్రవక్త(స) దానిని సమీపించి, దానిపై చెయ్యి వేయగానే అది నిశ్శబ్దంగా ఉండిపోయింది.

**239)** ఒకసారి హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) తన తోటివారినుద్దేశించి 'ఫిత్నా' (ఉపద్రవం, పరీక్ష) గురించి దైవప్రవక్త(స) చెప్పిన హదీసు అందరికన్నా బాగా ఎవరికి జ్ఞాపకం ఉంది? అని అడిగారు. (వేరొక సనదు ప్రకారం) 'ఫిత్నా' గురించి దైవప్రవక్త(స) చెప్పిన భవిష్యవాణి (హదీసు) ఎవరికి జ్ఞాపకం ఉంది? అని హజ్రత్ ఉమర్ అడిగారు. 'నాకు బాగా జ్ఞాపకం ఉంది; దైవప్రవక్త(స) చెప్పి నట్లుగా యథాతథంగా గుర్తుంది' అని మహనీయ హుజైఫా (రజి) బదులిచ్చారు. 'అలాగైతే వినిపించండి (మాషా అల్లాహ్) మీరు ధైర్యశాలిలా ఉన్నార'ని హజ్రత్ ఉమర్(రజి) చెప్పారు.

అప్పుడు దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారని హజ్రత్ హుజైఫా(రజి) వివరిం చారు: "మనిషి పాలిట ఒక పరీక్ష (ఫిత్నా) అతని నివాస గృహంలో, అతని సంపదలో, అతని పొరుగు వారిలో జరుగుతుంది. కాగా; నమాజ్, దానధర్మాలు, మంచిని చేయమని ఆదేశించటం, చెడుల నుండి వారించటం వంటి సత్కార్యాలు అతని పాలిట పరిహారం (కఫ్ఫారా)గా పరిణమిస్తాయి." – దానిపై హజ్రత్ ఉమర్ (రజి), 'నేనడిగేది దాని గురించి కాదు; సముద్రపు అలల్లా ఎగిసిపడే 'ఫిత్నా' (ఉపద్రవం) గురించి అడుగుతున్నాను' అని చెప్పినప్పుడు హుజైఫా(రజి) ఇలా

**అన్నారు : 'ఆ ఫిత్నా ప్రభావం మీపై పడదు. మీకూ– ఆ ఫిత్నాకి (ఉపద్రవానికి) మధ్యన మూయబడిన తలుపు ఉంది'. 'ఆ తలుపు తెరువబడుతుందా? బద్దలు గొట్టబడుతుందా?' అని ఉమర్(రజి) అడగ్గా, 'తెరువబడదు. అది బద్దలు గొట్టబడు తుంది' అని హుజైఫా (రజి) చెప్పారు. 'అలాగైతే అది మూసుకునే ప్రసక్తే ఉండదు కదా!' అని ఉమర్ (రజి) అన్నారు– ఆ తలుపు గురించి ఉమర్(రజి) గారికి తెలుసా? అని మేము హుజైఫా (రజి)ను ప్రశ్నించగా, 'పగలు తరువాత రేయి రావటం గురించి ప్రతి వ్యక్తికీ ఎంతగా తెలుసో, అంతగానే ఆ తలుపు గురించి ఆయనకు తెలుసు. ఏమాత్రం ఊహలకు ఆస్కారం లేని హదీసును నేను ఆయన గారికి వినిపించాను' అని హుజైఫా (రజి) బదులిచ్చారు– అబూ వాయల్ ఇలా అన్నారు : ఆ తలుపు గురించి హుజైఫా (రజి)ను అడగటానికి మాకు భయమేసింది. మేము మస్రూఖ్ ద్వారా అడిగించాము– ఆ తలుపు ఎవరు? అని. 'ఇంకెవరు? స్వయంగా ఉమర్(రజి) గారే'[1] అని హుజైఫా (రజి) చెప్పారు.**

**240) ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "మీరు వెంట్రుకలతో చేయబడిన చెప్పులు తొడిగిన జాతితో యుద్ధం చేయనంతవరకూ, మీరు తుర్కీలతో యుద్ధం**

---

239–1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. ఇమామ్ బుఖారీ (రహ్మ) దీనిని ఇక్కడ పొందుపరచటంలోని ఉద్దేశం దైవప్రవక్త(స) భవిష్యవాణి ఒక అద్భుతమని నిరూపించటమే. హజ్రత్ ఉమర్ (రజి) జీవించి ఉన్నంత కాలం ముస్లింలలో ఎలాంటి అరాచకం, ఉపద్రవం ప్రబలలేదు. ఆయన మరణించిన మీదటే ఉపద్రవాల తలుపు తెరచుకుంది. ఆ విధంగా దైవప్రవక్త(స) భవిష్యవాణి నిజమయింది.

'ఆ తలుపు' హజ్రత్ ఉస్మాన్(రజి) అని హుజైఫా చెప్పి ఉంటే ఇంకా బాగుండేది. ఎందుకంటే ఉస్మాన్(రజి) వీరమరణం తర్వాతనే ఉపద్రవాల తలుపు తెరుచుకుంది అని జర్కషీ వ్యాఖ్యానించారు. ఇక్కడ జర్కషీ భ్రమలో పడ్డారు– ఉపద్రవాల తలుపు ఉస్మాన్(రజి) జీవించి ఉండగానే తెరుచుకుంది. అలాంటప్పుడు ఆయన 'ఆ తలుపు' ఎలా అవుతారు?

హజ్రత్ హుజైఫా(రజి) ఉన్నత శ్రేణికి చెందిన సహాబీ. ఆయన దైవప్రవక్త(స) ఆంతరంగికులుగా ఉన్నారు. కనుక ఆయన ఖరారు చేసిన ఒక విషయంపై 'భాష్యం' చెప్పటం, ఆక్షేపించటం జర్కషీకి తగదు.

**చేయనంత వరకూ ప్రళయం సంభవించదు. వారి (ఆ తుర్కీల) కళ్ళు చిన్నవిగా ఉంటాయి. వారి ముఖాలు ఎర్రగానూ, ముక్కు చిన్నదిగానూ, చప్పడి ముక్కు అయి ఉంటుంది. ఇంకా వారి ముఖాలు ఒకదాని మీద ఒకటిగా పేర్చబడిన డాలుల మాదిరిగా ఉంటాయి."**

**ఇకపోతే, "ప్రభుత్వాధినేతగా ఉండటానికి ఏమాత్రం సుముఖత చూపని వానినే మీరు పరిపాలనాదక్షత కలవానిగా, సమర్థుడుగా కనుగొంటారు. కడకు అతను ఆ బాధ్యతల్లో పూర్తిగా మునిగిపోతాడు."**

**"ఇంకా మీపై ఒక కాలం రానున్నది. అప్పుడు మీలోని ఒకడు తన ఇల్లూ వాకిలి కన్నా, సిరిసంపదలకన్నా నన్ను చూడటాన్ని ఇష్టపడతాడు."[1]**

**241) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : "మీరు ఖూజ్, కర్మాన్ పట్టణవాసుల (ఈరానీయులు, అజమీల)తో యుద్ధం చేయనంతవరకూ ప్రళయం నెలకొనదు. వారి ముఖాలు ఎర్రగా ఉంటాయి. ముక్కులు చప్పిడి ముక్కులై ఉంటాయి. కళ్ళు చిన్నవిగా ఉంటాయి. వారి ముఖాలు ఒకదానిపై ఒకటిగా పేర్చబడిన చెక్కల్లా (డాలు మాదిరిగా) ఉంటాయి. వారు ధరించిన పాదరక్షలు వెంట్రుకలతో తయారై ఉంటాయి."- యహ్యా తప్ప ఈ హదీసును వేరితరులు కూడా అబ్దుర్రజ్జాఖ్ నుండి ఉటంకించారు.**

**242) ఖైస్ తెలిపారు: మేము ఒకసారి హజ్రత్ అబూహురైరా(రజి) దగ్గరకు వెళ్ళాము. అప్పుడాయన (రజి) ఇలా అన్నారు. 'నేను దైవప్రవక్త(సఅసమ్) సాంగత్యంలో మూడు సంవత్సరాలు ఉన్నాను. ఆ మూడేళ్ళ కాలంలో హదీసుల్ని కంఠస్థం చేసుకునే విద్య పట్ల నాకు కలిగిన ఆసక్తి నా జీవితకాలంలో మరెప్పుడూ కలగలేదు. నేను దైవప్రవక్త(స) ఈ విధంగా చెబుతుండగా విన్నాను- ఆయన(స)**

---

240-1. ఈ హదీసులో నాలుగు విషయాలపై భవిష్యవాణి ఉంది. ఆ నాలుగు కూడా పూర్తయ్యాయి. దైవప్రవక్త ప్రియ సహచరులు, వారి తరువాతి వారు, ఇంకా ఆ కాలం నుంచి ఈ కాలం వరకు గడిచిన ఎందరో శుభాత్ములు తమ ఆస్తిపాస్తులను, తమకు ప్రియాతిప్రియమైన లోగిళ్ళను దైవప్రవక్త(స) వారి ఒక్క సందర్శనార్థం అర్పించడానికి సిద్ధమయ్యారు.

**చేత్తో ఇలా సైగ చేస్తూ చెప్పారు, "ప్రళయానికి ముందు మీరు వెంట్రుకల చెప్పులు ధరించే జాతితో యుద్ధం చేస్తారు." [1]**

**243) దైవప్రవక్త(సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని అమ్ర్ బిన్ తగ్లిబ్ (రజి) చెప్పారు. ప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "ప్రళయానికి సమీపంలో మీరు ఒక జాతి వారితో యుద్ధం చేస్తారు. వారు వెంట్రుకల పాదరక్షలు తొడుగుతారు. వారి ముఖాలు ఒకదానిపై ఒకటిగా పేర్చబడిన డాలులా (చెక్కల్లా) ఉంటాయి."**

**244) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా నేను విన్నాను అని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు : "మీరు యూదులతో ఒక యుద్ధం చేస్తారు. ఆ యుద్ధంలో మీరు వారిపై విజయం సాధిస్తారు. అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందంటే (ఒకవేళ ఏ యూదుడైనా తన ప్రాణాలు కాపాడుకోవటానికి ఏ పర్వ తంలో దాక్కున్నా) 'ఓ ముస్లిం! ఈ యూదుడు నా చాటున నక్కి ఉన్నాడు. ఇతన్ని వధించు' అని కొండరాయి చెబుతుంది." [1]**

**245) హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "జనులపై ఒక కాలం రానున్నది– అప్పుడు ధర్మయుద్ధం కొరకు సైన్యం సమీకరించబడుతుంది. 'సైనికులలో దైవప్రవక్త (స) సహచర్య భాగ్యం పొందిన వారెవరయినా ఉన్నారా?' అని అడగటం జరుగు తుంది. 'అవున'ని సమాధానం వస్తుంది. అప్పుడు ఆ పెద్దాయన చేత విజయం కొరకు ప్రార్థన చేయించటం జరుగుతుంది. ఆ తరువాత మరొక ధర్మయుద్ధం జరుగుతుంది. అప్పుడు సైనికులనుద్దేశించి, 'మీలో ఎవరయినా దైవప్రవక్త(స) సహాబీ సహవాసం పొందినవారున్నారా?' అని అడగబడుతుంది. దానికి 'అవును'**

---

242–1. అంటే వారు– రసాయనిక ప్రక్రియ ద్వారా– చర్మాన్ని శుద్ధి చేయకుండానే, వెంట్రుకలతో సహా చెప్పులు కుట్టుకుంటారు. వారు ఈరానీయులు, కుర్దులు, దైలమీలు అయి ఉంటారు.

244–1. మహనీయ ఈసా(ఏసుక్రీస్తు– అలైహిస్సలామ్) దివి నుండి భువికి దిగి వచ్చి నప్పుడు ఇదంతా జరుగుతుంది. యూదులు దజ్జాల్ సైన్యంలో ఉంటారు. మహ నీయ ఈసా(అ) దజ్జాల్‌ను వధిస్తారు. అతని సైనికులు ఎక్కడుంటే అక్కడ ముస్లిముల చేత హతమార్చబడతారు.

అన్న జవాబు వస్తుంది. అప్పుడు ఆ వ్యక్తి చేత విజయం కొరకు దుఆ చేయిస్తారు. ఆ వేడుకోలు శుభం వల్ల విజయం వరిస్తుంది."

**246)** అదీ బిన్ హాతిమ్(రజి) తెలిపారు: నేను దైవప్రవక్త(సఅసమ్) సన్నిధిలో హాజరై ఉన్న సమయంలో ఒక వ్యక్తి వచ్చి పేదరికం, ఆకలిబాధల గురించి ఫిర్యాదు చేశాడు. తరువాత మరొక వ్యక్తి వచ్చి, రహదారులపై శాంతిభద్రతలు కరువయ్యా యని చెప్పాడు. దానిపై దైవప్రవక్త(స) "అదీ! నీవు 'హీరా' స్థలాన్ని చూశావా?" అని అడిగారు (హీరా అనేది కూఫా నగరానికి సమీపంలో ఉన్న ఒక చిన్న బస్తీ). దానికి నేను, 'చూడలేదు గాని, ఆ పేరు విన్నాను' అని విన్నవించు కున్నాను. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "నీవు గనక జీవించి ఉంటే నువ్వే చూస్తావు. ఒక మహిళ ఒంటరిగా ఒంటె తొట్ల (హౌదజ్)లో కూర్చుని, హీరా నుండి బయలు దేరి (మక్కాకు చేరుకుని) కాబా గృహ ప్రదక్షిణ చేస్తుంది. ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి భయం కూడా ఆమెకు ఉండదు." నేను (ఆశ్చర్యపోయి) నా మనసులో అను కున్నాను, అలాగైతే పట్టణాలను విధ్వంసం చేసి, కలహాగ్నిని రాజేసిన 'తై' తెగ బంది పోట్ల గతేంకాను? అని. దైవప్రవక్త(స) మళ్ళీ ఇలా అన్నారు: "నీవు గనక మరికొంత కాలం జీవించి ఉంటే 'కిస్రా' ఖజానాలు (మీ కొరకు) తెరువబడటం చూస్తావు?" 'ఏమిటి, (ఈరాన్ చక్రవర్తి) కిస్రా బిన్ హుర్ముజ్ గురించేనా మీరు చెప్పేది!?' అని అడిగాను ఆశ్చర్యపోతూ. దానికి సమాధాన మిస్తూ ఆయన(స), "అవును. కిస్రా బిన్ హుర్ముజ్. నీకు మరింత దీర్ఘాయువు లభించినట్లయితే ఇంకొక దృశ్యాన్ని కూడా చూస్తావు- ఒక వ్యక్తి తన చేతిలో బంగారం వెండి నింపుకుని బయలుదేరు తాడు, జకాత్ రూపేణా దానిని పుచ్చుకునే వారి కోసం. కాని దానిని స్వీకరించేవారు అతనికి దొరకరు. అల్లాహ్‌ను కలుసుకునే నిర్ధారిత రోజున మీలోని ప్రతి ఒక్కరూ మధ్యవర్తి ఎవరూ లేకుండా- ప్రత్యక్షంగా- ఆయన్ని కలుసుకుంటారు. అప్పుడు అల్లాహ్ అతనిని, 'ఏమిటి, నేను నీ దగ్గరకు సందేశాన్ని చేరవేసే ప్రవక్తను పంప లేదా?' అని అడుగుతాడు. దానికి అతను, 'నిజమే. నీవు పంపావు' అనంటాడు. 'ఏమిటి, నేను సిరిసంపదలను, సంతాన భాగ్యాన్ని ప్రసాదించలేదా? వారి ద్వారా నీకు ప్రాధాన్యతను వొసగలేదా?' అని అల్లాహ్ అడుగుతాడు. దానికి అతను 'నిశ్చయంగా నీవు నాకు ప్రాధాన్యతను వొసగావు' అని ధ్రువీకరిస్తాడు. తరువాత అతను కుడివైపున చూస్తే నరకం తప్ప

మరొకటి అతనికి కనిపించదు. తరువాత ఎడమ వైపున చూస్తే, అటువైపున కూడా నరకం తప్ప మరొకటి కానరాదు- అదీ (రజి) ఇలా అన్నారు : నేను దైవప్రవక్త (స) చెప్పగా విన్నాను "నరకానికి భయపడండి, ఖర్జూరపు ఒక ముక్క ద్వారా నయినా సరే. ఒకవేళ ఎవరి వద్దయినా ఖర్జూరపు ముక్క కూడా లేకపోతే, ఒక మంచి మాటనయినా పలకండి-" హజ్రత్ అదీ (రజి) ఇలా అన్నారు; నేను ఒంటె తొట్లపై కూర్చున్న మహిళను చూశాను. ఆమె ఒంటరిగా 'హీరా' నుండి బయలుదేరి మక్కాకు చేరుకుంది. ఆమె కాబా గృహ ప్రదక్షిణ చేసింది. ఆమెకు ఒక్క అల్లాహ్ భయం తప్ప ఏ బందిపోటు దొంగ భయం కూడా లేదు. దైవమార్గంలో పోరాడిన యోధులలో నేను కూడా ఉన్నాను. వారు కిస్రా బిన్ హుర్ముజ్ ఖజానాలపై విజయకేతనం ఎగురవేశారు. మీరు గనక మరి కొంతకాలం జీవించి ఉంటే, దైవప్రవక్త(స) చేసిన ఆ భవిష్యవాణిని కూడా చూసుకుంటారు. దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఒక వ్యక్తి జకాత్ ఇవ్వడానికి చేతిలో బంగారం వెండి పట్టుకుని తిరుగుతాడు. కాని దానిని స్వీకరించేవారు దొరకరు."

**247)** అబూ ముజాహిద్ వివరించారు: మాకు ముహిల్లు బిన్ ఖలీఫా ఇలా తెలిపారు- నేను అదీ (రజి) చెప్పగా విన్నాను. ఆయన ఏమన్నారంటే, నేను దైవ ప్రవక్త(స) సమక్షంలో హాజరయ్యాను... తరువాత పైన ప్రస్తావించబడిన హదీసునే వినిపించారు.

**248)** ఉఖ్బా బిన్ ఆమిర్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక రోజు మదీనా నగరం నుండి వెడలి, ఉహుద్ పోరాటంలో వీర మరణం పొందిన వారిపై నమాజు చేశారు. ఆ నమాజు అచ్చం మృతుని అంత్యక్రియల సందర్భంలో చేసే నమాజ్ లాగే ఉంది. ఆ తరువాత ఆయన(స) మింబర్‌పైకి వచ్చి ఇలా అన్నారు: "నేను మీకన్నా ముందే (కౌసర్ సరస్సుకు) చేరుకుని ప్రళయదినాన మీ కొరకు సౌఖ్య సామగ్రినవుతాను. నేను మీపైన సాక్షిగా ఉంటాను. దైవసాక్షి! నేను నా కౌసర్ సరస్సును ఇప్పుడు కూడా చూస్తున్నాను. నాకు భూమండలంలోని ధనాగారాల తాళం చెవులు ఇవ్వబడ్డాయి. దైవసాక్షిగా! మీరు షిర్క్‌కి ఒడిగడతారన్న భయం నాకు లేదు. నా భయమల్లా మీరు ప్రాపంచిక వ్యామోహంలో పడి, పరస్పరం అసూయ చెందుతారేమోనన్నదే."[1]

---

248-1. దైవప్రవక్త(స) చెప్పిన ఈ భవిష్యవాణి అక్షర సత్యమయింది. ముస్లింలకు గొప్ప ఉన్నతి లభించింది. అయితే పరస్పర అసూయాద్వేషాల కారణంగా వారు

**249)** ఉసామా బిన్ జైద్ (రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి ఒక ఎత్తయిన పర్వత గుట్టపైకెక్కి, "నేను ఏదైతే చూస్తున్నానో అది మీకు కనిపిస్తోందా? నేను ఉపద్రవాలను చూస్తున్నాను. అవి మీ ఇళ్ళల్లో వర్షపు నీటి బిందువులు పడినట్లే విరుచుకుపడుతున్నాయి" అని చెప్పారు.

**250)** జైనబ్ బిన్తె జహ్ష్(ర.అ) తమకు తెలియజేశారని ఉమ్మె హబీబా బిన్తె అబీ సుఫ్యాన్ (ర.అ) చెప్పారు : ఒక రోజు దైవప్రవక్త(స) తన ఇంటికి (జైనబ్ ఇంటికి) వచ్చినప్పుడు, ఆయన(స) ఎంతో వ్యాకులతకు లోనై ఉన్నారు. ఆ సమయంలో ఆయన(స) నోట ఈ వాక్యాలు వెలువడ్డాయి– "అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదు. అరబ్బులకు ముప్పు ఆ నగరం నుండి వస్తుంది. అది సంభవించే కాలం సమీపంలోనే ఉంది. ఈ రోజు యాజూజ్ మాజూజ్‌ల గోడలో ఇంత రంధ్రం పడింది". ఆయన(స) తన చేతివ్రేళ్ళతో వృత్తాన్ని చేసి దానిని సూచించారు– ఉమ్ముల్ మోమినీన్ జైనబ్(ర.అ) ఇలా అంటున్నారు : 'దైవప్రవక్తా! మాలో మంచి వారు ఉన్నప్పటికీ మేము అంతమొందించబడతామా?' అని నేను సందేహపడగా, "అవును, చెడులు పెచ్చరిల్లినప్పుడు అలాగే జరుగుతుంది" అని ఆయన అన్నారు.

.... వేరొక సనదు ప్రకారం ఉమ్మె సలమా(ర.అ) ఇలా వివరించారు: దైవ ప్రవక్త(స)కు మెలకువ రాగానే ఇలా పలికారు; "సుబ్‌హానల్లాహ్! ఎటువంటి ఖజానాలు అవతరించాయి! (అవి ముస్లింల కైవసమవుతాయి) ఎటువంటి ఉప ద్రవాలు అవతరించాయి! (వాటిలో ముస్లింలు చిక్కుకుపోతారు)"

**251)** హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) తన కుమారుడు అబూ సాసాతో ఇలా అన్నారు : మేకలను మేపటం నీకు ఎంతో ఇష్టమైన వ్యాపకంలా కనిపిస్తోంది. ఒకవేళ నీవు వాటిని మేపదలిస్తే వాటి మంచీ చెబ్బరల్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ ఉండు. వాటి ముక్కును కూడా శుభ్రం చేస్తూ ఉండాలి. ఎందుకంటే నేను దైవ ప్రవక్త(సఅసం) ప్రబోధించగా విన్నాను– ఆయన(స) ఇలా ప్రబోధించారు: "జనులపై ఒక కాలం రానున్నది. అప్పుడు ఒక ముస్లిం పాలిట ఎంతో ఉత్తమమైన

---

పతనమయ్యారు. ముస్లింలకు స్వయంగా తమ వారివల్లనే ఎక్కువ నష్టం వాటిల్లిందని చరిత్ర చెబుతోంది.

సంపద అతని మేకల (గొర్రెల) సంపద అయి ఉంటుంది. వాటిని తోలుకుని అతడు పర్వత శిఖరాలపైకి పోతాడు లేదా వర్షం కురిసే చోటికి వెళ్ళిపోతాడు. ఈ విధంగా అతను తన ధర్మాన్ని (దీన్‌ను) ఉపద్రవాల నుండి రక్షించుకుంటూ తిరుగుతాడు".

**252)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "ఉపద్రవాల కాలం వచ్చినప్పుడు– ఆ సందర్భంలో– కూర్చుని ఉన్నవాడు నిలబడి ఉన్నవానికంటే మెరుగైనవాడై ఉంటాడు. నిలబడి ఉన్నవాడు నడిచేవానికన్నా మెరుగైనవాడై ఉంటాడు. నడిచేవాడు పరుగెత్తే వానికన్నా మెరుగైనవాడై ఉంటాడు. ఎవడైతే అందులోకి తొంగిచూస్తాడో అతన్ని ఉపద్రవం (ఫిత్నా) తన్నుకుపోతుంది. ఆ సమయంలో ఎవరికి ఎక్కడ ఆశ్రయం దొరికితే అక్కడే ఆశ్రయం పొందాలి– తన ధర్మాన్ని ఉపద్రవాల బారి నుండి రక్షించుకోవడానికి ఇలా చేయటం అవసరం... అబూ హురైరా(రజి) ఉల్లేఖించిన ఈ హదీసు మాదిరి గానే మరో హదీసు ఉంది. అందులోఉల్లేఖకుడు అదనంగా ఇలా అన్నారు: "నమాజులలో ఒక నమాజ్ ఉంది. అది గనక వదలివేయబడితే ఆ వ్యక్తి ఇల్లూ వాకిలి అంతా నాశనమైనట్లే."[1]

**253)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "నా తదనంతరం మీ మీద ఒక కాలం రానున్నది. అప్పుడు ఇతరులకు మీపై ప్రాధాన్యత కల్పించ బడుతుంది. మీరు చెడుగా భావించే విషయాలు మీ ముందుకు వస్తుంటాయి"– 'దైవప్రవక్తా! అప్పుడు మా కర్తవ్యం ఏమిటో సెలవిస్తారా?' అని ఈ జనులు విన్నవించుకోగా, ఆయన (స) ఇలా ఉద్బోధించారు : "ఇతరుల ఏ ఏ హక్కుల్ని నెరవేర్చవలసిన బాధ్యత మీపైనున్నదో వాటిని నెరవేరుస్తూ ఉండండి. మీకు రావలసిన హక్కుల కోసం అల్లాహ్‌నే అర్థించండి (అంటే ఓర్పు వహించండి. మీ సమకాలీన పరిపాలకు నిపై తిరుగుబాటు చేయకండి)".

---

252–1. అది అస్ర్ నమాజ్ అని వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. ఈ హదీసుకు సంబంధించిన వివరణ 'ఉపద్రవాల ప్రకరణం'లో కూలంకషంగా రానున్నది. ఇలాంటి ఉపద్రవాలకు మనిషి దూరంగా ఉండటం ఉత్తమం. వాటిని చూడటానికి వెళ్ళినాసరే మనిషి అందులో కూరుకుపోతాడు.

**254) మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "ఈ ఖురైష్ తెగకు చెందిన వారిలో కొంతమంది జనులను చంపుతారు, వారిని సర్వనాశనం చేశారు" – 'మరి అలాంటి సందర్భాలలో మాకు తమరి ఆదేశం ఏమిటి?' అని ప్రియ సహచరులు అడగ్గా, "జనులు వారి నుండి వేరై ఉంటే ఎంత బాగుండు"అని ఆయన(స) చెప్పారు.**

**255) అమ్ర్ బిన్ యహ్యా బిన్ సయీద్ ఉమవీ తెలిపారు, ఈయనకు ఈయన తాత గారు తెలియజేశారు: నేను మర్వాన్ బిన్ హకమ్, అబూ హురైరా (రజి)ల వెంట ఉన్నాను. ఆ సందర్భంగా నేను అబూహురైరా (రజి) చెప్పగా విన్నాను. ఆయన ఇలా అన్నారు: నేను సత్యవంతులకే సత్యవంతుడైన దైవ ప్రవక్త(సఅసమ్) చెప్పగా విన్నాను. ఆయన(స) ఇలా చెప్పారు : "నా ఉమ్మత్ వినాశం ఖురైషులకు చెందిన కొద్దిమంది కుర్రవాళ్ళ చేతుల మీదుగా జరుగుతుంది". 'ఏమిటి, కుర్రవాళ్ళ చేతుల మీదుగానా?' అని మర్వాన్ అడగ్గా, అబూహురైరా (రజి) ఇలా అన్నారు :'నీవు కోరితే నేను వాళ్ళ పేర్లు కూడా చెప్పగలను. వాళ్ళు ఫలానా ఫలానా వంశీయులై ఉంటారు.'[1]**

**256) హజ్రత్ హుజైఫా బిన్ యమాన్(రజి) చెబుతుండేవారు. నా తోటి ఇతర సహచరమాన్యులు దైవప్రవక్త(సఅసం)ను 'మేలు' గురించి అడుగుతూ ఉండేవారు. కాని నేను మాత్రం 'కీడు' గురించి అడుగుతూ ఉండేవాణ్ణి. నేనెక్కడ అందులో కూరుకుపోతానోనన్న భయం చేత అలా అడుగుతుండేవాణ్ణి. ఒకసారి నేను దైవప్రవక్త(స)ను, 'యా రసూలల్లాహ్! మేము అజ్ఞాన యుగంలో, కీడు ఉన్న కాలంలో జీవించేవాళ్ళం. తరువాత అల్లాహ్ మాకు (ఇస్లామ్ అనే) మేలును,**

255–1. బహుశా దైవప్రవక్త(స) వారి పేర్లను అబూహురైరాకు తెలిపి ఉంటారు. అందువల్లనే అబూహురైరా అంటూ ఉండేవారు– 'దేవా! హిజ్రీ 60వ సంవత్సరం నుండి నన్ను కాపాడు' అని. ఆ సంవత్సరమే యజీద్ పరిపాలనా పగ్గాలు చేపట్టాడు. అధికారంలోకి వచ్చిన చాలామంది యువకులకు అనుభవం ఉండదు. ఈ కారణంగా వారు అవలంబించే పరిపాలనా విధానాలలోని లొసుగులు బయటపడతాయి. అందుకేనేమో దైవప్రవక్తలలో అత్యధిక మందిని నలభై ఏళ్ళ తర్వాతనే ప్రవక్తగా నియుక్తం చేయటం జరిగింది.

**శుభాన్ని ప్రసాదించాడు. మరైతే ఈ మేలు తర్వాత మళ్ళీ ఏదైనా కీడు ఉన్న కాలం వస్తుందా?' అని అడిగితే "అవును" అని ఆయన(స) చెప్పారు. 'ఈ కీడు తర్వాత మళ్ళీ శుభం ఉన్న కాలం వస్తుందా?' అని నేను ప్రశ్నించగా, "అవును, వస్తుంది. కాని ఆ శుభంపై పొగ అలుముకుని ఉంటుంది" అని ఆయన (స) సమాధాన మిచ్చారు. 'ఇంతకీ ఏమిటి, ఆ పొగ?' అని నేను అడగ్గా, "నా విధానం, నా సంప్ర దాయం కాకుండా ఇతరత్రా పద్ధతులను అవలంబించేవారు పుట్టుకు వస్తారు. వాటిలో కొన్ని మంచివై ఉంటే, కొన్ని చెడ్డవై ఉంటాయి"[1] అని ఆయన(స) చెప్పారు. 'ఈ మేలు తర్వాత మరేదైనా కీడు ఉంటుందా?' అని నేను ప్రశ్నించగా, "అవును. నరక ద్వారాల వైపునకు పిలిచేవారు పుట్టుకువస్తారు. తమ మాటను విన్నవారిని వారు నరకంలో పడవేస్తారు" అని ఆయన(స) జవాబిచ్చారు. 'దైవప్రవక్తా! వారి లక్షణాలేమిటో వివరిస్తారా?' అని నేను విన్నవించుకోగా, "వారు మన జాతి వారే అయి ఉంటారు. మన మత ధర్మాన్నే అవలంబిస్తారు. మన భాషే మాట్లాడతారు" అని ఆయన(స) వివరించారు. 'ఒకవేళ వారి కాలం వరకు నేను జీవించి ఉన్నట్ల యితే అప్పుడు నేను ఎలా మసలుకోవాలో చెబుతారా?' అని నేను విన్నవించుకోగా, దైవప్రవక్త(స) ఇలా చెప్పారు : "ముస్లింల జమాఅత్‌కు, వారి నాయకునికి లోబడి ఉండాలి". 'ఒకవేళ ముస్లింలకు ఒక నేత, ఒక సాముదాయిక వ్యవస్థ లేనట్లయితే అప్పుడేం చేయాలి?' అని సందేహపడగా, "అప్పుడు ఆ వర్గాలు, ముఠాలన్నింటి నుండి నిన్ను నువ్వు వేరుపరచుకో. దాని కొరకు నీవు ఒక చెట్టువ్రేళ్ళను నమలవలసి వచ్చినాసరే (వెనుకాడకు), కడకు నీకు మృత్యువు దాపురించినా సరే ఆ స్థితిపైనే ఉండు (ఇది వారితో కలసి ఉండటం కన్నా మెరుగైనది)" అని ఉపదేశించారు.**

**257) హజ్రత్ హుజైఫా(రజి) తెలిపారు : నా స్నేహితులు (ప్రవక్త ప్రియ**

---

256-1. ఆ కాలం కూడా గడిచిపోయింది. ముస్లింలు మంచి పనులు చేసేవారు. నమాజ్ ఆచరించేవారు. ఉపవాసాలు పాటించేవారు. కాని దైవప్రవక్త(స)విధానానికి, సంప్రదాయానికి కట్టుబడి ఉండే విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శిం చారు. తత్కారణంగా ఎన్నో కొత్త పుంతలు తొక్కాల్సి వచ్చింది. బిద్అత్‌లలో చిక్కుకుపోయారు. అదీగాక వారు ఖుర్ఆన్, హదీసులను తమ వీపు వెనుక పడవేశారు. వాటి అవసరం ఇక తమకు లేదన్నట్లుగా వ్యవహరించారు. ఈ కారణంగా వారిలో అనేక చెడుగులు చోటుచేసుకున్నాయి.

**సహచరులు–రజి) ప్రవక్త మహనీయుల(స) నుండి శుభవంతమయిన స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. నేను మటుకు దుర్భర స్థితిని గురించి విచారించాను."**

**258) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హ్రజత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "ఇరువర్గాల వారు పరస్పరం పోరాడుకోనంత వరకు ప్రళయం నెలకొనదు. మరి చూడబోతే ఆ ఇరువర్గాలలోని ప్రతి ఒక్కరూ తామే సత్యంపై ఉన్నామని వాదిస్తారు."[1]**

**259) హ్రజత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "రెండు సమూహాలు (జమాఅత్‌లు) పరస్పరం మార్కొని యుద్ధం చేయనంతవరకూ ప్రళయం నెలకొనదు. ఈ రెండు సమూహాల మధ్యన భీకర పోరు జరుగుతుంది. మరి చూడబోతే ఆ రెంటి వాదన ఒక్కటే అయి ఉంటుంది. దాదాపు ముప్ఫయి అబద్ధీకులైన దజ్జాల్‌లు పుట్టనంత వరకూ ప్రళయం సంభవించదు. వారిలోని ప్రతి ఒక్కడూ తనను తాను దైవప్రవక్తగా ఊహించుకుంటాడు."**

**260) హ్రజత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) వివరించారు: మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) సన్నిధిలో ఉండగా, ఆయన(స) (హునైన్ యుద్ధప్రాప్తిని) పంపిణీ చేయసాగారు. అంతలో బనీ తమీమ్ తెగకు చెందిన ఒక వ్యక్తి– జుల్ ఖువైసర్– వచ్చి 'దైవప్రవక్తా! న్యాయంగా వ్యవహరించండి' అన్నాడు. ఈ మాట విన్న దైవప్రవక్త(స) "కడు శోచనీయం. నేనే న్యాయంగా వ్యవహరించకపోతే లోకంలో ఇక న్యాయం చేసేవాడెవడు? ఒకవేళ నేను అన్యాయం చేసినట్లయితే నేను సర్వనాశనం అవటం తథ్యం" అన్నారు. ఇది గమనించిన హ్రజత్ ఉమర్ (రజి), 'దైవప్రవక్తా! నేనితని మెడ నరకడానికి నాకు ఆనతినివ్వండి' అన్నారు.**

---

258–1. మేము ఇస్లామ్‌పై ఉన్నామని ఒక వర్గం అంటే, లేదు, మేమే అస్లాం అనుయాయులం అని రెండవ వర్గం వారంటారు. వాస్తవానికి వారిలో ఎవరో ఒక్కరే సత్యంపైన ఉంటారు. దైవప్రవక్త(స) చెప్పిన ఈ భవిష్యవాణి కూడా ఎప్పుడో నిజమయింది. హ్రజత్ అలీ(రజి)– హ్రజత్ ముఆవియా (రజి)కి మధ్యన యుద్ధం జరిగింది. రెండువైపుల కూడా ముస్లింలే ఉన్నారు. ఇరువర్గాల వారు కూడా తామే సత్యంపైన ఉన్నామని వాదించేవారు.

**దానికి ఆయన(స) "అతన్ని వదలిపెట్టండి. అతనికి జతగా మరికొంతమంది పుడతారు. మీరు మీ నమాజులను వారి నమాజులకన్నా హీనమైనవిగా తల పోస్తారు. మీరు మీ ఉపవాసాలను వారి ఉపవాసాల కన్నా అధమమైనవిగా భావిస్తారు. వారు ఖుర్ఆన్ పారాయణం చేస్తారు. కాని అది వారి గొంతులోనుండి క్రిందికి దిగదు. వేగంగా దూసుకుపోయే బాణం జంతువును ఛేదించుకుని వెళ్ళిపోయినట్లే వాళ్ళు ధర్మం (దీన్)లో నుంచి బయటికి వెళ్ళి పోతారు. ఆ బాణం మొనను చూస్తే దానిపై ఏమీ (రక్తం లాంటిది) కనిపించదు. తరువాత ఆ బాణాన్ని మొదటి నుంచి చివరి వరకూ పరిశీలనగా చూసినా కూడా ఏమీ కానరాదు. ఒకవేళ ఆ బాణానికి జత పరచబడి ఉన్న కర్రను చూసినా, అక్కడా ఎలాంటి గుర్తులు కనిపించవు. అలాగే దాని రెక్కను చూసినా దానిపై ఎలాంటి ఆనవాలు కనిపించదు, వాస్తవానికి రక్తసిక్తమైన మాలిన్యం నుండి ఆ బాణం దూసుకుపోయింది. వారి మరో ఆనవాలు ఏమిటంటే ఒక నల్లని వ్యక్తి ఉంటాడు. అతని ఒక భుజం స్త్రీ వక్షోజం మాదిరిగా ఉబ్బి ఉంటుంది లేదా మాంసపు ముద్దలా కదలుతూ ఉంటుంది. వీళ్ళు ముస్లింలకు చెందిన అత్యుత్తమ సముదాయంపై తిరుగుబాటు చేస్తారు". హజ్రత్ అబూ సయీద్ (రజి) ఇలా అంటున్నారు : నేను ఈ హదీసును దైవప్రవక్త (స) నుండి విన్నానని సాక్ష్యమిస్తున్నాను. ఆ మూకతో (అంటే ఖారిజీలతో) హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్(రజి) యుద్ధం చేశారని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను. ఆ సమయంలో నేను హజ్రత్ అలీ (రజి) పక్షాన ఉన్నాను. (దైవప్రవక్త సూచించిన ఆనవాళ్ళ ఆధారంగా) హజ్రత్ అలీ(రజి) ఆ వ్యక్తిని గాలించమని ఆజ్ఞాపించారు. చివరకు అతను తీసుకురాబడ్డాడు, నేను అతనిని చూస్తే అతని వాలకం అచ్చం దైవ ప్రవక్త(స) చెప్పినట్లుగానే ఉంది.**[1]

---

260–1. అంటే ఒక బాణం ప్రయోగించబడిన తరువాత – శరవేగంతో– లక్ష్యాన్ని ఛేదించుకుని అవతలకి వెళ్ళాక కూడా అది పరిశుభ్రంగా కనిపిస్తుంది. మరి యథార్థానికి అది వేట జంతువు శరీరంలోనుంచి బయటికి దూసుకువెళ్ళింది. రక్త మాంసాలను ఛేదించుకుని పోయింది. కాని వేగం కారణంగా ఆ బాణానికి రక్త మాంసాలు అంటుకోలేదు. అలాగే వాళ్ళు కూడా ధర్మానికి (దీన్‌కు) బహు దూరంగా ఉంటారు. పైకి వారు నికార్సయిన ధర్మావలంబీకుల్లా కానవస్తారు. కాని వారి అంతరంగంలో ధర్మం ఉండదు. వారే ఖారిజీ వర్గీయులు. వారు

**261) మహనీయ అలీ (రజి) ఈ విధంగా పలికారని సువైద్ బిన్ ఘఫలా తెలిపారు : మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఆధారంగా నేను మీకు ఏదయినా విషయం చెబుతున్నప్పుడు, నేను ఆయన(స)కు ఏదయినా అబద్ధం ఆపాదించటం కన్నా నాపైన మిన్ను విరిగి మీద పడటం మిన్నగా భావిస్తాను. అయితే నేను నా తరపున మీకేదన్నా మాట చెబితే, యుద్ధం ఎత్తుగడలకు, వ్యూహానికి మరో పేరని తెలుసుకోండి (అంటే యుద్ధం గురించి నా తరపున నేను ఏదన్నా కల్పించి చెప్పటం సంభవమే). చూడండి! నేను దైవప్రవక్త(స) చెప్పగా విన్నాను- ఆయన(స) ఇలా చెప్పేవారు : "చివరి కాలంలో కొంతమంది పుట్టుకువస్తారు. వారి పల్లు చిన్నవిగా ఉంటాయి. వారు మూర్ఖజనులై ఉంటారు. వారు చెప్పే పలుకులు ప్రపంచంలోని అత్యుత్తమమైన పలుకులు అయి ఉంటాయి. కాని బాణం జంతువు నుండి ఆవలి వైపునకు దూసుకుపోయినట్లే వారు ఇస్లామ్ నుండి వెడలిపోయి ఉంటారు. వారి విశ్వాసం (ఈమాన్) వారి గొంతులో నుండి క్రిందికి దిగదు. వారు మీకు ఎక్కడ కనిపించినా వధించండి. ఎందుకంటే వారిని సంహరించటం వల్ల సంహరించిన వానికి ప్రళయదినాన పుణ్యం లభిస్తుంది."[1]**

---

హజ్రత్ అలీ(రజి)కి, ముస్లింలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. కూఫా వాసుల మాదిరిగా వారు ఖచ్చితంగా నమాజ్ చేసేవారు. ధర్మపరాయణులుగా దర్శనమిచ్చేవారు. కాని ప్రతి చిన్న విషయంపై సామాన్య ముస్లిములను నిలదీసి, వారిని అవిశ్వాసులని ఫత్వాలు ఇచ్చేవారు. ఈ శాపగ్రస్తులను హజ్రత్ అలీ(రజి) సంహరించారు. ఈ హదీసు ద్వారా తెలిసిన మరో విషయం ఏమిటంటే ఖుర్ఆన్ను కేవలం కంఠస్థం చేసుకోవటం, దాని అర్థంపై యోచన చేయకపోవటం ఖారిజీల విధానం. దేవుని శరణు.

261-1. వారు ఖుర్ఆన్ చదవండి అని అంటారు. వారు ఖుర్ఆన్ చదువుతారు. కాని ఆ వాక్యాలకు పెడర్థాలు తీస్తారు. వారెవరో కారు, ఖారిజీలే. వారు బయలుదేరి నప్పుడు 'ఖుర్ఆన్ ప్రకారం నడుచుకోండి' అని మహనీయ అలీ(రజి)కి సలహా ఇచ్చేవారు. **"నిర్ణయాధికారం పూర్తిగా అల్లాహ్కే ఉంది"** (6: 57) అని ఖుర్ఆన్లో ఉన్నప్పుడు, మీరు మనుషులను న్యాయనిర్ణేతలుగా ఎందుకు నియ మిస్తున్నారు? అని నిలదీసి అడిగేవారు. ఖుర్ఆన్ గురించి వ్యాఖ్యానించేటప్పుడు దైవప్రవక్త(స) మాదిరిగా, సహాబా మాదిరిగా కాకుండా తమదైన భాష్యం

**262) హ్జ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) కథనం : మేము దైవప్రవక్త (సఅసం) ముందు (అవిశ్వాసుల వేధింపులను గురించి) ఫిర్యాదు చేసుకున్నాము. ఆ సమయంలో ఆయన(స) తన దుప్పటికి ఆనుకుని కాబా గృహం నీడలో కూర్చొని ఉన్నారు. 'దైవప్రవక్తా! మీరు మా కొరకు దైవ సహాయం ఎందుకు అర్థించరు? మాకు తోడ్పడమని అల్లాహ్ సన్నిధిలో ఎందుకు వేడుకోరు? (అవిశ్వాసుల ఆగడాలతో మేము విసుగెత్తి పోయాం)' అని ఆయన(స) ముందు విన్నవించు కున్నాము. దానికి సమాధానంగా ఆయన(స) ఇలా అన్నారు : "(విశ్వ సించిన దానికి శిక్షగా) మీకు పూర్వం గతించిన వారి కొరకు కందకాలు త్రవ్వ బడేవి. ఆ కందకాలలో వారిని నిలబెట్టి, వారి తలలను రంపపు కోతకు గురి చేసేవారు. ఆ విధంగా వారిని రెండు ముక్కలుగా చీల్చివేసేవారు. అయినా వారు తమ ధర్మం (దీన్) నుండి మరలిపోయేవారు కారు. ఇనుప దువ్వెనలను వారి శరీరాలలో గుచ్చి, వారి ఎముకల, ప్రక్కటెముకలపైని మాంసాన్ని చీల్చి తీసేవారు. అయినప్పటికీ వారు తమ విశ్వాసాన్ని(ఈమాన్‌ను) వదులుకునేవారు కారు. దైవసాక్షిగా చెబుతున్నాను. ఈ విషయం (ఇస్లామ్) కూడా పరిపూర్ణం కానున్నది. ఒక కాలం రానున్నది– అప్పుడు వాహనంపై స్వారీ అయిన వ్యక్తి (యమన్ రాజ ధాని అయిన) 'సనా' నుండి 'హజర్ మౌత్' పట్టణం వరకూ నిశ్చింతగా, నిర్భ యంగా ప్రయాణిస్తాడు. (శాంతిభద్రతలు నెలకొని ఉంటాయి) అతనికి ఒక్క దైవభీతి తప్ప మరెవరి భయం కూడా ఉండదు. లేదా కేవలం తోడేలు భయం ఉంటుంది. తన మేకలను తోడేలు తింటుందేమోనని (గొర్రెలకాపరి) భయపడతాడు. కాని మీరు తొందర పెడుతున్నారు."[1]**

---

చెప్పేవారు. అసలు వారు ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకోనే లేదు. అలాంటప్పుడు వ్యాఖ్యానం సరిగ్గా ఎలా చేయగలరు? ఈ కాలపు 'బిద్అతీల' ధోరణి కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. వారు తమ మిథ్యా విశ్వాసాలను నిజమని నిరూ పించుకోవడానికి ఖుర్‌ఆన్ ఆయత్‌లకు తప్పుడు అర్థాలు తొడుగుతారు.

262–1. మనిషిది తొందరపడే స్వభావం. ప్రతి పనీ ఇప్పుడే అయిపోవాలని అతను కోరు కుంటాడు. కాని ఇది సంభవం కాదు. అల్లాహ్ ప్రతి పనికీ ఒక సమయాన్ని నిర్ధారించాడు. అప్పటివరకూ ఓర్పు వహించాల్సిందే. ఓర్పు వహించినవారు తమ లక్ష్యాన్ని అందుకుంటారు.

**263) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తనకు తెలిపారని మూసా బిన్ అనస్ వివరించారు: ప్రవక్త మహనీయుల(సఅసమ్)కు ఒక రోజు సాబిత్ బిన్ ఖైస్(రజి) కనబడలేదు. అప్పుడు ఒక సహచర మాన్యులు, 'దైవప్రవక్తా! నేను మీ కొరకు ఆయన క్షేమ సమాచారం కనుక్కొని వస్తాన'న్నారు. అన్నట్లే ఆయన్ని వెతుక్కుంటూ ఆయన ఇంటికి వచ్చారు. సాబిత్ తన ఇంట్లో దుఃఖ వదనులై తల వంచుకుని కూర్చుని ఉన్నారు. 'ఎలా ఉన్నారు?' అని అడిగితే, 'బాగా లేను. నా పరిస్థితి చాలా దారుణంగా ఉంది'[1] అని సాబిత్ బిన్ ఖైస్(రజి) సమాధానమిచ్చారు. దైవప్రవక్త(సఅసం) సమక్షంలో బిగ్గరగా మాట్లాడటం ఆయనకు అలవాటు. అందుకే తన ఆచరణ అంతా వ్యర్థమైపోయిందనీ, తాను నరకవాసులలో ఒకడినయ్యానని ఆయన వివరించారు. ఆ సహాబీ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, అసలు విషయం తెలియజేశారు. మూసా బిన్ అనస్ ఇలా అన్నారు : ఆ సహాబీ రెండవ సారి సాబిత్ బిన్ ఖైస్ (రజి) వద్దకు వచ్చారు. అయితే ఈసారి చాలా పెద్ద శుభవార్తను మోసుకువచ్చారు. ఇంతకీ ఆ శుభవార్త ఏమిటంటే, దైవప్రవక్త(స) ఇలా అన్నారు: 'సాబిత్ దగ్గరకు వెళ్ళి, అతను నరకవాసి కాదని, అతను స్వర్గవాసులలో ఒకడనీ చెప్పు."[2]**

---

263–1. అల్ హుజురాత్ సూరాలోని రెండవ ఆయత్ అవతరించినప్పుడు సాబిత్ బిన్ ఖైస్(రజి) దుఃఖ వదనులయ్యారు. ఆయత్‌లో ఇలా అనబడింది : "విశ్వాసులారా! మీ కంఠస్వరాన్ని ప్రవక్త కంఠస్వరం కంటే పెంచకండి. మీరు పరస్పరం మాట్లాడుకునే విధంగా ప్రవక్తతో బిగ్గరగా మాట్లాడకండి. దానివల్ల బహుశా మీరు చేసినదంతా మీకు తెలియకుండానే వ్యర్థమైపోవచ్చు. ఆ సంగతి మీకు తెలియకనూ పోవచ్చు" (49: 2) సాబిత్ బిన్ ఖైస్(రజి) కంఠస్వరం కూడా పెద్దది.

263–2. సాబిత్ బిన్ ఖైస్(రజి) సుప్రసిద్ధ సహాబీ. దైవప్రవక్త(స) కొరకు తన ప్రాణాలను అర్పించడానికి సదా సిద్ధంగా ఉండే సహచరమాన్యులు. అయితే కొంతమంది శిష్యులకు బిగ్గరగా మాట్లాడే అలవాటు ఉండేది. సాబిత్ కూడా అలాంటి వారిలో ఒకరు. అందువల్ల ఆయన ఈ ఆయత్ అవతరించినంతనే ఆత్మ విమర్శన చేసుకుని, దుఃఖంలో మునిగిపోయారు. అయితే దైవప్రవక్త(స) ఆయనకు శుభవార్త వినిపించారు. సాబిత్ బిన్ ఖైస్(రజి) యమామా యుద్ధంలో అమరగతి నొందారు.

**264)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా అబూ ఇస్‌హాఖ్ విన్నారు. బరా ఇలా చెప్పారు : ఒక సహాబీ (ఉసైద్ బిన్ హుజైర్–రజి) నమాజులో అల్ కహ్ఫ్ సూరా పారాయణం చేశారు. ఆ ఇంట్లోనే– ఆ సమయంలో ఒక గుర్రం కట్టబడి ఉంది. సూరా పారాయణం చేయగానే ఆ గుర్రం ఎగరటం, దుమకటం మొదలెట్టింది. (కాని ఉసైద్ ఇదేమీ పట్టించుకోలేదు). ఆయన నమాజ్‌ని ముగిస్తూ సలాం చేశాక, తన నివాస గృహంపై ఒక మబ్బు తునక నీడ కల్పించటం గమనించారు. ఈ సంఘటన గురించి ఆయన దైవప్రవక్త(స) ముందు ప్రస్తావించినప్పుడు, "ఖుర్ఆన్ చదువుతూ ఉండు. అదొక ప్రశాంత స్థితి. ఖుర్ఆన్ పారాయణం వల్ల అది అవతరించింది" అని దైవప్రవక్త(స) చెప్పారు.

**265)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా అబూ ఇస్‌హాఖ్ విన్నారు. ఆయన(బరా) ఇలా అన్నారు: అబూబక్ర్ (రజి) నా తండ్రి దగ్గరకు– ఆయన ఇంటికి– వచ్చారు. ఆయన వద్ద ఒంటెపై ఉంచబడే ఒక పాలాన్(తొట్ల)ను కొన్నారు. తరువాత మా నాన్నతో, 'మీ అబ్బాయి చేత దీనిని మా ఇంటికి చేరవేసే ఏర్పాటు చెయ్యి' అని చెప్పారు. హజ్రత్ బరా (రజి) వివరించారు– నేను ఆ తొట్లను లేపుకుని ఆయన వెంట నడిచివెళ్ళాను. మా నాన్నగారు తనకు మూల్యంగా లభించిన నాణాలను పరికించడానికి బయలుదేరారు. (ఆ సందర్భంగానే) మా నాన్నగారు, అబూబక్ర్(రజి)తో, 'మీరు దైవప్రవక్త(స)తో కలసి సౌర్ గుహ నుండి ప్రస్థానం చేసిన వృత్తాంతాన్ని నాకు వినిపించండి. అప్పుడు మీరిద్దరు అక్కడ ఎలా గడిపారు?' అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన(రజి) ఇలా అన్నారు: 'ఓహెూ అదా! ఆ రోజు రాత్రంతా మేము నడుస్తూనే ఉన్నాము, మరునాడు ఉదయం కూడా నడిచాము. కాని మధ్యాహ్న సమయానికి ఆ దారంతా నిర్మానుష్యంగా తయారయింది. అక్కడ మనిషి జాడ అన్నదే లేదు. ఆ సమయంలో మాకు ఒక పెద్ద రాయి కనిపించింది. దానికి ఒక వైపున కాస్త నీడ ఉంది. మేము అక్కడే విడిది చేశాము. నేను స్వయంగా– నా స్వహస్తాలతో– దైవప్రవక్త(స) కోసం ఒక స్థలాన్ని శుభ్రం చేశాను. అక్కడే ఒక దుప్పటిని పరచాను. తరువాత, 'దైవప్రవక్తా! తమరు ఇక్కడ విశ్రమించండి. నేను మీకు కాపలాగా ఉంటాన'ని అన్నాను. దైవప్రవక్త(స) నిద్రపోయారు. నేను ఆ పరిసరాల్లో నలువైపులా చూడటానికి బయలుదేరాను. యాదృచ్ఛికంగా నాకొక గొర్రెల కాపరి కనిపించాడు. అతను కూడా తన గొర్రెల

మందను ఆ రాయి నీడలోకి తోలుకురావాలనుకున్నాడు. 'నీవు ఏ తెగ వాడివి?' అని నేనడిగాను. అతను మదీనా లేక మక్కాకు చెందిన ఫలానా వ్యక్తితో నాకు సంబంధం ఉంది అని అన్నాడు. 'నీ గొర్రెల పాలు మాకు లభిస్తాయా?' అని నేనడిగాను. 'లభిస్తాయి' అన్నాడతను. 'మా కోసం నీవు పాలు పితకగలవా?' అని అడిగితే, 'సరే' అన్నాడు. అప్పటికప్పుడే అతను ఒక గొర్రెను పట్టుకుని వచ్చాడు. 'ముందు దాని పొదుగుకు అంటుకుని ఉన్న దుమ్మును, వెంట్రుకలను తుడువు. ఇతర మాలిన్యాలనుండి శుభ్రపరచు' అని చెప్పాను– ఉల్లేఖకులైన అబూ ఇస్‌హాఖ్ ఇలా అన్నారు : హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) తన ఒక చేతిని మరో చేతిపై చరచి, ఆ వ్యక్తి పొదుగును శుభ్రపరచిన వైనాన్ని వివరించటం నేను గమనించాను. ఆ వ్యక్తి కొయ్యతో చెయ్యబడిన ఒక పిడతలో పాలు పితికాడు. నేను దైవప్రవక్త(స) కోసం ఒక పాత్రను తెచ్చుకున్నాను. ఆ పాత్రలోనే ఆయన(స) నీరు త్రాగేవారు. వుజూ చేసుకునేవారు– నేను ఆయన(స) దగ్గరకు వచ్చాను (ఆ సమయంలో ఆయన నిద్దరవుతున్నారు). నిద్ర లేపటం భావ్యం కాదనుకున్నాను. కాసేపాగి నేను మళ్ళీ వచ్చేటప్పటికి ఆయన(స)కు మెలకువ వచ్చింది. నేను పాలపాత్రపై కొంచెం నీళ్ళు పోశాను. దాంతో అడుగు భాగం చల్లబడింది. 'దైవప్రవక్తా! పాలు సేవించండి' అన్నాను. ఆయన(స) పాలు త్రాగటంతో నేనెంతో సంతోషించాను. "ఏమిటి, మనం బయలుదేరే సమయం ఇంకా ఆసన్నం కాలేదా?" అని ఆయన(స) అడిగారు. 'ఆసన్నమయింది' అని అన్నాను నేను. పొద్దు వాలగానే మేము బయలుదేరాము.

అంతలో సురాఖా బిన్ మాలిక్ మమ్మల్ని వెంబడిస్తూ సమీపించాడు. 'దైవ ప్రవక్తా! అతడు మా దగ్గరికి వచ్చేశాడ'ని అన్నాను. "దుఃఖించకు. అల్లాహ్ మనతో ఉన్నాడు" అని ఆయన(స) ఓదార్చారు. తరువాత ఆయన(స) అతన్ని శపించారు. అంతే, ఆ గుర్రం అతనితో సహా పొట్ట వరకూ నేలలో కూరుకుపోయింది. మరి చూడబోతే ఆ నేల చాలా గట్టిగా ఉంది– ఈ సందిగ్ధం ఉల్లేఖకునికి కలిగింది– అప్పుడు సురాఖా ఇలా అన్నాడు : "మీరు నన్ను శపించారనుకుంటాను. మీరు గనక నా విముక్తి కొరకు ప్రార్థిస్తే (ఈ గండం నుంచి గట్టెక్కిస్తే), దైవసాక్షి! మిమ్మల్ని గాలిస్తూ బయలుదేరిన వారందరినీ వెనక్కి మళ్ళిస్తాను" అని అభ్యర్థించాడు సురాఖా. దైవ ప్రవక్త(స) అతని విముక్తి కొరకు ప్రార్థించగా, అతను ఆ గండం నుంచి బయట పడ్డాడు. ఆ తరువాత అతనికి దారిలో ఎవరు కనిపించినా, "నేను

**ఇటు చాలా వెతికాను. కాని వారు నాకెక్కడా కనిపించలేద”ని అనేవాడు. అబూబక్ర్(రజి) ఇలా అన్నారు : “సురాఖా మాకిచ్చిన మాటను నిలుపుకున్నాడు.”[1]**

**266) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక పల్లెటూరి బైతును పరామర్శించటానికి వెళ్ళారు. ఆయన (స) ఎప్పుడు రోగిని పరామర్శించడానికి వెళ్ళినా, “ఫరవాలేదు. దైవచిత్తమయితే ఈ జ్వరం పాపాలను కడిగి వేస్తుంది” అని అనేవారు. ఆయన(స) ఆ పల్లెటూరి వ్యక్తితో కూడా అదే మాట అన్నారు– “చింతించాల్సిన పనిలేదు. ఇన్షాఅల్లాహ్ ఈ జబ్బు పాపాలను ప్రక్షాళనం చేసేస్తుంది” అని చెప్పారు. దానిపై ఆ వ్యక్తి ఇలా అన్నాడు : ‘పాపాలను ప్రక్షాళనం చేసేస్తుంది అని తమరు అంటున్నారు. అలా ఎన్నటికీ కాదు, ఇది తీవ్రమైన జ్వరం. కాని ఇక్కడ పరిస్థితి ఎలా ఉందంటే ఈ జబ్బు వృద్ధుని ప్రాణాలను తోడేస్తున్నది. గోరీకి పోయేవరకూ ఇది వదలిపెట్టేలా లేదు’. దానికి ఆయన(స), “అవునా, మరైతే అలాగే జరుగుతుంది” అని చెప్పారు.[1]**

**267) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ఒక వ్యక్తి మొదట్లో క్రైస్తవునిగా ఉండేవాడు. తరువాత అతను ఇస్లామ్లో ప్రవేశించాడు. అతను అల్ బఖరా, ఆలి ఇమ్రాన్ సూరాలు పారాయణం చేశాడు. ఆ తరువాత అతను దైవప్రవక్త(స) వద్ద గుమాస్తాగా పనిచేశాడు. కాని ఆ తర్వాత అతను ధర్మభ్రష్టుడు (ముర్తద్) అయిపోయి, మళ్ళీ క్రైస్తవం పుచ్చుకున్నాడు. ‘ముహమ్మద్(స) కొరకు**

---

265–1. హిజ్రత్ (వలస) సందర్భంగా మహాప్రవక్త(స) ద్వారా ఎన్నో ‘అద్భుతాలు’ జరిగాయి. వివిధ ఉల్లేఖనాలలో, సీరత్ గ్రంథాలలో వాటి వివరాలు వచ్చాయి. ఇక్కడ కూడా కొన్ని ‘అద్భుతాల’ప్రస్తావన వచ్చింది. వాటి ద్వారా ఆయన సత్యసంధత నిరూపితం అవుతోంది. మనోనేత్రం ఉన్నవారికి, ఆయన(స) దైవప్రవక్త అన్న విషయంలో లేశమయినా సందేహం కలగదు. కాని హృదయ అంధత్వం ఉన్నవారికి ఇలాంటి వెయ్యి అద్భుతాలు చూపినా అవి సరిపోవు.

266–1. అంటే, నీవు తలపోస్తున్నట్లే నీవు చచ్చిపోతావు. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ ఈ హదీసును పొందుపరచి తిబ్రానీ వెలికి తీసిన దీని రెండు కోణాలను మన ముందు ఉంచారు. ఆ వ్యక్తి మరునాడే చచ్చిపోయాడు. అంటే దైవప్రవక్త(స) చెప్పినట్లుగానే జరిగింది. మహనీయుల పట్ల దురుసుగా ప్రవర్తించటం, నిష్ఠూరంగా మాట్లాడటం వాంఛనీయం కాదు.

ఏదైతే నేను వ్రాశానో అది తప్ప అతనికి ఏమీ తెలీదు' అని ప్రేలాపన చేశాడు. ఆ తర్వాత దైవాజ్ఞానుసారం అతన్ని మృత్యువు కబళించింది. అతని సహవాసులు అతన్ని (క్రైస్తవ ఆచారం ప్రకారం) ఖననం చేశారు. కాని తెల్లవారేసరికల్లా అతని మృతదేహం సమాధి నుండి వెలికి వచ్చి నేలపై పడి ఉండటం అతని మనుషులు గమనించారు. ఇదంతా ముహమ్మద్(స) అనుచరుల నిర్వాకమే అనీ, అతను ముహమ్మద్(స) ధర్మాన్ని విడనాడటం వల్ల అక్కసుతో వారు అతన్ని సమాధి నుంచి తీసి బయట పడవేశారని నిందించారు. తరువాత వారు మరో లోతైన గోతిని త్రవ్వి ఖననం చేశారు. కాని తెల్లవారేటప్పటికి ఆ శవం మళ్ళీ బయటపడింది. ఈసారి కూడా వాళ్ళు అదే అభాండం మోపారు– ఈ వ్యక్తి ముహమ్మద్ (స) జీవన విధానాన్ని విడనాడటం వల్ల ఆయన అనుయాయులు ఆగ్రహంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. పిదప వారు మూడవసారి అతని కోసం సమాధిని త్రవ్వారు. తమ శక్తి మేరకు– ఎంత లోతుగా త్రవ్వగలుగుతారో అంతవరకూ– త్రవ్వి శవాన్ని అందులో పడవేశారు. కాని తెల్లవారేటప్పటికి అతని శవం మళ్ళీ బయటకు వచ్చేసింది. అప్పటికిగాని వారికి నమ్మకం కుదరలేదు– ఇదేదో మానవ మాత్రుని పనికాదని (ఈ వ్యక్తికి దైవశిక్ష చుట్టుకుందని). అందువల్ల వారతన్ని అలాగే (నేలపై) ఉండనిచ్చారు.[1]

**268)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించారని హ్రజత్ అబూ హురైరా(అజి) ఉల్లేఖించారు: "కిస్రా (ఈరాన్ చక్రవర్తి) అంతమయ్యాక మరే 'కిస్రా' పుట్టడు. ఖైసర్ (రోము చక్రవర్తి) అంతమయ్యాక మరే 'ఖైసర్' పుట్టబోడు. ఎవరి స్వాధీనంలో ముహమ్మద్(స) ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! మీరు వారి ధనాగారాలను దైవమార్గంలో అవశ్యంగా ఖర్చుపెడతారు."

**269)** హ్రజత్ జాబిర్ బిన్ సమురా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "కిస్రా అంతమైన మీదట మరే కిస్రా పుట్టడు. ఖైసర్ అంతమైన తర్వాత మరే ఖైసర్ పుట్టడు." ఉల్లేఖకుడు (మొదటి హదీసు మాదిరిగానే ఈ హదీసును కూడా వినిపించిన తర్వాత) ఇలా అన్నారు– "మీరు వారిద్దరి ఖజానాలను దైవమార్గంలో ఖర్చుపెడతారు" అని దైవప్రవక్త(స) చెప్పారు.

267–1. ఆ వ్యక్తి ధర్మభ్రష్టత (ఇర్తెదాద్)కు ఒడిగట్టడమే గాకుండా, సాక్షాత్తూ దైవప్రవక్త(స) పైనే నింద మోపాడు. తత్కారణంగా దైవాజ్ఞానుసారం– ఈ భూమి కూడా అతనికి తన గర్భంలో చోటివ్వలేదు.

**270) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయుల (సఅసమ్) కాలంలో ముసైలిమా కిజ్జాబ్ [1] మదీనా వచ్చాడు. 'దైవప్రవక్త(స) తన తదనంతరం ఖలీఫాగా బాధ్యతలు నాకు అప్పజెప్పేటట్లయితే, నేను ఆయన (స)కు లోబడి ఉంటాను' అని అతను ప్రకటించాడు. యమామా నుండి అతను చాలా మందిని తన వెంటబెట్టుకుని వచ్చాడు. దైవప్రవక్త(స) అతనికి నచ్చుజెప్పే ఉద్దేశంతో అతని దగ్గరకు వెళ్ళారు. ఆయన(స) వెంట సాబిత్ బిన్ ఖైస్ (రజి) కూడా ఉన్నారు. ఆయన(స) చేతిలో ఖర్జూరపు బెత్తం ఉంది. ముసైలిమా తన మనుషులతో పాటు ఆగి ఉన్నచోటికి దైవప్రవక్త(స) చేరుకుని, "(ఖిలాఫత్ చాలా పెద్ద విషయం. ఒకవేళ) నీవు నా వద్ద ఉన్న ఈ బెత్తాన్ని అడిగినా నేను నీకు ఇవ్వలేను. ప్రభువేచ్ఛను నీవు దాటవేయలేవు. ఒకవేళ నీవు ఇస్లామ్ నుండి మరలిపోతే అల్లాహ్ నిన్ను నాశనం చేసేస్తాడు. (కలలో) నాకు చూపబడిన వాడివి బహుశా నువ్వేనను కుంటాను" అని చెప్పారు.**

**(ఇబ్నె అబ్బాస్– రజి– ఇలా అన్నారు) అబూ హురైరా నాకు తెలిపిన దాని ప్రకారం దైవప్రవక్త(స) ఇలా చెప్పారు : "నేను నిద్రించి ఉండగా, (కలలో) రెండు బంగారు కంకణాలు నా చేతుల్లో ఉండటం చూశాను. ఈ కల కారణంగా నేను వ్యాకులతకు గురయ్యాను.[2] వాటిపై ఊదమని నాకు కలలోనే ఆజ్ఞాపించటం జరిగింది. నేను నోటితో ఊదగానే అవి ఎగిరిపోయాయి. దీని భావం ఏమిటంటే, ఇద్దరు అబద్ధీకులైన (బూటకపు) పైగంబరులు నా తదనంతరం బయల్పడతారు.[3] వారిలో ఒకడు అస్వద్ అన్సీ మరొకడు యమామా వాస్తవ్యుడైన ముసైలిమా కిజ్జాబ్.[4]**

---

270–1. ఆ అబద్ధీకుడు తనను తాను దైవప్రవక్తగా చెప్పుకునేవాడు. యమామా ప్రాంతంలోని అత్యధిక మందిని తన అనుయాయులుగా చేసుకున్నాడు.

270–2. అంటే నా తదనంతరం వారిద్దరూ తమను దైవ సందేశహరులుగా ప్రకటించుకుంటారు. దైవప్రవక్త(స) చెప్పినట్లే జరిగింది.

270–3. అంటే నా తదనంతరం వారిద్దరూ తమను దైవ సందేశహరులుగా ప్రకటించు కుంటారు. దైవప్రవక్త(స) చెప్పినట్లే జరిగింది. అస్వద్ దైవప్రవక్త(స) హయాంలోనే వధించబడ్డాడు. ముసైలిమా కిజ్జాబ్ హజ్రత్ అబూబక్ర్ (రజి) ఖిలాఫత్ కాలంలో– యుద్ధంలో– సంహరించబడ్డాడు.

270–4. 'యమామా' అనేది ఒక పట్టణం పేరు. ఇది మక్కాకు 'నాలుగు మంజిల్'ల దూరాన ఉంది.

**271)** మహనీయ అబూ మూసా అష్అరీ (రజి) తెలిపారు : ప్రవక్త మహ నీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా ముహమ్మద్ బిన్ అలా చెప్పారని నేననుకుంటున్నాను– మహాప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "నేను మక్కా నుండి ఖర్జూరపు తోటలున్న భూభాగానికి వలసపోతున్నట్లుగా కలగన్నాను. అది యమామా లేక హిజ్ర్ ప్రదేశం అని నా మనసులో ఆలోచన వచ్చింది. కాని అది యస్రిబ్(మదీనా మునవ్వరా). ఆ కలలో నేను ఇంకొకటి కూడా చూశాను– నేను ఖడ్గాన్ని ఝుళిపించగా, అది మధ్యలో నుండే విరిగిపోయింది. అది ఉహుద్ యుద్ధంలో ముస్లింలకు ఎదురైన పరాజయానికి చిహ్నం. నేను మరోసారి ఆ ఖడ్గాన్ని ఝుళిపించినప్పుడు, అది మునుపటికన్నా మంచిగా అయిపోయింది. అది మక్కాలో అల్లాహ్ ముస్లింలకు ప్రసాదించిన విజయానికి సంకేతం. ఆ తరువాత ముస్లిము లంతా ఏకమయ్యారు. నేను ఆ కలలోనే ఆవులను చూశాను. అల్లాహ్ ఏంచేసినా మేలైనదే చేస్తాడని గమనించాను. ఆవులు ఉహుద్ యుద్ధంలో వీరమరణాన్ని ఆస్వాదించిన వారికి సంకేతంగా ఉన్నాయి. ఇక అల్లాహ్ ఏంచేసినా మంచి చేస్తాడు అనేది సత్యప్రియులకు బద్ర్ మైదానంలో అల్లాహ్ ప్రసాదించిన విజయానికి ప్రతీక.

**272)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : హజ్రత్ ఫాతిమా(ర.అ) వచ్చింది. ఆమె నడిచే వైనం దైవప్రవక్త(సఅసమ్) నడకను పోలి ఉండేది. "అమ్మా! రా అమ్మా! నీకు స్వాగతం" అని ఆయన(స) పలికారు. ఆ తరువాత ఆయన(స) ఆమెను తన కుడివైపునో, ఎడమ వైపునో కూర్చోబెట్టుకున్నారు. ఆ తరువాత ఆయన ఆమె చెవిలో నెమ్మదిగా ఏదో చెప్పారు. అది విని ఆమె ఏడుపు మొదలెట్టింది. 'ఎందుకు ఏడుస్తున్నావు?' అని నేనామెను అడిగాను. మళ్ళీ – రెండవసారి– దైవప్రవక్త(స) ఆమె చెవిలో రహస్యంగా ఏదో చెప్పారు. అప్పుడామె నవ్వింది. ఇంత తొందరగా ఏడ్చి మళ్ళీ అప్పుడే ఆమె మోముపై నవ్వు కనిపించటం ఎప్పుడూ జరగలేదు (అని నా మనసులో అనుకున్నాను). 'ఇంతకీ దైవప్రవక్త(స) ఏమన్నారేమిటి?' అని నేనామెను అడిగాను. దానికి ఆమె, 'దైవప్రవక్త(స) జీవించి ఉన్నంత కాలం నేనా రహస్యాన్ని విప్పలేను' అని చెప్పారు. అందువల్ల ఆయన(స) పరమపదించిన తరు వాత, ఆ విషయమే నేను గుర్తుచేస్తే ఆమె ఇలా చెప్పింది : ఆయన(స) నా చెవిలో "అమ్మా! హజ్రత్ జిబ్రయీల్ ప్రతి ఏడాది నా చేత ఒకసారి ఖుర్ఆన్ పారాయణం చేయించేవారు. ఈ ఏడాది మాత్రం రెండు సార్లు పారాయణం చేయించారు. అందువల్ల నా మరణకాలం సమీపించిందన్న ఆలోచన దృఢమయింది. మరయితే

**నా కుటుంబీకుల్లో అందరికన్నా ముందు వచ్చి నన్ను కలుసుకునేది నువ్వే” అని చెప్పారు. ఆ మాట వినగానే నాకు ఏడుపు వచ్చింది. అప్పుడు ఆయన(స), “నీవు స్వర్గంలోని స్త్రీలకు నాయకురాలిగా చేయబడతావు లేదా విశ్వాస స్త్రీలకు నాయకు రాలివి అవుతావు. ఇది నీకు సంతోషకరం కాదా?” అన్నారు. ఆ మాట విని నేను నవ్వేశాను.**[1]

**273) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ప్రవక్త మహ నీయులు(సఅసమ్) తనకు జబ్బు చేసిన చివరి కాలంలో హజ్రత్ ఫాతిమా (ర.అ)ను పిలిపించి, నెమ్మదిగా ఆమెకు ఏదో చెప్పారు. దానికి ఆమె ఏడ్వసాగారు. తరువాత ఆయన(స) మళ్ళీ ఆమెను దగ్గరకు పిలిచి, నెమ్మదిగా ఏదో మాట చెప్పారు. అది విని ఆమె మందహాసం చేశారు. తరువాత నేను ఫాతిమా(ర.అ)ను ఆ రహస్యం గురించి అడిగితే, ఆమె ఇలా అన్నారు : మొదటిసారి ఆయన(స) నెమ్మదిగా నాతో సంభాషించినప్పుడు, ఈ వ్యాధిగ్రస్త స్థితిలోనే తనకు మరణం సంభవించనుందని చెప్పారు (అలాగే జరిగింది కూడా). అది విని నేను రోదించసాగాను. ఆ తర్వాత ఆయన(స) నెమ్మదిగా నాతో ఇలా అన్నారు : “నీవు నా ఇంటివారలలోని దానివి. నీవు అందరికన్నా ముందు వచ్చి నన్ను కలుసుకుంటావు”. ఇది విని నేను నవ్వాను.**[1]

**274) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం : హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఇబ్నె అబ్బాస్(రజి)ను తన దగ్గర కూర్చోబెట్టుకునేవారు. దీనిపై అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) ఉమర్(రజి)కు ఫిర్యాదు చేస్తూ, ‘ఈయన లాంటి కుర్రాళ్ళు మాకూ ఉన్నారు కదా! (ఈ అబ్బాయికే మీరు ఇంత ప్రాధాన్యత ఎందుకిస్తు న్నారు?) అని చెప్పగా, ‘ఈ అబ్బాయి దగ్గర ఉన్న జ్ఞానసంపద కారణంగానే ఇతనికి**

---

272–1. ఇతర ఉల్లేఖనాలలో ఇలా ఉంది : “నా మరణకాలం దగ్గర పడింది” అని ఆయన(స) చెప్పగానే, ఫాతిమా ఏడ్వసాగారు. “నీవు అందరికన్నా ముందు వచ్చి నన్ను కలుసుకుంటావు’ అని ఆయన(స) చెప్పగానే ఆమె నవ్వసాగారు. ఈ హదీసు ద్వారా హజ్రత్ ఫాతిమా (ర.అ) గొప్పదనం రూఢీ అవుతోంది. నిజం గానే ఆమె దైవప్రవక్త ముద్దుల కూతురు, గారాలపట్టీ.

273–1. ఆయన(సఅసం) చెప్పినట్లుగానే జరిగింది. దైవప్రవక్త(స) పరమ పదించిన ఆరు నెలల తర్వాత హజ్రత్ ఫాతిమా(ర.అ) కూడా కాలం చేశారు. ఈ హదీసు ద్వారా హజ్రత్ ఫాతిమా(ర.అ) విశిష్టత తెలిసి వస్తోంది.

**పెద్దపీట వేస్తున్నాన'ని ఉమర్(రజి) చెప్పారు. తరువాత ఆయన ఇబ్నె అబ్బాస్(రజి) నుద్దేశించి, 'ఇజాజాఅ నస్రుల్లాహి వల్ ఫత్‌హ్' వాక్యం అవతరణలోని మర్మాన్ని అడగ్గా, 'అందులో దైవప్రవక్త(స) మరణం గురించి చెప్పబడింద'ని ఇబ్నె అబ్బాస్ (రజి) వివరించారు. అంటే ఆ విషయం అల్లాహ్ తన సందేశహరునికి ముందస్తుగా తెలియపరిచాడు.[1] అది విని 'నేను అనుకునేది కూడా అదే' అని హజ్రత్ ఉమర్ (రజి) చెప్పారు.**

**275) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు: మరణవ్యాధికి గురై ఉన్నప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) దుప్పటి కప్పుకుని, ఒక మృదువైన వస్త్రాన్ని తలకు చుట్టుకుని బయటికి వచ్చారు. వేదికపై కూర్చుని దైవస్తోత్రం చేయవలసిన రీతిలో చేశారు. తరువాత ఇలా అన్నారు : ".... అమ్మాబాద్! ప్రజల జనాభా పెరుగుతూ ఉంటుంది. కాని అన్సార్ల జనసంఖ్య తగ్గుముఖం పడుతుంది. కడకు వారు అన్నంలో ఉప్పు మాదిరిగా (మరీ అల్ప సంఖ్యలో) ఉండిపోతారు. మరి మీలో ఎవరయినా అధికారంలోకి వస్తే, వారి ద్వారా ఎవరికయినా లాభనష్టాలు జరిగే అవకాశం ఉంటే అన్సార్లలోని సజ్జనుల విలువను తెలుసుకోవాలి. వారిలోని చెడ్డ వారిని మన్నించి వదలిపెట్టాలి"[1] - ఇది దైవప్రవక్త(స) చిట్టచివరి ప్రబోధనా సమావేశం.**

---

274-1. దైవప్రవక్త(స)కు ముందుగా తెలియపరిచినట్లే జరిగింది. అంటే దైవ సందేశాన్ని చేరవేసే కర్తవ్యం నెరవేరగానే ఆయనకు మరణ ఘడియ సమీపించింది. అల్లాహ్ తాను కోరిన దాసులకు, తాను కోరిన విషయాన్ని ముందుగా తెలియపరుస్తాడు. అంతమాత్రాన వారికి అగోచర విషయాల జ్ఞానం ఉందని అర్థం ఎంతమాత్రం కాదు. అగోచర విషయాల జ్ఞాని కేవలం అల్లాహ్ మాత్రమే. దైవప్రవక్తలయినా, దేవుని ప్రియతమ దాసులయినా– వారంతా అగోచరాల విషయంలో అల్లాహ్‌పై ఆధారపడి ఉన్నవారే. అల్లాహ్ తెలియపరచనంత వరకూ వారేమీ చెప్పలేరు.

275-1. ప్రవక్త (స) వారి ఈ భవిష్యవాణి కూడా అక్షర సత్యమయింది. అన్సార్లకు ఖిలాఫత్ (ప్రాతినిధ్యం) లభించదని ఆయన(స)కు తెలుసు. అందుకే వారి పట్ల సద్భావంతో మెలగాలని, వారివల్ల జరిగే పొరపొట్లను పెద్ద మనసుతో మన్నించా లని ఆయన(స) హితవు పలికారు. రానురాను వారి జనాభా క్షీణించసాగింది. అదే సమయంలో ఇతర వర్గాల జనాభా ఎన్నో రెట్లు పెరిగింది.

**276)** హజ్రత్ అబూబక్రా(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒకసారి హసన్(రజి)ను వెంటబెట్టుకుని బయటకు వచ్చారు. ఆ పిల్లవాణ్ణి ఎత్తుకుని వేదికపైకెక్కి ఇలా ప్రవచించారు : "(ప్రజలారా!) నా ఈ కుమారుడు నాయకుడు. బహుశా ఇతని ద్వారా అల్లాహ్ ముస్లింలలోని రెండు వర్గాల మధ్య సంధి చేయించ వచ్చు."[1]

**277)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) జాఫర్ బిన్ అబూ తాలిబ్, జైద్ బిన్ హారిసా (రజిఅల్లాహు అన్హుమా)లు యుద్ధంలో అమరగతి నొందారన్న సమాచారాన్ని ముందుగానే తన ప్రియసహచరులకు తెలియపరిచారు. ఆ సమయంలో ఆయన(స) కళ్ళగుండా అశ్రువులు జలజలా కారుతున్నాయి.

**278)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం: (నా వివాహం సంద ర్భంగా) "నీ దగ్గర తివాచీ ఉందా?" అని దైవప్రవక్త(సఅసమ్) దర్యాప్తు చేయగా, 'అయ్యో, మా దగ్గర తివాచీ ఎక్కడుంటుంది? (మేము పేదవాళ్ళం కదా!)' అని నేనన్నాను. దానికి ఆయన(స), "గుర్తుంచుకో! ఒకానొక కాలం రానున్నది. అప్పుడు నీ దగ్గర నాణ్యమైన తివాచీలు ఉంటాయి" అని చెప్పారు. ఇప్పుడు నేను మా ఆవిడతో 'నీ తివాచీని అవతలకు జరుపు' అని చెబితే, "అదేమిటి, నీ దగ్గర నాణ్యమైన తివాచీలు ఉండే కాలం రానున్నది" అని దైవప్రవక్త(స) చెప్పలేదా? అని ఆమె అంటుంది. ఆ మాట విని నేను నిశ్శబ్దంగా ఉండిపోతాను.[1]

**279)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం: హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) ఉమ్రా చేసే సంకల్పంతో (మక్కా నగరానికి) వచ్చారు. ఆయన వచ్చీ రాగానే అబూ సఫ్వాన్ ఉమయ్యా బిన్ ఖలఫ్ వద్ద విడిది చేశారు. ఉమయ్యా కూడా సిరియా దేశానికి వర్తకం నిమిత్తం వెళ్ళేటప్పుడు- మదీనా నగరంలో ఆగినట్లయితే- సాద్ బిన్ ముఆజ్(రజి) వద్దనే విడిది చేసేవాడు. ఉమయ్యా సాద్(రజి)తో, 'కాస్త

276-1. హజ్రత్ హసన్(రజి) ద్వారా వేలాదిమంది ముస్లిం యోధుల ప్రాణాలు రక్షించ బడ్డాయి. అమీర్ ముఆవియా (రజి)తో యుద్ధం చేసే శక్తి ఉండి కూడా ఆయన యుద్ధం చేయలేదు. ఆ విధంగా దైవప్రవక్త(స) భవిష్యవాణి నిజమయింది.

278-1. ఈ ఉల్లేఖనంలో దైవప్రవక్త(స) చెప్పిన ఒక భవిష్యవాణి ప్రస్తావనకు వచ్చింది. అది అక్షరాలా నిజమయింది. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) స్వయంగా దానిని కళ్ళారా చూసుకున్నారు.

ఆగు. మధ్యాహ్న సమయంలో అందరూ అలసత్వానికి లోనై ఉన్నప్పుడు కాబా గృహ ప్రదక్షిణ చేసుకుందువుగాని' అన్నాడు. (ఎందుకంటే ఆ రోజుల్లో ముస్లిములకు– మక్కాలోని బహు దైవారాధకులకు మధ్య శత్రుత్వం తీవ్రంగా ఉంది)– హజ్రత్ సాద్(రజి) కాబా గృహ ప్రదక్షిణ (తవాఫ్) చేసుకుంటూ ఉండగా, అబూజహల్ అక్కడకు వచ్చి, 'ఇక్కడ కాబా గృహ ప్రదక్షిణ చేస్తున్నదెవరు?' అని అడిగాడు. దానికి ఆయన 'నేను సాద్‌ను' అన్నారు. దానికి అబూ జహల్, "మీరంతా అక్కడ ముహమ్మద్(స)కు, అతని అనుచరులకు ఆశ్రయం కల్పించి ఉండగా, ఇక్కడ నువ్వు నిశ్చింతగా కాబా గృహ ప్రదక్షిణ చేసుకుంటావా? (ఎంత ధైర్యం నీకు)' అన్నాడు. 'అవును (ఆశ్రయం ఇచ్చిన మాట నిజమే) ఇప్పుడేమిటంటా?' అని సాద్(రజి) ప్రశ్నించారు. వారిద్దరి మధ్య మాటామాటా పెరిగింది. మధ్యలో ఉమయ్యా జోక్యం చేసుకుని, 'అబుల్ హకమ్ (అబూజహల్) ముందు హెచ్చుస్వరంతో మాట్లాడకు. ఆయన ఈ లోయకు నాయకుడు' అని నచ్చజెప్పాడు. హజ్రత్ సాద్(రజి) ఇలా అన్నారు: 'దైవసాక్షి! నీవు గనక నన్ను కాబా గృహ ప్రదక్షిణ నుండి ఆపావంటే, నేను నీ సిరియా వర్తకానికి ముగింపు పలుకుతాను (ఎందుకంటే సిరియా వెళ్ళాలంటే మదీనా మీదుగానే వెళ్ళవలసి ఉంటుంది). కాని ఉమయ్యా మాత్రం సాద్(రజి)కు పదేపదే సలహా ఇవ్వసాగాడు– అబూజహల్‌తో కాస్త నెమ్మదిగా మాట్లాడమని. చివరకు సాద్(రజి)కు అతనిపై కోసం వచ్చింది. 'చాలించు నీ వాగుడు. (నీవు అబూజహ్లొని వెనవేసుకుని రాకు). నీ గురించి దైవప్రవక్త(స) చెప్పగా నేను విన్నాను. అబూజహలే నీ చావుకు కారకుడవుతాడు అని దైవ ప్రవక్త(స) చెప్పారు. తెలుసా?' అని సాద్(రజి) అతని ముఖం మీదే చెప్పేశారు. 'ఏమిటి, నా చావుకు ఇతను కారకుడవుతాడా? ఎంతమాట?' అని ఆశ్చర్యపోతూ అడిగాడు ఉమయ్యా. 'అవును. నీ చావుకు' అని సాద్(రజి) రెట్టించారు. 'అవునా! దైవసాక్షి! ముహమ్మద్(స) ఎప్పుడయినా, ఏదయినా మాట చెప్పారంటే అది జరగకుండా ఉండదు' అన్నాడు ఉమయ్యా. ఆ తరువాత అతను తన భార్య దగ్గరకు వచ్చి, 'నా యస్రిబ్ సోదరుడు నాతో ఏమన్నాడో తెలుసా?' అన్నాడు. 'ఏమన్నా దేమిటి?' అందామె. 'అబూ జహల్ నా చావుకు కారకుడవుతాడట! అలా అని ముహమ్మద్(స) చెప్పారట!' అని చెప్పాడు ఉమయ్యా. దానికి ఆమె, 'దైవసాక్షి! ముహమ్మద్(సఅసం) నోట ఎప్పుడూ అబద్ధపు మాట రాదు' అని అంది– ఆ తరువాత ఏం జరిగిందంటే మక్కా వాసులు బద్ర్ యుద్ధం కొరకు బయలుదేరారు. ఉమయ్యాకు

పిలుపు వచ్చింది. అప్పుడు అతని భార్య అతనితో, 'నీ యస్రిబ్ సోదరుడు నీకు అందజేసిన సమాచారాన్ని అప్పుడే మరచిపోయావా?' అని గుర్తుచేసింది. అంతే, ఉమయ్యా జాగ్రత్తపడ్డాడు. బద్ర్ యుద్ధానికి వెళ్ళరాదని నిశ్చయించుకున్నాడు. కాని అబూజహల్ ఎంతకీ అంగీకరించలేదు. 'అయ్యో! నీవు రాకపోతే ఎలా? నీవు మక్కా ప్రదేశానికి నాయకుడివి. కనీసం ఒకట్రొండు రోజులకొరకయినా నీవు మా వెంట రావాల్సిందే' అని పురికొల్పాడు. ఆ విధంగా ఉమయ్యా బద్ర్ రణరంగానికి బయలు దేరాడు. అల్లాహ్ అతని కథను సమాప్తం చేయించాడు.[1]

**280)** మోతమర్ బిన్ సులైమాన్ ఇలా అన్నారు : నేను నా తండ్రి చెప్పగా విన్నాను. మరి ఆయనకేమో అబూ ఉస్మాన్ చెప్పారు– ఆయన ఇలా చెప్పారు : నాకు తెలియజేయబడినదేమంటే, ఒకసారి హజ్రత్ జిబ్రయీల్(అలైహిస్సలామ్) దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చి, ఆయన(స)తో సంభాషించసాగారు. ఆ సమయంలో విశ్వాసుల మాత హజ్రత్ ఉమ్మే సలమా (ర.అ) దైవప్రవక్త(స) సమక్షంలో కూర్చుని ఉన్నారు. హజ్రత్ జిబ్రీల్(అ) నిష్క్రమించిన తరువాత "ఆయన ఎవరో నీకు తెలుసా?" అని దైవప్రవక్త(స) అడిగారు. లేదా అలాంటి ప్రశ్నే వేశారు– అబూ ఉస్మాన్ ఇలా అన్నారు– 'ఆయన దిహ్యా కల్బీగారే కదా!' అని ఉమ్మే సలమా(ర.అ) సమాధానమిచ్చారు– ఉమ్మే సలమా ఇలా అంటున్నారు : 'దైవసాక్షి! ఆయన దిహ్యా కల్బీ అని నేననుకున్నాను. కాని చివరకు నేను దైవప్రవక్త(స) ప్రసంగం విన్నప్పుడు, ఆయన జిబ్రయీల్(అ) అని తెలిసింది. ఎందుకంటే ఆ ప్రసంగంలో ఆయన(స) జిబ్రయీల్(అ) రాక గురించి తెలియపరిచారు.'[1]

**281)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహో దయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా అన్నారు : "నేను (కలలో) చూశాను–

279–1. ఆ విధంగా ఈ భవిష్యవాణి నిజమయింది. ఉమయ్యా బద్ర్ యుద్ధానికి వెళ్ళ దలచుకోలేదు. కాని అబూజహల్ అతన్ని బలవంతంగా తీసుకెళ్ళాడు. చివరకు అతను యుద్ధంలో ముస్లింల చేతుల్లో వధించబడ్డాడు. దైవప్రవక్త(స) భవిష్య వాణుల్లో ఈ సంఘటనకు ప్రాముఖ్యత ఉంది.

280–1. హజ్రత్ జిబ్రయీల్(అ) అప్పుడప్పుడూ దిహ్యాకల్బీ (రజి) అనే సహాబీ ఆకారంలో ప్రత్యక్షమయ్యే వారన్నది సుప్రసిద్ధం. అల్లాహ్ తన దూతలకు ఆ శక్తిని వొసగాడు. వారు కోరిన ఆకారంలో రాగలరు. ఈ హదీసు ద్వారా దైవప్రవక్త(స) సత్య వంతులు అని రూఢీ అవుతోంది.

**జనులు ఒక బహిరంగ మైదానంలో సమావేశమవుతున్నారు. వారిలో నుండి అబూబక్ర్(రజి) లేచి ఒక బావి నుండి ఒకట్రొండు బక్కెట్ల నీరు తోడారు. నీళ్ళు తోడే సమయంలో ఆయనలో కొంత బలహీనత పొడసూపింది. అల్లాహ్ ఆయన్ని మన్నించుగాక! ఆ తరువాత ఆ బక్కెట్టును ఉమర్(రజి) తీసుకున్నారు. ఆయన చేతిలోకి రాగానే ఆ బక్కెట్టు మరింత పెద్దదయింది. నేను జనులలో ఆయన లాంటి బలాఢ్యుడైన పహి ల్వాన్‌ను, సాహసవంతుణ్ణి, ఆయన మాదిరిగా పనిచేసే కార్యశూరుణ్ణి చూడలేదు. (ఆయన ఎన్ని బక్కెట్ల నీరు తోడారంటే, ఆ నీళ్ళను) జనులు తమ ఒంటెలకు కూడా త్రాపి, తమ ఇళ్ళకు మోసుకుని వెళ్ళారు."[1]**

**-మరికొన్ని ఆధారాల ప్రకారం హజ్రత్ అబూబక్ర్(రజి) రెండు బక్కెట్లు తోడారు (అందులో సందేహానికి తావులేదు)**

## అధ్యాయం: 25

## అల్ బఖరా సూరాలో దైవోపదేశం

**గ్రంథం కల ప్రజలు తమ కన్నకొడుకులను గుర్తుపట్టినట్లే ఈ ప్రవక్త (ముహమ్మద్-స)ను గుర్తుపడతారు. కాని వారిలోని ఒక వర్గం బుద్ధిపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చుతోంది. [1] (2: 146)**

**282) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: యూదులు దైవప్రవక్త ముహమ్మద్(సఅసం) సమక్షంలో హాజరై, తమ వర్గానికి చెందిన ఒక స్త్రీ, ఒక పురుషుడు అక్రమ సంబంధం పెట్టుకున్నారని ఫిర్యాదు చేశారు. దానికి ఆయన(స), "శిలాశిక్ష (రాళ్ళు రువ్వే శిక్ష) గురించి తౌరాత్ గ్రంథం ఏమంటోంది?" అని అడి**

---

281-1. ఈ హదీసు ఖిలాఫత్ వ్యవస్థను సూచిస్తోంది. అంటే మొదట హజ్రత్ అబూబక్ర్ (రజి)కు ఖిలాఫత్ లభిస్తుంది. ఆయన బాగానే పరిపాలిస్తారుగాని హజ్రత్ ఉమర్(రజి) మాదిరిగా శక్తి, ఠీవి ఆయనలో ఉట్టిపడదు. ఉమర్(రజి) హయాంలో ముస్లింల ప్రాబల్యం, వైభవం నలుదిశలా మార్మోగుతుంది. దైవప్రవక్త(స) చెప్పినట్లే జరిగింది కూడా.

25-1. తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో ముహమ్మద్(స) ప్రవక్త ప్రస్తావన చాలా స్పష్టంగా ఉంది. గ్రంథం కల ప్రజలు ఆ విషయాన్ని చదివేవారు. ఆయన(స) రాకడను సత్యబద్ధమైనదిగా అంగీకరించేవారు కూడా. కాని వారు సన్మార్గ భాగ్యానికి నోచుకోలేదు. మొత్తానికి దైవప్రవక్త(స) సత్యవంతుడన్న విషయం ఈ అధ్యాయం ద్వారా నిరూపితం అయింది.

**గారు. మేము వారిని అవమానపరచాలని, కొరడా దెబ్బలు కొట్టాలని అంటోంది' అని వారు చెప్పారు. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) కల్పించుకుని, 'మీరు అబద్ధీకులు. తౌరాతులో శిలాశిక్ష విధించాలని ఉంది. తౌరాత్ గ్రంథం తీసుకురండి' అన్నారు. యూదులు తౌరాతు తెచ్చి, దానిని విప్పారు. కాని శిలాశిక్ష గురించి ఆదేశం ఉన్న వాక్యంపై యూదుడు తన చెయ్యి పెట్టి, దానిని మరుగుపరిచే ప్రయత్నం చేశాడు. దానికి ముందు, దాని తర్వాత ఉన్న వాక్యాలను మాత్రం చదివాడు. 'ఏదీ, నీ చెయ్యి కాస్త జరుపు' అని అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) చెప్ప డంతో, యూదుడు తన చేతిని జరిపాడు. అక్కడ 'శిలా శిక్ష' ఆదేశం ఉంది. అప్పుడు వారంతా 'ఓ ముహమ్మద్! అబ్దుల్లాహ్ బిన్ సలామ్ చెప్పినది నిజం.[1] నిజంగానే తౌరాతు గ్రంథంలో శిలాశిక్ష గురించి ఉంది' అన్నారు. అందువల్ల దైవప్రవక్త(స) ఆదేశంపై వారిద్దరికీ శిలాశిక్ష విధించబడింది- హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అన్నారు : రాళ్ళు రువ్వే సమయంలో వారిద్దరినీ నేను చూశాను, యూదు పురుషుడు ఆ స్త్రీపై వంగి, ఆమెపై రాళ్ళు పడకుండా రక్షించసాగాడు.**

## అధ్యాయం : 26

## ఏదైనా 'అద్భుతం' (చిహ్నం, సూచన) చూపమని బహుదైవారాధకులు దైవ ప్రవక్త(స)ను కోరటం- చంద్రుడు చీలిపోయిన దృశ్యాన్ని దైవప్రవక్త(స) చూపటం.[1]

**283) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఉల్లేఖించారు : మహాప్రవక్త**

---

282-1. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) గొప్ప యూదు పండితుడు. యూదులు ఆయన్ని ఎంతగానో ఆదరించేవారు. కాని ఈయన ఇస్లామ్ స్వీకరించగానే, ఈయన్ని వారు తూలనాడటం మొదలెట్టారు. ఇస్లామ్‌లో ఆయనకు గల స్థానం ఎంతో ఉన్నతమైనది.

26-1. ఎంత గొప్ప అద్భుతమిది! ఏ దైవప్రవక్తకూ ఇంత గొప్ప **'అద్భుతం'** వొసగబడలేదు. ముహమ్మద్ ప్రవక్త(స) చూపిన అద్భుతాలలోకెల్లా పెద్దది 'చంద్రుడు చీలిపోవటం' అని అత్యధిక మంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ఖుర్ఆన్‌లో చెప్పబడినట్లు ఇది ప్రళయ సూచనలలో కూడా ఒకటి. ఉదా హరణకు- ఈ ఆయత్: **"ప్రళయ గడియ దగ్గరకు వచ్చేసింది. చంద్రుడు చీలి పోయాడు"**. (54: 1)

20వ శతాబ్ది నుండే మానవుడు చంద్ర మండలానికి వెళ్ళి పరిశోధనలు చేస్తు

**(సఅసమ్) కాలంలో చంద్రుడు రెండు భాగాలుగా చీలిపోవటం జరిగింది. దానిపై మహాప్రవక్త(స), "ప్రజలారా! దీనికి మీరు సాక్షులుగా ఉండాలి" అన్నారు.**

**284) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: మక్కావాసులు మహా ప్రవక్త ముహమ్మద్(సఅసమ్)తో, తమకు ఏదయినా 'అద్భుతం' చేసి చూపమని కోరి నప్పుడు, ఆయన(స) 'షక్కుల్ ఖమర్'- అంటే చంద్రుడు రెండుగా చీలిపోయిన అద్భుతం చూపించారు.**

**285) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం : ప్రవక్త మహనీయుల (సఅసమ్) కాలంలో చంద్రుడు రెండు భాగాలుగా చీలిపోవటం జరిగింది.[1]**

## అధ్యాయం : 27

**286) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) వారి సమావేశం నుండి ఇద్దరు సహచరులు (ఉసైద్ బిన్ హుజైర్- రజి, అబ్బాద్ బిన్ బిషర్-రజి) లేచి, తమ ఇండ్లవైపునకు నడిచి వెళ్ళసాగారు. రాత్రి చీకటి సమయమది. కాని రెండు దీపాల మాదిరిగా ఏదో వస్తువు వారికి కాంతి చూపుతూ ఉంది. మరి వారిద్దరూ (రాత్రి పూట తమ తమ ఇళ్ళకు వెళ్ళేందుకు) వేరైనప్పుడు కూడా ఆ 'వస్తువు' వారిద్దరికీ తోడుగా- వేరై పోయింది. ఆ విధంగా వారు (దాని వెలుగులో) తమ ఇంటివారల వద్దకు చేరు కున్నారు.[1]**

---

న్నాడు. పరిశోధనల్లో తేలిన ఒక విషయం ఏమిటంటే; చంద్రుని ఉపరితలంపై- ఒకచోట- సుదీర్ఘమైన నెర్ర (అగాధం) ఏర్పడి ఉంది. ఆ అగాధం మరేదో కాదు, అది 'షక్కుల్ ఖమర్' అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

285-1. వేరొక ఉల్లేఖనం ప్రకారం రెండుగా చీలిపోయిన తరువాత ఆ రెండు భాగాలు మళ్ళీ కలసిపోయాయి. ఇన్షాఅల్లాహ్ దీని వివరాలు 'కితాబుత్తఫ్సీర్' (వ్యాఖ్యాన ప్రకరణం)లో రానున్నాయి.

ముహమ్మద్ ప్రవక్త(స) కనికట్టు మాయాజాలంతో ఈ భూమండలంపై అద్భుతాలు చేస్తున్నాడని, ఆకాశంపై అతని ఆటలు సాగవని కొందరు మక్కా లోని బహు దైవారాధకులు ఎద్దేవా చేసేవారు. అందుకే వారు చంద్రుణ్ణి చీల్చి చూపెట్టమని కోరారు. దైవాజ్ఞతో ఇది కూడా జరిగింది.

**287)** హజ్రత్ ముగీరా బిన్ షూబా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు: "నా అనుచర సమాజంలోని కొంత మంది సదా ఆధిక్యత పొంది ఉంటారు. కడకు ప్రళయం లేదా మృత్యువు వచ్చినప్పుడు కూడా వారు ఆధిక్యత పొంది ఉంటారు.

**288)** దైవప్రవక్త(సఅసం) చెప్పగా తాను విన్నానని ముఆవియా బిన్ అబీ సుఫ్యాన్(రజి) తెలిపారు : దైవప్రవక్త(స) ఇలా చెప్పారు: "నా అనుచర సమాజంలో నిత్యం ఒక వర్గం ఉంటుంది. అది దేవుని శాసనాంగం (షరీఅత్)పై స్థిరంగా ఉంటుంది. వారిని పరాభవం పాల్జేయాలని ప్రయత్నించేవారు, వారిని వ్యతిరేకించే వారు వారికి ఎలాంటి హాని చేకూర్చలేరు. ప్రళయం వచ్చేవరకూ వారు అదే స్థితిలో ఉంటారు". తమ కాలంలో వారు సిరియాలో ఉన్నారని ఉమైర్ బిన్ హానీ, మాలిక్ బిన్ యుఖామిర్, ముఆజ్ బిన్ జబల్(రజి) అభిప్రాయపడ్డారు. అమీర్ ముఆవియా ఇలా అన్నారు : చూడండి, ఈ మాలిక్ బిన్ యుఖామిర్ ఇక్కడ ఉన్నారు. ఈయన ఏమంటున్నారంటే, "ఆ ప్రజలు సిరియా దేశంలో ఉన్నార"ని ముఆజ్ బిన్ జబల్ (రజి) చెప్పగా విన్నారట!

**289)** తన తెగవారు చెప్పగా తాను విన్నానని షుర్ఖదా చెప్పారు– మరి వారేమో ఉర్వా నుండి సంగ్రహించారు. దాని ప్రకారం దైవప్రవక్త(సఅసమ్) ఉర్వాకు ఒక దీనార్ ఇచ్చి ఒక మేకను కొని తీసుకురమ్మన్నారు. ఆయన ఆ ఒక్క దీనారుతో రెండు మేకలను కొని, ఒక మేకను అమ్మేశారు. మేకతోపాటు ఆ దీనారును కూడా వాపసు చేశారు. దైవప్రవక్త ఆ సహచరుని (విజ్ఞతకు సంతోషించి) ఆయన వ్యాపారంలో శుభం వొసగమని దైవాన్ని ప్రార్థించారు. ఆ తరువాత ఆయన పరిస్థితి ఎలా తయారయిందంటే, ఆయన మట్టిని పట్టుకున్నా అందులో లాభం వచ్చేది.. ఉర్వా ఇలా అనేవారు : "గుర్రాల నుదురుతో ప్రళయం వరకూ 'శుభం' ముడవడి ఉంటుంది" అని దైవప్రవక్త(స) చెప్పారు. షబీబ్ ఇలా అన్నారు : 'ఉర్వా ఇంట్లో డెబ్భయి గుర్రాలు కట్టబడి ఉండటం నేను చూశాను'. సుఫ్యాన్ ఇలా

---

286–1) అది దైవప్రవక్త(స) ప్రార్థనా ఫలం. ప్రవక్త వేడుకోలు వల్లనే దేవుడు వారిద్దరికీ 'కాంతి'ని ప్రసాదించాడు. వారి చేతుల్లో ఉన్న కర్ర దీపం మాదిరిగా కాంతిమంతం అయిందని అబ్దుర్రజ్జాఖ్ ఉల్లేఖనంలో ఉంది. వారి చేతివ్రేళ్ళు వెలిగిపోయాయని మరికొంత మంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. అంటే వారి కర్ర మెరవసాగిందని కొందరు భావించగా, వారి చేతివ్రేళ్ళు కాంతి పుంజంలా వెలుగు చూపాయని మరికొందరు తలపోశారు.

అన్నారు : మేకను కొనమని దైవప్రవక్త(స) ఉర్వాకు చెప్పారు. ఆ మేక ఖుర్బానీ కొరకు ఉద్దేశించినది.

**290**) మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు : "గుర్రాల నుదుటికి శుభం ప్రళయదినం వరకూ ముడివడి ఉండేలా కట్టివేయటం జరిగింది."

**291**) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా వక్కాణించారు : "గుర్రం నుదుటికి శుభం ప్రళయం వరకూ ముడివడి ఉండే విధంగా కట్టివేయటం జరిగింది.

**292**) హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "గుర్రాలను మూడు రకాల మనుషులు పోషిస్తారు. వారిలో ఒకరి కొరకు అవి పుణ్యప్రదంగా ఉంటే, రెండవ వారి కొరకు ధర్మసమ్మతం (ముబాహ్)గా పరిగణించబడతాయి. మూడవ రకం మనుషుల కొరకు అవి సంకటంగా పరిణమిస్తాయి. ఎవరి కొరకు గుర్రం పుణ్యప్రదం అవుతుందో ఆ వ్యక్తి ఆ గుర్రాన్ని ధర్మయుద్ధం (జిహాద్) కొరకు పోషిస్తాడు. అతను గనక మేత ప్రదేశంలోగానీ, తోటలోగానీ ఆ గుర్రపు త్రాడును పొడవుగా ఉంచితే, ఆ గుర్రం మేత మేసినంత మేర అంతా ఆ వ్యక్తిపాలిట పుణ్యప్రదంగా పరిణమిస్తుంది. ఒకవేళ ఎప్పుడయినా అది త్రాడు త్రెంపుకుని నాలుగైదు అడుగులు దుమికినా, దాని లద్దె కూడా యజమాని పాలిట పుణ్యంగా మారుతుంది. ఒకవేళ ఆ గుర్రం ఏదయినా కాలువ గుండా సాగిపోతూ అందులోని నీరు త్రాగితే– దానికి నీరు త్రాపించే ఉద్దేశం యజమానికి లేకపోయినప్పటికీ– ఆ గుర్రం త్రాగిన నీరు యజమాని కొరకు పుణ్యంగా పరిణమిస్తుంది. మరే వ్యక్తి అయినా తన దైనందిన అవసరాల కొరకు, ఇతరుల ముందు ముష్టెత్తుకునే దుస్థితి రాకుండా ఉండేందుకు గుర్రం పెంచినట్లయితే, దాని మెడపై, వీపుపై ఉన్న దేవుని హక్కును అతను విస్మరించకుండా ఉంటే, ఆ గుర్రం అతని కొరకు– ఒక విధంగా– పరువు ప్రతిష్ఠలను కాపాడేదిగా ఉంటుంది. ఒకవేళ ఎవరయినా గుర్రాన్ని కేవలం గర్వాతిశయంతో, ప్రదర్శనాబుద్ధితో, ఇస్లాం అనుయాయుల శత్రుత్వంలో భాగంగా పెంచినట్లయితే అది అతని పాలిట ప్రాణసంకటంగా పరిణమిస్తుంది"– గాడిదల గురించి (ఎవరో) దైవప్రవక్త(స)ను ప్రశ్నించగా, "నాకు గాడిదల విషయమై ఏమీ అవతరించలేదు. కాకపోతే ఈ ఆయత్‌లు అవతరించాయి అని అన్నారు : 'ఎవడయినా రవ్వంత

**సత్కార్యం చేసి ఉన్నాసరే దాన్ని అతను చూసుకుంటాడు. అలాగే ఎవడయినా రవ్వంత దుష్కార్యం చేసి ఉన్నాసరే దాన్నీ అతను చూసుకుంటాడు."[1] (99: 7,8)**

**293) హజ్రత్ అనస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) తెలతెల వారుతుండగా ఖైబర్ నగరానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఖైబర్‌లోని యూదులు తమ గడ్డపారలను పట్టుకుని (పొలం పనుల కొరకు) వెళుతున్నారు. వారు ఆయన్ని చూడగానే, 'ముహమ్మద్(స) తమ సేనల సమేతంగా వచ్చేశార'ంటూ కేకలు పెడుతూ తమ కోటల వైపునకు పరుగెత్తారు. అప్పుడు దైవప్రవక్త(స) తన చేతుల్ని ఎత్తి, "అల్లాహు అక్బర్! ఖైబర్‌కు మూడింది. మేము ఎప్పుడయినా, ఏ జాతి ముంగిట అయినా (యుద్ధం కొరకు) వాలామంటే, ముందస్తుగా హెచ్చరించబడిన జనుల ఉదయం విపత్కరంగా పరిణమిస్తుంది" అని పలికారు.**

**294) హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు : 'దైవప్రవక్తా! మీరు ప్రవచించే ఎన్నో హదీసులను నేను వింటూ ఉన్నాను. కాని నేను వాటిని మరచిపోతుంటాను' అని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "నీ దుప్పటిని చాపు" అని చెప్పారు. నేను నా దుప్పటిని చాపి ఉంచగా, ఆయన(స) తన చేత్తో– దోసిలి నిండా– అందులో వేశారు. "దీనిని నీ శరీరానికి అద్దుకో" అని ఉపదేశించారు. నేను అలాగే చేశాను. అంతే, ఆనాటి నుండీ నేను ఎన్నడూ హదీసును మరువలేదు.[1]**

---

292–1. నేటి ఆధునిక యుగంలో గుర్రాల స్థానాన్ని మోటారు వాహనాలు, కార్లు ఆక్రమించాయి. ప్రతి రంగంలో నేడు వాటి ఆవశ్యకత ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వాలకు కూడా వాటి అవసరం ఏర్పడవచ్చు. అవి సాముదాయిక ప్రయోజనాల కొరకు ఉపయోగపడతాయి. అలాగాకుండా ఎవరయినా కేవలం తన బడాయిని చాటుకోవడానికి తన ప్రాంగణంలో పదేసి ఖరీదైన కార్లను నిలిపి ఉంచితే దానివల్ల ఆ దేశానికి కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు.

294–1. దైవప్రవక్త(స) వేడుకోలు శుభం వల్ల అబూ హురైరా(రజి) జ్ఞాపకశక్తి పెరిగిపోయింది. దుప్పటిలో ఆయన(స) వేడుకోళ్ళతోపాటు బరకత్(శుభం, సమృద్ధి)ని కూడా దోసిలి నిండా వేశారు. ఆ దుప్పటిని అబూహురైరా (రజి) తన హృదయానికి హత్తుకున్నారు. అంతే, ఆయన జ్ఞాపకం పదునెక్కింది. అయిదు వేల కన్నా ఎక్కువ హదీసుల్ని ఆయన కంఠస్థం చేసి, వాటిని పదిలపరచుకున్నారు.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

# 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

## అధ్యాయం: 1

### ప్రవక్త ప్రియ సహచరుల(ర.అన్హుమ్) విశిష్టత గురించి

**(ఇమామ్ బుఖారీ- రహ్మ) ఇలా అన్నారు: "ఏ ముస్లిమైతే[1] మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) సహచర్యం పొందాడో, లేదా ఆయన(స) దర్శన భాగ్యానికి నోచుకున్నాడో అతడు ప్రవక్త(స) సహాబి.[2]**

**295) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించి నట్లుగా హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖించారు : "ఒక కాలం రానున్నది. అప్పుడు ముస్లిం సమూహాలు ధర్మయుద్ధం చేస్తాయి. మీలో దైవప్రవక్త(స) సహచర్యం పొందిన సహాబీ ఎవరయినా ఉన్నారా? అని వారిని ప్రశ్నించినప్పుడు, 'అవును, ఉన్నారు' అని వారంటారు. ఆ సహాబీ శుభం వల్ల వారికి విజయం వరిస్తుంది. ఆ తర్వాత ఒకానొక కాలం వస్తుంది. అప్పుడు కూడా ముస్లిం దళాలు ధర్మయుద్ధం చేస్తాయి. ఆ సందర్భంగా, 'మీలో దైవప్రవక్త సాంగత్యం పొందిన**

---

1-1. అతడు పురుషుడైనా సరే- స్త్రీ అయినాసరే. పసివాడైనా సరే- బానిస అయినా సరే; అతడు మానవుడైనా సరే- జిన్ను అయినాసరే.

1-2. దైవప్రవక్త ముహమ్మద్(స)ను ఒకసారి కళ్ళారా చూడటం ఎంత గొప్ప భాగ్య మంటే జీవితాంతం చేసుకున్న ఆరాధన, సాధన అంతా దాని ముందు దిగదుడుపే... హజ్రత్ షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలాని (రహ్మ) ఏమన్నారంటే ఏ వలీ (అల్లాహ్ ప్రియతముడు) కూడా ఒక అధమశ్రేణి సహాబీతో సరితూగలేదు.

**మహనీయుల సావాసం పొందినవారు (తాబయి) ఎవరయినా ఉన్నారా?' అని ప్రశ్నించటం జరుగుతుంది. 'అవును, ఉన్నార'ని సమాధానం వస్తుంది. అప్పుడు ఆ తాబయి ద్వారా విజయం కొరకు ప్రార్థించటం జరుగుతుంది (వారికి విజయం లభిస్తుంది). ఆ తర్వాత ఒక కాలం వస్తుంది. అప్పుడు ముస్లింల సైనిక దళాలు ధర్మయుద్ధం చేస్తాయి. అప్పుడు, దైవప్రవక్త(స) సహచరుల శిష్యులలో ఏ ఒక్కరి వద్దనయినా సాంగత్యం పొందినవారు ఉన్నారా? అన్న ప్రశ్న వేయబడుతుంది. 'ఉన్నారు' అని జవాబు వస్తుంది. అప్పుడు వారి ద్వారా విజయం కొరకు దైవాన్ని అర్థించటం జరుగుతుంది. కడకు వారికీ విజయం లభిస్తుంది."[1]**

**296) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించారని హ్రజత్ ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) తెలిపారు: "నా అనుచర సమాజపు అత్యుత్తమ కాలం నా కాలం. ఆ తర్వాత మంచి కాలం ఈ కాలం తర్వాత వచ్చేవారిది. పిదప ఆ తర్వాత వచ్చేవారిది"– దైవప్రవక్త(స) తన కాలం తర్వాత రెండు కాలాలను గురించి ప్రస్తావించారో లేక మూడు కాలాల ప్రస్తావన చేశారో తనకు ఖచ్చితంగా జ్ఞాపకం లేదని ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) చెప్పారు– "మీ తర్వాత ఒక జాతి ప్రభవించ నున్నది. సాక్ష్యం ఇవ్వమని అడగకపోయినా సరే అది సాక్ష్యం ఇవ్వడానికి ముందుకు వస్తుంది. వారిలో నమ్మకద్రోహం, దొంగతనం ఎంతగా ప్రబలిపోతుందంటే, వారిపై ఎవరికీ నమ్మకం కుదరదు. వారు మొక్కుకుంటారు. కాని మొక్కుబడులు చెల్లించరు. (హరామ్ సొమ్ము తినీ తినీ) వారిలో ఊబకాయం సర్వసామాన్యమై పోతుంది."[1]**

---

295–1. దైవప్రవక్త(స) ఆ మూడు కాలాలలో ఉన్న మహనీయుల విశిష్టతను నొక్కి వక్కాణించారు. వారంతా ఆ కాలాలలోని సదాచార సంపన్నులుగా ఖరారయ్యారు. అందుకే ఆ మూడు కాలాలలో లేని ఏదయినా కొత్త పోకడను ధర్మంలో సృష్టిస్తే విద్వాంసులు దానిని 'బిద్అత్'గా పేర్కొన్నారు. బిద్అత్‌లో తాను కేవలం చీకటి తప్ప ఏ వెలుగునూ చూడలేదని షేఖ్ అహ్మద్ ముజద్దద్ సర్ హిందీ (రహ్మా) వక్కాణించారు.

296–1. మంచి కాలం తర్వాత రానున్న సోకాల్డ్ ముస్లింల ప్రస్తావన ఇందులో ఉంది. వారు నైతికంగా, క్రియాత్మకంగా అధమాతి అధమశ్రేణికి చెందినవారు. వారు మాట్లాడితే అబద్ధం చెబుతారు. అవినీతి, మోసం, విశ్వాస ఘాతుకం వారి

**297) మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) ఉల్లేఖించారు: "నా కాలపు ప్రజలు అందరికన్నా మంచివారు. ఆపైన వారి తర్వాతి వారు. పిదప వారి తర్వాతి వారు. ఆ తర్వాత ఎలాంటి వారు పుట్టుకు వస్తారంటే సాక్ష్యం ఇవ్వకముందే వారి నోటిపై 'ప్రమాణం' ఉంటుంది. ప్రమాణం చేయకముందే సాక్ష్యం కూడా ఇచ్చేస్తూ ఉంటారు."[1]– ఇబ్రాహీమ్ నఖ్‌యీ ఇలా అంటున్నారు: 'మేము బాల్యంలో ఉన్నప్పుడు, సాక్ష్యం ప్రమాణం లాంటి పదాలు మా నోట వస్తే చాలు, దాని కారణంగా మా పెద్దలు మమ్మల్ని దండించేవారు.**

## అధ్యాయం : 2

## ముహాజిర్ల అంతస్తు [1]

**హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి)– అంటే అబ్దుల్లాహ్ బిన్ అబీ ఖుహాఫా– కూడా ముహాజిర్లలోని వారే (హిజ్రత్ చేసినవారే). అల్లాహ్ ఆ ముహాజిర్ల గురించి ఇలా సెలవిచ్చాడు :**

**"(ఇంకా ఆ ఆస్తులలో) తమ ఇళ్ళ నుండీ, తమ ఆస్తిపాస్తుల నుండీ తరిమి వేయబడిన నిరుపేద శరణార్థులకు కూడా హక్కు ఉంది. వారు అల్లాహ్ అనుగ్రహాన్నీ, ఆయన ప్రసన్నతనూ కోరుకుంటున్నారు. ఇంకా వారు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ సహాయపడేందుకు సదా సంసిద్ధంగా ఉంటారు. వారే రుజు వర్తనులు." *(అల్ హష్ర్: 9)***

---

దినచర్య అయిపోతుంది. ధనవ్యామోహం, ప్రాపంచిక వ్యామోహంలో పడి వారు నీతి నియమాలకు తిలోదకాలు ఇస్తారు.

297–1. అంటే వారికి స్వయంగా వారి నోటిపై, మనోమస్తిష్కాలపై అదుపు ఉండదు. అబద్ధపు సాక్ష్యాలు ఇచ్చే, అబద్ధపు ప్రమాణాలు చేసే విషయంలో వారు ఏమాత్రం తటపటాయించరు. కారణం దైవభీతి లేకపోవటమే. నేడు మనం కాస్త సునిశిత దృష్టితో పరిశీలిస్తే జనులలో ఇలాంటి వారు చాలా ఎక్కువ మంది ఉన్నారని బోధపడుతుంది.

2–1. మక్కా విజయానికి పూర్వం– మక్కాలో బహుదైవారాధకుల ఆగడాలకు తాళలేక, తాము నమ్మిన ధర్మాన్ని (దీన్‌ను) పరిరక్షించుకోవడానికి తమ ఇల్లూ వాకిలిని వదలి మరో ప్రదేశానికి వలస పోయిన వారిని 'ముహాజిర్లు' అంటారు.

"మీరు ఒకవేళ ప్రవక్తకు సహాయం చెయ్యకపోతే, ఏమీ ఫర్వాలేదు. అవిశ్వాసులు అతనిని బహిష్కరించినప్పుడూ, అతను కేవలం ఇద్దరిలో రెండోవాడుగా ఉన్నప్పుడు, వారిద్దరూ గుహలో ఉన్నప్పుడూ, అతను తన స్నేహితునితో, 'విచార పడకు, అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు' అని అన్నప్పుడూ అల్లాహ్ అతనికి సహాయం చేశాడు." *(అత్ తౌబా : 40)*

హజ్రత్ ఆయిషా(ర.అ), అబూ సయీద్ ఖుద్రీ (రజి), అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా అంటున్నారు : "హిజ్రత్ సమయంలో హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) దైవప్రవక్త(స)కు తోడుగా సౌర్ గుహలో ఉన్నారు."

**298)** హజ్రత్ బరా (రజి) తెలిపారు: మహనీయ అబూబక్ర్(రజి) తన తండ్రి ఆజిబ్(రజి) నుండి ఒక ఒంటె తొట్టె (పాలాన్)ను పదమూడు దిర్హములకు కొనుగోలు చేశారు. తరువాత అబూబక్ర్(రజి), 'మీ కుమారుడు బరా ద్వారా ఈ తొట్టెను మా ఇంటికి చేరవేసే ఏర్పాటు చెయ్యండి' అని మా నాన్నగారితో చెప్పారు. దానికి మా నాన్న ఆజిబ్(రజి), 'మీరు దైవప్రవక్త(స)తో కలసి (మక్కా నుండి మదీనాకు) హిజ్రత్ చేసిన సంఘటనను విడమరచి చెప్పనంతవరకూ ఇది అయ్యే పని కాదు. నిజానికి ఆ సమయంలో బహుదైవారాధకులు మీరిద్దరినీ తీవ్రంగా గాలిస్తూ ఉన్నారు' అని అన్నారు. అప్పుడు అబూబక్ర్(రజి) ఇలా వివరించి చెప్పారు: 'మేము మక్కా నుండి బయలుదేరిన తరువాత రాత్రంతా నడుస్తూనే ఉన్నాము. పగలు కూడా మా ప్రయాణం కొనసాగింది. అయితే మధ్యాహ్నమవగానే నేను నలువైపులా దృష్టిని సారించి, ఎక్కడయినా ఏదయినా నీడ దొరుకుతుందేమోనని చూశాను. కాసేపు విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నాము. కడకు ఒక చట్టుబండ కనిపించింది. నేను దానిని సమీపించి నీడ ఉందో లేదో పరిశీలించాను. నీడ ఉంది. నేను దైవప్రవక్త(స) కోసం పరుపు పరచి, దైవప్రవక్తా! తమరు ఇక్కడ విశ్రాంతి తీసుకోండి అని విన్నవించుకున్నాను. ఆయన ఆ పరుపుపై శయనించారు. నేను బయటికి నడిచి, జనులు మమ్మల్ని వెతుక్కుంటూ వస్తున్నారేమోనన్న అనుమానంతో నలువైపులా చూశాను.

ఆ సందర్భంగా నాకు ఒక గొర్రెల కాపరి కనిపించాడు. అతను తన గొర్రెల్ని తోలుకుని ఆ చట్టుబండ వైపునకే వస్తున్నాడు. అతను కూడా మా లాగే నీడ కొరకు

అన్వేషిస్తున్నాడు. అబ్బాయ్! నీవు ఎవరి బానిసవు? అని నేను అడిగితే, అతను ఖురైషుల్లోని ఒక వ్యక్తి పేరు చెప్పాడు. నాకు ఆ వ్యక్తి ఎవరో తెలుసు. నీ గొర్రెల్లో పాలిచ్చేవి ఉన్నాయా? అని అతన్ని అడిగాను. ఉన్నాయని అతనన్నాడు. నీవు పాలు పితకగలవా? అని అడిగితే పితకగలనని ఆ అబ్బాయి బదులిచ్చాడు. నా అభ్యర్థనపై ఆ కుర్రాడు ఆ మందలోని ఒక గొర్రెను ఒక చోట కట్టేశాడు. నా సూచనానుసారం ఆ గొర్రె పొదుగుపై ఉన్న దుమ్ము ధూళిని కూడా దులిపాడు. నీ చేతుల్ని కూడా శుభ్రపరచుకో అన్నాను. అతను తన ఒక చేతిని మరో చేతిపై చరచి శుభ్రపరచు కున్నాడు. ఆ తరువాత పాలు పితకటానికి సంసిద్ధుడయ్యాడు. దైవప్రవక్త(స) కోసం నేను ముందు నుండే వెంట తెచ్చుకున్న చెంబు మూతికి గుడ్డ బిగించి కట్టి అతనికి ఇచ్చాను (అందులో కొద్దిగా చన్నీళ్ళు ఉన్నాయి). పితకబడిన పాలపై కొంచెం నీళ్ళు పోశాను. దాంతో అడుగు భాగం వరకు అది చల్లగా అయింది. దానిని తీసుకుని దైవప్రవక్త(స) సేవలో హాజరయ్యాను. అప్పటికి ఆయన(స)కు మెలకువ వచ్చింది. 'ఈ పాలు సేవించండి' అని విన్నవించుకున్నాను. ఆయన(స) తనివితీరా పాలు త్రాగారు. దాంతో నాకెంతో సంతోషం కలిగింది. ఆ తరువాత, 'దైవప్రవక్తా! ఇప్పుడు మనం బయలుదేరాల్సిన సమయం అయింద'న్నాను. దానికి ఆయన(స) "సరే. పదండి" అన్నారు. ఆ విధంగా మేము ప్రయాణమయ్యాము. మక్కా వారు మా అన్వేషణలో ఉన్నారు. కాని ఒక్క సురాఖా బిన్ మాలిక్ తప్ప వేరెవరూ మాకు తారసపడలేదు. సురాఖా తన గుర్రంపై స్వారీ అయి వస్తున్నాడు. నేనతన్ని చూడ గానే, 'దైవప్రవక్తా! మనల్ని వెంటాడుతున్న శత్రువు మనకు చాలా దగ్గరకు వచ్చే శాడ'ని అన్నాను. దానికి ఆయన(స), "విచారపడకు. అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడ"ని అన్నారు.

**299)** మహనీయ అబూబక్ర్ (రజి) చెప్పినట్లుగా హజ్రత్ అనస్(రజి) తెలిపారు : "మేము సౌర్ గుహలో దాగి ఉన్నప్పుడు, దైవప్రవక్త(స)తో, 'ఒకవేళ బహుదైవారాధకులలో ఎవరి దృష్టి అయినా మా అడుగుజాడలపై పడితే, అతడు మనల్ని ఇట్టే పసిగట్టేస్తాడ'ని అన్నాను. దానికి ఆయన(స), "ఓ అబూబక్ర్! ఏ ఇద్దరికి తోడుగా మూడవ వానిగా అల్లాహ్ ఉన్నాడో, వారికి హాని కలిగించే వాడెవడు?" అని పలికారు.

## అధ్యాయం : 3

## మహాప్రవక్త(సఅసం) ఈ విధంగా సెలవిచ్చారు :

“అబూబక్ర్(రజి) ద్వారాన్ని వదిలేసి (మస్జిదె నబవీకి చెందిన) మిగతా ద్వారాలన్నింటినీ మూసివేయండి”– ఈ హదీసును మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) దైవప్రవక్త(స) నుండి ఉల్లేఖించారు.

**300)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రసంగిస్తూ ఇలా అన్నారు– “అల్లాహ్ తన దాసుల్లో ఒకనికి ప్రపంచంలో మరియు పరలోకంలో ఉన్న దానిలో (వస్తు సామగ్రిలో) ఏదో ఒక దానిని ఎన్నుకునే స్వేచ్ఛను ఇవ్వగా ఆ దాసుడు అల్లాహ్ వద్దనున్న దానిని ఎంపిక చేసుకున్నాడు.” ఇది వినగానే అబూబక్ర్(రజి) ఎక్కి ఎక్కి ఏడ్వసాగారు. అబూ సయీద్ ఇలా అన్నారు : ఆయన ఏడుపుపై మాకు ఆశ్చర్యమేసింది. దైవప్రవక్త(స) ఎంపిక స్వేచ్ఛ నివ్వబడిన ఒకానొక దాసుని గురించి చెబుతుండగా ఈయన గారు ఎందుకు ఏడుస్తున్నారని మేము ఆశ్చర్యపోయాము. కాని అసలు విషయం ఏమిటంటే; ఆ దాసుడు ఎవరో కాదు, దైవప్రవక్తే(స). యథార్థానికి అబూబక్ర్(రజి) మాలో అందరి కన్నా గొప్ప జ్ఞాని. దైవప్రవక్త(స) ఒక సందర్భంగా ఇలా అన్నారు: “సహచర్యం రీత్యాగాని, సంపద దృష్ట్యా గానీ నా మీద అబూబక్ర్(రజి) ఉపకారం అందరికన్నా ఎక్కువ. ఒకవేళ నేను గనక నా ప్రభువు తప్ప వేరితరుల్లో ఎవరి నయినా నా ప్రాణ స్నేహితునిగా చేసుకోవలసి వస్తే అబూబక్ర్‌నే చేసుకునేవాణ్ణి. అయితే ఇస్లాంలోని సౌభ్రాతృత్వం, ఇస్లాం ప్రేమ ఆయన పట్ల ఉంది. చూడండి! (సహాబా ఇండ్ల వైపునకు తెరచుకునే) మస్జిద్ ద్వారాలన్నింటినీ మూసివేయండి. కేవలం ఒక్క అబూబక్ర్ ద్వారాన్ని మాత్రమే తెరచి ఉంచండి.”

## అధ్యాయం : 4

## దైవప్రవక్త(సఅసం) తరువాత అబూబక్ర్(రజి)కు– ఇతర సహాబీలపై– గల ప్రాధాన్యత

**301)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : “ప్రవక్త మహనీయుల (సఅసమ్) కాలంలోనే మాకు సహాబా మధ్యన–విశిష్టతకు సంబంధించిన– ఎంపికకై చెప్పబడినప్పుడు, మేము అందరికన్నా ముందు అబూబక్ర్(రజి)ను

**శ్రేష్టునిగా ఖరారు చేసేవారము. ఆ తరువాత ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)ను, ఆ తరువాత ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి)ను పేర్కొనేవారం."[1]**

## అధ్యాయం : 5

## "ఒకవేళ నేను గనక ఎవరినయినా ప్రాణ స్నేహితునిగా చేసుకునేటట్లయితే అబూబక్ర్(రజి)ను చేసుకునేవాణ్ణి"[1] అని ప్రవక్త మహనీయులు (సఅసమ్) సెలవీయటం

**302) హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు: "ఒకవేళ నేనే గనక నా అనుచర సమాజం (ఉమ్మత్)లోని ఏ వ్యక్తినయినా నా ప్రాణ స్నేహితునిగా చేసుకోవలసివస్తే అబూబక్ర్‌ను చేసుకునేవాణ్ణి. కాని ఆయన నా ధార్మిక సోదరుడు, నా స్నేహితుడు."**

**303) మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) వక్కాణించినట్లుగా అయ్యూబ్ ఉటంకించారు: "నేనే గనక ఎవరినయినా నా ప్రాణ స్నేహితునిగా చేసుకునే మాటైతే అబూబక్ర్‌ను చేసుకుని ఉండేవాణ్ణి. అయితే ఇస్లాంలోని సోదర భావం ఏమైనా చిన్నదా?"**

**304) ఖుతైబా, అబ్దుల్ వహబ్, అయ్యూబ్‌ల పరంపర ద్వారా కూడా ఇదే హదీసు విశదీకరించబడింది.**

---

301-1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ అత్యధిక మంది విద్వాంసుల అభిప్రాయాన్ని ముందుకు తీసుకువచ్చారు. వారి ప్రకారం అబూబక్ర్ సిద్దీఖ్(రజి)కు సహాబా అందరిపై ప్రాధాన్యతకు ఆస్కారముంది. తొలికాలపు మహనీయుల అభిమతం కూడా ఇదే. ఆ తరువాతి వారి అభిప్రాయం కూడా ఇదే. అయితే కొందరు పరిశోధకుల ప్రకారం మొదటి నలుగురు మార్గదర్శక ఖలీఫాలలో ఒకరిపై ఇంకొకరికి ప్రాధాన్యత కల్పించటం సరైనది కాదు. ఆ మేరకు ఖచ్చితంగా ఎలాంటి మూలాధారాలు లేవు. అందుకే వీరు, నలుగురూ గొప్పవారేనని, దైవప్రవక్త సహచరమాన్యులలో ఈ నలుగురికీ గల ప్రాధాన్యత తిరుగులేనిది అని అంటారు.

5-1. ఈ అధ్యాయం క్రింద వచ్చిన ఎన్నో ఉల్లేఖనాల ద్వారా హ్రజత్ అబూబక్ర్(రజి) గొప్పతనం తెలిసివస్తుంది.

**305) కూఫావాసులు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)కు లేఖ వ్రాస్తూ, తాతకు సంక్రమించవలసిన వారసత్వపు హక్కును గురించి ప్రశ్నించగా, ఆయన దానికి జవాబు ఇలా వ్రాశారు : దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు– "ఒకవేళ నేను గనక నా అనుచర సమాజంలో ఏ వ్యక్తినయినా నా ప్రాణస్నేహితునిగా చేసుకోవలసి వస్తే అబూబక్ర్‌ను నా ప్రాణ స్నేహితునిగా చేసుకునేవాణ్ణి"– మరి ఆ అబూబక్ర్ (రజి) గారే ఇలా అన్నారు: 'తాత తండ్రి లాంటివాడు (అంటే మృతుని తండ్రి జీవించి లేనట్లయితే తండ్రి వాటా తాతకు ఇవ్వబడుతుంది– అంటే తండ్రి స్థానంలో తాత వారసుడవుతాడు).**

## అధ్యాయం : 6

**306) ముహమ్మద్ బిన్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ గారికి ఆయన తండ్రి తెలిపిన దాని ప్రకారం ఒక స్త్రీ దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చింది (సహాయార్థం). "తరువాత రా అమ్మా" అని ఆయన(స) ఆమెకు చెప్పారు. దానికి ఆమె, 'సరే. తరువాత వస్తాను. కాని అప్పుడు తమరు లేకపోతే ఎలా?' అని ప్రశ్నించింది. అంటే ఒకవేళ మీకు మరణం సంభవిస్తే అప్పుడు ఎవరిని అడగాలి? అని ఆమె చెప్పదలిచింది. దానికి ఆయన(స) "అప్పుడు నేను గనక లేకుంటే నీవు అబూబక్ర్ వద్దకు వెళ్ళవచ్చు"[1] అన్నారు.**

---

306–1. ఈ హదీసు ద్వారా అవగతమయ్యే ఒక విషయం ఏమిటంటే, తన తదనంతరం అబూబక్ర్ (రజి) ఖలీఫా అవుతారన్న సంగతి ఆయన(స)కు 'వహీ' ద్వారా తెలిసిపోయింది. తిబ్రానీలోని వేరొక హదీసు ప్రకారం, 'దైవప్రవక్తా! మీ తదనంతరం మేము జకాత్ సొమ్మును ఎవరికి ఇవ్వాలి?' అని ప్రశ్నించగా "అబూబక్ర్‌కు ఇవ్వండి" అని ఆయన(స) చెప్పారు. కాని ఈ హదీసు సనదు బలహీనంగా ఉంది.

మరోఉల్లేఖనం ప్రకారం ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త(స) సమక్షంలో ప్రమాణబద్ధుడైన తరువాత, 'ఒకవేళ తమరు మరణిస్తే నేను ఎవరి దగ్గరకు రావాలి?' అని అడిగాడు. దానికి ఆయన(స), "అబూబక్ర్ దగ్గరకు" అని బదులిచ్చారు. 'ఆయన తరువాత ఎవరి దగ్గరకు రావాలి?' అని తిరిగి ప్రశ్నించగా, "ఉమర్ దగ్గరకు" అని చెప్పారు.

**307) హజ్రత్ అమ్మార్(రజి) ఇలా అనేవారు: "నేను దైవప్రవక్త (సఅసమ్)ను చూసిన తొలి కాలంలో ఆయన వెంట (ఇస్లామ్ స్వీకరించినవారిలో కేవలం) అయిదుగురు బానిసలు, ఇద్దరు స్త్రీలు, అబూబక్ర్ సిద్దీఖ్(రజి) తప్ప వేరెవరూ లేరు."[1]**

**308) హజ్రత్ అబూ దర్దా (రజి) వివరించారు : నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్) దగ్గర ఉన్న సమయంలో హజ్రత్ అబూబక్ర్(రజి) తన వస్త్రం అంచును పట్టుకుని, మోకాలు కనిపిస్తున్న స్థితిలో అక్కడికి వచ్చారు. దైవప్రవక్త(స) ఆ పరిస్థితిని చూసి, "మీ మిత్రుడు ఎవరితోనో గొడవ పడినట్లుగా ఉన్నాడ"ని చెప్పారు. అబూబక్ర్(రజి) అక్కడకు రాగానే సలామ్ చేసి, 'దైవప్రవక్తా! నాకూ– ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)కు మధ్య మాటామాటా పెరిగింది. ఆ సందర్భంగా నేను తొందరపడి, ఆయనతో పరుషంగా మాట్లాడాను. కాని తరువాత నా వల్ల జరిగిన పొరపాటుకు పశ్చాత్తాపపడి, క్షమించమని ఆయన్ని అభ్యర్థించాను. కాని ఇప్పుడాయన నాకు క్షమాభిక్ష పెట్టడానికి సిద్ధంగా లేరు. అందుకే నేను మీ సన్నిధిలో హాజరయ్యాను (దయచేసి తమరు ఆయనకు కాస్త నచ్చజెప్పండి)' అని విన్నవించుకున్నారు. ఇది విని, "అబూబక్ర్! అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక!" ఆయన(స) మూడుసార్లు ఈ మాట పలికారు. ఈ లోగా హజ్రత్ ఉమర్(రజి) కూడా తన ధోరణిని తలచుకుని సిగ్గుతో కుంచించుకుపోయారు. హజ్రత్ అబూబక్ర్(రజి) ఇంటికివెళ్ళి, 'అబూ బక్ర్(రజి) ఉన్నారా?' అని అడిగారు. లేరని తెలుసుకుని ఆయన కూడా దైవ ప్రవక్త(స) దగ్గరకు వచ్చారు. వచ్చీరాగానే సలామ్ చేశారు. దైవప్రవక్త(స) ముఖారవిందం ఆగ్రహంతో కందిపోయింది. అబూబక్ర్(రజి) భయపడిపోయారు. మోకాళ్ళపై కూర్చుని, 'యా రసూలల్లాహ్! దైవసాక్షిగా చెబుతున్నాను– ఈ వ్యవహారంలో తప్పు నా వల్ల జరిగింది' అన్నారు. ఈ మాట రెండుసార్లు పలికారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "అల్లాహ్ నన్ను మీ వద్దకు ప్రవక్తగా చేసి పంపాడు. మీరంతా నన్ను అబద్ధీకరించినప్పుడు, అబూబక్ర్ నన్ను సత్యవంతుడని ధ్రువ**

---

307–1. బానిసలు ఎవరంటే– 1) బిలాల్ 2) జైద్ బిన్ హారిసా 3) ఆమిర్ బిన్ ఫుహైరా 4) అబూ ఫకియా 5) ఉబైద్ బిన్ జైద్ హబ్షీ. ఇక స్త్రీల విషయానికి వస్తే హజ్రత్ ఖదీజా(ర.అ), ఉమ్మె ఐమన్. లేదా సుమయ్యా. స్వతంత్ర పురుషులలో అందరికన్నా ముందు ఇస్లామ్ స్వీకరించినవారు హజ్రత్ అబూబక్ర్(రజి). పిన్న వయస్కులలో ఎన్నదగినవారు హజ్రత్ అలీ(రజి).

**పరిచారు. తన ధన ప్రాణాల ద్వారా ఆయన నాకు సహాయపడ్డారు. మరి అలాంట ప్పుడు మీరు నా మిత్రుణ్ణి సాధించటం మానుకుంటారా? లేదా?" ఆయన(స) రెండు సార్లు ఈ విధంగా ప్రశ్నించారు. దైవప్రవక్త(స) ఈ విధంగా చెప్పిన నాటి నుంచీ అబూబక్ర్(రజి) మనసును ఎవరూ నొప్పించలేదు.[1]**

**309) హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈయన్ని 'జాతిస్సలాసిల్' యుద్ధానికి సారథిగా చేసి పంపారు. (అమ్ర్– రజి– ఇలా అన్నారు:) తరువాత నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై 'మీకు అందరికన్నా ఎక్కువ ప్రేమ ఎవరిపై ఉంది?' అని అడిగాను. దానికి ఆయన(స) "ఆయిషాపైన" అని చెప్పారు. 'పురుషులలో ఎవరిపైన ఉంది?' అని అడిగితే, "ఆమె తండ్రి (అబూబక్ర్) పైన' అని ఆయన (స) బదులిచ్చారు. 'ఆ తర్వాత?' అని నేనడిగితే, "ఉమర్ బిన్ ఖత్తాబ్ పైన" అని దైవప్రవక్త(స) చెప్పారు.**

**310) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "ఒక గొర్రెల కాపరి తన గొర్రెలను మేపుతూ ఉండగా, ఒక తోడేలు వచ్చి గొర్రెల మందలోని ఒక గొర్రెను ఈడ్చుకుని పోసాగింది. గొర్రెల కాపరి ఆ తోడేలు నుంచి తన గొర్రెను విడిపించే ప్రయత్నం చేస్తుండగా, ఆ తోడేలు ఇలా అంది: '(ఇప్పుడు నీవు దీనిని నా నుండి విడిపించుకోగలవు. కాని ప్రళయానికి ముందు) క్రూరమృగాలు చెలరేగిపోయే దినాన గొర్రెల్ని కనిపెట్టుకుని ఉండేది నేను కాక మరెవరు?' – దైవప్రవక్త(స) ఇలా**

---

308–1. అబూ యాలా ఉల్లేఖనంలో ఇలా వుంది: హజ్రత్ ఉమర్(రజి) దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చినప్పుడు ఆయన(స) ముఖం త్రిప్పుకున్నారు. ఉమర్ ఆ వైపు నుండి వస్తే అటు నుంచి కూడా ముఖం త్రిప్పుకున్నారు. ఎదురుగా వచ్చి కూర్చుంటే, అప్పుడు కూడా ముఖం త్రిప్పుకున్నారు. తన పట్ల కినుక వహించడానికి కారణం ఏమిటి? అని ఉమర్ అడగ్గా, "క్షమించమని అబూబక్ర్ అభ్యర్థిస్తే నీవు క్షమించ లేదు. ఎందుకని?" అని దైవప్రవక్త(స) నిలదీశారు.

ఈ హదీసు ద్వారా అబూబక్ర్(రజి) గొప్పతనం అవగతం అవుతోందని హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మా) వ్యాఖ్యానించారు. నిజానికి మొదట తప్పు అబూబక్ర్(రజి) ద్వారానే జరిగింది. కాని ఆయన తన తప్పును గ్రహించగానే క్షమాపణ కొరకు అర్థించారు.

**కూడా సెలవిచ్చారు : "ఒక వ్యక్తి ఎద్దు వీపుపై స్వారీ అయి, తోలుకుపోతుండగా ఆ ఎద్దు అతని వైపు తిరిగి, 'నేను పుట్టించబడినది ఈ పని కోసం కాదు కదా! నేను వ్యవసాయ పనుల కోసం పుట్టించబడ్డాను' అని చెప్పింది. అది విన్న ఆ వ్యక్తి 'సుబ్‌హానల్లాహ్! (పశువు కూడా మనిషి మాదిరిగా మాట్లాడుతోందే!) అన్నాడు". దైవప్రవక్త(స) ఇంకా ఇలా అన్నారు : "ఈ సంఘటనలను నేను విశ్వసించాను. అబూబక్ర్, ఉమర్ బిన్ ఖత్తాబ్ కూడా విశ్వసిస్తారు."[1]**

**311) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని మహనీయ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "నిద్రలో ఉండగా, కలలో నేను ఒక బావి వద్ద ఉన్నట్లు చూశాను. ఆ బావి వరపైన ఒక బకెట్టు ఉంది. నేను దానిని తీసుకుని అల్లాహ్ కోరినంతగా నీరు తోడాను. ఆ తరువాత అబూ ఖుహాఫా (అబూ బక్ర్-రజి) దానిని తీసుకుని ఒకట్రెండు బక్కెట్లు నీరు తోడారు. అలా తోడేటప్పుడు ఆయనలో బలహీనత కనిపించింది. ఆయన బలహీనతకు గాను అల్లాహ్ ఆయన్ని మన్నించుగాక! ఆ తరువాత ఆ బక్కెట్టు పెద్ద బకెట్టుగా రూపాంతరం చెందింది. దానిని ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) తన చేతిలో తీసేసుకున్నారు. ఉమర్ లాగా నీళ్ళు తోడే బలోపేతుడైన పహిల్వాన్‌ను నేను చూడలేదు. అతను ఎంత నీరు తోడాడంటే- జనులు తమ ఒంటెలకు పిల్ల కాలువ ద్వారా నీరు త్రాపుకున్నారు."[1]**

---

310-1. 'క్రూర మృగాల దినం' అంటే ప్రళయదినమే లేదా ప్రళయం ఆసన్నమవుతున్న సమయం. ఆ సమయంలో పశువుల కాపరులు తమ పశువుల్ని వాటి మానాన వదలివేస్తారు. ప్రతి ఒక్కరికీ తమ తమ ప్రాణాల చింత ఉంటుంది. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. అయితే ఇమామ్ బుఖారీ(రహ్మ) గారు హజ్రత్ అబూబక్ర్(రజి) గొప్పతనాన్ని ప్రస్తావించడానికి ఇక్కడ దీనిని పునరావృతం చేశారు.

311-1. ఇస్లామీయ ఖిలాఫత్ ఎలా ఉండబోతుందో ఈ హదీసులో సంకేత ప్రాయంగా తెలియజేయబడింది. దైవప్రవక్త(స) పరమపదించిన తరువాత హజ్రత్ అబూబక్ర్(రజి) రెండు సంవత్సరాలు పరిపాలించారు. కాని ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని నిలదొక్కుకున్నారు. ఆ తరువాత ఉమర్(రజి) పరిపాలనా యుగం మొదలయింది. ఆయన ఒక సమర్థుడైన పరిపాలకునిగా రాణించారు. ఆయన హయాంలో ఇస్లాం వెల్లువ సుదూరప్రాంతాల వరకు విస్తరించింది. ప్రజలు సిరిసంపదలతో తులతూగారు.

**312)** **మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : "ఎవరయితే తన అంగ వస్త్రాన్ని (ఇజారుగానీ, షరాయి గానీ, లుంగీ గాని) గర్వాతిశయంతో, అహంకారంతో నేలకు రాసుకునేలా కట్టుకుని తిరుగుతాడో అతనిపై అల్లాహ్ ప్రళయదినాన తన కటాక్ష వీక్షణాలను ప్రసరింపజెయ్యడు". దీనిపై హజ్రత్ అబూబక్ర్(రజి), 'నా అంగ వస్త్రంలోని ఒక భాగం- అప్పుడప్పుడూ- నేలకు రాసుకుంటూ ఉంటుంది. అయితే నేను జాగ్రత్తగా నడిచినప్పుడు అది రాసుకోదు' అని సందేహపడగా, "నీవు అహం కారం వల్ల అలా చేయవు కదా! (అందుచేత ఈ ఆజ్ఞ నీకు వర్తించదు)" అని దైవ ప్రవక్త(స) చెప్పారు. మూసా బిన్ ఉఖ్‌బా ఇలా అన్నారు : అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఈ హదీసులో 'తన ఇజారును ఈడ్చుకుంటూ నడిచే వ్యక్తి' అని చెప్పారా? అని నేను సాలిమ్‌ను అడగ్గా, 'ఎవడు తన వస్త్రాన్ని వ్రేలాడదీసుకుంటూ నడుస్తాడో' అని ఆయన ద్వారా నేను విన్నాను అని చెప్పారు.**[1]

**313)** **ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు : ప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "ఎవ రయితే దైవమార్గంలో ఏదేని వస్తువు యొక్క ఒక జతను వెచ్చిస్తాడో (ఉదాహరణకు- రెండు నోట్లు, రెండు వస్త్రాలు, రెండు గుర్రాలను దైవమార్గంలో ఖర్చు చేస్తాడో) అతనికి స్వర్గ ద్వారాల నుండి, 'ఓ దైవదాసుడా! ఇటువైపునకు రా. ఈ ద్వారం ఉత్తమమైనది' అని పిలుపు ఇవ్వబడుతుంది- నమాజీ అయిన వ్యక్తికి నమాజు ద్వారం నుండి పిలుపు అందుతుంది. దాత అయిన వ్యక్తికి దానధర్మాల ద్వారం నుండి పిలుపు ఇవ్వబడుతుంది. ఉపవాసి అయిన వానికి సియామ్, రయ్యాన్ ద్వారం నుండి పిలుపు వస్తుంది"- ఇది విని అబూబక్ర్(రజి), 'ఏ వ్యక్తికి ఆ ద్వారా**

---

312-1. ఆచరణలు సంకల్పంపై ఆధారభూతమై ఉంటాయి. ఒక వ్యక్తి ఎవరయినా తన అంగవస్త్రం విషయంలో జాగ్రత్తపడతాడు. గిలకలపైన ఉండేలా ధరిస్తాడు. కాని అతని అణువణువునా గర్వం పెనవేసుకుని ఉంటుంది. ఇలాంటి గర్విష్టికి వినాశం తథ్యం. అలాగే పరధ్యానంలో ఒక వ్యక్తి అంగవస్త్రం నేలకు రాసు కున్నంత మాత్రాన ప్రమాదం ఏమీ లేదు. అల్లాహ్ మనిషి సంకల్పాన్ని చూస్తాడు. అయితే బాహ్యంలో కూడా మనిషి వీలైనంత వరకు జాగ్రత్తగా వ్యవహరించటం మంచిది.

లన్నింటి నుండి పిలుపు వస్తుందో అతనికి ఎలాంటి భయం, చింత ఉండదు. మరి ద్వారాలన్నింటి నుండి పిలుపు అందుకునేవాడు కూడా ఉంటాడా దైవప్రవక్తా!' అని విన్నవించుకోగా, "అవును. అబూబక్ర్! అలాంటి వారిలో నువ్వు కూడా ఉంటావని నేనాశిస్తున్నాను" అని దైవప్రవక్త(స) చెప్పారు.

**314)** మహాప్రవక్త పవిత్ర సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు: దైవప్రవక్త(సఅసమ్) పరమపదించిన సమయంలో హజ్రత్ అబూబక్ర్(రజి) 'సునహ్' వాడలో ఉన్నారు. (అది మస్జిదె నబవీకి ఒక మైలు దూరంలో ఉంది). ఉల్లేఖకులలో ఒకరైన ఇస్మాయీల్ ప్రకారం 'అవాల్' అనే పేటలో ఉన్నారు.

దైవప్రవక్త(స) మరణవార్త వినగానే హజ్రత్ ఉమర్ చివాలున లేచి, 'దైవ సాక్షిగా! దైవప్రవక్త(స) మరణించటమా? అసంభవం' అన్నారు. హజ్రత్ ఆయిషా (ర) కథనం ప్రకారం హజ్రత్ ఉమర్(రజి) ఇలా అంటూ ఉండేవారు : 'దైవసాక్షి! ఆ క్షణంలో నా మదిలో కలిగిన ఆలోచన అదే. అల్లాహ్ ఆయన(స)కు ఈ వ్యాధి నుండి తప్పక స్వస్థతను ప్రసాదిస్తాడని అనుకున్నాను. (ప్రవక్త మరణం గురించి వదంతులు వ్యాపింపజేస్తున్న) వారి కాళ్ళు చేతుల్ని ఆయన(స) నరికివేస్తారని కూడా ఊహించాను'. అంతలో హజ్రత్ అబూబక్ర్(రజి) వచ్చారు. ఆయన ప్రవక్త నివాస గృహంలోనికి వెళ్ళి, దైవప్రవక్త(స) పార్థీవ శరీరంపైనున్న గుడ్డను తొలగించి ముద్దు పెట్టుకున్నారు. ఇలా అన్నారు : 'నా తల్లిదండ్రులు మీకు అర్పితం. మీరు జీవించి ఉన్న కాలంలో కూడా పవిత్రంగా ఉన్నారు. మరణం తరువాత కూడా పవిత్రంగానే ఉన్నారు.ఎవరి స్వాధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! అల్లాహ్ మీపైన రెండుసార్లు మరణం విధించడు'– ఆ తరువాత ఆయన బయటికి వచ్చి ఉమర్ (రజి)తో, 'ఒట్టేసుకుంటున్నవాడా! కాస్త నెమ్మదించు' అన్నారు. దాని మీదట సంభాషణ మొదలెట్టారు. దాంతో హజ్రత్ ఉమర్(రజి) నిశ్శబ్దంగా ఉండిపోయారు.

హజ్రత్ అబూబక్ర్(రజి) మొదట అల్లాహ్ స్తోత్రం చేశారు. తరువాత ఇలా అన్నారు: 'ప్రజలారా! చూడండి, ఒకవేళ ఎవరయినా ముహమ్మద్(సఅసమ్)ను ఆరాధించే మాటైతే, ముహమ్మద్(స) మరణించారన్న సంగతి వారికి తెలియాలి. ఎవరయినా అల్లాహ్‌ను ఆరాధిస్తున్నట్లయితే, అల్లాహ్ సజీవుడు, ఆయనకు ఎన్నటికీ మరణం రాదు. (పిదప అబూబక్ర్–రజి జుమర్ సూరాలోని ఈ ఆయత్‌ను పఠించారు) 'ఓ ప్రవక్తా! నీవూ మరణిస్తావు. వారు కూడా మరణించవలసిన వారే'**(30: 30).**

ఇంకా అల్లాహ్ ఏమని సెలవిచ్చాడంటే, 'ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. అతనికి పూర్వం కూడా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు అతను ఒకవేళ మరణిస్తే లేక హత్య చెయ్యబడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? జ్ఞాపకం ఉంచుకోండి, మరలిపోయేవాడు అల్లాహ్‌కు ఎలాంటి నష్టం కలిగించలేడు. కాని అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించేవారిని, ఆయన తగువిధంగా బహూకరిస్తాడు' (3: 144). ఇది విని జనులు ఎక్కి ఎక్కి ఏడ్చారని ఉల్లేఖకుడు తెలిపారు. ఉల్లేఖకుని ప్రకారం అన్సార్లు 'సఖీఫా బనీ సాయిదా'లో సాద్ బిన్ ఉబాదా (రజి) వద్ద సమావేశమై 'ఒక అమీర్ (నాయకుడు) మాలో నుంచి, మరో అమీర్ మీలో (ముహాజిర్లలో) నుంచి ఉండాలి' అని కోరారు. (అంటే ఇద్దరూ కలసి పరిపాలన చేయాలి). అంతలో అబూబక్ర్, ఉమర్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజిఅల్లాహు అన్హుమ్) అక్కడకు చేరుకున్నారు.

ఉమర్(రజి) సంభాషణ మొదలెట్టబోయారు. కాని అబూబక్ర్(రజి) ఆయనకు అడ్డు తగులుతూ, నిశ్శబ్దంగా ఉండమని చెప్పారు– ఉమర్ ఇలా అనేవారు: దైవసాక్షి! నేనలా చేయడానికి కారణమేమంటే, నేను ముందుగానే నాకెంతో ఇష్టమైన ప్రసంగాన్ని తయారు చేసుకుని ఉన్నాను. అయినప్పటికీ అబూబక్ర్(రజి)కి సమ ఉజ్జీ కావడానికి ఈ ప్రసంగం సరిపోదని భయపడ్డాను. ఎట్టకేలకు అబూబక్ర్(రజి) గంభీరంగా మాట్లాడటం మొదలెట్టారు. ఆయన తన ప్రసంగంలో ఇలా అన్నారు: "(ఖురైషులైన) మేము పాలకులుగా ఉంటాము (అన్సారులైన) మీరు సలహాదారులుగా, మంత్రులుగా ఉంటారు." ఈ మాట వినగానే హుబ్బాబ్ బిన్ ముంజిర్ మధ్యలో జోక్యం చేసుకుని, 'దైవసాక్షి! మేమలా జరగనివ్వము. ఒక నాయకుడు మీలోనివాడై ఉంటే, ఒక నాయకుడు మాలోని వాడై ఉంటాడు' అని కరాకండీగా చెప్పారు. దానికి అబూబక్ర్(రజి), 'లేదు. పరిపాలకులుగా మేముంటాము, మంత్రులుగా మీరుంటారు. (ఎందుకంటే) ఖురైషులు యావత్ అరేబియాలో మర్యాదస్తులుగా పరిగణించబడతారు. వారి రాజ్యం (అంటే మక్కానగరం) అరేబియా నడిబొడ్డున ఉంది. ఉమర్‌కు విధేయతా ప్రమాణం (బైఅత్) చేస్తారో లేదా అబూ ఉబైదా బిన్ జర్రాహ్‌కు ప్రమాణబద్ధులై ఉంటారో మీ ఇష్టం' అని స్పష్టం చేశారు. అప్పుడు ఉమర్ కల్పించుకుని, 'లేదు, మేమంతా మీ సమక్షంలో విధేయతా ప్రమాణం చేస్తాము. మీరు మా నాయకులు. మాలో అందరికన్నా ఉత్తములు మీరు.

**దైవప్రవక్త(స) దృష్టిలో కూడా మీరే మా అందరికన్నా ప్రియతములు' అని చెప్పారు. ఇలా అంటూ ఆయన హజ్రత్ అబూబక్ర్(రజి) చేయి పట్టుకుని, చేతిలో చెయ్యేసి విధేయతా ప్రమాణం (బైఅత్) చేశారు. ఆ తరువాత అందరూ 'బైఅత్' చేశారు. అంతలో ఎవరి కంఠమో వినిపించింది– 'మీరంతా కలసి సాద్ బిన్ ఉబాదా(రజి)ను చంపేశార'ని. ఉమర్(రజి) దానికి సమాధానమిస్తూ, 'అల్లాహ్ అభిమతం ఇదే' అన్నారు.**

**హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : మరణానికి ముందు దైవప్రవక్త(స) దృష్టి ఆకాశం వైపునకు మళ్ళింది. ఆ సమయంలో ఆయన(స) ఇలా పలికారు : "ఓ అల్లాహ్! నన్ను అత్యున్నతమైన సహచరుల్లో చేర్చుకో". ఆయన(స) ఇలా మూడుసార్లు పలికారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు : 'అబూబక్ర్, ఉమర్– వీరిద్దరి ప్రసంగాల ద్వారా లాభం చేకూరింది. ఉమర్(రజి) జనులను హెచ్చరించే ధోరణిలో మాట్లాడారు. ఎందుకంటే వారిలో కొందరు కపటులు కూడా ఉన్నారు. అందుచేత అల్లాహ్ ఈ విధంగా చేయించి (వదంతులు వ్యాపించకుండా) నిరోధించాడు. పిదప అబూబక్ర్(రజి) సత్యమైన వాక్కును, సన్మార్గాన్ని విశదపరి చారు. కర్తవ్య బోధ చేశారు. అంటే ఇస్లాంపై స్థిరంగా ఉండమని బోధపరిచారు. 'వమా ముహమ్మదున్ ఇల్లా రసూల్...' అనే ఆయత్‌ను పఠిస్తూ ఆయన బయటకు వచ్చారు.**[1]

---

314–1. మహనీయ అబూబక్ర్(రజి) చేసిన ఈ అద్భుత ప్రసంగం ఇస్లామీయ వ్యవస్థను చెల్లాచెదరవకుండా కాపాడగలిగింది. తమ వర్గానికి చెందిన వ్యక్తిని నాయకునిగా ఎంపిక చేయాలన్న అన్సార్ల ప్రతిపాదన సరైనది కాదు. ఒకే ఒరలో రెండు ఖడ్గాలు ఇమడలేవు. ఇద్దరు అమీర్లను నియుక్తుల్ని చేయాలన్న సాద్ బిన్ ఉబాదా (రజి) ప్రతిపాదనను గనక అమలుపరచి ఉంటే పరిణామం తీవ్రంగా ఉండేది.

ఈ హదీసు ద్వారా ఖిలాఫత్(ప్రాతినిధ్య) వ్యవస్థకు గల ప్రాముఖ్యత ఎటువంటిదో విదితమయ్యింది. ప్రవక్త ప్రియ సహచరులు దైవప్రవక్త(స) అంత్యక్రియల కంటే ముందే ఖలీఫాను ఎన్నుకుని ఒక అపురూపమైన ఆదర్శాన్ని నెలకొల్పారు. దురదృష్టవశాత్తు అలాంటి ప్రాతినిధ్య వ్యవస్థ స్థానంలో రాజరిక (ములూకియత్) వ్యవస్థ వచ్చింది. ముస్లింలు అరేబియా ఎల్లలు దాటి బయటి

**315) ముహమ్మద్ బిన్ హనఫియ్యా తెలిపారు : 'ప్రవక్త మహనీయులు(స) తర్వాత అందరికన్నా గొప్ప సహాబీ ఎవరు?' అని నేను మా నాన్నగారి (హజ్రత్ అలీ-రజి)ని అడిగితే, "అబూబక్ర్" అని ఆయన బదులిచ్చారు. 'ఆ తరువాత?' అని నేను ప్రశ్నించగా, "ఆ తరువాత ఉమర్(రజి)" అని ఆయన సమాధాన మిచ్చారు. 'ఆ తరువాత ఎవరు?' అని ఒకవేళ నేను అడిగితే, ఉస్మాన్(రజి) అని ఆయన అంటారేమోనని నేను భయపడి అలా అడగలేదు. 'ఆ తరువాత మీరేనని నేను భావిస్తున్నాను' అని నేను స్వయంగా చెప్పాను. దానికి ఆయన, "నేను ముస్లిం సముదాయంలోని ఒక సాధారణ సభ్యుణ్ణి మాత్రమే" అని చెప్పారు.[1]**

**316) హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ఒకానొక ప్రయాణంలో మేము దైవప్రవక్త(సఅసం) వెంట ఉన్నాము. మేము 'బైదా' లేదా 'జాతుల్ జైష్' స్థలానికి చేరుకున్నప్పుడు నా కంఠహారం ఒకటి తెగి క్రిందపడిపోయింది. అందువల్ల దైవ ప్రవక్త(స) దాన్ని వెతకటానికి అక్కడే బస చేశారు. ప్రవక్త ప్రియసహచరులు (రజిఅల్లాహ్ అన్హుమ్) కూడా ఆయన(స)తోపాటే- అక్కడే- విడిది చేశారు. కాని ఆ ప్రదేశంలో నీరు లేదు. సహాబా వద్ద కూడా నీరు లేదు. జనులు హజ్రత్ అబూ బక్ర్ (రజి) దగ్గరకు వచ్చి, 'ఆయిషా(ర.అ) ఏం చేశారో తెలుసా? ఆమె నిర్వాకం**

---

ప్రపంచంలో అడుగు పెట్టినప్పుడు అక్కడి సంస్కృతీ నాగరికతలకు, సావాసానికి ప్రభావితులై తమ విధ్యుక్త ధర్మాన్ని విస్మరించారు. పూర్వం తమ మార్గదర్శక ఖలీఫాలు అనుసరించిన విధానానికి తిలోదకాలిచ్చారు. అదే వారి పతనానికి కారణమయింది.

315-1 దైవప్రవక్త(స) తర్వాత వరుసగా అబూబక్ర్(రజి), ఉమర్(రజి) స్థానాలు వస్తా యని చెప్పేవారంతా హజ్రత్ అలీ(రజి)గారి ఈ పలుకులను ప్రాతిపదికగా చేసు కున్నారు. ఉదాహరణకు - అహ్లె సున్నత్‌కు చెందిన అత్యధిక మంది. అబ్దుర్రజాఖ్ ముహద్దిస్ (హదీసువేత్త) ఇలా అంటారు : "హజ్రత్ అలీ(రజి) స్వయంగా అబూబక్ర్, ఉమర్‌లకు తనపై ప్రాధాన్యత ఇచ్చారు. అందువల్ల నేను కూడా వారిద్దరికీ ప్రాధాన్యత ఇస్తున్నాను. అన్యధా నేనెన్నటికీ ప్రాధాన్యత ఇచ్చేవాడను కాను."

వేరొక ఉల్లేఖనంలో మహనీయ అలీ(రజి) ఇలా అన్నారు : "ఎవరయినా అబూబక్ర్, ఉమర్‌లపై నాకు ప్రాధాన్యతను కల్పిస్తే, అలాంటి వారిని నేను కల్పన చేసేవారుగా ఖరారు చేస్తాను."

**మూలంగా దైవప్రవక్త(స) ఇక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. ఇంతమంది సహచరులు కూడా ఉన్నారు. కాని ఇక్కడ నీరు లేదు. వారి వద్ద కూడా నీరులేదు' అని నిష్ఠూరంగా మాట్లాడారు.**

**అందువల్ల అబూబక్ర్ గుడారంలోనికి వచ్చారు. ఆ సమయంలో దైవ ప్రవక్త(స) నా తొడపై తన శుభప్రదమైన తలను ఆనించి నిద్రిస్తున్నారు. '(ఆయిషా!) నీ మూలంగా దైవప్రవక్త(స)తోపాటు ఇంతమంది సహాబా ఇక్కడ ఆగిపోవాల్సి వచ్చింది. చూడబోతే ఇక్కడ నీరు అన్నదే లేదు. సహాబా వద్ద కూడా నీరు లేదు' అంటూ అబూబక్ర్(రజి) నా మీద మండిపడ్డారు. దేవుడు తలచినన్ని గట్టి మాటలు నాకు వినిపించారు. కోపంతో నా పొట్టను గిల్లారు. ఆ నొప్పికి ఓర్చుకోలేక పోయాను. కాని ఏం చేసేది? దైవప్రవక్త(స) శుభప్రదమైన శిరస్సు నా తొడ మీద ఉంది. దైవప్రవక్త(స) గాఢ నిద్రలో ఉన్నారు. తెల్లవారింది. మరోవైపు నీరు లేదు. సరిగ్గా ఆ సమయంలోనే అల్లాహ్ 'తయమ్ముమ్' ఆజ్ఞను అవతరింపజేశాడు. అందరూ తయమ్ముమ్ చేసుకున్నారు. ఈ వెసులుబాటుపై ఉసైద్ బిన్ హుజైర్(రజి) ఇలా వక్కాణించారు : "ఓ అబూబక్ర్ కుటుంబీకులారా! మీ మూలంగా (ఉమ్మత్‌కు) ప్రాప్తమయిన మొదటి శుభం కాదిది". హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : నేను స్వారీ అయి వచ్చిన ఒంటెను లేపినప్పుడు, ఆ కంఠహారం అక్కడే లభించింది."[1]**

**317) అబూ సయీద్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు: "నా ప్రియ సహచరులను దూషించకండి.[1] ఒకవేళ**

---

316-1. ఆ కంఠహారం అసలు అస్మా (ర.అ) ది. అందుకే హజ్రత్ ఆయిషా(ర.అ) మరింత చింతాగ్రస్తులయ్యారు. తరువాత దైవకృప వల్ల అది లభించింది. ఉసైద్ బిన్ హుజైర్(రజి) పలుకుల్లోని పరమార్థం ఏమిటంటే అబూబక్ర్ కుటుంబీకుల వల్ల ముస్లిం సముదాయానికి సదా ప్రయోజనమే చేకూరింది. ఈ హదీసు లోగడ 'తయమ్ముమ్' ప్రకరణంలో కూడా వచ్చింది. ఇక్కడ మళ్ళీ దీనిని పునరావృతం చేయటంలోని ఉద్దేశం హజ్రత్ అబూబక్ర్(రజి) విశిష్టతను చాటి చెప్పటమే.

317-1. ముఖ్యంగా మక్కా విజయానికి పూర్వం విశ్వసించిన- తొలికాలపు- సహాబా గురించి మాట్లాడేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం.

**ఎవరయినా ఉహుద్ పర్వతానికి సమానంగా (దైవమార్గంలో) బంగారం ఖర్చు చేసినా అది నా సహాబీల ఒక 'ముద్' లేదా ముద్‌లో సగభాగానికి (ధాన్యానికి) కూడా సరితూగజాలదు.[2] షూబా గారితోపాటు ఈ హదీసును జరీర్, అబ్దుల్లాహ్ బిన్ దావూద్, అబూ ముఆవియా, ముహాజిర్ ప్రభృతులు కూడా ఆమష్ నుండి ఉటంకించారు.**

**318) తనకు అబూ మూసా అష్అరీ(రజి) తెలియజేశారని సయీద్ బిన్ ముసయ్యిబ్ చెప్పారు: ఆయన ఒక రోజు తన ఇంట్లో వుజూ చేసి, 'ఈ రోజు ఎలాగైనా సరే దైవప్రవక్త(సఅసం) సాంగత్యాన్ని వీడకూడదు' అన్న సంకల్పంతో బయలుదేరారు. తరువాత ఆయన మస్జిదె నబవీలో ప్రవేశించి దైవప్రవక్త(స) గురించి అడిగితే,[1] దైవప్రవక్త(స) అటువైపు వెళ్ళారని జనులు తనకు తెలిపారు. అందువల్ల నేను ఆయన(స) గురించి జనుల్ని అడుగుతూ వెనకాలే వెళ్లాను. చివరకు ఆయన(స) ఖుబా గ్రామానికి సమీపంలోనున్న 'బైరె అరీస్'[2] తోటలోనికి ప్రవేశిస్తూ నా కంటపడ్డారు. నేను ఆ తోట ద్వారం వద్దనే కూర్చుండిపోయాను. ఆ ద్వారం ఖర్జూరపు మండలతో తయారైనది. ఆయన(స) కాలకృత్యాలు తీర్చుకుని, వుజూ కూడా చేశాక నేను ఆయన్ని సమీపించాను. ఆ సమయంలో ఆయన(స) 'బైరె అరీస్' గట్టుపై తన పిక్కలు కనిపించేలా చేసి (వస్త్రం లేపి), తన రెండు కాళ్ళను**

---

317–2. ఎందుకంటే వారు కష్టకాలంలో సైతం దైవమార్గంలో ధనాన్ని ఖర్చు చేశారు. ముస్లింలు ఆపదలో ఉన్నప్పుడు, అవిశ్వాసులు ప్రాబల్యం వహించి ఉన్నప్పుడు, వారి ఔదార్యం వర్షించింది. ముఖ్యంగా అన్సారులు మదీనా నగరంలో తమ ముహాజిర్ సోదరుల పట్ల కనబరచిన త్యాగభావం అపూర్వం, అనితర సాధ్యం.

ఒకానొక వ్యవహారంలో ఖాలిద్ బిన్ వలీద్‌కి– అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌కి మధ్య గొడవ జరిగినప్పుడు ఖాలిద్ బిన్ వలీద్ పరుష పదజాలం ఉపయోగించారు. ఈ సంగతి తెలిసిన దైవప్రవక్త(స) తొలికాలపు సహాబా గొప్పతనాన్ని శ్లాఘిస్తూ పలికిన వాక్యాలివి.

318–1. ఆయన(స) ఎక్కడున్నారని అడిగితే...

318–2. 'అరీస్' మదీనాలోని సుప్రసిద్ధ తోట. దైవప్రవక్త(స) గారి ఉంగరం హజ్రత్ ఉస్మాన్(రజి) చేతివ్రేలిలో ఉండేది. అది ఆ తోట బావిలోనే పడిపోయింది. ఆనాటి నుంచే ఖలీఫా ఉస్మాన్(రజి) కష్టాల్లో పడ్డారు.

బావిలో వ్రేలాడేలా కూర్చుని ఉన్నారు. నేను ఆయన(స)కు సలామ్ చేసి, తిరిగి తోట ద్వారం వద్దకు వచ్చేశాను. ఈ రోజు నేను దైవప్రవక్త(స)కు ద్వారపాలకునిలా ఉండాలని మనసులో అనుకున్నాను. అంతలో మహనీయ అబూబక్ర్(రజి) వచ్చి, తలుపు తెరువబోతే, 'ఎవరు?' అని అడిగాను. 'నేను అబూబక్ర్‌ను' అన్నారాయన. 'కొద్దిగా ఆగండి' అని చెప్పి నేను దైవప్రవక్త(స) సమక్షంలో హాజరై, 'అయ్యా దైవప్రవక్తా! అబూబక్ర్ ద్వారం వద్ద వేచి ఉన్నారు. లోనికి రావటానికి మీ అనుమతి కోరుతున్నార'ని విన్నవించుకున్నాను. దానికి దైవప్రవక్త(స), "ఆయనకు అనుమతి ఇవ్వండి. స్వర్గ శుభవార్తను కూడా వినిపించండి" అని పలికారు. నేను తలుపు వద్దకు వచ్చి, 'లోనికి రండి. మీకు స్వర్గ శుభవార్తను వినిపించమని దైవప్రవక్త(స) చెప్పార'ని అబూబక్ర్‌తో అన్నాను. హజ్రత్ అబూబక్ర్(రజి) లోనికి వచ్చి, ఆ బావి గట్టుపై దైవప్రవక్త(స)కు కుడివైపున కూర్చుని, తన రెండు కాళ్ళను బావిలో వ్రేలాడదీశారు– దైవప్రవక్త(స) లాగానే ఆయన తన పిక్కలను కూడా విప్పారు.[3] నేను తిరిగి వచ్చి నా స్థానంలో కూర్చున్నాను.

నేను నా ఇంటి నుండి వెడలేటప్పుడు నా సోదరుడు వుజూ చేస్తూ ఉన్నాడు. అతను కూడా నా వెంట రావాలనుకున్నాడు. అల్లాహ్ అతనికి ఈ విషయాన్ని తెలియజేసి, అతను కూడా ఇక్కడకు వచ్చేలా చేస్తే ఎంత బాగుంటుంది! అని నా మనసులో అనుకున్నాను. అంతలో ఎవరో వచ్చి తలుపు తట్టారు. 'ఎవరు?' అని నేనడిగాను. 'ఉమర్ బిన్ ఖత్తాబ్‌ను' అని సమాధానం వచ్చింది. 'కొన్ని క్షణాలు ఆగండి' అని చెప్పి నేను ప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యాను. సలామ్ చేశాక 'ఉమర్ బిన్ ఖత్తాబ్ తలుపు దగ్గర నిరీక్షిస్తున్నారు. లోనికి రావడానికి తమరి ఆనతి కోరుతున్నార'ని చెప్పాను. "ఆయనకు ఆనతి ఇవ్వండి. స్వర్గ శుభవార్త కూడా వినిపించండి" అన్నారు ప్రవక్త మహోదయులు(స). నేను వచ్చి 'లోనికి దయ చేయండి. మీకు స్వర్గలోక శుభవార్తను వినిపించమని దైవప్రవక్త (స) చెప్పార'ని అన్నాను. ఆయన కూడా లోనికి వచ్చి, అదే బావి గట్టుపై,ఆయన(స)కు ఎడమ వైపున తన కాళ్ళను బావిలో చాపి కూర్చున్నారు. నేను నా స్థానం వద్దకు వచ్చి కూర్చున్నాను.

---

318–3. దైవప్రవక్త(స)కు అసౌకర్యం కలగరాదన్న ఆలోచనతో, ప్రవక్త(స) మొగమాట పడతారేమోనన్న భావంతో అబూబక్ర్ కూడా తన పిక్కలను విప్పారు.

**అల్లాహ్ ఫలానా వ్యక్తికి (అంటే తన సోదరునికి) కూడా ఈ సంగతి తెలిపి, అతను కూడా ఇక్కడకు వచ్చేలా చేస్తే ఎంత బాగుంటుంది! అని లోలోపలే అను కున్నాను. అంతలోనే ఇంకొక వ్యక్తి వచ్చి తలుపు తట్టారు. 'ఎవరు?' అని అడిగాను. 'నేను ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌ను' అని చెప్పారాయన. 'కాసేపు ఆగండి' అని చెప్పి, నేను దైవప్రవక్త(స) సమక్షంలోకి వచ్చి ఆయన రాక గురించి తెలియపరిచాను. దానికి దైవప్రవక్త(స), "ఆయనకు అనుమతి ప్రదానం చేయండి. ఆయనకు స్వర్గ శుభవార్తను వినిపించండి. అయితే ఆయనపై ఒక ఆపద వచ్చిపడుతుందని (శత్రువుల ద్వారా ముట్టడించబడతారని) ఆయనకు చెప్పండి."[4] అని చెప్పారు. నేను తలుపు వద్దకు వచ్చి 'లోనికి దయ చేయండి' దైవప్రవక్త(స) మీకు స్వర్గలోక శుభవార్తను వినిపించమన్నారు. అయితే మీపై వచ్చే ఒక ఆపద తర్వాత మీకు ఈ భాగ్యం ప్రాప్తమవుతుందని అన్నారు' అని చెప్పాను నేను. ఆయన లోనికి వచ్చారు. కాని బావి గట్టు (అరుగు) మీద చోటు లేకపోవటం చేత మరోవైపు దైవప్రవక్త(స)కు ఎదురుగా కూర్చున్నారు– షరీక్ ఇలా అన్నారు : సయీద్ బిన్ ముసయ్యిబ్ ఈ హదీసు (విషయం) లోతుల్లోకి వెళ్ళి, ఆ మహానుభావుల సమాధులు అదే క్రమంలో ఉంటాయని భావార్థం చెప్పారు.[5]**

**319) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్(ర.అన్‌హుమ్)లను వెంటబెట్టుకుని ఉహుద్ పర్వతంపైకి ఎక్కినప్పుడు, అది వణకసాగింది. అప్పుడు దైవప్రవక్త(స) దానిని ఉద్దేశించి, "ఉహుద్! నెమ్మదించు. నీపైన ఒక దైవసందేశహరుడు, ఒక సత్య సంధుడు, ఇద్దరు అమరగతులు ఉన్నార"ని [1] పలికారు.**

---

318–4. దైవప్రవక్త(స) చెప్పినట్లుగానే తిరుగుబాటుదారులు మదీనాలో ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(రజి) నివాస గృహాన్ని ముట్టడించి, ఆయన్ని హతమార్చారు.

318–5. ఈ పలుకులు సయీద్ బిన్ ముసయ్యిబ్ విజ్ఞతకు, బుద్ధి కుశలతకు దర్పణం. ఈయన ఊహించినట్లుగానే అబూబక్ర్(రజి) దైవప్రవక్త(స)కు కుడిప్రక్కన, ఉమర్ (రజి) ఎడమ ప్రక్కన సమాధి చేయబడగా, ఉస్మాన్(రజి) మాత్రం ప్రవక్త పవిత్ర సమాధికి ఎదురుగా– కొంత దూరాన ఉన్న– జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు.

319–1. సుబ్‌హానల్లాహ్! ఈ హదీసు కూడా మహాప్రవక్త(స) గారి అద్భుతాలకు దర్పణం

**320)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు : "నేను (కలలో) ఒక బావి వద్ద నిలబడి అందులోనుంచి నీళ్ళు తోడుతున్నాను. అంతలో నా దగ్గరకు అబూబక్ర్ ఉమర్ కూడా చేరుకున్నారు. అబూబక్ర్ ఆ బక్కెటును అందుకుని ఒకట్రొండు బక్కెట్ల నీళ్ళు తోడారు. ఆ తోడటంలో కొంత బలహీనత పొడసూపింది. అల్లాహ్ ఆయన్ని మన్నించుగాక! తరువాత అబూబక్ర్ చేతిలో నుండి ఖత్తాబ్ పుత్రుడు బక్కెట్టును అందుకున్నాడు. ఆయన చేతిలోకి రాగానే ఆ బక్కెటు ఒక పెద్ద బక్కెట్టుగా మారి పోయింది. అంత అలవోకగా, సొగసుగా పనిచేసే ధైర్యశాలిని నేను చూడలేదు. ఆ విధంగా ఆయన ఎంత నీరు తోడారంటే అక్కడున్న జనులు తమ ఒంటెలకు నీరు త్రాపే తొట్టెలను నింపుకున్నారు- హదీసులో 'అతన్' అనే పదం వచ్చింది. ఒంటెలు కూర్చునే స్థలాన్ని 'అతన్' అంటారు. అంటే ఒంటెలు కడుపు నిండా నీరు త్రాగిన తరువాత జనులు వాటిని తోలుకుని వెళ్ళి వాటి వాటి స్థానాల్లో కూర్చో పెట్టారని అర్థం.[1]

**321)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కొరకు దుఆ చేస్తున్న వారితోపాటే నేను నిలబడి ఉన్నాను. ఆ సమయంలో ఆయన శవపేటిక అక్కడే ఉంచబడింది. అంతలో ఒక వ్యక్తి నా వెనుక నుండి వచ్చి, నా భుజాలపై తన మోచేతులను ఉంచి (ఉమర్-రజి-ను సంబోధించి) ఇలా అన సాగారు. "అల్లాహ్ మీపై కరుణించుగాక! అల్లాహ్ మిమ్మల్ని మీ సహవాసులిద్దరి (దైవప్రవక్త-స, అబూబక్ర్-స) ప్రక్కనే ఖననం చేయిస్తాడని నేను భావించేవాణ్ణి.

---

వంటిది. ఆయన(స) వక్కాణించినట్లే మహనీయ ఉమర్(రజి), మహనీయ ఉస్మాన్(రజి) వీర మరణాన్ని ఆస్వాదించారు. అబూబక్ర్ (రజి) గొప్పతనాన్ని చాటడం ఈ హదీసు ఉద్దేశం. ఉహుద్ పర్వతం వణకటం అనేది సత్యం. ప్రతి సృష్టి తన పరిమితుల్లో జీవన చైతన్యం కలిగి ఉంటుంది. "ఆయన స్తోత్రంతో పాటు ఆయన పరిశుద్ధతను కొనియాడనిది ఏదీ లేదు" (బనీ ఇస్రాయీల్ : 44)

320-1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. నీరు తోడేటప్పుడు హజ్రత్ అబూబక్ర్(రజి)లో వ్యక్తమైన 'బలహీనత' ఆయనలోని లోపం కాదు. తనలో శక్తి తక్కువగా ఉన్నప్పటికీ ఆయన ఆ బక్కెట్టును ముందుగా అందుకున్నారు. ఆ విధంగా ఆయనకు హజ్రత్ ఉమర్(రజి) పై గల ప్రాధాన్యత విదితమవుతోంది.

**నేను తరచూ దైవప్రవక్త(స) నోట వినేవాణ్ణి– 'నేనూ అబూబక్ర్, ఉమర్ ఉన్నాము', 'నేనూ, అబూబక్ర్, ఉమర్ కలసి ఈ పనిచేశాము'. నేనూ, అబూబక్ర్, ఉమర్ వెళ్ళాము' అని ఆయన(స) చెబుతూ ఉండేవారు. అందువల్ల అల్లాహ్ మిమ్మల్ని ఆ ఇద్దరు మహనీయులతోపాటే ఉంచుతాడని నేను భావించాను"– నేను వెనక్కి తిరిగి చూశాను, ఆయన ఎవరో కాదు, హజ్రత్ అలీ(రజి).[1]**

**322) ఉర్వా బిన్ జుబైర్ తెలిపారు : నేను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారిని అడిగాను, మక్కాలోని బహుదైవారాధకులు దైవప్రవక్త(స) యెడల ఒడిగట్టిన అత్యంత అమానుషమైన చేష్ట ఏది? అని. దానికి ఆయన ఇలా తెలిపారు : ఉఖబా బిన్ అబీ ముఅయ్త్ దైవప్రవక్త(స)ను సమీపించటం నేను గమనించాను. ఆ సమయంలో ఆయన(స) నమాజ్ చేసుకుంటున్నారు. ఆ దౌర్భాగ్యుడు తన దుప్పటిని ఆయన(స) మెడలో వేసి లాగాడు. దాంతో ఆయన(స) మెడ ఆ దుప్పటిలో చిక్కుకుపోయింది. అంతలో అబూబక్ర్ వచ్చి, ఆ దౌర్భాగ్యుణ్ణి ఆ దుశ్చేష్ట నుంచి ఆపుతూ, "ఏమిటి, అల్లాహ్‌యే నా ప్రభువు అని చెబుతూ, మీ వద్దకు తన ప్రభువు తరపు నుండి స్పష్టమైన నిదర్శనాలను కూడా తీసుకువచ్చిన వ్యక్తిని నీవు చంపేయా లనుకుంటున్నావా?" అని మందలించారు.[1]**

## అధ్యాయం : 7

## మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) విశిష్టత

**ఈయన కునీయత్ అబూ హఫ్స్. ఖురైషు తెగకు చెందినవారు.[1]**

---

321–1. సుబ్‌హానల్లాహ్. నలుగురు మార్గదర్శక ఖలీఫాలది ఒకేమాట. ఒకే బాట. వారు ఒకరింకొకరి బాగోగులను కోరుకునేవారు. ఒండొకరిని గౌరవించుకునేవారు. వారి మధ్య కల్మషం ఉండేదని, వారు పరస్పరం శ్రేయోభిలాషులు కారని ఊహించేవారు వంచకులు.

322–1. పై హదీసుల ద్వారా మహనీయ అబూబక్ర్(రజి) విశిష్టత తెలిసి వస్తోంది.

7–1. **'ఫారూఖ్'** అనేది ఈయన బిరుదు. దైవప్రవక్త(స) ఇచ్చిన బిరుదు ఇది. అది జిబ్రీల్ (అలైహిస్సలామ్) తీసుకు వచ్చిన బిరుదు అని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. న్యాయం, దూరదృష్టి, పరిపాలనా దక్షతలో సాటిలేని మేటి. ఈయన జీవిత చరిత్రపై ప్రపంచంలోని ఎన్నో భాషలలో పెద్దపెద్ద పుస్తకాలు వెలువడ్డాయి.

**323) మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా అన్నారు: నేను (స్వప్నంలో) స్వర్గంలోనికి ప్రవేశించాను. అక్కడ నేను అబూ తల్హా (రజి) ఇల్లాలు రుమైసా[1]ను చూశాను. ఇంకా నేను ఎవరివో అడుగుల సవ్వడి విన్నాను. ఆయన బిలాల్(రజి) అని (దైవ దూత ద్వారా) తెలిసింది. ఇంకా నేను స్వర్గంలో ఒక మేడను చూశాను. దాని ముందు ఒక స్త్రీ (వుజూ చేస్తూ) కనిపించింది. "ఇది ఎవరి నివాస గృహం?" అని నేను అడిగితే, 'ఉమర్ బిన్ ఖత్తాబ్‌ది' అని (దైవదూత) నాకు చెప్పారు. ఆ మేడ లోపలికి వెళ్ళి చూడాలని నా మనసు ఉబలాటపడింది. "కాని ఉమర్! మీ పౌరుషం నాకు జ్ఞప్తికి వచ్చింది".[2](ఇది విని) ఉమర్ భోరున ఏడ్చేశారు. '(అయ్యా దైవ ప్రవక్తా!) నా తల్లిదండ్రులు మీకు అర్పితం. మీ పట్ల నాకు పౌరుషమా?[3] అన్నారు.**

**324) హజ్రత్ అబూ హురైరా(రజి) వివరించారు: మేము దైవప్రవక్త (సఅసమ్) సేవలో ఉన్న సమయంలో ఆయన(స) ఇలా చెప్పారు. "నేను నిద్రలో ఉండగా కలలో స్వర్గాన్ని చూశాను. స్వర్గంలో ఒక స్త్రీ ఒక మేడ ఒద్దున వుజూ చేస్తూ కనిపించింది. 'ఇంతకీ ఈ మేడ ఎవరిది?' అని నేను అడిగితే, 'ఉమర్ ది' అని దైవదూతలు చెప్పారు. అప్పుడు నాకు ఆయన పౌరుషం, స్వాభిమానం గుర్తుకు వచ్చి వెంటనే తిరిగి వచ్చేశాను"- ఇది వినగానే హజ్రత్ ఉమర్(రజి) ఏడుస్తూ, 'దైవప్రవక్తా! నాకు మీ పట్ల పౌరుషం ఏమిటి?' అన్నారు.**

---

323-1. ఈమె హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తల్లి ఉమ్మె సులైమ్. 'రుమైసా' అనేది ఆమె బిరుదు. కళ్ళలోని పుసిని రుమైస్ అంటారు. ఆమె కళ్ళలో పుసి ఎక్కువగా కనిపించేది. అందువల్ల జనులు ఆమెను 'రుమైసా' అని పిలిచేవారు.

323-2. అందుకే తక్షణం నేను అక్కడి నుండి వెనుతిరిగాను.

323-3. అయ్యా దైవప్రవక్తా! మేము మీ బానిసలం. ఈనాడు మాకు లభించిన ఈ గౌరవం మీ మూలంగానే కదా! స్వర్గమెక్కడ? మేమెక్కడా? మేము స్వర్గ సువాస నను కూడా ఆఘ్రూణించలేము. మార్గభ్రష్టులుగా ఉన్న మాకు మీరు సన్మార్గం చూపి, స్వర్గలోక శుభవార్త వినిపించారు. అన్యథా మేము ఈ ప్రపంచంలో దౌర్భాగ్యులుగానే జీవించి, పరలోకంలో స్వర్గానికి దూరమయ్యే వారము అన్నది ఉమర్(రజి) పలుకులోని అంతరార్థం.

**325)** హమ్జా తన తండ్రి (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్–రజి) నుండి ఉటంకించిన దాని ప్రకారం దైవప్రవక్త(సఅసమ్) ఇలా ప్రవచించారు : 'నేను కలలో పాలు త్రాగాను. ఎంతగా త్రాగానంటే, దాని తాజాదనాన్ని చూడసాగాను. అది నా చేతివ్రేలిపై లేదా వ్రేళ్ళపై ప్రవహిస్తోంది. ఆ తరువాత నేను ఆ పాల పాత్రను ఉమర్ (రజి)కు ఇచ్చాను.' 'దైవప్రవక్తా! ఈ కలలోని నిగూఢార్థం ఏమిటి?' అని సహచర మాన్యులు ప్రశ్నించగా, "దాని నిగూఢార్థం జ్ఞానం" అని ఆయన(స) బదులిచ్చారు.

**326)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు: "నేను ఒక బావి నుండి నీరు తోడుతున్నట్లుగా కలలో చూశాను. ఆ బావికి కొయ్య చక్రం అమర్చబడి ఉంది. తరువాత అబూబక్ర్(రజి) కూడా వచ్చి ఒకటి లేదా రెండు బక్కెట్లు తోడారు. కాని ఎంతో ప్రయాసపడుతూ తోడారు. అల్లాహ్ ఆయన్ని క్షమించుగాక! అంతలో ఉమర్(రజి) వచ్చి, ఆ బక్కెట్టును అందుకున్నారు. ఆయన చేతిలోకి రాగానే ఆ బక్కెట్టు మరింత పెద్ద దయింది. నేను ఆయన మాదిరిగా సుదృఢంగా, హుందాగా పనిచేసే గట్టివాణ్ణి చూడలేదు. ఆయన ఎంత నీరు తోడారంటే జనులు తాము కడుపు నిండా త్రాగటమే గాక, తమ ఒంటెలకు కూడా త్రాపుకుని తమ తమ గమ్యస్థానాలకు వెళ్ళిపోయారు".

**327)** తనకు తన తండ్రి (హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్–రజి) తెలిపారని ముహమ్మద్ బిన్ సాద్ బిన్ అబీ వక్కాస్ చెప్పారు: ఇంతకీ ఆయన తెలిపిన విషయమేమంటే, ఒకసారి మహనీయ ఉమర్(రజి) లోనికి రావడానికి దైవప్రవక్త(స) అనుమతి కోరారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) దగ్గర ఖురైషు మహిళలు కొందరు (విశ్వాసుల మాతలు) కూర్చుని మాట్లాడుతున్నారు. వారి కంఠస్వరం దైవ ప్రవక్త(స) కంఠస్వరం కన్నా హెచ్చుగా ఉంది. ఇంటి ఖర్చులు (భరణం) పెంచమని వారు గట్టిగా కోరుతున్నారు. అంతలో వారికి మహనీయ ఉమర్(రజి) కంఠం వినిపించగానే, వారంతా లేచి తెర వెనక్కి పారిపోయారు. ఎట్టకేలకు దైవప్రవక్త(స) ఆనతిపై ఉమర్(రజి) లోనికి వచ్చారు. చిరునవ్వు చిందిస్తున్న దైవప్రవక్త(స)ను చూసి, 'యా రసూలల్లాహ్! అల్లాహ్ మిమ్మల్ని సదా సంతోషంగానే ఉంచుగాక! ఇంతకీ తమరి చిరునవ్వుకు గల కారణం ఏమిటో తెలుసుకోవచ్చా' అని అడగ్గా, "నాకు వీళ్ళ ధోరణిపై నవ్వొచ్చింది. వీరు ఇప్పటివరకూ నా దగ్గరే కూర్చుని ఉన్నారు. కాని మీ కంఠస్వరం వినగానే అందరూ (భయపడి) తెరవెనక్కి తుర్రు

**మన్నార"ని దైవప్రవక్త(స) చెప్పారు. దానికి హజ్రత్ ఉమర్(రజి), 'దైవప్రవక్తా! వారసలు భయపడాల్సింది నాకు కాదు, మీకు' అన్నారు. ఆ తర్వాత (ఆ మహిళల నుద్దేశించి) 'ఓ యీ ఆత్మ విరోధులారా! మీరు నాకు భయపడుతున్నారు గాని దైవప్రవక్త(స)కు భయపడటం లేదా?' అని ప్రశ్నించగా, 'అవును, మీరు చెప్పేది నిజమే. కాని దైవప్రవక్త(స)తో పోల్చుకున్నప్పుడు మీరు ఎక్కువ కఠినులు' అని విశ్వాసుల మాతలు సమాధానమిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఖత్తాబ్ పుత్రుడా! ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! ఏ దారిలోనయినా మీరు షైతాన్‌కు ఎదురుపడితే, వాడు ఆ దారిని వదిలేసి మరో దారి గుండా వెళ్ళిపోతాడు."**

**328) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) ఇలా అన్నారు : "మహనీయ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరించిన తరువాత మేము గౌరవ ప్రదంగా ఉండగలిగాము."[1]**

**329) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అంటూ ఉండగా నేను విన్నానని ఇబ్నె అబీ ములైకా చెప్పారు: మహనీయ ఉమర్(రజి)- అమరగతి నొందిన తరువాత- ఆయన భౌతిక కాయాన్ని పడకపై ఉంచినప్పుడు, జనులంతా ఆయన భౌతిక కాయం చుట్టూ గుమిగూడి ఆయన మన్నింపునకై (అల్లాహ్‌ను) వేడుకోసాగారు. శవపేటికను ఇంకా ఎత్తలేదు. నేను అక్కడే ఉన్నాను. అంతలో ఒక వ్యక్తి నా భుజాన్ని పట్టుకున్నారు. నేను వెనక్కి తిరిగి చూశాను. ఆయన ఎవరో కాదు, మహనీయ అలీ(రజి). తరువాత ఆయన హజ్రత్ ఉమర్(రజి)ను కరుణించమని దైవాన్ని వేడుకున్నారు. (ఉమర్ భౌతిక కాయాన్ని ఉద్దేశించి) ఇలా అన్నారు: మీరు మీ తదనంతరం నాకు అనుసరణీయుడైన వ్యక్తినెవరినీ విడిచిపోలేదు. అలాంటి ఆదర్శవంతుడైన వ్యక్తి ఉంటే, నేను అతని ఆచరణను అనుసరించి దైవాన్ని చేరుకునేవాణ్ణి. దైవసాక్షి! అల్లాహ్ మిమ్మల్ని మీ సహవాసులిద్దరి సరసన ఉంచు**

---

328-1. **"దేవా! ఉమర్ లేదా అబూ జహ్ల్ ఇస్లామ్ స్వీకరణ ద్వారా గౌరవం వొసగు"** అని దైవప్రవక్త(స) ప్రార్థించారు. ఆయన(స) ప్రార్థన ఉమర్(రజి) పక్షాన ఆమోదించబడింది. ఆయన ఇస్లామ్ స్వీకరించిన తరువాత ముస్లింలు కాబా ప్రాంగణంలో బాహాటంగా నమాజ్ చేయగలిగారు. ఇస్లామ్ ప్రచారానికి మార్గం సుగమం అయింది. హజ్రత్ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకార సంఘటన జగద్విదితమే.

తాడని ముందునుంచే ఊహించుకునేవాణ్ణి. నా ఈ గట్టి నమ్మకానికి కారణ మేమంటే, నేను తరచూ దైవప్రవక్త(స) నోట ఈ విధమైన పలుకులు వినేవాణ్ణి (ఆయన ఇలా పలికేవారు) : "నేనూ అబూబక్ర్ ఉమర్ వెళ్ళాము" "నేనూ, అబూ బక్ర్ ఉమర్ ప్రవేశించాము" "నేనూ అబూబక్ర్ ఉమర్ వెడలినాము."

**330)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒకసారి అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్ (రజి అల్లాహు అన్హుమ్)లతో కలసి ఉహుద్ పర్వతమెక్కినప్పుడు అది కంపించసాగింది. అప్పుడు దైవ ప్రవక్త(స) దానిని తన కాలితో కొట్టి, "ఉహుద్! శాంతించు. నీపైన ఒక దైవ సందేశ హరుడు, ఒక సిద్దీఖు, ఇద్దరు అమరవీరులు ఉన్నార"ని చెప్పారు.

**331)** జైద్ బిన్ అస్లమ్ కథనం : ఈయనకు ఈయన తండ్రి ఇలా తెలిపారు– మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారు తన తండ్రి హజ్రత్ ఉమర్ (రజి) గురించి ఏదన్నా చెప్పమని నన్ను కోరినప్పుడు, నేను నాకు తెలిసింది ఆయన గారికి చెప్పాను. అప్పుడాయన ఇలా అన్నారు : "దైవప్రవక్త(సఅసం) తరువాత నేను ఉమర్(రజి) మాదిరిగా ధర్మం కొరకు తీవ్రంగా పాటుపడేవారిని, ఆయన కన్నా ఎక్కువ ఉదార స్వభావిని ఎవరినీ చూడలేదు. హజ్రత్ ఉమర్(రజి)తోనే ఈ సద్గుణాలు అంతరించిపోయాయి."[1]

**332)** మహనీయ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: ఒక వ్యక్తి (జుల్ ఖువైసరా లేదా అబూ మూసా) దైవప్రవక్త(సఅసమ్)ను, 'ప్రళయం ఎప్పుడు వస్తుంది?' అని ప్రశ్నించగా, "నీవు దాని సన్నాహాలు చేసుకున్నావా?" అని ఆయన(స) అడిగారు. దానికి ఆ వ్యక్తి సన్నాహాలేమీ పెద్దగా చేసుకోలేదు. కాకపోతే దైవాన్ని, దైవప్రవక్త (స)ను ఎంతగానో ప్రేమిస్తున్నాను' అని విన్నవించుకున్నాడు. అప్పుడు దైవప్రవక్త(స), "మరి అలాగైతే నీవు ప్రేమించే వారితోనే నీవు లేపబడతావు" అని విశదపరిచారు– హజ్రత్ అనస్(రజి) ఇలా అంటున్నారు: 'నీవు ప్రేమించే వారితోనే నీ పునరుత్థానం జరుగుతుంది' అన్న ఈ ప్రవక్త ప్రవచనం విన్నప్పుడు మాకు కలిగి

---

331–1. అంటే తన పరిపాలనా కాలంలో హజ్రత్ ఉమర్(రజి) తిరుగులేని నాయకునిగా, ధైర్యశాలిగా, దాతృగుణం కలవానిగా రాణించారు. ఇక మహిమోన్నతల విషయానికి వస్తే హజ్రత్ అబూబక్ర్(రజి) తరువాతే ఎవరి స్థానమైనా.

**నంత సంతోషం మరెప్పుడూ కలగలేదు'. అనస్(రజి) ఇంకా ఇలా అంటున్నారు: 'నేను దైవప్రవక్త(స)ను, అబూబక్ర్(స)ను, ఉమర్(రజి)ను అమితంగా ప్రేమిస్తు న్నాను. ఈ కారణంగా– నేను వారిలాంటి సదాచరణ చేయలేక పోయినప్పటికీ– వారితోపాటే తిరిగి లేపబడతానని ఆశిస్తున్నాను.'**

**333) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "నాకు పూర్వం గతించిన సముదాయాలలో దివ్య ప్రేరణ పొందేవారు (విషయాల లోతుల్లోకి పోయేవారు) ఉండేవారు. ఒకవేళ నా సముదాయంలో అలాంటి వ్యక్తి ఎవరయినా ఉన్నాడంటే అతను ఉమర్ మాత్రమే". వేరొక రివాయతు ప్రకారం దైవప్రవక్త(స) ఇలా వక్కాణించినట్లుగా అబూహురైరా (రజి) తెలిపారు: "మీకు పూర్వం ఇస్రాయీల్ సంతతిలోని కొంత మందితో దైవదూతలు సంభాషించేవారు (వారికి విషయావగాహన కల్పించబడేది). నా ఉమ్మత్‌లో ఆ స్థాయి వ్యక్తులు ఎవరయినా ఉన్నారా? అని ఆలోచించినప్పుడు, ఉమర్(రజి) ఆ కోవకు చెందినవాడని అనిపిస్తుంది"– హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) సూరతుల్ హజ్జ్‌లో 'మిన్ నబియ్యిన్ వలా ముహద్దిస్"[1] అని పఠించేవారు.**

**334) దైవప్రవక్త(సఅసం) ప్రవచించినట్లుగా అబూహురైరా (రజి) ఉల్లేఖించగా తాము విన్నామని సయీద్ బిన్ ముసయ్యిబ్(రజి), అబూసలమా బిన్ అబ్దుర్రహ్మాన్ తెలిపారు : దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "ఒక గొర్రెల కాపరి గొర్రెల్ని మేపుతుండగా ఒక తోడేలు వచ్చి ఒక గొర్రెను కబళించింది. గొర్రెల కాపరి ఆ తోడేలును వెంటాడి, దాని బారి నుండి గొర్రెను విడిపించుకున్నప్పుడు ఆ తోడేలు గొర్రెల కాపరి వైపునకు తిరిగి, 'క్రూరమృగాల దినాన దీనిని కాపాడేవాడెవడు? ఆ రోజు నేను తప్ప మరెవరూ దీనికి కాపరిగా ఉండడు' అని పలికింది. ఇది విన్న సహచరమాన్యులు (రజి.అన్హుమ్) 'సుబ్‌హానల్లాహ్! (తోడేలు కూడా మాట్లాడ**

333–1. దేవుని తరఫున విషయం ప్రేరేపించబడి సత్యం పలికేవానిని, లేదా దైవదూతలు సంభాషించేవానిని **'ముహద్దిస్'** అంటారు. అతని అభిప్రాయం సరైనదై ఉంటుంది. నిశ్చయంగా హజ్రత్ ఉమర్(రజి) కూడా ఆ కోవకు చెందినవారే. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) సూరతుల్ హజ్జ్‌లోని 52వ ఆయత్‌ను పఠిస్తున్నప్పుడు, **'వమా అర్‌సల్‌నా మిన్ ఖబ్‌లిక మిన్ రసూలిన్ వలా నబియ్యిన్'**తోపాటు 'వలా ముహద్దిస్' అని కూడా పలికేవారు.

గలదా?)' అని ఆశ్చర్యపడగా, "ఈ సంఘటనను నేను విశ్వసించాను. అబూబక్ర్, ఉమర్‌లు కూడా విశ్వసించార"ని దైవప్రవక్త(స) చెప్పారు. నిజానికి ఆ సమయంలో అక్కడ అబూబక్ర్, ఉమర్(రజి.అన్‌హుమా)లు లేరు.[1]

**335)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) ఉల్లేఖించారు. ప్రవక్త(స) ఇలా చెప్పారు: "నేను కలలో కొంతమందిని చూశాను. నా సమక్షంలో హాజరుపరచబడిన ఆ వ్యక్తులు చొక్కాలు తొడిగి ఉన్నారు. వారిలో కొందరి చొక్కా కేవలం వారి ఛాతీ వరకు ఉంటే మరి కొందరి చొక్కా అంతకన్నా చిన్నదిగా ఉంది. నా ముందు ఉమర్ కూడా హాజరు పరచబడ్డారు. ఆయన తొడిగిన చొక్కా ఎంత పెద్దదంటే, నడుస్తుంటే నేలకు రాసుకుంటూ ఉంది." ఇది విన్న సహచరమాన్యులు, 'దైవప్రవక్తా! దీనిద్వారా (అంటే ఉమర్–రజి చొక్కా పొడవుగా ఉండటం ద్వారా) మీరు గ్రహించిన విషయం ఏమిటి?' అని అడగ్గా, "దీన్ (ఇస్లామ్ జీవన ధర్మం)"[1] అని దైవప్రవక్త(స) చెప్పారు.

**336)** మిస్వర్ బిన్ మఖ్రమా కథనం : హజ్రత్ ఉమర్(రజి)ను (శత్రువు) గాయపరచినప్పుడు ఆయన ఎంతో వ్యాకులతకు లోనయ్యారు. ఆ క్షణంలో మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఆయన్ని ఓదారుస్తూ ఇలా అన్నారు : "ఓ విశ్వాసుల నాయకా! మీరంతగా ఆందోళన ఎందుకు చెందుతున్నారు? మీరు దైవప్రవక్త (సఅసమ్) సహచర్య భాగ్యం పొందినవారు. ఆ సాంగత్య బాధ్యతను కూడా బహు చక్కగా నిర్వర్తించారు. దైవప్రవక్త(స) మిమ్మల్ని వీడిపోతున్నప్పుడు మీ పట్ల ప్రసన్నులై ఉన్నారు. ఆ తరువాత మీరు అబూబక్ర్(రజి) సహచర్యం కూడా పొందారు. ఆయన సహచర్య బాధ్యతను కూడా చాలా చక్కగా నెరవేర్చారు. మిమ్మల్ని వీడిపోతున్నప్పుడు ఆయన కూడా మీ పట్ల సంతోషంగా ఉన్నారు. చివర్లో ముస్లిముల సహచర్యం మీకు

---

334–1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. అందులో ఆవు ప్రస్తావన కూడా వచ్చింది. దీనిద్వారా ఆ సహచరమాన్యులిద్దరి విశిష్టత విదితమవుతోంది.

335–1. అంటే మహనీయ ఉమర్(రజి) గారి ధర్మావగాహన బహు విస్తృతమైనది. ఆయన ఈమాన్ (విశ్వాసం) దృఢమైనది. అంతమాత్రాన ఆయన గారు హజ్రత్ అబూబక్ర్(రజి)ను మించిన వారన్న అర్థం గ్రహించరాదు. ఎందుకంటే ఈ హదీసులో అబూబక్ర్(రజి) ప్రస్తావన రాలేదు.

**ప్రాప్తమయింది. వారి సహచర్య బాధ్యతను కూడా మీరు సజావుగా నిర్వర్తించారు. మీరు వారిని వీడిపోతున్నప్పుడు కూడా వారందరినీ సంతుష్టులై ఉన్న స్థితిలోనే వీడిపోతారనటంలో సందేహం లేదు." అప్పుడు హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు. "అబ్బాస్ పుత్రుడా! నీవు దైవప్రవక్త(స) సహచర్యం గురించి, ఆయన ప్రసన్నత గురించి ప్రస్తావించావు. నిశ్చయంగా ఇది దైవానుగ్రహం. దానిని ఆయన నాపై కురిపించాడు. అలాగే నీవు అబూబక్ర్(రజి) సహచర్యం గురించి, ఆయన సంతోషం గురించి ప్రస్తావించావు. అది కూడా ఖచ్చితంగా దైవకృపే. ఇకపోతే నాలోని ఏ వ్యాకులతను, ఆందోళనను నువ్వు పసిగట్టావో అది నీ మూలంగా, నీ సహోదరుల చింత కారణంగానే సుమా![1] దైవసాక్షి! ఒకవేళ నా దగ్గర ఈ భూమి నిండా బంగారం ఉన్నా, దానిని నేను దైవశిక్షను ఎదుర్కొనక ముందే పరిహారం (ఫిదియా)గా ఇచ్చి, విముక్తి పొందడానికి ప్రయత్నించేవాణ్ణి."[2]**

**337) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం : నేను మదీనాలోని ఒక తోటలో దైవప్రవక్త(సఅసమ్) వెంట ఉన్నాను. అంతలో ఒకాయన వచ్చి తలుపు తెరువమని కోరారు. "అతని కొరకు తలుపు తెరువు. అతనికి స్వర్గలోక శుభవార్త వినిపించు" అని దైవప్రవక్త(స) ఆదేశించారు. నేను తలుపు తెరిస్తే, అబూబక్ర్(రజి) నిలబడి ఉన్నారు. నేను దైవప్రవక్త(స) ఆదేశానుసారం ఆయనకు స్వర్గ శుభవార్తను వినిపించాను. దానికి ఆయన దైవస్తోత్రం చేశారు. మరొకాయన కూడా వచ్చి తలుపు తట్టారు. దైవప్రవక్త(స) అప్పుడు కూడా అదే అన్నారు; "అతని కొరకు తలుపు తెరువు. అతనికి స్వర్గలోక శుభవార్త వినిపించు" అని. నేను తలుపు తెరచి**

---

336–1. అంటే మీపైన పరిపాలకునిగా ఎవడొస్తాడో, మీపట్ల ఎలాంటి వ్యవహారం జరుగుతుందోనన్న ఆందోళన నన్ను పట్టిపీడిస్తోంది.

336–2. సుబ్‌హానల్లాహ్! మహనీయ ఉమర్(రజి) నికార్సయిన విశ్వాసి అయివుండి, లెక్కలేనన్ని సత్కార్యాలు చేసి, దైవప్రవక్త(స) సహచర్యం పొంది కూడా తన అంతిమ పరిణామం గురించి ఇంతగా భయపడుతూ ఉండేవారు. ఎందుకంటే రాజాధిరాజు అయిన అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఆశ్రిత పక్షపాతం చూపనివాడు. ఉమర్(రజి) లాంటి న్యాయశీలుడు, ధర్మపరిపాలకుడే దైవసమక్షంలో హాజరు కావటాన్ని తలచుకుని ఇంతగా భయపడినప్పుడు, అపరాధులమైన మనం మరెంతగా భయపడాలో ఆలోచించండి.

చూస్తే ఉమర్(రజి) నిలబడి ఉన్నారు. నేను దైవప్రవక్త(స) ఆదేశానుసారం ఆయన గారికి కూడా స్వర్గ శుభవార్త వినిపించాను. ఆయన కూడా అల్లాహ్‌ను స్తుతించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తరువాత మూడవ వ్యక్తి వచ్చి తలుపు తట్టారు. అతని కొరకు కూడా తలుపు తెరువు. అతనికి కూడా స్వర్గలోక శుభవార్త వినిపించు. అయితే ప్రపంచంలో ఎదురయ్యే కష్టాల తర్వాత అతనికి ఈ భాగ్యం ప్రాప్తమవుతుం దని చెప్పు" అని దైవప్రవక్త(స) పురమాయించారు. ఆ వ్యక్తి ఉస్మాన్(రజి), దైవ ప్రవక్త(స) చెప్పిన మాటను నేను ఆయన గారికి వినిపించినప్పుడు, ఆయన దైవ స్తోత్రం చేశారు. తరువాత ఇలా అన్నారు: "అల్లాహ్‌యే నా సహాయకుడు (కష్ట కాలంలో ఓర్పునిచ్చేవాడు ఆయనే)".

**338)** తన తాతగారైన అబ్దుల్లాహ్ బిన్ హిషామ్(రజి) చెప్పగా తాను విన్నానని అఖీల్ జుహ్రా బిన్ మాబద్ తెలిపారు : ఆయన ఇలా చెప్పారు– "మేము ఒక సందర్భంలో దైవప్రవక్త (సఅసమ్) వెంట ఉన్నాము. అప్పుడు దైవప్రవక్త(స) ఉమర్(రజి) చేతిని తన చేతిలోకి తీసుకుని ఉన్నారు."[1]

## అధ్యాయం : 8

## మహనీయ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) మహిమోన్నతులు

"ఎవరయితే బీరె రూమా (బావి)ని కొనుగోలు చేసి ప్రజలకు అంకితం చేస్తాడో అతనికి స్వర్గం లభిస్తుంది" అని దైవప్రవక్త(సఅసం) చెప్పినప్పుడు, మహనీయ ఉస్మాన్(రజి) దానిని కొనుగోలు చేసి ప్రజలందరికీ ఉపయోగపడేలా అంకితం చేశారు.

"ఎవరయితే జైషె ఉస్రాకు (తబూక్ యుద్ధంలో పాల్గొన్న సైనికులకు) సామగ్రిని సమకూరుస్తారో వారికి స్వర్గం లభిస్తుంది" అని దైవప్రవక్త(స) ప్రకటించినప్పుడు, హజ్రత్ ఉస్మాన్(రజి) ఆ ఏర్పాటు చేశారు.[1]

---

338–1. పూర్తి హదీసు 'మొక్కుబడుల ప్రకరణం'లో రానున్నది. దాని ద్వారా మహనీయ ఉమర్(రజి) పట్ల దైవప్రవక్త(స)కు గల ప్రేమాదరణలు ఎటువంటివో తెలుస్తాయి.

8–1. హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) దైవప్రవక్త(స) అల్లుడు కూడా. ఆయన గురించి హజ్రత్ అలీ(రజి) ఇలా అన్నారు: "ఉస్మాన్‌ను నింగినున్న వారు

**339) మహనీయ అబూ మూసా(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక తోటలోనికి ప్రవేశించారు. తోట ద్వారం వద్ద కాపలాగా ఉండమని నన్ను ఆదేశించారు. తరువాత ఒక వ్యక్తి వచ్చి లోనికి ప్రవేశించేందుకు అనుమతి కోరారు. "అతనికి అనుమతిని ఇవ్వు. స్వర్గలోక శుభవార్తను కూడా అతనికి వినిపించు" అని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఆయన హజ్రత్ అబూబక్ర్(రజి). తరువాత మరో వ్యక్తి వచ్చి, లోనికి వచ్చేందుకు అనుమతి కోరారు. "అతనికి కూడా అనుమతిని ఇవ్వు. స్వర్గ శుభవార్త కూడా వినిపించు" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు. ఆ రెండవ వ్యక్తి హజ్రత్ ఉమర్(రజి). తరువాత మూడవ వ్యక్తి వచ్చి అనుమతి కోరినప్పుడు దైవప్రవక్త(స) కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉండి, ఆ తరువాత ఇలా సెలవిచ్చారు : "అతనికి కూడా అనుమతి ఇవ్వు. ప్రపంచంలో ఒక పరీక్షను ఎదుర్కొన్న మీదట స్వర్గం లభిస్తుందన్న శుభవార్తను అతనికి వినిపించు".**

**అయితే ఆసిమ్ ఉల్లేఖనంలో అదనంగా ఈ పలుకులు కూడా ఉన్నాయి : "ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఆ సమయంలో నీరు ఉన్నచోట (బావి దగ్గర) కూర్చుని ఉన్నారు. ఆయన(స) గారి రెండు మోకాళ్ళు లేదా ఒక మోకాలు ఆచ్ఛాదన లేకుండా ఉన్నాయి. అయితే ఉస్మాన్(రజి) రాగానే ఆయన(స) తన మోకాళ్ళపై వస్త్రం కప్పుకున్నారు.**

---

**'జున్నూరైన్'** అంటారు. ఆయన వివాహ బంధంలో తప్ప మరెవరి వివాహ బంధంలో కూడా దైవ సందేశహరుని ఇద్దరు కుమార్తెలు చేరలేదు". దైవ ప్రవక్త(స) ఆయన్ని ఎంతగానో ప్రేమించేవారు. "ఒకవేళ నా దగ్గర మరో కుమార్తె ఉంటే, ఆమెను కూడా నీకిచ్చి పెండ్లి చేసేవాణ్ణి" అని చెప్పారాయన(స).

**'జైషె ఉస్రా'** హదీసును ఇమామ్ బుఖారీ(రహ్మ) స్వయంగా యుద్ధాల ప్రకరణంలో వసల్ చేశారు. హజ్రత్ ఉస్మాన్(రజి) తబూక్ యుద్ధం కొరకు వెయ్యి బంగారు నాణేలను దైవప్రవక్త(స)కు విరాళంగా ఇచ్చారు. ఆయన(స) వాటిని ఎంచుతూ, "ఇక మీదట ఉస్మాన్(రజి) ఆచరణ ఎలా ఉన్నా అతనికి నష్టం వాటిల్లదు" అని చెప్పారు. ఆ యుద్ధం కొరకు హజ్రత్ ఉస్మాన్ 950 ఒంటెల్ని, 50 గుర్రాలను కూడా ఇచ్చారు. అలాంటి త్యాగధనులైన సహాబీల గురించి మాట్లాడేటప్పుడు కూడా కొందరు సంకుచిత మనస్కులు, నోటికొచ్చి నట్లు వాగుతూ ఉంటారు. కడు శోచనీయం!

**340)** ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్ తెలిపారు: మిస్వర్ బిన్ మఖ్రమా, అబ్దుర్రహ్మాన్ బిన్ అస్వద్‌లిద్దరూ తనతో, 'నీవు హజ్రత్ ఉస్మాన్(రజి)తో అతని సోదరుడు వలీద్ వివాదం గురించి ఎందుకు మాట్లాడవు? ప్రజలు అతని పట్ల అసంతృప్తితో ఉన్నారు కదా!' అని చెప్పారు. అందువల్ల నేను మహనీయ ఉస్మాన్ (రజి) దగ్గరకు వెళ్ళాను. ఆ సమయంలో ఉస్మాన్(రజి) నమాజ్ కొరకు బయటకు వచ్చారు. నేను ఆయన్ని ఉద్దేశించి, 'మీతో నాకు అవసరం ఏర్పడింది. అందులో మీ శ్రేయం ఉంది' అని చెప్పాను. దానికి ఆయన "భలేవాడివే (నీ విషయంలో నేను అల్లాహ్ శరణు వేడుతున్నాను)" అన్నారు– 'నేను నీ నుండి అల్లాహ్ శరణు వేడుతున్నాను' అనే వాక్యాన్ని బహుశా మా'మర్ ఉల్లేఖించి ఉంటారని ఇమామ్ బుఖారీ (రహ్మ) అభిప్రాయపడ్డారు. అందువల్ల నేను వాళ్ళ దగ్గరకు తిరిగి వచ్చేశాను. అంతలోనే హజ్రత్ ఉస్మాన్(రజి) దూత నన్ను పిలవటానికి వచ్చాడు. నేను అతని వెంట ఉస్మాన్(రజి) సన్నిధికి వెళ్ళినప్పుడు, "నీవు ఇంతకీ ఏ శ్రేయం గురించి మాట్లాడాలనుకున్నావ్?" అని అడిగారు. అప్పుడు నేను ఇలా విన్న వించుకున్నాను: 'చూడండి, అల్లాహ్ ముహమ్మద్ (సఅసమ్)ను సత్యంతోపాటు పంపించాడు. ఆయనపై తన గ్రంథాన్ని అవతరింపజేశాడు. దైవ సందేశాన్ని, దైవ సందేశహరుని సందేశాన్ని స్వీకరించిన వారిలో మీరూ ఒకనిగా ఉన్నారు. మీరు రెండు ప్రదేశాలకు వలసపోయారు. దైవప్రవక్త(స) సహచర్య భాగ్యం పొందారు. ఆయన(స) విధా నాన్ని, సంప్రదాయాన్ని చూశారు. కాని అసలు విషయం ఏమిటంటే, జనులు వలీద్ గురించి ఎన్నో ఫిర్యాదులు చేస్తున్నారు".

దానికి హజ్రత్ ఉస్మాన్(రజి), "నీవు దైవప్రవక్త(స) ప్రవచనాలేమైనా విన్నావా?" అని అడిగారు. అప్పుడు నేను, 'లేదు. కాని దైవప్రవక్త(స) హదీసులు ఒక కన్నెపిల్ల వరకూ– ఆమె పరదాల్లో ఉన్నప్పటికీ– చేరిపోయాయి. అలాంటప్పుడు నాకు తెలియకుండా ఎలా ఉంటాయి' అన్నాను. సమాధానంగా హజ్రత్ ఉస్మాన్ (రజి) ఇలా అన్నారు: "నిశ్చయంగా అల్లాహ్ ముహమ్మద్(స)ను సత్యంతో పాటే పంపించాడు. దైవం, దైవప్రవక్త(స) సందేశాన్ని స్వీకరించిన వారిలో నేను కూడా ఒకణ్ణి. దైవప్రవక్త(స) ఏ సందేశంతోపాటు పంపబడ్డారో, దానిని పూర్తి స్థాయిలో నేను విశ్వసించాను. నీవు చెప్పినట్లు దైవమార్గంలో రెండు హిజ్రత్‌లు కూడా చేశాను. దైవప్రవక్త(స) సాంగత్యంలో కూడా ఉన్నాను. ఆయన సమక్షంలో

**విధేయతా ప్రమాణం (బైఅత్) కూడా చేశాను. దైవసాక్షి! నేను ఎన్నడూ ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించలేదు. ఆయన(స) యెడల ఎన్నడూ విశ్వాసఘాతుకానికి పాల్పడ లేదు. కడకు అల్లాహ్ ఆయన(స)కు మరణం వొసగాడు. ఆ తరువాత అబూ బక్ర్(రజి) పట్ల కూడా నేను ఇలాగే వ్యవహరించాను. ఉమర్(రజి) యెడల కూడా నా వ్యవహారం ఇలాగే ఉండేది. మరి అలాంటప్పుడు నన్ను వారి వారసునిగా చేసి నప్పుడు, వారికి ఉన్న అధికారాలు (హక్కులు) నాకు ఉండవా?" 'ఎందుకు ఉండవు? తప్పక ఉంటాయి' అని నేనన్నాను. "మరి అలాంటప్పుడు మీ ద్వారా నా వరకు చేరే ఆక్షేపణలకు ప్రాతిపదిక ఏముంటుంది? ఇకపోతే, వలీద్ గురించి నీవు ప్రస్తా వించిన విషయాలు, ఇన్షాఅల్లాహ్ అతనికి తగిన శిక్ష తప్పకుండా విధిస్తాను" అని ఉస్మాన్(రజి) హామీ ఇచ్చారు. హజ్రత్ ఉస్మాన్(రజి) హజ్రత్ అలీ(రజి)ని పిలిపించి, "వలీద్కి శిక్ష విధించండి" అని చెప్పారు. అందువల్ల ఆయన వలీద్కు ఎనభై కొరడా దెబ్బలు కొట్టారు.[1]**

**341) హజ్రత్ అనస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి ఉహుద్ పర్వతంపైకి ఎక్కినప్పుడు, ఆయన వెంట అబూబక్ర్, ఉమర్,**

---

340-1. వలీద్ హజ్రత్ ఉస్మాన్(రజి)కి పాల వరుస సోదరుడు. స్వర్గలోక శుభవార్త పొందిన పదిమంది (అష్రె ముబష్షిరా) సహాబాలో ఒకరైన సాద్ బిన్ అబీ వక్కాస్(రజి)ను హజ్రత్ ఉస్మాన్(రజి) కూఫా గవర్నర్గా నియమించారు. ఈయనకు– అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి)కి మధ్య ఒకానొక విషయంలో గొడవ జరిగింది. అందువల్ల ఖలీఫా ఉస్మాన్(రజి) వలీద్ను అక్కడి గవర్నర్గా నియమించారు.

వలీద్ మితిమీరి వ్యవహరించసాగాడు. మద్యం సేవించి జన సామాన్యంపై జులుమ్ చేశాడు. అందువల్ల ప్రజలు హజ్రత్ ఉస్మాన్(రజి) పట్ల కినుక వహిం చారు. సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) లాంటి అగ్రశ్రేణి సహాబీని తొలగించి వలీద్ లాంటి అసమర్థునికి పదవి కట్టబెట్టడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణ మయింది. ఏవిధంగా చూసినా వలీద్ ఆ పదవికి తగినవాడు కాడు. పైగా అతడు దైవప్రవక్త(స) పట్ల అమానుషంగా ప్రవర్తించిన ఉఖబా బిన్ అబీ ముఅయ్త్ కుమారుడు. ఒకవేళ వలీద్ తన ప్రవర్తనను సరిదిద్దుకుని ప్రజల హృదయాలను జయించి ఉంటే ఏ గొడవా ఉండేది కాదు. కాని అతను తండ్రికి ఏమాత్రం తీసిపోనివాడుగా నిరూపించుకున్నాడు.

ఉస్మాన్(రజి)లు కూడా ఉన్నారు. ఉహుద్ పర్వతం వణకసాగింది. అప్పుడు దైవప్రవక్త(స), "ఉహుద్! శాంతించు– బహుశా ఆయన(స) తన కాలితో దానిని కొట్టారనుకుంటాను– నీ మీద ఒక దైవసందేశహరుడు, ఒక సత్యసంధుడు, ఇద్దరు అమరవీరులు ఉన్నారు" అని పలికారు.

**342)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు : "మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) కాలంలో మేము సహాబాలో అబూబక్ర్(రజి)కు సమ ఉజ్జీగా ఎవరినీ పేర్కొనేవారం కాము. ఆ తర్వాత ఉమర్(రజి), ఉస్మాన్(రజి) పేర్లు వచ్చేవి. ఆ తరువాత ప్రవక్త ప్రియ సహచరుల(రజి) గురించి మేము ఎలాంటి చర్చ జరిపేవారం కాము. ఎవరికీ ఒండొకరిపై ప్రాధాన్యతను కల్పించేవారం కాము"– ఈ హదీసును అబ్దుల్లాహ్ బిన్ సాలెహ్ కూడా అబ్దుల్ అజీజ్ నుండి ఉటంకించారు.

**343)** ఉస్మాన్ బిన్ మౌహబ్ కథనం: ఈజిప్టు దేశానికి చెందిన ఒక ఆగంతకుడు వచ్చి కాబా గృహాన్ని సందర్శించి హజ్జ్ చేశాడు. తరువాత అతను అక్కడ కూర్చున్న వారిని ఉద్దేశించి, 'వీరెవరు?' అని అడిగాడు. 'వీరు ఖురైషులు' అని ఎవరో చెప్పారు. 'వీరిలో అందరికన్నా పెద్దవారెవరు?' అని ఆ వ్యక్తి అడిగాడు. 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)' అని జనులు చెప్పారు. అప్పుడతను, 'ఓ ఇబ్నె ఉమర్! నేను మీకు కొన్ని ప్రశ్నలు వేయదలిచాను. మీరు నన్ను సమాధానపరుస్తారని ఆశిస్తాను. ఉహుద్ యుద్ధ సమయంలో ఉస్మాన్(రజి) పరారయ్యారన్న సంగతి మీకు తెలుసా?' అని అడిగితే, "అవును. అలా జరిగిన సంగతి వాస్తవమే" అని ఇబ్నె ఉమర్(రజి) చెప్పారు. తరువాత ఆ వ్యక్తి 'ఆయన బద్ర్ సంగ్రామంలో పాల్గొనలేదన్న సంగతి మీకు తెలుసా?' అని ప్రశ్నించాడు. "తెలుసు" అని ఇబ్నె ఉమర్ (రజి) బదులిచ్చారు. 'ఆయన బైఅతె రిజ్వాన్‌లో కూడా పాల్గొనలేదన్న విషయం మీకు తెలుసా?' అని ఆ వ్యక్తి ప్రశ్నించగా, "అవును. అది కూడా నిజమే" అని ఇబ్నె ఉమర్ (రజి) జవాబిచ్చారు. ఇది వినగానే ఆ వ్యక్తి 'అల్లాహు అక్బర్' అన్నాడు. అప్పుడు ఇబ్నె ఉమర్(రజి) ఆ వ్యక్తితో "ఇలా దగ్గరకు రా. ఈ సంఘటనల వెనుక ఉన్న అసలు విషయాన్ని నేను నీకు విశదపరుస్తాను" అన్నారు.

"ఉహుద్ యుద్ధరంగం నుంచి పారిపోవటం గురించి నేను ఇచ్చే సాక్ష్యమేమిటంటే, అల్లాహ్ ఆయన్ని క్షమించాడు. ఇక బద్ర్ సంగ్రామంలో ఆయన పాల్గొనలేకపోవడానికి కారణమంటావా, ఆయన సతీమణి అయిన దైవప్రవక్త పుత్రిక ఆ

సమయంలో వ్యాధిగ్రస్థులై ఉన్నారు. 'నీవు రోగిని కనిపెట్టుకుని ఉండు. యుద్ధంలో పాల్గొన్నవారికి లభించినంత పుణ్యఫలమే నీకూ లభిస్తుంది. అలాగే యుద్ధప్రాప్తి (మాలె గనీమత్)లో కూడా నీకు వాటా లభిస్తుంది' అని దైవప్రవక్త(స) సముదాయించారు. ఇక 'రిజ్వాన్ ప్రతిజ్ఞ' (బైఅతె రిజ్వాన్)లో ఉస్మాన్(రజి) పాల్గొనలేక పోవటానికి కారణమేమిటో తెలుసా? ఆ సమయంలో ఆయన దైవ ప్రవక్త(స) ఆజ్ఞానుసారం మక్కా నగరంలో ప్రవేశించారు. ఆ సమయంలో మక్కాలో ఉన్న ముస్లింలలో ఉస్మాన్ (రజి) కన్నా ఎక్కువ మర్యాదస్తులు, ప్రముఖులు లేరు. ఈ కారణంగానే దైవప్రవక్త(స) ఆయన్ని ఖురైషులతో చర్చలు జరిపే నిమిత్తం మక్కాకు పంపించారు. 'బైఅతె రిజ్వాన్' జరిగే సమయానికి ఉస్మాన్(రజి) మక్కా చేరుకున్నారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) తన కుడి చెయ్యిని ఎత్తి 'ఇది ఉస్మాన్ చెయ్యి' అని పలికారు. తరువాత తన రెండో చేతిపై చెయ్యివేసి 'ఇది బైఅతె ఉస్మాన్ తరఫున' అని కూడా పలికారు. ఆ తరువాత ఇబ్నె ఉమర్(రజి) ప్రశ్నించిన ఆగంతకుణ్ణి ఉద్దేశించి, "పో. పోయి ఈ విషయాలను బాగా జ్ఞాపకం ఉంచుకో" అన్నారు.

**344)** మహనీయ అనస్(రజి) కథనం : దైవప్రవక్త(స) అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్(రజి.అన్‌హుమ్)లతో కలసి ఉహుద్ పర్వతమెక్కినప్పుడు అది కంపించ సాగింది. అప్పుడు దైవప్రవక్త(స) "ఓ ఉహుద్! నెమ్మదించు" అన్నారు- తన కాలిని పర్వతంపై కొట్టారని కూడా భావిస్తున్నాను. పిదప ఇలా అన్నారు: "నీ మీద ఒక దైవసందేశహరుడు, ఒక సిద్దీఖు, ఇద్దరు అమరవీరులు ఉన్నారు".

## అధ్యాయం : 9

## హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) సమక్షంలో విధేయతా ప్రమాణం చేసిన సంఘటన, ఆయన ఖిలాఫత్‌పై ప్రవక్త సహచరుల (రజి.అన్‌హుమ్) ఏకాభిప్రాయం

ఈ అధ్యాయంలో అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) వీర మరణం గురించి...

**345)** అమ్ర్ బిన్ మైమూన్ కథనం : నేను హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)ను, ఆయన గాయపడక కొన్ని రోజుల క్రితం మదీనాలో చూశాను; ఆయన హుజైఫా బిన్ యమాన్, ఉస్మాన్ బిన్ హునైఫ్ (ర.అన్‌హుమా)లతోపాటు నిలబడి

ఉన్నారు. ఆయన వాళ్ళను ఉద్దేశించి, "మీరు ఇరాక్ భూముల విషయంలో భరించశక్యం కాని శిస్తు భారం మోపలేదు కదా!?"[1] అని అడిగారు. దానికి వారిద్దరూ, 'మేము భూసారాన్ని బట్టే శిస్తు విధించాము. తలకు మించిన భారం వారిపై వేయలేదు' అని సమాధానమిచ్చారు. దానికి ఉమర్(రజి) "బాగా ఆలోచించుకోండి! భూసారానికి మించిన శిస్తు విధించలేదు కదా!" అని మరోసారి రెట్టించగా, 'అలా జరగనేరదు' అని వారిద్దరూ చెప్పినట్లు ఉల్లేఖకుడు తెలిపారు. అప్పుడు ఉమర్(రజి) ఇలా అన్నారు: "అల్లాహ్యే గనక నాకు మరింత జీవితం ప్రసాదిస్తే నేను ఇరాక్లోని వితంతువుల సంక్షేమం కోసం శాయశక్తులా కృషి చేస్తాను. దాంతో నా తదనంతరం వారు ఎవరి మీద కూడా ఆధారపడవలసిన అగత్యం ఉండదు."[2] ఉల్లేఖకుడైన అమ్ర్ బిన్ మైమూన్ ఇలా అన్నారు: ఈ సంభాషణ జరిగిన నాల్గవ రోజునే హజ్రత్ ఉమర్(రజి) గాయపరచబడ్డారు. నేను (ఫజ్ర్ నమాజ్ కోసం) పంక్తిలో నిలబడి ఉన్నాను. నాకూ– ఆయన గారికి మధ్యన అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తప్ప ఎవరూ లేరు. మహనీయ ఉమర్(రజి) అలవాటు ఏమిటంటే, ఇమామత్ కొరకు ముందుకు వెళ్ళేటప్పుడు, "వరుసలు తిన్నగా ఉండేలా చూసుకోండి" అని తాకీదు చేసేవారు. పంక్తులలో ఎలాంటి వంకర, ఖాళీ లేదని నిర్ధారించుకున్న మీదటే ముందుకు వెళ్ళి తక్బీర్ పలికేవారు. ఫజ్ర్ నమాజ్లోని మొదటి రకఅత్లో సాధారణంగా సూరయె యూసుఫ్ లేదా సూరయె నహ్లును లేదా అంతే సుదీర్ఘమయిన మరేదయినా సూరాను పారాయణం చేసేవారు. మొదటి రకఅత్ పారాయణం పూర్తయ్యేసరికి జనులు పెద్దసంఖ్యలో సామూహిక నమాజ్లోకి వచ్చి చేరేవారు. ఆ రోజు కూడా ఆయన తక్బీర్ పలికిన మీదట, "నన్ను హతమార్చటం జరిగింది లేదా కుక్క కరిచింది" అని ఆయన చెప్పటం

---

345–1. ఆ ఇద్దరు వ్యక్తులను ఖలీఫా భూమి శిస్తును నిర్ధారించడానికి ఇరాక్ ప్రాంతానికి పంపించారు.

345–2. ఆ రోజుల్లో ఇరాక్ ప్రదేశంలో లూటీలు, బందిపోట్లు యధేచ్ఛగా జరిగేవి. దీంతో వితంతు స్త్రీలు మరిన్ని కష్టాలను ఎదుర్కోవలసి వచ్చేది. ఎందుకంటే వారిని ఆదుకునే మగదిక్కు ఉండేది కాదు. అందువల్ల అక్కడ శాంతిభద్రతలను నెలకొలిపి, వితంతువులకు అభయం కల్పించాలని ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) నిశ్చయించుకున్నారు.

నేను విన్నాను. అబూ లూలూ ఆయన్ని గాయపరిచాడు. ఆ తర్వాత ఆ దుర్మార్గుడు తన కత్తిని తీసుకుని పరుగెత్తాడు. తనకు కుడివైపున, ఎడమ వైపున అడ్డం వచ్చిన వారినల్లా గాయపరుస్తూ మరీ పరుగెత్తాడు. ఆ విధంగా అతను మొత్తం 13 మందిని గాయ పరిచాడు. గాయపడిన వారిలో ఏడుగురు అమరగతి నొందారు. ముస్లింలలోని ఒక వ్యక్తి ఈ పరిస్థితి స్వరూపాన్ని వీక్షించారు. ఆయన ఆ దౌర్భాగ్యునిపై దుప్పటి విసిరారు. దుప్పటిలో చిక్కుకున్న ఆ హంతకుడు తాను పట్టుబడిపోయానని అర్థమవ గానే కత్తితో కుత్తుక కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గాయపడిన స్థితిలోనే మహనీయ ఉమర్(రజి) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) చెయ్యి పట్టి నమాజ్ సారథ్యం కొరకు ముందుకు పంపారు. ఉమర్(రజి)కు దగ్గరగా ఉన్నవారంతా నేను చూసిన దృశ్యాన్ని చూశారు. కాని వెనుక పంక్తుల్లో ఉన్నవారికి, పంక్తుల అంచుల్లో ఉన్న వారికి పరిస్థితి నిజస్వరూపం తెలీదు. అయితే నమాజులో మహనీయ ఉమర్(రజి) కంఠస్వరం వినకపోవడంతో వారు 'సుబ్‌హానల్లాహ్, సుబ్‌హానల్లాహ్' అనసాగారు. ఎట్టకేలకు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) క్లుప్తంగా నమాజ్ చేయించారు. నమాజ్ ముగించుకుని జనులు వాపసు అవుతుండగా, "ఇబ్నె అబ్బాస్! నన్ను గాయపరిచినవాడు ఎవరో కాస్త కనుక్కో" అని పురమాయించారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కొన్ని క్షణాలు అటూఇటూ తిరిగి వచ్చి 'గాయపరిచిన వ్యక్తి ముగీరా (రజి) బానిస (అబూ లూలూ)' అని చెప్పారు. "అంటే, ఆ చేతి పని నిపుణుడేనా?" అని ఉమర్(రజి) ఆరా తీయగా, 'అవును' అని ఇబ్నె అబ్బాస్ చెప్పారు. అది విని, "అల్లాహ్ అతన్ని నాశనం చెయ్యి. నేనైతే అతనికి ఒక మంచి మాట చెప్పాను. దానికి అతను ఇచ్చిన ప్రతిఫలం ఇదా? నేను ముస్లింని అని చెప్పే వ్యక్తి చేత అల్లాహ్ నా ప్రాణం తీయలేదు. అందుకుగాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు. '(ఇబ్నె అబ్బాస్!) అరబ్బేతర బానిసల్ని భారీ సంఖ్యలో మదీనాకు తీసుకురావాలని నువ్వూ, నీ తండ్రి కోరుకున్నారు కదా!' అని ఉమర్(రజి) చెప్పగా, 'తమరు ఆజ్ఞాపిస్తే మేము వారి పనిపడతాం' అని ఇబ్నె అబ్బాస్(రజి) అన్నారు. అంటే మీరు ఆదేశించిన మరుక్షణమే మదీనాలో నివసించే అరబ్బేతర బానిసలను హతమారుస్తామని అన్నారు. 'నీ ఆలోచన పనికి మాలినది. ఇది ఘోరమైన తప్పిదం. ముఖ్యంగా వారు నీ భాష మాట్లాడే వారైనప్పుడు, నీ ఖిబ్లా వైపు తిరిగి నమాజ్ చేస్తున్నప్పుడు, నీ లాగే

హజ్జ్ క్రియలు ఆచరిస్తున్నప్పుడు (వారిని చంపుతావా? కడు శోచనీయం)" అని వారించారు.

తరువాత మహనీయ ఉమర్(రజి)ను ఆయన నివాస గృహానికి తరలించారు. మేమంతా వెంటవెళ్ళాము. అటువంటి విపత్కర పరిస్థితి తమకెప్పుడూ ఎదురవ లేదన్నట్లుగా ఆవేదనకు గురయ్యారు జనులు. ఆయనకేమీ కాదు. తొందరగానే కోలుకుంటారని కొందరు చెప్పుకుంటే, ఆయన జీవితం ప్రమాదంలో పడిందని మరికొందరు చెప్పుకోసాగారు. అంతలో ఖర్జూరపు పానీయం తీసుకువచ్చారు. ఆ పానీయాన్ని ఆయన సేవించారు. కాని అది కడుపులో నుంచి బయటకు వచ్చేసింది. తరువాత పాలు సమర్పించారు. ఆయన పాలు త్రాగారు. కాని అది కూడా గాయపడిన రంధ్రం గుండా బయటకు వచ్చేసింది. ఇక ఆయన వీర మరణం తథ్యమని జనులు అనుకున్నారు. మేము లోనికి వెళ్ళాము. జనులు ఆయనపై ప్రశంసా వర్షం కురిపించసాగారు. అంతలో ఒక నవ యువకుడు లోనికి వచ్చి 'అమీరుల్ మోమినీన్! అల్లాహ్ తరపు నుండి మీకు శుభవార్త! మీకు ప్రవక్త మహ నీయుల(స) సాంగత్యం లభించింది. తొలికాలంలోనే ఇస్లామ్ స్వీకరించే భాగ్యం కూడా మీకు ప్రాప్తమయింది. తరువాత మీరు ఖలీఫా అయ్యారు. ధర్మంగా పరిపాలించారు. చివరకు అమరగతినొందారు' అని చెప్పాడు. ఆ మాట విన్న ఉమర్(రజి) "నా వ్యవహారం సరిసమానమై ముగిసినా చాలు. అంటే బహుమానం లభించకపోయినా ఫరవాలేదు, శిక్షపడకుండా ఉంటే చాలు, నేను సంతోషిస్తాను" అన్నారు. ఆ నవయువకుడు తిరిగి వెళుతున్నప్పుడు అతని లుంగీ (లేక ఇజారు) నేలకు రాసుకునేలా వ్రేలాడుతున్నట్లు కనిపించింది. "ఆ అబ్బాయిని నా దగ్గరకు పిలుచుకుని రండి" అని కోరారు ఉమర్(రజి). అతను వచ్చాక, "నా భ్రాతృజుడా! నీ అంగవస్త్రాన్ని కాస్త పైకి కట్టుకో. ఇలా చేయటం వల్ల ఇటు నీ వస్త్రం ఎక్కువ కాలం పనికివస్తుంది. అటు నీవు నీ ప్రభువు ఆగ్రహం నుండి తప్పించుకున్నట్టూ ఉంటుంది" అని హితవు పలికారు.

తరువాత తన కుమారుణ్ణి ఉద్దేశించి, "ఓ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్! నాపై ఉన్న అప్పుల భారం ఎంతో కాస్త లెక్క కట్టు" అన్నారు. జనులు ఆయన చేసిన అప్పుల గురించి ఆరా తీయగా అది దాదాపు **86** వేలు అని తేలింది. అప్పుడాయన ఇలా అన్నారు: "ఈ అప్పులన్నీ ఉమర్ కుటుంబీకుల సంపదతో తీరిపోయేటట్ల

యితే, వారి సంపదతోనే తీర్చాలి. తీరకపోతే బనీ అదీ బిన్ కాబ్‌ను అడగండి. వారి సొమ్ముతో కూడా తీరకపోతే ఖురైషులను అడగండి. వారు తప్ప వేరితరులను అప్పులు తీర్చమని అభ్యర్థించరాదు. (అబ్బాయి అబ్దుల్లాహ్!) ఉమ్ముల్ మోమినీన్ హ(జ్రత్ ఆయిషా(ర.అ) దగ్గరకు వెళ్ళు. ఉమర్ మీకు సలామ్ చెప్పాడని చెప్పు. 'అమీరుల్ మోమినీన్' అని మాత్రం అనకు. ఎందుకంటే ఇప్పుడు నేను విశ్వాసుల నాయకుణ్ణి కాను. ఉమర్ బిన్ ఖత్తాబ్ తన ఇద్దరు మిత్రులతోపాటు అక్కడే ఖననం కావడానికి అనుమతి కోరుతున్నాడని చెప్పు".

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(అమ్మ ఆయిషా–ర.అ–దగ్గరకు వెళ్ళి) సలామ్ చేశారు. ఆమె అనుమతితో లోపలికి వెళ్ళారు. ఆ సమయంలో ఆమె కూర్చుని దుఃఖంతో విలపిస్తున్నారు. 'అమ్మా! ఖత్తాబ్ పుత్రుడు మీకు సలామ్ చెప్పారు. తన ఇద్దరు మిత్రులతోపాటే ఖననం కావడానికి మీ ఆనతి కోరారు' అని చెప్పారు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్. దానికి ఆమె, "ఈ స్థలాన్ని నేను నా కోసం ఎంపిక చేసు కున్నాను. అయితే ఈ రోజు నేను నాపై ఆయనకు ప్రాధాన్యత ఇస్తున్నాను" అన్నారు. ఇబ్నె ఉమర్(రజి) తిరిగి రాగానే, 'ఇదిగో, అబ్దుల్లాహ్ వచ్చేశార'ని జనులు చెప్పారు. "నన్ను కాస్త లేపండి" అని ఉమర్(రజి) అభ్యర్థించారు. ఒకాయన ఆయనకు ఊతమిచ్చి కూర్చోబెట్టారు. "చెప్పు. అమ్మ ఆయిషా ఏమన్నారు?" అని కొడుకును అడిగారు ఉమర్. దానికి ఇబ్నె ఉమర్, 'అమీరుల్ మోమినీన్! మీ ఆకాంక్ష నెరవేరింది' అని చెప్పారు. "అల్ హమ్దులిల్లాహ్! నా కొరకు ఇప్పుడు ఇంతకన్నా ముఖ్యమైనది మరేదీ కాజాలదు. అయితే నేను చనిపోయి, నా శవపేటి కను తీసుకెళ్ళినప్పుడు మరోసారి (ఆమెకు) నా సలామ్ చెప్పండి. ఉమర్ బిన్ ఖత్తాబ్ మీ అనుమతి కోరాడమ్మా! అని మరోసారి విన్నవించుకోండి. ఆమె అనుమతిని ప్రదానం చేస్తేనే నన్ను అక్కడ ఖననం చేయండి. అనుమతి ఇవ్వకపోతే ముస్లింల ఖననవాటికలోనే ఖననం చేయండి" అని తాకీదు చేశారు.

అంతలో ఉమ్ముల్ మోమినీన్ హ(జ్రత్ హఫ్సా(ర.అ) అక్కడికి వచ్చారు. ఆమె వెంట మరికొంతమంది మహిళలు కూడా ఉన్నారు. మేము ఆమెను చూడగానే లేచి నిలబడ్డాము. ఆమె తన తండ్రిని సమీపించి దుఃఖంతో విలపించసాగారు. తరువాత పురుషులు లోనికి రావడానికి అనుమతి కోరటంతో ఆమె ఇంటిలోపలి గదిలోనికి వెళ్ళిపోయారు. మేము ఆమె ఏడుపు శబ్దం విన్నాము.

జనులు హ(జత్ ఉమర్(రజి)ని ఉద్దేశించి, 'అమీరుల్ మోమినీన్? ఖిలాఫత్ నిమిత్తం ఏమన్నా వసీయతు చేయండి' అని అభ్యర్థించారు. దానికి ఆయన ఇలా అన్నారు: "దైవప్రవక్త(స) తన మరణకాలం వరకు ఎవరెవరి పట్ల సంతుష్టులై ఉన్నారో వారు తప్ప మరెవరినీ నేను ఖిలాఫత్‌కు అర్హులుగా భావించను"– తరువాత ఆయన అలీ, ఉస్మాన్, జుబైర్, తల్హా, సాద్ బిన్ అబీ వక్కాస్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ల పేర్లు ప్రస్తావించారు. తన కుమారుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ పేరు కూడా ప్రస్తావించారు. అయితే అతన్ని కేవలం సలహా సంప్రతింపుల వరకే ఉంచండి. ఖిలాఫత్‌తో అతనికి ఎట్టి సంబంధం ఉండకూడదని మరీ మరీ చెప్పారు. "ఒకవేళ సాద్‌కు ఖిలాఫత్ దక్కితే అతను దానికి అర్హుడే. ఒకవేళ అతను ఖలీఫా కాలేకపోతే, ఖలీఫాగా ఎన్నికయిన వ్యక్తి తన పరిపాలనా కాలంలో అతని సహాయ సహకారాలు పొందుతూ ఉండాలి. ఎందుకంటే నేనతన్ని (కూఫా గవర్నర్ పదవి నుంచి) తొలగించినది అతని అసమర్థత కారణంగానో, నమ్మకద్రోహం వల్లనో కాదు" అని స్పష్టం చేశారు. హ(జత్ ఉమర్(రజి) ఇంకా ఇలా అన్నారు : "నా తదనంతరం కాబోయే ఖలీఫాకు, తొలికాలపు ముహాజిర్ల విషయంలో వసీయతు చేస్తున్నాను– అతను వారి హక్కులను గుర్తెరగాలి. వారి పట్ల మర్యాదగా మసలుకోవాలి. ఇంకా నా తర్వాత కాబోయే ఖలీఫాకు నేను చేసే వసీయతు ఏమిటంటే, అతను అన్సార్ల పట్ల ఉత్తమ రీతిలో వ్యవహరించాలి. వారు దారుల్ హి(జత్, దారుల్ ఈమాన్ (మదీనా)లో దైవప్రవక్త(స) రాకకు ముందు నుంచే నివసిస్తూ ఉన్నారు. అన్సార్లలోని సజ్జనులను ఖలీఫా సత్కరించాలి. వారిలోని దుర్వర్తనులను క్షమించాలి. కాబోయే ఖలీఫాకు నేను చేసే మరొక తాకీదు ఏమిటంటే అతను పట్టణవాసుల పట్ల సద్వ్యవహారం చేయాలి. వారు ఇస్లామ్‌కు సహాయకులు, రెవిన్యూ విషయంలో తోడ్పాటునందించేవారు. ఇస్లామ్ విరోధులకు మింగుడుపడని వారు. కాబట్టి వారి వద్ద మిగిలి ఉన్న దానినే (బైతుల్ మాల్ కొరకు) వసూలు చేయాలి. సంతోషంగా వారు ఇచ్చినదే తీసుకోవాలి. పల్లెటూరి బైతుల విషయంలో కూడా మంచిగా వ్యవహరించవలసినదిగా నేను కాబోయే ఖలీఫాకు తాకీదు చేస్తున్నాను. ఎందుకంటే వారు అసలు సిసలు అరబ్బులు. ఇస్లామ్‌కు మూలాల వంటివారు. వారి వద్ద మిగిలి ఉన్న సొమ్మును (జకాత్‌గా) వసూలు చేసి, వారిలోని అవసరార్థుల మధ్యనే దానిని పంపిణీ చేయాలి. ఇంకా నేను కాబోయే ఖలీఫాకు చేసే వసీయతు ఏమిటంటే, దైవం

మరియు దైవప్రవక్త యొక్క ఒడంబడికను కనిపెట్టుకుని ఉండాలి (ముఖ్యంగా ముస్లిమేతరులతో చేసుకున్న ఒడంబడికను). వారికి చేసిన వాగ్దానాన్ని నిలబెట్టు కోవాలి. వారి రక్షణ కోసం అవసరమైతే యుద్ధం చేయాలి. వారి శక్తికి మించిన (రెవిన్యూ) భారం వారిపై మోపరాదు.

మహనీయ ఉమర్(రజి) తనువు చాలించిన తరువాత మేము ఆయన (శవ పేటిక)ను తీసుకుని (హజ్రత్ ఆయిషా-ర) కుటీరం వైపునకు వచ్చాము. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఆమెకు సలామ్ చేసి, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) మీ అనుమతి కోరారని చెప్పారు. "ఆయన్ని ఇక్కడే ఖననం చేయండి" అని ఆమె చెప్పారు. అందువల్ల ఆయన అంత్యక్రియలు అక్కడే జరిగాయి.

అంత్యక్రియలు ముగిసిన తర్వాత, మరణానికి ముందు ఉమర్(రజి) ఎవరెవరి పేర్లు ప్రస్తావించారో వారంతా ఒకచోట సమావేశమయ్యారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి), ఆ మండలిని ఉద్దేశించి, "మీరు మీ వ్యవహారాన్ని మీలోని ముగ్గురు వ్యక్తులకు అప్పగించాలి" అన్నారు. "నేను నా వ్యవహారాన్ని అలీ(రజి) పరం చేస్తు న్నాను" అని జుబైర్(రజి) చెప్పారు. "నేను నా వ్యవహారాన్ని ఉస్మాన్(రజి) చేతిలో పెడుతున్నాను" అని తల్హా (రజి) అన్నారు. "నేను నా వ్యవహారాన్ని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)కి అప్పగించాన"ని సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) చెప్పారు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)గారు ఉస్మాన్, అలీలను ఉద్దేశించి, "మీరిద్దరిలో ఎవరు ఖిలాఫత్‌ను ఆశించటంలేదని ప్రకటిస్తారో వారినే మేము ఖలీఫాగా చేస్తాము. అలాంటి వ్యక్తికి అల్లాహ్ సహాయకునిగా, సంరక్షకునిగా ఉంటాడు. ఇస్లామ్ హక్కు లను కాపాడే బాధ్యత అతనిపై ఖచ్చితంగా ఉంటుంది. ఈ కోణం నుంచి ఎవరు ఈ బాధ్యతలకు తగినవారో మీలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి" అని స్పష్టం చేశారు. ఇది విని వారిద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఇలా అన్నారు: "ఏమిటి, మీరిద్దరూ ఈ ఎంపిక బాధ్యతను నా మీద మోపుతున్నారా? దైవసాక్షి! మీరిద్దరిలో అందరికన్నా శ్రేష్ఠుడైన వానినే నేను ఎంపిక చేస్తాను." "సరే. అలాగే చేయండి" అని వారిద్దరూ పలికారు. అప్పుడు ఆయన వారిద్దరిలో ఒకరి చేయి పట్టుకుని, "చూడండి, దైవప్రవక్త(స)తో మీకు రక్త సంబంధం ఉంది. తొలి కాలంలో ఇస్లామ్ స్వీకరించిన గౌరవం కూడా మీకు దక్కింది. ఈ విషయం మీకు సయితం తెలుసు. అల్లాహ్‌యే మీ పర్యవేక్షకుడు.

**ఒకవేళ నేను గనక మిమ్మల్ని ఖలీఫాగా చేస్తే న్యాయబద్ధంగా పరిపాలిస్తారా? ఒకవేళ నేను గనక ఉస్మాన్(రజి)ను ఖలీఫాగా చేస్తే, మీరు ఆయన ఆదేశాలను శిరసా వహిస్తారా? ఆయనకు విధేయత చూపుతారా?" అని అడిగారు. ఆ తర్వాత రెండవ వ్యక్తిని ఏకాంతంలోనికి తీసుకెళ్ళి ఆయన్ని కూడా అలాగే అడిగారు. ఆయన నుండి వాగ్దానం పొందిన తరువాత, "ఉస్మాన్! మీ చేయి ముందుకు చాపండి" అన్నారు. అందరికంటే ముందు ఉస్మాన్ చేతిలో చెయ్యేసి విధేయతా ప్రమాణం (బైఅత్) చేశారు. మహనీయ అలీ(రజి) కూడా ఆయనకు ప్రమాణబద్ధులయ్యారు. తరువాత మదీనా వాసులంతా వచ్చి విధేయతా ప్రమాణం చేశారు.**[3]

---

345–3. మహనీయ ఉమర్(రజి) హత్యోదంతం దారుణమైనది. హజ్రత్ ముగీరా (రజి)కు చెందిన అరబ్బేతర బానిస అబూ లూలూ అనే దౌర్భాగ్యుడు విషం పూసిన కత్తితో ఖలీఫాకు మూడుసార్లు కత్తి పోట్లు పొడిచాడు. ఆ కత్తిని అతను స్వయంగా తయారు చేశాడు. 'ఆ కుక్కను పట్టుకోండి. వాడు నన్ను పొడిచాడు' అని హజ్రత్ ఉమర్(రజి) సైగ చేశారు. ఆ దుర్మార్గుడు మంచి వృత్తి నిపుణుడు. కమ్మరి, వడ్రంగి, చిత్రకారుడు కూడా. ముగీరా అతని నుండి నెలకు 100 దిర్హముల చొప్పున జిజ్‌యా తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. తనపై విధించిన భారం చాలా ఎక్కువ అని, దానిని కొంత తగ్గించమని అతను హజ్రత్ ఉమర్(రజి)కు ఫిర్యాదు చేశాడు. నీ లాంటి వృత్తి నిపుణుడు నెలకు వంద దిర్హములు చొప్పున చెల్లించటం కష్టమేమీ కాదని హజ్రత్ ఉమర్(రజి) నచ్చ జెప్పారు. దాంతో అతనికి కోపం వచ్చింది.

ఒకసారి అతను హజ్రత్ ఉమర్(రజి)కు దారిలో కనిపించినప్పుడు, నీవు తిరుగలి రాయిని చేయటంలో నిపుణుడవని విన్నాను, నిజమేనా? అని అడిగారు. దానికి అతను, 'నేను మీ కోసం జనులు ఎల్లకాలం గుర్తుంచుకునే తిరుగలి రాయిని చేసి ఇస్తాన'న్నాడు. అతని మాటల్లోని దురుద్దేశాన్ని హజ్రత్ ఉమర్(రజి) పసిగట్టి, ఆ బానిస నన్ను బెదిరిస్తున్నాడని తన సహచరులతో అన్నారు. ఇది జరిగిన కొన్నాళ్లకే అతను ఈ దారుణానికి పాల్పడ్డాడు. 'ముస్లిం' వెలికి తీసిన హదీసు ప్రకారం మహనీయ ఉమర్(రజి) అమరగతినొందక ముందు ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆయన ఇలా అన్నారు : "ఒక కోడిపుంజు కలలో నన్ను తన ముక్కుతో మూడుసార్లు పొడిచింది. దాంతో నా మరణ కాలం సమీపించిందని నేను తలపోశాను" గాయపడిన కొన్ని రోజుల తర్వాత ఆయన పరమ పదించారు.

## అధ్యాయం : 10

## హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్(రజి) విశిష్టత

**ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) హజ్రత్ అలీ(రజి)తో "నీవు నాడవు. నేను నీకు చెందినవాడను"[1] అని పలికారు.**

---

మహనీయ ఉమర్(రజి) ఖిలాఫత్ కొరకు నియమించిన కమిటీలో తన కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ను కేవలం సలహా సంప్రతింపుల వరకే పరిమితం చేయటం గమనార్హ విషయం. ఆ సమయంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) దుఃఖసాగరంలో మునిగి ఉన్నారు. తబ్రీ, ఇబ్నె సాద్ సంగ్రహించిన ఒక ఉల్లేఖనం ప్రకారం, 'అబ్దుల్లాహ్‌ను ఖలీఫాగా చేయండి' అని ఒక వ్యక్తి సలహా ఇవ్వగా, "అల్లాహ్ నిన్ను నాశనం చెయ్య. నేను అల్లాహ్ వద్దకు ఏం ముఖం పెట్టుకుని వెళ్ళాలి?" అని సమాధానమిచ్చారు ఉమర్(రజి). సుబ్‌హా నల్లాహ్! నిష్కల్మష హృదయానికి, న్యాయశీలతకు, నిష్పక్షపాత బుద్ధికి ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది? సమర్థుడు, జ్ఞాని అయిన కొడుకు తన ఇంట ఉన్నప్పటికీ ఆయన రాగద్వేషాలను దరికి రానివ్వలేదు. ఆశ్రిత పక్షపాతానికి, బంధు ప్రీతికి లొంగలేదు. తాను జీవించి ఉన్నంతకాలం అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కు ఉసామా బిన్ జైద్‌కన్నా తక్కువ పెన్షన్ ఇచ్చారు. అబ్దుల్లాహ్ ఉసామా కన్నా తక్కువేమీ కాదు కదా! పైగా అబ్దుల్లాహ్ దైవప్రవక్త(స)తో కలసి యుద్ధాలలో కూడా పాల్గొన్నారని సహాబా సిఫారసు చేయగా, "దైవప్రవక్త(స) ఉసామా తండ్రిని అబ్దుల్లాహ్ తండ్రికన్నా ఎక్కువగా ప్రేమించేవారు. అందుకే నేను దైవ ప్రవక్త(స) ప్రేమకు నా ప్రేమపై ప్రాధాన్యత ఇచ్చాన"ని చెప్పారు మహనీయ ఉమర్(రజి).

హజ్రత్ ఉమర్(రజి) ఖలీఫాగా ఉన్నంతకాలం అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఆర్థిక ఇబ్బందుల్లోనే ఉన్నారు. పైగా ఆయనకు సంతానం ఎక్కువ. చివరకు ఆయన యమన్ రాష్ట్ర గవర్నర్ వద్దకు వెళ్ళి తన ఆర్థిక ఇక్కట్లను గురించి చెప్పుకున్నారు. అంతా విన్న మీదట, 'మీ నాన్నగారు ఎంత ఖచ్చితమైన మనిషో మీకు తెలుసు. నేను బైతుల్ మాల్ నుండి ఒక్క దిర్హమ్ కూడా మీకు ఇవ్వలేను. అయితే ఒక పని చేయండి, నేను మదీనాకు కొంత డబ్బు పంపించాల్సి ఉంది. దానిని మీకు ఇస్తాను. ఆ డబ్బుతో ఇక్కడ వస్త్రాలు కొని మదీనాలో అమ్మండి. తద్వారా వచ్చిన లాభాన్ని మీరు తీసుకుని అసలు సొమ్మును ప్రభుత్వ

**హ|జత్ ఉమర్(రజి) హ|జత్ అలీ(రజి)తో, "దైవప్రవక్త(స) తన మరణ కాలం వరకు మీ పట్ల ప్రసన్నులై ఉన్నార"ని చెప్పారు.**

**346) హ|జత్ సహ్ల్ బిన్ సాద్(రజి) ఉల్లేఖించారు : దైవప్రవక్త(సఅసం) ఖైబర్ యుద్ధ సందర్భంగా, "రేపు నేను ఒక వ్యక్తి చేతికి ఇస్లామ్ పతాకం ఇస్తాను. అల్లాహ్ అతని చేతుల మీదుగా విజయం ప్రసాదిస్తాడ"ని అన్నారు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు: రాత్రంతా జనులు ఆలోచనల్లో మునిగిపోయారు– తెల్లవారాక**

---

ధనాగారంలో జమ చెయ్యండి' అని సలహా ఇచ్చాడు ఆ గవర్నర్. అదే భాగ్యం అనుకున్నారు అబ్దుల్లాహ్. ఆయన మదీనాకు తిరిగి వచ్చినప్పుడు ఆ విషయం తెలుసుకున్న ఖలీఫా ఉమర్(రజి), "అసలు సొమ్ముతోపాటు, దానిపై వచ్చిన లాభాన్ని కూడా కోశాగారంలో జమ చెయ్యి. ఎందుకంటే ఆ సొమ్ము నీదీ కాదు, నీ అబ్బదీ కాదు" అన్నారు. పాపం, అబ్దుల్లాహ్ అంత దూరం నుంచి ప్రయాణం చేసి వచ్చారు. ప్రభుత్వ బొక్కసానికి చేరవలసిన డబ్బును భద్రంగా తీసుకు వచ్చారు. అందుచేత ఆయనకు కొంత వేతనం లభించటం న్యాయం అని సహచరమాన్యులు నచ్చజెప్పినప్పుడు, "సరే మీ ఇష్టం. నేనైతే ఆ డబ్బంతా ప్రభుత్వ ధనాగారంలోనే చేరాలని భావిస్తాను" అన్నారు.

మహనీయ ఉమర్(రజి)లోని న్యాయశీలతకు, నిష్పక్షపాత బుద్ధికి ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే.

10–1. హ|జత్ అలీ బిన్ అబీ తాలిబ్(రజి) ముస్లింలకు నాల్గవ మార్గదర్శక ఖలీఫా (రజి) అయ్యారు. అబుల్ హసన్, అబూ తురాబ్ ఈయన కునీయత్. ఎనిమిదేళ్ళ ప్రాయంలోనే ఇస్లామ్ స్వీకరించారు. ఒక్క తబూక్ యుద్ధంలో తప్ప మిగిలిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. గోధుమ వర్ణం శరీరం. అందమైన కళ్ళు. ఎక్కువ పొడుగరి కారు. గుబురు గడ్డం చూడచక్కగా ఉండేది. చివరి కాలంలో గడ్డంతోపాటు తల కూడా నెరసిపోయింది. హ|జత్ ఉస్మాన్ అమరగతి నొందిన రోజున– హిజ్రీ 35వ సంవత్సరం, జిల్‌హజ్జా 18వ తేదీ శుక్రవారం నాడు ఖిలాఫత్ బాధ్యతలు ఆయనకు కట్టబెట్టడం జరిగింది. హిజ్రీ 40వ ఏట రమజాన్ నెల 18వ తేదీన శుక్రవారం నాడు అబ్దుర్రహ్మాన్ బిన్ ముల్జిమ్ అనే వ్యక్తి ఖడ్గంతో ఆయన తలపై వ్రేటు వేశాడు. గాయపడిన మూడు రోజుల తర్వాత ఆయన అమరగతినొందారు– ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. హ|జత్ హసన్(రజి) నమాజె జనాజాకు సారథ్యం వహించారు. ప్రభాత సమయాన అంత్యక్రియలు జరిగాయి. అప్పటికి ఆయన వయసు 63 సంవత్సరాలు. ఖలీఫాగా నాలుగేళ్ళ పది మాసాలు పరిపాలించారు.

**ఇస్లామ్ పతాకం ఎవరి చేతికి ఇవ్వబడుతుందా! అని. తెల్లవారాక అందరూ దైవ ప్రవక్త(స) సమక్షంలో హాజరయ్యారు. పతాకం తమకే ఇవ్వబడుతుందని ప్రతి ఒక్కరూ ఆశించారు. కాని, "అలీ బిన్ అబీ తాలిబ్ ఎక్కడ?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించారు. 'ఆయన కళ్లలో నొప్పి ఉంద'ని సహచరులు చెప్పారు. "ఎవరినయినా పంపి అతన్ని పిలుచుకుని రండి" అని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఆయన వచ్చిన తరువాత దైవప్రవక్త(స) తన లాలాజలాన్ని ఆయన కళ్లలో వేశారు. ఆయన కొరకు ప్రార్థించారు. దాంతో ఆయనకు సంపూర్ణ స్వస్థత చేకూరింది. తనకు అసలు ఏ బాధా లేనట్లే ఆరోగ్యవంతులయ్యారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇస్లామ్ ధ్వజాన్ని ఆయన చేతికి ఇచ్చారు. 'దైవప్రవక్తా! వారు కూడా మనలాగే అయ్యేవరకూ (అంటే ముస్లింలుగా పరివర్తన చెందేవరకూ) వారితో పోరాడతాను' అన్నారు అలీ(రజి). దానికి ఆయన(స), "ప్రస్తుతానికి ఇలాగే ముందుకు సాగిపోండి. మీరంతా వారి ప్రాంతంలో అడుగు పెట్టిన తరువాత, మొదట వారికి ఇస్లామ్ సందేశం చేర వేయండి. అల్లాహ్‌కు వారిపై గల హక్కులు ఏమిటో వారికి విశదపరచండి. దైవ సాక్షి! నీ ద్వారా అల్లాహ్ ఒక్క వ్యక్తికి సన్మార్గం వొసగినా, అది నీ పాలిట ఎర్రని ఒంటెల (సంపద) కన్నా మేలైనది"[1] అని ఉపదేశించారు.**

**347) సలమా బిన్ అక్వా (రజి) తెలిపారు : మహనీయ అలీ(రజి) కళ్ల జబ్బు కారణంగా ఖైబర్ యుద్ధానికి దైవప్రవక్త(సఅసం)తో కలసి రాలేకపోయారు. తరువాత ఆయన ఆలోచనలో పడిపోయారు– దైవప్రవక్త(స)తో కలసి ధర్మ యుద్ధంలో పాల్గొనకపోవటమా!? (ఎంత విడ్డూరం). ఈ ఆలోచన రాగానే ఆయన హుటాహుటిన తన ఇంటి నుండి బయలుదేరి ఆ సైన్యంలోకి వచ్చి చేరారు. రేపు ఉదయం అల్లాహ్ విజయం ప్రసాదించనుండగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "రేపు నేను ఎలాంటి వ్యక్తికి పతాకం ఇస్తానంటే... లేదా ఇలా అన్నారు : ఎలాంటి వ్యక్తి పతాకం తీసుకుంటాడంటే– అతన్ని దైవం మరియు దైవప్రవక్త ప్రేమిస్తు న్నారు... లేదా ఆయన(స) ఇలా అన్నారు : అతను దైవాన్ని, దైవప్రవక్త(స)ను ప్రేమిస్తున్నాడు. అల్లాహ్ అతని చేతుల మీదుగా విజయం ఒసగుతాడు" యాదృచ్ఛి**

---

346–1. సాధ్యమైనంత వరకు యుద్ధం జరగకుండా చూడండి అన్నది దైవప్రవక్త(స) పలుకుల్లోని అంతరార్థం. ఇస్లామ్ యుద్ధాన్ని ఇష్టపడదు. అది శాంతినే కోరు కుంటుంది. అది యుద్ధం చేసేది కేవలం ఆత్మరక్షణ కొరకే.

కంగా మహనీయ అలీ (రజి) వచ్చేశారు. నిజానికి ఆయన రాగలరని మేము అనుకోలేదు. ఇదిగో, అలీ వచ్చేశారని జనులు చెప్పారు. దైవప్రవక్త(స) ఆయన చేతికి ధ్వజం అందించారు. అల్లాహ్ ఆయన చేతుల మీదుగా విజయం ప్రసాదించాడు.

**348)** తన తండ్రి తనకు తెలియజేశారని అబూ హాజిమ్ వివరించారు : ఒక వ్యక్తి హజ్రత్ సహ్ల్ బిన్ సాద్(రజి) దగ్గరకు వచ్చి, 'విన్నారా! ఫలానా వ్యక్తి (మదీనా గవర్నర్ మర్వాన్) మస్జిద్ వేదికపై కూర్చుని మహనీయ అలీ(రజి) గురించి నోరు పారేసుకుంటున్నాడు' అని ఫిర్యాదు చేశాడు. అబూ హాజిమ్ ఇలా అన్నారు: "ఇంతకీ ఏమన్నాడేమిటి?" అని సహ్ల్ బిన్ సాద్(రజి) విచారించగా, 'అలీ(రజి)ని అబూ తురాబ్[1] అంటున్నాడు' అని ఆ వ్యక్తి చెప్పాడు. అది విని మహనీయ సహ్ల్ తొలుత నవ్వేశారు. తరువాత ఇలా అన్నారు : "దైవసాక్షి! ఇది ఆయనకు దైవ ప్రవక్త (స) పెట్టిన పేరు. స్వయంగా హజ్రత్ అలీ(రజి) కూడా ఈ పేరు (కునీయత్)ను అమితంగా ఇష్టపడేవారు'. ఇది విని నేను ఈ హదీసు పూర్వాపరాలను గురించి సహ్ల్ బిన్ సాద్(రజి) నోట వినదలిచాను. 'ఓ అబూ అబ్బాస్![2] ఈ సంఘటన గురించి కాస్త వివరిస్తారా?' అని నేను విన్నవించుకోగా, ఆయన ఇలా వివరించారు: "ఒకసారి మహనీయ అలీ(రజి) ఫాతిమా(ర.అ) దగ్గరకు వచ్చారు. అక్కడి నుంచి సరాసరి మస్జిద్‌కు వెళ్ళి అక్కడే పడుకున్నారు. తరువాత దైవప్రవక్త(స) ఫాతిమా వద్దకు వచ్చి "నీ పెత్తండ్రి కొడుకు[3] ఎక్కడ?" అని అడిగితే, మస్జిద్‌లో ఉన్నారని ఆమె చెప్పారు. దైవప్రవక్త(స) మస్జిద్‌కు వచ్చి చూస్తే అలీ(రజి) పడుకుని ఉన్నారు. ఆయన కప్పుకున్న దుప్పటి కూడా క్రిందపడిపోయి ఉంది. అలీ వీపుకు మట్టి అంటుకుని ఉంది. దైవప్రవక్త(స) ఆ మట్టిని తుడుస్తూ "ఓ అబూ తురాబ్ (మట్టి కొట్టుకున్నవాడా! లే. లేచి కూర్చో" అన్నారు ఆప్యాయంగా.

---

348–1. అలీ(రజి)ని కించపరిచే ఉద్దేశంతో మర్వాన్ అలా అన్నాడు. కాని దైవప్రవక్త(స) వాత్సల్యంతో అలా పిలిచారని అతనికి తెలీదు.

348–2. ఇది సహ్ల్ బిన్ సాద్(రజి) గారి కునీయత్

348–3. తాతను తండ్రిగా సంబోధించారు. అబూ తాలిబ్ హజ్రత్ ఫాతిమా (ర.అ)కు తాత అవుతారు.

**349)** సాద్ బిన్ ఉబైదా తెలిపారు : ఒక వ్యక్తి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) దగ్గరకు వచ్చి, హజ్రత్ ఉస్మాన్(రజి) గుణశీలముల గురించి వాకబు చేశాడు. ఇబ్నె ఉమర్ ఉస్మాన్(రజి)లోని సద్గుణాలను గురించి ప్రస్తావించారు. తరువాత "బహుశా ఈ మాటలు నీకు రుచించలేదేమో!" అన్నారు. దానికి అతను 'అవున'న్నాడు. అది విన్న ఇబ్నె ఉమర్, "అల్లాహ్ నీ ముక్కుకు మన్ను తగిలేలా చెయ్యుగాక!" అని వ్యాఖ్యానించారు. తరువాత ఆ వ్యక్తి, హజ్రత్ అలీ(రజి) గురించి అడిగాడు. ఆయన అలీ(రజి)లోని మంచిని గురించి కూడా ప్రస్తుతించారు. హజ్రత్ అలీ(రజి) కుటుంబం దైవప్రవక్త(స) వంశంలోని అత్యంత మంచి కుటుంబం అని కూడా చెప్పారు. తరువాత "బహుశా ఈ మాటలు కూడా నీకు జీర్ణం కాలేదేమో!" అన్నారు. దానికి అతను 'అవున'న్నాడు. అప్పుడు హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి), "అల్లాహ్ నీ ముక్కుకు మన్ను తగిలేలా చెయ్యుగాక. పో, నీకు చేతనయింది చేసుకో పో"[1] అన్నారు.

**350)** మహనీయ అలీ(రజి) తెలిపారు: హజ్రత్ ఫాతిమా (రఅ) దైవ ప్రవక్త(స) సమక్షంలో, తిరుగలి రాయి తిప్పటంలో ఎదురవుతున్న బాధను గురించి చెప్పుకున్నారు. ఇలా చెప్పుకున్న కొన్నాళ్ళ తర్వాత దైవప్రవక్త(స) వద్దకు కొంతమంది ఖైదీలు తీసుకురాబడ్డారు. అప్పుడు హజ్రత్ ఫాతిమా(ర.అ) దైవప్రవక్త(స) ఇంటికి వచ్చారు. కాని ఆ సమయంలో దైవప్రవక్త(స) ఇంట్లో లేరు. ఆమె గారు హజ్రత్ ఆయిషా(ర.అ)ను కలుసుకుని, తన సమస్య గురించి చెప్పుకున్నారు. తరువాత దైవప్రవక్త(స) ఇంటికి వచ్చినప్పుడు, ఫాతిమా వచ్చి వెళ్ళిన సంగతిని ఆమె చెప్పారు. అందువల్ల దైవప్రవక్త(స) స్వయంగా మా ఇంటికి వచ్చారు. అప్పటికే మేము పడకపై మేను వాల్చాము. నేను లేచి నిలబడబోయాను. "ఫరవాలేదు. పడుకునే ఉండండి" అని దైవప్రవక్త(స) చెప్పారు. తరువాత ఆయన(స) మా ఇద్దరి మధ్యన కూర్చు

---

349-1. ప్రశ్నించిన ఆ వ్యక్తి పేరు నాఫే. అతను ఖారిజీ వర్గానికి చెందినవాడు. అతను హజ్రత్ ఉస్మాన్(రజి)తోపాటు హజ్రత్ అలీ (రజి)ని కూడా చెడ్డవారుగా భావించేవాడు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారు హజ్రత్ అలీ (రజి) కుటుంబీకుల మంచితనాన్ని కూడా ప్రస్తావించారు. కాని ఖారిజీలు ఆయన కుటుంబీకుల సేవల్ని విస్మరించి, అలీ (రజి) పట్ల తిరుగుబాటు ధోరణిని అవలంబించారు. చివరకు పరాభవం పాలయ్యారు.

**న్నారు. నేను ఆయన(స) పాదాల చల్లదనాన్ని నా గుండెల్లో ఆస్వాదించాను. ఆయన (స) ఇలా ఉపదేశించారు : "మీరు ఏదైతే నా నుండి కోరారో దానికన్నా మేలైన విషయం చెప్పనా! మీరు నిద్రించడానికి పడకపై మేను వాల్చినప్పుడు 34సార్లు అల్లాహు అక్బర్ అనీ, 33 సార్లు సుబ్‌హానల్లాహ్ అనీ, 33 సార్లు అల్‌హమ్దులిల్లాహ్ అని పలకండి. ఈ ఆచరణ మీ పాలిట సేవకుని కన్నా మేలైనది."[1]**

**351) ఉబైదా కథనం: హజ్రత్ అలీ(రజి) ఉబైదాతో ఇలా అన్నారు : "లోగడ మీరు ఎలా తీర్పు చేసేవారో ఇప్పుడూ అలాగే తీర్పు చెయ్యండి.[1] నేను భేదాభిప్రాయాన్ని మంచిదిగా భావించను.[2] ప్రజలు ఒక ఖలీఫా మాటకు కట్టుబడి ఉన్నంత వరకూ (భేదాభిప్రాయానికి తావీయకూడదు)[3] లేదా నేను అబూబక్ర్, ఉమర్‌ల మాదిరిగా ఈ లోకం నుండి అయినా నిష్క్రమించాలి (కాని రాజీపడే ప్రసక్తే లేదు). ఇబ్నె సీరీన్ కథనం : సాధారణంగా జనులు అలీ ద్వారా (అబూబక్ర్, ఉమర్‌ల గురించి) ఉల్లేఖించబడిన ఎన్నో హదీసులు సత్యబద్ధమైనవి కావని[4] అంటారు. ...మరొక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) హజ్రత్ అలీ(రజి)తో ఇలా అన్నారు: "మూసా (అలైహిస్సలామ్) దృష్టిలో హారూన్(అ) స్థాయి ఎటువంటిదో, నా దృష్టిలో నీ స్థాయి కూడా అటువంటిదే. ఇది నీకు సంతోషకరం కాదా?"[5]**

---

350–1. ఎవరయితే నిద్రకు ఉపక్రమించినప్పుడు ఈ హదీసు ప్రకారం అమలుపరుస్తాడో అతనికి అలసట ఉండదని ఇమామ్ ఇబ్నె తైమియ్యా (రహ్మ) అభిప్రాయపడ్డారు.

351–1. అంటే అబూబక్ర్, ఉమర్‌ల కాలంలో చేసే తీర్పులు.

351–2. ఉబైదా ఇరాక్ న్యాయాధిపతిగా ఉండేవారు. ఒక యజమాని వద్ద బానిస స్త్రీగా ఉంటూ అతని చేత సంతానవతి అయిన 'ఉమ్మె వలదా'ను వేరొకరికి అమ్మటం సమంజసం కాదన్నది హజ్రత్ ఉమర్(రజి) అభిప్రాయం. కాగా, హజ్రత్ అలీ(రజి) ఆమె అమ్మకాన్ని సమంజసంగా భావించేవారు. 'అబూబక్ర్, ఉమర్‌ల పరిపాలనా కాలంలో మేము ఉమ్మె వలదాను అమ్మటం అనుచితంగా భావించేవారం కదా! మరి మీరేమంటారు?' అని ఉబైదా అడిగినప్పుడు, ఇప్పుడు కూడా పూర్వపు తీర్పునే కొనసాగించండి అని హజ్రత్ అలీ(రజి) అన్నారు.

351–3. అంటే లోగడ మార్గదర్శక ఖలీఫాలు అవలంబించిన దానిని మనం గౌరవించాలి. ఇలాంటి విషయాలలో అనవసరంగా భేదాభిప్రాయాలకు తావీయటం మంచిది కాదు.

## అధ్యాయం : 11

## మహనీయ జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి) విశిష్టత

**ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఆయనతో, "నీవు రూపురేఖలలోనూ, గుణగణాలలోనూ నన్ను ఎక్కువగా పోలి ఉన్నావ్"[1] అన్నారు.**

**352) హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: అబూ హురైరా (రజి) చాలా హదీసులు వినిపిస్తాడని జనులు చెప్పుకుంటున్నారు. నిజానికి నేను కడుపు నిండిన తరువాత ఎల్లవేళలా ప్రవక్త మహనీయుల(సఅసమ్)నే అంటిపెట్టుకుని ఉండేవాణ్ణి.[1] నాకు ఖుమైరీ రొట్టెలుగానీ, నాణ్యమైన దుస్తులుగానీ లభ్యమయ్యేవి కావు (అంటే నా సమయంలో ఎక్కువ భాగం విద్యార్జనలోనే గడిచిపోయేది). నా సేవ కొరకు**

---

351–4. ఇది రాఫిజీలు అల్లిన కట్టుకథ.

351–5. దైవప్రవక్త(స) తబూక్ యుద్ధానికి వెళ్ళినప్పుడు హజ్రత్ అలీ(రజి)ని మదీనాలో వదలివెళ్ళారు. దీనికి అలీ(రజి) దుఃఖ వదనులయ్యారు. నన్ను మీరు స్త్రీల, చిన్నపిల్లల మధ్యన వదలివెళుతున్నారా? అని అలీ ప్రశ్నించినప్పుడు, దైవ ప్రవక్త(స) ఈ హదీసును వినిపించారు. అంటే దైవప్రవక్త మహనీయ మూసా(అ) తూర్ పర్వతంపైకి వెళ్ళేటప్పుడు తన సోదరునికి, జాతి ప్రజలను కనిపెట్టుకుని ఉండే బాధ్యతను అప్పగించినట్లే, నేను నీకు మదీనా ప్రజలను కనిపెట్టుకుని ఉండే బాధ్యతను అప్పగిస్తున్నాను అన్నది ఆ పలుకుల ఆంతర్యం.

11–1. ఈయన హజ్రత్ అలీ(రజి) అన్నయ్య. అలీ(రజి) కన్నా పదేండ్ల పెద్దవారు. దైవమార్గంలో రెండుసార్లు హిజ్రత్ చేశారు. మొదటి హిజ్రత్ అబిసీనియా దేశానికి, రెండవ హిజ్రత్ మదీనాకు. ఈయనకు 'జుల్ జనాహైన్' (రెండు రెక్కల వాడు) అనే బిరుదు ఉంది. ఇస్లామ్ స్వీకరిస్తున్నప్పుడు ఈయన దైవప్రవక్త(స)కు ఎడమ వైపున నిలబడి నమాజ్ చేశారు. "నీవు నాతో కలసి నమాజ్ ఆచరించావు. అల్లాహ్ స్వర్గంలో నీకు రెండు రెక్కలను ప్రసాదిస్తాడు. తద్వారా నీవు స్వర్గంలో ఎగురుతూ తిరుగుతావు" అని దైవప్రవక్త(స) చెప్పారు. 41 ఏండ్ల వయసులో హిజ్రీ 8వ యేట– ముతా యుద్ధంలో జాఫర్(రజి) అమరగతి నొందారు.

352–1, అంటే అప్పుడు నాకంటూ ఇల్లూవాకిలి ఉండేది కాదు. దైవప్రవక్త(స) సాంగత్య భాగ్యంతోనే పూటకు ఇంత అన్నం దొరికేది.

**ఏ పురుషుడుగానీ, ఏ స్త్రీ గానీ వచ్చేవారు కారు. పైగా నేను ఆకలి బాధకు తట్టుకోలేక కడుపుకు రాయి కట్టుకునేవాణ్ణి. ఒక్కోసారి నేను ఏదైనా దివ్య వచనాన్ని పఠించి, దీనికి అర్థం ఏమిటో చెప్పగలరా! అని జనులను అడిగేవాణ్ణి. బహుశా వారు ఆ ఆయత్‌లోని అర్థాన్ని గ్రహించి నన్ను తమ ఇంటికి తోడ్కొని వెళ్ళి అన్నం పెడతారని ఆశించేవాణ్ణి. వాస్తవానికి నాకు ఆ ఆయత్ అర్థం తెలియక కాదు, తెలుసు. కాని ప్రజల దృష్టిని నా వైపు మళ్ళించుకునేందుకు ఆ విధంగా అభినయం చేసేవాణ్ణి. నిరాధార జీవుల పట్ల అందరికన్నా ఉత్తమంగా వ్యవహరించేవారిలో ఒకరు హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి). ఆయన మమ్మల్ని తన ఇంటికి పిలుచుకుని వెళ్ళి, ఇంట్లో ఆ సమయానికి ఏముంటే అదే తినిపించేవారు.[2] ఒక్కోసారి (భోజనం లేకపోతే) తేనె కుప్పెగానీ, నేతి కుప్పె గానీ తెచ్చి సమర్పించేవారు. మేము ఆ కుప్పెనే చీల్చి అందలి పదార్థాన్ని చప్పరించేవారం."**

**353) ఇస్మాయీల్ బిన్ అబీ ఖాలిద్ తెలిపారు: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారు హజ్రత్ జాఫర్(రజి) కుమారునికి సలామ్ చేసినప్పుడల్లా 'అస్సలాము అలైక యా ఇబ్నె జిల్ జనాహైన్' (ఓ యీ రెండు రెక్కలవాని పుత్రుడా! నీపై శాంతి కురియుగాక!) అని అనేవారు.[1] హదీసులోని 'జనాహైన్' అనే పదానికి అర్థం 'రెండు మూలలు' అని ఇమామ్ బుఖారీ(రహ్మ) అభిప్రాయపడ్డారు.**

## అధ్యాయం : 12

## మహనీయ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి) గురించి

**354) హజ్రత్ అనస్(రజి) కథనం: హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) తన పరిపాలనా కాలంలో కరవు కాటకాలు వచ్చినప్పుడు, హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి)ను ముందుకు పంపి వర్షం కొరకు 'దుఆ' చేయించేవారు. ఇలా**

---

352–2. మహనీయ జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి) గొప్ప దాతృగుణం కలవారు. ఈయన కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ దానధర్మాలైతే విశ్వవిఖ్యాతి గాంచాయి.

353–1. ముతా యుద్ధంలో వీరమరణం పొందిన జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి)కు స్వర్గంలో రెండు రెక్కలుంటాయని దైవప్రవక్త(స) భవిష్యవాణి పలికారు. మహనీయ జాఫర్ స్వర్గంలో దైవదూతలతోపాటు ఎగురుతూ ఉంటారు. ఈ కారణంగానే ఆయన్ని 'తయ్యార్' అని కూడా అంటారు.

**వేడుకునేవారు: "ఓ అల్లాహ్! పూర్వం మేము మా ప్రవక్త(స) చేత వర్షం కొరకు ప్రార్థన చేయించేవారము. నీవు మాపై పుష్కలంగా వర్షం కురిపించి, మా దాహం తీర్చేవాడవు. ఇప్పుడు మేము మా ప్రవక్త పినతండ్రి చేత వర్షం కొరకు ప్రార్థన చేయిస్తున్నాము. కాబట్టి మా దాహం తీర్చు"[1] - ఇలా ప్రార్థించిన మీదట ధారా పాతంగా వర్షం కురిసిందని ఉల్లేఖకుడు అన్నారు.**

## అధ్యాయం : 13

## దైవప్రవక్త(స) రక్త సంబంధీకుల ప్రాముఖ్యత

**355) హజ్రత్ ఆయిషా(ర.అ) నుండి సంగ్రహించిన విషయాన్ని ఉర్వా బిన్ జుబైర్ ఇలా వివరించారు: హజ్రత్ ఫాతిమా(ర.అ) తన మనిషిని హజ్రత్ అబూ బక్ర్(రజి) దగ్గరకు పంపించి, దైవప్రవక్త(సఅసమ్) నుండి లభించవలసిన వారసత్వ ఆస్తిని ఇవ్వమని కోరారు. దానిని అల్లాహ్ 'ఫై' రూపంలో తన ప్రవక్తకు వొసగాడు. ఆ ఆస్తి ద్వారా వచ్చే రాబడిని దైవప్రవక్త(స) సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించేవారు. దానిని తనకు ఇవ్వమని విజ్ఞప్తి చేశారు ఫాతిమా. అలాగే ఫదక్ ఆస్తిని, ఖైబర్‌లో లభించిన 'ఖుముస్' (ఐదవ భాగం)ను కూడా తనకు ఇవ్వమని కోరారు.**

**దానికి సమాధానంగా హజ్రత్ అబూబక్ర్(రజి) ఇలా అన్నారు : "దైవ ప్రవక్తలమైన మాకు ఏ మీరాశీ ఉండదని మహాప్రవక్త(స) స్వయంగా చెప్పి వెళ్ళారు. మేము వదలిపోయినదంతా సదకా(దానం)గా పరిగణించబడుతుందనీ, ముహమ్మద్ కుటుంబీకుల ఖర్చులు ఆ సొమ్ము నుండే చెల్లించాలనీ, ఒక్క తిండి ఖర్చులు తప్ప**

---

354-1. మహనీయ అబ్బాస్(రజి) దైవప్రవక్త(స) కన్నా రెండు మూడేండ్ల పెద్దవారు. స్వంత బాబాయి. ఒకసారి మదీనాలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడింది. అప్పుడు కాబ్ బిన్ మాలిక్(రజి) ఖలీఫా ఉమర్(రజి) దగ్గరకు వచ్చి, "బనీ ఇస్రాయీల్‌పై దుర్భిక్షం తాండవించినప్పుడు, వారు తమ ప్రవక్తల సంతానం చేత ప్రార్థన చేయించేవారు. తత్ఫలితంగా అల్లాహ్ వర్షం కురిపించేవాడు" అని చెప్పారు. దానికి ఉమర్(రజి), "మన వద్ద కూడా అబ్బాస్(రజి) ఉన్నారు కదా, ఆయన దైవప్రవక్త(స) పినతండ్రి. పిన తండ్రి తండ్రి లాంటివాడే" అని చెప్పి, ఆయన వద్దకు వెళ్ళారు. ఆయన్ని తోడ్కొని వచ్చి, మింబర్ పైకి ఎక్కి దుఆ చేశారు. అల్లాహ్ పుష్కలంగా వర్షం కురిపించాడు.

**మరేవిధమయిన వ్యయం కూడా చేసే హక్కు వారికి ఉండదని దైవప్రవక్త(స) తాకీదు చేశారు. దైవసాక్షి! దైవప్రవక్త(స) కాలంలో ఈ పద్దు క్రింద అయ్యే ఖర్చుల్లో నేను ఎలాంటి మార్పులు చేర్పులు చేయలేను. దైవప్రవక్త(స) నెలకొల్పిన వ్యవస్థనే యధాతథంగా కొనసాగిస్తాను."**

**తరువాత మహనీయ అలీ(రజి) ఖలీఫా హజ్రత్ అబూబక్ర్(రజి) దగ్గరకు వచ్చి "అబూబక్ర్(రజి)! మేము మీ విశిష్టతను అంగీకరిస్తున్నాము" అని చెప్పారు. ఆ తరువాత ఆయన దైవప్రవక్త(స)తో తమకు గల బంధుత్వ సంబంధాన్ని, తమ హక్కును గురించి ప్రస్తావించారు. దానికి సమాధానంగా అబూబక్ర్(రజి), "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! దైవప్రవక్త(స) రక్త సంబంధీకులతో సద్భావంతో మెలగటం నాకు నా బంధువులతో సద్భావంతో మెలగటం కన్నా ఇష్టకరమైనది."[1] అన్నారు.**

**మహనీయ ఇబ్నె ఉమర్(రజి) కథనం ప్రకారం హజ్రత్ అబూబక్ర్(రజి) ఇలా అన్నారు : "దైవప్రవక్త(సఅసమ్) పట్ల గల గౌరవాదరణలను ఆయన ఇంటివారల పట్ల కలిగి ఉండండి."**

**356) మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఫాతిమా (ర.అ) నా శరీర భాగం.**

---

355–1. ఇక్కడ రక్త సంబంధీకులు అంటే అబ్దుల్ ముత్తలిబ్ సంతానమని హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మా) పేర్కొన్నారు. వారు పురుషులూ కావచ్చు, స్త్రీలూ కావచ్చు. దైవప్రవక్త(స)ను ప్రత్యక్షంగా చూసినవారు, ఆయన(స) సహచర్యంలో ఉన్న వారు. ఉదాహరణకు మహనీయ అలీ(రజి), ఆయన సంతానమైన హసన్, హుసైన్, ముహ్సిన్, ఫాతిమా, ఆమె కూతురు ఉమ్మె కుల్సూమ్(ఈమె హజ్రత్ ఉమర్–రజి భార్య కూడా). హజ్రత్ జాఫర్‌తోపాటు ఆయన పిల్లలు కూడా ఈ కోవలోకి వస్తారు. అఖీల్‌తోపాటు ఆయన పిల్లలు, ఉమ్మె హానీ, హజ్రత్ అలీ సోదరీమణి, ఆమె పిల్లలు, హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరియు ఆయన పిల్లలు. అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్, ఇంకా ఆయన పిల్లలు. అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరియు ఆయన పిల్లలు, అబ్దుల్ ముత్తలిబ్ కూతుళ్ళు, వారి సంతానం– వీరంతా ప్రళయదినం వరకూ దైవప్రవక్త(స) బంధువులుగానే పరిగణించబడతారు.

**అందువల్ల అకారణంగా ఆమెకు మనస్తాపం కలిగించినవారు నాకు మనస్తాపం కలిగించినట్లే."**

**357) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా వివరించారు: దైవ ప్రవక్త (సఅసమ్) మరణ వ్యాధికి గురైనప్పుడు తన కూతురు హజ్రత్ ఫాతిమా (ర.అ)ను పిలిచి, నెమ్మదిగా ఆమెకు ఏదో చెప్పారు. అది విని ఆమె ఏడ్వసాగారు. దైవప్రవక్త(స) ఆమెను మళ్ళీ (దగ్గరకు) పిలిచి ఏదో రహస్యంగా చెప్పారు. అది విని ఆమె చిరునవ్వు చిందించారు. ఇంతకీ ఆ విషయం ఏమిటో చెప్పమని నేను ఆమెను అడగ్గా, "ఈ వ్యాధిగ్రస్త స్థితిలోనే నేను మరణిస్తాన"ని దైవప్రవక్త(స) నెమ్మదిగా నాతో చెప్పారు. దాంతో నాకు ఏడుపు ఆగలేదు. తరువాత ఆయన(స) నాతో, "తన ఇంటి వారలలో అందరికన్నా ముందు నేనే ఆయన సన్నిధికి చేరు కుంటాన"ని అన్నారు. అది విని నేను నవ్వాను[1] అని అన్నారు.**

## అధ్యాయం : 14

## మహనీయ జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) గొప్పతనం[1]

**మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : ఆయన (జుబైర్) దైవ ప్రవక్త(స) హవారీ.[2] ఈసా అలైహిస్సలామ్ వెంట ఉండే హవారీలను హవారీలు అని ఎందుకంటారంటే వారు తెల్లని వస్త్రాలను ధరించేవారు.**

---

357-1. సుబ్హానల్లాహ్! ఈ హదీసునుబట్టి దైవప్రవక్త(స) తన గారాలపట్టి ఫాతిమా (ర.అ)ను ఎంతగా ప్రేమించేవారో అవగతమవుతోంది. దైవప్రవక్త(స) చెప్పినట్లుగానే ఆయన పరమపదించిన ఆరు నెలలకు హజ్రత్ ఫాతిమా(ర.అ) కూడా కాలం చేశారు. దైవప్రవక్త(స) ఆ విధంగా పలికినంత మాత్రాన ఆయనకు అగోచర విషయాల జ్ఞానం ఉందని భావం ఎంతమాత్రం కాదు. తనకు అందిన దైవవాణి ఆధారంగా ఆయన ఆ భవిష్యవాణి పలికారు.

14-1. అబూ అబ్దుల్లాహ్ ఖురైషీ ఈయన కునీయత్. ఈయన తల్లి సఫియ్యా (ర.అ) దైవప్రవక్త మేనత్త. ఆమె అబ్దుల్ ముత్తలిబ్ కుమార్తె. పదహారేళ్ళ ప్రాయంలో జుబైర్ ఇస్లామ్ స్వీకరించారు. ఇస్లామ్ విడనాడమంటూ ఈయన బాబాయి ఈయనకు ముంత పొగపెట్టాడు. కాని ఈయన ఇస్లామ్ ధర్మంపై స్థిరంగా ఉన్నారు. స్వర్గలోక శుభవార్త వినిపించబడిన పదిమంది సౌభాగ్యవంతులలో ఈయన ఒకరు.

**358) మర్వాన్ బిన్ హకమ్ అందజేసిన సమాచారం ప్రకారం 'నక్‌సీర్' (ముక్కు నుండి నెత్తురు పడే) వ్యాధి తీవ్రంగా ప్రబలిన సంవత్సరం ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(రజి) కూడా దాని వాతన పడ్డారు. ఆయన ఎంత తీవ్రంగా అనారోగ్యానికి గురయ్యారంటే ఆ ఏడాది హజ్జ్‌కి కూడా వెళ్ళలేకపోయారు. ఆఖరికి తన జీవితంపైనే ఆశ వదలుకుని వీలునామా కూడా చేశారు. ఆ సమయంలోనే ఖురైషుల్లోని ఒక వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చి, మీరు ఎవరినయినా మీ ఖలీఫాగా చేయండి అని విజ్ఞప్తి చేశాడు. దానికి ఉస్మాన్(రజి), "ఏమిటి, అందరూ ఇలాగే కోరుకుంటున్నారా?" అని అడిగారు. 'అవున'ని ఆ వ్యక్తి చెప్పాడు. "ఎవరిని ఖలీఫాగా చేయమంటావు?" అని ఆయన అడగ్గా అతను మౌనం వహించాడు. ఆ తరువాత మరో వ్యక్తి కూడా ఆయన సన్నిధికి వెళ్ళి, 'మీరు ఎవరినయినా ఖలీఫాగా చేస్తే బాగుంటుంది' అని సలహా ఇచ్చాడు. బహుశా అతను హారిస్ అని నేననుకుంటున్నాను. "ఏమిటి, అందరి ఆకాంక్ష ఇదేనా?" అని ఉస్మాన్(రజి) అడిగితే, 'అవున'ని అతను సమాధాన మిచ్చాడు. "జనులు ఎవరిని ఖలీఫాగా కోరుకుంటున్నారు?" అని ఆయన ప్రశ్నించగా, ఆ వ్యక్తి నిశ్శబ్దంగా ఉండిపోయాడు. అప్పుడు ఆయన స్వయంగా "బహుశా జనులు జుబైర్ బిన్ అవ్వామ్ వైపు మొగ్గు చూపుతున్నారేమో!" అని పలికారు. 'అవునండి' అని అతను బదులిచ్చాడు. అది విని ఉస్మాన్(రజి), "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. నాకు తెలిసినంతవరకు ఆయన వారందరిలోకెల్లా శ్రేష్ఠుడు. నిశ్చయంగా ఆయన దైవప్రవక్త(స) దృష్టిలో కూడా వారందరిలోకీ ఎక్కువ ప్రియతముడు"[1] అని సాక్ష్యమిచ్చారు.**

---

14–2. ఈయన దైవప్రవక్త(స) ద్వారా 'హవారీ' (ప్రత్యేక సహాయకుడు) అనే బిరుదు పొందారు. కందక యుద్ధ సందర్భంగా ముస్లింల పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నప్పుడు శత్రు శిబిరం నుండి రహస్య సమాచారం రాబట్టడానికి దైవప్రవక్త జుబైర్ బిన్ అవ్వామ్(రజి)ను గూఢచారిగా పంపారు. ఆ కార్యాన్ని ఆయన పకడ్బందీగా నిర్వహించారు. అందుకే దైవప్రవక్త ఆయనకు 'హవారీ' అనే బిరుదుతో సత్కరించారు. జమల్ యుద్ధం నుండి తిరిగి వస్తూ అమరగతినొందారు.

358–1. అది హజ్రత్ ఉస్మాన్(రజి) అభిప్రాయం మాత్రమే. కాని అల్లాహ్ జ్ఞాన పరిధిలో ఆ హెూదా హజ్రత్ అలీ(రజి) కొరకు ప్రత్యేకమై ఉంది. అందుకే దేవుడు రాసిపెట్టిన దాని ప్రకారం హజ్రత్ అలీ (రజి) నాల్గవ మార్గదర్శక ఖలీఫాగా చేయబడ్డారు.

**359)** మర్వాన్ చెప్పగా తాను విన్నానని హిషామ్ తెలిపారు : మర్వాన్ ఇలా చెప్పాడు: నేను ఉస్మాన్(రజి) దగ్గర కూర్చొని ఉండగా ఒక వ్యక్తి వచ్చి, 'మీరు మీ ఖలీఫాగా ఎవరినయినా చేయండి' అని విజ్ఞప్తి చేశాడు. దానికి ఆయన, "అందరూ ఇలాగే అనుకుంటున్నారా?" అని ప్రశ్నించగా, 'అవును. జనులు జుబైర్ వైపు మొగ్గు చూపుతున్నార'ని ఆ వ్యక్తి బదులిచ్చాడు. దానిపై ఆయన(రజి) ఇలా అన్నారు : "మంచిది, మీ అందరిలోకీ ఆయన ఉత్తముడన్న సంగతి నీకూ తెలుసు"– ఈ మాట ఆయన మూడుసార్లు పలికారు.

**360)** హజ్రత్ జాబిర్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: "ప్రతి ప్రవక్తకూ హవారీలుంటారు. ఇక నా విషయా నికి వస్తే నా హవారీ (సహాయకుడు) జుబైర్ బిన్ అవ్వామ్(రజి)"

**361)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) తెలిపారు: అహ్జాబ్(కందక) యుద్ధ సందర్భంగా నన్నూ, అమ్ర్ బిన్ అబీ సలమా(రజి)ను స్త్రీల మధ్యన వదలి వెళ్ళటం జరిగింది (ఎందుకంటే అప్పటికి మేము పిన్న వయస్కులం). అకస్మాత్తుగా నా దృష్టి హజ్రత్ జుబైర్– రజిపై (నా తండ్రిపై) పడింది. ఆయన గుర్రంపై స్వారీ అయి బనీ ఖురైజా (యూదు తెగ) వైపునకు వస్తూ పోతూ ఉన్నారు. రెండు లేక మూడు సార్లు ఇలా జరిగింది. (యుద్ధం ముగిసి) నేను తిరిగి వచ్చిన తరువాత, 'నాన్న! నేను మిమ్మల్ని అనేకసార్లు రాకపోకలు సాగిస్తూ ఉండగా గమనించాను. ఏమిటి విశేషం?' అని అడిగితే, "ఒరేయ్ చంటీ! నిజంగానే నీవు నన్ను చూశావా?" అని ఆయన అడిగారు. నేను 'అవున'న్నాను. అప్పుడాయన ఇలా వివరించారు : "బనూ ఖురైజా వద్దకు వెళ్ళి, వారి కదలికల్ని పసిగట్టి, ఆ సమాచారం నాకు చేరవేసే వారెవరు?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించినప్పుడు, చిత్తం అంటూ నేను అక్కడికి వెళ్ళి ఆ రహస్య సమాచారాన్ని దైవప్రవక్త(స)కు చేరవేశాను. అప్పుడు దైవప్రవక్త(స) సంతోషాతిశయంతో తన తల్లిదండ్రుల్ని ప్రస్తావిస్తూ, "నా తల్లిదండ్రులు నీపై ఫిదా" అని పలికారు.

**362)** హిషామ్ బిన్ ఉర్వా తెలిపారు: ఈయన గార్కి ఈయన తండ్రి తెలియ జేశారు: యర్మూక్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త ప్రియ సహచరులు, జుబైర్ బిన్ అవ్వామ్(రజి)తో, "మీరు పరాక్రమం చూపరేమిటి? మీరు గనక పరాక్రమం చూపితే, మీతోపాటే మేము కూడా మెరుపు దాడి చేస్తాము" అని విజ్ఞప్తి చేశారు.

అప్పుడు ఆయన (రోమనులపై) దాడికి దిగారు. ఆ సందర్భంగా రోమనులు ఆయన భుజాలపై రెండుసార్లు ఖడ్గపు వ్రేటు వేశారు. ఆ రెండు గాయాల మధ్య బద్ర్ యుద్ధ సందర్భంగా గాయపడిన మచ్చ కూడా ఉండేది. ఉర్వా ఇలా అంటున్నారు : ఆ గాయాలు ఎంత లోతైనవంటే (ఆయన కోలుకున్న తర్వాత)– పసితనంలో– నేను ఆ గాయాలలో వ్రేళ్ళు పెట్టి ఆడుకునేవాణ్ణి.

## అధ్యాయం : 15

## మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) గురించి[1]

దైవప్రవక్త (సఅసమ్) తన మరణ కాలం వరకు ఈయన పట్ల సంతుష్టులై ఉన్నారని హజ్రత్ ఉమర్(రజి) చెప్పారు.

**364)** అబూ ఉస్మాన్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసం) పాల్గొన్న కొన్ని యుద్ధాలలో (ఉహుద్ యుద్ధంలో) ప్రవక్త వెంట తల్హా, సాద్ బిన్ అబీ వక్కాస్‌లు తప్ప వేరెవరూ నిలువలేకపోయారు.

**365)** ఖైస్ బిన్ అబీ హాజిమ్ తెలిపారు : "మహనీయ తల్హా (రజి) గారు (ఉహుద్ యుద్ధంలో) దైవప్రవక్త(స)ను రక్షించడానికి అడ్డుగా పెట్టిన ఆయన చేతిని చూశాను. అది పూర్తిగా పనికిరాకుండా పోయి ఉంది."

## అధ్యాయం : 16

## మహనీయ సాద్ బిన్ అబీ వక్ఖాస్ జుహ్రీ(రజి) విశిష్టత

ఈయన బనీ జుహ్రా తెగకు చెందినవారు. బనీ జుహ్రా దైవప్రవక్త (సఅసమ్)కు వరుసకు మేనమామ అవుతారు. ఆయన అసలు పేరు సాద్ బిన్ అబీ మాలిక్.[1]

---

15–1. ఈయన ఖురైషీ. ఈయన కునీయత్ అబూ ముహమ్మద్. స్వర్గలోక శుభవార్త ప్రపంచంలోనే వినిపించబడిన అష్రె ముబష్షిరాలో ఒకరు. ఉహుద్ యుద్ధంలో ఈయన దైవప్రవక్త(స) ముఖారవిందానికి గాయం అవకుండా ఉండేందుకు తన రెండు చేతుల్ని 'డాలు'గా అడ్డం పెట్టారు. చేతులపై 75 గాయాలయ్యాయి. చేతివ్రేళ్ళు చచ్చుబడిపోయాయి. అయినా దైవప్రవక్త(స) మోముపై దెబ్బపడకుండా ఉండేందుకు మొక్కవోని సాహసంతో నిలబడ్డారు.

హజ్రత్ తల్హా (రజి) సుందర స్వరూపులు. శరీరం గోధుమ వర్ణంలో ఉండేది. జమల్ యుద్ధంలో అమరగతి నొందారు. అప్పటికి ఆయన వయసు 64 సంవత్సరాలు.

**366) మహనీయ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) ఇలా చెప్పేవారు : "ఉహుద్ యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు (సఅసం) నా కోసం తన తల్లిదండ్రు లిద్దరినీ స్మరిస్తూ, "నా తల్లిదండ్రులు నీపై ఫిదా" అని పలికారు.**

**367) తన తండ్రి (సాద్ బిన్ అబీ వక్ఖాస్-రజి) తనతో ఇలా చెప్పారని ఆమిర్ బిన్ సాద్ తెలిపారు: "నాకు బాగా జ్ఞాపకం ఉంది. ఒకానొక కాలంలో ముస్లింలలో కేవలం మూడవ భాగం మాత్రమే ఉండటం నేను చూసి ఉన్నాను (అంటే దైవ ప్రవక్త-సఅసం- వెంట సాద్, అబూబక్ర్, బిలాల్లు మాత్రమే ఉండేవారు).**

**368) హజ్రత్ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) చెప్పగా తాను విన్నానని సయీద్ బిన్ ముసయ్యిబ్ తెలిపారు- సాద్(రజి) ఇలా చెప్పారు : "నాకంటే ముందు ఎవరూ ఇస్లామ్ స్వీకరించలేదు. నేను ముస్లింగా ధర్మపరివర్తన చెందిన రోజునే ఇతరులు (తొలి కాలపు సహాబా) కూడా ఇస్లామ్ స్వీకరించారు. ఏడు రోజులపాటు నేను ముస్లింల మూడవ భాగంగా ఉన్నాను"[1] ఇబ్నె అబీ జాయిదాతో పాటు ఈ హదీసును అబూ ఉసామా కూడా ఇలాగే ఉల్లేఖించారు.**

**369) హజ్రత్ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) చెప్పగా తాను విన్నానని ఖైస్ తెలిపారు: సాద్(రజి) ఇలా చెప్పారు: "అరేబియాలో అందరికన్నా ముందు దైవ మార్గంలో (ఇస్లామ్ తొలి కాలంలో) బాణం ప్రయోగించిన వాణ్ణి నేనే. మేము**

---

16-1. సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) 'అష్రె ముబష్షిరా'లో ఒకరు. 17 ఏళ్ళ వయసులో ఇస్లామ్ స్వీకరించారు. దైవమార్గంలో అందరికన్నా ముందు విలువిద్యను ప్రదర్శించిన యోధుడు. హజ్రత్ ఉస్మాన్(రజి) ఈయన్ని కూఫా గవర్నర్గా నియ మించారు. 70 ఏళ్ళ వయసులో హిజ్రీ 55వ సంవత్సరంలో మరణించారు. అల్లాహ్ ఆయన పట్ల ప్రసన్నుడవుగాక!

368-1. దీనిపై ఆక్షేపణ వ్యక్తమయింది. అబూబక్ర్, ఖదీజాతో సహా అనేక మంది సాద్(రజి) కన్నా ముందే ఇస్లామ్ స్వీకరించారు. దీనిపై మరికొంతమంది ఏమంటారంటే; బహుశా సాద్(రజి) తన జ్ఞాన పరిధిలో అలా చెప్పి ఉండవచ్చు. కాని ఇది నిజం కాదు. ఎందుకంటే ఇబ్నె అబ్దుల్ బర్(రహ్మా) సాద్ నుండి సంగ్ర హించిన దానిలో ఇలా ఉంది : "నేను 19 ఏండ్ల వయసులో అబూబక్ర్ చేతుల మీదుగా ఇస్లామ్ స్వీకరించాను. ఆ సమయంలో నేను ఏడవ ముస్లింను."

దైవప్రవక్త (సఅసమ్)తో కలసి కొన్ని యుద్ధాలలో పాల్గొన్నప్పుడు, మేము తినడానికి చెట్ల ఆకులు తప్ప మరొకటి ఉండేది కావు. తత్కారణంగా మేము మల విసర్జన చేసినప్పుడు ఒంటె లద్దె మాదిరిగా, మేక పెంటికల మాదిరిగా (పొడి పొడిగా) మల విసర్జన జరిగేది. కాని ఇప్పుడు బనీ అసద్ తెగవారి గురించి ఏమని చెప్పేది!? వారు ఇస్లామీయ ఆదేశాల పాలన విషయంలో నాలోని తప్పులెన్నుతున్నారు. ఒకవేళ వారు చెప్పేదే నిజమైతే నేను అభాగ్యులలో ఒకడినవుతాను. నేను చేసుకున్న సత్కార్యాలన్నీ వ్యర్థమైపోతాయి"– ఇంతకీ జరిగిందేమిటంటే బనీ అసద్ తెగవారు హజ్రత్ ఉమర్ (రజి) ముందు సాద్ బిన్ అబీ వక్కాస్ (రజి) గురించి పరోక్ష నింద చేశారు. 'ఆయన గారు కనీసం నమాజ్ కూడా సరిగ్గా చేయలేర'ని తీవ్రంగా విమర్శించారు.[1]

## అధ్యాయం : 17

## దైవప్రవక్త (సఅసమ్) అల్లుళ్ల గురించి... అబుల్ ఆస్ బిన్ రబీ కూడా ఈ కోవలో ఉన్నాడు.

**370)** మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) కథనం: హజ్రత్ అలీ(రజి) అబూ జహ్లా కుమార్తె (ఆమె ముస్లింగా మారింది)కు వివాహ సందేశం పంపారు. ఈ సంగతి తెలిసిన హజ్రత్ ఫాతిమా(ర.అ) దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, '(నాన్నా!) మీ కూతుళ్ళకు ఎవరు బాధ కలిగించినా మీకు కోపం రాదని మీ జాతి ప్రజలు చెప్పు కుంటున్నారు. (ఈ కారణంగానే) ఇప్పుడు అలీ కూడా అబూ జహ్లా కూతుర్ని పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు' అని తన గోడు వినిపించుకున్నారు. ఇది విని దైవప్రవక్త(స) తన సహచరులనుద్దేశించి ప్రసంగించారు– ఆయన ప్రసంగించటం నేను విన్నాను– తషహ్హుద్ పఠించిన మీదట ఆయన(స) ఇలా అన్నారు: "అబుల్ ఆస్ బిన్ రబీతో నా కుమార్తె (జైనబ్–ర.అ) వివాహం జరిపినప్పుడు, అతను నాకిచ్చిన మాటను నిలుపుకున్నాడు.[1] నిశ్చయంగా ఫాతిమా (ర.అ) కూడా నా

369–1. ఈ హదీసు లోగడ 'కితాబుస్సలాత్'లో కూడా వచ్చింది. బనీ అసద్ తెగవారు ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) సమక్షంలో చేసిన ఈ నిందారోపణపై సాద్ బిన్ అబీ వక్కాస్ (రజి) మనోవేదనకు గురయ్యారు. ఒక సుదీర్ఘ కాలం దైవప్రవక్త(స) సహచర్యంలో ఉండి, దైవమార్గంలో అనన్య సామాన్యమయిన త్యాగాలు చేసిన నన్ను కూడా బనీ అసద్ విడిచి పెట్టలేదే! అని బాధపడ్డారు.

**(శరీరంలోని ఒక) భాగమే. ఎవరయినా సరే ఆమెకు బాధ పెట్టడాన్ని నేను సహించలేను. దైవసాక్షి! దైవ సందేశహరుని కూతురు, దైవ విరోధి కూతురు ఒకే వ్యక్తి వివాహ బంధంలో ఇమడలేరు." దైవప్రవక్త(స) అంతరంగాన్ని అర్థం చేసు కున్న హజ్రత్ అలీ(రజి) ఈ వివాహ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ముహమ్మద్ బిన్ అమ్ర్ బిన్ హల్‌హలా ఇబ్నె షిహాబ్ నుండి ఉటంకిస్తూ అదనంగా ఇలా అన్నారు.. ఆయన(స) బనీ అబ్దె షమ్స్‌కు చెందిన ఒక అల్లుడి గురించి ప్రస్తా విస్తూ, ఒక అల్లుడిగా అతని వ్యవహారశైలిని ప్రశంసించారు. తరువాత ఇలా అన్నారు: "అతను నాకు ఏ మాట చెప్పినా నిజం చెప్పాడు. ఏ వాగ్దానం చేసినా దానిని నెరవేర్చాడు."**

## అధ్యాయం : 18

## దైవప్రవక్త(స) బానిస మహనీయ జైద్ బిన్ హారిసా (రజి) గురించి...[1]

**బరా బిన్ ఆజిబ్(రజి) ప్రవక్త మహనీయుల(సఅసమ్) నుండి ఉటంకించిన**

---

370–1. మరలాంటప్పుడు అలీ (రజి) మాట నిలబెట్టుకోకపోవడం ఆశ్చర్యకరం! ఇంతకీ ఏం జరిగిందంటే అబుల్ ఆస్ దైవప్రవక్త పెద్ద కుమార్తె జైనబ్(రజి)ను వివాహం చేసుకునేటప్పుడు, ఆమె నా భార్యగా ఉన్నంతకాలం నేను మరో పెళ్ళి చేసుకోను అని షరతు పెట్టుకున్నాడు. ఆ షరతును అబుల్ ఆస్ నెరవేర్చాడు. బహుశా హజ్రత్ అలీ(రజి) కూడా ఇలాంటి షరతే పెట్టి ఉండవచ్చు. కాని అబూ జహ్లా కుమార్తెకు వివాహ సందేశం పంపేటప్పుడు ఆ మాటను మరచిపోయారేమో! అయితే దైవప్రవక్త(స) హెచ్చరించే ధోరణిలో ప్రసంగించేసరికి ఆయనకు తాను మాటిచ్చిన సంగతి జ్ఞప్తికి వచ్చి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

మరి కొంతమంది ఏమన్నారంటే, అలీ(రజి) అలాంటి షరతు ఏమీ పెట్టలేదు. కాని హజ్రత్ ఫాతిమా(ర.అ) ఎంతో వ్యాకులతకు గురయ్యారు. ఎందుకంటే అప్పటికే ఆమె తల్లి కాలం చేశారు. తన తోబుట్టువులు ముగ్గురు మరణించారు. తానొక్కతే మిగిలి ఉన్నారు. అలాంటి పరిస్థితిలో అబూ జహ్లా వంటి కరుడుగట్టిన ఇస్లాం శత్రువు కుమార్తె తనకు సవతిగా వస్తే తన సంసార నౌక సాఫీగా ముందుకు సాగుతుందో లేదోనని ఆమె సంశయంలో పడ్డారు. ఆ మాటే తన తండ్రితో చెప్పుకున్నారు. అటు హజ్రత్ అలీ(రజి) కూడా దైవ సందేశహరుని ఆవేదనను పసిగట్టి ఈ నిర్ణయాన్ని మార్చుకున్నారు.

**దాని ప్రకారం, ఆయన(స) జైద్ బిన్ హారిసా (రజి)తో ఇలా అన్నారు : "నీవు మా సోదరుడవు. మా మౌలావు." (ప్రాణ మిత్రుడవు)."**

**371) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక సైనిక దళాన్ని పంపుతూ, దానికి సేనాధిపతిగా ఉసామా బిన్ జైద్(రజి)ను నియమించారు. (పిన్న వయస్కుడైన) ఉసామాను సేనాధిపతిగా చేయడాన్ని కొంతమంది ఆక్షేపించినప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "ఈ రోజు ఇతనిని సేనాధిపతిగా నియమించినందుకు మీరు ఆక్షేపణ తెలుపడం ఆశ్చర్యకరం కాదు. ఇంతకుముందు ఇతని తండ్రిని సేనాధిపతిగా నియమించినప్పుడు కూడా మీరు అభ్యంతరం తెలిపి ఉన్నారు. దైవసాక్షి! అతడు (జైద్–రజి) ఆ సమయంలో నాయకత్వానికి అర్హుడు, నాకు అందరికన్నా ప్రియతముడు. ఇప్పుడు అతని తర్వాత ఇతను (ఉసామా– రజి) నాకు అందరికన్నా ప్రియతముడు."[1]**

---

18–1. ఈయన తన కునీయత్‌తో అబూ ఉసామాగా పిలువబడేవారు. ఎనిమిదేళ్ళ ప్రాయంలో హజ్రత్ జైద్(రజి)ను బందిపోటు దొంగలు కిడ్నాప్ చేసి మక్కాలో 400 దిర్హములకు అమ్మేశారు. హకీమ్ బిన్ హిజామ్(రజి) ఈయన్ని కొనుగోలు చేసి, తన మేనత్త హజ్రత్ ఖదీజా (ర.అ)కు ఇచ్చారు. దైవప్రవక్త(స)తో వివాహం జరిగిన తర్వాత ఖదీజా ఈ అబ్బాయిని తన భర్తకు కానుకగా సమర్పించుకున్నారు. మొదట్లో దైవప్రవక్త(స) ఈయన్ని తన దత్తపుత్రునిగా చేసుకున్నారు. దైవప్రవక్త(స) సద్వ్యవహారానికి ముగ్ధుడైన ఆ అబ్బాయి ఒక దశలో తన కన్నతల్లిదండ్రుల వద్దకు వెళ్ళడానికి కూడా నిరాకరించాడు.

జైద్ బిన్ హారిసా(రజి) యుక్త వయస్సుకు చేరిన తరువాత దైవప్రవక్త(స) ఈయన వివాహాన్ని తాను స్వేచ్ఛను ప్రసాదించిన బానిస స్త్రీ ఉమ్మె ఐమన్(ర.అ)తో జరిపించారు. ఆ దంపతులకు పుట్టిన కుమారుడే ఉసామా బిన్ జైద్. ఆ తరువాత ప్రవక్త తన మేనత్త కుమార్తె జైనబ్ బిన్తె జహష్(ర.అ)ను కూడా జైద్‌కు ఇచ్చి పెళ్ళి జరిపించారు. ఆ వివాహ బంధం ఎక్కువ కాలం నిలువలేదు. అది వేరే విషయం. దివ్య ఖుర్‌ఆన్‌లో ఒకే ఒక సహాబీ పేరు వచ్చింది. (33: 37). ఆయన ఎవరో కాదు, హజ్రత్ జైద్(రజి). ముతా యుద్ధంలో 55 ఏళ్ళ వయసులో హిజ్రీ 8వ సంవత్స రంలో సేనాధిపతిగా వీరమరణం పొందారు.

371–1. దైవప్రవక్త(స) మరణ వ్యాధికి గురై ఉన్న రోజుల్లో సిద్ధం చేయబడిన సైనిక దళమిది. వెంటనే బయలుదేరి వెళ్ళమని కూడా ఆజ్ఞాపించారు ప్రవక్త. కాని

**372) హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: సాముద్రిక విద్యలో ప్రవేశం ఉన్న ఒక వ్యక్తి (ముద్లజీ) మా వద్దకు వచ్చాడు. ఆ సమయంలో ప్రవక్త మహనీయులు (సఅసమ్) కూడా అక్కడే ఉన్నారు. ఉసామా బిన్ జైద్, జైద్ బిన్ హారిసా లిద్దరూ ఒకే దుప్పట్లో దూరి నిద్రిస్తున్నారు. (వారిద్దరి పాదాలు తప్ప ముఖం, శరీర భాగ మంతా దుప్పటి కప్పబడి ఉంది). ఆ పాదాలను శ్రద్ధగా గమనించిన సాముద్రిక శాస్త్రజ్ఞుడు, 'ఈ పాదాలు ఒండొకదాని నుంచి బయల్పడినవి' అని చెప్పాడు. ఆ మాట విన్న దైవప్రవక్త(స) ఆనందానికి అంతులేదు. తరువాత ఆయన(స) ఆయిషా (ర)కు కూడా ఈ సంఘటనను వినిపించారు.[1]**

## అధ్యాయం : 19

## మహనీయ ఉసామా బిన్ జైద్(రజి) గురించి

**373) అమ్మ ఆయిషా(ర.అ)కథనం : ఖురైషులు మఖ్జూమ్ తెగకు చెందిన ఒక స్త్రీ వ్యవహారంలో తీవ్రమయిన వ్యాకులతకు లోనయ్యారు. "(ఆ స్త్రీ పక్షాన సిఫారసు చేయడానికి) ఒక్క ఉసామా బిన్ జైద్ తప్ప మరెవరు తగిన వ్యక్తి కాగలడు? అతను దైవప్రవక్త(స)కు ప్రియమైనవాడు. అతను మాత్రమే ఈ సాహసం చేయగలడు" అని వారు పరస్పరం తీర్మానించుకున్నారు.**

**... మరొక సనదు ప్రకారం హజ్రత్ ఆయిషా (ర.అ) ఇలా అన్నారు : మఖ్జూమ్ తెగకు చెందిన ఒక స్త్రీ దొంగతనం చేసింది. దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో ఆ స్త్రీ కొరకు సిఫారసు చేయగల వ్యక్తి ఎవరు కాగలరు? అని ఖురైషులు**

---

సైనిక దళం మదీనా పొలిమేరలు కూడా దాటకముందే దైవప్రవక్త(స) పరమ పదించారు. అందువల్ల ఆ సైనిక దళం మదీనాకు తిరిగి వచ్చింది. మొదటి ఖలీఫా హజ్రత్ అబబూక్ర్(రజి) ఈ సైనిక దళాన్ని ఉసామా నేతృత్వంలోనే పంపారు. ఉసామా (రజి) విజేతగా తిరిగి వచ్చారు.

372–1. హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి) పట్ల గల అపారమైన ప్రేమే దైవప్రవక్త(స) ఆనందానికి ప్రధాన కారణం. అదీగాక ఆ రోజుల్లో కపటులు ఉసామా బిన్ జైద్ (రజి)ను చూసి, అతను జైద్ కొడుకు కాడని ఎద్దేవా చేసేవారు. ఎందుకంటే జైద్ ఎర్రగా ఉండేవారు. ఉసామా నల్లగా ఉండేవారు. సాముద్రిక శాస్త్రజ్ఞుడు నిజాన్ని వ్యక్తపరచిన మీదట కపటులు నోరు మూసుకున్నారు.

తర్జన భర్జన చేసుకుని, చివరకు ఉసామా బిన్ జైద్(రజి) పేరు ప్రతిపాదించారు. ఉసామా వెళ్ళి సిఫారసు చేసినప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "బనీ ఇస్రా యీల్‌లో ఒక రివాజు ఉండేది. ఎవరయినా కులీనుడు (మర్యాదస్తుడు) దొంగతనం చేస్తే, వారు అతన్ని విడిచి పెట్టేసేవారు. బలహీనుడయిన వ్యక్తి ఆ నేరం చేస్తే మాత్రం అతని చేతిని నరికేవారు. (వినండి!) ఒకవేళ నేడు (దైవప్రవక్త పుత్రిక) ఫాతిమా–ర.అ దొంగతనం చేసినా నేను ఆమె చేతిని నరకడానికి వెనుకాడను."

## అధ్యాయం : 20

**374)** అబ్దుల్లాహ్ బిన్ దీనార్ అందజేసిన సమాచారం: ఒకరోజు మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) మస్జిద్‌లో ఒక వ్యక్తిని చూశారు. అతను తొడిగిన దుస్తులు పొడవుగా ఉన్నాయి. అతను మస్జిద్‌లోని ఒక మూలలో తన అంగవస్త్రాన్ని నేలకు ఈడ్చుకుంటూ పోతున్నాడు– అబ్దుల్లాహ్ బిన్ దీనార్ ఇలా అంటున్నారు: "అతనెవరో కాస్త చూడు. ఒకవేళ అతను నా సమీపంలో ఉంటే నా తడాఖా చూపించేవాణ్ణి" అని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) నాతో అన్నారు. అంతలో (పరిచయం లేని) ఒక వ్యక్తి, 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్! అతనెవరో మీకు తెలీదా? అతని పేరు ముహమ్మద్, ఉసామా బిన్ జైద్ కుమారుడు' అని అన్నాడు. అంతే, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) సిగ్గుతో తలదించుకుని, "ఒకవేళ దైవప్రవక్త(స) ఇతన్ని చూసి ఉంటే, (ఉసామాను ప్రేమించినట్లే) ఇతన్ని కూడా ప్రేమించేవారు" అని పలికారు.

**375)** హజ్రత్ ఉసామా బిన్ జైద్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తనను, హజ్రత్ హసన్(రజి)ను పట్టుకుని, "అల్లాహ్! నీవు వీరిద్దరినీ ప్రేమించు. నేను కూడా వీరిద్దరినీ ప్రేమిస్తున్నాన"ని అనేవారు.

ఉసామా బిన్ జైద్(రజి) దగ్గర, 'మౌలా'గా ఉన్న ఒక వ్యక్తి (హర్మలా) అందిం చిన సమాచారం ప్రకారం, హజ్జాజ్ బిన్ అయ్‌మన్ బిన్ ఉమ్మె అయ్‌మన్‌ను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) నమాజులో గమనించారు– అతను రుకూ సజ్దాలు సరిగ్గా చేయలేదు– అయ్‌మన్ బిన్ ఉమ్మె అయ్‌మన్ ఉసామా (రజి)కు తల్లి తరఫు సోదరుడు అవుతాడు– అప్పుడు ఇబ్నె ఉమర్(రజి) అతనితో "మళ్ళీ నమాజ్ చెయ్యి" అని చెప్పారు.

**ఉసామా బిన్ జైద్(రజి) సేవకుడు హర్మలా తెలిపారు : తాను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) సేవలో ఉండగా హజ్జాజ్ బిన్ అయ్‌మన్(మస్జిద్) లోపలికి వచ్చాడు. అతడు రుకూ గాని, సజ్దా గానీ సరిగ్గా చేయలేదు. "మళ్ళీ నమాజ్ చేసుకో" అని ఇబ్నె ఉమర్ అతనికి పురమాయించారు. అతను నమాజ్ చేయడానికి తిరిగి వెళుతుండగా, "ఇతనెవరు?" అని ఆయన నన్ను అడిగారు. 'ఇతను హజ్జాజ్ బిన్ అయ్‌మన్ ఇబ్నె ఉమ్మె అయ్‌మన్" అని నేను చెప్పాను. అది విని, "ఒకవేళ దైవప్రవక్త(సఅసం) గనక ఇతన్ని చూస్తే ఎంతో ప్రేమించేవారు" అని ఇబ్నె ఉమర్ అభిప్రాయపడ్డారు. ఆ తరువాత ఆయన ఉమ్మె అయ్‌మన్‌ను, ఆమె సంతతిని స్మరించుకుని దైవప్రవక్త(స) వారిని ఎంతగా ప్రేమించేవారో చెప్పారు- ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇలా అన్నారు : నా స్నేహితులు కొందరు (యాఖూబ్ బిన్ సుఫ్యాన్) ఈ హదీసును సులైమాన్ బిన్ అబ్దుర్రహ్మాన్ నుండి ఉటంకించారు. అందులో అదనంగా ఇలా ఉంది: ఉమ్మె అయ్‌మన్ (ర.అ) బాల్యంలో దైవప్రవక్త(స)ను తన ఒడిలోనికి తీసుకున్నారు.[1]**

## అధ్యాయం : 21

## మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గొప్పతనం[1]

**376) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మా మధ్యన ఉన్నంతకాలం ఎవరికి కల వచ్చినా, ఆ కల గురించి అతను దైవప్రవక్త (స) ముందు చెప్పుకునేవాడు. నేను కూడా ఒక కలగంటే బాగుండునని, ఆ కల గురించి దైవప్రవక్త(స)కు చెప్పుకునేవాడినన్న ఆకాంక్ష నాలో కూడా కలిగింది. ఆ రోజుల్లో నేను అవివాహితుణ్ణి. యుక్త వయస్సులో ఉన్నాను.**

---

375-1. ఉమ్మె అయ్‌మన్ మొదటి భర్త పేరు ఉబైద్ బిన్ ఉమర్ హబషీ. ఆయన హునైన్ యుద్ధంలో అమరగతినొందారు. ఇక ఉమ్మె అయ్‌మన్- జైద్ బిన్ హారిసా దంపతులకు పుట్టిన బిడ్డడే ఉసామా బిన్ జైద్(రజి).

21-1. ధర్మజ్ఞానం, ఐహిక అనాసక్తత, భయభక్తుల విషయంలో ఎన్నదగ్గవారు. తన జీవితకాలంలో వెయ్యికన్నా ఎక్కువ మంది బానిసలను బానిసత్వం నుండి విడుదల చేశారు. హిజ్రీ 73వ సంవత్సరంలో 84 లేక 86 ఏళ్ళ వయసులో అమరగతినొందారు.

**ఆ కాలంలో నేను మస్జిద్‌లోనే నిద్రించేవాణ్ణి. ఒక రోజు నేను కలగన్నాను. కలలో ఇద్దరు దైవదూతలను చూశాను. వారు నన్ను పట్టుకుని నరకం వైపునకు లాక్కుపోయారు. అది బావి మాదిరిగా ఒకదాని మీద ఒకటిగా పేరుకుని ఉంది. బావి మాదిరిగానే దానికి కూడా రెండు ఒడ్డులున్నాయి. అందులో ఉన్నవారిలో కొందరిని నేను ఎరుగుదును. నేను చూడగానే, 'నరకం బారి నుండి నేను అల్లాహ్ శరణు కోరుతున్నాన'ని అన్నాను. ఆ తరువాత నేను మరొక దైవదూతను కలుసుకోవటం జరిగింది. 'భయపడకు. నేను ఈ కల గురించి హజ్రత్ హఫ్సా(ర.అ)కు చెప్పాన'ని అతను నాతో అన్నాడు.**

**హజ్రత్ హఫ్సా(ర.అ) ఈ కలను దైవప్రవక్త(స)కు వినిపించగా, ఆయన(స) "అబ్దుల్లాహ్ చాలా మంచి కుర్రవాడు. అయితే అతను రాత్రి తహజ్జుద్ నమాజ్‌కు లేస్తే ఎంత బాగుండేది!" అన్నారు. ఆ తరువాత అబ్దుల్లాహ్ రాత్రి వేళల్లో చాలా తక్కువగానే నిద్రించేవారని సాలిమ్ చెప్పారు.**

## అధ్యాయం : 22

## అమ్మార్, హుజైఫా (ర.అన్‌హుమా)ల గురించి[1]

**378) అల్ఖమా తెలిపారు : నేను సిరియాకు వెళ్ళినప్పుడు, రెండు రకతుల నమాజ్ చేసుకుని, "అల్లాహ్! నాకు ఎవరయినా ఒక మంచి మిత్రుణ్ణి ప్రసాదించు" అని వేడుకున్నాను. తరువాత నేను ఒక బృందం వద్దకు వచ్చి, వారి సమావేశంలో కూర్చున్నాను. కొద్దిసేపటికే ఒక వృద్ధుడు వచ్చి నా ప్రక్కన కూర్చున్నారు. 'ఈ పెద్దాయన ఎవరు?' అని నేనడిగితే, ఈయన అబూదర్దా (రజి) అని జనులు**

22–1. వీరిద్దరూ ఉత్తమ శ్రేణి సహాబీలే. అమ్మార్(రజి) ఇస్లామ్ స్వీకరించిన మీదట భరించ శక్యం కాని కష్టాలను ఎదుర్కొన్నారు. ఈయన తల్లి హజ్రత్ సుమయ్యా(ర.అ)ను దైవ విరోధి అబూజహ్లా దారుణంగా హతమార్చాడు. ఆ విధంగా ఆమె దైవమార్గంలో అమరగతి నొందిన ప్రథమ మహిళగా చరిత్రలో నిలిచిపోయింది.

హుజైఫా బిన్ యమాన్(రజి) అన్సార్ సహాబీ. దైవప్రవక్త(స) తన రహస్య విషయాలను ఆయనకు చెప్పేవారు. అందుచేత ఆయన్ని రహస్యాలను కాపాడే వ్యక్తి అనేవారు.

**చెప్పారు. నాకు ఒక మంచి సహచరుణ్ణి ప్రసాదించమని నేను దైవంతో మొరపెట్టు కున్నాను. ఆయన నా మొరను ఆలకించాడని నేనన్నాను. 'నీవు ఎచటివాడవు?' అని ఆయన అడిగారు. 'నేను కూఫా వాసిని' అని చెప్పాను. 'ఏమిటి, మీ వద్ద ఉమ్మె అబ్ద్ కుమారుడు (అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్– రజి) లేరా? దైవప్రవక్త(స) నోట– షైతాన్ బారి నుండి అల్లాహ్ రక్షణ ఇవ్వబడిన వ్యక్తి (అమ్మార్ బిన్ యాసిర్– రజి) లేరా? ఏమిటి, మీ వద్ద దైవప్రవక్త(స)కు తెలిసిన రహస్యాన్ని ఎరిగిన వ్యక్తి లేరా? (అంటే హుజైఫా బిన్ యమాన్–రజి. దైవప్రవక్త తెలిపిన ఆ రహస్యాలను ఆయన తప్ప వేరెవరూ ఎరుగరు)' అని ఆయన అడిగారు. ఆ తరువాత ఆయన 'వల్లైలి ఇజా యగ్‌షా' ఆయత్‌ను అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) ఎలా పఠించే వారు?' అని అడిగారు. నేను ఆయనకు ఇలా చదివి వినిపించాను– 'వల్లైలి ఇజా యగ్‌షా వన్నహారి ఇజా తజల్లా- వజ్జకరి వల్ ఉన్సా'. అది విని, దైవ ప్రవక్త(స) స్వయంగా తమ నోట నాకు ఇలాగే కంఠస్థం చేయించారని ఆయన చెప్పారు.**[1]

**379)** ఇబ్రాహీమ్ నఖ్‌యీ కథనం : అల్ఖమా గారు సిరియా దేశానికి వెళ్ళి నప్పుడు, మస్జిద్‌లోనికి వెళ్ళి "అల్లాహ్! నాకు ఈ దేశంలో ఒక మంచి స్నేహితుణ్ణి ఇవ్వు" అని వేడుకున్నారు. అందువల్ల ఆయనకు హజ్రత్ అబూ దర్దా (రజి) స్నేహం ప్రాప్తమయింది. అబూ దర్దా (రజి) ఆయన్ని ఉద్దేశించి, "మీరు ఎక్కడినుండి వచ్చారు"ని అడగ్గా, "కూఫా నుండి" అని అల్ఖమా చెప్పారు. "ఏమిటి, షైతాన్ కీడు నుండి– దైవప్రవక్త నోట– రక్షణ కల్పించబడిన వ్యక్తి మీ మధ్యన లేరా?" అని అబూ దర్దా ప్రశ్నించగా, "ఉన్నార"ని ఆయన బదులిచ్చారు. అంటే అమ్మార్ బిన్ యాసిర్ (రజి) అన్నమాట. తరువాత అబూ దర్దా, "ఏమిటి, మీ మధ్యన దైవప్రవక్త ఆంతరంగికుడు లేరా? ప్రవక్త చెప్పిన రహస్యం ఆయనకు తప్ప మరొకరికి తెలిసేది కాదు" అని అడిగినప్పుడు, "అవును. ఉన్నార"ని అల్ఖమా చెప్పారు (ఆయనే హజ్రత్ అబూ హుజైఫా). "ఏమిటి, మీ మధ్యన దైవప్రవక్త(స) మిస్వాక్‌ను, దిండును

378–1. **'వమా ఖలఖజ్జకర వల్ ఉన్‌సా'** అనేది ప్రఖ్యాతి చెందినది. అయితే మొదట్లో ఈ ఆయత్ 'వజ్జకరి వల్ ఉన్‌సా'గానే అవతరించింది. తరువాత 'వమా ఖలఖ' అనే పదం అదనంగా అవతరించింది. అయితే అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజి)కు, అబూ దర్దాకు ఈ సమాచారం అందలేదు. వారు తమకు వినిపించ బడినట్లుగానే పారాయణం చేసేవారు.

సర్దిపెట్టే వ్యక్తి లేరా?" అని అబూ దర్దా ప్రశ్నించగా, "ఉన్నారు" అని ఆయన సమాధానమిచ్చారు. (అంటే హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్-రజి). "అవును, **వల్లైలి ఇజా యగ్షా వన్నహారి ఇజా తజల్లా** సూరా పారాయణం చేసేటప్పుడు అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఎలా పఠించేవారు?" అని అబూ దర్దా మళ్ళీ ప్రశ్నించగా, "ఆయన గారు వమా ఖలఖ అనే పదాన్ని పలకకుండా వజ్జకరి వల్ ఉన్సా అని పఠిస్తారు" అని అల్ఖమా బదులిచ్చారు. దానికి ఆయన, "నేను కూడా దైవ ప్రవక్త (స) నోట అలాగే విన్నాను. కాని ఈ సిరియా వాసులు నిత్యం నన్ను తప్పు పట్టే ప్రయత్నంలో ఉంటారు" అని చెప్పారు.

## అధ్యాయం : 23

## మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి) విశిష్టత[1]

**380)** హజ్రత్ అనస్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు. ప్రతి ఉమ్మత్‌లో అమీన్‌లు (నిజాయితీపరులు) ఉంటారు. ఈ ఉమ్మత్‌లోని 'అమీన్' అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి)."

**381)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) నజరాన్ ప్రజలతో ఈ విధంగా పలికారని హజ్రత్ హుజైఫా(రజి) తెలిపారు : "నేను మీ వద్దకు ఒక 'అమీన్'ను పంపిస్తాను. అతను నిజ భావంలో అమీన్ అయి ఉంటాడు". ఈ మాట విని సహచర మాన్యులంతా ఆ గౌరవం తమకే దక్కాలని కాంక్షించారు. కాని ఆయన(స) హజ్రత్ అబూ ఉబైదా (రజి)ను పంపించారు.

## అధ్యాయం : 24

## మహనీయ హసన్, హుసైన్(రజిఅల్లాహు అన్హుమా)ల విశిష్టత[1]

**నాఫె బిన్ జుబైర్ మహనీయ అబూహురైరా(రజి) నుండి ఉటంకించిన దాని**

---

23-1. స్వర్గలోక శుభవార్త అందుకున్న అష్రె ముబష్షిరాలో ఈయన ఒకరు. ఈ ఉమ్మత్‌కు చెందిన 'అమీన్'గా బిరుదాంకితులు. అబిసీనియా రాజ్యం వైపునకు రెండుసార్లు హిజ్రత్ చేశారు. పొడుగరి. సుందర స్వరూపులు. హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ కాలంలో సిరియా రాజ్యంలో, హిజ్రీ 18వ సంవత్సరంలో ప్లేగు వ్యాధి సోకి మృతి చెందారు. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్(రజి) ఈయన అంత్య క్రియల నమాజ్‌కు నాయకత్వం వహించారు.

24-1. హజ్రత్ హసన్ కునీయత్ అబూ ముహమ్మద్. హిజ్రీ 3వ సంవత్సరం, రమజాన్

**ప్రకారం, దైవప్రవక్త(సఅసం) హజ్రత్ హసన్(రజి)ను తన మెడకు హత్తుకున్నారు.[2]**

**382) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా, హజ్రత్ అబూ బక్రా(రజి) విన్నారు: దైవప్రవక్త(స) వేదికపై ఉన్నారు. ఆ సమయంలో ఆయన ప్రక్కన హజ్రత్ హసన్(రజి) ఉన్నారు. ఆయన ఒకసారి ప్రజల వైపు చూస్తే, ఒకసారి హసన్ వైపు చూడసాగారు. తరువాత, "నా ఈ అబ్బాయి నాయకుడు. అల్లాహ్ ఇతని ద్వారా ముస్లింలలోని రెండు వర్గాల మధ్యన సంధి చేయిస్తాడని ఆశిస్తున్నాను" అని అన్నారు.**

**383) ఉసామా బిన్ జైద్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) తనను, హజ్రత్ హసన్(రజి)ను (ఒడిలోనికి) తీసుకుని, "అల్లాహ్! నేను వీరిద్దరినీ ప్రేమిస్తున్నాను. నీవు కూడా వీరిని ప్రేమించు" అని వేడుకునేవారు.**

**384) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం, హజ్రత్ హుసైన్ (రజి) తలను ఉబైదుల్లాహ్ బిన్ జియాద్ దగ్గరకు తీసుకువచ్చి, ఒక పళ్ళెంలో పెట్టినప్పుడు, ఆ దౌర్భాగ్యుడు తన బెత్తంతో తలపై కొడుతూ హజ్రత్ హుసైన్ సౌందర్యం గురించి ఏదో చెప్పాడు (నేను ఇంత అందమైన ముఖారవిందాన్ని చూడలేదని అన్నాడు). దానిపై హజ్రత్ అనస్(రజి) ఇలా అన్నారు : హజ్రత్ హుసైన్(రజి) అందరికన్నా ఎక్కువగా దైవప్రవక్త(స)ను పోలి ఉండేవారు. ఆయన తన గడ్డం, తలవెంట్రుకలకు 'వస్మా' రంగు పూసేవారు (అది నల్లగా ఉండేది).**

**385) హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అదీ తెలిపారు: బరా బిన్ ఆజిబ్ ఇలా చెప్పారు: నేను ఒకసారి దైవప్రవక్త(స)ను చూశాను. ఆ సమయంలో హజ్రత్ హసన్ (రజి) ఆయన భుజాలపై ఉన్నారు. ప్రవక్త(స) ఇలా వేడుకుంటున్నారు : "దేవా! నేను ఇతన్ని ప్రేమిస్తున్నాను. నీవు కూడా ఇతన్ని ప్రేమించు."**

---

నెలలో జన్మించారు. హిజ్రీ 50లో మరణించారు. హజ్రత్ హుసైన్ (రజి) హిజ్రీ 4వ సంవత్సరం షాబాన్ నెలలో జన్మించారు. హిజ్రీ 61లో వీరమరణం పొందారు. అబూ అబ్దుల్లాహ్ ఈయన కునీయత్.

24-2. ఈ హదీసు ఇంతకుముందు 'కితాబుల్ బుయూ'లో మౌసూల్‌గా వచ్చింది.

**386)** ఉఖబా బిన్ హారిస్ తెలిపారు : నేను మహనీయ అబూ బక్ర్ (రజి)ను చూశాను, ఆయన హజ్రత్ హసన్(రజి)ను ఎత్తుకుని, "నా తల్లిదండ్రులు ఈ అబ్బాయిపై ఫిదా. ఇతను అచ్చం దైవప్రవక్త(స) లాగానే ఉన్నాడు. అలీ(రజి) లాగా లేడు" అని పలికారు. అక్కడే నిలబడి ఈ మాటలు వింటున్న హజ్రత్ అలీ(రజి) ముసి ముసి నవ్వులు చిందించారు.

**387)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం ప్రకారం హజ్రత్ అబూబక్ర్ (రజి) ఇలా వక్కాణించారు: ప్రవక్త మహనీయుల(స) మెప్పును పొందగోరే వారు ఆయన ఇంటివారల పట్ల ప్రేమాభిమానంతో మసలుకోవాలి."

**388)** హజ్రత్ అనస్(రజి) కథనం : "అలీ కుమారుడగు హసన్(రజి)కన్నా అధికంగా ఎవరూ దైవప్రవక్త (స)ను పోలి ఉండరు."[1]

**389)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పగా అబూ నుఐమ్ విన్నారు. (ఇరాక్‌కు చెందిన) ఎవరో ఒక వ్యక్తి ఇహ్రామ్ దీక్షలో ఉన్నవాని గురించి ఈయన్ని ప్రశ్నించాడు. అంటే ఇహ్రామ్ కట్టుకుని ఉన్న వ్యక్తి ఈగను చంపితే, దానికి పరిహారం(కఫ్ఫారా)గా ఏం ఇవ్వాలి? అని బహుశా అతను అడిగి ఉంటాడని నేను భావిస్తున్నానని షుబా చెప్పారు- దానికి సమాధానంగా అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అన్నారు : "ఇరాక్ వాసులు ఇప్పుడు ఈగ గురించి ప్రశ్నిస్తున్నారు. నిజానికి వీళ్ళే దైవప్రవక్త(స) ముద్దుల మనవణ్ణి పొట్టనబెట్టుకున్నారు.[1] అతని గురించి దైవ

---

388-1. ఇంతకుముందు వచ్చిన హజ్రత్ అనస్(రజి) ఉల్లేఖనంలో హజ్రత్ హుసైన్(రజి) ఎక్కువగా దైవప్రవక్త(స)ను పోలి ఉండేవారని ఉంది. ఈ రెండు హదీసులలో సారూప్యత ఎలా? అంటే ఆహార్యంలో కొంతభాగం హసన్‌కు దైవప్రవక్త(స) పోలికలు వస్తే, మరికొంత భాగం హుసైన్‌కు పోలికలు వచ్చి ఉంటాయి.

389-1. దోమలను వడబోసి ఏనుగులను మ్రింగటం అంటే ఇదే. ధర్మం (దీన్)లోని విధులను, హలాల్- హరామ్‌లను విస్మరించి, పాక్షిక విషయాలను పట్టుకు వ్రేలాడే వారికి ఇది గుణపాఠం కావాలి.

ఇకపోతే ప్రశ్నించిన ఆ వ్యక్తి కూఫా (ఇరాక్) వాసి. బహుశా హజ్రత్ హుసైన్ (రజి)ను చంపినవాడు అతనే. ఈ సంఘటన తర్వాత కూఫా వాసులు విశ్వాస పాత్రులు కారు అన్న నానుడి ప్రాచుర్యంలోనికి వచ్చింది.

**ప్రవక్త(స), 'వీరిద్దరూ (హసన్, హుసైన్) ప్రపంచంలో 'నా రెండు పువ్వులు' అని చెప్పి ఉన్నారు."**

## అధ్యాయం : 25

## హజ్రత్ బిలాల్ బిన్ రబాహ్(రజి) విశిష్టత[1]

**ఈయన హజ్రత్ అబూబక్ర్(రజి) గారి ద్వారా బానిసత్వ చెర నుండి విడుదల అయ్యారు.**

**మహనీయ బిలాల్(రజి)తో ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు : "నేను స్వర్గంలో నా ముందు నీ అడుగుల సవ్వడి విన్నాను."**

**390) హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) కథనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అంటూ ఉండేవారు : "అబూబక్ర్ మా నాయకుడు. మా నాయకుడైన బిలాల్‌కు ఆయన స్వాతంత్ర్యం ఇచ్చారు."[1]**

**391) ఖైస్ కథనం : హజ్రత్ బిలాల్(రజి) హజ్రత్ అబూబక్ర్(రజి)తో ఇలా అన్నారు: "మీరు మీ స్వయం కొరకు నన్ను కొనుగోలు చేసి ఉంటే మీ దగ్గరే ఉండనివ్వండి.[1] దైవప్రసన్నత కొరకు కొని ఉంటే మాత్రం నాకు స్వేచ్ఛను ప్రసాదించండి. నేను దైవమార్గంలో పాటుపడతాను."[2]**

---

25-1. ఈయన ప్రవక్త(స) మౌజన్‌గా సుప్రసిద్ధులు. ఇస్లామ్‌కు పూర్వం మక్కాలో ఉమయ్యా బిన్ ఖలఫ్ ద్వారా తీవ్రంగా వేధించబడ్డారు. మహనీయ అబూబక్ర్ (రజి) ఈయన్ని కొనుగోలు చేసి, బానిసత్వం నుండి స్వేచ్ఛను ప్రసాదించారు. బద్ర్ యుద్ధ సందర్భంగా సత్య తిరస్కారి ఉమయ్యా బిన్ ఖలఫ్ హజ్రత్ బిలాల్ చేతనే వధించబడ్డాడు. అదీ విచిత్రం, విశేషం!

390-1. వాస్తవానికి హజ్రత్ బిలాల్(రజి) ఒక బానిస. అయితే ఉమర్(రజి) ఆయన్ని 'నాయకుడు' (సర్దార్) అని సంబోధించేవారు. ఇది ఉమర్(రజి)లోని సౌహార్ధానికి ప్రబల తార్కాణం.

391-1. దైవప్రవక్త(స) పరమపదించిన తరువాత బిలాల్‌ను మదీనాలోనే ఉండి, అజాన్ ఇస్తూ ఉండమని కోరటం జరిగింది.

391-2. దైవప్రవక్త(సఅసమ్)ను తలచుకుని బిలాల్ దుఃఖంతో కుమిలిపోయేవారు. అజాన్ ఇచ్చేటప్పుడు దైవప్రవక్త(స) పేరు వచ్చేది. దాంతో ఆయన ప్రవక్త(స) సమాధి వైపు దృష్టిని సారించేవారు. గుండెలోని గాయం మళ్ళీ తిరగదోడేది.

## అధ్యాయం : 26

## మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) గురించి[1]

**392) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) నన్ను తన హృదయానికి హత్తుకుని, "దేవా! ఇతనికి విజ్ఞతా వివేచనల జ్ఞానం వొసగు" అని ప్రార్థించారు.**

**393) అబ్దుల్ వారిస్ తెలిపారు: "ఓ అల్లాహ్! ఇతనికి గ్రంథ జ్ఞానం వొసగు" అని దైవప్రవక్త(సఅసమ్) ప్రార్థించారు.[1]**

## అధ్యాయం : 27

## మహనీయ ఖాలిద్ బిన్ వలీద్(రజి) విశిష్టత[1]

**394) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) తనకు ఏ సమాచారం కూడా అందకముందే జైద్, జాఫర్, ఇబ్నె రవాహ**

---

అందుకే ఆయన మదీనా వదలి సిరియా వెళ్ళిపోయారు. ఆరు నెలల తర్వాత మదీనాకు తిరిగి వచ్చినప్పుడు దైవప్రవక్త(స) కలలో కనిపించి, "బిలాల్! ఏమిటీ అన్యాయం. నువ్వు మమ్మల్ని వదలి వెళ్ళిపోతావా?" అన్నారు. అప్పుడు బిలాల్ ఫాతిమా(ర.అ) గురించి అడిగారు. ఆమె కూడా మరణించినట్టు తెలిసింది. హసన్ హుసైన్‌లను పిలిచి తన హృదయానికి హత్తుకున్నారు. వలవలా ఏడ్చేశారు. ప్రజల కోర్కెపై అజాన్ ఇవ్వమని బిలాల్‌ను కోరారు హసన్. బిలాల్ అజాన్ ఇవ్వడానికి నిలబడ్డారు. కాని **'అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్'** అనే పలుకు దగ్గరకు వచ్చేసరికి స్పృహ కోల్పోయారు. జనులు గొల్లుమన్నారు. అల్లాహ్ బిలాల్(రజి) పట్ల ప్రసన్నుడవుగాక!

26-1. ఈయన హిజ్రత్‌కు మూడేళ్ళ క్రితం జన్మించారు. గొప్ప విద్వాంసులు. ఖుర్ఆన్ వ్యాఖ్యాత. 70 ఏళ్ళ వయసులో హిజ్రీ 68లో తాయఫ్‌లో తనువు చాలించారు.

393-1. ఈ వేడుకోలు శుభం వల్ల హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఖుర్ఆన్ విద్యలో తన కాలంలోని విద్వాంసులలో ఎన్నదగ్గవారయ్యారు.

27-1. గొప్ప యోధుడు. ముస్లిం సైన్యానికి అధిపతిగా విజయాలలో కీలకపాత్ర వహించారు. సైఫుల్లాహ్(దేవుని కరవాలం) అనే బిరుదును అందుకున్నారు. 40 ఏళ్ళ వయసులో- హిజ్రీ 21వ సంవత్సరంలో- హమస్‌లో మరణించారు.

(రజిఅల్లాహు అన్హుమ్)లు అమరగతినొందారన్న వార్తను సహచరులకు వినిపించారు. ఆయన (స) ఇలా అన్నారు: ఇప్పుడు ఇస్లామ్ ధ్వజాన్ని జైద్ బిన్ హారిసా (రజి) తీసుకున్నాడు. అతను వీరమరణాన్ని ఆస్వాదించాడు. ఇప్పుడు జాఫర్ (రజి) ధ్వజాన్ని చేబూనాడు. అతను కూడా అమరగతినొందాడు. ఇప్పుడు ఇబ్నె రవాహ (రజి) చేతిలోకి పతాకం వచ్చింది. అతను కూడా వీర మరణం పొందాడు". అప్పుడు దైవప్రవక్త(స) కళ్ళలోనుంచి కన్నీరు ప్రవహించింది. తరువాత ఆయన(స) ఇలా అన్నారు: "ఎట్టకేలకు దేవుని కరవాలాలలోని ఒక కరవాలం (ఖాలిద్ బిన్ వలీద్- రజి) ఇస్లామీయ ధ్వజాన్ని అందుకున్నాడు. అల్లాహ్ అతని చేతుల మీదుగా ముస్లింలకు విజయం వొసగాడు."

## అధ్యాయం : 28

## మహనీయ అబూ హుజైఫా బానిస సాలిమ్(రజి)[1] గురించి

**395)** మస్రూఖ్ కథనం: అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) దగ్గర అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ప్రస్తావన వచ్చినప్పుడు, ఆయన ఇలా అన్నారు : నేను సదా ఆయన్ని ప్రేమిస్తూ ఉంటాను. ఎందుకంటే, నేను దైవప్రవక్త(సఅసమ్) ఈ విధంగా ప్రవచించగా విన్నాను- "నలుగురు వ్యక్తుల నుండి ఖుర్ఆన్ నేర్చుకోండి. 1) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్-రజి నుండి 2) అబూ హుజైఫా బానిస సాలిమ్ నుండి 3) ఉబై బిన్ కాబ్ నుండి 4) ముఆజ్ బిన్ జబల్ నుండి-". దైవప్రవక్త(స) ముందుగా ఉబై బిన్ కాబ్ పేరును ప్రస్తావించారో లేక ముఆజ్ బిన్ జబల్ పేరును ప్రస్తావించారో తనకు సరిగ్గా జ్ఞాపకం లేదని మస్రూఖ్ చెప్పారు.

## అధ్యాయం : 29

## మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి)[1] గొప్పతనం

---

28-1. ఈయన అసలు పారసీక దేశస్థులు. సాలిమ్ విద్వాంసులు. శాస్త్రోక్తంగా ఖుర్ఆన్ పఠించేవారు.

29-1. ఈయన బనీ హుజైల్ తెగకు చెందినవారు. దైవప్రవక్త(స)కు ప్రత్యేక సేవకులు. ప్రయాణంలోనూ, ఇంటి వద్ద ఉన్నప్పుడూను ప్రవక్త(స) సేవలో నిమగ్నులై ఉండేవారు. పొట్టిగా, బక్క పలచగా ఉండేవారు. ఎన్నదగ్గ ధర్మజ్ఞాని. సాత్వికులు, ఫికహ్(ధర్మశాస్త్రం)లో ప్రవీణులు. అరవై ఏళ్ళ వయసులో హిజ్రీ 22వ సంవత్సరంలో పరమపదించారు.

**396)** మస్రూఖ్ చెప్పగా తాను విన్నానని అబూ వాయల్ తెలిపారు : అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) ఇలా అన్నారు– దైవప్రవక్త(సఅసమ్) నోట చెడు మాట ఏదీ వెలువడేది కాదు. ఆయన(స) నుండి అసలు అలాంటి దానిని ఊహించనైనా లేము. ఆయన(స) ఇలా అన్నారు: "మీలో ఎవరి నీతి నడవడికలు మంచివో అతను నాకు మీ అందరిలోకెల్లా ప్రియతముడు". దైవప్రవక్త(స) ఇంకా ఇలా అన్నారు : "నలుగురు వ్యక్తుల నుండి ఖుర్‌ఆన్‌ను నేర్చుకోండి. వారు 1) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ 2) అబూ హుజైఫా బానిస సాలిమ్ 3) ఉబై బిన్ కాబ్ 4) ముఆజ్ బిన్ జబల్ (రజిఅల్లాహు అన్‌హుమ్)".

**397)** అల్ఖమా తెలిపారు: నేను సిరియాకు చేరుకోగానే అన్నింటికన్నా ముందు రెండు రకతుల నమాజ్ చేసి, 'దేవా! నాకు ఎవరయినా ఒక సజ్జనుని సాంగత్యం ద్వారా లబ్ధి పొందే సద్బుద్ధిని ప్రసాదించు' అని వేడుకున్నాను. అంతలోనే ఒక మహనీయుడు అటువైపు రావటం గమనించాను. ఆయన నా దగ్గరకు రాగానే నా మొర ఆలకించబడిందని అనుకున్నాను. 'మీరు ఎచటివారు?' అని ఆయన ప్రశ్నించారు. 'కూఫా వాసిని' అని బదులిచ్చాను. 'ఏమిటి, మీ వద్ద సౌభాగ్య వంతుడు, నిష్కళంకమైన వ్యక్తి (అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్– రజి) లేరా? షైతాన్ బారి నుండి (అల్లాహ్) శరణు లభించిన వ్యక్తి మీ నగరంలో లేరా? (అంటే అమ్మార్ బిన్ యాసిర్–రజి). మీ వద్ద దైవప్రవక్త(స) రహస్యాలు తెలిసిన వ్యక్తి లేరా? (హుజైఫా–రజి). వాటిని గురించి ఆయన తప్ప మరెవరూ ఎరుగరు' అని అడిగారు. ఆ తర్వాత ఆయన, 'ఇబ్నె ఉమ్మె అబ్ద్ (అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్–రజి) **వల్లయ్‌లి ఇజా యగ్‌షా** సూరాను ఎలా పారాయణం చేసేవారు?' అని ప్రశ్నించగా **'వల్లయ్‌లి ఇజాయగ్‌షా- వన్నహారి ఇజా తజల్లా- వజ్జకరి వల్ ఉన్‌సా'** అని నేను విన్నవించు కున్నాను. అది విని ఆయన 'దైవప్రవక్త(స) కూడా స్వయంగా నాకు ఇలాగే నేర్పారు. కాని ఇప్పుడు సిరియా వాసులు ఈ విధంగా పఠించటం నుండి నన్ను ఆపాలను కుంటున్నారు' అని అన్నారు.

**398)** అబ్దుర్రహ్మాన్ బిన్ జైద్ కథనం : ప్రవక్త ప్రియ సహచరులలో, నీతీ నడవడికలు, అలవాట్లు పద్ధతులలో అందరికన్నా అధికంగా దైవప్రవక్త(స)కు దరిదాపుల్లో ఉన్నవారెవరు? అని మేము హజ్రత్ హుజైఫా(రజి)ను అడిగాము. ఇది

**తెలుసుకుని మేము ఆ సహాబీ నుండి సంస్కారం నేర్చుకోవాలనుకున్నాము. దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు : 'నీతీ నడవడికలలో, అలవాట్లు పద్ధతులలో, గుణగణాలలో ఇబ్నె ఉమ్మె అబ్ద్ (అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్-రజి) కన్నా ఎక్కువగా దైవప్రవక్త(స)ను పోలినవారు ఎవరూ లేరని నేను భావిస్తున్నాను.'**

**399) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) చెప్పగా తాను విన్నానని అస్వద్ బిన్ యజీద్ తెలిపారు- అబూ మూసా అష్అరీ ఇలా చెప్పారు- "నేనూ, నా సోదరుడు యమన్ నుండి (మదీనా) వచ్చి, చాలా కాలం ఇక్కడే ఉన్నాము. ఈ మధ్య కాలంలో మేము తలపోసేవారం- అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) దైవ ప్రవక్త(స) కుటుంబీకుల్లోని వారని. ఎందుకంటే ఈయనా, ఈయన తల్లి పదే పదే దైవ ప్రవక్త(స) ఇంటికి వస్తూపోతూ ఉండేవారు."**

## అధ్యాయం : 30

## హజ్రత్ ముఆవియా బిన్ అబూ సుఫ్యాన్(రజి) గురించి[1]

**400) ఇబ్నె అబీ ములైకా కథనం: హజ్రత్ ముఆవియా (రజి) ఇషా నమాజ్ అనంతరం ఒక రకఅత్ విత్ర్ నమాజ్ చేశారు. ఆ సమయంలో హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) బానిస (ఖురైబ్) అక్కడే ఉన్నాడు. అతను ఇబ్నె అబ్బాస్ వద్దకు వచ్చి (ముఆవియా ఒక రకఅత్ విత్ర్ నమాజ్ చేసిన విషయాన్ని) ప్రస్తావించగా, "ఫరవాలేదు. ఆయన దైవప్రవక్త(స) సాంగత్యం పొందినవారు"[1] అని చెప్పారు.**

**401) ఇబ్నె అబీ ములైకా వివరించారు: 'అమీరుల్ మోమినీన్ హజ్రత్ అమీర్ ముఆవియా (రజి) గురించి మీ అభిప్రాయం ఏమిటి? ఆయన విత్ర్ నమాజ్ కేవలం ఒక రకఅత్ మాత్రమే చేస్తున్నార'ని ఎవరో ఇబ్నె అబ్బాస్(రజి)ను అడగ్గా,**

---

30-1. ఈయన అబూ సుఫ్యాన్ కుమారుడు. అబూ సుఫ్యాన్ చివరి దశ వరకూ (మక్కా విజయం వరకూ) ముస్లిములతో యుద్ధం చేస్తూ వచ్చారు. ముఆవియా (రజి) దైవప్రవక్త(స) దగ్గర మున్షీగా కూడా ఉన్నారు. హిజ్రీ 60లో డెమాస్కస్‌లో మరణించారు. అప్పటికి ఆయనకు 82 సంవత్సరాలు.

400-1. అంటే దైవప్రవక్త(సఅసమ్) ఒక రకఅత్ విత్ర్ నమాజ్ చేయగా ముఆవియా చూసి ఉంటారు. కాబట్టి దీనిపై రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఎంతమాత్రం లేదన్నది ఆయన పలుకుల్లోని అంతరార్థం.

**"అయితే ఏమిటంటారు? ఆయన స్వయంగా ధర్మవేత్త (ఫఖీ)"[1] అని ఇబ్నె అబ్బాస్ (రజి) చెప్పారు.**

**402) ముఆవియా (రజి) ఈ విధంగా చెప్పారని హ్రమ్రాన్ బిన్ అబాన్ తెలిపారు: "అదేమిటో మీరు ఒక ప్రత్యేక నమాజ్ చేస్తున్నారు. మేము దైవ ప్రవక్త(సఅసమ్) సహచర్యంలో ఉన్నాము. కాని మేమెన్నడూ ఈ వేళ ఆయన(స) నమాజ్ చేస్తుండగా చూడలేదు. పైగా ఆయన(స) దీన్నుండి వారించారు". అస్ర్ నమాజ్ తర్వాత రెండు రకతుల నమాజ్ చేయడాన్ని చూసి ఆయన ఈ విధంగా అన్నారు.**

## అధ్యాయం : 31

## హజ్రత్ ఫాతిమా(ర.అ) విశిష్టత

**"హజ్రత్ ఫాతిమా(ర.అ) స్వర్గంలోని మహిళలకు నాయకురాలు"[1] అని దైవప్రవక్త(స) చెప్పారు.**

**403) మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: "ఫాతిమా(ర.అ) నా శరీరంలోని భాగం. (అకారణంగా) ఆమెకు కోపం తెప్పించిన వారు నాకు కోపం తెప్పించినట్లే."**

## అధ్యాయం : 32

## హజ్రత్ ఆయిషా(ర.అ) విశిష్టత[1]

**404) హజ్రత్ ఆయిషా(ర.అ) తనతో చెప్పారని అబూ సలమా తెలిపారు:**

---

401–1. అంటే ఒక ముజ్తహిద్ (శాసనాన్వయకర్త, ఇజ్తెహాద్ చేసే వ్యక్తి) ధర్మశాస్త్రం విషయాలలో పరిశోధించి ఒక నిర్ధారణకు వచ్చినప్పుడు మరో ముజ్తహిద్ దానిపై ఆక్షేపణ తెలుపటం సమంజసం కాదు. అదీగాక అమీర్ ముఆవియాకు దైవప్రవక్త(స) సామీప్యం లభించింది. బహుశా ఆయన దైవప్రవక్త(స)ను ఒక రకఅత్ విత్ర్ నమాజ్ చేస్తుండగా చూసి ఉంటారు.

31–1. హజ్రత్ ఫాతిమా(ర.అ) దైవప్రవక్త(స) గారి అందరికన్నా చిన్న కూతురు. ఆయన గారాలపట్టి. ఆమె వివాహం హిజ్రీ 2లో హజ్రత్ అలీ(రజి)తో జరిగింది. ఆ దంపతులకు హసన్, హుసైన్ ముహ్సిన్ అనే ముగ్గురు కుమారులు, జైనబ్, ఉమ్మె కుల్సుమ్, రుఖయ్యా అనే ముగ్గురు కుమార్తెలు జన్మించారు. దైవప్రవక్త(స) పరమపదించిన ఆర్నెల్ల తర్వాత ఈమె కూడా మరణించారు. మరణించే నాటికి ఆమె వయసు 24 లేదా 29 లేదా 30 సంవత్సరాలని అనుబడుతోంది.

**ప్రవక్త మహనీయులు(సఅసం) ఒక రోజు నాతో, "ఆయిషా! ఇదిగో జిబ్రయీల్ (అలైహిస్సలామ్) విచ్చేశారు. ఆయన నీకు సలామ్ చెబుతున్నార"ని అన్నారు. దానికి జవాబుగా నేను ఇలా అన్నాను– 'వ అలైహిస్సలాము వ రహ్మతుల్లాహి వ బరకాతుహు. (ప్రవక్తా!) నాకు కానరాని దానిని మీరు చూడగలుగుతారు'.**

**405) హజ్రత్ అబూ మూసా అష్‌అరీ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "పురుషులలో చాలామంది పరిపూర్ణత గలవారు జన్మించారు. కాని మహిళలలో ఇమ్రాన్ పుత్రికయగు మర్యమ్ (అలైహిస్స లామ్), ఫిరౌన్ భార్య యగు ఆసియా తప్ప వేరెవరూ పరిపూర్ణులు కారు. ఇకపోతే ఆయిషా(ర.అ) విశిష్టత; వంటకాలన్నింటిలో సరీద్‌కు ఎటువంటి ప్రాధాన్యత ఉందో ఆయిషా(ర.అ)కు మహిళావనిపై అటువంటి ప్రాధాన్యతే ఉంది."**

**406) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించగా నేను విన్నా నని హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు: "సరీద్ వంటకానికి ఇతర వంటకాలన్నింటిపై గల ప్రాధాన్యత ఎటువంటిదో ఆయిషా(ర.అ)కు మహిళా జగతిపై గల ప్రాధాన్యత అటువంటిది."[1]**

**407) ఖాసిమ్ బిన్ ముహమ్మద్ కథనం: హజ్రత్ ఆయిషా(ర.అ) అస్వస్థతకు గురైనప్పుడు, హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఆమెను పరామర్శించటానికి**

---

32–1. ఉమ్మె అబ్దుల్లాహ్ ఈమె కునీయత్. మహనీయ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) కుమార్తె. దైవప్రవక్త(స)కు ప్రాణ సఖి. 'సిద్దీకా' అనేది ఈమె బిరుదు. గొప్ప విద్వాంసు రాలు. ఫికహ్‌లో, ఇజ్తెహాద్‌లో సాటిలేని మేటి. మంచి వక్త. ముఆవియా ఖిలాఫత్ కాలం వరకు జీవించి ఉన్నారు. ముస్లిం మహిళా జగతికి ధార్మికంగా ఆమె చేసిన సేవలు అమూల్యమైనవి. హిజ్రీ 58వ సంవత్సరంలో మరణించారు. అది రమజాన్ నెల 27వ తేదీ. మహనీయ అబూ హురైరా(రజి) ఆమె గారి నమాజె జనాజాకు నాయకత్వం వహించారు.

406–1. 'సరీద్' అనేది అరబ్బులకు ఎంతో ఇష్టకరమైన వంటకం. పలుచటి రొట్టె ముక్కలను మాంసం కూరలో వేసి వండుతారు. హజ్రత్ ఆయిషా(ర.అ)లోని సమయస్ఫూర్తి, స్థిత ప్రజ్ఞత, ధర్మావగాహన దృష్ట్యా దైవప్రవక్త(స) ఆమె గురించి ఇలా పలికారు.

**వెళ్ళి, "ఉమ్ముల్ మోమినీన్! మీరు సత్యవంతులు ఉండే చోటికి వెళుతున్నార"ని అన్నారు. అంటే, దైవప్రవక్త(సఅసమ్) మరియు అబూబక్ర్(రజి)ల వద్దకు.**

**408) అబూ వాయల్ చెప్పగా తాను విన్నానని హకమ్ వివరించారు : జనుల మద్దతును కూడగట్టడానికి హజ్రత్ అలీ(రజి) అమ్మార్‌ను, హసన్‌ను 'కూఫా'కు పంపించినప్పుడు, అక్కడి ప్రజలనుద్దేశించి, అమ్మార్ (రజి) ఇలా ప్రసంగించారు: "ఆయిషా(ర.అ) ఇహలోకంలోనూ, పరలోకంలోనూ దైవప్రవక్త (సఅసమ్)కు ప్రియాతిప్రియమయిన భార్య అన్న సంగతి నాకూ తెలుసు. అయితే అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించదలుస్తున్నాడు. అంటే (ధర్మబద్ధంగా ఖలీఫాగా ఉన్న) హజ్రత్ అలీ(రజి)ని మీరు సమర్థిస్తారా? లేక ఆయిషా(ర.అ)ను సమర్థిస్తారా? అన్నది చూడదలిచాడు."[1]**

**409) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : (దైవప్రవక్త–సఅసమ్‌తో కలసి ఒక యుద్ధ ప్రయాణం చేసేందుకు) నేను నా అక్క అస్మా (ర.అ)**

408–1. అమ్మ ఆయిషా(ర.అ) ప్రజల ఉద్వేగపూరితమయిన మాటలకు ప్రభావితులై పోయారు. హజ్రత్ ఉస్మాన్(రజి) హంతకులపై ప్రతీకారం తీర్చుకోవటంలో హజ్రత్ అలీ(రజి) తాత్సారం చేస్తున్నందుకు ఆయనతో యుద్ధం చేయటానికి పూనుకున్నారు. మరోవైపు అలీ (రజి), ఆవేశాలు చల్లారి పరిస్థితులు కుదుట పడిన మీదట న్యాయవిచారణ జరిపించి హంతకులపై చర్య తీసుకోవటం సబబుగా ఉంటుందని అనేవారు.

ఈ సందర్భంగా "మీరు మీ ఇండ్లలోనే ఆగి ఉండండి" (33: 33) అన్న దైవాజ్ఞ గమనార్హమైనది. ఇది ప్రత్యేకంగా దైవప్రవక్త సతీమణుల నేపథ్యంలో అవతరించింది. దీని ప్రభావం ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఉమ్మె సలమా (ర.అ)పై ఎంతగా పడిందంటే, 'నేను దైవప్రవక్త(స)ను చేరుకునేవరకూ ఒంటెపై స్వారీ అవబోను' అని నిర్దిష్టంగా చెప్పేవారు. అంటే మరణం వచ్చేవరకూ ఇల్లు వదలి ఎక్కడికీ వెళ్ళను అన్నది ఆమె మాటల్లోని అంతరార్థం.

కాని హజ్రత్ ఆయిషా(ర.అ) సంస్కరణ వైపునకు మొగ్గు చూపారు. హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మా) ప్రకారం హజ్రత్ ఆయిషా, హజ్రత్ తల్హా, హజ్రత్ జుబైర్‌లు 'ముజ్తహిద్'ల కోవకు చెందినవారు. ముస్లింల మధ్యన సంఘీభావం అవసరం అని వారు తలపోసేవారు. హజ్రత్ ఉస్మాన్(రజి) హంతకుల నుండి 'ఖిసాస్' తీసుకోనంతవరకూ సంఘీభావం సాధ్యం కాదన్నది వారి వాదన.

**వద్ద నుండి ఒక కంఠహారం అరువుగా తీసుకున్నాను. యాదృచ్ఛికంగా ఆ హారం దారిలో ఎక్కడో పడిపోయింది. దానిని వెతికేందుకు దైవప్రవక్త(స) కొంతమంది సహాబాను పంపించారు. ఈ లోగా నమాజ్ వేళ అయింది. వెళ్ళినవారు వుజూ చేయ కుండానే నమాజ్ చేసుకున్నారు. తిరిగి వచ్చిన తరువాత వారు పరిస్థితుల స్వరూ పాన్ని దైవప్రవక్త(స)కు వివరించారు. ఆ తర్వాత 'తయమ్మమ్' ఆయత్ అవతరిం చింది. అప్పుడు ఉసైద్ బిన్ హుజైర్(రజి) ఆయిషా(ర.అ)నుద్దేశించి ఇలా అన్నారు: '(అమ్మా!) అల్లాహ్ మీకు మంచి ప్రతిఫలం వొసగుగాక! అల్లాహ్ సాక్షిగా! మీపై ఎప్పుడు, ఏ ఆపద వచ్చిపడినా, దాని నుండి బయటపడే మార్గాన్ని అల్లాహ్ మీ కొరకు తెరిచాడు. అంతేకాదు, ముస్లింల కొరకు కూడా అందులో శుభాన్ని పొందుపరి చాడు'.**

**410) హిషామ్ తన తండ్రి (ఉర్వా) నుండి ఉటంకించిన దాని ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) మరణ వ్యాధికి గురైన సమయంలో కూడా తన సతీమణుల దగ్గర వంతుల వారీగా ఆగే నియమానికి కట్టుబడి ఉండేవారు. అయితే "రేపు నేను ఎవరి వద్ద ఆగవలసి ఉంది? రేపు నా విడిది ఎక్కడ?" అని కలవరించేవారు. ఎందుకంటే ఆయన(సఅసమ్) హజ్రత్ ఆయిషా(ర.అ) వంతు కోసం ఆత్రుతతో నిరీక్షించసాగారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అంటున్నారు: 'ఆయన(స) నా దగ్గర ఆగవలసిన రోజు వచ్చాక ఆయనకు నెమ్మది లభించింది.[1]**

**411) హిషామ్ తన తండ్రి (ఉర్వా) నుండి సంగ్రహించిన దాని ప్రకారం జనులు దైవప్రవక్త(సఅసం)కు కానుకలు పంపదలచుకున్నప్పుడు హజ్రత్ ఆయిషా**

---

410–1. అంటే– 'రేపు నేను ఎవరి దగ్గర ఆగవలసింది ఉంది' అని పదేపదే అడగటం మానేశారు. హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) నకలు చేసిన దానిలో ఇలా ఉంది: 'మా దృష్టిలో హజ్రత్ ఫాతిమా(ర.అ) అందరిలోకీ శ్రేష్ఠత గల వనిత. ఆ తర్వాతి స్థానం హజ్రత్ ఖదీజా(ర.అ)ది'. ఇమామ్ ఇబ్నె తైమియ్యా (రహ్మ) గారు ఈ విషయాన్ని ఎటూ తేల్చలేదు. ఇమామ్ ఇబ్నె ఖయ్యిమ్(రహ్మ) ఇలా అంటారు: 'ఫజీలత్' అనేది పుణ్యఫలం రీత్యా అయివుంటే, ఆ విషయం అల్లాహ్‌కే బాగా తెలుసు. ఒకవేళ 'జ్ఞానం' రీత్యా అయివుంటే హజ్రత్ ఆయిషా(ర.అ)యే శ్రేష్ఠులు. ఒకవేళ వంశపరమైన శ్రేష్టత అయివుంటే హజ్రత్ ఫాతిమా(ర.అ) శ్రేష్టత తిరుగులేనిది.

**(ర.అ) వంతు కొరకు నిరీక్షించేవారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అంటున్నారు: నా సవతులంతా ఉమ్మె సలమా(ర.అ) దగ్గరకు వెళ్ళి, 'ఉమ్మె సలమా! దైవసాక్షి! ప్రజలు ఉద్దేశపూర్వకంగా తమ కానుకలను దైవప్రవక్త(స) ఆయిషా ఇంట్లో ఆగే రోజునే పంపిస్తున్నారు. ఆయిషా మాదిరిగానే మేము కూడా మేలును కాంక్షించే వారమే కదా! (మరలాంటప్పుడు ఇది సమంజసమా?). కాబట్టి నీవు దైవప్రవక్త(స) దగ్గరకు వెళ్ళి, ఆయన ఏ భార్య వద్ద ఆగి ఉన్నా సరే కానుకలు పంపవచ్చు అనీ, ఆయిషా ఇంట ఆగే రోజు కొరకే నిరీక్షించవలసిన అవసరం లేదని ప్రజలకు ఆజ్ఞాపించమని చెప్పు'. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అ) తన సవతుల అభ్యర్థన మేరకు, దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి ఈ విషయమై మాట్లాడారు. ఆయన(స) ముఖం త్రిప్పుకున్నారు (కాని సమాధానం ఇవ్వలేదు). ఆమె రెండవసారి విన్నవించుకున్నారు. అప్పుడూ సమాధానం రాలేదు. మూడవసారి కూడా విజ్ఞప్తి చేసినప్పుడు ఆయన(స) ఇలా అన్నారు: "ఉమ్మె సలమా! ఆయిషా వ్యవహారంలో నన్ను ఇబ్బంది పెట్టకు. దైవసాక్షి! మీలో ఏ ఒక్క భార్య దుప్పట్లో కూడా (నేను దానిని కప్పుకుని ఉండగా) దైవవాణి అవతరించలేదు. కాని ఆయిషా దుప్పట్లో శయనిస్తూ ఉండగా దైవవాణి అవతరించింది."**

## అధ్యాయం : 33

## అన్సార్ల[1] గొప్పతనం గురించి...

**దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు : శరణార్థుల రాకకు పూర్వమే, విశ్వసించి వలస కేంద్రంలో స్థిరపడిన వారికి కూడా (ఈ ఆస్తులలో) హక్కు ఉంది. వారు తమ వద్దకు వలస వచ్చిన వారిని ప్రేమిస్తారు. వారికి ఏది ఇవ్వబడినా, దాని అవసరం సయితం ఉన్నట్లుగా వారు తమ మనస్సులలో భావించరు.[2] వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. *(అల్ హష్ర్ : 9)***

---

33-1. 'నాసిర్' అనే పదానికి బహువచనం 'అన్సార్'. అన్సార్ అంటే సహాయకులు అని అర్థం. మదీనాలో నివసించే ఔస్, ఖజ్రజ్ తెగలకు చెందిన ముస్లింలకు లభించిన బిరుదు అన్సార్. వారు దైవప్రవక్త(స)కు రక్షణ కల్పించడమేగాక, ధన ప్రాణాలతో ఆదుకున్నారు.

33-2. మక్కా నుండి హిజ్రత్ చేసి మదీనాకు వచ్చిన ముహాజిర్ ముస్లింలకు అన్ని

**412) గీలాన్ బిన్ జరీర్ తెలిపారు: నేను మహనీయ అనస్(రజి)ను, "చెప్పండి, అన్సార్ అనే పేరును మీరు స్వయంగా పెట్టుకున్నారా? లేక మీకు ఈ పేరు అల్లాహ్ పెట్టాడా?" అని నేను అడగ్గా, "ఈ పేరు మేము పెట్టుకున్నది కాదు, అల్లాహ్‌యే మాకు ఈ నామకరణం చేశాడు" అని ఆయన చెప్పారు. గీలాన్ ఉల్లేఖనంలో ఈ విధంగా కూడా ఉంది: మేము అనస్(రజి) సేవలో హాజరయ్యే వారం. ఆయన మాకు, అన్సార్ల గొప్పతనం గురించి, ధర్మయుద్ధాలలో వారు కనబరచిన అసాధారణ పోరాట పటిమ గురించి విడమరిచి చెప్పేవారు. తరువాత ఆయన నా వైపు లేదా అజ్ద్[1] తెగకు చెందిన ఒక వ్యక్తి వైపు తిరిగి, "మీ జాతి వారు (అన్సార్) ఫలానా రోజున ఫలానా ఘనకార్యం సాధించార"ని చెప్పేవారు.**

**413) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : (ఇస్లామ్‌కు పూర్వం ఔస్- ఖజ్రజ్ తెగల మధ్యన జరిగిన) బుఆస్ యుద్ధాన్ని అల్లాహ్ తన ప్రవక్త(సఅసమ్) మదీనాకు రాకపూర్వమే సమాప్తం అయ్యేలా చేశాడు. ఆయన(స) మదీనాకు వచ్చినప్పుడు ఈ తెగల వారు పరస్పరం అనైక్యతకు గురై ఉన్నారు. వారి నాయకులలో కొందరు వధించబడగా, మరికొందరు క్షతగాత్రులై ఉన్నారు. దైవప్రవక్త (మదీనాకు) రాక పూర్వమే ఈ యుద్ధ విరమణ జరగటంతో, ఆయన(స) రాగానే వారు ముస్లింలుగా ధర్మపరివర్తన చెందారు.[1]**

---

విధాలా తోడ్పాటునందించారు. వారి పునరావాసం నిమిత్తం దైవప్రవక్త(స) వారికి సహాయం చేసినప్పుడు అన్సార్లు దానిని హృదయపూర్వకంగా స్వాగతించారు.

412-1. 'అజ్ద్' అనేది యమన్ ప్రాంతంలోని ఒక తెగ. అన్సార్లంతా ఆ తెగ సంతానమే.

413-1. మదీనా నగరానికి రెండు మైళ్ళ దూరాన ఉన్న ఒక స్థలం పేరు 'బుఆస్'. అక్కడ అన్సార్ల రెండు తెగల (ఔస్- ఖజ్రజ్) మధ్యన భీకర పోరాటం జరిగింది. ఇరు తెగల నాయకులు ఆ యుద్ధంలో వధించబడ్డారు. హిజ్రత్‌కు ఐదారేళ్ళ క్రితం ఈ యుద్ధం ముగిసింది. కాని ఇరుతెగల వారి మనసులు వేర్వేరుగా ఉండేవి. ఇస్లామ్ చలువ వల్ల వారి మధ్యన ప్రేమానురాగాలు పెంపొందాయి. సోదర భావన బలపడింది. పూర్వం ఒకప్పుడు పరస్పరం బద్ధ శత్రువులుగా ఉండే ఈ ప్రజలు ఇస్లామ్ తరువాత పరస్పరం సంగఠితమై సరికొత్త చరిత్ర సృష్టించారు.

**414)** హ్రజత్ అనస్(రజి) బిన్ మాలిక్ తెలిపారు: మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త(స) ఖురైషులకు (హునైన్) విజయప్రాప్తినంతా ఇచ్చేసినప్పుడు అన్సార్లలోని కొంతమంది యువకులు ఖిన్నులై '(దైవసాక్షి!) ఇది కడు విచిత్రం! మా ఖడ్గాల నుండి ఖురైషుల నెత్తురు కారుతుండగానే, మేము సాధించిన విజయ ధనం మాత్రం కేవలం వారికే ఇవ్వబడుతోంది'[1] అన్నారు. దైవప్రవక్త(స)కు ఈ సంగతి తెలియగానే అన్సార్లను పిలిపించారు. దైవప్రవక్త(స) ఈ విధంగా అడిగారని అనస్(రజి) అన్నారు: "నాకు అందిన సమాచారం నిజమేనా?" అన్సార్లు అబద్ధం చెప్పరు. '(ప్రవక్తా!) మీకు అందిన ఈ సమాచారం నిజమే'నని వారు ధ్రువపరిచారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "జనులు విజయధనం తీసుకుని తమ తమ ఇండ్లకు వెళుతుండగా మీరు దైవప్రవక్త(స)ను వెంటబెట్టుకుని మీ ఇళ్ళకు వెళతారు. ఇది మీకు సంతోషకరం కాదా? (బాగా వినండి!) అన్సార్లు ఏ కనుమ గుండా, పర్వత లోయ గుండా నడుస్తారో నేను కూడా అదే కనుమ లేదా పర్వత లోయ గుండా నడుస్తాను."

### అధ్యాయం : 34

### ప్రవక్త మహనీయులు (స) ఈ విధంగా సెలవీయటం...

**415)** హ్రజత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "అన్సార్లు ఏ కనుమ లేదా లోయ మీదుగా నడుస్తారో నేను కూడా ఆ కనుమలోనే నడుస్తాను. ఒకవేళ నేను గనక హిజ్రత్ చేయకుండా ఉన్నప్పటికీ అన్సార్లలోని ఒక వ్యక్తిగా ఉండటానికి ఇష్టపడేవాణ్ణి"– హ్రజత్ అబూ హురైరా (రజి) ఇలా అన్నారు : '(దైవప్రవక్తా!) నా తల్లిదండ్రులు మీకు అర్పితం. మీరు అనుచితమైన మాట ఏదీ చెప్పలేదు. మిమ్మల్ని అన్సార్లు తమ వద్ద ఆపుకున్నారు. మీకు సహాయపడ్డారు'. లేదా అబూ హురైరా (రజి) అలాంటి అర్థమే వచ్చే మరో మాట అన్నారు.

---

414–1. అన్సార్లలోని కొంతమంది విజ్ఞత లోపించిన యువకులు ఈ విధంగా పలికారని మరో ఉల్లేఖనంలో ఉంది. కాని దైవప్రవక్త(స) పవిత్ర నోట జాలువారిన పలుకులను విన్న మీదట అన్సార్ల కళ్ళు ఆనందంతోనూ, ఉద్వేగంతోనూ వర్షించాయి. తమకు దైవప్రవక్త(స) సాంగత్యం చాలని వారు ముక్తకంఠంతో పలికారు.

## అధ్యాయం : 35

## అన్సార్లు- ముహాజిర్ల మధ్యన దైవప్రవక్త(స) సోదర బంధాన్ని ఏర్పరచటం[1]

**416)** ఇబ్రాహీమ్ బిన్ సాద్ తన తండ్రీ తాతల నుండి సంగ్రహించిన విషయాన్ని ఇలా వివరించారు: ముహాజిర్లు మదీనా వచ్చినప్పుడు దైవప్రవక్త (సఅసమ్) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌కి- సాద్ బిన్ రబీకి మధ్య సోదర బంధం ఏర్పరిచారు. సాద్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌తో, “చూడండి, నేను అన్సార్లలో అందరికన్నా ధనికుణ్ణి. మీరు నా సంపదలోనుండి సగం తీసేసుకోండి. నాకు ఇద్దరు భార్యలున్నారు. మీరు వారిని చూసుకోండి. వారిలో మీకు నచ్చిన వారెవరో చెప్పండి. నేనామెకు విడాకులు ఇస్తాను. ఇద్దత్ (నిర్ణీత గడువు) పూర్తయ్యాక మీరు ఆమెను నికాహ్ చేసుకోండి” అని అన్నారు. సమాధానంగా అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) ఇలా అన్నారు : “అల్లాహ్ మీ ఆస్తిపాస్తుల్లో, ఆలుబిడ్డలలో శుభాన్ని ప్రసాదించుగాక! మీ మార్కెట్టు ఎక్కడో నాకు చెప్పండి”. నేను బనూ ఖైనుఖా మార్కెట్టు దారి ఆయనకు చూపించాను. ఆయన అక్కడ వ్యాపారం చేసి తిరిగి వచ్చినప్పుడు, ఆయన దగ్గర కొన్ని జున్ను ముక్కలు, నెయ్యి ఉన్నాయి. ఆ రోజు నుంచీ ఆయన అలాగే ఉదయం మార్కెట్టుకు వెళ్ళి వ్యాపారం చేసి వచ్చేశారు. చివరకు ఆయన ఒక రోజు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చినప్పుడు, ఆయన శరీరంపై కుంకుమ పువ్వు రంగు (సువాసన) గుర్తులు కనిపించాయి. “ఏమిటిది?” అని ప్రవక్త(స) అడిగితే, ‘నేను నికాహ్ చేసుకున్నాన’ని చెప్పారు. “మరయితే ఎంత మహర్ ఇచ్చావు?” అని దైవప్రవక్త(స) విచారించగా, ‘ఒక బంగారు విత్తనం లేదా ఐదు దిర్హము (నాణాల)ల

---

35-1. ముహాజిర్ ముస్లింలు తమ స్వస్థలాన్ని వదలి మదీనాకు వచ్చినప్పుడు ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఇల్లూ వాకిలినీ, ఆస్తిపాస్తులను, ఆత్మీయులను కోల్పోయిన బాధతో కృంగిపోతుండేవారు. అలాంటి క్లిష్ట పరిస్థితులలో దైవ ప్రవక్త(స) 150 మంది అన్సార్లు- 150 మంది ముహాజిర్ల మధ్య అపురూపమైన సోదర బంధాన్ని ఏర్పరచారు. తత్ఫలితంగా అన్సార్లు- ముహాజిర్ల మధ్యన నిజమైన సోదర బంధం ఏర్పడింది. అన్సార్లు తమ ముహాజిర్ సోదరుల కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడేవారు. చరిత్రలోనే అటువంటి ఉపమానం దొరకదు.

బరువుకు సమానంగా ఉన్న బంగారం అని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) బదులిచ్చారు– ఇక్కడ ఉల్లేఖకుడు ఇబ్రాహీమ్ సందిగ్ధంలో పడ్డారు.

**417)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేసి వచ్చినప్పుడు, ప్రవక్త మహనీయులు(స) ఆయనకు– సాద్ బిన్ రబీకి మధ్యన సోదర బంధం ఏర్పరచారు. హజ్రత్ సాద్(రజి) ధనికులు. ఆయన గారు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)తో, "నేను అన్సార్లలోకెల్లా ధనవంతుణ్ని అన్న సంగతి అన్సార్లకు బాగా తెలుసు. అందువల్ల నేను నా సంపదలో సగభాగం మీకూ, సగ భాగం నాకు పంచిపెడుతున్నాను. ఇకపోతే, నాకు ఇద్దరు భార్యలున్నారు. వారిలో మీకు నచ్చిన ఆమెకు నేను విడాకులిస్తాను. ఆమె ఇద్దత్ ముగిసిన తర్వాత మీరు ఆమెను వివాహమాడండి" అని చెప్పారు. దానికి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి), "అల్లాహ్ మీ సిరిసంపదల్లో, ఇంటి వారలలో సమృద్ధిని వొసగుగాక! నాకు మీ (నగరంలోని) మార్కెట్టును చూపించండి, చాలు" అన్నారు. కొంత పన్నీరు, నెయ్యి లాభంగా మిగులనంత వరకూ ఆయన మార్కెట్టు నుండి తిరిగి రాలేదు. కొన్నాళ్ళు గడిచిన తర్వాత ఆయన దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చినప్పుడు, ఆయన ఒంటిపై కుంకుమ పువ్వు రంగు కనిపించింది "ఏమిటిది?" అని దైవప్రవక్త(స) అడిగితే, 'నేనొక అన్సార్ మహిళను మనువాడాను' అని ఆయన చెప్పారు. "ఎంత మహర్ ఇచ్చావు?" అని ప్రవక్త(స) అడిగితే, ఒక విత్తనం (బరువుకు) సమానమైన బంగారం లేదా ఒక బంగారు విత్తనం ఇచ్చానని ఆయన బదులిచ్చారు. దానికి దైవప్రవక్త(స) "అలాగా! అయితే వలీమా విందు ఇవ్వు– ఒక మేక ద్వారానయినా సరే" అని ఉపదేశించారు.

**418)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : అన్సార్లు దైవప్రవక్త (సఅసమ్)తో 'యా రసూలల్లాహ్! ఖర్జూరపు తోటలను మాకూ– ముహాజిర్లకు మధ్యన పంచిపెట్టండి' అని విన్నవించుకోగా, "అది జరగని పని" అని దైవప్రవక్త (స) చెప్పారు. 'పోనీ, అలాగైతే మీరు మా తోటల్లో శ్రమదానం చేయండి. ఫలసాయంలో చెరిసగం తీసుకుందాము' అని అన్సార్లు ప్రతిపాదించగా, 'మీ మాట విన్నాము. ఇది మాకు సమ్మతమే'[1] అని ముహాజిర్లు చెప్పారు.

---

418–1. అంటే ఈ ప్రతిపాదన ధర్మసమ్మతంగా ఉంది. మీ తోటలు మీకే ఉంటాయి. మేము కష్టపడి పనిచేస్తాము. వచ్చిన పంటను సగం సగం పంచుకుందాము.

## అధ్యాయం : 36

## అన్సార్ల పట్ల ప్రేమాదరణలు కలిగి ఉండటం గురించి

**419)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ద్వారా నేను విన్నాను లేదా ఆయన (స) ఈ విధంగా చెప్పారని హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పారు. ప్రవక్త(స) ఇలా చెప్పారు: "అన్సార్ల పట్ల కేవలం విశ్వాసి (మూ'మిన్) మాత్రమే ప్రేమాదరణలు కలిగి ఉంటాడు. కేవలం కపటి (మునాఫిక్) మాత్రమే వారి పట్ల శత్రుత్వం కలిగి ఉంటాడు. కాబట్టి వారి యెడల ప్రేమాదరణలు కలిగి ఉన్నవానిని అల్లాహ్ ప్రేమి స్తాడు. వారి పట్ల శత్రుత్వం కలిగి ఉన్న వాని పట్ల అల్లాహ్ శత్రుత్వం కలిగి ఉంటాడు.

**420)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహ నీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు: "అన్సార్ల పట్ల ప్రేమ విశ్వాసానికి (ఈమాన్‌కు) చిహ్నం. అన్సార్ల పట్ల శత్రుత్వం కాపట్యానికి (మునాఫిఖత్‌కు) చిహ్నం."

## అధ్యాయం: 37

## "మీరు నాకు జనులందరిలోకీ ప్రియతములు" అని దైవప్రవక్త(స) సెలవీయటం.

**421)** అనస్ బిన్ మాలిక్(రజి) నాతో ఈ విధంగా చెప్పారని అబ్దుల్ అజీజ్ తెలిపారు : ఒకసారి దైవప్రవక్త(సఅసమ్) అన్సార్ మహిళలు, పిల్లలు (నా అంచనా ప్రకారం) ఒక వివాహ మహోత్సవం నుండి తిరిగి వస్తుండగా చూసి, ఆయన(స) లేచి నిలబడి, "అల్లాహ్ సాక్షిగా! మీరు నాకు అందరికన్నా ప్రియమైన వార"ని పలికారు. ఆయన(స) ఈ విధంగా మూడుసార్లు పలికారు.

**422)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ఒక అన్సార్ మహిళ దైవ ప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చింది. ఆమె వెంట ఆమె పిల్లవాడు కూడా ఉన్నాడు.

---

తోటల్ని ఇరువర్గాల వారి మధ్య పంచి ఇవ్వడానికి దైవప్రవక్త(స) అంగీకరించ లేదు. ఎందుకంటే రానున్న కాలంలో ఎన్నో విజయాలు వరించనున్నాయని, తద్వారా వచ్చే ఆస్తుల్ని ముస్లింలకు ఇవ్వవచ్చని దైవప్రవక్త(స)కు 'వహీ' ద్వారా తెలియపరచబడింది. అలాంటప్పుడు అన్సార్ల ఆస్తుల్ని ఎందుకు పంపిణీ చేయాలి?

దైవప్రవక్త(స) వారిద్దరితో సంభాషించారు. ఆ సందర్భంగా ఆయన(స) ఇలా అన్నారు : "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! (అన్సార్లు అయిన) మీరు నాకు అందరికన్నా ప్రియమైనవారు"– ఆయన(స) రెండుసార్లు ఈ మాట అన్నారు.

## అధ్యాయం : 38

## అన్సార్ తాబేదారుల[1] విశిష్టత

**423)** జైద్ బిన్ అర్ఖమ్ (రజి) నుండి అబూ హమ్జా ఉటంకించారు: 'దైవ ప్రవక్తా! ప్రతి ప్రవక్తకు తాబేదారులు ఉంటారు. మేము మీకు తాబేదారులుగా వ్యవహరించాము. మా తాబేదారులను కూడా అల్లాహ్ మీ కోవలోకి చేర్చమని తమరు దైవాన్ని ప్రార్థించండి' అని అన్సార్లు విన్నవించుకున్నప్పుడు, దైవప్రవక్త(స) అందు నిమిత్తం ప్రార్థించారు. తరువాత నేను ఈ హదీసు ప్రస్తావన అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ లైలా ముందు చేసినప్పుడు జైద్ బిన్ అర్ఖమ్(రజి) ఈ హదీసును వినిపించారని ఆయన అన్నారు.

**424)** అన్సార్లకు చెందిన ఒక వ్యక్తి– హమ్జా– చెప్పగా తాను విన్నానని అమ్ర్ బిన్ ముర్రా తెలిపారు : '(దైవప్రవక్తా!) ప్రతి జాతికి తాబేదార్లు ఉంటారు. మేము మీకు తాబేదార్లుగా ఉన్నాము. మా తాబేదారులను కూడా మీ కోవలోకి చేర్చమని తమరు దుఆ చేయండి' అని అన్సార్లు విన్నవించుకున్నప్పుడు, దైవప్రవక్త(స) ఇలా దుఆ చేశారు : "(దేవా!) ఈ తాబేదార్లను కూడా వీరిలోనే చేర్చుకో".

అమ్ర్ ఇలా అంటున్నారు : – తరువాత నేను ఈ హదీసును అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ లైలా ముందు ప్రస్తావించగా, 'ఏమిటి, జైద్ ఇలా అన్నాడా?' అని (ఆశ్చర్యంగా) అడిగారు. బహుశా ఈ జైద్, జైద్ బిన్ అర్ఖమ్(రజి) అయి ఉంటారని షూబా అభిప్రాయపడ్డారు.

## అధ్యాయం : 39

## అన్సార్ కుటుంబీకుల విశిష్టత

**425)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ నుండి హజ్రత్ అబూ ఉసైద్ (రజి)[1] సంగ్రహించిన దాని ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు:

---

38–1. ఇక్కడ 'తాబేదారులు' అంటే అన్సార్ల సమర్థకులు, మిత్రులు, వారి బానిసలు, బానిస స్త్రీలు అని అర్థం.

**“అన్సార్ కుటుంబీకుల్లోకెల్లా అత్యుత్తమ కుటుంబీకులు బనూ నజ్జార్ [2]. తరువాత బనూ అబ్దు అష్‌హల్, ఆ తరువాత బనూ హారిస్ బిన్ ఖజ్రజ్, ఆ తరువాత బనూ సాయిదా బిన్ కాబ్ బిన్ ఖజ్రజ్ అక్బర్‌ది. అతను ఔస్‌కు సోదరుడు (ఖజ్రజ్ అక్బర్, ఔస్– ఇద్దరూ హారిసా కుమారులు). ఆ విషయానికి వస్తే అన్సార్‌లకు చెందిన ప్రతి కుటుంబం మంచిదే”– సాద్ బిన్ ఉబాదా (రజి) ఇలా అన్నారు: ‘నా అభిప్రాయంలో దైవప్రవక్త(స) అన్సార్ల అనేక తెగలకు మాపై ప్రాధాన్యత కల్పించారు. ఇది విని, ‘నీకు కూడా అనేక తెగలపై దైవప్రవక్త(స) ప్రాధాన్యత ఇచ్చారు కదా!’ అని ఎవరో[3] అన్నారు..**

**426) అబూ ఉసైద్ (రజి) తెలియజేశారు : నేను దైవప్రవక్త(సఅసమ్) ఈ విధంగా చెప్పగా విన్నాను– “అన్సార్లలో లేదా అన్సార్ కుటుంబీకులలో అన్నిటికన్నా ఉత్తమమైనది బనూ నజ్జార్. (ఆ తర్వాత) బనూ అబ్దు అష్‌హల్, బనూ హారిస్, బనూ సాయిదా కుటుంబాలు”.**

**427) అబూ హుమైద్ సాయిదీ కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: “అన్సార్ల కుటుంబీకుల్లోకెల్లా మంచి కుటుంబం బనూ నజ్జార్ కుటుంబం. ఆ తరువాత అబ్దు అష్‌హల్ వారిది, ఆ తరువాత బనూ హారిస్ వారిది, ఆ తరువాత బనీ సాయిదా వారిది. ఆ మాటకొస్తే అన్సార్ల కుటుంబాలన్నింటిలో మంచి ఉంది” – తరువాత మేము సాద్ బిన్ ఉబాదా(రజి)ను కలుసుకున్నప్పుడు, ఆయన అబూ ఉసైద్ (రజి)తో ఇలా అన్నారు : ‘ఓ అబూ ఉసైద్! దైవప్రవక్త(స) అన్సార్ల మంచి కుటుంబాలను గురించి ప్రస్తుతిస్తూ, మమ్మల్ని (బనూ సాయిదాను) అందరికన్నా చివర్లో ఉంచిన సంగతి మీకు తెలియదా?’. చివరకు సాద్ బిన్ ఉబాదా (రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, ‘(దైవప్రవక్తా!) అన్సార్లలోకెల్లా మంచి కుటుంబాలను ప్రస్తుతించటం జరిగింది. కాని మేము**

---

425–1. ఈయన అసలు పేరు మాలిక్ అని హాఫిజ్ ఇబ్నె హజర్ చెప్పారు.

425–2. బనూ నజ్జార్ ఖజ్రజ్ తెగకు చెందినది. దైవప్రవక్త(స) తల్లి తరఫు బంధువులు వారిలో ఉన్నారు.

425–3. ఆ వ్యక్తి ఎవరో కాదు, సాద్ బిన్ ఉబాదా (రజి) మేనల్లుడు సహ్లా. సాద్ బిన్ ఉబాదా ఆ విధంగా వ్యాఖ్యానించటం సహ్లాకు కోపం తెప్పించింది. అందుకే అలా స్పందించారు.

అందరికన్నా చివర్లో పేర్కొనబడ్డాము' అని విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త(స) "నీ కుటుంబీకులు కూడా మంచి కుటుంబాల జాబితాలోనికి వచ్చారు. ఇది నీకు చాలదా?"[1] అన్నారు.

## అధ్యాయం : 40

## ప్రవక్త మహనీయులు(స) అన్సార్లతో ఇలా పలకటం....

"కౌసర్ సరస్సు వద్ద మీరు నన్ను కలుసుకునేవరకూ మీరు ఓర్పు వహించండి".

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్(రజి) దైవప్రవక్త(స) నుండి దీనిని ఉల్లేఖించారు.

**428)** హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్(రజి) కథనం : 'దైవప్రవక్తా(స)! ఫలానా వ్యక్తికి అధికార పదవి ఇచ్చినట్లుగా నాకూ ఒక పదవిని ఇవ్వండి' అని ఒక అన్సార్ సహాబీ విన్నవించుకోగా, ఆయన(స) ఇలా సమాధానమిచ్చారు: "నా తదనంతరం (ప్రాపంచిక వ్యవహారాలలో) ఇతరులకు మీపై ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుంది. కాబట్టి కౌసర్ సరస్సు వద్ద మీరు నన్ను కలుసుకునే వరకూ సంయమనంతో వ్యవహరించండి."[1]

**429)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని హిషామ్ తెలిపారు. అనస్ ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) అన్సార్లను ఉద్దేశించి ఇలా అన్నారు– "నా తదనంతరం ఇతరులకు మీపై ప్రాధాన్యతనివ్వటాన్ని మీరు గమనిస్తారు. కనుక (అలాంటి సందర్భాలలో) మీరు ఓర్పు వహించండి– నన్ను చేరుకునే వరకూ నిగ్రహంతో మసలుకోండి.[1] నేను మిమ్మల్ని కౌసర్ సరస్సు వద్ద కలుసుకుంటాను."

---

427–1. చివర్లో ఉంటేనేమీ, మొదట్లో ఉంటేనేమీ మీ కుటుంబీకులు కూడా మంచి కుటుంబాల జాబితాలోనే ఉన్నారు. ఇందుకుగాను నీవు సంతోషించాలి అన్నది దీని భావం.

428–1. ఇలా విన్నవించుకున్న వ్యక్తి ఎవరో కాదు, స్వయంగా ఉసైద్ బిన్ హుజైర్ గారేనని హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ) పేర్కొన్నారు.

429–1. అంటే మీ సమకాలికుడైన రాజ్యాధికారిపై తిరుగుబాటు చేయకండి.

**430) అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా యహ్యా బిన్ సయీద్ విన్నారు- ఆయన అనస్ బిన్ మాలిక్(రజి) వెంట ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్ మాలిక్ వద్దకు వెళ్ళడానికి బయలుదేరారు. ఆ సందర్భంగా ఇలా అన్నారు : దైవప్రవక్త(స) అన్సార్లను పిలిపించారు. బహ్రయిన్ రాష్ట్రాన్ని అన్సార్లకు జాగీరుగా వ్రాసి ఇవ్వాలని సంకల్పించుకున్నారాయన. అప్పుడు అన్సార్లు, 'దైవప్రవక్తా! తమరు మా సహోదరులైన ముహాజిర్లకు కూడా ఇలాంటి జాగీరే ప్రదానం చేయనంతవరకూ మాకు ఇది సమ్మతం కాద'ని నిర్మొహమాటంగా చెప్పేశారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(స) ఇలా ఉపదేశించారు: "చూడండి, ఈ రోజు ఈ బహుమానాన్ని మీరు స్వీకరించటం లేదు. మరి అలాగైతే నా తదనంతరం కూడా ఇలాగే ఓర్పు వహించండి. నన్ను చేరుకునే వరకూ నిగ్రహం కోల్పోకూడదు. ఎందుకంటే నా తదనంతరం- త్వరలోనే- మీ హక్కులకు విఘాతం కలగబోతోంది."[1]**

## అధ్యాయం : 41

## "(దేవా!) అన్సార్లపై ముహాజిర్లపై దయజూపు' అని ప్రవక్త మహనీయులు (స) వేడుకోవటం

**431) మహనీయ అనస్(రజి) ఉల్లేఖించారు : (కందక యుద్ధ సందర్భంగా, కందకం త్రవ్వుతూ) ప్రవక్త మహనీయులు(స), "సిసలైన జీవితమైతే పరలోక జీవితమే. కనుక ఓ అల్లాహ్! అన్సార్లపై, ముహాజిర్లపై దయజూపు" అని వేడు కున్నారు- ఖతాదా ద్వారా అందిన రివాయత్‌లో "అన్సార్లను, ముహాజిర్లను మన్నించు" అని ఉంది.**

**432) హజ్రత్ అనస్(రజి) తెలిపారు : అన్సార్లు కందక యుద్ధ సందర్భంగా (కందకం త్రవ్వుతూ) 'మా బొందిలో ప్రాణమున్నంత వరకూ జిహాద్ చేస్తూ ఉంటా మని ముహమ్మద్(స) సమక్షంలో ప్రతిజ్ఞ చేసిన వారము మేము' అని కవితలు పాడు తుండగా ప్రవక్త మహనీయులు(స) విని, సమాధానంగా ఇలా పలికారు: "అల్లాహ్!**

---

430-1. అంటే అనర్హులు కొంతమంది పదవులను అలంకరిస్తారు. మీరు ఉపేక్షించబడ తారు. బనూ ఉమయ్యా కాలంలో జరిగింది అదే. ఆ విధంగా దైవప్రవక్త(స) భవిష్యవాణి అక్షరాలా నిజమయింది. అయితే అన్సార్లు మాత్రం ఎంతో సంయమనంతో వ్యవహరించి, దైవప్రవక్త(స) వసీయతుకు కట్టుబడ్డారు.

**పరలోక జీవితం తప్ప మరే జీవితమూ వాస్తవిక జీవితం కాదు. కనుక అన్సార్లపై, ముహాజిర్లపై దయజూపు".**

**433) హజ్రత్ సహ్ల్ (రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మా దగ్గరకు వచ్చిన సమయంలో మేము కందకం త్రవ్వటంలో నిమగ్నమై ఉన్నాము. మా భుజాలపై మట్టి ఎత్తుకుంటున్నాము. అది చూసి దైవప్రవక్త(స) ఇలా ప్రార్థించారు :"అల్లాహ్! పరలోక జీవితం తప్ప మరొక అసలైన జీవితం లేదు. కనుక అన్సార్లను, ముహాజిర్లను క్షమించు."[1]**

## అధ్యాయం : 42

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు." *(అల్ హష్ర్ : 9)***

**434) హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు: ఒక వ్యక్తి దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చాడు, అతను బాగా ఆకలితో ఉన్నాడు. ఆయన(స) తన భార్యలకు కబురంపారు. ఆ వ్యక్తికి భోజన ఏర్పాటు చేయమని. ఇంట్లో మంచినీళ్ళు తప్ప తినటానికి మరేమీ లేదని వారి నుండి సమాధానం వచ్చింది. అప్పుడు దైవ ప్రవక్త (స), "ఈ వ్యక్తికి ఆతిథ్యం ఇచ్చేవారెవరు?" అని సహచరులను అడగ్గా, 'నేనిస్తాను' అని ఒక అన్సారీ సహాబీ[1] చెప్పారు. ఆ సహాబీ ఆ వ్యక్తిని వెంటబెట్టుకుని తన ఇంటికి వెళ్లారు. 'దైవప్రవక్త అతిథికి మర్యాద చెయ్యి' అని భార్యను ఆదేశించారు. 'అయ్యో, ఇంట్లో పిల్లల అన్నం తప్ప మరొకటి లేదండి' అని ఆమె చెప్పింది. 'ఇంట్లో ఏముంటే అదే వడ్డించు. దీపం వెలిగించు, పిల్లలకు ఏదో ఒకటి చెప్పి పడుకోబెట్టు' అని భార్యకు సూచించారు ఆ సహాబి. భర్త సూచించినట్లే భోజనం వడ్డించి, దీపం వెలిగించింది ఆ ఇల్లాలు. ఏదో ఒక వంకతో పిల్లల్ని నిద్రపుచ్చింది. దీపాన్ని సరిచేస్తున్నట్లుగా నటించి, ఆర్పివేసింది. ఆ తరువాత ఆ భార్యాభర్తలిద్దరూ కూడా భోజనం**

433–1. కందక యుద్ధాన్ని అహ్జాబ్ యుద్ధమని కూడా అంటారు. అరేబియాలోని శత్రు కూటములన్నీ మదీనాపై దండెత్తి వచ్చినప్పుడు, మదీనా నగరంలోని కీలక ప్రాంతంలో కందకం త్రవ్వటం జరిగింది. శత్రువు బారి నుండి ఆత్మరక్షణ కోసం త్రవ్విన కందకం అది.

434–1. ఆ సహాబీ పేరు సాబిత్ బిన్ ఖైస్ లేదా అబ్దుల్లాహ్ బిన్ రవాహ లేదా అబూ తల్హా.

**చేస్తున్నట్లే నటించారు చీకట్లో.[2] కాని వారిద్దరూ (తమ పిల్లలతోపాటే) ఆ రాత్రి పస్తులుండిపోయారు. తెల్లవారాక ఆ సహాబీ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చినప్పుడు, "రాత్రి మీ దంపతులిద్దరూ చేసిన మంచి పనిపై అల్లాహ్ నవ్వేశాడు, ఆశ్చర్య పోయాడు"[3] అని చెప్పారు. ఆ తర్వాత అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: "వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వాస్తవానికి ఆత్మలోభత్వం నుండి రక్షింపబడినవారే సాఫల్యం పొందేవారు."[4] *(అల్ హష్ర్ : 9)***

## అధ్యాయం : 43

## ప్రవక్త మహనీయులు (స) ఈ విధంగా సెలవీయటం

"అన్సార్లలోని సజ్జనుల సేవలకు విలువ ఇవ్వండి. వారిలోని దుర్వర్తనులను క్షమించండి."

**435) అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని హిషామ్ బిన్ జైద్ తెలిపారు. అనస్(రజి) ఇలా చెప్పారు: హజ్రత్ అబూబక్ర్(రజి), హజ్రత్ అబ్బాస్ (రజి)లు ఇద్దరూ అన్సార్లు కూర్చుని ఉన్న ఒక సమావేశం వైపు నుండి సాగిపోతూ, అక్కడ కూర్చున్న వారంతా దుఃఖంతో విలపించటం గమనించారు. ఇంతకీ మీ దుఃఖానికి కారణం ఏమిటి? అని వారు అడిగితే, "ఇప్పుడే మేము దైవప్రవక్త(స) సమావేశాలను స్మరించుకున్నాము. ఆ సమావేశాలలో మేము కూర్చునేవారం (దైవప్రవక్త-స-మరణ వ్యాధికి గురై ఉన్నప్పటి సంఘటన ఇది)" అని వారు చెప్పారు. ఇది విని వారిద్దరూ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. అన్సార్ల పరిస్థితిని ప్రవక్తకు తెలియపరిచారు. అప్పుడు దైవప్రవక్త(స) బయటికి వచ్చారు. తలపై (తలనొప్పి కారణంగా) పట్టీ కట్టబడి ఉంది- ఉల్లేఖకుడు ఇలా అన్నారు: దైవ**

---

434-2. అంటే కంచంలో చేయి పెట్టి తాము కూడా భోజనం చేస్తున్నట్లే అభినయం చేశారు. మరోవైపు అతిథి మాత్రం కడుపు నిండా తిన్నాడు.

434-3. నవ్వటం, ఆశ్చర్యపోవటం- ఈ రెండు గుణాలు దేవునిలో ఉంటాయని హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

434-4. సుబ్‌హానల్లాహ్! ఆ దంపతుల సమయస్ఫూర్తికి జోహార్లు. మనం వేలు,లక్షలు దైవమార్గంలో ఖర్చుచేసినా ఆ భార్యాభర్తలు ఆ సమయంలో చేసిన త్యాగంతో సరితూగలేము.

ప్రవక్త(స) వేదికపైకి వచ్చారు. (ఆయన–స– వేదికను అలంకరించటం అదే చివరిసారి) ఆ తరువాత ఆయన ఆ వేదికను అలంకరించలేకపోయారు. ఆయన (స) దైవస్తోత్రం చేశారు. పిదప ఇలా అన్నారు: "నేను మీకు అన్సార్ల గురించి గట్టిగా తాకీదు చేస్తున్నాను. వారు నా ప్రాణం. వారు తమపై గల బాధ్యతలన్నింటినీ నెరవేర్చారు. కాని వారికి లభించవలసిన ప్రతిఫలం (స్వర్గం) లభించాల్సి ఉంది. కాబట్టి మీరు అన్సార్లలోని సజ్జనులను ఆదరించండి. వారిలోని దుర్వర్తనులను మన్నించండి."

**436)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ద్వారా తాను విన్నానని ఇక్రిమా తెలియజేశారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) బయటికి విచ్చేశారు. ఆయన(స) గారి రెండు భుజాలు దుప్పటితో కప్పబడి ఉన్నాయి. తలకు ఒక నల్లని పట్టీ (కట్టబడి) ఉంది. ఆయన(స) వేదికపై కూర్చుని అల్లాహ్‌ను స్తుతించారు. తరువాత ఇలా అన్నారు: "అమ్మాబాద్! ప్రజలారా! ఇతర జాతుల జనాభా పెరుగుతూ పోతుంది. కాని అన్సార్ల జనసంఖ్య తగ్గుముఖం పడుతుంది. చివరకు వారు అన్నంలో ఉప్పు మాదిరిగా అయిపోతారు.[1] కాబట్టి మీలో ఎవరయినా ఏదయినా విభాగానికి అధికారిగా నియుక్తులైనట్లయితే అతని ద్వారా లాభనష్టాలు చేకూరే అవకాశం ఉంటే, అతను అన్సార్లలోని మంచి వారిని ఆదరించాలి. వారిలోని దుర్వర్తనులను మన్నించాలి."

**437)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: "అన్సార్లు నా శరీరం, నా ప్రాణం వంటి వారు. ఒకానొక కాలం రానున్నది, అప్పుడు ఇతరుల సంఖ్య బాగా పెరిగి పోయి ఉంటుంది. కాని అన్సారులు మాత్రం తగ్గిపోయి ఉంటారు. కనుక వారిలోని మంచి వారిని ప్రోత్సహించాలి. చెడ్డవారిని మన్నించి వదలిపెట్టాలి."

## అధ్యాయం : 44

## మహనీయ సాద్ బిన్ ముఆజ్ (రజి) విశిష్టత[1]

**438)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) ఉల్లేఖనం : ప్రవక్త మహనీయుల

---

436–1. ప్రవక్త మహనీయుల(స) ఈ భవిష్యవాణి అక్షరాలా నిజమయింది. వివిధ తెగల వారు ఎల్లెడలా విస్తరించారు. కాని అన్సారులు బాగా తగ్గిపోయారు.

44–1. హజ్రత్ సాద్ బిన్ ఉబాదా ఖజ్రజ్ తెగకు సర్దారు అయినట్లే ఈయన ఔస్ తెగకు సర్దారు.

**(సఅసమ్) వద్దకు ఒక జత పట్టువస్త్రాలు కానుకగా వచ్చాయి. ప్రవక్త ప్రియ సహచరులు ఆ వస్త్రాన్ని ముట్టుకుని, అది సుతిమెత్తగా ఉండటంపై ఆశ్చర్యపోయారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు– "మీకు ఈ మెత్తదనంపై ఆశ్చర్యమేస్తుందా? సాద్ బిన్ముఆజ్ (రజి) రుమాళ్ళు (స్వర్గంలో) దీనికన్నా సుతిమెత్తగా, నాజూగ్గా ఉంటాయి"– ఈ హదీసును ఖతాదా, జుహ్రీలు కూడా ఉటంకించారు. వారు అనస్(రజి) ద్వారా దీనిని విన్నారు. ఆయనేమో దైవప్రవక్త(స) నుండి ఉల్లేఖించారు.**

**439) ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా నేను విన్నానని హజ్రత్ జాబిర్(రజి) తెలిపారు : ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "సాద్ బిన్ ముఆజ్(రజి) మరణంపై సింహాసనం (అర్ష్) కదిలింది"... వేరొక ఉల్లేఖనం ప్రకారం కూడా దైవప్రవక్త(స) ఇలాగే వక్కాణించారు. ఒక వ్యక్తి జాబిర్(రజి)తో, 'ముఆజ్(రజి) భౌతిక కాయం ఉంచబడిన మంచం కదిలింది' అని బరా బిన్ ఆజిబ్(రజి) వివరించారు కదా!' అని అడగ్గా, హజ్రత్ జాబిర్(రజి) ఇలా అన్నారు : ఆ రెండు తెగల (ఔస్– ఖజ్రజ్) మధ్య అజ్ఞాన కాలంలో శత్రుత్వం ఉండేది. "సాద్ బిన్ ముఆజ్ (రజి) మరణంపై కరుణామయుని సింహాసనం కదిలిపోయింది"[1] అని స్వయంగా దైవప్రవక్త(స) చెప్పగా నేను విన్నాను.**

**440) హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) కథనం : (బనీ కురైజా అనే) యూదు తెగవారు సాద్ బిన్ ముఆజ్(రజి)ను మధ్యవర్తిగా అంగీకరించి, యుద్ధ విరమణకు ఒప్పుకుని (కోట నుండి) దిగి వచ్చినప్పుడు సాద్‌ను పిలిపించడానికి మనుషుల్ని పంపటం జరిగింది. ఆయన(రజి) గాడిదపై స్వారీ అయి వచ్చారు.**

---

439–1. ఈ హదీసుపై వ్యాఖ్యాతల మధ్య ద్వంద్వాభిప్రాయం ఉంది. ఇస్లామ్‌కు పూర్వం మదీనాలో ఔస్– ఖజ్రజ్ తెగల మధ్య శత్రుత్వం ఉండేది. కాని ఇస్లామ్ తర్వాత ఈ శత్రుత్వం సమసిపోయింది. హజ్రత్ సాద్ (రజి) ఔస్ తెగకు నాయకులు. మొత్తానికి సాద్ బిన్ ముఆజ్(రజి) మరణం ముస్లిం సమాజానికి తీరని లోటు అన్న విషయంలో హదీసువేత్తల మధ్య ఏకాభిప్రాయం ఉంది.

**(యుద్ధ సమయంలో) దైవప్రవక్త(స) నమాజ్ కొరకు కేటాయించుకున్న ప్రార్థనా స్థలం[1] వద్దకు సాద్ రాగానే, "మీలోని అందరికన్నా శ్రేష్ఠుడైన వ్యక్తిని తీసుకోవడానికి (లేదా ఇలా అన్నారు) మీ నాయకుణ్ని తీసుకోవడానికి లేవండి"[2] అని దైవప్రవక్త (స) చెప్పారు. తరువాత ఆయన(స) ఇలా అన్నారు: "సాద్! వీళ్ళు మిమ్మల్ని మధ్యవర్తిగా అంగీకరించి, ఆయుధాలు పడవేశారు". దానికి సమాధానంగా సాద్ ఇలా అన్నారు: 'అలాగా! అయితే నా తీర్పు వినండి. వీరిలో ఎవరు యుద్ధం చేయ గలుగుతారో వారందరినీ చంపేయాలి. వీరి స్త్రీలను, పిల్లలను యుద్ధ ఖైదీలుగా చేసుకోవాలి". ఆ తీర్పు విని దైవప్రవక్త(స), 'మీరు అల్లాహ్ తీర్పు ప్రకారం నిర్ణయం గైకొన్నారు. లేదా దైవదూత ఆజ్ఞానుసారం తీర్పు చేశారు" అని ప్రశంసించారు.**

## అధ్యాయం : 45

## ఉసైద్ బిన్ హుజైర్ (రజి), అబ్బాద్ బిన్ బిష్ర్ (రజి)ల విశిష్టత[1]

**441) హజ్రత్ అనస్(రజి) కథనం : ఒకసారి రాత్రి చీకటిలో ఇద్దరు పురుషులు (ఉసైద్ బిన్ హుజైర్, అబ్బాద్ బిన్ బిష్ర్) దైవప్రవక్త(సఅసమ్) సమావేశం నుండి లేచి తమ ఇండ్లకు బయలుదేరారు. వారిద్దరి ముందు ఒక కాంతి ప్రసరించసాగింది. కొంతదూరం వెళ్ళి వారిద్దరూ ఒండొకరి నుండి వేరైనప్పుడు ఆ కాంతి కూడా రెండు భాగాలుగా విడిపోయింది.**

---

440–1. కొంతమంది దానిని మస్జిదె నబవీగా భావించారు. అది పొరపాటు. దైవప్రవక్త(స) ఆ కోట క్రింద నమాజ్ నిమిత్తం తాత్కాలికంగా ఒక స్థలాన్ని ప్రత్యేకించు కున్నారు.

440–2. పెద్దవాళ్ళు, మహనీయుల గౌరవార్థం లేచి నిలబడటం సమంజసమేనని ఈ హదీసు ద్వారా అవగతమవుతోందని కొందరు వ్యాఖ్యానించారు. కాని మరి కొందరేమన్నారంటే, ఇది గౌరవార్థం లేచి నిలబడటం కాదు. సాద్ బిన్ ముఆజ్ (రజి) ఆ సమయంలో గాయపడి ఉన్నారు. ఆయన తన వాహనం నుండి స్వయంగా దిగి వచ్చే స్థితిలో లేరు. ఈ కారణంగానే ఆయనకు సహాయపడటా నికి వెళ్ళండి అని దైవప్రవక్త(స) ఆదేశించారు.

45–1. వీరిద్దరూ అన్సార్ సహాబీలే. ఉసైద్ ఔస్ తెగకు చెందినవారు. అబ్బాద్ బిన్ బిష్ర్ ఖజ్రజ్ తెగవారు.

## అధ్యాయం : 46

## ముఆజ్ బిన్ జబల్ (రజి) గొప్పతనం[1]

**442) ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) ఉల్లేఖించారు. ప్రవక్త(స) ఇలా చెప్పారు : ఖుర్ఆన్‌ను నలుగురు (సహచరుల) నుండి నేర్చుకోండి- 1) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్, 2) అబూ హుజైఫా బానిసయగు సాలిమ్ 3) ఉబై బిన్ కాబ్ 4) ముఆజ్ బిన్ జబల్ (రజిఅల్లాహు అన్‌హుమ్)[1]**

## అధ్యాయం : 47

## సాద్ బిన్ ఉబాదా (రజి) గురించి....

**ఈయన గారు (ఇఫ్క్ సంఘటనకు) మునుపు సత్పురుషుడు అని హజ్రత్ ఆయిషా (ర.అ) అన్నారు.[1]**

**443) హజ్రత్ అబూ ఉసైద్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "అన్సార్లలోని అత్యుత్తమ కుటుంబీకులు బనూ నజ్జార్ కుటుంబీకులు. ఆ తర్వాత బనూ అబ్దె అష్‌హల్, ఆ తర్వాత బనూ హారిస్, ఆ తరువాత బనూ సాయిదా. ఇక మంచి విషయానికి వస్తే అది అన్సార్లలోని కుటుంబీకులందరిలో ఉంది." ఇది విని ఇస్లాం స్వీకరణలో ముందంజ వేసిన సాద్ బిన్ ఉబాదా(రజి) ఇలా అన్నారు: 'నా అభిప్రాయంలో దైవప్రవక్త(స) మాపైన ఇతరులకు ప్రాధాన్యం ఇచ్చారు'. అప్పుడు, '(అలా ఎందుకు అనుకుంటున్నారు?) దైవప్రవక్త(స) మీకూ అనేక తెగలపై ప్రాధాన్యం ఇచ్చారు కదా!' అని ఆయనతో అనటం జరిగింది.**

---

46-1. ఈయన ఖజ్రజ్ తెగవారు. గొప్ప విద్వాంసులు. సాత్వికులు. దైవప్రవక్త(స) కాలంలో అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి)తో ఈయనకు సోదర బంధం ఏర్పరచ బడింది.

442-1. దైవప్రవక్త(స) కాలంలో ఈ నలుగురు సహాబా ఖుర్ఆన్ విద్యలో నిపుణులుగా ప్రసిద్ధి చెందారు. శాస్త్రోక్తంగా ఖుర్ఆన్ పారాయణం చేసేవారు. అందుకే దైవ ప్రవక్త(స) ఈ నలుగురిని ఖుర్ఆన్ అధ్యాపకులుగా ఖరారు చేశారు. ఇది ఎంత గొప్ప పురస్కారమో విశ్వాసులే తెలుసుకోగలరు.

47-1. హజ్రత్ ఆయిషా(ర.అ)పై 'అపనింద' మోపబడినప్పుడు అన్సార్ల మధ్య (సాద్ బిన్ ఉబాదాకి-ఉసైద్ బిన్ హుజైర్‌కి మధ్య) జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని అమ్మ ఆయిషా(ర.అ) ఆ విధంగా అని ఉంటారు.

## అధ్యాయం : 48

## ఉబై బిన్ కాబ్ (రజి) గురించి[1]

**444)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) గారి సమావేశంలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ప్రస్తావన వచ్చినప్పుడు ఆయన ఇలా అన్నారు : దైవప్రవక్త(స) చెప్పిన నాటినుంచే నా హృదయంలో ఆయన గారి పట్ల ప్రేమాదరణలు చోటు చేసుకున్నాయి. దైవప్రవక్త(స) ఇలా చెప్పారు: నలుగురు వ్యక్తుల నుండి ఖుర్ఆన్ నేర్చుకోండి- 1) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) నుండి - దైవప్రవక్త ఈయన పేరుతోనే మొదలెట్టారు- 2) అబూ హుజైఫా బానిస సాలిమ్(రజి) నుండి 3) ముఆజ్ బిన్ జబల్(రజి) నుండి 4) ఉబై బిన్ కాబ్(రజి) నుండి."

**445)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ఒకసారి ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉబై బిన్ కాబ్(రజి)తో, "నీకు **లమ్ యకునిల్లజీన కఫరూ...** సూరా వినిపించాలని అల్లాహ్ నాకు ఆజ్ఞాపించాడు" అని చెప్పారు. ఇది విని హజ్రత్ ఉబై బిన్ కాబ్(రజి), 'ఏమిటి, అల్లాహ్ నా పేరు పెట్టి మరీ ఇలా సెలవిచ్చాడా!?' అని ఆశ్చర్యంతో అడగ్గా, "అవును" అని దైవప్రవక్త(స) చెప్పారు. అప్పుడు ఉబై బిన్ కాబ్(రజి) ఏడ్చేశారు.[1]

## అధ్యాయం : 49

## హజ్రత్ జైద్ బిన్ సాబిత్(రజి) విశిష్టత

**446)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) నుండి ఖతాదా ఉటంకించిన దాని ప్రకారం ప్రవక్త మహనీయుల (సఅసమ్) కాలంలో నలుగురు ప్రియ సహచరులు

---

48-1. ఈయన ఖజ్రజ్ తెగకు చెందిన అన్సార్ సహాబి. బైఅతె అఖబాలో పాల్గొన్నారు. బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. విద్వాంసులు. హిజ్రీ 30వ సంవత్సరంలో మరణించారు. హజ్రత్ ఉమర్(రజి) ఈయన్ని **'సయ్యిదుల్ ముస్లిమీన్'** అని అనేవారు.

445-1. ఆనందంతో, ఉద్వేగంతో వచ్చిన ఏడుపు అది. రాజాధిరాజు, విశ్వసామ్రాట్టు అయిన అల్లాహ్ స్వయంగా తన సందేశహరునితో ఒక సామాన్య దాసుని పేరు పెట్టి చెప్పటం సాధారణ విషయం కాదు కదా! ఈ అనుగ్రహ భాగ్యానికి కృతజ్ఞతలు తెలుపుకునేదెలా!? అన్న అనుభూతి ఉబై బిన్ కాబ్‌కు కలిగి ఉంటుంది.

**ఖుర్ఆన్‌ను సేకరించి (క్రోడీకరించి) భద్రపరిచేవారు. వారు నలుగురూ అన్సార్ సహాబీలే. వారు 1) ఉబై బిన్ కాబ్ 2) ముఆజ్ బిన్ జబల్ 3) అబూ జైద్ 4) జైద్ బిన్ సాబిత్- రజిఅల్లాహు అన్హుమ్. 'ఈ అబూ జైద్ ఎవరు?' అని నేను (ఖతాదా) అడగ్గా, 'ఆయన నా పినతండ్రి' అని అనస్(రజి) చెప్పారు.[1]**

## అధ్యాయం : 50

## హజ్రత్ అబూ తల్హా(రజి) గొప్పతనం[1]

**447) హజ్రత్ అనస్(రజి) కథనం : ఉహుద్ యుద్ధ సందర్భంగా ప్రవక్త సహచరులు దైవప్రవక్త(స) దగ్గరి నుండి అటూ ఇటూ చెల్లాచెదురయిన సమయంలో అబూ తల్హా (రజి) తన డాలుతో దైవప్రవక్త(స)ను రక్షిస్తూ నిలబడ్డారు. హజ్రత్ అబూతల్హా (రజి) విలువిద్యలో నిపుణులు. చాలా వేగంగా బాణం ప్రయోగించేవారు. ఆ రోజు ఆయన చేతిలో రెండో మూడో ధనుస్సులు విరిగిపోయాయి. ఆ సమయంలో ఎవరయినా ఒక ముస్లిం తన అంబుల పొదితో సహా అటువైపు నుంచి వెళుతుంటే, "నీ బాణాలను అబూ తల్హా ముందు పడవెయ్యి" అని దైవ ప్రవక్త(స) అనేవారు. యుద్ధరంగంలో పరిస్థితుల స్వరూపాన్ని వీక్షించేందుకు దైవ ప్రవక్త(స) తల ఎత్తినప్పుడు, 'యా రసూలల్లాహ్! నా తల్లిదండ్రులు మీకు అర్పితం. దయచేసి తలెత్తి చూడకండి. ఎటువైపు నుండి అయినా బాణం వచ్చి మీకు గుచ్చుకునే ప్రమాదం ఉంది' అని చెప్పేవారు. నా ఛాతీ దైవప్రవక్త(స) ఛాతీకి డాలుగా మారింది. నేను ఆయిషా బిన్తె అబీబక్ర్‌ను, ఉమ్మె సులైమ్(అబూ తల్హా భార్య)ను చూశాను. వారిద్దరూ తమ ఇజారును పైకెత్తి (యోధుల) సేవలో నిమగ్నులయ్యారు. వారు వడివడిగా నీళ్ళ తిత్తుల్లో నీరు తెచ్చి ముస్లిం యోధులకు నీరు త్రాపసాగారు. మళ్ళీ తిరిగి వెళ్ళి మళ్ళీ నీరు తెచ్చి క్షతగాత్రుల దాహం తీర్చేవారు. ఆ రోజు అబూ తల్హా (రజి) నుండి రెండు లేక మూడు సార్లు ఖడ్గాలు చేజారి క్రిందపడ్డాయి.[1]**

---

446-1. హజ్రత్ జైద్ బిన్ సాబిత్(రజి) 'కాతిబె వహీ'గా సుప్రసిద్ధులు. అంటే దైవప్రవక్త (స)పై అవతరించిన దైవవాణిని ఆయన గ్రంథస్థం చేసేవారు. ఆయనకు లభించిన ఈ గౌరవం సాధారణమయింది కాదు.

50-1. అన్సార్ సహాబి. అసలు పేరు జైద్ బిన్ సహ్ల్ బిన్ అస్వద్(రజి). ఖజ్రజ్ తెగకు చెందినవారు. హజ్రత్ అనస్(రజి) తల్లి ఉమ్మె సులైమ్‌ను వివాహమాడారు. హిజ్రీ 30లో మరణించారు.

## అధ్యాయం : 51
## అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) విశిష్టత[1]

**448) ఆమిర్ బిన్ సాద్ బిన్ అబీ వక్కాస్‌తో ఆయన తండ్రి సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) చెప్పారు: నేలపై నడయాడే ఫలానా వ్యక్తి స్వర్గవాసి అని ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా నేను వినలేదు. కాని అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) విషయంలో మాత్రం ఆయన(స), "అతను స్వర్గవాసి" అని అన్నారు. "ఇస్రాయీల్ సంతతికి చెందిన ఒక సాక్షి ఇలాంటి సాక్ష్యాన్ని కూడా ఇచ్చి..." (అల్ అహ్‌ఖాఫ్: 10) అనే ఆయత్ ఈయన గురించే అవతరించింది. – ఆయత్ అవతరణ సంగతిని మాలిక్ తన తరఫున చెప్పారా లేక అది హదీసులో ఉందా! అన్నది తనకు తెలియదని అబ్దుల్లాహ్ బిన్ యూసుఫ్ చెప్పారు.**

**449) ఖైస్ బిన్ ఉబాద్ తెలిపారు : నేను మస్జిదె నబవీలో కూర్చుని ఉండగా ఒక పెద్ద మనిషి మస్జిద్‌లోనికి వచ్చారు. ఆయన ముఖారవిందంపై అణకువ, భయభక్తుల చిహ్నాలు ఉట్టి పడుతున్నాయి. 'ఈ పెద్దాయన స్వర్గవాసి' అని జనులు చెప్పారు. ఆ పెద్దాయన రెండు రకతుల నమాజ్‌ని క్లుప్తంగా చేసుకుని బయటికి వెళ్ళిపోయారు. నేను కూడా ఆయన వెనుకే నడిచాను. 'అయ్యా! మీరు మస్జిద్‌లో ప్రవేశించగానే ఈయన గారు స్వర్గవాసి అని జనులు చెప్పుకున్నారు (ఏమిటి విశేషం?)' అని అడిగాను. దానికి ఆయన, "దైవసాక్షి! ఒకరి గురించి తనకు తెలియనప్పుడు ఈ విధంగా అనటం సమంజసం కాదు. ఎందుకంటారా, నేను మీకు చెబుతాను.**

---

447–1. హజ్రత్ అబూ తల్హా (రజి) సుప్రసిద్ధ అన్సార్ సహాబి. గొప్ప యోధుడు. ఉహుద్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(స)కు రక్షా కవచంగా నిలిచిన ఇద్దరు ముగ్గురు వీరులలో ఈయన ఒకరు. ఆ రోజు దైవప్రవక్త(స) సేవకునిగా ఆయన చేసిన వీరోచిత పోరాటం ప్రళయ దినం వరకూ చిరస్మరణీయంగా ఉండిపోతుంది. అలాగే ఉహుద్ యుద్ధ సందర్భంగా హజ్రత్ ఆయిషా, ఉమ్మె సులైమ్ క్షతగాత్రులకు చేసిన సేవలు కూడా సదా గుర్తుండిపోతాయి.

51–1. పూర్వాశ్రమంలో యూదు మతస్థులు. బనూ ఖైనుఖా తెగకు చెందినవారు. గొప్ప విద్వాంసులు. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) సంతతికి చెందినవారు. ఇస్లాంకు పూర్వం ఈయన పేరు హుసైన్. ఇస్లాం స్వీకరించిన మీదట దైవ ప్రవక్త(స) ఈయనకు అబ్దుల్లాహ్ అనే పేరు పెట్టారు. హిజ్రీ 43లో మరణించారు.

**దైవప్రవక్త(స) జీవిత కాలంలో నేను ఒక కల గన్నాను. ఆ కల గురించి దైవప్రవక్త (స)కు చెప్పాను. కలలో నేను ఏం చూశానంటే, నేనొక ఉద్యాన వనంలో ఉన్నాను– తరువాత ఆయన ఆ ఉద్యానవనం వైశాల్యం గురించి, దాని పచ్చదనం గురించి ప్రస్తావించారు– ఆ ఉద్యానవనం మధ్యలో ఒక ఇనుప స్తంభం ఉంది. దాని అడుగు భాగం నేలలో పాతుకుని ఉంది, పైభాగం ఆకాశాన్నంటుకుంటోంది. దాని శిఖరాగ్రాన ఒక దట్టమైన వృక్షం ఉంది. 'దానిపైకి ఎక్కు' అని నాతో అనబడింది. నాలో అంతటి శక్తి లేదని అన్నాను. అంతలో ఒక సేవకుడు వచ్చి, వెనుక నుండి నా వస్త్రం ఎత్తి పట్టుకున్నాడు, అప్పుడు నేను ఆ స్తంభం పైకెక్కి, దట్టమైన ఆ వృక్షాన్ని పట్టుకున్నాను. వృక్షాన్ని బాగా గట్టిగా పట్టుకో అని నాతో అనబడింది. దానిని నేను పట్టుకుని ఉండగానే మెలకువ వచ్చేసింది– ఈ కల గురించి నేను దైవప్రవక్త(స)తో చెప్పినప్పుడు, "నీవు చూసిన ఆ వృక్షం ఇస్లామ్. అందులో ఉన్న ఆ స్తంభం ఇస్లామ్ స్తంభం. దట్టమైన వృక్షం 'ఉర్వతుల్ వస్‌ఖా'. అందువల్ల నీవు మరణం వచ్చేవరకూ ఇస్లామ్ ధర్మంపై స్థిరంగా ఉంటావు" అని ఆయన(స) వివరించారు. ఆ మహనీయుడు అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి)[1]**

**450) సయీద్ బిన్ అబీ బుర్దాతో ఆయన తండ్రి (ఆమిర్ బిన్ అబీ మూసా) ఇలా చెప్పారు: నేను మదీనా నగరానికి వెళ్ళినప్పుడు, అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి)ను కలుసుకోవటం జరిగింది. ఆయన "రండి, నేను మీకు సత్తు అంబలి, ఖర్జూరపండ్లు తినిపిస్తాను. మీరిప్పుడు శుభప్రదమైన నివాసంలోనికి వచ్చేశారు" అని అన్నారు. ఆ తరువాత ఆయన ఇలా ఉపదేశించారు : "చూడండి! వడ్డీ లావాదేవీలు యథేచ్ఛగా సాగే దేశం (ఇరాక్)లో మీరు నివసిస్తున్నారు. జాగ్రత్త! మీకు రుణపడివున్న వ్యక్తి మీకు ఒక గడ్డి పరక ఇచ్చినా, గోధుమ గింజ ఇచ్చినా, లేదా ఒక గడ్డిపరకకు సమానమైనది ఇచ్చినా దానిని స్వీకరించకండి. ఎందుకంటే అది కూడా వడ్డీయే"– నజర్, అబూదావూద్, వహబ్‌లు (తమ ఉల్లేఖనాలలో) 'నివాసం' ప్రస్తావన తీసుకురాలేదు.**

---

449–1. అసలు విషయం ఏమిటో మహనీయ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) హెచ్చు తగ్గులు లేకుండా వివరించారు. జీవితాంతం ఆయన ఇస్లామ్‌పై నిలకడగా ఉంటారని దైవప్రవక్త(స) ఆ కల భావార్థం చెప్పారంతే. దాని ఆధారంగా తాను స్వర్గవాసి అని జనులు ఖచ్చితంగా ప్రకటించటం భావ్యం కాదన్నది ఆయన ఉద్దేశం.

## అధ్యాయం : 52

## హజ్రత్ ఖదీజా(ర.అ)తో దైవప్రవక్త(స) వివాహం. ఆమె[1] విశిష్టత

**451)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అలీ(రజి) ఉల్లేఖించారు: (తన కాలంలో) హజ్రత్ మర్యమ్– అలైహస్సలాం– అందరికన్నా ఉత్తమురాలైన మహిళ. కాగా, (ఈ సముదాయంలో) హజ్రత్ ఖదీజా(ర.అ) అందరికన్నా ఉత్తమురాలు."

**452)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: నాకు హజ్రత్ ఖదీజా (ర.అ)పై కలిగినంత ఈర్ష్య (రష్క్) దైవప్రవక్త(స) గారి మరే భార్యపైనా కలిగేది కాదు. వాస్తవానికి ఆమె నా వివాహానికి ముందే మరణించారు. కాని దైవప్రవక్త(స) తరచూ ఆమెను మెచ్చుకుంటూ మాట్లాడేవారు. ఆమెకు స్వర్గంలో ముత్యాలతో నిర్మించబడిన మేడ లభిస్తుందన్న శుభవార్తను వినిపించమని అల్లాహ్ తన సందేశ హరునికి ఆజ్ఞాపించాడు. దైవప్రవక్త(స) ఎప్పుడయినా మేకను జిబహ్ చేస్తే, ఆమెతో కలసిమెలసి ఉండే మహిళలకు కూడా చాలినంత మాంసం పంపించేవారు.

**453)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: నేను హజ్రత్ ఖదీజా(ర.అ) విషయంలో చెందినంత ఈర్ష్య(రష్క్) మరే మహిళ వ్యవహారంలోనూ చెందలేదు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు(స) తరచూ ఆమెను ప్రస్తుతిస్తూ ఉండేవారు. ఆమె ఇంకా ఇలా అన్నారు : ఆమె మరణించిన మూడు సంవత్సరాల తర్వాత నా వివాహం దైవప్రవక్త(స)తో జరిగింది. అల్లాహ్ ఆయన(స)కు ఆజ్ఞాపించాడు లేదా

---

52–1. ఖదీజా బిన్తె ఖువైలిద్(రజిఅల్లాహు అన్హా).. దైవప్రవక్త(స)తో ఈమె వివాహం జరిగే నాటికి, ఈమె 40 ఏళ్ళ వితంతువు. వివాహం తరువాత మరో 25 ఏండ్లు జీవించారు. దైవప్రవక్త(స)తో ఆమె దాంపత్య జీవితం అన్యోన్యమైనది. మహా ప్రవక్త(స) నిజమైన సహధర్మచారిణిగా, సలహాదారుగా నిరూపించుకున్నారు. కష్టకాలంలో తోడూ నీడగా వెన్నంటి ఉన్నారు. దైవప్రవక్త(స)కు ఈమె ద్వారా సంతాన భాగ్యం ప్రాప్తించింది. హిజ్రత్‌కు నాలుగేళ్ళ క్రితం 65 ఏండ్ల వయసులో చనిపోయారు. ఆమె వియోగంపై దైవప్రవక్త(స) ఎంతో దుఃఖావేదనకు లోనయ్యారు. ఆ సంవత్సరాన్ని శోక సంవత్సరంగా పాటించారు. ఆమెలోని మంచితనాన్ని దైవప్రవక్త(స) జీవితాంతం తలచుకునేవారు. ఎప్పుడయినా ఆమె స్నేహితురాండ్రు మదీనా వస్తే వారికి మర్యాద చేసి పంపేవారు.

జిబ్రీల్ (అలైహిస్సలామ్) ద్వారా సందేశం పంపించాడు– స్వర్గంలో ఆమెకు ముత్యాల మేడ లభిస్తుందన్న శుభవార్తను వినిపించమని.

**454)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర.అ) ఇలా వివరించారు : దైవ ప్రవక్త (సఅసమ్) సతీమణులలో నాకు హజ్రత్ ఖదీజా (ర.అ)పై కలిగినంత ఈర్ష్య మరెవరిపైనా కలిగేది కాదు. మరి వాస్తవానికి నేను ఆమెను చూడనయినా లేదు. కాని దైవప్రవక్త(స) తరచూ ఆమెను గురించి ప్రస్తావిస్తూ ఉండేవారు. ఎప్పుడయినా మేకను జిబహ్ చేస్తే, మాంసాన్ని ముక్కలుగా చేసి ఖదీజా(ర.అ) స్నేహితురాళ్ళకు పంపించేవారు. 'ఈ లోకంలో ఖదీజా(ర.అ) తప్ప మరే మహిళా లేనట్లే మాట్లాడతారేమిటి?' అని నేను దైవప్రవక్త(స)తో అంటే, "ఆమె మాటే వేరు. ఆమె ద్వారా నాకు సంతాన భాగ్యం ప్రాప్తమయింది" అని ఆయన(స) బదులిచ్చేవారు.[1]

**455)** ఇస్మాయీల్ బిన్ అబీ ఖాలిద్ ఇలా అన్నారు : 'దైవప్రవక్త(సఅసమ్) హజ్రత్ ఖదీజా (ర.అ)కు శుభవార్త వినిపించారా?' అని నేను హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా(రజి)ను అడగ్గా, "అవును. స్వర్గంలో ఒక ముత్యాల మేడ లభిస్తుందని, అక్కడ ఎలాంటి గలాటా, అలసట వంటివి ఉండవని ఆమెకు శుభవార్త వినిపించారు" అని ఆయన చెప్పారు.

**456)** హజ్రత్ అబూ హురైరా(రజి) వివరించారు : దైవదూత జిబ్రీల్(అ) దైవప్రవక్త(సఅసమ్) దగ్గరకు వచ్చి, "దైవప్రవక్తా! ఖదీజా(ర.అ) ఒక పాత్రను తీసుకుని మీ దగ్గరకు రాబోతున్నారు. అందులో కూర ఉంది లేదా (ఇలా అన్నారు) తినే త్రాగే పదార్థం ఉంది. ఆమె మీ దగ్గరకు వచ్చినప్పుడు, ఆమె ప్రభువు తరఫున ఆమెకు సలామ్ చెప్పండి, నా తరఫున కూడా. ఆమె కోసం స్వర్గంలో ఒక ముత్యాల మేడ ఉందన్న శుభవార్త కూడా వినిపించండి. అందులో ఎలాంటి గలాటా గానీ, బాధ గానీ, అలసట గానీ ఉండదు" అని తెలియజేశారు.

---

454–1. దీనినిబట్టి దైవప్రవక్త(స) దృష్టిలో ఖదీజా(ర.అ) స్థానం ఎటువంటిదో ఊహించవచ్చు. యథార్థానికి ఆమె ఇస్లామ్‌ను స్వీకరించిన తొలి మహిళ. ఇస్లామ్ ప్రవక్త(స)కు తోడుగా నిలిచి, ఆమె చేసిన ఉపకారాలకు ప్రతిఫలం అల్లాహ్ మాత్రమే వొసగగలడు– రజిఅల్లాహ్ అన్హా వ రజూ అన్హా.

**హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : హజ్రత్ ఖదీజా(ర.అ) సోదరి హాలా బిన్తె ఖువైలిద్ ఒకసారి వచ్చి, లోనికి వచ్చేందుకు దైవప్రవక్త(స)ను అనుమతి కోరారు. అప్పుడు ఆయన(స)కు ఖదీజా అనుమతి కోరే విధానం జ్ఞాపకం వచ్చి, ఉలిక్కి పడ్డారు. "అల్లాహ్! ఈమె హాలా కదూ!" అని పలికారు. ఆ మాటపై నాకు ఈర్ష్య కలిగింది. 'ఏమిటి, మీరు ఇప్పటికీ పళ్ళూడిపోయి, కేవలం పెదవులపై ఎరుపుదనం మాత్రమే మిగిలిన ఆ వృద్ధురాలిని తలచుకుంటున్నారా? ఆమె చనిపోయి చాలా కాలం అయింది కదా! అల్లాహ్ ఆమెకన్నా మంచి భార్యను ఇచ్చి ఉండగా (ఆమెనే ఎందుకింతగా తలచుకుంటున్నారు?)' అని అన్నాను.[1]**

## అధ్యాయం : 53

## జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ(రజి) గురించి

**457) జరీర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తెలిపారు : నేను ఇస్లామ్ స్వీకరించినప్పటి నుండీ దైవప్రవక్త(సఅసమ్) నన్ను తన నివాస గృహంలో రావటానికి అడ్డుకోలేదు (అంటే అనుమతి కోరినప్పుడల్లా లోనికి ఆహ్వానించారు). నన్ను చూసినప్పుడల్లా ఆయన(స) చిరుమందహాసం చేసేవారు.**

**హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలియజేశారని ఖైస్ ఉటంకించారు. ఇస్లామ్‌కు పూర్వం– అజ్ఞాన కాలంలో– 'జుల్ ఖలసా' అనే ఒక విగ్రహాలయం ఉండేది. దానిని 'కాబతుల్ యమానీయ' లేదా 'కాబతుల్ షామియ'[1] అని కూడా అనేవారు. ఒకసారి దైవప్రవక్త(స) నాతో, "జుల్ ఖలసా ఉనికి వల్ల నాకు బాధ**

---

456–1. ముస్నద్ అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పిన ఈ మాట విని దైవప్రవక్త(స) ఆగ్రహం చెందారు. కోపంతో ఆయన(స) ముఖారవిందం కందిపోయింది. అప్పుడు హజ్రత్ ఆయిషా(ర.అ) నిలబడి దైవసన్నిధిలో క్షమాపణ కోరుకున్నారు. ఆనాటి నుంచీ ఎన్నడూ దైవప్రవక్త(స) ముందు ఆ విధంగా మాట్లాడలేదు.

457–1. ఇక్కడ ఉల్లేఖకుని ద్వారా పొరపాటు జరిగిందని కొందరు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే 'కాబతుల్ షామియ' అన్నది మక్కాలో ఉన్నదే. ఇకపోతే 'కాబతుల్ యమానీ'; అది యమన్ ప్రదేశంలో ఉండేది. మక్కాలోని పవిత్ర కాబా గృహానికున్న వైభవాన్ని తగ్గించడానికి యమన్‌లోని అవిశ్వాసులు ఒక విగ్రహాలయాన్ని నిర్మించి, దానికి కాబతుల్ యమానియ అనే పేరు పెట్టారు.

**కలుగుతోంది. నీవు నాకు ఆ బాధ నుండి ఉపశమనం కలిగించగలవా?" అని అడిగారు. అప్పుడు నేను అహ్మస్ తెగకు చెందిన 150 మంది అశ్వారూఢులను తీసుకుని బయలుదేరాను. మేము ఆ విగ్రహాలయాన్ని నేలమట్టం చేసి, అందులో ఉన్నవారిని హతమార్చాము. తరువాత మేము ఆయన (స) సన్నిధికి వచ్చి, జరిగిన దంతా వివరించి చెప్పాము. అప్పుడు ఆయన(స) మా కోసం, అహ్మస్ తెగవారి కోసం ప్రార్థించారు.**

## అధ్యాయం : 54

## హుజైఫా బిన్ యమాన్(రజి) గురించి....

**458) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : ఉహుద్ సంగ్రామంలో బహుదైవా రాధకులు ఓటమి పాలైనప్పుడు, ఇబ్లీస్ (మోసబుద్ధితో) కేకలు వేస్తూ, 'దైవదాసు లారా! ముందు మీ వెనుక ఉన్నవారి సంగతి చూడండి!' అని అన్నాడు. అందువల్ల ముస్లింలు తమ వెనుక ఉన్నవారిపై విరుచుకుపడ్డారు. అప్పుడు హుజైఫా(రజి) చూస్తే, ఆయన తండ్రి (యమాన్- రజి) కూడా వెనుక ఉన్న వారిలో కనిపించారు. అప్పుడు హుజైఫా, "అయ్యో! దైవదాసులారా! ఆయన నా తండ్రి. ఆయన్ని వదలండి" అని అరిచారు. ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : 'దైవసాక్షి! ఆయన్ని కడతేర్చే వరకూ ముస్లింలు అక్కడి నుండి కదల్లేదు." హుజైఫా అనితర సాధ్యమైన ఓరిమిని ప్రదర్శిస్తూ, "అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక!" అని మాత్రం అన్నారు. (హిషామ్ ఇలా అన్నారు) "దైవసాక్షిగా! హుజైఫా తరచూ ఈ వేడుకోలు వచనం పలుకుతూ ఉండేవారు" (అంటే పొరపాటున తన తండ్రిని వధించిన ముస్లింలను క్షమించమని అల్లాహ్‌ను వేడుకునేవారు). మరణించేవరకూ ఆయన ఈ విధంగా దుఆ చేస్తుండేవారు.[1]**

## అధ్యాయం : 55

## హింద్ బిన్తె ఉతబా బిన్ రబీయ (రజి) గురించి

**హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పినట్లుగా ఉర్వా బిన్ జుబైర్ తెలిపారు : (మక్కా**

458-1. దీనినిబట్టి ఆయన సహనం, సంయమనంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు. అపార్థం వల్ల మనిషి ఎదుటివారికి తీరని నష్టం కలిగిస్తాడు. అందుకే వదంతుల్ని నమ్మరాదని, ఏదైనా సమాచారం అందినప్పుడు దాని నిజానిజాలను పరిశీలించి నిజనిర్ధారణకు రావాలని అనబడింది.

**విజయం తరువాత) ఉతబా పుత్రిక యగు హింద్ దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! లోగడ ఈ ప్రపంచంలో మీ శిబిరంలోనివారు (మీ అనుచరులు) పరాభవం పాలైనప్పుడు నాకు కలిగినంత సంతోషం వేరితర శిబిరాల వారి పరాభవంపై కలిగేది కాదు. కాని ఈ రోజు (వ్యవహారం తలక్రిందులైంది) మీ శిబిరంలోని వారి గౌరవాదరణలపై కలిగినంత సంతోషం వేరితరుల గౌరవాదరణ లపై నాకు కలగటం లేదు' అని చెప్పింది. తరువాత ఆమె ఈ విధంగా విన్నవించు కున్నది: 'దైవప్రవక్తా! (నా భర్త) అబూ సుఫ్యాన్ మరీ పిసినిగొట్టు మనిషి. నేను గనక అతని అనుమతి లేకుండా నా పిల్లల అన్నపానీయాల కోసం అతని ధనం నుండి కొంత తీసుకుంటే పాపమా?' దానికి ఆయన (స), "ప్రఖ్యాత (మారూఫ్) పద్ధతిననుసరించి తీసుకుంటే, అది పాపం కాదు"[1] అని చెప్పారు.**

## అధ్యాయం : 56

## హజ్రత్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్[1] వృత్తాంతం

**459) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : ప్రవక్త మహ నీయులు(సఅసమ్) జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్(రజి)ను 'బల్దాహ్' పల్లపు ప్రాంతంలో కలుసుకోవటం జరిగింది. 'వహీ' అవతరణకు పూర్వం జరిగిన సంఘటన ఇది. ఆ**

---

55–1. ఈ హింద్ ఎవరో కాదు, అబూ సుఫ్యాన్ భార్య. ముఆవియా మాతృశ్రీ. మక్కా విజయం సందర్భంగా తన భర్త అబూ సుఫ్యాన్ ఇస్లామ్ స్వీకరించిన మీదట ఈమె కూడా ఇస్లామ్ స్వీకరించి, దైవప్రవక్త(స) సమక్షంలో విధేయతా ప్రమాణం చేసింది. అంతకుముందు ఇస్లామ్, ముస్లిములకు బద్ధ విరోధిగా ఉండేది. ఉహుద్ సంగ్రామంలో హజ్రత్ హమ్జా (రజి) మృతదేహాన్ని 'ముస్‌లా' చేసి, ఆయన పచ్చి కాలేయాన్ని కసి తీరా నమలిన చరిత్ర ఆమెది. కాని ఇస్లాం స్వీకరించిన తరువాత, ఆమె ధర్మ సందేహాలను దైవప్రవక్త(స) ఓపికతో తీర్చటం గమనార్హ విషయం.

56–1. ఈ మహనీయ సహాబీ ఇస్లామ్‌కు పూర్వమే ఏకేశ్వరోపాసకుడు. అష్రె ముబష్షిరాలో ఒకరైన సయీద్ బిన్ జైద్ తండ్రి. వరుసకు హజ్రత్ ఉమర్(రజి) పినతండ్రి కుమారుడు అవుతారు. మహాప్రవక్త ముహమ్మద్(స)కు దైవదౌత్యం అందక పూర్వమే ఈయన చనిపోయారు.

సందర్భంగా దైవప్రవక్త(స) ముందు భోజనం వడ్డించబడింది. ఆ భోజనం తినడానికి జైద్ నిరాకరించారు. భోజనం వడ్డించిన వారితో జైద్ ఇలా అన్నారు: 'మీ విగ్రహాల పేర మీరు జిబహ్ చేసిన జంతువుల మాంసాన్ని నేను తినను. అల్లాహ్ పేరు మీద జిబహ్ చేసిన పశువుల మాంసం మాత్రమే నేను తింటాను'– జైద్ బిన్ అమ్ర్ ఖురైషులు జిబహ్ చేసిన దానిపై అభ్యంతరం తెలుపుతూ ఈ విధంగా అనేవారు : మేకను పుట్టించినవాడు అల్లాహ్. ఆయనే దాని కోసం ఆకాశం నుండి వర్షం కురిపిస్తాడు. మరి ఆయనే దాని కొరకు నేల నుండి మొక్కల్ని మొలకెత్తిస్తాడు. మరలాంటప్పుడు మీరు అల్లాహ్ పేరు మీద కాకుండా ఇతరుల (విగ్రహాల) పేరు మీద దానిని కోస్తారా?– ఖురైషుల ఈ చేష్టలపై తీవ్రంగా అభ్యంతరం తెలుపుతూ జైద్ ఇలా పలికేవారు. వారి ఈ పనిని ఘోరమైన తప్పిదంగా ఖరారు చేసేవారు.

ఇబ్నె ఉమర్(రజి) కథనం ప్రకారం జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్ సత్యాన్వేషణలో మక్కా నుండి సిరియా దేశానికి వెళ్ళారు. అక్కడ ఆయన ఒక యూదు విద్వాంసుణ్ణి కలుసుకున్నారు. ఆయన అతనితో, 'నాకు నీ ధర్మం (దీన్) గురించి తెలుపు. బహుశా నేను కూడా దానిని అవలంబించగలనేమో!' అన్నారు. దానికి అతను, 'నీవు గనక మా ధర్మాన్ని అవలంబించావంటే దైవాగ్రహంలోని ఒక భాగం నీ వాటాలోనికి వస్తుంది (అంటే నీవు దైవశిక్షకు గురి అవుతావు)' అని నిర్ద్వంద్వంగా చెప్పేశాడు. 'అయ్యో! నేను ఇక్కడకు వచ్చినది దైవాగ్రహానికి భయపడే కదా! దేవుని శిక్షా భారాన్ని మోయగలిగే శక్తి నాకు లేదు. కాబట్టి మరేదైనా ధర్మం (దీన్) ఉంటే నాకు చెప్పు' అని జైద్ కోరారు. దానికి అతను, 'అది నాకు తెలీదు! కాని నీవు 'దీనె హనీఫ్'వి అన్నాడు. 'దీనె హనీఫ్' అంటే ఏమిటి?' అని జైద్ ప్రశ్నించగా, 'అది ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) అవలంబించిన మతధర్మం. ఆయన యూదుడు గానీ, క్రైస్తవుడుగానీ కారు. ఏకాగ్రచిత్తంతో నిజ ఆరాధ్య దైవం వైపునకు మరలిన ఏకేశ్వరోపాసకుడు ఆయన' అని అతను చెప్పాడు.

తరువాత జైద్ అక్కడి నుండి బయలుదేరి ఒక క్రైస్తవ మతాచార్యుణ్ణి కలుసుకున్నారు. అతను కూడా ఇంచుమించు అలాగే సంభాషించాడు. 'నీవు గనక మా మతధర్మంలోకి ప్రవేశించావంటే దేవుని ధూత్కారంలోని ఒక భాగం నీ వాటా క్రిందికి వస్తుంది' అన్నాడు. అది విని జైద్, 'అయ్యో! నేను దేవుని ధూత్కారం నుండి

**పారిపోవాలనుకుంటున్నాను. నేను దేవుని ధూత్కారాన్ని గానీ, ఆగ్రహాన్ని గానీ ఎత్తుకోలేను. ఆ శక్తి నాలో లేదు. సరే, మరేదయినా నిజధర్మం ఉంటే నాకు తెలుప గలవా?' అని అడిగారు. దానికి ఆ క్రైస్తవ సన్యాసి, 'అదేదో నాకు తెలీదు. ఒకవేళ నిజధర్మం ఏదయినా కాగలదంటే అది 'దీనె హనీఫ్ మాత్రం కాగలదు' అన్నాడు. 'ఇంతకీ దీనె హనీఫ్ అంటే ఏమిటి?' అని జైద్ అడగ్గా, 'అది ఇబ్రాహీమ్ అవలం బించిన ధర్మం (దీన్). ఆయన యూదుడు గానీ, క్రైస్తవుడు గానీ కారు. ఆయన ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే పూజించేవారు' అని ఆ సన్యాసి వివరించాడు. మహనీయ జైద్ హజ్రత్ ఇబ్రాహీమ్(అ) గురించి యూదుల ద్వారా, క్రైస్తవుల ద్వారా విన్న మీదట అక్కడి నుండి తిరుగు ప్రయాణమయ్యారు. రెండు చేతుల్ని (ఆకాశం వైపు) ఎత్తి, 'యా అల్లాహ్! నేను ఇబ్రాహీమ్(అ) జీవన విధానంపై స్థిరంగా ఉన్నా నని సాక్ష్యమిస్తున్నాను' అని పలికారు.**

**... హజ్రత్ అస్మా బిన్తె అబీబక్ర్(ర.అ) ఇలా వివరించారు: నేను జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్‌ను చూశాను. ఆయన పవిత్ర కాబా గృహానికి తన ఉదరాన్ని ఆనించి నిలబడి ఉన్నారు. ఆయన ఈ విధంగా అంటున్నారు– 'ఓ ఖురైషు ప్రజ లారా! దైవసాక్షి! నేను తప్ప మీలో ఏ ఒక్కరూ ఇబ్రాహీమ్ జీవన విధానంపై లేరు'– జైద్ ఆడపిల్లల్ని సజీవంగా పాతిపెట్టేవారు కారు. కన్న కూతుర్ని చంపడానికి సిద్ధంగా ఉన్నవారిని చూసి, 'ఆ పాపను చంపకు. (నాకు ఇచ్చేయ్) నేను పోషిస్తాను' అనేవారు. ఆ విధంగా ఆయన ఆ చిన్నారిని పెంచి పెద్దదాన్ని చేసేవారు. ఆ తర్వాత ఆమె తండ్రితో, 'ఇదిగో నీ కూతురు, నీ అమానతు. తీసుకో. వద్దనుకుంటే చెప్పు, 'నేనే ఆమె (వివాహ) బాధ్యతల్ని నెరవేరుస్తాను'[1] అనేవారు.**

---

459–1. బజ్జార్, తిబ్రానీలలోని ఉల్లేఖనం ప్రకారం, జైద్ మరియు వరఖా– ఇద్దరూ సత్య ధర్మ అన్వేషణలో సిరియా వెళ్ళారు. అక్కడ వరఖా క్రైస్తవ మతం పుచ్చు కున్నాడు. జైద్‌కు మాత్రం ఆ మతం నచ్చలేదు. తరువాత ఆయన మౌసల్‌కు వచ్చి ఒక క్రైస్తవ సన్యాసిని కలుసుకున్నారు. అతను కూడా క్రైస్తవ మతం గురించి ఉపదేశించాడు. కాని జైద్ అంగీకరించలేదు. అదే ఉల్లేఖనంలో ఈ విధంగా కూడా ఉంది: హజ్రత్ సయీద్ బిన్ జైద్, హజ్రత్ ఉమర్‌లిద్దరూ, జైద్ గురించి దైవప్రవక్త(స)ను అడగ్గా, ఆయన ఇలా చెప్పారు : "అల్లాహ్ అతన్ని క్షమించాడు. అతన్ని కరుణించాడు. అతను ఇబ్రాహీమ్(అ) జీవన ధర్మంపై మరణించాడు".

## అధ్యాయం : 57

## ఖురైషులు కాబా గృహానికి మరమ్మతు చేయటం గురించి

**460) హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) వివరించారు: కాబా గృహ నిర్మాణ (మరమ్మతు) పనులు జరుగుతున్నప్పుడు దైవప్రవక్త(స), హజ్రత్ అబ్బాస్ (రజి) రాళ్ళు మోస్తూ ఉన్నారు. అప్పుడు హజ్రత్ అబ్బాస్ దైవప్రవక్త(స)కు "నీ లుంగీని భుజాలపై వేసుకో. ఇలా చేయటం వల్ల నీ మెడ ఒడుసుకుపోకుండా ఉంటుంది" అని సూచించారు. ఆయన (స) అలా చేయగానే (స్పృహ తప్పి) నేల మీద పడిపోయారు. కనుగుడ్లు మాత్రం ఆకాశం వైపు చూస్తుండిపోయాయి. స్పృహ లోకి రాగానే ఆయన తన పినతండ్రితో "నా లుంగీ ఇవ్వండి" అన్నారు. అప్పుడు అబ్బాస్ ఆయన(స) లుంగీని నడుముకు గట్టిగా బిగించి కట్టారు.**

**461) ఉబైదుల్లాహ్ బిన్ అబీ జైద్ వివరించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాలంలో కాబా గృహం చుట్టూ ప్రహరీ గోడ ఉండేది కాదు. జనులు**

---

పై హదీసులో మక్కా బహు దైవారాధకుల 'జబీహ' ప్రస్తావన వచ్చింది. కాబా గృహానికి చుట్టూ ప్రతిష్టించబడిన విగ్రహాల పేరు మీద వారు పశువులను కోసేవారు.

ఆమిర్ బిన్ రబీయా నుండి ఫాకహీ సంగ్రహించిన ఉల్లేఖనం ఇలా ఉంది : జైద్ నాతో ఇలా అన్నారు– "నేను నా జాతి వారి విధానానికి విరుద్ధంగా ఇస్మాయీల్ (అ), ఇబ్రాహీమ్(అ)ల జీవన విధానాన్ని అనుసరించాను. ఇస్మాయీల్ సంతతిలో ప్రభవించనున్న 'ఆ ప్రవక్త' కొరకు నేను నిరీక్షిస్తున్నాను. కాని నేను అప్పటివరకూ జీవించి ఉంటానన్న నమ్మకం లేదు. అయితే నేను ఆయన్ని విశ్వసిస్తున్నాను, ఆయన సత్యవంతుడైన ప్రవక్త అని ధ్రువపరుస్తున్నాను. ఆ మేరకు సాక్ష్యం కూడా ఇస్తున్నాను. ఒకవేళ నీవు అప్పటివరకూ బ్రతికి ఉంటే, ఆ ప్రవక్తను నీవు కలుసుకుంటే, ఆయనకు నా సలామ్ చెప్పు."

ఆమిర్(రజి) ఇలా అన్నారు : నేను ముస్లింగా ధర్మపరివర్తన చెందిన తరువాత దైవప్రవక్త(స)కు ఆయన సలామ్ చేరవేశాను. దానికి సమాధానంగా ఆయన, "వ అలైహిస్సలామ్. నేను అతన్ని స్వర్గంలో దుస్తులు ఈడ్చుకుంటూ సాగుతుండగా చూశాను" అన్నారు. అరేబియాలో ఆడబిడ్డలను సజీవంగా పాతిపెట్టే దురాచారానికి వ్యతిరేకంగా జైద్ కూడా ఉద్యమించారు.

**కాబా చుట్టూ నమాజ్ చేసేవారు. హ(జత్ ఉమర్(రజి) తన పరిపాలనా కాలంలో పవిత్ర కాబా గృహం చుట్టూ (ప్రహరీ గోడ కట్టారు. ఆ గోడ పొట్టిగా ఉండేదని ఉబైదుల్లాహ్ చెప్పారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఆ గోడ ఎత్తును పెంచారు.**[1]

## అధ్యాయం : 58

## అజ్ఞాన కాలం గురించి[1]

**462) విశ్వాసుల మాత హ(జత్ ఆయిషా(ర.అ) వివరించారు : అజ్ఞాన కాలంలో ఖురైషులు ఆషూరా (ముహ(ర్రమ్ నెల 10వ రోజు) ఉపవాసం పాటించే వారు. ప్రవక్త మహనీయులు(సఅసమ్) కూడా దానిని మిగిల్చి ఉంచారు. ఆయన (స) మదీనాకు ఏతెంచినప్పుడు, తాను స్వయంగా ఆ రోజు ఉపవాసం పాటించటమే గాకుండా, తన సహచర మాన్యులకు కూడా ఆ రోజు ఉపవాసం పాటించమని ఆజ్ఞాపించారు. కాని హి(జీ 2వ సంవత్సరంలో రమజాన్ ఉపవాసాలు విధిగా నిర్ణయించబడిన తరువాత ఆయన(స) ఇలా అన్నారు : "ఇక మీదట తాము కోరిన వారు ఆషూరా ఉపవాసం పాటించవచ్చు, కోరిన వారు పాటించకపోవచ్చు."**

**463) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు: అజ్ఞాన కాలంలో జనులు హజ్జ్ మాసాలలో ఉమ్రా చేయటం చాలా పెద్ద పాపమని తలపోసేవారు. వారు ముహ(ర్రమ్ నెలను సఫర్ అనేవారు. ఒంటె వీపుపై ఉన్న గాయం మాని, హజ్జ్ యాత్రికుల పాదచిహ్నాలు(దారిలో) చెరిగిపోయిన తరువాత గాని ఉమ్రా**

---

461–1. హాఫిజ్ ఇబ్నె హజర్ ప్రకారం కాబా గృహం ఇప్పటివరకూ పదిసార్లు నిర్మించ బడింది. మొట్టమొదట ఈ గృహాన్ని దైవదూతలు నిర్మించారు. ఆ తరువాత ఆదమ్ (అలైహిస్సలామ్) నిర్మించారు. పిదప ఆయన సంతతి వారు నిర్మించారు. ఆ తరువాత మహనీయ ఇబ్రాహీమ్(అ), ఆపైన అమాలిఖా, ఆ తరువాత జుర్హుమ్ తెగవారు, ఆ తరువాత ఖుసై బిన్ కిలాబ్, ఆ తరువాత ఖురైషులు, ఆ తరువాత అబ్దుల్లాహ్ బిన్ జుబైర్, ఆ తరువాత హజ్జాజ్ బిన్ యూసుఫ్. ఇప్పటివరకు హజ్జాజ్ బిన్ యూసుఫ్ వేసిన పునాదులపైనే ఆ కట్టడం నిలబడి ఉంది. అయితే దానిని విస్తృతపరచటంలో సవూదీ ప్రభుత్వం చేసిన కృషి శ్లాఘించదగినది.

58–1. అంటే దైవప్రవక్త(స) జననానికి పూర్వం ఉన్న కాలం, ముహమ్మద్(స)కు దైవ దౌత్యం లభించే వరకు గల కాలాన్ని కూడా అజ్ఞాన కాలంగానే వ్యవహరిస్తారు.

చేసేవారి ఉమ్రా స్వీకారయోగ్యం కాజాలదన్న నమ్మకం వారిలో ఉండేది. ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(స) తన సహచరులతోపాటు జిల్‌హజ్జా 4వ తేదీన హజ్జ్ నిమిత్తం ఇహ్రామ్ దీక్షబూని మక్కాకు వచ్చినప్పుడు, "మీ హజ్జ్‌ను ఉమ్రాగా చేసుకోండి" అని సహాబాకు ఆదేశించారు. (అంటే తవాఫ్, సయీని చేసి మీ ఇహ్రామ్ దీక్షను విరమించండి అన్నారు). దానికి సహచర మాన్యులు, 'దైవప్రవక్తా! ఈ ఉమ్రాకి- హజ్జ్‌కి మధ్య ఏ ఏ వస్తువులు హలాల్ అవుతాయి?' అని విన్నవించుకోగా, "అన్ని వస్తువులు!" అన్నారు. అంటే ఇహ్రామ్ దీక్షబూనక పూర్వం ఏవేవి ధర్మసమ్మతంగా ఉండేవో అవన్నీ ధర్మసమ్మతం (హలాల్) అవుతాయి అన్నారు.

**464)** సయీద్ బిన్ ముసయ్యిబ్ తన తండ్రి నుండి ఇలా ఉటంకించారు: అజ్ఞాన కాలంలో (ఇస్లామ్‌కు పూర్వం) ఒకసారి మక్కాలో వరద వచ్చింది. దాంతో మక్కా ఇరువైపుల ఉన్న పర్వతాల మధ్య ప్రాంతమంతా జలమయం అయింది- ఈ హదీసు వెనుక చాలా పెద్ద కథ ఉందని అమ్ర్ బిన్ దీనార్ చెప్పేవారు.

**465)** ఖైస్ బిన్ అబీ హాజిమ్ కథనం: అబూబక్ర్(రజి) అహ్మస్ తెగకు చెందిన ఒక స్త్రీని కలుసుకున్నారు. ఆమె పేరు జైనబ్ బిన్తె ముహాజిర్. ఆమె మాట్లాడ కుండా మౌనంగా ఉండిపోవటాన్ని ఆయన గమనించి, "ఏమిటి సంగతి? ఈవిడ ఎందుకు మాట్లాడటం లేదు?" అని అడిగారు. 'ఈమె హజ్జ్ సందర్భంగా ఆద్యంతం నిశ్శబ్దంగా ఉంటూ హజ్జ్ చేయాలని మొక్కుకుంది?' అని అక్కడి జనులు చెప్పారు. అప్పుడు అబూబక్ర్ ఆమెతో, "మాట్లాడు. ఈ విధంగా హజ్జ్ చేయటం అజ్ఞాన కాలపు ఆచారం" అని చెప్పారు. అప్పుడామె మౌనం వీడి మాట్లాడసాగింది- 'ఇంతకీ మీరెవరు?' అని అడిగింది. దానికి అబూబక్ర్, "నేను ముహాజిర్లలోని ఒక మనిషిని" అన్నారు. 'ముహాజిర్లలోని ఏ తెగకు చెందినవారు?' అని ఆమె ప్రశ్నించగా, "ఖురైష్ తెగకు చెందినవాణ్ణి" అని ఆయన బదులిచ్చారు. 'ఖురైషులలో ఏ కుటుంబీకులు?' అని ఆమె ప్రశ్నించగా, "నీవు అధిక ప్రశ్నలు వేసే దానవు. నేను అబూబక్ర్‌ను" అని ఆయన చెప్పారు. 'అజ్ఞాన కాలం తరువాత అల్లాహ్ మాకు ఈ సత్యధర్మాన్ని ప్రసాదించాడు. మరయితే దీనిపై (ముస్లిములమైన) మనం ఎప్పటివరకు నిలకడగా ఉండగలము?' అని తిరిగి ప్రశ్నించగా, "మీ నాయకులు (ఇమామ్) సక్రమంగా ఉన్నంత కాలం నీవు నీ ధర్మంపై స్థిరంగా ఉండగలవు"

**అని ఆయన వివరించారు. 'నాయకులు అంటే ఎవరు?' అని ఆ స్త్రీ ప్రశ్నించగా, "ఏమిటీ, నీ జాతి వారిలో పెద్దవారు, సౌజన్యశీలురు లేరా? వారు ప్రజలకు దేని గురించైనా ఆజ్ఞాపించినప్పుడు వారికి మీరు విధేయత చూపటం లేదా?" అని ఆయన అడిగారు. దానికి ఆమె 'ఎందుకు లేరు? ఉన్నారు అని చెప్పింది. "నాయ కులు (ఇమామ్) అంటే వారే"[1] అని అబూబక్ర్(రజి) ఆమెను సమాధానపరిచారు.**

**466) హ్రజత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ఒక అరబ్బు వ్యక్తికి చెందిన బానిసరాలైన ఒక నల్లని స్త్రీ ఇస్లామ్ స్వీకరించింది. మస్జిద్ ఆవరణలోనే ఆమె పాక ఉండేది. ఆవిడ మా ఇంటికి వచ్చి, మాటామంతీ జరిపేది. మాట్లాడటం అయ్యాక ఆమె ఈ కవిత చెప్పేది (దాని సారాంశం ఇది). "వడ్డాణం (సంఘటన జరిగిన) దినం కూడా మా ప్రభువు అద్భుతాలలోనిదే. ఆయనే తన కృపతో నన్ను అవిశ్వా సుల పురము నుండి విడిపించాడు". ఆమె పలుమార్లు ఈ కవిత వినిపించడంతో హ్రజత్ ఆయిషా(ర.అ), "ఇంతకీ ఆ వడ్డాణం సంగతి ఏమిటి?" అని ఆ స్త్రీని అడిగారు. దానికి సమాధానంగా ఆ స్త్రీ ఇలా వివరించింది: 'నా యజమానుల కుటుంబీకురాలైన ఒక యువతి (కొత్త పెళ్ళికూతురు) ఎర్రని చర్మపు వడ్డాణం నడుముకు కట్టుకుంది. అయితే ఆమె బయటికి వచ్చినప్పుడు యాదృచ్ఛికంగా అది క్రింద పడిపోయింది. ఒక గ్రద్ద దృష్టి దానిపై పడింది. అది మాంసం అనుకుని ఆ గ్రద్ద దానిని తన్నుకుపోయింది. అక్కడి జనులు నాపై దొంగతనపు నింద మోపారు. నన్ను హింసించటం మొదలెట్టారు. కడకు వారు నా మానాన్ని కూడా**

---

465–1. ఇస్మాయీలీ రివాయతు ప్రకారం ఆ మహిళ ఇలా అంది: అజ్ఞాన కాలంలో మాకూ– మా జాతి వారికీ మధ్య ఒక కలహం ఉండేది. అల్లాహ్ గనక నన్ను ఆ కలహం నుండి కాపాడితే, హజ్జ్ చేసేవరకూ ఎవరితోనూ మాట్లాడనని మొక్కుకున్నాను. దానికి అబూబక్ర్, "ఇస్లామ్ ఇలాంటి వాటిని తుడిచి పెట్టేస్తుంది. కాబట్టి నీవు మాట్లాడు" అని ఆమెతో అన్నారు. ఈ విధమైన తప్పుడు ప్రమాణాలు భగ్నపరచటం అభిలషణీయం అని అబూబక్ర్(రజి) పలుకుల ద్వారా స్పష్టమవుతోందని హాఫిజ్ ఇబ్నె హజర్ అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, కాలినడకన వెళ్ళి హజ్జ్ చేస్తానని మొక్కుకున్న ఒక వ్యక్తిని చూసి, "నీవు నీ ఒంటెపైన స్వారీ అవ్వు" అని దైవప్రవక్త(స) ఆదేశించి, అతని మొక్కుబడిని భగ్నం చేయించారు.

**వెతికారు. వారంతా నన్ను నలువైపుల నుంచీ చుట్టుముట్టి ఉండగానే- నేను ఆపదలో చిక్కుకుని ఉండగానే- ఆ గ్రద్ద వచ్చి, మా తలలపై ఎగరసాగింది. తరువాత అది ఆ వడ్డాణాన్ని క్రింద పడవేసింది. జనులు దానిని ఎత్తుకోగానే, 'దీని కోసమేనా మీరంతా నన్ను నిందించింది? ఇప్పుడయినా తెలిసిందా, నేను నిర్దోషినని' అన్నాను.**

**467) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహా ప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ఉద్బోధించారు : "ఎవరయినా ఒట్టేసుకోవాలనే అనుకుంటే అల్లాహ్ తప్ప మరొకరిపైన ఒట్టేసుకోకండి". ఖురైషులు తమ తాతల తండ్రులపై ఒట్టేసుకునేవారు. అందువల్లనే ఆయన(స), "మీ తాతల తండ్రుల మీద ఒట్టేసుకోకండి" అని చెప్పారు.**

**468) అబ్దుర్రహ్మాన్ బిన్ ఖాసిమ్ వివరించారు : (తన తండ్రి) ఖాసిమ్ బిన్ ముహమ్మద్ శవయాత్ర సందర్భంగా శవపేటికకు ముందు ముందు నడిచేవారు. శవపేటికను చూసి లేచి నిలబడేవారు కారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఆధారంగా ఆయన ఇలా అన్నారు : అజ్ఞాన కాలంలో శవయాత్రను చూసి లేచి నిలబడేవారు. వారిలా అనేవారు : "ఓ చనిపోయినవాడా! ఏ విధంగానయితే నీవు నీ జీవితంలో నీ ఇంటివారల పట్ల ఉండేవాడివో అదేవిధంగా ఏదయినా ఒక పక్షి ఆకారంలో ఉంటావు."[1]**

**469) ఉర్వా బిన్ మైమూన్ కథనం ప్రకారం హజ్రత్ ఉమర్(రజి) ఇలా తెలిపారు: 'సబీర్' పర్వతంపై సూర్యకిరణాలు పడనంత వరకూ ఖురైషులు (హజ్జ్‌లో) ముజ్‌దలిఫా నుండి (మినాకు) బయలుదేరే వారు కారు. దైవప్రవక్త(సఅసం) బహు**

468-1. అంటే అజ్ఞాన కాలం నాటి ప్రజలకు నరకంపై నమ్మకం ఉండేది కాదు. మనిషి మరణించగానే ఏదైనా పక్షిలో అతని ఆత్మ ప్రవేశిస్తుందనీ, ఒకవేళ మనిషి మంచివాడైనట్లయితే పావురం వంటి పక్షి రూపు ధరిస్తాడని, అతడు చెడ్డవాడై ఉంటే గుడ్లగూబ, కాకి లాంటి పక్షుల ఆకారంలో ఉంటాడని భావించేవారు. మరికొంతమంది "నీవు నీ కుటుంబీకులలో మంచివాడుగా ఉండేవాడివి. ఇప్పుడు ఏ జన్మలో ఉన్నావో చెప్పు" అని అనువదించారు. మరికొందరు, "నీవు నీ ఇంటివారలలో ఉండేవాడవు. కాని మళ్ళీ నీవు వారి మధ్యన ఉండలేవు. అంటే నీకు పునరుత్థానం లేదు" అనేవారు. ఇది బహుదైవారాధకుల నమ్మకం. ఎందుకంటే ఈ జీవితమే అసలు జీవితమని, పరలోకం లేదని వారు నమ్మేవారు.

**దైవారాధకుల ఈ పోకడకు విరుద్ధంగా సూర్యోదయం అవకముందే అక్కడి నుండి పయనమయ్యేవారు.**

**470) ఇక్రిమా (సూరయె నబాలోని ఆయత్) 'వ కాసన్ దిహాఖా' గురించి చెబుతూ అవి పూర్తిగా నిండి పొలికే మద్యం పాత్రలనీ, అవి నిరంతరం ఇవ్వ బడుతూ ఉంటాయనీ అన్నారు.**

**మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: నేను మా నాన్న గారు (హజ్రత్ అబ్బాస్) చెప్పగా విన్నాను– ఆయన ఇలా అనేవారు: "అజ్ఞాన కాలంలో ఇస్ఖినా కాసన్ దిహాఖా అనే పదం వాడుకలో ఉండేది. అంటే మాకు పూర్తిగా నిండిన మధుపాత్రలు ఇవ్వండి అని అర్థం."**

**471) హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహ నీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: "కవులు చెప్పే మాటల్లో అన్నిటికన్నా సత్యబద్ధమైనది లబీద్ చెప్పిన ఈ చరణం–**

**"అల్లాహ్ తప్ప ప్రతిదీ నాశనమయ్యేదే".**

**ఇక ఉమయ్యా బిన్ అబీ సల్త్ విషయానికి వస్తే అతను ముస్లింగా పరివర్తన చెందడానికి చేరువలో ఉండేవాడు."[1]**

**472) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : హజ్రత్ అబూ బక్ర్ (రజి) దగ్గర ఒక బానిస ఉండేవాడు. అతను తన రోజువారీ సంపాదనను తెచ్చి అబూబక్ర్‌కి ఇచ్చేవాడు. అబూబక్ర్(రజి) దానిని తన నిత్యావసరాలకై వాడు**

---

471–1. సహీహ్ ముస్లిమ్‌లో సరీద్‌చే ఇలా ఉల్లేఖించబడింది : "నాకు ఉమయ్యా బిన్ సల్త్ కవితలు వినిపించు" అని దైవప్రవక్త(స) కోరినప్పుడు, నేను ఆయన(స)కు దాదాపు వంద చరణాలు వినిపించాను. అవి విని, "అరె, ఇతను తన కవితల ప్రకారం ముస్లిమ్‌గా మారడానికి చాలా దగ్గరయ్యాడు" అని ప్రవక్త(స) చెప్పారు. ఉమయ్యా అజ్ఞాన కాలంలో దైవారాధన చేసేవాడు. పరలోక చింతన కలిగి ఉండేవాడు. మరికొంతమంది ప్రకారం అతను క్రైస్తవ మతం పుచ్చుకున్నాడు.

ఇక లబీద్ గురించి చెప్పాలంటే అతను అజ్ఞాన కాలంలో గొప్ప కవి. ఇస్లామ్ స్వీకరించిన తరువాత కవిత్వం చెప్పటం మానేశాడు. అదేమంటే, ఖుర్ఆన్ తర్వాత కూడా కవిత్వమా!? అనేవాడు.

**కునేవారు. ఒకరోజు ఆ బానిస ఏదో తినే వస్తువును తెచ్చాడు. అబూబక్ర్ కూడా దానిని తిన్నారు. అప్పుడా బానిస, 'ఇది ఎటువంటి సంపాదనో మీకు తెలుసా?' అని అన్నాడు. "ఎందుకు? ఎటువంటి సంపాదన?" అని ఆయన రెట్టించారు. దానికి అతను ఇలా విన్నవించుకున్నాడు: 'అజ్ఞాన కాలంలో నేను ఒక వ్యక్తికి జోస్యం చెప్పాను. వాస్తవానికి నాకు జ్యోతిష్యం గురించి ఏమీ తెలీదు. నేనతన్ని మోస గించాను. యాదృచ్ఛికంగా అతను నాకు కనిపించి, ఆ జోస్యానికి ప్రతిఫలంగా ఈ వస్తువు ఇచ్చాడు. ఇప్పుడు మీరు తిన్న వస్తువు అదే'. ఈ మాట వినగానే అబూబక్ర్(రజి) తన నోట్లో చెయ్యివేసి కడుపులోనిదంతా కక్కేశారు.**

**473) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: అజ్ఞాన కాలం నాటి ప్రజలు 'హబలిల్ హబలా' వరకు మూల్యం చెల్లించే వాగ్దానంపై ఒంటె మాంసాన్ని అరువుగా కొనుగోలు చేసేవారు. హబలిల్ హబలా అంటే ఏమిటో వివరిస్తూ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ ఇలా అన్నారు: ఒంటె ఈనిన మీదట, ఆ ఒంటె పిల్ల పెద్దదై సూడిదైనప్పుడు– మూల్యం ఇస్తామని అనటం.[1] దైవప్రవక్త(స) ఇలాంటి క్రయ విక్రయాలను నిషిద్ధంగా ఖరారు చేశారు.**

**474) గైలాన్ బిన్ జరీర్ కథనం : మేము అనస్ బిన్ మాలిక్(రజి) దగ్గరకు వెళుతూ ఉండేవారము. ఆయన మాకు అన్సార్ల గురించి చెబుతూ మీ జాతి వారు ఫలానా సందర్భంలో ఫలానా ఘనకార్యం సాధించారు. ఫలానా సందర్భంలో ఫలానా పని చేశారని అనేవారు.[1]**

---

473–1. దీని వివరణ ఇంతకుముందు 'కితాబుల్ బుయూ'లో వచ్చింది.

474–1. పైన పేర్కొనబడిన ఉల్లేఖనాలన్నింటిలో ఏదో ఒక కోణం నుంచి అజ్ఞాన కాలపు స్థితిగతులు ప్రస్తావనకు వచ్చాయి. అందుకే ఇమామ్ బుఖారీ అజ్ఞాన కాలానికి సంబంధించిన హదీసులన్నింటినీ ఇక్కడ పొందుపరిచారు. ఈ స్థితిగతులు చాలావరకు ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, నైతిక వ్యవహారాలకు సంబంధించినవి. వీటిలో మంచీ చెడు పరిస్థితులన్నీ ప్రస్తావనకు వస్తాయి. ఇస్లామ్ అజ్ఞాన కాలపు మంచి విషయాలను తీసుకుని, చెడు విషయాలను రూపు మాపింది. ఎందుకంటే వారిలోని మంచి విషయాలన్నీ మహనీయ ఇబ్రాహీమ్, మహనీయ ఇస్మాయీల్‌ల సంప్రదాయంతో ముడివడి ఉండేవి. అందుకే ఇస్లామ్ వాటిని మిగిల్చి ఉంచింది.

## అధ్యాయం : 59

## అజ్ఞాన కాలపు ప్రమాణ స్థలి గురించి[1]

**475)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : అజ్ఞాన కాలంలో అన్నిటి కన్నా మొదటి 'ఖసామా' సంఘటన మా బనీ హాషిమ్ తెగవారిలోనే సంభవించింది. బనూ హాషిమ్‌కు చెందిన ఒక వ్యక్తి– అమ్ర్ బిన్ అల్ఖమా–ని ఖురైషుల మరో కుటుంబానికి చెందిన వ్యక్తి సేవకునిగా పెట్టుకున్నాడు. ఈ హాషిమీ సేవకుడు తన యజమానితో కలసి ఒంటెలు తోలుకుని సిరియా వైపు ప్రయాణమయ్యాడు. దారిలో ఆ సేవకునికి మరో వ్యక్తి ఎవరో తారసపడ్డాడు. అతని మూట త్రాడు తెగిపోయింది. అతను ఆ సేవకునితో, 'నీవు ఒంటెల్ని కట్టే ఒక త్రాడును దయచేసి నాకు ఇవ్వు. నేను నా సామాను కట్టుకుంటాను. త్రాడు లేకపోతే నా సామాను క్రిందపడిపోతుంది' అని అభ్యర్థించాడు. ఆ సేవకుడు అతనికి ఒక త్రాడు ఇచ్చేశాడు. దాంతో ఆ వ్యక్తి తన మూటా ముల్లె కట్టుకుని వెళ్ళిపోయాడు. తరువాత ఆ సేవకుడు, అతని యజమాని– ఇద్దరూ ఒక చోట విడిది చేసినప్పుడు, ఒంటెలన్నింటినీ కట్టివేశారు. కాని ఒక్క ఒంటెకు త్రాడు తక్కువ పడింది. 'ఒంటెలన్నీ కట్టివేయబడ్డాయి. కాని ఈ ఒక్క ఒంటెను ఎందుకు కట్టలేదు?' అని యజమాని తన హాష్మీ సేవకుణ్ణి నిలదీసి అడిగాడు. 'దాని త్రాడు లేద'ని సేవకుడు సమాధానమిచ్చాడు. 'లేకుండా ఎక్కడికి పోతుంది? ఇంతకీ ఏం చేశావ్?' అంటూ యజమాని కోపోద్రిక్తుడై అతనిపై కర్ర విసిరాడు. దాంతో అతను మృత్యువాతన పడ్డాడు. (అతని చావుకు ముందు) ఆ ప్రాంతం నుండి ఒక యమనీ వ్యక్తి వెళుతుండడం గమనించి, 'నీవు ఏటేటా హజ్జ్ చేయడానికి మక్కా వెళుతుంటావా?' అని హాష్మీ నౌకరు అడిగాడు. 'ఇప్పుడైతే ఆ ఉద్దేశం లేదుగాని నేను హజ్జ్‌కు వెళుతుంటాను' అని యమనీ వ్యక్తి బదులిచ్చాడు.

---

59–1. ఏదైనా ఒక జనావాసంలో లేదా ప్రదేశంలో అనేకమంది చంపబడ్డారు. కాని హంతకుని ఆచూకీ తెలియలేదు. అట్టి పరిస్థితిలో ఆ బస్తీకి చెందిన యాభై మందిని ఎంపిక చేసి, ఆ దారుణ మారణ హోమంతో తమకెట్టి సంబంధం లేదని వారిచేత ప్రమాణం చేయించుకునేవారు. దీనినే వారు 'ఖసామత్'గా వ్యవహరించేవారు. మక్కాలో ఇస్లామ్‌కు పూర్వం కూడా ఈ విధానం ఉండేది. దానిని ఇస్లామ్ మిగిల్చి ఉంచింది. ఈ ప్రమాణ స్వీకారం కాబా ప్రాంగణంలో జరిగేది.

'నీవు ఎప్పుడు మక్కా నగరానికి వెళ్ళినా దయచేసి నా సందేశం ఒక దాన్ని చేరవేయ గలవా?' అని అడిగాడు. 'చేరవేస్తాను' అని అతను చెప్పాడు. అప్పుడు ఆ నౌకరు ఇలా అన్నాడు: 'నీవు ఎప్పుడు హజ్జ్ చేయడానికి వెళ్ళినా, ఓ ఖురైషు ప్రజలారా! అని బిగ్గరగా పిలువు. వారు నీ దగ్గరకు రాగానే, ఓ బనీ హాషిమ్! అని పిలువు. వారు నిన్ను సమీపించినప్పుడు, అబూ తాలిబ్ గురించి వాకబు చెయ్యి. అబూ తాలిబ్ రాగానే, ఫలానా వ్యక్తి కేవలం ఒక త్రాడు కోసం నన్ను చంపేశాడని చెప్పు'. ఇలా చెప్పిన మీదట ఆ నౌకరు ప్రాణం విడిచాడు.

యజమాని మక్కాకు తిరిగి రాగానే అబూ తాలిబ్ దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు అబూ తాలిబ్, 'మా తెగకు చెందిన ఒక వ్యక్తిని నీవు ఉద్యోగంపై పెట్టుకున్నావు కదా! అతనేడి?' అని అడిగితే, 'అతను వ్యాధిగ్రస్తుడయ్యాడు. నేనతని సపర్యలు చేయటంలో ఏ లోటూ రానివ్వలేదు. కాని అతను చచ్చిపోయాడు. నేనతన్ని పూడ్చి పెట్టేశాను' అని అతను అబద్ధం చెప్పాడు. దానికి అబూ తాలిబ్, 'ఔను లే, ఎవ రయినా అంతకన్నా చేసేదేముంది?' అని పలికారు.

కొంతకాలం గడిచిన మీదట ఆ యమనీ వ్యక్తి హజ్జ్ చేయడానికి మక్కా వచ్చాడు. ఆ నౌకరు చేసిన వసీయతు ప్రకారం, 'ఓ ఖురైషు ప్రజలారా!' అని బిగ్గరగా ఎలుగెత్తి పిలిచాడు. దానికి, 'ఇదిగో ఖురైషులు వీరే' అని జనులు చెప్పారు. 'ఓ బనీ హాషిమ్ జనులారా!' అని ఆ వ్యక్తి మళ్ళీ పిలిచాడు. 'ఇదిగో, వీరే బనీ హాషిమ్ జనులు' అని అక్కడున్నవారు చెప్పారు. 'అబూ తాలిబ్ ఎక్కడున్నారు?' అని ఆ వ్యక్తి అడగ్గా, జనులు ఆయన్ని చూపించారు. అప్పుడు ఆ వ్యక్తి ఇలా చెప్పాడు : 'చూడండి! ఫలానా వ్యక్తి (మరణ సమయంలో) ఈ సందేశాన్ని మీకు చేరవేయమని నాకు వసీయతు చేశాడు. కేవలం ఒక త్రాడు కోసం ఫలానా వ్యక్తి అతన్ని చంపేశాడు'. ఈ సందేశాన్ని పురస్కరించుకుని అబూ తాలిబ్ ఆ వ్యక్తి దగ్గరకు వచ్చి "చూడు, మూడు విషయాలలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకో. **1.** నీవు గనక కోరుకుంటే రక్తశుల్కం (దియత్) క్రింద నూరు ఒంటెలను ఇచ్చుకో. ఎందుకంటే నీవు మా తెగకు చెందిన వ్యక్తిని అన్యాయంగా హతమార్చావు. **2.** అలా కాదనుకుంటే, నీ జాతికి చెందిన యాభై మంది ముందుకు వచ్చి, నీవు హత్యా నేరానికి పాల్పడలేదని ప్రమాణం చేసి చెప్పాలి. **3.** ఒకవేళ నీవు అదీ సాధ్యం కాదనుకుంటే ప్రతీకారంగా మేము నిన్ను హతమారుస్తాము." అప్పుడు ఆ వ్యక్తి

**తన జాతి వారి వద్దకు వచ్చి, జరిగినదంతా చెప్పాడు. తాము ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అతని జాతి వారన్నారు. అంతలో బనీ హాషిమ్ తెగకు చెందిన ఒక స్త్రీ (జైనబ్ బిన్తె అల్ఖమా. ఆమె హతుని సోదరి) అక్కడకు వచ్చింది. ఆమె వివాహం హంతకుని తెగకు చెందిన ఒక వ్యక్తితో జరిగింది. ఆ దంపతులకు ఒక మగ బిడ్డ కూడా ఉన్నాడు. ఆమె ఇలా విన్నవించుకుంది: 'ఓ అబూ తాలిబ్! (రుక్న్‌కు– మఖామె ఇబ్రాహీమ్‌కు మధ్యన ఉన్న) ప్రమాణ స్థలి వద్ద ప్రమాణం చేయించుకుంటున్న యాభై మందిలోనుంచి ఈ అబ్బాయి ప్రమాణాన్ని క్షమించండి. అంటే ప్రమాణం కొరకు ఇతన్ని ఇబ్బంది పెట్టకండి' అని ప్రాధేయపడింది. అబూ తాలిబ్ ఆమె విన్నపాన్ని మన్నించారు. ఆ తరువాత వారిలోని మరో వ్యక్తి కూడా వచ్చి, 'అబూ తాలిబ్! తమరు నూరు ఒంటెల స్థానంలో యాభై మంది ప్రమాణం చేయాలని కోరారు. ఆ విధంగా ఒక్కొక్క వ్యక్తికి రెండు ఒంటెల చొప్పున పడతాయి. కాబట్టి ఈ రెండు ఒంటెల్ని నా నుంచి స్వీకరించి, నన్ను ఆ స్థలంలో ప్రమాణం చేయటం నుండి మినహాయించండి' అని కోరాడు. అబూతాలిబ్ అతని అభ్యర్థనను కూడా ఆమోదించారు. ఆ తరువాత మిగిలిన 48 మంది వచ్చి ప్రమాణం చేసేశారు. ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అంటున్నారు: "ఎవరి చేతుల్లో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను– ఈ సంఘటన జరిగి ఒక ఏడాది కాలమయినా గడవక ముందే ఆ 48 మందిలో ఏ ఒక్కరూ మిగల్లేదు (అందరూ చచ్చిపోయారు).[1]**

475–1. అబద్ధపు ప్రమాణం చేసినందుకు వారికి తగిన శాస్తి జరిగింది. అదీ ఎక్కడ? కాబా గృహం వద్ద! వేరొక ఉల్లేఖనం ప్రకారం వారందరి భూములు, ఆస్తిపాస్తులు హజ్రత్ తయ్యబ్‌కు లభించాయి. ఆయన తల్లి అభ్యర్థనపైనే అబూ తాలిబ్ క్షమాభిక్ష పెట్టారు. ఈ సంఘటన జరిగిన నాటికి హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇంకా పుట్టలేదు. అయితే ఎన్నదగిన వ్యక్తుల ద్వారా ఆయన దీనిని విన్నారు.

వేరొక ఉల్లేఖనం ప్రకారం కొంతమంది కాబా గృహం వద్ద– ఒకానొక వివాదంలో– అబద్ధపు ప్రమాణం చేసి, ఒక కొండ ప్రక్కన నిలబడ్డారు. అంతలో కొండచరియ విరిగి వారిపై పడింది. దాంతో వారంతా చచ్చి ఊరుకున్నారు. అబద్ధపు ప్రమాణాలు చేయటం, దానికితోడు ప్రమాణం కొరకు ఖుర్ఆన్ గ్రంథాన్ని, మస్జిద్‌ను వాడుకోవడం ఎంత తీవ్రమయిన విషయమో ఆలోచించాలి. ఈ కాలంలో కూడా ఇలాంటి వారు చాలామంది ఉన్నారు. ఇకనయినా వారు అబద్ధపు ప్రమాణాల విషయంలో జాగ్రత్త పడాలి.

**476) హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు : బుఆస్ యుద్ధాన్ని అల్లాహ్ (కొన్ని పరమార్థాల దృష్ట్యా) మహాప్రవక్త (స) మదీనాకు రాక పూర్వమే జరిగి పోయేలా చేశాడు. మహాప్రవక్త(స) మదీనాకు ఏతెంచినప్పుడు అన్సార్ల సమూహం మధ్య చీలిక ఏర్పడి ఉంది. వారి నాయకులు హతమార్చబడి ఉన్నారు లేదా గాయ పడి ఉన్నారు. అన్సార్లు ఇస్లామ్‌లో (నిస్సంకోచంగా) ప్రవేశించేందుకు గాను అల్లాహ్ ముందుగానే ఈ యుద్ధం జరిగేలా చేశాడు.[1]**

**అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపినట్లుగా ఆయన గారి బానిస కురైబ్ చెప్పారు– అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా తెలిపారు : సఫా– మర్వాల మధ్యన లోతట్టు స్థలంలో చాలా వేగంగా పరుగెత్తటం సంప్రదాయం కాదు. అజ్ఞాన కాలంలో ప్రజలు అక్కడ ఆ విధంగా పరుగెత్తేవారు. తాము ఈ రాతిప్రదేశం గుండా పరుగులు తీస్తూనే దాటిపోతామని వారనేవారు.[2]**

**477) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా అనేవారు : "ప్రజలారా! నేను మీకు చెప్పే విషయాలను శ్రద్ధగా వినండి. (మీరు అర్థం చేసుకున్న మీదట) నాకు వినిపించండి. (అర్థం చేసుకోకుండా) వెళ్ళిపోయి, 'ఇబ్నె అబ్బాస్ ఇలా అన్నారు, ఇబ్నె అబ్బాస్ అలా అన్నార'ని జనులతో చెప్పుకుంటూ తిరిగే పరిస్థితి రాకూడదు సుమా! ఏ వ్యక్తి కాబా గృహ ప్రదక్షిణ చేసినా, అతను 'హతీమ్' అవతలి నుంచి ప్రదక్షిణ (తవాఫ్) చేయాలి. హిజర్‌ను హతీమ్ అని అనకండి. అది అజ్ఞాన కాలపు పేరు. ఆ కాలపు ప్రజల్లో ఎవరయినా ఏదన్నా విషయంపై ప్రమాణం చేస్తే తన కొరడాను, చెప్పును లేదా ధనుస్సును అక్కడ పారవేసేవాడు.[1]**

---

476–1. మదీనా నగరానికి సమీపంలోనున్న ఒక స్థలం పేరు 'బుఆస్'. దైవప్రవక్త (సఅసమ్) మదీనా నగరానికి హిజ్రత్ చేసి రాక ఐదేళ్ళ క్రితమే ఔస్– ఖజ్రజ్ తెగల మధ్య ఇక్కడ భీకర పోరు జరిగింది. అందులో ఎంతోమంది నగర ప్రముఖులు వధించబడ్డారు.

476–2. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) సఫా– మర్వాల మధ్య 'సయీ' చేయడాన్ని తప్పు పట్టలేదు. పైగా ఇది మహాప్రవక్త(స) సున్నత్ కూడా. కాకపోతే ఇస్లామ్‌కు పూర్వం– అజ్ఞాన కాలంలో– ప్రజలు మరీ వేగంగా అక్కడ పరుగెత్తేవారు. అలా పిచ్చిగా పరుగెత్తడాన్నే ఆయన ఆక్షేపించారు.

477–1. ఎవరయినా ఒక విషయాన్ని బోధపరచేటప్పుడు నిశ్శబ్దంగా, సావధానంగా

**478) అమ్ర్ బిన్ మైమూన్ ఇలా వివరించారు: నేను అజ్ఞాన కాలంలో ఒక ఆడ కోతిని చూశాను. దానిచుట్టూ ఎన్నో కోతుల గుంపు చేరి ఉంది. ఇంతకీ ఏం జరిగిందంటే ఆ ఆడ కోతి వ్యభిచారానికి ఒడిగట్టింది. అందువల్ల ఆ కోతులన్నీ కలసి దానికి రాళ్లు రువ్వే శిక్ష విధించాయి. నేను కూడా ఆ శిలా శిక్ష విధించడంలో పాల్గొన్నాను.[1]**

**479) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) చెప్పగా, ఉబైదుల్లాహ్ విన్నారు: అజ్ఞాన (కాల)పు దురలవాట్లలో ఇవి ఉండేవి : వంశపారంపర్యం గురించి–**

---

దానిని వినాలి. అందులో ఏదయినా అంశం అర్థం కాకపోతే, బోధకులను ఒకటికి రెండుసార్లు అడిగి అవగాహన చేసుకోవాలి. అంతేగాని మిడిమిడి జ్ఞానంతో ఇతరుల ముందు చెప్పుకుంటూ తిరగటం సమంజసం కాదు. అది సమాజంలో అనర్థదాయకంగా పరిణమించే అవకాశం ఉంది.

478–1. పూర్తి ఉల్లేఖనం ఇలా వుంది: అమ్ర్ బిన్ మైమూన్ ఇలా అన్నారు– నేను యమన్ ప్రదేశంలో నా తెగవారితో మేకల మంద వద్ద ఉన్నాను. ఒక ఎత్తయిన స్థలంలో ఒక కోతి, ఆడ కోతిని వెంటబెట్టుకుని వచ్చింది. ఆడ కోతి చేతిని తన తలక్రింద పెట్టుకుని పడుకుంది. అంతలో ఒక చిన్న కోతి వచ్చి, ఆడ కోతికి సైగ చేసింది. ఆడ కోతి, మగ కోతి తల క్రింద ఉన్న తన చేతిని నెమ్మదిగా లాక్కుని, ఆ చిన్న కోతితోపాటు పోయి, దానితో కులికింది. నేను అదంతా వింతగా చూస్తూ ఉన్నాను. లైంగిక సంప్కరం తరువాత ఆ ఆడ కోతి తిరిగి వచ్చి, నెమ్మదిగా తన చేతిని మగ కోతి తల క్రింద పెట్టసాగింది. కాని అలికిడికి మగ కోతికి మెలకువ వచ్చింది. ముందు అది కంగారు పడింది. తరువాత అనుమానం వచ్చి ఆడ కోతి వాసన చూసింది. అంతే, లబోదిబోమని అరవసాగింది. పరిసరాల్లో ఉన్న కోతులన్నీ అక్కడ ప్రోగయ్యాయి. ఆ కోతి ఆవేదనతో, ఆడ కోతి వైపు సైగ చేస్తూ (తన భాషలో) రోదించసాగింది. (అంటే తన పట్ల స్వామి ద్రోహం చేసి, వ్యభిచారం చేసిందని ఫిర్యాదు చేసింది). కొన్ని కోతులు కుడివైపునకు, ఎడమ వైపునకు వెళ్ళి ఆ చిన్న కోతిని వెంటబెట్టుకుని వచ్చాయి. ఆడ కోతితో జతకట్టిన ఆ చిన్న కోతిని నేను గుర్తుపట్టాను. కోతులన్నీ కలసి ఆ చిన్న కోతి కోసం, ఆడ కోతి కోసం ఒక గోతిని త్రవ్వాయి. ఆ రెండు కోతులపై రాళ్ళు రువ్వాయి. ఆ విధంగా నేను ఆదమ్ సంతతితోపాటు జంతువుల్లో కూడా శిలాశిక్షను కళ్ళారా చూశాను.

**నిరాధారంగా– ఎత్తిపొడవటం, మృతునిపై పెడబొబ్బలు పెడుతూ రోదించటం. మూడవ దురలవాటును ఉల్లేఖకుడు (ఉబైదుల్లాహ్) మరచిపోయారు. సుఫ్యాన్ ప్రకారం ఆ మూడవ అలవాటు నక్షత్రాలను వర్షానికి కారణంగా ప్రజలు తలపోసేవారని అన్నారు.**

## అధ్యాయం : 60

## దైవప్రవక్త- సల్లల్లాహు అలైహి వ సల్లమ్- ప్రభవనం గురించి

**ఆయన నామధేయం ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్ బిన్ అబ్దె మునాఫ్ బిన్ ఖుసై బిన్ కిలాబ్ బిన్ ముర్రా బిన్ కఅబ్ బిన్ లువయ్యి బిన్ గాలిబ్ బిన్ ఫిహ్ర్ బిన్ మాలిక్ బిన్ నజ్ర్ బిన్ కినానా బిన్ ఖుజైమా బిన్ ముద్రికా బిన్ ఇలియాస్ బిన్ ముజరా బిన్ నిజార్ బిన్ మఅద్ బిన్ అద్నాన్...** [1]

**480) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు : మహాప్రవక్త(సఅసమ్) నలభయ్యేళ్ళ వయస్సుకు చేరినప్పుడు ఆయన(స)పై 'వహీ' (దైవవాణి) అవత రించింది. ఆ తరువాత ఆయన(స) పదమూడేళ్ళు మక్కా ముకర్రమాలో ఉన్నారు. పిదప ఆయన(స)కు హిజ్రత్ చేయమన్న ఆజ్ఞ అయినప్పుడు, ఆయన మదీనాకు వలసపోయారు. అక్కడ పదేళ్ళు ఉన్నారు. ఆ తరువాత ఆయన(స) పరమపదిం చారు. ఆ లెక్కన ఆయన పూర్తి వయస్సు 63 సంవత్సరాలు. ఇదే సరైనది.**

## అధ్యాయం : 61

## దైవప్రవక్త(స), ఆయన ప్రియ సహచరులు మక్కా నగరంలో బహు దైవారాధకుల చేత ఎదుర్కొన్న కష్టాల గురించి

**481) హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) వివరించారు: ఒకసారి నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్) సన్నిధికి వచ్చాను. ఆ సమయంలో ఆయన(స) కాబా గృహం నీడలో ఒక దుప్పటి పరచి, దిండుకు ఆనుకుని కూర్చుని ఉన్నారు. ఆ**

---

60–1. ఇక్కడివరకే ఆయన తన వంశపరంపరను వివరించారు. అద్నాన్‌కు పూర్వం ఉల్లేఖనాల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఇమామ్ బుఖారీ (రహ్మ) చరిత్రలో ఆయన(స) వంశపరంపరను హజ్రత్ ఇబ్రాహీమ్(అ) వరకు వివరించారు.

**రోజుల్లో మేము బహు దైవారాధకులు పెట్టే కఠినాతికఠినమైన బాధలను భరిస్తూ ఉన్నాము. నేను ఆయన సమక్షంలో, 'దైవప్రవక్తా! తమరు అల్లాహ్‌ను ఎందుకు మొరపెట్టుకోరు?' అని విన్నవించుకున్నాను. ఇది వినగానే ఆయన(దిండుకు ఆనుకుని కూర్చుని ఉన్నవారల్లా) లేచి నిటారుగా కూర్చున్నారు. (ఆందోళనతో) ఆయన ముఖారవిందం కందిపోయింది. ఆయన(స)ఇలా అన్నారు :"మీకు పూర్వం గతించిన వారు ఇంతకన్నా తీవ్రమైన యాతనల్ని భరించారు. ఇనుప దువ్వెనలతో వారి శరీరాలపై గుచ్చి మాంసం తీసేవారు. అయినా వారు సత్యధర్మం నుండి మరలిపోలేదు. వారి తల మధ్యలో రంపం పెట్టి కోసేవారు. వారి శరీరాలను- నిలువునా- రెండు ముక్కలుగా చీల్చివేసేవారు. అయినప్పటికీ వారు తమ ధర్మం నుండి విముఖులు కాలేదు. (బాగా వినండి! ఒక రోజు తప్పక వస్తుంది) అల్లాహ్ తన కార్యాన్ని పూర్తి చేస్తాడు. ఆనాడు ఒక వ్యక్తి 'సన్ఆ'[1] నుండి హజర్‌మోత్[2] వరకు ఒంటరిగా వాహనమెక్కి ప్రయాణిస్తాడు. ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి భయం కూడా అతనికి ఉండదు"- బయాన్ ఉల్లేఖనంలో, "భయమనేది అతనికి ఉంటే తన గొర్రెల్ని తోడేలు ఎక్కడ తినేసి పోతుందోనన్న భయం మాత్రమే ఉంటుంది" అనే వాక్యం అదనంగా ఉంది.**

**482) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) అన్ నజ్మ్ సూరా పారాయణం చేసి సజ్దా చేసినప్పుడు, ఆయనతోపాటు అక్కడ ఉన్నవారంతా సాష్టాంగ ప్రణామం చేశారు. కేవలం ఒక్కగానొక్క వ్యక్తి మాత్రం సజ్దా చేయకపోవటం నేను గమనించాను. అతను పిడికెడు కంకరరాళ్ళు ఎత్తుకుని దానిపై తల ఉంచాడు. 'నాకు ఇది చాలు' అని అన్నాడు. ఆ తరువాతి కాలంలో అతను అవిశ్వాస (కుఫ్ర్) స్థితిలో హతమార్చబడటం నేను నా కళ్ళారా చూశాను.[1]**

---

481-1. 'సన్అ' అనేది యమన్ దేశంలోని ఒక పట్టణం పేరు.

481-2. 'హజర్‌మోత్' ఉత్తర అరేబియాలో ఉంది. హజర్‌మోత్‌కి- సన్ఆకి మధ్య కాలినడకన 15 రోజుల ప్రయాణ దూరం ఉంటుంది.

482-1. ఆ వ్యక్తి ఎవరో కాదు, ఉమయ్యా బిన్ ఖలఫ్. కరడుగట్టిన సత్య తిరస్కారి. హదీసు ద్వారా విదితమయ్యేదేమంటే ఆ కాలంలో సత్య తిరస్కారులు కూడా ఖుర్ఆన్ పారాయణం సందర్భంగా 'సజ్దా' ఆయత్ వచ్చినప్పుడు,

**483)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు నమాజ్ చేస్తూ సజ్దా స్థితిలో ఉండగా, చుట్టుప్రక్కల ఉన్న ఖురైషులు ఆ వైనాన్ని గమనిస్తూ ఉన్నారు. అంతలో ఉఖబా బిన్ అబీ ముఅయ్త్ ఒంటె పొట్ట లోని కసువును, గర్భకోశాన్ని తెచ్చి దైవప్రవక్త(స) వీపుపై వేశాడు. తత్కారణంగా ఆయన(స) సజ్దా స్థితి నుండి లేవలేకపోయారు. తరువాత ఫాతిమా(ర.అ) వచ్చి, వీపుపైనున్న మాలిన్యాన్ని తొలగించారు. ఈ దుశ్చేష్టకు ఒడిగట్టిన వానికి శాపనార్థం పెట్టారు. దైవప్రవక్త(స) కూడా వారిని శపిస్తూ, "ఓ అల్లాహ్! ఖురైషుల ఈ మూకను పట్టుకో. అబూజహ్ల్ బిన్ హిషామ్‌ను, ఉతబా బిన్ రబీయాను, షైబా బిన్ రబీయాను, ఉమయ్యా బిన్ ఖలఫ్ లేదా ఉబై బిన్ ఖలఫ్‌ను (ఇక్కడ ఉల్లేఖకుడు సందిగ్ధంలో పడ్డారు) పట్టుకో అన్నారు. అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) ఇలా అన్నారు: బద్ర్ యుద్ధ సందర్భంగా వీళ్ళంతా వధించబడటం నేను చూశాను. తరువాత వాళ్ళను ఒక బావిలో పడవెయ్యటం జరిగింది. ఉమయ్యా లేదా ఉబై యొక్క ప్రతి కీలు వేరైపోయింది. అందువల్ల బావిలో పడవెయ్యటం సాధ్య పడ లేదు.'[1]

**484)** సయీద్ బిన్ జుబైర్ ఇలా అన్నారు : అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్జా (రజి) నాతో ఏమన్నారంటే; ఆ రెండు ఆయత్‌లను సమన్వయపరచటం ఎలాగో హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి)ను అడగండి. ఒక ఆయత్ : 'సత్యంతో తప్ప అల్లాహ్ పవిత్రంగా నిర్ణయించిన ఏ ప్రాణాన్నీ హతమార్చకండి' (అల్ అన్ఆమ్: 151). రెండవ

---

ముస్లింలతోపాటు సాష్టాంగ ప్రణామం చేసేవారు. ఒకసారి ఏం జరిగిందంటే, ఇథియోపియాకు వలస వెళుతున్న ముస్లింలు, బహు దైవారాధకులు సజ్దా చేయటం చూసి, వారు ముస్లింలై పోయారని తలచి, తమ వలస నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. కాని ఆ బహు దైవారాధకులు ముస్లింలుగా ధర్మ పరివర్తన చెందలేదని తరువాత తెలిసింది. అందువల్ల వారు మళ్ళీ ఇథియోపియా వైపునకు బయలుదేరారు.

483–1. ఉమయ్యా బిన్ ఖలఫ్ అన్నదే సరైనది. ఎందుకంటే ఉబైని దైవప్రవక్త(స) ఉహుద్ యుద్ధంలో వధించారు.

ఇకపోతే మక్కా నగరిలో దైవప్రవక్త(స)ను అడుగడుగునా వేధించిన సత్య తిరస్కారులకు తగిన శాస్తి జరిగింది.

**ఆయత్: 'బుద్ధి పూర్వకంగా ఒక విశ్వాసిని చంపేవానికి శిక్ష నరకం' (అన్ నిసా: 93)– ఈ రెండు ఆయత్‌లను గురించి నేను ఇబ్నె అబ్బాస్(రజి)ను అడిగితే, ఆయన ఇలా విశదీకరించారు: ఫుర్ఖాన్ సూరాలోని ఆయత్ అవతరించినప్పుడు మక్కాలోని బహుదైవారాధకులు, 'అల్లాహ్ నిషిద్ధం (పవిత్రం)గా ఖరారు చేసిన ప్రాణులను కూడా మేము చంపి ఉన్నాము. మేము అల్లాహ్‌ను కాదని వేరితర ఆరాధ్య దైవాలను కూడా పూజించాము. అశ్లీల కార్యాలకు కూడా ఒడిగట్టాము. (మరి దీనికేమంటారు?)' అని అడిగారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవత రింపజేశాడు: "(ఈ పాపాల తరువాత) పశ్చాత్తాపపడి, విశ్వసించి మంచి పనులు చేయటం ప్రారంభించినవాడు శిక్ష నుండి తప్పించుకుంటాడు" (అల్ ఫుర్ఖాన్: 70). కనుక ఈ ఆయత్ ఆ అవిశ్వాసులకు అనుకూలంగా వర్తిస్తుంది. కాని అన్ నిసా సూరాలోని ఆయత్(93); ఇస్లామ్ ఆదేశాలను గురించి తెలిసి కూడా ఉద్దేశపూర్వ కంగా– హత్య చేసినవారిని శిక్షార్హులుగా ఖరారు చేస్తుంది. అలాంటి వారికి నరకం తథ్యం అని అంటుంది.[1] నేను అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) గారి ఈ ఉపదేశాన్ని ముజాహిద్ ముందు ప్రస్తావించగా, పశ్చాత్తాపం ప్రకటించిన వారికి ఈ ఆజ్ఞ వర్తిం చదు అని అన్నారు.**

---

484–1. ఫుర్ఖాన్ సూరాలోని ఆయత్(70) ద్వారా బోధపడేదేమిటంటే, హత్య చేసిన మీదట పశ్చాత్తాపపడి, సత్కార్యాలు ఆచరించటం ప్రారంభించినట్లయితే, అలాంటి వ్యక్తి పశ్చాత్తాపాన్ని అల్లాహ్ ఆమోదిస్తాడు. కాని అన్ నిసా(93) సూరాలోని ఆయత్ ప్రకారం ఎవరయినా బుద్ధిపూర్వకంగా ఒక ముస్లింను చంపినట్లయితే అతనికి శిక్ష తథ్యం. అతను శాశ్వతంగా నరకంలో ఉంటాడు. దేవుని ఆగ్రహం అతనిపై పడుతుంది. ఈ రెండు ఆయత్‌లలో వైరుధ్యం, వ్యాఘాతం ఉందని తలపోసి అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్జా(రజి) గారు అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి)ను అడిగించారు. ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పదలచినదేమంటే; ఫుర్ఖాన్ సూరాలోని ఆయత్ అవిశ్వాసులకు అనుకూలంగా ఉంది. అంటే వారు అవిశ్వాస (కుఫ్ర్) స్థితిలో అకారణంగా ఒకరిని చంపి, ఆ తరువాత పశ్చాత్తాప పడి, ముస్లింగా ధర్మపరివర్తన చెందితే, ఇస్లాం స్వీకారం కారణంగా వారు చేసిన హత్యపై నిలదీత ఉండదు. కాని సూరయె నిసా (93)లోని ఆయత్ కేవలం ముస్లింలకు ఉద్దేశించబడినది. వారు గనక తెలిసి కూడా ఏ ముస్లింనయినా అన్యాయంగా చంపినట్లయితే వారిని పట్టుకోవటం ఖాయం. వారికి నరక శిక్ష తప్పదు. వారి పశ్చాత్తాపం స్వీకారయోగ్యమవదు.

**485) ఉర్వా బిన్ జుబైర్ వివరించారు: నేను అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను, "బహు దైవారాధకులు దైవప్రవక్త(సఅసమ్) పట్ల అత్యంత దౌర్జన్య పూరితంగా ప్రవర్తించిన సంఘటన ఏది?" అని అడగ్గా ఆయన ఇలా వివరించారు– "దైవప్రవక్త(స) హతీమ్‌లో నమాజ్ చేస్తుండగా ఉఖబా బిన్ అబీ ముఅయ్త్ వచ్చి, తన దుప్పటిని దైవప్రవక్త(స) మెడలో ఉరిత్రాడు మాదిరిగా వేసి గట్టిగా లాగాడు. దాంతో ఆ వస్త్రం దైవప్రవక్త(స) మెడకు బిగుసుకుపోయింది. అంతలో మహనీయ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) వచ్చి, ఆ దౌర్భాగ్యుని మెడ పట్టుకుని దైవ ప్రవక్త(స) నుండి దూరం తొలగించారు. ఆయన(రజి) ఇలా అన్నారు : "ఏమిటి, అల్లాహ్ నా ప్రభువు అని చెప్పినందుకు ఒక వ్యక్తిని హతమారుస్తారా?"**

## అధ్యాయం : 62

## మహనీయ అబూబక్ర్(రజి) ఇస్లాం స్వీకరించిన సంఘటన[1]

**486) హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్(రజి) ఇలా అన్నారు: నేను (మొదట్లో) దైవప్రవక్త(స)ను చూసినప్పుడు, ఆయన వెంట ఐదుగురు బానిసలు[1], ఇద్దరు స్త్రీలు[2] అబూబక్ర్ సిద్దీఖ్(రజి)[3] తప్ప మరెవరూ (ముస్లింలు)లేరు.**

---

62–1. ఈయన అసలు పేరు అబ్దుల్లాహ్. ఉస్మాన్ అబూ ఖుహాఫా కుమారుడు. ఏడు తరాలు వెనక్కిపోతే ఈయన వంశ వృక్షం దైవప్రవక్త(స) వంశంతో కలుస్తుంది. అతీఖ్‌గా కూడా పిలువబడేవారు. ఈయన నరకాగ్ని నుండి పూర్తిగా విముక్తి నొందిన వారని దైవప్రవక్త(స) సెలవిచ్చారు. ప్రతి యుద్ధంలో, ప్రతి ముఖ్యమైన సందర్భంలో దైవప్రవక్త వెంట ఉండేవారు. వృద్ధాప్యంలో గడ్డానికి, తల వెంట్రుకలకు గోరింటాకు తైలం పూసుకునేవారు.

486–1. బిలాల్, జైద్, ఆమిర్, అబూ ఫకీహ, ఉబైద్‌లు.

486–2. ఆ ఇద్దరు స్త్రీలు హజ్రత్ ఖదీజా(ర.అ), హజ్రత్ ఉమ్మె ఐమన్(ర.అ), లేదా సుమయ్యా(ర.అ)

486–3. మహనీయ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) ఏనుగుల వాళ్ళ సంఘటనకు రెండేళ్ళ క్రితం మక్కాలో జన్మించారు. హిజ్రీ 13వ సంవత్సరంలో మరణించారు. 28 నెలలపాటు ప్రథమ ఖలీఫాగా పరిపాలన చేశారు. ఈయన్ని 'సిద్దీఖ్' (మహా సత్యవంతుడు) అని అనడానికి ప్రధాన కారణం; ఈయన అజ్ఞాన కాలంలో ఎన్నడూ అబద్ధం చెప్పలేదు. విగ్రహారాధన చెయ్యలేదు.

## అధ్యాయం : 63

## మహనీయ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి)[1] ఇస్లామ్ స్వీకరణా వృత్తాంతం

**487) అబూ ఇస్‌హాఖ్ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) చెప్పగా తాను విన్నానని సయీద్ బిన్ ముసయ్యిబ్ తెలిపారు: నేను ఇస్లామ్ స్వీకరించిన రోజే ఇతరులు**

---

ఖాజీ అబుల్ హుసైన్ తన సనదుననుసరించి చేసిన ఉల్లేఖనం ప్రకారం, ఈయన తండ్రి అబూ ఖుహాఫా ఒకరోజు ఈయన్ని విగ్రహాలయంలోనికి తీసు కెళ్ళారు. విగ్రహం ముందు ప్రణమిల్లమని పురమాయించారు. అలా చెప్పి వెళ్ళి పోయారు తండ్రి.

అబూబక్ర్ ఇలా అంటున్నారు: నేను ఒక విగ్రహం దగ్గరకు వెళ్ళి, 'నాకు ఆకలిగా ఉంది. అన్నం పెట్టు' అని అడిగాను. ఆ విగ్రహం నుండి సమాధానం రాలేదు. 'నాకు బట్టలు లేవు. బట్టలు ఇవ్వు' అని కోరాను. ఇప్పుడు కూడా ఆ విగ్రహం నుండి జవాబు రాలేదు. చివరకు నేను ఒక రాయి తీసుకుని, 'ఒకవేళ నీవే గనక దేవుడవైతే నా బారి నుండి నిన్ను రక్షించుకో' అంటూ దానిపై రాయి రువ్వి అక్కడే పడుకున్నాను. అంతలో నాన్నగారు వచ్చి, 'అబ్బాయి! ఏం చేస్తున్నావ్?' అని అడిగారు. 'మీరు చూస్తున్నదే' అని బదులిచ్చాను. ఆయన గారు నన్ను మా అమ్మ దగ్గరకు తీసుకెళ్ళి, జరిగినదంతా చెప్పారు. దానికి ఆమె, 'నా పుత్ర రత్నానికి ఏమీ అనకు. ఇతని మూలంగా, ఇతను నా గర్భంలో ఉండగా అల్లాహ్ నాతో సంభాషించాడు. నాకు పురిటినొప్పులు వచ్చినప్పుడు నాకు వినిపించిన ఆకాశ వాణి ఇది: "ఓ దైవదాసీ! సంతోషించు. నీకు ఒక స్వతంత్రుడైన పిల్లవాడు పుడతాడు. ఆకాశంలో అతని పేరు సిద్దీఖ్. అతను హజ్రత్ ముహమ్మద్(స) సహచరునిగా, మిత్రునిగా ఉంటాడు."

63–1. ఈయన గారి కునీయత్ అబూ ఇస్‌హాఖ్. స్వర్గలోక శుభవార్తను అందుకున్న పది మంది సౌభాగ్యవంతుల (అష్రె ముబష్షిరా)లో ఒకరు. 17 ఏళ్ల వయసులో ఇస్లామ్ స్వీకరించారు. అన్ని ధర్మయుద్ధాలలో దైవప్రవక్త(స)తో కలసి పాల్గొ న్నారు. విలువిద్యలో సాటిలేని మేటి. దైవప్రవక్త(స) ఈయన కొరకు ప్రత్యేకంగా దైవాన్ని ప్రార్థించారు. మదీనా నగరానికి కొంతదూరాన ఉన్న 'అతీఖ్' స్థానంలో పరమపదించారు. ప్రజలు ఆయన శవపేటికను మదీనా వరకు మోసుకుని వచ్చారు. ఆనాటి మదీనా పురపాలకుడైన మర్వాన్ బిన్ హకమ్ జనాజా నమాజ్ చేయించారు. ఆయన మరణించిన సంవత్సరం హిజ్రీ 55.

**కూడా ఇస్లామ్ స్వీకరించారు. నేను ముస్లిమ్‌గా ధర్మపరివర్తన చెంది ఏడు రోజులు గడిచేవరకూ నేను మొత్తం ముస్లిములలో మూడోవంతుగా ఉండేవాణ్ణి."[1]**

## అధ్యాయం : 64

## జిన్నుల గురించి

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "ఓ ప్రవక్తా! జిన్నాతుల సమూహం ఒకటి ఖుర్ఆన్‌ను శ్రద్ధగా విన్నది" *(అల్ జిన్న్: 1)***

**488) మఆన్ బిన్ అబ్దుర్రహ్మాన్ తెలిపారు: నేను నా తండ్రి చెప్పగా విన్నాను. ఆయన గారు మస్రూఖ్‌ను ఇలా అడిగారు– 'ఏ రాత్రి యందు జిన్నాతులు ఖుర్ఆన్ విన్నారో, ఆ సమాచారాన్ని దైవప్రవక్త(స)కు ఎవరు తెలియపరచారు?' దానికి మస్రూఖ్ "జిన్నులు ఖుర్ఆన్ విన్న సంగతిని ఒక తుమ్మ చెట్టు దైవప్రవక్త(స)కు తెలియపరచింది" అని మీ నాన్నగారైన హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) నాకు తెలియజేశారు.**

**489) హజ్రత్ అబూ హురైరా(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ, కాలకృత్యాల నిమిత్తం తాను ఒక (నీళ్ళ) పాత్ర తీసుకుని ఆయన(స) వెనుకే నడుస్తుండగా, "ఈయన గారెవరు?" అని దైవప్రవక్త(స) అడిగారు. 'అబూహురైరా'ను అని చెప్పడం జరిగింది. "ఇస్తింజా కొరకు నాకు కొన్ని మట్టి పెడ్డలు వెతికి తీసుకురా. ఎముకలు, లద్దె (పేడ) మాత్రం తీసుకురావద్దు" అని ఆయన సూచించారు. ఆయన కోరినట్లుగా మట్టిపెడ్డలు తెచ్చాను. వాటిని ఒక గుడ్డలో చుట్టి, ఆయన సమీపంలో ఉంచి, అక్కడ నుండి తిరిగి వచ్చేశాను. ఆయన కాలకృత్యాలు తీర్చుకున్న మీదట, నేను మళ్ళీ ఆయన (స) సేవలో హాజరై 'ఎము కలు, పేడ ఎందుకు వద్దన్నారు?' అని అడిగాను. దానికి ఆయన(స), "ఎందుకంటే అవి జిన్నాతుల ఆహారం. నా దగ్గరకు నసీబీన్ జిన్నాతుల బృందం ఒకటి వచ్చింది.**

---

487–1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. సాద్ బిన్ వక్కాస్(రజి) తన జ్ఞాన పరిధిలో ఇలా చెప్పి ఉంటారు. అన్యథా ఈయనకు ముందే మహనీయ అలీ(రజి), హజ్రత్ ఖదీజా(ర.అ), హజ్రత్ అబూ బక్ర్(రజి) తదితరులు ఇస్లామ్ స్వీకరించారు. బహుశా వీరంతా ఒకే రోజు ఇస్లామ్‌లో చేరారేమో! వారిలో చివరివారు సాద్ అయి ఉండవచ్చు.

**వారు ఎంత మంచి జిన్నాతులు! వారు తమ కొరకు ఆహారం కావాలని అడిగారు. నేను వారి కోసం దైవాన్ని ప్రార్థించాను– ఎప్పుడు వారి దృష్టి ఎముకపై, పేడపై పడినా, వారికి వాటి ద్వారా ఆహారం లభించాలని వేడుకున్నాను"[1] అని చెప్పారు.**

## అధ్యాయం : 65

## మహనీయ అబూజర్ గిఫ్ఫారీ(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటన

**490) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: మహాప్రవక్త ముహమ్మద్(స) ప్రవక్తగా ప్రకటించుకున్నారన్న సంగతి అబూజర్ గిఫ్ఫారీ(రజి)కి తెలిసినప్పుడు ఆయన తన తమ్ముడు అనీస్‌ను పిలిచి, 'మక్కా వెళ్ళేందుకు వాహనాన్ని సిద్ధం చేసుకో. తనను ప్రవక్తగా ప్రకటించుకుని, తన వద్దకు ఆకాశం నుండి సందేశం వస్తుందని చెబుతున్న వ్యక్తి గురించి సమాచారం రాబట్టు. అతని మాటల్ని శ్రద్ధగా విను. ఆ తర్వాతే నా దగ్గరకు రావాలి' అని పురమాయించారు. ఆయన తమ్ముడు మక్కా నగరానికి వచ్చి, దైవప్రవక్త(స) మాటల్ని స్వయంగా విన్నారు. ఆ తరువాత తిరిగి వచ్చి, అబూజర్(రజి)తో ఇలా అన్నారు : 'నేనాయన్ని స్వయంగా చూశాను. ఆయన(స) మంచి నీతి నడవడికలను గురించి ప్రజలకు ఆజ్ఞాపిస్తున్నారు. ఆయన చెప్పేది కవిత్వం మాత్రం కాదు'. అంతా విని, 'నేను ఏ ఉద్దేశంతో నిన్ను పంపించానో, దానిపై నేను పూర్తిగా సంతృప్తి చెందలేదు' అని చెప్పారు.**

**ఆ తరువాత ఆయన స్వయంగా ప్రయాణ సన్నాహం చేసుకున్నారు. చద్ది మూట కట్టుకున్నారు. నీళ్ళతో నిండిన ఒక పాత నీళ్ళ తిత్తిని కూడా వెంటబెట్టుకుని**

---

489–1. అంటే దైవశక్తితో ఎముకలు, పేడ నుండి వారి కోసం, వారి పశువుల కోసం ఆహారం పుట్టుకొస్తుంది. దైవప్రవక్త(స) సన్నిధికి జిన్నాతుల సమూహాలు అనేకసార్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఒకసారి నఖ్‌లా లోయలో ఆయన(స) ఖుర్‌ఆన్ పారాయణం చేస్తుండగా ఒక బృందం వచ్చింది. ఆ బృందంలో ఏడుగురు జిన్నులు ఉన్నారు. రెండవసారి హుజూన్‌లో, మూడవసారి బఖీలో. ఆ రాత్రులలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) దైవప్రవక్త(స) వెంట ఉన్నారు. వారు కూర్చుకునేందుకుగాను ఆయన నేలపై గీత గీశారు. నాల్గవసారి మదీనా నగరం వెలుపల. ఆ సందర్భంగా జుబైర్ బిన్ అవ్వామ్(రజి) ప్రవక్త వెంట ఉన్నారు. ఐదవసారి– ప్రయాణ సందర్భంగా– బిలాల్ బిన్ హారిస్(రజి) ఉన్నారు. జిన్నాతుల ఉనికి ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా రూఢీ అవుతోంది.

బయలుదేరారు. మక్కా నగరానికి చేరుకుని మస్జిదె హరామ్(కాబా)ను సందర్శించారు. అక్కడ దైవప్రవక్త(స)ను అన్వేషించారు. అబూజర్ దైవప్రవక్త(స)ను గుర్తుపట్టలేదు. ఆయన గురించి వేరితరులను అడగటం కూడా భావ్యం కాదనుకున్నారు. కొంత రాత్రి గడిచింది. ఆయన పడుకుని ఉన్నారు. అంతలో హజ్రత్ అలీ(రజి) వచ్చి, ఆయన్ని చూసి ఎవరో బహుదూరపు బాటసారి అనుకున్నారు. 'మీరు మా ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకోండి' అని కోరారు అలీ. అబూజర్ ఆయన వెనకాలే నడిచి వెళ్ళారు. కాని వారిరువురూ ఒండొకరితో మాట్లాడుకోలేదు. తెల్లవారగానే అబూజర్ తన మూటాముల్లె సర్దుకుని మస్జిదె హరామ్‌కు తిరిగి వచ్చేశారు. ఆ రోజు పగలు కూడా అలాగే గడిచిపోయింది. దైవప్రవక్త(స)ను ప్రత్యక్షంగా చూడలేక పోయారు. రాత్రి పొద్దుగూకగానే నిద్రకు ఉపక్రమించారు. అలీ (రజి) ఆ రోజు రాత్రి కూడా అటువైపు నుండి సాగిపోతూ బహుశా ఈ బాటసారికి తన గమ్యస్థానాన్ని చేరుకునే సమయం ఆసన్నం కాలేదేమో అనుకున్నారు. అందుకే ఆ రోజు రాత్రి కూడా ఆయన్ని తన ఇంటికి తీసుకెళ్ళారు. కాని ఈ రాత్రి కూడా వారు పరస్పరం సంభాషించుకోలేదు. మూడో రోజు రాత్రి కూడా అదే కథ. కాని ఈసారి అలీ(రజి) అడిగారు– మీ రాకలోని ఉద్దేశం ఏమిటో తెలుసుకోవచ్చా? అని. దానికి అబూజర్, 'నా అన్వేషణా మార్గంలో సహాయపడతానని గట్టి వాగ్దానం చేసే మాటైతే నేను మీకు అంతా వివరంగా చెబుతాన'న్నారు. అలీ వాగ్దానం చేసిన మీదట, అంతా వివరంగా చెప్పారు అబూజర్ గిఫ్ఫారీ.

అంతా విన్నాక, 'అవును. ఆయన (స) సత్యపథంలో ఉన్నారు. ఆయన దేవుని సత్యవంతుడైన ప్రవక్త. సరే, రేపు ఉదయం మీరు నా వెనకే నడిచి రండి. దారిలో ఏదన్నా ప్రమాదం పొంచి ఉందని భావిస్తే నేను (ఏదయినా గోడ ప్రక్కన) నిలబడిపోతాను, మూత్ర విసర్జన కోసం అన్నట్టు. ఆ సమయంలో మీరు నా కోసం నిరీక్షించకుండా ముందుకు సాగిపోండి. ఆ తరువాత నన్ను అనుసరించండి. వీళ్ళిద్దరూ ఒక్కటేనని జనులకు అనుమానం రాకుండా ఉండటానికి ఇలా జాగ్రత్త పడటం అవసరం. చివరకు నేను ఏ ఇంట్లో ప్రవేశిస్తే ఆ ఇంట్లోకి మీరు కూడా రావాలి' అని అలీ(రజి) సూచించారు. అబూజర్ అలాగే చేశారు. ఎట్టకేలకు ఆయన అలీ(రజి)తోపాటు దైవప్రవక్త (స) సన్నిధికి చేరుకున్నారు. ప్రవక్త(స) ఉపదేశాన్ని విన్నారు. అక్కడే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. తరువాత దైవ

ప్రవక్త(స) ఆయనకు ఇలా ఉపదేశించారు: “ఇక నీవు నీ తెగ వారైన గిఫ్ఫార్ వద్దకు వెళ్ళిపో. వారికి నా గురించి చెప్పు. నేను ప్రాబల్యం వహించినట్లుగా సమాచారం అందినప్పుడు నా దగ్గరకు రా”. దానికి అబూజర్ గిఫ్ఫారీ, ‘ఎవరి చేతిలో నా ప్రాణ ముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను. నేను ఖురైషులు గుమిగూడి ఉన్నచోట దేవుని ఏకత్వపు వచనాన్ని (కలిమాను) ఎలుగెత్తి ప్రకటిస్తాను’ అన్నారు. అన్నట్లే ఆయన దైవప్రవక్త(స) వద్ద నుండి మస్జిదె హరామ్‌కు తిరిగి వచ్చి, బిగ్గరగా ‘అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని, ఇంకా ముహమ్మద్ (స) దైవప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను’ అన్నారు. ఇది వినగానే అక్కడున్న వాళ్ళంతా ఆయనపై అమాంతం విరుచుకుపడ్డారు. చితకబాదారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఆయన నేలకొరిగారు. అంతలో అబ్బాస్(రజి) వచ్చి, అబూజర్(రజి)పై (డాలుగా) పడి పోయి ఖురైషులకు చీవాట్లు పెట్టారు. ‘మీ ధోరణి కడు శోచనీయం. ఈ వ్యక్తి గిఫ్ఫార్ తెగకు చెందినవాడన్న సంగతి మీకు తెలీదా? సిరియాకు వెళ్ళే మీ వర్తక బిడారాలన్నీ ఇతని ప్రాంతం మీదుగానే సాగిపోవాల్సి ఉంటుంది’ అని చెప్పి అబూజర్‌ను రక్షించారు. రెండో రోజు కూడా అబూజర్ మస్జిదె హరామ్‌కు వచ్చి, తాను ఇస్లామ్ స్వీకరించినట్లు ప్రకటించారు. ఆ రోజు కూడా జాతి ప్రజలు ఆయనపై విరుచుకు పడ్డారు. ఈసారి కూడా అబ్బాస్(రజి) ఆయనపై బోర్లాపడి రక్షించారు.[1]

## అధ్యాయం : 66

## సయీద్ బిన్ జైద్(రజి)[1] ఇస్లామ్ స్వీకరణ

**491)** సయీద్ బిన్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్(రజి) తెలిపారు : “ఒకప్పుడు

490–1. మహనీయ అబూజర్ గిఫ్ఫారీ(రజి) ఉన్నత శ్రేణి సహాబాలో ఒకరు. ఐహిక అనాసక్తత గల ముహాజిర్. ఈయన అసలు పేరు జున్దబ్. మక్కాలో ఇస్లామ్ స్వీకరించిన తొలి వారిలో ఈయన ఐదవవారు. తరువాత తన తెగ వారి వద్దకు వెళ్ళిపోయారు. కందక యుద్ధ సందర్భంగా మదీనా వచ్చి దైవప్రవక్త(స)ను కలుసుకున్నారు. హిజ్రీ 32లో మరణించారు.

66–1. ఈయన హజ్రత్ ఉమర్(రజి)కు బంధువు, బావ గారు కూడా. ఈయన తండ్రి జైద్ అజ్ఞాన కాలంలో ‘దీనె హనీఫ్’ను అవలంబించారు. ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) విధానానికి కట్టుబడి ఉన్నారు. కేవలం ఏక దైవారాధన చేసేవారు. షిర్క్‌కు ఒడిగట్టేవారు కారు. కాబా గృహం వైపునకు తిరిగి నమాజ్ చేసేవారు.

**హజ్రత్ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరించక మునుపు నన్ను కట్టి ఉంచారు. కారణం, నేను ఇస్లామ్ స్వీకరించటమే. కాని మీరేమో హజ్రత్ ఉస్మాన్(రజి) పట్ల వ్యవహరించిన తీరు ఎంత దారుణమైనదంటే, దాని మూలంగా ఉహుద్ పర్వతం తన స్థానం నుంచి జరిగిపోయినా, అలా జరగటం దానికి తగినదే."[1]**

## అధ్యాయం : 67

## మహనీయ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటన

**492) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు: మహనీయ ఉమర్(రజి) ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన తరువాత మేము గౌరవప్రదంగా జీవించ గలిగాము.**

**493) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వివరించారు : హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ఇస్లామ్ స్వీకరించిన పిదప) భయంతో ఇంట్లో కూర్చుని ఉండగా అబూ అమ్ర్ ఆస్ బిన్ వాయల్ సహ్మీ లోపలికి వచ్చాడు. గళ్ళ దుప్పటి, పట్టు వస్త్రం ధరించి ఉన్నాడు. అతను బనూ సహ్మ్ తెగకు నాయకుడు. అజ్ఞాన కాలంలో ఆ తెగవారితో మాకు మైత్రి ఉండేది. ఆస్ ఉమర్(రజి)ని ఉద్దేశించి, 'ఎందుకిలా ఉదాసీనంగా ఉన్నావు?' అని అడిగాడు. దానికి ఉమర్, 'నేను గనక ముస్లింగా మారితే నన్ను చంపేస్తామని మీ తెగ వారంటున్నారు' అన్నారు. దానికి ఆస్, 'నువ్వేం భయపడకు. నీకెవరూ ఎలాంటి హాని కలిగించలేరు' అని అభయం ఇచ్చాడు. ఆస్ మాటలు విన్న మీదట, 'అలాగైతే నేను నిశ్చింతగా ఉండగలను' అన్నారు ఉమర్ బిన్ ఖత్తాబ్**

---

491-1. తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(రజి) హత్య ఇస్లామ్ చరిత్రలో అత్యంత కిరాతకమైనది. హజ్రత్ సయీద్ బిన్ జైద్(రజి) ఆ ఉదంతంపై తన ఆవేదనను వ్యక్తం చేస్తూ పూర్వం ఒకప్పుడు ఇస్లామ్ స్వీకరించినందుకు నన్ను బంధించి ఉంచారు. కాని ఇప్పుడు హజ్రత్ ఉస్మాన్(రజి) వంటి అగ్రశ్రేణి సహాబీ రక్తంతో మన చేతులు తడిసి ముద్ద అయ్యాయి. ఇది ఎంత దారుణమైన సంఘటన అంటే, దీనిపై ఉహుద్ పర్వతం తన స్థానం నుండి చలించినా ఆశ్చర్యపడ నవసరం లేదు. నిజానికి హజ్రత్ ఉస్మాన్(రజి)కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వారిలో అత్యధికులు కపట విశ్వాసులు. వారి దుశ్చేష్ట కారణంగా ముస్లింల సంస్థాగత వ్యవస్థ చిందర వందర అయిపోయింది.

(రజి). ఆ తరువాత ఆస్ బయటికి రాగానే, మైదానమంతా జనులతో కిక్కిరిసిపోయి ఉండటం గమనించాడు. 'ఎక్కడికెళ్తున్నారు?' అని అతను అడిగితే, 'మేము ఖత్తాబ్ పుత్రుని సంగతి తేల్చడానికి వెళుతున్నాము. అతను ధర్మభ్రష్టుడైపోయాడు' అని వారు చెప్పారు. అది విన్న ఆస్, 'అతనికి ఎవరూ ఎలాంటి హాని తలపెట్టలేడు. జాగ్రత్త!' అని మందలించాడు. అంతే, వారంతా తిరిగి వెళ్ళిపోయారు.

**494)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్ స్వీకరించారని తెలిసినప్పుడు, జనులు ఆయన ఇంటి ముందు గుమి గూడారు. 'ఉమర్ ధర్మభ్రష్టుడైపోయాడు' అని వారు చెప్పుకుంటున్నారు. ఆ రోజుల్లో నేను పసివాణ్ణి, మా ఇంటి కప్పుపైకెక్కి చూస్తున్నాను. అంతలో అకస్మాత్తుగా ఒక వ్యక్తి వచ్చాడు. అతను పట్టువస్త్రం (పొడవాటి చొక్కా) తొడిగి ఉన్నాడు. "సరే. ఉమర్ ధర్మభ్రష్టుడవుతే అవనివండి. కాని మీరిలా ఎందుకు గుమిగూడినట్టు? చూడండి, నేను ఉమర్(రజి)కు రక్షణ కల్పించి ఉన్నాను!" ఇబ్నె ఉమర్ ఇలా అన్నారు: 'ఆ వ్యక్తి అలా అనగానే జనులంతా తమ ఇంటి దారిపట్టారు' ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? అని నేను అడిగితే, 'ఆస్ బిన్ వాయల్' అని హజ్రత్ ఉమర్(రజి) చెప్పారు.

**495)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వివరించారు: మహనీయ ఉమర్(రజి) ఎప్పుడు ఏ వ్యవహారంలోనయినా, 'దీని గురించి నేనిలా భావిస్తున్నాను' అని చెబితే, అది ఆయన అభిప్రాయపడినట్లుగానే జరిగేది. ఒక రోజు ఆయన కూర్చుని ఉండగా, ఆయన సమీపంనుంచి ఒక అందమైన వ్యక్తి సాగిపోయాడు. ఆ వ్యక్తి గురించి ఆయన తన అభిప్రాయం వ్యక్తపరుస్తూ, 'ఇతను ఇప్పటికీ తన అజ్ఞాన కాలపు మత ధర్మంపై స్థిరంగా ఉన్నాడు. అజ్ఞాన కాలంలో ఇతగాడు తన జాతి వారి జ్యోతిష్కుడుగా ఉండేవాడు. లేదంటే నా అభిప్రాయం తప్పయినా అయి ఉండాలి. అతన్ని నా దగ్గరకు పిలుచుకుని రండి' అని చెప్పారు. ఆ వ్యక్తి వచ్చాక, అతని ముందు కూడా ఆయన ఇందాక చెప్పిన మాటల్నే మళ్ళీ చెప్పారు. దానికి అతను, 'ఈ రోజు నాకు ఎదురైనటువంటి సమస్య మరే ముస్లింకు కూడా ఎదురైనట్టు నేను చూడలేదు' అన్నాడు. దానికి ఉమర్(రజి), 'కథలు చెప్పకు. నేను అడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పు'అని గద్దించారు. అప్పుడతను, 'నేను అజ్ఞాన

**కాలంలో నా జాతి వారి జ్యోతిష్కునిగా ఉండేవాణ్ణి' అని ఒప్పుకున్నాడు. 'అలాగైతే నీ దగ్గరకు వచ్చే ఆడ దెయ్యం చెప్పే విషయాలలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటో చెప్పు' [1] అని ఉమర్(రజి) నిలదీసి అడిగినప్పుడు, ఆ వ్యక్తి ఇలా వివరించాడు: 'ఒకరోజు నేను బజారులో ఉండగా ఒక దెయ్యం నా దగ్గరకు వచ్చింది. అది కలవరానికి లోనై ఉండటం నేను గమనించాను. అది ఇలా చెప్పింది: 'జిన్నుల పరిస్థితి ఎలా ఉందో నీకు తెలియదా!' ఆకాశ సమాచారాలు రాబట్టే పని నుండి వాటిని ఆపటం జరిగినప్పటి నుండీ అవి భీతి చెందాయి. నిరాశతో ఒంటెల తొట్లకు అతుక్కుపోయాయి'. అది విని, 'నీవు చెప్పింది నిజం' అని ధ్రువీకరించారు ఉమర్. ఆయన ఇంకా ఇలా అన్నారు: 'ఒకరోజు నేను కూడా ఆ రోజుల్లో విగ్రహాల దగ్గర పడుకుని ఉండగా, ఒక వ్యక్తి ఒక ఆవు దూడను తెచ్చి, విగ్రహం పేర దానిని జిబహ్ చేశాడు. అప్పుడు దాని లోపలి నుండి బిగ్గరగా శబ్దం వినిపించింది. అలాంటి అరువును నేను ఎన్నడూ వినలేదు. అది ఇలా అంది : 'ఓయీ విరోధి! ఒక విషయం చెబుతాను. దానివల్ల నీవు కృతార్థుడవు కావచ్చు. సంస్కారవంతుడైన ఒక వ్యక్తి లా ఇలాహ ఇల్లల్లాహ్ అని అంటున్నాడు. ఇది వినగానే అక్కడున్న వారంతా తేరుకుని అక్కడినుంచి నిష్క్రమించారు. నేను మాత్రం అక్కడి నుండి వెళ్ళకూడదని, ఆ తరువాత ఏం జరుగుతుందో చూడాలని నిశ్చయించుకున్నాను. మళ్ళీ అదే ధ్వని... 'ఓయీ విరోధి! నీకొక విషయం చెబుతాను. తద్వారా నీవు కృతార్థుడవు కాగలవు. మర్యాదస్తుడైన ఒక వ్యక్తి లా ఇలాహ ఇల్లల్లాహ్ అంటున్నాడు'. నేను లేచి నిల బడ్డాను. కొన్ని క్షణాల తర్వాత జనులు చెప్పుకోసాగారు– 'ఆయన (ముహమ్మద్–సఅసమ్), దేవుని సత్యవంతుడైన ప్రవక్త.'**

---

495–1. హజ్రత్ ఉమర్(రజి) తన దూరదృష్టి, మనోనేత్రం ఆధారంగా ఆ వ్యక్తి గురించి అలా ఊహించగలిగారు.

అబూ అమ్ర్ ఇలా అన్నారు: ఆ వ్యక్తి ఇస్లామ్‌కు పూర్వం– అజ్ఞాన కాలంలో– జోస్యం చెప్పేవాడు. హజ్రత్ ఉమర్(రజి) వేళాకోళానికి అతనితో, 'ఓ సవాద్! నీ జోస్యం ఇప్పుడేమయింది?' అని అడిగారు. దానికి ఆ వ్యక్తి కోపంతో, 'ఉమర్! మనం లోగడ ఉన్న స్థితి (అంటే కుఫ్ర్ స్థితి) జ్యోతిష్యం కన్నా హీన మయినది. ఇక నేను పశ్చాత్తాపపడిన దానిని గుర్తుచేసి, నన్ను ఉడికిస్తున్నారా? అల్లాహ్ దానిని క్షమించి వేశాడని నేనాశిస్తున్నాను' అన్నాడు.

**496) సయీద్ బిన్ జైద్(రజి) ముస్లిములనుద్దేశించి ఇలా అన్నారు: ఉమర్ ఇస్లామ్‌లో ప్రవేశించక పూర్వం నన్ను, తన చెల్లెలిని బంధించి, ఇస్లామ్ ఎందుకు స్వీకరించారని ఆగ్రహం వెలిబుచ్చారు. కాని ఈనాడు మీరు హజ్రత్ ఉస్మాన్(రజి) పట్ల వ్యవహరించిన తీరు ఎంత కర్కశమైనదంటే, ఒకవేళ ఆ తీరుకు ఉహుద్ పర్వతం తన స్థానం నుండి చలించినా, అది దానికి శోభాయమానమే."[1]**

## అధ్యాయం : 68

## చంద్రుడు చీలిపోవటం

**497) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: మక్కాలోని అవిశ్వాసులు ఏదయినా సూచనను చూపించమని దైవప్రవక్త(స)ను కోరినప్పుడు దైవప్రవక్త(స) చంద్రుణ్ణి రెండు భాగాలుగా చీల్చి చూపించారు. కడకు వారు హిరా కొండను ఆ రెండు భాగాల నడుమ ఉన్నట్లు చూశారు.**

**498) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా వివరించారు: చంద్రుడు రెండుగా చీలిపోయినప్పుడు మేము దైవప్రవక్త(స) వెంట 'మినా'**

---

496–1. మహనీయ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటన సియర్ గ్రంథాలలో చాలా వివరంగా వచ్చింది. దాని సారాంశం ఇది : ముహమ్మద్(స) తల నరికి తెచ్చినవానికి నూరు ఒంటెల్ని బహుమానంగా ఇస్తానని అబూ జహ్ల్ ప్రకటించాడు. ఉమర్(రజి) దీనికి ఆశపడి, ఖడ్గం వ్రేలాడదీసుకుని బయలుదేరారు. దారిలో ఒకరు ఎదురుపడి, 'ముహమ్మద్(స) సంగతి తర్వాత, ముందు నీ చెల్లెలు, నీ బావ సంగతి చూడు. వారిద్దరూ ఇస్లామ్ స్వీకరించార'ని చెప్పారు. దాంతో ఉమర్ సరాసరి తన చెల్లెలి వద్దకు వచ్చారు. చెల్లెల్ని, బావను కట్టి చితక బాదారు. చివరకు సిగ్గుతో కుంచించుకుపోయి, 'ఏదీ, ఇందాక మీరిద్దరూ చదువుతున్నదేమిటో నాకు వినిపించండి' అన్నారు. దానికి వారు, 'ముందు నువ్వు వుజూ చేసుకుని రా' అన్నారు. ఉమర్ వుజూ చేసుకుని వచ్చి ఆ సహీఫాను తెరచి చదివారు. అంతే, అప్రయత్నంగా ఆయన నోట **'అష్‌హదుఅంల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్‌హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్'** అనే వచనం వెలువడింది. ఆ తరువాత ఆయన దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. "ఉమర్! నీవు ఇస్లామ్ స్వీకరించు" అని ఆయన(స) సూచించారు. ఉమర్ నిష్కల్మషమైన మనసుతో కలిమా పఠించారు. అక్కడ ఉన్న ముస్లింలంతా సంతోషాతిశయంతో తక్బీర్ పలికారు.

**మైదానంలో ఉన్నాము. ఆయన(స) మమ్మల్ని ఉద్దేశించి, "ప్రజలారా! దీనికి మీరు సాక్షులుగా ఉండాలి" అన్నారు. చంద్రుని ఒక భాగం రెండవ దాన్నుంచి వేరై పర్వతం వైపునకు వెళ్ళింది. వేరొక ఉల్లేఖనం ప్రకారం చంద్రుడు చీలిపోయిన సంఘటన మక్కాలో[1] జరిగింది.**

**499) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయుల (సఅసమ్) కాలంలో ఖచ్చితంగా చంద్రుడు చీలిపోవటం జరిగింది.**

**500) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు: "చంద్రుడు చీలిపోవటం జరిగింది[1] (ఇందులో సందేహానికి తావులేదు)"**

## అధ్యాయం : 69

## ముస్లింలు అబిసీనియా వైపునకు వలస పోవటం[1]

**ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖించారు: "నాకు మీ హిజ్రత్ స్థలం (కలలో) చూపించబడింది. అక్కడ ఖర్జూర చెట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఆ స్థలం రెండు రాతి మైదానాల మధ్యన ఉంది". అందువల్ల (మక్కా) నుండి వలసపోయిన వారంతా మదీనా నగరానికి చేరుకున్నారు. అంతకుముందు అబిసీనియా (హబష్)కు వలస వెళ్ళిన వారు కూడా మదీనాకు తిరిగి వచ్చారు. దీనికి సంబంధించి అబూ మూసా, అస్మా బిన్తె ఉమైస్‌ల ఉల్లేఖనాలు కూడా ఉన్నాయి.**

---

498-1. ఈ రెండింటి మధ్యన వైరుధ్యం ఏమీ లేదు. ఎందుకంటే 'మినా' మైదానం కూడా మక్కా పరిధిలోనికే వస్తుంది.

500-1. చంద్రుడు చీలిపోయిన సంఘటన సత్యమని ఖుర్ఆన్,హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. విశ్వాసి (మోమిన్) అయిన వ్యక్తికి ఇంతకన్నా పెద్ద సాక్ష్యాధారం అవసరం లేదు. ఆనాడు ఇతర దేశాల వారు కూడా ఆ దృశ్యాన్ని చూసినట్లు రుజవులు ఉన్నాయి.

దివ్య ఖుర్ఆన్‌లో ఇలా వుంది: "ప్రళయ ఘడియ దగ్గరకు వచ్చేసింది. చంద్రుడు చీలిపోయాడు. కాని వారి పరిస్థితి ఎలా ఉందంటే, వారు ఏ సూచనను చూసినా తమ ముఖాలను తిప్పుకుంటున్నారు." (54: 1,2)

69-1. మక్కాలో ముస్లింలకు వ్యతిరేకంగా సత్య తిరస్కారుల అత్యాచారాలు మితిమీరి

**501)** మిస్వర్ బిన్ మఖ్రమా, అబ్దుర్రహ్మాన్ బిన్ అస్వద్ బిన్ అబ్దె యగూస్– వీరిద్దరూ ఉబైదుల్లాహ్ బిన్ అదీతో, 'నువ్వు నీ మామయ్య గారైన (అమీరుల్ మోమినీన్) హజ్రత్ ఉస్మాన్(రజి)తో, ఆయన సోదరుడు వలీద్ బిన్ ఉఖబా బిన్ అబీ ముఅయ్త్ గురించి ఎందుకు మాట్లాడవు?' అన్నారు. (ఇంతకీ అసలేం జరిగిందంటే వలీద్ పట్ల మహనీయ ఉస్మాన్–రజి వ్యవహరించిన తీరును ప్రజలు ఆక్షేపించారు). దానికి సమాధానంగా ఉబైదుల్లాహ్ ఇలా అన్నారు: 'హజ్రత్ ఉస్మాన్(రజి) నమాజ్ కొరకు బయలుదేరినప్పుడు నేను దారిలో నిలబడి, మీతో నాకు ఒక పని పడింది. మీకు శ్రేయోభిలాషతో కూడిన సలహా ఇవ్వవలసి ఉంది' అని చెప్పాను. దానికి ఆయన, 'భలేవాడివే. నీ వ్యవహారంలో నేను దేవుని శరణు వేడుతున్నాను' అని అన్నారు. అది విని నేను తిరిగి వచ్చేశాను. నమాజ్‌ను ముగించిన పిదప నేను మిస్వర్ బిన్ మఖ్రమాను, ఇబ్నె అబ్దె యగూస్‌ను కలుసుకుని, ఉస్మాన్‌కు నేను చెప్పిన దానిని, దానికి సమాధానంగా ఆయన చెప్పిన మాటను వివరించాను. దానికి వారు, 'సరే. నీవు నీ బాధ్యతను నెరవేర్చావు' అని నిట్టూర్చారు.

నేను ఆ సమావేశంలో కూర్చుని ఉండగానే ఉస్మాన్(రజి) మనిషి ఒకడు నా దగ్గరకు (నన్ను పిలవటానికి) వచ్చాడు. అప్పుడు వాళ్ళిద్దరూ నాతో, 'అల్లాహ్ నిన్ను పరీక్షకు లోను చేశాడు' అని వ్యాఖ్యానించారు. నేను అక్కడి నుండి లేచి, మహనీయ ఉస్మాన్(రజి) సన్నిధిలో హాజరయ్యాను. ఆయన నన్ను చూడగానే, "ఇందాక నీవు శ్రేయోభిలాష గురించి ప్రస్తావించావు కదా! ఇంతకీ ఏమిటది?" అని అడిగారు. దానికి జవాబుగా నేనిలా అన్నాను– 'సాక్షిగా అల్లాహ్ చాలు. అల్లాహ్ ముహమ్మద్(స)ను ప్రవక్తగా చేసి, ఆయనపై తన గ్రంథాన్ని అవతరింపజేసినప్పుడు, ప్రవక్త(స) పిలుపునకు చిత్తం అని పలికినవారిలో మీరు కూడా ఒకరు. మీరు దైవప్రవక్త(స)ను విశ్వసించారు. దైవమార్గంలో రెండుసార్లు హిజ్రత్ చేశారు (ఒకసారి అబిసీనియాకు, రెండవసారి మదీనాకు). ప్రవక్త సహచర్య భాగ్యానికి నోచుకున్నారు. ప్రవక్త(స) గారి పద్ధతుల్ని ప్రత్యక్షంగా తిలకించారు. అసలు విషయా

---

పోవటంతో, వారిని ఎదుర్కొనే శక్తి ముస్లింల వద్ద లేకపోవటంతో అబిసీనియా దేశానికి హిజ్రత్ చేయటానికి దైవప్రవక్త ముస్లింలకు అనుమతి ఇచ్చారు. ముస్లింలకు సుస్థిరత లభ్యమయ్యే వరకు అక్కడే ఉండమని కూడా దైవప్రవక్త(స) వారికి సూచించారు.

నికి వస్తున్నాను. వలీద్ బిన్ ఉఖబా విషయంలో ప్రజలు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. కాబట్టి మీరు తాత్సారం చేయకుండా అతనికి (మద్యపాన సేవనానికి గాను) శిక్ష విధించటం అవసరం'.

అంతా విన్న తర్వాత హజ్రత్ ఉస్మాన్(రజి) "మేనల్లుడా! నువ్వు ప్రవక్త మహనీయుల(స)ను చూశావా?" అని అడిగారు. దానికి నేను 'లేదు. కాని ప్రవక్త(స) వారి బోధనలు నాకు తెలిశాయి. ఒక కన్నెపిల్ల పరదాలో ఉండి ధార్మిక విషయాలు ఎలా తెలుసుకోగలుగుతుందో అలాగే నేను ధార్మిక విషయాలు నేర్చుకున్నాను' అని చెప్పాను. ఆ తరువాత ఉస్మాన్(రజి) కూడా అల్లాహ్‌ను సాక్షిగా చేసుకుని ఇలా అన్నారు: "నిశ్చయంగా అల్లాహ్ ముహమ్మద్(స)ను సత్యంతోపాటు ప్రవక్తగా నియుక్తం చేశాడు. ఆయనపై తన గ్రంథాన్ని అవతరింపజేశాడు. అల్లాహ్, ఆయన ప్రవక్త(స) పిలుపుపై 'హాజరయ్యాను' అని సమాధానం ఇచ్చిన వారిలో నేనూ ఒకణ్ణి అన్నది కూడా నిజమే. మహాప్రవక్త(స) తెచ్చిన షరీఅత్‌ను నేను విశ్వసించాను. నీవు చెప్పినట్లుగా నేను రెండు హిజ్రత్‌లు కూడా చేశాను. నేను దైవప్రవక్త(స) సాంగత్యం ద్వారా లబ్ది పొందాను. ఆయనకు ప్రమాణబద్ధుణ్ణి కూడా అయ్యాను. దైవసాక్షిగా! నేను ఆయన(స)కు అవిధేయత కనబరచలేదు. ఆయన పట్ల స్వామి ద్రోహానికి కూడా ఒడిగట్టలేదు. కడకు ఆయన(స) పరమపదించిన మీదట హజ్రత్ అబూబక్ర్(రజి) ఖలీఫాగా ఎన్నుకోబడ్డారు. దైవసాక్షిగా! నేను ఆయన యెడల కూడా ఎన్నడూ అవిధేయతా వైఖరిని అవలంబించలేదు. ఏ వ్యవహారంలో కూడా ఆయన పట్ల ద్రోహం చేయలేదు. ఆయన తదనంతరం హజ్రత్ ఉమర్(రజి) ఖలీఫా అయ్యారు. నేను ఆయన యెడల కూడా అవిధేయునిగా ఉండలేదు. ఆయనకు నమ్మక ద్రోహం కూడా చేయలేదు. ఆ తరువాత నేను ఖలీఫా అయ్యాను. వారందరికీ (పూర్వపు ఖలీఫాలకు) నాపై ఏఏ హక్కులుండేవో ఆ హక్కులు నాకు మీపైన లేవా?" 'ఖచ్చితంగా మీకు ఆ హక్కు ఉంది' అని ఉబైదుల్లాహ్ చెప్పారు. అప్పుడు ఉస్మాన్ (రజి) ఇలా అన్నారు : "మరలాంటప్పుడు మీరందరి ద్వారా నాకు చేరుతున్న ఈ మాటల్లో ఏపాటి నిజం ఉంది? ఇక వలీద్ బిన్ ఉఖబా సంగతంటావా, దైవచిత్తమైతే మేము అతన్ని ఈ వ్యవహారంలో ధర్మబద్ధంగా పట్టుకుంటాము". ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు : ఎట్టకేలకు (సాక్ష్యాధారాలు లభించాక) వలీద్ బిన్ ఉఖబాకు నలభై

**కొరడా దెబ్బలు కొట్టబడ్డాయి. కొరడా దెబ్బలు కొట్టమని హజ్రత్ అలీ(రజి)ని ఆజ్ఞాపించగా, అలీ(రజి)యే అతనికి కొరడా దెబ్బలు కొట్టారు.[1]– ఈ హదీసును యూనుస్, జుహ్రీ భ్రాతృజుడు కూడా జుహ్రీ నుండి ఉటంకించారు. అందులో ఉస్మాన్ (రజి) గారు ఈ విధంగా పలికినట్లు ఉంది: "వారికి మీపైన ఎలాంటి హక్కు లుండేవో అలాంటి హక్కులే నాకు మీపైన లేవా?"**

---

501–1. తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(రజి) కూఫా గవర్నర్‌గా ఉన్న మహనీయ సాద్ బిన్ అబీ వక్కాస్(రజి)ను పదవి నుంచి తొలగించి, ఆయన స్థానంలో వలీద్ బిన్ ఉఖబాను నియమించారు. వలీద్ అక్కడ ఎన్నో విపరీతమైన పోకడలకు పాల్పడ్డాడు. సారాయి తాగిన మత్తులో నమాజ్‌కు సారథ్యం వహించడానికి నిలబడ్డాడు. కాని అతన్ని శిక్షించడంలో హజ్రత్ ఉస్మాన్(రజి) జాప్యం చేశారు. ప్రజలు దీనిని సహించలేకపోయారు. అందుకే ఉస్మాన్ మేనల్లుడైన ఉబైదుల్లాహ్ బిన్ అదీని తమ ప్రతినిధిగా చేసి ఉస్మాన్(రజి) దగ్గరకు పంపారు.

హజ్రత్ ఉస్మాన్(రజి) ఉబైదుల్లాహ్‌ను మొదట చూడగానే ఏదో ఆర్థిక సహాయం కోసం వచ్చి ఉంటారని తలపోసి, ఆయన మాటల్ని పట్టించుకోలేదు. 'మీ శ్రేయాన్ని అభిలషించి ఒక సలహా ఇవ్వదలిచాను' అనే ఉబైదుల్లాహ్ మాటపై ఆలోచనలో పడిపోయారు ఉస్మాన్. తర్వాత సంభాషణ ముగిసిన పిదప, మహనీయ అలీ(రజి) చేత వలీద్‌కు కొరడా దెబ్బల శిక్షను విధించారు.

ముస్లింలు అబిసీనియా దేశం వైపునకు హిజ్రత్ చేశారన్నది అధ్యాయంలోని ముఖ్యాంశం. మొదట దైవప్రవక్త(స) సుమారు 80 మంది ముస్లింలను నజాషీ చక్రవర్తి ఏలుబడిలో ఉన్న అబిసీనియా (హబషా)కు పంపారు. కాని ఆ తర్వాత మక్కాలోని బహు దైవారాధకులు సూరయె నజ్మ్ పారాయణం తర్వాత దైవ ప్రవక్త(స)తో కలసి సజ్దా చేశారని ముస్లింలకు తెలిసింది. బహుశా మక్కాలోని ముష్రిక్కులు ముస్లింలుగా ధర్మపరివర్తన చెందారని భావించి అబిసీనియాలోని ముహాజిర్ ముస్లింలు మక్కాకు తిరిగి వచ్చారు. కాని వారి అంచనా తప్పు అని మక్కాకు చేరుకున్న మీదట తెలిసింది. అందువల్ల వారు తిరిగి అబిసీనియా వైపు ప్రయాణమయ్యారు. ఈ పయన బృందంలో 83 మంది పురుషులు, 18 మంది స్త్రీలు ఉన్నారు. కాని రెండవసారి అబిసీనియాకు వలసపోయిన వారిలో హజ్రత్ ఉస్మాన్(రజి) లేరు. ఆయన రెండుసార్లు హిజ్రత్ చేశారంటే ఒకసారి అబిసీని యాకు, ఒకసారి మదీనాకు అని అర్థం చేసుకోవాలి.

**502)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: ఉమ్మె హబీబా(ర.అ), ఉమ్మె సలమా (ర.అ) లిద్దరూ ఒక చర్చీ గురించి ప్రస్తావించారు. దానిని వారు అబిసీనియా (హబషా)లో చూశారు. ఆ చర్చిలో రూపచిత్రాలున్నాయి. ఈ విషయాన్ని వారు ప్రవక్త మహనీయుల (సఅసమ్) ముందు ప్రస్తావించినప్పుడు, ఆయన(స) ఇలా అన్నారు : "వారిలో ఎవరయినా సత్పురుషుడు మరణించినప్పుడు, అతని సమాధిపై వారు ఆరాధనాలయాన్ని నిర్మించి, అందులో అతని రూపచిత్రాలను ఉంచేవారు. ఈ పని చేసినవారు ప్రళయదినాన అల్లాహ్ సమక్షంలో అత్యంత నీచమైన సృష్టితాలుగా ఉంటారు."[1]

**503)** ఉమ్మె ఖాలిద్ బిన్తె ఖాలిద్ (ర.అ) వివరించారు: నేను అబిసీనియా దేశం నుండి (తిరిగి) వచ్చినప్పుడు పిన్న వయస్కురాలిని. ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక గళ్ళ దుప్పటిని నాకు ప్రదానం చేశారు. తరువాత ఆయన(స) ఆ చారలపై తన చేతిని నిమిరి "సనాహ్ సనాహ్" అని పలికారు– హుమైదీ ఇలా అన్నారు : 'సనాహ్ సనాహ్' అనేది అబిసీనియా (భాష) పదం. 'భలే భలే' అని దీనికి అర్థం.

**504)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం: (తొలి కాలంలో) మేము దైవప్రవక్త (సఅసమ్) నమాజ్ చేస్తున్న సమయంలో ఆయనకు సలామ్ చేసినట్లయితే, ఆయన(స) నమాజ్ స్థితిలోనే మా సలామ్‌కు జవాబు ఇచ్చేవారు. కాని మేము నజాషీ రాజు దేశం నుండి (మదీనాకు) తిరిగి వచ్చినప్పుడు, నమాజ్ స్థితిలో నున్న దైవప్రవక్త(స)కు సలామ్ చేశాము. కాని ఆయన సలామ్‌కు బదులు ఇవ్వలేదు. నమాజ్ ముగించిన తరువాత, 'దైవప్రవక్తా! లోగడ మేము మీకు సలామ్ చేస్తే, నమాజ్ స్థితిలో కూడా మీరు మా సలామ్‌కు జవాబు ఇచ్చేవారు కదా!' అని సందేహపడగా, "అవును,నమాజ్‌లో మనిషి వ్యాపకంలో నిమగ్నుడై ఉంటాడు" అని పలికారు. 'ఇలాంటి సమయాల్లో మీరేం చేస్తారు?' అని సులైమాన్ ఆమష్ గారు ఇబ్రాహీమ్ నఖ్యీని అడగ్గా, 'నేను మనసులోనే జవాబు ఇచ్చుకుంటాను' అని సమాధానం ఇచ్చారు.

---

502–1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. ఇమామ్ బుఖారీ(రహ్మా) మళ్ళీ దీనిని ఇక్కడ తీసుకురావటంలోని ఉద్దేశ్యం, ఈ అధ్యాయంలో అబిసీనియా ప్రస్తావన రావటమే.

**505)** హజ్రత్ అబూ మూసా అష్అరీ(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనాకు హిజ్రత్ చేశారన్న వార్త మాకు అందినప్పుడు మేము యమన్‌లో ఉన్నాము. తరువాత మేము పడవలో ప్రయాణమయ్యాము. కాని కాకతాళీయంగా గాలి మా పడవను నజాషీ రాజ్యం వైపునకు తీసుకుపోయింది. అక్కడ మాకు జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి) ఎదురయ్యారు. (అంతకుముందే ఆయన అబిసీనియా దేశా నికి వలసపోయారు). మేము ఆయనతోపాటే అక్కడ ఉండిపోయాము. ఆ తరువాత కొంత కాలానికి మేము మదీనా వైపునకు బయలు దేరాము. మేము దైవప్రవక్త(స)ను కలుసుకునే సమయానికి ఆయన ఖైబర్‌ను జయించారు. ఆయన(స) మమ్మల్ని ఉద్దేశించి "ఓ పడవ వారలారా! మీరు రెండు హిజ్రత్‌లు చేశారు"[1] అని పలికారు.

## అధ్యాయం : 70

## అబిసీనియా రాజు నజాషీ మరణం గురించి

**506)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) కథనం : అబిసీనియా చక్రవర్తి మరణించినప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా అన్నారు : "ఈ రోజు ఒక సత్పురుషుడు ఈ లోకం నుండి నిష్క్రమించాడు. లేవండి, మీ సోదరుడు అస్‌హమా నమాజె జనాజా చేయండి."[1]

**507)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) తెలిపారు: "ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) నజాషీ చక్రవర్తి (చనిపోయినప్పుడు) నమాజె జనాజా చేశారు. మేము వరుస తీరి ఆయన(స) వెనుక నిలబడ్డాము. నేను రెండవ లేక మూడవ వరుసలో ఉన్నాను."

---

505–1. అంటే ఒక హిజ్రత్ మక్కా నుండి అబిసీనియాకు. మరొక హిజ్రత్ అబిసీనియా నుంచి మదీనాకు.

'ముస్లిం'లోని ఉల్లేఖనంలో ఇలా వుంది: ఖైబర్ యుద్ధంలో పాల్గొనని వారికి ఆయన యుద్ధప్రాప్తిని ఇవ్వలేదు. కాని పడవ ప్రయాణం చేసి వచ్చిన వారికి మాత్రం జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి)తోపాటే వాటా ఇచ్చారు.

506–1. దీనినిబట్టి నజాషీ చక్రవర్తి ముస్లింగా పరివర్తన చెందాడని విదితమవుతోంది. ఎవరయినా ఒక వ్యక్తి మరణించినప్పుడు అతని పరోక్షంలో నమాజె జనాజా గాయిబానా ఆచరించటం సరైనదేనని కూడా దీని ద్వారా తెలుస్తోంది.

**508) హ|జత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) నజాషీ చక్రవర్తి అస్‌హమా అంత్యక్రియల నమాజు (గాయిబానా) చదివారు. ఆ సందర్భంగా ఆయన(స) నాలుగు సార్లు తక్బీర్లు పలికారు- యజీద్ బిన్ హారూస్‌తోపాటు ఈ హదీసును అబ్దుస్సమద్ బిన్ అబ్దుల్ వారిస్ కూడా (సులైమ్ బిన్ హయ్యాన్) నుండి ఉటంకించారు.**

**509) హ|జత్ అబూ హురైరా (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) నజాషీ చక్రవర్తి మరణించిన రోజే ఆ మరణవార్తను తెలియజేశారు. "మీ సోదరుని మన్నింపునకై ప్రార్థించండి" అని ఆయన(స) సూచించారు.**

**వేరొక సనదు ప్రకారం మహనీయ అబూ హురైరా(రజి) ఇలా తెలిపారు: మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) నజాషీ నమాజె జనాజా కొరకు ఈద్గాహ్‌లో తన ప్రియసహచరులను వరుసల్లో నిలబెట్టి నజాషీ చక్రవర్తి నమాజె జనాజా చేయించారు. ఈ సందర్భంగా ఆయన(స) నాలుగు సార్లు తక్బీర్ (అల్లాహు అక్బర్) పలికారు.**

## అధ్యాయం : 71

## దైవప్రవక్త(సఅసమ్)కు వ్యతిరేకంగా బహు దైవారాధకుల ప్రతిజ్ఞ[1]

**510) హ|జత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు**

71-1. ఒక వైపున ప్రవక్త ప్రియ సహచరులు కొందరు అబిసీనియా దేశానికి వలసపోయి ప్రశాంతంగా జీవించటం, మరోవైపున హ|జత్ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరించటం, ఇంకోవైపున ఇస్లామ్ నలువైపులా వ్యాప్తి చెందటం- ఈ పరిణామాలను ఖురైషులు జీర్ణించుకోలేకపోయారు. ఆవేశం అసూయా ద్వేషాలతో ఊగిపోయారు. అందుకే వారంతా కలసి ఒక తీర్మాన పత్రాన్ని తయారు చేశారు. అందులో ఇలా లిఖించబడింది: "ముహమ్మద్(స)ను మాకు అప్పగించే వరకూ బనీ హాషిమ్‌తో, బనీ ముత్తలిబ్‌తో వివాహ సంబంధాలు ఏర్పరచుకోవటం గానీ, క్రయ విక్రయాలు జరపటం గానీ జరగదు"- ఈ పత్రాన్ని లిఖించిన తరువాత ఖురైషులు దానిని కాబా గృహం లోపల గోడకు వ్రేలాడదీశారు. అంటే ఒక విధంగా ఇది సంఘ బహిష్కరణే. తత్కారణంగా బనీ హాషిమ్, బనీ ముత్తలిబ్‌తో కలసి దైవప్రవక్త(స) ఒక పర్వత కనుమ వద్ద విడిది చేయాల్సి వచ్చింది. అక్కడ వారు ఎదుర్కొన్న బాధలు వర్ణనాతీతం. ఒకరోజు దైవప్రవక్త(స) తన పెత్తండ్రి అబూ తాలిబ్‌తో, "ఆ తీర్మాన పత్రానికి చెదలు పట్టింది. ఆ పత్రాలలో ఒక్క అల్లాహ్ అనే పదం మాత్రమే మిగిలి

**(సఅసమ్) హునైన్ యుద్ధ సంకల్పం చేసుకున్నప్పుడు, "దైవచిత్తమైతే రేపు మేము బనీ కనానా తెగవారి ప్రదేశంలో విడిది చేయనున్నాము. అక్కడి ప్రజలు సదా అవిశ్వాసులుగానే ఉంటామని ప్రతినబూనారు" అని చెప్పారు.**

## అధ్యాయం : 72

## అబూ తాలిబ్ సంఘటన[1]

**511) హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి) కథనం : ఈయన గారు దైవప్రవక్త(స)తో, "మీ పెత్తండ్రి అబూతాలిబ్ మిమ్మల్ని సమర్థించేవారు, మీ కొరకు ప్రజలను కోపగించుకునేవారు కదా! మరి మీరు ఆయనకు ఏ విధంగా తోడ్పడ గలరు?" అని ప్రశ్నించగా, "(ఈ కారణంగానే) ఆయన మడమల వరకూ నరకంలో ఉన్నారు. నేను గనక ఆయన కొరకు సిఫారసు చేయకుండా ఉంటే ఆయన నరకంలోని అట్టడుగు భాగంలో పడి ఉండేవారే" అని దైవప్రవక్త(స) సమాధానమిచ్చారు.**

**512) సయీద్ బిన్ ముసయ్యిబ్ తన తండ్రి నుండి ఉటంకించారు : అబూ తాలిబ్‌కు మరణ ఘడియలు సమీపించినప్పుడు ప్రవక్త మహనీయులు(స) ఆయన**

---

ఉంది" అని చెప్పారు. అప్పుడు అబూ తాలిబ్, ఖురైషు ప్రముఖులతో, 'మీరు కాబా గృహం లోపల గోడకు వ్రేలాడదీసిన తీర్మాన పత్రానికి చెదలు పట్టిందని నా భ్రాతృజుడు అంటున్నాడు. కావాలంటే మీరు కాబా లోపలికి వెళ్ళి చూసుకోండి. ఒకవేళ అతని మాట నిజమైతే మేము మా బొందిలొ ప్రాణమున్నంత వరకూ అతన్ని మీకు అప్పగించటం జరగదు. ఒకవేళ అతను తన మాటలో అబద్ధీకుడై ఉంటే అతనిని మీకు అప్పజెపుతాం. మీరతన్ని చంపుతారో, బ్రతికి ఉండనిస్తారో మీ ఇష్టం' అని చెప్పారు. ఖురైషులు కాబా తలుపు తెరచి ఆ పత్రాన్ని పరిశీలించారు. అందులో ఒక్క అల్లాహ్ పదం తప్ప మిగిలిన అక్షరాలన్నింటినీ చెదలు తినేసింది. అప్పుడు వారేమన్నారో తెలుసా? 'అబూ తాలిబ్! మీ భ్రాతృజుడు మహా మాంత్రికుడు'.

దైవప్రవక్త(స) అబూ తాలిబ్‌కు చెదలు పట్టిన విషయాన్ని తెలియపరచినప్పుడు, 'ఈ విషయం నీకు ఎలా తెలుసు?' అని ఆయన అడిగారు. దానికి ఆయన(స) "నాకు అల్లాహ్ తెలియపరిచాడ"ని అన్నారు.

72–1. ఈయన మహాప్రవక్త ముహమ్మద్(స) పెత్తండ్రి. అంటే ప్రవక్త నాన్న గారైన అబ్దుల్లాహ్ అన్నయ్య. ఈయన జీవించి ఉన్నంత కాలం దైవప్రవక్త(స)కు వెన్నుదన్నుగా నిలిచారు. కాని ఇస్లామ్ స్వీకరించలేదు.

దగ్గరకు వచ్చారు. ఆ సమయంలో అబూ జహ్లో కూడా అక్కడే కూర్చుని ఉన్నాడు. ప్రవక్త మహనీయులు(స) తన పెత్తండ్రితో, "పెదనాన్న! **లా ఇలాహ ఇల్లల్లాహ్** అని ఒక్కసారి పలకండి. అల్లాహ్ దర్బారులో మీ కొరకు సిఫారసు చేయడానికి నాకు ఈ ఒక్క ఆధారం సరిపోతుంది" అని ప్రాధేయపడ్డారు. దీనికి అబూజహ్లో, అబ్దుల్లాహ్ బిన్ అబీ ఉమయ్యా అడ్డు తగులుతూ, "ఓ అబూతాలిబ్! అబ్దుల్ ముత్తలిబ్ మతం నుండి మీరు మరలిపోతారా?" అని మాటిమాటికీ చెబుతూ అబూ తాలిబ్పై ఒత్తిడి తీసుకువచ్చారు. చివరకు అబూ తాలిబ్ నోట, "నేను అబ్దుల్ ముత్తలిబ్ మతంపైనే ఉన్నాను" అనే మాట వెలువడింది. తరువాత దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "నన్ను వారించబడనంత వరకూ నేను ఆయన మన్నింపునకై ప్రార్థిస్తూనే ఉంటాను". అప్పుడు ఈ ఆయత్ అవతరించింది : "ముష్రిక్కులను క్షమించ వలసినదిగా ప్రార్థన చెయ్యటం ప్రవక్తకూ, విశ్వాసులకూ తగని పని. వారు వారికి బంధువులైనప్పటికీ, ఇంకా వారు నరకానికి అర్హులని వారికి స్పష్టమైనప్పుడు."

***(అత్ తౌబా : 113)***

ఇంకా ఈ ఆయత్ కూడా అవతరించింది. "(ప్రవక్తా!) నీకు ఇష్టమైన వారికి నీవు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించలేవు." ***(అల్ ఖసస్: 56)***

**513)** దైవప్రవక్త(సఅసమ్) చెప్పగా హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) విన్నారు. ఒకసారి ఆయన(స) సమావేశంలో ఆయన పెత్తండ్రి (అబూతాలిబ్) ప్రస్తావన వచ్చినప్పుడు, "బహుశా ప్రళయదినాన ఆయన గారికి నా సిఫారసు ఉపకరించవచ్చు. కేవలం కాలిమడమల వరకే ఆయన్ని నరకంలో ఉంచవచ్చు. ఆ సెగకు ఆయన మెదడు కుతకుత ఉడుకుతుంది."

**514)** బైతుల్ మఖ్దిస్ వరకూ తీసుకెళ్ళబడిన వృత్తాంతాన్ని గురించి అల్లాహ్ బనీ ఇస్రాయీల్ సూరాలో ప్రస్తావించాడు : "కొన్ని నిదర్శనాలను చూపటానికి తన దాసుణ్ణి ఒక రాత్రి మస్జిదె హరాం నుండి దూరాన ఉన్న మసీదు వద్దకు తీసుకు పోయిన ఆయన పరిశుద్ధుడు."[1] ***(17: 1)***

---

514-1. 'మేరాజ్' ప్రాప్తమయిన రాత్రి దైవప్రవక్త(స) ఉమ్మె హానీ ఇంట్లో ఉన్నారు. ఇక్కడ మస్జిదె హరామ్ అంటే **'హరమ్'** పరిధిలో ఉన్న భూభాగం అని అర్థం చేసు కోవాలి. మక్కా నుండి బైతుల్ మఖ్దిస్ వరకు గల ప్రయాణాన్ని 'ఇస్రా'

**515)** **ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నానని హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు: ప్రవక్త(స) ఇలా చెప్పారు: "ఖురైషులు (మేరాజ్ సంఘటన సందర్భంగా) నన్ను అబద్ధీకరించినప్పుడు, నేను 'హతీమ్'లో నిలబడ్డాను. అప్పుడు అల్లాహ్ నా కొరకు బైతుల్ మఖ్దిస్‌ను జ్యోతిర్మయం చేశాడు. నేను దానిని చూస్తూ ఖురైషులకు దాని ఆకులను, చిహ్నాలను వివరిస్తూపోయాను."[1]**

## అధ్యాయం : 73

## మేరాజ్ (గగనయాత్ర) గురించి...[1]

**516)** **అనస్ బిన్ మాలిక్(రజి) తనతో చెప్పారని ఖతాదా తెలిపారు. అనస్‌కు మాలిక్ బిన్ సాసా(రజి) వివరించారు. ఈయనకు ప్రవక్త మహనీయులు (సఅసమ్) మేరాజ్ రాత్రి జరిగిన సంఘటనను వివరించారు. దైవప్రవక్త(సఅసమ్)**

---

అంటారు. ఇది ఖుర్ఆన్ ద్వారా రూఢీ అవుతోంది. దీనిని తిరస్కరించినవాడు సత్య తిరస్కారి అవుతాడు. ఇక బైతుల్ మఖ్దిస్ నుండి సప్తాకాశాల వరకు సాగిన గగన యాత్ర ప్రామాణిక హదీసుల ద్వారా నిరూపితమవుతోంది. కాబట్టి దీనిని కాదన్న వాడు మార్గభ్రష్టుడుగా, బిద్అతీగా పరిగణించబడతాడు. ఈ 'ఇస్రా–మేరాజ్' శారీరకంగా, మానసికంగా కూడా– మేల్కొని ఉన్న స్థితిలో జరిగిందని అత్యధిక మంది సలఫ్‌లు, అహ్లె హదీసు వారు అంటారని హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ) పేర్కొన్నారు. కాగా, మరికొంత మంది బైతుల్ మఖ్దిస్ వరకు గల ప్రయాణం మేల్కొని ఉన్న స్థితిలో జరిగిందని, గగనయాత్ర మాత్రం స్వప్నంలో జరిగిందని అంటారు.

515–1. బైహఖీలోని ఉల్లేఖనం ప్రకారం; దైవప్రవక్త(స) 'ఇస్రా– మేరాజ్' సంఘటనను విడమరచి చెప్పినప్పుడు ఖురైషుల్లోని సత్య తిరస్కారులు దానిని త్రోసిపుచ్చారు. వారు అబూబక్ర్(రజి) దగ్గరకు వచ్చి, దీని గురించి చెప్పినప్పుడు, ఆయన(రజి) దానిని సత్యమని ధ్రువపరిచారు. ఆనాటి నుంచే ఆయనకు 'సిద్దీఖ్' (సత్య వంతుడు) అనే బిరుదు లభించింది.

73–1. 'మేరాజ్' అంటే ఎక్కడం, అధిరోహించటం అని అసలు అర్థం. మక్కా నుండి మస్జిదె అక్సా వరకు సాగిన ప్రయాణాన్ని 'ఇస్రా' అంటారు. మస్జిదె అక్సా నుండి గగనయాత్రకు గొనిపోబడిన సంఘటనను 'మేరాజ్'గా పేర్కొంటారు. 'ఇస్రా–మేరాజ్' రెండు ఒకే రాత్రివేళ సంభవించాయి.

**ఇలా వివరించారు– "నేను హతీమ్‌లో పండుకుని ఉన్నాను– కొన్నిసార్లు ఖతాదా గారు 'హతీమ్'కు బదులు 'హిజ్ర్' అనే పదాన్ని ప్రయోగించారు– నా దగ్గరకు ఒక వ్యక్తి (జిబ్రీల్– అలైహిస్సలాం) వచ్చారు. ఆయన నా రొమ్మును చీల్చారు (ఖతాదా ఇలా వివరించారు : నేను అనస్–రజి– చెప్పగా విన్నాను : 'ఇక్కడి నుండి ఇక్కడి వరకూ' అని. 'అనస్ గారు పలికిన ఈ పదంలోని మర్మం ఏమిటి?' అని నేను నాకు దగ్గరలోనే కూర్చొని ఉన్న జారూద్‌ను అడగ్గా, 'గొంతునుండి నాభి వరకు' అని ఆయన చెప్పారు. ('దైవప్రవక్త(స) వారి రొమ్ము నుండి నాభి వరకు చీల్చినట్లుగా అనస్ చెప్పగా నేను విన్నానని కూడా ఖతాదా తెలిపారు). తరువాత నా హృదయాన్ని తీశారు. ఒక బంగారు పళ్ళెం ప్రత్యక్షపరచబడింది. అది విశ్వాసం (ఈమాన్)తో[1] నిండి ఉంది. నా హృదయాన్ని కడిగి, యథాస్థానంలో ఉంచటం జరిగింది. ఆ తరు వాత ఒక జంతువు తేబడింది. అది గుర్రం కన్నా చిన్నదిగానూ, గాడిద కన్నా పెద్దది గానూ ఉంది. తెల్లని రంగులో ఉంది– 'అబూ హమ్జా! అది బురాఖ్ వాహనమా?' అని జారూద్ హజ్రత్ అనస్ (రజి)ను అడగ్గా, 'అవున'ని ఆయన(స) బదులిచ్చారు. దాని చూపు ఎంతదూరం వరకు పడుతుందో అంతదూరం వరకు దాని ప్రతి అడుగు పడుతుంది. (దైవప్రవక్త(స) ఇలా వివరించారు) "నన్ను ఆ వాహనంపైకి ఎక్కించటం జరిగింది. జిబ్రీల్(అలైహిస్సలాం) నన్ను తీసుకుని భూమండలానికి సమీపంలోనున్న ఆకాశం వరకు వెళ్ళారు. ఆయన తలుపు తెరువమని కోరినప్పుడు, 'ఎవరు?' అని ప్రశ్నించటం జరిగింది. 'నేను జిబ్రీల్(అ)ని' అని ఆయన సమాధానం ఇచ్చారు. 'మీ వెంట ఉన్నవారెవరు?' అని అడిగితే, 'ముహమ్మద్(స)' అని ఆయన చెప్పారు. 'ఆయన్ని పిలువడానికే మీరు పంపబడ్డారా?' అని ప్రశ్నించగా, 'అవున'ని ఆయన జవాబిచ్చారు. అప్పుడు 'అలాగైతే ఈయనకు స్వాగతం. ఇక్కడికి వచ్చిన ఆయన ఎంతో శుభవంతులు!' అని పలుకుతూ తలుపులు తెరిచారు. నేను లోనికి వెళ్ళగానే మహనీయ ఆదమ్(అలైహిస్సలామ్)ను చూశాను. 'ఈయన మీ తాత గారు, ఆదమ్(అ). ఈయనకు సలామ్ చేయండి' అని జిబ్రీల్(అ) చెప్పగా, నేనాయన గారికి సలామ్ చేశాను. ఆయన నా సలామ్‌కు జవాబిస్తూ 'సజ్జనుడవైన కుమారుడా! సౌజన్యశీలుడవైన ప్రవక్తా! నీకు స్వాగతం!' అన్నారు. అక్కడి నుండి**

516–1. మరో ఉల్లేఖనంలో అది విశ్వాసం (ఈమాన్), విజ్ఞత (హిక్మత్)తో నింపబడి ఉంది అని చెప్పబడింది.

జిబ్రీల్(అ) నన్ను వెంటబెట్టుకుని రెండవ ఆకాశంపైకి వచ్చారు. అక్కడ కూడా తలుపు తెరిపిస్తున్నప్పుడు 'ఎవరు?' అని శబ్దం వచ్చింది. దానికి 'నేను జిబ్రీల్(అ)ని' అని చెప్పారు. 'మీ వెంట ఇంకా ఎవరయినా ఉన్నారా?' అని ప్రశ్నించబడగా, 'ముహమ్మద్(స) ఉన్నార'ని జవాబివ్వడం జరిగింది. 'ఆయన్ని పిలుచుకు రావడానికే మీరు పంపబడ్డారా?' అని తిరిగి ప్రశ్నించగా, 'అవున'ని ఆయన బదులిచ్చారు. అప్పుడు 'అలాగైతే ఈయనకు స్వాగతం! ఇక్కడకు ఏతెంచిన ఈయన ఎంతో శుభప్రదమైన వారు' అన్న సమాధానం వచ్చింది. తరువాత ఆకాశ ద్వారం తెరుచుకుంది. అక్కడ యహ్యా(అలైహిస్సలాం), ఈసా(అలైహిస్సలాం) ఉన్నారు. వారిరువురూ అక్కాచెల్లెళ్ళ కుమారులు (అన్నదమ్ములు). 'వీరు యహ్యా, ఈసా. వీరికి సలామ్ చేయండి' అని జిబ్రీల్(అ) చెప్పారు. నేను వారికి సలామ్ చేశాను. వారిద్దరూ నా సలామ్‌కు బదులిస్తూ 'స్వాగతం సోదరా! సజ్జనుడవైన ప్రవక్తా!' అని పలికారు.

అక్కడి నుండి జిబ్రీల్(అ) నన్ను మూడవ ఆకాశం వైపు గొనిపోయారు. ఆకాశ ద్వారం తెరిపించబోతే, 'ఎవరు?' అన్న ప్రశ్న ఎదురయింది. 'నేను జిబ్రీల్‌ని' అని బదులివ్వగానే, 'మీ వెంట ఉన్నవారెవరు?' అని ప్రశ్నించటం జరిగింది. 'ముహమ్మద్(స)' అని జవాబివ్వగానే, 'ఏమిటి ఆయన్ని పిలుచుకు రావడానికే మీరు పంపబడ్డారా?' అన్న ప్రశ్న వేయబడింది. 'అవున'ని చెప్పగానే 'స్వాగతం! ఇక్కడకు వచ్చినవారు ఎంతో శుభవంతులు' అన్న శబ్దం వినవచ్చింది. ఆకాశ ద్వారం తెరచుకుంది. మేము లోనికి వెళ్ళగానే మహనీయ యూసుఫ్ (అలైహిస్సలామ్) ఎదురయ్యారు. 'ఈయన యూసుఫ్. ఈయనకు సలామ్ చేయండి' అని జిబ్రీల్ సూచించారు. నేను సలామ్ చేశాను. దానికి ఆయన బదులిస్తూ, 'మీకు స్వాగతం సోదరా! దైవ సందేశహరుడా!' అని ఆయన పలికారు.

పిదప జిబ్రీల్ (అ) నన్ను తీసుకుని పైకెక్కారు. నాల్గవ ఆకాశంపైకి వెళ్ళి ద్వారం తెరిపించబోతే, 'ఎవరు?' అని ప్రశ్నించటం జరిగింది. 'నేను జిబ్రీల్‌ని' అని ఆయన చెప్పారు. 'మరి మీ వెంట ఉన్నవారెవరు?' అని ప్రశ్నించబడగా, 'ముహమ్మద్(స)' అని జిబ్రీల్ సమాధానమిచ్చారు. 'ఆయన్ని పిలువడానికే మీరు పంపబడ్డారా?' అని ప్రశ్నించగా, 'అవున'ని ఆయన చెప్పారు. అప్పుడు 'ఆయనకు స్వాగతం! ఇక్కడకు విచ్చేసిన ఆయన ఎంతో సౌభాగ్యవంతులు' అని సమాధాన

మివ్వబడింది. ఆకాశ ద్వారం తెరచుకుంది. అక్కడ నేను మహనీయ ఇద్రీస్ (అలైహిస్సలాం) దగ్గరకు తీసుకుపోబడ్డాను. 'ఈయన ఇద్రీస్. ఈయనకు సలామ్ చేయండి' అని జిబ్రీల్ సూచించగా, నేనాయన గారికి సలామ్ చేశాను. ఆయన నా సలామ్‌కు బదులిస్తూ 'స్వాగతం పరిశుద్ధుడైన సోదరా! సజ్జనుడైన ప్రవక్తా!' అన్నారు.

తరువాత నన్ను తీసుకుని ఐదవ ఆకాశంపైకి వెళ్ళి ద్వారం తెరిపించబోతే, 'ఎవరు?' అని ప్రశ్నించటం జరిగింది. 'నేను జిబ్రీల్‌ని' అని చెప్పగా, 'మీ వెంట వచ్చిన వారెవరు?' అన్న ప్రశ్న ఎదురయింది. 'ముహమ్మద్(స)' అని సమాధాన మివ్వబడినప్పుడు, 'ఆయన్ని పిలవడానికే మిమ్మల్ని పంపటం జరిగిందా?' అని ప్రశ్నించటం జరిగింది. 'అవున'ని చెప్పిన మీదట, 'ఇక్కడికి విచ్చేసిన ఆయన ఎంత చక్కనివారు?!?' అనే శబ్దం వినవచ్చింది. అక్కడ నేను మహనీయ హారూన్ (అలైహిస్సలామ్)ను కలుసుకున్నప్పుడు, 'ఈయన హారూన్. ఈయనకు సలామ్ చేయండి' అని జిబ్రీల్ చెప్పారు. నేను ఆయనకు సలామ్ చేశాను. ఆయన నా సలామ్‌కు జవాబు ఇచ్చిన మీదట 'స్వాగతం మా మంచి సోదరా! సత్పురుషుడైన సందేశహరుడా!' అంటూ ఆయన స్వాగతించారు.

మరి అక్కణ్ణుంచి నన్ను ఆరవ ఆకాశంపైకి గొనిపోవటం జరిగింది. ఆకాశ ద్వారం తెరిపించబోయినప్పుడు, 'వచ్చిన వారెవరు?' అన్న ప్రశ్న ఎదురయింది. 'జిబ్రీల్' అని జవాబివ్వగానే, 'మీ వెంట మరెవరయినా వచ్చారా?' అని తిరిగి ప్రశ్నించటం జరిగింది. 'ముహమ్మద్(స) వచ్చార'ని జవాబిచ్చారు. 'ఆయన్ని పిలువ డానికే మీరు పంపబడ్డారా?' అని అడిగితే, 'అవున'ని సమాధానమిచ్చారు జిబ్రీల్. 'అయితే ఆయనకు స్వాగతం! ఇక్కడకు ఏతెంచిన ఆయన ఎంత మంచివారు?' అంటూ స్వాగతం పలకటం జరిగింది. అక్కడ నేను మహనీయ మూసా (అలైహి స్సలాం) సన్నిధికి చేరుకున్నప్పుడు, 'ఈయన మూసా. మీరు ఈయనకు సలామ్ చేయండి' అని జిబ్రీల్ సూచించారు. నేను ఆయనకు సలామ్ చేశాను. నా సలామ్‌కు జవాబు ఇచ్చిన మీదట 'సజ్జనుడైన ప్రవక్తా! సజ్జనుడవైన ఓ సోదరా!' మీకు స్వాగతం అంటూ ఆయన స్వాగతించారు. నేను కాస్త ముందుకు సాగగానే ఆయన ఏడవసాగారు.[2] 'ఎందుకు ఏడుస్తున్నారు?' అని ఎవరో అడిగితే, 'ఇతన్ని చూసిన మీదట నాకు ఏడుపు ఆగలేదు. ఎందుకంటే ఈయన నా తర్వాతి ప్రవక్తగా చేసి

**పంపబడ్డాడు. కాని ఈయన సముదాయానికి చెందినవారు స్వర్గంలో నా సముదాయపు జనులకన్నా అధికంగా ఉంటారు' అని ఆయన తెలిపారు.**

**ఆ తర్వాత జిబ్రీల్(అలైహిస్సలాం) నన్ను ఏడవ ఆకాశంపైకి తీసుకెళ్ళారు. అక్కడ ద్వారం తెరిపించబోతే, 'ఎవరు?' అని ప్రశ్నించటం జరిగింది. 'నేను జిబ్రీల్'ని అని జవాబు ఇవ్వగానే, 'మీ వెంట వచ్చిన మరో వ్యక్తి ఎవరు?' అని ప్రశ్నించటం జరిగింది. 'ముహమ్మద్(స)' అని జవాబివ్వగానే, 'ఏమిటి, ఆయన్ని పిలుచుకు రావడానికే మీరు పంపబడ్డారా?' అన్న ప్రశ్న ఎదురయింది. 'అవున'ని అనగానే, 'ఆయనకు స్వాగతం, వచ్చినవారు ఎంతో మంచివారు' అని స్వాగతం పలకబడింది. నేను లోపలికి వెళ్ళగానే మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలాం) కనిపించారు. జిబ్రయిల్(అ) ఆయన్ని పరిచయం చేయిస్తూ 'ఈయన మీ పితామహుడు. ఈయనకు సలామ్ చేయండి' అన్నారు. నేను ఆయనకు సలామ్ చేశాను. దానికి ఆయన బదులిస్తూ, 'సజ్జనుడవైన సందేశహరుడా! సజ్జనుడవైన పుత్రుడా! నీకు స్వాగతం' అన్నారు. తరువాత 'సిద్రతుల్ ముంతహా' వృక్షం నా ముందుకు తేబడింది. దాని పండ్లు హిజర్ ప్రదేశంలోని పిడతల మాదిరిగా (పెద్దవిగా)[3] ఉన్నాయి. దాని ఆకులు ఏనుగు చెవులు మాదిరిగా పెద్దవిగా ఉన్నాయి. ఇది 'సిద్రతుల్ ముంతహా' అని జిబ్రీల్(అ) చెప్పారు. అక్కడ నేను రెండు కాలువలు చూశాను. వాటిలో రెండు అంతర్గతమైనవి. రెండు బహిర్గతమైనవి. 'ఓ జిబ్రీల్! ఇవేమిటి?' అని నేను అడిగితే, 'అంతర్గతమైన రెండు కాలువలు స్వర్గానికి సంబంధించినవి. బహిర్గతమైన రెండు కాలువలలో ఒకటి నైలునది, రెండవది ఫరాత్ నది' అని చెప్పారు.**

**తరువాత నా ముందు 'బైతుల్ మామూర్'[4] ప్రత్యక్షపరచబడింది. అక్కడ నా ముందు ఒక గ్లాసులో మద్యం, మరొక గ్లాసులో పాలు, ఇంకొక గ్లాసులో తేనె**

---

516–2. మహనీయ మూసా (అ)కు వచ్చిన ఏడుపు 'అసూయ' వల్ల వచ్చినది కాదు. దుఃఖం, ఆవేదన వల్ల వచ్చిన ఏడుపు అది. అంటే తన అనుచర సముదాయం వెనుక తాను అహోరాత్రులు కష్టపడినా సత్యధర్మానికి వారు విధేయులు కాకపోయారే అన్న బాధ ఆయన్ని కృంగదీసింది.

516–3. 'హిజర్' అనేది సిరియా రాజ్యంలో ఉన్న ఒక స్థలం పేరు. అక్కడి మట్టి పిడతలు ప్రఖ్యాతి గాంచినవి.

**హాజరుపరచటం జరిగింది. నేను పాల గ్లాసును అందుకోగానే, 'మీరు సహజత్వాన్ని (ప్రకృతిని) స్వీకరించి సహజత్వంపై స్థిరత్వం కనబరిచారు. మీ ఉమ్మత్ కూడా సహజత్వంపై ఉంటుందని జిబ్రీల్(అ) చెప్పారు.**

**తరువాత నాపై రోజుకు 50 పూటల నమాజులు విధించబడ్డాయి. నేను తిరిగి వస్తుండగా, మహనీయ మూసా(అ) ఎదురుపడి, 'ఇంతకూ మీకు దేని ఆజ్ఞ ఇవ్వబడింది' అని అడిగారు. 'అనుదినం యాభై నమాజులు చేయాలన్న ఆజ్ఞ అయింది' అని నేను చెప్పాను. దానికి మూసా(అ), 'మీ అనుచర సమాజంలో ఇంతటి శక్తి లేదు. ఇంతకుముందు నేను జనుల పరిస్థితిని, వారి వైఖరిని చూసి ఉన్నాను. బనీ ఇస్రాయీల్ ద్వారా నేను చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నాను. అందుచేత మీరు మీ ప్రభువు వద్దకు తిరిగి వెళ్ళి మీ ఉమ్మత్ కొరకు ఈ ఆజ్ఞను (నమాజుల సంఖ్యను) కుదించమని విజ్ఞప్తి చేయండి'[5] అని సలహా ఇచ్చారు. అందువల్ల నేను అల్లాహ్ సన్నిధిలో హాజరై నమాజుల సంఖ్యను తగ్గించమని విన్నవించుకున్నాను. దాంతో పది నమాజులు తగ్గించబడ్డాయి. తరువాత నేను మూసా(అ) ఉన్నచోటి నుండి తిరిగి వస్తుండగా, ఆయన మళ్ళీ అదే ప్రశ్న వేశారు. అందువల్ల నేను రెండవసారి అల్లాహ్ దర్బారులో హాజరై సమస్యను వివరించి చెప్పాను. ఈసారి కూడా రోజుకు మరో పదిపూటల నమాజులు కుదించబడ్డాయి. నేను తిరిగి వస్తుండగా మూసా(అ) ఎదురుపడి, మళ్ళీ ప్రశ్న వేశారు. నేను మూడవసారి కూడా అల్లాహ్ సన్నిధికి వచ్చి, మరో పది నమాజులను తగ్గించుకున్నాను. నేను తిరిగి వస్తుండగా మూసా(అ) తారసపడి, తన అనుభవాలను చెప్పుకొచ్చారు. అందువల్ల నేను నాల్గవసారి దైవ సన్నిధికి వచ్చి, సాధ్యాసాధ్యాలను గురించి విన్నవించుకున్నాను. ఈసారి మరో పది నమాజులు తగ్గించబడ్డాయి. నేను తిరిగి వస్తుండగా మూసా(అ) ఎదురు పడి మళ్ళీ అదే సమస్యను లేవనెత్తారు. నేను మళ్ళీ దైవ**

---

516–4. అందులోకి అనుదినం 70వేల మంది దైవదూతలు వస్తారు. ఒకసారి వచ్చిన వారికి అందులో మరోసారి ప్రవేశించే అనుమతి లభించదు.

516–5. దైవప్రవక్త మూసా(అలైహిస్సలాం) బనీ ఇస్రాయీల్ ప్రజల ద్వారా ఎదుర్కొన్న కష్టాలను దృష్టిలో పెట్టుకుని అంతిమ దైవప్రవక్త(స)కు ఇచ్చిన సలహా ఇది. ఆయన అనేకసార్లు మహాప్రవక్త(స)ను దైవసన్నిధికి పంపించి నమాజుల సంఖ్యను యాభై నుండి అయిదుకు తగ్గించటంలో దోహదపడ్డారు.

**సన్నిధిలో హాజరయ్యాను. అప్పుడు రోజుకు కేవలం పూటల నమాజు విధిగా ఆచరించాలని ఆజ్ఞాపించటం జరిగింది. నేను తిరిగి వస్తుండగా మహనీయ మూసా (అ) ఎదురుపడి, 'ఏమయింది?' అని అడిగారు. 'రోజుకు అయిదు పూటల నమాజు విధిగా చేయాలని ఆజ్ఞాపించబడింది' అని నేను ఆయనకు చెప్పాను. దానికి ఆయన, 'మీ ఉమ్మత్‌లో అంతటి శక్తి కూడా లేదు, మీకు పూర్వం గతించిన వారిని నేనెరుగుదును. బనీ ఇస్రాయీల్ వారి ద్వారా నేను చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నాను. కాబట్టి మీరు మరోసారి అల్లాహ్ సన్నిధికి వెళ్ళి మరిన్ని నమాజులను తగ్గించమని విజ్ఞప్తి చేయండి' అని సూచించారు. అప్పుడు అంతిమ దైవప్రవక్త(స) ఇలా అన్నారు : 'నేను నా ప్రభువు ఎదుట చాలాసార్లు విన్నపాలు చేసుకున్నాను. ఇంకొకసారి విన్నపం చేసుకునేందుకు నాకు సిగ్గేస్తుంది. దీనిపట్ల (రోజుకు ఐదు వేళల నమాజు పట్ల) నేను సంతుష్టుణ్ణి అయ్యాను'. అక్కడి నుండి నేను ముందుకు సాగుతుండగా ఓ పిలుపు ప్రతిధ్వనించింది– 'నేను నా ఆజ్ఞను జారీ చేసేశాను. నా దాసులపైన గల బరువును కూడా తగ్గించాను.'[6]**

**517) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : "వమా జఅల్ నర్రూయల్లతీ అరైనాక ఇల్లా ఫిత్నతన్ లిన్నాసి" (ఇప్పుడు మేము నీకు చూపించిన దానిని మేము వారికి ఒక పరీక్షగా చేశాము). ఈ ఆయత్‌లో 'రూయా' అంటే కళ్ళతో చూడటం అనే అర్థం. అది అంతిమ దైవప్రవక్త(స)కు మేరాజ్ రాత్రి చూపించబడింది. ఆ సందర్భంగా ఆయన్ని బైతుల్ మఖ్దిస్‌కు తీసుకుపోవటం జరిగింది. దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన 'శపించబడిన వృక్షం' వాస్తవానికి 'జఖ్ఖూమ్ వృక్షం.'[1]**

---

516–6. ఉమ్మతె ముస్లిమాకు రోజుకు అయిదు పూటల నమాజ్ మాత్రమే విధితమైనప్పటికీ, వారు గనక ఈ అయిదు పూటల నమాజులను ఆచరిస్తే యాభై నమాజుల ప్రతిఫలం లభిస్తుంది.

517–1. ఈ వృక్షం నరకంలోనే పుట్టించబడుతుంది. అది ప్రపంచంలో జెముడు వృక్షం మాదిరిగా ఉంటుంది. కాని దాని చేదు ఎంత కఠోరంగా ఉంటుందంటే, దానివల్ల నరకవాసుల కడుపుల్లోని ప్రేవులు తెగి బయటకు వస్తాయి. దాని ఆకులు విషసర్పాల పడగల మాదిరిగా ఉంటాయి. ఖుర్ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన ఆ 'శపించబడిన వృక్షం' ఇదే.

## అధ్యాయం : 74

## మక్కాలో దైవప్రవక్త(స) వద్దకు అన్సార్ల బృందాలు రావటం-బైఅతె అఖబా గురించి

**518)** అబ్దుల్లాహ్ బిన్ కాబ్ తనతో ఈ విధంగా చెప్పారని అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ తెలిపారు: ఆయన కంటిచూపు తగ్గిపోయిన తరువాత, బయటకు వెళ్ళినప్పుడు నన్ను పట్టుకుని నడిచేవారు. ఆయన (అబ్దుల్లాహ్) ఇలా అన్నారు: నేను కాబ్ బిన్ మాలిక్(రజి) చెప్పగా విన్నాను. ఆయన తబూక్ పోరాటంలో పాల్గొనలేకపోయిన తన సుదీర్ఘ వృత్తాంతాన్ని వినిపిస్తూ ఉండేవారు. ఇబ్నె బుకైర్ తన ఉల్లేఖనంలో వివరించిన దాని ప్రకారం మహనీయ కాబ్ బిన్ మాలిక్ ఇలా అన్నారు– 'నేను అఖబా ప్రతిజ్ఞ జరిగిన రాత్రి దైవప్రవక్త(స) వెంట ఉన్నాను. ఆ సమయంలో మేము ఇస్లామ్ ధర్మంపై స్థిరంగా ఉంటామని గట్టి వాగ్దానం చేశాము. నా దృష్టిలో అఖబా రాత్రి జరిగిన ప్రతిజ్ఞ బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న దానికన్నా ఎక్కువ ప్రీతికరమైనది.[1] ప్రజలు బద్ర్ సంగ్రామం గురించి చాలా ఎక్కువగా చర్చించుకుంటారు (కాని నా దృష్టిలో అఖబా ప్రతిజ్ఞ దీనికన్నా ముఖ్యమయింది).

**519)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) చెప్పగా తాను విన్నానని అమ్ర్ బిన్ దీనార్ తెలిపారు: జాబిర్ ఇలా చెబుతుండేవారు– "నా మామయ్యలిద్దరూ నన్ను 'బైఅతె అఖబా' సందర్భంగా తీసుకెళ్ళారు". 'వారిద్దరిలో ఒకరు బరా బిన్ మారూర్ (రజి)' అని ఇబ్నె ఉయైనా చెప్పినట్లు ఇమామ్ బుఖారీ (రహ్మ) పేర్కొన్నారు.

**520)** హజ్రత్ జాబిర్ (రజి) కథనం: "అఖబా ప్రతిజ్ఞ చేసినవారిలో నా తండ్రి, నా మామయ్యలిద్దరూ (అంటే ముగ్గురు) కూడా ఉన్నారు."

---

518–1. సత్యాసత్యాల మధ్య జరిగిన తొలి సంగ్రామం బద్ర్ కావటాన, ఆ సంగ్రామంలో హేమాహేమీలైన సత్య తిరస్కారులు వధించబడటం వల్ల బద్ర్‌యుద్ధం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. కాని అఖబా ప్రతిజ్ఞ దైవప్రవక్త(స) సమక్షంలో మక్కాలో జరిగిన కాలం కష్టకాలం. ఆ సమయంలో సత్యధర్మంపై స్థిరత్వం కలిగి ఉంటామని, దైవప్రవక్త(స)కు విధేయులై ఉంటామని ప్రతిజ్ఞ చేయటం సాధారణ విషయం కాదు. అందుకే హజ్రత్ కాబ్ బిన్ మాలిక్(రజి) ఆ 'ప్రతిజ్ఞ' గురించి అలా చెప్పారు.

**521) ఆయిజ్ బిన్ అబ్దుల్లాహ్ తెలిపారు : దైవప్రవక్త(సఅసమ్)తో కలసి బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న సహచరమాన్యులలో ఉబాదా బిన్ సామిత్(రజి) ఒకరు. ఆయన అఖబాలో రాత్రివేళ ప్రతిజ్ఞ చేసినవారిలో కూడా ఒకరు. ఆ సమయంలో ఆయన(స) ఆయన సహచరుల ఒక బృందం అక్కడ ఉంది. ఆయన కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "రండి, ఈ విషయాలపై మీరు గట్టి వాగ్దానం చేయండి–**

**★ మేము అల్లాహ్‌కు సహవర్తులుగా ఎవరినీ ఎంచము.**

**★ దొంగతనం చేయము.**

**★ వ్యభిచారం చేయము.**

**★ మా సంతానాన్ని హతమార్చబోము.**

**★ మా తరపున ఎవరిపైన కూడా అబద్ధాన్ని కల్పించి చెప్పము.**

**★ మంచి విషయాలలో మీ పట్ల అవిధేయత కనబరచము.**

**– ఎవరయితే ఈ వాగ్దానానికి కట్టుబడి ఉంటాడో అతనికి మంచి ప్రతిఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది. ఎవరయినా ఇందులో ఏదయినా లోటు కనబరిస్తే, అటువంటి వ్యక్తి వ్యవహారాన్ని అల్లాహ్ మరుగుపరిస్తే, ఆ వ్యక్తి వ్యవహారం దైవాధీనమై ఉంటుంది. ఆయన అతన్ని శిక్షించినా, క్షమాభిక్ష పెట్టినా ఆయన ఇష్టం."**

**– ఈ విషయాలన్నింటిపై నేను దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో బైఅత్ (ప్రమాణం) చేశానని హజ్రత్ ఉబాదా (రజి) చెప్పారు.**[1]

---

521–1. ఈ హదీసు ఆధారంగా సూఫీలు మురీదుల చేత 'బైఅత్' (ప్రతిజ్ఞ, ప్రమాణం, శపథం, వాగ్దానం) చేయించే పోకడకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా దైవప్రవక్త(స) ఇస్లామ్ స్వీకరించిన సందర్భంలో ముహ్తదీల (సన్మార్గ భాగ్యం పొందిన) వారి చేత 'బైఅత్' చేయించేవారు. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో కూడా తన సహచరుల నుండి ప్రమాణం స్వీకరించేవారు.

ఇక సూఫీలు తమ మురీదుల చేత చేయించే బైఅత్ పశ్చాత్తాప ప్రకటన లాంటిది. ఉదాహరణకు : ఇకమీదట దైవం విధించిన వాటికి (ఫరాయెజ్‌లకు) కట్టుబడి ఉంటాము. పాపకార్యాలకు దూరంగా ఉంటాము.

**522) ఉబాదా బిన్ సామిత్(రజి) వివరించారు: "(అఖబా రాత్రిన) దైవ ప్రవక్త(స) సమక్షంలో ప్రతిజ్ఞ చేసిన పర్యవేక్షకుల (నఖీబులు)లో నేనూ ఒకణ్ణి- మేము ఎవరినీ అల్లాహ్‌కు భాగస్వాములుగా కల్పించబోమని, దొంగతనం చేయ బోమనీ, వ్యభిచారానికి ఒడిగట్టబోమనీ, అల్లాహ్ నిషిద్ధంగా ఖరారు చేసిన ఏ ప్రాణినీ అకారణంగా చంపబోమనీ, దోపిడీలకు పాల్పడబోమని, అల్లాహ్ పట్ల అవిధేయత చూపబోమని స్వర్గానికి బదులుగా మేము ఈ విషయాలకు పూర్తిగా కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశాము. కాని ఒకవేళ మేము ఈ వాగ్దానంలో దేని కయినా వ్యతిరేకంగా వ్యవహరిస్తే, దానికి సంబంధించిన నిర్ణయం అల్లాహ్ గైకొం టాడు."**

## అధ్యాయం : 75

## హజ్రత్ ఆయిషా(ర.అ)తో దైవప్రవక్త(స) వివాహం. ఆయన (స) మదీనాకు రావటం. హజ్రత్ ఆయిషా(ర.అ) కాపురానికి వెళ్ళటం గురించి...[1]

**523)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: దైవప్రవక్త (సఅసమ్)తో నా వివాహం జరిగినప్పుడు నాకు ఆరేళ్ళు. ఆ తరువాత మేము మదీనా నగరానికి (హిజ్రత్ చేసి) వచ్చి, బనీ హారిస్ బిన్ ఖజ్రజ్ వద్ద ఆగాము. ఇక్కడకు రాగానే నాకు తీవ్రమైన జ్వరం వచ్చింది. తత్కారణంగా నా తల వెంట్రుకలు సయితం రాలి పోసాగాయి. (స్వస్థత చేకూరిన) తరువాత శిరోజాలు గుబురుగా వచ్చాయి. ఆ తరువాత ఏం జరిగిందంటే, ఒకరోజు నా తల్లి ఉమ్మె రూమాన్(ర.అ) నా దగ్గరకు వచ్చింది. ఆ సమయంలో నేను నా స్నేహితురాండ్రు కొంతమందితో కలసి ఉయ్యాలలూగుతున్నాను. అమ్మ పిలవగానే నేను ఆమె దగ్గరకు వెళ్ళాను. ఆమె

---

75-1. హిజ్రత్‌కు మూడేళ్ళ క్రితం- నుబువ్వత్ 10వ యేట- దైవప్రవక్త(స)తో హజ్రత్ ఆయిషా(ర.అ) నికాహ్ జరిగింది. హిజ్రీ 2వ సంవత్సరం షవ్వాల్ నెలలో మదీనాలో ఆమెను కాపురానికి పంపటం జరిగింది. దైవప్రవక్త(స) పరమ పదించే నాటికి ఆమె వయసు 18 సంవత్సరాలు. గొప్ప విద్వాంసురాలు. హిజ్రీ 58 లేదా 57లో మరణించారు. హజ్రత్ అబూ హురైరా (రజి) ఆమె నమాజె జనాజా చేయించారు. రాత్రివేళ జన్నతుల్ బఖీలో అంత్యక్రియలు జరిగాయి. ఇస్లామీయ జ్ఞాన పరిమళాన్ని పంచిపెట్టడంలో ఈమె నిర్వహించిన భూమిక అసాధారణమైనది.

**నన్ను ఎందుకు పిలిచిందో, నా పట్ల ఏమి జరగనున్నదో అప్పటి వరకూ నాకేమీ తెలియదు. ఆమె నా చెయ్యిపట్టుకుని వెళ్ళి ఇంటి గుమ్మం దగ్గర నిలబెట్టింది. నేను ఉత్కంఠ కారణంగా ఆయాసంతో రొప్పుతున్నాను. కొద్దిసేపటి తరువాత గుండె దడ తగ్గింది. అప్పుడు ఆమె కొద్దిగా నీళ్ళు తీసుకుని నా రొమ్ముపై, తలపై చిలకరించింది. ఆ తరువాత నన్ను ఇంటిలోపలికి తీసుకెళ్ళింది. అప్పటికే అక్కడ కొంత మంది అన్సార్ మహిళలు కూర్చుని ఉన్నారు. వారు నన్ను చూడగానే దీవించారు. శుభం జరగాలని ప్రార్థించారు. 'నీవు గొప్ప అదృష్టవంతురాలివి' అని చెప్పారు. నా తల్లి నన్ను వారికి అప్పగించింది. వారు నన్ను అలంకరించారు. ఆ తరువాత- పొద్దెక్కిన మీదట- దైవప్రవక్త(స) అకస్మాత్తుగా నా దగ్గరకు వచ్చారు. ఆయన(స) స్వయంగా నాకు సలామ్ చేశారు. అప్పటికి నా వయసు తొమ్మిది సంవత్సరాలు."[1]**

**524) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా అన్నారు: "నీవు నాకు రెండుసార్లు కలలో చూపించబడ్డావు. నీవు ఒక పట్టు వస్త్రంలో చుట్టబడి ఉన్నావు. 'ఈమె మీ భార్య' అని జిబ్రీల్(అ) నాతో అంటున్నారు. నేను ఆ వస్త్రాన్ని విప్పి చూస్తే అందులో నీవు ఉన్నావు. ఈ కల అల్లాహ్ తరఫు నుండి అయివుంటే దానిని ఆయన తప్పక నెరవేరుస్తాడని (మనసులో) అనుకున్నాను."**

**525) హిషామ్ బిన్ ఉర్వా తన నుండి ఇలా ఉటంకించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనాకు వలస పోక మూడేళ్ళ క్రితమే హజ్రత్ ఖదీజా(ర.అ) పరమపదించారు. ఆమె మరణించిన సుమారు రెండేళ్ళ తరువాత హజ్రత్ ఆయిషా (ర.అ)తో దైవప్రవక్త(స) వివాహం జరిగింది. ఆ సమయంలో ఆమె వయస్సు ఆరేళ్ళు. ఆమె కాపురానికి వెళ్ళే నాటికి ఆమెకు తొమ్మిదేండ్లు.**

---

523-1. ఇమామ్ అహ్మద్ పొందుపరచిన ఉల్లేఖనంలో ఇలా వుంది : 'నేను ఇంటి లోపలికి వెళ్ళేటప్పటికే దైవప్రవక్త(స) మంచంపై కూర్చుని ఉన్నారు. ఆయన(స) వద్ద కొంతమంది అన్సార్ స్త్రీ పురుషులు కూడా ఉన్నారు. ఆ మహిళలు నన్ను ఆయన(స) ఒడిలో కూర్చోబెట్టారు. 'దైవప్రవక్తా! ఈమె మీ భార్య. మీకు శుభం కలుగుగాక!' అని పలికారు. ఆ తరువాత స్త్రీ పురుషులంతా అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ కలయిక హిజ్రీ 2వ సంవత్సరం షవ్వాల్ నెలలో జరిగింది.

## అధ్యాయం : 76

## దైవప్రవక్త(స), ఆయన ప్రియ సహచరులు మదీనా వైపునకు హిజ్రత్ చేయటం

ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పినట్లుగా అబ్దుల్లాహ్ బిన్ జైద్(రజి), అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: “ఒకవేళ హిజ్రత్ ప్రాశస్త్యం గనక లేకుండా ఉంటే నేను అన్సార్లలోని ఒక వ్యక్తి మాదిరిగా ఒక అన్సార్ వ్యక్తినై ఉండటానికి ఇష్ట పడేవాణ్ణి.” ప్రవక్త ముహమ్మద్(స) ఈ విధంగా చెప్పినట్లుగా హజ్రత్ అబూ మూసా అష్అరీ(రజి) ఉల్లేఖించారు: “నేను స్వప్నంలో మక్కా నుండి మరొక ప్రదేశానికి హిజ్రత్ చేస్తున్నట్లుగా చూశాను. ఆ ప్రదేశంలో ఖర్జూర వృక్షాలున్నాయి. (మొదట) నేను దానిని ‘యమామా’[1]గా తలపోశాను. తరువాత దానిని ‘హజర్’[2] గా ఊహిం చాను.

**526)** అబూ వాయల్ (షఫీఖ్ బిన్ సలమా) కథనం : మేము ఖబ్బాబ్ బిన్ అరత్(రజి)కు జబ్బు చేసినప్పుడు, ఆయన్ని పరామర్శించడానికి వెళ్ళాము. ఆ సందర్భంగా ఆయన ఇలా అన్నారు : మేము ప్రవక్త మహనీయుల(స) వెంట కేవలం దైవప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యంతో హిజ్రత్ చేశాము. అల్లాహ్ మాకు దాని ప్రతిఫలం ప్రసాదిస్తాడు. మాలోని చాలామంది ఇప్పటికే ఈ ప్రపంచం నుండి నిష్క్రమించారు. వారు (ఈ లోకంలో) తమ త్యాగాల ఫలితాన్ని చూసుకోలేదు. అలాంటి వారిలో ముస్అబ్ బిన్ ఉమైర్(రజి) ఒకరు. ఆయన ఉహుద్ యుద్ధంలో అమరగతినొందారు. ఆయన కేవలం ఒక గళ్ళ దుప్పటి మాత్రమే తన వెనుక వదలి పోయారు. కఫన్ వస్త్రం తొడిగించేటప్పుడు, ఆ దుప్పటితో ఆయన తలభాగం కప్పితే కాళ్ళు కనిపించేవి. కాళ్ళు కప్పితే తల కనిపించేది. ఆ దుప్పటితో ఆయన తల భాగం కప్పి, కాళ్ళపై ఇజ్ఖిర్ గడ్డి వేయమని దైవప్రవక్త(స) మాకు ఆజ్ఞాపించారు. మాలో మరికొంతమందికి తమ కర్మల పండ్లు (ఈ ప్రపంచంలో కూడా) ప్రాప్తమయ్యాయి. వాటిని వారు ఏరుకుంటున్నారు.[1]

---

76-1. ప్రస్తుతం ఇది ‘యమన్’ దేశంలోని పట్టణం

76-2. ఇప్పుడు ఇది బహరైన్ రాజ్యంలో ఉంది.

526-1. అంటే కొంతమంది సహచరమాన్యులు విజయధనం లభించక ముందే తనువు చాలించారు. మరికొంతమంది జీవించి ఉన్నారు, వారి త్యాగాల ఫలం వారికి పుష్కలంగా ప్రాప్తమయింది. దానిని వారు తనివితీరా గ్రోలుతున్నారు.

**527)** **హజ్రత్ ఉమర్(రజి) చెప్పగా తాను విన్నానని అల్ఖమా బిన్ అబీ వక్కాస్ తెలిపారు. హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు – నేను దైవప్రవక్త(స) చెప్పగా విన్నాను: ఆయన(సఅసమ్) ఇలా అన్నారు : "ఆచరణలు సంకల్పంపై ఆధార భూతమై ఉన్నాయి. ప్రాపంచిక సంపదను ఆర్జించే ఉద్దేశంతో హిజ్రత్ చేసినవాడు దానినే పొందుతాడు. ఎవరయినా ఒక మహిళను వివాహమాడే సంకల్పంతో హిజ్రత్ చేసినవాడు కూడా అదే లక్ష్యాన్ని సాధిస్తాడు. కాని ఎవరయితే దైవాన్ని, దైవప్రవక్త(స)ను సంతోషపరచడానికి హిజ్రత్ చేస్తాడో అతని హిజ్రత్ దైవం, దైవప్రవక్త కొరకు చేసినదిగా భావించబడుతుంది."**

**528)** **హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అనేవారు: "మక్కా విజయం తరువాత (మక్కా నుండి మదీనాకు చేసే) హిజ్రత్ ఇక మిగిలిలేదు."[1]**

**529)** **అతా బిన్ అబీ రబాహ్ తెలిపారు: నేను ఉబైద్ బిన్ ఉమైర్ లైసీతో కలసి హజ్రత్ ఆయిషా(ర.అ) దగ్గరకు వెళ్ళాను. మేము ఆమెగారిని, మక్కా విజయం తర్వాత హిజ్రత్ చేయటం గురించి అడిగితే, ఆమె ఇలా అన్నారు : "గతంలో– ఒకప్పుడు– ముస్లిం వ్యక్తి తన ధర్మాన్ని (దీన్‌ను) కాపాడుకునేందుకు అల్లాహ్, ఆయన ప్రవక్త(స) వైపునకు ప్రతినబూని వచ్చేవాడు. హిజ్రత్ చేయకపోతే తాను (ధార్మికంగా) పరీక్షకు గురవుతానేమోనన్న భయం అతనికి ఉండేది. కాని అల్లాహ్ ఇప్పుడు ఇస్లామ్‌కు ప్రాబల్యం వొసగాడు. నేడు (అరేబియా భూభాగంలో) మనిషి తాను కోరినచోట తన ప్రభువు ఆరాధన చేసుకోగలడు. అయితే జిహాద్, జిహాద్ సంకల్పం ఎప్పటికీ మిగిలి ఉంటాయి."[1]**

---

528–1. అంటే మక్కా విజయానికి పూర్వం మక్కా నుండి మదీనా నగరానికి వలస పోవటానికి ఉన్నంత ప్రాధాన్యత మక్కా విజయం తర్వాత లేదు. అంతమాత్రాన అసలు హిజ్రత్ అన్నదే లేదని దీని అర్థం కాదు. ధర్మావలంబనలో అడుగడుగునా అవరోధాలు కల్పించబడినప్పుడు, షరీఅత్‌కు కట్టుబడి జీవించటం దుర్లభం అయినప్పుడు సత్య ప్రధానమైన వ్యవస్థ వైపునకు ప్రస్థానం చేయటం అనేది ఎప్పటికీ ఉంటుంది.

529–1. అమ్మ ఆయిషా(ర.అ) గారి పలుకుల ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే దైవదాస్యం నిర్భయంగా, స్వేచ్ఛగా చేసుకునేందుకు వీలులేని ప్రదేశాల నుండి మాత్రమే హిజ్రత్ చేయటం తప్పనిసరి (వాజిబ్). మహనీయ మావర్దీ ప్రకారం, ఒక

**530) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం ప్రకారం మహనీయ సాద్ బిన్ ముఆజ్(రజి) ఇలా వేడుకున్నారు: "దేవా! నేను నీ మార్గంలో నీ ప్రవక్త(స)ను అబద్ధీకరించి, ఆయన్ని తన స్వస్థలం నుంచి వెళ్ళగొట్టిన వారితో పోరాడటం కన్నా నాకు ఎక్కువ ప్రీతికరమైన విషయం మరొకటి కాదన్న సంగతి నీకు తెలుసు. కాని ఓ అల్లాహ్! నీవు వారికీ– మాకూ మధ్యన పోరాటాల పరంపరను సమాప్తం చేశావని అనిపిస్తోంది..."[1] హజ్రత్ ఆయిషా(ర.అ) గారే తెలిపిన దాని ప్రకారం సాద్(రజి) ఈ విధంగా కూడా పలికేవారు. "వారు నీ ప్రవక్త(స)ను అబద్ధీకరించారు. ఆయన్ని వెళ్ళగొట్టారు." వారు అంటే ఖురైషుల్లోని అవిశ్వాసులన్నమాట.**

**531) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్)ను నలభయ్యేళ్ళ వయసులో దైవప్రవక్త(స)గా నియమించటం జరిగింది. ఆ తరువాత పదమూడు సంవత్సరాలపాటు మక్కాలో ఆయనపై 'వహీ' అవతరిస్తూ ఉండింది. ఆ తరువాత ఆయన(స)కు హిజ్రత్ చేయాలన్న ఆజ్ఞ అయింది. హిజ్రత్ చేశాక ఆయన (మదీనా నగరంలో) పదేళ్ళు గడిపారు. ఆపైన 63 ఏళ్ళ వయసులో ఆయన(స) పరమపదించారు.**

**532) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: మహాప్రవక్త(సఅసమ్) తనకు దైవదౌత్యం అందిన పిదప పదమూడేళ్ళు మక్కాలో ఉన్నారు. మరణం సంభవించే నాటికి ఆయన(స)కు 63 సంవత్సరాలు.**

**533) హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) వేదికనలంకరించిన మీదట ఇలా ప్రసంగించారు : "ప్రపంచంలోని**

---

ముస్లిం దారుల్ హరబ్‌లో తన ధర్మాన్ని (దీన్‌ను) వ్యక్తం చేసుకోగలిగినప్పుడు, అతడు అక్కడే ఆగి ఉండటం హిజ్రత్ చేయటం కన్నా ఉత్తమం. ఎందుకంటే అతడు అక్కడ ఆగి ఉండటం వల్ల, ఇతరులకు కూడా ఇస్లామ్ వైపునకు ప్రేరణ అయ్యే అవకాశం ఉంటుంది.

530–1. అహ్జాబ్(కందక) యుద్ధ సందర్భంగా ఖురైషులు తమ సర్వశక్తుల్ని ఒడ్డిన మీదట కూడా వాతావరణం అనుకూలించకపోవటంతో తోక ముడిచి మక్కాకు తిరిగి వెళ్ళాల్సిన అగత్యం ఏర్పడింది. అందువల్ల ఇక మీదట ఖురైషుల్లోని సత్య తిరస్కారులతో యుద్ధం చేసే అవకాశం లభించదేమోనని సాద్ బిన్ ముఆజ్ (రజి) తలపోసి, ఆ విధంగా పలికారు.

**అనుగ్రహ భాగ్యాలు కావాలో లేదా (పరలోకంలో) అల్లాహ్ వద్ద ఉన్నది కావాలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛాధికారాన్ని అల్లాహ్ ఒక దాసునికి ప్రసాదించగా, ఆ దాసుడు అల్లాహ్ వద్ద ప్రాప్తించే దానినే ఇష్టపడ్డాడు– ఈ మాట విని హజ్రత్ అబూ బక్ర్(రజి) ఏడుస్తూ '(దైవప్రవక్తా!) మా తల్లిదండ్రులు మీకు సమర్పితం' అని పలికారు. (అబూ సయీద్ ఖుద్రీ– రజి ఇలా అంటున్నారు) అబూబ్రక్ ఆ విధంగా విలపించటం చూసి మేము ఆశ్చర్యపోయాము. 'దైవప్రవక్త(స) ఒక దాసుని గురించి చెబుతుంటే, ఈ పెద్దాయనేమిటి, ఇలా ఏడుస్తున్నాడు?' అని కొంతమంది చెప్పు కున్నారు. కాని ఆ ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడినది ఎవరికో కాదు, స్వయంగా దైవ ప్రవక్త(స)కే. ఈ విషయం మాలో అందరికన్నా అధికంగా అబూబక్ర్(రజి)కే తెలుసు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా బోధించారు: "ప్రజలలో తన సంపద రీత్యానూ, సహచర్యం దృష్ట్యాను అందరికన్నా అధికంగా నాకు తోడ్పడినవారు అబూబక్ర్. ఒకవేళ నేను నా అనుచరులలో ఎవరినయినా ప్రాణ స్నేహితునిగా చేసుకునేటట్లయితే అబూబక్ర్నే చేసుకుంటాను. అయితే ఇస్లామీయ(సోదర) బాంధవ్యం తరువాత ఇక దాని అవసరం లేదు. చూడండి! మస్జిద్ వైపునకు ఎవరి ఇంటి కిటికీ కూడా తెరచి ఉంచరాదు (అన్నింటినీ మూసివేయండి). కేవలం అబూ బక్ర్(రజి) ఇంటి కిటికీ మాత్రం తెరచి ఉండనివ్వండి."[1]**

**534) దైవప్రవక్త పవిత్ర సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : నాకు లోకజ్ఞానం వచ్చే నాటికి నేను నా తల్లిదండ్రులను ఇస్లాం ధర్మావలంబీకులుగా కనుగొన్నాను. ఆ కాలంలో దైవప్రవక్త(సఅసమ్) మా ఇంటికి రాని రోజంటూ లేదు. ఆయన(స) అనుదినం ఉదయం, సాయంత్రం మా ఇంటికి వస్తూ ఉండేవారు.**

---

533–1. ఇంతకీ జరిగిందేమిటంటే మస్జిదె నబవీ చుట్టుప్రక్కల ఇళ్ళు గలవారు తమ ఇళ్ళ కిటికీలు మస్జిద్ వైపున ఉండేలా ఏర్పాటు చేసుకున్నారు. నమాజ్ వేళ కాగానే తొందరగా మస్జిద్‌కు వెళ్ళటానికి, పదేపదే దైవప్రవక్త దర్శనభాగ్యం లభించటా నికి వారు ఆ విధంగా ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ ఇళ్ళ కిటికీలన్నీ మూసి వేయాలని, ఒక్క అబూబక్ర్(రజి) ఇంటి కిటికీ మాత్రమే తెరచి ఉండనివ్వాలని దైవప్రవక్త(స) ఆదేశించారు. మరికొంతమంది ఈ హదీసు ద్వారా గ్రహించిన సారాంశం ఏమిటంటే, ప్రవక్త తదనంతరం ఖిలాఫత్ అబూబక్ర్(రజి)కు లభించనున్నది.

తరువాత (మక్కాలో) ముస్లింలపై వేధింపులు తీవ్రతరమైనప్పుడు హజ్రత్ అబూబక్ర్(రజి) అబిసీనియాకు వలసపోయే ఉద్దేశ్యంతో బయలుదేరారు. ఆయన 'బర్కుల్ గమాద్' స్థలానికి చేరుకునేసరికి ఖార్రా తెగ నాయకుడైన ఇబ్నుద్దగినా ఎదురుపడి, 'అబూబక్ర్! ఎక్కడికెళుతున్నారు?' అనడిగాడు. దానికి ఆయన, "నా జాతివారు నన్ను వెళ్ళగొట్టారు. అందుకే దేశదేశాలు తిరుగుతూ (స్వేచ్ఛగా) దైవారాధన చేసుకుందామని నిర్ణయించుకున్నాను' అని చెప్పారు. ఈ మాట విని ఇబ్నుద్దగినా 'అబూబక్ర్! మీలాంటి వారు దేశం విడిచి వెళ్ళటం గానీ, మిమ్మల్ని దేశం నుంచి వెళ్ళగొట్టడం గానీ శ్రేయస్కరం కాదు. మీరు అగత్యపరులను ఆదుకుంటూ ఉంటారు. బలహీనుల బరువు ఎత్తుకుంటూ ఉంటారు. అతిథులకు మర్యాద చేస్తుంటారు. సత్యంపై స్థిరంగా ఉన్న కారణంగా ఎవరిపైనయినా కష్టాలు వచ్చిపడినప్పుడు, వారికి సహాయపడుతూ ఉంటారు. నేను మీకు రక్షణ కల్పిస్తాను (శరణు ఇస్తాను). కాబట్టి మీరు నగరానికి తిరిగి వెళ్ళండి. మీ ప్రభువును నిర్భయంగా ఆరాధించుకోండి' అన్నాడు.

అందువల్ల ఆయన(మక్కాకు) తిరిగి వచ్చేశారు. ఇబ్నుద్దగినా కూడా ఆయనతోపాటే నగరానికి వచ్చాడు. ఆ తరువాత ఇబ్నుద్దగినా, సాయంత్రం పూట ఖురైషు నాయకుల వద్దకు వెళ్ళి, 'చూడండి, అబూబక్ర్(రజి) వంటి వ్యక్తిని నగరం నుండి వెళ్ళగొట్టడం గానీ, అతను స్వయంగా నగరం విడిచి వెళ్ళటం గానీ మనకు శ్రేయస్కరం కాదు. అతను అవసరార్థులను ఆదుకుంటూ ఉంటాడు. బంధువుల హక్కు ఇస్తుంటాడు. బలహీనుల బరువు ఎత్తుకుంటూ ఉంటాడు. అతిథి మర్యాద చేస్తాడు. సత్యం కారణంగా ఎవరి మీదనయినా ఆపద వస్తే వారికి సహాయం చేస్తుంటాడు' అని సూటిగా చెప్పాడు. ఇబ్నుద్దగినా అబూబక్ర్‌కు శరణు ఇవ్వడాన్ని ఖురైషులు కాదనలేదు గానీ, వారు ఒక ఆంక్ష విధించారు– 'అబూబక్ర్ తన ప్రభువును ఆరాధించదలిస్తే ఇంట్లోనే ఆరాధించుకోమని ఆయన గారికి చెప్పు. ఆయన ఇంట్లోనే నమాజ్ చేసుకోవాలి. ఇంకా ఏమేమి చదవాలనుకున్నా ఇంట్లోనే చదువుకోవాలి. అంతేగాని తన ఆరాధనల ద్వారా ఆయన మాకు ఇబ్బంది కలిగించరాదని, బిగ్గరగా ఆరాధన చేయరాదని చెప్పు. ఎందుకంటే అతని ఆరాధనల వల్ల మా స్త్రీలు, పిల్లలు ఎక్కడ పరీక్షలో పడిపోతారోనని మాకు భయంగా ఉంది' అని సూచించారు.

ఇబ్నుద్దగినా వచ్చి ఆ మాటలన్నీ అబూబక్ర్(రజి)కు వినిపించాడు– మీరు కొన్నాళ్ళపాటు వీటికి కట్టుబడి ఉండండి అన్నాడు. అందువల్ల ఇంటిలోపలే ప్రభువు దాస్యం చేసుకునే వారాయన. బహిరంగ స్థలాలలో నమాజ్ చేయటంగానీ, హెచ్చు స్వరంతో ఖుర్ఆన్ పఠించడం గానీ చేసేవారు కాదు. కాని కొన్నాళ్ళ తర్వాత ఆలో చించుకుని తన ఇంటి ప్రాంగణంలో నమాజ్ ఆచరించేందుకు ఒక స్థలాన్ని ప్రత్యే కించుకున్నారు. ఆ స్థలంలోనే నమాజ్ చేసేవారు. అక్కడే ఖుర్ఆన్ పారాయణం కూడా చేసేవారు. తత్ఫలితంగా అక్కడ బహు దైవారాధకుల స్త్రీలు, పిల్లలు గుమి గూడేవారు. వారంతా ఒకింత ఆశ్చర్యంగా, ఆనందంగా దానిని గమనించేవారు. హజ్రత్ అబూబక్ర్(రజి) మృదు మనస్కులు. ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు కన్నీరును ఆపుకోలేకపోయేవారు. ఈ పరిస్థితిని చూసి బహు దైవారాధకులైన ఖురైషులు కలవరం చెందారు. వారు ఇబ్నుద్దగినాను పిలిపించారు. ఇబ్నుద్దగినా రాగానే, 'చూడు, అబూబక్ర్ తన ఇంట్లో ఉండి నమాజ్ చేసుకునే షరతుపై మేము అతనికి నీవు కల్పించిన రక్షణకు అంగీకారం తెలిపాము. కాని ఇప్పుడతను ఈ షరతుకు విరుద్ధంగా, తన ఇంటి బయట నమాజ్ ఆచరించేందుకు ఒక స్థలాన్ని ప్రత్యేకించుకుని, బహిరంగంగా నమాజ్ చేస్తున్నాడు, బహిరంగంగానే ఖుర్ఆన్ పఠిస్తున్నాడు. తత్కారణంగా మా స్త్రీలు, పిల్లలు ఎక్కడ ఉపద్రవానికి లోనవుతారో నన్న భయాందోళన మాకు కలుగుతోంది. కాబట్టి నీవు అతన్ని నిలువరించు. ఇంటిలోపలే ఉండి అతను తన ప్రభువును ఆరాధించుకుంటే మాకు అభ్యంతరం లేదు. కాని ఒకవేళ అతను బిగ్గరగా– బహిరంగంగా– ఆరాధన చేసుకోవటంపైనే హఠం చేసే మాటైతే, అతనికి కల్పించబడిన రక్షణ (అభయం) వాపసు చేయమని చెప్పు. ఎందుకంటే నీవు అతనికి రక్షణ కల్పించి ఉండగా, ఆ వ్యవహారంలో జోక్యం చేసకోవటం మాకు తగదు. కాని అదే సమయంలో మేము అబూబక్ర్ ఉల్లంఘనా ధోరణిని కూడా సహించలేము' అని నిష్కర్షగా చెప్పేశారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: తరువాత ఇబ్నుద్దగినా అబూ బక్ర్ (రజి) దగ్గరకు వచ్చి, 'ఏ షరతుకు కట్టుబడి నేను మీతో ఒప్పందం చేసుకున్నానో అది మీకు తెలియనిది కాదు. కనుక మీరు ఆ షరతుకు కట్టుబడి ఉండనయినా ఉండండి, లేదంటే నా ఒప్పందాన్ని నాకు వాపసు చేయండి. ఎందుకంటే, నేను ఒక వ్యక్తికి రక్షణ కల్పించి ఉండగా ఖురైషులు అతని వ్యవహారంలో జోక్యం

చేసుకుంటున్నారన్న విషయం అరబ్బుల చెవిలో పడటం నాకు ఎంతమాత్రం సహించదు' అన్నాడు. దానికి అబూబక్ర్(రజి), "నీవిచ్చిన రక్షణను నేను నీకు వాపసు చేస్తున్నాను. మహోన్నతుడగు నా ప్రభువు రక్షణ పట్ల సంతుష్టుణ్ణి అయి ఉన్నాను" అన్నారు. ఆ రోజుల్లో దైవప్రవక్త (సఅసమ్) మక్కాలోనే ఉన్నారు. ఆయన(స) ముస్లిములనుద్దేశించి, "మీరు హిజ్రత్ చేసే స్థలం నాకు కలలో చూపించబడింది. అక్కడ ఖర్జూర చెట్లు ఉన్నాయి. రెండు రాతి మైదానాల నడుమ ఆ స్థలం ఉంది" అని చెప్పారు. అందువల్ల హిజ్రత్ చేయదలచినవారు మదీనా నగరం వైపునకు హిజ్రత్ చేశారు. అప్పటికే అబిసీనియా దేశానికి వలసపోయి ఉన్నవారు కూడా మదీనా వైపునకు ప్రస్థానం చేయటం ప్రారంభించారు.

అబూబక్ర్(రజి) కూడా మదీనాకు హిజ్రత్ చేసే సన్నాహాలు మొదలెట్టారు. అయితే, "మీరు కొన్నాళ్ళు ఆగండి. బహుశా నాకూ హిజ్రత్ చేసే ఆనతి లభించ వచ్చు" అని దైవప్రవక్త(స) సూచించారు. అది విని, 'ఏమిటి, మీకూ హిజ్రత్ చేసేం దుకు అనుమతి లభిస్తుందా! నా తల్లిదండ్రులు మీకు అర్పితం' అని అబూబక్ర్ ఆశ్చర్యంతో విన్నవించుకోగా, "అవును" అని దైవప్రవక్త(స) చెప్పారు.

దైవప్రవక్త(స)తో కలసి హిజ్రత్ చేసే ఉద్దేశ్యంతో అబూబక్ర్(రజి) తన ప్రయా ణాన్ని వాయిదా వేసుకున్నారు. తన వద్ద ఉన్న రెండు ఒంటెలకు నాలుగు నెలల వరకు తుమ్మ ఆకులు తినిపించి, బాగా బలిసేలా చేశారు. హజ్రత్ ఆయిషా (ర.అ) ఇలా అన్నట్లు ఉర్వా తెలిపారు: ఒక రోజు మేము అబూబక్ర్(రజి) ఇంట కూర్చుని ఉండగా, మిట్ట మధ్యాహ్నం వేళ అబూబక్ర్తో, 'దైవప్రవక్త(స) తన తలపై రుమాలు కప్పుకుని వస్తున్నారు' అని ఎవరో చెప్పారు. సాధారణంగా ఆ సమయంలో దైవ ప్రవక్త(స) మా ఇంటికి రారు. 'దైవప్రవక్త(స)పై నా తల్లిదండ్రులు ఫిదా. ఈ సమయంలో దైవప్రవక్త(స) మా ఇంటికి వచ్చారంటే, ఏదో ముఖ్యమైన పని అయి ఉంటుంది' అని అబూబక్ర్ పలికారు. అంతలోనే దైవప్రవక్త(స) వచ్చి, లోనికి వచ్చేందుకు అనుమతి కోరారు. అబూబక్ర్ ఆయన(స)కు అనుమతి ఇవ్వగానే, ఆయన లోపలికి వచ్చి, "కొన్ని క్షణాలపాటు అందరినీ ఇక్కడి నుండి వెడలిపొమ్మని చెప్పండి" అన్నారు. దానికి అబూబక్ర్(రజి), 'దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకు అర్పితం. ప్రస్తుతం ఇక్కడ ఉన్నవారంతా నా కుటుంబ సభ్యులే' అని వివరణ ఇచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స),"నాకు హిజ్రత్ చేసేందుకు అనుమతి లభించింది"

అన్నారు. దానికి అబూబక్ర్, 'దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీపై ఫిదా. ఈ ప్రయాణంలో మీ సహచర్య భాగ్యం నాకూ లభిస్తుందా!?' అని ప్రశ్నించగా, "లభిస్తుంది" అని దైవప్రవక్త(స) బదులిచ్చారు. 'దైవప్రవక్తా! నా తల్లి దండ్రులు మీకు సమర్పితం. ఈ రెండు ఒంటెలలో ఒక దానిని తమరు తీసేసుకోండి' అని అబూబక్ర్ విన్నవించుకోగా, "తీసుకుంటాను. కాని మూల్యానికి" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు.

ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: మేము శీఘ్రంగా వారి కోసం ప్రయాణ ఏర్పాట్లు చేయసాగాము. ఒక సంచిలో చద్దిమూట పెట్టాము. అస్మా బిన్తె అబీ బక్ర్ (ర.అ) తన వోణీని చింపి ఒక గుడ్డ ముక్కతో ఆ సంచి కట్టేసింది. ఈ కారణంగానే ఆమెకు 'జాతన్నితాఖ్' (దుపట్టా కల స్త్రీ) అనే పేరు పడింది. తరువాత దైవ ప్రవక్త(స), అబూబక్ర్(రజి)లిరువురూ సౌర్ పర్వత గుహలో తలదాచుకున్నారు. మూడు రాత్రులు అక్కడే గడిపారు [1]. అబ్దుల్లాహ్ బిన్ అబూబక్ర్(రజి) రాత్రిపూట అక్కడికి వెళ్ళి వారితో గడిపేవారు. ఆ యువకుడు బుద్ధిమంతుడు, విషయావగాహన కలవాడు. జాము రాత్రిన గుహ నుండి బయలుదేరి తెల్లవారక ముందే మక్కా నగరానికి చేరుకునేవాడు. పగలంతా మక్కాలో జరిగేదంతా గమనించి, రాత్రి చీకటి కమ్ముకున్న మీదట గుహకు వెళ్ళి పూసగుచ్చినట్లుగా వారికి అంతా వివరించి చెప్పే వాడు. అబూబక్ర్(రజి) బానిస అయిన ఆమిర్ బిన్ ఫుహైరా (రజి) ఆ ప్రాంతంలోనే మేకలను మేపుతూ, రాత్రి పొద్దుపోయాక వారిద్దరి కోసం పాలిచ్చే మేకల్ని తోలుకుని వచ్చేవాడు. మూడు రాత్రుల వరకూ ఆమిర్ మామూలు అదే. అబూబక్ర్(రజి) బనీ దైల్ తెగకు చెందిన ఒక వ్యక్తి (అబ్దుల్లాహ్ బిన్ అరీఖత్)ని, దారి చూపించడానికి వేతనంపై పెట్టుకున్నారు. ఆ వ్యక్తి దారి చూపించడంలో ప్రవీణుడు. ఆలె ఆస్ బిన్ వాయల్‌తో మైత్రి కలవాడు. ఖురైషు అవిశ్వాసుల మతావలంబీకుడు. ఆ మహ నీయులిద్దరూ ఆ వ్యక్తిపై గల నమ్మకంతో తమ రెండు ఒంటెల్ని అతనికి స్వాధీన పరిచారు. మూడు రాత్రులు గడిచిన మీదట ఆ వ్యక్తి వారిని సౌర్ గుహలో కలుసు కోవాలని ఖరారు చేసుకోవటం జరిగింది. దాని ప్రకారమే అతను మూడవ రాత్రి గడిచిన మీదట- ప్రభాత సమయంలో- ఆ రెండు ఒంటెలను తోలుకుని వచ్చేశాడు. ఆమిర్ బిన్ ఫుహైరా (రజి), ఆ దారి చూపే వ్యక్తికి తోడయ్యారు. వారు ఆ మహ

**నీయులిద్దరినీ వెంటబెట్టుకుని సముద్ర తీర ప్రాంతం మీదుగా ప్రయాణం చేయ సాగారు.[1]**

**సురాఖా బిన్ మాలిక్ కథనం: మా వద్దకు ఖురైష్ అవిశ్వాసుల దూత ఒకతను వచ్చి దైవప్రవక్త(స)ను, అబూబక్ర్(రజి)ను హతమార్చిన లేదా ఖైదీలుగా పట్టి తీసుకువచ్చిన వారికి వందేసి ఒంటెల చొప్పున బహుమానం ఇవ్వబడతాయని చెప్పాడు. నేను మా తెగ వారైన బనీ ముద్లిజ్ సమావేశంలో కూర్చుని ఉన్నాను. వారి మనిషి ఒకతను వచ్చి మా సమీపంలో నిలబడ్డాడు. మేము అప్పటికి అక్కడే కూర్చుని ఉన్నాము. ఆ వ్యక్తి ఇలా అన్నాడు: 'సురాఖా! తీరప్రాంతంలో నేనిప్పుడే కొన్ని నీడల్ని చూసి వచ్చాను. బహుశా వారు ముహమ్మద్(స), అతని సహచరులు అయి ఉంటారని నా అనుమానం'. సురాఖా ఇలా అన్నాడు: అతని అంచనా సరైనదే నని నాకు అనిపించింది. కాని నేను అతనితో, 'వాళ్ళు కారులే. నేను ఇందాక ఫలానా ఫలానా మనుషుల్ని చూశాను. వాళ్ళు మా ముందు నుంచే అటువైపు వెళ్ళారు' అని చెప్పాను. ఆ తరువాత నేను ఆ సమావేశంలో కాసేపు కూర్చుని ఆ తరువాత లేవగానే సరాసరి ఇంటికి వెళ్ళాను. 'నా గుర్రాన్ని తీసుకుని గుట్ట వెనుక వచ్చేయ్. నేను వచ్చేవరకూ అక్కడే వేచి ఉండు' అని నా బానిస స్త్రీకి పురమాయించాను. ఆ తరువాత నేను ఈటె తీసుకుని మా ఇంటి పెరటి మార్గం గుండా బయటికి నడిచాను. ఈటె మొనతో నేలపై గీత వేస్తూ వెళ్ళాను (ఎవరికీ నాపై అనుమానం రాకూడదన్న ఉద్దేశ్యంతో ఇలా నటించాను). ఆ విధంగా నేను గుట్ట వెనుకాల వచ్చి గుర్రంపై స్వారీ అయ్యాను. మెరుపు వేగంతో పోతూ వారిని సమీపిం చాను.**

**సరిగ్గా అదే సమయంలో గుర్రం ఎదురుదెబ్బ తిని నన్ను పడగొట్టేసింది. నేను వెంటనే లేచి నిలబడి, నా అంబుల పొదిలోనుంచి బాణం తీసి దాని ద్వారా**

---

534-1. హిజ్రత్ సంఘటన– సందర్భానుసారం– సంక్షిప్తంగానూ, కూలంకషంగానూ హదీసులలో ప్రస్తావనకు వచ్చింది. ఇస్లామ్ చరిత్రలో హిజ్రత్‌కు గల ప్రాముఖ్యం ఎనలేనిది. ఈ ప్రయాణంలో దైవప్రవక్త(స) సాంగత్యం పొందే భాగ్యం మహనీయ అబూబక్ర్(రజి)కు దక్కింది. మక్కా నగరానికి ఐదు మైళ్ళ దూరాన ఉన్న 'సౌర్' పర్వత గుహలో మూడు రోజులపాటు ఆయన దైవప్రవక్త(స)కు చేసిన సేవలు కూడా చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి.

**జోస్యం (శకునం) చూశాను. కాని ఆ జోస్యం నాకు అనుకూలంగా లేదు. బాణం ద్వారా తీసిన జోస్యాన్ని లెక్కచేయకుండా మరోసారి గుర్రమెక్కి దౌడు తీయించాను. గుర్రం చాలా వేగంగా పరుగెత్తుతోంది. వారిని సమీపించింది. నేను దైవప్రవక్త(స) చేసే పారాయణాన్ని కూడా విన్నాను. దైవప్రవక్త(స) నావైపు చూడలేదు గాని అబూబక్ర్(రజి) మాత్రం పదేపదే వెనక్కి తిరిగి చూస్తున్నారు. అప్పుడు నా గుర్రం ముందరికాళ్ళు రెండూ నేలలో దిగబడిపోయాయి. అది మడమల వరకూ నేలలో కూరుకుపోగానే నేను దాని వీపుపై పడిపోయి, గద్దించాను. దానిని ఉరికించే ప్రయత్నం చేశాను. కాని అది తన కాళ్ళను నేలలోనుంచి తీయలేకపోయింది. అతి కష్టమ్మీద అది తన కాళ్ళపై నిలబడే యత్నం చేస్తుండగా, దాని ముందరి కాళ్ళ నుంచి దుమ్ము రేగి మిన్నంటసాగింది. నేను బాణాల ద్వారా శకునం చూశాను. ఈసారి కూడా నేను ఇష్టపడని శకునమే వచ్చింది. అప్పుడు నేను రక్షణ కోసం ముహమ్మద్(స)ని పిలిచాను. నా కంఠం విని వారంతా ఆగిపోయారు. నేను నా గుర్రంపై స్వారీ అయి వారిని సమీపించాను. దురుద్దేశ్యంతో వారి వరకూ చేరకుండా నిలువరించబడిన నాకు ఒక విషయం బాగా అర్థమయింది. అదేమిటంటే, దైవప్రవక్త(స) సందేశం తప్పక ప్రాబల్యం వహిస్తుంది. అందుకే ఆయన(స)తో 'మీ జాతి వారు మిమ్మల్ని చంపడానికి నూరు ఒంటెల బహుమానాన్ని ప్రకటించారు' అని చెప్పాను. ఆ తరువాత ఖురైషుల పథకాన్ని గురించి విడమరిచి చెప్పాను. వారి సేవలో భోజన సామగ్రిని, ఇతర వస్తువులను కూడా సమర్పించాను. కాని దైవ ప్రవక్త(స) స్వీకరించలేదు. నా నుండి మరే ఇతర వస్తువును కూడా కోరలేదు గానీ, తమ ఆచూకీని గురించి ఎవరికీ చెప్పరాదని మాత్రం సూచించారు. మరి నాకు అభయ పత్రం వ్రాసి ఇవ్వమని ఆయన్ని అభ్యర్థించాను. ఆ మేరకు దైవప్రవక్త(స) ఆమిర్ బిన్ ఫుహైరాకు ఆదేశించారు. అతను ఒక తోలు పత్రంపై అభయం వ్రాసి ఇచ్చాడు.[2] ఆ తరువాత దైవప్రవక్త(స) ముందుకు సాగిపోయారు.**

---

534–2. 'అల్ ఇస్తీయాబ్'లో పొందుపరచబడిన దాని ప్రకారం సురాఖా బిన్ మాలిక్ నిరాశతో వెనుతిరిగి వస్తున్నప్పుడు దైవప్రవక్త(స) అతనితో, "సురాఖా! కిస్రా (ఈరాన్ చక్రవర్తి) స్వర్ణ కంకణాలు నీ చేతుల్లో తొడిగించబడినప్పుడు నీ వైభవం ఎలా ఉంటుందో కాస్త ఊహించుకో" అన్నారు.

ఉహుద్ యుద్ధం తర్వాత సురాఖా ఇస్లాం స్వీకరించారు. ఉమర్ ఫారూఖ్(రజి)

**ఉర్వా బిన్ జుబైర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స)కు జుబైర్(రజి) ఎదురుపడ్డారు. ఆయన ఒక వర్తక బిడారుతోపాటు సిరియా నుండి తిరిగి వస్తున్నారు. ఆయన దైవప్రవక్త(స)కు, అబూబక్ర్‌కు తెల్లని వస్త్రాలు సమర్పించారు.**[3] **అటు మదీనాలో కూడా, దైవప్రవక్త మక్కా నుండి హిజ్రత్ చేసి వస్తున్నారన్న సమాచారం ముస్లింలకు అందింది. వారు ప్రతి రోజూ ఉదయం 'హర్రా' ప్రదేశానికి వచ్చి, మధ్యాహ్నం వరకు నిరీక్షించేవారు. మధ్యాహ్నం ఎండ తాపం కారణంగా వారు తమ ఇండ్లకు తిరిగి వెళ్ళిపోయేవారు.**

**ఒకరోజు వారు సుదీర్ఘ నిరీక్షణ తరువాత తమ తమ ఇండ్లకు తిరిగి వచ్చే శారు. ఆ సమయంలోనే ఒక యూదుడు ఏదో చూడటానికి తన మేడపైకెక్కాడు. అతను దైవప్రవక్తను, ఆయన సహచరులను చూశాడు. వారు వేగంగా (మదీనా వైపే) వస్తున్నారు. అతను మొదట్లో ఎండమావి అని భ్రమపడ్డాడు. కాని వారు సమీపిస్తున్న కొద్దీ ఎండలో ఇసుక మెరవటం తగ్గసాగింది. 'ఓ అరబ్బు జనులారా! అడుగో, ఇన్నాళ్ళుగా మీరు ఎదురుచూస్తున్న మీ మహనీయుడు వచ్చేశార'ంటూ బిగ్గరగా కేక వేశాడు. ముస్లింలు సాయుధులై అటువైపు పరుగెత్తారు. 'హర్రా'లో**

---

ఖలీఫాగా ఉన్న కాలంలో **'మదాయన్'** జయించబడినప్పుడు కిస్రా కిరీటంతో పాటు విలువైన ఆభరణాలు వజ్ర వైఢూర్యాలు ఖలీఫా దర్బారుకు తరలించ బడ్డాయి. హజ్రత్ ఉమర్(రజి) సురాఖాను పిలిపించి, ఆయన చేతులకు కిస్రా కంకణాలు తొడిగించారు. 'అల్లాహు అక్బర్! ఒక అరబ్బు పల్లెటూరి వ్యక్తి చేతుల్లో కిస్రా కంకణాలు తొడిగించిన అల్లాహ్ మహోన్నతుడు' అని ఉమర్ పలికారు.

ఈ ప్రయాణ సందర్భంగా దైవప్రవక్త(స) ఉమ్మె మాబద్ గుడారంలో విశ్రాంతి తీసుకున్నారు. అక్కడి నుండి బయలుదేరినప్పుడు దారిలో-ఆయన అన్వేషణలో వస్తున్న బురైదా అస్లమీ తారసపడ్డాడు. అయితే ఆయన(స)తో సంభాషణ జరిగిన మీదట, తన డెభ్భయి మంది సహవాసుల సమేతంగా ధర్మపరివర్తన చెందాడు.

534-3. ఆ మార్గంలోనే సిరియా నుండి వర్తక బిడారుతో పాటు వస్తున్న జుబైర్ బిన్ అవ్వామ్(రజి) ఎదురుపడ్డారు. ఆయన దైవప్రవక్తస)కు, అబూబక్ర్(రజి)కు ధవళ వస్త్రాలు సమర్పించుకున్నారు.

**స్వాగతం పలికారు. ఆయన (స) వారికి కుడివైపున ముందుకు సాగుతూ బనీ అమ్ర్ బిన్ ఔఫ్ వాడలో విడిది చేశారు. అది రబీవుల్ అవ్వల్ నెల సోమవారం. జనులను కలుసుకోవడానికి అబూబక్ర్ లేచి నిలబడ్డారు. దైవప్రవక్త(స) మాత్రం నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు. అంతకుముందు ఎన్నడూ దైవప్రవక్త(స)ను ప్రత్యక్షంగా చూడని అన్సార్ ప్రజలు అబూబక్ర్(రజి)కే సలామ్ చెబుతున్నారు. కాని దైవప్రవక్త(స)పై ఎండ పడగానే అబూబక్ర్ వచ్చి తన దుప్పటిని నీడగా పట్టుకోవడంతో అందరికీ అర్థమయింది, దైవప్రవక్త ఎవరో. దైవప్రవక్త(స) దాదాపు పదిరాత్రుల వరకూ బనీ అమ్ర్ బిన్ ఔఫ్ వాడలో ఆగి ఉన్నారు. ఆ సందర్భంగానే భయభక్తుల పునాదిపై నిలిచివున్న మస్జిద్(ఖుబా)ను నిర్మించారు.[4] ఆ మస్జిద్‌లో ఆయన నమాజ్ చేశారు. ఆ తరువాత (శుక్రవారం నాడు) దైవప్రవక్త తన ఒంటెపై స్వారీ అయ్యారు. సహచర మాన్యులు కూడా కాలినడకన ఆయన్ని అనుసరించారు. చివరకు ఆయన ఒంటె మదీనా మునవ్వరాలో– ప్రస్తుతం మస్జిదె నబవీ ఉన్నచోట–వచ్చి కూర్చుంది. ఆ స్థలంలో కొంతమంది ముస్లిం లు– ఆ రోజుల్లో– నమాజ్ ఆచరించేవారు. ఆ స్థలం సుహైల్, సహ్లా అనే ఇద్దరు అనాథ బాలురకు చెందినది. అక్కడ ఖర్జూరాలను ఎండబెట్టేవారు. ఆ అనాథలిద్దరూ అస్‌అద్ బిన్ జురారా సంరక్షణలో ఉండేవారు. ఆయన ఒంటె ఆ స్థలంలో కూర్చోవటం వల్ల “ఇన్‌షాఅల్లాహ్ ఇదే మేము ఆగే స్థలం కాగలద”ని ప్రకటించారు. ఆ తరువాత ఆయన(స) ఆ అనాథ బాలురిద్దరినీ పిలిచి, మస్జిద్ నిర్మాణం కొరకు ఆ స్థలాన్ని వారి నుండి కొనుగోలు చేయాలన్న తన**

---

534–4. దైవదౌత్యం లభించిన 13వ యేట రబీవుల్ అవ్వల్ నెల సోమవారం నాడు దైవ ప్రవక్త(స) అమ్ర్ బిన్ ఔఫ్ వాడకు చేరుకున్నారు. అక్కడే ఆయన పదిరోజుల పాటు (గురువారం వరకు) ఆగి ఉన్నారు. ఆ సందర్భంగానే ‘మస్జిదె ఖుబా’కు పునాది వేశారు. 12 రబీవుల్ అవ్వల్ నెల హిజ్రీ మొదటి సంవత్సరం (క్రీ.శ 622 సెప్టెంబర్ 22న) శుక్రవారం నాడు అక్కడి నుండి బయలుదేరారు. బనూ సాలిమ్ తెగవారు నివసించే వీధిలోకి వచ్చేటప్పటికి జుమా నమాజ్ వేళ అయింది. అక్కడ ఆయన 100 మందితో కలసి జుమా నమాజ్ చేశారు. ఆయన (స) సారథ్యంలో– ఇస్లామ్‌లో–చేయబడిన మొట్టమొదటి జుమా నమాజ్ అదే. ఆ తరువాత ‘యస్రిబ్’ నగరంలోనికి దక్షిణ దిక్కు నుండి ప్రవేశించారు. ఆనాటి నుంచే ఆ నగరం ‘మదీనతున్నబీ’గా పిలువబడసాగింది.

ఉద్దేశ్యాన్ని తెలిపారు. కాని ఆ అబ్బాయిలిద్దరూ, 'దైవప్రవక్తా! మేము ఈ స్థలాన్ని మీకు ఉచితంగా ఇస్తామ'ని విన్నవించుకున్నారు. కాని ఉచితంగా స్వీకరించడానికి ఆయన(స) నిరాకరించారు. ఆ స్థలానికి తగిన మూల్యం చెల్లించి మస్జిద్ నిర్మాణా నికి పూనుకున్నారు. మస్జిద్ నిర్మాణం జరుగుతున్నప్పుడు దైవప్రవక్త(స) కూడా తన ప్రియ సహచరులతో కలసి ఇటుకలు మోసారు. ఇటుకలు మోస్తున్నప్పుడు ఆయన(స) ఇలా పలికేవారు. "ఈ బరువు ఖైబర్ బరువు వంటిది కాదు.[5] పైగా దీని ప్రతిఫలం అల్లాహ్ వద్ద మిగిలి ఉంటుంది. ఇందులో ఎంతో పరిశుభ్రత, పరిశు ద్ధత ఉంది." దైవప్రవక్త(స) ఆ సందర్భంగా ఇలా వేడుకుంటూ ఉండేవారు: "దేవా! ప్రతిఫలమైతే పరలోకంలో లభించేదే. నీవు అన్సార్లపై, ముహాజిర్లపై నీ కారుణ్యాన్ని అవతరింపజెయ్యి."

**535)** హజ్రత్ అస్మా బిన్తె అబీబక్ర్(ర.అ) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్), హజ్రత్ అబూబక్ర్(రజి) – ఇద్దరూ మదీనాకు హిజ్రత్ చేసే ఉద్దేశ్యంతో బయలుదేరినప్పుడు, నేను వారిద్దరి కోసం భోజనం తయారు చేశాను. కాని ఆ చద్దిమూటను కట్టడానికి నా దగ్గర ఒక దుపట్టా తప్ప మరే వస్తువూ లేదు. ఆ మాటే నేను మా నాన్నగారికి (అబూబక్ర్‌కు) చెబితే, 'అలాగైతే ఆ దుపట్టాను రెండు ముక్క లుగా చింపు' అని ఆయన సూచించారు. నేను అలాగే చేశాను (అంటే ఒక గుడ్డ ముక్కతో చద్దిమూట కట్టాను). అప్పటి నుండే నాకు 'జాతిన్నితాఖైన్' (రెండు దుపట్టాలు కలది) అనే పేరు పడిపోయింది. ఇబ్నె అబ్బాస్(రజి) గారు మాత్రం హజ్రత్ అస్మాను 'జాతిన్నితాఖ్' అన్నారు.

**536)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనా వెళ్ళడానికి బయలుదేరినప్పుడు సురాఖా బిన్ మాలిక్ ఆయన్ని వెంబడించాడు. ప్రవక్త మహనీయులు(స) అతని దౌష్ట్యంపై ఆక్రందన చేయగా, అతని గుర్రం భూమిలో దిగబడిపోయింది. 'నా కొరకు దైవాన్ని ప్రార్థించండి. నేను

---

534–5. ఆ కాలంలో ప్రజలు ఖైబర్ ప్రాంతం నుండి ఖర్జూరాలు, ద్రాక్ష పండ్లు మోసుకుని వచ్చి ఇచ్చేవారు. ఈ బరువు ప్రపంచంలోనే తరిగిపోతుంది. కాని మస్జిద్ నిర్మాణం కొరకు ఎత్తుకునే బరువు దైవసన్నిధిలో ఎన్నటికీ తరగదు అన్నది ప్రవక్త(స) పలుకుల సారాంశం.

మీకు ఎలాంటి హాని కలిగించను' అని విజ్ఞప్తి చేశాడు. అప్పుడు ఆయన(స) అతని విమోచన కొరకు ప్రార్థించారు. (అంతే, అతని గుర్రం నేలలోనుంచి బయటికి వచ్చింది). దారిలో దైవప్రవక్త(స)కు ఒకచోట దాహమేసింది. అంతలో అటువైపు నుండి ఒక గొర్రెల కాపరి సాగిపోతున్నాడు. అబూబక్ర్(రజి) ఇలా అన్నారు : నేను (ఆ గొర్రెల మందలోని ఒక గొర్రెను పట్టుకుని) కొద్దిగా పాలు పితికాను. ఆ పాలు దైవప్రవక్త(స)కు సమర్పిస్తే వాటిని ఆయన సేవించారు. నాకెంతో సంతోషం కలిగింది.

**537)** హజ్రత్ అస్మా బిన్తె అబీబక్ర్(రజి) కథనం : అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) నా కడుపులో ఉండగా– నిండు గర్భవతిగా ఉన్నప్పుడు– నేను (మక్కా నుండి) మదీనాకు బయలుదేరాను. అక్కడికి చేరుకోగానే నేను మొదట ఖుబా వాడలో విడిది చేశాను. అక్కడే అబ్దుల్లాహ్(రజి) జన్మించాడు. తరువాత ఆ అబ్బాయిని ఎత్తుకుని దైవప్రవక్త(సఅసమ్) సన్నిధిలో హాజరయ్యాను. ఆ పసివాణ్ణి ఆయన(స) ఒడిలో పెట్టాను. దైవప్రవక్త(స) ఒక ఖర్జూర పండును తెప్పించి, దానిని నమలి అబ్దుల్లాహ్(రజి) నోట్లో పెట్టారు. ఆ విధంగా అబ్దుల్లాహ్(రజి) కడుపులో అన్నిటికన్నా ముందు వెళ్ళిన పదార్థం దైవప్రవక్త(స) శుభవంతమైన లాలాజలం. ఆ తరువాత ఆయన(స) ఆ పిల్లవాడి కోసం ప్రార్థించారు. అతనికి శుభం కలగాలని దైవాన్ని వేడుకున్నారు. హిజ్రత్ తరువాత (ముహాజిర్లలో) జన్మించిన మొట్టమొదటి శిశువు అబ్దుల్లాహ్.

**538)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: (హిజ్రత్ తర్వాత) ఇస్లామ్‌లో జన్మించిన మొట్టమొదటి పిల్లవాడు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి). జనులు ఆ పిల్లవాణ్ణి దైవప్రవక్త(స) వద్దకు తీసుకు రాగా, ఆయన(స) ఒక ఖర్జూరాన్ని నమలి, ఆ పిల్లవాని నోట్లో వేశారు. ఆ విధంగా ఆ పసివాని కడుపులోకి మొదట దైవ ప్రవక్త(స) లాలాజలం పోయింది.[1]

538–1. మహనీయ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) విశిష్టతకు ఇదొక్కటి చాలు. ముహాజిర్ ముస్లింలలో హిజ్రీ 1వ సంవత్సరంలో జన్మించిన మొట్టమొదటి ముద్దుబిడ్డడు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్. మహనీయ అబూబక్ర్(రజి) ఈయన చెవుల్లో అజాన్ పలుకులు వినిపించారు. ఈయన ముఖం నున్నగా ఉండేది. అంటే ముఖంపై గడ్డం మొలవలేదు. అత్యధికంగా ఉపవాసాలు పాటించేవారు. నఫ్ల్ నమాజులు

**539) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనా నగరానికి ఏతెంచినప్పుడు, అబూబక్ర్ సిద్దీఖ్(రజి) ప్రవక్త వాహనంపై కూర్చుని ఉన్నారు. అబూబక్ర్‌లో వృద్ధాప్యపు ఛాయలు తొంగిచూస్తున్నాయి. అదీగాక జనులు ఆయన్ని గుర్తుపడతారు కూడా.[1] కాని ప్రవక్త మహనీయులు(స) ఇంకా యువకులుగానే కనిపిస్తున్నారు. చాలామంది ఆయన్ని గుర్తుపట్టరు. దారిలో ఎవరయినా తారసపడితే, 'అబూబక్ర్! మీవెంట ఉన్న ఈయన ఎవరు?' అని అడిగేవాడు. దానికి ఆయన, 'ఈయన నా మార్గబోధకుడు. నాకు దారి చూపేవారు' అని చెప్పేవారు. బహుశా మదీనా దారి చూపేవాడేమో! అని ప్రశ్నించిన వ్యక్తి అనుకునేవాడు. కాని అబూబక్ర్(రజి) అంతరార్థం వేరు. విశ్వాస మార్గం, ధర్మమార్గం చూపేవాడు అన్న అర్థంలో ఆయన అలా చెప్పేవారు. ప్రయాణంలో ఒకసారి అబూబక్ర్(రజి) వెనక్కి తిరిగి చూసినప్పుడు, వాహనంపై స్వారీ అయి వస్తున్న ఒక వ్యక్తి కనిపించాడు. అతడు చాలా దగ్గరికి వచ్చేశాడు. 'దైవప్రవక్తా! ఈ వ్యక్తి మనల్ని సమీపించాడు' అని అబూబక్ర్ విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త(స) కూడా వెనక్కి తిరిగి చూశారు. "దేవా! ఇతన్ని పడగొట్టు"**

---

ఎక్కువగా చేసేవారు. దృఢకాయులు. గంభీర వదనులు. సత్యాన్ని సమర్థించే వారు. బంధువుల హక్కు నెరవేర్చేవారు.

ఈయన తల్లి అస్మా అబూబక్ర్(రజి) కూతురు. ఈయన తాతగారు అబూబక్ర్ సిద్దీఖ్(రజి). ఈయన నాయనమ్మ సఫియ్యా దైవప్రవక్త(స) మేనత్త. ఈయన పినతల్లి హజ్రత్ ఆయిషా(ర.అ).

హజ్జాజ్ బిన్ యూసుఫ్ అత్యంత నిర్దాక్షిణ్యంగా ఈయన్ని హతమార్చాడు. హిజ్రీ 73వ సంవత్సరం జమాదివుస్సానీ నెల 17వ తేదీ మంగళవారం నాడు ఈయన్ని ఉరి తీయించాడు. ఆ విధంగా అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) అమరగతి నొందారు.

ఆనాటి నుంచే హజ్జాజ్ బిన్ యూసుఫ్ పతనం మొదలైంది. అతనికి నిద్ర పట్టగానే అకస్మాత్తుగా అరుస్తూ లేచేవాడు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ నాపై ప్రతీకారం తీర్చుకునేందుకు నా తలపైకెక్కాడు అని చెప్పేవాడు. ఆ విధంగా అతను ప్రపంచంలోనే నరకయాతన అనుభవిస్తూ కొన్నాళ్ళకే మృత్యువాతన పడ్డాడు.

539-1. ఎందుకంటే అబూబక్ర్(రజి) వ్యాపార నిమిత్తం రాకపోకలు సాగించేవారు.

అని ప్రార్థించారు. అంతే, ఆ గుర్రం అతన్ని క్రింద పడవేసింది. ఆ తరువాత ఆ గుర్రం సకిలిస్తూ లేచింది. ఆ రౌతు (సురాఖా) మనసు కీడు శంకించింది. 'దైవ ప్రవక్తా! మీరు కోరినట్లుగా ఆజ్ఞాపించండి. శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నాన'ని ఆ రౌతు (సురాఖా) విన్నవించుకున్నాడు. "మరేమీ లేదు గాని నీవు ఉన్న చోటే ఉండు. ఎవరినీ మా వైపునకు రానీయకు" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు.

ఉల్లేఖకుడు ఇలా అన్నారు : ఉదయం దైవప్రవక్త(స)కు బద్ధ విరోధిగా ఉన్న ఆ వ్యక్తి సాయంత్రమయ్యేసరికి దైవప్రవక్త(స) శత్రువులను నిలువరించే ఆయుధంగా మారిపోయాడు. ఆ తరువాత దైవప్రవక్త(స) మదీనా చేరుకుని 'హర్రా' సమీపంలో ఒంటె దిగి అన్సార్లను పిలిపించారు. అన్సార్లలోని ప్రముఖులు దైవ ప్రవక్త(స) సన్నిధిలో హాజరై, వారిద్దరికీ సలామ్ చేశారు. 'తమరు స్వారీ అవండి. మీకు సర్వవిధాలా భద్రత కల్పించబడుతుంది. మీకు విధేయత కనబరచబడుతుంది' అని పలికారు.

దైవప్రవక్త, అబూబక్ర్– ఇద్దరూ వాహనమెక్కారు. అన్సార్లు ఆయుధాలు చేబూని ఆయనకు వలయంగా నిలబడ్డారు. దైవప్రవక్త(స) ఏతెంచారన్న వార్త మదీనా నగరమంతా వ్యాపించింది. ప్రవక్త(స)ను చూడటానికి ప్రజలంతా ఎత్తయిన ప్రదేశానికి చేరుకున్నారు. 'దైవప్రవక్త వచ్చేశారు, దైవప్రవక్త వచ్చేశార'ంటూ నినదించారు.

దైవప్రవక్త(స) మదీనా నగరం వైపునకు సాగిపోతున్నారు. అబూ అయ్యూబ్ అన్సారీ(రజి) ఇంటి దగ్గర వాహనం దిగారు. అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (అనే యూదు విద్వాంసుడు) తన ఇంటివారల ద్వారా దైవప్రవక్త రాక గురించి విన్నారు. ఆ సమయంలో ఆయన ఖర్జూర తోటలో ఖర్జూరపండ్లు ఏరుకుంటున్నారు. ఈ వార్త వినగానే తొందరగా తన పని ముగించుకుని ప్రవక్త సన్నిధిలో హాజరయ్యారు. ఆ సమయంలో కొన్ని ఖర్జూరపండ్లు కూడా ఆయన వద్ద ఉన్నాయి. ఆయన ప్రవక్త మహనీయుని(స) మాటలు విని, తిరిగి తన నివాస గృహానికి వచ్చేశారు. "నా (తల్లి) బంధువుల్లో ఎవరి ఇల్లయినా దగ్గరలో ఉందా?" అని దైవప్రవక్త(స) దర్యాప్తు చేయగా, 'దైవప్రవక్తా! ఇదిగో మా ఇల్లు, ఆ కనబడే ద్వారం మాదే' అని అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) చెప్పారు. "(అలాగా!) మరైతే మధ్యాహ్నం విశ్రాంతి తీసుకునే స్థలాన్ని మాకు ప్రత్యేకించండి. మేము మధ్యాహ్నం అక్కడే విశ్రమిస్తాము"

**అని దైవప్రవక్త(స) సూచించారు. అలాగైతే మీరిరువురూ దయ చేయండి, అల్లాహ్ మీకు శుభం కలిగించుగాక! అంటూ వారికి స్వాగతం పలికారు అబూ అయ్యూబ్ అన్సారీ(రజి).**

**దైవప్రవక్త(స) ఇంట్లో ప్రవేశిస్తుండగానే అబ్దుల్లాహ్ బిన్ సలామ్ వచ్చి 'మీరు దైవ సందేశహరులని, మీరు సత్యంతో పాటు ప్రభవింపజేయబడ్డారని నేను సాక్ష్యమిస్తున్నాను' అని పలికారు.[2] ఆయన ఇంకా ఇలా అన్నారు : 'నేను యూదుల నాయకుణ్ణి, వారి నాయకుని కుమారుడను, వారందరిలోకెల్లా జ్ఞాన సంపన్నుణ్ణి. ఈ విషయం యూదులకు బాగా తెలుసు. నేను ఇస్లామ్ స్వీకరించానన్న సంగతి వారికి ముందుగా తెలియనివ్వకండి. వారిని పిలిచి, నా గురించి దర్యాప్తు చేయండి. ఎందుకంటే, నేను ఇస్లామ్ స్వీకరించానన్న సంగతి వారికి తెలిస్తే, వారు నా గురించి చెడుగా చెబుతారు'.**

---

539–2. ఎందుకంటే మదీనాకు ఏతెంచినప్పుడు దైవప్రవక్త(స) చేసిన క్లుప్తమైన ప్రసంగాన్ని అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) విన్నారు. పండితుడైన ఆయన్ని ఆ ప్రసంగం తీవ్రంగా ఆలోచింపజేసింది. సత్యం కొరకు ఆయన హృదయ కవాటాలు తెరచుకున్నాయి. దైవప్రవక్త(స) మదీనాలో చేసిన మొదటి ప్రసంగం ఇది: "ప్రజలారా! శాంతిభద్రతలను నెలకొల్పండి. (పేదలకు) అన్నం పెట్టండి. బంధుత్వ సంబంధాలను బలోపేతం చేయండి. అందరూ ఆదమరచి నిద్రిస్తున్న వేళ తహజ్జుద్ నమాజ్ చేయండి'. ఈ సత్కర్మల ఫలితంగా మీరు సురక్షితంగా స్వర్గంలో ప్రవేశిస్తారు."

ఇక హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) విషయానికి వస్తే ఆయన బనూ నజ్జార్ వంశీయులు. దైవప్రవక్త(స) తాతగారి తల్లి ఆ వంశీయురాలే. ఆ విధంగా ఆ తెగవారితో దైవప్రవక్త(స)కు బంధుత్వ సంబంధం ఉంది. హజ్రత్ అబూ అయ్యూబ్(రజి) అసలు పేరు ఖాలిద్ బిన్ జైద్ బిన్ కులైబ్ అన్సారీ. హిజ్రీ 51వ సంవత్సరంలో కాన్‌స్టాంటినోపుల్ (ఇస్తాంబుల్)లో మరణించారు. హజ్రత్ ముఆవియా హయాంలో ఆయన జిహాద్ నిమిత్తం కాన్‌స్టాంటినోపుల్‌కు వెళ్ళారు. కాని దారిలోనే వ్యాధిగ్రస్తులయ్యారు. వ్యాధి తీవ్రతరమైనప్పుడు ఆయన తన మిత్రులకు వసీయతు చేస్తూ, 'నేను గనక మార్గమధ్యంలోనే మరణిస్తే నా శవ పేటికను తీసుకెళ్ళి, శత్రువును మార్కొనే స్థలంలో మీ కాళ్ళ క్రింద ఖననం చేయండి' అని అన్నారు. ఆయన వీలునామా ప్రకారమే కాన్‌స్టాంటినోపుల్ నాలుగు గోడల సమీపంలో ఆయన్ని ఖననం చేయటం జరిగింది.

దైవప్రవక్త(స) యూదులను పిలిపించి, “యూదులారా! మీ ధోరణి కడు శోచనీయం. మీరు దైవానికి భయపడండి. ఏ నిజ ఆరాధ్య దైవం తప్ప మరో దైవం లేడో ఆయన మీద ఒట్టు. నేను దేవుని సత్యసందేశహరుణ్ణి అన్న సంగతి మీకు తెలుసు. నేను మీ వద్దకు సత్యాన్ని తీసుకువచ్చానన్న విషయం కూడా మీకు తెలుసు. కనుక మీరు ఇస్లామ్‌లో ప్రవేశించండి” అని పిలుపు ఇచ్చారు. ఈ సంగతి మాకు తెలియదని వారన్నారు. దైవప్రవక్త(స) వారికి మూడుసార్లు ఇలా అనటం, తమకు తెలియదని వారు సమాధానమివ్వటం మూడుసార్లు జరిగింది.

“సరే. మీలో అబ్దుల్లాహ్ బిన్ సలామ్ ఎవరో చెప్పండి” అని దైవప్రవక్త(స) అడిగారు. దానికి వారు, ‘ఆయన మా నాయకుడు. మా నాయకుని పుత్రుడు. మాలో అందరికన్నా ఎక్కువగా జ్ఞానసంపద కలవారు. మాలోని అందరికన్నా గొప్ప విద్వాంసుని కుమారుడు’ అని చెప్పారు. “ఒకవేళ ఆయన ఇస్లామ్ స్వీకరిస్తే అప్పుడు మీరేమంటారు?” అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, ‘దేవుడు ఆయన్ని రక్షించుగాక! ఆయన ఇస్లామ్ ఎలా స్వీకరిస్తారు?’ అని వారు బదులిచ్చారు. అప్పుడు దైవ ప్రవక్త(స), “ఇబ్నె సలామ్! వీళ్ళ ముందుకు రండి” అని పిలిచారు. అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) బయటికి వచ్చి, ‘యూదులారా! దైవానికి భయపడండి. ఏ నిజ ఆరాధ్యదైవం తప్ప మరో దేవుడు లేడో ఆయన సాక్షిగా! ఈయన దైవప్రవక్త అన్న విషయం మీకు బాగా తెలుసు. ఈయన సత్య సమేతంగా పంపబడ్డారన్న విషయమూ మీకు తెలియనిది కాదు’ అని చెప్పారు. దానికి యూదులు, ‘నీవు అబద్ధీకుడవు’ అన్నారు. “ఇక మీరు బయటకు వెళ్ళండి” అని దైవప్రవక్త(స) చెప్పారు.

**540)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) తన ఖిలాఫత్ కాలంలో తొల్దొలి ముహాజిర్లందరికీ కోశాగారం నుండి (ఒక్కొక్కరికి) నాలుగు వేల చొప్పున పెన్షన్‌ను నాలుగు కిస్తుల్లో చెల్లించాలని నిర్ధారించారు. అయితే తన కుమారుడగు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కి మాత్రం మూడున్నర వేలు మాత్రమే నిర్ధారించారు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కూడా ముహాజిర్ సహాబీయే కదా! మరలాంటప్పుడు ఆయనకు నాలుగు వేలకన్నా తక్కువ ఎందుకు ఇస్తున్నారు? అని ఆయన్ని ప్రశ్నించగా, “అతనిని అతని తల్లిదండ్రులు హిజ్రత్ చేయించి ఇక్కడి (మదీనా) వరకు తీసుకువచ్చారు. అందువల్ల అతను స్వయంగా హిజ్రత్ చేసిన ముహాజిర్లతో సరితూగలేడు” అని హజ్రత్ ఉమర్(రజి) చెప్పారు.[1]

**541) హ(జత్ ఖబ్బాబ్(రజి) తెలిపారు: "మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)తోపాటు హి(జత్ చేశాము."**

**542) హ(జత్ ఖబ్బాబ్(రజి) ఇలా వక్కాణించారు: "మేము ప్రవక్త మహనీయులు(స)తోపాటు హి(జత్ చేసినప్పుడు కేవలం దైవప్రసన్నతను చూరగొనటం ఒక్కటే మా సంకల్పం అయి ఉండేది. అల్లాహ్ మాకు దాని ప్రతిఫలాన్ని తప్పక ప్రసాదిస్తాడు. అయితే మాలో కొందరు ముందుగానే ఈ లోకం నుండి లేపుకో బడ్డారు. ఇహలోకంలో వారెలాంటి ప్రతిఫలాన్నీ పొందలేదు. అలాంటి వారిలో ముస్అబ్ బిన్ ఉమైర్(రజి) ఒకరు. ఉహుద్ సంగ్రామంలో ఆయన అమరగతి నొందారు. ఆయనకు కఫన్ తొడిగించడానికి మా వద్ద ఒక కంబళి తప్ప మరేమీ లేదు. అది కూడా ఎలాంటిదంటే, దాంతో ఆయన తలభాగం కప్పితే కాళ్ళు కనిపించేవి, కాళ్ళు కప్పితే తలభాగం కనిపించేది. "తలభాగం కప్పేసి, కాళ్ళపై ఇజ్ఖిర్ గడ్డి వేయండి" అని దైవప్రవక్త(స) సూచించారు. మాలో కొందరు తమ త్యాగాల ఫలాలను ఈ ప్రపంచంలో పండించుకున్నారు. వాటిని వారిప్పుడు ఏరుకుంటున్నారు."**

**543) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తనతో ఇలా చెప్పినట్లుగా అబూ బుర్దా బిన్ అబీ మూసా అష్అరీ తెలిపారు: "నా తండ్రి (ఉమర్–రజి) మీ నాన్న గారికి (అబూ మూసా అష్అరీ–రజికి) ఇచ్చిన జవాబు ఏమిటో మీకు తెలుసా? ఓ అబూ**

---

540–1. మదీనాలో రెండు ఖిబ్లాల వైపునకు తిరిగి నమాజ్ చేసిన ముహాజిర్ సహాబాను, బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్నవారిని 'తొలికాలపు సహాబా'గా పరిగణించేవారు. అందుకే హ(జత్ ఉమర్(రజి) బంధుప్రీతికి తావీయకుండా న్యాయానికి కట్టుబడ్డారు.

వేరొక ఉల్లేఖనం ప్రకారం హ(జత్ ఉమర్(రజి) ఉసామా బిన్ జైద్(రజి)కు నాలుగు వేల పెన్షన్‌ను నిర్ధారించినప్పుడు కొంతమంది సహచరమాన్యులు ఆక్షేపిస్తూ, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కూడా ఉసామాకు సమ ఉజ్జీయే కదా! మరలాంటప్పుడు అబ్దుల్లాహ్ పెన్షన్ ఉసామా పెన్షన్ కన్నా తక్కువగా ఎందుకు ఉంది? అని అడగ్గా, "దైవప్రవక్త(స) ఉసామా తండ్రిని అబ్దుల్లాహ్ తండ్రి కన్నా ఎక్కువగా ప్రేమించేవారు. అలాంటప్పుడు ప్రవక్త ప్రేమకు నా ప్రేమపై ప్రాధాన్యత ఇవ్వక తప్పదు కదా!" అని హ(జత్ ఉమర్(రజి) చెప్పారు.

**మూసా! మనం దైవప్రవక్త(స)తో కలసి ఎన్నో సదాచరణలు చేశాము. ఉదాహరణకు– ఇస్లామ్ స్వీకరించాము. హిజ్రత్ చేశాము. జిహాద్ చేశాము. ప్రవక్త(స) జీవిత కాలంలో మనం చేసుకున్న సత్కార్యాలన్నింటికీ మనకు మోక్షం లభించి, ఆయన(స) తర్వాతి కాలంలో మనం చేసుకున్న పనులకు (అవి సత్కార్యాలే అయినప్పటికీ, పుణ్యం లభించకుండా) వ్యవహారం సరిసమానం అయిపోయినా చాలని నేను భావిస్తున్నాను. ఇది మీకు సంతోషకరమేనా?" అని అడిగినప్పుడు, మీ నాన్న మా నాన్నగారితో ఇలా అన్నారు: "దైవసాక్షిగా! దీంతో నేను సంతృప్తి చెందను. ఎందుకంటే మనం దైవప్రవక్త(స)తో కలసి జిహాద్ చేశాము. నమాజులు చేశాము, ఉపవాసాలు పాటించాము. మరెన్నో సదాచరణలు చేశాము. మన ద్వారా ఎంతో మంది ఇస్లామ్ కూడా స్వీకరించారు. ఆ పుణ్యం కూడా దేవుడు మనకు ప్రసాదిస్తాడన్న ఆశాభావం నాకు ఉంది." దీనికి సమాధానంగా మా నాన్న గారిలా అన్నారు : "సరే, మీరు అలాగే అనుకుంటూ ఉండండి. కాని నా మటుకు నేను ఏమనుకుంటున్నానంటే, ఎవరి స్వాధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! దైవప్రవక్త(స) కాలంలో మనం చేసుకున్న సత్కార్యాలు సురక్షితంగా మిగిలి ఉండి, ఆయన(స) తదనంతరం మనం చేసుకున్న పనులపై (నిలదీత జరగకుండా) వ్యవహారం సరిసమానం అయిపోయి, మనకు సాఫల్యం సిద్ధిస్తే చాలు"– అబూ బర్దా ఇలా అన్నారు : నేను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)తో ఏమన్నానంటే; దైవసాక్షి! మీ నాన్న గారు (ఉమర్ బిన్ ఖత్తాబ్–రజి) మా నాన్నగారి (అబూ మూసా–రజి) కన్నా ఉత్తములు.**[1]

---

543–1. మహనీయ ఉమర్(రజి) గారి పలుకులు ఆయనలోని దైవభీతికి, జాగ్రత్తకు నిదర్శనం. దైవప్రవక్త(స) తదనంతరం తాము చేసుకున్న సత్కార్యాలపై పూర్తిగా భరోసా చేయలేమని, అవి దైవసన్నిధిలో స్వీకృతి పొందనూ వచ్చు లేదా త్రోసిపుచ్చబడనూ వచ్చు అని, కాబట్టి వాటి విషయంలో మితిమీరిన ధీమా పనికిరాదని ఆయన తలపోసేవారు. అయితే దైవప్రవక్త(స) హయాంలో తాము ఆ మహనీయుని వెంట ఉండి చేసుకున్న సదాచారాలు నమ్మదగినవని, వాటి ఆధారంగానే తమకు దైవసన్నిధిలో క్షమాపణ లభించగలదని ఆయన భావించేవారు. ఆయన(స) మరణించిన పిదప తాము చేసుకున్న ఆచరణలపై తమకు పుణ్యం లభించకపోయినా ఫరవాలేదు గాని, వాటిపై నిలదీత జరగకుండా ఉంటే అదే చాలని కూడా అనుకునేవారు. ఎందుకంటే మనిషిలోని

**544) ఇబ్నె ఉమర్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఉస్మాన్(రజి) తెలిపారు : 'మీరు మీ నాన్నగారి కంటే ముందే హిజ్రత్ చేశారు కదా!' అని జనులు ఆయనతో అన్నప్పుడు, ఆయన గారికి కోపం వచ్చేది. అసలు జరిగిందేమిటో ఆయన ఇలా వివరించారు– "నేను నా తండ్రి ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)తోపాటు దైవప్రవక్త(సఅసమ్) దగ్గరకు వెళ్ళాను. ఆ సమయంలో దైవప్రవక్త(స) నిద్రిస్తున్నారు. అందువల్ల మేమిద్దరం మా ఇంటికి తిరిగి వచ్చేశాము. తరువాత, దైవ ప్రవక్త(స) ఇప్పుడయినా మేల్కొన్నారో లేదో చూసి రా అని మా నాన్నగారు నన్ను పంపించారు. నేను తిరిగి వెళ్ళాను (అప్పటికి దైవప్రవక్త మేల్కొన్నారు). అందువల్ల నేను లోనికి వెళ్ళి ఆయన(స) చేతిపై విధేయతా ప్రమాణం (బైఅత్) చేశాను. ఆ తరువాత నాన్న గారి దగ్గరకు వెళ్ళి, దైవప్రవక్త(స) మేల్కొన్నారని చెప్పాను. ఆ తరువాత మేమిద్దరం త్వరత్వరగా దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చాము. హజ్రత్ ఉమర్ లోనికి వెళ్ళి ఆయన(స) సమక్షంలో విధేయతా ప్రమాణం చేశారు. నేను కూడా (మరోసారి) విధేయతా ప్రమాణం చేశాను.[1]**

**545) బరా బిన్ ఆజిబ్(రజి) ద్వారా నేను హదీసును విన్నానని అబూ ఇస్హాఖ్ తెలిపారు. ఆయన(బరా) ఇలా అన్నారు– అబూబక్ర్(రజి) నా తండ్రి**

---

'భయం' 'ఆశ' కన్నా ఉన్నతమైనది. ఈ విషయంలో హజ్రత్ ఉమర్(రజి) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కన్నా గొప్పవారు.

హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) ఇలా అంటారు : హజ్రత్ ఉమర్(రజి) పలుకులు ఆయనలోని అణకువకి, దైవభీతికి తార్కాణం. నిజానికి ఆయన గారి ఒక్కొక్క ఆచరణ, ఒక్కొక్క న్యాయ నిర్ణయం మనం జీవితాంతం చేసుకున్న సదాచరణల కంటే ఎక్కువే. వాస్తవమేమంటే న్యాయశీలుడైన ఒక వ్యక్తి– అతడు ఏ మతస్థుడైనా సరే– హజ్రత్ ఉమర్(రజి) జీవిత చరిత్రపై దృష్టిని సారించినట్లయితే అలాంటి ముద్దుబిడ్డలను మాతృమూర్తులు అరుదుగానే కన్నారన్న యదార్థం తెలుస్తుంది. ముస్లిం జగతిలో దైవప్రవక్త(స) తదనంతరం అలాంటి పరిపాలనా దక్షత కలవాడు, న్యాయశీలుడు, సత్యవంతుడు, సాత్వికుడు, ప్రజా రక్షకుడు జన్మించలేదనే అనాలి.

544–1. అసలు విషయం ఇది. ఆ విధంగా అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) జనులలో ఉన్న అపార్థాన్ని దూరం చేశారు. దాంతో ఈయన తన తండ్రికన్నా ముందే హిజ్రత్ చేశారన్న తప్పుడు ప్రచారం నిరోధించబడింది.

**ఆజిబ్(రజి) నుండి ఒక తొట్ల(ఒంటె మీద వేసే పాలాన్)ను కొనుగోలు చేశారు. ఆయన ఇంటి వరకూ చేరవేయడానికి ఆ తొట్లను నేను ఎత్తుకున్నాను. ఆ సంద ర్భంగా ఆజిబ్ అబూబక్ర్(రజి) గారిని హి్జ్రత్ స్థితిగతులను గురించి అడగ్గా, ఆయన ఇలా వివరించారు: (శత్రువులు) మాపై నిఘా వేసి ఉండటం వల్ల మేము రాత్రివేళ (ఇంటి నుండి) బయలుదేరాము. రాత్రంతా, పగటిపూట కూడా వేగంగా నడిచాము. మధ్యాహ్న సమయంలో మాకు ఒక కొండ రాయి కనిపించింది. మేము దానిని సమీపించి చూస్తే, ఆ రాయి ప్రక్కన నీడ కనిపించింది. నేను దైవప్రవక్త(స) కోసం ఒక తోలు చాపను పరచాను. ఆయన(స) దానిపై శయనించారు. దాని చుట్టుప్రక్కల స్థలాన్ని నేను ఊడ్వసాగాను. అంతలో నాకు ఒక మేకల కాపరి కనిపించాడు. అతను కూడా ఆ నీడలో విశ్రాంతి తీసుకునే ఉద్దేశ్యంతోనే అటువైపు వస్తున్నాడు. 'అబ్బాయి! నీవు ఎవరి సేవకుడవు?' అని నేనతన్ని అడిగితే, ఫలానా ఆసామి దగ్గర పనిచేస్తాన'ని అతనన్నాడు. 'మరైతే నీవు నీ మేకల పాలు కొన్ని పితికి ఇవ్వగలవా?' అని అడిగాను. దానికి అతను సరేనన్నాడు. తన మేకల మందలో నుండి ఒక మేకను తోలుకుని వచ్చాడు. దాని పొదుగును బాగా దులిపి శుభ్రం చేసుకో అన్నాను. ఆ అబ్బాయి పాలు పితికాడు. నా దగ్గర ఒక నీళ్ళ తిత్తి ఉంది. దాని మూతిపై గుడ్డ కట్టబడి ఉంది. దైవప్రవక్త(స) కోసం నేను ప్రత్యేకంగా తెచ్చుకున్న నీరు అది. పితకబడిన పాలలో నీరు కలిపి దానిని బాగా చల్లబరిచాను. తరువాత నేను ఆ పాలను దైవప్రవక్త(స) సన్నిధిలోకి తెచ్చి, 'దైవప్రవక్తా! దీనిని సేవించండి' అని విన్నవించుకున్నాను. ఆయన(స) ఆ పాలు సేవించడంతో నేనెంత గానో సంతోషించాను. ఆ తరువాత మేము మళ్ళీ బయలుదేరాము. మరోవైపు మమ్మల్ని వెతికేవారు వెతుకుతూనే ఉన్నారు.[1]**

**బరా ఇలా అన్నారు: నేను అబూబక్ర్(రజి) వెంట ఆయన ఇంటికి వెళ్ళి నప్పుడు, ఆయన కూతురు ఆయిషా(ర.అ) అస్వస్థత కారణంగా పండుకుని ఉన్నారు. అబూబక్ర్(రజి) ఆమె చెంపపై ముద్దుపెట్టుకుంటూ, 'బేటీ! నీ ఆరోగ్యం ఎలా ఉంది?' అని అడిగారు.**

---

545–1. హ్జ్రత్ అబూబక్ర్(రజి) మహిమోన్నతులకు సంబంధించి ఈ ఒక్క సంఘటన చాలు. ఆయన దైవప్రవక్త(స)తో కలసి మదీనా వరకు చేసిన ప్రయాణమంతా ఒక ఎత్తయితే, సౌర్ పర్వత గుహలో గడిపిన క్షణాలు ఒక ఎత్తు. అందుకే ప్రవక్త

**546) దైవప్రవక్త(స) సేవకులైన అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనాకు హిజ్రత్ చేసి వచ్చినప్పుడు, ఆయన ప్రియ సహచరులలో ఒక్క అబూబక్ర్(రజి) వెంట్రుకలు మాత్రమే తెల్లగా ఉన్నాయి. అందువల్ల ఆయన గోరింటాకును, ఖజాబ్(రంగు)ను ఉపయోగించేవారు.**

**(వేరొక సనదు ప్రకారం) అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనా నగరానికి ఏతెంచినప్పుడు, ఆయన సహచర మాన్యులలో అందరికన్నా ఎక్కువ వయస్కులు అబూబకర్(రజి)గారే. అందువల్ల ఆయన గోరింటాకును, ఖజాబ్‌ను ఉపయోగించేవారు. దాంతో ఆయన వెంట్రుకలు ముదురు ఎరుపు రంగులో కనిపించేవి.**

**547) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: మహనీయ అబూబక్ర్(రజి) బనూ కల్బ్ తెగకు చెందిన ఒక స్త్రీ- ఉమ్మె బక్ర్-ని వివాహమాడారు. మరి ఆయన హిజ్రత్ చేసినప్పుడు ఆమెకు విడాకులు ఇచ్చి (మదీనా) వచ్చారు. తరువాత ఆమెను ఆమె పినతండ్రి కుమారుడు (అబూబక్ర్ షద్దాద్ బిన్ అస్వద్) మనువాడాడు. ఆ వ్యక్తి ఒక కవి. అతనే కురైష్ అవిశ్వాసుల గురించి సుప్రసిద్ధమైన ఒక 'ముర్సియా' వ్రాశాడు. (దాని సారాంశం ఇది).**

> **"బద్ర్ బావుల గురించి నేనేమి చెప్పేది.[1] అవి మనల్ని షీజా వృక్షపు పెద్దపెద్ద పాత్రలకు నోచుకోకుండా చేశాయి. ఆ పాత్రలు ఒకప్పుడు ఒంటె మూపురం మాంసం కన్నా [2] ప్రియమైనవై ఉండేవి. బద్ర్ బావుల గురించి నేనేమి**

---

సహచరమాన్యులలో ఆయన స్థానం ప్రత్యేకమయినది. ఆకాశంలోని నక్షత్రా లన్నింటిపై చంద్రునికి గల ప్రాధాన్యత ఎటువంటిదో సహాబాలో అబూబక్ర్ స్థానం అటువంటిది. ప్రపంచంలో ఇస్లామ్ జీవించి ఉన్నంతకాలం అబూబక్ర్ పేరు కూడా ఇస్లాంతోపాటే జీవించి ఉంటుంది. ఆయన చేసిన సేవలకు ప్రతిఫలంగానే అల్లాహ్ ప్రళయదినం వరకూ పచ్చని గుమ్మటంలో దైవప్రవక్త(స) ప్రక్కన సేదదీరుతూ ఉండే సౌభాగ్యాన్ని ఆయనకు ప్రసాదించాడు.

547-1. అంటే హేమాహేమీలైన ఖురైషు ప్రముఖులు బద్ర్ యుద్ధంలో హతులైపోయారు. వారు బద్ర్ మైదానంలోని గోతుల్లో పడవేయబడ్డారు.

547-2. ఒంటె మూపురం మాంసం అరబ్బులకు ఎంతో ఇష్టకరమైనది. హదీసులో 'షీజా' వృక్షం ప్రస్తావన వచ్చింది. దాని కొయ్యతో పాత్రలు చేసేవారు.

అనగలను!? అవి మనల్ని మంచి నాట్యకత్తెల్ని, మధుపాన ప్రియుల్ని[3] చూడకుండా చేశాయి. ఉమ్మె బకర్ [4] నా భద్రత కొరకు ప్రార్థనలు చేసింది. కాని నా జాతి వారే నాశనమయ్యాక ఇక నాకు భద్రత ఎక్కడ? ఈ ప్రవక్త మాకు మరో జీవితం గురించి సమాచారం ఇస్తున్నాడు. కాని ఎముకలు, పుర్రెలు ఎలా బ్రతుకుతాయి?[5]

**548)** హ్రజత్ అబూబక్ర్(రజి) తనతో చెప్పినట్లుగా అనస్(రజి) తెలిపారు: నేను ప్రవక్త మహనీయుల(సఅసమ్) వెంట పర్వత గుహలో ఉన్నప్పుడు, కొంచెం తల ఎత్తి చూస్తే, మా జాతికి చెందిన కొంతమంది (బయట) కనిపించారు. అప్పుడు నేను, 'దైవప్రవక్తా! వీరిలో ఏ ఒక్కడయినా వంగి మనల్ని చూస్తే మనం పట్టుబడినట్లే' అని అన్నాను. దానికి దైవప్రవక్త(స), "అబూబక్ర్! నిశ్శబ్దంగా ఉండు. మనిద్దరికీ తోడుగా మూడవ వానిగా అల్లాహ్ ఉన్నాడు"[1] అని పలికారు.

**549)** మహనీయ అబూ సయీద్ ఖుద్రీ(రజి) తెలిపారు : ఒక పల్లెటూరి వ్యక్తి ప్రవక్త మహనీయుని(సఅసమ్) సన్నిధిలో హాజరై, హిజ్రత్ గురించి ప్రశ్నించ సాగాడు. దానికి ఆయన(స), "నీ పరిస్థితి కడు శోచనీయం! హిజ్రత్ చాలా కష్టతర మైన పని. నీ దగ్గర ఒంటెలుగాని ఉన్నాయా?" అని దర్యాప్తు చేశారు. దానికి అతను, 'ఉన్నాయ'న్నాడు. "నీవు వాటిపై జకాత్ ఇస్తున్నావా?" అని అడిగితే 'ఇస్తు న్నాన'ని చెప్పాడు. "ఒంటెల పాలు ఇతరులకు (నిరుపేదలకు) కూడా పితకటానికి ఇస్తున్నావా?" అని ప్రవక్త అడిగితే, 'ఆ పని కూడా చేస్తున్నాన'ని అతడు సమాధాన

---

547–3. ఆ కాలంలో శ్రీమంతులు, నాయకులు మద్యం సేవించి, నాట్యకత్తెలతో కాలక్షేపం చేసేవారు.

547–4. అంటే అతని భార్య. ఒకప్పుడు ఆమె అబూబక్ర్ (రజి) వివాహ బంధంలో ఉండేది.

547–5. మృతుని ఆత్మ అతని పుర్రెలో నుండి బయటికి వెళ్ళి గుడ్లగూబ ఆకారంలో జన్మిస్తుందని, అది రాత్రిపూట కూతలు పెడుతూ సంచరిస్తుందని పూర్వం అజ్ఞాన కాలంలో అరబ్బులు భావించేవారు. అలాంటప్పుడు మరణానంతరం మనిషి మానవ రూపంలో మళ్ళీ ఎలా లేపబడతాడు? ప్రవక్త చెప్పేది నిజమెలా అవుతుంది? అని వారు చెప్పేవారు.

548–1. అల్లాహ్ ఎవరికయినా తోడుగా ఉన్నప్పుడు చింతించవలసిన అవసరం ఏముం టుంది? లోకమంతా ఏకమైనా వారికి ఎలాంటి నష్టం చేకూర్చజాలదు.

**మిచ్చాడు. "ఆ ఒంటెలను (అప్పుడప్పుడు) నీటి కొలను వద్దకు తోలుకుపోయి నప్పుడు కూడా (అవసరార్థుల కోసం) పాలు పితుకుతున్నావా?" అని ప్రశ్నించగా 'అదీ చేస్తున్నాను' అని అతను బదులిచ్చాడు. "మరి అలాంటప్పుడు నీవు సప్త సముద్రాలకు ఆవల సదాచరణ చేసినా అల్లాహ్ నీ ఆచరణల్లో దేని ప్రతిఫలాన్ని కూడా తగ్గించడు"[1] అని దైవప్రవక్త(స) పలికారు.**

## అధ్యాయం : 77

## ప్రవక్త మహనీయులు(స), ఆయన ప్రియ సహచరులు మదీనాకు రావటం[1]

**550) బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నట్లు అబూ ఇస్హాఖ్ తెలిపారు : అందరికన్నా ముందు మా వద్దకు హిజ్రత్ చేసి వచ్చినవారు ముస్అబ్ బిన్ ఉమైర్(రజి),[1] ఇబ్నె ఉమ్మె మక్తూమ్(రజి), ఆ తరువాత అమ్మార్ బిన్ యాసిర్(రజి), బిలాల్ (రజి) వచ్చారు.**

**551) బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నట్లు అబూ ఇస్హాఖ్ తెలిపారు : (బరా బిన్ ఆజిబ్ ఇలా చెప్పారు)– అందరి కన్నా ముందు మా వద్దకు (మదీనాకు) ముస్అబ్ బిన్ ఉమైర్(రజి), ఇబ్నె ఉమ్మె మక్తూమ్(రజి) వచ్చారు. ఆ మహనీయులిద్దరూ ముస్లింలకు ఖుర్ఆన్ చదవటం నేర్పేవారు. ఆ తరువాత బిలాల్, సాద్ బిన్ అబీ వక్కాస్, అమ్మార్ బిన్ యాసిర్(రజిఅల్లాహు అన్హుమ్)లు వచ్చారు. ఆ తరువాత ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఇరవై మంది ప్రవక్త ప్రియసహచరులను వెంటబెట్టుకుని వచ్చారు. పిదప ప్రవక్త మహనీయులు(స) వచ్చారు. (ఆయన**

---

549–1. ఈ హదీసు ఇంతకుముందు 'జకాత్ ప్రకరణం'లో కూడా వచ్చింది. అయితే ఇందులో **'హిజ్రత్'** ప్రస్తావన రావటం వల్ల ఈ అధ్యాయం క్రింద దీనిని సేకరించవలసి వచ్చింది.

77–1. దైవప్రవక్త రబీవుల్ అవ్వల్ నెల 12వ తేదీ లేదా 8వ తేదీ సోమవారం నాడు మదీనా నగరంలో ప్రవేశించారు. అప్పటికే ఆయన ప్రియ సహచరుల్లో అనేకమంది మదీనాకు హిజ్రత్ చేశారు.

550–1. దైవప్రవక్త(స) ఆదేశానుసారం మహనీయ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) ఒక ప్రబోధకునిగా, సందేశ ప్రచారకునిగా మదీనాకు వచ్చారు.

**వెంట అబూబక్ర్–రజి, ఆమిర్ బిన్ ఫుహైరా ఉన్నారు). ప్రవక్త మహనీయులు ఏతెంచినప్పుడు మదీనా వాసులకు కలిగినంత సంతోషం మరెప్పుడూ కలిగినట్లు నేను గమనించలేదు. దైవప్రవక్త(స) వచ్చేశారంటూ బానిస స్త్రీలు కూడా కేరింతలు కొట్టారు. దైవప్రవక్త(స) రాకపూర్వమే నేను 'ముఫస్సల్' కోవకు చెందిన అనేక సూరాలతోపాటు 'సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా' సూరాను కూడా కంఠస్తం చేసుకున్నాను.[1]**

**552) హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనా నగరానికి వచ్చినప్పుడు అబూబక్ర్(రజి) బిలాల్(రజి)లకు తీవ్రంగా జ్వరం వచ్చింది. నేను వారి సేవలో హాజరై, 'నాన్నా! మీ ఆరోగ్యం ఎలా ఉంది? బిలాల్! ఇప్పుడు మీకెలా ఉంది?' అని అడిగాను. ఆమె ఇంకా ఇలా అన్నారు: అబూబక్ర్ (రజి)కు జ్వరం తీవ్రతరమైనప్పుడు ఆయన ఈ కవిత పఠించసాగారు:**

**"ప్రతి వ్యక్తీ తన ఇంటివారలలో తెల్లవారుస్తాడు.**

**ఇక మృత్యువు అంటారా, అది చెప్పువారు కన్నా దగ్గరగా ఉంది."**

**ఇక బిలాల్(రజి) అంటారా, ఆయనకు జ్వరం తగ్గినప్పుడు వలవలా ఏడుస్తూ ఈ కవిత చదివేవారు :**

**"నేనెప్పుడయినా ఒక్క రాత్రి అయినా మక్కా లోయలో గడుపుతానని తెలిస్తే ఎంత బాగుండు!**

**నా చుట్టూ (సువాసన వెదజల్లే) ఇజ్ఖిర్, జలీల్ ఉండగా సేదదీరే అవకాశం దొరుకునా?**

**ఒక్కరోజయినా 'మజన్నా' నీటి వద్దకు పోగలనా?**

**షామా, తుఫైల్ పర్వతాలపై దృష్టిని సారించగలనా?"**

---

551–1. **'హాకిమ్'**లోని రివాయతు ప్రకారం దైవప్రవక్త(స) మదీనా నగరానికి సమీపించినప్పుడు బనీ నజ్జార్ తెగకు చెందిన బాలికలు సంతోషంతో డప్పు వాయిస్తూ "వదా కొండల మధ్యన పూర్ణచంద్రుడు ఉదయించాడు. దైవానికి కృతజ్ఞతలు తెలుపటం మాకు తప్పనిసరై పోయింది" అని గీతాలాపన చేయసాగారు. అది విని, "అల్లాహ్ మిమ్మల్ని ఇష్టపడుతున్నాడని తెలుసుకోండి" అని దైవప్రవక్త(స) పలికారు.

అల్ హుజురాత్ సూరా నుండి మొదలయ్యే సూరాలను **'ముఫస్సలాత్'** అంటారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అంటున్నారు : నేను దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి, పరిస్థితుల ఈ స్వరూపాన్ని విడమరచి చెప్పాను. అప్పుడు ఆయన(స) ఇలా ప్రార్థించారు: "దేవా! మక్కా పట్ల మా హృదయాలలో ఎంత ప్రేమాభిమానం ఉండేదో అంత కన్నా ఎక్కువ ప్రేమాభిమానాన్ని మదీనా పట్ల జనింపజెయ్యి. ఇక్కడి గాలి నీరును ఆరోగ్యప్రదంగా చెయ్యి. మా కొరకు ఇక్కడి 'సా', 'ముద్'(కొల మానాల)లో సమృద్ధిని వొసగు. ఇక్కడి జ్వరాన్ని జుహైఫా ప్రదేశానికి తరలించు."

**553)** ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్ తెలిపారు: నేను మహనీయ ఉస్మాన్(రజి) సన్నిధికి వెళ్ళినప్పుడు, ఆయన దైవస్తోత్రం చేసి, సాక్ష్యవచనం పలికిన మీదట ఇలా అన్నారు: "అమ్మాబాద్! అల్లాహ్ ముహమ్మద్(సఅసమ్)కు సత్యంతో పాటు ప్రభవింపజేశాడనటంలో ఎలాంటి సందేహం లేదు. అల్లాహ్ మరియు ఆయన సందేశహరుని సందేశంపై (తొలి రోజుల్లోనే) 'చిత్తం' అని స్పందించిన వారిలో నేనూ ఒకణ్ణి. ముహమ్మద్(స) తీసుకు వచ్చిన విషయాలన్నింటినీ నేను విశ్వ సించాను. తరువాత నేను రెండు హిజ్రత్‌లు చేశాను. దైవప్రవక్త(స)కు అల్లుడయ్యే సౌభాగ్యం కూడా నాకు దక్కింది. దైవప్రవక్త(స) సమక్షంలో నేను విధేయతా ప్రమాణం కూడా చేశాను. దైవసాక్షిగా! నేను ఎన్నడూ ఆయన మాట వినకపోవటం గానీ, ఆయనకు దగా చేయటం గానీ జరగలేదు. ఆయన పరమపదించే వరకూ ఆయన విధేయుడుగానే ఉన్నాను."

**554)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) 'మినా'లో తన గుడారం వైపునకు తిరిగి వస్తున్నారు... ఇది హజ్రత్ ఉమర్ (రజి) గారి చివరి హజ్జ్ యాత్ర సందర్భంగా జరిగిన సంఘటన! నేనాయన్ని కలిసి నప్పుడు, ఆయన ఇలా అన్నారు: (ఉమర్-రజి హాజీలను ఉద్దేశించి ప్రసంగించ బోయారు. అందువల్ల) నేనాయనతో ఇలా విన్నవించుకున్నాను: "అమీరుల్ మోమినీన్! హజ్జ్ సందర్భంగా రకరకాల జనులు వస్తారు. వారి ఆలోచనలు కూడా రకరకాలుగా ఉంటాయి. గలాటా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మీరు మీ నిర్ణ యాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసుకుని, మదీనా చేరుకున్న మీదట ప్రసంగించండి. ఎందుకంటే అది హిజ్రత్ చేసిన కేంద్రం! సున్నత్ నెలవు! అక్కడ విజ్ఞులు, గౌరవ నీయులైనవారు ఉంటారు." ఉమర్(రజి) ఇది విని, "నీ అభిప్రాయం సరైనదే.

**మదీనాకు చేరగానే వీలైనంత తొందరగా ప్రసంగించడానికి నిలబడతాన"ని[1] అన్నారు.**

**555) దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో విధేయతా ప్రమాణం చేసిన అన్సార్ మహిళ ఉమ్మె అలా (ర.అ) తెలిపారు : అన్సార్లు ముహాజిర్ల ఆతిథ్యం కొరకు చీటీలు (లాటరీ) వేసినప్పుడు ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ ఆమె వాటాలోకి వచ్చారు. ఉమ్మె అలా(ర.అ) వివరించారు: తరువాత ఉస్మాన్(ర.అ) మా వద్ద అస్వస్థతకు గుర య్యారు. నేను ఆయనకు సర్వవిధాలా సేవలు చేశాను. కాని ఆయన బ్రతకలేదు. మేము ఆయన్ని ఆయన వస్త్రాల్లో చుట్టేశాము. అంతలో దైవప్రవక్త(స) కూడా విచ్చేశారు. ఆ సమయంలో నా నోట, 'అబూ సాయిబ్! (ఇది ఉస్మాన్ బిన్ మజ్‌ఊన్ కునీయత్) మీ మీద దైవకారుణ్యం కురియుగాక! అల్లాహ్ మిమ్మల్ని గౌరవంతో సత్కరిస్తాడని నేను సాక్ష్యమిస్తున్నాను' అన్న మాటలు వెలువడ్డాయి. దానికి దైవప్రవక్త(స), "అల్లాహ్ తన గౌరవంతో ఇతన్ని సత్కరిస్తాడన్న సంగతి నీకెలా తెలుసు?" అని ప్రశ్నించారు. 'ఈ విషయం గురించి నాకేమీ తెలియదు. దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీపై ఫిదా' అని నేను బదులిచ్చాను. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "నిశ్చయంగా రానున్నది (మరణం) ఇతని వద్దకు వచ్చిందన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. దైవసాక్షిగా! నేను కూడా అల్లాహ్ ఇతనికి మేలు చేస్తాడనే ఆశిస్తున్నాను. కాని నేను దైవప్రవక్తనైనప్పటికీ నా వ్యవహారంలో ఏమి జరగనున్నదో స్వయంగా నాకే తెలియదు"–ఉమ్మె అలా (ర.అ) ఇలా అన్నారు: 'దైవసాక్షిగా! ఈ సంఘటన తరువాత నేను ఇక ఎన్నడూ ఎవరి పరిశుద్ధత గురించి**

---

554–1. ఇంతకీ ఏం జరిగిందంటే, హజ్జ్ సందర్భంగా 'మినా' ప్రదేశంలో ఒక మూర్ఖుడు, "ఒకవేళ ఉమర్(రజి) చనిపోతే నేను ఫలానా వ్యక్తి ముందు విధేయతా ప్రమాణం (బైఅత్) చేస్తాను. లోగడ జనులు వెనకా ముందు ఆలోచించకుండా అబూబక్ర్ సమక్షంలో బైఅత్ చేశారు' అని చెప్పాడు. ఈ మాట హజ్రత్ ఉమర్(రజి) వరకూ చేరింది. ఆయనకు కోపం వచ్చింది. అతన్ని పిలిచి హెచ్చరించాలని అనుకు న్నారు. కాని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఆయనకు సర్ది చెప్పారు. హజ్జ్‌లో రకరకాల భావాలు గలవారు ఒకచోట గుమిగూడుతారని, అందుకే మదీనా చేరుకున్న మీదట మీరు చెప్పదలచిందేమిటో చెప్పండని సూచించారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ సలహాను హజ్రత్ ఉమర్(రజి) స్వాగతించారు.

**కూడా ధ్రువీకరణ ఇవ్వనుగాక ఇవ్వను. ఆమె ఇంకా ఇలా అన్నారు : ఈ సంఘటన నన్ను ఎంతగానో కృంగదీసింది. తరువాత నాకు నిద్రపట్టినప్పుడు, నేను కలలో చూశాను– ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ కొరకు ఒక ప్రవహించే సెలయేరు ఉంది. నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై ఈ విధంగా కలగన్నానని చెబితే, "అది (ఆ సెలయేరు) అతని సదాచరణ"[1] అని ఆయన(స) అన్నారు.**

**556) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు : (అన్సార్ల ప్రధాన తెగలయిన ఔస్, ఖజ్రజ్‌ల మధ్యన) బుఅస్ యుద్ధాన్ని దైవప్రవక్త(సఅసమ్) మదీనాకు చేరుకోక ముందే అల్లాహ్ విచ్ఛిన్నపరచాడు. అందువల్ల దైవప్రవక్త(స) మదీనా నగరానికి చేరుకునే నాటికి అన్సార్లలో చీలిక వచ్చి ఉంది. అప్పటికే వారి నాయకులు, ప్రముఖులు వధించబడ్డారు. అందులో దేవుని పరమార్థం దాగి వుంది. అంటే అన్సార్లు ఇస్లామ్ వైపునకు మరలడానికి ఈ పరిస్థితులు దోహదపడ్డాయి.[1]**

**557) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : మహనీయ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) ఒకసారి మా ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇంట్లోనే ఉన్నారు. అది ఈదుల్ ఫిత్ర్ లేదా ఈదుల్ అజ్హా రోజు. ఇద్దరు అన్సార్ బాలికలు (డప్పులు వాయిస్తూ), బుఆస్ యుద్ధ దినాన అన్సార్లు చెప్పిన గర్వాతిశ**

---

555–1. "రేపు మీకు ఏమి జరగనున్నదో, నాకు ఏమి కానున్నదో నాకైతే తెలియదు. నేను నా వద్దకు పంపబడే దైవవాణి (వహీ)ని మాత్రమే అనుసరిస్తాను" (అహ్ఖాఫ్ : 9) అన్న దైవవచనం ఈ సందర్భంగా గమనార్హం. ఉస్మాన్ బిన్ మజ్‌వూన్(రజి) సదాచరణ ప్రవహించే సెలయేరు రూపంలో వ్యక్తమయింది.

వేరొక హదీసు ద్వారా తెలిసేదేమిటంటే; మనిషి సత్కార్యాలు సుందర స్వరూపుడైన మనిషి ఆకారంలో వ్యక్తమవుతాయి. దుష్కార్యాలు కురూపి అయిన మనిషి ఆకారంలో బహిర్గతమవుతాయి– రెండు హదీసులు కూడా సత్యమైనవే. వాటి మధ్యన ఎలాంటి వైరుధ్యం లేదు. పరలోకంలో ప్రతి మనిషి ముందు అతని ఆచరణలు సిసలైన రూపంలో ముందుకు వస్తాయి. దైవం మరియు దైవప్రవక్త (స) తెలిపిన దానిని విశ్వసించటం మన కర్తవ్యం.

556–1. అంటే అన్సార్లలోని శ్రీమంతులు, సర్దార్లు యుద్ధంలో వధించబడ్డారు. పేదవారు మాత్రం మిగిలారు. ధనమదాంధులు, అధికార మదాంధులు గనక బ్రతికి ఉంటే బహుశా వారు సన్మార్గంలో అవరోధాలు సృష్టించి ఉండేవారు.

యంతో కూడిన కవితలు పాడుకుంటున్నారు. అది విని అబూబక్ర్, 'దైవప్రవక్త(స) ఇంట ఇలాంటి షైతానీ పాటలా?' అని మండిపడ్డారు. ఈ మాట రెండుసార్లు పలికారు. అది విన్న దైవప్రవక్త(స), "అబూబక్ర్! వాళ్ళను ఏమీ అనకండి. ప్రతి జాతికీ ఉత్సవ దినం ఉంటుంది. ఈ రోజు మన ఉత్సవ దినం" అన్నారు.

**558)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తనతో చెప్పారని అబూ తయ్యాహ్ యజీద్ బిన్ హుమైద్ జుబ్ యీ తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనాకు ఏతెంచినప్పుడు మొదట మదీనా మెరక ప్రదేశం 'ఖుబా'లోని ఒక వాడలో విడిది చేశారు. అది బనీ అమ్ర్ బిన్ ఔఫ్ వాడగా పిలువబడేది. దైవప్రవక్త(స) అక్కడ పధ్నాలుగు రాత్రులు ఆగి ఉన్నారని ఉల్లేఖకుడు తెలియజేశారు. తరువాత ఆయన (స) బనీ నజ్జార్ తెగవారికి కబురంపారు. బనీ నజ్జార్ అన్సార్లు ఆయన(స) దగ్గరకు ఖడ్గాలు వ్రేలాడదీసుకుని వచ్చారు. ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు: ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళ ముందు కదలాడుతోంది. ఆ సమయంలో దైవప్రవక్త(స) తన వాహనంపై స్వారీ అయ్యారు. అబూబక్ర్ ఆయన(స) వెనుకే కూర్చున్నారు. బనీ నజ్జార్ తెగకు చెందిన అన్సార్లు ఆయన నలువైపులా సాయుధులై – వలయంగా ఏర్పడి– నడుస్తున్నారు. చివరకు ఆయన(స) అబూ అయ్యూబ్ అన్సారీ(రజి) ఇంటికి సమీపంలో వాహనంపైనుంచి దిగారు. అప్పటి వరకూ ఆయన(స) ఎక్కడ వేళ అవుతే అక్కడే నమాజ్ చేసుకునేవారు. రాత్రిపూట మేకలు కట్టివేయబడే స్థలాలలో కూడా నమాజ్ చేయబడేది. తరువాత దైవప్రవక్త(స) మస్జిద్‌ను నిర్మించమని ఆదేశించారు. దీని కోసం ఆయన(స) బనూ నజ్జార్ తెగవారిని పిలిపించారు. వారు వచ్చిన తరువాత "బనూ నజ్జార్! ఈ తోట విలువ ఎంతో నిర్ధారించండి" అని కోరారు. దానికి వారు, 'లేదు. దైవసాక్షిగా! మేము దీని మూల్యాన్ని అల్లాహ్ నుండి మాత్రమే తీసుకుంటాము' అని విన్నవించుకున్నారు. ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు: ఆ తోటలో రెండు వస్తువులు ఉండేవి. అవేమిటో నేను మీకు చెబుతాను– ఆ తోటలో బహు దైవారాధకుల సమాధులు ఉండేవి. కొన్ని శిథిలాలు, కొన్ని ఖర్జూర చెట్లు ఉండేవి. దైవప్రవక్త(స) ఆదేశానుసారం బహు దైవారాధకుల సమాధులు పెకలించి వేయబడ్డాయి. శిథిలాలు నేలమట్టం చేసి చదునుగా చేయటం జరిగింది. ఖర్జూర చెట్లు నరికి వేయబడ్డాయి. ఖర్జూరపు బొద్దులు మస్జిద్ ఖిబ్లా దిక్కున వరుసగా ఒక గోడ మాదిరిగా పేర్చబడ్డాయి. వాకిలి వద్ద రాళ్ళు ఉంచబడ్డాయి. అనస్ (రజి) ఇలా అంటున్నారు: ప్రవక్త సహచరులు రాళ్ళు మోస్తున్న

**ప్పుడు, కవితలు చదివేవారు. దైవప్రవక్త(స) కూడా వారితోపాటు రాళ్ళు మోసే వారు. సహచరుల కవితలకు సమాధానంగా ఆయన(స) "దేవా! మేలు అన్నది పరలోకంలో ఉన్నదే. నీవు అన్సార్లకు, ముహాజిర్లకు సహాయపడు" అని పలికేవారు.**

## అధ్యాయం : 78

## హజ్జ్ నెరవేర్చిన పిదప 'ముహాజిర్లు' మక్కాలో ఆగి ఉండటం[1]

**559) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని అలా బిన్ హజ్రమీ(రజి) తెలిపారు : ముహాజిర్ అయిన వ్యక్తికి (మక్కాలో హజ్జ్ సందర్భంగా) వీడ్కోలు ప్రదక్షిణ తర్వాత మూడు రోజుల వరకు ఆగి ఉండే అనుమతి ఉంది."**

## అధ్యాయం : 79

## ఇస్లామ్ చరిత్రకు మొదలేది?[1]

**560) హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ (రజి) తెలిపారు : ఇస్లామ్ చరిత్ర**

---

77-1. మక్కా విజయానికి పూర్వం హిజ్రత్ చేసిన వ్యక్తి (ముహాజిర్) తిరిగి మక్కాలో స్థిరనివాసం ఏర్పరచుకోవటం అధర్మం అని హాఫిజ్ ఇబ్నె హజర్ అన్నారు. అయితే ఉమ్రా, హజ్జ్ నిమిత్తం అక్కడకు వచ్చిన ముహాజిర్ తాత్కాలికంగా– మూడు రోజుల వరకూ– అక్కడ ఆగవచ్చు. అంతకన్నా ఎక్కువ సమయం ఆగటం సమంజసం కాదు. ఇక ఇతర ప్రాంతాల వారు తమ ధర్మపరిరక్షణ నిమిత్తం– దైవప్రసన్నతకై– తమ దేశాన్ని వదలిపెడితే, వారు మళ్ళీ అక్కడకు తిరిగి వెళ్ళటం భావ్యం కాదు. కాని ఉపద్రవం సమసిపోయి, పరిస్థితులు తమకు సానుకూలంగా ఉన్నాయనుకుంటే, అట్టి పరిస్థితిలో తమ స్వదేశానికి తిరిగి రావటం సమంజసమే.

78-1. ఇబ్నె జౌజీ ఇలా అంటారు: ప్రపంచంలో మనుజ జాతి జనసంఖ్య పెరగటం మొదలయ్యాక హజ్రత్ ఆదమ్(అ) కాలం నుండి చరిత్ర (లేక తేదీ) పరిగణన లోనికి వచ్చింది. ఆదమ్ నుండి నూహ్ (అ) వరకు మొదటి దశగా, నూహ్ కాలపు తుఫాను నుండి మహనీయ ఇబ్రాహీమ్(అ) అగ్ని గుండంలో పడవేయ బడే వరకూ రెండవ దశగా, ఆనాటి నుండి హజ్రత్ యూసుఫ్(అ) కాలం వరకు మూడవ దశగా, అక్కడి నుండి మహనీయ మూసా(అ) ఈజిప్ట్‌ను విడిచిపోయే వరకూ నాల్గవ దశగా, అక్కడి నుండి హజ్రత్ దావూద్(అ) వరకు ఐదవ దశగా,

మహాప్రవక్త(స)కు దైవదౌత్యం అందిన కాలం నుండి గానీ, ఆయన మరణ సమయం నుండి గానీ పరిగణనలోకి తీసుకోబడలేదు. పైగా ఆయన(స) మదీనాకు హిజ్రత్ చేసిన సంవత్సరం నుండి లెక్కించబడింది.

**561)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: "(మక్కాలో ఉన్నప్పుడు) ప్రతి నమాజ్ రెండేసి రకతుల చొప్పున విధితమై ఉండేది. తరువాత ఆయన(స) మదీనాకు హిజ్రత్ చేశాక (జుహ్ర్, అస్ర్, ఇషా వేళల్లో) నాలుగేసి రకతుల చొప్పున ఫర్జ్ గావించబడ్డాయి. ప్రయాణంలో మాత్రం రెండేసి రకతులే ఉంచబడ్డాయి."

## అధ్యాయం : 80

## "దేవా! నా సహచరుల హిజ్రత్‌ను స్థిరపరచు"

అని దైవప్రవక్త(స) వేడుకోవటం. మక్కాలోనే మరణించిన ముహాజిర్ల గురించి ఆయన(స) దుఃఖించటం.

**562)** హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) ఇలా వివరించారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) వీడ్కోలు హజ్జ్ సందర్భంగా– హిజ్రీ పదవ యేట– నన్ను పరామర్శించటానికి నా దగ్గరకు వచ్చారు. అస్వస్థతకు గురైన నేను తిరిగి కోలుకునే ఆశలు అడుగంటిపోయాయి. అందువల్ల నేను, 'దైవప్రవక్తా! నా వ్యాధి తీవ్రతను మీరు స్వయంగా చూస్తూనే ఉన్నారు. నా దగ్గర చాలా ఆస్తి ఉంది. ఒకే ఒక్క కూతురు నాకు వారసురాలుగా ఉంది. అందువల్ల నేను నా ఆస్తిలో మూడింట రెండు వంతులు సదఖాగా ఇవ్వనా?' అని విన్నవించుకున్నాను. దానికి దైవప్రవక్త(స) "వద్దు" అన్నారు. 'పోనీ సగభాగం ఇవ్వనా?' అని నేను అడగ్గా "సాద్! మూడింట ఒక వంతు (1/3) ఇవ్వు, అది చాలు. వాస్తవానికి ఇది కూడా ఎక్కువే. నీవు నీ

---

అక్కడి నుండి హజ్రత్ సులైమాన్(అ) వరకు ఆరవ దశగా, అక్కడి నుండి హజ్రత్ ఈసా(అ) వరకు ఏడవ దశగా పేర్కొనబడింది. ఇక అంతిమ దైవప్రవక్త(స) హిజ్రత్ కాలం నుండి ఇస్లామీయ చరిత్ర ప్రారంభమవుతుంది. హిజ్రత్ రబీవుల్ అవ్వల్ నెలలో జరిగినప్పటికీ ముహర్రం నెల నుండి హిజ్రీ శకపు సంవత్సరం ఆరంభించబడింది. క్రైస్తవులు మాత్రం హజ్రత్ ఈసా(అ) లేపుకోబడినప్పటి నుండి క్రీస్తు శకాన్ని లెక్కిస్తారు.

**సంతానాన్ని అగత్యపరులుగా వదలగా, వారు జనుల ఎదుట చేయి చాపటంకన్నా నీవు వారిని స్థితిమంతులుగా వదలిపోవటం మంచిది" అని ఆయన(స) సూచించారు.**

**అహ్మద్ బిన్ యూనుస్ ఉటంకించిన దాని ప్రకారం దైవప్రవక్త(స) ఈ విధంగా కూడా ఉపదేశించారు: "నీవు నీ సంతానాన్ని వదలి ఏం ఖర్చుపెట్టినా, తద్వారా అల్లాహ్ ప్రసన్నతను చూరగొనటం నీ లక్ష్యమై ఉంటే, అల్లాహ్ నీకు దాని పుణ్యఫలం ప్రసాదిస్తాడు. నీవు నీ భార్య నోటికి అందించే అన్నపు ముద్దకు కూడా అల్లాహ్ నీకు పుణ్యఫలం వొసగుతాడు"– 'దైవప్రవక్తా! నేను నా సహవాసుల వెనుక మక్కాలోనే ఉండిపోతానా? (నేను మక్కాలోనే) తనువు చాలిస్తానా?)' అని నేను సందేహపడగా, ఆయన(స) ఇలా అన్నారు: "నీవు వెనుక ఉండిపోవు. నీవు ఏ సదాచరణ చేసినా, దాని లక్ష్యం దైవప్రసన్నత బడయటమై ఉంటే, తత్కారణంగా నీ అంతస్తు ఉన్నతమవుతూనే ఉంటుంది. బహుశా నీవు ఇంకా చాలా కాలం బ్రతికి ఉంటావు. నీ ద్వారా చాలా మంది (ముస్లింల)కి లాభం చేకూరగలదు. చాలా మందికి (అన్యులకు) నష్టం వాటిల్లగలదు. అల్లాహ్! నా సహచరుల హిజ్రత్‌ను పూర్తిగావించు. వారిని వారి కాళ్ళ మడమలపై వెనక్కి మరల్చకు."[1]**

**అయితే సాద్ బిన్ ఖౌలా నష్టంలో పడిపోయారు. దైవప్రవక్త(స) ఆయన ముగింపుపై విచారం వ్యక్తం చేసేవారు. ఎందుకంటే ఆయన (హిజ్రత్ చేసిన తర్వాత) మళ్ళీ మక్కాలోనే మరణించారు.**

---

562–1. అంతిమ హజ్జ్ యాత్ర సందర్భంగా హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) మక్కాలో అస్వస్థతకు గురయ్యారు. తాను బ్రతుకుతానన్న ఆశ ఆయనకు లేకుండా పోయింది. అందువల్ల ఆయన దైవప్రవక్త(స) ముందు తన ఆస్తిపాస్తుల పంపకం, దానధర్మాల గురించి సంప్రతించారు. అప్పుడు దైవప్రవక్త(స) ఆయన్ని ఓదారుస్తూ, నీవు ఇంకా చాలాకాలం బ్రతికి ఉంటావని, నీ ద్వారా లోకానికి మేలు జరగనున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జరిగింది కూడా. ఆ తర్వాత సాద్ బిన్ అబీ వక్కాస్ మరో 40 ఏండ్ల వరకూ జీవించి ఉన్నారు. ఆయన నేతృత్వంలో ఇరాక్ జయించబడింది. చాలామంది ఆయన చేతుల మీదుగా సన్మార్గ భాగ్యం పొందారు. ఆయనకు పుత్ర సంతానం కలిగింది.

హదీసుపై చింతన చేసిన మీదట బోధపడేదేమంటే సంతానాన్ని నిరుపేదలుగా

## అధ్యాయం : 81

## దైవప్రవక్త(స) ఏ విధంగా తన సహచరుల మధ్యన సోదర బంధాన్ని ఏర్పరచారు?

**అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) ఇలా అన్నారు : మేము హిజ్రత్ చేసి మదీనాకు వచ్చినప్పుడు దైవప్రవక్త(స) నాకూ– సాద్ బిన్ రబీ అన్సారీ (రజి)కి మధ్య సోదర బంధం ఏర్పరచారు. అబూ జుహైఫా(రజి) ఇలా అన్నారు : దైవప్రవక్త(స) సల్మాన్ ఫార్సీకి– అబూ దర్దాకి మధ్యన సోదర బంధం ఏర్పరచారు.[1]**

**563) హజ్రత్ అనస్(రజి) కథనం: హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) హిజ్రత్ చేసి (మదీనా) వచ్చినప్పుడు, ప్రవక్త మహనీయులు(స) ఆయనకు సాద్ బిన్ రబీ (రజి)తో సోదర బంధం ఏర్పరచారు. ఒకసారి సాద్(రజి) అబ్దుర్రహ్మాన్ (రజి)తో, "నా దగ్గరున్న సిరిసంపదల్లో నుంచి సగభాగం మీరు తీసేసుకోండి" అని ప్రతిపాదించారు. దానికి అబ్దుర్రహ్మాన్, "అల్లాహ్ మీ ఆస్తిపాస్తుల్లో ఆలుబిడ్డల్లో శుభాన్ని ప్రసాదించుగాక! నాకు మార్కెట్ దారి చూపించండి, చాలు"[1] అని చెప్పారు. ఆ విధంగా ఆయన వ్యాపారం చేయసాగారు. మొదటి రోజు ఆయనకు నెయ్యిలో, జున్ను ముక్కల్లో కొంత లాభం వచ్చింది. కొన్ని రోజులు గడిచిన మీదట దైవప్రవక్త(స) అబ్దుర్రహ్మాన్‌ను గమనించారు. ఆయన దుస్తులపై (సువాసనతో కూడిన) కుంకుమ రంగు గుర్తులు కనిపించాయి. "అబ్దుర్రహ్మాన్! ఏమిటిది?" అని అడిగితే, "దైవప్రవక్తా! నేనొక అన్సార్ మహిళను వివాహమాడాను" అన్నారు.**

---

వదలిపెట్టి, వారు ముష్టెత్తుకునే స్థితికి దిగజార్చటం కన్నా సాధ్యమైనంత వరకు వారిని ఆర్థికంగా మంచి స్థితిలో వదలిపోవాలి. దానికోసం తల్లిదండ్రులు అహోరాత్రులు శ్రమించాలి. పిల్లల కొరకు స్థిరచరాస్తులు వదలిపోవటం సాధ్యం కాకపోయినా వారిని విద్యావంతుల్ని చేయాలి. వారికి సంస్కారం ఇవ్వాలి.

80–1 దైవప్రవక్త(స) ముహాజిర్లకి– అన్సార్లకీ మధ్యన నెలకొల్పిన ఈ సోదర బంధం ప్రభావం వారిపై ఎంతగా పడిందంటే అన్సార్లు తమ ఆస్తిపాస్తుల్లో కూడా ముహాజిర్లకు వాటా ఇవ్వడానికి సిద్ధపడ్డారు. అప్పుడు రక్త సంబంధీకులు ఎక్కువ హక్కుదారులు (33: 6) అనే ఆయత్ అవతరించింది. హిజ్రత్ జరిగిన ఐదు మాసాల తర్వాత ఈ 'సోదర బంధం' ఏర్పడింది.

**"మరైతే మహర్‌గా నీవు ఆమెకు ఏమిచ్చావు?" అని ప్రవక్త(స) ప్రశ్నించగా, "ఒక టెంక బరువుకు సమానంగా బంగారం ఇచ్చానన్నారా"యన. దానికి దైవప్రవక్త(స), "మంచిది. ఇప్పుడు నీవు వలీమా విందు ఇవ్వు; ఒక మేకను జిబహ్ చేసి అయినా సరే" అని సూచించారు.**

## అధ్యాయం : 82

**564) మహనీయ అనస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనాకు ఏతెంచారన్న సమాచారం అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి)కు తెలిసినప్పుడు, కొన్ని ప్రశ్నలు వేసే ఉద్దేశ్యంతో ఆయన దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. ఇలా అన్నారు : 'నేను మీకు మూడు ప్రశ్నలు వేస్తాను. ఒక్క దైవప్రవక్తకు తప్ప వాటి సమాధానం వేరెవరికీ తెలిసి ఉండదు- 1) ప్రళయదినం రాకకు మొదటి సూచన ఏది? 2) స్వర్గవాసులకు అన్నిటికన్నా ముందు ఏ భోజనంతో ఆతిథ్యం ఇవ్వబడుతుంది? 3) శిశువుకు ఒక్కోసారి తండ్రి పోలికలొస్తే, ఒక్కోసారి తల్లి పోలికలొస్తాయి. అలా ఎందుచేత?'**

**సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "దైవదూత జిబ్రీల్ (అలైహిస్సలాం) ఇప్పుడే వచ్చి ఈ విషయం నాకు తెలియజేశారు". ఇది విని, 'ఆయన దైవదూతలలో యూదులకు శత్రువు' అన్నారు అబ్దుల్లాహ్ బిన్ సలామ్. దైవప్రవక్త (స) ఇలా అన్నారు : 1) "ప్రళయ సూచనలలో మొట్టమొదటిది అగ్ని. అది మనుషుల్ని తూర్పు నుండి పడమర వైపునకు తీసుకెళుతుంది. 2) స్వర్గవాసులకు మొట్టమొదట చేప కాలేయంతో విందు (ఆతిథ్యం) ఇవ్వబడుతుంది. అది చేప కాలేయపు పెద్ద ముక్క అయి ఉంటుంది (ఎంతో రుచికరంగా ఉంటుంది). 3) ఇక శిశువు పోలికల విషయానికి వస్తే స్త్రీ వీర్యంపై పురుషుని వీర్యం ఆధిపత్యం వహించినప్పుడు శిశువుకు తండ్రి పోలికలు వస్తాయి. పురుషుని వీర్యంపై స్త్రీ వీర్యం ఆధిక్యత వహించినప్పుడు శిశువుకు తల్లి పోలికలొస్తాయి."**

---

563-1. ఒకవైపున అన్సార్లలోని త్యాగగుణం, మరోవైపున ముహాజిర్లలోని స్వాభిమానం ఈ హదీసు ద్వారా కొట్టొచ్చినట్లే కనిపిస్తున్నాయి. ఇచ్చేవారికి, పుచ్చుకునేవారికి కూడా ఇది ఉదాహరణ ప్రాయం. ఈ హదీసు ద్వారా వర్తకానికి ఇవ్వబడిన ప్రాధాన్యం, ప్రోత్సాహం కూడా స్పష్టమవుతోంది.

**అంతే. ఈ సమాధానం విని అబ్దుల్లాహ్ బిన్ సలామ్, 'అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్యదైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. తమరు దైవ సందేశహరులని కూడా నేను సాక్ష్యం పలుకుతున్నాను' అన్నారు. తరువాత ఆయన ఇలా అన్నారు: 'దైవప్రవక్తా! అపనిందలు మోపటంలో యూదులు సిద్ధహస్తులు. అందుకే, నేను ఇస్లామ్ స్వీకరించిన సంగతి వారికి తెలియజేయక ముందు, నా గురించి వారిని అడగండి'.**

**కొంతమంది యూదులు రాగానే, "మీ జాతి వారిలో అబ్దుల్లాహ్ బిన్ సలామ్ ఎవరు? ఎటువంటివారు?" అని ప్రశ్నించారు దైవప్రవక్త(స). దానికి యూదులు, 'ఆయన మా అందరిలోకీ ఉత్తముడు. అందరికన్నా ఉత్తముడైన వాని కుమారుడు. మాలో అందరికన్నా శ్రేష్ఠుడు. అందరికన్నా శ్రేష్ఠుని పుత్రుడు' అని సమాధాన మిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స), "ఒకవేళ ఆయన ఇస్లామ్ స్వీకరిస్తే అప్పుడు మీరేమంటారు?" అని అడగ్గా, 'ఈ చేష్ట నుండి దేవుడాయన్ని రక్షించుగాక!' అని బదులిచ్చారు. దైవప్రవక్త(స) రెండవసారి కూడా వారికి అదే ప్రశ్న అడగ్గా, వారు తిరిగి అదే జవాబు ఇచ్చారు. ఆ తరువాత అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) బయటికి వచ్చి, 'అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్యదైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్(స) దైవప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను' అన్నారు. ఈ సాక్ష్య వచనం విన్న తక్షణమే యూదులు, 'ఇతను మా అందరిలోకీ అల్పుడు. అందరికన్నా అల్పు డైన వాని కుమారుడు' అంటూ ఆయన గురించి చెడుగా మాట్లాడటం మొదలెట్టారు. అది విని అబ్దుల్లాహ్ బిన్ సలామ్, 'దైవప్రవక్తా! విన్నారా! ఇలా అంటారని నేను ముందే ఊహించాన'న్నారు.[1]**

**565) అబ్దుర్రహ్మాన్ బిన్ ముత్యిమ్ వివరించారు: నా మిత్రుడొకడు మార్కెట్టులో కొన్ని దిర్హములను (లేదా నాణేలను) అరువుగా అమ్మాడు.[1] నేనతనితో,**

---

564–1. ఈ విధంగా యూదుల రెండు నాల్కల ధోరణి బట్టబయలైపోయింది. మొదట అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి)ను వారు పొగడ్తల్లో ముంచెత్తారు. ఆయన ఇస్లామ్ స్వీకరించినట్టు తెలియగానే తూర్పారబట్టారు. తమ అడుగులకు మడుగులొత్తి నంత సేపు వారు మెచ్చుకుంటారు. వ్యతిరేకంగా ఉంటే మాత్రం, ఎంత గొప్ప విద్వాంసుడైనా సరే అతన్ని తూలనాడుతారు. ఈ ద్వంద్వ స్వభావం వారిలో ఇప్పుడూ ఉంది.

**‘సుబ్హానల్లాహ్! ఇది ధర్మసమ్మతమేనా?’ అని అడిగాను. దానికి అతను, ‘సుబ్హానల్లాహ్! దేవుని మీద ఒట్టు. నేను బజారులో వీటిని విక్రయించినప్పుడు ఎవరూ అభ్యంతరం తెలుపలేదు’[2] అన్నాడు. అబ్దుర్రహ్మాన్ ఇలా అన్నారు : ఈ వ్యవహారం గురించి నేను బరా బిన్ ఆజిబ్ (సహాబీ-రజి)ను అడగ్గా, ఆయన ఇలా అన్నారు: ‘దైవప్రవక్త(స) హిజ్రత్ చేసి మదీనాకు వచ్చినప్పుడు, మేము ఇలాంటి క్రయ విక్రయాలు జరిపేవారం. దానిపై దైవప్రవక్త(స), “ఈ క్రయ విక్రయాల వ్యవహారం అప్పటికప్పుడు (నగదు రూపేణా) చేతులు మారితే అందులో తప్పులేదు. కాని వ్యవహారం అరువుగా జరిగితే మాత్రం అది ధర్మసమ్మతం కాద”ని అన్నారు. కావాలంటే మీరు జైద్ బిన్ అర్ఖమ్(రజి)ని కూడా కలుసుకుని అడిగితే బాగుంటుంది. ఆయన మాలోని పెద్ద వర్తకుడు అన్నారు. నేనాయన్ని అడిగితే, ఆయన కూడా ఈ మాటే అన్నారు(అంటే బరా-రజి చెప్పినట్లే చెప్పారు). సుఫ్యాన్ ఒకసారి ఇలా అన్నారు : దైవప్రవక్త(స) మదీనాకు వచ్చిన రోజుల్లో మేము ఈ అరువు వ్యవహారం చేసేవారు. సీజన్ వచ్చేవరకు లేదా హజ్జ్ కాలం వరకు[3] చెల్లించే వాగ్దానంపై ఈ వర్తకం జరిగేది.**

## అధ్యాయం : 83

## ప్రవక్త మహనీయులు(స) మదీనా వచ్చినప్పుడు, యూదులు ఆయన(స) వద్దకు రావటం గురించి...

**566) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : “ఒకవేళ పది మంది యూదులు (మతాచార్యులు, విద్వాంసులు) నన్ను విశ్వసించినా యూదులంతా ముస్లింలుగా ధర్మపరివర్తన చెందేవారు.”[1]**

---

565-1. ఇది ధర్మసమ్మతం కాదు. ఎందుకంటే ఇది అప్పటికప్పుడు- నగదుగా - చేతులు మారాలి. వాణిజ్య ప్రకరణంలో ఈ వివరాలు వచ్చాయి.

565-2. అంటే అది ధర్మసమ్మతం కాకుండా ఉంటే జనులు తప్పకుండా తప్పపట్టేవారు కదా! అన్నది ఆయన మాటల్లోని అంతరార్థం.

565-3. ఇక్కడ ఉల్లేఖకుడు సంశయంలో పడ్డారు.

566-1. అంటే నేను మదీనా నగరానికి వచ్చిన మీదట పదిమంది యూదులు

**567) హ్రజత్ అబూ మూసా అష్అరీ(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనాకు వచ్చినప్పుడు, అక్కడి యూదులు ఆషూరా (ముహర్రమ్ పదవ తేదీ) దినాన్ని గౌరవిస్తూ, ఆ రోజు ఉపవాసం పాటించటం గమనించారు. అప్పుడాయన(స) ఇలా అన్నారు: "ఈ రోజు ఉపవాసం పాటించడానికి మేము ఎక్కువ హక్కుదారులం." అందువల్ల ఆయన ఆషూరా దినాన ఉపవాసం ఉండమని తన అనుచరులకు ఆజ్ఞాపించారు.**

**568) హ్రజత్ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనాకు ఏతెంచినప్పుడు, యూదులు ఆషూరా దినాన ఉపవాసం పాటించడాన్ని గమనించారు. దాని గురించి వారిని అడిగితే, 'ఇది అల్లాహ్ మూసా (అ)కు, బనీ ఇస్రాయీల్‌కు ఫిరౌన్‌పై విజయాన్ని ప్రసాదించిన రోజు. అందువల్ల మేము ఈ రోజును గౌరవిస్తూ ఉపవాసం పాటిస్తాము' అని వారన్నారు. దానికి దైవప్రవక్త(స), "మేము మూసా(అలైహిస్సలాం)కు మీకన్నా సన్నిహితులం" అని చెప్పారు. ఆ రోజు ఉపవాసం పాటించమని (మాకు) ఆదేశించారు.**

---

ముస్లింలుగా పరివర్తన చెందినా చాలు, మిగిలిన యూదులంతా వారిని చూసి ఇస్లామ్ స్వీకరించేవారు అని అర్థం.

అసలు జరిగిందేమిటంటే, దైవప్రవక్త(స) మదీనాకు హిజ్రత్ చేసి వచ్చినప్పుడు కేవలం ఒక్క అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) మాత్రమే ఇస్లామ్ స్వీకరించారు. మిగిలిన యూదు ప్రముఖులు– ఉదాహరణకు: అబూ యాసిర్, హుయి బిన్ అఖ్తబ్, కాబ్ బిన్ అష్రఫ్, రాఫె బిన్ అబీ హఖీఖ్ (వీరు బనీ నజీర్ తెగవారు), అబ్దుల్లాహ్ బిన్ హునైఫ్, ఖహస్, రిఫాఅ(వీరు బనూ ఖైనుఖా తెగవారు), జుబైర్, కాబ్, శామ్యూల్(వీరు బనూ ఖురైజా తెగవారు)– వీరంతా వ్యతిరేకించారు. అబూ యాసిర్ దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చాడని, తరువాత అతను తన జాతి ప్రజల వద్దకు వెళ్ళి, తాము ఎంతోకాలంగా నిరీక్షిస్తూ ఉన్న సత్యవంతుడైన ప్రవక్త వచ్చాడని నచ్చజెప్పాడని, ఆయన సందేశాన్ని స్వీకరించమని కోరాడని అనబడుతోంది. కాని అతని సోదరుడు త్రోసిపుచ్చాడు. అందువల్ల జాతి జనులు కూడా అబూ యాసిర్ మాట వినలేదు. ఒక్క మైమూన్ బిన్ యామీన్ మాత్రమే ఇస్లామ్ స్వీకరించాడు. కాని అతని పరిస్థితి కూడా అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి)లా మారింది. అంటే యూదులు ఇతన్ని కూడా ఎంతో పొగిడేవారు. కాని తీరా అతను ఇస్లామ్ స్వీకరించగానే అతని గురించి చెడుగా మాట్లాడటం మొదలెట్టారు.

**569)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్‌) తలవెంట్రుకలు నుదుటిపై వ్రేలాడుతూ ఉండేలా వదలేవారు. బహు దైవారాధకులు తలలో పాపిడి ఉండేలా దువ్వుకునేవారు. గ్రంథవహులు కూడా తమ తల వెంట్రుకలు నుదుటిపై వ్రేలాడదీసేవారు. దైవప్రవక్తపై ఏ ఏ విషయాల గురించి (వహీ ద్వారా) ఆజ్ఞ అవతరించలేదో, వాటిలో ఆయన(స) గ్రంథం కల ప్రజల పద్ధతిని ఇష్టపడేవారు. పిదప ఆయన(స) కూడా తల దువ్వుకోవటం మొదలెట్టారు.[1]

**570)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పినట్లుగా సయీద్ బిన్ జుబైర్ తెలియజేశారు : ఆకాశ గ్రంథాన్ని (దైవం అవతరింపజేసిన గ్రంథాన్ని) ముక్కలు ముక్కలుగా చేసినది గ్రంథం కల ప్రజలే. వారు ఆ గ్రంథంలోని కొన్ని విషయాలను విశ్వసించి, మరి కొన్నింటిని తిరస్కరించారు.[1]

## అధ్యాయం : 84

## సల్మాన్ ఫార్సీ(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటన

**571)** అబూ ఉస్మాన్ నహ్దీ కథనం: తనను పది మంది కన్నా ఎక్కువే కొనుగోలు చేసి అమ్మకం జరిపారని మహనీయ సల్మాన్ ఫార్సీ(రజి) తెలిపారు.

**572)** అబూ ఉస్మాన్ నహ్దీ కథనం: తాను (పారసీక దేశంలోని) రామ్ హుర్మూజ్ వాస్తవ్యుడనని హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) చెప్పేవారు.

**573)** అబూ ఉస్మాన్ నహ్దీ కథనం ప్రకారం హజ్రత్ సల్మాన్ ఫార్సీ(రజి) ఇలా అన్నారు : "ఈసా(అలైహిస్సలాం)కి– ముహమ్మద్(సఅసమ్‌)కి మధ్య కాలం సంధి కాలం (అంటే ఈ కాలంలో మరే ప్రవక్తా రాలేదు). ఈ సంధి కాలం దాదాపు ఆరువందల సంవత్సరాలు."[1]

---

569–1. బహుశా ఆయన(స)కు 'వహీ' ద్వారా ఆజ్ఞ ఇవ్వబడి ఉంటుంది. ముస్లింలు ప్రతి విషయంలో దైవప్రవక్త(స) విధానాన్ని అనుసరించటం అవసరం. అన్యుల పద్ధతిని అవలంబించకూడదు.

570–1. ఉదాహరణకు: అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) దైవదౌత్యాన్ని త్రోసిపుచ్చారు. యూదులలో ఉన్న ఈ మాయ రోగం ముస్లింలలో కూడా చోటు చేసుకుం

టోంది. వారు ఖుర్‌ఆన్‌లోని కొన్ని దైవాదేశాల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని నిషిద్ధాంశాలను అవలంబిస్తున్నారు. కొన్ని సున్నత్‌లను అనుసరించి, మరికొన్నింటిని ఉపేక్షిస్తున్నారు.

573–1. మహనీయ సల్మాన్ ఫార్సీ(రజి) పారసీక దేశస్తులు. ఈయన పూర్వీకులు అగ్ని పూజారులు. ఈయన సత్యాన్వేషణలో బయలుదేరి క్రైస్తవ మతం పుచ్చుకున్నారు. కాని సంతృప్తి కలగలేదు. సత్యాన్వేషణలో సుదీర్ఘ ప్రయాణం చేశారు. అరబ్బు జాతి వారు ఆయన్ని మోసగించి యూదులకు అమ్మివేశారు. మదీనాలో తొలి సారి దైవప్రవక్త ముహమ్మద్(స)ను చూడగానే ఇస్లామ్ స్వీకరించారు.

సల్మాన్ ఫార్సీ(రజి) తన యూదు యజమానితో **'ముకాతబత్'** ఒప్పందం చేసు కున్నారు. దైవప్రవక్త ఆ యూదు యజమానికి డబ్బు చెల్లించి సల్మాన్ ఫార్సీకి బానిసత్వం నుండి స్వేచ్ఛను ప్రసాదించారు. దైవప్రవక్త(స) ఈయన్ని అమితంగా ప్రేమించేవారు. "సల్మాన్ మా ఇంటి సభ్యుడు. స్వర్గం అతని అడుగుల సవ్వడి కోసం నిరీక్షిస్తూ ఉంది" అని అనేవారు. స్వహస్తాలతో జీవనోపాధిని ఆర్జించే వారు. హిజ్రీ 35లో మదాయన్ పట్టణంలో తనువు చాలించారు.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# كِتَابُ الْمَغَازِي

# 4. యుద్ధాల ప్రకరణం★

## (కితాబుల్ మగాజీ)

### అధ్యాయం : 1

### ఉషైరా లేదా ఉసైరా యుద్ధం గురించి

ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) పాల్గొన్న మొట్టమొదటి యుద్ధం 'అబ్వా' యుద్ధం. తరువాత జబ్లె బువాత్, ఆ తరువాత ఉషైరా యుద్ధాల్లో పాల్గొన్నారు.[1]

**574) అబూ ఇస్‌హాఖ్ తెలిపారు : నేనొకసారి జైద్ బిన్ అర్ఖమ్(రజి) ప్రక్కన కూర్చుని ఉండగా, 'దైవప్రవక్త(స) ఎన్ని యుద్ధాలలో పాల్గొన్నార'ని ఎవరో ప్రశ్నించారు. దానికి ఆయన, 'పందొమ్మిది' అని జవాబిచ్చారు. 'మరైతే మీరు దైవప్రవక్త(స)తో కలసి ఎన్ని యుద్ధాలకు వెళ్ళారు?' అని నేను అడగ్గా, 'పదిహేడు' అని ఆయన చెప్పారు. 'మీరు పాల్గొన్న మొట్టమొదటి యుద్ధం ఏది?' అని అడిగితే 'ఉసైరా లేదా ఉషైరా' అని ఆయన చెప్పారు. ఈ విషయం నేను ఖతాదా ముందు ప్రస్తావిస్తే, 'ఉషైరా అన్నదే సరైన పదం' అని ఆయన వివరించారు.**

---

★ దైవప్రవక్త స్వయంగా పాల్గొన్న యుద్ధాన్ని 'గజ్వా' అంటారు. మరే యుద్ధంలో దైవప్రవక్త(స) స్వయంగా పాల్గొనలేదో దానిని 'సరియ్యా'గా వ్యవహరిస్తారు.

1-1. 'అబ్వా' ఒక ఊరి పేరు. ఇది జుహైఫా నుండి మదీనాకు వెళ్ళే మార్గంలో ఉంది. 'బువాత్' ఒక పర్వతం పేరు. ఇది 'యన్బో'కు సమీపంలో ఉంది. 'ఉషైరా' కూడా ఒక ఊరి పేరు లేదా ఒక తెగ పేరు. ఈ మూడు యుద్ధాలకు కూడా దైవప్రవక్త(స) బద్ర్ సంగ్రామానికి పూర్వం వెళ్ళారు.

## అధ్యాయం : 2

## బద్ర్ సంగ్రామంలోని హతుల గురించి ప్రవక్త మహనీయుని (స) భవిష్యవాణి[1]

**575)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) గారు, హజ్రత్ సాద్ బిన్ ముఆజ్(రజి) ద్వారా ఉటంకించారు– సాద్(రజి) ఇలా అన్నారు : ఈయన (అజ్ఞాన కాలం నుండే) ఉమయ్యా బిన్ ఖలఫ్‌కు స్నేహితుడు. ఉమయ్యా బిన్ ఖలఫ్ ఎప్పుడు మదీనా నగరం మీదుగా (వర్తకం కొరకు) సాగిపోయినా ఈయన దగ్గరే ఆగేవాడు. అదేవిధంగా సాద్(రజి) మక్కా నగరం మీదుగా సాగిపోయినప్పుడు, ఉమయ్యా వద్ద ఆగేవారు.

దైవప్రవక్త(స) మదీనాకు హిజ్రత్ చేసి వచ్చిన తరువాత సాద్(రజి) ఒకసారి ఉమ్రా చేసే ఉద్దేశ్యంతో మక్కా వెళ్ళారు. ఆనవాయితీ ప్రకారం ఉమయ్యా దగ్గరే ఆగారు. ఆ సందర్భంగా ఆయన ఉమయ్యాతో, "జనులు ఉండని సమయం ఏదో చెప్పు. నేను కాబా గృహాన్ని సందర్శించి 'తవాఫ్' (ప్రదక్షిణ) చేసుకుంటాన"ని చెప్పారు. అతను సాద్‌ను మిట్ట మధ్యాహ్నం వేళ వెంటబెట్టుకుని వెళ్ళాడు. దారిలో అబూ జహల్ తారసపడి, "అబూ సఫ్వాన్! నీ వెంట ఉన్న ఇతగాడు ఎవడు?" అని అడిగాడు. "ఇతను సాద్ బిన్ ముఆజ్"– చెప్పాడు ఉమయ్యా. దానికి అబూజహల్, "నీవు మక్కాలో నిక్షేపంగా తవాఫ్ చేసుకోవడాన్ని నేను సహించలేను. ఎందుకంటే మీరు ధర్మవిహీనులకు రక్షణ కల్పించారు. దైవసాక్షి! నువ్వు ఈ క్షణంలో అబూ సఫ్వాన్(ఉమయ్యా) వెంట ఉండబట్టి సరిపోయింది. లేకుంటే, నీవు నీ ఇంటికి క్షేమంగా చేరుకునేవాడివి కావు" అన్నాడు. సమాధానంగా సాద్ (రజి) ఇలా అన్నారు– ఆ క్షణంలో ఆయన హెచ్చు స్వరంతో మాట్లాడారు– "దైవ సాక్షిగా చెబుతున్నాను. ఈ రోజు నీవు గనక నన్ను తవాఫ్ చేయకుండా అడ్డుకున్నావంటే, నేను కూడా మదీనా మీదుగా నిన్ను ముందుకు పోనివ్వను, అది నీ పాలిట చాలా గడ్డు

2–1. ఈ అధ్యాయం క్రింద ఇమామ్ ముస్లిమ్ పొందుపరచిన ఉల్లేఖనం మరింత స్పష్టంగా ఉంది. దాని ప్రకారం బద్ర్ యుద్ధం మొదలవక ముందే దైవప్రవక్త(స) తన సహచరుడైన ఉమర్(రజి)తో, ఏ అవిశ్వాసి ఏ స్థలంలో వధించబడతాడో చెప్పేశారు. ఉమర్ (రజి) ఇలా అన్నారు : "దైవప్రవక్త(స) ఏ ఏ స్థలంలో ఏ ఏ సత్య తిరస్కారి వధించబడతాడని సూచించారో ఆయా స్థలాలలోనే వారు హతులయ్యారు"– ఇది దైవప్రవక్త(స) అద్భుతాలలో ఒకటి.

సమయంగా ఉంటుంది, జాగ్రత్త!” ఉమయ్యా మధ్యలో కల్పించుకుని, “సాద్! అబుల్ హకమ్ (అబూ జహల్) ముందు బిగ్గరగా మాట్లాడకు. ఇతను ఈ మక్కా లోయకు నాయకుడు” అన్నాడు. కాని సాద్ (రజి) ఏమాత్రం జంకకుండా, “ఉమయ్యా! చాలించు నీ అధిక ప్రసంగం. అబూ జహల్‌ను వెనకేసుకుని రాకు. నీవు వారిచేత (దైవప్రవక్త, ఆయన సహచరుల చేత) వధించబడతావని దైవప్రవక్త (స) చెప్పగా నేను విని ఉన్నాను” అన్నారు. దానికి ఉమయ్యా, “ఏమిటి, మక్కాలో నన్ను హతమారుస్తారటనా?” అని అడిగాడు. “ఎక్కడ హతమారుస్తారనేది నాకు తెలీదు (కాని నిన్ను హతమారుస్తారని మాత్రం చెప్పారు) అన్నారు సాద్. ఈ మాట విని ఉమయ్యా భయాందోళనకు గురయ్యాడు. ఇంటికి రాగానే (తన భార్యతో) “చూశావా ఉమ్మె సఫ్వాన్! సాద్ నా గురించి ఏమంటున్నాడో?” అన్నాడు. “ఏమం టున్నాడేమిటి?” అడిగింది భార్య. “ఏదో ఒక రోజు ముహమ్మద్(స) నన్ను చంపే స్తారట! ఈ విషయం సాద్(రజి)కు చెప్పారట! మక్కాలో నన్ను చంపుతారటనా? అని నేనడిగాను. ఆ సంగతి తనకు తెలీదని సాద్ అంటున్నాడు. దైవసాక్షి! ఇక నుంచి నేను మక్కా విడిచి ఎక్కడికీ వెళ్ళను” అన్నాడు ఉమయ్యా.

తరువాత బద్ర్ యుద్ధ సందర్భంగా ఖురైషులలో సమరోత్సాహం కలిగించేందుకు బయలుదేరమని ఉమయ్యా బిన్ ఖలఫ్‌ను కోరాడు అబూ జహల్. కాని ఉమయ్యా మాత్రం యుద్ధంలో పాల్గొనడానికి సుముఖత చూపలేదు. అయితే అబూ జహల్ అతని దగ్గరకు వచ్చి, “చూడు అబూ సఫ్వాన్! నీవు ఈ లోయకు సర్దారువి. ఒకవేళ నువ్వే రాకపోతే సామాన్య ప్రజలు కూడా యుద్ధానికి రాక పోవచ్చు” అన్నాడు. ఆ విధంగా అబూ జహల్ పలుమార్లు చెప్పి అతి కష్టమ్మీద ఉమయ్యాను ఒప్పించగలిగాడు. గత్యంతరం లేని పరిస్థితిలో ఉమయ్యా “మక్కాలోనే అరుదైన, వేగవంతమైన ఒంటెను కొంటాను” అన్నాడు. తరువాత ఉమయ్యా తన భార్యతో, “ఉమ్మె సఫ్వాన్! నా సామాను సర్దు” అని పురమాయించాడు. దానికి ఆమె, “అయ్యో! అబూ సఫ్వాన్! నీ యస్రిబ్ స్నేహితుడు చెప్పిన మాటను మరచిపోయావా?” అంది. “మరువలేదు. వీళ్ళ వెంట కొంత దూరం మాత్రమే వెళ్ళి, తిరిగి వస్తాను” అని భార్యకు ధైర్యం చెప్పాడు ఉమయ్యా. ఆ విధంగా ఉమయ్యా అన్యమనస్కంగా బయలుదేరాడు. దారిలో ఎక్కడ విడిది చేసినా వేగంగా

**పరుగెత్తే తన ఒంటెను తన దగ్గర్లోనే కట్టి ఉంచేవాడు. ఆ విధంగా చివరి క్షణం వరకు అతను జాగ్రత్తలు తీసుకున్నాడు. కడకు అల్లాహ్ అతని కథను సమాప్తం చేయించాడు.[1]**

## అధ్యాయం : 3

## బద్ర్ యుద్ధం[1]

**576) మహనీయ కాబ్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ కాబ్ తెలిపారు : కాబ్ బిన్ మాలిక్(రజి) ఇలా అన్నారు. ప్రవక్త మహనీయులు(సఅసమ్) పాల్గొన్న యుద్ధాలన్నింటిలో నేను పాల్గొన్నాను– ఒక్క తబూక్ యుద్ధం తప్ప. కాకపోతే నేను బద్ర్ సంగ్రామానికి వెళ్ళలేదు. అయితే ఈ యుద్ధంలో పాల్గొనలేకపోయిన వారిలో ఏ ఒక్కరినీ అల్లాహ్ అధిక్షేపించలేదు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు(స) ఖురైషు వర్తక బిడారు ఆచూకీ తెలుసుకోవడానికి వెళ్ళారు. (యుద్ధం చేసే ఉద్దేశంతో బయలుదేరలేదు). అయితే అనూహ్యంగా అల్లాహ్ ముస్లింలకు, శత్రువులతో మార్కొనే పరిస్థితిని ఏర్పరచాడు.**

---

575–1. ఉమయ్యా బద్ర్ యుద్ధ రంగానికి వెళ్ళడానికి ఏమాత్రం సుముఖంగా లేడు. కాని అబూ జహల్ అతన్ని లాలించి, బుజ్జగించి ఒప్పించాడు. ఆ విధంగా ఉమయ్యా వధకు– ఒక విధంగా– అబూ జహల్ కూడా కారకుడయ్యాడు.

ముహమ్మద్(స) చెప్పిన మాట అక్షర సత్యం అవుతుందన్న సంగతి ఉమయ్యాకు తెలుసు. క్లిష్ట సమయంలో పలాయనం చిత్తగించేందుకు వేగంగా పరిగెత్తే ఒంటెను కూడా కొనుగోలు చేశాడు. కాని అతని ముందు జాగ్రత్తచర్యలు ఏవీ పనికిరాలేదు. బద్ర్ యుద్ధ మైదానంలోనే హజ్రత్ బిలాల్(రజి) చేత వధించబడ్డాడు. ఒకప్పుడు ఉమయ్యా మక్కాలో హజ్రత్ బిలాల్ (రజి)ను నానా విధాలుగా హింసించాడు.

3–1. మదీనాకు కొన్ని మైళ్ళ దూరంలో బద్ర్ మైదానం ఉంది. పూర్వం బద్ర్ బిన్ ముఖల్లద్ పేరుతో ఈ గ్రామం వసింపజేయబడినది. లేదా బద్ర్ అనేది ఒక బావి పేరు. హిజ్రీ రెండవ సంవత్సరం రమజాన్ నెల 17వ తేదీ శుక్రవారం నాడు ఖురైషులకు– ముస్లింలకు మధ్యన జరిగిన ఈ యుద్ధం చరిత్రాత్మకమైనది. యుద్ధంలో ముస్లింలు ఘన విజయం సాధించారు. 70 మంది ఖురైషులు వధించబడ్డారు. మరో 70 మంది యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. ఈ యుద్ధంతో మక్కా తిరస్కారుల నడుం విరిగినట్టయింది.

## అధ్యాయం : 4

అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : ఇంకా మీరు మీ ప్రభువును సహాయం కొరకు ప్రార్థించిన సందర్భాన్ని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి. సమాధానంగా అప్పుడు ఆయన ఇలా సెలవిచ్చాడు : "నేను మీ సహాయం కొరకు వెయ్యి మంది దైవదూతలను ఒకరి తరువాత ఒకరిని ఎడతెగకుండా పంపుతున్నాను." మీకు శుభవార్తగానూ మీ మనస్సులు దీనివల్ల నిశ్చింతగా ఉండే నిమిత్తమూ అల్లాహ్ ఈ విషయాన్ని మీకు తెలిపాడు. సహాయమనేది ఎప్పుడు లభించినా అల్లాహ్ తరఫు నుండే లభిస్తుంది. నిశ్చయంగా అల్లాహ్ అత్యంత శక్తిమంతుడు. అత్యంత వివేకవంతుడూను. ఇంకా ఆ సమయాన్ని; అప్పుడు అల్లాహ్ తన తరఫు నుండి నిద్రమత్తు రూపంలో నిశ్చింతనూ, నిర్భయ స్థితినీ మీపై ఆవహింపచేస్తూ ఉన్నాడు. ఆయన ఆకాశం నుండి మీపై నీళ్ళను వర్షింపచేస్తూ ఉన్నాడు, మిమ్మల్ని పరిశుద్ధపరచాలని, మీకు షైతాను వల్ల కలిగిన మాలిన్యాన్ని మీనుండి దూరం చెయ్యాలని, మీకు ధైర్యం కలిగించాలని, తద్వారా మీ పాదాలను సుస్థిరం చెయ్యాలని. ఇంకా ఆ సమయం, అప్పుడు మీ ప్రభువు దైవదూతలకు ఇలా సంజ్ఞ చేశాడు: "నేను మీకు తోడుగా ఉన్నాను. మీరు విశ్వాసులకు ధైర్య స్థయిర్యాలను కలిగించండి. నేను ఇప్పుడే ఈ అవిశ్వాసుల హృదయాలలో భయాన్ని సృష్టిస్తాను. కనుక మీరు వారి మెడలపై కొట్టండి. వారి కీలుకీలుపై కొట్టండి." ఎందుకంటే వారు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను ఎదిరించారు. అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ ఎదిరించే వారి పట్ల అల్లాహ్ అత్యంత కఠినంగా వ్యవహరిస్తాడు. *(అల్ అన్‌ఫాల్ : 9-13)*

**577)** హజ్రత్ ఇబ్నె మస్‌ఊద్(రజి) ఇలా అన్నారు : నేను మిఖ్దాద్ బిన్ అస్వద్(రజి) ద్వారా ఒక మాట విన్నాను. ఆ మాటే గనక నా నోట వెలువడి ఉంటే, అది నా కొరకు అన్ని విషయాలకంటే కూడా అత్యంత ప్రీతికరమైనదై ఉండేది. ఇంతకీ జరిగిందేమిటంటే, ప్రవక్త మహనీయులు(సఅసమ్) అవిశ్వాసులను అధిక్షేపిస్తూ, దుఆ చేస్తున్న సమయంలో మిఖ్దాద్ అక్కడకు విచ్చేశారు. ఆయన (మిఖ్దాద్) ఇలా అన్నారు: "దైవప్రవక్తా! మేము మూసా(అ) జాతి జనుల మాదిరిగా, 'నీవూ, నీ ప్రభువు పోయి యుద్ధం చేయండి' అని అనేవారము కాము. పైగా మేము మీకు కుడివైపున, ఎడమ వైపున, ముందు వెనుకా ఉండి యుద్ధం చేస్తాము" అని

**అన్నారు. ఇబ్నె మస్ఊద్ ఇలా అన్నారు: మిఖ్దాద్ ఈ మాట అనగానే దైవప్రవక్త(స) ముఖారవిందం సంతోషంతో ప్రకాశమానమైంది.[1]**

**578) ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) బద్ర్ యుద్ధ సందర్భంగా ఇలా అన్నారు : "అల్లాహ్! నేను నీ వాగ్దానాన్ని గుర్తు చేస్తూ వేడుకుంటున్నాను. (ఒకవేళ సత్య తిరస్కారులు ప్రాబల్యం వహించాలన్నదే) నీ అభిలాష అయివుంటే ఈ ధరిత్రిపై నీ ఆరాధన జరగదు"– ఇది వినగానే అబూబక్ర్ (రజి) దైవప్రవక్త(స) చేయి పట్టుకుని, 'దైవప్రవక్తా! ఇక చాలు' అన్నారు. ఆ తరువాత ప్రవక్త మహనీయులు(స) తన గుడారంలో నుంచి బయటికి వచ్చారు. ఆ క్షణంలో ఆయన నోట ఈ ఆయత్ వెలువడింది: "త్వరలోనే ఈ శత్రు వర్గం పరాజయం పాలవుతుంది."[1] (54: 45)**

---

577–1. బద్ర్ యుద్ధ నేపథ్యంలో జరిగిన సంఘటన ఇది. ఖురైషుల వర్తక బిడారు సమాచారం విని దైవప్రవక్త(స) మదీనా నుండి బయలుదేరారు. కాని వర్తక బిడారు మరో దారిగుండా– మక్కా వైపు సాగిపోయింది. సాయుధులైన ఖురైషుల సైన్యం ఎదురుపడింది. క్లిష్టమైన ఆ తరుణంలో దైవప్రవక్త(స) యుద్ధం గురించి తమ అభిప్రాయం ఏమిటో చెప్పమని సహచరమాన్యులను అడిగారు. అప్పుడు ముహాజిర్లు, అన్సార్లు యుద్ధానికి తమ సంసిద్ధతను వెలిబుచ్చారు. అన్సార్లయితే మరింత తెగువను చూపుతూ, తమను 'బర్కుల్ గమాదీ' అనే సుదూర ప్రాంతానికి తీసుకుపోయి యుద్ధం చేయమన్నా వెనుకాడబోమనీ, తమ ధన ప్రాణాలతో పోరాడతామని హామీ ఇచ్చారు. దాంతో దైవప్రవక్త(స) అమితంగా సంతోషించారు.

578–1. అల్లాహ్ తాను చేసిన వాగ్దానాన్ని అక్షరాలా నెరవేర్చాడు. బద్ర్ సంగ్రామం జరిగిన రోజున అల్లాహ్ మొదటి విడతగా వెయ్యిమంది దైవదూతలను పంపాడు. ఆ తరువాత ఈ సంఖ్యను మూడు వేలకు, అయిదు వేలకు పెంచి సహాయం చేశాడు.

దైవప్రవక్త(స) ఖురైషుల సైన్యాన్ని చూసినప్పుడు ఇలా వేడుకున్నారు : "దేవా! ఈ ఖురైషులు గర్వాతిశయంతో నీ ప్రవక్తతో పోరాడటానికి, అతన్ని అబద్ధీకరించడానికి వచ్చారు. దేవా! నీ సహాయాన్ని అందించి, మాకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చు."

## అధ్యాయం : 5

**579)** ఇబ్నె అబ్బాస్(రజి) ఈ విధంగా అనేవారని అబ్దుల్లాహ్ బిన్ హారిస్ బానిసయగు మిఖ్‌సిమ్ తెలిపారు : (అన్ నిసా సూరాలోని ఈ ఆయత్ ఆధారంగా) ఆయన ఇలా అనేవారు- "జిహాద్‌లో పాల్గొనేవారు పాల్గొననివారు సమానులు కాలేరు"- అంటే బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారు, పాల్గొననివారు అని అర్థం.

## అధ్యాయం : 6

## బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నవారి సంఖ్య

**580)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు: "బద్ర్ యుద్ధ సందర్భంగా నన్నూ, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ను పిన్న వయస్కులుగా ఖరారు చేయటం జరిగింది."[1]

**581)** బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు : బద్ర్ యుద్ధ సందర్భంగా నన్నూ, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ను పిన్న వయస్కులుగా ఖరారు చేయటం జరిగింది. ఈ యుద్ధంలో ముహాజిర్ల సంఖ్య అరవైకి పైచిలుకు ఉంటే అన్సార్ల సంఖ్య రెండు వందల నలభై కన్నా అధికంగా ఉంది. మొత్తం ముస్లింల సంఖ్య 310 - 319కి మధ్యన ఉంది.

**582)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ తెలిపారు: బరా ఇలా చెప్పారు - ప్రవక్త మహనీయులు(సఅసమ్)తో కలసి బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న సహచర మాన్యులు నాతో ఏమన్నారంటే; ఆ సంగ్రామంలో వారి సంఖ్య తాలూత్ (అలైహిస్సలామ్) సహచరుల సంఖ్యకు సమానంగా ఉంది. వారు ఆయనతో కలసి పాలస్తీనా కాలువను దాటారు. అంటే సుమారు 310

---

580-1. యుద్ధ రంగానికి వెళ్ళే ముందు ముస్లిం యోధులు దైవప్రవక్త(స) సమక్షంలో హాజరు పరచబడేవారు. ఆయన(స) వారి వయసును, ఆరోగ్యాన్ని పరిశీలించి, తగినవారికి మాత్రమే యుద్ధం చేయడానికి అనుమతించేవారు. పిన్న వయస్కులకు ఆనతి ఇచ్చేవారు కారు. బద్ర్ యుద్ధ సమయంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి)కు పదమూడేళ్ళు. అందువల్ల ఆయనకు అనుమతి లభించలేదు. ఉహుద్ యుద్ధ సమయంలో ఆయనకు పధ్నాలుగేండ్లు. అప్పుడు కూడా అనుమతి లభించలేదు.

**మంది. అయితే బరా (రజి) ఇలా అన్నారు : "లేదు. దైవసాక్షిగా! తాలూత్ వెంట విశ్వాసులైన సహచరులు మాత్రమే కాలువ దాటగలిగారు."[1]**

**583) బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్హాఖ్ తెలిపారు- ముహమ్మద్(స) సహచరులమైన మేము బద్ర్‌లో పాల్గొన్న సహాబా సంఖ్యను గురించి పరస్పరం చర్చించుకుంటూ, ఈ సంఖ్య తాలూత్‌తో కలసి పాలస్తీనా కాలువను దాటిన సహచరుల సంఖ్య అంతే ఉండేదని చెప్పుకునే వారం. ఆ కాలువను దాటిపోయిన వారంతా విశ్వాసులే. వారు మొత్తం 310 కన్నా ఎక్కువే ఉన్నారు.**

**584) (వేరొక సనదు ప్రకారం) బరా బిన్ ఆజిబ్(రజి) అబూ ఇస్హాఖ్‌తో ఇలా అన్నారు : బద్ర్ యుద్ధంలో పాల్గొన్న ప్రవక్త ప్రియసహచరుల సంఖ్య గురించి మేము పరస్పరం తర్జన భర్జన చేసుకునేవారం. ఈ సహాబా సంఖ్య 310కి పైచిలుకు ఉండేది. ఈ సంఖ్య పూర్వం తాలూత్‌తో కలసి పాలస్తీనా కాలువను దాటగలిగిన సహచరుల సంఖ్యకు సమానం. కేవలం విశ్వాసులు మాత్రమే ఆ కాలువను దాట గలిగారు.**

## అధ్యాయం : 7

## ఖురైషు అవిశ్వాసులు, షైబా, ఉతబా, వలీద్, అబూ జహల్‌లను అధిక్షేపిస్తూ ప్రవక్త మహనీయులు(స) ప్రార్థించటం- వారి పరిణామం గురించి...[1]

**585) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాబా గృహం వైపునకు అభిముఖమై ఖురైషు వర్గానికి చెందిన షైబా**

---

582-1. మిగిలిన వారంతా ఓపిక పట్టలేక కాలువ నీరు పీకలదాకా త్రాగేసి చతికిల పడ్డారు. తాలూత్ బనీ ఇస్రాయీల్‌కు చెందిన రాజు. అతని వృత్తాంతం సుప్రసిద్ధం. దివ్య ఖుర్ఆన్‌లోని అల్ బఖరా సూరా (247-251)లో దీని ప్రస్తావన వచ్చింది.

7-1. మక్కాలో దైవప్రవక్త(స)ను వేధించడానికి దొరికిన ఏ అవకాశాన్నీ జారవిడువని దౌర్భాగ్యులు వారు. ఒకసారి దైవప్రవక్త(స) కాబా ప్రాంగణంలో నమాజ్ చేసు కుంటూ ఉండగా ఒంటె కసువును తెచ్చి ఆయన నడుంపై వేశారు. దైవప్రవక్త ఆక్రందనను దేవుడు ఆలకించాడు. బద్ర్ యుద్ధంలో వారంతా అంతమొందించ బడ్డారు.

**బిన్ రబీయ, ఉతబా బిన్ రబీయ, వలీద్ బిన్ ఉతబా, అబూ జహ్ల్ బిన్ హిషామ్ కొరకు ఆక్రందనతో కూడిన దుఆ చేశారు. నేను దైవసాక్షిగా చెబుతున్నాను, ఆ శాపగ్రస్తులందరి శవాలు బద్ర్ యుద్ధ మైదానంలో పడి ఉండటం నేను కళ్ళారా చూశాను. సూర్యుడు ఆ శవాలను కంపు కొట్టేలా చేశాడు. ఆ రోజు ఎండ చాలా తీవ్రంగా ఉంది."[1]**

## అధ్యాయం : 8

## అబూ జహ్ల్ వధ

**586) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం: బద్ర్ యుద్ధం జరిగిన దినాన ఆయన అబూ జహ్ల్ సమీపం నుండి సాగిపోయారు. ఆ సమయంలో అతడు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. అతడు ఆయనగారితో, "నీవు చంపినవారిలో నాకన్నా గొప్పవాడు ఎవడయినా ఉన్నాడా?" అని అన్నాడు.**

**587) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్(సఅసమ్); "అబూ జహ్లాకు పట్టిన గతేమిటో తెలుసుకునే వారెవరు?" అని అడిగినప్పుడు, ఇబ్నె మస్ఊద్ (రజి) నిజ స్థితిని తెలుసుకునేందుకు వెళ్ళారు. అఫ్రా కొడుకులు ఇద్దరూ (ముఆజ్, మవూజ్) అతనిని వధించి ఉండటం గమనించారు. అప్పటికే అతని శరీరం చల్లబడిపోయింది. 'అబూ జహ్లావి నువ్వేనా?'[1] అని ఆయన అడిగారు. అనస్(రజి) ఇలా అన్నారు: ఇబ్నె మస్ఊద్(రజి) అతని గడ్డం పట్టుకున్నారు. 'ఈ రోజు నీవు వధించిన వారిలో ఇతని (నా)కన్నా గొప్పవాడె**

---

585-1. దైవప్రవక్త(స) సజ్దా స్థితిలో ఉన్నప్పుడు, ఆయన వీపుపై ఒంటె ప్రేగులు తెచ్చి పడవేసిన దుర్మార్గులకు జరిగిన శాస్తి ఇది. దైవప్రవక్త(స) వీపుపై బరువుతో లేవలేని స్థితిలో ఉంటే ఆ దుర్మార్గులు వికటాట్టహాసం చేస్తూ వేడుక చూశారు.

587-1. ఇబ్నె మస్ఊద్(రజి) మక్కాలో ఉన్నప్పుడు అబూ జహ్ల్ చేత తీవ్రంగా హింసించబడ్డారు. బద్ర్ యుద్ధ మైదానంలో ఆ దౌర్జన్యపరుడు ఇద్దరు టీనేజీ కుర్రాళ్ళ చేతిలో చావు దెబ్బ తిని పడి ఉండటాన్ని ఇబ్నె మస్ఊద్ (రజి) కళ్ళారా చూశారు. అతని గడ్డం పట్టుకుని 'నువ్వేనా అబూ జహ్లావి?' అని ప్రశ్నించారు. నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కుప్పకూలినట్లుగా బద్ర్ యుద్ధంలో అబూ జహ్ల్ కథ సమాప్తం అయింది.

**వడయినా ఉన్నాడా?' అని అబూ జహ్లొ అడిగాడు లేదా అతనిలా అన్నాడు : 'తన జాతివారు వధించిన వారిలో ఇతనికన్నా గొప్పవాడెవడయినా ఉన్నాడా?'**

**588) హజ్రత్ అనస్(రజి) కథనం: బద్ర్ యుద్ధ దినాన ప్రవక్త మహనీయులు (సఅసమ్) తన సహచరులనుద్దేశించి, "అబూజహ్లొ సంగతి తెలుసుకుని వచ్చేవారు మీలో ఎవరు?" అని అడిగినప్పుడు, ఇబ్నె మస్ఊద్(రజి) అతని సంగతి తెలుసుకుని రావడానికి వెళ్ళారు. అఫ్రా కుమారులిద్దరూ అతన్ని వధించి ఉండటాన్ని ఆయన గమనించారు. అబూ జహ్లొ శరీరం చల్లబడుతోంది. ఆయన అతని గడ్డాన్ని పట్టుకుని, 'అబూ జహ్లొవి నువ్వేనా?' అని అడిగారు. దానికి అతను, 'తన జాతి వారిచేత వధించబడిన వారిలో ఇతనికన్నా గొప్పవాడెవడయినా ఉన్నాడా?'[1] అని చెప్పాడు. లేదా 'మీరంతా కలసి అతన్ని చంపేశారా?' అన్నాడు.**

**589) అలీ బిన్ అబీ తాలిబ్(రజి) తెలిపారు : ప్రళయదినాన అల్లాహ్ దర్బారులో వివాదాన్ని పరిష్కరించడానికి రెండు బాహువుల్ని ఆనించి కూర్చునే మొట్టమొదటి వ్యక్తిని నేనే[1]. ఈ మహానుభావుల (హమ్జా, అలీ, ఉబైదా– రజిఅల్లాహు అన్హుమ్‌ల) గురించి అల్ హజ్జ్ సూరాలోని ఈ ఆయత్ అవతరించిందని ఖైస్ బిన్ ఉబాద్ తెలియజేశారు. "ఆ ఇరువర్గాల వారు తమ ప్రభువు విషయంలో ఘర్షణ**

---

588–1. చింత చచ్చినా పులుపు చావదన్నట్లు, అవమానకరమయిన చావును చవిచూసే సమయంలో కూడా అబూ జహ్లొలోని గర్వాహంకారం చావలేదు. వేరొక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఇబ్నె మస్ఊద్(రజి), అబూ జహ్లొ మరణవార్త తెలియజేసినప్పుడు దైవప్రవక్త(స) దైవానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. "ఈ ఉమ్మత్‌లోని ఫిరౌన్ వధించబడ్డాడ"ని అన్నారు.

589–1. అసలేం జరిగిందంటే, యుద్ధం మొదలవడానికి ముందు సత్య తిరస్కారుల పక్షాన ముగ్గురు వ్యక్తులు యుద్ధ రంగంలో ముందుకు వచ్చి 'ఓ ముహమ్మద్(స)! మాతో యుద్ధం చేయడానికి జనులను పంపించు' అని సవాలు విసిరారు. వారి కోరికపై ముగ్గురు అన్సారులు వెళ్ళారు. కాని వారు అన్సారులతో తలపడటానికి నిరాకరించారు. మేము మాకు సమ ఉజ్జీలైన ఖురైషులతో మాత్రమే పోరాడతామని అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స),"హమ్జా అలీ, ఉబైదా! లేవండి" అని పురమాయించారు. హమ్జా షైబాకు ఎదురుగా, అలీ వలీద్‌కు ఎదురుగా నిలబడ్డారు. హమ్జా షైబాను వధించగా, అలీ వలీద్‌ను కడతేర్చారు. మరోవైపు ఉబైదా– ఉతబాలిద్దరూ పరస్పరం కత్తులు దూసుకుంటున్నారు. హజ్రత్ అలీ వెళ్ళి ఉతబాను వధించి, ఉబైదాను తీసుకుని వచ్చారు.

పడ్డారు (22: 19). అంటే బద్ర్ యుద్ధం జరిగిన రోజున ఆ ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు ముఖాముఖీ అయ్యారు. ముస్లింల తరఫున హమ్జా, అలీ, అబూ ఉబైదా బిన్ హారిస్(ర.అన్‌హుమ్) ముందుకు వస్తే, అవిశ్వాసుల పక్షాన షైబా బిన్ రబీయ, ఉతబా, వలీద్ బిన్ ఉతబా ముందుకు వచ్చారు.

**590)** హజ్రత్ అబూజర్(రజి) కథనం : అల్ హజ్జ్ సూరాలోని "ఆ ఇరు వర్గాల వారు ప్రభువు విషయంలో పోరాడారు" (22: 19) అనే ఆయత్ ఆరుగురు వ్యక్తుల గురించి అవతరించింది. వారిలో ముగ్గురు (ముస్లింల పక్షాన) అలీ, హమ్జా, ఉబైదా బిన్ హారిస్. మరో ముగ్గురు (సత్య తిరస్కారుల తరఫున) షైబా బిన్ రబీయ, ఉతబా బిన్ రబీయ, వలీద్ బిన్ ఉతబా.

**591)** మహనీయ అలీ (రజి) చెప్పారని ఖైస్ బిన్ ఉబాద్ ఉటంకించారు: "ఆ రెండు వర్గాల మధ్యన తమ ప్రభువును గురించి వివాదం తలెత్తింది" (22: 19) అనే దైవవాక్యం మా గురించే అవతరించింది.

**592)** అబూజర్(రజి) చెప్పగా తాను విన్నానని ఖైస్ బిన్ ఉబాద్ తెలిపారు. అబూజర్ ప్రమాణం చేసి ఇలా చెప్పేవారు. ఈ ఆయత్ (22: 19) ఆరుగురు వ్యక్తుల గురించి అవతరించింది. వారు బద్ర్ యుద్ధదినాన పరస్పరం తలపడ్డారు– ఇంతకుముందు వచ్చిన హదీసు మాదిరిగానే ఉల్లేఖకుడు ఈ హదీసును కూడా వివరించారు.

**593)** హజ్రత్ అబూజర్(రజి) చెప్పగా నేను విన్నానని ఖైస్ బిన్ ఉబాద్ ఒట్టేసి మరీ తెలిపేవారు: "ఈ ఆయత్ (22: 19) బద్ర్ యుద్ధం జరిగిన రోజున– మొదట పరస్పరం మార్కొనడానికి బయలుదేరిన వారి గురించి అవతరించింది. అలీ, హమ్జా, ఉబైదా బిన్ హారిస్(రజి.అల్లాహు అన్‌హుమ్)లు ముస్లింల తరఫున బయలుదేరగా, ఉతబా, షైబా, వలీద్ బిన్ ఉతబాలు అవిశ్వాసుల తరఫున వచ్చారు.

**594)** అబూ ఇస్‌హాఖ్ కథనం: ఒక వ్యక్తి బరాబిన్ ఆజిబ్(రజి)తో "అలీ (రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారా?" అని అడిగాడు. దానికి ఆయన, "అవును. ఆయన గారైతే యుద్ధంలో కీలకపాత్ర పోషించారు. రెండు యుద్ధ కవచాలు తొడిగి ఉన్నారు" అని చెప్పారు.

**595)** హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) కథనం : (హిజ్రత్ అనంతరం) ఉమయ్యా బిన్ ఖలఫ్‌కి – నాకూ మధ్య ఒక ఒడంబడిక జరిగింది.[1] తరువాత బద్ర్ యుద్ధ దినాన అతను వచ్చి తానూ, తన కుమారుడు వధించబడతామని

**భయాందోళనను వ్యక్తపరిచాడు. అంతలో బిలాల్ అతన్ని గమనించి, "ఈ రోజు ఉమయ్యా గనక తప్పించుకుని పోయినట్లయితే, నేను పరలోకంలో శిక్ష నుండి సురక్షితంగా ఉండలేన"ని అన్నారు.[2]**

**596) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒకసారి (మక్కాలో) అన్ నజ్మ్ సూరా పారాయణం చేస్తూ, 'సజ్దా తిలావత్' చేసినప్పుడు, అక్కడ ఉన్న వారంతా సాష్టాంగపడిపోయారు. కేవలం ఒకే ఒక వృద్ధుడు మాత్రం అరచేతిలో కొంత మట్టి తీసుకుని తన నుదుటికి తగిలించుకుని,[1] 'నాకు ఇది చాలు' అని అన్నాడు. తరువాతి కాలంలో ఆ వృద్ధుడు అవిశ్వాస స్థితిలో వధించబడటం నేను కళ్ళారా చూశానని అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) చెప్పారు.**

**ఉర్వా బిన్ జుబైర్(రజి) ఇలా వివరించారు : జుబైర్(రజి) శరీరంపై మూడు (లోతైన) ఖడ్గపు గాయాల చిహ్నాలు ఉండేవి. ఒకటి ఆయన భుజంపై ఉండేది (అది ఎంత లోతుగా ఉండేదంటే) బాల్యంలో నేను నా చేతివేళ్లను అందులోకి జొన్పేవాణ్ణి. ఉర్వా ఇంకా ఇలా అన్నారు : రెండు గాయాలు ఆయనకు బద్ర్ యుద్ధ సందర్భంగా అయినాయి. ఇంకొకటి యర్మూక్[2] పోరాటం సందర్భంగా అయింది.**

---

595-1. ఇంతకీ ఆ ఒడంబడిక ఏమిటి? అంటే మక్కాలో ఉన్న అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) ఆస్తిపాస్తుల్ని ఉమయ్యా రక్షిస్తే, మదీనాలో ఉన్న ఉమయ్యా ఆస్తుల్ని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) కాపాడుతూ ఉంటారు.

595-2. బిలాల్ (రజి) మొదట్లో (మక్కాలో) ఉమయ్యా బిన్ ఖలఫ్ బానిసగా ఉండేవారు. బిలాల్ ఇస్లామ్ స్వీకరించిన మీదట ఉమయ్యా ఆయనకు పెట్టిన హింసలు అన్నీ ఇన్నీ కావు. ఆఖరికి ఉమయ్యా బద్ర్ యుద్ధరంగంలో బిలాల్(రజి) చేతనే వధించ బడ్డాడు. ఉమయ్యాను రక్షించడానికి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ అతని మీద పడినారు. కాని ముస్లింలు ఆ దైవవిరోధిని పక్కకు ఈడ్చి అతని కథను సమాప్తం చేశారు. ఈ సందర్భంగా అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)కి కూడా గాయాలయ్యాయి.

596-1. ఆ వృద్ధుడు ఎవరో కాదు, ఉమయ్యా బిన్ ఖలఫ్. బద్ర్ యుద్ధంలో హజ్రత్ బిలాల్(రజి) స్వయంగా అతనిని కడతేర్చారు.

596-2. 'యర్మూక్' సిరియా రాజ్యంలోని ఒక ఊరి పేరు. హిజ్రీ 15వ సంవత్సరంలో హజ్రత్ ఉమర్(రజి) పరిపాలనా కాలంలో అక్కడ ముస్లింలకు- క్రైస్తవులకు

**ఉర్వా ఇంకా ఇలా అన్నారు : అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) (హజ్జాజ్ బిన్ యూసుఫ్ చేతుల్లో) అమరగతినొందినప్పుడు అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ నాతో "ఉర్వా! జుబైర్(రజి) ఖడ్గం ఏదో నీవు గుర్తుపట్టగలవా?" అని అడిగాడు. దానికి నేను, "గుర్తుపడతాన"ని అన్నాను. "అయితే ఏదన్నా ఆనవాలు చెప్పు" అని అత నన్నాడు. "బద్ర్ యుద్ధం జరిగిన రోజున ఆ ఖడ్గంలోని ధారలో కొంతభాగం విరిగి పోయింది. అది ఇప్పటివరకూ అలాగే ఉంది" అని నేను చెప్పాను. అబ్దుల్ మలిక్ అది విని, "నీవు నిజం చెప్పావు"అని పలికాడు. ఆ సందర్భంగా అబ్దుల్ మలిక్ (నాబగా కవి చెప్పిన కవిత్వంలోని ఒక చరణాన్ని స్మరించుకుంటూ) "సైన్యాలతో యుద్ధం చేస్తూ వారి కరవాలాలలోని పదును అనేకచోట్ల మొక్కవోయింది" అన్నాడు. తరువాత అబ్దుల్ మలిక్ ఆ ఖడ్గాన్ని ఉర్వాకు తిరిగి ఇచ్చేశాడు. "ఆ ఖడ్గం విలువ సుమారు పదివేల దిర్హములు ఉంటుందని కూడా మా అంచనా. దానిని మా మిత్రు డొకడు (ఉస్మాన్ బిన్ ఉర్వా) వెల చెల్లించి తీసుకున్నాడు. ఆ ఖడ్గం నా వాటాలోకి వస్తే బాగుండేదని నేను అభిలషించాను" అని హిషామ్ తెలిపారు.**

**597) ఉర్వా తెలిపారు : "జుబైర్(రజి) ఖడ్గంపై వెండి ఆభరణం ఉండేది". హిషామ్ ఇలా అన్నారు : (నా తండ్రి) ఉర్వా ఖడ్గంపై వెండి ఆభరణం ఉండేది (బహుశా అది జుబైర్- రజి) ఖడ్గమే అయి ఉండవచ్చు).**

**598) అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ వివరించారు. ఆయనకు హిషామ్ బిన్ ఉర్వా తెలిపారు. ఈయనకు ఈయన తండ్రి ఉర్వా తెలియజేశారు. ఈయన ప్రకారం దైవప్రవక్త(సఅసమ్) ప్రియ సహచరులు యర్మూక్ యుద్ధం జరిగిన రోజున జుబైర్(రజి)తో, "మీరు గనక (శత్రువులపై) దాడి చేస్తే మేము కూడా మీతోపాటే దాడి చేస్తామ"ని అన్నారు. దానికి ఆయన, "నేను గనక వారిపై పూర్తి శక్తితో పరాక్రమం చూపితే, మీరంతా వెనుక పడిపోతార"ని చెప్పారు. "లేదు, మేమలా వెనుకంజ వేసే ప్రసక్తే లేద"ని అందరూ హామీ ఇచ్చారు. అందువల్ల జుబైర్(రజి)**

---

మధ్య యుద్ధం జరిగింది. అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి) ముస్లింల సేనాధి పతిగా ఉన్నారు. ఈ యుద్ధంలో 70వేల మంది క్రైస్తవులు హతులయ్యారు. నలభై వేల మంది యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. నాలుగు వేల మంది ముస్లింలు వీర మరణం పొందారు. మరణించిన వారిలో వంద మంది బద్రీ సహాబా కూడా ఉన్నారు *(ఫత్హుల్ బారీ)*

శత్రువులపై మెరుపు దాడి చేశారు. శత్రువుల పంక్తులను చీల్చుకుంటూ ముందుకు చొచ్చుకుపోయారు. ఆ సమయంలో (ముస్లింలు) ఎవరూ ఆయనకు తోడుగా లేరు. తరువాత ఆయన (ముస్లింల వైపునకు) తిరిగి వస్తుండగా, రోమనులు ఆయన గుర్రపు కళ్ళాన్ని పట్టుకుని, ఆయన భుజంపై వ్రేటు వేశారు. ఈ వ్రేటు బద్ర్ యుద్ధంలో ఆయనకు అయిన రెండు గాయాల మధ్యన పడింది. ఉర్వా బిన్ జుబైర్ ఇలా అన్నారు: "నేను పసివాడుగా ఉన్నప్పుడు ఆ గాయాల (గుర్తుల)లో నా చేతి వ్రేళ్ళు పెట్టి ఆడుకునేవాణ్ణి." ఉర్వా ఇంకా ఇలా అన్నారు : యర్మూక్ యుద్ధ సందర్భంగా అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) కూడా ఆయన వెంట వెళ్ళారు. ఆ సమయంలో ఆయనకు పదేళ్ళు మాత్రమే. అందువల్ల ఆయన్ని ఒక గుర్రంపై కూర్చోబెట్టి, ఒక వ్యక్తి రక్షణలో అప్పగించారు.

**599)** అబూ తల్హా (రజి) తమతో ఇలా అన్నారని అనస్ బిన్ మాలిక్(రజి) తెలియజేశారు: బద్ర్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (స) ఆదేశానుసారం యుద్ధంలో హతులైన 24 మంది ఖురైషు సర్దారుల శవాలు లోతైన ఒక చీకటి బావిలో పడవెయ్య బడ్డాయి. సాధారణంగా ప్రవక్త మహనీయులు(స) శత్రువుపై విజయం సాధించిన మీదట యుద్ధ రంగంలో మూడు దివా రాత్రులు ఆగి ఉండేవారు. బద్ర్ యుద్ధం ముగిసిన మూడవ రోజు ఆయన(స) ఆజ్ఞపై ఒంటెను సిద్ధం చేయటం జరిగింది. ఆయన(స) బయలుదేరగానే సహచరమాన్యులు కూడా ఆయన వెంట బయలు దేరారు. బహుశా ఆయన ఏదో పనిమీద వెళుతున్నారని సహచరులు తలపోశారు. కాని ఆయన(స) ఆ బావి ప్రక్కన వచ్చి నిలబడి, 'యుద్ధంలో హతులైన ఖురైషు సర్దారుల పేర్లను వారి తండ్రుల పేర్లతో సహా, "ఓ ఫలానా కుమారుడగు ఫలానా వ్యక్తీ! ఓ ఫలానా పుత్రుడగు ఫలానా వాడా! చెప్పండి, మీరు ప్రపంచంలో దైవానికి, దైవప్రవక్తకు విధేయత చూపి ఉంటే ఈ రోజు మీకు శుభకరం అయి ఉండేది కాదా!? నిశ్చయంగా మా ప్రభువు మాకు చేసిన వాగ్దానం సర్వవిధాలా నెరవేరింది. మరైతే మీ ప్రభువు మీకు చేసిన (శిక్షా) వాగ్దానం మీ పాలిట పూర్తిగా నెరవేరిందా?" అని అడిగారు. అబూతల్హా (రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త(స) వేసిన ప్రశ్నపై ఉమర్(రజి) స్పందిస్తూ, 'దైవప్రవక్తా! తమరు ప్రాణం లేని ఈ శవాలను ఎందుకు సంబోధిస్తున్నారు?' అని అడగ్గా, "ఏ శక్తిమంతుని చేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా! నేను చెప్పేదంతా వారు మీకన్నా బాగా వింటున్నార"ని దైవప్రవక్త(స)

**చెప్పారు. ఖతాదా ఇలా అన్నారు : అల్లాహ్ వారిని ఆ సమయంలో బ్రతికించాడు. దైవప్రవక్త(స) ఆ సత్య తిరస్కారులకు తన మాటను వినిపించడానికి, వారిని హెచ్చ రించడానికి, అవమానపరచడానికి, ప్రతీకారం తీర్చుకోవడానికి, విచారపడేలా చేయడానికి, సిగ్గుతో కుంచించుకుపోయేలా చేయడానికి ఇలా చేయటం జరిగింది.**[1]

**600) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్- అల్లజీన బద్దలూ నీమతల్లాహి కుఫ్రన్.. (14: 28)ను ప్రస్తావిస్తూ, "దైవసాక్షి! ఈ ఆయత్‌లోని సత్య తిరస్కారులు ఖురైషులు" అని అభిప్రాయపడ్డారు (అరబీ ఆయత్ అర్థం ఇది : అల్లాహ్ అనుగ్రహాన్ని పొంది, దానికి మారుగా 'కృతఘ్నత'ను చూపినవారిని నీవు చూశావా? వారు (తమతోపాటు) తమ జాతిని కూడా నరకంలోకి త్రోసివేశారు). దీనిపై అమ్ర్ బిన్ దీనార్ వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: ఇక్కడ 'జనులు' అంటే ఖురైషులు అని గ్రహించాలి. 'అనుగ్రహం' అంటే ఇస్లామ్ లేదా ముహమ్మద్ ప్రవక్త(స). 'దారల్ బవార్' అంటే నరకం. అంటే బద్ర్ యుద్ధం జరిగిన దినాన ఖురైషులు తమ జాతి జనులను నరకాగ్నికి ఆహుతి చేశారు.**[1]

**601) "మృతుని ఇంటివారలు ఏడ్చిన కారణంగా సమాధిలో మృతునికి శిక్ష విధించబడుతుంద"ని దైవప్రవక్త(సఅసమ్) ప్రవచించినట్లుగా ఇబ్నె ఉమర్(రజి) అంటున్నారని ఎవరో హజ్రత్ ఆయిషా(ర.అ) ముందు ప్రస్తావించగా, ఆమె ఇలా**

---

599-1. ఈ సంఘటన ఆధారంగా మృతులు వింటారని ఎవరయినా భావిస్తే లేదా నిరూపిస్తే వారు పొరబడినట్లే. ఎందుకంటే వినిపించే ఈ సంఘటన దైవప్రవక్త(స)కు ప్రత్యేకం. ఇది ఆయన(స) అద్భుతాలలోని ఒక అద్భుతం అని మరువరాదు.

వేరొక ఆయత్‌లో చాలా స్పష్టంగా ఇలా సెలవీయబడింది : "(ప్రవక్తా!) సమాధులలో ఖననమైన వారికి నీవు వినిపించలేవు" (35:22). మరణించిన వెంటనే ప్రపంచంతో మనిషికి ఉండే సంబంధాలన్నీ తెగిపోతాయి. 'వినటం' కూడా ఇందులోనికే వస్తుంది. సజ్జనులైనవారికి దేవుడు 'ఆలమె బర్జఖ్' (బర్జఖ్ అవస్థ)లో ఏదయినా వినిపిస్తే అది వేరే విషయం. దీనితో మృతుల వినికిడికి ఎలాంటి సంబంధం లేదు.

600-1. ఈ మహదానుగ్రహం విలువను తెలుసుకుని, దానిని ఆస్వాదించినవారు ఇహమునందునూ, పరమునందునూ గౌరవోన్నతులను పొందారు.

**అన్నారు : దైవప్రవక్త(స) (అలా అనలేదు) ఇలా అన్నారు: "మృతుని దుష్కార్యాల, పాపాల కారణంగా అతను యాతనకు గురవుతాడు. వ్యవహారం ఇలా ఉండగా అతని ఇంటివారలు అతని వియోగంపై ఏడుస్తూ ఉంటారు."**

**దైవప్రవక్త(స) బద్ర్ యుద్ధం జరిగిన రోజు, ముష్రిక్కుల శవాలు వేయబడిన బావి వద్ద నిలబడి సంబోధించటం వంటిదే ఇదీను. ఆ సందర్భంగా ఆయన(స) ఇలా అన్నారు: "నేను చెప్పేదంతా వీళ్ళు వింటున్నారు"– ఆయన(స) ఆ విధంగా అనటంలోని ఉద్దేశం ఏమిటంటే, "నేను వారితో చెబుతూ వచ్చినదంతా సత్యం అన్న విషయం వీళ్ళకు అర్థమైపోయింది"– తరువాత ఆయన(స) ఈ దివ్యవచనం పఠించారు : "నిశ్చయంగా నీవు మృతులకు వినిపించలేవు" (అన్ నమ్ల్ : 80). "సమాధులలో ఖననమైన వారికి (ఓ ప్రవక్తా!) నీవు వినిపించలేవు" (35: 22). అమ్మ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: "తమ నివాసాన్ని నరకంలో ఏర్పరచుకున్న వారికి (అంటే ఆ మృతులకు) ఆయన వినిపించలేరు."**

**602) మహనీయ ఇబ్నె ఉమర్(రజి) వివరించారు. ప్రవక్త మహనీయులు (సఅసమ్) బద్ర్ బావి వద్ద నిలబడి, "మీ ప్రభువు మీ కొరకు చేసిన వాగ్దానాన్ని మీరు సత్యమైనదిగా కనుగొన్నారా?" అని అడిగారు. తరువాత ఆయన(స) ఇలా వక్కాణించారు: "నేను ఏదైతే అంటున్నానో దానిని వీళ్ళు ఇప్పుడు కూడా వింటు న్నారు". ఈ హదీసును అమ్మ ఆయిషా(ర.అ) ముందు ప్రస్తావించినప్పుడు ఆమె గారిలా అన్నారు: "నేను వీళ్ళతో ఏదైతే చెప్పానో, అది సత్యం అన్న విషయాన్ని వీళ్ళు ఇప్పుడు తెలుసుకుని ఉంటారు" అన్నది ప్రవక్త మహనీయుల(స) పలుకుల అంతరార్థం. తరువాత ఆమె గారు ఈ ఆయత్‌ను పఠించారు "(ప్రవక్తా!) నీవు మృతులకు వినిపించలేవు, వీపు త్రిప్పి పరుగెత్తే బధిరులకు కూడా నీ పిలుపును వినిపించలేవు."[1] (అన్ నమ్ల్ : 80)**

---

602–1. మృతులకు మాట వినిపించటం సంభవం కాదు అన్న దానికి ఈ ఆయత్ స్పష్ట మైన నిదర్శనం. ఇదే సత్యం కూడా. అయితే బద్ర్ యుద్ధంలో వధించబడిన వారికి మహాప్రవక్త(స) తన మాట వినిపించటం అనేది ఆయన దైవదౌత్య అద్భుతాలలో ఒక అద్భుతం మాత్రమే. దీనిని ఉదాహరణగా చేసుకుని ఇతర మృతులను కూడా వినిపించవచ్చు అని భావించటం సరైనది కాదు. కాకపోతే అల్లాహ్ ఏ మేరకు వినిపించదలుస్తాడో ఆ మేరకు అది సంభవం కావచ్చు.

## అధ్యాయం : 9

## బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి విశిష్టత

**603)** హజ్రత్ అనస్(రజి) కథనం : హారిసా బిన్ సురాఖా అన్సారీ (రజి) నూనూగు మీసాల కుర్రవాడుగా ఉండగానే బద్ర్ యుద్ధ దినాన అమరగతి నొందారు. తరువాత ఆయన తల్లి (రబీ బిన్తె నఫర్, ఈమె అనస్‌కు మేనత్త కూడా) దైవప్రవక్త(స) సన్నిధిలోకి వచ్చి, 'యా రసూలల్లాహ్! హారిసాను నేను ఎంతగా ప్రేమిస్తానో మీకు తెలిసిందే. ఒకవేళ అతనిప్పుడు స్వర్గంలో ఉంటే, నేనతని వియోగంపై ఓర్పు వహిస్తాను. అల్లాహ్ నుండి పుణ్యాన్ని ఆశిస్తాను. కాని ఒకవేళ అతను మరోచోట ఉండే మాటైతే, నేను ఏ స్థితిలో ఉన్నానో మీరు చూస్తూనే ఉన్నార'ని విన్నవించుకుంది. దానికి దైవప్రవక్త(స), "అల్లాహ్ నీపై దయజూపుగాక! నీకేమైనా పిచ్చిపట్టిందా? అక్కడ ఒకే స్వర్గవనం ఉందని అనుకుంటున్నావా? చాలా స్వర్గవనాలున్నాయి. కాగా, నీ కుమారుడు జన్నతుల్ ఫిర్దౌస్‌లో ఉన్నాడ"ని[1] అన్నారు.

**604)** మహనీయ అలీ (రజి) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) నన్నూ, అబూ మర్సద్‌ను, జుబైర్(రజిఅల్లాహు అన్‌హుమ్)లను ఒక ముఖ్యమైన పనిపై పంపారు. మేము ముగ్గురం గుర్రాలపై స్వారీ అయి ఉన్నాం. "మీరు నేరుగా వెళ్ళండి. 'రౌజె ఖాక్' ప్రదేశానికి చేరుకోగానే మీకు బహుదైవారాధకుల స్త్రీ ఒకామె కనబడుతుంది. ఆమె దగ్గర ఒక ఉత్తరం ఉంది. దానిని హాతిబ్ బిన్ అబీ బల్తతఆ(రజి) బహుదైవారాధకుల పేర పంపాడు" అని ప్రవక్త మహనీయులు(స) ఆదేశించారు. దైవప్రవక్త(స) సూచించిన ప్రదేశంలోనే మేము ఒంటెపై వెళుతున్న ఆ స్త్రీని కనుగొన్నాము. "ఏదీ, ఆ ఉత్తరం ఇటివ్వు" అని మేము ఆమెను

---

ఉదాహరణకు:– "అస్సలాము అలైకుమ్ అహ్లు ద్దియార్" అనటం. అంతేగాని, సమాధులలో ఖననమై ఉన్న బాబాల వద్దకు పోయి ఎప్పుడు మొరపెట్టుకున్నా, వారు తమ మొరలను ఆలకిస్తారన్న బిద్అతీల ఆలోచన అసత్యం. షరీఅత్‌తో దీనికి ఎలాంటి సంబంధం లేదు.

603–1. ఈ హదీసును బట్టి బద్ర్ యుద్ధంలో పాల్గొన్న యోధుల విశిష్టత తెలిసి వస్తోంది– వారంతా స్వర్గవాసులు. హారిసా తండ్రి సురాఖా కూడా హునైన్ యుద్ధంలో వీరమరణం పొందారు.

పురమాయించాము. 'నా దగ్గర ఉత్తరం, గిత్తరం ఏదీ లేద'ని ఆమె బుకాయించింది. మేము ఆమె ఒంటెను కూర్చోబెట్టి, సోదా చేశాము. కాని నిజంగానే మాకు ఉత్తరం కనిపించలేదు. అయితే దైవప్రవక్త(స) చెప్పిన మాట ఏదీ అబద్ధమై ఉండదు. ఆ మాటే ఆ స్త్రీతో అన్నాము– "మర్యాదగా ఉత్తరం తీసి ఇవ్వు. లేదంటే నిన్ను వివస్త్రను చేయాల్సి వస్తుంద"ని హెచ్చరించాము. మా కఠిన వైఖరిని పసిగట్టిన ఆ స్త్రీ తన నడుము వస్త్రం కట్టే చోటు వద్ద చేయి పెట్టి, ఆ ఉత్తరాన్ని తీసి ఇచ్చింది. అది ఒక వస్త్రంలో చుట్టబడి ఉంది. మేము ఆ ఉత్తరాన్ని తీసుకుని దైవప్రవక్త(స)సన్నిధిలో హాజరయ్యాము. 'ఇతను (హాతిబ్ బిన్ అబీ బల్తతఅ) దైవం పట్ల, దైవప్రవక్త(స) పట్ల, ముస్లిముల పట్ల విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డాడు. దైవప్రవక్తా! తమరు ఆనతినిస్తే నేనతని మెడ నరికివేస్తాను' అన్నారు హజ్రత్ ఉమర్(రజి). అయితే దైవ ప్రవక్త(స) ఆ సహాబినుద్దేశించి, "ఎందుకు చేశావ్ ఈ పని?" అని అడిగారు. దానికి హాతిబ్, 'దేవుని మీద ఒట్టు! నాకు అల్లాహ్‌పైన, ఆయన ప్రవక్తపైన విశ్వాసం లేక కాదు. ఖురైషులకు నేను ఏదన్నా ఒక ఉపకారం చేస్తే, దానికి ప్రత్యుపకారంగా వారు మక్కాలో ఉన్న నా కుటుంబసభ్యులకు కీడు తలపెట్టకుండా ఉంటారని భావించి ఈ పని చేశాను. మీ సహచరులైన ముహాజిర్లందరి తెగవారు మక్కాలో ఉన్నారు. అల్లాహ్ వారి ద్వారా వారి ఆలుబిడ్డల్ని రక్షిస్తూ ఉన్నాడు. (కాని నాకు అలాంటి అండదండలు అక్కడ లేవు)' అని సంజాయిషీ ఇచ్చారు. అది విని, "ఇతను చెప్పింది నిజం. కాబట్టి మీరంతా ఇతని గురించి మంచి మాటే పలకాలి" అని హితవు పలికారు దైవప్రవక్త(స). అయితే ఉమర్(రజి) మరోసారి ఇలా అన్నారు: 'ఇతగాడు దైవానికి, దైవప్రవక్త(స)కు, ముస్లిములకు ద్రోహం చేశాడు. మీరు నాకు అనుమతి ఇస్తే నేనితనికి శిరచ్ఛేదనం చేస్తాను.

అప్పుడు దైవప్రవక్త(స) ఆయనతో ఇలా అన్నారు: "ఇతను బద్ర్ సహచరుల లోని వాడు కాదా? బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారి గురించి అల్లాహ్‌కు మొదటి నుంచే తెలుసు. 'ఇక మీరేం చేసుకున్నా మీకు స్వర్గం తప్పకుండా లభిస్తుంద'ని అల్లాహ్ స్వయంగా సెలవిచ్చాడు. (లేదా) 'నేను మిమ్మల్ని క్షమించాన'ని అన్నాడు. ఇది విని ఉమర్(రజి) కళ్ళు చెమ్మగిల్లాయి. 'ఈ విషయం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు'[1] అని ఉమర్(రజి) పలికారు.

---

604–1. దేశ చట్టాన్ని, పరిపాలనా వ్యవస్థను దృష్టిలో పెట్టుకుని హజ్రత్ ఉమర్(రజి)

## అధ్యాయం : 10

**605) అబూ ఉసైద్(మాలిక్ బిన్ రబీయా-రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) బద్ర్ యుద్ధ సందర్భంగా, "అవిశ్వాసులు మిమ్మల్ని సమీపించినప్పుడు మాత్రమే వారిపై మీ బాణాలు సంధించండి. (వారు దూరాన ఉన్నప్పుడు మీ బాణాలను ప్రయోగించి వాటిని వృథా గావించకండి) వాటిని భద్రంగా కాపాడుకోండి"[1] అని మాకు సూచించారు.**

**606) అబూ ఉసైద్(రజి) కథనం : బద్ర్ సంగ్రామం జరిగిన రోజు దైవ ప్రవక్త(సఅసమ్) మాకు ఇచ్చిన సూచన ఇది : "అవిశ్వాసులు మిమ్మల్ని సమీపించిన మీదటే, అంటే వారు గుంపులు గుంపులుగా మీపై దాడి జరిపినప్పుడే వారిపై మీరు బాణ వర్షం కురిపించండి. అన్యథా మీరు మీ బాణాలను పదిలపరచుకోండి."**

**607) బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్హాఖ్ వివరించారు: ఉహుద్ యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) విలు కాండ్రపై అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)ని నాయకునిగా నియమించారు. ఆ యుద్ధంలో మన వాళ్ళు డెబ్భయి మంది అమరగతినొందారు. బద్ర్ యుద్ధ సమయంలో దైవప్రవక్త(స), ఆయన సహచరులు కలసి 140 మంది శత్రువులకు నష్టం కలిగించారు. వారిలో డెబ్భయి మంది వధించబడగా, మరో డెబ్భయి మంది యుద్ధ ఖైదీలుగా నిర్బంధించబడ్డారు. దానిపై అబూ సుఫ్యాన్ వ్యాఖ్యానిస్తూ, "ఈ రోజు బద్ర్‌లో చవిచూసిన పరాజయానికి ప్రతీకారం తీర్చుకున్న రోజు. యుద్ధం ఉపమానం చేద లాంటిది"[1] అన్నాడు.**

---

తీవ్రంగా స్పందించారు. దేశానికి, సమాజానికి ద్రోహం చేసిన వ్యక్తికి మరణ దండన అనివార్యం అన్నది ఆయన ఉద్దేశం. అయితే దైవప్రవక్త(స) హజ్రత్ హాతిబ్ సంకల్పశుద్ధిని పసిగట్టి, ఆయన పట్ల మన్నింపుల వైఖరిని అవలంబించారు. దానికితోడు, హాతిబ్(రజి) బద్రీ సహాబీ. బద్రీ సహాబా తప్పులను మన్నించినట్లు అల్లాహ్ స్వయంగా సెలవిచ్చాడు.

605-1. అంటే లక్ష్యాన్ని ఛేదించినా ఛేదించకపోయినా ఫరవాలేదని భావించి, మీ దగ్గర ఉన్న బాణాలను దుర్వినియోగం చేయకండి. ప్రతిభావంతుడైన సేనాధిపతి ఇచ్చే సూచనలు ఇలాగే ఉంటాయి. రణతంత్రంలో మహాప్రవక్త ముహమ్మద్(స) సాటిలేని మేటి. నేటికీ ప్రపంచంలో అమల్లో ఉన్న యుద్ధ నియమం ఇదే.

607-1. ఉహుద్ యుద్ధ దినాన దైవప్రవక్త(స) యాభై మంది విలుకాండ్రను అబ్దుల్లాహ్

**608) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా వక్కాణించినట్లుగా అబూ మూసా అష్అరీ (రజి) తెలిపారు. "ఉహుద్ యుద్ధం తర్వాత అల్లాహ్ మనకు ప్రసాదించిన మేలే అసలైన మేలు. ఇక కార్యశుద్ధికి సంబంధించిన ప్రతిఫలం అంటారా, దానిని అల్లాహ్ బద్ర్ యుద్ధం తర్వాత మనకు అనుగ్రహించాడు."[1]**

**609) హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) కథనం : బద్ర్ యుద్ధ సంద ర్భంగా నేను పంక్తిలో నిలబడి ఉన్నాను. నేను వెనక్కి తిరిగి చూడగానే నాకు కుడి వైపున, ఎడమ వైపున ఇద్దరు నవ యువకులు కనిపించారు. నేను వారి గురించి ఇంకా ఒక నిర్ధారణకు రాకముందే, వారిద్దరిలో ఒకబ్బాయి రహస్యంగా– రెండవ వానికి వినిపించకుండా– 'బాబాయి! నాకు అబూ జహ్లును చూపించండి' అన్నాడు. దానికి నేను, "అబ్బాయి! నువ్వు అతన్ని చూసి ఏం చేస్తావ్?"అనడిగాను. 'నాకు అతను కనిపించగానే నేనతన్ని హతమార్చడమైనా చేస్తాను లేదా నేను స్వయంగా చావనయినా చస్తాను అని అల్లాహ్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశాను' అని ఆ అబ్బాయి చెప్పాడు. రెండవ అబ్బాయి కూడా తన తోటివానికి తెలియకుండా నాకు అదే విషయం అడిగాడు. ఆ క్షణంలో ఆ టీనేజీ కుర్రవాళ్ళ మధ్య నిలబడి ఉండటం నాకెంతో సంతోషం కలిగించింది. అదుగో, అతనే అబూజహల్ అంటూ నేను వారికి సంజ్ఞ చేశాను. అతన్ని చూడగానే వారిద్దరూ గ్రద్దల మాదిరిగా అతనిపై పడి, అప్పటికప్పుడే కడతేర్చారు. వీరిద్దరూ అఫ్రా కొడుకులు.[1]**

---

బిన్ జుబైర్ నేతృత్వంలో ఒక గుట్టపై నిలిచి ఉండమని ఆజ్ఞాపించారు. తదుపరి ఆదేశం అందేవరకు అక్కడి నుండి కదలరాదని కూడా సూచించారు. కాని యుద్ధం మొదటి దశలో ముస్లిముల ఆధిక్యతను గమనించిన విలుకాండ్రు, తమ స్థలాన్ని వదలి యుద్ధప్రాప్తిని సేకరించడానికి వెళ్ళారు. తత్కారణంగా విజయం కాస్తా పరాజయంగా పరిణమించింది.

608–1. ఉహుద్ పోరాటంలో పరాజయం ఎదురైనప్పటికీ ముస్లింల ఆత్మ విశ్వాసం సన్నగిల్లలేదు. వారు భగ్న హృదయులు కాలేదు. ఆ తర్వాతి కాలంలో అల్లాహ్ వారికి అనేక విజయాలు ప్రసాదించాడు.

609–1. వీరిద్దరూ ముఆజ్ బిన్ అఫ్రా, మవూజ్ బిన్ అఫ్రా అనీ, వీరిద్దరి తల్లి పేరు అఫ్రా అనీ కొన్ని ఉల్లేఖనాలలోఉంది. వీరి తండ్రి పేరు హారిస్ బిన్ రిఫాఅ. దైవప్రవక్త (స)ను దూషించిన అబూజహ్లును వధించాలని ఈ కుర్రాళ్ళు ఇద్దరూ ముందు

**610)** మహనీయ అబూ హురైరా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) పదిమంది సహచరులను గూఢచారులుగా నియమించి పంపారు. ఆసిమ్ బిన్ సాబిత్ అన్సారీ(రజి)ని వారి నాయకునిగా నియుక్తం చేశారు. ఈయన ఆసిమ్ బిన్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) తాతయ్య. వీరు ఉస్ఫాన్- మక్కాల మధ్యన ఉన్న 'హద్దా' స్థలానికి చేరుకోగానే, బనీ హుజైల్‌కు చెందిన ఒక తెగవారికి వీళ్ళ ఆచూకీ తెలిసిపోయింది. ఆ తెగ పేరు బనీ లిహ్యాన్. బనీ లిహ్యాన్‌కు చెందిన వంద మంది విలుకాండ్రు ప్రవక్త ప్రియ సహచరుల అన్వేషణలో బయలుదేరారు. వారి అడుగుజాడలను పసిగట్టి నడవసాగారు. చివరకు వారు ప్రవక్త ప్రియ సహచరులు (రజి) కూర్చుని ఖర్జూరపండ్లు తిన్న చోటికి చేరుకున్నారు. ఇవి యస్రిబ్ (మదీనా) ఖర్జూరపండ్ల విత్తనాలు అని పరస్పరం చెప్పుకుని, వారి అడుగుజాడలను చూస్తూ ముందుకు సాగారు.

(శత్రువులు) తమను వెంబడిస్తున్నారని తెలుసుకోగానే ఆసిమ్ బిన్ సాబిత్ (రజి), ఆయన సహచరులు సురక్షితమైన ఒక స్థలంలో ఆశ్రయం పొందారు. కాని బనీ లిహ్యాన్ తెగవారు వాళ్ళను ముట్టడించారు. "మీరందరూ క్రిందికి దిగి రండి. మీలో ఏ ఒక్కరికీ ప్రాణనష్టం కలిగించబోమని మేము వాగ్దానం చేస్తున్నాము" అని ప్రకటన గావించారు. "ముస్లింలారా! నేను ఏ ఒక్క సత్య తిరస్కారిని కూడా నమ్మి క్రిందికి దిగను" అని ఆసిమ్ బిన్ సాబిత్(రజి) చెప్పారు. తరువాత ఆయన, "దేవా! మా పరిస్థితి గురించి నీ ప్రవక్త(స)కు తెలియబరచు" అని వేడుకున్నారు.

చివరకు విలుకాండ్రు ముస్లింలపై బాణ వర్షం కురిపించి ఆసిమ్ (రజి)ను చంపేశారు. పిదప వారిచ్చిన హామీపై ముగ్గురు సహచరులు క్రిందికి దిగి వచ్చారు. వారిలో ఒకరు హజ్రత్ ఖుబైబ్, రెండవ వారు జైద్ బిన్ దసినా, మూడవ వారు మరొక సహాబి. బనీ లిహ్యాన్ తెగవారు ఈ ముగ్గురు సహాబీలను తమ అదుపులోకి తీసుకుని, తమ ధనుస్సు త్రాళ్ళతో వారిని కట్టేశారు. "ఇది మీ మొదటి విశ్వాస ఘాతుకం. నేను మీ వెంట రాను. నాకు నా ఈ మిత్రులే ఆదర్శప్రాయం" అని మూడవ

---

గానే ప్రతిజ్ఞ చేసుకున్నారు. అనుకున్నది సాధించారు. నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్కగాలి వానకే కూలిపోయినట్లు సత్య తిరస్కారుల సర్దారు సాధారణ కుర్రాళ్ళ చేత వధించబడ్డాడు.

సహాబీ చెప్పారు. బనీ లిహ్యాన్ చేత వధించబడిన సహచరులను ఉదాహరిస్తూ ఆయన అలా చెప్పారు. అవిశ్వాసులు ఆయన్ని బలవంతంగా ఈడ్వసాగారు. కాని ఆయన వారి వెంట వెళ్ళడానికి ఎంతకీ అంగీకరించకపోవడంతో ఆయన్ని కూడా చంపేశారు. ఖుబైబ్(రజి), జైద్ బిన్ దసినా (రజి)లను మక్కాకు తీసుకెళ్ళి, వారిద్ద రినీ అక్కడ అమ్మేశారు. బద్ర్ యుద్ధం తరువాత జరిగిన సంఘటన ఇది.

హారిస్ బిన్ ఆమిర్ బిన్ నౌఫల్ కుమారులు ఖుబైబ్(రజి)ను కొనుగోలు చేశారు. బద్ర్ యుద్ధంలో హారిస్ బిన్ నౌఫల్‌ను వధించినది ఖుబైబ్ గారే. కొన్ని రోజుల వరకూ ఆయన వారి వద్దనే ఖైదీగా ఉన్నారు. చివరకు హారిస్ కొడుకులు ఆయన్ని చంపేయాలని నిర్ణయించుకున్నారు. ఆ రోజుల్లోనే హారిస్ కూతుళ్ళలో ఒకామె వద్ద నుండి ఆయన మంగలి కత్తిని అడిగి తీసుకున్నారు– తన నాభి క్రింది వెంట్రుకలను తీయడానికి. ఆ సమయంలో ఆమె చంటి పిల్లవాడు ఆయన దగ్గరకు (ఆడుకోవడానికి) వెళ్ళాడు. పరధ్యానం నుండి తేరుకుని ఆమె ఖుబైబ్ (రజి) దగ్గరకు వచ్చే సమయానికి ఆ పిల్లవాడు ఆయన తొడపై కూర్చుని ఉన్నాడు. ఆయన చేతిలో మంగలికత్తి ఉంది. ఆ దృశ్యాన్ని చూసి తాను ఆందోళనకు గురయ్యానని ఆమె చెప్పింది. ఆమె పరిస్థితిని గమనించిన ఖుబైబ్(రజి),"ఏమిటి, నేను నీ పిల్లవాణ్ణి చంపేస్తానని భయపడుతున్నావా? నిశ్చింతగా ఉండు. నేను ఎన్నటికీ అలా చెయ్యను" అని అభయమిచ్చారు ఖుబైబ్.

ఆ స్త్రీ ఇలా అంది: "దైవసాక్షి! నేను ఖుబైబ్(రజి) కన్నా మంచి ఖైదీని చూడ లేదు. దైవసాక్షిగా! నేనొక రోజు ఆయన చేతిలో ద్రాక్ష పండ్ల గుత్తిని చూశాను. ఆయన వాటిని తింటూ ఉన్నారు. నిజానికి ఆ సమయంలో ఆయన ఇనుప సంకెళ్ళలో బంధించబడి ఉన్నారు. ఆ సీజన్లో మక్కా నగరంలో ద్రాక్ష పండ్లు కూడా లభ్యమవవు. వాస్తవానికి అల్లాహ్ ఆయనకు ఉపాధిగా పంపిన పండ్లు అవి."

తరువాత బనూ హారిసా (రజి) తెగవారు ఖుబైబ్(రజి)ను వధించడానికి హరమ్ (పవిత్ర కాబా) పరిధి నుండి వెలుపలికి తీసుకెళ్ళసాగారు. "నాకు రెండు రకతుల నమాజ్ చేసుకునే అనుమతిని ఇవ్వండి" అని ఖుబైబ్(రజి) కోరారు. అనుమతి పొందిన మీదట ఆయన రెండు రకతుల నమాజ్ ఆచరించి ఇలా అన్నారు: "అల్లాహ్ సాక్షిగా! ప్రాణభయం వల్ల నేను నమాజ్‌ను సుదీర్ఘంగా చేసుకుంటున్నానని

మీరు అనుకుంటున్నారన్న ఆలోచన నాకు కలగకుండా ఉంటే మరింత ఎక్కువ సమయం నమాజ్‌లో గడిపేవాణ్ణి". తరువాత ఆయన ఇలా ప్రార్థించారు. "దేవా! వీరిలో ప్రతి ఒక్కరినీ వేర్వేరుగా అంతమొందించు. ఏ ఒక్కరినీ విడిచిపెట్టకు"- పిదప ఈ కవితలు పఠించారు :

"(సారాంశం) నేను ఇస్లామ్‌పై వధించబడుతున్నప్పుడు నాకు చింత యేల? అల్లాహ్ మార్గంలో నేను ఏ వైపు నుండి పడగొట్టబడినా అది అల్లాహ్ ప్రసన్నత కొరకే కాగలదు. ఆయన గనక తలచుకుంటే నా శరీరంలోని ఒక్కొక్క కీలుపై పుణ్యఫలం ప్రసాదించగలడు".

ఆ తరువాత అబూ సిర్వఆ ఉఖబా బిన్ హారిస్ ఆయన వైపునకు వెళ్ళి ఆయన్ని వధించాడు. తన హత్యకు ముందు ఖుబైబ్ ఓ గొప్ప సంప్రదాయం నెల కొల్పారు. ఆయన చేసిన రెండు రకతుల నమాజ్ భావితరాల వారికి- ఖైదీగా పట్టుబడి చంపబడేవారికి- (రెండు రకతుల నమాజ్) ఆనవాయితీగా మారింది. ఇటు ఈ సహచరమాన్యులపై విపత్తు విరుచుకుపడిన రోజే అల్లాహ్ తన ప్రవక్త (స)కు ఆ విషయం తెలియపరిచాడు.

ఆసిమ్ బిన్ సాబిత్(రజి) వధించబడ్డారన్న సంగతి తెలుసుకున్న ఖురైషు ప్రముఖులు కొంతమందిని ఆ ప్రదేశం వైపునకు పంపించారు- ఆయన భౌతిక కాయంలో ఏ అవయవం అయినా దొరికితే దానిపట్ల అమర్యాదగా ప్రవర్తించాలని. ఎందుకంటే బద్ర్ యుద్ధదినాన ఖురైషు నాయకుల్లో ఒకడైన ఉఖబా బిన్ అబీ ముఅయ్‌త్‌ను హతమార్చినది ఆయనే. అయితే అల్లాహ్ ఆయన భౌతికకాయంపై కారుమేఘం కమ్మినట్లుగా కందిరీగల దళాన్ని నియమించాడు. అవి ఆయన భౌతిక కాయాన్ని ఖురైష్ మనుషుల వాతనపడకుండా కాపాడుకున్నాయి- ఆయన భౌతిక కాయంలోని ఏ అవయవాన్ని కూడా వారు కోయలేకపోయారు.[1]

---

610-1. సుదీర్ఘమైన ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన పది మంది సహచరమాన్యులలో ఏడుగురి పేర్లు పేర్కొనబడ్డాయి. వారి పేర్లు ఇవి : 1) మర్సద్ ఘనవీ 2) ఖాలిద్ బిన్ బుకైర్ 3) ఖుబైబ్ బిన్ అదీ 4) జైద్ బిన్ దసినా 5) అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్ 6) మోతిబ్ బిన్ ఉబైద్ 7) ఆసిమ్ బిన్ సాబిత్ (రజి అల్లాహు అన్‌హుమ్). తక్కిన ముగ్గురు సహచరమాన్యుల పేర్లు తెలియలేదు.

**కాబ్ బిన్ మాలిక్(రజి) ఇలా అన్నారు : జనులు నా ముందు (తబూక్ యుద్ధంలో పాల్గొనలేకపోయిన) మురారా బిన్ రబీ(రజి), హిలాల్ బిన్ ఉమయ్యా(రజి) గురించి ప్రస్తావించారు. వారు సత్పురుషులైన సహాబా కోవకు చెందినవారు. వారిద్దరూ బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు.**

**611) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) శుక్రవారం నాడు ఇలా వివరించారు: బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సయీద్ బిన్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్ (రజి) వ్యాధిగ్రస్తులయ్యారు. పొద్దెక్కిన తరువాత అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఆయన్ని పరామర్శించడానికి వెళ్ళారు. అంతలో జుమా నమాజ్ వేళ సమీపించింది. జుమా నమాజును (గత్యంతరం లేని స్థితిలో) ఆయన ఆచరించలేకపోయారు.**[1]

**ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉతబా వివరించారు : ఈయన తండ్రి అబ్దుల్లాహ్ గారు ఉమర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అర్ఖమ్‌కు ఉత్తరం వ్రాస్తూ, 'నీవు సుబైయా బిన్తె హారిస్ అస్లమియా (ర.అ) దగ్గరకు వెళ్ళి, ఆమె దైవప్రవక్త(స) సమ**

బద్ర్ యుద్ధంలో ఖుబైబ్ బిన్ అదీ (రజి) హారిస్ బిన్ ఆమిర్‌ను వధించారు. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న హారిస్ కొడుకులు ఖుబైబ్(రజి)ను కొనుగోలు చేసి, ఆయన్ని హతమార్చే వ్యూహం రచించారు. హజ్రత్ ఖుబైబ్(రజి) మహిమలు ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చాయి. సీజన్ కాని సమయంలో– మక్కా లాంటి కటిక కొండ ప్రాంతంలో– అల్లాహ్ హజ్రత్ ఖుబైబ్(రజి)కు పండ్ల రూపంలో ఉపాధిని ప్రసాదించాడు.

అలాగే ఆయన తొడపై కూర్చుని ఉన్న తన పిల్లవాడికి ఖుబైబ్(రజి) కీడు తలపెడతారేమోనని హారిస్ కూతురు భయపడిపోయింది. కాని ఖుబైబ్ (రజి), నిజమయిన ముస్లిం అన్యాయంగా ఏ ప్రాణినీ బలిగొనడని తన ప్రవర్తన ద్వారా నిరూపించారు– రజి అల్లాహు అన్హు.

611–1. ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకురావటంలోని ముఖ్య ఉద్దేశం సయీద్ బిన్ జైద్(రజి) బద్రీ సహాబీ కావటమే. ఆయన ప్రత్యక్షంగా బద్ర్ యుద్ధంలో పాల్గొనలేదు. ఎందుకంటే దైవప్రవక్త(స) ఈయన్ని తల్హా (రజి)తోపాటు గూఢచర్యం కొరకు నియమించారు. వీళ్ళు తిరిగి రాకముందే యుద్ధం మొదలైపోయింది. అయితే యుద్ధప్రాప్తి పంపిణీ జరిగినప్పుడు దైవప్రవక్త(స) ఈయన గారికి వాటా కల్పించారు. ఆ విధంగా ఈయన గారు బద్రీ సహాబీ అయ్యారు.

**క్షంలో తన సందేహాన్ని వ్యక్తపరచినప్పుడు, ఆయన(స) ఆమె గారికి ఇచ్చిన సమాధానం ఏమిటో అడిగి తెలుసుకో' అని ఆదేశించారు. దానికి ఉమర్ బిన్ అబ్దుల్లాహ్ సమాధానం వ్రాస్తూ, "సుబైయా బిన్తె హారిస్(ర.అ) నాతో ఏమని చెప్పిందంటే; ఆమె సాద్ బిన్ ఖౌలా వివాహ బంధంలో ఉండేది. అతను బనీ ఆమిర్ బిన్ లూయి తెగకు చెందినవాడు. అతను బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారిలో ఒకడు.[2] తరువాత వీడ్కోలు హజ్జ్ యాత్ర సందర్భంగా అతను మరణించాడు. ఆ సమయంలో నేను గర్భవతిగా ఉన్నాను. సాద్ బిన్ ఖౌలా (రజి) మరణించిన కొన్ని రోజులకే (ఇరవై అయిదు లేక అంతకన్నా తక్కువ రోజులకే) ఆమె ప్రసవించింది. ఆమె పురిటి రక్తస్రావం (నిఫాస్) నుండి పరిశుద్ధతనొందగానే, తనకు నికాహ్ సందేశం పంపే వారి కోసం ఆమె మంచి బట్టలు తొడుక్కుని సింగారించుకోసాగింది. అప్పుడు బనూ అబ్దుద్దార్ తెగకు చెందిన ఒక సహాబీ అబుస్సనాబీల్ బిన్ బాకక్(రజి) ఆమె దగ్గరకు వెళ్ళి, 'నికాహ్ సందేశం పంపేవాళ్ళ కోసం బహుశా నీవు సింగారించుకుంటున్నట్టున్నావ్! నీకు నికాహ్ చేసుకునే ఉద్దేశం ఉందా? కాని దైవసాక్షిగా! (సాద్ మరణించి) నాలుగు నెలల పదిరోజుల గడువు (ఇద్దత్) ముగియనిదే నీవు పునర్వివాహానికి యోగ్యురాలవు కాలేవు' అని నిర్దిష్టంగా చెప్పేశారు. సుబైయా (ర.అ) ఇలా అన్నారు: అబుస్సనాబీల్ నాతో ఈ మాట అన్ననాడే నేను సాయంత్రం (మంచి) బట్టలు తొడుక్కుని, దైవప్రవక్త(స) సమక్షంలో హాజరై, ఈ సమస్యకు పరిష్కారం అడిగాను. సమాధానంగా దైవప్రవక్త(స) "ప్రసవించడంతోటే నీవు నీ ఇద్దత్(గడువు) నుండి బయటపడ్డావు. నీవు పునర్వివాహానికి యోగ్యురాలవే" అన్నారు.**

---

ఈయనకు జబ్బు చేసినప్పుడు, ఈయన్ని పరామర్శించటం చాలా అవసరం అని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) భావించారు. ఎందుకంటే ఆ సమయంలో ఆయనకు మరణ ఘడియలు సమీపించాయి. ఈ కారణంగానే ఇబ్నె ఉమర్(రజి) జుమా నమాజును కూడా త్యజించారు.

611-2. సాద్ బిన్ ఖౌలా (రజి) కూడా బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబాలో ఒకరు.

భర్తను కోల్పోయిన గర్భవతి అయిన భార్యకు ప్రసవం అవగానే ఆమె ఇద్దత్ (గడువు) ముగిసిపోతుందని, నాలుగు నెలల పది రోజుల వరకు ఆగి ఉండవలసిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది.

## అధ్యాయం : 11

## బద్ర్ యుద్ధంలో దైవదూతలు పాల్గొనటం గురించి

**612) ముఆజ్ బిన్ రిఫాఅ బిన్ రాఫె జురఖీ తన తండ్రి రిఫాఅ బిన్ రాఫె నుండి ఉటంకించారు. ఆయన బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారు. ఆయన ఇలా వివరించారు : దైవదూత జిబ్రీల్(అలైహిస్సలామ్) ప్రవక్త మహనీయుల(సఅసమ్) సన్నిధికి వచ్చి, 'బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి అంతస్తు గురించి మీరేమంటారు?' అని అడిగితే, "వారు ముస్లింలందరిలోకెల్లా శ్రేష్టులు" అని ఆయన (స) చెప్పారు. లేదా ఆయన(స) అలాంటి మాటే అన్నారు. దానికి జిబ్రీల్(అ), 'బద్ర్ యుద్ధంలో పాల్గొన్న దైవదూతల స్థాయి కూడా అటువంటిదే'[1] అని అన్నారు.**

**613) అఖబా ప్రతిజ్ఞ (బైఅత్)లో పాల్గొన్న రాఫే తన కుమారుడు రిఫాఅతో ఇలా అనేవారు : అఖబా ప్రతిజ్ఞ (బైఅత్)లో పాల్గొన్నందుకు నాకు కలిగినంత సంతోషం బద్ర్ యుద్ధంలో పాల్గొన్నందుకు కూడా కలగలేదు. ఈ యుద్ధంలో పాల్గొన్నవారి అంతస్తు గురించి జిబ్రీల్ దైవప్రవక్త(స)ను అడిగినప్పటికీ[1] (నా దృష్టిలో మాత్రం బైఅతె అఖబా కీలకమైనది).**

---

612–1. దైవదూతలు ఇతర యుద్ధాలలో కూడా దివి నుండి భువికి దిగి వచ్చిన సందర్భాలున్నాయి. కాని బద్ర్ మైదానంలో మాత్రం దైవదూతలు ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొన్నారు. బైహఖీలోని ఉల్లేఖనం ప్రకారం దైవదూతలు కొట్టిన దెబ్బ గుర్తు పట్టబడేది. మెడపైన వేసే దెబ్బ, పార్శ్వాలపై నిప్పు వాత వంటివి విలక్షణంగా భావించబడ్డాయి. ఇస్హాఖ్ సనదులో జుబైర్ బిన్ ముత్యిమ్ కథనం ఇలా ఉంది : బద్ర్ యుద్ధం నాడు నేను అవిశ్వాసుల పరాజయానికి ముందు ఆకాశం నుండి నల్లని చీమలు దిగి రావటం చూశాను. వారే దైవదూతలు. వారు దిగగానే అవిశ్వాసులు ఓటమి పాలయ్యారు.

613–1. ఆయన దృష్టిలో బద్ర్ యుద్ధంలో పాల్గొనటం కన్నా 'అఖబా ప్రతిజ్ఞ'లో పాల్గొనటం కీలకమైనది. ఎందుకంటే ఆ ప్రతిజ్ఞ గడ్డుకాలంలో రహస్యంగా జరిగింది. ఈ ప్రతిజ్ఞ తర్వాతనే దైవప్రవక్త(స)కు మానసికంగా స్థిమితం చిక్కింది. మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేయడానికి మార్గం సుగమం అయింది. అదే ఇస్లామ్‌లో కీలక మలుపు.

**614)** **ముఆజ్ బిన్ రిఫాఅ చెప్పగా తాను విన్నానని యహ్యా బిన్ సయీద్ అన్సారీ తెలిపారు: "ఒక దైవదూత (అంటే జిబ్రీల్– అలైహిస్సలామ్) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(స)ను అడిగారు...**

**615)** **ఇబ్నె అబ్బాస్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) బద్ర్ యుద్ధ దినాన ఇలా అన్నారు: "అదిగో, ఆయనే జిబ్రీల్(అలైహిస్సలామ్). తన గుర్రం తల పట్టుకుని, సాయుధులై ఉన్నారు."[1]**

## అధ్యాయం : 12

**616)** **అనస్ బిన్ మాలిక్(రజి) ఖతాదాతో ఇలా అన్నారు : అబూ జైద్(రజి) మరణించారు. ఆయన తన వెనుక సంతానాన్ని వదలలేదు. ఆయన బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నారు.**

**617)** **అబ్దుల్లాహ్ బిన్ ఖబ్బాబ్(రజి)కథనం: అబూ సయీద్ బిన్ మాలిక్ ఖుద్రీ (రజి) ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు ఆయన ఇంటివారు ఆయన ముందు ఖుర్బానీ మాంసాన్ని సమర్పించారు. దానిపై ఆయన, "దీనికి సంబంధించిన ఆజ్ఞ ఏమిటో స్పష్టంగా తెలియనంతవరకూ నేను దీనిని తినను" అని నిర్దిష్టంగా చెప్పేశారు. చివరకు ఆయన తన తల్లి తరఫు (సవతి) సోదరుని వద్దకు సందేహ నివృత్తి కొరకు వెళ్ళారు. ఆయన పేరు ఖతాదా బిన్ నోమాన్ అన్సారీ(రజి). ఆయన బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారిలో ఒకరు.[1] ఆయన ఇలా అన్నారు: "మూడు రోజుల కన్నా ఎక్కువగా ఖుర్బానీ మాంసాన్ని నిల్వ ఉంచరాదన్న ఆజ్ఞ నీవు ప్రయాణానికి వెళ్ళిన తరువాత రద్దు అయింది."**

---

615–1. ఆయన్ని అల్లాహ్ ముస్లింలకు సహాయపడటానికి యుద్ధ రంగానికి పంపాడు. జిబ్రీల్(అ) ఎర్రని గుర్రంపై స్వారీ అయి ఉన్నట్టు సయీద్ బిన్ మన్సూర్ ఉల్లేఖనంలో ఉంది. ఇబ్నె ఇస్హాఖ్ అబూ వాఖిద్ లైసీ ఆధారంగా వెలికితీసిన దాని ప్రకారం, నేను బద్ర్ యుద్ధ దినాన ఒక అవిశ్వాసిని చంపడానికి వెళ్ళాను. కాని నేను అతన్ని సమీపించకముందే అతని తల అతని దేహం నుండి వేరైపోయింది. నా ఖడ్గం ఇంకా అతన్ని తాకనయినా లేదు.

బైహఖీ వెలికితీసిన ఉల్లేఖనం ఇలా వుంది: బద్ర్ యుద్ధదినాన ఒక తుఫాను గాలి వీచింది. రెండవసారి కూడా మరింత ఉధృతంగా గాలి వీచింది. మొదటి గాలి హజ్రత్ జిబ్రీల్(అ)ది. రెండవ గాలి హజ్రత్ మేకాయీల్(అ)ది.

**618) హజ్రత్ జుబైర్(రజి) తెలిపారు : బద్ర్ యుద్ధ సందర్భంగా ఉబైదా బిన్ సయీద్ బిన్ ఆస్ నాకు ఎదురుపడ్డాడు. అతని శరీరమంతా ఇనుప కవచంతో నిండి ఉంది; కేవలం కళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయి. అబూ జాత్ కర్షీ అతని కునీయత్. 'నేను అబూ జాత్ కర్షీని' అని అతను స్వయంగా చెప్పుకున్నాడు. నేను ఒక చిన్న బరిసెతో అతనిపై దాడి చేసి, అతని కంటినే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఆ గాయంతోనే అతను చనిపోయాడు.[1]**

**జుబైర్(రజి) తనతో చెప్పినట్లుగా హిషామ్ ఉటకించారు : "... తరువాత నేను నా పాదాన్ని అతని శరీరంపై పెట్టి శక్తికొలదీ ఆ బరిసెను లాగాను. అతి కష్టమ్మీద ఆ బరిసె అతని కంటిలోనుంచి వచ్చింది. దాని రెండు వైపులు వంకర పోయాయి.**

**ఉర్వా తెలిపారు : "తరువాత ప్రవక్త మహనీయులు(స), ఆ బరిసెను తనకు ఇవ్వమని జుబైర్‌ను కోరారు. జుబైర్ దానిని దైవప్రవక్త(స)కు ఇచ్చారు. ప్రవక్త మహనీయులు(స) పరమపదించిన మీదట జుబైర్ దానిని తిరిగి తీసేసుకున్నారు. తరువాత అబూబక్ర్(రజి) అడిగితే, ఆయన అబూబక్ర్‌కు ఇచ్చారు. అబూబక్ర్(రజి) మరణానంతరం ఉమర్(రజి) ఆ బరిసెను తనకు ఇవ్వమని కోరారు. ఆయన దానిని ఉమర్(రజి)కు కూడా ఇచ్చారు. ఉమర్(రజి) మరణించిన పిదప, ఆయన దానిని స్వాధీనం చేసుకున్నారు. అయితే తృతీయ ఖలీఫా ఉస్మాన్(రజి) కోరికపై ఆయనకు ఇచ్చేశారు. ఉస్మాన్(రజి) అమరగతినొందిన పిదప అది అలీ(రజి) వద్దకు వెళ్ళి పోయింది. అలీ(రజి) తదనంతరం అది ఆయన సంతానం వద్ద ఉంది. ఆ తరువాత అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) దానిని తీసుకున్నారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) వీర మరణం పొందేవరకూ ఆ బరిసె ఆయన వద్దనే ఉంది.**

---

617–1. ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఖతాదా బిన్ నోమాన్(రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబి కాబట్టి, ఈ అధ్యాయం క్రింద ఈ హదీసును తీసుకోవటం జరిగింది.

618–1. బద్ర్ యుద్ధ దినాన సంభవించిన సంఘటన ఇది. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం.

**619) బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న సహాబీ ఉబాదా బిన్ సామిత్(రజి) తెలిపారు : “నా సమక్షంలో ప్రమాణం (బైఅత్) చెయ్యి” అని దైవప్రవక్త(సఅసమ్) నాతో చెప్పారు.[1]**

**620) మహాప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : దైవప్రవక్త(స) తో కలసి బద్ర్ సమరంలో పాల్గొన్న వారిలో ఒకరైన అబూ హుజైఫా(రజి), సాలిమ్ (రజి)ను తన దత్తపుత్రునిగా చేసుకుని, తన అన్న కుమార్తె యగు హిందా బిన్తె వలీద్ బిన్ ఉతబాతో అతని వివాహం జరిపించారు. సాలిమ్(రజి) వాస్తవానికి ఒక అన్సార్ మహిళ వద్ద బానిసగా ఉన్నారు. దైవప్రవక్త(స) జైద్ బిన్ హారిసా(రజి)ను దత్తపుత్రునిగా చేసుకున్నట్లే సాలిమ్‌ను అబూ హుజైఫా తన దత్తపుత్రునిగా చేసుకున్నారు- ఇస్లామ్‌కు పూర్వం, అజ్ఞాన కాలంలోని సంప్రదాయం ప్రకారం ఎవరయినా ఒక వ్యక్తిని దత్తపుత్రునిగా చేసుకుంటే, ప్రజలు అతనిని ఆ వ్యక్తి కుమారునిగానే పిలిచేవారు. దత్తపుత్రుడు అతని ఆస్తికి వారసుడు కూడా అయ్యేవాడు.[1] చివరకు, “దత్తపుత్రులను వారి తండ్రులతో ఉన్న సంబంధం ప్రకారం పిలవండి. ఇది అల్లాహ్ దృష్టిలో ఎంతో న్యాయసమ్మతమైన విషయం” (అల్ అహ్‌జాబ్: 5) అనే దైవ వచనం అవతరించింది. అప్పుడు సహ్‌లా (ర.అ) దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయింది... తరువాత ఉల్లేఖకుడు వివరంగా హదీసును వినిపించారు.**

---

619-1. ఈ హదీసు “కితాబుల్ ఈమాన్” (విశ్వాస ప్రకరణం)లో పూర్తిగా ఇంతకు ముందు వచ్చింది.

620-1. ఇమామ్ బుఖారీ(రహ్మ) ఇక్కడ పూర్తి హదీసును తీసుకోలేదు. అబూదావూద్‌లో ఇంకా ఇలా వుంది : సహ్‌లా (ర.అ) వచ్చి, ‘దైవప్రవక్తా! మేము సాలిమ్(రజి)ను కొడుకుగానే భావిస్తున్నాము. అతనితో పరదా పాటించే వారము కాము. ఇప్పుడేం చేయాలో సెలవీయండి’ అని విన్నవించుకుంది . దానికి ఆయన(స) ఇలా అన్నారు : “ఒక పని చెయ్యి. నీవు సాలిమ్‌కు పాలివ్వు”. ఆమె సాలిమ్‌కు అయిదుసార్లు పాలిచ్చి, ఆయన్ని తన పాలవరుస సోదరునిగా చేసుకున్నారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఈ హదీసు ఆధారంగా ధార్మిక తీర్పులు ఇచ్చేవారు. ఇకపోతే ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన వలీద్ బిన్ ఉతబా బద్ర్ యుద్ధంలో హజ్రత్ అలీ(రజి) చేత వధించబడ్డాడు. అబూ హుజైఫా సహాబీ (రజి) అతని సోదరులే. ఈయన ఇస్లామ్ స్వీకరించిన తొలి కాలపు ముహాజిర్లలో ఒకరు.

**621)** రబీ బిన్తె మవూజ్(ర.అ) ఖాలిద్ బిన్ జక్వాన్‌తో ఇలా అన్నారు: నా వివాహం జరిగిన నాటి రాత్రి– తెల్లవారాక ప్రవక్త మహనీయులు(సఅసమ్) నా ఇంటికి వచ్చి, నా పడకపై కూర్చున్నారు. ఇప్పుడు నీవు నా దగ్గర కూర్చున్నట్లుగానే కూర్చున్నారు. ఆ సమయంలో కొంతమంది బాలికలు డప్పు వాయిస్తూ బద్ర్ యుద్ధంలో వీరమరణం పొందిన తమ కుటుంబీకుల గురించి గీతాలాపన చేసు కుంటున్నారు. అప్పుడు వారిలోని ఒక బాలిక 'మన మధ్యన ఒక ప్రవక్త(స) ఉన్నారు. రేపు ఏం జరగనున్నదో ఆయనకు తెలుసు'[1] అన్న కవిత చెప్పింది. దైవ ప్రవక్త(స) వెంటనే ఆ అమ్మాయిలను వారిస్తూ, "ఇలా అనవద్దమ్మా. ఇంతకు ముందు మీరు పాడుకున్నవే పాడుకోండి" అని బోధించారు.

**622)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : ప్రవక్త మహనీయుల (సఅసమ్) సహచరులైన అబూ తల్హా (రజి) నాకు తెలియజేశారు. ఆయన దైవప్రవక్త(స)తో కలసి బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నారు. ఆయన ప్రకారం దైవప్రవక్త(స) ఇలా వక్కా ణించారు: "కుక్క, (ప్రాణమున్న వాటి) రూపచిత్రాలు ఉన్న ఇంట్లోకి (కారుణ్య) దైవదూతలు రారు.[1]

**623)** హజ్రత్ అలీ(రజి) తనకు తెలియజేసినట్లుగా మహనీయ హుసైన్ బిన్ అలీ(రజి) తెలిపారు: బద్ర్ యుద్ధంలో విజయ ధనంగా ప్రాప్తమయిన సొమ్ములో

---

621–1. ఈ కవిత ద్వారా దైవప్రవక్త(స)కు అగోచర జ్ఞానం ఉంది అనే విషయం ద్యోతకమవుతోంది. వాస్తవానికి ఒక్కడైన అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ అగోచర విషయాల జ్ఞానం లేదు. అందుకే దైవప్రవక్త(స) వెంటనే కల్పించుకుని, వారిం చారు. ఇలా అనవద్దని, ఇంతకుముందు పాడుకున్నదే పాడుకోండి అనీ నచ్చ జెప్పారు. కనుక ఎవరయితే దైవప్రవక్త(స)కు అగోచర విషయాల జ్ఞానం ఉందని వాదిస్తున్నారో వారు అబద్ధీకులు. ఇది ఖుర్‌ఆన్ హదీసుల ధిక్కరణ క్రిందికి వస్తుంది.

622–1 దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే వృక్షాలు, కట్టడాలు వంటి ప్రాణం లేని వస్తువుల చిత్రపటాలు వేయటం ధర్మసమ్మతమేగాని ప్రాణమున్న వాటి చిత్రాలు వేయడం ధర్మసమ్మతం కాదు. కుక్కలు, ప్రాణం ఉన్న వస్తువుల చిత్రాలు వేయబడిన ఇండ్లలోనికి దేవుని కారుణ్య దూతలు రారు. పైగా అలాంటి ఇండ్లు దైవానుగ్రహానికి నోచుకోకుండా పోతాయి.

నుండి నాకు నా వాటాగా ఒక ఒంటె లభించింది. అదే యుద్ధంలో దైవప్రవక్త(స)కు 'ఖుముస్' (ఐదవ భాగం)గా ప్రత్యేకించబడిన దానిలోనుండి దైవప్రవక్త(స) నాకు ఒక ఒంటెను ప్రదానం చేశారు. ఆ రోజుల్లోనే దైవప్రవక్త పుత్రిక ఫాతిమా(ర.అ)ను కాపురానికి పిలిపించుకోవాలన్న ఆలోచన నాకు వచ్చింది. అందుకే బనూ కైనుకా తెగకు చెందిన ఒక కంసాలితో మాట్లాడి, ఇజ్‌ఖిర్ గడ్డిని సేకరించాలని నిర్ణయించు కున్నాను. తద్వారా వచ్చిన సొమ్ము వలీమా విందుకు ఉపయోగపడుతుందని భావించాను. నేను నా ఒంటెల కోసం తొట్లను, త్రాళ్ళను సమకూర్చుకుంటూ ఉన్నాను. ఆ సమయంలో నా ఒంటెలు ఒక అన్సారీ ఇంటి సమీపంలో కూర్చుని ఉన్నాయి. నా ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక ఒంటెల్ని తోలుకుని పోవడానికి అక్కడికి వచ్చాను. కాని ఆ ఒంటెల మూపురాలు కోయబడి ఉన్నాయి. వాటి కడుపులు చీల్చి లోపలి నుండి కాలేయాలు తీసుకోబడ్డాయి. ఈ దృశ్యాన్ని చూసిన నేను కన్నీటిని ఆపుకోలేక పోయాను. "ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారెవరు?" అని అడిగాను. 'అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడగు హమ్జా(రజి) ఈ దారుణానికి ఒడిగట్టారు. అదిగో, ఆ చావిడిలోనే ఆయన అన్సార్లతో, తన స్నేహితులతో కలసి మద్యం సేవిస్తున్నారు' అని అక్కడున్నవారు చెప్పారు. అక్కడ ఒక గాయని కూడా ఉంది. ఆమె పాటలు పాడుతూ, 'హమ్జా! బాగా బలిసిన ఈ మేలు జాతి ఒంటెల్ని నీవు చూడటం లేదా!?' అని రెచ్చగొట్టింది. అంతే, హమ్జా ఒక్క ఉదుటున లంఘించి, ఖడ్గం చేబూనారు. ఆ ఒంటెల మూపురాలు కోసేశారు. వాటి పొట్టల్ని చీల్చి లోపలి నుండి కార్జాలను తీసుకున్నారు.

అలీ(రజి) ఇలా అన్నారు : నేను సరాసరి దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళాను. ఆ సమయంలో జైద్ బిన్ హారిసా(రజి) కూడా అక్కడే ఉన్నారు. దుఃఖ వదనుణ్ణి అయి ఉన్న నన్ను చూడగానే దైవప్రవక్త(స), "ఏమయింది?" అనడిగారు. దానికి నేను, 'దైవప్రవక్తా! ఈ రోజు నాకు ఎదురయినటువంటి బాధాకరమయిన సంఘటన ఎన్నడూ ఎదురు కాలేదు. హమ్జా(రజి) నా రెండు ఒంటెల మూపురాలను కోసేశారు. వాటి పొట్టల్ని చీల్చివేశారు. ఆయన అక్కడే సమీపంలో ఒక చోట మద్యం సేవిస్తూ ఉన్నారు అని విన్నవించుకున్నాను.

దైవప్రవక్త(స) తన దుప్పటిని తెప్పించుకుని, హుటాహుటిన బయలుదేరారు. నేనూ, జైద్ బిన్ హారిసా(రజి) కూడా ఆయన వెంట వెళ్ళాము. హమ్జా(రజి) మద్యం

**సేవిస్తున్న ఇంట్లోకి వెళ్ళేందుకు ఆయన అనుమతి కోరారు. అనుమతి లభించిన మీదట లోనికి వెళ్ళి, హమ్జా చేసిన పనిని ఖండిస్తూ మందలించారు. కాని హమ్జా (రజి) ఆ సమయంలో మత్తులో ఉన్నారు. ఆయన కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆయన దైవప్రవక్త(స)పై దృష్టిని సారించారు. ఎగా దిగా చూశారు. చివరకు ప్రవక్త(స) మోకాళ్ళపై దృష్టిని నిలిపి, "మీరంతా నా తండ్రి బానిసలు..." అంటూ వాగటం మొదలెట్టారు. ఆయన స్పృహలో లేరన్న విషయాన్ని దైవప్రవక్త(స) పసిగట్టి, వెంటనే తన ఇంటికి తిరిగి వచ్చేశారు. మేము కూడా ఆయనతోపాటే వచ్చేశాము.**[1]

**624) అబ్దుల్లాహ్ బిన్ మాఖిల్ కథనం: హ్రజత్ అలీ (రజి) సహ్లా బిన్ హునైఫ్ (రజి) శవపేటిక వద్ద తక్బీర్లు పలికారు. ఆయన బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారని చెప్పారు.**[1]

**625) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారు హ్రజత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) నుండి ఉటంకించారు. హఫ్సా బిన్తె ఉమర్(ర.అ) భర్త ఖునైస్ బిన్ హుజాఫా(రజి) మరణించారు. ఖునైస్ ప్రవక్త ప్రియ సహచరులలో ఒకరు. ఆయన బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. అనంతరం ఆయన మదీనాలో చనిపోయారు.**

**ఉమర్(రజి) ఇలా అన్నారు: నాకు ఉస్మాన్ బిన్ బిన్ అఫ్ఫాన్(రజి) తారసపడినప్పుడు, నా కుమార్తె హఫ్సా విషయం ఆయన ముందు ప్రస్తావించాను. మీరు**

---

623–1. అప్పటికి ఇంకా మద్య నిషేధాజ్ఞ అవతరించలేదు. హ్రజత్ హమ్జా(రజి) తాగిన మైకంలో ఈ కిరాతకానికి ఒడిగట్టారు. తాగిన మత్తులోనే అసభ్యంగా మాట్లాడారు. మత్తు వదిలిన తరువాత ఆయనకు తన తప్పు తెలిసి వచ్చింది. దైవప్రవక్త (స) హమ్జాను పిలిపించి ఆ రెండు ఒంటెల మూల్యాన్ని హ్రజత్ అలీ(రజి)కి ఇప్పించారు. ఈ హదీసులో 'బద్ర్' ప్రస్తావన వచ్చింది. ఈ కారణంగానే ఈ హదీసును ఇక్కడ పునరావృతం చేయవలసి వచ్చింది.

624–1. ప్రతి జనాజా (శవపేటిక) వద్ద తక్బీర్లు పలకటం ఆనవాయితీయే. అయితే హ్రజత్ అలీ(రజి) ఈయన జనాజా వద్ద ఎక్కువసార్లు తక్బీర్లు పలికారు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం అయిదు లేక ఆరుసార్లు తక్బీర్లు పలికారు. ఇలా పలకటానికి కారణం ఆ మృతుడు బద్రీ సహాబీ కావటమే. కొందరు ప్రముఖుల మృతి సందర్భంగా అదనపు తక్బీర్లు పలికిన సంగతి వాస్తవమే అయినప్పటికీ, దైవ ప్రవక్త(స) వారి ఆఖరి ఆచరణ నాలుగు తక్బీర్లే. కనుక జనాజా నమాజులో నాలుగు తక్బీర్లే అన్న విషయంపై ఉమ్మత్‌లో ఏకాభిప్రాయం ఉంది.

కోరినట్లయితే ఆమెను మీకిచ్చి వివాహం జరిపిస్తానని అన్నాను. దానికి ఆయన, 'ఆలోచించి చెబుతాన'న్నారు. అందుచేత కొన్నాళ్ళపాటు ఆగిపోయాను. కొన్నాళ్ళ తర్వాత ఆయన, 'ఇప్పట్లో పెళ్ళి చేసుకునే ఆలోచన ఏదీ నాకు లేద'ని చెప్పారు.

ఉమర్(రజి) ఇలా అన్నారు: తరువాత నేను అబూబక్ర్(రజి)ను కలుసు కున్నప్పుడు ఆయన ముందు కూడా ఇదే విషయం ప్రతిపాదించాను, మీరు కోరితే నా కూతురు హఫ్సాను మీకిచ్చి నికాహ్ జరిపిస్తానని. కాని అబూబక్ర్ మౌనం వహిం చారు. సమాధానమేమీ ఇవ్వలేదు. ఆయన గారి ఈ ధోరణి నాకు ఉస్మాన్ కన్నా ఎక్కువ బాధ కలిగించింది. అందువల్ల కొన్నాళ్ళపాటు నేను ఈ విషయాన్ని ఆలోచిం చలేదు. అయితే దైవప్రవక్త(స) స్వయంగా హఫ్సాను వివాహమాడగోరినట్లు సందేశం పంపించారు. అంతే, నేను ఆమె నికాహ్ దైవప్రవక్త(స)తో జరిపించాను.

ఆ తరువాత అబూబక్ర్ (రజి)తో నేను సమావేశమైనపుడు, 'బహుశా నా వ్యవహారసరళిపై మీరు బాధ పడి ఉంటారు. ఎందుకంటే, ఇంతకుముందు మీరు హఫ్సాతో నా వివాహం గురించి ప్రతిపాదించినప్పుడు నేను మీకు సమాధానమేదీ ఇవ్వలేకపోయాన'ని అన్నారు. దానికి నేను, 'అవును. మీ ధోరణి నాకు బాధ కలిగిం చింది' అనన్నాను. అది విని అబూబక్ర్(రజి) ఇలా అన్నారు : 'నా మౌనానికి కారణ మేమిటో చెబుతాను వినండి. హఫ్సాను వివాహమాడే విషయమై దైవప్రవక్త(స) నా సలహా అడిగారు. నేను దైవప్రవక్త(స) రహస్యాన్ని విప్పలేను కదా! ఒకవేళ దైవ ప్రవక్త(స) హఫ్సాను వివాహమాడే ఉద్దేశాన్ని విరమించుకుని ఉంటే నేను తప్ప కుండా ఆమెను నికాహ్ చేసుకునేవాణ్ణి'.

**626)** అబూ మస్ఊద్ బద్రీ (ఉఖబా బిన్ అమ్ర్ అన్సారీ) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు : "మనిషి తన ఆలుబిడ్డలపై ఖర్చుపెట్టడం కూడా పుణ్యప్రదమే."

**627)** ఉర్వా బిన్ జుబైర్(రజి)గారు అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ పరిపాలనా కాలం నాటి పరిస్థితిని వివరిస్తూ ఇలా అన్నారు: ఒకరోజు ముగీరా బిన్ షూబా-రజి (ఈయన ముఆవియా తరఫున కూఫా అధికారిగా ఉన్నారు) అస్ర్ నమాజ్ చేయడానికి ఆలస్యం చేసినపుడు, జైద్ బిన్ హసన్ బిన్ అలీ తాతగారు, బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్న అబూ మస్ఊద్ ఉఖబా బిన్ అమ్ర్ అన్సారీ గారు

ముగీరాతో ఇలా అన్నారు: 'జిబ్రీల్ (నమాజ్ పద్ధతిని నేర్పడానికి) వచ్చి నమాజ్ చేసినప్పుడు దైవప్రవక్త(స) ఆయన వెనుక నమాజ్ చేశారు. అయిదు వేళల నమాజులు (ఏఏ వేళల్లో ఆచరించాలో) కూడా నేర్పారు. ఈ సంగతి మీకు తెలిసినదే. నాకు సయితం ఈ విధంగానే ఆజ్ఞాపించబడింది"– బషీర్ బిన్ అబీ మస్ఊద్ కూడా ఈ హదీసును తన తండ్రి నుండి ఉటంకించేవారు.

**628)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూ మస్ఊద్ బద్రీ (రజి) వివరించారు: అల్ బఖరా సూరాలోని రెండు ఆయత్‌లు **(285, 286)** ఎవరయితే రాత్రివేళ పఠిస్తాడో, అతని (రక్షణ)కి అవి సరిపోతాయి"– అబ్దుర్రహ్మాన్ ఇలా అంటున్నారు : నేను స్వయంగా అబూ మస్ఊద్(రజి)ను కలుసుకున్నాను. ఆ సమయంలో ఆయన కాబా గృహం ప్రదక్షిణ చేస్తున్నారు. నేను ఈ హదీసు నిర్ధారణకై ఆయన్ని అడగ్గా, ఆయన ఈ హదీసును ఇలాగే వివరించారు.

**629)** మహ్మూద్ బిన్ రబీ తెలిపిన సమాచారం ప్రకారం ప్రవక్త సహచరమాన్యులైన ఉతబాన్ బిన్ మాలిక్(రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆయన అన్సార్ వర్గానికి చెందినవారు. దైవప్రవక్త(స) సేవలో హాజరయ్యారు.[1]

**630)** ఇబ్నె షిహాబ్ ఇలా అన్నారు : బనీ సాలిమ్‌లోని మర్యాదస్తుల్లో ఒకరుగా పరిగణించబడే హుసైన్ బిన్ అన్సారీ గారిని నేను ఆ హదీసును గురించి అడిగాను– అంటే ఉతబాన్ బిన్ మాలిక్(రజి) నుండి ఉటంకించిన ముహమ్మద్ బిన్ రబీ హదీసును గురించి అడిగితే ఆయన కూడా దీనిని సత్యమని ధ్రువపరిచారు.

**631)** జుహ్రీ కథనం : నాకు అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ బిన్ రబీయా తెలిపారు. ఆయన బనీ అదీ తెగ వారిలోకెల్లా పెద్దవారు, ఆయన తండ్రి ఆమిర్ బిన్ రబీయ (రజి) దైవప్రవక్త(స)తో కలసి బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు: హజ్రత్ ఉమర్(రజి) ఖుదామా బిన్ మజ్ఊన్(రజి)ను బహ్రైన్

---

629–1. ఈ హదీసు పూర్తిగా నమాజు ప్రకరణం, బాబుల్ మసాజిద్‌లో కడిచింది. ఆ హదీసులలోని ఒక వాక్యాన్ని మాత్రం ఇమామ్ బుఖారీ(రహ్మ) ఇక్కడ తీసుకున్నారు. ఎందుకంటే ఉతబాన్ బిన్ మాలిక్(రజి) కూడా బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారిలో ఒకరు అని ఆయన చెప్పదలిచారు.

**అధికారిగా నియమించారు. ఖుదామా కూడా బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారిలో ఒకరు. ఈ ఖుదామా అబ్దుల్లాహ్ బిన్ ఉమర్‌కు, ఉమ్ముల్ మోమినీన్ హఫ్సా (ర.అ)కు మేనమామ అవుతారు.**

**632) సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ అందజేసిన సమాచారం ప్రకారం రాఫె బిన్ ఖదీజ్(రజి) గారు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కు ఇలా తెలిపారు: బద్ర్ యుద్ధంలో పాల్గొన్న తన పినతండ్రులిద్దరూ (జహీర్, మజ్‌హర్ రాఫె బిన్ అదీ బిన్ జైద్ అన్సారీ కొడుకులు) తనకు ఏమని తెలియజేశారంటే, భూమిని అద్దెకు ఇవ్వటాన్ని దైవప్రవక్త (స) వారించారు. 'మరి మీరు అద్దెకు ఇస్తున్నారు కదా!' అని నేను (జుహ్రీ) సాలిమ్‌ను అడగ్గా, 'అవును, రాఫె తన ఆత్మపై వైపరీత్యానికి ఒడిగట్టార'ని ఆయన జవాబిచ్చారు.[1]**

**633) రిఫాఅ బిన్ రాఫే అన్సారీ (రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొనటాన్ని తాను చూశానని అబ్దుల్లాహ్ బిన్ షద్దాద్ బిన్ హాది లైసీ తెలిపారు.**

**634) మిస్వర్ బిన్ మఖ్రమా(రజి) కథనం : బనీ ఆమిర్ బిన్ లూవై తెగ వారితో మైత్రీ సంబంధం కలిగి ఉన్న అమ్ర్ బిన్ ఔఫ్(రజి) దైవప్రవక్త(స)తో కలసి బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. (ఆయన ఇలా వివరించారు) 'దైవప్రవక్త(స) బహ్‌రైన్ నుండి జిజ్‌యా సొమ్మును తీసుకురావటానికి అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి)ను పంపారు. అంతకుముందు ప్రవక్త మహనీయులు(స) బహ్‌రైన్ వాసులతో సంధి చేసుకుని అలా బిన్ హజ్రమీ(రజి)ని అక్కడి నాయకునిగా నియమించారు. పిదప అబూ ఉబైదా (రజి) బహ్‌రైన్ నుండి లక్ష దిర్హములను తీసుకుని వచ్చారు. అబూ ఉబైదా రాకడ గురించి తెలుసుకున్న అన్సార్లు ఫజ్ర్ నమాజ్‌ను దైవప్రవక్త(స)తోపాటే**

---

632-1. విషయాన్ని అర్థం చేసుకోవటంలో ఆయన పొరబడ్డారు. వాస్తవానికి ప్రవక్త మహనీయులు(స) వారించినది భూ ఉత్పత్తుల్ని అద్దెకు ఇవ్వటాన్ని మాత్రమే. కాని నగదు వ్యవహారంపై వారించలేదు. దీనికి సంబంధించిన వివరాలు 'కితాబుల్ మజారియా'లో ఇంతకుముందు వచ్చాయి. ఈ హదీసులో బద్ర్ ప్రస్తావన వచ్చింది. ఈ కారణంగానే దీనిని ఇక్కడ పొందుపరచవలసి వచ్చింది.

పూర్వం అరబ్బులు తమ పొలాలను కౌలుకు ఇస్తున్నప్పుడు కాలువల ప్రక్కన ఉన్న భూభాగాన్ని లేదా పంట బాగా పండే భూభాగాన్ని తమ కొరకు ప్రత్యేకించు కుని, నిస్సారమైన నేలను కౌలుదారులకు ఇచ్చేవారు. ఈ అన్యాయాన్ని దైవ ప్రవక్త(స) వారించారు.

ఆచరించారు. దైవప్రవక్త(స) నమాజును ముగించిన తరువాత అన్సార్లంతా ఆయన ఎదుట గుమిగూడారు. దైవప్రవక్త(స) వారిని చూసి, చిరునవ్వు చిందించారు. "అబూ ఉబైదా (రజి) సొమ్ము తీసుకువచ్చిన సంగతి బహుశా మీకు తెలిసిపోయిందను కుంటాను" అన్నారాయన. దానికి అన్సార్లు, 'అవును, ఓ దైవప్రవక్తా!' అని విన్నవించుకున్నారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(స) వారినుద్దేశించి ఇలా ఉద్బోధించారు : "అలాగైతే మీకు శుభవార్త! దేనివల్ల మీకు సిసలైన సంతోషం కలుగుతుందో దానిని ఆశించండి. అల్లాహ్ సాక్షిగా! మీ పేదరికం గురించి నేను భయపడటం లేదు. మీ పూర్వీకుల మాదిరిగా మీపైన కూడా ప్రపంచం ఎక్కడ విస్తృతం చేయబడుతుందో, మరి పూర్వీకుల మాదిరిగానే మీరునూ పరస్పరం ఎక్కడ ఈర్ష్య చెందుతారోనని నేను భయపడుతున్నాను. దాని కారణంగానే మీ పూర్వీకులు అంతమొందించబడ్డారు. మీరు కూడా దాని మూలంగా అంతమొందించబడతా రేమోనని నాకు భయంగా ఉంది."[1]

**635)** నాఫె కథనం: అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) మొదట్లో అన్ని రకాల పాముల్ని చంపేసేవారు. అయితే బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబి అబుల్ బాబా (బషీర్ బిన్ అబ్దుల్ ముంజిర్-రజి); "ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇంటి ప్రాంగణంలో సంచరించే శ్వేత లేదా పలుచని పాముల్ని చంపటాన్ని వారించార"ని అన్నప్పటి నుండీ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) అలాంటి పాముల్ని చంపటం మాను కున్నారు.[1]

---

634-1. ఈ హదీసు జిజ్యా అధ్యాయంలో ఇంతకుముందు వచ్చింది. అమ్ర్ బిన్ ఔఫ్ బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబీ అని తెలియజేసేందుకే దీనిని ఇక్కడ సేకరించటం జరిగింది.

635-1. ఎందుకంటే శ్వేత సర్పాల్లో విషం ఉండదు. విషం లేని పాములు ఉండటం వల్ల ఒక విధంగా పర్యావరణానికి లాభమే. ఎందుకంటే అవి విష వాయువుల్ని పీల్చి మంచి వాయువుల్ని బయటికి వదులుతాయి. వృక్షాలకున్న గుణమే వీటికీ ఉంటుంది. ఈ హదీసు ఇంతకుముందు సృష్టి ఆరంభ ప్రకరణంలో కూడా వచ్చింది.

హాఫిజ్ ఇబ్నె హజర్ ప్రకారం అబుల్ బాబా బద్ర్ యుద్ధం చేయలేదుగాని

**636) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు : అన్సార్ వర్గానికి చెందిన కొంతమంది సహచరమాన్యులు ప్రవక్త మహనీయుల(సఅసమ్) సన్నిధికి వచ్చి, 'తమరు గనక ఆనతిని ఇస్తే, మేము మా మేనల్లుడు అబ్బాస్ పరిహారాన్ని (ఫిదియాను) క్షమించి వదలి పెడతామ'ని విన్నవించుకున్నారు. కాని దైవప్రవక్త అందుకు అంగీకరించలేదు. పైగా ఇలా అన్నారు : "దైవసాక్షిగా! ఆయన నుండి రావలసిన ఫిదియాలో ఒక్క దిర్హమ్‌ను కూడా వదలిపెట్టకండి."[1]**

**637) బనీ జుహ్రాతో మైత్రి కలిగి ఉన్న మిఖ్దాద్ బిన్ అమ్ర్ కిందీ బద్ర్ యుద్ధంలో దైవప్రవక్త(స)తో కలసి పాల్గొన్నారు. ఆయన ఇలా వివరించారు– 'దైవప్రవక్తా! చెప్పండి, నేను (యుద్ధంలో) ఒక అవిశ్వాసితో తలపడతాను. ఇద్దరం పోరాటం సాగిస్తాము. ఆ అవిశ్వాసి తన ఖడ్గంతో నా చేయి కూడా నరికేస్తాడు. ఆ తర్వాత అతను ఒక చెట్టు ఆసరాలోకెళ్ళి 'నేను ముస్లింనయ్యాను' అంటాడు. అట్టి పరిస్థితిలో (అతను కలిమాను పఠించిన మీదట) నేనతన్ని చంపగలనా?' అని నేను సందేహపడగా,"లేదు. నీవు అతన్ని చంపకూడదు" అని ఆయన(స) సెలవిచ్చారు. మిఖ్దాద్, 'దైవప్రవక్తా! అతను నా చెయ్యి ఒకదాన్ని నరికిన మీదట ఇలా అంటాడు కదా' అని విన్నవించుకోగా, "అయినా సరే, అతన్ని చంపకూడదు.**

---

దైవప్రవక్త(స) ఈయన కోసం యుద్ధప్రాప్తిలో వాటా కల్పించారు. ఆ విధంగా ఈయన కూడా బద్రీ సహాబీ అయ్యారు.

636–1. హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ దైవప్రవక్త(స)కు స్వయాన పినతండ్రి. బద్ర్ యుద్ధంలో యుద్ధ ఖైదీగా పట్టుబడి, మదీనాకు తీసుకురాబడ్డారు. అన్సారుల్లు ఆయన్ని 'మా మేనల్లుడు' అని అనటంలోని ఔచిత్యం ఏమిటంటే, ఆయన గారి తాతమ్మ, అంటే అబ్దుల్ ముత్తలిబ్ తల్లి బనూ నజ్జార్ తెగకు చెందిన మహిళ. ఈ బంధుత్వం కారణంగానే అన్సారుల్లు అబ్బాస్ నుండి రావలసిన నష్టపరిహారాన్ని మాఫీ చేయాలని అనుకున్నారు. కాని ఎన్నో పరమార్థాల దృష్ట్యా దైవప్రవక్త(స) అందుకు అంగీకరించలేదు. పైగా ఆయన నుండి పూర్తి ఫిదియాను వసూలు చేయమని తాకీదు చేశారు.

ఆ విధంగా బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి ఆస్కారం లేకుండా చేశారు. అదీగాక అబ్బాస్ ధనవంతుడు. అందుకే ఆయన తన ఫిదియాతో పాటు తన ఇద్దరు భ్రాతృజుల ఫిదియాను కూడా చెల్లించాలని దైవప్రవక్త(స) ఆదేశించారు.

**ఎందుకంటే నీవు గనక అతన్ని చంపినట్లయితే, అతన్ని చంపక ముందు నీవు ఏ స్థితిలో ఉండేవాడివో ఇప్పుడు అతను ఆ స్థితిలో ఉంటాడు. కాగా; నీ స్థానం అతను కలిమా పఠించక ముందు ఉండే చోట ఉంటుంది."[1]**

**638) హజ్రత్ అనస్(రజి) తెలిపారు : బద్ర్ సంగ్రామం జరిగిన రోజున ప్రవక్త మహనీయులు(సఅసమ్), "అబూ జహ్లాకు పట్టిన దుర్గతి ఎట్టిదో చూసి వచ్చే వారెవరు?" అని అడిగారు. ఆ మాట విని అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కదన రంగంలోకి వెళ్ళారు. అఫ్రా కొడుకులు ఇద్దరూ కలసి అబూ జహ్లాను కడతేర్చారు. అతను కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉండగా, 'అబూ జహ్లావి నువ్వేనా?" అని ఇబ్నె మస్ఊద్(రజి) అడిగారు. దానికి సమాధానంగా అబూ జహ్లా, 'నీవు చంపిన వారిలో నాకన్నా గొప్పవాడెవడయినా ఉన్నాడా?' అన్నాడు. లేదా ఇలా అన్నాడు: 'ఇతని (నా)కన్నా గొప్పవాణ్ణి ఇతని జాతి చంపగలిగిందా?' అబూ మిజ్లజ్ ప్రకారం, 'అయ్యో! ఒక కర్షకుడు గాకుండా మరెవరయినా నన్ను చంపి ఉంటే బాగుండేది కదా!'[1] అని అబూ జహ్లా అన్నాడు.**

**639) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) హజ్రత్ ఉమర్(రజి) నుండి ఉటంకించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) పరమపదించినప్పుడు నేను అబూబక్ర్ (రజి)తో, "మీరు మమ్మల్ని అన్సార్ సోదరుల వద్దకు తీసుకుపొండి (వాళ్ళు అక్కడ ఏం చేస్తున్నారో చూద్దాం)" అని అన్నాను. తరువాత మేము వెళుతుండగా దారిలో మాకు ఇద్దరు అన్సార్ సజ్జనులు తారసపడ్డారు. వారిద్దరూ బద్ర్ యుద్ధంలో**

---

637–1. అంటే 'ఖిసాస్' (రక్తపరిహారం) కింద ఇప్పుడు నిన్ను వధించటం సమ్మతం అవుతుంది.

638–1. చూశారా! గుండెలోని ప్రాణం గొంతు వరకు వచ్చిన మీదట కూడా అబూ జహ్లా లోని అజ్ఞాన కాలపు అహంభావం, నిమ్నోన్నతా భేదభావం చావలేదు. ఇస్లామ్ వచ్చినది అసలు ఇటువంటి అహంభావాలను తుదముట్టించడానికే. కాని ఇస్లామ్ అనుయాయులమని చెప్పుకునే కొందరు 'అరిస్టోక్రాట్స్'లోనూ నేడు అక్కడక్కడా, అప్పుడప్పుడూ ఇలాంటి అజ్ఞాన కాలపు గబ్బు వస్తూ ఉంటుంది. ఇది ఎంతైనా శోచనీయం.

అహంభావం కారణంగానే అబూజహ్లా ఇస్లామ్‌ను స్వీకరించలేదు. కాని అతని కథ సమాప్తమైనది ఎవరిచేత? ఇద్దరు కుర్రాళ్ళ చేత?

పాల్గొన్నవారే– ఉబైదుల్లాహ్ ఇలా అన్నారు: తరువాత నేను ఈ హదీసును ఉర్వా బిన్ జుబైర్ ముందు ప్రస్తావించగా, ఆ ఇద్దరు సహచరమాన్యులు ఉవైమ్ బిన్ సాయిదా, మాన్ బిన్ అదీ (రజిఅల్లాహు అన్హుమా) అని ఆయన చెప్పారు.

**640)** ఖైస్ బిన్ అబీ హాజిమ్ కథనం: బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబాకు[1] – ఒక్కొక్కరికి– సాలీనా అయిదు వేల చొప్పున పెన్షన్ ఇవ్వబడేది.[2] ఉమర్ (రజి) ఇలా అన్నారు: “నేను వారికి (బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి) తరువాత కాలంలో విశ్వసించిన సహాబాపై ప్రాధాన్యతనిస్తాను.”[3]

**641)** ముహమ్మద్ బిన్ జుబైర్ బిన్ ముత్యిమ్ తన తండ్రి నుండి ఉటంకించారు. ఆయన ఇలా అనేవారు– ప్రవక్త మహనీయులు (సఅసమ్) మగ్రిబ్ నమాజులో అత్తూర్ సూరా పారాయణం చేయటం నేను విన్నాను[1]. నా హృదయంలో విశ్వాసం (ఈమాన్) నాటుకున్న మొదటి సందర్భం అది.

ప్రవక్త మహనీయులు (స) బద్ర్ యుద్ధ ఖైదీలను గురించి ఈ విధంగా వక్కాణించారని జుబైర్ బిన్ ముత్యిమ్(రజి) తెలిపారు : “ముత్యిమ్ బిన్ అదీ బ్రతికి ఉండి, తుచ్ఛులైన ఈ ఖైదీల విషయంలో సిఫారసు చేసి ఉంటే, ఆయన మాటపై నేను వీళ్ళకు స్వేచ్ఛను ప్రసాదించేవాణ్ణి.”

సయీద్ బిన్ ముసయ్యిబ్ ఇలా అన్నారు : తొలిసారి కల్లోలం రేకెత్తినప్పుడు (హజ్రత్ ఉస్మాన్–రజి అమరగతినొందినప్పుడు) బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబీలలో ఏ ఒక్కరూ మిగల్లేదు. మలిసారి కల్లోలం హర్రాలో జరిగినప్పుడు, అది హుదైబియా సహచరమాన్యులలో ఏ ఒక్కరినీ వదల్లేదు. మూడవసారి కల్లోలం పొడసూపినప్పుడు, ప్రజలలోని మంచిని తుడిచిపెట్టనంత వరకూ అది సమసిపోలేదు.

---

640–1. అంటే ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) హయాంలో.

640–2. ఏడాదికి అయిదువేల చొప్పున రెండుసార్లు (మొత్తం పదివేల దిర్హములు) చెల్లించబడేవి.

640–3. దీనినిబట్టి బద్రీ సహాబా విశిష్టత ఎటువంటిదో ద్యోతకమవుతోంది. హజ్రత్ ఉమర్(రజి) ముహాజిర్ సహాబాకు ఏడాదికి పదివేల చొప్పున, అన్సార్ సహాబాకు ఎనిమిదివేల చొప్పున పెన్షన్ చెల్లించేవారని, దైవప్రవక్త(స) సతీమణులకు ఏడాదికి 24 వేల చొప్పున చెల్లించేవారని మరో ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది.

**642) ఉర్వా బిన్ జుబైర్, సయీద్ బిన్ ముసయ్యిబ్, అల్ఖమా బిన్ వక్కాస్, ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్– వీరు నలుగురూ దైవప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (ర.అ)పై మోపబడిన అపనిందలోని ఒక్కో భాగాన్ని (తాము విన్నది) తనకు తెలియ జేశారని జుహ్రీ చెప్పారు : వారి ప్రకారం హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా తెలిపారు– "నేనూ, ఉమ్మె మిస్తహ్– ఇద్దరం కాలకృత్యాలు తీర్చుకోవడానికి (రాత్రిపూట) బయటకు వెళుతుండగా ఉమ్మె మిస్తహ్(ర.అ) దుప్పటి కాళ్ళలో చిక్కుకుని ఆమె క్రింద పడిపోయారు. ఆ సమయంలో అకస్మాత్తుగా ఆమె నోట, 'మిస్తహ్ పాడుగాను' అనే మాట వెలువడింది. దానికి నేను, 'నీవు చెప్పిన మాట మంచిది కాదు. బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న వ్యక్తి గురించి ఇలా అనవచ్చునా?[1] అన్నాను– తరువాత ఆమె ఆ వృత్తాంతమంతా వినిపించారు.**

---

641–1. బద్ర్ యుద్ధ సందర్భంగా ఖైదీలుగా పట్టుబడిన వారిలో జుబైర్ బిన్ ముత్యిమ్ (రజి) ఒకరు. మస్జిదె నబవీకి సమీపంలో ఆయన్ని నిర్బంధించి ఉంచినప్పుడు, ఆయన మగ్రిబ్ నమాజ్‌లో దైవప్రవక్త(స) ద్వారా తూర్ సూరా పారాయణం విని, అమితంగా ప్రభావితులై ఇస్లామ్ స్వీకరించారు. ఈ అధ్యాయంలోని ప్రధానాంశం ఇదే.

ఇక ముత్యిమ్ బిన్ అదీ ఒకప్పుడు దైవప్రవక్త(స)కు ఒక మేలు చేసి ఉన్నాడు. దైవప్రవక్త(స) తాయిఫ్ నుండి దుఃఖ వదనులై తిరిగి వస్తున్నప్పుడు ముత్యిమ్ బిన్ అదీ ఆయన(స)కు రక్షణ కల్పించారు. తన నలుగురు కుమారుల్ని ఆయు ధాలు ధరించి ఉన్న స్థితిలో దైవప్రవక్త(స)కు అంగ రక్షకులుగా పంపించాడు. దైవప్రవక్త(స) కాబా ప్రాంగణంలో ప్రవేశించినప్పుడు ముత్యిమ్ కొడుకులు నలుగురూ నాలుగు మూలలా నిలబడి భద్రత కల్పించారు. ఈ దృశ్యాన్ని చూసిన ఖురైషులు భయంతో 'మనం ముత్యిమ్ కల్పించిన రక్షణను భగ్న పరచలేము' అని పలికారు.

ఇకపోతే హదీసులో ప్రస్తావనకు వచ్చిన మొదటి మూడు కల్లోలాల్లో మొదటిది తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(రజి) కాలంలో పొడసూపింది. ఆ ఉపద్రవానికి హజ్రత్ ఉస్మాన్(రజి) బలైపోయారు.

642–1. మిస్తహ్ (రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబీలలో ఒకరు అన్నదే ఈ హదీసులోని ప్రధానాంశం. హజ్రత్ ఆయిషా (ర.అ)పై కపటులు మోపిన అపనింద (ఇఫ్క్ సంఘటన) ఇంతకుముందు వివరంగా వచ్చింది.

**643)** మూసా బిన్ ఉఖ్బా ఇబ్నె షిహాబ్ నుండి ఉటంకించారు : అది దైవ ప్రవక్త(సఅసమ్) యుద్ధాలకు సంబంధించిన వృత్తాంతం– బద్ర్ యుద్ధ మైదానంలో హతులైన అవిశ్వాసుల మృతదేహాలు బావిలో పడవేయబడుతున్నప్పుడు దైవ ప్రవక్త(స) వారినుద్దేశించి, "మీకు మీ ప్రభువు చేసిన వాగ్దానాన్ని మీరు పొందారా?" అని అడిగారు. దానిపై కొంతమంది సహచరమాన్యులు (వారిలో హజ్రత్ ఉమర్ కూడా ఉన్నారు) 'దైవప్రవక్తా! తమరు మృతులను పిలుస్తున్నారా?' అని (ఆశ్చ ర్యంతో) అడిగారు. దానికి దైవప్రవక్త(స), "నేను వీళ్ళతో ఏదైతే అంటున్నానో, దానిని వీరు మీకన్నా బాగా వింటున్నారు" అని పలికారు. బద్ర్ యుద్ధానంతరం ఆ యుద్ధంలో పాల్గొన్న ఖురైష్ (ముహాజిర్) సహాబీలకు దైవప్రవక్త(స) విజయ ధనంలో వాటా కల్పించారు. ఆ లబ్దిదారుల సంఖ్య **81.** జుబైర్ (రజి) ఆధారంగా ఉర్వా బిన్ జుబైర్ ఇలా అన్నారు : నేను (ముహాజిర్ల) ఆ వాటాలను పంపిణీ చేశాను. వాటి సంఖ్య వంద. ఈ సంఖ్య ఖచ్చితంగా ఎంత అన్నది అల్లాహ్‌కే బాగా తెలుసు.

**644)** హజ్రత్ జుబైర్ (రజి) తెలిపారు: బద్ర్ యుద్ధ దినాన ముహాజిర్ల కొరకు నూరు వాటాలు కేటాయించబడ్డాయి.

## అధ్యాయం : 13

## బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహచరమాన్యుల పేర్లు

అబూ అబ్దుల్లాహ్ (ఇమామ్ బుఖారీ– రహ్మ) తన సమగ్ర గ్రంథం 'సహీహ్ బుఖారీ'లో, బద్ర్ యుద్ధంలో పాల్గొన్న కొందరు సహాబా పేర్లను నమోదు చేశారు–

**1)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లమ్) **2)** అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) **3)** అయాస్ బిన్ బుకైర్(రజి) **4)** అబూబక్ర్ సిద్దీఖ్ బానిస యగు బిలాల్ బిన్ రబాహ్(రజి) **5)** హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి) **6)** హాతిబ్ బిన్ అబీ బల్తఆ (రజి) **7)** అబూహుజైఫా బిన్ ఉతబా బిన్ రబీయ (రజి) **8)** హారిసా బిన్ అన్సారీ(రజి)– ఈయన్ని హారిసా బిన్ సురాఖా అని కూడా అంటారు. ఈయన పిన్న వయసులోనే కదన రంగాన్ని చూడటానికి వెళ్ళి అమరగతి నొందారు **9)** ఖుబైబ్ బిన్ అదీ అన్సారీ (రజి) **10)** ఖునైస్ బిన్ హుజాఫా సహ్మీ (రజి) **11)** రిఫాఅ బిన్ రాఫే అన్సారీ(రజి) **12)** రిఫాఅ బిన్ అబ్దుల్ ముంజిర్ అబుల్ బాబా అన్సారీ (రజి) **13)** జుబైర్ బిన్ అవ్వామ్(రజి) **14)** జైద్ బిన్ సహ్లొ

**అబూతల్హా అన్సారీ (రజి) 15) అబూ జైద్ అన్సారీ (రజి) 16) సాద్ బిన్ మాలిక్ (సాద్ బిన్ అబీ వక్కాస్–రజి) 17) సాద్ బిన్ ఖౌలా (రజి) 18) సయీద్ బిన్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్ (రజి) 19) సహ్ల్ బిన్ హునైఫ్ అన్సారీ (రజి) 20) జుహైర్ బిన్ రాఫె అన్సారీ (రజి) 21) ఈయన సోదరుడు అబ్దుల్లాహ్ బిన్ ఉస్మాన్ (రజి) 22) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ హుజలీ (రజి) 23) ఉతబా బిన్ మస్ఊద్ హుజలీ (రజి) 24) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ జుహ్రీ (రజి) 25) ఉబైదా బిన్ హారిస్ ఖురషీ (రజి) 26) ఉబాదా బిన్ సామిత్ అన్సారీ (రజి), 27) ఉమర్ బిన్ ఖత్తాబ్ అదవీ(రజి), 28) ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ ఖురషీ(రజి),– బద్ర్ యుద్ధం జరిగిన రోజుల్లో దైవప్రవక్త పుత్రిక అస్వస్థతకు గురై ఉండటం వల్ల ఆమెను కనిపెట్టుకుని ఉండటానికి ఉస్మాన్‌ను మదీనాలోనే వదలి వెళ్ళటం జరిగింది. అయితే విజయ ధనంలో దైవప్రవక్త(స) ఉస్మాన్‌కు కూడా వాటా కల్పించారు 29) అలీ బిన్ అబీ తాలిబ్ హాష్మి (రజి), 30) బనీ ఆమిర్ లూయీ మద్దతుదారులైన అమ్ర్ బిన్ ఔఫ్ (రజి), 31) ఉఖ్బా బిన్ అమ్ర్ అన్సారీ(రజి), 32) ఆమిర్ బిన్ రబీయా అనజీ (రజి), 33) ఆసిమ్ బిన్ సాబిత్ అన్సారీ (రజి), 34) ఉవైమ్ బిన్ సాయిదా అన్సారీ (రజి), 35) ఉతబాన్ బిన్ మాలిక్ అన్సారీ(రజి), 36) ఖుదామా బిన్ మజ్‌వూన్ (రజి), 37) ఖతాదా బిన్ నోమాన్ అన్సారీ (రజి), 38) ముఆజ్ బిన్ అమ్ర్ బిన్ జుమూహ్ (రజి), 39) మవూజ్ బిన్ అఫ్రా (రజి), 40) ఈయన సోదరుడు ముఆజ్ (రజి), 41) మాలిక్ బిన్ రబీయా అబూ ఉసైద్ అన్సారీ(రజి), 42) మురారా బిన్ రబీ అన్సారీ (రజి), 43) మఅన్ బిన్ అదీ అన్సారీ (రజి), 44) మిస్తహ్ బిన్ ఉసాసా (రజి), 45) మిఖ్దాద్ బిన్ అమ్ర్ కిందీ (రజి), 46) హిలాల్ బిన్ ఉమయ్యా అన్సారీ (రజి).**[1]

---

13–1. బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబా అందరి పేర్లు ఇక్కడ ప్రస్తావించబడలేదు. పై హదీసులలో వచ్చిన సహాబా పేర్లు మాత్రమే ఇక్కడ పేర్కొనబడ్డాయి.

ప్రవక్త మహనీయులు(స)తో కలిపి మొత్తం 46 మంది పేర్లు మాత్రమే ఇక్కడ పేర్కొనబడ్డాయి. హాఫిజ్ అబుల్ ఫతహ్ ఖురైషులలోని 94 మంది, ఖజ్రజ్ తెగలోని 195 మంది, ఔస్ తెగలోని 74 మందిని కలుపుకుని మొత్తం 363 మంది పేర్ల జాబితాను రూపొందించారు.

## అధ్యాయం :14

## బనూ నజీర్ యూదుల గురించి

**ఇద్దరు ముస్లింల రక్తశుల్కం (దియత్) విషయమై మాట్లాడటానికి దైవ ప్రవక్త(సఅసమ్) బనూ నజీర్ వాడకు వెళ్ళటం. వారు దైవప్రవక్త(స) పట్ల విశ్వాస ఘాతుకానికి పాల్పడటం.[1]**

**బనూ నజీర్ యుద్ధం బద్ర్ యుద్ధం జరిగిన ఆర్నెల్ల తర్వాత ఉహుద్ యుద్ధానికి పూర్వం జరిగిందని జుహ్రీ ఉర్వాతో చెప్పారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "అల్లాహ్‌యే గ్రంథ ప్రజలలోని సత్య తిరస్కారులను మొదటి దెబ్బలోనే వారి ఇండ్ల నుంచి గెంటివేశాడు". *(అల్ హష్ర్: 2)***

**ఇబ్నె ఇస్‌హాఖ్ పరిశోధన ప్రకారం ఈ యుద్ధం బైరె మవూనా, ఉహుద్ యుద్ధాల తర్వాత జరిగింది.**

**645) హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: బనూ నజీర్, బనూ ఖురైజా తెగలకు చెందిన యూదులు (ఒడంబడికను ఉల్లంఘించి) దైవప్రవక్త(స)తో యుద్ధం కొనిదెచ్చుకున్నారు. వారి నమ్మకద్రోహం కారణంగా దైవప్రవక్త(స) బనూ నజీర్‌ను మదీనా నుండి బహిష్కరించారు. అయితే బనూ ఖురైజా వారిని బహిష్కరించకుండా, వారికి రాయితీ ఇచ్చారు. కాని బనూ ఖురైజా యూదులు కూడా (కందక యుద్ధ సందర్భంగా) నమ్మకద్రోహం చేసి తమ శత్రుత్వాన్ని చాటుకున్నారు. అందువల్ల ఆయన(స) వారి పురుషులను వధింపజేసి, వారి స్త్రీలను, పసివారిని, వారి ఆస్తి పాస్తులను ముస్లింల మధ్య పంపిణీ చేశారు. కేవలం కొద్దిమంది బనూ ఖురైజా వారికి మాత్రమే ఈ శిక్ష నుండి వేరుగా ఉంచారు. ఎందుకంటే వారు దైవ**

---

14-1. దియత్ (రక్తశుల్కం) వ్యవహారంలో బనూ నజీర్ యూదుల సహాయం పొందడానికి దైవప్రవక్త(స) అక్కడికి వెళ్లారు. అయితే ఆ మోసగాళ్ళు దైవప్రవక్తను, ఆయన సహచరులను గోడ ప్రక్కన కూర్చోబెట్టి, గోడ మీది నుంచి ఒక పెద్ద రాయిని ఆయన(స)పై పడవేసి చంపాలని కుట్ర పన్నారు. అల్లాహ్ తన దూత జిబ్రీల్ ద్వారా తన ప్రవక్తకు ఈ విషయం తెలియపరిచాడు. దాంతో దైవప్రవక్త (స) వెంటనే మదీనాకు తిరిగి వచ్చేశారు. ఈ విద్రోహానికి గాను బుద్ధి చెప్పడానికి దైవప్రవక్త(స) బనూ నజీర్ వాడపై దండెత్తారు.

**ప్రవక్త(స)ను శరణు జొచ్చి, ఇస్లామ్ స్వీకరించారు. ఈ విధంగా ఆయన(స) యూదులందరినీ మదీనా నుండి గెంటివేశారు. అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) తెగ వారయిన బనూ ఖైనుఖా యూదుల్ని, బనీ హారిసాను కూడా మదీనా నుండి బహిష్కరించారు.[1]**

**646) సయీద్ బిన్ జుబైర్ తెలిపారు : నేను మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) సమక్షంలో 'హష్ర్ సూరా' అని అన్నప్పుడు, "దానిని 'నజీర్ సూరా' అని అనండి. (ఎందుకంటే అది బనూ నజీర్‌పై సైనికచర్య నేపథ్యంలో అవతరించింది)" అని ఆయన అన్నారు.**

**647) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు : అన్సార్ సహాబా ప్రవక్త మహనీయుని (సఅసమ్) కొరకు కొన్ని ఖర్జూర చెట్లను ప్రత్యేకించేవారు (అంటే పంట చేతికి వచ్చినప్పుడు వాటి పండ్లను దైవప్రవక్తకు కానుకగా పంపేవారు). కాని అల్లాహ్ బనూ ఖురైజా, బనూ నజీర్ తెగలపై విజయాన్ని ప్రసాదించిన మీదట దైవప్రవక్త(స) ఆ ఖర్జూర పండ్లను– మృదువుగా– వాపసు చేశారు.**

**648) మహనీయ ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) బనూ నజీర్ ఖర్జూర తోటలను కాల్చివేశారు. వారి చెట్లను నరికి వేయించారు. ఈ తోటలు 'బువైరా'[1]లో ఉండేవి. దానిపై ఈ ఆయత్ అవతరించింది : "మీరు ఖర్జూరపు ఏ చెట్లను నరికివేశారో లేక ఏ ఖర్జూరపు చెట్లను వాటి వ్రేళ్ళపై యథాతథంగా ఉండనిచ్చారో, ఇదంతా అల్లాహ్ ఆజ్ఞతోనే జరిగింది."**

**649) హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) బనూ నజీర్ తోటల్ని కాల్చివేశారు. ఈ చర్యపై వ్యాఖ్యానిస్తూ హస్సాన్ బిన్ సాబిత్ (రజి) ఈ కవిత చెప్పారు.**

---

645–1. వెన్నుపోటు చర్యలకు యూదులు పెట్టింది పేరన్న దానికి చరిత్రే సాక్ష్యం. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అగ్రరాజ్యాల అండదండలతో ఇస్రాయీల్ రాజ్యాన్ని స్థాపించుకుని, యూదులు పాలస్తీనా ప్రజల గుండెలపై ఎలా గునపం గుచ్చుతున్నారో లోకానికి ఎరుకే.

648–1. *'బువైరా' అనేది బనూ నజీర్ ఖర్జూర తోట పేరు. అది మదీనా నగరం పొలిమేరల్లో ఉండేది.*

**అనువాదం :**

**"బువైరాలో వ్యాపించిన అగ్ని కీలల్ని బనూ లూయి జనులు (ఖురైషులు) చాలా సులువుగా భరించారు."**

**దీనికి సమాధానంగా అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ చెప్పిన కవిత ఇది :**

**"మదీనాలో ఎల్లకాలం నిప్పు రాజుకుని ఉండేలా దేవుడు శిక్ష విధించుగాక! ఆ నగర పరిసరాల్లో సతతం ఇలాగే నిప్పులు చిమ్ముతూ ఉండాలి. మనలో ఎవరు ఈ బువైరా స్థలానికి దూరంగా ఉంటారో మీకు అనతి కాలంలోనే తెలిసిపోతుంది. ఎవరి ప్రదేశానికి నష్టం వాటిల్లిందో కూడా మీకు తెలిసిపోతుంది."[1]**

**650) జుహైరీ తెలియజేశారు. ఆయనకేమో మాలిక్ బిన్ ఔస్ బిన్ హదసాన్ నుసైరీ తెలియపరిచారు– ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఈయన్ని పిలిచారు. (ఈయన అమీరుల్ మోమినీన్ సమక్షంలో ఉండగానే) అమీరుల్ మోమినీన్ సేవకుడు యర్ఫా వచ్చి, 'ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, జుబైర్ బిన్ అవ్వామ్, సాద్ బిన్ అబీ వక్కాస్(రజిఅల్లాహు అన్హుమ్)లు లోనికి రావడానికి అనుమతి కోరుతున్నారు. మీ తరఫున అనుమతి ఉందా?' అని అడిగాడు. "సరే, వారిని లోనికి రమ్మను" అని అమీరుల్ మోమినీన్ అన్నారు.**

**కొన్ని క్షణాల తర్వాత యర్ఫా మళ్ళీ వచ్చి, 'అలీ, అబ్బాస్ (రజిఅల్లాహు అన్హుమా)లు కూడా లోనికి రాదలుస్తున్నారు. వారికి కూడా అనుమతి ఉందా?' అని అడిగాడు. "అవును. వారిని కూడా లోపలికి రమ్మను" అని ఉమర్(రజి) ఆదేశించారు. వారిద్దరు కూడా లోనికి వచ్చిన తరువాత అబ్బాస్(రజి) ఇలా విన్నవించుకున్నారు: 'అమీరుల్ మోమినీన్! నాకూ – ఈయన గారికి (అలీ–రజికి) మధ్య**

---

649–1. ఈ సైనిక చర్యకుముందు బనూ నజీర్ యూదులకు– ఖురైషులకు మధ్య మైత్రీ ఒప్పందం ఉండేది. హజ్రత్ హస్సాన్ కవితలోని అంతరార్థం ఖురైషులను ఉడికించటం. అంటే ఒకవైపున బనూ నజీర్ తోట కాలుతుంటే ఖురైషులు గోళ్ళు గిల్లుకుంటూ తమ చేతకానితనాన్ని చాటుకున్నారన్నది దాని అర్థం. దీనికి సమాధానంగా అబూ సుఫ్యాన్ తన కవిత్వంలో ముస్లింలను శపించాడు. ఎల్లకాలం మదీనా నగరం అగ్నికీలల మధ్యన ఉండాలని అన్నాడు. కాని అబూ సుఫ్యాన్ శాపం తిప్పికొట్టబడింది. మదీనా నేటికీ భూతల స్వర్గం మాదిరిగా కళకళలాడుతూ ఉంది.

తలెత్తిన వివాదంపై తీర్పు చెయ్యండి'. అల్లాహ్ తన ప్రవక్త(స)కు బనూ నజీర్ నుండి 'ఫై' రూపంలో ఇచ్చిన సొమ్ముపై వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సందర్భంగా అలీ– అబ్బాస్‌ల నోట పరుష వాక్కులు వెలువడ్డాయి. ఒకరింకొకరిని తీవ్రంగా విమర్శించారు. అందువల్ల అక్కడున్న ప్రముఖులు, 'అమీరుల్ మోమినీన్! ఈ మహానుభావులిరువురి మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించండి. తద్వారానే ఇద్దరి మధ్య గొడవకు ఆస్కారం ఉండదు' అని సలహా ఇచ్చారు.

దానికి ఉమర్(రజి) "ఆవేశపడకండి. కాస్త నెమ్మదించండి. ఏ అల్లాహ్ ఆదేశంపై భూమ్యాకాశాలు స్థిరంగా ఉన్నాయో, ఆయనపై ఒట్టేసి అడుగుతున్నాను– 'ప్రవక్తలమైన మా ఆస్తిపాస్తులకు వారసులెవరూ ఉండరు. మేము వదలిపోయి నదంతా సదఖాయే' అని మహాప్రవక్త(స) వక్కాణించారన్న విషయం మీ అందరికీ తెలుసా? ఇది తన స్వయానికి కూడా వర్తిస్తుందన్నది ఆయన(స) అభిమతం. అవునా?" అని అడగ్గా, 'అవును' దైవప్రవక్త(స) ఇలా వక్కాణించారన్న విషయం వాస్తవమే'నని అక్కడ హాజరై ఉన్న ప్రబుద్ధులంతా ధ్రువపరిచారు.

అప్పుడు ఉమర్(రజి) అలీ, అబ్బాస్‌లనుద్దేశించి, "నేను మీరిద్దరినీ అల్లాహ్ సాక్షిగా అడుగుతున్నాను– దైవప్రవక్త ఈ విధంగా చెప్పారా? లేదా? మీరే చెప్పండి" అని అడిగారు. దానికి వారిరువురూ 'అవును. చెప్పారు' అని ధ్రువపరిచారు. అప్పుడు హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: "ఇప్పుడు నేను ఈ వ్యవహారానికి సంబంధించిన తప్సీళ్ళన్నింటినీ మీకు విశదపరుస్తాను. యధార్థం ఏమిటంటే, అల్లాహ్ తన ప్రవక్తకు 'ఫై' రూపంలో (బనూనజీర్ నుండి లభించిన) సొమ్ములో నుంచి ఒక భాగాన్ని ప్రత్యేకించాడు. దానిని గురించి అల్లాహ్ ఏమని సెలవిచ్చా డంటే, **'మా అఫా అల్లాహు అలా రసూలిహీ మిన్‌హుమ్...'** (ఏ ఆస్తులను అల్లాహ్, వారి అధీనంలోనుండి తీసుకుని తన ప్రవక్త వైపునకు తరలించాడో, అవి మీరు మీ గుర్రాలనూ, ఒంటెలనూ పరుగెత్తించగా లభించినటువంటి ఆస్తులు కావు. అల్లాహ్ తన ప్రవక్తకు తాను కోరిన వారిపై ఆధిపత్యాన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ప్రతి దానిపై అధికారం కలిగి ఉన్నాడు– అల్ హష్ర్ : 6)

కాబట్టి ఈ దైవోపదేశం ప్రకారం 'ఆ భాగం' దైవప్రవక్త(స)కు ప్రత్యేకంగా ప్రసాదించబడింది. కాని దైవసాక్షిగా! దైవప్రవక్త (స) మిమ్మల్ని ఉపేక్షించి ఆ ఆస్తిని

తన కొరకు ప్రత్యేకించుకోలేదు. మీపై తన స్వయానికి ప్రాధాన్యతను కల్పించుకోనూ లేదు. తొలుత ఆ సొమ్ములోనుండి మీకు ఇచ్చారు. మీ మధ్యన దానిని పంపిణీ చేశారు. చివరకు ఆ 'ఫై'లో నుండి ఈ ఆస్తి మిగిలింది. ఆయన(స) తన సతీమణుల సాలీనా ఖర్చులు కూడా ఈ ఆస్తిలోనుండే తీసేవారు. కడకు అందులో నుండి మిగిలిన సొమ్మును ఆయన అల్లాహ్ మార్గంలో వెచ్చించేవారు. దైవప్రవక్త(స) తాను జీవించి ఉన్నంత కాలం ఇలాగే చేస్తూ వచ్చారు.

ఆయన(స) పరమపదించిన తరువాత నన్ను ఆయన (స) ప్రతినిధిగా చేయటం జరిగిందని అబూబక్ర్ (రజి) అన్నారు. అందువల్ల ఆయన ఆ ఆస్తిని తన స్వాధీనంలోకి తీసేసుకుని, దైవప్రవక్త(స) దానిని ఏఏ పద్దులలో ఖర్చు చేసేవారో, ఆ పద్దులలోనే ఖర్చు చేసేవారు. అప్పుడు మీరంతా ఇక్కడే ఉన్నారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్(రజి) అలీ, అబ్బాస్‌ల వైపునకు తిరిగి ఇలా అన్నారు : "దైవసాక్షిగా! ఈ కార్యనిర్వహణలో మహనీయ అబూబక్ర్(రజి) నికార్సయినవారు, సద్వర్తనులు, ధర్మావలంబీకులు, న్యాయశీలురు అని మీరందరూ అంగీకరిస్తారు. తరువాత అల్లాహ్ అబూబక్ర్(రజి)ను కూడా లేపుకున్నాడు. పిదప నేను దైవప్రవక్త(స)కు, అబూబక్ర్‌కు ప్రతినిధిగా ఎంపికయ్యాను. నేను రెండేళ్ళుగా ఖలీఫాగా ఈ ఆస్తికి పర్యవేక్షకునిగా ఉన్నాను. దైవప్రవక్త, అబూబక్ర్‌లు ఏ ఏ పద్దుల్లో ఆ ఆస్తిని వెచ్చించే వారో ఆ పద్దుల్లోనే నేను కూడా ఖర్చు చేస్తున్నాను. నేను కూడా ఈ వ్యవహారంలో నిజాయితీపరుణ్ణి, సత్యబద్ధుణ్ణి, న్యాయశీలుణ్ణి అన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు.

కాగా; మీరిద్దరూ నాతో మాట్లాడటానికి వచ్చారు. మీరిద్దరూ ఒక్కటే. మీ వ్యవహారం కూడా ఒక్కటే. అయినా మీరు (అబ్బాస్ గారూ!) నా దగ్గరకు వచ్చారు. నేను మీరిద్దరితో చాలా స్పష్టంగా చెప్పేశాను– 'ప్రవక్తలమైన మా ఆస్తి పంచబడదు. మేము వదలిపోయినదంతా సదఖాగా పరిగణించబడుతుంది' అని దైవప్రవక్త(స) చెప్పారని. తరువాత నేను బాగా ఆలోచించిన మీదట, ఈ ఆస్తుల్ని మీకు స్వాధీన పరచటం సముచితం అని నాకు అనిపించింది. అప్పుడు నేను మీతో, 'చూడండి, మీరు కోరితే ఈ ఆస్తిని నేను మీకు స్వాధీనపరచగలను. కాని ఒక షరతు– అదేమిటంటే, దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని మీరు దైవప్రవక్త(స) మాదిరిగా, అబూబక్ర్ తన ఖిలాఫత్ హయాంలో పంపిణీ చేసిన విధంగా నిర్ణీత పద్దుల్లోనే ఖర్చు

చేస్తూ ఉండాలి (అంటే మీరు ఈ ఆస్తికి కేవలం వ్యవహారకర్తలుగా మాత్రమే ఉండాలి)' అని చెప్పాను. ఖలీఫాగా పరిపాలనా బాధ్యతలు చేపట్టినప్పటి నుండీ నేను ఏ విధంగా వ్యవహరిస్తూ వచ్చానో మీకు తెలిసిందే. ఈ షరతు మీకు ఆమోద యోగ్యం కానట్లయితే, దీని గురించి మీరు నాతో మాట్లాడకండి అని కూడా చెప్పాను. దానికి మీరు, 'సరే, ఇదే షరతుపై ఈ ఆస్తిని మాకు స్వాధీనపరచండి' అని మీరన్నారు. అందువల్ల నేను దానిని మీకు స్వాధీనపరచటం జరిగింది. "మరైతే ఇప్పుడు మీరు ఇదిగాక మరేదైనా విషయంపై తీర్పు చేయించాలని కోరుకుంటు న్నారా? అల్లాహ్ సాక్షిగా! ఎవరి ఆజ్ఞతో గగన భువనాలు నెలకొని ఉన్నాయో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను. ఆయన తప్ప వేరెవరూ దీనిపై తీర్పు చెయ్య లేరు. ఒకవేళ దీని నిర్వహణ మీ వల్ల కాదనుకుంటే, ఆ ఆస్తిని నాకు తిరిగి స్వాధీన పరచండి. ఆ పనిని కూడా నేనే స్వయంగా చేసుకుంటాను" అని ఉమర్(రజి) ఖచ్చితంగా తన నిర్ణయాన్ని ప్రకటించారు.

జుహ్రీ ఇలా అన్నారు: తరువాత నేను ఈ హదీసును ఉర్వా బిన్ జుబైర్ ముందు ప్రస్తావించగా, 'మాలిక్ బిన్ ఔస్ మీతో చెప్పింది నిజం' అని ఆయన అన్నారు. (ఆయన ఇంకా ఇలా అన్నారు) 'నేను దైవప్రవక్త(స) సతీమణి ఆయిషా (ర.అ) ద్వారా విన్నాను. ఆమె గారేమన్నారంటే, ప్రవక్త సతీమణులు హజ్రత్ ఉస్మాన్(రజి)ను మొదటి ఖలీఫా అబూబక్ర్(రజి) వద్దకు పంపి, అల్లాహ్ 'ఫై' రూపంలో తన ప్రవక్త(స)కు ఇచ్చిన దానిలోనుండి తమ వాటాను తమకు ఇవ్వాలని విజ్ఞప్తి చేయాలనుకున్నారు. కాని నేను వాళ్ళను వారించాను. ఏమిటి, మీరంతా అల్లాహ్‌కు భయపడటం లేదా? "దైవప్రవక్తలమైన మేము వదలిపోయినది వారసత్వ ఆస్తిగా పంచబడదు. మేము ఏది వదలిపోయినా అది సదఖాగా పరిగణించబడు తుంది" అని దైవప్రవక్త(స) ఖుద్దుగా వక్కాణించారు. దైవప్రవక్త(స) స్వవిషయం కూడా ఆ ఆజ్ఞ క్రిందకే వస్తుంది. అయితే ముహమ్మద్(స) కుటుంబీకులకు జీవి తాంతం ఈ ఆస్తి నుండి భరణం లభిస్తూ ఉంటుంది"– ప్రవక్త సతీమణులకు నేను ఈ హదీసును వినిపించిన మీదట వారు తమ ఆలోచనను విరమించుకున్నారు.

ఉర్వా ఇలా అన్నారు : ఈ సదఖా(ఆస్తి)ని మొదట్లో హజ్రత్ అలీ(రజి) పర్య వేక్షించేవారు. అలీ(రజి) దీని నిర్వహణలో అబ్బాస్(రజి)ను భాగస్వామిగా చేయ లేదు సరికదా, ఆయన స్వయంగా దీనికి వ్యవహారకర్తగా ఉండేవారు. పిదప ఆ

**సదఖా పర్యవేక్షణా బాధ్యత హజ్రత్ హసన్(రజి), ఆపైన హజ్రత్ హుసైన్ (రజి) చేపట్టారు. ఆ తర్వాత అది హసన్ బిన్ అలీ, హసన్ బిన్ హసన్‌ల పర్యవేక్షణలో ఉండేది. అది దైవప్రవక్త(స) వారి 'సదఖా' అన్నది వాస్తవం (అయితే ప్రవక్త కుటుంబీకులు దానికి ధర్మకర్తలుగా ఉండేవారు; యజమానులుగా మాత్రం కాదు)[1]**

**651) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : "ఫాతిమా(ర.అ), అబ్బాస్(రజి)లు ఇరువురూ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) దగ్గరకు వచ్చి, ఫదక్‌లో ఉన్న దైవప్రవక్త(స) భూముల నుండి, ఖైబర్‌లో ఆయనకు లభించిన దాని నుండి తమ వారసత్వ హక్కును ఇవ్వమని అడిగారు.**

**దానిపై అబూబక్ర్ (రజి) ఇలా అన్నారు : నేను స్వయంగా దైవప్రవక్త(స) చెప్పగా విన్నాను. ఆయన(స) ఇలా అన్నారు : "మేము వదలిపోయినది (తరకా) పంచబడదు. మేము ఏది వదలిపోయినా అది సదఖాయే. కాకపోతే ముహమ్మద్(స) కుటుంబీకులకు, ఆ ఆస్తిలో నుండి తిండి నిమిత్తం ఖర్చు తప్పకుండా లభిస్తూ ఉండాలి." దైవసాక్షిగా చెబుతున్నాను. దైవప్రవక్త(స) సమీప బంధువుల పట్ల సద్వ్యవహారం చేయటం నాకు నా రక్త సంబంధీకుల పట్ల సద్వ్యవహారం చేయటం కన్నా ప్రీతికరమైనది.[1] (కాని నేను ప్రవక్త ఆదేశాన్ని ఉల్లంఘించలేను)**

---

650–1. ఈ హదీసు ద్వారా స్పష్టంగా అర్థమయ్యేదేమంటే, ప్రవక్త తన వారసత్వం విషయంలో జారీ చేసిన ఫర్మానాను మొదటి ఖలీఫాలిద్దరూ ఖచ్చితంగా పాటించారు. ఆ ఆస్తి పంపకం జరగనివ్వలేదు. దైవప్రవక్త(స) తన ఏ ఏ పద్దుల్లో దానిని ఖర్చుపెట్టారో ఆ పద్దుల్లోనే అబూబక్ర్, ఉమర్ కూడా ఖర్చుపెట్టారు. హజ్రత్ అలీ(రజి) సయితం దీంతో విభేదించలేదు. ఆ ఆస్తికి ధర్మకర్తగా ఎవరుండాలి? అన్న దానిపైనే ఆయన ప్రశ్నించారు. దానికి సంబంధించిన పూర్వాపరాలన్నింటినీ విడమరచి చెప్పిన మీదట హజ్రత్ ఉమర్(రజి) ఆ 'తరకా'ను ఆయన పర్యవేక్షణలో స్వాధీనపరచారు.

651–1. హజ్రత్ అబూబక్ర్(రజి) ఒకవైపున దైవప్రవక్త(స) ఫర్మానాను శిరసావహిస్తూనే, మరోవైపున ప్రవక్త కుటుంబీకుల పట్ల గౌరవ భావంతో, వారి సేవలు చేయటంలో ఏ లోటూ రానివ్వనని నిర్దిష్టంగా చెప్పారు. ఆ విధంగా ఆయన హజ్రత్ ఫాతిమా (ర.అ)ను ఓదార్చటంతోపాటు, జీవితాంతం ప్రవక్త ఆదేశ

## అధ్యాయం : 15
## కాబ్ బిన్ అష్రఫ్ వధ[1]

**652) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ(రజి) చెప్పగా తాను విన్నానని అమ్ర్ బిన్ దీనార్ వివరించారు : "కాబ్ బిన్ అష్రఫ్ సంగతిని సమాప్తం చేసేవారెవరు? అతను అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను బాధిస్తున్నాడ"ని ప్రవక్త మహనీయులు (సఅసమ్) అడిగినప్పుడు, ముహమ్మద్ బిన్ మస్లమా అన్సారీ(రజి) లేచి నిలబడి, 'దైవప్రవక్తా! నేనతన్ని కడతేర్చడానికి మీ అనుమతి ఉంటుందా?' అని విన్నవించు కున్నారు. దానికి ఆయన(స), "ఉంటుంది" అని అన్నారు. 'అలాగైతే నేనతన్ని ఏమార్చడానికి సందర్భోచితంగా ఏవైనా మాటలు చెప్పడానికి అనుమతించండి'.[1] అని ముహమ్మద్ బిన్ మస్లమా అభ్యర్థించగా, అందుకు ఆయన(స) అనుమతి ప్రదానం చేశారు.**

**తరువాత ముహమ్మద్ బిన్ మస్లమా (రజి) కాబ్ బిన్ అష్రఫ్ దగ్గరకు వచ్చి, 'ఏం చెప్పమంటావు ఈయన గారు (దైవప్రవక్త) నిరంతరం మమ్మల్ని విరాళాలు అడుగుతుంటారు. మొత్తానికి ఆయన మమ్మల్ని అలసిపోయేలా చేశారు. అందుకే నేను నీ దగ్గర అప్పు తీసుకోవడానికి వచ్చాన'ని[2] అన్నారు. దానికి కాబ్, 'అప్పుడే ఏమయింది? మున్ముందు ఇంకా ఏం జరుగుతుందో చూడు. దైవసాక్షి! మీరంతా చాలా బాధపడతారు' అని చెప్పాడు. దానికి ముహమ్మద్ బిన్ మస్లమా, 'ఏం**

---

పాలనలో ఎవరితోనూ రాజీపడేది లేదని చెప్పకనే చెప్పారు. అల్లాహ్ వీరందరినీ తీర్పుదినాన **'జన్నతుల్ ఫిర్దౌస్'**లో ఏకత్రం చేస్తాడని ఆశిద్దాం. "వారి మనస్సులలో పరస్పరం ఏకాస్త స్పర్ధ ఉన్నా దానిని మేము తొలగిస్తాము." (అల్ ఆరాఫ్: 43)

15–1. కాబ్ బిన్ అష్రఫ్ ఆనాటి యూదుల్లోని పెద్ద ధనికుల్లో ఒకడు. అతను దైవప్రవక్త (స)ను, ముస్లింలను గురించి చెడుగా చెప్పుకునేవాడు. సత్య తిరస్కారులైన ఖురైషులను ముస్లింలకు వ్యతిరేకంగా ఉసిగొల్పేవాడు. అతని దౌష్ట్యాలకు చరమ గీతం పాడటానికి హిజ్రీ 3వ సంవత్సరం రబీవుల్ అవ్వల్ నెలలో చర్య తీసుకోవటం జరిగింది. ".... ఈ విధంగా దుర్మార్గానికి పాల్పడిన వారిని సమూలంగా నిర్మూలించటం జరిగింది. సకల లోక ప్రభువైన అల్లాహ్‌యే స్తుతికి పాత్రుడు." (అల్ అన్ఆమ్: 45)

**చేయమంటావు, ఇప్పటికే ఆయన విధేయతకు కట్టుబడిపోయాం. దీని పరిణామాలు ఎలా ఉంటాయో స్పష్టం కానంతవరకూ ఆయన్ని వదిలించుకోవటం సమంజసం కాదు. నేను నీ వద్ద నుండి ఒక వసఖ్ లేదా రెండు వసఖ్‌ల[3] ధాన్యం అరువుగా తీసుకోవడానికి వచ్చాను' అన్నారు.... దానికి కాబ్ బిన్ అష్రఫ్, 'అలాగయితే నా వద్ద ఏదైనా వస్తువును తాకట్టు పెట్టు' అన్నాడు. 'తాకట్టుగా ఏం పెట్టమంటావ్?' అని అడగ్గా, 'మీ స్త్రీలనే తాకట్టుగా పెట్టవచ్చు' అని కాబ్ అన్నాడు. దానికి ముహమ్మద్ బిన్ మస్లమా, 'నీవు అరబ్బులలోకెల్లా అందగాడివి. అలాంటప్పుడు మా స్త్రీలను నీ దగ్గర తాకట్టుగా ఎలా పెడతాం?'[4] అని చెప్పగా, 'అలాగయితే మీ పిల్లల్ని తాకట్టుగా పెట్టండి' అని కాబ్ అన్నాడు. 'అయ్యో! మేము మా పసివాళ్ళను తాకట్టు పెట్టాలా? రేపటి రోజున జనులు మా పిల్లల్ని ఆడిపోసుకుంటారు. ఒక వసఖ్ లేదా రెండు వసఖ్‌ల తిండి గింజల కోసం ఇతన్ని తాకట్టు పెట్టడం జరిగిందని తూలనాడుతారు. ఇంతకన్నా సిగ్గుచేటు మాకు ఇంకా ఏముంటుంది? ఒక పని చేయగలం. మేము మా వద్ద ఉన్న ఆయుధాలను తెచ్చి నీ వద్ద తాకట్టు పెడతాం' అని ముహమ్మద్ బిన్ మస్లమా (రజి) చెప్పి, మాపటేళ నిన్ను కలుసుకోవడానికి మరోసారి వస్తామని వాగ్దానం చేశారు.**

**ఆయనతోపాటు అబూ నాయలా కూడా ఆయన వెంట ఉన్నారు. ఆయన**

---

652–1. అంటే ఆ మాటలు మభ్యపెట్టేవిగా ఉంటాయి. ఆ మాటలు మీ పట్ల మా అపనమ్మకాన్ని వ్యక్తపరిచేవిగా ఉంటాయి. కాని అవన్నీ మేము వ్యూహాత్మకంగా మాత్రమే చెబుతాము. వాస్తవానికి మా మనసులు ఎలాంటివో దైవానికి ఎరుకే.

652–2. ముహమ్మద్ బిన్ మస్లమా(రజి) దైవప్రవక్త(స)కు వాగ్దానం చేసిన తరువాత కూడా కొంతకాలం పాటు సందిగ్ధంలో ఉండిపోయారు. తరువాత అబూ నాయలా వద్దకు వచ్చి, దీనిని గురించి చర్చించారు. పిదప అబ్బాద్ బిన్ బిషర్, హారిస్ బిన్ ఔస్, అబూ ఉబైస్ బిన్ జబర్‌ను కూడా సంప్రతించారు. కడకు వారంతా ఆయనకు తోడయ్యారు. దైవప్రవక్త(స)ను నమ్మిన కారణంగా తాము ఆర్థికంగా కృంగిపోయినట్లు అబద్ధం చెప్పారు.

652–3. ఒక వసఖ్ లేదా రెండు వసఖ్‌లు అనే విషయంలో ఉల్లేఖకుడు సందిగ్ధంలో పడ్డారు.

652–4. అంటే నీలాంటి అందగాణ్ని చూసి స్త్రీలు తట్టుకోలేరు. నీ వలలో పడిపోతారు.

కాబ్ బిన్ అష్రఫ్‌కు పాల వరుస సోదరుడు. వారు అతని కోట వద్దకు వెళ్ళి బిగ్గరగా అతన్ని పిలిచారు. అతను బయటికి వస్తుండగా అతని భార్య 'రాత్రివేళ ఎక్కడికి వెళుతున్నావ్?' అని అడ్డు తగిలింది. దానికి అతను, 'ఫరవాలేదులే. వారిలో ఒకరు ముహమ్మద్ బిన్ మస్లమా, మరొకరు నా సోదరుడు అబూ నాయలా' అని చెప్పాడు. (వేరొక ఉల్లేఖకుని ప్రకారం) అతని భార్య అతన్ని గట్టిగా వారించింది. 'వారి కేకలో రక్తం కారుతున్నట్టు నాకు అనిపిస్తోంది'[5] అని కూడా చెప్పింది. దానికి కాబ్, 'ఆందోళన చెందకు. వారిద్దరూ మనవాళ్ళే– ఒకరు ముహమ్మద్ బిన్ మస్లమా, ఇంకొకరు నా పాల వరుస సోదరుడు అబూ నాయలా. మర్యాదస్తుడైన వ్యక్తికి రాత్రివేళ ఈటెల విన్యాసానికి పిలిచినా అతను జంకు లేకుండా వెళ్ళిపోతాడు' అని చెప్పాడు. (ఉల్లేఖకుడు ఇలా అన్నారు) ముహమ్మద్ బిన్ మస్లమా లోనికి వెళ్ళి నప్పుడు ఆయన వెంట మరో ఇద్దరు మనుషులు ఉన్నారు. 'కాబ్ రాగానే నేను అతని(తల) వెంట్రుకల సువాసన చూసేందుకు చేత్తో పట్టుకుంటాను. నేను అతనిని పూర్తిగా ఆక్రమించుకున్నానన్న నమ్మకం మీకు కుదరగానే, మీరు అతనిని కడతేర్చాలి' అని ముహమ్మద్ బిన్ మస్లమా తన మనుషులకు సూచించారు.

ఎట్టకేలకు కాబ్ దుప్పటి కప్పుకుని బయటకు వచ్చాడు. అతని శరీరం నుండి సువాసన వెదజల్లుతోంది. 'అబ్బ! ఈ రోజు ఆఘ్రాణించినంత మంచి సువాసనను నేనెన్నడూ జీవితంలో ఆఘ్రాణించలేద'ని ముహమ్మద్ బిన్ మస్లమా(రజి) చెప్పారు. దానికి కాబ్ బిన్ అష్రఫ్ 'నా దగ్గర ఒక అరబ్బు మహిళ ఉంది. ఆవిడ ఎల్లవేళలా సుగంధంలోనే మునిగి ఉంటుంది. ఇక అందచందాల విషయానికి వస్తే ఆమెకు సాటి మరెవరూ లేర'ని అన్నాడు. 'మరైతే నీ తల వెంట్రుకల్లోని సువాసనను పీల్చే అనుమతి నాకు ఉంటుందా!?' అని ముహమ్మద్ బిన్ మస్లమా (రజి) విన్నవించుకోగా, 'నిరభ్యంతరంగా పీల్చవచ్చు' అని కాబ్ చెప్పాడు. (ఉల్లేఖకుడు ఇలా అన్నారు:) ముహమ్మద్ బిన్ మస్లమా (రజి) అతని తలలోని సువాసనను పీల్చారు. ఆయన తరువాత ఆయన వెంటనున్న సహచరులు కూడా పీల్చారు. 'మరోసారి పీల్చవచ్చునా?' అని ఆయన విన్నవించుకోగా, ఈసారి కూడా

652–5. మొత్తానికి ఆ స్త్రీలోని విజ్ఞత, దూరదృష్టి శ్లాఘించదగినది. ఆమె వారి కేకలోని ఉద్దేశ్యాన్ని పసిగట్టి, కాబ్ బిన్ అష్రఫ్‌ని హెచ్చరించింది.

**పీల్చడానికి అతను అనుమతి ఇచ్చాడు. ఆ విధంగా ముహమ్మద్ బిన్ మస్లమా (రజి) అతనిపై పూర్తిగా అదుపు సాధించగానే, తన సహచరులకు సంజ్ఞ చేశారు. అంతే, వారు అతని కథను సమాప్తం చేశారు.[6] తరువాత దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి జరిగినదంతా తెలియపరిచారు.**

## అధ్యాయం : 16

## అబూ రాఫె అబ్దుల్లాహ్ బిన్ అబిల్ హుఖీఖ్ వధ

**ఇతని అసలు పేరు సలామ్ బిన్ అబిల్ హుఖీఖ్ అనీ, అతను ఖైబర్ వాసి అనీ అనబడుతోంది. అతను హిజాజ్ క్షేత్రంలోని ఒక దుర్గంలో ఉండేవాడని మరి కొందరు అభిప్రాయపడ్డారు. అబూ రాఫె కాబ్ బిన్ అష్రఫ్ హత్య తరువాత వధించ బడ్డాడని జుహ్రీ అన్నారు (హిజ్రీ 6వ సంవత్సరం రమజాన్ నెలలో)**

**653) హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) కొంతమందిని అబూ రాఫే వద్దకు పంపించారు. అబ్దుల్లాహ్ బిన్ అతీక్ రాత్రివేళ అతని ఇంట్లో జొరబడ్డారు. అతను నిద్రిస్తుండగా వారు అతన్ని హతమార్చారు.**

**654) మహనీయ బరా బిన్ ఆజిబ్(రజి) తెలియజేశారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) అబూ రాఫే యహూదీని చంపడానికి కొంతమంది అన్సార్ సహచరులను పంపారు. అబ్దుల్లాహ్ బిన్ అతీక్ (రజి)ను వారికి నాయకునిగా నియమించారు. (ఎందుకంటే ఈ) అబూ రాఫే దైవప్రవక్త(స)కు మనస్తాపం కలిగించేవాడు. ఆయన(స) శత్రువులకు సహాయపడేవాడు. హిజాజ్ ప్రాంతంలో**

---

652-6. కాబ్ బిన్ అష్రఫ్ మదీనాలోని శ్రీమంతుల్లో ఒకడు. యూదు మతస్థుడు. ఇస్లామ్‌కు బద్ధ విరోధి. అవకాశం దొరికినప్పుడల్లా మక్కాలోని ఖురైషు అవిశ్వాసులతో కుమ్మక్కు అయి, వారిని ముస్లింలపై ఉసిగొల్పేవాడు. ఒకసారి దైవప్రవక్త (స)ను పిలిచి, ఆయనకు కీడు తలపెట్టబోయాడు. దైవప్రవక్త(స) జిబ్రీల్(అ) ద్వారా అతని దురుద్దేశ్యాన్ని గురించి తెలుసుకుని జాగ్రత్తపడ్డారు.

కాబ్ బిన్ అష్రఫ్ కవి కూడా. అతను తన కవితల ద్వారా కూడా దైవప్రవక్త(స)పై గల తన అక్కసును వెళ్లగ్రక్కేవాడు. ఆ విధంగా అతని ఆగడాలు హద్దు మీరి పోవటంతో దైవప్రవక్త(స) అతనిపై చర్య గైకొనక తప్పలేదు.

అతనికి ఒక కోట ఉండేది. అతను అక్కడే ఉండేవాడు. వీరు అతని కోట వద్దకు చేరుకునేటప్పటికీ సూర్యాస్తమయం జరిగింది. అప్పటికే జనులు తమ పశువులను మేపుకుని తమ ఇండ్లకు తిరిగి వచ్చేశారు. అబ్దుల్లాహ్ బిన్ అతీక్(రజి) తన తోటి సహచరులతో, "మీరంతా ఇక్కడే ఉండండి. నేను (కోటపైకి) వెళ్ళి, లోనికి వెళ్ళే ఉపాయం ఏదన్నా ఆలోచిస్తాను" అన్నారు. ఆ విధంగా ఆయన కోట ద్వారాన్ని సమీపించి, కాలకృత్యాలు తీర్చుకునే వ్యక్తి గుడ్డ కప్పుకున్నట్లుగా తనను తాను ఎవరికీ కనబడకుండా నక్కి కూర్చున్నారు. కోటలో ఉండే వారంతా లోనికి వెళ్ళిపోయారు. అప్పుడు ద్వారపాలకుడు, 'దైవ దాసులారా! లోనికి రాగోరిన వారు తొందరగా వచ్చేయండి, ద్వారం మూసివేయబడుతుంది' అని బిగ్గరగా ప్రకటించాడు. (అబ్దుల్లాహ్ బిన్ అతీక్–రజి ఇలా అన్నారు) నేను కూడా ద్వారంలోనికి ప్రవేశించి, చాటుమాటుగా ద్వారపాలకుడు చేసేదంతా జాగ్రత్తగా గమనించసాగాను. అందరూ లోనికి వచ్చేసిన తర్వాత అతను ద్వారాన్ని మూసివేసి, తాళం చెవుల గుత్తిని ఒక గూటానికి తగిలించాడు. నేను నెమ్మదిగా వెళ్ళి ఆ తాళం చెవులను తీసుకుని, కోట ద్వారాన్ని తెరిచాను (పారిపోవలసి వచ్చినప్పుడు ఇబ్బంది కలుగరాదన్న ఉద్దేశ్యంతో అలా చేశాను). జనులు అబూ రాఫె దగ్గర రాత్రిపూట కథలు చెప్పేవారు. అతను తన ప్రత్యేక మిద్దెపై కూర్చుని కథలు వినేవారు. కథలు చెప్పేవారు వెళ్ళిపోయిన తరువాత నేను అతని బాల్కనీ వైపు ఎక్కసాగాను. ఈ సందర్భంగా ఎన్ని తలుపులు తెరిచినా, లోపలి నుంచి వాటిని మూసేసేవాణ్ణి. లోపల ఎవరో ఉన్నారన్న అనుమానం పహరాదారులకు వచ్చినా, వారు తొందరగా నన్ను చేరుకొనరాదన్నది నా ఉద్దేశం. ఎట్టకేలకు నేను అతన్ని సమీపించాను. ఆ సమయంలో అతను ఓ చీకటి గదిలో తన ఆలుబిడ్డలతో కలసి పడుకుని ఉన్నాడు. అతనెవరో అంచనా వేయటం నాకు కష్టమయింది. అందుకే నేను, 'ఓ రాఫే!' అని అరిచాను. దానికి అతను 'ఎవరు?' అన్నాడు. అతని శబ్దం వినిపించిన చోటికి వెళ్ళి, ఖడ్గంతో ఒక్క వ్రేటు వేశాను. ఆ సమయంలో నా గుండె దడ పెరిగింది. ఈ కారణంగానే నేను అతని కథను సమాప్తం చేయలేకపోయాను. నేను కొట్టిన దెబ్బకు అతను పెద్దగా అరిచాడు. అందువల్ల నేను గదిలోనుండి బయటకు వచ్చేశాను. కాసేపు బయటే నిలబడ్డాను. తరువాత మళ్ళీ గది లోపలికి వెళ్ళి, గొంతు సవరించుకుని, 'అబూ రాఫె! ఇందాక గదిలో శబ్దం వచ్చిందేమిటి?' అని అడిగాను. దానికి అతను, 'నీ తల్లి పాడుగాను!

ఇప్పుడే నాపై ఎవడో ఖడ్గంతో దాడి చేశాడు' అని చెప్పాడు. నేను అతని కంఠస్వరం వినిపించిన వైపే వెళ్ళి, మరోసారి ఖడ్గంతో వ్రేటు వేశాను. నేనతన్ని తీవ్రంగా గాయ పరచగలిగాను. కాని అతను ఇంకా చావలేదు. అందువల్ల నేను నా ఖడ్గాన్ని అతని పొట్టపై పెట్టి గట్టిగా నొక్కాను. అది పొట్టలోనికి బాగా దిగబడింది. ఇప్పుడతను చచ్చిపోయాడన్న గట్టి నమ్మకం నాకు కలిగింది. ఆ తర్వాత నేను ఒక్కొక్క తలుపును తెరుస్తూ ఆఖరికి ఒక నిచ్చెన వద్దకు చేరుకున్నాను. నేను పూర్తిగా క్రిందికి దిగి పోయానని అనుకున్నాను. కాని ఇంకా దిగలేదు. అందువల్ల అదుపు తప్పి క్రిందపడి పోయాను. అది వెన్నెల రాత్రి. అలా క్రింద పడటం వల్ల నా కాలి మడమ విరిగింది. నేను తలపాగాతో దానిని గట్టిగా కట్టుకుని, ద్వారం దగ్గరకు వచ్చి కూర్చున్నాను. నేనతన్ని వధించానో లేదో నిర్ధారణ కానంతవరకూ అక్కడి నుండి తిరిగి వెళ్ళకూడ దని దృఢంగా సంకల్పించుకున్నాను. తెల్లవారుజామున కోడికూసిన మీదట కోట బురుజు వద్ద నుండి ప్రకటన చేసే వాడొకడు నిలబడి ప్రకటించాడు– హిజాజ్ క్షేత్రానికి చెందిన వర్తకుడు అబూరాఫే మరణించాడని. అంతే, నేను నా తోటి సహచరుల దగ్గరకు వచ్చి, తొందరగా పదండి అన్నాను. అల్లాహ్ అబూ రాఫే కథను సమాప్తం చేయించాడు. నేను దైవప్రవక్త(స) సేవలో హాజరై, జరిగినదంతా వివరించాను. "ఏదీ, నీ కాలు చాపు" అన్నారాయన(స). నేను నా కాలు చాపగానే, ఆయన తన పవిత్ర హస్తాన్ని దానిపై నిమిరారు. అంతే, నా కాలికి ఎప్పుడూ ఏమీ బాధ కలగనే లేదన్నట్లుగా అది నయమైపోయింది.

**655)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ తెలియజేశారు : బరా బిన్ ఆజిబ్ ప్రకారం, దైవప్రవక్త (సఅసమ్) అబ్దుల్లాహ్ బిన్ అతీక్ (రజి)ను, అబ్దుల్లాహ్ బిన్ ఉతబా(రజి)ను కొంతమంది సహచరులతోపాటు అబూ రాఫెను కడతేర్చడానికి పంపారు. వారంతా ప్రయాణమయ్యారు. అతని కోట దగ్గరకు చేరుకోగానే అబ్దుల్లాహ్ బిన్ అతీక్(రజి) తన తోటివారితో, "మీరంతా ఇక్కడే ఉండండి. ముందు నేను వెళ్ళి పరిస్థితుల స్వరూపాన్ని అంచనా వేస్తాను" అన్నారు. అబ్దుల్లాహ్ బిన్ అతీక్(రజి) ఇలా అన్నారు : నేను కోట సమీపంలోకెళ్ళి లోనికి ప్రవేశించే ఉపాయాన్ని గురించి ఆలోచించసాగాను. యాదృచ్ఛికంగా కోట లోని ఒక గాడిద తప్పిపోయింది. ఆ గాడిదను వెతకటానికి కోటలోని వారు కాగడా పట్టుకుని బయటికి వచ్చారు. వారు నన్ను గుర్తు పడతారేమోనని భయపడ్డాను.

అందుకే తలపై గుడ్డ కప్పుకుని, కాలకృత్యాలు తీర్చుకునే వానిలా అభినయం చేశాను. ఆ తరువాత ద్వారపాలకుడు, ద్వారం మూసివేసే వేళ అయింది, బయట ఉన్న వారంతా తొందరగా లోనికి రావలసినదిగా ప్రకటన చేశాడు. నేను (ఇదే అదనుగా భావించి) లోపలికి వెళ్ళాను. లోపల కోట సింహద్వారానికి సమీపంలోనే గాడిదలు కట్టి వేయబడి ఉన్నాయి. నేను అక్కడే దాక్కున్నాను. కోటలోని వారు అబూరాఫేతో కలసి భోజనాలు చేశారు. తరువాత అతనికి (బుర్ర) కథలు వినిపించసాగారు. రాత్రి పొద్దుపోయాక కోటలోని వారంతా తమ తమ నివాస గృహా లకు వెళ్ళిపోయారు. నలువైపులా నిశ్శబ్దం ఆవరించింది. ఎక్కడా ఎలాంటి చడీ చప్పుడు లేదు.

నేను నెమ్మదిగా కార్యోన్ముఖుణ్ణి అయ్యాను. ద్వారపాలకుడు తాళం చెవులను పెట్టిన చోటును నేను ముందే చూశాను. ముందుగా ఆ తాళం చెవుల గుత్తిని నా అధీనంలోకి తీసుకున్నాను. తరువాత అన్నిటికన్నా ముందుగా కోట ప్రధాన ద్వారం తెరచి ఉంచాను. ఎందుకంటే, ఒకవేళ నా ఆచూకీ భద్రతా సిబ్బందికి తెలిస్తే, నేను సులువుగా పారిపోగలిగేందుకు ఇలా చేయటం అవసరం అనుకున్నాను. ఆపైన నేను అబూ రాఫేను చేరుకునేందుకు అనేక గదులను దాటిపోవలసి వచ్చింది. ఏ గదిలోనికి వెళ్ళినా ఆ తలుపుకు లోపలి నుండి తాళం వేసేశాను. తరువాత ఒక నిచ్చెన ద్వారా అబూ రాఫే ఉండే బాల్కనీలోని శయనాగారానికి చేరుకున్నాను. గదిలో చీకటి ఉంది. దీపం ఆర్పివేయబడింది. అబూ రాఫే ఎక్కడున్నాడో ఖచ్చి తంగా నిర్ధారించుకోలేకపోయాను. అందుకే "ఓ అబూ రాఫే!" అని పిలిచాను. దానికి అతను "ఎవరూ?" అన్నాడు. నేను ఆ శబ్దం వినిపించిన వైపు వెళ్ళి ఖడ్గంతో ఒక్క వ్రేటు వేశాను. అతను అరవసాగాడు. (కొన్ని క్షణాల తర్వాత) అతనికి సహాయపడే వ్యక్తిలా అతని దగ్గరకెళ్ళి, కంఠస్వరం మార్చి, "అబూ రాఫే! తమరెలా ఉన్నారు? క్షేమమే కదా!" అన్నాను. దానికి అతను "నీ తల్లి పాడుగాను! ఇప్పుడే ఎవరో ఆగంతకుడు నా గదిలోనికి వచ్చి ఖడ్గంతో నాపై హత్యాయత్నం చేశాడు" అని చెప్పాడు. నేను అతని శబ్దం ఆధారంగా రెండోసారి దాడి చేశాను. కాని ఈసారి కూడా అతడు చావలేదు. గావుకేకలు పెట్టసాగాడు. ఈ అరుపులకు అతని భార్యకు కూడా మెలకువ వచ్చి లేచింది. నేను ఈసారి కూడా గొంతు మార్చి సహాయం కొరకు వచ్చినవానిలా అతన్ని సమీపించాను. అతను వెల్లకిలా పడుకుని ఉన్నాడు.

**నా ఖడ్గాన్ని అతని పొట్టపై పెట్టి బలంతో నొక్కాను. అతని కడుపులోనికి ఖడ్గం చొచ్చుకుపోయింది. చివరకు వెన్నెముక విరిగినట్లుగా శబ్దం రాగానే అక్కడి నుండి వెనుతిరిగాను. ఆ క్షణంలో నేను ఎంతో కంగారుపడిపోయాను. నిచ్చెన ద్వారా క్రిందికి దిగాలనుకున్నాను. కాని కాలుజారి క్రిందపడిపోయాను. నా కాలు బెణికింది. గబగబా కాలికి కట్టుకట్టి, నా మిత్రులు నా కోసం వేచి ఉన్నచోటికి కుంటుతూనే వచ్చాను. "మీరంతా ఇక్కణ్ణుంచి వెళ్ళిపోండి. దైవప్రవక్త(స)కు శుభవార్త వినిపించండి, నేను మాత్రం, అబూరాఫే చనిపోయాడన్న వార్త విననంత వరకూ ఇక్కడి నుండి రాను" అని చెప్పాను.**

**తెలతెలవారుతుండగా మరణవార్త వినిపించేవాడు కోట గోడపైకెక్కి, 'అబూ రాఫే చనిపోయాడ'ని ప్రకటించాడు. నేను అక్కడి నుండి బయలుదేరాను. (విజయం సాధించిన సంతోషంలో) నా కాలు బెణికిన బాధ ఏమీ నాకు తెలియలేదు. నా తోటి స్నేహితులు దైవప్రవక్త(స) వద్దకు చేరుకోకముందే, నేను వారిని కలుసుకున్నాను. దైవప్రవక్త(స)కు ఈ శుభవార్త వినిపించాను.[1]**

## అధ్యాయం : 17

## ఉహుద్ యుద్ధం[1]

**ఆలి ఇమ్రాన్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:**

---

655-1. అబూ రాఫే యూదుడు. ఖైబర్‌లో నివసించేవాడు. హిజాజ్ క్షేత్రంలో అతి పెద్ద వర్తకునిగా సుప్రసిద్ధుడు. ఇస్లామ్‌కు బద్ధశత్రువు. ఎల్లప్పుడూ దైవప్రవక్త ముహమ్మద్(స)ను దూషించేవాడు. కందక యుద్ధ సందర్భంగా అరేబియాలోని ప్రముఖ తెగలను మదీనాపై దండెత్తేలా పురికొల్పాడు. అందువల్ల ఖజ్రజీ సహచరుల అభ్యర్థనపై దైవప్రవక్త(స) అతనిపై చర్యకు అంగీకరించారు. అబ్దుల్లాహ్ బిన్ అతీక్(రజి) అన్సారీ నేతృత్వంలో ఐదుగురు సహాబాను ఈ పని కొరకు నియమించారు. ఈ సందర్భంగా స్త్రీలకు, పిల్లలకు ఎలాంటి కీడు తలపెట్టరాదని తాకీదు చేశారు.

17-1. ఇది భీకరమైన పోరు. హిజ్రీ 3వ సంవత్సరం షవ్వాల్ నెలలో మదీనాకు మూడు మైళ్ళ దూరాన ఉన్న ఉహుద్ పర్వతం వద్ద ఈ యుద్ధం జరిగింది. ప్రథమార్థంలో యుద్ధంలో ముస్లింలదే పైచేయి అయింది. కాని యుద్ధప్రాప్తిని ప్రోగు చేసుకోవాలనే ఆరాటంలో దైవప్రవక్త(స) గుట్టపై నియమించిన విలుకాండ్రు తమ స్థలాన్ని విడిచిపెట్టడంతో గెలుపు వాకిట ఓటమిని చవిచూడవలసి వచ్చింది.

**(ప్రవక్తా!) నీవు ముస్లిములకు ఆ సమయాన్ని గురించి తెలుపు) అప్పుడు నీవు వేకువజామున నీ ఇంటి నుండి బయలుదేరి (ఉహుద్ క్షేత్రంలో) ముస్లిములను యుద్ధం కొరకు వారి వారి స్థానాలలో నియమించావు. అల్లాహ్ అన్ని మాటలూ వింటాడు. ఆయన అన్నీ తెలిసినవాడు.** ***(3: 121)***

**ఇదే సూరాలో అల్లాహ్ ఈ విధంగా కూడా సెలవిచ్చాడు :**

**క్రుంగిపోకండి, దుఃఖపడకండి, మీరే ప్రాబల్యం పొందుతారు, మీరు విశ్వాసులే అయితే. ఇప్పుడు మీరు దెబ్బతిన్నారు. నిజమే. ఇదివరకు మీ ప్రత్యర్థి కూడా ఇటువంటి దెబ్బనే తిన్నాడు కదా! ఇవి కాలం యొక్క మిట్ట పల్లాలు. వాటిని మేము ప్రజల మధ్య త్రిప్పుతూ ఉంటాము. ఇటువంటి కాలం మీకు ఎందుకు ప్రాప్తించిందంటే మీలో నిజమైన విశ్వాసులెవరో అల్లాహ్ చూడదలిచాడు. (సత్యానికి) నిజమైన సాక్షులెవరో ఏరదలిచాడు– ఎందుకంటే దుర్మార్గులైన ప్రజలంటే అల్లాహ్‌కు ఇష్టం లేదు– ఇంకా ఆయన ఈ పరీక్ష ద్వారా విశ్వాసులను వేరుచేసి అవిశ్వాసులను తుదముట్టించదలిచాడు. మీరు ఇట్టే స్వర్గంలో ప్రవేశించాలని అనుకుంటున్నారా? వాస్తవానికి ఆయన మార్గంలో ప్రాణాలు తెగించి కృషి చేసేవారు, ఆయన కొరకు సహనం చూపేవారు మీలో ఎవరో అల్లాహ్ ఇంకా చూడనేలేదు కదా! మీరు ఇదివరకు మరణాన్ని కోరుతూ ఉండేవారు! కాని ఇది, మరణం మీ ముందుకు**

---

పర్వత కనుమ వెనుక నుంచి శత్రువులు ముస్లింలపై మెరుపుదాడి చేశారు. ముస్లిం సేన చెల్లాచెదురయింది. 70 మంది ప్రవక్త ప్రియ సహచరులు అమర గతినొందారు. దైవప్రవక్త(స) సయితం యుద్ధంలో గాయపడ్డారు.

ఈ యుద్ధం వల్ల ముస్లింలకు జరిగిన ఒక మేలు ఏమిటంటే వారికి తమ మధ్యన ఉన్న ద్వంద్వనీతి పరులు(కపటులు) ఎవరో, నిజమైన ముస్లింలు ఎవరో తేటతెల్లమైపోయింది.

ఇబ్నె ఇస్‌హాఖ్ ఇలా అన్నారు: అల్లాహ్ ఉహుద్ యుద్ధం నేపథ్యంలో ఆలి ఇమ్రాన్ సూరాలో 60 ఆయత్‌లను అవతరింపజేశాడు. కాగా, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) ప్రకారం ఈ సూరాలోని 120 ఆయత్‌లు ఈ అధ్యాయానికి సంబంధించినవే.

రానప్పటి విషయం. ఇదిగో, అది ఇప్పుడు మీ ముందుకే వచ్చింది. దాన్ని స్వయంగా మీరే మీ కళ్ళతో చూశారు. *(ఆలి ఇమ్రాన్ : 139-143)*

అల్లాహ్ మీకు చేసిన (సహాయం చేస్తాననే) తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. ప్రారంభంలో ఆయన ఆజ్ఞ ప్రకారం మీరే వారిని చంపుతూ ఉన్నారు. కాని మీరు బలహీనతను ప్రదర్శించినప్పుడు మీ కర్తవ్యం విషయంలో పరస్పరం విభేదాలకు గురి అయినప్పుడు మీరు వ్యామోహపడిన వస్తువును (అంటే విజయ ధనం) అల్లాహ్ మీకు చూపగానే మీరు మీ నాయకుని ఆజ్ఞను ఉల్లంఘించారు– ఎందుకంటే, మీలో కొందరు ఇహాన్ని కోరారు, మరికొందరు పరాన్ని కోరారు– అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించటానికి అవిశ్వాసులకు బదులుగా మిమ్మల్ని ఓటమిపాలు చేశాడు. అయినప్పటికీ వాస్తవానికి అల్లాహ్ మిమ్మల్ని క్షమించాడు. ఎందుకంటే, విశ్వాసుల పట్ల అల్లాహ్‌కు ఎనలేని అనుగ్రహం. *(ఆలి ఇమ్రాన్: 152)*

అల్లాహ్ మార్గంలో చంపబడ్డ వారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు సజీవులే. తమ ప్రభువు వద్ద జీవికను పొందుతున్నారు. *(ఆలి ఇమ్రాన్ : 169)*

**656)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉహుద్ యుద్ధ సందర్భంగా ఇలా అన్నారు– "అదిగో, ఆయన జిబ్రీల్ (అలైహిస్సలామ్), ఆయుధాలు ధరించి, తన గుర్రపు కళ్ళాన్ని పట్టుకుని ఉన్నారు."

**657)** ఉఖ్‌బా బిన్ ఆమిర్(రజి) తెలియజేశారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఎనిమిది సంవత్సరాల తర్వాత ఉహుద్ యుద్ధంలో అమరగతినొందిన సహాబాపై జనాజా నమాజ్ చేశారు. ఆ నమాజ్ చేసిన వైనం సజీవులను, మృతులను వీడిపోతున్న వారిలా వుంది. ఆ తర్వాత ఆయన(స) వేదిక పైకి వచ్చి ఇలా ప్రసంగించారు: "నేను మీకన్నా మున్ముందు ఉన్నాను (అంటే మీకన్నా ముందే పరలోకానికి పోతున్నాను). నేను మీ ఆచరణలకు సాక్షిగా ఉంటాను. (ప్రళయదినాన) మీరు నన్ను కౌసర్ సరస్సు వద్ద కలుసుకుంటారు. ఇప్పుడు నేను నా స్థానం నుండి కౌసర్ సరస్సును తిలకిస్తున్నాను. మీరు బహుదైవారాధన (షిర్క్)కు ఒడిగడతారన్న భయం నాకు లేదు. కాని మీరు ప్రాపంచిక మోజులో పడి ఒకరింకొకరి పట్ల అసూయా ద్వేషాలకు ఎక్కడ గురి అవుతారోనని

**నేను భయపడుతున్నాను"-[1] 'కడసారి నాకు దైవప్రవక్త(స) దర్శన భాగ్యం లభించింది ఈ సందర్భంగానే' అని ఉఖ్బా బిన్ ఆమిర్ చెప్పారు.**

**658) హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు : ఉహుద్ యుద్ధ సందర్భంగా బహు దైవారాధకులను మార్కొనడానికి మేము (ఉహుద్ పర్వతం వద్దకు) చేరుకున్నప్పుడు ప్రవక్త మహనీయులు(స) విలుకాండ్ర దళాన్ని అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) నేతృత్వంలో ఒక గుట్టపై నియమిస్తూ, "ఇక్కడి నుండి మీరు కదలవద్దు. ఒకవేళ మేము శత్రువుపై ఆధిపత్యం వహించినట్లు మీరు చూసినాసరే మీరు మాత్రం ఉన్నచోటనే ఉండండి. ఒకవేళ శత్రువు మాపై ఆధిపత్యం వహించినట్లు మీరు గమనించినా సరే, మా సహాయం కొరకు మీరు రాకూడదు" అని గట్టిగా తాకీదు చేశారు.**

**మేము సత్య తిరస్కారులను మార్కొన్నప్పుడు రణరంగంలో తొక్కిసలాట మొదలయింది. వారి స్త్రీలు వేగంగా పర్వత కనుమల్లోకి పరుగులు తీయడం నేను కళ్ళారా చూశాను. ఆ సమయంలో వారు తమ వస్త్రాలను పిక్కల పైదాకా ఎత్తి ఉండగా వారి అందియలు సైతం కనిపించాయి. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) సారథ్యంలో గుట్టపై నియమితులై ఉన్న విలుకాండ్రు ఈ దృశ్యాన్ని చూసి 'యుద్ధ ప్రాప్తి, యుద్ధప్రాప్తి' అని అరవసాగారు. దానిపై అబ్దుల్లాహ్ బిన్ జుబైర్, 'ఇక్కడి నుండి కదలకూడదని దైవప్రవక్త(స) చెప్పారా లేదా?' అని వారిని మందలించారు (అంటే మీరు యుద్ధప్రాప్తి కోసం ఎగబడకండి అని గట్టిగా వారించారు). కాని వారు ఆయన ఆదేశాన్ని ఉల్లంఘించారు. ఈ ఆజ్ఞోల్లంఘన కారణంగా ముస్లింలు**

---

657-1. ఉహుద్ యుద్ధం హిజ్రీ శకం మూడవ సంవత్సరం షవ్వాల్ నెలలో జరిగింది. కాగా, హిజ్రీ 11వ సంవత్సరం రబీవుల్ అవ్వల్ నెలలో దైవప్రవక్త(స) పరమపదించారు. కాబట్టి ఉల్లేఖకుడు **'ఎనిమిదేళ్ళ తర్వాత'** అని అనటం సరైనది కాదు. **'ఎనిమిదవ యేట'** అంటే సరిపోయేది.

'కౌసర్ సరస్సు' వద్ద ముస్లింలంతా దైవప్రవక్త(స)ను కలుసుకుంటారని హదీసులో అనబడింది. కనుక ముస్లిం సోదరులారా! ప్రవక్త మహనీయులను హౌజె కౌసర్ వద్ద కలుసుకున్నప్పుడు, ఆయన సమక్షంలో తలవంపు కలిగే పరిస్థితిని రానీయకండి. దైవధర్మానికి తోడ్పాటునందించండి. ఖుర్ఆన్ సందేశాన్ని, మహాప్రవక్త మహితోక్తులను సర్వవ్యాప్తం చేయండి.

**పరాజయాన్ని చవిచూడవలసివచ్చింది. 70 మంది ముస్లింలు వీర మరణం పొందారు. ఆ తరువాత అబూ సుఫ్యాన్ పర్వతం మీది నుంచి 'మీ వెంట ముహమ్మద్(స) ఉన్నారా?' అని కేక వేశాడు. "సమాధానం ఇవ్వకండి" అని దైవ ప్రవక్త(స) చెప్పారు. 'మీతోపాటు ఇబ్నె అబీ ఖుహాఫా ఉన్నారా?' అని అతను అడిగాడు. దీనికి కూడా జవాబు ఇవ్వరాదని దైవప్రవక్త(స) సూచించారు. 'ఏమిటి, మీ వెంట ఖత్తాబ్ పుత్రుడు ఉన్నాడా?' అని అతను అరిచాడు. (ఈసారి కూడా నిశ్శబ్దం ఆవరించింది). దానిపై అబూ సుఫ్యాన్, 'వారంతా వధించబడ్డారు. ఒకవేళ వారు గాని బ్రతికి ఉంటే సమాధానం ఇచ్చేవారు' అన్నాడు. ఈ మాట విని హజ్రత్ ఉమర్(రజి) ఓర్చుకోలేకపోయారు. "ఓయీ దైవ విరోధి! నీవు అబద్ధీకుడవు. నిన్ను పరాభవంపాలు చేసేందుకు అల్లాహ్ వారిని మిగిల్చి ఉంచాడు" అని జవాబిచ్చారు.**

**అబూ సుఫ్యాన్ దీనిపై స్పందిస్తూ, 'హుబల్ (దేవత)కు జై'[1] అన్నాడు.**

**"ఇతని మాటకు సమాధానం ఇవ్వండి" అన్నారు దైవప్రవక్త(స).**

**'ఏమని సమాధానం ఇవ్వాలి?' అని సహాబా విన్నవించుకోగా, "అల్లాహ్ మహోన్నతుడు, ఘనాఘనుడు, పెద్దరికం కలవాడు అని చెప్పండి".**

**'మా దగ్గర ఉజ్జా (దేవత) ఉన్నాడు. మీ దగ్గర ఉజ్జాలాంటి వారెవరూ లేరు' అని అబూ సుఫ్యాన్ చెప్పగా,**

**"అతనికి దీటుగా జవాబివ్వండి" అన్నారు దైవప్రవక్త(స).**

**'ఏమని జవాబివ్వాలి?' అని ప్రియసహచరులు విన్నవించుకోగా,**

**"అల్లాహ్‌యే మా సహాయకుడు. మీకు సహాయపడే వాడెవడూ లేడు అని చెప్పండి".**

**'ఈ రోజు బద్ర్ యుద్ధ దినానికి ప్రతీకారం తీర్చుకున్న రోజు.[2] యుద్ధం బావిలో**

---

658–1. 'హుబల్' అనేది ఒక విగ్రహం పేరు. అది పవిత్ర కాబా గృహంలో ప్రతిష్టించ బడేది. ఈ సందర్భంగా అబూ సుఫ్యాన్ హుబల్‌కు జై అని పలకటంలోని ఉద్దేశ్యం, ఇక మీదట మేము మక్కాలో హుబల్‌ను సగర్వంగా పూజించుకునే సమయం వచ్చేసింది అని చాటడమే.

658–2. అంటే బద్ర్ యుద్ధం జరిగిన రోజున 70 మంది అవిశ్వాసులు వధించబడితే ఈనాడు (ఉహుద్ యుద్ధంలో) 70 మంది ముస్లింలు వధించబడ్డారు. జయాపజయాలు ఇరువైపులా దోబూచులాడుతుంటాయి.

**వేసే చేద వంటిది (అది చేతులు మారుతూ ఉంటుంది. ఒకసారి అది మీ చేతుల్లో ఉంటే, ఒకసారి మా చేతుల్లో ఉంటుంది). మీరు మీ హతుల్లో కొందరి మృతదేహాల అవయవాలను కోసినట్లుగా ('ముస్‌లా' చేసినట్లుగా) కనుగొంటారు. అలా చేయ మని నేను ఆజ్ఞాపించలేదు. అయితే అలా జరిగినందుకు నేను బాధపడటమూ లేదు' అని అబూ సుఫ్యాన్ చెప్పాడు.**

**659) హ్రజత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) కుమారుడు ఇబ్రాహీమ్ తెలిపారు: (తన తండ్రి) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ముందు (ఇఫ్తార్) భోజనం సమర్పించబడింది. ఆ రోజు ఆయన ఉపవాసం ఉన్నారు. ఆయన ఇలా అన్నారు: "ముస్‌అబ్ బిన్ ఉమైర్–రజి (ఉహుద్ పోరాటంలో) అమరగతి నొందారు. ఆయన నాకన్నా గొప్పవారు. కాని ఆయనకు కఫన్‌గా చుట్టబడిన దుప్పటి ఎంత కురచగా ఉందంటే, ఆయన తలపై దానిని కప్పితే కాళ్ళు కనిపించేవి. కాళ్ళపై కప్పితే తల కనిపించేది". హమ్జా (రజి)ను కూడా ఆయన ఆ సందర్భంగా తలచుకున్నారని నా అనుమానం. "హమ్జా (రజి) నాకన్నా ఉత్తములు. (అదే యుద్ధంలో) ఆయన కూడా అమరగతినొందారు." కాని ఆ తర్వాత ఏం జరిగిందో మీరు చూస్తూనే ఉన్నారు. ప్రపంచంలో మాకు కలిమి నొసగబడింది. లేదా ఇలా అన్నారు: మాకు ప్రపంచం పుష్కలంగా ప్రసాదించబడటం మీరు చూస్తున్నారు. మేము చేసుకున్న సత్కార్యాలకు గాను మాకు ప్రాపంచిక సిరులు ఇక్కడే తొందరగా ఇవ్వబడ్డాయేమో అని నాకు భయమేస్తోంది– ఇలా చెప్పిన తర్వాత ఆయన చాలా సేపటివరకు విలపిస్తూనే ఉండిపోయారు. భోజనం కూడా చేయలేకపోయారు.[1]**

**660) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) చెప్పగా అమ్ర్ బిన్ దీనార్ విన్నారు (జాబిర్ ఇలా అన్నారు): ఒక సహచరుడు ఉహుద్ యుద్ధ దినాన దైవప్రవక్త**

659–1. హ్రజత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) స్వర్గలోక శుభవార్త పొందిన పదిమంది సహాబా (అష్రె ముబష్షిరా)లో ఒకరు. అయినప్పటికీ ఆయన ముస్‌అబ్ బిన్ ఉమైర్(రజి)ను తనకన్నా గొప్పవానిగా చెప్పుకోటం ఆయనలోని వినమ్రతకు నిదర్శనం.

ఇక ముస్‌అబ్ బిన్ ఉమైర్(రజి)యువకుడైన సహాబీ. ఆయన హిజ్రత్‌కు ముందే మదీనాకు వెళ్ళి ధర్మ బోధకుని (దాయి)గా సేవలందించారు. ఆయన కృషి వల్ల మదీనాలో ఇస్లామ్ వేగంగా వ్యాపించింది.

**(సఅసమ్)తో, 'యా రసూలల్లాహ్! నేను గనక యుద్ధంలో వధించబడితే ఆ తర్వాత ఎక్కడికెళతాను?' అని అడిగాడు. "స్వర్గానికి" అని దైవప్రవక్త(స) చెప్పారు. అంతే, అతను తన చేతుల్లో ఉన్న ఖర్జూర పండ్లను విసిరేసి రణరంగంలో దూకాడు. వీరోచితంగా పోరాడుతూ అమరగతినొందాడు.[1]**

**661) మహనీయ ఖబ్బాబ్ బిన్ అరత్ వివరించారు : మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తోపాటు హిజ్రత్ చేశాము. కేవలం దైవ ప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యంతోనే ఈ పని చేశాము. దీనికి ప్రతిఫలం ప్రసాదించే బాధ్యత అల్లాహ్‌ది. మరి మనలో కొందరు చనిపోయారు. ఈ లోకంలో వారు ఎలాంటి ప్రతిఫలాన్నీ చూసుకోలేదు. అలాంటి వారిలో ముస్అబ్ బిన్ ఉమైర్(రజి) ఒకరు. ఉహుద్ సంగ్రామంలో ఆయన వీర మరణం పొందారు. చారలు గల ఒక దుప్పటి తప్ప ఆయన దగ్గర మరేదీ లేదు (అదే ఆయన కఫన్ వస్త్రం అయింది). దాంతో ఆయన తలభాగం కప్పితే కాళ్ళు కనిపించేవి. కాళ్ళు కప్పితే తల కనిపించేది. "దుప్పటితో తల భాగాన్ని కప్పి కాళ్ళపై ఇజ్‌ఖిర్ గడ్డి వేయండి" అని ప్రవక్త మహ నీయులు(స) సూచించారు. మనలో కొందరికి, వారి ఆచరణల ఫలం (ఈ లోకం లోనే) లభిస్తోంది. దానిని వారు తనివితీరా ఆస్వాదిస్తున్నారు.**

**మహనీయ అనస్(రజి) కథనం: ఈయన పినతండ్రి (అనస్ బిన్ నజర్) బద్ర్ సంగ్రామంలో పాల్గొనలేకపోయారు. ఆయన ఒక సందర్భంలో ఇలా అన్నారు: 'నేను మొదటియుద్ధంలో దైవప్రవక్త(స)తోపాటు పాల్గొనలేకపోయాను. ఒకవేళ అల్లాహ్ గనక మరేదయినా యుద్ధంలో దైవప్రవక్త(స)తో కలసి పాల్గొనే అవకాశం కల్పిస్తే, నేను ఎలా వీరోచితంగా పోరాడతానో అల్లాహ్‌యే చూస్తాడు.**

**తరువాత ఉహుద్ యుద్ధ మైదానంలో ముస్లింల మధ్యన గందరగోళం నెలకొన్నప్పుడు, 'దేవా! ఈ రోజు ముస్లింలు చేసిన దానికి, నేను నీ సన్నిధానంలో**

---

660-1. 'ముస్లిమ్'లోని రివాయతు ప్రకారం ఆ వ్యక్తి పేరు ఉమైర్ బిన్ హుమామ్. యుద్ధ సమయంలో ఆ వ్యక్తి తినడానికి కొన్ని ఖర్జూర పండ్లు తీశాడు. కాని ఖర్జూర పండ్లు అయిపోయే వరకూ తాను ఆలస్యం చేస్తే, అది కూడా దౌర్భాగ్యమేనని భావించి కదన రంగంలో దూకాడు. వీరోచితంగా పోరాడుతూ వీర మరణం పొందాడు.

**క్షమాపణ వేడుకుంటున్నాను. బహు దైవారాధకులు చేసిన దానితో నాకెట్టి సంబంధం లేదని నీ సన్నిధిలో విన్నవించుకుంటున్నాను' అని పలికారు. తరువాత ఆయన తన ఖడ్గం పట్టుకుని ముందుకు ఉరికారు. దారిలో సాద్ బిన్ ముఆజ్ (రజి) తారసపడ్డారు. 'ఎక్కడికెళుతున్నారు?' అని ఆయన అడిగితే, 'నేను ఉహుద్ పర్వత ఒడిలో స్వర్గ సువాసనను ఆఘ్రాణిస్తున్నాను' అని చెప్పారు. ఆ తర్వాత ఆయన ముందుకు దూసుకుపోయి (వీరోచితంగా పోరాడి) షహీద్ అయ్యారు. ఆయన మృతదేహాన్ని గుర్తు పట్టడం కష్టమై పోయింది.[1] చివరకు ఆయన సోదరీమణి ఒక పుట్టుమచ్చ లేదా ఆయన వ్రేళ్ళ కణుపుల ఆధారంగా ఆయన మృతదేహాన్ని గుర్తు పట్టగలిగారు. ఆయన శరీరంపైన ఎనభైకన్నా ఎక్కువగా బరిసెల, ఖడ్గాల, బాణాల గాయాలు కనిపించాయి.**

**662) హ్రజత్ జైద్ బిన్ సాబిత్(రజి) చెప్పగా తాను విన్నానని ఖారిజా బిన్ జైద్ బిన్ సాబిత్ తెలిపారు : జైద్ బిన్ సాబిత్ ఇలా చెప్పేవారు– మేము దివ్య ఖుర్ఆన్‌ను లిఖించడానికి ఉపక్రమించినప్పుడు అల్ అహ్జాబ్ సూరాలోని ఒక ఆయత్ (లిఖితపూర్వకమైనది) మాకు లభించలేదు. అయితే నేను ఆ ఆయత్‌ను దైవప్రవక్త(స) ఎన్నోసార్లు పారాయణం చేయగా విని ఉన్నాను. మేము ఆ ఆయత్‌ను అన్వేషించగా, అది ఖుజైమా బిన్ అన్సారీ(రజి) వద్ద లభించింది. ఆ ఆయత్ ఇది: "మినల్ మోమినీన రిజాలున్ సదఖూ మా ఆహదుల్లాహ అలైహి ఫ మిన్‌హుమ్ మ్మన్ ఖజా నహ్‌బహు వ మిన్‌హుమ్ మ్మన్ యన్ తజిరు..."(అల్ అహ్జాబ్: 23). తరువాత మేము దానిని ఈ సూరాలో (ఖుర్ఆన్‌లో) కలిపి వేశాము.[1]**

---

661–1. ఎందుకంటే బహుదైవారాధకులు ఈయన మృతదేహంలోని అవయవాలను కోసివేశారు (ముస్‌లా చేశారు). ఈ కారణంగానే ఈయన మృతదేహాన్ని గుర్తుపట్టడం కష్టమయింది.

సోదరులారా! మీ తాతముత్తాతలు అనితర సాధ్యమైన త్యాగాలు చేసి ప్రపంచంలో ఇస్లామ్‌ను వ్యాపింపజేశారన్న సంగతిని మీరు మరువకండి.

662–2. ఈ ఆయత్ తర్జుమా ఇది : "విశ్వాసులలో, అల్లాహ్‌కు తాము చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపినవారూ ఉన్నారు. వారిలో కొందరు తమ మొక్కుబడిని తీర్చుకున్నారు. మరికొందరు సమయం కోసం నిరీక్షిస్తున్నారు." ఉదాహరణకు: ఉస్మాన్(రజి), తల్హా (రజి) మొదలగువారు. హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఈ

**663)** హజ్రత్ జైద్ బిన్ సాబిత్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉహుద్ యుద్ధం కొరకు బయలుదేరినప్పుడు, ఆయన(స) వెంట ఉన్న వారిలో కొందరు (ద్వంద్వనీతిపరులు సాకులు చూపి) వెనక్కి మరలారు. అలా వెనక్కి మరలిపోయిన కపటుల విషయంలో ప్రవక్త ప్రియసహచరుల(రజిఅల్లాహు అన్‌హుమ్) మధ్యన రెండు అభిప్రాయాలు ఏర్పడ్డాయి. 'అందరికన్నా ముందు మేము ఈ కపటులతో పోరాడాలి' అని ఒక వర్గం వారంటే, 'వారితో పోరాడరాద'ని మరో వర్గం వారన్నారు. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది : "మీకు ఏమయింది, మీ మధ్య కపటులను గురించి రెండు అభిప్రాయాలు ఉన్నాయి? వాస్తవానికి వారు సంపాదించుకున్న దుష్కర్మల ఫలితంగానే అల్లాహ్ వారిని వెనక్కు (పూర్వపు స్థితికి) మరలించాడు"[1] (4: 88). మహాప్రవక్త ఇలా వక్కాణించారు : "మదీనా పవిత్ర (తయ్యిబా) నగరి. నిప్పుకొలను వెండిలోని కసువును తొలగించినట్లే అది తల బిరుసులను తన నుండి దూరం చేస్తుంది."

## అధ్యాయం : 18

మీలోని రెండు వర్గాలు[1] పిరికితనం చూపటానికి సిద్ధపడిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. వాస్తవానికి అల్లాహ్ వారికి సహాయంగా అక్కడ ఉన్నాడు. విశ్వాసులైనవారు అల్లాహ్‌నే నమ్ముకోవాలి *(3: 122)*

**664)** మహనీయ జాబిర్(రజి) ఇలా అన్నారు : ఈ ఆయత్ (మీలోని రెండు వర్గాలు....) మా గురించే అవతరించింది. ఆ రెండు వర్గాలలో ఒకటి బనూ సలమా, రెండవది బనూ హారిసా. వీరి గురించి ఈ ఆయత్ అవతరించటం నాకు

---

ఆయత్ ప్రవక్త సహచరులకు కంఠస్థమై ఉంది. కాని వ్రాతపూర్వకంగా లేదు. హజ్రత్ ఖుజైమా (రజి) వద్ద అది లిఖితపూర్వకంగా లభ్యమవటంతో దానిని వ్రాత ప్రతిలో చేర్చటం జరిగింది.

663–1. కపటుల నాయకుడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై, అతని అనుంగు అనుచరుల వెకిలి చేష్టల నేపథ్యంలో ఈ ఆయత్ అవతరించింది.

18–1. ఆ రెండు వర్గాలలో ఒకటి బనూ సలమా, రెండవది బనూ హారిసా. వారు కపటులతోపాటే వెనుతిరిగి పోవాలనుకున్నారు. అయితే అల్లాహ్ వారి పాదాలకు స్థిరత్వాన్ని ఇచ్చాడు.

**ఇష్టంలేదు. ఎందుకంటే వారికి సహాయంగా అల్లాహ్ ఉండగా[1] (వారు పిరికి పందలుగా వ్యవహరించటం వాంఛనీయం కాదు కదా!)**

**665) మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఇలా వివరించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒకసారి నన్ను "జాబిర్! నికాహ్ చేసుకున్నావా?" అని అడిగారు. దానికి నేను 'అవున'న్నాను. "కన్యను చేసుకున్నావా? వితంతువును చేసుకున్నావా?" అని ఆయన(స) అడిగారు. 'వితంతువును చేసుకున్నాను' అని నేనన్నాను. దానికి ఆయన (స) "కన్యను చేసుకోకపోయావా? కన్య అయితే ఆమె నీతో ఎంచక్కా ఆడుకునేది కదా!" అన్నారు. దానికి నేను, 'దైవప్రవక్తా! నా తండ్రి ఉహుద్ యుద్ధంలో వీరమరణం పొందారు. ఆయన తన వెనుక తొమ్మండుగురు కూతుళ్ళను వదిలారు. అంటే నాకు తొమ్మండుగురు చెల్లెళ్ళు. అందుకే నేను, బొత్తిగా అనుభవం లేని కన్నెపిల్లను తెచ్చి వీళ్ళ మధ్యన వదలటం భావ్యం కాదనుకున్నాను. వాళ్ళ (నా చెల్లెళ్ళ) ఆలనా పాలన చేసి, వారికి సంస్కారం నేర్పే అనుభజ్ఞురాలైన మహిళ ఉంటే బావుంటుందని తలపోశాను' అని విన్నవించుకున్నాను.[1] ఇది విని ఆయన(స) "చాలా మంచి పని చేశావ్" అని చెప్పారు.**

**666) హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) చెప్పగా తాను విన్నానని షాబి తెలిపారు : జాబిర్ తండ్రి (అబ్దుల్లాహ్–రజి) ఉహుద్ సంగ్రామంలో అమరగతి నొందారు. ఆయన తన వెనుక అప్పులను, ఆరుగురు కూతుళ్ళను వదలిపోయారు. ఖర్జూర పంట కోతకు వచ్చినప్పుడు నేను దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వెళ్ళి 'అయ్యా దైవప్రవక్తా(స)! నా తండ్రి ఉహుద్ యుద్ధంలో అమరగతినొందిన సంగతి**

---

664–1. నిజంగా ఇది గొప్ప దైవానుగ్రహం. కపటుల సర్దారైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై తన అనుయాయులను వెంటబెట్టుకుని తిరోన్ముఖుడైనప్పుడు ముస్లింలలో కలతలు రేపడానికి షైతాన్ ప్రయత్నించాడు. అయితే అల్లాహ్ వారిని షైతాన్ మాయాజాలంలో పడనివ్వలేదు.

665–1. హజ్రత్ జాబిర్(రజి) సుప్రసిద్ధ అన్సార్ సహాబీ. బద్ర్ యుద్ధం, ఉహుద్ యుద్ధంతో సహా అన్ని యుద్ధాలలో దైవప్రవక్త(స)తో కలసి పాల్గొన్నారు. వృద్ధాప్యంలో అంధులయ్యారు. 94 ఏళ్ళ సుదీర్ఘ ఆయుషు పొంది హిజ్రీ 74వ సంవత్సరంలో మరణించారు. మదీనా నగరంలో మరణించిన ప్రవక్త సహచరులలో ఈయన చివరి వారు. చాలామంది ఆయన హదీసులను ఉటంకించారు.

**మీకు తెలుసు. ఆయన తన వెనుక అప్పులను వదలిపోయారు. రుణదాతలు తమరిని చూస్తే నా పట్ల కాస్త మృదువుగా వ్యవహరిస్తారన్న ఆశ నాకుంది' అని విన్నవించు కున్నానని ఆయన చెప్పారు. దానికి దైవప్రవక్త(స), "వెళ్ళు. ఒక్కో రకపు ఖర్జూర పండ్లను ఒక్కో రాశిగా– వేర్వేరు కుప్పలుగా– ఉంచు" అని ఆజ్ఞాపించారు. నేను దైవప్రవక్త(స) చెప్పినట్లుగానే చేశాను. తరువాత ఆయన్ని పిలువటానికి వెళ్ళాను. దైవప్రవక్త(స)ను చూడగానే రుణదాతలు మరింతగా రెచ్చిపోయారు (వారంతా యూదులు). దైవప్రవక్త వాళ్ళ ధోరణిని పసిగట్టిన మీదట ఖర్జూరపు కుప్పల్లో అన్నిటికన్నా పెద్దకుప్ప దగ్గరకు వెళ్ళి, దాని చుట్టూ మూడు సార్లు తిరిగారు. ఆ తర్వాత ఆ కుప్పపై కూర్చుని "నీ రుణదాతలందరినీ పిలువు"అని పురమాయిం చారు. ప్రవక్త మహనీయులు(స) వారందరికీ ఖర్జూరపండ్లు కొలిచి ఇవ్వటం మొద లెట్టారు. ఆ విధంగా అల్లాహ్ నా తండ్రి చేసిన అప్పు అంతటినీ తీర్చే ఏర్పాటు చేశారు. నా తండ్రి చేసిన అప్పులు తీరిపోతే చాలు, నా చెల్లెళ్ళ కోసం ఒక్క ఖర్జూర పండు తీసుకుని వెళ్ళకపోయినా ఫరవాలేదనుకున్నాను. కాని అల్లాహ్ మిగతా ఖర్జూర పండ్ల రాశులన్నింటినీ మిగిల్చి ఉంచాడు. చివరకు దైవప్రవక్త(స) కూర్చుని, రుణదాతలకు కొలిచి ఇచ్చిన రాశిలో కూడా ఒక్క ఖర్జూరం తరుగుదల రాలేదు.**[1]

**667) హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) తెలిపారు : ఉహుద్ యుద్ధ సందర్భంగా నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్)ను చూశాను. ఆయన(స) వెంట ఇద్దరు పురుషులు (దైవదూతలు జిబ్రీల్, మేకాయిల్ మానవాకారంలో) ఉన్నారు. వారు దైవప్రవక్త(స)ను తమ రక్షణలోకి తీసుకుని సత్య తిరస్కారులతో వీరోచితంగా పోరాడుతున్నారు. వారి శరీరాలపై తెల్లటి వస్త్రాలున్నాయి. నేను అంతకుముందు గానీ, ఆ తర్వాత గానీ వారిద్దరినీ చూడలేదు.**

**668) మహనీయ సాద్ బిన్ అబీ వక్కాస్ (రజి) చెప్పగా తాను విన్నానని**

---

666–1. దైవప్రవక్త(స)ను చూస్తే, రుణదాతలు ఎంతో కొంత రుణం మాఫీ చేస్తారని జాబిర్(రజి) భావించారు. కాని అలా జరగలేదు. జాబిర్(రజి) పట్ల దైవప్రవక్త(స)కు ఎంతో వాత్సల్యం ఉన్న సంగతి రుణదాతలకు తెలుసు. అప్పు తీరకపోతే దైవప్రవక్త(స) తన వద్ద నుండి అప్పు తీరుస్తారని వారనుకున్నారు. అయితే దైవప్రవక్త(స) ప్రార్థనా ఫలితంగా ఖర్జూర పంటలో అనూహ్యంగా సమృద్ధి జరిగింది.

**సయీద్ బిన్ ముసయ్యిబ్ తెలిపారు : సాద్ ఇలా చెబుతుండేవారు– ఉహుద్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(స) తన అంబులపొదిలోని బాణాలను తీసి నాకు అందిస్తూ, "(సాద్!) బాణ వర్షం కురిపించు, నా తల్లిదండ్రులు నీపై ఫిదా అవుగాక!"[1] అన్నారు.**

**669) మహనీయ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) ఇలా అనేవారు : ఉహుద్ యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసం) నాలో ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి, తన తల్లి తండ్రి– ఇద్దరినీ ఏకత్రం చేసి, "నా తల్లిదండ్రులు నీకు సమర్పితం"[1] అని పలికారు.**

**670) మహనీయ అలీ(రజి) చెప్పగా తాను విన్నానని ఇబ్నె షద్దాద్ తెలిపారు. మహనీయ అలీ ఇలా అనేవారు. ప్రవక్త మహనీయులు (స) ఒక్క సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) కొరకు తప్ప, వేరితరుల కొరకు "నా తల్లిదండ్రులు నీకు సమర్పితం" అని చెప్పగా నేను వినలేదు.**

**671) హజ్రత్ అలీ(రజి) ఇలా అన్నారు: నేను సాద్ బిన్ మాలిక్ (సాద్ బిన్ అబీ వక్ఖాస్) తప్ప మరెవరి గురించి కూడా దైవప్రవక్త(సఅసమ్), తన తల్లి దండ్రులతో పాటు ప్రస్తావించగా వినలేదు. ఉహుద్ యుద్ధ దినాన ఆయన(స) "సాద్! బాణ వర్షం కురిపిస్తూ పో. నా తండ్రి, తల్లి నీపై ఫిదా" అని చెప్పగా నేను విన్నాను.**

**672) అబూ ఉస్మాన్ ఇలా అనేవారు: దైవప్రవక్త(సఅసమ్) సత్య తిరస్కారులతో చేసిన ఒక యుద్ధ సందర్భంగా (ఉహుద్ యుద్ధంలో) ఒక దశలో ఆయన(స) వెంట తల్హా బిన్ ఉబైదుల్లాహ్, సాద్ బిన్ అబీ వక్ఖాస్ తప్ప ఎవరూ నిలబడలేక**

---

668–1. మహనీయ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) విలువిద్యలో నిపుణులు. ఉహుద్ యుద్ధంలో సత్య తిరస్కారులు దైవప్రవక్త(స) వైపునకు దూసుకుని వస్తున్నప్పుడు ఈయన నిరాఘాటంగా బాణాలను సంధించారు. దాంతో ఒక్క సత్య తిరస్కారి కూడా దైవప్రవక్త(స)ను సమీపించలేకపోయాడు.

669–1. దైవప్రవక్త(స) ఏ వ్యక్తి కొరకు ఈ విధంగా పలికినా, అతను ఎంత గొప్ప సౌభాగ్యవంతుడు! నిజంగానే హజ్రత్ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) ఈ దీవెనకు అర్హులు.

**పోయారు– అబూ ఉస్మాన్ గారు తల్హా, సాద్ (రజి.అన్‌హుమా)ల నుండి దీనిని విన్నారు.**

**673) సాయబ్ బిన్ యజీద్ ఇలా అన్నారు : నేను అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, తల్హా బిన్ ఉబైదుల్లాహ్, మిఖ్దాద్ బిన్ అస్వద్, సాద్ బిన్ అబీ వక్కాస్(రజిఅల్లాహు అన్‌హుమ్)ల సహచర్యంలో ఉన్నాను. కాని నేను ఆ మహనీయుల్లో ఏ ఒక్కరూ మహాప్రవక్త(స) వారి హదీసు వినిపిస్తూ ఉండగా వినలేదు. ఒక్క తల్హా (రజి) నుండి మాత్రమే ఉహుద్ యుద్ధం గురించి హదీసు విన్నాను.**[1]

**674) ఖైస్ బిన్ అబీ హాజిమ్ కథనం : నేను తల్హా (రజి) చేయి ఒక దానిని చూశాను. అది పనికి రాకుండా (చచ్చుబడి) పోయింది. ఉహుద్ యుద్ధ దినాన ఆయన ఆ చేతినే అడ్డంగా పెట్టి దైవప్రవక్త(స)ను శత్రువుల దాడి నుంచి రక్షించారు.**

**675) మహనీయ అనస్ (రజి) ఇలా వివరించారు : ఉహుద్ యుద్ధంలో ముస్లిం యోధులు మహాప్రవక్త(సఅసం) దగ్గరి నుండి చెల్లాచెదురైపోయినప్పుడు అబూ తల్హా (రజి) తన తోలు డాలుతో దైవప్రవక్త(స)ను కాపాడుతూ ఉన్నారు. అబూ తల్హా (రజి) గొప్ప విలుకాడు. ధనుస్సును గట్టిగా పట్టుకుని గురి చూసి బాణం వదిలేవారు. ఆ రోజు ఆయన రెండు లేదా మూడు ధనుస్సులను విరిచారు. ముస్లింలలో ఎవరయినా అటువైపు నుంచి అంబుల పొదితో సాగిపోతుంటే, "ఆ బాణాలను అబూ తల్హా కోసం ఇక్కడే వదలిపోండి" అని దైవప్రవక్త(స) చెప్పేవారు.**

**అనస్(రజి) ఇలా అన్నారు : 'దైవప్రవక్త(స) బహుదైవారాధకులను చూడ టానికి తల ఎత్తినప్పుడల్లా, 'నా తల్లిదండ్రులు మీపై ఫిదా. మీరు తల ఎత్తకండి. అటువైపు నుండి ఏ బాణం అయినా వచ్చి మీకు తగలవచ్చు' అని అబూ తల్హా**

---

673–1. సాయబ్ బిన్ యజీద్ గారి పలుకులు ఆయన సహచర్యం వరకే పరిమితం. అన్యథా హదీసు పుస్తకాలలో ఈ మహనీయుల ద్వారా కూడా ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి. కాకపోతే ప్రవక్త సహచరమాన్యులు హదీసులను వినిపించే విషయంలో చాలా జాగ్రత్త వహించేవారు. ఎక్కడయినా ఏదన్నా పొరపాటు జరిగితే తాము సజీవ నరక వాసులం అవుతామన్న భయం వారికి ఉండేది. ఎందుకంటే, "ఏ వ్యక్తి నా పేరు మీద హదీసు వినిపిస్తూ నేను చెప్పని మాటను చెబుతాడో, అతను సజీవ నరకవాసి అవుతాడు'' అని దైవప్రవక్త(స) వక్కాణించారు.

**చెప్పేవారు. అనస్(రజి) ఇంకా ఇలా అన్నారు: ఆ రోజు హజ్రత్ ఆయిషా బిన్తె అబీబక్ర్ (ర.అ), ఇంకా నా తల్లి ఉమ్మె సులైమ్(ర.అ) తమ ఇజారులను కాస్త పైకెత్తి నీళ్ళ తిత్తులను తమ వీపులపై మోసుకుంటూ వస్తున్నారు. ఆ స్థితిలో వారి కాళ్ళ పిక్కలు సైతం కనిపించాయి. వారిద్దరూ క్షతగాత్రులైన ముస్లింలకు నీరు త్రాపుతున్నారు. నీళ్ళు అయిపోతే మళ్ళీ వెళ్ళి నీరు తెస్తున్నారు.[1] ఆ రోజు అబూ తల్హా (రజి) చేతిలో నుంచి రెండు లేక మూడుసార్లు ఖడ్గం జారి క్రిందపడిపోయింది.**

**676) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వాతో ఇలా అన్నారు: ఉహుద్ యుద్ధంలో మొదట్లో బహు దైవారాధకులు ఓటమిని చవిచూశారు. కాని ఇబ్లీస్ (వాడిపై అల్లాహ్ శాపం పడుగాక!) ముస్లింలను మోసగించేందుకు, 'ఓ దైవదాసులారా! (ముస్లింలారా!) మీ వెనుకనున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండండి' అని కేక వేశాడు. దాంతో ముందు ఉన్న ముస్లింలు కాస్తా వెనక్కి తిరిగి, తమ వెనుక వస్తున్న వారితో తలపడ్డారు. ఆ వెనుకనున్న వారిలో తన తండ్రి యమాన్(రజి) కూడా ఉండటాన్ని హుజైఫా బిన్ యమాన్(రజి) కళ్ళారా చూశారు. (ముస్లింలు ఆయన్ని తమ శత్రువు అనుకుని కొడుతున్నారు). 'ముస్లింలారా! అయ్యో, ఆయన మా నాన్నగారు, ఆయన్ని వదలండి' అని కేకలు వేసినా ప్రయోజనం లేకపోయింది. ఉర్వా ప్రకారం హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : ఆయన్ని చంపేవరకూ ముస్లింలు ఆయన్ని వదలిపెట్టలేదు. దుఃఖ వదనులైన హుజైఫా, 'అల్లాహ్ ముస్లింలను క్షమించుగాక!' అని మాత్రం అన్నారు. ఆ తరువాత హుజైఫా(రజి) జీవితాంతం ముస్లింల మన్నింపు కొరకు ప్రార్థిస్తూ ఉండేవారు. కడకు ఆయన అల్లాహ్‌ను చేరుకునే వరకూ ఈ మన్నింపు వేడుకోలు ఆగలేదు[1]. హదీసులో 'బసుర్తు' అనే పదం వచ్చింది. అంటే నేను మనోనేత్రంలో విషయాన్ని అర్థం చేసుకుంటాను. అబ్‌సర్తు (చర్మ చక్షువులను) కేవలం చూడటానికి మాత్రమే ఉపయోగిస్తాను.**

---

675–1. రణరంగంలో ముస్లిం మహిళలు చేసిన సేవలు కూడా కలకాలం గుర్తుండిపోతాయి. అత్యవసర పరిస్థితుల్లో ముస్లిం మహిళలు ఇండ్ల నుండి బయటికి వెళ్ళి పని చేయటం ధర్మసమ్మతమేనని కూడా ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. రణరంగంలో నీళ్ళు మోసుకుని వస్తున్నప్పుడు ఆ మహిళామణుల కాళ్ళ పిక్కలు కనబడటం అనివార్య స్థితికి నిదర్శనం.

## అధ్యాయం : 19

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : మీలో కొందరు శత్రువును మార్కొనే రోజున వెన్ను చూపారు. వారి ఈ పొరపాటుకు కారణమేమిటంటే, వారిలోని కొన్ని బలహీనతల వల్ల షైతాను వారి పాదాలను చలింపజేశాడు. అయినా అల్లాహ్ వారిని క్షమించాడు. అల్లాహ్ అధికంగా క్షమించేవాడు, సహించేవాడూను. (ఆలి ఇమ్రాన్ : 155)**

**677) ఉస్మాన్ బిన్ మౌహబ్ కథనం : ఒక వ్యక్తి బైతుల్లాహ్‌ను సందర్శించి హజ్జ్ చేసుకోవడానికి (మక్కా) వచ్చాడు. అక్కడ కొంతమంది కూర్చుని ఉండటం చూసి, ఇక్కడ కూర్చుని ఉన్నవారెవరు? అని అతనడిగాడు. 'వీరు ఖురైషులు' అని జనులు చెప్పారు. 'వీరందరిలోకీ వృద్ధుడు ఎవరు?' అని ఆ వ్యక్తి ప్రశ్నించగా, 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)' అని జనులు జవాబిచ్చారు.**

**ఆ వ్యక్తి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) దగ్గరకు వచ్చి, 'నేను మీకొక విషయం అడుగుతాను. మీరు నాకు (డొంక తిరుగుడుగా కాకుండా) సూటిగా సమాధానం ఇవ్వండి. ఈ గృహం(కాబా) పవిత్రత మీద ఒట్టేసి మరీ మిమ్మల్ని అడుగుతున్నాను. ఉహుద్ యుద్ధం జరిగిననాడు ఉస్మాన్-రజి ధైర్యం కోల్పోయి వెనుకంజ వేసిన సంగతి నిజమేనా?' అని అడిగాడు. దానికి ఆయన, 'అవును, నిజమే' అని బదులిచ్చారు. 'ఉస్మాన్(రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొనలేదన్న విషయం కూడా మీకు తెలిసే ఉండాలి' అని ఆ వ్యక్తి అడగ్గా, 'అవున'ని ఆయన జవాబిచ్చారు. 'ఉస్మాన్-రజి బైఅతె రిజ్వాన్‌లోనూ (హుదైబియా ఒడంబడిక సందర్భంగా) వెనుకంజ వేశారు, ఆ ప్రతిజ్ఞలో ఆయన పాల్గొనలేదు. ఇది కూడా మీకు తెలుసను కుంటాను' అని ఆ వ్యక్తి ప్రశ్నించగా, 'అవును, ఈ విషయం కూడా నిజమే' అని ఇబ్నె ఉమర్(రజి) బదులిచ్చారు. ఈ మాట వినగానే ఆ వ్యక్తి (సంతోషాన్ని పట్టలేక) 'అల్లాహు అక్బర్' అని పలికాడు.**

---

676-1. హజ్రత్ హుజైఫా(రజి) వైఖరి ఆయనలోని ఔదార్యానికి, సౌభ్రాతృత్వానికి ప్రబల నిదర్శనం.

పై హదీసులన్నింటిలో ఏదో ఒక విధంగా ఉహుద్ యుద్ధ ప్రస్తావన రావటం వల్ల వాటన్నింటినీ ఇక్కడ సేకరించవలసి వచ్చింది. ఉహుద్ యుద్ధం ఇస్లామీయ చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ఘటన.

**అప్పుడు ఇబ్నె ఉమర్(రజి) ఆ వ్యక్తిని, 'ఇలా దగ్గరకు రా. నువ్వు వేసిన ప్రశ్నలన్నింటికీ విపులంగా సమాధానం ఇస్తాన'న్నారు. ఉహుద్ యుద్ధ సందర్భంగా పరారవటం గురించి నీవు అడిగావు. అయితే అల్లాహ్ ఆయన గారి ఆ తప్పిదాన్ని మన్నించాడు. ఇక బద్ర్ యుద్ధంలో ఆయన పాల్గొనలేకపోవడానికి కారణం ఏమంటే, ఆయన వివాహ బంధంలో ఉన్న దైవప్రవక్త పుత్రిక (రుఖయ్యా–ర.అ) ఆ సమయంలో అస్వస్థతకు గురై ఉంది. అందువల్ల దైవప్రవక్త(స) ఆయనకు సెలవు ఇస్తూ, "బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి లభించినంత పుణ్యం నీకూ లభిస్తుంది. వారికి సమానంగా యుద్ధప్రాప్తిలో నీకూ వాటా లభిస్తుంది" అని చెప్పారు. ఇక 'బైఅతె రిజ్వాన్'లో ఉస్మాన్(రజి) పాల్గొనలేకపోవటం గురించి అంటావా, ఖురైషుల దృష్టిలో ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) కన్నా ఎక్కువగా అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తి ఉండి ఉంటే బహుశా అలాంటి వ్యక్తిని దైవప్రవక్త(స) మక్కా నగరానికి పంపి ఉండేవారు. కాని అలాంటి వారెవరూ లేకపోవటం చేత దైవప్రవక్త(స) ఉస్మాన్‌నే మక్కాకు పంపవలసి వచ్చింది. ఉస్మాన్(రజి) మక్కా నగరంలో ఉన్న సమయంలో 'బైఅతె రిజ్వాన్' ప్రతిజ్ఞ జరిగింది. దైవప్రవక్త(స) తన కుడి చేతిని పైకెత్తి "ఇది ఉస్మాన్ చేయి" అని పలికారు. దానిని (ఎడమ) చేతిపై కొడుతూ, "ఈ బైఅత్ ఉస్మాన్ (రజి) తరఫున" అని కూడా పలికారు. (అర్థమయిందా?) ఇక నీవు వెళ్ళవచ్చు. అయితే నేను చెప్పినదంతా జ్ఞాపకం ఉంచుకో[1] అని ఇబ్నె ఉమర్ హితబోధ చేశారు.**

---

677–1. మహనీయ ఉస్మాన్(రజి)పై ఆక్షేపణలు లేవనెత్తిన ఆ వ్యక్తి ఖారిజీ వర్గానికి చెందినవాడు. అతను స్థూలదృష్టితో సంఘటనలను ప్రస్తావించి ఎదుటి వారిని తప్పుదోవ పట్టించజూశాడు. కాని అల్లాహ్ గౌరవమొసగిన వ్యక్తి గురించి చెడుగా చెప్పేవాడే నిజానికి చెడ్డవాడు.

ఉహుద్ యుద్ధ సందర్భంగా ఒక్క ఉస్మాన్(రజి) మాత్రమేగాక, అనేకమంది సహచరమాన్యులు చెల్లాచెదురైపోయారు. వారి తప్పును అల్లాహ్ స్వయంగా మన్నించినపుడు, ఇక దానిపై తప్పులెన్నే అర్హత ఎవరికీ లేదు.

ప్రశ్నలు వేసిన వ్యక్తికి మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) విపులంగా సమాధానపరిచారు. కాని ఆంతర్యంలో అక్కసు ఉన్నవారికి విషయం అంత తొందరగా బుర్రకెక్కదు. ఇలాంటి వక్రబుద్ధి గలవారు ఇప్పటికీ ఉన్నారు. మహాప్రవక్త ప్రియసహచరులు (రజిఅల్లాహు అన్హుం), మరీ ముఖ్యంగా

## అధ్యాయం : 20

అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : జ్ఞాపకం తెచ్చుకోండి, అప్పుడు మీరు పారిపోతున్నారు. వెనక్కి తిరిగి ఎవరినీ చూసే అంత స్పృహ కూడా మీకు లేదు. వెనుక నుండి ప్రవక్త మిమ్మల్ని కేక వేస్తూ ఉన్నాడు. అప్పుడు మీ ఈ వైఖరికి ప్రతిఫలంగా అల్లాహ్ మీకు దుఃఖం తరువాత దుఃఖం కలుగజేశాడు, మీరు ఏదైనా పోగొట్టుకున్నా లేదా మీకు ఏదైనా ఆపద కలిగినా మీరు చింతించకుండా ఉండేటం దుకు, ఇది భవిష్యత్తులో మీ కొరకు గుణపాఠంగా ఉండాలని. అల్లాహ్కు మీరు చేసే పనులన్నీ తెలుసు. *(ఆలి ఇమ్రాన్ : 153)*

**678)** మహనీయ బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్హాఖ్ తెలిపారు: ఉహుద్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్) విలుకాండ్ర పదాతి దళానికి అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)ను నాయకునిగా నియమించారు. కాని వారు ఓటమిపాలై తిరిగి వచ్చారు. “వెనుక నుండి ప్రవక్త మిమ్మల్ని కేక వేస్తూ ఉన్నాడు..” అనే ఆయత్ వీళ్ళ నేపథ్యంలోనే అవతరించింది.

## అధ్యాయం : 21

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ఈ దుఃఖం తరువాత అల్లాహ్ మీలో కొందరిపై నిశ్చింత స్థితిని ఆవహింపజేశాడు. దానివల్ల వారు కునికిపాట్లు పడసాగారు. కాని కేవలం స్వప్రయోజనానికే పూర్తిగా ప్రాముఖ్యం ఇచ్చే రెండో వర్గం వారు, అల్లాహ్ను గురించి అజ్ఞాన భూయిష్టమైన, సత్యదూరమైన అనుమానాలు వ్యక్తం చెయ్యసాగారు. వారు ఇప్పుడు ఏమంటారంటే : “ఈ వ్యవహారాన్ని నడపటంలో మాకూ ఏదైనా భాగం ఉందా?” వారికి ఇలా చెప్పు: “(ఎవరికీ ఏ భాగమూ లేదు) ఈ వ్యవహారా నికి సంబంధించిన సమస్త అధికారాలూ అల్లాహ్ చేతుల్లో ఉన్నాయి.” వాస్తవానికి వారు తమ హృదయాలలో దాచుకున్న దానిని మీకు వ్యక్తం చెయ్యటం లేదు. వారి అసలు ఉద్దేశ్యమేమిటంటే : “(నాయకత్వపు) అధికారాలలో మాకూ భాగం ఉండి వున్నట్లయితే ఇక్కడ మేము చంపబడి ఉండేవారము కాము.” వారితో ఇలా అను:

---

నలుగురు మార్గదర్శక ఖలీఫాలు మనందరి కొరకు గౌరవనీయులు. వారి వల్ల ఎప్పుడైనా, ఎక్కడయినా ఏదైనా పొరపాటు జరిగి ఉంటే ఆ విషయం దైవాధీనం. తప్పులెన్నే హక్కు మనకు లేదు.

"మీరు మీ ఇళ్ళల్లోనే ఉండివున్నప్పటికీ, మరణం వ్రాయబడి ఉన్నవారు స్వయంగా తమ వధ్యస్థానాలకు తరలి వచ్చి ఉండేవారు. ఈ వ్యవహారమంతా ఎందుకు జరిగిందంటే, మీ గుండెలలో దాగివున్న దానిని అల్లాహ్ పరీక్షించేందుకు, మీ మనస్సులలో ఉన్న మాలిన్యాన్ని వేరు చెయ్యటానికి. అంతరంగాల స్థితి అల్లాహ్‌కు బాగా తెలుసు. *(ఆలి ఇమ్రాన్ : 154)*

అబూ తల్హా (రజి) అనస్(రజి)తో ఇలా అన్నారు: ఉహుద్ యుద్ధ సందర్భంగా కునుకు పట్టిన వారిలో నేనూ ఒకణ్ణి. ఆ స్థితిలో ఖడ్గం నా చేతి నుండి అనేక సార్లు జారి క్రిందపడిపోయేది. దానిని నేను మళ్ళీ ఎత్తుకునేవాణ్ణి.

## అధ్యాయం : 22

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : (ప్రవక్తా!) నిర్ణయాధికారాలలో నీకు పాత్ర ఏదీ లేదు. వారిని క్షమించే, శిక్షించే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. ఎందుకంటే వారు దుష్టులు. *(ఆలి ఇమ్రాన్ : 128)*

హుమైద్, సాబిత్‌లు మహనీయ అనస్(రజి) నుండి ఉటంకించారు: ఉహుద్ యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయుల(స) తలకు గాయాలయినాయి. అప్పుడు ఆయన(స) "తమ ప్రవక్తనే గాయపరిచిన జాతి ఎలా సాఫల్యం పొందుతుంది?" అని పలికారు. దానిపై ఈ ఆయత్ (ఆలి ఇమ్రాన్: 128) అవతరించింది.

**679)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ప్రవక్త మహనీయుల(సఅసమ్) నుండి విన్నారు– ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఫజ్ర్ నమాజ్ చివరి రకఅతులో రుకూ స్థితి నుండి తలపైకెత్తినప్పుడు, "ఓ అల్లాహ్! ఫలానా, ఫలానా, ఫలానా (సఫ్వాన్ బిన్ ఉమయ్యా, సుహైల్ బిన్ అమ్ర్, హారిస్ బిన్ హిషామ్) వ్యక్తులను నీ కారుణ్యానికి దూరంగా ఉంచు" అని వేడుకునేవారు. **'సమిఅల్లాహు లిమన్ హమిదహ్, రబ్బనా లకల్ హమ్ద్'** తరువాత ఆయన ఇలా వేడుకునేవారు. దానిపై అల్లాహ్ "నిర్ణయాధికారంలో నీ పాత్ర ఏదీ లేదు. వారిని క్షమించే, శిక్షించే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. ఎందుకంటే వారు దుష్టులు" అనే ఆయత్ (ఆలి ఇమ్రాన్ : 128)ను అవతరింపజేశాడు.

మరో సనదు

సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ ఇలా అనేవారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్)

**సఫ్వాన్ బిన్ ఉమయ్యా, సుహైల్ బిన్ అమ్ర్, హారిస్ బిన్ హిషామ్‌లను శపిస్తూ ప్రార్థించేవారు. దానిపై లైస లక మినల్ అమ్రి షయ్‌వున్... ఫ ఇన్నహుమ్ జాలిమూన్ (ఆలి ఇమ్రాన్ : 128) అనే ఆయత్ అవతరించింది.**[1]

## అధ్యాయం : 23

## ఉమ్మె సలీత్(ర.అ) ప్రస్తావన[1]

**680) సాలబా బిన్ అబీ మాలిక్ కథనం : హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) మదీనా మహిళల్లో దుప్పట్లను పంపిణీ చేయించారు. నాణ్యమైన ఒక దుప్పటి మిగిలింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఒక సహచరుడు, 'ఓ అమీరుల్ మోమినీన్! ఈ దుప్పటిని మీ నికాహ్‌లో ఉన్న ప్రవక్త మనవరాలికి ఇవ్వండి' అని సలహా ఇచ్చారు. అంటే అలీ కుమార్తె యగు ఉమ్మె కుల్సుమ్(ర.అ)కు ఇవ్వండి అన్నది ఆయన ఉద్దేశం. కాని హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు : "ఉమ్మె సలీత్ (ర.అ) ఆమెకన్నా ఎక్కువగా దీనికి అర్హురాలు"- ఉమ్మె సలీత్ అన్సార్ తెగకు చెందిన మహిళామూర్తి. ఆమె దైవప్రవక్త(స) సమక్షంలో బైఅత్ (విధేయతా ప్రమాణం) చేశారు. "ఉహుద్ యుద్ధ సందర్భంగా ఆమె మా కొరకు నీళ్ళ తిత్తిలో నీరు నింపి తెచ్చేద"ని ఉమర్(రజి) చెప్పారు.**[1]

---

679-1. దైవప్రవక్త(స) శపించిన ఆ ముగ్గురు వ్యక్తులు అవిశ్వాసులు. తరువాత అల్లాహ్ ఆ ముగ్గురికీ సద్బుద్ధిని ప్రసాదించాడు. బహుశా ఈ కారణంగానే అల్లాహ్ వారిని శపించరాదని తన ప్రవక్తను ఆదేశించి ఉంటాడు.

ఉతబా బిన్ అబీ వక్కాస్ ఉహుద్ యుద్ధంలో ప్రవక్త(స) క్రింది వరుసలోని దంతాన్ని విరగ్గొట్టాడు. క్రింది పెదవి కూడా గాయపడింది. అబ్దుల్లాహ్ బిన్ షిహాబ్ ఆయన(స) ముఖారవిందాన్ని గాయపరిచాడు. అబ్దుల్లాహ్ బిన్ ఖుమయ్యా రాయి విసిరి ఆయన ముఖాన్ని గాయపరిచాడు. ఆయన(స) ధరించిన కవచంలోని నట్టెలు ఆయన ముఖం లోపలికి గుచ్చుకున్నాయి. "అల్లాహ్ నిన్ను పరాభవం పాల్జేయుగాక" అని దైవప్రవక్త(స) పలికారు. అలాగే జరిగింది. ఒక కొండజాతి మేక అతన్ని కొమ్ముతో పొడిచి చంపేసింది.

23-1. ఉమ్మె సలీత్ భర్త అబూ సలీత్ హిజ్రత్‌కు పూర్వమే మరణించాడు. తరువాత ఈమెను మాలిక్ బిన్ సుఫ్యాన్ ఖుద్రీ(రజి) వివాహమాడారు. ఈ దంపతులకు పుట్టిన బిడ్డడే ప్రసిద్ధ సహాబీ అబూ సయీద్ ఖుద్రీ(రజి).

**681) జాఫర్ బిన్ అమ్ర్ బిన్ ఉమయ్యా జమ్‌రీ (రజి) తెలిపారు: నేను ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్(రజి)తో కలసి హమస్‌కు బయలుదేరాను. మేమిద్దరం హమస్‌కు చేరుకోగానే ఉబైదుల్లాహ్(రజి) నాతో, '(ఉహుద్ యుద్ధంలో మహనీయ హమ్జా–రజి–ను వధించిన నీగ్రో) హబ్షీ ఎవరో మీకు తెలుసా? పదండి, హమ్జా వీర మరణం గురించి అతన్ని అడిగి తెలుసుకుందాం' అన్నారు. దానికి నేను, 'అలాగా! అయితే పదండి, తప్పకుండా ఈ విషయం తెలుసుకోవాలి' అన్నాను.**

**ఆ విధంగా మేము వహ్షీ గురించి జనుల ముందు ఆరా తీశాము. 'అదుగో, అక్కడ తన నివాస గృహం నీడలో కూర్చొని ఉన్న ఆయనే వహ్షీ' అని మాకు తెలియజేయటం జరిగింది. అతను దుంగ మాదిరిగా ఉబ్బి ఉన్నాడు. మేము అతని దగ్గరకు వెళ్ళి, కాస్సేపు నిలబడ్డాము. తరువాత సలామ్ చేశాము. అతను మా సలామ్‌కు బదులిచ్చాడు. ఉబైదుల్లాహ్(రజి) తన తలపాగాను శరీరానికి చుట్టుకుని కేవలం కళ్ళు మాత్రమే వహ్షీకి కనిపించేలా బందోబస్తు చేసుకున్నారు.**

**'వహ్షీ! నీవు నన్ను గుర్తుపట్టావా?'– అడిగారు ఉబైదుల్లాహ్.**

**వహ్షీ ఆయన్ని ఎగాదిగా చూసి, 'లేదు, దైవసాక్షిగా! కాకపోతే నాకొక విషయం తెలుసు– అదీ బిన్ ఖియార్ ఒక స్త్రీని వివాహమాడారు. ఆమె ఉమ్మొ ఖితాల్‌గా పిలువబడేది. మక్కాలో ఆమెకు ఒక పిల్లవాడు పుట్టాడు. నేనామె కోసం తిండి గింజలు సమకూర్చడానికి బయలుదేరాను. ఆ పిదప నేనా పిల్లవాణ్ణి అతని పెంపుడు తల్లి (పాలిచ్చే ఆయా) వద్దకు ఎత్తుకుని వెళ్ళాను. ఆ సమయంలో అతని కన్నతల్లి కూడా వెంట ఉన్నది. బహుశా ఆ సమయంలో నేను నీ పాదాలు చూసి ఉన్నాను' అన్నాడు వహ్షీ.**

---

680–1. హజ్రత్ ఉమర్ (రజి) లోని న్యాయశీలతకు ఇదొక మచ్చుతునక. ఆయన తన అర్ధాంగిపై ఉమ్మొ సలీత్(ర.అ)కు ప్రాధాన్యత ఇచ్చారు.

మరో విషయం; హజ్రత్ అలీ(రజి) తన కన్నకూతురును హజ్రత్ ఉమర్(రజి)కు ఇచ్చి పెళ్ళి చేశారు. షియా వర్గీయులు తలపోస్తున్నట్లుగా సహాబా మధ్యన– ముఖ్యంగా ధర్మ ఖలీఫాల మధ్యన– ఎలాంటి మనస్పర్థలు ఉండేవి కావని చెప్పడానికి ఇదొక ప్రబల తార్కాణం.

**అంతే, ఉబైదుల్లాహ్ బిన్ అదీ తన ముఖంపైనున్న ముసుగును తొలగించి, 'నీవు మాకు హమ్జా(రజి) అమరగతి నొందిన వృత్తాంతాన్ని వివరించగలవా?' అని ఉత్సుకతతో అడిగారు. దానికి అతను, 'ఓ! తప్పకుండా వివరించగలను. ఇంతకీ జరిగిందేమిటంటే బద్ర్‌యుద్ధం జరిగినప్పుడు మహనీయ హమ్జా(రజి) తుఅయ్‌మా బిన్ అదీ బిన్ ఖియార్‌ను వధించారు. అందువల్ల నా యజమాని అయిన జుబైర్ బిన్ ముత్‌యిమ్ నాతో, 'ఒకవేళ నీవు గనక హమ్జా(రజి)ను, నా పినతండ్రి తుఅయ్‌మా హత్యకు ప్రతీకారంగా చంపగలిగితే, నీవు బానిసత్వం నుండి స్వేచ్ఛ పొందగలవు' అన్నారు.**

**తరువాత ఖురైషులు 'అయ్‌నైన్' యుద్ధం కొరకు బయలుదేరారు. 'అయ్‌నైన్' అనేది ఉహుద్ పర్వతశ్రేణుల్లోని ఒక కొండ. దానికీ– ఉహుద్‌కి మధ్యన ఒక లోయ ఉంది. నేను కూడా యుద్ధ సంకల్పంతో వారి వెంట వెళ్ళాను. (ఇరువర్గాల సేనలు పరస్పరం) మార్కొనడానికి సిద్ధమైనప్పుడు (ఖురైషుల వర్గం నుండి) సబా బిన్ అబ్దుల్ ఉజ్జా ముందుకు వచ్చి, 'నాతో తలపడే వాడెవడైనా ఉన్నాడా?' అని సవాలు విసిరాడు. (ఈ సవాలుకు జవాబుగా) హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి) ముందుకు వచ్చి, 'ఓ సబా! ఓ ఉమ్మె అన్మార్ పుత్రుడా! నీ తల్లి స్త్రీలకు సున్నతీ (ఖితాన్) చేసేది.[1] ఇప్పుడు నువ్వేమో దైవంతో, దైవప్రవక్తతో పోరాడేటంతటి వాడివయ్యావా?' అని గర్జించారు. ఆ తర్వాత ఆయన అతనిపై దాడి చేసి అతని కథను సమాప్తం చేశారు. ఈ సంఘటన గతం గతః అయింది.**

**వహ్‌షీ ఇలా అన్నాడు :నేను ఇటువైపు ఒక చట్టుబండ చాటున హమ్జా(రజి) కోసం మాటేసి కూర్చున్నాను. ఆయన నన్ను సమీపించగానే, నేనాయనపై ఒక ఈటెను గురిచూసి విసిరాను. అది ఆయన నాభి క్రింది నుండి దూసుకుని పోయింది.**

---

681–1. పూర్వం అరబ్బులలో పురుషుల మాదిరిగానే స్త్రీలకు కూడా సున్నతీ (సుంతీ, ఖితాన్) చేసేవారు. పురుషులకు పురుషులు సున్నతీ చేస్తే స్త్రీలకు స్త్రీలు సున్నతీ చేసేవారు. ఈ ఆచారం అజ్ఞాన కాలం నుండే చెలామణిలో ఉండేది. ఇస్లామ్ దీనిని త్రోసిపుచ్చలేదు. ఎందుకంటే దైవప్రవక్త ఇబ్రాహీమ్(అ) కాలంనాటి కొన్ని ఆచార సంప్రదాయాలు అరబ్బులలో మిగిలి ఉండేవి. వాటిలో ఈ 'ఖత్నా' కూడా ఒకటి. సబా బిన్ అబ్దుల్ ఉజ్జా తల్లి స్త్రీలకు ఖత్నా చేసేది. అందుకే మహనీయ హమ్జా(రజి) అతని తల్లి చేపట్టిన వృత్తిని ఇక్కడ జ్ఞాపకం చేశారు.

అదే ఆయన అమరగతికి కారణమయింది. పిదప ఖురైషులు మరలిరాగా, నేను కూడా వారితోపాటే వచ్చేశాను. మక్కాలోనే స్థిరపడ్డాను. కాని మక్కా నగరం కూడా ఇస్లామీయ సామ్రాజ్య పరిధిలోనికి రాగానే నేను తాయిఫ్ పట్టణానికి వెళ్ళిపోయాను. తాయిఫ్ ప్రజలు దైవప్రవక్త(స) దగ్గరకు ఒక రాయబారిని పంపినప్పుడు, అక్కడి ప్రజలు నాకు ఒక సలహా ఇచ్చారు : దైవప్రవక్తలు (అలైహిముస్సలామ్) ఎవరిపైనా దౌర్జన్యం చేయరు (అందుకే నీవు ముస్లింగా ధర్మపరివర్తన చెందు. ఇస్లామ్ ధర్మస్వీకారం తరువాత గత కాలంలో నీ వల్ల జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి) అని సూచించారు. అందువల్ల నేనూ వారితోపాటు బయలుదేరాను. నేను దైవ ప్రవక్త(స) సన్నిధికి చేరుకోగానే, ఆయన(స)నన్ను చూసి, "వహ్షీవి నువ్వేనా?" అని అడిగారు. నేను 'అవున'న్నాను. "హమ్జా(రజి)ను వధించినది నువ్వేనా?" అని ఆయన ప్రశ్నించగా, 'ఈ వ్యవహారంలో దైవప్రవక్త(స)కు తెలిసినదంతా సత్యం' అన్నాను. దానికి ఆయన(స), "నీవు ఎన్నడూ నీ ముఖాన్ని నాకు చూపించకుండా ఉండగలవా?" అని అడిగారు. అంతే, ఆ క్షణమే నేను అక్కడి నుండి నిష్క్రమించాను.[2]

మహాప్రవక్త(స) పరమపదించిన తరువాత ముసైలిమా కిజ్జాబ్(అబద్ధీకుడు) తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. నేను ఆలోచించసాగాను. నేనిప్పుడు ముసైలిమా కిజ్జాబ్‌కు వ్యతిరేకంగా జరిగే యుద్ధంలో తప్పనిసరిగా పాల్గొనాలి. నేను గనక ఆ అబద్ధీకుణ్ణి చంపగలిగితే అది హమ్జా(రజి) వధకు ఎంతో కొంతయినా ప్రాయశ్చిత్తం అవుతుంది. అంతే, నేను ముస్లిములతో కలసి ఆ మార్గభ్రష్టుడికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో పాల్గొన్నాను.[3] అతనితో జరిగిన యుద్ధ విశేషాలు జగద్విదితమే.

---

681–2. బానిసత్వం నుండి స్వేచ్ఛను పొందే తపనలో వహ్షీ హజ్రత్ హమ్జా (రజి)ను యుద్ధరంగంలో హతమార్చాడు. కాని మక్కా విజయం తర్వాత అతని దారులన్నీ మూసుకుపోయాయి. గత్యంతరం లేని పరిస్థితిలో అతను ఇస్లామ్ స్వీకరించి దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యాడు. మక్కా విజయం సందర్భంగా అంతిమ ప్రవక్త(స) చేసిన మన్నింపుల ప్రకటన జగద్విదితమే. "ఈ రోజు మీపై ఎలాంటి నిందారోపణ లేదు. మీరు స్వతంత్రులు" అంటూ హజ్రత్ యూసుఫ్(అ) తన అన్నలకు పెట్టిన క్షమాభిక్ష తరహాలో క్షమించారు. దాంతో మక్కాలోని అవిశ్వా

**వహ్‌షీ ఇలా అన్నాడు : (రణరంగంలో) ఒక వ్యక్తి (ముసైలిమా) ఒక గోడకు ఆనుకుని నిలబడి ఉండటం నేను గమనించాను. గోధుమ రంగు ఒంటెలా చిందర వందరైన జుట్టుతో బెదిరిపోయి ఉన్నాడు. నేను అతని మీద కూడా ఒక పదునైన చిన్న ఈటెను విసిరాను. అది అతని గుండెలో నుంచి దూసుకుని భుజాన్ని చీల్చు కుంటూ వెళ్ళిపోయింది. అంతలో ఒక అన్సార్ సహాబీ (రజి) అతనిపై లంఘించి, ఖడ్గంతో అతని పుర్రెపై ఒక్క వ్రేటు వేశారు... అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇలా అన్నారు : (ముసైలిమా వధించబడిన తరువాత) ఒక అమ్మాయి ఇంటి కప్పుపై నిలబడి ప్రకటించింది– "అమీరుల్ మోమినీన్‌ని ఒక నల్లని బానిస (అంటే వహ్‌షీ–రజి) వధించాడ"ని.**

## అధ్యాయం : 24

## ఉహుద్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(స)కు అయిన గాయాలు

**682) మహనీయ అబూ హురైరా(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహ నీయులు (సఅసమ్) ఇలా పలికారు : "తమ ప్రవక్త పట్ల ఈ విధంగా వ్యవహరిం చిన జాతిపై దైవాగ్రహం తీవ్రంగా విరుచుకుపడుగాక!" విరిగిపోయిన తన ముందు వరుస పల్లను చూపిస్తూ ఆయన(స) ఆ విధంగా పలికారు. ఇంకా ఆయన(స) ఇలా అన్నారు : "దైవమార్గంలో దైవప్రవక్త(స)చే వధించబడిన వానిపై (ఉబై బిన్ ఖలఫ్‌పై) దైవాగ్రహం విరుచుకుపడుగాక!"**

---

సుల రాతిగుండెలు కరిగినాయి. వారు హృదయపూర్వకంగా ఇస్లాంలో చేరారు. వహ్‌షీని చూడగానే దైవప్రవక్త(స)కు తన పినతండ్రి హమ్జా(రజి) జ్ఞాపకం వచ్చారు. అందుకే, ఇక మీదట నీవు నా ముందుకు రాబాకు అని వహ్‌షీని కోరారు. వహ్‌షీ కూడా ప్రవక్త(స) ఆదేశాన్ని మనస్ఫూర్తిగా శిరసావహించారు.

681–3. మహాప్రవక్త(స) పరమపదించిన తర్వాత అరేబియాలో 'ఇర్తెదాద్' (ధర్మభ్రష్టత) ప్రబలింది. కొంతమంది ధర్మభ్రష్టులు (ముర్తద్‌లు) అయిపోయారు. ఈ ఉప ద్రవానికి నాయకుడు ముసైలిమా కిజ్జాబ్. ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబక్ర్ (రజి) ఇలాంటి తిరుగుబాటుదారులపై యుద్ధ ప్రకటన చేశారు. అప్పుడు వహ్‌షీకి తన తప్పును సరిదిద్దుకునే అవకాశం లభించింది. ధర్మభ్రష్టుడైన ముసైలిమా కిజ్జాబ్‌ను చంపి తనకు అంటిన కళంకాన్ని చెరిపివేసుకునే అవకాశం లభించింది. ఆ పనిని అతను పూర్తి చేశాడు.

**683)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా తెలిపారు : దైవమార్గంలో దైవప్రవక్త(సఅసమ్) వధించిన వానిపై దైవాగ్రహం కఠినంగా విరుచుకుపడింది. దైవప్రవక్త ముఖారవిందాన్ని (ఉహుద్ యుద్ధ సందర్భంగా) రక్తసిక్తం చేసిన జాతిపై దైవాగ్రహం తీవ్రంగా విరుచుకుపడింది."

**684)** సహ్ల్ బిన్ సాద్(రజి) కథనం: (ఉహుద్ యుద్ధ సమయంలో) దైవ ప్రవక్త(స)కు అయిన గాయాల గురించి ఈయన్ని అడగ్గా, ఈయన ఇలా వివరించారు : "దైవసాక్షిగా! దైవప్రవక్త(స) గాయాలను కడిగిన వారెవరో, ఆ గాయాలపై నీరు పోసిన వారెవరో, ఏ మందుతో ఆయన(స)కు చికిత్స చేయబడిందో నాకు తెలుసు". ఆయన ఇలా వివరించారు – "దైవప్రవక్త పుత్రిక ఫాతిమా (ర.అ) గాయాల నుండి స్రవించే రక్తాన్ని కడిగారు. అలీ (రజి) బొక్కెనతో నీరు పోయ సాగారు. నీరు పోయటం వలన మరింత రక్తస్రావం జరుగుతుందని ఫాతిమా (ర.అ) గమనించగానే, చాప ముక్కను కాల్చి, ఆ బూడిదను గాయాలపై అద్దారు. దాంతో రక్తం రావటం ఆగిపోయింది. ఆ రోజే దైవప్రవక్త(స) ముందు వరుస పల్లు ఊడిపోయాయి. దైవప్రవక్త(స) ముఖారవిందం కూడా గాయపడింది. తలపై నున్న శిరస్త్రాణం (రాయి విసరటం వల్ల) విరిగిపోయింది."

**685)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : దైవప్రవక్త(స)చే వధించబడిన వ్యక్తిపై దైవాగ్రహం తీవ్రంగా విరుచుకుపడింది. దైవప్రవక్త(స) ముఖారవిందాన్ని రక్తసిక్తం చేసిన వ్యక్తి (అబ్దుల్లాహ్ బిన్ ఖుమయ్యా)పై దైవాగ్రహం తీవ్రంగా విరుచుకుపడింది.[1]

---

685–1. ఈ హదీసులన్నింటిలో ఉహుద్ సంగ్రామానికి సంబంధించిన ఏదో ఒక భయంకరమయిన కోణం చిత్రించబడింది. ముఖ్యంగా దైవప్రవక్త(స) ముఖారవిందం ఈ సందర్భంగా గాయపడింది. ఆయన ముందు పల్లు నాలుగు ఊడిపోయాయి. దీనికి కారకుడైన అవిశ్వాసి అబ్దుల్లాహ్ బిన్ ఖుమయ్యాపై ప్రళయదినం వరకూ దేవుని అభిశాపం అవతరిస్తూ ఉంటుంది.

ఈ యుద్ధంలో జరిగిన మరో ఘటన ఏమిటంటే మక్కాలోని సుప్రసిద్ధ అవిశ్వాసి ఉబై బిన్ ఖలఫ్ దైవప్రవక్త(స) చేత వధించబడ్డాడు. వాస్తవానికి ఆయన(స) తన స్వహస్తాలతో ఎవరినీ చంపగోరలేదు. కాని ఉబై బిన్ ఖలఫ్ దౌర్భాగ్యానికి ఇది తార్కాణం. వాడు గత్యంతరం లేని పరిస్థితిలో దైవప్రవక్త(స)చేత వధించబడి నరకాగ్నికి ఆహుతి అయ్యాడు.

**686) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ)కథనం : క్షతగాత్రులైన తరువాత కూడా అల్లాహ్ పిలుపునకు, ప్రవక్త పిలుపునకు సమాధానం ఇచ్చిన విశ్వాసుల కొరకు– వారిలో సజ్జనులు, భయభక్తులు కలవారి కొరకు– గొప్ప ప్రతిఫలం ఉంది" అనే ఆయత్ అవతరణా నేపథ్యాన్ని గురించి తెలుపుతూ ఆయిషా(ర) ఉర్వాతో ఇలా అన్నారు: "ఓ నా మేనల్లుడా! నీ తండ్రి (జుబైర్–రజి), నీ తాతయ్య (అబూబక్ర్ –రజి) కూడా ఆ సజ్జనులలో ఉన్నారు. ఉహుద్ రణరంగంలో దైవప్రవక్త(స)కు కొంత బాధ కలిగింది. ఆ బాధలో కూడా బహుదైవారాధకులు తిరిగి వెళుతున్నప్పుడు, వారు బహుశా మళ్ళీ వచ్చి దాడి చేస్తారేమోనన్న అనుమానం వచ్చింది. అందుచేత, 'వాళ్ళను వెంబడించడానికి ఎవరెవరు వెళతారు?' అని దైవప్రవక్త(స) అడగ్గానే, 70 మంది సహచరమాన్యులు సిద్ధమయ్యారు."[1] అబూబక్ర్ (రజి), జుబైర్(రజి) కూడా వారిలో ఉన్నారని ఉల్లేఖకులు తెలియజేశారు.**

## అధ్యాయం : 25

## ఉహుద్ యుద్ధంలో అమరగతినొందినవారు

**వారిలో హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్, అబూ హుజైఫా అల్ యమాన్, అనస్ బిన్ నజర్, ముస్అబ్ బిన్ ఉమైర్(రజి అల్లాహు అన్హుమ్) కూడా ఉన్నారు.**

**687) ఖతాదా తెలిపారు : అరబ్బు తెగలలో అన్సార్ తెగవారికి లభించిన గౌరవోన్నతులు మరే తెగకూ లభించలేదు. అన్సార్ తెగవారు అత్యధికంగా అమరగతినొందారు. ఈ తెగవారు ప్రళయదినాన అందరికన్నా ఎక్కువ గౌరవ మర్యాదలతో లేచి వస్తారు. అనస్ బిన్ మాలిక్(రజి) మాతో ఏమన్నారంటే; ఉహుద్**

686–1. ఉహుద్ యుద్ధంలో తీవ్రంగా ప్రాణనష్టం జరిగిన తరువాత కూడా ముస్లింలు మక్కా అవిశ్వాసులను వెంబడించటంలోని మర్మం ఏమిటి? అన్న సందేహం ఎవరికయినా కలగవచ్చు– దీనికి సమాధానం ఏమిటంటే ముస్లింలు ఇప్పటికీ క్రుంగిపోలేదు, నిరాశ చెందలేదు, శత్రువుకు దీటుగా జవాబిచ్చే చేవ ఇప్పటికీ వారిలో ఉంది అని ప్రత్యర్థికి తెలియజెప్పడానికి దైవప్రవక్త(స) ఈ స్ట్రాటజీని అవలంబించారు. తరతరాల ముస్లింల చరిత్రను శోధించినప్పుడు అవగత మయ్యే ముఖ్య విషయం ఏమిటంటే వారు ఎన్నడూ రణరంగం నుండి నిరాశతో వెనుతిరగలేదు. ఎట్టి పరిస్థితులలోనూ గుండె బలాన్ని ఆయుధంగా చేసుకుని శత్రువును ప్రతిఘటించారు.

**యుద్ధంలో అన్సార్ తెగకు చెందిన డెభ్బయి మంది వీర మరణాన్ని ఆస్వాదించారు. బైరె మవూనా ఘటనలో వారి డెభ్బయి మంది వీర మరణం పొందారు.[1] యమామా యుద్ధంలో ఈ తెగకు చెందిన డెభ్బయి మంది అమరగతి నొందారు. ఉల్లేఖకుని ప్రకారం బైరె మవూనా ఘటన దైవప్రవక్త(స) జీవిత కాలంలో ఎదురయింది. యమామా యుద్ధం అబూబక్ర్(రజి) ఖిలాఫత్ హయాంలో జరిగింది– అది ముసైలిమా కిజ్జాబ్ పీచమణచటానికి చేయబడిన యుద్ధం.[2]**

**688) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తెలిపారు :ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉహుద్ యుద్ధంలో అమరగతి నొందిన వారిని– ఒక్కో కఫన్ వస్త్రంలో ఇద్దరేసి వ్యక్తుల్ని చుట్టారు. ఖనన సమయంలో "వీరిలో ఎవరు ఎక్కువ ఖుర్ఆన్ విద్వాంసులు?" అని దైవప్రవక్త(స) అడిగేవారు. 'అదిగో వారు' అని ఎవరయినా సంజ్ఞ ద్వారా తెలియజేశాక, ఆ అమరవీరుణ్ణే ముందుగా గోరీలో దించమని అనేవారు. "ప్రళయదినాన వీరందరిపై నేను సాక్షిగా ఉంటాన"ని కూడా ఆయన(స) పలికారు. ఆ తరువాత ఆయన(స) అమరవీరులందరినీ వారి (శరీరాలపై ఉన్న) రక్తంతోపాటే ఖననం చేయమని ఆదేశించారు. వారి జనాజా నమాజ్ చేయలేదు. వారికి శవస్నానం కూడా చేయించలేదు.[1]**

**జాబిర్(రజి) ఇంకా ఇలా అన్నారు : నా తండ్రి అబ్దుల్లాహ్(రజి) అమరగతి నొందినప్పుడు నేను ఏడ్వసాగాను. మాటిమాటికీ ఆయన ముఖంపైనున్న వస్త్రాన్ని**

---

687–1. బైరె మవూనాలో అమరగతి నొందిన డెభ్బయి మంది అన్సార్ తెగ వారంతా దివ్య ఖుర్ఆన్ ఖారీలు (పారాయణం చేసేవారు). వారంతా ఇస్లాం ధర్మవ్యాప్తి నిమిత్తం వెళ్ళారు. అయితే అవిశ్వాసులు మోసంతో వారందరినీ హతమార్చారు.

687–2. ముసైలిమా కిజ్జాబ్ యమామా ప్రాంతంలో ఉండేవాడు. వాడు దైవప్రవక్త (సఅసమ్) చివరి కాలంలోనే తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్నాడు. మొదటి ఖలీఫా హజ్రత్ అబూబక్ర్(రజి) తన పరిపాలనా కాలంలో ధర్మభ్రష్టతను నిర్మూలించే చర్యల్లో భాగంగా అతనిపై దండెత్తారు. ఆ యుద్ధంలో కూడా అన్సార్ తెగకు చెందిన డెభ్బయి మంది అసువులు బాసారు. ముసైలిమా కిజ్జాబ్ వధతో ధర్మభ్రష్టత (ఇర్తెదాద్) నడుం విరిగింది.

688–1. దైవచిత్తమయితే ఈ అమరవీరులు ప్రళయదినాన యథాస్థితిలో తమ గోరీల నుండి లేచివస్తారు.

**తొలగించసాగాను. అలా చేయకుండా సహాబా నన్ను ఆపారు. కాని దైవప్రవక్త(స) మాత్రం ఆపలేదు. (అబ్దుల్లాహ్ సోదరీమణి, జాబిర్ మేనత్త అగు ఫాతిమా బిన్తె ఉమర్-ర.అ కూడా ఏడ్వసాగారు). "ఏడవకమ్మా! నీవు అబ్దుల్లాహ్ వీర మరణంపై ఏడుస్తున్నావా!? మరోవైపు దైవదూతలు అతని జనాజా లేపబడేవరకూ అతనికి తమ రెక్కలతో నీడ కల్పించార"ని దైవప్రవక్త ఓదార్చారు.**

**689) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించి నట్లుగా అబూ మూసా అష్అరీ(రజి) తెలిపారు: "నేను కలలో చూశాను- నేను ఖడ్గాన్ని ఝుళిపించగానే దాని మొన విరిగిపోయింది. దీని సారాంశం ఉహుద్ యుద్ధంలో ముస్లింలకు కలిగిన నష్టం రూపంలో వ్యక్తమయింది. రెండవసారి నేను ఖడ్గాన్ని ఝుళిపించగానే అది మునుపటికన్నా చక్కగా మారిపోయింది. దీని పరిణామ స్వరూపంగా ఎట్టకేలకు అల్లాహ్ ముస్లింలకు విజయం చేకూర్చాడు. వారి మధ్య సంఘటితత్వాన్ని సృజించాడు. ఇంకా నేను కలలో(జిబహ్ అవుతున్న) ఆవును చూశాను. అల్లాహ్ ఏది చేసినా దాని వెనుక మేలు దాగి ఉంటుంది. దీని అర్థం ఏమిటంటే ముస్లింలు (డెభ్భయి మంది వరకూ) ఉహుద్ యుద్ధంలో వీరమరణాన్ని ఆస్వాదించారు.**[1]

**690) మహనీయ ఖబ్బాబ్(రజి) వివరించారు: మేము ప్రవక్త మహనీయుల (సఅసమ్)తోపాటే హిజ్రత్ చేశాము. తద్వారా మేము కేవలం దైవప్రసన్నతను చూరగొనాలని ఆశించాము. ఈ పనికి గాను అల్లాహ్ మాకు ప్రతిఫలం వొసగటం అవశ్యమైపోయింది. అయితే ఈ త్యాగధనులలో కొందరు అల్లాహ్ వద్దకు చేరుకున్నారు. (ప్రపంచంలో) వారు తమ త్యాగాలకుగాను ఎలాంటి ప్రతిఫలాన్ని**

---

689-1. ఉహుద్ యుద్ధం ఇస్లామ్ చరిత్రలో ఎంతో విషాదకరమైన ఘటన. ముస్లింలు ఘోర పరాజయాన్ని చవిచూసినప్పటికీ తొందరగానే తేరుకుని సంఘటితం అయ్యారు. అది వారి భావి జీవితానికి శుభసూచకంగా పరిణమించింది. సత్య తిరస్కారుల పక్షాన ఉహుద్ సంగ్రామానికి నాయకత్వం వహించిన ఖాలిద్ బిన్ వలీద్(రజి), అబూ సుఫ్యాన్(రజి) తరువాతి కాలంలో ఇస్లామ్ స్వీకరించారు. "అవిశ్వాసులకు ఎంత సహించరానిదైనా సరే అల్లాహ్ తన జ్యోతిని పూర్తిగా వ్యాపింపజేయటానికే నిశ్చయించుకున్నాడు" (61: 8) అనేది సత్యం.

**పొందలేదు. అలాంటి వారిలో ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) ఒకరు. ఉహుద్ యుద్ధంలో ఆయన అమరగతినొందారు. ఆయన తన వెనుక ఒక దుప్పటి తప్ప మరేమీ వదలిపోలేదు. ఆ దుప్పటిని ఆయన కఫన్‌వస్త్రంగా ఉపయోగించినప్పుడు, ఆయన తలభాగాన్ని కప్పితే కాళ్ళు కనిపించేవి. కాళ్ళను కప్పితే తల కనిపించేది. "దుప్పటితో తలభాగాన్ని కప్పి, కాళ్ళపై ఇజ్‌ఖిర్ గడ్డి వేయండి" అని దైవప్రవక్త(స) చెప్పారు. లేదా "అతని కాళ్ళపై ఇజ్‌ఖిర్ గడ్డి వేయండి" అన్నారు (రెండింటి అర్థం ఒక్కటే). మాలో కొందరికి వారి త్యాగాల ప్రతిఫలం ఈ ప్రపంచంలోనే ఇవ్వ బడింది. దాంతో వారు బాగా లబ్ధి పొందుతున్నారు.**[1]

## అధ్యాయం : 26

## "ఉహుద్ పర్వతం మమ్ము అభిమానిస్తోంది"

**"ఉహుద్ పర్వతం మమ్మల్ని ప్రేమిస్తోంది. దానిని మేము ప్రేమిస్తున్నామ"ని ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పినట్లుగా అబ్బాస్ బిన్ సహ్లా అబూ హుమైద్ నుండి ఉటంకించారు.**

**691) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అనస్(రజి) ఉల్లేఖించారు : "ఈ ఉహుద్ పర్వతం విశిష్టత ఏమిటంటే ఇది మమ్ము ప్రేమిస్తోంది. మేము దీనిని ప్రేమిస్తున్నాము".**

**692) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) (ఖైబర్ నుండి తిరిగి వస్తున్నప్పుడు) ఉహుద్ పర్వతం కనిపించగానే,"ఈ పర్వతం మమ్ము ఇష్టపడుతోంది. మేము కూడా దీనిని ఇష్టపడుతున్నాము. ఓ అల్లాహ్! ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) మక్కా నగరాన్ని పవిత్ర నగరిగా ఖరారు**

---

690–1. లబ్ధి పొందే వారిలో కొందరు ఈ భువికి వారసులయ్యారు. కిరీటాలు ధరించారు. అంటే అల్లాహ్ వారికి ప్రపంచంలోనూ అనుగ్రహించాడు. పరలోకంలో కూడా వారు గొప్ప ప్రతిఫలానికి అర్హత పొందారు. కాని మరికొందరు ముందుగానే వీర మరణం పొందారు. వారి ప్రతిఫలమంతా పరలోకంలో జమ చేయబడింది. అలాంటి వారిలో ఒకరు ముస్అబ్ బిన్ ఉమైర్. నవ యువకుడు. మహాప్రవక్త(స) ఆదేశంపై ప్రప్రథమ దాయీగా మదీనాకు వచ్చి, ఇస్లామ్ పరివ్యాప్తికై అవిరళ కృషి చేసిన త్యాగధనుడు.

**చేశారు. నేను ఈ రెండు రాతి ప్రదేశాల నడుమ ఉన్న ప్రాంతాన్ని (జ్యోతిర్మయమైన మదీనాను) పవిత్ర నగరంగా ఖరారు చేస్తున్నాన"ని[1] అన్నారు.**

**693) హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్(రజి) ఉల్లేఖనం : ఒక రోజు ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనా నగరం నుండి బయటకు వచ్చి ఉహుద్ యుద్ధంలో అమరగతినొందిన సహచరమాన్యుల కొరకు 'నమాజె జనాజా' చేశారు.[1] ఇది అచ్చం మృతుల కొరకు చేసే ప్రార్థన మాదిరిగానే ఉంది. పిదప ఆయన (మదీనాలో) వేదికనెక్కి ఇలా ప్రసంగించారు : "వినండి! నేను మీకంటే ముందే (పరలోకానికి) వెళతాను. నేను మీ కొరకు సాక్షిగా ఉంటాను. నేను ఇప్పుడు కూడా (కౌసర్) సరస్సును తిలకిస్తున్నాను. నాకు ప్రాపంచిక ఖజానాల తాళం చెవులు ప్రసాదించబడ్డాయి. లేదా భూభాగపు తాళం చెవులు ఇవ్వబడ్డాయి అని అన్నారు (రెండింటి భావం ఒక్కటే). దైవసాక్షిగా! మీరు నా తదనంతరం షిర్క్ (బహుదైవారాధన)కు ఒడిగడతారన్న భయం నాకు లేదు. అయితే మీరు ప్రాపంచిక వ్యామోహానికి లోనవుతారేమోనన్న భయం నన్ను పీడిస్తోంది."[2]**

## అధ్యాయం : 27

## రజీ యుద్ధం గురించి

**ఆసిమ్ బిన్ ఉమర్ తమతో చెప్పినట్లుగా ఇబ్నె ఇస్‌హాఖ్ ఉటంకించారు: 'రజీ యుద్ధం ఉహుద్ యుద్ధం తరువాత సంభవించింది.'[1]**

---

692–1. కనుక మదీనా కూడా పవిత్ర నగరమే. ఎవరయితే మక్కా మినహా వేరితర ప్రాంతాన్ని పవిత్రంగా భావించడాన్ని 'షిర్క్' అనుకుంటాడో అతను పొరబడ్డాడు.

693–1. పై ఉల్లేఖనాలలో ఏదో ఒక విధంగా ఉహుద్ పర్వత ప్రస్తావన వచ్చింది. ఈ కారణంగానే ఈ ప్రకరణంలో ఈ హదీసులను పొందుపరచవలసి వచ్చింది.

693–2. అంటే మీరు ప్రాపంచిక వ్యామోహంలో పడి అసూయాగ్నిలో దహించుకుపోతుంటారు. తత్కారణంగా మీ మధ్యన ఉండవలసిన ప్రేమైక భావాలు క్షీణిస్తాయి. సంఘీభావం దెబ్బ తింటుంది. ఇది మీకు శ్రేయస్కరం కాదు.

29–1. 'రజీ' అనేది ఒక ప్రదేశం పేరు. ఈ యుద్ధం హిజ్రీ 4వ సంవత్సరంలో సఫర్ నెలలో– ఉహుద్ యుద్ధం తర్వాత– జరిగింది. బైరె మవూనాకి– ఉస్ఫాన్‌కి మధ్యన ఒక స్థలం ఉంది. అక్కడ 'రాల్', 'జక్వాన్' తెగల వారు మోసంతో ప్రవక్త పంపిన

**694)** మహనీయ అబూ హురైరా (రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) గూఢచర్యం నిమిత్తం ఒక బృందాన్ని (ఖురైషుల కదలికలను తెలుసుకోవడానికి) పంపారు. ఆ బృందానికి ఆసిమ్ బిన్ సాబిత్(రజి)ను నాయకునిగా నియమించారు. ఈయన ఆసిమ్ బిన్ ఉమర్ బిన్ ఖత్తాబ్‌కు తాతయ్య అవుతారు. ఈ బృందం తన పనిపై పయనమయింది. వీరు ఉస్ఫాన్‌కి– మక్కాకి మధ్యన చేరుకోగానే హుజైల్ తెగకు చెందిన ఒక ఉప తెగకు– అది బనీ లిహ్యాన్‌గా పేర్కొనబడేది–వీళ్ళ సమాచారం అందింది. బనూ లిహ్యాన్‌కు చెందిన వంద మంది విలుకాండ్రు వారిని వెంబడించారు. వారి అడుగుజాడలను పసిగడుతూ నడిచారు. చివరకు వారు ఈ పయన బృందం ఆగిన ప్రదేశాన్ని కనుగొనడంలో కృతకృత్యులయ్యారు. పయన బృందంలోని సభ్యులు తిన్న ఖర్జూరపు విత్తనాలను చూసి, 'ఇవి యస్రిబ్ ప్రాంత ఖర్జూరాలు' అని బనూ లిహ్యాన్ జనులు చెప్పుకున్నారు. అప్పటికప్పుడే ఆ పరిసర ప్రాంతాలలో వారిని వెతకటం మొదలెట్టారు. చివరకు వారు ప్రవక్త సహచరుల ఆచూకీని కనుగొన్నారు.

ఈ పరిస్థితిని పసిగట్టిన ఆసిమ్(రజి) తన సహచరులను తీసుకుని ఓ పర్వత గుట్టపైకెక్కారు. బనూ లిహ్యాన్ తెగవారు ఆ పర్వత గుట్టను చుట్టుముట్టి, 'మీరు గనక ఆయుధాలను పడవేసి ఆత్మ సమర్పణ చేసుకునే మాటైతే మేము మీకు ఎలాంటి కీడు కలిగించము. ఆ మేరకు మేము వాగ్దానం చేస్తున్నామ'ని హామీ ఇచ్చారు. 'ఎట్టి పరిస్థితిలోనూ నన్ను నేను ఏ అవిశ్వాసికి కూడా అప్పజెప్పుకునేది లేద'ని ఆసిమ్(రజి) నిర్ద్వంద్వంగా చెప్పేశారు. 'దేవా! మాకు ఎదురైన ఈ సంక్లిష్ట స్థితి గురించి నీ ప్రవక్తకు తెలియబరచు'అని వేడుకున్నారు. చివరకు ఆ సహాబా (రజి) బనూ లిహ్యాన్ తెగవారిని ప్రతిఘటించారు. ఆసిమ్ తన ఆరుగురు సహచరులతో సహా విలుకాండ్ర బాణాలకు ఆహుతి అయి ప్రాణం విడిచారు. ఖుబైబ్, జైద్, మరొక సహాబీ– ముగ్గురూ ఆ దాడుల నుండి సురక్షితంగా ఉన్నారు. ఆ తెగవారు మళ్ళీ వారికి అభయం ఇచ్చారు. వారు ముగ్గురూ ఆ తెగ వారి హామీపై గుట్ట నుండి క్రిందికి దిగివచ్చారు. తెగవారు ఆ ముగ్గురినీ పూర్తిగా అదుపులోకి తీసుకుని, 'తమ

---

ఖుర్ఆన్ విద్వాంసులను దారుణంగా హతమార్చారు. ఉజల్, ఖార్రా అనేవి కూడా రెండు అరబ్బు తెగల పేర్లే. వీరి ప్రస్తావన రజీ యుద్ధంలో వచ్చింది.

ధనుస్సుల త్రాళ్ళతో వారిని కట్టేశారు. ఖుబైబ్, జైద్‌లతోపాటు మూడవ సహాబీ తీవ్రంగా ప్రతిఘటించారు. ఇది మీ మొదటి విశ్వాస ఘాతుకం అని చెప్పారు. ఆయన వారి వెంట వెళ్ళడానికి నిరాకరించారు. మొదట బనూ లిహ్యాన్ తెగవారు ఆయన్ని ఈడ్చారు. ఎలాగైనాసరే ఆయన్ని తమతో తీసుకువెళ్ళాలని యత్నించారు. ఆయన ఎంతకీ సిద్ధం కాకపోవడంతో ఆయన్ని అక్కడికక్కడే హతమార్చారు.

ఇక మిగిలింది ఖుబైబ్, జైద్. వారిద్దరినీ తీసుకుని ఆ తెగవారు మక్కా వచ్చారు. ఖుబైబ్ (రజి)ను హారిస్ బిన్ ఆమిర్ బిన్ నౌఫల్ కొడుకులు కొనుగోలు చేశారు. ఎందుకంటే ఖుబైబ్(రజి) ఇంతకుముందు బద్ర్ యుద్ధంలో హారిస్‌ను చంపి ఉన్నారు. ఆయన కొన్నాళ్ళపాటు వారి వద్ద ఖైదీగా ఉన్నారు. కడకు ఖుబైబ్(రజి)ను హతమార్చాలని ఆ తెగవారు నిర్ణయించుకున్నారు. ఆ రోజుల్లోనే కాకతాళీయంగా హారిస్ కూతురు (జైనబ్) నుండి ఖుబైబ్(రజి) తన నాభి క్రింది వెంట్రుకలను తీయడానికి మంగలికత్తి అడిగి తీసుకున్నారు.

ఆమె ఇలా అన్నారు : నేను పరధ్యానంలో ఉండగా నా పిల్లవాడు ఖుబైబ్ (రజి) దగ్గరకు వెళ్ళిపోయాడు. ఆయన ఆ పిల్లవాణ్ణి తన తొడపై కూర్చోబెట్టు కున్నారు. నేనా పిల్లవాణ్ణి ఆ స్థితిలో చూసి ఆందోళనకు గురయ్యాను. ఆయన చేతిలో కత్తి ఉంది. నా కలవరాన్ని ఆయన పసిగట్టి ఇలా అన్నారు: 'ఏమిటి, ఈ పిల్లవాణ్ణి చంపేస్తానేమోనని భయపడుతున్నావా? ఇన్‌షాఅల్లాహ్ అలా ఎన్నటికీ చేయలేను."

ఆమె ఇలా అన్నారు: నేను ఖుబైబ్(రజి) కన్నా మంచి ఖైదీని ఎన్నడూ చూడ లేదు. నేనాయన్ని ద్రాక్షపండ్లు తినటం చూశాను. నిజానికి ఆ సమయంలో మక్కాలో ఏ రకమయిన పండ్లు కూడా లేవు. అదీగాక ఆయన సంకెళ్ళతో బంధించబడి ఉన్నారు. వాస్తవానికి అల్లాహ్ తరఫున ఆయనకు పంపబడిన ఉపాధి అది.

పిదప హారిస్ కొడుకులు ఖుబైబ్(రజి)ను వధించటానికి 'హరమ్' పరిధి వెలు పలికి తీసుకుపోయారు. "నాకు రెండు రకతుల నమాజ్ చేసుకోవడానికి అనుమతి ఇవ్వండి" అని కోరారు ఖుబైబ్(రజి). (అనుమతి లభించింది) నమాజ్ చేసిన తరువాత ఖుబైబ్(రజి), "నేను మృత్యువుకు భయపడి ఆలస్యం చేస్తున్నానన్న తలంపు మీకు రాకుండా ఉండే మాటైతే మరింత సుదీర్ఘ నమాజ్ చేసుకునేవాణ్ణి" అని వారితో

అన్నారు. హత్యకు ముందు రెండు రకతుల నమాజ్ చేసుకునే ఆనవాయితీకి ఆద్యుడు హ(జత్ ఖుబైబ్(రజి) గారే. ఆ తరువాత ఆయన వారిని శపిస్తూ ఇలా అన్నారు :"ఓ అల్లాహ్! వీళ్ళలో ఏ ఒక్కరినీ వదలకుండా అంతమొందించు". పిదప ఆయన నోట వెలువడిన కవితలకు అర్థం ఇది: "నేను ముస్లిమునై ఉన్న స్థితిలో హత్యగావించబడుతూ ఉండగా నాకు చింత ఏల? ఏ వైపునుంచి దైవమార్గంలో నన్ను కడతేర్చినా ఫరవాలేదు. ఇదంతా దైవమార్గంలోనే కదా! అల్లాహ్ గనక తలిస్తే, తెగిన శరీరంలోని ఒక్కో ముక్కలో శుభాన్ని ప్రసాదించగలడు."

తరువాత ఉఖ్బా బిన్ హారిస్ నిలబడి ఆయన్ని వధించాడు. మరోవైపు ఖురైషులు ఆసిమ్(రజి) శవం కొరకు మనుషుల్ని పంపారు. ఆయన మృతదేహంలోని ఏ భాగం దొరికినా గుర్తు పట్టి తీసుకురమ్మని పురమాయించారు. ఎందుకంటే అంతకుముందు ఆసిమ్(రజి) బద్ర్ సంగ్రామంలో ఖురైషుల ఓ ప్రముఖ నాయకుణ్ణి చంపి ఉన్నారు. కాని అల్లాహ్ కందిరీగల ఒక సైన్యాన్ని మబ్బుతునక ఆకారంలో పంపాడు. ఆ కందిరీగలు ఆసిమ్(రజి) మృతదేహం చుట్టూ క్రమ్ముకుని ఖురైషుల బారి నుండి కాపాడాయి. ఖురైషులు పంపిన మనుషులు నిరాశతో వెనుతిరిగి వచ్చారు.

**695)** మహనీయ ఖుబైబ్(రజి)ను అబూ సరవా (ఉఖ్బా బిన్ హారిస్) వధించాడని జాబిర్ తెలిపారు.

**696)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) డెభ్భయి మందితో కూడిన ఒక బృందాన్ని ఇస్లామ్ ధర్మపరివ్యాప్తి కొరకు పంపారు. వారందరినీ 'ఖారీలు'గా పిలిచేవారు. దారిలో బనూ సులైమ్‌కు చెందిన రీల్, జక్వాన్ అనే తెగలవారు ఒక బావి దగ్గర వారిని అటకాయించారు. ఆ బావి పేరు 'బైరె మవూనా'గా సుప్రసిద్ధం. "దైవసాక్షిగా! మేము మీతో పోరాడటానికి రాలేదు. దైవప్రవక్త(స) ఒకానొక ప్రత్యేక కార్యంపై పంపగా మేము వచ్చాము"ని ప్రవక్త ప్రియ సహచరులు విన్నవించుకున్నారు. కాని సత్య తిరస్కారులైన ఆ తెగలవారు సహాబా అందరినీ అమానుషంగా వధించారు. ఈ విషాదకర ఘటన తరువాత దైవప్రవక్త(స) ప్రతి రోజూ ఫజ్ర్ నమాజులో వారిని శపించేవారు. ఈ విధంగా దైవప్రవక్త(స) నెలరోజుల వరకూ ఆ హంతకులను

**శపిస్తూ ప్రార్థించారు.[1] ఆ రోజు నుంచే 'దుఆయె ఖునూత్' మొదలయింది. అన్యథా అంతకుముందు మేము 'దుఆయె ఖునూత్' పఠించేవారము కాము.**

**అబ్దుల్ అజీజ్ బిన్ సుహైబ్ ఇలా అన్నారు : ఒక వ్యక్తి (ఆసిమ్ అహ్వాల్) దుఆయె ఖునూత్ గురించి హజ్రత్ అనస్(రజి)ను, ఈ దుఆ 'రుకూ' తరువాత పఠించబడుతుందా? లేక ఖుర్ఆన్ పారాయణం తరువాత పఠించబడుతుందా? అని అడగ్గా, 'ఖుర్ఆన్ పారాయణం పూర్తవగానే (రుకూ చేయకముందే) పఠించబడుతుంది' అని అనస్(రజి) చెప్పారు.**

**697) హజ్రత్ అనస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) (ఫజ్ర్) నమాజులో రుకూ తరువాత, ఒక నెల రోజుల వరకూ ఖునూత్ పఠించారు. అందులో ఆయన(స) కొన్ని అరబ్బు తెగలను శపించారు.[1]**

**698) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: రీల్, జక్వాన్, ఉసయ్యా, బనూ లిహ్యాన్ తెగల వారు శత్రువు బారి నుండి సురక్షితంగా ఉండేందుకు సహాయం**

---

696–1. రీల్, జక్వాన్, ఉసయ్యా, బనూ లిహ్యాన్ తెగల వారి వద్దకు దైవప్రవక్త(స) 70 మంది ఖుర్ఆన్ విద్వాంసులను పంపారు. ఎందుకంటే, తాము ఇస్లామ్ స్వీకరించామని, తమకు ధార్మిక శిక్షణ గరపటానికి కొంతమంది అధ్యాపకులను పంపమని ఆ తెగవారు అభ్యర్థించారు.

వేరొక ఉల్లేఖనం ప్రకారం అబూ బరా ఆమిర్ బిన్ మాలిక్ అనే ఒక వ్యక్తి దైవ ప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! తమరు నజ్ద్ ప్రాంతం వైపునకు కొంత మంది విద్వాంసులను పంపండి. వారి బోధనల వల్ల నజ్ద్ ప్రాంతంలోని ప్రజలు ముస్లింలుగా ధర్మపరివర్తన చెందే అవకాశం ఉంది' అని విన్నవించుకున్నాడు. "నజ్ద్ ప్రాంత ప్రజలు వారిని హతమారుస్తారేమోనని నేను భయపడుతున్నాన"ని అన్నారు దైవప్రవక్త(స). కాని ఆ వ్యక్తి భరోసా ఇచ్చాడు. ఆ విద్వాంసులకు తాను రక్షణ కల్పిస్తానని. అప్పుడాయన (స) 70 మంది విద్వాంసుల్ని అక్కడకు పంపారు. వారిలో ఒక్క సహాబీ కాబ్ బిన్ జైద్(రజి) మాత్రమే గాయాలతో బయటపడ్డారు.

697–1. ఫికహ్ పరిభాషలో ఇలాంటి ఖునూత్‌ను **'ఖునూతె నాజిలా'** అంటారు. గడ్డు కాలం ఎదురైనప్పుడు, ఆపదలు విరుచుకుపడుతున్నప్పుడు ఇలాంటి ఖునూతె నాజిలా పఠించటం నేటికీ సంప్రదాయమే. కాని చాలా మంది ముస్లింలు కష్ట కాలంలో కూడా ఖునూతె నాజిలాను చదవకపోవడం దురదృష్టకరం.

**చేయమని దైవప్రవక్త(స)ను అభ్యర్థించారు. దైవప్రవక్త(స) ఆ తెగల వారికి సహాయంగా డెభ్భయి మంది అన్సార్ సహచర మాన్యులను పంపారు. మేము ఆ మహానుభావులను 'ఖారీ'లుగా పిలిచేవారం. వారు తమ దైనందిన జీవితంలో జరుగుబాటు కోసం పగటిపూట కట్టెల్ని ప్రోగు చేసేవారు. రాత్రిపూట దైవారాధనలో లీనమై ఉండేవారు. ఈ మహనీయులు 'బైరె మవూనా' వద్దకు చేరుకోగానే ఆ తెగలవారు మోసంతో వారిని హతమార్చారు. దైవప్రవక్త(స)కు ఈ సమాచారం అందిన మీదట ఫజ్ర్ నమాజ్‌లో ఒక నెల రోజుల వరకూ ఆ తెగలను శపించారు. అరేబియాకు చెందిన రీల్, జక్వాన్, బనూ లిహ్యాన్ తెగలే అవి.**

**అనస్(రజి) ఇంకా ఇలా అన్నారు: ఆ సహచరమాన్యుల గురించి ఖుర్ఆన్‌లో ఆయత్ కూడా అవతరించింది. దానిని మేము పారాయణం కూడా చేసేవారం. పిదప ఆ ఆయత్ రద్దయింది. (దాని అనువాదం ఇది) "మేము మా ప్రభువు వద్దకు చేరుకున్నామని మా జాతి వారికి (ముస్లిములకు) మా తరపున తెలియపరచండి. మా ప్రభువు మా పట్ల ప్రసన్నుడయ్యాడు. మమ్మల్ని కూడా (తన అనుగ్రహ భాగ్యాలతో) సంతోషంగా ఉంచాడు"- ఖతాదా గారు అనస్(రజి) నుండి ఉటంకించిన దాని ప్రకారం దైవప్రవక్త(స) నెలరోజుల వరకూ ఉదయం నమాజులో అరేబియాకు చెందిన కొన్ని తెగలను- అంటే రీల్, జక్వాన్, ఉసయ్యా తెగల వారినీ, బనూ లిహ్యాన్‌ని శపించారు.**

**ఖతాదా గారే అనస్(రజి) నుండి నుడివిన దాని ప్రకారం ఈ డెభ్భయి మంది సహాబా అన్సార్ తెగకు చెందినవారు. వారు 'బైరె మవూనా' దగ్గర వధించబడ్డారు.**[1]

**699) మహనీయ అనస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) అనస్ మేనమామ (హరామ్ బిన్ మిల్హాన్)ను కూడా ఆ డెభ్భయి మందిలో ఒక**

698-1. గమనార్హమైన విషయం ఏమిటంటే, ఆ సహాబా ఖుర్ఆన్ విద్వాంసులు (ఖారీలు) అయివుండి కూడా జీవనోపాధి కోసం పగటిపూట కష్టపడి పని చేసేవారు. రాత్రివేళల్లో దైవారాధనలో నిమగ్నులై ఉండేవారు. వారు ఈ కాలపు ఖారీల వంటివారు కారు. నేటి ఖారీల మాదిరిగా వారు ఖుర్ఆన్ విద్యను పొట్టకూటి కోసం సాధనంగా చేసుకోలేదు. దుకాణాల వద్ద ఖుర్ఆన్ సూరాలు పఠించి చేయి చాపే ప్రబుద్ధులకు ఇది గుణపాఠం కావాలి.

సభ్యునిగా పంపారు. ఆయన ఉమ్మె సులైమ్ (ర.అ) సోదరుడు. ఇలా పంపడానికి కారణమేమంటే బహుదైవారాధకుల నాయకుడైన ఆమిర్ బిన్ తుఫైల్ దైవప్రవక్త(స) ముందు (గర్వాతిశయంతో) మూడు షరతులు పెట్టాడు. అతనిలా అన్నాడు: '1) పల్లెటూరి బైతులను మీరు ఏలుకోండి 2) పట్టణ ప్రజలపై నా అధికారం ఉంటుంది 3) లేదా మీరు నన్ను మీ తదనంతర పాలకునిగా నియమించండి. లేదంటే నేను వేలాది మంది గిత్ఫాన్ తెగ వారిని తీసుకుని మీ మీద దండయాత్ర చేస్తాను.'

తరువాత అతను ఉమ్మె ఫులాన్ ఇంట్లో ప్లేగు వ్యాధి వాతన పడ్డాడు. (అప్పటికీ అతనికి బుద్ధి రాలేదు) 'ఉమ్మె ఫులాన్ స్త్రీ ఇంట్లోని పడుచు ఒంటెల మాదిరిగా నాకు కణితి వచ్చింది. నా గుర్రం తీసుకురండి' అన్నాడు. (గుర్రంపై స్వారీ అయ్యాడు) గుర్రం వీపు మీదనే అతని ప్రాణం పోయింది. మొత్తమ్మీద ఉమ్మె సులైమ్ సోదరుడు హరామ్ బిన్ మిల్హాన్, కుంటివారైన మరొక సహాబీ, బనీ ఫులాన్‌కు చెందిన ఇంకొక సహాబీ (వీళ్ళు ముగ్గురూ) ముందుకు వెళ్ళారు. హరామ్(తన సహచరులిద్దరితో ముందుగానే) ఇలా చెప్పారు: "మీరిద్దరూ నాకు దగ్గరగా ఈ పరిసరాల్లోనే ఎక్కడయినా ఉండండి. నేను వారి వద్దకు (బనూ ఆమిర్ వద్దకు) వెళతాను. వారు గనక నాకు రక్షణ కల్పిస్తే, మీరెలాగూ దగ్గరే ఉన్నారు. ఒకవేళ వారు నన్ను హతమార్చినట్లయితే, మీరు మీ వాళ్ళ వద్దకు వెళ్ళిపోండి"- అనుకున్నట్లుగానే ఆయన ఆ తెగ వారి వద్దకు వెళ్ళి, "మీరు నాకు రక్షణ ఇస్తారా, నేను మీకు దైవప్రవక్త(స) సందేశాన్ని అందజేయవలసి ఉంది" అని అన్నారు. తరువాత ఆయన ప్రవక్త సందేశాన్ని వారికి వినిపిస్తూ ఉండగా, తెగవారు ఒక వ్యక్తికి సైగ చేశారు. అతను వెనుక నుండి వచ్చి, ఆయనపై బాణం ప్రయోగించాడు. 'బహుశా బల్లెం విసిరాడు, అది శరీరంలో ఇటువైపునుండి అటువైపునకు చీల్చుకుంటూ వెళ్ళింద'ని హమ్మామ్ తెలిపారు. ఆ సమయంలో హరామ్ నోట, "అల్లాహు అక్బర్! కాబా ప్రభువు సాక్షిగా! నేను కోరుకున్నది నెరవేరింది" అన్న మాటలు వెలువడ్డాయి. ఆ తరువాత వారిలో ఒక సహాబీని కూడా ముష్రిక్కులు పట్టుకున్నారు (ఆయన్ని కూడా చంపేశారు). ఆ తరువాత ఈ పనిపై వచ్చిన వారందరినీ వధించారు. కేవలం ఒక్కగానొక్క కుంటి సహచరుడు మాత్రం తప్పించుకోవటంలో సఫలీకృతులయ్యారు. ఆయన కొండ శిఖరం పైకెక్కారు. ఆ అమరవీరుల త్యాగాన్ని గురించి ఖుర్‌ఆన్‌లో ఆయత్ కూడా అవతరించింది. ఆ తరువాత అది రద్దు అయింది. ఆ ఆయత్ ఇది : "ఇన్నా

**ఖద్‌లఖీనా రబ్బనా ఫరజియ అన్నా వ అర్‌జానా"** అల్లాహ్, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపిన రీల్, జక్వాన్, బనూ లిహ్యాన్, ఉసయ్యా తెగలవారిని దైవప్రవక్త(స) ముప్ఫయి రోజుల వరకూ ఫజ్ర్ నమాజులో శపించారు.

**700)** అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని సుమామా బిన్ అబ్దుల్లాహ్ బిన్ అనస్ తెలిపారు : అనస్ ఇలా చెప్పేవారు– తన మేనమామ అయిన హరామ్ బిన్ మిల్హాన్‌ను బైరెమవూనా సందర్భంగా గాయపరిచినప్పుడు, ఆయన ఆ గాయం నుండి స్రవిస్తున్న రక్తాన్ని చేతిలో తీసుకుని, దానిని తన ముఖానికి, తలకు రాసుకున్నారు. ఆ సమయంలో ఆయన "కాబా ప్రభువు సాక్షిగా! నేను కృతార్థుణ్ణి అయ్యాను" అని పలికారు.

**701)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా వివరించారు : మక్కాలో బహుదైవా రాధకులు అబూబక్ర్(రజి)ను తీవ్రంగా వేధించటం మొదలెట్టినప్పుడు అబూబక్ర్ (రజి) తనకు హిజ్రత్ చేసేందుకు అనుమతించమని దైవప్రవక్త(స)ను అభ్యర్థిం చారు. దానికి దైవప్రవక్త(స), "ప్రస్తుతానికి ఇక్కడే ఆగి ఉండు" అని సూచించారు. దానికి ఆయన, 'దైవప్రవక్తా! మీరు కూడా (అల్లాహ్ నుండి) హిజ్రత్ ఆనతి కొరకు నిరీక్షిస్తున్నారా?' అని సందేహపడగా, "అవును. ఆనతి లభిస్తుందన్న ఆశ నాకుంది" అని దైవప్రవక్త(స) చెప్పారు.

ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : అబూబక్ర్ (రజి) ఆ రోజు కొరకు ఎదురు చూడసాగారు. ఎట్టకేలకు దైవప్రవక్త(స) ఒకరోజు జుహ్ర్ వేళ (మా ఇంటికి) వచ్చి అబూబక్ర్(రజి)ను పిలిచారు. మా నాన్నగారితో "లోపలున్నవారిని కాస్త బయటకు పంపు" అని ఆదేశించగా, "ఇక్కడ నా ఇద్దరు కూతుళ్ళు మాత్రమే ఉన్నారు" అని అబూబక్ర్ చెప్పారు. "నీకు తెలుసా! నాకూ హిజ్రత్ చేసేందుకు (మక్కా నుండి వలస పోయేందుకు) ఆనతి లభించింది" అని దైవప్రవక్త(స) చెప్పగానే 'యా రసూ లల్లాహ్! నాకూ మీతోపాటే వెళ్ళే భాగ్యం లభిస్తుందా?'అని అబూబక్ర్ విన్నవించు కున్నారు. దానికి ఆయన(స), "అవును. నువ్వు కూడా నాతోపాటే బయల్దేరుతు న్నావు" అన్నారు. 'దైవప్రవక్తా! నా దగ్గర రెండు ఒంటెలున్నాయి. నేను వాటిని హిజ్రత్ కోసమే బాగా మేపుతున్నాను' అని చెప్పి, 'అల్ జద్‌ఆ' అనే ఒంటెను దైవ

ప్రవక్త(స)కు ఇచ్చేశారు. ఆ మహనీయులిద్దరూ ఒంటెలపై స్వారీ అయ్యారు. 'సౌర్' అనే పర్వత గుహ వద్దకు వెళ్లి, వారిద్దరూ కనుమరుగైపోయారు. అబ్దుల్లాహ్ బిన్ తుఫైల్ బిన్ సఖ్బరా బానిసయగు ఆమిర్ బిన్ ఫుహైరా అబూబక్ర్(రజి)కు చెందిన ఒక పాలిచ్చే ఒంటెను మేపడానికి తోలుకుని వెళ్ళి, రాత్రి పొద్దుపోయాక దైవప్రవక్త, అబూబక్ర్ల వద్దకు వచ్చేవారు. (సౌర్ గుహలో ఆ మహనీయులిద్దరి ఆహారం ఒంటె పాలు మాత్రమే). వారు పాలు త్రాగిన మీదట ఆ ఒంటెను అక్కడి నుండి తోలుకుని వెళ్ళిపోయేవారు. ఆ విధంగా ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్తపడేవారు. ఎట్టకేలకు ఆ మహనీయులిద్దరూ మదీనా చేరుకున్నారు. బైరె మవూనా విషాదకర ఘటనలో ఆమిర్ బిన్ ఫుహైరా కూడా అమరగతినొందారు.

... బైరె మవూనా ఘటనలో ఖారీలైన సహచరమాన్యులు వధించబడినప్పుడు, అమ్ర్ బిన్ ఉమయ్యా జమ్రీ (రజి) ఖైదు చేయబడ్డారు. అప్పుడు ఆమిర్ బిన్ తుఫైల్ ఒక మృతదేహం వైపు చూస్తూ ఆయన్ని అడిగాడు, 'ఈయన ఎవరు?' అని. 'ఈయన ఆమిర్ బిన్ ఫుహైరా (రజి)' అని అమ్ర్ బిన్ ఉమయ్యా(రజి) చెప్పారు. అప్పుడు ఆమిర్ బిన్ తుఫైల్(రజి) ఇలా అన్నాడు: 'వీరమరణం పొందిన తరువాత ఈయన మృతదేహం ఆకాశం వైపునకు లేపుకోబడటం నేను ప్రత్యక్షంగా తిలకించాను. నేను నా దృష్టిని ఆకాశం వైపు సారించాను. అది భూమ్యాకాశాల మధ్యన వ్రేలాడుతూ ఉంది. తరువాత అది నేలపై ఉంచబడింది."

ఈ అమరవీరుల గురించి దైవదూత జిబ్రీల్(అలైహిస్సలామ్) దైవాజ్ఞపై దైవ ప్రవక్త(స)కు సమాచారం అందజేశారు. అందువల్ల దైవప్రవక్త(స) వారి అమరగతి గురించి తన ప్రియ సహచరులకు తెలియపరిచారు : "మీతోటి సహచరులు వధించబడ్డారు. షహాదత్ తరువాత వారు తమ ప్రభువుతో, 'మా ప్రభూ! మేము నీ వద్దకు చేరుకుని సంతోషంగా ఉన్నామని, నీవు కూడా మా పట్ల ప్రసన్నుడై ఉన్నావని మా (ముస్లిం) సోదరులకు తెలియపరచు' అని విన్నవించుకున్నారు"- అందువల్ల అల్లాహ్ (దివ్య ఖుర్ఆన్ ద్వారా) ముస్లిములకు ఈ సమాచారం తెలియపరిచాడు. ఈ దుర్ఘటనలోనే ఉర్వా బిన్ అస్మా బిన్ సలత్(రజి) కూడా వీర మరణం పొందారు. (తరువాత జుబైర్-రజి-కు అబ్బాయి పుట్టినప్పుడు) అతని

**పేరు ఉర్వా అని ఈ ఉర్వా బిన్ అస్మా పేరు మీదనే పెట్టడం జరిగింది. ముస్జిర్ బిన్ అమ్ర్(రజి) కూడా ఈ దుర్ఘటనలో అసువులు బాసారు. (జుబైర్–రజి–కు కలిగిన మరో అబ్బాయి పేరు) 'ముంజిర్' అనీ ఆ అమరగతుని పేరు మీదనే పెట్టడం జరిగింది.[1]**

**702) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక నెలరోజుల వరకూ (నమాజ్‌లో) రుకూ తరువాత 'దుఆయె ఖునూత్' పఠించారు. ఈ దుఆయె ఖునూత్‌లో ఆయన(స) రీల్, జక్వాన్ తెగల వారిని శపించారు. "ఉసయ్యా తెగవారు దైవాన్ని, దైవప్రవక్త(స)ను ధిక్కరించార"ని ఆయన (స) చెప్పేవారు.**

**703) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం : మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) బైరె మవూనాలో తన ప్రియ సహచరులను మోసంతో వధించిన వారిని ముప్ఫయి రోజుల వరకూ ఫజ్ర్ నమాజ్‌లో శపించారు. ఆయన (స) దైవాన్ని, దైవప్రవక్తను ఎదిరించిన రీల్, బనూ లిహ్యాన్,ఉసయ్యా తెగల వారిని ఆ నమాజులలో శపించేవారు.**

**అనస్(రజి) ఇంకా ఇలా అన్నారు : తరువాత అల్లాహ్ బైరె మవూనాలో అమరగతి నొందిన సహచరమాన్యుల గురించి తన ప్రవక్తపై ఆయత్‌ను అవతరింపజేశాడు. మేము ఆ ఆయత్‌ను పారాయణం చేసేవారం. తరువాత అది రద్దుపరచబడింది. దాని అర్థం ఇది– "మేము మా ప్రభువును చేరుకున్నామని, మా ప్రభువు మా పట్ల ప్రసన్నుడయ్యాడని, మేము కూడా (ఆయన ప్రసాదించిన బహుమానాల కారణంగా) ఆయన యెడల సంతుష్టులమై ఉన్నామని మా జాతి వారికి సమాచారం అందజెయ్యండి."**

---

701–1. ఈ హదీసులో దైవప్రవక్త(స) హిజ్రత్ ప్రస్తావన వచ్చింది. మొదట్లో ఆయన (స) 'సౌర్' గుహలో తలదాచుకోవటం కూడా దైవసూచనపైనే జరిగింది. అల్లాహ్ ఆయనకు అక్కడ కూడా ఉపాధిని చేరవేసే ఏర్పాటు చేశాడు. ఆ సందర్భంగా ఆమిర్ బిన్ ఫుహైరా(రజి) ఆ మహనీయులిద్దరికీ స్వచ్ఛమైన పాలు రూపంలో ఆహారం సరఫరా చేశారు. నిజమైన త్యాగం అంటే ఇదే. ఈ ఆమిర్ బిన్ ఫుహైరా 70 మంది ఖారీలతోపాటే అమరగతి నొందినప్పుడు అల్లాహ్ ఆయన భౌతిక కాయాన్ని ఆకాశం వైపునకు లేపుకుని, తిరిగి నేలపై ఉంచేలా చేశాడు. త్యాగధనులకు లభించే పురస్కారం ఇలాగే ఉంటుంది.

**704) ఆసిమ్ అహ్వల్ ఇలా అన్నారు : నమాజ్‌లో ఖునూత్ పఠించటం గురించి మీరేమంటారు? అని నేను మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి)ను అడిగితే, 'అలా పఠించటం సరైనదే కదా' అని ఆయన(రజి) చెప్పారు. మరైతే ఈ ఖునూత్ రుకూకు ముందు పఠించాలా? లేక రుకూ తరువాత పఠించాలా? అని అడిగాను. 'రుకూ చేయకముందే పఠించాల'ని ఆయన అన్నారు. కాని రుకూ తరువాత పఠించాలని ఫలానా వ్యక్తి చెప్పినట్లుగా అన్నారే! అని నేను అడగ్గా, 'ఆయన చెప్పింది తప్పు' అని మహనీయ అనస్(రజి) అన్నారు. తరువాత ఇలా అన్నారు : 'రుకూ తరువాత దైవప్రవక్త(స) కేవలం ఒక నెల రోజుల వరకూ ఖునూత్ చదివారు. ఎందుకంటే ఆయన(స) డెభ్భయి మంది ఖుర్ఆన్ పండితులను (బనీ ఆమిర్ అనే) బహు దైవారాధకుల వద్దకు పంపారు. (వారికి మార్గబోధన చేసే నిమిత్తం పంపటం జరిగింది). బహు దైవారాధకులైన ఆ తెగల వారు ఈ డెభ్భయి మందికి రక్షణ కల్పిస్తామని హామీ కూడా ఇచ్చారు. కాని తరువాత వారు మోసంతో వారిని వధించారు. దైవప్రవక్త(స) ఆ సందర్భంగా- రుకూ అనంతరం- నెలరోజుల వరకూ ఖునూత్ పఠించారు. అందులో ఆయన (స) హంతకులైన బహు దైవారాధకులను శపించారు.**[1]

---

704-1. ఈ దుర్ఘటనలో ఆమిర్ బిన్ తుఫైల్ అనే వ్యక్తి ప్రమేయం ఎక్కువగా ఉంది. మొదట అతను బనూ ఆమిర్ తెగ వారిని ముస్లిములకు వ్యతిరేకంగా ఉసిగొల్పాడు. కాని వారు ముస్లిములతో పోరుకు అంగీకరించలేదు. తరువాత వాడు బనూ సులైమ్‌కు చెందిన రీల్, జక్వాన్, ఉసయ్యా తెగలను రెచ్చగొట్టాడు. చూడబోతే బనూ సులైమ్ తెగ వారు దైవప్రవక్త(స)తో ఒడంబడిక చేసుకుని ఉన్నారు. కాని వారు ఆమిర్ మాయ మాటల్లో పడి ఒడంబడికను ఉల్లంఘించారు. ఖుర్ఆన్ పండితులను మోసంతో దారుణంగా హతమార్చారు.